
ఆంధ్ర వాల్మీకి రామాయణ రసరమ్య గాథలు

వాసుదాసు ఆంధ్రవాల్మీకి రామాయణం
మందరం ఆధారంగా



వనం జ్వాలా నరసింహారావు

ఆంధ్ర వాల్మీకి రామాయణ

రసరమ్య గాథలు

వాసుదాసు ఆంధ్రవాల్మీకి
రామాయణం మందరం ఆధారంగా

వనం జ్వాలానరసింహారావు

దర్శనమ్ ఆధ్యాత్మిక మాసపత్రిక
సభక్తిపూర్వక సమర్పణమ్

జ్వాలా దర్శనమ్ పబ్లికేషన్స్
హైదరాబాద్

ఆంధ్రవాల్మీకి రామాయణ

రసరమ్య గాథలు

(వాసుదాసు ఆంధ్రవాల్మీకి రామాయణం మందరం ఆధారంగా)

By **వనం జ్వాలానరసింహారావు**

✆: 80081 37012

ప్రథమ ముద్రణ: **మార్చి, 2021,**

ప్రతులు 1,000

వెల: రూ. 499/-

ముఖచిత్రం: **రామోజు గణేష్**

లేఅవుట్: **శ్రీనివాసరావు త్రిపురాన**

టైప్ సెట్టింగ్: **వనం జ్వాలానరసింహారావు**

ముద్రణ: **సాయితిరుమల ప్రింటింగ్ ప్రెస్**,చిక్కడపల్లి, హైదరాబాద్

ప్రచురణ: **దర్శనమ్ ఆధ్యాత్మిక మాసపత్రిక**

ప్రతులకు: రాష్ట్రంలోని అన్ని ప్రముఖ పుస్తక విక్రయ కేంద్రాలు

మరుమాముల వెంకట రమణ శర్మ,
సంపాదకులు: దర్శనమ్ మాసపత్రిక,
శ్రీరామ సిద్ధాంతి భవనం, 29-105/4/1,
న్యూ విద్యానగర్ కాలనీ, నేరేడ్‌మెట్, సికిందరాబాద్-500056
ఫోన్: 94410 1546, 040-27220401
వనం జ్వాలా నరసింహారావు: 80081 37012

విషయ సూచిక



అంకితం

ఖమ్మం జిల్లా, ముదిగొండ మండలం, ముత్తారం (వనంవారి కృష్ణాపురం)
గ్రామంలోని రామాలయంలో ప్రతిష్ఠించిన శ్రీకృష్ణమూర్తి విగ్రహం



శ్రీ గుప్త ప్రసన్న భక్త ఆంజనేయ దేవాలయం

ఆశ్వరావుపల్లి గ్రామం, రఘునాధపల్లి మండలం,

జనగాం జిల్లా, తెలంగాణ రాష్ట్రం

పాదాభివందనం



నాన్న–అమ్మ

స్వర్గీయ **వనం శ్రీనివాస రావు గారు–వనం సుశీల** గారు

(ఆగస్ట్ 14, 1982 న తీసిన ఫొటో)

జ్వాలా రామాయణం–రసరమ్య కథామృతం

జ్వాలా రామాయణం రసరమ్య కథామృతం
ఆపదామపహర్తారం దాతారం సర్వసంపదాం.
లోకాభిరామం శ్రీరామం భూయో భూయో నమామ్యహం.
దక్షిణే లక్ష్మణో యస్య వామేచ జనకాత్మజా
పురతో మారుతిర్యస్య తం వందే రఘు నందనమ్
గోష్పదీకృత వారాసిం మశకీకృత రాక్షసమ్
రామాయణ మహా మాలా రత్నం వందే అనిలాత్మజమ్
'కూజంతం రామరామేతి మధురం మధురాక్షరం
ఆరుహ్య కవితాశాఖాం వందే వాల్మీకి కోకిలమ్'

భారత ఇతిహాసాల్లో రామాయణం అత్యంత ఉత్కృష్టమైనది. రామనామం సకల పాపహరం. మోక్షప్రదం. సకలగుణాభిరాముడు, మర్యాదపురుషోత్తముడు అయిన శ్రీరాముని నామోచ్చారణమే భవసాగరాన్ని దాటిస్తుంది. 24 వేల శ్లోకాలతో రామాయణాన్ని రచించిన ఆదికవి వాల్మీకి గొప్ప వేదాంతి, దార్శనికుడు, తపస్వి, సంస్కర్త కూడా. ఆచంద్రతారార్కం ఈ వాల్మీకి రామాయణం గొప్పతేజస్సుతో విరాజిల్లుతుందన్నది బ్రహ్మవాక్కు. భావితరాలకు ఆదర్శప్రాయం, అనుసరణీయమైన రామాయణానికి తేనెలూరే తెలుగు భాషలో 'ఆంధ్రవాల్మీకి' వావిలికొలను సుబ్బారావు గారు (వాసుదాసస్వామి) 24వేల పద్యాలను రసరమ్యంగా తాత్పర్యసహితంగా "మందరం" పేరుతో అందించారు. "తెలుగుజాతికి ఆచంద్రతారార్కం నిలిచిపోయే గొప్ప బహుమానం వారందించిన ఈ మందరం".

వాసుదాస స్వామి వారి ఈ మందరం రామాయణాన్ని అత్యంత సరళంగా వచనరూపంలో శ్రీ వనం జ్వాలా నరసింహారావు గారు ఆరుకాండలుగా అద్భుత రచనను అందించి రామానుగ్రహ పాత్రులయ్యారు. అంతే కాకుండా పామరులకు, చిన్నారులకు అందరికీ ఆసక్తిని కలిగించేలా

రామాయణం మొత్తాన్ని వడపోసి అత్యంత సరళంగా కథల రూపంలో "ఆంధ్రవాల్మీకి రామాయణ రసరమ్య గాథలు" గా అద్భుత పుస్తకాన్ని తెలుగు పాఠకలోకానికి అందించడం అత్యంత ముదావహం.

ఇప్పటికే జ్వాలా నరసింహారావు గారు వాసుదాసస్వామివారి మందరం ఆధారంగా రామాయణం ఆరుకాండలను వచనరూపంలో రసరమ్యంగా అందించారు. ఈ ఆరుకాండలను దర్శనమ్ ఆధ్యాత్మిక మాస పత్రిక ప్రచురించి అందించింది. ఈ ఆరుకాండలతో పాటు జ్వాలావారి ఇతర రచనలు ధర్మధ్వజం, శ్రీమద్భాగవతం కథలు పుస్తకాలను కూడా దర్శనమ్ ప్రచురించింది. ఈ పరంపరలో "ఆంధ్ర వాల్మీకి రామాయణ రసరమ్య గాథలు" గ్రంథాన్ని కూడా ప్రస్తుతం ప్రచురించడం దర్శనమ్ మహద్భాగ్యం. రామాయణంలోని అద్భుత గాథల సమాహారంగా వెలువడుతున్న ఈ గ్రంథం పాఠకులందరినీ విశేషంగా ఆకట్టుకో గలదని మా ఆకాంక్ష. ఈ అవకాశాన్ని కల్పించిన శ్రీ వనం జ్వాలా నరసింహారావు గారికి మనఃపూర్తిగా ధన్యవాదాలు. వారి ఆధ్యాత్మిక రచనాస్రవంతి మున్ముందు కూడా అప్రతిహతంగా కొనసాగాలని దర్శనమ్ అభిలషిస్తోంది.

ఈ పుస్తకానికి లేఔట్ సెట్టింగ్ అందించిన శ్రీనివాసరావు త్రిపురాన గారికి, అందమయిన ముఖచిత్రాన్ని అందించిన రామోజు గణేశ్ గారికి, పుస్తకాన్ని ముద్రించిన శ్రీ సాయి తిరుమల ప్రింటర్స్ అధినేత లక్ష్మినర్సు గారికి ఇంకా ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు.

మరుమాముల వెంకటరమణ శర్మ,
సంపాదకులు, దర్శనమ్ ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక
25-02-2021

వన్దే రామాయణ కథార్ణవమ్!

శ్రీ సీతారామ పదాంబుజాత యుగళీ ధ్యానైక నిష్ఠారతులు శ్రీమాన్ వావికొలను సుబ్బారావు అనే లౌకిక నామధేయులు, 'వాసుదాసు'గా, శ్రీరామభక్తి సామ్రాజ్యమహాదేశికులుగా తెలుగు సీమలో సుప్రసిద్ధులు. 'ధర్మం' అనేది మనుష్య రూపురేఖలు ధరిస్తే అది 'రాముడ'వుతాడని రాక్షసుడైన మారీచుని నోట వాల్మీకి మహర్షి పలికిన మాట! 'రామో విగ్రహవాన్ ధర్మః' అని! జనజీవనంలో ఒక మనిషి ఎలా మనోవాక్కాయ కర్మలను అనుష్ఠించాలో లోకానికి ఆవిష్కరించిన మహనీయ మానవుడు శ్రీరామచంద్రుడు. అలాగే స్త్రీమూర్తి సీతమ్మ. అందుకే శ్రీ రామాయణాన్ని 'సీతాయాశ్చరితం మహత్' అన్నారు మహర్షి వాల్మీకి.

కవితావనంలో సంచరిస్తూ శ్రీరామ కథను నినదించే మునిసింహం వాల్మీకి మహర్షి. లోకహితం కోరి, ఉత్తమ ధార్మిక సమాజ నిర్మాణానికి సోదాహరణ ప్రాయమైన మానవ మాత్రులు ఎలా ప్రవచించాలో, ప్రవర్తించాలో, ప్రభావ సంపన్నంగా ఆచరణ చరణులు కావాలో శ్రీ సీతారాముల కథకు సంస్కృత భాషలో 24వేల శ్లోకాలతో 6 కాండలతో (ఆపైన ఉత్తరకాండతో కలిపి 7 కాండలతో) మనకు అందించారు మహర్షి వాల్మీకి. ఆ మహాకావ్యం 'ఆదికావ్యం'గా, వాల్మీకి 'ఆదికవి'గా లబ్ద ప్రతిష్టమైంది మనకు తెలిసిన విషయమే కద! శ్రీరామాయణం తదుపరి అనేకమైన ప్రపంచ భాషలలో అనువదించబడింది, ఆయా అనువాదకుల భావనా ప్రకర్షలలో, భావనా సృజనతో! కానీ వాల్మీకి రామాయణాన్నియధాతథంగా 24వేల పద్యాలతో 7 కాండలుగా "శ్రీమదాంధ్ర వాల్మీకి రామాయణం"గా చక్కని తెలుగు భాషలోనికి అనువాద గంగావతరణం చేసిన మహామహానుభావులు వాసుదాసస్వామివారు. వారే తమ ఆంధ్ర వాల్మీకి రామాయణాన్ని 1908లో కడపకు 25 కి.మీ. దూరంలో గల ఒంటిమిట్టలో గల శ్రీ కోదండ రామస్వామివారికి అంకితమిచ్చి ధన్యులైన అనన్య శ్రీరామభక్తులు. తొలి వాల్మీకి ఆంధ్రానువాదకర్తలు. రాబోయే కాలంలో తమ ఆంధ్రరామాయణం మారిన కాలానికి తగ్గట్లుగా అర్థం కావాలని భావించిన వాసుదాస స్వామి 'మందరం' అనే పేరుతో తను 24వేల పద్యాలకు చక్కని తాత్పర్యాలను రచించారు. 'మందరం' పేరుతో 'ఆంధ్రవాల్మీకి తాత్పర్య రామాయణం' విస్తృతమైంది.

శ్రీమాన్ వనం జ్వాలా నరసింహారావు గారు ఈగ్రంథకర్త. ఇది ఒక జీవన సాఫల్య తపః ఫలం దీనిని

'శ్రీరామాయణ కథార్ణవం' అనో 'శ్రీరామాయణ సుధామృతమో' అనో అనవచ్చును. లౌకిక ప్రాపంచిక సౌరభాలతో సతమతంగా వుంటున్న కాలంలో 'జ్వాలా' గారికి శ్రీరామ భూతం పట్టింది. ఆరోజు జనవరి 15, 2003. 'సుందరుడ'నిపించుకున్న హనుమ వారిని ఆవహించిన పుణ్యావహం! జ్వాలలో ఏదో ఒక భద్రమైన మార్పు కన్పిస్తూ వచ్చింది. మేమిద్దరం మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో ఉన్నతోద్యోగులం. రోజంతా కలిసిమెలిసి వుండే ఉద్యోగులం. ఇరుగు పొరుగులం. ఆయన పద్ధతి నాకు నచ్చేది కాదు. ఆయనది ఉధృతి, నాది నెమ్మతి. కానీ మా చెలిమి చిలుము పట్టనిది. జ్వాలా జనవరి, 2003లో వాసుదాస స్వామి వారి "సుందరకాండ' అత్యంత శ్రద్ధా భక్తులతో అనజాలను కానీ అత్యంత శ్రద్ధాసక్తులతో చదివి, ఒంట పట్టించుకున్నట్లు ఏ రోజు కారోజు నేను 'పరిప్రశ్నల' – జవాబుల ద్వారా గ్రహించేవాడిని. ఇది ఆ సీతారాముల చలవ చూపుల జలపాత స్నాన ఫలం వారి జీవితంలో!

2003 నుండి 2019 వరకు శ్రీ రామానుగ్రహపాతం అవిచ్ఛిన్నంగా వారిపై పడుతూ వచ్చింది. మన దేశంలో వున్నా, ఇతర దేశాలలో వున్నా ఆయన 'సుహృలేఖిని' శ్రీమదాంధ్ర, వాల్మీకి మందర మథనాన్నికొనసాగిస్తూనే ఉంది. ఎప్పటికప్పుడు శుద్ధప్రతులను 'ఈమేయిల్'లో నాకు పంపిస్తుండేవారు. ఆ క్రమంలో తాను వాసుదాస స్వామి వారికి 'అనువక్త'గా, మందరానికి 'వాచవి'గా వారి రామాయణాన్ని సంక్షిప్త సుందరమాధుర్యకావ్యంగా మలిచారు. ఇది 16 సం॥ల తపస్సు. స్వాధ్యాయం వంటి మందర పారాయణ పరమాన్నం. 2004లో ప్రారంభమైన 'మందర మకరంద మాధుర్యప్రచురణాస్వాదం' మొదట సుందరకాండ, ఆ పైన బాలకాండ (2010). అయోధ్యకాండ (2017). అరణ్యకాండ (2018), కిష్కింధాకాండ (2019) యుద్ధకాండ (2019) లు ప్రచురితమైనాయి. శ్రీరామానుగ్రహం ఆవిధంగా జ్వాలా గారిని వరించింది.

వాసుదాస స్వామి వారు 113 సం॥లకితం తమ 70 ఏండ్ల వయసులో రోజుకు 20గంటలు శ్రమించి ఆంధవాల్మీకాన్ని ఆంధ్రులకు అందించారని, తెలుగు నేలన నడయాడిన అప్పటి మహాకవులు, భక్తులు, సాహితీ ప్రియులు వారిని సంభావించేవారు. వారు పాదం మోపిన గృహాంగణాలన్నీ వాల్మీకి ఆశ్రమాలుగా, శ్రీ సీతారాములు కొలువైన దివ్యమంగళ ప్రాంగణాలుగా భావించే వారని మాపెద్దలు చెప్పేవారు. జ్వాలా గారి పితృపాదులు పరమపద వాసులైన శ్రీనివాసరావు గారు 'మందరా'న్ని పెక్కుమార్లు పారాయణం చేసిన పుణ్యఫలం వల్ల వారి పుత్రుని చేత ఇలాంటి గొప్ప 'రచనా, ప్రవచనా కైంకర్యం' ఆకాశవాణిలోనూ, పఠన, పాఠన, ప్రవచన బాణిలోనూ ప్రచారమౌతున్నది.

ఇటీవల కాలంలో జ్వాలాగారు 'భాగవత కథలు' రచించి, ప్రచురించారు. అది పండిత, పామరుల ఆమోదప్రమోదాలను అందుకుంది. ఇప్పుడు 'ఆంధ్రవాల్మీకి రసరమ్య గాధలు'ను రచించి, ప్రచురిస్తున్నారు. 400 పేజీలలో తెలుగు టైపులో విస్తరించిన మహాగ్రంథం. ఈ కాలంలో ఒక విచిత్రమైన దుస్థితి గొప్ప గొప్ప రచయితలను కూడా ఇబ్బంది పెడుతోంది. రచన శుద్ధ ప్రతుల తయారీ, ప్రచురణ, ముద్రణ, వినిమయం, సమీక్షణ, పునర్ముద్రణ – ప్రతి అంశమూ ప్రసవవేదనమే రచయితలకు| అయితే ఇవేమీ ముట్టని ఘటికులు జ్వాల. తాను రచన మాత్రం హాయిగా చేయగా, ఆధ్యాత్మిక మాసపత్రిక 'దర్శనమ్'నిర్వాహకులు బ్రహ్మశ్రీ మరుమాముల వేంకటరమణ శర్మ గారు ప్రచురణ బాధ్యత తీసుకోగా,

భాగవతోత్తములు, నిత్యనిరంతర శ్రీరామాయణ పారాయణ పరాయణులు, శ్రీ రామాయణ ప్రవచన వాణీ విలసితులు శ్రీమాన్ చీదేళ్ల సీతారామయ్య గారు ఆర్థికంగా అండదండలనందిస్తున్నారు. అసలు 'పట్టు' అంతా 'పట్టుదల'ను పెంచిన మా దివ్య సోదరి శ్రీమతి విజయలక్ష్మీ జ్వాలా గారిదే! ఇది నిజం.

వాసుదాసస్వామి వారి గురించిన 'విజ్ఞాన సర్వస్వం' తో బాటు, శ్రీ రామాయణంలో ఏముంది, శ్రీరామ, సీతమ్మ, రావణుల వైలక్ష్యణ్యాన్నీ, ధర్మ సంస్థాపనా మూర్తిగా శ్రీరామచంద్రుడ్నీ, రామాయణ రహస్యాలనూ, కాల గమనాన్నీ , నారద వృత్తాంతాన్నీ– ఇలాంటి వాటితోబాటు భవ్యమైన రసరమ్య రామాయణ గాథలను అందంగా, పాఠక సౌలభ్య శైలిలో ఈ విశిష్ఠ ఇతిహాసం 'మందరం' ఆధారంగా అనువక్తవ్యం చేయబడింది. ఇప్పటికే 'భారతగాథల'ను కూడా సిద్ధం చేస్తోన్న మన జ్వాలా నరసింహారావు గారు నిజంగా కారణజన్ముడు. ఏ పూర్వపుణ్యమో రాశీభూతమై శ్రీరామాయణ రహస్యాలను ప్రకాశకోశంగా వారి లేఖిని జాలువారుస్తోంది. నిరుపమ భాగ్యశాలురు, శ్రీరామానుగ్రహబల సంపన్నులు. "వాసిగ ఋషి విరచితంబగు, నీ సంహిత, నెవడు రామునెడగడు భక్తిన్! వ్రాసిన వ్రాయించిన స్వర్వాసం బామానవునకు నఱలు సతంబై'' (వాసుదాసు).

ఎన్నిలోకాగ్రతమైన వ్యగ్రతలు, వత్తిళ్లు వున్నా శ్రీ సీతారామ దివ్య కథాను వ్రతాన్ని చక్కగా అనుష్టిస్తూ వివిధ సాహితీరూపాల్లో అక్షరబద్ధం చేస్తూ శ్రీరామ కైంకర్యనిష్టువై జీవనయానాన్ని గడువుతున్న నా వీర(వైర) మిత్రమణి జ్వాలా నరసింహారావు గారిని అభినందిస్తున్నాను. తదుపరి భారత కథలు కూడా వేగవంతంగా పూర్తి చేయాలనీ ఆశిస్తున్నాను. "రామేణ రహితానాం హి కిమర్థం జీవితంహినః! జై శ్రీరామ్!

శ్రీరామ–రామానుజ దాసానుదాసుడు

చిలకపాటి విజయ రాఘవాచార్యులు,
పూర్వ కార్యదర్శి, హిందూ ధర్మ ప్రచార పరిషత్, తిరుమల తిరుపతి దేవస్థానములు,
డైరెక్టర్ దేవదాయ, ధర్మదాయ శాఖ ఆంధ్ర ప్రదేశ్ (SITA),
1–3–2021, విజయవాడ, సెల్ 8985030906.

తొలిపలుకు

కూజంతం రామరామేతి మధురమ్ మధురాక్షరమ్
ఆరూహ్య కవితాశాఖామ్ వందే వాల్మీకి కోకిలమ్.

ఆదికవి వాల్మీకి మహర్షి ఆదికాలంనాడు అక్షర బద్ధం చేసిన శ్రీమద్రామాయణ గాధ అశేష ప్రజానీకానికి అనాదిగా అనునిత్య పారాయణ గ్రంథమై విరాజిల్లుతోంది. శ్రవణం కీర్తనం వంటి నవవిధ భక్తి మార్గాలద్వారా ఆబాల్యమ్ రామకథ మనందరి జీవితాల్లో అంతశ్చేతనగా అలరారుతోంది. రామాయణాన్ని ఎన్నిసార్లు పారాయణం చేసినా నవనవోన్మేషంగా నూతనార్థాలతో గోచరిస్తుంది. రసప్లావితమై మనసు మరోమారు ఆహ్లాదభరితమవుతుంది.

రామాయణ గాధను ఎప్పటికప్పుడు ఎందరో మహానుభావులు పునః రచించడం, కాల మాన పరిస్థితులకు అనుగుణంగా వ్యాఖ్యానించడం కూడా అనాదిగా జరుగుతోంది. వివిధ కాలాల్లో వివిధ దేశాల్లో, వివిధ భాషల్లో వివిధ ప్రక్రియల్లో విలసిల్లిన రామాయణ గాథల్లో వర్ణనలు, కల్పనలు, పాత్రచిత్రణలో మార్పులు చేర్పులు కారణంగా అవాల్మీకాలకు ఆస్కారం కలిగింది. ఎంతో వైవిధ్యం చోటుచేసుకున్న ఈ సందర్భంలో అసలు సిసలు వాల్మీకి రచనకు ఎంతో ప్రాధాన్యత ఏర్పడింది. వాల్మీకి రామాయణాన్ని సంపూర్ణంగా తెలుగులోకి తెచ్చిన వాసుదాసు గారి భాషాసాహిత్య సేవ వేనోళ్ల కొనియాడబడింది. అయితే, విద్యల విషయంలో కాలక్రమంలో వచ్చిన మార్పుల కారణంగా పద్యం చదివి అర్థం చేసుకునే శక్తి నేటి తరంలో సన్నగిల్లింది. అందుచేతనే శ్రీ వనం జ్వాలానరసింహారావు గారు ఎంతో శ్రమించి విలువైన సమయాన్ని వెచ్చించి వ్యయ ప్రయాసలకోర్చి వాసుదాసు గారి మందరం ఆధారంగా వాల్మీకి రామాయణాన్ని సరళ వచనంలో రచించి నేటితరానికి అందుబాటులోకి తెచ్చి తెలుగు భాషా సాహిత్యాలకు తెలుగు సమాజానికి ఎనలేని సేవచేసారు.

శ్రీ వనం జ్వాలా నరసింహారావు గారు శ్రీమద్రామాయణాన్ని నేటితరం పాఠకుల కోసం తేట తెలుగులో రచించిన భాగవతోత్తములు. వారు అనేక దశాబ్దాలుగా పలు ప్రభుత్వాలలో ఉన్నత పదవులు

నిర్వహిస్తూ నిత్యం తీరికలేకుండా పెద్ద పెద్ద బాధ్యతలు నిర్వర్తిస్తూ కూడా నిరంతరం సాహిత్య సేవలో తరిస్తున్న ధన్యజీవి.

శ్రీమద్వాల్మీకి రామాయణాన్ని ఆసాంతం సరళ వచనంలో రచించటం వారి నిబద్ధతకు నిదర్శనమైతే ఆ మందర మకరందాన్ని అన్ని కాండలూ ప్రచురింపజేయటం వారి కార్యదక్షతకు తార్కాణం. అంతటితో ఆగకుండా వారు మరో అడుగు ముందుకేసి మందర మకరందం నుంచి అనేక రసరమ్య గాథలను వెలికితీశారు. ఆకాశవాణికి హైదరాబాద్ కేంద్రానికి వాటిని ప్రసారం చేసే అవకాశం కల్పించారు. ఇప్పటికే 52 రసరమ్యగాథలను ప్రసారం చేయటం జరిగింది. రామాయణ పరమార్థాన్ని విడమరచి చెప్పే ప్రయత్నంలో ఎన్నో విశేషాలను వివరించారు వనం వారు. రామాయణ ప్రసారం ద్వారా సమాజానికి ఎంతో మేలు కలుగుతుంది. నేటితరం శ్రోతలకు మరీముఖ్యంగా యువతకు, విద్యార్థులకు రామాయణ రసరమ్య గాథల ద్వారా మనోవికాసం కలుగుతుంది. ఆవిధంగా ఆకాశవాణి తన కర్తవ్య నిర్వహణలో భాగంగా రామాయణ గాథలు ప్రసారం చేసింది.

ఈ గాథలను వారు పుస్తకంగా ప్రచురించటం ఎంతో సంతోషదాయకం. శ్రీ వనం జ్వాలా నరసింహారావు గారి సాహిత్య సేవ, వారి ఆదరణ ఇలాగే కొనసాగాలని కోరుకుంటూ నాలుగు మాటలు రాయటానికి అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

శ్రీమతి మల్లాది శైలజా సుమన్
డిప్యూటి డైరెక్టర్ జనరల్, ప్రోగ్రాం
ఆకాశవాణి, హైదరాబాద్

ఆంధ్రవాల్మీకి రామాయణ రసరమ్య గాథలు

ముందుమాట

నేను వాల్మీకి రామాయణం మొదలు మందర మకరందంగా, ఆ తరువాత రామాయణ రసరమ్య గాథలుగా రాయడానికి పూర్వ రంగం వుంది.

గత శతాబ్దం, తొంభైవ దశకం చివర్లో నేను మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో ఉన్నతాధికారిగా పనిచేస్తున్న రోజుల్లో సంస్థ కేటాయించిన క్వార్టర్ లో నా నివాసం. అప్పట్లో, మా పొరుగునున్న బ్రహ్మశ్రీ శ్రీమాన్ చిలకపాటి విజయ రాఘవాచార్యులు లేచింది మొదలు నిద్ర పోయేదాక రామనామం తప్ప దేని మీద మనస్సు పోనీయడు. ప్రతినిత్యం రామాయణ పారాయణం చేస్తూ వుంటాడు. నా కంటే వయస్సులో చిన్న వాడైనా, జ్ఞానవృద్ధుడు. నా నిత్య కృత్యాలు చాలవరకు ఆయనకు నచ్చవు. నేనంటే మాత్రం ఇష్టం. ఆయన ఉదయం అనుష్టానం చేసుకుంటుంటే, చనిపోయిన మా నాన్న స్వర్గీయ వనం శ్రీనివాసరావు గారు గుర్తొచ్చేవారు. విజయరాఘవాచార్యులు గారు తిరుమల తిరుపతి దేవస్థానంలో కూడా పనిచేశారు. భారత, భాగవత, రామాయణ కావ్యాల నుండి అనర్గళంగా, అలవోకగా ఎలాంటి సందర్భాన్నైనా అప్పటికప్పుడు చెప్పగల మహనీయుడు.

మా నాన్నగారు స్వర్గీయ వనం శ్రీనివాసరావు గారు, వాసుదాసు గారు రచించిన ఆంధ్ర వాల్మీకి రామాయణం, మందరం అన్ని కాండల్నీ, కనీసం పాతిక సార్లకు పైగా పారాయణం చేసినవారు. వాసుదాసుగారూ ఆయన శిశ్యులు సుబ్బదాసుగారూ (దాసశేషుడు) ఖమ్మం జిల్లాలోని వనంవారి కృష్ణాపురం గ్రామంలో వున్న మా ఇంట్లో వారి పాదాలు మోపి మా ఇంటిని పావనం చేసారు నా బాల్యంలో చాలా సంవత్సరాల కింద. నేనూ మా నాన్నగారితో నా చిన్నతనంలో తెనాలి దగ్గర అంగలకుదురులోని వారి ఆశ్రమానికి వెళ్లాను ఒకటి-రెండు సార్లు. ఇటీవలి కాలంలో కూడా ఒకటి-రెండు పర్యాయాలు వెళ్లడం జరిగింది.

వాసుదాసుగారి ఆంధ్ర వాల్మీకంలోని ప్రతి కాండకొక ప్రత్యేకతుంది. ప్రతికాండ ఒక్కోరకమైన విజ్ఞానసర్వస్వం. ప్రతి కాండలోని, ప్రతి పద్యానికి, ప్రతి పదార్థం ఇస్తూ, చివరకు తాత్పర్యం

రాస్తూ, అవసరమైన చోట నిగూఢార్థాలను, అంతరార్థాలను, ఉపమానాలను ఉటంకిస్తూ, సాధ్యమైనంత వరకు ఇతర గ్రంథాల్లోని తత్సంబంధమైన అంశాలను పేర్కొంటారు కవి. ప్రత్యుత్తరం కోరి చదవాల్సిన విషయాలన్నింటికీ సోదాహరణంగా జవాబిస్తారు. శ్రద్ధగా చదువుకుంటూ పోతే, అర్థం చేసుకునే ప్రయత్నం చేసుకుంటూ చదువగలిగితే, ప్రతి కాండలో ఆ కాండ కథా వృత్తాంతమే కాకుండా, సకల శాస్త్రాల సంగమం దర్శనమిస్తుంది. ఒక సారి ధర్మశాస్త్రం లాగా, ఇంకో సారి రాజనీతి శాస్త్రం లాగా, మరో చోట ఇంకో శాస్త్రం లాగా బోధపడుతుంది.

ప్రతికాండ ఒక భూగోళ శాస్త్రం, ఖగోళ శాస్త్రం, సాంఘిక, సామాజిక, ఆర్థిక, సామాన్య, నీతి, సంఖ్యా, సాముద్రిక, కామ, రతి, స్వప్న, పురా తత్వ శాస్త్రం లాగా దర్శనమిస్తుంది. బహుశా, క్షుణ్ణంగా చదివితే, ఇంకెన్నో రకమైన శాస్త్ర విషయాలు గోచరిస్తాయి. అసలు-సిసలైన పరిశోధకులంటూ వుంటే, మందరం ఏ ఒక్క కాండ మీద పరిశోధన చేసినా, ఒకటి కాదు-వంద పీహెచ్‌డీలకు సరిపోయే విషయ సంపద లభ్యమవుతుంది. డాక్టరేట్ తో పాటు, అద్భుతమైన రహస్యాలు అవగతమౌతాయి.

మా శ్రీమతికి మా నాన్న గారి పూజ-పునస్కారాల వారసత్వం వచ్చింది. నాకంతగా అబ్బ లేదు. ప్రక్కనున్న విజయరాఘవ గారినీ, ఆయన భక్తి సంబంధమైన మాటలను ఎప్పుడూ వింటుంటే ఆమె: ''మీరు అన్న గారి మార్గంలోనన్నా పోతారు, లేదా, ఆయన మీ దారికన్నా వస్తారు'' అనేది, మేమిద్దరం చర్చించుకుంటుంటే. అదే నిజమైంది కొద్ది రోజుల్లో. నేను రామాయణం చదువుతాను, మీదగ్గరుంటే ఇవ్వండి, అయితే వాసుదాసు గారు వ్రాసిన ఆంధ్రవాల్మీకి రామాయణం మాత్రమే కావాలన్నాను. అలా అడగటానికీ, అదే కావాలంటానికీ ప్రత్యేక కారణం ఏమీ లేదు. కాకపోతే నా చిన్న తనంలో, మా నాన్న గారు ''మందరం'' పారాయణం చేస్తుంటే చూశాను కనుక అది మాత్రమే రామాయణమేమో అనుకున్నాను. ఆయితే నేను రామాయణం చదువుతానంటే ఆయన కొన్నాళ్ళు నమ్మలేదు. నేనూ గట్టిగా అడగనూలేదు. ఆయన ఇవ్వనూ లేదు. నేను ఆలోచన వచ్చిన వెంటనే చదవటమూ జరగలేదు.

మళ్ళీ నిత్య జీవితం. దైనందిన చర్యలు. మధ్యలో మా జిల్లాలోనే వున్న భద్రాచల రాముడినీ, పొరుగు రాష్ట్రంలో ఉన్న శ్రీరంగనాథ స్వామినీ, దర్శించుకొనే భాగ్యం కలిగింది, డిసెంబర్ 2002-జనవరి 2003 లో. ''శ్రీ రామావతార సమయంలో శ్రీ సీతా రాముల దర్శనం ఏదోవిధంగా కలగందే ఈ జన్మలో శ్రీరంగనాధుని (శ్రీరంగం) దర్శనం కలగనే కలగదు'' అన్నారు విజయరాఘవ గారు. జనవరి 15, 2003న తన ఇంట్లోకి పిల్చి, స్నానం చేసిరమ్మని, వాసుదాసుగారి శ్రీమదాంధ్రవాల్మీకి రామాయణం సుందరకాండ మందరం నా చేతిలో పెట్టారు. రామాయణం మొత్తం చదవడం తర్వాత, ముందిది చదవమన్నారు. ఎందుకంటే, రామాయణం పఠనమో, పారాయణమో సుందరకాండ తోనే మొదలెట్టాలన్నారు. అవునేమోననుకుని చదవడం ప్రారంభించాను.

సరీగ్గా పది రోజుల్లో ఆసాంతం చదివాను. ఏరోజుకారోజు, వీలున్నప్పుడల్లా చదివేవాడిని. చదివిన విషయ సారాంశం ఎప్పటికప్పుడు బడి పిల్లాడిలా, విజయరాఘవ గారికి అప్ప చెప్పే వాడిని. వశిష్ఠుడి నోట బ్రహ్మర్షి అంటేనే విశ్వామిత్రుడు ఒప్పుకున్నాడట! నేను చదువుతున్నానన్న నమ్మకం

ఆయనకు కలిగితేనే నాకెందుకో తృప్తనిపిస్చేది. పదిరోజుల్లో చదవడం గొప్ప కాదు. నన్ను ప్రేరేపించి, ప్రోత్సహించి చదివించిన ఆయన గొప్పతనం అది. వాల్మీకి సంస్కృతంలో వ్రాసిన ఇరవైనాలుగు వేల శ్లోకాలను ఎప్పుడంటే అప్పుడు ప్రతిపదార్థంతో సహా అప్పచెప్పగల సమర్థుడాయన!

ఆరువందల డెబ్బై పేజీల పద్య, గద్య, ప్రతిపదార్థ తాత్పర్య సహిత సుందరకాండ మందరాన్ని చదవడానికైనా, పారాయణం చేయడానికైనా, నాలాంటి చాలామందికి తీరికా, ఓపికా వుండదేమో అనిపించింది. తెలుగు భాషలో కనీస ప్రావీణ్యత వున్నవారికి అర్థమయ్యే రీతిలో వాసుదాసుగారి సుందరకాండ మందరాన్ని, ఆయనే ''వక్తగా'', నేను కేవలం ''వాచవిగా''–''అనువక్తగా'' శిష్ట వ్యావహారిక భాషలో సంక్షిప్తీకరించి నలుగురికీ అందించగలుగుతే బాగుంటుందేమో అనుకున్నాను.

2003 లో మా రెండో అమ్మాయి కిన్నెర సిన్సినాటి (అమెరికా) లో వున్నప్పుడు దాని కూతురు ప్రసవ సమయంలో సహాయంగా వుండడానికి దంపతీ సమేతంగా వెళ్లిన నేను హైదరాబాద్ లో మొదలుపెట్టిన సుందరకాండ మందర మకరందం పుస్తకాన్ని ఓ నెల రోజుల వ్యవధిలో శ్రీరామానుగ్రహం వల్ల పూర్తిచేసాను. కొంతకాలానికి, మిత్రుల, సన్నిహితుల ప్రోత్సాహంతో బాలకాండ మొదలుపెట్టాను. సుందర కాండ మందర మకరందం ఇప్పటికీ మూడు సార్లు ముద్రణ అయింది.

అయితే, కారణాలు ఏమైనప్పటికీ, ఆ తరువాత చాలాకాలానికి గాని, అంటే, 2009 లో మా అబ్బాయి ఆదిత్య అమెరికా సాన్ ఫ్రాన్సిస్కో నగరంలో వున్నప్పుడు, మా మనవరాలు కనక్ పుట్టే సమయంలో అక్కడికి పోయినప్పుడు, బాలకాండ మందర మకరందం పూర్తి చేయగలిగాను. అది తీసుకుని ఒక పబ్లిషర్ దగ్గరికి వెళ్తే మొత్తం రామాయణాన్ని రాసిన తరువాత అన్నీ కలిపి ముద్రిస్తానన్నాడు. అదోక ఛాలెంజ్ లాగా తీసుకున్నాను. అన్ని కాండలు రాయాలని నిశ్చయించుకున్నాను. బాలకాండ మొదటి ముద్రణ చిన జీయర్ స్వామి దయతో జరిగింది. ఆతరువాత ద్వితీయ ముద్రణ కూడా జరిగింది.

తరువాత అయోధ్య కాండ మందర మకరందం మొదలుపెట్టాను. అది సాగనివ్వదని పలువురు చెప్పిన మాట నిజమేమో అన్నట్లుగా అది పూర్తి చేయడానికి చాలా కాలం పట్టింది. దాన్ని హైదరాబాద్ లో, సింగపూర్ లో కూడా రాశాను. కాని చివరకు 2017 లో మరోమారు అమెరికా పర్యటనకు సాన్ ఫ్రాన్సిస్కో, హ్యూస్టన్ నగరాలకు అబ్బాయి, అమ్మాయిల దగ్గరికి వెళ్లినప్పుడు పూర్తి చేయగలిగాను. తరువాత రెండేళ్ళు అమెరికా రావడం కుదరలేదు. అరణ్యకాండ మందర మకరందం, కిష్కింధ కాండ మందర మకరందం హైదరాబాద్ లోనే పూర్తి చేశాను. యుద్ధకాండ మొదలు పెట్టాను. కాని అది కూడా అమెరికాలోనే పూర్తి కావాలని వుందేమో! అమెరికా రావడం (2019 నవంబర్) పూర్తి చేయడం జరిగింది. ఆ విధంగా మొత్తం రామాయణం ఆరు కాండలు రాయడానికి పదహారేళ్ల సుదీర్ఘ కాలం పట్టింది. ఆ విధంగా పదహారు సంవత్సరాల యజ్ఞం పూర్తయింది.

ఎందరో సహృదయులు, అందరికీ కృతజ్ఞతలు. సుందరకాండ మందర మకరందం వ్రాయడానికి వాడిన కలం కానీ, కాగితం కానీ, టైపు చెసిన కంప్యూటర్లు కానీ నావి కావు. ఆలాంటప్పుడు రాసింది నేను మాత్రమేనని, రాసిన విషయమంతా నా కృషివల్లనే జరిగిందని ఎలా అనగలను? నేనేంటి? ఆంధ్రవాల్మీకి రామాయణం మందరం చదవడమేంటి? చదివిన తర్వాత మందర మకరందంగా

మలచడమేంటి? తెలుగు సాహిత్యంలో, రచనా వ్యాసంగంలో అంతో, ఇంతో ప్రవేశం వున్న మాట కొంత వాస్తవమే అయినప్పటికీ, ఆంధ్రవాల్మీకి రామాయణాన్ని మందర మకరందంగా మలిచే శక్తి నాకు కలగడమేంటి?

ఇదంతా బహుశా ఏదో అద్భుత, అజ్ఞాత, అప్రమేయ శక్తి నాతో కావాలనే చేయించి వుంటుంది! ఆ శక్తే నన్ను పదే-పదే ఈ పనికొరకై అమెరికా పంపించి వుంటుంది! నేను అమెరికా ఒహాహియో రాష్ట్రంలోని సిన్సినాటి లో వున్న మా అమ్మాయి ఇంట్లో వున్నప్పుడు, ఆ ఆతరువాత హ్యూస్టన్ లో వున్నప్పుడు, మా అబ్బాయి ఆదిత్య ఇంట్లో శాన్ఫ్రాన్సిస్కోలో వున్నప్పుడు, ఆ శక్తే మా పిల్లలలో జొరబడి, వాళ్ల ద్వారా, ఆ ఇంట్లో నాకు అనువైన వాతావరణం కలిగించి వుంటుంది! వ్రాయడానికి అవసరమైన కాగితాలు, అన్ని రకాల పెన్నులూ వాళ్లతో ఇప్పించి వుంటుంది ఆ శక్తే! వ్రాసిన దానిని నేనే స్వయంగా కంప్యూటర్ ద్వారా తెలుగులో టైపు చేసుకునేందుకు అవసరమైన సాఫ్ట్ వేర్ ను తెప్పించిందీ ఆ శక్తేనేమో! ఇంగ్లీష్ లోనే సరీగ్గా కంప్యూటర్ వాడకం రాని నాతో 3000 పేజీలకు పైగా టైపు చేయించింది ఆ శక్తేనేమో! ఎప్పటికప్పుడు కంప్యూటర్ ప్రింట్లు తీయించి ఇచ్చింది ఆ శక్తేనేమో!

సుందర కాండ వ్రాత ప్రతి అయిన మరునాడే, దాన్ని పిట్స్ బర్గ్ లోని వెంకటేశ్వరస్వామి పాదాల దగ్గర పెట్టే అవకాశం దొరికింది. ఆ తరువాత స్వర్గీయ పీవీఆర్కే ప్రసాద్ గారు దాన్ని ఆవిష్కరించారు. ఇదిప్పటికి మూడు సార్లు ప్రచురించాను. బాలకాండ చినజీయర్ స్వామి దయతో ప్రచురించాను మొదటిసారి. అది కూడా రెండో సారి ముద్రించడం జరిగింది. అయోధ్య, అరణ్య, కిష్కింధ, యుద్ధ కాండలు కోరమండల్ సీతారామయ్య గారి ఆర్థిక సహాయంతో వెలుగులోకి వచ్చాయి. డాక్టర్ వుయ్యూరి లోకేష్ కూడా సహాయం చేశారు. ఈ పుస్తకానికి ఆర్థిక సహాయం ఆయనగారితో పాటు నా కూతురు కిన్నెర కొనికి చేసింది. వారికి ధన్యవాదాలు.

మా నాన్న గారు ఇప్పుడు జీవించి వుంటే బహుశా ఆయన కంటే ఈ విషయంలో సంతోషించే వారెవరూ వుండరు! ఆయన బ్రతికున్నప్పుడు నేనెట్లా వుండాలని కోరుకున్నాడో అలా కొంతవరకూ వున్నానంటానికి ఈ పుస్తకమే నిదర్శనం.

మందర మకరందంగా శ్రీమదాంధ్ర వాల్మీకి రామాయణం అన్ని కాండలను వాచవి-అనువక్తగా నేను రాయడం పూర్తి చేసిన తరువాత కలిగిన మరో ఆలోచన వీటినే చిన్న-చిన్న కథలుగా ఎందుకు రాయకూడదని! అలా మొదలుపెట్టి ఈ రామాయణ రసరమ్య గాథలను పూర్తి చేశాను. ఆకాశవాణి హైదరాబాద్ కేంద్ర వారి సూచన మేరకు వీటిని వారం-వారం శ్రోతలకు వినిపించి పరిచయం చేస్తున్నాను. సహృదయులైన ఆకాశవాణి శ్రోతలు మనసారా ప్రోత్సహించమని మనవి. నమస్కారం.

వనం జ్వాలా నరసింహారావు
రచయిత

ఆంధ్ర వాల్మీకి–వాసుదాస స్వామి

నూట ఏభై సంవత్సరాలకు పూర్వం, జనవరి నెల 1863 లో ఒక మహానుభావుడు అభినవ పోతన అవతారంగా కడప జిల్లా ఒంటిమిట్టలో జన్మించారు. తిథుల ప్రకారం మాఘ శుద్ధ చవితి అయిందారోజు. ఆంధ్ర వాల్మీకిగా, వాసు దాసుగా ప్రసిద్ధికెక్కిన ఆయనను స్మరించు కోవడం తెలుగు వారందరి కనీస ధర్మం.

వాల్మీకి రామాయణాన్ని యథావాల్మీకంగా, పూర్వ కాండలతో సహా ఉత్తర కాండను కూడా కలిపి తెనిగించిన ఏకైక మహాకవి కీర్తి శేషులు వావిలికొలను సుబ్బారావు (వాసుదాసు) గారు. ఆ మహానుభావుడి ఆంధ్ర వాల్మీకి రామాయణం మందరాలన్నీ, తెలుగునేల నాలుగు చెరగులా విశేష ప్రాచుర్యాన్ని ఏనాడో సంతరించుకున్నాయి. కానీ, కాలక్రమంలో అవన్నీ మరుగున పడిపోతున్నాయి. వాల్మీకి రామాయణ క్షీరసాగర మథనాన్ని చేసి ''మందర'' మకరందాలనూ, రమా రామ పారమ్య పీయూషాలనూ, నాలుగు చెరగులా పంచి, ఆ మథనంలో ఆవిర్భవించిన శ్రీ సీతారాముల తత్వాన్ని, వేద వేదాంగేతిహాస స్మృతి, శ్రుతి శుభంగా అన్వయించి, ఆంధ్రుల హృదయ కేదారాలను ప్రపుల్లంచేసిన పరమ భాగవతోత్తములు ''ఆంధ్ర వాల్మీకి'' వాసుదాస స్వామి. వాల్మీకి సంస్కృత రామాయణాన్ని అందరికంటే మొట్ట మొదలు తెనిగించి, పదే–పదే రామాయణ పఠన పాఠన శ్రవణాదుల పట్ల ఆంధ్రులకు అత్యుత్సాహాన్ని కలిగించి, “రామ భక్తి సామ్రాజ్యం'' అంటే, తెలుగు నేలే సుమా, అనిపించిన నిరుపమ రామ భక్తులు వాసుదాస స్వామివారు.

వాసుదాసుగారి కీర్తికి ఆలవాలమైంది ఆంధ్ర వాల్మీకి రామాయణం. ఆంధ్ర భాషలో అంతకుముందు రామాయణానికి యథా మూలాలు లేవని, అర్థ పూర్తి కలిగి, కావ్య–ఇతిహాస గౌరవ పాత్రమై, సర్వజన పఠనీయమై, ప్రామాణికమై, మూలానుసరమైన రామాయణం తెలుగులో వుండడం లోకోపకారంగా భావించి, రచించించారీ గ్రంథాన్ని వాసుదాసుగారు. ఎనిమిదేళ్లలో రామాయణాన్ని తొలుత నిర్వచనంగా ఆంధ్రీకరించి, అలనాటి కడప మండలంలోని ఒంటిమిట్ట కోదండ రామస్వామికి అంకితం

చేసారు . ఆయన రచించిన నిర్వచన రామాయణం, ఆయన జీవిత కాలంలోనే, నాలుగైదు సార్లు ముద్రించబడింది. తర్వాత, శ్రీ మదాంధ్ర వాల్మీకి రామాయణం ''మందరం'' పేరుతో గొప్ప వ్యాఖ్యానం రాసారు వాసుదాసుగారు. వాస్తవానికి అదొక గొప్ప ఉద్గ్రంథం. సరికొత్త విజ్ఞాన సర్వస్వం.

''మందరం''అంటే, క్షీర సాగరాన్ని మథించడంలో కవ్వంగా ఉపయోగించిన మందర పర్వతమే గుర్తుకొస్తుంది సాధారణంగా ఎవరికైనా. కాని, వాసుదాసుగారి శ్రీపాద సంబంధులకు మాత్రం, "మందరం'' అంటే, మొదట గుర్తుకొచ్చేది, ఆంధ్ర వాల్మీకి రామాయణం మందరమే. వాల్మీకి విరచితమైన రామాయణాన్ని శ్రీవారు, "క్షీరవారాసి'' గా సంభావించి, దానిని మథించిన తమ ''మేథ'' అందించిన మకరందాలను, మధురిమలను, ముచ్చటగా ''మందరం'' అని పేర్కొన్నారు. సహృదయ నైవేద్యంగా, అనుభవైక వేద్యంగా వచ్చిన రచనలకు అసాధ్యంగా, నిగమ గోచరంగా భావించబడిన రామాయణానికి ''మందరం'' అని నామకరణం చేయడంలో తను కొంత వరకే న్యాయం చేయగలిగానని అంటారాయన. ఇందులోంచి చిలికిన కొద్దీ ఎన్నో దివ్యరసాయనాలు ఉద్భవిస్తాయని, భావితరాల వారు ఇందుకు పూనుకోవాలని కూడా సూచించారు వాసుదాసుగారు.

తను రచించిన నిర్వచన రామాయణంలో సంస్కృత రామాయణంలో వున్న ప్రతి శ్లోకానికొక పద్యం వంతున రాసారు వాసుదాసుగారు. మందరంలో తను రాసిన ప్రతి పద్యానికి, ప్రతి పదార్థ తాత్పర్యం సమకూర్చారు. ఒక్కో పదానికున్న వివిదార్థాలను విశదీకరించారు. భావాన్ని వివరణాత్మకంగా విపులీకరించారు. ఆయన మందరాలలోని శ్రీరామాయణ వ్యాఖ్యానంలో ''జ్ఞాన పిపాసి'' కి విజ్ఞాన సర్వస్వం దర్శనమిస్తుంది. ఆయన రాసిన నిర్వచన రామాయణంలో సాధారణంగా అందరూ రాసే చంపక మాలలు, ఉత్పల మాలలు, సీస, ఆటవెలది, తేటగీతి, కంద, శార్దూలాలు, మత్తేభాలు మాత్రమే కాకుండా, తెలుగు ఛందస్సులో వుండే వృత్తాలన్నిటినీ, సందర్భోచితంగా ప్రయోగించారు.

వాసుదాసుగారి ఆంధ్ర వాల్మీకంలోని ప్రతి కాండకొక ప్రత్యేకతుంది. ప్రతి కాండ ఒక్కోరకమైన విజ్ఞానసర్వస్వం. ప్రతి కాండలోని, ప్రతి పద్యానికి, ప్రతి పదార్థం ఇస్తూ, చివరకు తాత్పర్యం రాస్తూ, అవసరమైన చోట నిగూఢార్థాలను-అంతరార్థాలను-ఉపమానాలను ఉటంకిస్తూ, సాధ్యమైనంత వరకు ఇతర గ్రంథాల్లోని తత్సంబంధమైన అంశాలను పేర్కొంటారు కవి. ప్రత్యుత్తరం కోరి చదవాల్సిన విషయాలన్నింటికీ సోదాహరణంగా జవాబిస్తారు. శ్రద్ధగా చదువుకుంటూ పోతే, అర్థం చేసుకునే ప్రయత్నం చేసుకుంటూ చదువగలిగితే, ప్రతి కాండలో ఆ కాండ కథా వృత్తాంతమే కాకుండా, సకల శాస్త్రాల సంగమం దర్శనమిస్తుంది. ధర్మశాస్త్రం లాగా, రాజనీతి శాస్త్రం లాగా, భూగోళ శాస్త్రం, ఖగోళ శాస్త్రం, సాంఘిక, సామాజిక, ఆర్థిక, సామాన్య, నీతి, సంఖ్యా, సాముద్రిక, కామ, రతి, స్వప్న, పురాతత్వ శాస్త్రం లాగా దర్శనమిస్తుంది. అసలు, సిసలైన పరిశోధకులంటూ వుంటే, మందరం ఏ ఒక్క కాండ మీద పరిశోధన చేసినా, ఒకటి కాదు-వంద పీహెచ్‌డీలకు సరిపోయే విషయ సంపద లభ్యమవుతుంది. డాక్టరేట్ తో పాటు, అద్భుతమైన రహస్యాలు అవగతమౌతాయి. పాదరసం నుండి బంగారం చేసే రహస్యమైన విషయాలలాంటి అనేకమైనవి తెలుసుకోవచ్చు, పరిశోధనా దృక్పథంతో చదివితే. ప్రతి కాండ చివర వాసుదాసుగారు రాసిన ఆఖరు పద్యంలో, ఆ కాండలో వున్న మొత్తం పద్యాలెన్నో తెలియచేసే పంక్తులుంటాయి.

ఆంధ్ర వాల్మీకి రామాయణం రాయడానికి ప్రేరణ–స్ఫూర్తి, భాగవత గ్రంథకర్త బమ్మెర పోతన సంకల్పం ద్వారానే తనకు లభించిందంటారు వాసుదాసుగారు. తనకంటే ముందు కాలం నాటి పూర్వ కవులెవరు, రామాయణాన్ని (పూర్వ కాండలు, ఉత్తర కాండ కలిపి) సంపూర్ణంగా తెనిగించలేదని గ్రహించిన వాసుదాసుగారు, అన్ని కాండలను తెనిగించి, విశేషించి తెలుగు పాఠక లోకానికి ఆవిష్కరించాలని సంకల్పించుకున్నారు. భగవత్ చరిత్రలెన్నో వుండగా రామాయణ రచనకే ఎందుకు పూనుకున్నావని అడిగినవారికి తనదైన శైలిలో జవాబిచ్చారు వాసుదాసుగారు. జనన–మరణ రూపకమైన సంసార బంధం నుండి విముక్తి చేసేది రామ కథేనని, భగవత్ సాయుజ్యం పొందేందుకు రామాయణ రచన చేసానని అంటారాయన. పూర్వం కొందరు రాసారుకదా, మరల ఎందుకు రాస్తున్నావంటే, "ఎవరి పుణ్యం వారిదే. ఒకరి పుణ్యం మరొకరిని రక్షించదు'' అని జవాబిస్తూ, శ్రీరాముడి అనుగ్రహం కొరకు రామాయణాన్ని రచించి వాగ్రూపకైంకర్యం చేయదల్చానంటారు వాసు దాసుగారు.

వావిలికొలను సుబ్బారావుగారు, కడప జిల్లా, జమ్మలమడుగులో 1863 లో జన్మించి 1939 లో పరమపదించారు. ఎఫ్.ఎ చదువు పూర్తిచేసి, పొద్దుటూరు తాలూకా కార్యాలయంలో చిరుద్యోగిగా చేరి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ హోదాకెదిగారు. ఆ విధంగా 1893–1904 మధ్య కాలంలో పదకొండేళ్లు రెవెన్యూ శాఖలో ఉద్యోగం చేసారు మొదట్లో. కందుకూరి వీరేశలింగం పంతులు గారి తర్వాత, మద్రాస్ (నేటి చెన్నై) ప్రెసిడెన్సీ కళాశాలలో ఆంధ్ర పండితులుగా 1904–1920 మధ్య కాలంలో పనిచేశారు. వాసుదాసుగారి తర్వాత ఆ పదవిని అలంకరించింది అక్కిరాజు ఉమాకాంతం గారు. కళాశాలలో చేరక ముందే, పినతండ్రి మీద తనకున్న కృతజ్ఞతకు గుర్తుగా, "శ్రీ కుమారాభ్యుదయం'' అనే ప్రబంధ గ్రంథాన్ని రచించి, ఆయనకు అంకితమిచ్చి శాశ్వత స్వర్గ సుఖాన్ని కలిగించారాయనకు. ఆయన రచించిన ఆ ప్రబంధం, నాటి కవి పండితులను ఆశ్చర్య పరిచింది. ఆయన ప్రతిభకది తొలి హారం.

ఆంధ్ర పండితుడిగా పనిచేస్తున్న రోజుల్లోనే, భార్యా వియోగం కలగడంతో, వాసుదాసుగారు భక్తి, యోగ మార్గం పట్టారు. జీర్ణ దశలో వున్న ఒంటిమిట్ట రామాలయాన్ని సముద్ధరించాలన్న సంకల్పంతో, బిక్షాటనచేసి లభించిన ధనంతో ఆలయాన్ని అభివృద్ధి చేసారు. ఆంధ్ర వాల్మీకి రచనాకాలం 1900–1908 మధ్య కాలంలో. గాయత్రీ మంత్రం, రామ షడక్షర మంత్రం మూలంలో వున్నట్లే, అనువాదంలో కూడా నిక్షిప్తం చేశారాయన. వాల్మీకంలో వున్న బీజాక్షరాలన్నీ, ఇందులోనూ యథాస్థానంలో చేర్చబడ్డాయి. విడిగా వాసుదాసుగారు, గాయత్రీ రామాయణం, శ్రీరామనుతి కూడా రాసారు. ఆంధ్ర వాల్మీకం అనువాదమైనా, స్వంత రచన, స్వతంత్ర రచన అనిపించుకుంది.

వావిలికొలను సుబ్బారావుగా పండిత పదవీ విరమణ చేసిన అనంతరం, తన జీవితమంతా, భక్తి మార్గంలోనే గడిపారు. వాసుదాసుగారు ''కౌసల్యా పరిణయం'' అనే ప్రబంధం, "సుభద్రా విజయం'' అనే నాటకంతో పాటు, "హిత చర్యలు'', "ఆధునిక వచనరచనా విమర్శనం'', "పోతన నికేతన చర్చ'', "పోతరాజు విజయం'', "రామాశ్వమేథం'', ఆంధ్రవిజయం'' కూడా రాసారు.''ఆర్యకథానిధులు'' అన్న పేరుతో ఆయన రాసిన సులభ వచన గ్రంథాలు తెలుగువారందరికి అత్యంత ఆదరణీయమైనాయి.''సులభ వ్యాకరణం'' తెలుగు వ్యాకరణాన్ని నిజంగానే సులభం చేసింది. ఆయన

రచించిన ''కృష్ణావతార తత్వం'' ప్రశస్త కృతి పాండిత్యంతో, ఆధ్యాత్మిక భావనతో, పాఠకులలో ఆంధ్ర భాషాభిమానాన్ని ఉద్దీపించ చేసి, తాను తరించి, ఇతరులను తరింపచేసిన ధన్యాత్ముడు, మహామనీషి వావిలికొలను సుబ్బారావు గారు. వాస్తవానికి సరైన పోషకుడో, ప్రాయోజకుడో వుండి వుంటే, వాసుదాసుగారి ఆంధ్రవాల్మీకి రామాయణం, ఎప్పుడో, ఏనాడో నొబెల్ సాహిత్య బహుమతికో, జ్ఞానపీఠ పురస్కారానికో నోచుకుని వుండేది. ఏ మాత్రం మన తెలుగువారు ప్రయత్నం చేసినా, ఆ మహానుభావుడికి భారతరత్న, జ్ఞానపీఠ అవార్డులతో పాటు నొబెల్ బహుమానం వచ్చేది. ఇప్పటికైనా ఆ ప్రయత్నం చేస్తే మంచిదేమో.

వాసుదాసుగారు ఆంధ్ర వాల్మీకిగా లబ్ద ప్రతిష్టులయ్యారు. రామాయణ క్షీర సాగరాన్ని ''మందరం'' మథించి, మనకందరికీ ఆప్యాయంగా అందించింది. అయితే, దానిని ఆస్వాదించే తీరికా, ఓపికా లేని జీవులమైపోయాం మనం. భాష, శైలి, అర్థం, తాత్పర్యం కాలక్రమంలో పరిణామం చెందుతున్నాయి. నేటితరం పఠితులూ, పండితులూ ''సూక్ష్మంలో మోక్షం'' కావాలంటున్నారు. కాలం గడిచిపోతున్నది. వాసుదాసుగారు మారిపోతున్నతరాలకు గుర్తు రావడంకూడా కష్టమైపోతున్నది. వారి ''ఆర్యకథానిధుల'' తోనూ, ''హితచర్యల'' పరంపరలతోనూ, పరవశించిపోయిన ఆ నాటి తెలుగు పాఠక మహనీయులు క్రమంగా తెరమరుగవుతున్నారు. మళ్లీ-మళ్లీ జ్ఞాపకం చేసుకోవాల్సిన, మరువలేని మహనీయుడు, ప్రాతఃస్మరణీయుడు వాసుదాసస్వామి.

◆❖◆

వాల్మీకి రామాయణంలో ఏముంది?

వాల్మీకి ఎవరు అనే అంశాన్ని వాస్తవానికి లోతుగా అధ్యయనం చేసిన వారికి అదే వాల్మీకి రామాయణంలో సమాధానాలు లభ్యమవుతాయి. వాల్మీకి ఎవరు, ఏమిటి, ఏ కులంవాడు అని ఆలోచించే కన్నా, ఆయన రచించిన రామాయణంలో ఏముంది, అది ఎందుకు అవశ్య పఠనీయం అనే అంశాలపై కొంత దృష్టి సారిస్తే, అనుమానాలన్నీ నివృత్తి అవుతాయి. అలానే, 'మానిషాద ప్రతిష్టాం త్వ...' శ్లోకం నుంచి ప్రారంభించి, ఆద్యంతం గూఢార్థాలను వెతుకుతే కాని అసలు విషయం బోధ పడదు.

వాల్మీకి రామాయణం యథా వాల్మీకంగా పూర్వ కాండలతో ఉత్తర కాండను కూడా కలిపి రచించిన ఏకైక వ్యక్తి, కడప జిల్లా ఒంటిమిట్ట వాస్తవ్యులు, వాసు దాసుగా ప్రసిద్ధికెక్కిన కీర్తి శేషులు వావిలికొలను సుబ్బారావు గారు. రామాయణం అంటే ఏమిటి, వాల్మీకి రామాయణం ఎందుకు చదవాలి, అనే అంశాలను ఆయన పీఠికలో సవివరంగా వుంది. రామాయణాన్ని చక్కగా తెలిసినవారు, అర్థం చేసుకోగలిగిన వారు మాత్రమే లోకానికి అందలి విషయాలను వివరించగల సమర్థులు. అందరికీ అది సాధ్యమయ్యేది కాదు. తత్త్వమెరిగిన మహాత్ముడు వాల్మీకి మహర్షి, తను రచించిన ఆది కావ్యానికి శ్రీ రామాయణం అని పేరు పెట్టాడు. శ్రీరాముడు భగవంతుడన్న అర్థం, హారంలోని సూత్రంలాగా, రామాయణంలోని ఏడు కాండల్లోనూ వ్యాపించి వుంది. ఆసక్తిగా శోధించిన వారికి, పరీక్షించిన వారికి మాత్రమే, వాల్మీకి రామాయణానికి, ఇతర రామాయణాలకు గల తారతమ్యం, వాల్మీకి రామాయణంలోని గొప్పదనం తెలుస్తుంది.

వాల్మీకి చరిత్ర గురించి కూడా రామాయణంలోనే ఇమిడి వుంది. సీతా రామ లక్ష్మణులు చిత్రకూటంలో వాల్మీకిని కలిసినప్పుడు ఆయనే తనగురించి ఇలా చెప్పుకున్నాడు....''రామా, నేను పూర్వం పరమ కిరాతకులతో పెంచబడ్డాను. పుట్టుకతో విప్రుడనైనా, ఆచార రీత్యా కిరాతకుడినయ్యాను. కిరాతక స్త్రీని పెళ్లి చేసుకుని కొడుకులను పొందాను. దొంగల్లో చేరి దొంగనయ్యాను. జంతువుల పాలిటి యముడనయ్యాను. నేనున్న భయంకర అడవిలో ఓ రోజు సప్తఋషులు కనిపిస్తే, వాళ్లను

దోచుకుందామని, వారివెంట పరిగెత్తాను. నీచుడా, ఎందుకొచ్చావు?' అని వారడిగారు. నాపుత్రులు ఆకలితో వున్నారు, వాళ్ల సంరక్షణకై ఈ కొండల్లో అడవుల్లో తిరుగుతున్నాను. వాళ్ల ఆకలి తీర్చేందుకు మీదగ్గరున్నవి దోచుకుందామని వచ్చానని జవాబిచ్చాను. నన్ను ఇంటికి పోయి, నా పాపంలో కుటుంబ సభ్యులు భాగం పంచుకుంటారేమో కనుక్కుని రమ్మన్నారు మునులు. నేనొచ్చేవరకు వుంటామని కూడా చెప్పారు. వాళ్ల మాటలు నమ్మి ఇంటికి పోయి వారు చెప్పినట్లే నా భార్యా పిల్లలను ప్రశ్నించాను. నేను తెచ్చింది తింటామన్నారే కాని నా పాపంతో సంబంధం లేదన్నారు. వెంటనే మునుల వద్దకు పరుగెత్తుకుని పోయి, వాళ్ల పాదాలపై పడి నన్ను రక్షించమని కోరాను.

ఈ బ్రాహ్మణాధముడికి మోక్ష మార్గం ఉపదేశిద్దామని తలచిన వారు 'రామ' నామాన్ని తలకిందులు చేసి, వాళ్లు మరల వచ్చే వరకు, 'మరా మరా' అని ఎల్లవేళలా జపించమని ఆదేశించి పోయారు. ఆ విధంగానే సర్వసంగ విహీనుడనై, నిశ్చలుడనై దీర్ఘకాలం జపించాను. నాపైన పుట్ట పెరిగింది. నా తపోబలంతో, నేనక్కడ నాటిన దండమే వృక్షమయింది. ఇలా వేయి యుగాలు గడిచిపోయాయి. ఋషులు మళ్లా వచ్చి లెమ్మని పిల్చారు. పుట్టనుండి బయట కొచ్చిన నన్ను చూసిన మునులు నన్ను 'మునీశ్వర వాల్మీకీ ' అని పిలిచారు. నాకది రెండవ జన్మన్నారు''. అని చెప్పాడు వాల్మీకి. రామాయణంలో వాల్మీకి బోయవాడని ఎక్కడా చెప్పబడలేదు. దాంట్లో తప్పేం లేదు కూడా. ఇక రామాయణం విషయానికొస్తే...

వాల్మీకి రామాయణం రాయడానికి ముందర ఒక నాడు తమసా నదిలో స్నానం చేస్తున్న సందర్భంలో, ఆయన కంటికి సమీపంలో, మనోహరంగా కూస్తూ, వియోగం సహించలేని క్రౌంచ పక్షుల జంట కనిపించింది. ఆ సమయంలో, తాను చూస్తున్నానన్న లక్ష్యం కూడా లేకుండా, సహజంగా జంతువులను హింసించే స్వభావమున్న బోయవాడొకడు, రెండు పక్షులలో మగదాన్ని బాణంతో చంపి నేల కూల్చాడు. క్రూరుడైన బోయవాడిపై దయ వీడి శపించాడు వాల్మీకి.సంస్కృత రామాయణంలో ఆ శ్లోకం ఇలా వచ్చింది వాల్మీకి నోట:

"మానిషాద ప్రతిష్ఠాం త్వ! మగ మ శ్శాశ్వతీ స్సమాః
యత్క్రౌంచ మిథునాదేక! మవధీః కామమోహితం"

ఆంధ్ర వాల్మీకి రామాయణంలో వాసు దాసుగారిలా తెనిగించారు ఆ శ్లోకాన్ని:

"తెలియు మా నిషాదుండ ప్రతిష్ఠ నీక
ప్రాప్తమయ్యెడు శాశ్వతహాయనముల
గ్రౌంచ మిథునంబునందు నొక్కండు నీవు
కామమోహిత ముం జంపు కారణమున"

శ్రీ రామాయణం మహాకావ్యం. పుట్టుకతోనే కాకుండా గుణంలో కూడ అదే మొదటిది. దానిలోని గుణాలు, రహస్యాలు తెలుసుకోవాలంటే వాల్మీకికి గాని, సర్వజ్ఞుడికి గాని మాత్రమే సాధ్యమవుతుంది. తన వర్ణనా చాతుర్యంతో వాల్మీకి, పాఠకులను, తన చేతిలో బొమ్మలా చేసి,ఇష్టమొచ్చినట్లు

ఆడుకుంటాడు. వాల్మీకి మరో ప్రత్యేకత ''ఉత్ప్రేక్ష''. అలానే ఆయన వాడిన శ్లేషాలంకారాలు. శ్లేషాలంకారానికి చక్కటి ఉదాహరణ వాల్మీకి నోట వెలువడిన ప్రథమ శ్లోకం.

ఒక బోయవాడు క్రౌంచ మిథునంలో వున్న మగ పక్షిని చంపడం, ఆడ పక్షి అది చూసి దుఃఖించడం, పరమ దయామయుడైన వాల్మీకి అది చూసి, బోయవాడు చేసిన అధర్మ కార్యానికి కోపగించి అతడిని శపించడం జరిగింది. ఆ శాపమే రామాయణ ఉత్పత్తికి కారణమైంది. దీనికి భగవత్ పరంగా ఒక అర్థం వుంది. రామాయణంలోని ఏడు కాండల అర్థం, కథ ఇందులో సూక్ష్మంగా సమర్థించబడింది. శ్రీరాముడు భగవంతుడన్న అభిప్రాయం వాల్మీకి పదే పదే చెప్పుకుంటూ పోయాడు రామాయణంలో.

వాల్మీకి రామాయణమనే ''కలశార్ణవం'' లో రత్నాలను వెదికేవారు, మొట్టమొదటగా తెలుసుకోవాల్సింది వాల్మీకి శైలి-విధానం. అది తెలుసుకోలేక వెతకడం మొదలుపెట్టితే, చీకట్లో తారాడినట్లే. వాల్మీకి రామాయణం ''ధ్వని కావ్యం''. కావ్యమంతా ధ్వన్యర్థం వుండడమే కాకుండా, పలు శ్లోకాలకు విడిగా ధ్వన్యర్థం వుంది. రుతు వర్ణనలలో ధ్వని స్ఫురిస్తుంది. శ్రీ రామాయణంలోని కవితా చమత్కృతిని విశదీకరించాలంటే, ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. అందువల్లే, వాల్మీకి రామాయణం పారాయణం చేసేవారు, "అంగన్యాస కరన్యాసాదులతో'' యథావిధిగా చదివి, వారి వారి కోరికలు నెరవేర్చుకుంటారు. సద్భావంతో సుందర కాండ పారాయణం చేసి కార్య సిద్ధిని పొందనివారు ఇంతవరకు లేరు. గాయత్రిలోని 24 అక్షరాలను, ప్రతి వేయి శ్లోకాలకు ఒక అక్షరం చొప్పున శ్లోకం ఆరంభంలో చెప్పబడింది. ఏడు కాండలలో ఏడు వ్యాహృతులు వివరించడం జరిగింది. ఈ గాయత్రీ విధానాన్ని నారదుడే స్వయంగా వాల్మీకి మహర్షికి, రామాయణంతో పాటే ఉపదేశించాడు. "తప స్స్వాధ్యాయ నిరతం, తపస్వీ వాగ్విదాంవరమ్, నారదం పరిపప్రచ్ఛ, వాల్మీకిర్మునిపుంగవమ్'' అని గాయత్రిలోని మొదటి అక్షరంతో శ్లోకాన్ని ప్రారంభించి, "జనశ్చ శూద్రోపి మహత్త్వ మీయాత్''అని గాయత్రి కడపటి అక్షరంతో సర్గను ముగించాడు. అది భగవత్ కథ కావడానికి అదనంగా సర్వజ్ఞుడైన వాల్మీకి కూర్చిన బీజాక్షరాల మహాత్మ్యమే. శ్రీమద్రామాయణం వేదంతో సమానమైందే కాకుండా వేదమే అనాలి.

గీర్వాణ భాషా గ్రంథాలలో ఆద్యమైంది శ్రీ రామాయణ కావ్యం. కావ్యాలలోకెల్లా ప్రథమంగా ఉత్పన్నమైంది కావడంతో అది ఆదికావ్యమైంది. మన పూర్వీకులకు తెలియని నాగరికతలు లేవు. వారు ఏ కారణం వల్ల ఆర్యులయ్యారు? ఎటువంటి గుణాలు కలిగి, ఎటువంటి మహోన్నత స్థితిలో వుండే వారు? వారి నాగరికత విధానం ఎటువంటిది? వారి కులాచార ప్రవర్తనలెలావుండేవి? రాజుకు-ప్రజలకు మధ్య ఐకమత్యం ఎలా వుండేది? భార్యా-భర్తలు, సోదరులు, తల్లి తండ్రులు, పుత్రులు పరస్పరం ఎలా ప్రవర్తించేవారు? సుఖ-దుఃఖాల విషయంలో స్త్రీ-పురుషులు ఏ విధమైన నడవడి గలవారు? వారికి దేవుడంటే ఎలాంటి ఆలోచన వుండేది? దైవాన్ని వారెలా ఆరాధిస్తుండే వారు? ఇలాంటి లౌకిక విషయాలను తెలుసుకోవాలనుకునే వారికి శ్రీ రామాయణాన్ని మించి తెలిపే గ్రంథం ఎక్కడా లేదు. కాలక్షేపానికి చదవడానికైనా శ్రీ రామాయణం లాంటి పుస్తకం ఇంకోటి లేదు. శ్రద్ధా భక్తులతో చదివినవారికి కల్పవృక్షంలా కోరిన కోరికలు తీర్చేదీ రామాయణమే. ఇహ-పర లోకాల్లో

సుఖపడాలనుకునేవారికి, శ్రీ రామాయణ పఠనం అవశ్య కర్తవ్యం. శ్రీరామచంద్రుడు మనుష్యుడివలె నటిస్తుంటే, వాల్మీకేమో వాస్తవార్థం చెప్తూ, ఆయన సాక్షాత్తు భగవంతుడే అంటాడు.

వాల్మీకి రామాయణంలోని పాత్రలు, పాత్రధారుల వాక్కులు, ఆయా పాత్రల చిత్త వృత్తి గుణాలను తెలియచేసేవిగా, సందర్భోచితంగా, వారున్న అప్పటి స్థితికి అర్హమైనవిగా వుంటాయి. శ్రీమద్రామాయణం గొప్ప ధర్మ శాస్త్రం. ఇందులో సర్వ విధాలైన, అన్ని రకాల ధర్మాల గురించి వివరంగా చెప్పబడింది. రాజ ధర్మం, ప్రజా ధర్మం, పతి ధర్మం, సతీ ధర్మం, భాతృ ధర్మం, పుత్ర ధర్మం, భృత్యు ధర్మం, మిత్ర ధర్మం లాంటి అన్ని ధర్మాలను గురించి చక్కగా తెలుపబడి వుంది. లాభ, లోభ, పక్షపాత బుద్ధి లేకుండా, న్యాయం మీదే దృష్టి నిలిపి వాదించే న్యాయవాది ధర్మం కూడా చెప్పబడింది. శ్రీమద్వాల్మీకి రామాయణం మంత్రనిధానం. ఇందులో అనేకానేక మంత్రాలు ఉద్ధరించబడి వున్నాయి.

భగవద్గీత, శ్రీ విష్ణు సహస్ర నామ స్తోత్రం, శ్రీ రామాయణం భారతీయ సంస్కృతీ రూపాలు. సనాతన ధర్మ ప్రతిపాదకాలు. వీటి మౌలిక తత్వాలు ధర్మ–జ్ఞానాలు. ఈ రెండింటినీ వాచ్య–వ్యంగార్థాలతో శ్రీ మద్రామాయణం ఆవిష్కరిస్తోంది. వాల్మీకి ఆదికవి. రామాయణం ఆదికావ్యం. ఇది ధ్వని–అర్థ ప్రతిపాదిత మహా మంత్రపూతం. గాయత్రీ బీజసంయుతం. ఔపనిషతత్వసారం. స్మరణ–పారాయణ మాత్రంగా అంతఃకరణ శుద్ధి అవుతుంది. రామాయణం రసరమ్యం, రామనామం సదాస్మరణీయం, రామాయణం రసరమ్య కావ్యం. అష్టాక్షరీ మంత్రంలోని 'రా' శబ్దం, పంచాక్షరీ మంత్రంలోని 'మ' శబ్దం కలిపి వశిష్ఠ మహర్షి ఏ పుణ్య ముహూర్తంలో దశరథ తనయుడికి 'రామ' నామాన్ని ఖరారు చేశారో కాని, యుగయుగాలకు, రామనామం తారక మంత్రమైంది. అజరామరమైంది. రామాయణాన్ని ఎన్నిసార్లు చదివినా–విన్నా తనివి తీరదు.

◆❖◆

వాల్మీకి రామాయణం
భారతీయ సంస్కృతికి ప్రతిరూపం

వాల్మీకి సంస్కృతంలో రచించిన శ్రీమద్రామాయణంలో నాయిక సాక్షాత్తు శ్రీదేవైన సీతాదేవి. నాయకుడు మహావిష్ణువైన శ్రీరామచంద్రమూర్తి. వీరిరువురు త్రేతాయుగంలో దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ చేసి, ధర్మ సంస్థాపన చేసేందుకు అవతరించారు. శ్రీమద్రామాయణం బాలకాండలో శ్రీ మహావిష్ణువు భూమిపై అవతరించాల్సిన కారణం, అయోధ్య కాండలో స్థితి కారణం, అరణ్య కాండలో మోక్షమిచ్చే అధికారం, కిష్కింధ కాండలో గుణ సంపత్తి, సుందర కాండలో సర్వ సంహార శక్తి, యుద్ధ కాండలో వేదాంత వేద్యత్వం, ఉత్తర కాండలో సృష్టికి హేతువు లాంటి విషయాలను చెప్పడం జరిగింది.

రామాయణ రచనకు పూనుకున్న వాల్మీకి మహర్షి, తన ఆశ్రమానికి వచ్చిన నారదుడికి సాష్టాంగ నమస్కారం చేసి: ''గుణవంతుడు, అతివీర్యవంతుడు, ధర్మజ్ఞుడు, కృతజ్ఞుడు, సత్యశీలుడు, సమర్థుడు, నిశ్చలసంకల్పుడు, సదాచారం మీరనివాడు, సమస్త ప్రాణులకు మేలు చేయాలన్న కోరికున్నవాడు, విద్వాంసుడు, ప్రియదర్శనుడు, ఆత్మవంతుడు, కోపాన్ని స్వాధీనంలో వుంచుకున్నవాడు, ఆశ్చర్యకరమైన కాంతిగల వాడు, అసూయ లేనివాడు, రణరంగంలో దేవదానవులను గడ-గడలాడించ గలవాడు ఎవరైనా వున్నారా ఈ భూలోకంలో?'' అని పదహారు ప్రశ్నలు వేస్తాడు. పదహారు తపస్సంఖ్యాకం. పదహారు కళలతో కూడినవాడు పూర్ణ చంద్రుడు. అలానే పదహారు ప్రశ్నలకు జవాబుగా శ్రీరామచంద్రుడిని తప్ప ఇంకొకరి పేరు చెప్పగలమా? అందుకే శ్రీరాముడిది పూర్ణావతారం.

బాల్యంలోనే శ్రీరాముడు గుహుడిలాంటి వారితో సహవాసం చేయడంతో, ఆయన ''గుణవంతుడు'' అయ్యాడు. తాటకాది రాక్షసులను చంపి ''వీర్యవంతుడు'' అయ్యాడు. గురువాజ్ఞ మీరక పోవడం, జనకాజ్ఞ జవదాటక పోవడం, పరశురాముడిని చంపక పోవడం లాంటివి ఆయన ''ధర్మజ్ఞుడు'' అని తెలుపుతాయి. అయోధ్య కాండ వృత్తాంతమంతా శ్రీరాముడిని సత్యవాదిగా, దృఢవ్రతుడిగా, సచ్చరిత్రుడుగా తెలుపుతుంది. విద్వాంసుడు, సమర్థుడు అనే విషయాలను కిష్కింధ కాండలో హనుమంతుడితో జరిపిన సంభాషణ, వాలి వధల ద్వారా అర్థమవుతుంది. కాకాసుర రక్షణ శ్రీరాముడి

సచ్చరిత్రను, సర్వ భూత హితాన్ని అరణ్య కాండ ద్వారా తెలుపుతుంది. సుందర కాండలో హనుమంతుడి రామ సౌందర్య వర్ణన ఆయనెంత ప్రియ దర్శనుడనేది తెలుపుతుంది. విభీషణ శరణాగతి ద్వారా రాముడి ఆత్మవంతుడి లక్షణాన్ని బయటపెడుతుంది. ఇంద్రజిత్తుపై కోపించక పోవడం, చేజిక్కిన రావణుడిని విడిచిపెట్టడం, రాముడి జితక్రోధత్వాన్ని తెలుపుతుంది. విరోధైన రావణుడిని మెచ్చుకోవడమంటే రాముడికి అసూయ లేదనే కదా.

వాల్మీకి అడిగిన ప్రశ్న లోకోత్తర విషయానికి సంబంధించింది. అడిగినవాడు, జవాబిచ్చేవాడూ వేదాంతజ్ఞులే. ఇరువురూ సర్వదా భగవత్ చింతన చేసేవారే. అయితే, వాల్మీకి వేసిన ప్రశ్న భగవంతుడి గురించే అయితే, ఆ భగవంతుడు సగుణుడా, నిర్గుణుడా, సాకారుడా, నిరాకారుడా, ద్రవ్యమా, అద్రవ్యమా, ఏకతత్వమా, అనేకతత్వమా అని అడక్క గుణాల గురించే ఎందుకడిగాడు? అనుష్ఠానం ప్రధానం గాని, వాదం కాదు. మామిడిపండు తింటేనే తీపో, పులుపో తెలుస్తుంది. అనుష్ఠాన రూపకమైన భక్తి మార్గమే శ్రేష్ఠం. నారదుడు భక్తుడు. తత్వవిచారంకంటే గుణ విచారమే శ్రేయస్కరమని ఆయన నమ్మకం. వాల్మీకీ ఆ కోవకి చెందినవాడే. అందుకే భగవత్ గుణ వర్ణన వాల్మీకి చేయగానే నారదుడు సంతోషించాడు. శ్రీమద్రామాయణం గూఢార్థగుంభితం. రామాయణార్థం సరిగ్గా గ్రహించాలంటే అనేక శాస్త్రాల జ్ఞానం వుండాలి. అదిలేనివారికి యదార్థ జ్ఞానం కలగదు. నారదుడంటే జ్ఞాన దాత. జ్ఞాన దాత చేయాల్సింది జ్ఞానముపదేశించడమో, మోక్ష విషయం చెప్పడమో అయ్యుండాలి. నారదుడు ఉపదేశంతో వాల్మీకి శ్రీమద్రామాయణం రచించాడు. వాల్మీకి ప్రశ్నించింది అవతార మూర్తి గురించే, నారదుడు జవాబిచ్చిందీ అవతార మూర్తిని గురించే.

బాలకాండలోని సంక్షిప్త రామాయణంలో నారదుడు అయోధ్యకాండ అర్థాన్ని సంగ్రహంగా చెప్పి, పితృవాక్య పాలన అనే సామాన్య ధర్మాన్ని, స్వామైన భగవంతుడి విషయంలో దాసుడు చేయాల్సిన కైంకర్య వృత్తిని, ప్రపన్నుడు భగవత్ పరతంత్రుడిగానే వుండాలన్న విషయాన్ని, ప్రపత్తికి భంగం కలిగే పనులు ఎవరు చెప్పినా చేయకూడదనే విశేష ధర్మాన్ని తెలియ పరుస్తాడు. సీతను రక్షించ బోయి రావణుడి వల్ల చనిపోయిన జటాయువుకు దహన సంస్కారాలు చేసి రాముడు శోకించాడని సంక్షిప్త రామాయణంలో నారదుడు చెప్పాడు. రామచంద్రమూర్తికి శోకం కలిగింది తన కొచ్చిన కష్టానికి కాదు. తనకై, తన ఆప్తులకు దుఃఖం కలిగిందికదానని, తన మూలాన వీరికింత దుఃఖం ప్రాప్తించిందికదానని, వారి దుఃఖాన్ని ఆపాల్సిన తానే వారి దుఃఖానికి కారణమయ్యానని మాత్రమే రాముడు శోకించాడు. అలానే, సీతాదేవి విషయంలోనూ దుఃఖించాడు శ్రీరాముడు. తనను నమ్మి అడవులకు వచ్చిన సీతను, రాక్షసుడు ఎత్తుకుపోతే, తనను వదిలిన బాధతో, అమెకెంత దుఃఖం కలిగిందని రామచంద్రమూర్తి దుఃఖించాడు. వియోగంవల్ల తమకు కలిగిన నష్టానికి దుఃఖించే వాళ్లు మనుష్యులు. జీవులకు కలిగిన నష్టానికి దుఃఖించేవాడు భగవంతుడు.

రాముడు వానరుడితో స్నేహం చేశాడంటే అది అతడి సౌశీల్యాతిశయం గురించి చెప్పడమే. గుహుడితో స్నేహం చేసినందువల్ల రాముడి సౌశీల్యం చెప్పడం జరిగింది. శబరితో స్నేహం చేయడంవల్ల రాముడు మిక్కిలి సౌశీల్యవంతుడయ్యాడు. వానరుడైన సుగ్రీవుడితో స్నేహమంటే మీదుమిక్కిలి సౌశీల్యం

చూపడం జరిగింది. దాన్నిబట్టి తెలిసేదేమిటంటే, భక్తికి అందరూ అధికారులేనన్న విషయం. జ్ఞానంతో రామచంద్రమూర్తిని ఆశ్రయించేవారు కొందరే. భక్తితో ఆశ్రయించేవారు కోటానుకోట్లు. ఫలితం ఇరువురికీ సమానమే. ఒకే ఒక్క బాణంతో రాముడు వాలిని నేలగూల్చుతాడు అని చెప్పడంలో చాలా అర్థముంది. తమ్ముడి భార్యతో సంగమించిన వాడికి శిక్ష వధ అని శాస్త్రాలు చెప్తున్నాయి. శాస్త్ర బద్ధుడైన రాముడు అట్లే చేశాడు. నేలబడేటట్లు కొట్టాడే కాని, ప్రాణంపోయేటట్లు కొట్టలేదు. ఎందుకంటే వాడి దోషం గురించి వాడికి చెప్పి ఇది ప్రాయశ్చిత్తం అని తెలియచేసేందుకే. దీన్ని బట్టి రాముడి ధర్మ బుద్ధి, సత్య పరాక్రమం స్పష్టమవుతుంది.

రావణ సంహారం జరిగిన తర్వాత, విభీషణుడిని లంకా రాజ్యానికి ప్రభువుగా చేసి, వీరుడై, కృతకృత్యుడై, మనో దుఃఖం లేనివాడయ్యాడు శ్రీరాముడు అని చెప్పబడింది. అంటే, రావణ వధ, సీతా ప్రాప్తి ప్రధానం కాదని, విభీషణ పట్టాభిషేకమే ప్రధానమని సూచించబడిందిక్కడ. ప్రధాన ఫలం ప్రాప్తించినప్పుడే ఎవరైనా కృతకృత్యుడయ్యేది, మనో దుఃఖం లేనివాడయ్యేది. సీతా ప్రాప్తి స్వకార్యం. దొంగలెత్తుకొని పోయిన తన సొమ్ము తాను తిరిగి రాబట్టుకోవడంలాంటిది. చోరదండనమే రావణ వధ. తనపని తాను చేయడంలో గొప్పేముంది? విభీషణ పట్టాభిషేకం ఆశ్రిత రక్షాధర్మకార్యం. ఆ ఆశ్రిత రక్షాభిలాషే రావణ వధకు ముఖ్య కారణం. సీతా ప్రాప్తి స్వంత కార్యం. అందుకే సీతను నిరాకరించగలిగాడుగాని, విభీషణుడి పట్టాభిషేకానికై ఉత్కంఠ వహించాడు శ్రీరాముడు.

గ్రంథాన్ని చదవాలనుకునేవారు మూడు విషయాలు అవశ్యంగా తెలుసుకోవాలి. గ్రంథం చెప్పిందెవరు? అతడి నడవడి ఎలాంటిది? లోకులకతడు ఆప్తుడా? అని విచారించాలి. దీన్నే వక్తృవిశేషం అంటారు. మేలుకోరి మంచే చెప్తాడన్న విశ్వాసానికి పాత్రుడైన వాడే ఆప్తుడు. వీడి వాక్యమే ఆప్త వాక్యం. ఆప్త వాక్యం తోసివేయలేనటువంటిది. మొదటి ఆప్తుడు భగవంతుడు. వేదం ఆప్త వాక్యం. ప్రజల మేలుకోరి, వేదార్థాలను, పురాణ, ఇతిహాస శాస్త్రాలను లోకానికి తెలిపినవారు ఆప్తులు. వారి రచనలు ఆప్త వాక్యాలు. యధార్థాన్ని తను తెలుసుకుని, కామ, క్రోధ, లోభాలకు లోనుకాకుండా, తనెరిగిన ఆ యధార్థ విషయాన్నే, ఇతరుల మేలుకోరి చెప్పడమే ఆప్త లక్షణం. అలాంటిదే వాల్మీకికి బ్రహ్మానుగ్రహంవల్ల కలిగింది. కాబట్టి ఆయన పరమాప్తుడు.

నారదుడు చెప్పిన రామ చరిత్రను విన్న వాల్మీకి సంతోషంతో ఆయన్ను పూజించాడు. నారదుడు పోయింతర్వాత, వాల్మీకి, శిష్యుడితో తమసాతీరంలో తిరుగుతూ, ఒక క్రౌంచమిధునాన్ని చూశాడు. ఆయన చూస్తుండగానే, బోయవాడొకడు, జంటలోని మగపక్షిని బాణంతో కొట్టి చంపుతాడు. ఆడ పక్షి ఏడుపు విన్న వాల్మీకి, ఎంతో జాలిపడి, బోయవాడిని శపించాడు. ఇలా ఆదికవి నోటినుండి వెలువడిన వాక్యాలు సమాక్షరాలైన నాలుగు పాదాల శ్లోకమయింది. బ్రహ్మదేవుడు వచ్చి, రామాయణం రాయమని ఉపదేశించి, సర్వం ఆయనకు తెలిసేట్లు వరమిచ్చి పోయాడు. రామ చరిత్రను, వాల్మీకి వివరంగా చెప్పాలనుకున్నాడు.

వాల్మీకి రామాయణం యధా తథంగా తెనిగించిన వాసు దాసు గారు రాసిన మొదటి పద్యం రామాయణార్థాన్ని సంపూర్ణంగా సూచిస్తుంది. ''మానిషాదుండ'' అంటే లక్ష్మికి నివాస స్థానమయిన

శ్రీనివాసుడా, శ్రీరాముడా అనే పదం బాలకాండ అర్థాన్ని సూచిస్తుంది. ''ప్రతిష్ఠ నీక శాశ్వతంబగు'' అనే పదం పితృవాక్య పరిపాలన, రాముడి ప్రతిష్ఠను తెలియచెప్పే అయోధ్య కాండ అర్థాన్ని సూచిస్తుంది. ''శాశ్వతహాయనముల'' అనే పదంలో రాముడు దండకారణ్యంలో ఋషులకు చేసిన ప్రతిజ్ఞలు నెరవేర్చినందువల్ల ఆయనకు కలిగిన ప్రతిష్ఠను తెలియచేసే అరణ్య కాండ అర్థాన్ని సూచిస్తుంది. దాని ఉత్తరార్థంలో కిష్కింధ కాండార్థాన్ని సూచిస్తుంది. క్రౌంచ దుఃఖం సీతా విరహతాపాన్ని తెలియచేసే సుందర కాండ అర్థాన్ని సూచిస్తుంది. ఇలా రకరకాలుగా రామాయణార్థం సూచించబడిందీ పద్యంలో. ఏదేమైనా, వాల్మీకి రామాయణంలో చెప్పిన దానికి అర్థం వెతికేటప్పుడు, వాల్మీకి రామాయణమే ప్రమాణం కాని, ఇతర గ్రంథాలు ప్రమాణం కావు. లోక పిత రాముడైతే, లోకమాత సీత. తన చరిత్రకంటే సీతాదేవి చరిత్రే శ్రేష్ఠమైందని రామచంద్రమూర్తే స్వయంగా అంటాడొకసారి. అందువల్లనే రామాయణాన్ని సీతా మహాచరిత్రమంటాడు వాల్మీకి మహర్షి.

బాలకాండతో రామాయణ కథ ప్రారంభమవుతుంది. అయోధ్యా పుర వర్ణనతో మొదలవుతుంది. భగవంతుడు అక్కడ పుట్టినందువల్లే, ఆ పుణ్య నగరం ''అయోధ్య'' గా కీర్తించబడింది. అయోధ్యా పుర జనులను గురించి రాస్తూ, అక్కడి బ్రాహ్మణులను గురించి చెప్పబడింది. వారు ఆరంగాల వేదాధ్యయనం (శిక్ష, వ్యాకరణం, ఛందస్సు, నిరుక్తం, జ్యోతిష్యం, కల్పం) చేసినవారు. బ్రాహ్మణులను ద్విజాతులని, వేదషడంగ పారగోత్తములని, అహితాగ్నులని, సహస్రదులని, మహామతులని, సత్యవచస్కులని, హిమకర మిత్ర తేజులని, ఋషులని, హృష్ఠ మానసులని, శాస్త్ర చింతన పరాయణులని, స్వస్వతుష్టులని, త్యాగశీలురని, భూరి సంచయులని పోలుస్తూ వర్ణించబడింది. అదేవిధంగా పూర్వ కాలంలో అన్ని జాతుల వారు కూడా విద్య నేర్చుకునేందుకు అర్హులనే విషయం అయోధ్య నగర వాసుల గురించి వర్ణించినప్పుడు చెప్పబడింది. ఒకానొకప్పుడు శూద్రులని పిలువబడే వారికి విద్యార్హతలుండవని వాదనుండేది. అయితే అది తప్పుడు వాదనేనని స్పష్టంగా చెప్పబడింది.

దశరథుడి పుత్రకామేష్టి యాగానికి వచ్చిన విష్ణుమూర్తి, శరణాగతులైన బ్రహ్మాది దేవతలందరికీ అభయహస్తమిచ్చి, తాను మనుష్యుడిగా ఎవరికి జన్మించాలనీ, ఆ యోగ్యత ఎవరికున్నదనీ ఆలోచించాడు. తనకు తండ్రి కాగల అర్హుడు అయోధ్యాపురాధిపతైన దశరథుడేనని తలచాడు. దీనికి కారణముంది. స్వాయంభువ మనువు, పూర్వం గోమతీ తీరాన వున్న నైమిశారణ్యంలో, వాసుదేవ ద్వాదశాక్షరీ మంత్రాన్ని జపించాడు. శ్రీమన్నారాయణుడు ప్రత్యక్షమై వరం కోరుకొమ్మనగా, మూడు జన్మల్లో నారాయణుడు తనకు పుత్రుడుగా వుండాలని అడుగుతాడు. అంగీకరించిన భగవంతుడు, ఆయన దశరథుడిగా పుట్టినప్పుడు ''శ్రీరాముడు'' గా పుత్రుడయ్యాడు. యదువంశంలో వసుదేవుడిగా మనువు పుట్టినప్పుడు ''శ్రీకృష్ణుడు'' గా ఆయనకు పుత్రుడయ్యాడు. మూడోజన్మలో ''శంబళ గ్రామం'' లో, కలియుగంలో, నాలుగోపాదంలో, హరివ్రతుడనే బ్రాహ్మణుడికి ''కల్కి'' గా పుట్టగలడు. మనువు భార్య సుశీల, కౌసల్య పేరుతో దశరథుడికి, దేవకి పేరుతో వసుదేవుడికి, దేవ ప్రభ పేరుతో హరివ్రతుడికి భార్యగా వుండి, మూడు జన్మల్లో విష్ణుమూర్తికి తల్లి అవుతుంది. శంబళ, సంబళ, సంభల అనే రూపాంతరాలు కూడా శంబళ గ్రామానికున్నాయి.

దేవతల క్షేమం కోరి శ్రీమహావిష్ణువు భూలోకంలో జన్మించేందుకు సంకల్పించాడు కనుక, ఆయనకు సహాయపడేందుకు, బలవంతులను, కామ రూపులను, గోళ్ళు, కోరలు ఆయుధాలుగా కలవారిని, అసహాయశూరులను సృజించమని, దేవతలను ఆదేశించాడు బ్రహ్మ. వాలి, సుగ్రీవులిరువురూ రామకార్యార్థమే పుట్టారు. ఇదొక రకమైన ఏర్పాటు. దీనినే ''సమయ'' మని పేరు. వాలి రావణ వధకొరకు శ్రీరాముడికి సహాయపడేందుకు బదులు, రావణుడితో స్నేహం చేసాడు. భవిష్యత్ లో రామ కార్యానికి ఉపయోగ పడబోయే సుగ్రీవుడికి హానిచేసి, అతడిని చంపే ప్రయత్నం చేసి, రామ కార్యాన్ని భంగపరచ తలపెట్టాడు. ఈ కారణాన వాలి రాముడి చేతిలో వధించబడ్డాడు. దశరథుడి వద్దకు విశ్వామిత్రుడు యాగ రక్షణకై రాముడిని పంపమని అడగాడానికొచ్చేంతవరకు, భగవదవతారాన్ని గురించే చెప్పబడింది. ఇక ఇక్కడినుంచి, చివరివరకూ, భగవదవతార ప్రయోజనం గురించి మాత్రమే చెప్పడం జరుగుతుంది. ఆ ప్రయోజనాల్లో, శిష్ట రక్షణ, దుష్ట శిక్షణ, ధర్మ సంస్థాపన ముఖ్యమయినవి. ఈ ప్రయోజనాల్లో సేద్యం చేసేవారికి, ధాన్యంలాగా లభించే ప్రధాన ఫలం, శిష్ఠపరిపాలనే. పైరు బాగుపడేందుకు ఏ విధంగానైతే కలుపు మొక్కలను పీకేస్తామో, అదేవిధంగా, శిష్ఠరక్షణార్థమై నడమంత్రపు సిరైన దుష్ట శిక్షణ తప్పనిసరిగా జరగాల్సిందే.

శ్రీరామచంద్రమూర్తి అవతార కార్య ధురంధరత్వం స్త్రీ వధతో ప్రారంభం అవుతుంది. స్త్రీ వధ పాపం అని రామాయణమే చెపుతుంది. భరత వాక్యం, హనుమంతుడి వాక్యం అదే విషయం తెలియచేస్తుంది. అలాంటప్పుడు శ్రీరాముడు ఎందుకు స్త్రీ వధ చేశాడు? భగవద్గీత పుట్టింది ఇలాంటి సంశయ నివృత్తికే. అర్జునుడు, శ్రీరాముడు ఇరువురు క్షత్రియులే. స్వధర్మమని, బంధువులను చంపితే పాపం వస్తుందని భయపడ్డాడు అర్జునుడు. స్వధర్మమని, స్త్రీని చంపవచ్చానని, శంకించాడు రాముడు. కృష్ణుడు అర్జునుడికి ఏం ఉపదేశించాడో, విశ్వామిత్రుడు అదే చేశాడు రాముడికి. స్వధర్మ నిర్వహణ తన విధి అని శ్రీరామచంద్రమూర్తి ఆసక్తి లేకపోయినా చేశాడు. అందుకే శ్రీరాముడు తాటకను చంపడం దోషం కాదు.

ప్రపంచ సృష్టి విషయంలో పరిణామ వాదం అని, వివర్త వాదం అని రెండు రకాలున్నాయి. మట్టి ముద్దే కుండయినట్లు, సూక్ష్మాలైన చిదచిత్తులలో వుండే భగవంతుడే, స్థూల చిదచిద్విష్టుడై, ప్రపంచాకారంగా పరిణమించాడని, సూక్ష్మానికి, స్థూలానికి అణుత్వ బృహత్త్వ భేదం తప్ప, మరే భేదం లేదని, రెండూ సత్యమని చెప్పేదే ''పరిణామ వాదం''. ప్రపంచం మిధ్య, బ్రహ్మమే సత్యం, అనడం ''వివర్త వాదం''. బాలుడు యౌవనవంతుడైనట్లు, సూక్ష్మంగా వున్న వామనుడే ముల్లోకాలను ఆక్రమించి, త్రివిక్రముడై నందువల్ల, ఇరువురికీ భేదం లేదని, రెండూ సత్యమని, తేలడంతో, వామనావతారం పరిణామవాదాన్ని స్థిర పరుస్తున్నది. దీనికే ''వామన త్రివిక్రమ న్యాయం'' అని పేరుంది. వామనుడు యాచించింది తన భార్య సొమ్ములకొరకు కాదు, తను బ్రతక లేక కాదు. యాచనా దోషం అందులోలేదు. గుర్వర్థమై, దేవతార్థమై, లోకోపకారార్థమై చేసే యాచన, యాచన కాదు.

క్షీరసాగర మధనం గురించి చెప్పినప్పుడు అనేక రహస్యాలు బాలకాండలో వివరించబడ్డాయి. పాల సముద్రంలో అమృతం పుట్టడం యోగశాస్త్రాన్ననుసరించే వుంది. మూలాధారమందుండే త్రికోణం మందరం. దాన్ని చుట్టి వున్న వాసుకి కుండలి. దాన్ని మథించిన సురాసురులు ఇడాపింగళ నాడులందుండే

ప్రాణశక్తి వాయువులు. దీనంతటికి ఆధార భూతుడు విష్ణువు. కుండలి మొదలు మేల్కొన్నప్పుడు, దేహంలో శక్తి ప్రసారమైన కారణాన, వికారాలు పుట్తాయి. అప్పుడు, ఆ యోగవిద్య తెలిసిన గురువు, దాన్నుండి అపాయం కలగకుండా చేయాలి. ఆ గురువే వాసుకి భూషణుడైన శివుడు. శివుడు వాసుకి కంకణుడు కాబట్టి, విషం ఆయనను భాదించదు. భగవంతుడైన విష్ణుమూర్తే, గురువైన శివుడిని, అపాయాన్నుండి కాపాడమని ప్రేరేపించాడు. ఆ తర్వాత, తానే ఆధారంగా నిలుచుండి, యోగి అభీష్ఠాన్ని నెరవేర్చాడు. అమృతం పుట్టినప్పటికీ, ఆ దశలో, హరి భక్తిలేని సాధకులు, అందగత్తెలను చూసి చెడిపోతారు. భగవంతుడిని ఆశ్రయించి వున్నవారు చెడరు. అందువల్ల ఆయనే విఘ్నాలను అణచివేసి, అమృతాన్ని దేవతలకిచ్చాడు.

అహల్య శిలగా మారిందని కొన్ని గ్రంథాలలో చెప్పబడిన విషయం వాస్తవం కాదని వాల్మీకి రామాయణం స్పష్టం చేసింది. వాల్మీకి మతమే వేరు. దుఃఖానుభవం లేకుండా, రాయిగా పడి వుంటే, పాప ఫలం అనుభవించినట్లెలా అవుతుంది? అహల్య స్త్రీగా వుంటూనే, ఆహారం లేకుండా తాపంలో మాడుతుంటుంది. రామచంద్రమూర్తి ఆశ్రమ ప్రవేశం చేయగానే ఆ తాపం తొలగి లోకానికి కనిపిస్తుంది. అంటే, జారత్వ దోషం పోవాలంటే, అనేక సంవత్సరాలు తపించి, భగవత్ సాక్షాత్కారం చేసుకోవాలి. అలా కాకపోతే వంశ నాశనం అవుతుంది. గౌతముడు అహల్య స్వరూప నాశనం చేయకుండా, గాలిని ఆహారంగా తీసుకుంటూ, కఠిన వ్రతం ఆచరించమని మాత్రమే అంటాడు. జారత్వమే అభ్యాసంగా వుంటే, ఆ స్త్రీని పతితగా భావించి స్వీకరించ కూడదు–పరిత్యజించాలి.

గాయత్రీ బీజసంయుతమైన వాల్మీకి రామాయణంలో, ప్రతి అక్షరానికి, గాయత్రీ మంత్రంలోని ఒక్కొక్క అక్షరానికి ఎంత మహిముందో, అంతే మహిముంది. వశిష్ఠ విశ్వామిత్ర యుద్ధం, బ్రాహ్మణ క్షత్రియ యుద్ధం మాత్రమే కాదు. ఆత్మ విద్యకు, అనాత్మవిద్యకు మధ్య జరిగిన యుద్ధం. సంపూర్ణంగా అనాత్మవిద్య నేర్చుకున్నప్పటికీ, వాడు, ఆత్మవంతుడిని గెలవలేడు. విద్యావంతుడి దౌష్ట్యం, ఆత్మవంతుడి సాధుస్వభావం కూడా ఈ యుద్ధంలో స్పష్టంగా కనిపిస్తుంది. వశిష్టుడు ఆద్యంతం తనను తాను రక్షించుకునే ప్రయత్నమే చేశాడు కాని, తన ఉప్పు తిని, కృతఘ్నుడై, దివిటీ దొంగలా తన సొమ్ము అపహరించేందుకు పూనుకున్నవాడిని, తన ఆశ్రమాన్నంతా పాడుచేసి తనను చంపే ప్రయత్నం చేసినవాడిని, దెబ్బకు దెబ్బ అనికూడా కీడు తలపెట్టలేదు. ఇదే ఆత్మవంతుడైన బ్రాహ్మణుడి లక్షణం. బ్రాహ్మణుడు ఇతరులవల్ల నష్టపడినా గాని, పరులకు హాని తలపెట్టడు. వశిష్టుడు ఇంతజరిగినా విశ్వామిత్రుడిని శపించలేదు.

విశ్వామిత్రుడి తపస్సువలన, సర్వం అనర్థకమైన కోపాన్ని జయించినవాడికే తపస్సిద్ధి కలుగుతుందనీ, బ్రాహ్మణ్యానికి కామ–క్రోధాలను జయించడం ఆవశ్యమని అర్థమవుతున్నది. కామ క్రోధాలు రెండూ, రజోగుణం వల్ల కలుగుతాయి. వీటికెంత ఆహారమైనా సరిపోదు. ఇవి మహా పాపాలు, శత్రువులు. తపస్సిద్ధికి జితేంద్రియత్వం అవశ్యం. ఏం తిన్నా, తాకినా, చూసినా, విన్నా సంతోషంగాని, అసంతుష్టిగాని పడడో వాడే జితేంద్రియుడు. కామ క్రోధాలను విశ్వామిత్రుడు జయిస్తే దశరథుడిపై కోపం ఎందుకొచ్చిందని సందేహం కలగొచ్చు. ఆయన మునుపటి విశ్వామిత్రుడయివుంటే వాస్తవానికి

శపించాలి. అలా చేయలేదు. ఆ కోపం ఆయన కార్య సాధనకు తెచ్చుకున్న కోపం కాని, ఇంతకుముందు లాగా మనస్సులో కాపురముంటున్న కోపం కాదు.

వాల్మీకి రామాయణం పూర్తిగా అర్థం చేసుకోవాలంటే, కీర్తి శేషులు శ్రీమాన్ వావిలికొలను సుబ్బారావు (వాసు దాసు) గారి శ్రీ మదాంధ్ర వాల్మీకి రామాయణం మందరాలు చదివి తీరాలి. ఆ మాటకొస్తే వాల్మీకి రామాయణాన్ని యథా వాల్మీకంగా, పూర్వ కాండలతో సహా ఉత్తర కాండను కూడా కలిపి తెనిగించిన ఏకైక మహాకవి ఆయన ఒక్కరే. ఆ మహానుభావుడి ఆంధ్ర వాల్మీకి రామాయణం మందరాలన్నీ, తెలుగునేల నాలుగు చెరగులా విశేష ప్రాచుర్యాన్ని ఏనాడో సంతరించుకున్నాయి. ఎనిమిదేళ్లలో రామాయణాన్ని తొలుత నిర్వచనంగా ఆంధ్రీకరించి, ఒంటిమిట్ట కోదండ రామస్వామికి అంకితం చేసారు. ఆ తరువాత ''మందరం'' పేరుతో గొప్ప వ్యాఖ్యానం రాసారు.

తను రచించిన నిర్వచన రామాయణంలో సంస్కృత రామాయణంలో వున్న ప్రతి శ్లోకానికొక పద్యం వంతున రాసారు వాసు దాసుగారు. మందరంలో తను రాసిన ప్రతి పద్యానికి, ప్రతి పదార్థ తాత్పర్యం సమకూర్చారు. ఒక్కో పదానికున్న వివిదార్థాలను విశదీకరించారు. భావాన్ని వివరణాత్మకంగా విపులీకరించారు. ఆయన మందరాలలోని శ్రీ రామాయణ వ్యాఖ్యానంలో ''జ్ఞాన పిపాసి'' కి విజ్ఞాన సర్వస్వం దర్శనమిస్తుంది. వాల్మీకంలోని ప్రతి కాండకొక ప్రత్యేకతుందనే విషయం ఆయన మందరంలో స్పష్టంగా కనిపిస్తుంది. వాస్తవానికి ప్రతి కాండ ఒక్కోరకమైన విజ్ఞానసర్వస్వం. శ్రద్ధగా చదువుకుంటూ పోతే, అర్థం చేసుకునే ప్రయత్నం చేసుకుంటూ చదువగలిగితే, ప్రతి కాండలో ఆ కాండ కథా వృత్తాంతమే కాకుండా, సకల శాస్త్రాల సంగమం దర్శనమిస్తుంది.

ఇక్కడొక విషయం చెప్పాలి. మనమేమో వాల్మీకినీ, శ్రీ రామాయణాన్నీ, రామాయణం మంచిదన్న ప్రతివారిని కించపరిచే విధంగా వ్యాసాలు రాస్తుంటాం. విదేశీయులేమో దానిని ఒక మహత్తర గ్రంథంలాగా భావించి తమ గ్రంథాలయాలలో జాగ్రత్తగా భద్రపరుచుకుంటారు. వాసు దాసు గారి ''నిర్వచన రామాయణం'' లోని నాలుగు (బాల, అయోధ్య, అరణ్య, కిష్కింధ) కాండలు 1909 వ సంవత్సరంలో నాటి చెన్నపురి (నేటి చెన్నై) లోని ''శ్రీ వైజయంతీ ముద్రా శాల'' లో ముద్రించబడి, ఒక అజ్ఞాత మహానుభావుడి ద్వారా ''కాలిఫోర్నియా (అమెరికా) విశ్వ విద్యాలయం'' కు చెందిన ''బర్క్ లీ'' గ్రంథాలయం చేరుకుని, అక్కడ భద్రపరచబడింది. ''గూగుల్ సంస్థ'' డిజిటలైజ్ చేసి నందువల్ల నేను కాలిఫోర్నియాలో వుండగా నా దృష్టికి వచ్చింది. అపురూపమైన అలనాటి గ్రంథకర్త అభిప్రాయాలు అక్షర లక్షలు చేసే ఆణిముత్యాలు. తెర మరుగవుతున్న వందేళ్లనాటి అపురూపమైన తెలుగు సాహిత్యంలోని అత్యంత ఆదరణీయమైన వాసు దాసుగారి అభిప్రాయాలు అందులో వున్నాయి.

అందుకే–ఇందుకే వాల్మీకి రామాయణం చదవాలి. చదివినకొద్దీ, ఆస్వాదించినకొద్దీ, అనేక ప్రశ్నలు, సరైన సమాధానాలు పుట్టుకొస్తాయి. చదవాలని మొదలుపెట్టి పూర్తిగా చదివిన వారికి, ఇంతకాలం ఎందుకు చదవలేదానన్న వెలితి క్షణంలో పోతుంది.

◆❖◆

రావణుడే మహనీయుడైతే రామాయణమే లేకపోయేది

రావణుడు ఈ దేశ స్థానికులకు చెందిన రాజా? స్థానిక మూలవాసీ చక్రవర్తా? అతడు భూమి పుత్రుడా? రావణ బలి చక్రవర్తుల సామూహిక హత్యకు బాలకాండలో బ్లూ ప్రింటా? రావణ రాజ్యాన్ని రాముడు దురాక్రమణ చేసుకున్నాడా? రావణుడు పౌలస్త్య బ్రాహ్మణుడని తొండి వాదన చేస్తున్నారా? రావణుడు చేసిన నేరమేంటా? రావణుడిని బలపరాక్రమవంతుడనీ, సమర్థుడైన పాలకుడనీ, మహా రూపవంతుడనీ, సరసుడనీ, కళాకారుడనీ, సర్వజనహితుడనీ, జ్ఞాని అనీ, ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యస్థాపకుడనీ, స్త్రీలు ఆయన పట్ల మిక్కిలి గౌరవభావంతో వుండేవారనీ, మానవతా మూర్తి అనీ......ఇలా అనేక రకాలుగా ఆయనను ఒక మహనీయుడిగా చిత్రీకరించే ప్రయత్నం చేశారు కొందరు నాస్తికవాదులు.

రావణాసురుడు దేవుడని, ఇటీవల కొందరు పని కట్టుకుని మరీ ప్రచారం చేస్తున్నారు. ఆ మాటకొస్తే, ఒక్క రావణుడే కాదు, మహిషాసురుడు, నరకాసురుడు, హిరణ్య కశిపుడు, శిశుపాలుడు......ఇలా మన పురాణాలలో, ఇతిహాసాలలో రాక్షసులుగా ముద్రపడిన ప్రతి వారినీ వారు దేవతలంటున్నారు. రావణుడిని అగ్రవర్ణాల వారు అణగదొక్కారని కూడా వాదిస్తున్నారు. రావణుడు పుట్టింది బ్రాహ్మణ, క్షత్రియ జంటకు. అలాంటప్పుడు వెనుకబడిన వర్ణానికి చెందిన వాడెలా అవుతాడు?

సుమాలి అనే రాక్షస రాజు కూతురు కైకసిని విశ్రవసువును వివాహం చేసుకో మంటాడు. తండ్రి సూచన ప్రకారం, కైకసి, విశ్రవసుడుని చేరబోతుంది. ఆమె వివరాలు అడిగి, మనసులోని భావాన్ని గ్రహించి, వచ్చిన సమయం మంచిది కానందున, క్రూరులైన రాక్షస శ్రేష్టులు ఆమెకు కొడుకులుగా పుట్తారని అంటాడు. విశ్రవసుడికి కైకసి వివాహిత భార్య కాదు. కొంతకాలానికి ఆమెకు నిడుపాటి కోరలు, పది తలలు, ఎర్రని వెంట్రుకలు, ఇరవై చేతులతో భయంకరమైన ఆకారం కలవాడిని కంటుంది. వాడికి దశకంఠుడు అని పేరు పెట్టాడు తండ్రి విశ్రవసుడు. ఆ తరువాత వాడికి రావణుడనే పేరు మిగిలింది. రావణుడి తండ్రి బ్రాహ్మణుడైనప్పటికీ, తల్లి రాక్షస రాజకన్యక ఐనందున, బ్రాహ్మణుడికి క్షత్రియ స్త్రీయందు కలిగిన వాడు క్షత్రియుడే. బ్రాహ్మణుడైనా, క్షత్రియుడైనా, అగ్ర కులాలకు చెందిన వాడే!

రావణాసురుడు బుద్ధి తెల్సినప్పటి నుంచే ఘోరాలు, నేరాలు చేసిన వాడే!. సవతి సోదరుడు కుబేరుడిని వర బలంతో లంక నుంచి వెళ్ల గొట్టాడు. ముల్లోకాలను బాధ పెట్టడం వాడికొక దిన చర్య. అడ్డూ–అదుపూ లేకుండా క్రూరుడై, దేవతలను, ఋషులను, యక్షులను చంపసాగాడు. తప్పని చెప్పిన అన్న కుబేరుడి మీద యుద్ధానికి పోయి పుష్పక విమానాన్ని లాక్కుంటాడు. శౌర్యవంతులైన రాజులను ఇబ్బందులకు గురి చేస్తూ, యుద్ధంలో ఎదిరించిన వారిని చంపుకుంటూ, ఓడిన వారిని బెదిరిస్తూ రోజులు గడిపేవాడు. నందీశ్వరుడిని అవమానించి శాపానికి గురయ్యాడు. కామంతో వేదవతిని అవమానించాడు. అయోధ్య రాజు అనరణ్యుడిని అవమానించి ఆయన శాపానికీ గురవుతాడు. యముడి మీదకు, ఇంద్రుడి మీదకు దండెత్తుతాడు. బల గర్వంతో, రాజ స్త్రీలను, ముని కన్యలను, దానవ కుటుంబినులను, దేవతా స్త్రీలను, కంటకనబడిన స్త్రీలందరినీ బలాత్కారం చేస్తాడు. రంభను చెరిచి నలకూబరుడి శాపానికి గురవుతాడు. కార్తవీర్యార్జునుడితో, వాలితో కయ్యానికి దిగి గర్వభంగమవుతాడు. సీతాదేవిని అపహరిస్తాడు. ఇలా చెప్పుకుంటూ పోతే వాడు చేసినవన్నీ అరాచకాలే! వాడెలా దేవుడవుతాడు.

మయుడనేవాడు, తన కూతురు మండోదరిని, రావణుడికి ఇచ్చి వివాహం చేస్తాడు. కూతురుతో పాటు మయుడు రావణుడికి ''శక్తి'' అనే ఒక అస్త్రాన్నిచ్చాడు. ఇక అప్పటినుంచి రావణుడు ముల్లోకాలను భాదించడం మొదలెట్టాడు. అడ్డూ–అదుపూ లేకుండా క్రూరుడై, దేవతలను, ఋషులను, యక్షులను చంపసాగాడు. పుష్పక విమానంలో లంకకు మరలిపోతుండగా, కైలాస గిరి ప్రాంతంలో, విమానం కదలదు. రావణుడు కైలాసాన్ని పెకలించడానికి పూనుకుంటాడు. శివుడు తన కాలి బొటన వేలుతో, ఆ పర్వతాన్ని అణచి వేశాడు. రావణుడి చేతులు కొండ కింద పడి బాధించసాగాయి. ఏడవడం మొదలెట్టాడు. శంకరుడిని ప్రార్థించాడు. అలా వేయేళ్లు ఏడవగా శంకరుడు కరుణించాడు. ఆ విధంగా ముల్లోకాలు కలతచెందేట్లు ఏడ్చినందున అతడికి ''రావణుడు'' అని శివుడు పేరు పెట్టాడు.

హిమవత్పర్వత ప్రాంతంలో రావణుడికి వేదవతి కనిపించింది. కామంతో కళ్లు మూసుకున్న రావణుడు ఆమెను చేరబోయాడు. తల వెంట్రుకలు పట్టుకుని వేదవతిని లాగుతాడు. రావణుడు అవమానించిన ఆ దేహాన్ని ఇక తాను వుంచుకోనంటుంది. అగ్ని ప్రవేశం చేస్తానని, రావణుడి గర్వమణచడానికి మళ్లీ జన్మించుతానని అంటూ, చెప్పినట్లే చేస్తుంది. ఆ విధంగా రావణ వినాశానికి బీజాలు పడ్డాయి. ఆ వేదవతే, జనక మహారాజు కూతురై, భూమిలో పుట్టి, సీత పేరుతో శ్రీరాముడిని వివాహమాడింది. అయోధ్యకు వెళ్లాడు రావణుడు. ఆ సమయంలో అనరణ్యుడు అయోధ్యను పాలించేవాడు. ఆతడిని యుద్ధానికి పురిగొల్పాడు రావణుడు. యుద్ధంలో ఓడిపోయాడు అనరణ్యుడు. తన వంశంలోనే దశరథ మహారాజు కుమారుడైన రాముడు, యుద్ధంలో రావణుడిని చంపుతాడని శపించాడు.

యముడిని చంపడానికి పోతాడు. యమ–రావణ యుద్ధం జరుగుతుంది. ఇరువురు సరిసమానంగా పోరు సల్పారు. యముడిని గెలిచినట్లు ప్రకటించుకున్న రావణుడు యమ పురిని విడిచి పోయాడు. తరువాత నశ్మ నగరాన్ని పాలిస్తున్న కాలకేయులను జయించి, వరుణ నగరంపై యుద్ధానికి పోతాడు.

లంకా నగరానికి పోతూ, రాజ స్త్రీలను, ముని కన్యలను, దానవ కుటుంబినులను, దేవతా స్త్రీలను, కంటకనబడిన స్త్రీలందరినీ బలాత్కారం చేస్తాడు. వారందరినీ పుష్పక విమానంలో పడేస్తాడు. చెరబడిన స్త్రీలందరూ విలపించినా రావణుడు పట్టించుకోడు. పర స్త్రీలను తన భార్యలుగా చేసుకోవాలను కోవడం కంటే పాప కార్యం లేదని, తమను కామంతో వశ పర్చుకో చూస్తున్నాడని, తామే పతివ్రతలమైతే, రావణుడు పర స్త్రీ కారణంగానే చంపబడతాడని శపించారు వారందరు. అలా మరో శాపం తగిలింది.

దేవతల మీదకు దండయాత్రకు పోతాడు. మార్గమధ్యంలో, దేవతా సౌందర్యవతి రంభను చూసి ఆమె చేయి పట్టుకుంటాడు. రావణుడు తనకు తండ్రి లాంటి వాడని, ఇలా చేయడం తగదని, వేడుకుంటుంది రంభ. రావణుడా మాటలు పట్టించుకోకుండా రంభను చెరిచి విడిచి పెట్తాడు. రావణుడు చేసిన చెడ్డ పనిని భర్త నలకూబరుడి (కుబేరుడి కొడుకు) తో చెప్తుంది రంభ. పర స్త్రీని చెరిచినట్లయితే రావణుడు మరణించుతాడని నలకూబరుడు శపించుతాడు. రావణుడు బలవంతంగా ఎత్తుకుని వచ్చిన పతివ్రతా స్త్రీలు ఆ శాపం తెలిసి కొని సంతోషించారు. రావణుడి వలన భయం వదిలారు. ఆ దినం మొదలుకుని, పరస్త్రీ సంగమం విషయంలో మనస్సు పోనిచ్చినవాడు కాదు రావణుడు.

ఇంద్రుడిమీదకు యుద్ధానికి పోతాడు. దేవ-దానవ యుద్ధం జరుగుతుంది. రావణుడి కొడుకు మేఘనాధుడు ఇంద్రుడిని బంధించుతాడు. అప్పటినుంచి మరింత లోక కంటకుడై విర్రవీగుతుండేవాడు రావణుడు. కనిపించిన ప్రతి వారినీ, రాజులందరినీ బాధించుతూ, భుజ బల గర్వంతో, కళ్లు మూసుకొనిపోయి, ఒకనాడు మాహిష్మతీ నగరాన్ని పాలిస్తున్న కార్తవీర్యార్జునుడి మీదకు యుద్ధానికి పోతాడు. కార్తవీర్యార్జునుడు వాడిని బంధించి చెరసాలలో పడేశాడు. ఇది తెలుసుకున్న రావణుడి తాత పులస్త్యుడు అక్కడకు చేరుకుని, రావణుడిని చెరసాలనుంచి విడవమని కోరాడు. ఆయన కోరికను మన్నించాడు కార్తవీర్యార్జునుడు. రావణుడు కార్తవీర్యార్జునుడితో స్నేహం చేస్తూ, తరువాత, మళ్లా రాజులను ఓడించాలన్న కోరికతో, పొగరు పడుతూ, భూమి మీద తిరుగుతుండేవాడు.

రావణుడు లోకాలలో సంచరిస్తూ, ఒకనాడు కిష్కింధకు వచ్చి, వాలిని యుద్ధానికి పిలిచాడు. ఆ సమయంలో వాలి సంధ్య వార్చడానికి నాలుగు సముద్రాలకు పోయాడు. అప్పుడు దక్షిణ సముద్రంలో సంధ్య వారుస్తున్నాడని తెలుసుకుని పుష్పక విమానం ఎక్కి అక్కడకు చేరుకుంటాడు రావణుడు. వాలిని వెనుక నుంచి వెళ్ళి బంధించాలనుకుంటాడు. వాడి ఉద్దేశం కనిపెట్టిన వాలి, రావణుడిని తన చంకలో ఇరికించి, ఆకాశ మార్గంలో పోయి, పడమటి సముద్రంలో, ఉత్తర సముద్రంలో, తూర్పు సముద్రంలో సంధ్య వారుస్తాడు. కిష్కింధకు తిరిగొచ్చి రావణుడిని విడిచి, ఏమీ తెలియని వాడివలె అతడి క్షేమ సమాచారం అడుగుతాడు. తాను వాలితో యుద్ధం చేయడానికి వచ్చానని, గర్వభంగం ఐందనీ, అగ్ని సాక్షిగా అతడితో స్నేహం చేయాలని వుందని అంటాడు. ఆ తరువాత వారిరువురు స్నేహితులౌతారు.

సన్యాసి వేషంలో సీతను రావణుడు బలాత్కారంగా ఎత్తుకుని పోతాడు. సీతతో లంక చేరుకుంటాడు. సీత మీద రాక్షస స్త్రీలను కాపలాగా వుంచుతాడు. సీత తనను కామించడానికి పన్నెండు నెలల గడువిస్తాడు. ఆ మర్నాడు మాట వినని సీతను తన భోజనం కొరకు వంటవారు ముక్కలుగా కోసి వండుతారని బెదిరిస్తాడు.

రావణుడి రూపం, తేజం, బలం, ధైర్యం అనుపమానవైనవే. సౌందర్యం, సంపద, ఆకర్షణ రాముడిలో ఎంత వున్నాయో, రావణుడి దగ్గర కూడా అంతే మోతాదులో వున్నాయనవచ్చు. ఐతే, ఇతరుల పట్ల కరుణ, రక్షించాలనే బుద్ధి రాముడిలో వున్నాయి కాని రావణుడిలో లేవు. వాడిది కఠినమైన మనస్సు. భూతదయ వాడికి లేనందునే జనులు దూషించారు. దేవదానవులు వణకుతున్నారు. రావణుడు, విధానాన్ననుసరించి ధర్మ శాస్త్రాలను చక్కగా అధ్యయనం చేశాడు. ప్రపంచం మెచ్చే రీతిలో తపస్సు చేశాడు. ఎంతో కష్టపడి తపస్సు చేసినా, అది మర్చిపోయి, తపో ధర్మం వల్ల కలిగే సత్ఫలితాలను పాడుచేసే పనులెన్నో చేశాడు. అతడి తపస్సు వ్యర్థమైపోయింది. తన తపస్సుతో దేవదానవులెవరూ జయించకుండా వరం పొంది, ఇంక తనకేం భయమని గర్వపడ్డాడు. వాస్తవానికి, ఆ వరాలేవే అతన్ని ఎల్లప్పుడూ రక్షించ లేవనే సంగతి అతడి ఆలోచనకే రాలేదు.

చీకటి, వెలుతురు ఒకేసారి రానట్లే, పాప–పుణ్య ఫలాలు రెండూ ఒకేసారి అనుభవించలేం. పుణ్యం అనుభవించుతున్నంత వరకూ, పాప ఫలం దరికి రాదు. ధర్మ ఫలం అధర్మ ఫలాన్ని చెరిపేస్తుంది. చీకటి ఎలాగైతే వెలుతురును చెరచ లేదో, అలానే అధర్మ ఫలం రావణుడికి చాలాకాలం అనుభవం లోకి రాలేదు. తపఃఫలం వల్ల రావణుడు తనకు పాప ఫలం రాదనుకున్నాడు! అష్టైర్యాలను అనుభవించే వాడికి రోగాలు రావా? రావణుడి తపస్సు అతడికి దీర్ఘాయువు ఇవ్వాలి. కాని, వాడు చేసిన పరస్త్రీ అపహరణనే పాపపు పని వల్ల త్వరగా చావాలి. ఈ రెండూ ఏకకాలంలో జరగవు కాబట్టి, అతడి చావు రాముడొచ్చేవరకూ ఆగింది. అతడి వ్రత ఫలంగా దేవ దానవుల చేతుల్లో చావు లేకుండా వరం కోరాడు. నర వానరులను నిషేధించాడు. వాడి తపఃఫలం వారి నుండి కాపాడదు. ఇక రావణుడి పూర్వ పుణ్యం పూర్వ పాపాన్నే హరిస్తుంది. కాని తరువాత చేసిన పాప కార్యాలనుండి అతడిని రక్షించదు. నేడు చేస్తున్న భోజనం, నిన్నటి ఆకలి బాధ తీరుస్తుంది కాని, రేపటి బాధను కాదు కదా! పశ్చాత్తాపం చెందితే, ప్రాయశ్చిత్తముంటుంది. రావణుడు బలవంతంగా ఎత్తు కొచ్చిన సీతాదేవిని, ఇతర స్త్రీలను ఎవరి వారికి వారిని అప్పగించినట్లైతే అతడి దోషం పోయేది. తపఃఫలం సదా రక్షిస్తుందనేమాట భ్రాంతే! తపఃఫలం పుణ్యమనుభవించిన కొద్దీ క్షీణిస్తుంది. శాశ్వతంగా మిగిలిపోదు.

రామ రావణ యుద్ధం మొదలవుతుంది. శ్రీరాముడు మూల బలాల్ని సంహరిస్తాడు. పౌరుషోక్తులు పలుకుతూ రావణుడు యుద్ధానికి వెళ్తాడు. ఇరువురూ దివ్యాస్త్రాలతో పోరాడుతారు. రావణుడు పరాజితుడై లంకకు పరుగెత్తుతాడు. రామరావణుల కడపటి యుద్ధం ప్రారంభమవుతుంది. రావణుడి శూలాన్ని విరగగొట్టాడు రాముడు. రావణుడి ధ్వజాన్ని నరుకుతాడు రాముడు. రావణుడి శిరస్సును ఖండించాడు. తల నరకగానే తల మొలిచింది కాని వాడు చనిపోవడం లేదు. చివరకు బ్రహ్మాస్త్రంతో రావణుడిని వధించాడు రాముడు. రావణుడి మరణానికి లోకాలన్నీ సంతోషించాయి.

ప్రథమంగా ఉత్పన్నమైంది రామాయణం కావడంతో అది ఆదికావ్యమైంది. రామాయణాన్ని చక్కగా తెలిసినవారు, అర్థం చేసుకో గలిగిన వారు మాత్రమే లోకానికి అందలి విషయాలను వివరించ సమర్థులు. అందరికీ అది సాధ్యమయ్యేది కాదు. లౌకిక విషయాలను తెలుసుకోవాలనుకునే వారికి శ్రీ రామాయణాన్ని మించి తెలిపే గ్రంథం ఎక్కడా లేదు. కాలక్షేపానికి చదవడానికైనా శ్రీ రామాయణం

లాంటి పుస్తకం ఇంకోటి లేదు. శ్రీ సీతారాముల పేరు విన్న ప్రతి ఆర్యుడు మనస్సులోనైనా భక్తితో నమస్కారం చేసుకోవాల్సిందే. సీతారాములలో విశేషమేమిటంటే, వారు అవతార మూర్తులు కావడమే! వాల్మీకి మహర్షి ఆ అవతార రహస్యాన్ని, తాను గ్రంథస్థం చేసిన శ్రీ రామాయణంలో, తన శక్తికొలది వివరించాడు. రామాయణ గాథలో, శ్రీరామచంద్రుడు మనుష్యుడివలె నటిస్తుంటే, వాల్మీకే మో ఆయన సాక్షాత్తు భగవంతుడే అంటాడు. రాముడి చర్యల ద్వారా, రాముడి వాక్కుల ద్వారా తాను చెప్పదల్చుకున్న దాన్ని సిద్ధాంతీకరించాడు వాల్మీకి. శ్రీమద్రామాయణంలో ఉత్తమోత్తమ మహాకావ్య లక్షణాలెన్నో వున్నాయి. వర్ణనలెన్నో వున్నాయి. రామాయణం గానం చేసినా, పఠించినా మనోహరంగా వుంటుంది.

శ్రీమద్రామాయణం గొప్ప ధర్మ శాస్త్రం. ఇందులో సర్వ విధాలైన, అన్ని రకాల ధర్మాల గురించి వివరంగా చెప్పబడింది. రాజ ధర్మం, ప్రజా ధర్మం, పతి ధర్మం, సతీ ధర్మం, భాతృ ధర్మం, పుత్ర ధర్మం, భృత్యు ధర్మం, మిత్ర ధర్మం లాంటి అన్ని ధర్మాలను గురించి చక్కగా తెలుపబడి వుంది. లాభ, లోభ, పక్షపాత బుద్ధి లేకుండా, న్యాయం మీదే దృష్టి నిలిపి వాదించే న్యాయవాది ధర్మం కూడా చెప్పబడింది. వీటితో పాటు కథా సందర్భానుసారంగా, అంతరాంతరాలలో ఎన్నో నీతులు చెప్పబడ్డాయి. రావణుడి పాత్ర కూడా అందులో భాగమే!

◆❖◆

పలికించిన వాడు రామభద్రుడు

వాల్మీకి సంస్కృత రామాయణాన్ని, యథా వాల్మీకంగా పూర్వ కాండలతో సహా ఉత్తర కాండను కూడా తెనిగించిన ఏకైక మహానుభావుడు ఆంధ్ర వాల్మీకి-కవి సార్వభౌమ వావిలికొలను సుబ్బారావు (వాసు దాసు) గారు. తాను రచించిన ఆంధ్ర వాల్మీకి రామాయణాన్ని ఒంటిమిట్ట కోదండ రామస్వామికి 1908 వ సంవత్సరం అక్టోబర్ నెల 9, 10, 11 తేదీలలో దేవాలయంలో అంకితమిచ్చారు. ఈ మహా కృతి సమర్పణోత్సవానికి చాలామంది ప్రముఖులు వచ్చారు.

శ్రీ మదాంధ్ర వాల్మీకి రామాయణం తెలుగునేల నాలుగు చెరగులా విశేష ప్రాచుర్యాన్ని ఏనాడో-ఐదారు దశాబ్దాల క్రితమే సంతరించుకుంది. ఇరవై నాలుగు గాయత్రీ మంత్రాక్షరాలలో నిబంధించబడిన మంత్ర మంజూష వాల్మీకి మహర్షి రచించిన శ్రీమద్రామాయణం. మహా మహానుభావులూ, మహా విద్వాంసులూ కీర్తి శేషులు శ్రీమాన్ వావిలికొలను సుబ్బారావు గారు, వాల్మీకి రామాయణాన్ని యధాతథంగా వందమంత్రమయం చేస్తూ, ఛందః యతులను ఆయా స్థానాలలో నిలిపి, వాల్మీకాన్ని తెనిగించారు. వాల్మీకి రామాయణానికి తుల్యమైన స్థాయినీ, పారమ్యాన్నీ, తొలుత నిర్వచనంగా ఆంధ్ర వాల్మీకి రామాయణానికి అందించి, తదనంతరం, "మందరం" అని దానికి విశేష ప్రాచుర్యాన్ని కలిగించారు.

శ్రీ మదాంధ్ర వాల్మీకి రామాయణం గ్రంథోత్పత్తిని గురించి స్వయంగా వాసుదాసుగారే వివరిస్తూ, తన బాబాయి లక్ష్మణరావు గారికి నిరంతరం రామాయణ పారాయణం చేసే అలవాటుండేదని, తనను కూడా శ్రీ రామాయణాన్ని పారాయణం చేయమని ప్రోత్సహించి, చేసే విధానాన్ని ఉపదేశించారని రాసుకున్నారు. ఆ విషయాలను రాస్తూ వాసుదాసు గారు..."ఒక నాడు, బమ్మెర పోతన పలికిన "చెనకి చెరిచినాడు భాస్కరుడు గాకుండిన రామాయణము బండ్ల కెక్కింపనా" అన్న వాక్యాలు నా మనస్సులో జొరబడ్డాయి. నేనెందుకు (మా) బమ్మెర పోతన సంకల్పాన్ని నెరవేర్చ రాదన్న భావన కలిగింది. వాల్మీకి సంస్కృత రామాయణం మూలంలోని 24, 000 శ్లోకాలకు, శ్లోకానికి ఒకటి చొప్పున, తెలుగులో

24,000 పద్యాలను రాయాలని సంకల్పించుకున్నాను. అయితే ''శ్రేయాంసి బహువిఘ్నాని'' అన్నట్లు నేనెక్కడ? నా ఆరోగ్య మెక్కడ? రామాయణ రచనెక్కడ? అనుకొని, వూరి మధ్యలో నున్న శ్రీరామచంద్రుడే ఇక నాకు శరణ్యం అన్న నిర్ణయానికొచ్చాను. ఆయన ఆదేశం ప్రకారం నడుచుకోవాలనుకొని, ఒకనాడు పారాయణం ముగిసిన తర్వాత, భగవత్ సన్నిధానంలో కూర్చొని, ఏం చెయ్యాలనుకుంటూ, శ్రీమద్రామాయణం పుస్తకం ముందుంచుకుని, ప్రశ్న వేసుకున్నాను. ఆశ్చర్యకరంగా వచ్చిన సమాధానం ''ఉత్తిష్ఠ హరి శార్దూల, లంఘయస్వ మహార్ణవమ్'' (''లెమ్మా హరిశార్దూలా, యిమ్మహితార్ణవము దాటుమీ'') అన్న శ్లోక రూపంలో సమాధానం లభించింది. భగవత్ కటాక్షానికి పాత్రుడనయ్యానని భావించాను. 1900 వ సంవత్సరంలో, ఆశ్వయుజ శుద్ధ దశమి నాడు, గ్రంథ రచన ఆరంభించాను".

"భద్రాద్రి రామభద్రుడికి అంకితమిచ్చిన నా రచన శ్రీకౌసల్యాపరిణయం నేటికీ (అప్పటికి) ఆయనకు అర్పించలేకపోయినందువల్ల, "ఒంటిమిట్ట'' నేను పుట్టిన మండలంలోనే వుండడం వల్ల, శ్రీమదాంధ్ర భాగవతానికి ఇది జన్మస్థలం కావడంవల్ల, పోతనామాత్యుడు ఒకవేళ రామాయణం రాసి వుంటే ఆ రామభద్రుడికే అంకితం ఇచ్చి వుండేవాడైనందువల్ల, ఆయన సంకల్పం నెరవేరుస్తున్న నేను ఆయన ఉద్దేశం నెరవేర్చడం అభిలషణీయమై నందువల్ల, "ఇంటి ముందరున్న పారిజాతం'' ఒంటిమిట్ట కోదండ రాముడికే ఈ కృతిని అంకితం చేశాను. గ్రంథ రచనను కొనసాగిస్తుండగా, స్నేహితుడు బ్రహ్మ శ్రీ కొత్తపల్లె పద్మనాభ శాస్త్రులు వారు ఒక సలహా ఇచ్చారు. వాల్మీకి రామాయణానికి యథా మూలం గా వున్న గ్రంథం ఇంతవరకు (అప్పటి వరకు) లేదనీ, మూలాన్ని అనుసరించి గ్రంథముంటే ఎక్కువ పూజించబడుతుందని, సాధ్యమైనంత వరకు మూల గ్రంథాన్ని అతిక్రమించకుండా-విషయం లోపించకుండా రచించమని సూచించారు. సంస్కృతంలో ''వాల్మీకి రామాయణం'' ఎలాగో, తెలుగులో నా రచన అలానే వుండేలా, అనుకునేలా, దీనికి ''ఆంధ్ర వాల్మీకి రామాయణం'' అని పేరు పెట్టమని కూడా చెప్పారు.

"కొత్తపల్లె వారి సూచనను అంగీకరించి రచనను కొనసాగించాను. శ్లోక భావాన్ని మించి పద్యం మిగిలిపోయిన సందర్భంలో, పాదాన్ని పూర్తిచేయడానికి కొన్ని పదాలను ఎక్కువగా ఉపయోగించి వుండవచ్చు కూడా. శ్లేషాలంకారాలున్న శ్లోకాలను తెనిగించేటప్పుడు, వాటికున్న అర్థాలన్నీ, ఒకే పద్యంలో వచ్చేట్లు వీలైనంతవరకు ప్రయత్నం చేశాను. ఒక్కోసారి, శ్లోకానికి పద్యం కాకుండా, రెండు-మూడు శ్లోకాల భావాన్ని ఒక్క పద్యంలోనే చొప్పించే ప్రయత్నం కూడా చేశాను. రాసేది లోకోపకారమైన గ్రంథం కాబట్టి సార్వజనీనంగా వుండాలన్నదే నా అభిప్రాయం. ఈ కారణం వల్ల, మూలంలో గూఢంగా వున్న సందర్భాలలో, దాని అర్థాన్ని విడమర్చి కొంచెం పెంచి రాసాను. ఏ కారణం వల్ల వాల్మీకి తన కావ్యాన్ని నిర్వచనం గా రాసారో, అదే కారణం వల్ల నేనుకూడా తొలుత దీన్ని నిర్వచనంగానే రచించాను".

శ్రీమదాంధ్ర వాల్మీకి రామాయణం రాయడం పూర్తి చేసిన తర్వాత ఎలా ఆ గ్రంథాన్ని ముద్రించింది, ఎవరి తోడ్పాటుతో జరిగింది, ఎవరికి-ఎప్పుడు-ఎలా అంకితమిచ్చింది వాసుదాసు గారి మాటల్లోనే తెలుసుకుందాం. అలనాటి ప్రముఖ దినపత్రిక ''ఆంధ్ర ప్రకాశిక'' 17-10-1908 న ఆ నాటి విశేషాలను ప్రచురించింది కూడా.

ఈ విషయాలను తెలియ చేస్తూ, వాసు దాసు గారు: “ఇంత గొప్ప గ్రంథాన్ని ముద్రించడం ఎలాగని నా స్నేహితులు కొందరు నాతో కలిసి ఆలోచన చేశారు. ఈ వార్త తెలుసుకున్న ఒక ‘‘స్వదేశీయ ప్రభువు’’ గారు, తాను ఆ భారమంతా మీదేసుకుంటానని చెప్పి, ప్రతిఫలాపేక్ష లేకుండా, వాగ్దానాన్ని నెరవేర్చుకొని, వేలాది రూపాయలు వ్యయం చేసి, ముద్రింపచేసి, “కృతి’’ కి, “కృతి కర్త’’ కు చిరాయువు కలిగించారు. ఈ విషయంలో తన నిర్వ్యాజ కరుణకు పాత్రులైన ఆ సత్ ప్రభువుగారికి శ్రీరాముడే సర్వ శ్రేయోదాయి అవ్వాలి. ఆ ప్రభువుగారు, తన పేరును ఇందులో ప్రకటించడానికి నాకు అనుమతి ఇవ్వనందున ఆయనెవరో లోకానికి తెలియచేయలేక పోతున్నందుకు విచారం వ్యక్తం చేస్తున్నాను’’.

“గ్రంథ రచన పూర్తవగానే ముగ్గురు స్నేహితులం కూర్చొని, దీన్ని, కృతిపతైన ఒంటిమిట్ట శ్రీకోదండరాముడికి నివేదించి, లోకానికి తెలియచేయడం ఎలాగని ఆలోచన చేశాం. ఆ సమయంలో అనుకోకుండా, నా పాత స్నేహితుడు, కడప మండలం, పొద్దుటూరులో న్యాయవాదిగా పనిచేస్తున్న బ్రహ్మ శ్రీ రాజ శ్రీ వి వసంత రావు గారు చెన్నపురికి వచ్చి, వార్త తెలుసుకొని, కార్యక్రమాన్ని మంచిగా జరిపించాలని ప్రోత్సహించడమే కాకుండా, సహాయం చేసేందుకు ముందుకొచ్చారు. ఆయనంతటితో ఆగకుండా, కడప మండలంలోని స్నేహితులతో, హితులతో, భాషాభిమానులతో, దైవ భక్తిగలవారితో ఒక ఆహ్వాన సభను ఏర్పాటు చేశారు. అందులో బ్రహ్మ శ్రీ మహారాజ శ్రీయుతులు నెమలి పట్టాభిరామరావు (కొచ్చిన్ సంస్థానంలో దివానుగా వుండేవారు), ఏ పరశురామ రావు, వావిలికొలను రామానుజ రావు, సి నంజుండప్ప, కే గుండు రావు, కామసముద్రము నరసింహాచార్యులు, ఎన్ నరసింగరావు, సత్యధీరగురురాజప్రియ కౌకూరు రామచంద్రరావు, యమ్మనూరు నాగయ్య, ఆర్ గిరి రావు గార్లు, మహరాజ శ్రీయుతులు కొణదల రామచంద్రారెడ్డి, విఠాయా గంటిసెట్టి గార్లు ఆహ్వాన సంఘ సభ్యులు. వీరికి సహాయపడేందుకు, శ్రీమదాయుర్వేదమార్తండ భిషజ్మణి పండిత డి గోపాలాచార్యులు గారు, మహారాజ శ్రీ పానుగంటి రామారాయనింగారు, బ్రహ్మశ్రీ రాజ శ్రీ గుమ్మెదూరు వేంకట రంగారావు గారు, వేంకట సుబ్బయ్య గారు, ఏ. జయరామరావుగారు, క్రొత్తపల్లి వేంకట పద్మనాభ శాస్త్రి గారు ముందుకొచ్చారు’’.

“ఇలాంటి మహనీయుల కలయికతో అలంకరించిన సభ ఎలాంటి కార్యాన్నైనా చేయగలదు కదా ! పైగా, వీరి ప్రార్థనలను అంగీకరించి, గ్రంథ సమర్పణ సమయంలో, సభాధ్యక్షుడిగా వుండడానికి ‘‘చిత్రనళీయం’’ లాంటి అనేక రూపక గ్రంథాలను రచించి, బళ్లారిలో న్యాయవాద వృత్తిలో వున్న, శతావధాని–ఉభయ వేదాంత ప్రవర్తకులు, మహారాజ రాజ శ్రీ శ్రీమద్ధర్మవరము రామ కృష్ణమాచార్యులు గారు ఒప్పుకున్నారు. 1908వ సంవత్సరం అక్టోబర్ నెల 9, 10, 11 తేదీలలో–అంటే, కీలక నామ సంవత్సరం ఆశ్వయుజ శుద్ధ పౌర్ణమి, బహుళ పాడ్యమి–విదియ తిథులలో ‘‘కావ్య సమర్పణ’’ జరుగుతుందని పత్రికా ప్రకటన ఇచ్చింది ఆహ్వాన సంఘం. ఇలా ఆంధ్ర లోకానికి వెల్లడి చేయడమే కాకుండా, హిత–కవి–పండితులందరినీ ప్రత్యేకంగా ‘‘విజ్ఞాపన పత్రికల’’ ను పంపించి ఆహ్వానించారు. నా పాత స్నేహితులు, ఒంటిమిట్ట దేవాలయ ధర్మకర్త మహారాజ శ్రీ తిప్పన సుబ్బారెడ్డి గారు, గ్రామ మెజిస్ట్రేట్ మహారాజ శ్రీ ఆకేపాటి సుబ్బారెడ్డి గారు, గ్రామంలో కావలసినన్ని వసతి సౌకర్యాలు ఏర్పాటు చేయించి, దేవాలయాన్ని అలంకరించి కార్యక్రమానికి సిద్ధం చేశారు. సమాచారం తెలుసుకున్న చుట్టు–

పక్కల గ్రామ ప్రజలు కార్యక్రమం ఆరంభానికి ఒకరోజు ముందు కల్లా ఒంటిమిట్టకు రాసాగారు. మహాత్ముడైన బమ్మెర పోతన పేరు ఇప్పటికీ (అప్పటికీ) మండలంలో భక్తితో స్మరించబడుతుండం వల్ల, ఆ కవి పట్ట భద్రుడు ఎలాగైతే భాగవతాన్ని అర్పించాడో, అలానే ఎవరో శ్రీ కోదండరామస్వాముల వారికి శ్రీ రామాయణం సమర్పించేందుకు వస్తున్నారని విన్న వారందరు, భక్తి ఆవేశంతో, బాలోన్మత్త పిశాచగ్రస్తులలాగా ''రామ-రామ'' అంటూ, అన్ని వర్ణాల వారు, చుట్టు-పక్కల పది యోజనాల నుంచి వచ్చారు. అధమపక్షం అలా వచ్చిన వారి సంఖ్య అయిదు వేల పైనే వుంటుంది''.

"ఆహ్వానాలందుకుని వచ్చిన వారిలో చాలామంది గొప్ప కవులు, విద్వాంసులు, అధికారులు, పూజ్యులున్నారు. రాలేక పోయినవారిలో కొందరు గ్రంథావిష్కరణకు తమ ఆమోదం తెలుపుతూ ప్రత్యుత్తరమో, మాట మాత్రంగానో తెలియ పరిచారు. కొందరు సందేశాలను పంపారు. ఇలాంటి వారిలో రాజ శ్రీ రాయ బహదూర్ పి అనంతాచార్యులవారు, విద్యా వినోద, విశారద, సిఐఇ, మహామహోపాధ్యాయ బిరుదాంకితులు బ్రహ్మ శ్రీ కొక్కొండ వేంకటరత్నము పంతులు గారు, రస్సల్ కొండ డిప్యూటీ కలెక్టర్ మహారాజ శ్రీ జయంతి రామయ్య పంతులు గారు, గుంటూరు జిల్లా కోర్ట్ మునసబు వావిలాల శివావధానులు గారు, పిఠాపురం ప్రధానోపాధ్యాయుడు కూచి నరసింహము పంతులు గారు, వైజాగ్ వకీలు బి. యాజులు గారు, కర్ణాటక పండితులు బ్రహ్మ శ్రీ సిద్ధాంతి శివశంకర శాస్త్రి గారు ప్రముఖులు. చెన్నపురి కళాశాలలనుంచి ఆంధ్ర భాషాభివర్ధనీ సమాజ సభ్యులు, కొందరు విద్యార్థులు వచ్చారు. పూర్వాచార పరాయణుడు-ప్రసిద్ధ పురాతన పుంగనూరు సంస్థాన ప్రభువు, మహారాజ రాజశ్రీ రాజా వీర బసవచిక్కరాయలు యశోవంత బహదూర్ గారు ఆయన సంస్థానంలోని దివాన్-పండితుడు బ్రహ్మ శ్రీ శేషప్ప శాస్త్రి గారిని, ఆస్థాన విద్వాంసుడు బ్రహ్మ శ్రీ వేంకటరామ శాస్త్రి గారిని పంపారు''.

"చెన్నపురి నుంచి శ్రీ శైలాద్దంకి సమయోద్దండ కోలాహల లక్ష్మీ నృసింహ కుమారేత్యాద్యభి జనవ్యపదేశ భాసురులు, అఖిల హరిదంతర విసృత్వర కవితా పరిమళ మహాకవిత్వోచిత సహృదయ సముదయ సాదర సమర్పిత కవిభూషణ బిరుద భూషణుడు, శ్రీమత్కుమార తాతా చార్యులు గారొచ్చారు. శ్రీ కాళహస్తి నుంచి ఆంధ్రీకృత మహాభారతులు, ఉభయ భాషా కవిత్వ తత్వజ్ఞులు బ్రహ్మ శ్రీ శత ఘంటము వేంకట రంగ శాస్త్రి గారొచ్చారు. వేంకటగిరి నుంచి కపిలాచిత్రకాయ ఉపాఖ్యానాది గ్రంథ కర్త శ్రీమదుభయ వేదాంత ప్రవర్తకులు శ్రీమత్కొమాండూరు శ్రీనివాసాచార్యులు గారు, తిరుపతి నుంచి చుళికీకృత సమస్తాంధ్ర గ్రంథులు-ఉభయ కవివయస్యులు బ్రహ్మ శ్రీ నాగ పూడి కుప్పుసామయ్య గారు వచ్చారు. ఉభయ వేదాంత ప్రవర్తకులు-పండితులు శ్రీమత్కమలాపురము రాఘవాచార్యులు గారు, గోపాలాచార్యులు గారు, తర్క వ్యాకరణ పారంగతులు సీతారామ శాస్త్రి గారు, శ్రీమదష్టావధానం నరసింహాచార్యులు గారు, పార్థసారథి సెట్టి గారు, కోటి రెడ్డి గారు, కె. చెంగయ్య గారి లాంటి కవులు, విద్వాంసులు అనేకమంది వచ్చారు. వచ్చిన వారంతా విద్యావంతులే. అనాహుతులై వచ్చిన వారిలోనూ పెక్కురు విద్యావంతులున్నారు. అపరిచితులైన వారి పేర్లను నమోదు చేసుకునే అవకాశం కలగలేదు''.

"కార్యక్రమం మూడు రోజులూ, ఉదయం, శ్రీ సీతారామచంద్రులకు సహస్రనామార్చన

యథావిధిగా జరుపబడింది. మొదటిరోజు ఉదయాన సంస్కృత వాల్మీకి రామాయణం, ఆంధ్ర వాల్మీకి రామాయణం పుస్తకాలను శ్రీస్వామివారి పల్లకిలో వుంచి, ఆ పల్లకిని, రాయబహద్దర్ బ్రహ్మ శ్రీ హనుమంత గౌడ్ గారు, నెమలి సుబ్బారావు గారు, మల్లవరపు పెంచలార్య కవి గారు, కాకినాడ సరస్వతీ పత్రికాధిపతి బ్రహ్మ శ్రీ కొత్తపల్లి సూర్యారావు గారు, ఇతర ప్రముఖులు తమ భుజాలపై మోసారు. బ్రహ్మ శ్రీ కొత్తపల్లి పద్మనాభ శాస్త్రి గారు, బ్రహ్మ శ్రీ రాజ శ్రీ కూనపరాజు శేషాద్రి రావు గారు, ఛత్రం–చామర పట్టుకుని తోడురాగా, మంగళ వాద్యాలతో దేవాలయ గ్రామ ప్రదక్షిణగా వూరేగించారు. గ్రంథానికి పూజ చేసిన తర్వాత ముందున్న కొంత భాగాన్ని కవి చదివారు. ఒక్కరే మూడు దినాల్లో పూర్తి గ్రంథాన్ని చదవడం కష్టమని భావించి, చిలుకూరి కృష్ణమూర్తి గారు, వేంకట సుబ్బయ్య గారు, పద్మనాభ శాస్త్రి గారు, కోమాండూరు శ్రీనివాసాచార్యులు గారు, క్రొత్తపల్లి సూర్యారావు గారు, కూనపరాజు శేషాద్రి రావు గారు, కాళహస్తి శర్మ గారు తోడ్పడి పుస్తక పఠన పూర్తి చేశారు. మొదటిరోజు మధ్యాహ్నం దేవాలయ ముఖ మంటపంలో సభ జరిగింది. సీతారామ శాస్త్రి గారు, అష్టావధానం నరసింహాచార్యులు గారు, ఆర్కాట్ హనుమంతాచార్యులు గారు, అద్దంకి తాతాచార్యులు గారు, వాధూల శ్రీ వేంకట ప్రసన్న యోగీంద్ర స్వాముల (ధర్మకర్త) వారు, శ్రీ రామాయణం గురించి ఉపన్యసించారు. తెలుగు రాని బ్రహ్మ శ్రీ గోపాలసామయ్యర్ కూడా ఉపన్యసించారు".

"రెండో రోజు మధ్యాహ్నం తిరిగి సభ జరిగింది. ఆహ్వాన సభా సభ్యుడు వి వసంత రావు గారు సభ ఉద్దేశాన్ని, ఒంటిమిట్ట గ్రామ ప్రసిద్ధిని, కార్యక్రమ అపూర్వత్వాన్ని గురించి వివరించారు. ఆహ్వానితులకు స్వాగతం పలుకుతూ, (మూడు సీస పద్యాలు, ఒక ఉత్పలమాల, ఒక కవిరాజవిరాజితము) "స్వాగత పంచ రత్నాలు" చదివి వినిపించారు. అనంతరం సభాధ్యక్షుడు శ్రీమద్ధర్మవరము కృష్ణమాచార్యులు గారు ఆంధ్రా భాషా విషయాలను గురించి ఉపన్యసించి, సందేశాలను చదివి వినిపించి, గ్రంథోత్పత్తిని గురించి తెలుపమని కోరారు. "భక్తే ఈ గ్రంథ రచనకు కారణం" అని చెప్పిన నేను, ఈ విషయంలో శ్రీరామచంద్రుడు చేసిన సహాయం గురించి వివరించాను. ఆ తర్వాత సభాధ్యక్షుడు పండితులను ఉద్దేశించి, ఆంధ్ర వాల్మీకి రామాయణాన్ని, పరీక్షించవచ్చని కోరారు. అప్పటికప్పుడు కొందరడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వడం జరిగింది. చాలామంది పండితులు సభానంతరం వారి వసతి గృహాలకు గ్రంథాలను తీసుకొనిపోయి శోధించారు. ఆ రాత్రి పాదుకా పట్టాభిషేకం నాటకం ప్రదర్శించారు. వచ్చిన డబ్బులను దేవాలయానికి విరాళంగా ఇచ్చారు. పిండారబోసినట్లున్న పౌర్ణమి నాటి పండు వెన్నెలలో, నంజుండప్ప గారు, కమలాపురం రాఘవాచార్యులు గారు, నెమలి సుబ్బారావు గారు సీతా కల్యాణం హరి కథా కాలక్షేపం బోధించారు".

"మూడో రోజు ఉదయం హిందూ మతం గురించి ఉపన్యాసాలయిన తర్వాత గ్రంథ పరీక్ష జరిగింది. పండితులందరూ వారి వారి సంతుష్టిని పద్యంగానో–ఉపన్యాసంగానో వెల్లడిచేసి, కృతిని ప్రశంసించి కవిని ఆశీర్వదించారు. పట్టాభిషేకం భాగం పఠనంతో, సభాధ్యక్షుడి ఉపన్యాసంతో సభ ముగిసింది. కనీ–వినీ ఎరుగని రీతిలో కార్యక్రమం ముగిసి, లోకులెల్లరు కొనియాడుతుంటే. శ్రీమదాంధ్ర వాల్మీకి రామాయణం, కృతి భర్తైన ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామి వారికి సమర్పించబడింది".

“దిన త్రయం అన్నదానం జరిగింది. చిన్నా–పెద్దా తేడా లేకుండా అందరూ అందులో పాల్గొన్నారు. హేమా–హేమీలనుకునే వారు నడుం బిగించి వడ్డన చేశారు. వారందరికీ నా సాష్టాంగ నమస్కారాలు. అన్నదానానికి సహాయపడిన యాదాళ్ళ నాగమాంబ గారికి, శ్రీ వేంకట సుబ్బయ్య గారికి, శ్రీ యాదాళ్ల పాపయ్య సెట్టి గారికి, ఇతర పుణ్యాత్ములందరికి శ్రీరాముడు శాశ్వత సౌఖ్యాలను ఇచ్చుగాక”. “కొక్కొండ వేంకటరత్నము పంతులు గారు ‘‘శ్రీ మదాంధ్ర వాల్మీకి రామాయణ కృతి ప్రశంస’’ గా ‘‘రత్నావళి పద్య పంచక బహు కృతి’’ ని చేశారు. అలానే కవిభూషణ అద్దంకి కుమార తాతర్య గారు, నాగ పూడి కుప్పుసామయ్య గారు, వేంకట రంగ శాస్త్రి గారు, మల్లవరపు పెంచలార్య కవి గారు, కొమాండూరు శ్రీనివాసాచార్యులు గారు, నాధముని దాసు గారు పద్య రూపంలో ప్రశంసించగా ఇతరులు ఉపన్యాస రూపంగా ప్రశంసించారు. అలనాటి పత్రికల్లో ఈ కార్యక్రమాన్ని గురించి విశేషంగా వార్తలొచ్చాయి. ప్రశసింస్తూ ప్రసంగం చేసిన వారు–పద్యాలను చదివిన వారు, నన్ను బమ్మెర పోతనతో పోల్చారు”.

వావిలికొలను సుబ్బారావు గారు ప్రాతఃస్మరణీయుడు.

◆❖◆

సీతాయాశ్చరితం మహత్!

శ్రీ రామాయణం, భారతం, భాగవతం అద్వితీయమైన గీర్వాణ భాషా గ్రంథాలు. ఈ మూడింటి లో ఆద్యమైంది శ్రీ రామాయణ కావ్యం. కావ్యాలలోకెల్లా ప్రథమంగా ఉత్పన్నమైంది కావడంతో ఆదికావ్యమైంది. రామాయణాన్ని చక్కగా తెలిసినవారు, అర్థం చేసుకోగలిగిన వారు మాత్రమే లోకానికి అందలి విషయాలను వివరించ సమర్థులు. అందరికీ అది సాధ్యమయ్యేది కాదు. మన పూర్వీకులకు తెలియని నాగరికతలు లేవు. మన పూర్వులు ఏ కారణం వల్ల ఆర్యులయ్యారు? వారు ఎటువంటి గుణాలు కలిగి, ఎటువంటి మహోన్నత స్థితిలో వుండే వారు? వారి నాగరికత విధానం ఎటువంటిది? వారి కులా చార ప్రవర్తనలెలావుండేవి? రాజుకు–ప్రజలకు మధ్య ఐకమత్యం ఎలా వుండేది? భార్యా–భర్తలు, సోదరులు, తల్లి తండ్రులు, పుత్రులు పరస్పరం ఎలా ప్రవర్తించేవారు? సుఖ–దుఃఖాల విషయంలో స్త్రీ–పురుషులు ఏ విధమైన నడవడి గలవారు? వారికి దేవుడంటే ఎలాంటి ఆలోచన వుండేది? దైవాన్ని వారెలా ఆరాధిస్తుండే వారు? ఇలాంటి లౌకిక విషయాలను తెలుసుకోవాలనుకునే వారికి శ్రీ రామాయణాన్ని మించి తెలిపే గ్రంథం ఎక్కడా లేదు. కాలక్షేపానికి చదవడానికైనా శ్రీ రామాయణం లాంటి పుస్తకం ఇంకోటి లేదు. ఏ విధంగా చదివినా, చదివిన తర్వాత, సమయాన్ని సద్వినియోగం చేశామన్న తృప్తినిచ్చేది రామాయణమే.

శ్రీ సీతారాముల పేరు విన్న ప్రతి ఆర్యుడు మనస్సులోనైనా భక్తితో నమస్కారం చేసుకోవాల్సిందే. ఇలా సీతారాములు సార్వజనీన సంపూజ్యులు కావడానికి కారణమేంటి? సీతారాములలో విశేషమేమిటంటే, వారు అవతార మూర్తులు కావడమే ! ఎవరెవరు, ఏ ఏ పేరుతో పిలిచినా, భగవంతుడనేవాడు ఒక్కడే అని ఆర్యుల నమ్మకం. భిన్న, భిన్న రూపాల్లో దర్శనమీయడం భవత్‌కళా విశేషం. అలాంటి భగవంతుడే, శ్రీరాముడుగా, లోక రక్షణార్థం జన్మించాడన్న నమ్మకమే, లోకులందరు ఒకేవిధంగా శ్రీ సీతారాములను అర్చన చేయడానికి కారణమైంది.

''శ్రీ రామాయణం'' అంటే, లక్ష్మీరమణుడైన శ్రీమన్నారాయణుడి మాయా మానుషావతారమైన

శ్రీరామ చరిత్రనీ, శ్రీ లక్ష్మీదేవి అవతారమైన సీతాదేవి చరిత్రనీ అర్థం. ఇందులో సీతాదేవి మహాత్మ్యాన్ని విశేషించి చెప్పడంవల్ల వాల్మీకి మహర్షే, శ్రీ రామాయణాన్ని ''సీతాయాశ్చరితం మహత్తు'' అని వెల్లడిచేశాడు. శ్రీరామచంద్రుడు మనుష్యుడివలె నటిస్తుంటే, వాల్మీకేమో వాస్తవార్థం చెప్తూ, ఆయన సాక్షాత్తు భగవంతుడే అంటాడు. రాముడి చర్యల ద్వారా, రాముడి వాక్కుల ద్వారా తాను చెప్పదల్చుకున్న దాన్ని సిద్ధాంతీకరించాడు వాల్మీకి. శ్రీరాముడు భగవంతుడన్న అర్థం, రామాయణంలోని ఏడు కాండల్లోనూ వ్యాపించి వుంది. శ్రీమద్రామాయణంలో ఉత్తమోత్తమ మహాకావ్య లక్షణాలెన్నో వున్నాయి. వర్ణనలెన్నో వున్నాయి. రామాయణం గానం చేసినా, పఠించినా మనోహరంగా వుంటుంది.

అలంకార శాస్త్రంలో ఎన్ని అలంకారాలు చెప్పబడ్డాయో, అవన్నీ వాల్మీకి రామాయణంలో వున్నాయి. వాల్మీకి అసమాన కవితా చాతురి వర్ణనాతీతం. సాధారణ విషయాన్ని చెప్పాల్సి వచ్చినప్పుడు కూడా ఏదో ఒక చమత్కారాన్ని కనబరిచేవాడు. వాల్మీకి రామాయణంలోని పాత్రలు, పాత్రధారుల వాక్కులు, ఆయా పాత్రల చిత్త వృత్తి గుణాలను తెలియచేసేవిగా, సందర్భోచితంగా, వారున్న అప్పటి స్థితికి అర్హమైనవిగా వుంటాయి. పాత్ర గుణ మహాత్మ్యానికి అసంగతమైన వాక్యాలు ఆయా పాత్రల నోటినుంచి వెలువడవు. శ్రీరాముడు భగవంతుడన్న అభిప్రాయం వాల్మీకి పదే పదే చెప్పుకుంటూ పోయాడు రామాయణంలో.

వాల్మీకి రామాయణమనే ''కలశార్ణవం'' లో రత్నాలను వెదికేవారు, మొట్టమొదటగా తెలుసుకోవాల్సింది వాల్మీకి శైలి, విధానం. అది తెలుసుకోలేక వెతకడం మొదలుపెట్టితే, చీకట్లో తారాడినట్లే. ఒక విషయం గురించి చెప్పాల్సిందంతా ఒకచోట చెప్పడు. కొన్ని సందర్భాలలో ఆ విషయానికి సంబంధించిన ప్రస్తావనే వుండదు. అదే విషయం మరెక్కడో సూచన ప్రాయంగా వుండొచ్చు. ఒక్కోసారి విపులంగా విశదీకరించబడి వుండొచ్చు. ఆయన చేసిన వర్ణనలను బట్టి, ప్రయోగించిన పదజాలాన్ని బట్టి, పాఠకులు ఊహించుకోవచ్చు. ఒకే విషయం, ఒకటి కంటె ఎక్కువ సార్లు చెప్పితే, ఒక్కోసారి ఒక్కోరకమైన విశేషంతో చెప్పబడుతుంది. ఇలాంటి చిత్రాలు అనేకం వుంటాయి.

వాల్మీకి రామాయణం ''ధ్వని కావ్యం''. కావ్యానికి ప్రధానమైంది ధ్వని. కావ్యానికి ప్రాణం ధ్వని. ధ్వని లేని కావ్యం శవంతో సమానం. రామాయణంలో ధ్వని విశేషంగా వుంది. కావ్యమంతా ధ్వన్యర్థం వుండడమే కాకుండా, పలు శ్లోకాలకు విడిగా ధ్వన్యర్థం వుంది. రుతు వర్ణనలలో ధ్వని స్ఫురిస్తుంది. శ్రీ రామాయణ అంతరార్థాన్ని పెద్దలు ఇలా చెప్పుకుంటారు: భగవంతుడు ఒక్కడే పురుషుడు. తక్కిన దంతా స్త్రీ మయం అన్న నియమం ప్రకారం, సీతే జీవుడు. ఆ జీవుడు భగవంతుడిని ఆశ్రయించి వున్నంతవరకు ఎలాంటి ఆపదా కలగదు. కర్మవశాన దుర్బుద్ధితో, మాయా మయమైన ప్రకృతి పదార్థాల (మాయ జింక) మీద ఆసక్తి కలిగితే, మోక్ష సాధనానికి విరుద్ధమైన అలాంటి బుద్ధి మళ్లీ పుట్టకుండా చేయడానికి భగవద్వియోగం కలుగుతుంది. వెంటనే దేహ ప్రాప్తి (లంక) కలుగుతుంది.

రావణ–కుంభకర్ణులు అహంకార–మమకారాలు. ఏకాక్షి ప్రభృతులు ఇంద్రియాలు. అనుభవంతో బుద్ధిమంతులు కావల్సినవారు, వాటికి చిక్కి అవస్థ పడుతున్నప్పుడు, జీవుడికి వివేకం కలిగి, పరితపించడం ప్రారంభించి, తన మీద భగవంతుడికి దయ కలుగుతోందా, తన దగ్గరకు చేర్చుకుంటాడా,

అని విలపిస్తారు (సీతా విలాపం). తనను ఆశ్రయించిన జీవుడు ఇలా అజ్ఞానం వల్ల కష్ట దశలో పడిపోయెగదా అని అత్యంత దయాళుడైన భగవంతుడు బిడ్డకొరకు తండ్రి దుఃఖించినట్లు, జీవుడికంటే ఎక్కువగా పరితపిస్తాడు (రామ విలాపం). జీవుడికి ధైర్యం కలగడానికి, భగవంతుడికి తనపై అనురాగం వుందని చెప్పి భయపడ వద్దని తెలియచేయడానికి ఆచార్యుడిని (హనుమంతుడు) పంపుతాడు. ఆచార్యుడు అక్కడకు (లంకకు) పోయి అతడి చేష్టలన్నీ తెలుసుకొని, ధైర్యం చెప్పి, మరల భగవంతుడితో జీవుడు అనన్య భక్తుడనీ, ఆయనే దిక్కని నమ్మినాడనీ (నియత-యక్షత), కాబట్టి భగవంతుడే కాపాడాలనీ వేడుకుంటాడు. భగవంతుడు ప్రతిబంధకాలను అణచివేసి, చిత్తశుద్ధి పరీక్షించి (సీత అగ్ని ప్రవేశం) మరల తన దగ్గర చేర్చుకుంటాడు. దానర్థం: అనన్యాసక్తుడై, దృఢ నిశ్చయంతో, జీవుడు భగవంతుడిని సేవిస్తుంటే, అతడికి కావల్సిందంతా భగవంతుడే నెరవేరుస్తాడు. సుందర కాండ చదివేటప్పుడు పాఠకులు తమను సీత గాను, శ్రీరాముడిని భగవంతుడి గాను భావిస్తే ఈ అర్థం స్పష్టంగా తెలుసుకోవచ్చు.

వాల్మీకి రామాయణంలో, సాధారణంగా, సర్గ మొదట్లో, చివర్లో, మొదలు చెప్పిన కథనే సంగ్రహంగా తిరిగి చెప్పడం జరిగింది. ఇది కాకుండా, యజ్ఞాలు, శకునాల లాంటివి చెప్పవలసి వచ్చినప్పుడు, వర్ణించిన విషయాన్నే మరల వర్ణించాల్సి వస్తే, పూర్వోక్త శ్లోకాలనే మళ్లీ చెప్పడం జరిగింది. ఇలాంటిది ఆ కవి కవితా విశేషమే గాని మరొకటి కాదు. శ్రీరామాయణంలోని కవితా చమత్కృతిని విశదీకరించాలంటే, ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. వేదవ్యాసుడంతటి వాడు వాల్మీకి శ్లోకాలను అనువదించగా లేంది, వేరేవారి సంగతి చెప్పాలా ! ఎవరికైనా సత్కవి కావాలని కోరికుంటే, వారు వాల్మీకి రామాయణాన్ని అనేక పర్యాయాలు, శ్రద్ధగా-భక్తితో పఠించాల్సిందే.

శ్రీమద్రామాయణం గొప్ప ధర్మ శాస్త్రం. ఇందులో సర్వ విధాలైన, అన్ని రకాల ధర్మాల గురించి వివరంగా చెప్పబడింది. రాజ ధర్మం, ప్రజా ధర్మం, పతి ధర్మం, సతీ ధర్మం, భాతృ ధర్మం, పుత్ర ధర్మం, భృత్యు ధర్మం, మిత్ర ధర్మం లాంటి అన్ని ధర్మాలను గురించి చక్కగా తెలుపబడి వుంది. లాభ, లోభ, పక్షపాత బుద్ధి లేకుండా, న్యాయం మీదే దృష్టి నిలిపి వాదించే న్యాయవాది ధర్మం కూడా చెప్పబడింది. వీటితో పాటు కథా సందర్భానుసారంగా, అంతరాంతరాలలో ఎన్నో నీతులు చెప్పబడ్డాయి.

సత్ ప్రభు లక్షణం తెలుసుకోవాలంటే, రామ-దశరథుల రాజ్య పాలనా విధానంలో దొరుకుతుంది. ఆర్య ప్రభువులు ఏ పని చేసినా ప్రజల అనుమతి లేకుండా చేయలేదు. తాము ప్రభుత్వం నడిపేది ప్రజలకొరకేనని, వారిని సుఖ పెట్టడానికేనని వారు భావించేవారు. ప్రత్యక్షంగానైనా, పరోక్షంగానైనా ప్రజలకు హాని కలిగించే పనేదీ చేయరు. శ్రీరాముడి పట్టాభిషేకం గురించి దశరథుడు చేసిన (అయోధ్య కాండ) ఉపన్యాసం ఇందుకో ఉదాహరణ. ప్రజల దగ్గర పన్నులు తీసుకుంటూ, వారి కష్టాలు తొలగించకపోతే నరకంలోకి పోతామని వారి నమ్మకం (అరణ్య కాండ).

ప్రభువైన వాడు ధర్మాన్ని ఆధారంగా చేసుకొని, వేగులవారి ద్వారా, ప్రజల కష్ట సుఖాలను తెలుసుకోవాలి. ప్రజలు ఇష్టపడని గుణాలు తనలో వుంటే, ఎంత నష్టమైనా, కష్టమైనా అవి మానుకోవాలి. ఆ విషయంలో రాజు అంతఃకరణం చెప్పింది ముఖ్యం కాదు. ఇతరులను సంతోష పెట్టడానికి తనెందుకు

దుఃఖపడాలని అనకూడదు. ఈ విషయంలో రాముడే ప్రమాణం.

శ్రీరాముడు పట్టాభిషేకం జరిగిన తర్వాత ఒక నాడు వేగులవాడైన భద్రుడిని నగరంలో, పల్లెల్లో వార్తలేంటని, తమను గురించి ప్రజలేమనుకుంటున్నారని అడిగాడు. జవాబుగా వాడు, తనను లోకులందరూ ప్రశంసిస్తున్నారని చెప్తే, అంతటితో తృప్తి పడలేదాయన. ఉన్నదున్నట్లు, విన్నది విన్నట్లు అసలు విషయాలన్నీ చెప్పమంటాడు రాముడు. రాముడి గుణగణాలను చక్కగా అర్థం చేసుకుంటే, రాజుకుండవలసిన సద్గుణాలే కాకుండా, సాధారణంగా ప్రతి పురుషుడికి వుండాల్సిన, సత్యం, దయ, ఇంద్రియ నిగ్రహం, పితృభక్తి, ఏక పత్నీనియమం, సౌభ్రాత్రం, దైవ భక్తి, దేవతారాధనం, నిత్య కర్మానుష్ఠానం విపులంగా ఆయనలో వున్నాయని తెలుసుకోవచ్చు.

ఉత్తమ స్త్రీల లక్షణాలన్నీ కలగనున్నవారిలా సీత, కౌసల్య, సుమిత్రల గుణాలను బట్టి, నీచ స్త్రీల లక్షణాలున్న వారిగా కైకేయి, శూర్పణఖల గుణాలను బట్టి తెలుసుకోవచ్చు. రావణాసురుడు చెడిపోవడానికి ఎన్నో కారణాలు కనిపిస్తాయి రామాయణంలో. ఇంద్రియాలను జయించ లేకపోవడం, అసత్యాలు పలకడం, వేగుల వారు లేకపోవడం, వున్న వారికి సరైన జీతాలు ఇవ్వక పోవడం, తన పరిసరాలో జరుగుతున్న వృత్తాంతాలను తెలుసుకోలేక పోవడం, విన్న ప్రతి విషయాన్నీ నమ్మడం, నిజా-నిజాలు మంత్రులపైన పడవేయడం, తన మేలుకోరి చెప్పగలవారికి, జ్ఞాన హీనతతో చెప్పేవారికి మధ్య తేడా తెలుసుకోలేక పోవడం, ఎవరినీ నమ్మక పోవడం, మూర్ఖత్వం లాంటి పలు దుర్గుణాలు వున్న రావణుడు సమూలంగా నాశనమయ్యాడు. పైన పేర్కొన్న విషయాలన్నీ, శూర్పణఖ, మారీచుడు, విభీషణుడు చెప్పిన మాటల్లో బయట పడుతుంది. రాముడితో యుద్ధమెందుకు చేయవలసి వచ్చిందో, యుద్ధ కారణమేంటో తన భటులకే తెలియనీయక వంచన చేసి, వారి ప్రాణాలను తీసిన (రావణాసురుడి లాంటి) ప్రభువు ఎలాంటి వాడో రామాయణం చదువుతే అర్థమవుతుంది.

ఇలాగే, రామ లక్ష్మణ భరత శత్రుఘ్నుల చర్యల వలన భాతృ ధర్మం, సుగ్రీవుడి చర్యల వలన మిత్ర ధర్మం, హనుమంతుడి చర్యల వలన భృత్యు ధర్మం తెలియ చేయబడ్డాయి రామాయణంలో. రామాయణంలో సకల ధర్మాలున్నాయి. ఇందులో వున్న ధర్మాలే మిగిలిన అన్ని గ్రంథాలలోనూ కనబడతాయి. ఇందులో లేని ధర్మాలు మరింకేదాంట్లోను కనిపించవు.

శ్రీమద్వాల్మీకి రామాయణం మంత్రనిధానం. ఇందులో అనేకానేక మంత్రాలు ఉద్ధరించబడి వున్నాయి. అందువల్లే, వాల్మీకి రామాయణం పారాయణం చేసేవారు, యథావిధిగా చదివి, వారి వారి కోరికలు నెరవేర్చుకుంటారు. రామాయణమంతా గాయత్రీ స్వరూపమే. గాయత్రిలోని 24 అక్షరాలను, ప్రతి వేయి శ్లోకాలకు ఒక అక్షరం చొప్పున శ్లోకం ఆరంభంలో చెప్పబడింది.

కామ్యార్థమైనా, మోక్షార్థమైనా, రామాయణం పారాయణం చేసినవారి కోరికలు నెరవేర్చే శక్తి, రామాయణానికి వుండడానికి కారణం, అది భగవత్ కథ కావడానికి అదనంగా సర్వజ్ఞుడైన వాల్మీకి కూర్చిన బీజాక్షరాల మహాత్మ్యమే. శ్రీమద్రామాయణం వేదంతో సమానమైందే కాకుండా వేదమే అనాలి. వేదమే అయినప్పుడు, వేదంతో సమానమైందని ఎలా అనవచ్చునంటే, వేదంలోని వర్ణాలనే, అనులోమ, విలోమాలుగా మార్చి, వేద ప్రసిద్ధమైన రామ కథను చెప్పడంవల్ల ఇది వేదమే అయింది. వేదాల్లోని

అర్థాలున్నందువల్ల వేదంతో సమానమైంది. అందువల్లనే, వేద పఠనం అవశ్యంగా చేయాల్సిన కార్యక్రమాల్లో, రామాయణ పఠనం నియమితమైంది. శత కోటి, అంటే 24 గాయత్రీ బీజాక్షరాలతో కూడిన 24,000 గ్రంథాల రామాయణంలోని ప్రతి అక్షరానికి మహా పాతకాలను నాశనం చేయగల శక్తిగలదని కొందరంటారు. కొందరేమో, శత కోటి రామాయణాన్ని వాల్మీకి సంగ్రహంగా చెప్పాడంటారు. ఇలాంటి మహిమ రామాయణంలో వుండడానికి కారణమేంటో ఆలోచించాలి.

{ఒక అజ్ఞాత మహానుభావుడి ద్వారా ''కాలిఫోర్నియా (అమెరికా) విశ్వ విద్యాలయం'' కు చెందిన ''బర్క్ లీ'' గ్రంథాలయంలో చోటుచేసుకుని, "గూగుల్ సంస్థ'' డిజిటలైజ్ చేసి నందువల్ల అంతర్ జాలంలో లభ్యమైన ''వాసుదాసు-వావిలికొలను సుబ్బరావు'' గారి ''శ్రీ మదాంధ్ర వాల్మీకి రామాయణం'' మొదటి సంపుటి, బాల, అయోధ్య, అరణ్య, కిష్కింధ కాండలకు ముందు మాటగా రచయిత చెప్పిన మాటల ఆధారంగా}

◆❖◆

ధర్మ సంస్థాపనే రామావతార పరమార్థం

బద్రాచలంలో శ్రీరామనవమి, అంటే రాముడి పుట్టినరోజు జరుగుతుంది. చైత్ర మాసం, శుక్లపక్షం, నవమి తిథి నాడు, పునర్వసువు నక్షత్రంలో, అభిజిల్లగ్నం, కర్కాటక లగ్నంలో, చంద్రుడిని కూడిన బృహస్పతి కలిగిన ఉదయం రామ జననం అయింది. వివాహం జరిగింది నవమి నాడు కాదు. యథావాల్మీకమైన ఆంధ్ర వాల్మీకి రామాయణంలో వాసుదాసు గారు రాసినదాన్ని బట్టి చూస్తే, సౌమ్య నామ సంవత్సరం, మాఖ బహుళంలో శ్రీరామ లక్ష్మణులను విశ్వామిత్రుడు తనవెంట యాగరక్షణకు తీసుకెళ్తాడు. 27వ రోజు, అంటే, శుక్ల త్రయోదశి, ఉత్తర ఫల్గుణీ నక్షత్రంలో సీతా కల్యాణం జరిగింది. మరి ఆ 27వ రోజు, నవమి అని ఎక్కడా చెప్పడం జరగలేదు. ఎందుకు మనవాళ్లందరూ వివాహం జరిగిన తిథి నాడు కాకుండా శ్రీరామనవమి నాడు సీతారాముల కల్యాణం జరుపుతున్నారో సామాన్యులకు అర్థంకాదు, అర్థం చేసుకొని అడగాలని కూడా ఎవరూ అనుకోరు. ఇది దైవ కార్యం. ఎప్పుడైనా చేయొచ్చు. తిరుమలలో నిత్య కల్యాణం పచ్చ తోరణం. ప్రతి రోజు కల్యాణమే!

వాల్మీకి రామాయణాన్ని యథావాల్మీకంగా పూర్వ కాండలతో సహా ఉత్తర కాండను కూడా ప్రప్రథమంగా తెనిగించిన ''ఆంధ్ర వాల్మీకి–కవిసార్వభౌమ'' వావిలికొలను సుబ్బరావు (వాసుదాసు) గారి ఆంధ్ర వాల్మీకి రామాయణం బాలకాండలో సీతా కల్యాణ ఘట్టం అపురూపంగా వర్ణించబడింది. వివాహం పూర్వ రంగం, వివాహ ఘట్టం చదువుతుంటే ఆసక్తికరంగా వుంటుంది. స్వాయంభువ మనువు, పూర్వం, గోమతీ తీరాన వున్న నైమిశారణ్యంలో, వాసుదేవ ద్వాదశాక్షరీ మంత్రాన్ని జపించాడు. శ్రీమన్నారాయణుడు ప్రత్యక్షమై వరం కోరుకొమ్మంటే, మూడు జన్మల్లో నారాయణుడు తనకు పుత్రుడుగా వుండాలని అడుగుతాడు. అంగీకరించిన భగవంతుడు, మనువు దశరథుడిగా పుట్టినప్పుడు ''శ్రీరాముడు'' గా పుత్రుడయ్యాడు. యదువంశంలో వసుదేవుడిగా మనువు పుట్టినప్పుడు ''శ్రీకృష్ణుడు'' గా ఆయనకు పుత్రుడయ్యాడు. మూడో జన్మలో ''శంబళ గ్రామం'' లో–కలియుగంలో–నాలుగో పాదంలో, హరివ్రతుడనే బ్రాహ్మణుడికి ''కల్కి'' గా పుట్టగలడు. మనువు భార్య సుశీల, కౌసల్య పేరుతో దశరథుడికి,

దేవకి పేరుతో వసుదేవుడికి, దేవ ప్రభ పేరుతో హరిప్రతుడికి భార్యగా వుండి, మూడు జన్మల్లో విష్ణుమూర్తికి తల్లి అవుతుంది.

దశరథుడు పుత్రకామేష్టి యాగం చేస్తుండగా అగ్నిహోత్రం మధ్యనుంచి వచ్చిన ప్రాజాపత్య మూర్తి దివ్యపరమాన్నం దశరథుడికిచ్చి, నలుగురు భార్యలకు పంచమంటాడు. అలా చేస్తే దశరథుడు కోరినట్లే కొడుకులు పుట్టారని అంటాడు. ప్రాజాపత్య పురుషుడిచ్చింది భగవంతుడి తేజస్సు మనుష్య స్త్రీ గర్భంలో ప్రవేశించేందుకు మంత్రవంతమైన హవిస్సులాంటి భగవత్తేజః పూరితమైన పాయసాన్నం. అందుకే, శ్రీరామాది జననాలు ''రేతస్సర్గం'' కారణం కాదు. వారి దేహాలు అ ప్రాకృతాలు. శుక్ల రక్త సంయోగాలవలన ఏర్పడే దేహాలకు స్త్రీ గర్భవసతి అవశ్యం కాని, దివ్య తేజస్సుతో ఏర్పడేవాటికి స్త్రీ గర్భ వసతితో పనిలేదు. ఇందు క్షేత్రం ప్రధానం కాదు, గర్భస్థజీవుడే తన తపో బలంతో, స్వేచ్ఛాత్తశరీరుడవుతాడు. వీరి దేహాలు తల్లి తినే ఆహారంతో కాని, తల్లి సంకల్పంతో కాని సంబంధం లేదు. అంటే, తల్లిదండ్రుల జాతికి, బిడ్డల జాతికి సంబంధం లేదక్కడ.

కొడుకులు కలిగేందుకు దశరథుడు పాయసం పంచితే, రాజపత్నులు సంతోషించారు. పాయసం తాగిన కౌసల్య, సుమిత్ర, కైకేయిలు గర్భాలను ధరించారు. ఆరు ఋతువుల తర్వాత, పన్నెండో నెలలో, చైత్ర మాసం, శుక్లపక్షం, నవమి తిథి నాడు, పునర్వసువు నక్షత్రంలో, అభిజిల్లగ్నం, కర్కాటక లగ్నంలో, చంద్రుడిని కూడిన బృహస్పతి కలిగిన ఉదయం (గురుడు కర్కాటకరాశిలో చంద్రుడితో చేరి వుండడం, చైత్రంలో సూర్యుడు మేషరాశిలో ప్రవేశించడం కూడా ఉచ్చస్థానాలే), సూర్యుడితో సహా ఐదు గ్రహాలు (అంగారక, సూర్య, గురు, శని, శుక్ర) వాటి–వాటి ఉచ్చ స్థలాల్లో (సూర్యుడికి మేషరాశి, గురువుకు కర్కాటకం, శనికి తుల, శుక్రుడికి మీన రాశి , అంగారకుడికి మకర రాశి ఉచ్చ స్థానాలు) వుండగా, కౌసల్యా దేవి జగత్ పాలకుడైన శ్రీమహావిష్ణువు యొక్క అర్థాంశమూర్తి రాముడిని కనింది. శ్రీరామావతారానికి ముఖ్యకారణం కౌసల్య తపః ప్రభావమేనని అనవచ్చు. ఆమె నవమీవ్రతాన్ని చేసినందువల్ల భగవంతుడు నవమి నాడు జన్మించాడు.

విశ్వామిత్రుడి యాగం పరిసమాప్తమైన తర్వాత, మిథిలకు తీసుకెళ్లాడు వారిని. అక్కడ శివ ధనస్సును గురించి వివరించాడు. విశ్వామిత్రుడి ఆదేశం ప్రకారం శ్రీరాముడు అవలీలగా జనక మహారాజు దగ్గరున్న శివ ధనుస్సు వింటిని అరచేత్తో పట్టుకొని, అల్లెతాటిని బిగువుగా లాగుతుంటేనే, విల్లు ఫెల్లుమని రెండుగా విరిగిపోతుంది. ఇది చూసిన జనకుడు, సీత దశరథ కుమారుడు శ్రీరామచంద్రుడిని భర్తగా పొందడంవల్ల తమ జనక కులానికి కీర్తి సంపాదించిపెట్టినట్లైందని అంటాడు విశ్వామిత్రుడితో. ''నా కూతురు వీర్య శుల్క అని నేను చేసిన ప్రతిజ్ఞ ఫలించింది. నేనన్న మాట ప్రకారం, నా ప్రాణంకంటే ప్రియమైన భూపుత్రి సీతను గొప్ప గుణాలున్న శ్రీరామచంద్రమూర్తికిచ్చి వివాహం చేస్తాను'' అని జనకుడు సీతను రాముడికి ధారాదత్తం చేసే ప్రయత్నం చేయగా, వివాహమాడడానికి తనకు తండ్రి ఆజ్ఞ లేదని అంటాడు రాముడు.

విశ్వామిత్రుడి ఆదేశం మేరకు, మిథిలకు రమ్మని ఆహ్వానిస్తూ, దశరథుడి దగ్గరకు దూతలను పంపాడు జనకుడు. దూతలు అందించిన వార్తను విన్న దశరథ మహారాజు వామదేవ, వశిష్ఠాదులను,

మంత్రులను పిలిపించి ''మన శ్రీరామచంద్రుడి బల పరాక్రమం చూసి, మెచ్చిన జనకుడు, తన కూతురునిచ్చి వివాహం చేయనున్నాడు. జనకుడు తలపెట్టిన కార్యం మీకు సమ్మతమైతే, ఆలస్యం చేయకుండా పయనమై పోదాం'' అనగా మంత్రులందరూ ఇది తగిన కార్యమేనని, మంచి సంబంధమేనని అన్నారు.

మర్నాడు దశరథుడు చతురంగ బలాలతో, వాసుదేవుడు, వశిష్టుడు, జాబాలి, కశ్యపుడు, మార్కండేయుడు, కాత్యాయనుడు లాంటి పెద్దలతో కలిసి బయలుదేరి ఐదవ రోజు పగటిపూట కల్లా విదేహనగరం చేరుకుంటాడు. ఆయన రాకను తెలుసుకున్న జనకుడు స్వాగతం పలికి, ''నా పుణ్యం మంచిదైనందున, సూర్య వంశపు రాజులతో వియ్య మాడే అవకాశం కలిగింది. మిక్కిలి బలవంతులైన మీతో బంధుత్వం కలుస్తున్నందువల్ల మా వంశం అతి పూజ్యమైంది'' అంటాడు. వివాహానికి సన్నాహాలు మొదలయ్యాయి. మర్నాడుదయం, జనకుడి ఆహ్వానాన్ని అందుకుని దశరథుడు ఋషులతో బంధువులతో కలిసి జనకుడున్న చోటికి పోయి, ఆయనకు వశిష్టుడిని చూపించి, ఇక్ష్వాకు వంశానికి ఆయన కులగురువనీ, తమ గురించి చెప్పాల్సిన విషయాలన్ని ఆయన చెప్తాడనీ అంటాడు.

జనకుడితో వశిష్టుడు సూర్యవంశక్రమాన్ని వివరించాడు. ''అవ్యక్తసంభవుడు, నిత్యుడు, అవ్యయుడైన చతుర్ముఖ బ్రహ్మకు మరీచి జన్మించాడు. మరీచికి కశ్యపుడు, ఆయనకు వివస్వంతుడు, ఆయనకు మనువు, ఆయనకు ఇక్ష్వాకుడు కలిగారు. ఇక్ష్వాకుడి రాజధాని అయోధ్య'' అంటూ మొదలుపెట్టి, చివరలో అంబరీషుడికి నహుషుడు, అతడికి యయాతి, అతడికి ఆభాగుడు, అతడికి అజుడు, అతడికి బలశాలైన దశరథుడు కొడుకులుగా పుట్టారు'' అని సూర్యవంశ క్రమాన్ని సవివరంగా తెలియచేశాడు. దశరథుడి కుమారులే శ్రీరామ లక్ష్మణులనీ, వీరి వంశం ఆదినుండి పరిశుద్ధమైందని, వీరందరు అసమాన ధర్మరతులు, వీరులనీ, సత్యమంటే ప్రీతికలవారనీ అంటూ, శ్రీరామచంద్రుడికి, లక్ష్మణుడికి సరితూగే గుణగణాలు గల తన ఇరువురు పుత్రికలను ప్రేమ పూర్వకంగా ఇచ్చి వివాహం చేయమని, ఇది తన మనవి అని కోరాడు జనకుడిని.

ఇక్ష్వాకుల వంశ క్రమం వివరించిన వశిష్టుడితో జనక మహారాజు తనవంశక్రమాన్ని కూడా వినిపించాడు. తమ వంశానికి పూర్వీకుడు ధర్మాత్ముడైన ''నిమి'' అనీ, అతడి కొడుకు మిథి అనే మహాత్ముడే ఈ మిథిలా పురాన్ని కట్టించాడనీ, ఆయనే మొదటి జనకుడనీ, ఆ పేరే తమ వంశంలో ''జనకుడు'' అని రాసాగిందనీ, అదే వంశ నామం అయిందనీ అంటాడు. మిథి కొడుకు దగ్గరనుంచి మొదలెట్టి, మహారోముడికి స్వర్ణరోముడు, అతడికి హ్రస్వరోముడు; హ్రస్వరోముడికి తను తన తమ్ముడు కుశధ్వజుడు కొడుకులమని వంశ క్రమాన్ని వివరించిన జనకుడు దశరథుడితో, ముమ్మాటికి తన ఇద్దరు కూతుళ్లను ఆయన ఇద్దరు కుమారుల కిస్తానని చెప్పాడు. మూడు రోజుల తర్వాత ఉత్తర ఫల్గుణి నక్షత్రం వస్తుందనీ, ఆ రోజున వివాహం చేద్దామనీ అంటాడు. ఉత్తర ఫల్గుణీ నక్షత్రం శ్రీరామచంద్రమూర్తికి శుభకరమే కాని సీతకు జన్మ నక్షత్రం. అయినా గాని, తిథి, వార, నక్షత్ర దోష శాస్త్రం ప్రకారం, అభిజిత్సర్వదోషఘ్నం అయినందున, ఆ లగ్నమే మంచిది. అదే నక్షత్రంలో మొదటి పాదం తర్వాత ఆమెది కన్యారాశి అయినందున, తృతీయ ఏకాదశ రూప నక్షత్ర కూట శుద్ధి కావడంతో నక్షత్ర దోషం

లేదు. అయినా, భార్యా–భర్తలిద్దరికి ఏక నాడి అయినందున వియోగ ప్రాప్తంటారు.

ఆ రాత్రి కొడుకులతో వినోదంగా గడిపి దశరథుడు, మర్నాడు ఉదయం తూర్పు తెల్లవారుతుండగానే, కాల కృత్యాలు తీర్చుకొని పెళ్లిజరిపించేందుకై ఏర్పాటుచేసిన ఉత్సవ శాలకు చేరుకున్నాడు. అందమైన ఆభరణాలను ధరించి, కంకణం కట్టుకొని, రామచంద్రమూర్తి మంచి ముహూర్తంలో తమ్ములతో కలిసి వచ్చాడక్కడకు. వశిష్టుడు, ఇతర మునీంద్రులు ముందుండి తమ వెంట వస్తుంటే అందరూ కలిసి లోపలికి వెళ్లారు. అలా ప్రవేశిస్తుండగానే వశిష్టుడు జనక రాజును చూసి, దాత కొరకు దశరథుడు వేచి వున్నాడని చెప్పాడు. ఇచ్చేవాడు, పుచ్చుకునేవాడు ఒకచోట వున్నప్పుడే తదుపరి తతంగం జరుగుతుందని అంటూ, ఆయన స్వధర్మమైన, దాత చేయాల్సిన కార్యమైన పెళ్లి జరిపించమని వశిష్టుడు జనకుడికి తెలియచేశాడు.

వశిష్టుడితో జనకుడు, ఇతర ఋశీష్వరులతో కలిసి త్రిలోకాభిరాముడైన రామచంద్రమూర్తికి శీఘ్రంగా, సంతోషంగా వివాహ సంబంధమైన కార్యాలన్నీ జరిపించమని అన్నాడు. అన్న మాట ప్రకారం సీతారాముల కల్యాణం వైభవంగా జరుగుతుంది. అదే రీతిలో సాంప్రదాయ బద్ధంగా ఈ కల్యాణాన్ని కడప, బధ్రాచలం లాంటి పుణ్య క్షేత్రాలతో సహా ముత్తారం లాంటి కుగ్రామాలలో కూడా ఘనంగా జరుపుకుంటున్నాం.

◆❖◆

ఆంధ్ర వాల్మీకి అద్భుత సృష్టి

వాల్మీకి సంస్కృత రామాయణాన్ని, యథా వాల్మీకంగా పూర్వ కాండలతో సహా ఉత్తర కాండను కూడా తెనిగించిన ఏకైక మహానుభావుడు ఆంధ్ర వాల్మీకి, కవి సార్వభౌమ వావిలికొలను సుబ్బారావు. ఆయన సొంత, స్వతంత్ర రచన అనిపించుకున్న శ్రీ మదాంధ్ర వాల్మీకి రామాయణం తెలుగునేల నాలుగు చెరగులా విశేష ప్రాచుర్యాన్ని ఏనాడో సంతరించుకుంది. ఇరవై నాలుగు గాయత్రీ మంత్రాక్షరాలలో నిబంధించబడిన మంత్ర మంజూష వాల్మీకి మహర్షి రచించిన శ్రీమద్రామాయణం. మహా మహానుభావులూ, మహా విద్వాంసులూ కీర్తి శేషులు శ్రీమాన్ వావిలికొలను సుబ్బారావు వాల్మీకి రామాయణాన్ని యధాతథంగా మంత్రమయం చేస్తూ, ఛందో యతులను ఆయా స్థానాలలో నిలిపి, వాల్మీకాన్ని తెనిగించారు. వాల్మీకి రామాయణానికి తుల్యమైన స్థాయినీ, పారమ్యాన్నీ, తొలుత నిర్వచనంగా ఆంధ్ర వాల్మీకి రామాయణానికి అందించి, తదనంతరం, "మందరం" అని దానికి విశేష ప్రాచుర్యాన్ని కలిగించారు.

గ్రంథకర్త అభిప్రాయాలు అక్షర లక్షలు చేసే ఆణిముత్యాలు. ఆయన మాటల్లోనే, ఆ విషయాలు కొన్ని:

శ్రీ రామాయణం, భారతం, భాగవతం అద్వితీయమైన గీర్వాణ భాషా గ్రంథాలు. ఈ మూడింటి లో ఆద్యమైంది శ్రీ రామాయణ కావ్యం. కావ్యాలలోకెల్లా ప్రధమంగా ఉత్పన్నమైంది కావడంతో ఆదికావ్యమైంది. "శ్రీ రామాయణం" అంటే, లక్ష్మీరమణుడైన శ్రీమన్నారాయణుడి మాయా మానుషావతారమైన శ్రీరామ చరిత్రనీ, శ్రీ లక్ష్మీదేవి అవతారమైన సీతాదేవి చరిత్రనీ అర్థం. రాముడి చర్యల ద్వారా, రాముడి వాక్కుల ద్వారా తాను చెప్పదల్చుకున్న దాన్ని సిద్ధాంతీకరించాడు వాల్మీకి. శ్రీ రామాయణం మహాకావ్యం. పుట్టుకతోనే కాకుండా గుణంలో కూడ అదే మొదటిది. దానిలోని గుణాలు, రహస్యాలు తెలుసుకోవాలంటే వాల్మీకికి గాని, సర్వజ్ఞుడికి గాని మాత్రమే సాధ్యమవుతుంది. శ్రీమద్రామాయణంలో ఉత్తమోత్తమ మహాకావ్య లక్షణాలెన్నో వున్నాయి. వర్ణనలెన్నో వున్నాయి. శృంగారం లాంటి నవ రసాలున్నాయి. వాల్మీకి శ్లోకాల (ఆంధ్ర వాల్మీకి పద్యాల) భావం మాత్రమే

కాకుండా, అందులోని కొన్ని పదాలు ఎంత అర్థ గాంభీర్యం గలవిగా, రసవంతంగా వుంటాయో చెప్పలేం.

అలంకార శాస్త్రంలో ఎన్ని అలంకారాలు చెప్పబడ్డాయో, అవన్నీ వాల్మీకి (ఆంధ్ర వాల్మీకి) రామాయణంలో వున్నాయి. వాల్మీకి అసమాన కవితా చాతురి వర్ణనాతీతం. రామాయణంలోని పాత్రలు, పాత్రధారుల వాక్కులు, ఆయా పాత్రల చిత్త వృత్తి గుణాలను తెలియచేసేవిగా, సందర్భోచితంగా, వారున్న అప్పటి స్థితికి అర్థమైనవిగా వుంటాయి. పాత్ర గుణ మహాత్మ్యానికి అసంగతమైన వాక్యాలు ఆయా పాత్రల నోటినుంచి వెలువడవు. శ్రీరాముడు భగవంతుడన్న అభిప్రాయం వాల్మీకి పదే పదే చెప్పుకుంటూ పోయాడు రామాయణంలో. వాల్మీకి రామాయణమనే ''కలశార్ణవం'' లో రత్నాలను వెదికేవారు, మొట్టమొదటగా తెలుసుకోవాల్సింది వాల్మీకి శైలి, విధానం. అది తెలుసుకోలేక వెతకడం మొదలుపెట్టితే, చీకట్లో తారాడినట్లే.

వాల్మీకి (ఆంధ్ర వాల్మీకి) రామాయణం ''ధ్వని కావ్యం''. కావ్యానికి ప్రధానమైంది ధ్వని. కావ్యానికి ప్రాణం ధ్వని. ధ్వని లేని కావ్యం శవంతో సమానం. రామాయణంలో ధ్వని విశేషంగా వుంది. కావ్యమంతా ధ్వన్యర్థం వుండడమే కాకుండా, పలు శ్లోకాలకు విడిగా ధ్వన్యర్థం వుంది. వాల్మీకి రామాయణంలో, సాధారణంగా, సర్గ మొదట్లో – చివర్లో, మొదలు చెప్పిన కథనే సంగ్రహంగా తిరిగి చెప్పడం జరిగింది. శ్రీ రామాయణంలోని కవితా చమత్కృతిని విశదీకరించాలంటే, ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. ఇంతెందుకు! కాళిదాసు, భవభూతి అంత గొప్ప వాళ్లు కావడానికి రామాయణమే కారణం. ఒక్క ఏరునో, నదినో చూసిన మాత్రాన అదెంత గొప్పగా వుందో అనుకుంటాం. అలానే కాళిదాసు లాంటి వారిని గొప్ప కవులంటాం. అలాంటప్పుడు అన్ని నదులకు ఆధారమైన సముద్రాన్ని ఏమనాలి? అలానే, కాళిదాసాదులకు జీవనదమైన రామాయణాన్ని ఏమని వర్ణించాలి? వాల్మీకి రామాయణం నుంచి కాళిదాసు లాంటి వారు గ్రహించినవి ఎన్నో వున్నాయి. వేదవ్యాసుడంతటి వాడు వాల్మీకి శ్లోకాలను అనువదించగా లేంది, వేరేవారి సంగతి చెప్పాలా !

శ్రీమద్రామాయణం గొప్ప ధర్మ శాస్త్రం. ఇందులో సర్వ విధాలైన, అన్ని రకాల ధర్మాల గురించి వివరంగా చెప్పబడింది. కథా సందర్భాను సారంగా, అంతరాంతరాలలో ఎన్నో నీతులు చెప్పబడ్డాయి. రామాయణంలో సూక్ష్మంగా చెప్పబడిన ధర్మాలను, కథలు, కథలుగా కల్పించి వ్యాస భగవానుడు ఇంతకు నాలుగింతలు గ్రంథాన్ని తయారు చేశాడు. భగవద్గీతంతా కూడా రామాయణ సారమేనని గ్రహించాలి.

శ్రీమద్వాల్మీకి రామాయణం మంత్రనిధానం. ఇందులో అనేకానేక మంత్రాలు ఉద్ధరించబడి వున్నాయి. రామాయణమంతా గాయత్రీ స్వరూపమే. గాయత్రిలోని 24 అక్షరాలను, ప్రతి వేయి శ్లోకాలకు ఒక అక్షరం చొప్పున శ్లోకం ఆరంభంలో చెప్పబడింది. వాల్మీకి రచించిన 24,000 శ్లోకాలలో, యజుర్వేదంలోని 1,29,290 పదాలే కాకుండా, ఋగ్వేదం, సామవేదం, అధర్వ వేదాలలోని పదాలు కూడా అనులోమ–విలోమంగా కూర్చబడిందన్న రహస్యం తెలుసుకోవచ్చు. ఏడు కాండలలో ఏడు వ్యాహృతులు వివరించడం జరిగింది. ఈ గాయత్రీ విధానాన్ని నారదుడే స్వయంగా వాల్మీకి మహర్షికి,

రామాయణంతో పాటే ఉపదేశించాడు.

''తప స్స్వాధ్యాయ నిరతం, తపస్వీ వాగ్విదాంవరమ్, నారదం పరిపప్రచ్ఛ, వాల్మీకిర్మునిపుంగవమ్''

అని గాయత్రిలోని మొదటి అక్షరంతో శ్లోకాన్ని ప్రారంభించి, "జనశ్చ శూద్రోపి మహత్త్వ మీయాత్'' అని గాయత్రి కడపటి అక్షరంతో సర్గను ముగించాడు వాల్మీకి. అంధ్ర వాల్మీకంలో, మూలంలో వున్నట్లు '' తపమున స్వాధ్యాయంబున, నిపుణుని... ..... తమి గావించెన్" అన్న పద్యంతో ప్రారంభించి, "యథావిధి విన్న బఠింప నారయన్'' అని ముగించబడింది. కామ్యార్థమైనా, మోక్షార్థమైనా, రామాయణం పారాయణం చేసినవారి కోరికలు నెరవేర్చే శక్తి, రామాయణానికి వుండడానికి కారణం, అది భగవత్ కథ కావడానికి అదనంగా సర్వజ్ఞుడైన వాల్మీకి (ఆంధ్ర వాల్మీకి) కూర్చిన బీజాక్షరాల మహాత్మ్యమే.

శ్రీరాముడు సామాన్య ధర్మాలన్నీ ఎలా అనుష్టించింది, కష్ట కాలంలో ఎలా ప్రవర్తించింది, సుఖ కాలంలో ఎలా నడచుకుంది, ఎలాంటెలాంటి వారి మీద ఏ విధమైన అభిప్రాయంతో మెలిగేవాడనేదీ, వీటి కారణాలేంటి అన్న విషయాలన్నీ చర్చించాల్సినవే. రామాయణ గ్రంథమేమో చాలా గొప్పది. రాసిన కవేమో బ్రహ్మర్షి. ఇందులోని మర్మాలేమో మెండుగా వున్నాయి. రాసిందేమో సంస్కృత భాషలో. చదివినా కొద్దీ విశేషాలు కనిపిస్తాయి. శ్రీమద్రామాయణం వేదంతో సమానమైందే కాకుండా వేదమే అనాలి. వేదమే అయినప్పుడు, వేదంతో సమానమైందని ఎలా అనవచ్చునంటే, వేదంలోని వర్ణాలనే, అనులోమ, విలోమాలుగా మార్చి, వేద ప్రసిద్ధమైన రామ కథను చెప్పడంవల్ల ఇది వేదమే అయింది. వేదాల్లోని అర్థాలున్నందువల్ల వేదంతో సమానమైంది. అందువల్లనే, వేద పఠనం అవశ్యంగా చేయాల్సిన కార్యక్రమాల్లో, రామాయణ పఠనం నియమితమైంది. ఎవరికైనా సత్కవి కావాలని కోరికుంటే, వారు వాల్మీకి రామాయణాన్ని అనేక పర్యాయాలు, శ్రద్ధగా–భక్తితో పఠించాల్సిందే.

◆❖◆

రాముడు బ్రహ్మ జ్ఞాన సంపన్నుడు

రాముడు లోకోత్తరుడు. ఆయనలో వున్న మంచి గుణాలు ఎవరిలోనూ కనిపించవు. అటువంటి వ్యక్తి చరిత్రే రామాయణం. వాల్మీకిని రామాయణం రాయమని ప్రోత్సహించడానికి వస్తాడు నారదుడు. అలావచ్చిననారదుడిని, "గుణవంతుడు, అతివీర్యవంతుడు, ధర్మజ్ఞుడు, కృతజ్ఞుడు, సత్యశీలుడు, సమర్థుడు, నిశ్చలసంకల్పుడు, సదాచారంమీరనివాడు, సమస్త ప్రాణులకు మేలు చేయాలన్న కోరికున్నవాడు, విద్వాంసుడు, ప్రియదర్శనుడు, ఆత్మవంతుడు, కోపాన్ని స్వాధీనంలో వుంచుకున్నవాడు, ఆశ్చర్యకరమైన కాంతిగల వాడు, అసూయ లేనివాడు, రణరంగంలో దేవదానవులను గడ–గడలాడించ గలవాడు ఎవరైనా వున్నారా ఈ భూలోకంలో?" అని పదహారు ప్రశ్నలు వేస్తాడు వాల్మీకి. నారదుడు ఆ ప్రశ్నలకు సమాధానం చెప్తాడు.

చైత్ర మాసం, శుక్లపక్షం–నవమి తిథి నాడు, పునర్వసువు నక్షత్రంలో, అభిజిల్లగ్నం–కర్కాటక లగ్నంలో, చంద్రుడిని కూడిన బృహస్పతి కలిగిన ఉదయం రామ జననం అయింది. ఆ ఉదయం (గురుడు కర్కాటకరాశిలో చంద్రుడితో చేరి వుండడం, చైత్రంలో సూర్యుడు మేషరాశిలో ప్రవేశించడం కూడా ఉచ్ఛస్తానాలే), సూర్యుడితో సహా ఐదు గ్రహాలు (అంగారక, సూర్య, గురు, శని, శుక్ర) వాటి, వాటి ఉచ్ఛ స్థలాల్లో (సూర్యుడికి మేషరాశి, గురువుకు కర్కాటకం, శనికి తుల, శుక్రుడికి మీన రాశి, అంగారకుడికి మకర రాశి ఉచ్ఛ స్థానాలు) వుండగా, కౌసల్యా దేవి జగత్ పాలకుడైన శ్రీమహావిష్ణువు యొక్క అర్థాంశమూర్తి రాముడిని కనింది. శ్రీరామావతారానికి ముఖ్యకారణం కౌసల్య తపః ప్రభావమేనని అనవచ్చు. ఆమె నవమీవ్రతాన్ని చేసినందువల్ల భగవంతుడు నవమి నాడు జన్మించాడు.

సౌమ్య నామ సంవత్సరం, మాఖ బహుళంలో శ్రీరామ లక్ష్మణులను విశ్వామిత్రుడు తనవెంట యాగరక్షణకు తీసుకెళ్తాడు. 27వ రోజు, అంటే, శుక్ల త్రయోదశి, ఉత్తర ఫల్గుణీ నక్షత్రంలో సీతా కల్యాణం జరిగింది. వివాహం జరిగింది నవమి నాడు కాదు. మరి ఆ 27వ రోజు, నవమి అని ఎక్కడా చెప్పడం జరగలేదు. ఎందుకు మనవాళ్లందరూ వివాహం జరిగిన తిథి నాడు కాకుండా శ్రీరామనవమి

నాడు సీతారాముల కల్యాణం జరుపుతున్నారో సామాన్యులకు అర్థంకాదు, అర్థం చేసుకొని అడగాలని కూడా ఎవరూ అనుకోరు.

వాల్మీకి శ్లాఘించిన గుణాలు అసమానమైనవి. ఒక్కో గుణంలో అంతర్లీనంగా ఇంకొన్ని వుండడంతో అవి అనేకమయ్యాయి. మనుష్యమాత్రులందు ఇవి కనపడవు. ఇట్టి సుగుణ సంపత్తికలవాడు, ఇక్ష్వాకుల మహారాజు వంశంలో, రామచంద్రమూర్తి అనే పేరుగలాయన మాత్రమే. అతి వీర్యవంతుడాయన. అసమానమైన, వివిధమైన, విచిత్రమైన శక్తి గలవాడు. స్వయంగా ప్రకాశించగలడు. అతిశయం లేని ఆనందంగలవాడు. ఇంద్రియాలను, సకల భూతాలను వశపర్చుకున్నాడు. సర్వం తెలిసినవాడు. నీతే ప్రధానం ఆయనకు. పరులకు హితమైన, ప్రియమైన మాటలు చెప్తాడు. ఎవరిపై శత్రు భావం లేకపోయినా, తనను ఆశ్రయించిన వారిని ద్వేషిస్తే, వారిని నాశనం చేసే వాడు.

ఆశ్రితులు అనుభవించేందుకు అనువైన, యోగ్యమైన దివ్య మంగళ విగ్రహానికి తోడు, ఆశ్రితులను రక్షించేందుకు అనువైన గుణాలు కూడా వున్నాయి. శ్రీరామచంద్రుడు ప్రశస్తమైన ధర్మజ్ఞానంగలవాడు. క్షత్రియులకు ప్రశస్త ధర్మమైన శరణాగత రక్షణను ముఖ్య వ్రతంగా ఆచరించేవాడు. చేసిన ప్రతిజ్ఞ తప్పనివాడు. సమస్త భూ జనులకు మేలైన కార్యాలనే చేసేందుకు ఆసక్తి చూపేవాడు. దానధర్మాలు, స్వాశ్రితరక్షణ వల్ల లభించిన యశస్సు, శత్రువులను అణచినందున వచ్చిన కీర్తిగలవాడు. సర్వ విషయాలు తెలిసినవాడు. బ్రహ్మ జ్ఞాన సంపన్నుడు. మిక్కిలి పరిశుద్ధుడు. ఋజుస్వభావం గలవాడు. ఆశ్రిత రక్షకుడు. ఆత్మతత్వం ఎరిగినవాడు. ఆశ్రితులకు, మాత, పిత, ఆచార్యులకు, వృద్ధులకు వశ పడినవాడు. విష్ణువుతో సమానుడు. శ్రీమంతుడు.లోకాలను పాలించ సమర్థుడు. ఆశ్రిత శత్రువులను, తన శత్రువులనూ అణచగలిగినవాడు.

ఎల్ల ప్రాణికోటిని రక్షించాలన్న కోరికున్నవాడు. ధర్మాన్ని తానాచరిస్తూ, ఇతరులతో ఆచరింపచేసేవాడు. స్వధర్మ పరిపాలకుడు. స్వజనరక్షకుడు. వేద వేదాంగాలను రహస్యార్థాలతో ఎరిగినవాడు. కోదండ దీక్షాపరుడు. సర్వ శాస్త్రాల అర్థాన్ని నిర్ణయించగల నేర్పరి. జ్ఞాపకశక్తిగలవాడు. విశేషప్రతిభగలవాడు. సమస్త ప్రపంచానికి ప్రియం చేసేవాడు. సాధువు. గంభీర ప్రకృతిగలవాడు. అన్ని విషయాలను చక్కగా బోధించగలవాడు. నదులన్నీ సముద్రానికి పారినట్లే ఎల్లప్పుడూ ఆర్యుల పొందుగోరేవాడు. అందరిమీద సమానంగా ఎప్పుడూ, ఏకవిధంగా, మనోహరంగా దర్శనమిచ్చేవాడు. సమస్తభూతకోటికిపూజ్యుడు. అన్నింటా గుణ శ్రేష్ఠుడు. కౌసల్యా నందనుడని పేరు తెచ్చుకున్నాడు. గాంభీర్యంలో సముద్రుడంతటివాడు. ధైర్యంలో హిమవత్పర్వత సమానుడు. వీర్యాధిక్యంలో విష్ణు సమానుడు. చంద్రుడిలా చూసేందుకు ప్రియమైన వాడు. కోపంలో ప్రళయకాలాగ్ని. ఓర్పులో భూదేవంతటివాడు. దానంలో కుబేరుడు. అసమాన సత్యసంధుడు. ధర్మానికి మారుపేరు. ఇటువంటి పురుషోత్తముడికి సరితూగేవారు లోకంలో ఎవరూ లేరు.

పంపా తీరంలోని వనంలో హనుమంతుడిని చూసి, ఆయన మాటపై గౌరవం వుంచి, సుగ్రీవుడితో స్నేహంచేసాడు రాముడు. తనకథ, సీత వృత్తాంతం మొత్తం ఆయనకు చెప్పాడు. చెప్పిన తర్వాత, సుగ్రీవుడు రాముడితో అగ్ని సాక్షిగా స్నేహితులయ్యారు. రాముడు వానరుడితో స్నేహం చేశాడంటే అది

అతడి సౌశీల్యాతిశయం గురించి చెప్పడమే. గుహుడితో స్నేహం చేసినందువల్ల రాముడి సౌశీల్యం చెప్పడం జరిగింది. శబరితో స్నేహం చేయడంవల్ల రాముడు మిక్కిలి సౌశీల్యవంతుడయ్యాడు. వానరుడైన సుగ్రీవుడితో స్నేహమంటే మీదుమిక్కిలి సౌశీల్యం చూపడం జరిగింది.

శ్రీరామరాజ్యంలో సాదువులు చేసే శ్రీరామ సేవకు విరోధమైన మనోవేదనలుకాని, రోగబాధలుకాని, యీతిబాధలుకాని లేవు. పుత్రశోకం ఏ తల్లితండ్రులకు కలగలేదు. స్త్రీలు పాతివ్రత్యాన్ని విడవలేదు. వారికి వైధవ్య దుఃఖం లేదు. ఎక్కడా అగ్నిభయంలేదు. శ్రీ రామరాజ్యంలో నీళ్లలో పడి చనిపోయినవారు లేరు. పెద్దగాడ్పులతో ప్రజలు పీడించబడలేదు. దొంగలు లేరు. ఆకలికి, జ్వరానికి తపించినవారు లేరు. నగరాలలో, గ్రామాలలో, నివసించే జనులు ధన-ధాన్యాలు విస్తారంగా కలిగి, భోగభాగ్యాలతో కృతయుగంలో లాగా మిక్కిలి సుఖమనుభవించారు. శ్రీరాముడు అనేక అశ్వమేధ యాగాలను, యజ్ఞాలను చేసి, బ్రాహ్మణులకు లెక్కపెట్ట లేనన్ని ఆవులను, ధనాన్ని దానమిచ్చి, తన సుఖాన్ని వదులు కోనైనా ప్రజలకు సుఖం కలిగేటట్లు ధర్మ పద్ధతిలో రాజ్యపాలన గావించి, వైకుంఠ లోకానికి పోయాడు. శ్రీరామచంద్రమూర్తి, రాజ్య హీనులై నానా దేశాలలో తిరుగుతున్న పూర్వ రాజుల వంశాల వారిని పిలిపించి, వారి పెద్దల రాజ్యాన్ని వారికిచ్చి, వారంతా స్వధర్మాన్ని వీడకుండా కాపాడాడు. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులనే నాలుగు వర్ణాల వారిని చక్కగా పరిపాలించాడు. స్వధర్మానుష్ఠానమే మోక్షకారణమనీ, పరధర్మానుష్ఠానం పతనకారణమనీ తెలియచేశాడు. పదకొండువేల సంవత్సరాలు ఇలా రాజ్యాన్ని పాలించి విష్ణు లోకానికి చేరుకుంటాడు శ్రీరామచంద్రమూర్తి.

రామాయణం పరిశుద్ధంగా చదివేవారికి, వినేవారికి మూడు విధాలైన సమస్త పాపాలు హరించి పోయి, ఏమాత్రం ఆలస్యం లేకుండా మోక్ష ఫలం కలుగుతుంది. అంతశక్తి దీనికుండటానికి కారణం, ఇది వేద స్వరూపమై, వేదార్థాన్నే బోధిస్తుంది కాబట్టి. అంతేకాదు, సంసార సాగరాన్ని తరింపచేస్తుంది కూడా. ఇది వినేవారు, చదివేవారు, అంతమాత్రాన సన్యాసులు కానవసరం లేదు. ఆయుస్సు పెరిగి, కొడుకులు, కూతుళ్లతో, మనుమలు, ఇష్ట బంధువులతో అనుభవించి, మరణించిన తర్వాత మోక్షాన్ని, బ్రహ్మానందాన్ని కలిగిస్తుంది. పరిమితి చెప్పనలవికాని మహత్త్వమున్న యీ రామాయణ గ్రంథాన్ని శాస్త్ర ప్రకారం చదివినా, ఇతరులు చదవగా విన్నా, అర్థ విచారం చేసినా, బ్రాహ్మణుడికి వేద వేదాంగాలు అధ్యయనం చేస్తే ఎలాంటి ఫలం కలుగుతుందో అలాంటిదే కలుగుతుంది. క్షత్రియుడికి సర్వాధిపత్యం కలుగుతుంది. వైశ్యుడికి వ్యాపార లాభం కలుగుతుంది. శూద్రుడికి అపారమైన గొప్పతనం లభిస్తుంది. కాబట్టి నాలుగువర్ణాలవారు, స్త్రీ-పురుషులు, దీన్ని చదవాలి-వినాలి. విషయ చింతన చేయాలి. వినేవారుంటే చదివి వినిపించాలి. చదివేవారుంటే వినాలి. ఈ రెండూ జరగని కాలముంటే, విన్నదానిని-కన్నదానిని, విశేషంగా మననం చేయాలి. ఏదోవిధంగా మనస్సు దీనిపై నిలపాలి.

◆❖◆

వాల్మీకి, మార్క్స్ – మానవత

సాహిత్యానికీ, మానవ విలువలకూ; ఛాందసత్వానికీ, కమ్యూనిజానికీ; గతితార్కిక భౌతిక వాదానికీ, కర్మ సిద్ధాంతానికీ ఏదో ఒకరకమైన, అనిర్వచనీయమైన, విడదీయరాని అనుబంధం వుంది. హిందూత్వం మనిషి జీవించడానికి తగినటువంటి ఆదర్శమైన జీవనవిధానం. ఆధునిక ప్రపంచంలో మానవ విలువలకు నూటికి నూరుపాళ్లు అద్దంపట్టిన అతి గొప్ప సిద్ధాంతం ''మార్క్సిజం–కమ్యూనిజం''. కర్మ సిద్ధాంతం ప్రకారం, ఈ సకల చరాచర ప్రపంచమంతటికీ, భూతకాలంలో జరిగిన దానికీ, వర్తమానంలో జరుగుతున్న దానికీ, భవిష్యత్ లో జరగబోయే దానికీ, కర్త, కర్మ, క్రియ ఒక్కరే. ఏ పనిని, ఎప్పుడు, ఎలా, ఎవరి ద్వారా జరిపించాలో, జరిగినదాని పర్యవసానం ఏమిటో, లాభ నష్టాలేంటోనన్న విషయాలను నిర్ధారించే అధికారం ఆ ఒక్కరికే వుంది.

సృష్టించేది బ్రహ్మ అనీ, సంహరించేది రుద్రుడనీ, కాపాడేది విష్ణుమూర్తనీ అంటారు. అది పూర్తిగా నిజం కాదేమో! అనంతకోటి బ్రహ్మాండానికి 'పరబ్రహ్మం' ఒక్కరే. ఆ ఒక్కరే సృష్టికి ఒక (బ్రహ్మ) అధికారిని, సంహారానికి (రుద్రుడు) ఒక అధికారిని నియమించాడు. బ్రహ్మ, రుద్రులు నిమిత్తమాత్రులే. అంటే, ఎవరో ఒక ''జగన్నాటక సూత్రధారి'' స్వయంగా రచించి, నిర్మించి, దర్శకత్వం వహించిన ఒక అద్భుతమైన నాటకంలో, సకల చరాచర ప్రపంచంలోని జీవ, నిర్జీవ రాసులన్నీ తమకు అప్పచెప్పిన పాత్ర పోషించాయి. ఆ ఒక్కరు ఎవరికి ఏ పాత్ర ఇస్తే, దాన్ని వారు ఆయన దర్శకత్వం మేరకే పోషించి, ఆగమన్నప్పుడు ఆగి, జీవితం చాలించాలి. ఆ తర్వాత ఏంజరుగుతుందనేది మళ్లీ ఆయన నిర్ణయానికే వదలాలి.

నిశితంగా పరిశీలిస్తే, కార్ల్ మార్క్స్ నిర్ధారితవాద సిద్ధాంతంలో ఇలాంటి అంశాలే కనిపిస్తాయి. ఆయన కలలు కన్న కార్మిక రాజ్య స్థాపన పూర్వ రంగంలో ''నిరంకుశ, భూస్వామ్య, ధన స్వామ్య వ్యవస్థ'' కు వ్యతిరేకంగా శ్రామికవర్గం పోరాడుతుందని, దరిమిలా విజయం సాధిస్తుందనీ, ముందున్న వ్యవస్థ కూలిపోతుందని, శ్రామికవర్గ నియంతృత్వం స్థాపించబడుతుందని, కుల, మత, వర్గ, పేద,

ధనిక తేడాలు సమసిపోతాయని మార్క్స్ జోస్యం చెప్పాడు. హిందూత్వ కర్మసిద్ధాంతంలోమాదిరిగానే, జరిగినదానిని (భూతకాలం) విశ్లేషించి, జరుగుతన్నదానిని (వర్తమానకాలం) వ్యతిరేకించి, జరగాల్సినదాన్ని (భవిష్యత్కాలం) ముందుగానే నిర్ణయించాడు. తన సిద్ధాంత ధోరణైన గతితార్కిక భౌతిక వాదాన్ని ''యాంటీ థీసిస్, థీసిస్, సింథసిస్'' అనిపిలిచాడు. ఒకరకమైన ''కర్త, కర్మ, క్రియ'' అనవచ్చమో. ఈ సిద్ధాంత సృష్టికర్త కార్ల్ మార్క్స్.

వేళ్లూనుకున్న వ్యవస్థకు వ్యతిరేకంగా జరుగుతుందని భావించిన వర్గపోరాటంలో, ఎవరి పాత్ర ఏమిటో ఆయనే నిర్ధారించాడు. పాత్రను పోషించే విధానం కూడా ఆయనే వివరించాడు. కార్మిక, కర్షక రాజ్య స్థాపన తదనంతర పరిణామాలెలా వుండాలో, వుండబోతాయో కూడా ఆయనే నిర్ణయించాడు. ఆరంభం, అంతం అంతా కర్మ సిద్ధాంతంలో మాదిరిగానే, నిర్ణయించిన విధంగానే జరుగుతుందని తన సిద్ధాంతంలో చెప్పాడు. ఆయన చెప్పినట్లే చాలావరకు జరిగిందికూడా.

కార్ల్ మార్క్స్ లాంటి మహా మహానుభావులు, ఆలోచనాపరులు, అవనిలో అరుదుగా అవతరిస్తుంటారు. పెట్టుబడిదారీ ధన స్వామ్య, భూస్వామ్య వ్యవస్థ అనుసరించే దోపిడీ విధానాన్ని, వక్రమార్గంలో అది అభివృద్ధి చెందడాన్ని అన్ని కోణాల్లోంచి విశ్లేషణ చేసేందుకు, పరిణామక్రమంలో శ్రామికవర్గ నియంతృత్వం స్థాపించబడి, ఒకనాటి దోపిడీ వ్యవస్థే సామ్యవాద వ్యవస్థగా మార్పు చెందనున్నదని చెప్పేందుకు కార్ల్ మార్క్స్ తన కమ్యూనిస్ట్ సాహిత్యంలో ప్రాధాన్యమిచ్చాడు. ఆయన రాసిన ప్రతి అక్షరంలో మానవతా విలువలే ప్రతిబింబిస్తాయి. ఏ విధమైన పరిస్థితులుంటే మానవాభివృద్ధి సుసాధ్యమవుతుందన్న అంశాన్ని అందరికీ విశద పర్చాలన్న ఆతృత, ఆందోళన మార్క్స్ రచనల్లో, సాహిత్యంలో అణువణువునా దర్శనమిస్తుంది. ప్రతివ్యక్తి స్వేచ్ఛగా అభివృద్ధి చెందడంలోనే, ఇతర వ్యక్తులందరి అభివృద్ధి సాధ్యపడి, తద్వారా సామాజికాభివృద్ధి జరిగేందుకు వీలవుతుందని, ఆ ప్రక్రియను వేగవంతం చేయాలనీ మార్క్స్ భావిస్తాడు. హేతుబద్ధ ప్రణాళిక, సహకార ఉత్పత్తి, పంపిణీలో సమాన వాటాల ఆధారంగా, అన్నిరకాల రాజకీయ, సామాజిక, ఉద్యోగ స్వామ్య అధికార క్రమానికి దూరంగా వుండే, ప్రజాస్వామ్య, లౌకిక వ్యవస్థ ఏర్పాటై తీరుతుందని మార్క్స్ నిర్ధారిత వాదం సిద్ధాంతంలో పేర్కొంటాడు. మార్క్స్ జీవించిన రోజుల నాటి ప్రపంచంలో, ఆ మాటకొస్తే ఇప్పటికీ, ఎప్పటికీ, మన చుట్టూ జరుగుతున్న వాస్తవాలకు, యదార్థ సంఘటనలకు అద్దంపట్టే తాత్త్విక–సామాజిక మార్గమే ఆయన ప్రవచించిన గతి తార్కిక భౌతికవాదం.

ఆ సిద్ధాంతాన్ని అన్వయిస్తూ, మానవ విలువలను, మానవాళి చరిత్రను మార్క్సిజం విశదీకరించే ప్రయత్నం చేసింది. మనుషుల మానసిక, ఆధ్యాత్మిక జీవనశైలి, ఆలోచనా సరళి, జీవిత లక్ష్యం, గమనం వారి–వారి మనుగడకు, సహజీవనానికి అవసరమైన భౌతిక పరిస్థితులపైనే ఆధారపడి వుంటాయి. మానవుడు తను బ్రతకడానికి అవసరమైన వాటిని ఉత్పత్తి చేసుకునేందుకు, ఎవరెవరితో, ఎటువంటి సంబంధ బాంధవ్యాలు ఏర్పాటు చేసుకోవాలనే దానిపైనే సమాజంలో వర్గాలు ఏర్పడతాయి. వీటికి అనుకూలమైన ఆర్థిక ప్రాతిపదికపైనే, సామాజిక, రాజకీయ సంస్థలకు, వ్యవస్థలకు అనుకూలమైన ఆలోచనల నిర్మాణ స్వరూపం ఏర్పాటవుతుంది. అందువల్లే వర్గపోరాటాల చరిత్రే సామాజిక

చరిత్రంటాడు మార్క్స్. ఒక మజిలీ, లేదా దశ నుండి, దానికి పూర్తిగా విరుద్ధమైన వ్యతిరేక మజిలీకి, దశకు చరిత్ర పయనించి, సంశ్లేషణ దశలో ఉన్నత స్థాయికి చేరుకున్నప్పుడే శ్రామిక రాజ్య ఆధారితమైన వ్యవస్థ ఏర్పాటవుతుంది. సమాజంలోని వైరుధ్యాలే సంఘర్షణలకు దారితీసి, ప్రజా వ్యతిరేక వ్యవస్థను కూల దోసి, శ్రామిక రాజ్యస్థాపన ద్వారా వర్గ భేదాలు లేని సమసమాజ వ్యవస్థ ఏర్పాటవుతుందని మార్క్సిజం చెప్తుంది.

మార్క్స్ ప్రవచనాలకు, తదనుగుణంగా సంభవించిన సోవియట్ రష్యా, చైనా విప్లవానికి, శ్రామిక రాజ్య స్థాపన జరగడానికి వేలాది సంవత్సరాల పూర్వమే, వాల్మీకి మహర్షి సంస్కృతంలో రామాయణం రచించాడు. వాల్మీకి రచించిన రామాయణం సృష్టికర్తైన బ్రహ్మ ప్రేరణతోనే జరిగింది, అంటే జగన్నాటక సూత్రధారి అనుమతితోనే కదా. రామాయణంలోని పాత్రలను, చేయబోయే పనులను ముందుగానే యోగదృష్టితో కనిపెట్టాడు వాల్మీకి. శ్రీరామచంద్రమూర్తిని దైవంగా, మహావిష్ణువు అంశగా, జరగబోయే దాన్ని వివరంగా, రామాయణ గాథగా లోకానికి తెలియచెప్పాడు. శ్రీరామచంద్రమూర్తి త్రేతాయుగంలో జన్మించి, దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ చేసి, ధర్మ సంస్థాపన చేసేందుకు అవతరించాడని తెలియచేసేదే రామాయణ కథ. శ్రీమహావిష్ణువుకు అత్యంత ఆప్తుడిగా, భక్తుడిగా, కాపలాదారుడిగా వుండే వ్యక్తి దైవానుగ్రహానికి గురై, శ్రీరాముడికి శత్రువుగా, రావణాసురుడనే రాక్షసుడిగా పుట్టబోతున్నాడని ముందే ఊహించి రాసాడు వాల్మీకి.

మార్క్స్ గతితార్కిక, నిర్ధారిత సిద్ధాంతంలో పేర్లు లేకపోయినా, రష్యా-చైనాలో జరిగిన విప్లవాలకు నాయకత్వం వహించిన లెనిన్, మావోలు మార్క్స్ పరిభాషలోని శ్రీరామచంద్రుడిలాంటివారే. రష్యా నిరంకుశ రాజు జార్ చక్రవర్తి, చైనా చాంగ్-కై-షెక్ లు రావణాసురుడిలాంటి రాక్షసులు. మార్క్స్ పరిభాషలోని నిరంకుశ, భూస్వామ్య, ధన స్వామ్య వ్యవస్థకు అధినేతైన మహా బలవంతుడు రాక్షసరాజు రావణాసురుడు, "శ్రామిక వర్గం" లాంటి బలహీన శక్తులైన నర వానరుల కూటమి ఉమ్మడి పోరాటంలో ఓటమి పాలయ్యాడు. కూటమిని విజయపథంలో నడిపించింది నాయకత్వ లక్షణాలున్న యుద్ధ కోవిదుడు శ్రీరామచంద్రుడు. ఆయనకు తోడ్పడింది తమ్ముడు లక్ష్మణుడు, ఆచార్య లక్షణాలున్న హనుమంతుడిని ఏంగెల్స్ తో పోల్చవచ్చు. మార్క్స్ పరిభాషలో చెప్పుకోవాలంటే: మావో, లెనిన్, చౌ-ఎన్-లై, స్టాలిన్ శ్రీరామచంద్రుడు కోవకు చెందినవారు. మార్క్స్ చెప్పిన "యాంటీ థీసిస్, థీసిస్, సింథసిస్ రామ రావణ యుద్ధంలోనూ అన్వయించుకోవచ్చు. మార్క్స్ కోరుకున్న "శ్రామిక, కార్మిక, కర్షక" రాజ్యమే రావణ వధానంతరం ఏర్పడిన "రామ రాజ్యం". కాకపోతే మార్క్స్ చెప్పడానికి వేలాది సంవత్సరాల క్రితమే వాల్మీకి చెప్పాడు. వాల్మీకైనా, మార్క్సైనా వారి-వారి సాహిత్యాలలో దేశ కాల పరిస్థితులకనుకూలమైన మానవ విలువల పరిరక్షణకే ప్రాధాన్యమిచ్చారు.

మానవ విలువలను కాపాడేందుకు నిరంతరం అన్వేషణ జరుగుతుందనడానికి వాల్మీకి రామాయణ గాథే చక్కటి ఉదాహరణ. వాల్మీకి సంస్కృతంలో రచించిన శ్రీమద్రామాయణం కావ్యాలలో అగ్రస్థానంలో నిలిచింది. కథానాయకుడు సాక్షాత్తు మహావిష్ణువైన శ్రీరామచంద్రమూర్తి. త్రేతాయుగంలో ఆయన అవతరించి దుష్ట శిక్షణ-శిష్ట రక్షణ చేసి మానవ విలువలను కాపాడాడనేది సారాంశం. వారి చరిత్రను

వాల్మీకే రచించి వుండక పోతే, మనలాంటి వారు అంధకారంలో పడి, దురాచార పరులమైపోయి, మానవ విలువలకు తిలోదకాలిచ్చేవారిమేమో.

శ్రీరామచంద్రమూర్తి అవతార కార్య ధురంధరత్వం స్త్రీ వధతో ప్రారంభం అవుతుంది. మార్పు జరగాలంటే, ఆద్యంతం విరుద్ధ, విభిన్న మార్గాలలో పయనించడం, విరుద్ధ, విభిన్న అంశాలను ఎదుర్కోవడం, ఒత్తిళ్లను, సంఘర్షణలను తట్టుకోవడం తప్పనిసరని చెప్పుకున్నాం. స్వధర్మ నిర్వహణ తన విధి అని శ్రీరామచంద్రమూర్తి ఆసక్తి లేకపోయినా తాటకను చంపాడు. వాల్మీకి రామాయణంలోని ''వశిష్ట – విశ్వామిత్ర యుద్ధం'', బ్రాహ్మణ క్షత్రియ యుద్ధం మాత్రమే కాదు. ''ఆత్మ విద్యకు, అనాత్మవిద్యకు'' మధ్య జరిగిన యుద్ధం. సంపూర్ణంగా అనాత్మవిద్య అన్నీ నేర్చుకున్నప్పటికీ, వాడు, ఆత్మవంతుడిని గెలవలేడని స్పష్టమవుతుంది. విద్యావంతుడి దౌష్ట్యం, ఆత్మవంతుడి సాధుస్వభావం కూడా ఈ యుద్ధంలో స్పష్టంగా కనిపిస్తుంది. వశిష్టుడు, ఆద్యంతం తనను తాను రక్షించుకునే ప్రయత్నమే చేశాడు. వర్గపోరాటంలో కూడా, కార్మికవర్గ నియంతృత్వానికి పూర్వ రంగంలో, తమ హక్కులకొరకు శ్రామికులు పోరాడుతారని మార్క్స్ అంటాడు. ''సంకెళ్లు తప్ప కార్మికులు కోల్పోయేదేమీలేదు'' అంటాడు మార్క్స్. దానర్థం: ఎదుటివారిని దెబ్బతీసేందుకన్నా, తమను తాము రక్షించుకోవడమే ప్రధానమని. ఇదీ మానవ విలువలనే సూచిస్తుంది.

మానవతావాదం అనాదిగా సాగుతున్న ఒక మహోద్యమం. విజ్ఞాన సముపార్జనకవసరమైన సూక్ష్మాతిసూక్ష్మ విషయాలకు సంబంధించిన ప్రతి అంశం, సంస్కృతీ, సాహిత్యాల సాంప్రదాయిక నేపథ్యం మీదనే ఆధారపడి వుండే రీతిలోనే మానవతావాద ఉద్యమానికి అంకురార్పణ జరిగింది. మేధావులు, సాహిత్యాభిలాషులు, శాస్త్రీయ దృక్పథంతో ఆలోచన చేసిన పలువురు, శతాబ్దాల పూర్వమే, మానవ విలువల పరిరక్షణకు ఆరంభించిన ఆ మహోద్యమం ఈ నాటికీ ప్రత్యక్షంగా–పరోక్షంగా వాటిని కాపాడేందుకు దోహదపడుతూనే వుంది. మానవతావాదాన్ని రకరకాల పేర్లతో, ఎవరికి నచ్చిన విధంగా వారు పిలువసాగారు.

రామరాజ్యమైనా, గ్రామరాజ్యమైనా, కార్మికరాజ్యమైనా, శ్రామికరాజ్యమైనా, మానవతా దృక్పథం కలిగిందైతేనే, మానవ విలువలకు అర్థముంటుంది. అలా కానప్పుడు, ఏదో ఒక రూపంలో, మానవ విలువలు కాపాడబడేందుకు నిరంతర పోరాటం జరుగుతూనే వుంటుంది. ఆ పోరాటానికి మొదలు–చివర అంటూ ఏమీలేదు. ఏదేమైనా, మానవ విలువల పరిరక్షణకు అసలు–సిసలైన సాధనం మాత్రం సాహిత్యమే. అందులో సందేహం లేదు.

మతం, భాష, సాహిత్యం దేని కవే మానవ విలువల పరిరక్షణకు దోహదపడుతున్నాయి. మనిషి తాను భగవంతుడితో మమేకం కావడానికి, తన మూర్తిని భగవంతుడిలో, ఆయన మూర్తిని తనలో చూసుకుంటూ, తద్వారా క్రమశిక్షణతో మెలుగుతూ, తోటి మానవ విలువలను కాపాడేందుకు నిరంతరం పాటుపడుతూనే వుంటాడని ఆశించుదాం.

◆❖◆

రహస్యార్థాల రామాయణం

శ్రీమదాంధ్ర వాల్మీకి రామాయణం యథా వాల్మీకంగా పూర్వ కాండలతో ఉత్తర కాండను కూడా కలిపి రచించిన ఏకైక వ్యక్తి కీర్తి శేషులు వావిలికొలను సుబ్బారావు (వాసు దాసు) గారు. రామాయణం అంటే ఏమిటి, ఆంధ్ర వాల్మీకి రామాయణం ఎందుకు చదవాలి, అనే అంశాలను స్వయంగా వాసు దాసు గారే ఆయన పీఠికలో వివరించారు. రామాయణాన్ని చక్కగా తెలిసినవారు, అర్థం చేసుకోగలిగిన వారు మాత్రమే లోకానికి అందలి విషయాలను వివరించ సమర్థులు. అందరికీ అది సాధ్యమయ్యేది కాదు. "శ్రీ రామాయణం" అంటే, లక్ష్మీరమణుడైన శ్రీమన్నారాయణుడి మాయా మానుషావతారమైన శ్రీరామ చరిత్రనీ, శ్రీ లక్ష్మీదేవి అవతారమైన సీతాదేవి చరిత్రనీ అర్థం. దంపతుల మాదిరిగా, వారి "అభిధానంబులు అనపాయంగా" వుండినట్లే, తత్త్వమెరిగిన మహాత్ముడు వాల్మీకి మహర్షి, తను రచించిన ఆది కావ్యానికి శ్రీ రామాయణం అని పేరు పెట్టాడు. ఇందులో సీతాదేవి మహాత్మ్యాన్ని విశేషించి చెప్పడంవల్ల వాల్మీకి మహర్షే, శ్రీరామాయణాన్ని "సీతాయాశ్చరితం మహత్తు" అని వెల్లడిచేశాడు. శ్రీరాముడు భగవంతుడన్న అర్థం, హారంలోని సూత్రంలాగా, రామాయణంలోని ఏడు కాండల్లోనూ వ్యాపించి వుంది. రామాయణాన్ని చదివేవారందరు, ఈ అర్థాన్ని మనస్సులో పెట్టుకొని, ఇందులోని ప్రతి అంశాన్ని, ప్రతి వాక్యాన్ని హెచ్చరికతో శోధించాలి. ఇలా ఆసక్తిగా శోధించిన వారికి–పరీక్షించిన వారికి మాత్రమే, వాల్మీకి రామాయణానికి, ఇతర రామాయణాలకు (ఆ మాటకొస్తే, ఏ భాషలో వున్న ఏ గ్రంథాలకు) గల తారతమ్యం, వాల్మీకి రామాయణంలోని గొప్పదనం తెలుస్తుంది.

శ్రీ రామాయణం మహాకావ్యం. పుట్టుకతోనే కాకుండా గుణంలో కూడ అదే మొదటిది. దానిలోని గుణాలు, రహస్యాలు తెలుసుకోవాలంటే వాల్మీకికి గాని, సర్వజ్ఞుడికి గాని మాత్రమే సాధ్యమవుతుంది. శ్రీమద్రామాయణంలో ఉత్తమోత్తమ మహాకావ్య లక్షణాలెన్నో వున్నాయి. వర్ణనలెన్నో వున్నాయి. రామాయణం గానం చేసినా, పఠించినా మనోహరంగా వుంటుంది. రామాయణంలో శృంగారం లాంటి నవ రసాలున్నాయి. అందులో శృంగార రసం "సంభోగ శృంగారం". వాల్మీకి వాక్యామృత

రసాన్ని నిరంతరం ఆస్వాదన చేసిన భవభూతి వర్ణించినట్లు ఇందులో హాస్యం, కరుణ, వీర, రౌద్రం, భయానక, బీభత్సం, అద్భుతం, శాంతం రసాలను కనుగొన వచ్చు. రామాయణంలో శబ్దాలంకారాలు తరచుగా కనబడవు. అంత్యానుప్రాసలు కొన్ని చోట్ల వున్నాయి. శ్రీమద్రామాయణం స్వభావోక్త్యలంకారాలకు పుట్టిల్లు. వర్షాన్ని వర్ణన చేసిన సందర్భంలో మన ఎదుట వర్షం కురుస్తున్నట్లే వుంటుంది. హేమంతాన్ని వర్ణిస్తుంటే, మనకు మంచులో తడుస్తున్నామా అనిపిస్తుంది. తన వర్ణనా చాతుర్యంతో వాల్మీకి, పాఠకులను, తన చేతిలో బొమ్మలా చేసి, ఇష్టమొచ్చినట్లు ఆడుకుంటాడు. వాల్మీకి మరో ప్రత్యేకత ''ఉత్ప్రేక్ష''. అలానే ఆయన వాడిన శ్లేషాలంకారాలు. శ్లేషాలంకారానికి చక్కటి ఉదాహరణ వాల్మీకి నోట వెలువడిన ప్రథమ శ్లోకం. దాన్ని ఆంధ్ర వాల్మీకి రామాయణంలో అనువదిస్తూ వాసు దాసుగారు ఇలా రాశారు.

''తెలియు మా నిషాదుండ ప్రతిష్ఠ నీక
ప్రాప్తమయ్యెడు శాశ్వతహాయనముల
గ్రౌంచ మిథునంబునందు నొక్కండు నీవు
కామమోహిత ముం జంపు కారణమున''

ఒక బోయవాడు క్రౌంచ మిథునంలో వున్న మగ పక్షిని చంపడం, ఆడ పక్షి అది చూసి దుఃఖించడం, పరమ దయామయుడైన వాల్మీకి అది చూసి, బోయవాడు చేసిన అధర్మ కార్యానికి కోపగించి అతడిని శపించడం జరిగింది. ఆ శాపమే రామాయణ ఉత్పత్తికి కారణమైంది. దీనికి భగవత్ పరంగా ఒక అర్థం వుంది. రామాయణంలోని ఏడు కాండల అర్థం, కథ ఇందులో సూక్ష్మంగా సమర్థించబడింది. అలంకార శాస్త్రంలో ఎన్ని అలంకారాలు చెప్పబడ్డాయో, అవన్నీ వాల్మీకి (ఆంధ్ర వాల్మీకి) రామాయణంలో వున్నాయి. వాల్మీకి అసమాన కవితా చాతురి వర్ణనాతీతం. మరొక్క ఉదాహరణ చిత్రాలంకార ఉపయోగం. అలంకారాల వరకెందుకు? సాధారణ విషయాన్ని చెప్పాల్సి వచ్చినప్పుడు కూడా ఏదో ఒక చమత్కారాన్ని కనబరిచేవాడు. వాల్మీకి రామాయణంలోని పాత్రలు–పాత్రధారుల వాక్కులు, ఆయా పాత్రల చిత్త వృత్తి గుణాలను తెలియచేసేవిగా, సందర్భోచితంగా, వారున్న అప్పటి స్థితికి అర్హమైనవిగా వుంటాయి. పాత్ర గుణ మహాత్మ్యానికి అసంగతమైన వాక్యాలు ఆయా పాత్రల నోటినుంచి వెలువడవు. శ్రీరాముడు భగవంతుడన్న అభిప్రాయం వాల్మీకి పదే పదే చెప్పుకుంటూ పోయాడు రామాయణంలో.

వాల్మీకి రామాయణమనే ''కలశార్ణవం'' లో రత్నాలను వెదికేవారు, మొట్టమొదటగా తెలుసుకోవాల్సింది వాల్మీకి శైలి–విధానం. అది తెలుసుకోలేక వెతకడం మొదలుపెట్టితే, చీకట్లో తారాడినట్లే. ఒక విషయం గురించి చెప్పాల్సిందంతా ఒకచోట చెప్పడు. కొన్ని సందర్భాలలో ఆ విషయానికి సంబంధించిన ప్రస్తావనే వుండదు. అదే విషయం మరెక్కడో సూచన ప్రాయంగా వుండొచ్చు. ఒక్కోసారి విపులంగా విశదీకరించబడి వుండొచ్చు. ఆయన చేసిన వర్ణనలను బట్టి, ప్రయోగించిన పదజాలాన్ని బట్టి, పాఠకులు ఊహించుకోవచ్చు. ఒకే విషయం, ఒకటి కంటె ఎక్కువ సార్లు చెప్పితే, ఒక్కోసారి ఒక్కోరకమైన విశేషంతో చెప్పబడుతుంది. ఇలాంటి చిత్రాలు అనేకం వుంటాయి. వాల్మీకి (ఆంధ్ర వాల్మీకి) రామాయణం ''ధ్వని కావ్యం''. కావ్యానికి ప్రధానమైంది ధ్వని. కావ్యానికి ప్రాణం ధ్వని.

ధ్వని లేని కావ్యం శవంతో సమానం. రామాయణంలో ధ్వని విశేషంగా వుంది. కావ్యమంతా ధ్వన్యర్థం వుండడమే కాకుండా, పలు శ్లోకాలకు విడిగా ధ్వన్యర్థం వుంది. రుతు వర్ణనలలో ధ్వని స్ఫురిస్తుంది.

శ్రీ రామాయణంలోని కవితా చమత్కృతిని విశదీకరించాలంటే, ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. ఇంతెందుకు ! కాళిదాసు, భవభూతి అంత గొప్ప వాళ్లు కావడానికి రామాయణమే కారణం. వాళ్లు రామాయణాన్ని ఎన్ని సార్లు చదివారో గాని, వారి కవితా వల్లి ''వాల్మీకి వాక్సుధాసేచనం'' లో జీవించి, వృద్ధి పొందిందనడం నిర్వివాదం. శ్రీ విశిష్టాద్వైతం మతోద్ధారకుడైన శ్రీ రామానుజాచార్యులు పద్దెనిమిది పర్యాయాలు గురు ముఖంగా రామాయణాన్ని పఠించి వ్యాఖ్య రాశారు.

శ్రీమద్వాల్మీకి రామాయణం మంత్రనిధానం. ఇందులో అనేకానేక మంత్రాలు ఉద్ధరించబడి వున్నాయి. అందువల్లే, వాల్మీకి రామాయణం పారాయణం చేసేవారు, "అంగన్యాస కరన్యాసాదులతో" యథావిధిగా చదివి, వారి వారి కోరికలు నెరవేర్చుకుంటారు. సద్భావంతో సుందర కాండ పారాయణం చేసి కార్య సిద్ధిని పొందనివారు ఇంతవరకు లేరు. ఉత్తర కాండలో చెప్పినట్లు, రామాయణమంతా గాయత్రీ స్వరూపమే. గాయత్రిలోని 24 అక్షరాలను, ప్రతి వేయి శ్లోకాలకు ఒక అక్షరం చొప్పున శ్లోకం ఆరంభంలో చెప్పబడింది. ఏడు కాండలలో ఏడు వ్యాహృతులు వివరించడం జరిగింది. ఈ గాయత్రీ విధానాన్ని నారదుడే స్వయంగా వాల్మీకి మహర్షికి, రామాయణంతో పాటే ఉపదేశించాడు.

"తప స్స్వాధ్యాయ నిరతం, తపస్వీ వాగ్విదాంవరమ్, నారదం పరిపప్రచ్ఛ, వాల్మీకిర్మునిపుంగవమ్" అని గాయత్రిలోని మొదటి అక్షరంతో శ్లోకాన్ని ప్రారంభించి, "జనశ్చ శూద్రోపి మహత్త్వ మీయాత్" అని గాయత్రి కడపటి అక్షరంతో సర్గను ముగించాడు వాల్మీకి. ఆంధ్ర వాల్మీకంలో, మూలంలో వున్నట్లు ''తపమున స్వాధ్యాయంబున, నిపుణుని... ..... తమి గావించెన్'' అన్న పద్యంతో ప్రారంభించి, "యథావిధి విన్న బఠింప నారయన్" అని ముగించబడింది. కామ్యార్థమైనా, మోక్షార్థమైనా, రామాయణం పారాయణం చేసినవారి కోరికలు నెరవేర్చే శక్తి, రామాయణానికి వుండడానికి కారణం, అది భగవత్ కథ కావడానికి అదనంగా సర్వజ్ఞుడైన వాల్మీకి (ఆంధ్ర వాల్మీకి) కూర్చిన బీజాక్షరాల మహాత్మ్యమే.

శ్రీమద్రామాయణం వేదంతో సమానమైందే కాకుండా వేదమే అనాలి. వేదమే అయినప్పుడు, వేదంతో సమానమైందని ఎలా అనవచ్చునంటే, వేదంలోని వర్ణాలనే, అనులోమ, విలోమాలుగా మార్చి, వేద ప్రసిద్ధమైన రామ కథను చెప్పడంవల్ల ఇది వేదమే అయింది. వేదాల్లోని అర్థాలున్నందువల్ల వేదంతో సమానమైంది.అందువల్లనే, వేద పఠనం అవశ్యంగా చేయాల్సిన కార్యక్రమాల్లో, రామాయణ పఠనం నియమితమైంది. శత కోటి, అంటే 24 గాయత్రీ బీజాక్షరాలతో కూడిన 24,000 గ్రంథాల రామాయణంలోని ప్రతి అక్షరానికి మహా పాతకాలను నాశనం చేయగల శక్తిగలదని కొందరంటారు. కొందరేమో, శత కోటి రామాయణాన్ని వాల్మీకి సంగ్రహంగా చెప్పాడంటారు. ఇలాంటి మహిమ రామాయణంలో వుండడానికి కారణమేంటో ఆలోచించాలి.

వాల్మీకి సూత్రాన్ననుసరించి, రామాయణం వేద స్వర సముద్ధృతంగా-సర్వశ్రుతులందున్నట్లుగా తెలుస్తోంది. వాల్మీకి రచించిన 24,000 శ్లోకాలలో, యజుర్వేదంలోని 1,29,290 పదాలే కాకుండా,

రుగ్వేదం, సామవేదం, అథర్వ వేదాలలోని పదాలు కూడా అనులోమ–విలోమంగా కూర్చబడిందన్న రహస్యం తెలుసుకోవచ్చు. యజుర్వేదానికి ప్రాముఖ్యం ఇవ్వడానికి కారణం, శ్రీరాముడు యజుర్వేది కావడమే.

శ్రీమద్రామాయణంలోని కాండలలో వేదాక్షరాలు ఎలా వున్నాయో పరిశీలించితే, బాల కాండ ప్రథమ సర్గ నుంచి ఐదో సర్గ వరకు రెండో శ్లోకం దాకా, నారదుడు ఉపదేశించిన విధానం రాసి, తర్వాతనే బ్రహ్మ ప్రత్యక్షం కావడంతో కథా భాగం వుంది. బాల కాండ 5 సర్గ 3 వ శ్లోకం నుంచి, అయోధ్య కాండ 115 వ సర్గ వరకు యజుర్వేదం. అయోధ్య కాండ 116 వ సర్గ మొదలు, అరణ్య కాండ 74 వ సర్గ వరకు ఋగ్వేదం. అరణ్య కాండ 75 వ సర్గ మొదలు సుందరకాండ 48 వ సర్గ వరకు సామవేదం. సుందర కాండ 49 వ సర్గ మొదలు ఉత్తర కాండ 36 వ సర్గ వరకు అథర్వ వేదం. ఉత్తర కాండ 37వ సర్గ మొదలు చివర వరకు ఉపనిషత్తు, అంటే శాంతి. ఈ విధంగా 647 సర్గలలో 23635 శ్లోకాలు, 776794 అక్షరాలున్నాయి. రామాయణం ఒక మహత్తరమైన సాంఖ్య శాస్త్రం. "కాదినవాది సూత్రాల" ప్రకారం అక్షరాల కొచ్చే సంఖ్యలను బట్టి చూస్తే, రామాయణంలో ఎన్నో చిత్రాలు కనిపిస్తాయి.

అవతార సంఖ్య...7, రామాయణ కాండ సంఖ్య....7, యుద్ధం జరిగిన రోజుల సంఖ్య...7, రామాయణ యుద్ధంలో ముఖ్య మైన పురుషుల సంఖ్య (రామ, లక్ష్మణ, హనుమ, విభీషణ, రావణ, కుంభకర్ణ, ఇంద్రజిత్తులు) ...7. పారాయణం చేసే వారికి ముఖ్యంగా నియమిత మైన సర్గల సంఖ్య 7. వ్యాహృతులు 7. ఇలా ఈ ఏడవ సంఖ్య మహిమ అద్భుతం. "శ్లోక శతై" అని వాల్మీకి చెప్పినట్లు, బాల కాండం మొదటి సర్గ మొదటి శ్లోకం (తప స్స్వాధ్యాయ...) లోని అక్షరాల కొచ్చే సంఖ్యలను కూడితే 100 వస్తుంది. ఈ 100 సంఖ్య ప్రథమ సర్గలోని శ్లోకాల సంఖ్య. రామాయణంలోని సప్త సంఖ్యా నియమాన్ని గ్రహించిన వ్యాస భగవానులు నిజ రచిత గ్రంథానికి ''జయ'' అని పేరు పెట్టాడు. "జయ" అంటే 18. భారతంలోని పర్వాలు 18. యుద్ధం జరిగింది 18 రోజులు. రణ శూరులు 18 మంది. భగవద్గీతలో 18 అధ్యాయాలున్నాయి. ఇలా ఆలోచిస్తే, మహర్షులందరి మార్గాలు ఒక్కటేననిపిస్తుంది. సీతారాముల వియోగం గురించి, కలిసి వుండడం గురించి అయోధ్యా కాండలో చెప్ప బడింది. మిగిలిన కాండలలో కొంత కాలమన్నా వియోగం గురించి చెప్పబడింది. కాబట్టి ''సీత, రామ'' నామాల సంఖ్యలు కలిపితే (సీత=67 + రామ=52) 119 వస్తుంది. అయోధ్య కాండలో 119 సర్గలున్నాయి. ఇలాంటి చిత్రాలు ఎన్నెన్నో వాల్మీకి రామాయణంలో నిక్షేపం చేశాడు.

◆❖◆

శ్రీరామచంద్రుడు సాక్షాత్తు దేవుడే!

వాల్మీకిని రామాయణం రాయమని ప్రోత్సహించడానికి వస్తాడు నారదుడు. అలా వచ్చిన నారదుడిని పదహారు ప్రశ్నలు వేశాడు వాల్మీకి. "గుణవంతుడు, అతివీర్యవంతుడు, ధర్మజ్ఞుడు, కృతజ్ఞుడు, సత్యశీలుడు, సమర్థుడు, నిశ్చలసంకల్పుడు, సదాచారం మీరనివాడు, సమస్త ప్రాణులకు మేలు చేయాలన్న కోరికున్నవాడు, విద్వాంసుడు, ప్రియదర్శనుడు, ఆత్మవంతుడు, కోపాన్ని స్వాధీనంలో వుంచుకున్నవాడు, ఆశ్చర్యకరమైన కాంతిగల వాడు, అసూయ లేనివాడు, రణరంగంలో దేవదానవులను గడ-గడలాడించ గలవాడు ఎవరైనా ఈ భూలోకంలో వున్నారా?" అని అడిగాడు. నారదుడు ఆ ప్రశ్నలకు ఇచ్చిన సమాధానంలో ఆ గుణాలన్నీ వున్న ఒకేఒక వ్యక్తి శ్రీరాముడనే అర్థం స్ఫురణకు స్పష్టంగా వస్తుంది. వాల్మీకికి కావాల్సిన గుణాలున్న వ్యక్తి ఆగుణాలకు ఎలా అర్హుడనేది రామాయణం చదివితే అర్థమవుతుంది.

బాల్యంలోనే శ్రీరాముడు గుహుడు లాంటి ఆటవిక జాతి వారితో సహవాసం చేయడంతో, ఆయన గుణవంతుడు అయ్యాడు. తాటకాది రాక్షసులను చంపి వీర్యవంతుడు అయ్యాడు. గురువాజ్ఞ మీరక పోవడం, జనకాజ్ఞ జవదాటక పోవడం, పరశురాముడిని చంపక పోవడం లాంటివి రాముడు ధర్మజ్ఞుడు అని తెలుపుతాయి. అయోధ్య కాండ వృత్తాంతమంతా శ్రీరాముడిని సత్యవాదిగా, దృఢవ్రతుడిగా, సచ్చరిత్రుడుగా తెలపడమే. విద్వాంసుడు, సమర్థుడు అనే విషయాలను కిష్కింధ కాండలో హనుమంతుడితో రాముడు జరిపిన సంభాషణ, వాలి వధల ద్వారా అర్థమవుతుంది. అరణ్యకాండలో కాకాసుర రక్షణ శ్రీరాముడి సచ్చరిత్రను, సర్వ భూత హితాన్ని తెలుపుతుంది. సుందర కాండలో హనుమంతుడి రామ సౌందర్య వర్ణన ఆయనెంత ప్రియ దర్శనుడనేది వివరిస్తుంది. విభీషణ శరణాగతి ద్వారా రాముడి ఆత్మవంతుడి లక్షణాన్ని బయటపెడుతుంది. ఇంద్రజిత్తుపై కోపించక పోవడం, చేజిక్కిన రావణుడిని విడిచిపెట్టడం, రాముడి జితక్రోధత్వాన్ని తెలుపుతుంది. విరోధైన రావణుడిని మెచ్చుకోవడమంటే రాముడికి అసూయ లేదనే కదా. ఇలానే రాముడు కాంతియుక్తుడనీ, భయంకరుడనీ

పలు సందర్భాల్లో చెప్పడం జరిగింది.

వాల్మీకి శ్లాఘించిన గుణాలు అసమానమైనవి. ఒక్కో గుణంలో అంతర్లీనంగా ఇంకొన్ని వుండడంతో అవి అనేకమయ్యాయి. మనుష్యమాత్రులలో ఇవి కనపడవు. ఇట్టి సుగుణ సంపత్తికలవాడు, ఇక్ష్వాకుల రాజవంశంలో, "రామా రామా రామా", అని లోకులు పొగిడే రామచంద్రమూర్తి మాత్రమే. అతివీర్యవంతుడాయన. అసమానమైన, వివిధమైన, విచిత్రమైన శక్తిగలవాడు. స్వయంగా ప్రకాశిస్తాడు. అతిశయం లేని ఆనందం ఆయన సొంతం. ఇంద్రియాలను, సకల భూతాలను వశపర్చుకున్నాడు. సర్వం తెలిసినవాడు. నీతే ప్రధానం ఆయనకు. పరులకు హితమైన, ప్రియమైన మాటలు చెప్తాడు. శ్రీమంతుడు. ఎవరిపై శత్రు భావం లేకపోయినా, తనను ఆశ్రయించిన వారిని ద్వేషిస్తే, వారిని నాశనం చేసే వాడు.

శంఖంలాగా మూడు రేఖలున్న కంఠం, విశాలమైన వక్షస్థలం వున్నాయి రాముడికి. శత్రు సమూహాలకు ప్రళయకాల యముడిలాంటి వాడు. యుద్ధంలో భయంకరుడు. శ్రీరామచంద్రమూర్తి చేతులు మోకాళ్లకు తగిలేంత పొడుగ్గా వుంటాయి. అందమైన వక్షం, అసమాన సౌందర్యమున్న నొసలు, చూసేవారిని మైమరిపించే నడక గలవాడు. అందంగా, శాస్త్రంలో చెప్పినట్లుగా, పరిమాణంలో ఒకదానికొకటి సరిపోయే అవయవాలున్నాయి. ప్రకాశించే దేహ కాంతి, భయంకరమైన శత్రువులకు సహించలేని ప్రతాపం, మనోహరమై, బలిసిన మంచి వక్షం వున్నవాడు. కీర్తించదగిన నిడివి, వెడల్పాటి కళ్లు, ఎదుటివారు మెచ్చుకునే వేషం, శ్లాఘ్యమైన శుభ చిహ్నాలు, శుభం కలిగించే ఆకారం, మంచి గుణాల మనోహరుడాయన.

కనుబొమలు, ముక్కుపుటాలు, కళ్లు, చెవులు, పెదాలు, చనుముక్కులు,మోచేతులు, మణికట్టు, మోకాళ్లు, చేతులు, కాళ్లు, పిక్కలు, ఎవరికి సమానంగా వుంటాయో వారు భూమిని ఏలుతారని సాముద్రిక శాస్త్రంలో వుంది. ఇవన్నీ శ్రీరాముడికున్నాయి.

ఆశ్రితులు అనుభవించేందుకు అనువైన–యోగ్యమైన దివ్య మంగళ విగ్రహానికి తోడు, ఆశ్రితులను రక్షించేందుకు అనువైన గుణాలు కూడా వున్నాయి. శ్రీరామచంద్రుడు ప్రశస్తమైన ధర్మజ్ఞానంగలవాడు. క్షత్రియులకు ప్రశస్త ధర్మమైన శరణాగత రక్షణను ముఖ్య వ్రతంగా ఆచరించేవాడు. చేసిన ప్రతిజ్ఞ తప్పనివాడు. సమస్త భూజనులకు మేలైన కార్యాలనే చేసేందుకు ఆసక్తి చూపేవాడు. దానధర్మాలు, స్వాశ్రితరక్షణ వల్ల లభించిన యశస్సు, శత్రువులను అణచినందున వచ్చిన కీర్తిగలవాడు. సర్వ విషయాలు తెలిసినవాడు. బ్రహ్మ జ్ఞాన సంపన్నుడు. మిక్కిలి పరిశుద్ధుడు. ఋజుస్వభావం గలవాడు. ఆశ్రిత రక్షకుడు. ఆత్మతత్వం ఎరిగినవాడు. ఆశ్రితులకు, మాత, పిత, ఆచార్యులకు, వృద్ధులకు వశ పడినవాడు. విష్ణువుతో సమానుడు. శ్రీమంతుడు. లోకాలను పాలించ సమర్థుడు. ఆశ్రిత శత్రువులను, తన శత్రువులనూ అణచగలిగినవాడు. ఎల్ల ప్రాణికోటిని రక్షించాలన్న కోరికున్నవాడు. ధర్మాన్ని తానాచరిస్తూ, ఇతరులతో ఆచరింపచేసేవాడు. స్వధర్మ పరిపాలకుడు. స్వజనరక్షకుడు. వేద వేదాంగాలను రహస్యార్థాలతో ఎరిగినవాడు.

శ్రీరాముడు సర్వశాస్త్రాల అర్థాన్ని నిర్ణయించగల నేర్పరి. జ్ఞాపకశక్తిగలవాడు. విశేషప్రతిభగలవాడు. సమస్త ప్రపంచానికి ప్రియం చేసేవాడు. సాధువు. గంభీర ప్రకృతిగలవాడు. అన్ని విషయాలను చక్కగా బోధించగలవాడు. నదులన్నీ సముద్రానికి పారినట్లే ఎల్లప్పుడూ ఆర్యుల పొందుగోరేవాడు. అందరిమీద

సమానంగా వారి, వారి యోగ్యత కొద్దీ ప్రవర్తించేవాడు. గొప్పగుణాలున్నవాడు. ఎప్పుడూ, ఏకవిధంగా, మనోహరంగా దర్శనమిచ్చేవాడు. సమస్తభూతకోటికి పూజ్యుడు. అన్నింటా గుణ శ్రేష్ఠుడు. కౌసల్యా నందనుడని ఆయనకు పేరు. గాంభీర్యంలో సముద్రుడంతటివాడు. ధైర్యంలో హిమవత్పర్వత సమానుడు. వీర్యాధిక్యంలో విష్ణు సమానుడు. చంద్రుడిలా చూసేందుకు ప్రియమైన వాడు. కోపంలో ప్రళయకాలాగ్ని. ఓర్పులో భూదేవంతటివాడు. దానంలో కుబేరుడు. అసమాన సత్యసంధుడు. ధర్మానికి మారుపేరు. ఇటువంటి పురుషోత్తముడికి సరితూగేవారు లోకంలో ఎవరూ లేరు.

రామావతారం పూర్ణావతారమే. అంటే ప్రకృతి సంసర్గం లేదు. శరీరం అప్రాకృతం. ప్రకృతి గుణాలు ఆయన్ను బాధించవు. రామచంద్రమూర్తి శోకించాడని వాల్మీకి అనేకసార్లు రాసిందీ అసత్యం కాదు. నిజంగానే శోకం కలిగిందాయనకు. అయితే శోకం కలిగింది తనకొచ్చిన కష్టానికి కాదు. తమకు దుఃఖాలొచ్చాయని మనుష్యులు దుఃఖిస్తారు. తనకై, తన ఆప్తులకు దుఃఖం కలిగిందికదానని, తన మూలాన వీరికింత దుఃఖం ప్రాప్తించిందికదానని, వారి దుఃఖాన్ని ఆపాల్సిన తానే వారి దుఃఖానికి కారణమయ్యానేనని మాత్రమే రాముడు శోకించాడు. సీతాదేవి విషయంలోనూ దుఃఖించాడు శ్రీరాముడు. తనను నమ్మి అడవులకు వచ్చిన సీతను, రాక్షసుడు ఎత్తుకుపోతే, తనను వదిలిన బాధతో, అమెకెంత దుఃఖం కలిగిందోనని రామచంద్రమూర్తి దుఃఖించాడు. వియోగంవల్ల తమకు కలిగిన నష్టానికి దుఃఖించే వాళ్లు మనుష్యులు. జీవులకు కలిగిన నష్టానికి దుఃఖించేవాడు భగవంతుడు.

శ్రీరామచంద్రుడు వానర సేనలతో సముద్రం దాటి, లంకలో నిర్భయంగా ప్రవేశించి, యుద్ధభూమిలో రావణుడిని చంపి, సీతాదేవిని చూసి, ఇన్నాళ్ళూ పగవాడింట్లో వున్న ఆడదానిని ఎట్లా స్వీకరించాలా అని సిగ్గుపడి, సీతాదేవిని కఠినోక్తులాడుతాడు. పతివ్రతైన సీత, తన పాతివ్రత్య మహిమను లోకానికంతా తెలపాలని తలచి, లక్ష్మణుడు పేర్చిన చితిలో మండుటెండలో ప్రవేశిస్తుంది. అప్పుడు అగ్నిహోత్రుడు సీతను బిడ్డలాగా ఎత్తు కొచ్చి, సీతాదేవి వంటి పతివ్రతలు లోకంలో లేరనీ, ఆమెలో ఎట్టి లోపించలేదని, ఆమెను గ్రహించమని శ్రీరామచంద్రమూర్తికి అప్పగిస్తాడు. శ్రీరాముడామెను మరల స్వీకరించి, బ్రహ్మ రుద్రాదిదేవతలందరు మెచ్చుకుంటుంటే సంతోషిస్తాడు.

దేవతా సమూహాల గౌరవం పొందిన శ్రీరామచంద్రమూర్తి, తను చేసిన పని, లోకోపకారం, లోకసమ్మతమైన పనైనందున, సంతోషపడ్డాడు. సీతామహాలక్ష్మి తోడుండగా, శ్రీరామచంద్రమూర్తి రాజ్యలక్ష్మిని తిరిగి యదార్థంగా పొందడంతో ముల్లోకాలు మిక్కిలి సంతోషించాయి. శ్రీరామచంద్రుడు రాజ్యం చేసేటప్పుడు లోకాలన్నీ సంతోషించాయి. సంతోషాతిశయంతో కలిగిన గగుర్పాటుతో సాదువులు, ధర్మాత్ములు బలపడ్డారు. శ్రీ రామరాజ్యంలో సాదువులు చేసే శ్రీరామ సేవకు విరోధమైన మనోవేదనలుకాని, రోగబాధలుకాని, యీతిబాధలుకాని లేవు.

శ్రీరాముడు అనేక అశ్వమేధ యాగాలను, యజ్ఞాలను చేసి, బ్రాహ్మణులకు లెక్కపెట్ట లేనన్ని ఆవులను, ధనాన్ని దానమిచ్చి, తన సుఖాన్ని వదులు కొనైనా ప్రజలకు సుఖం కలిగేటట్లు ధర్మ పద్ధతిలో రాజ్యపాలన గావించి, వైకుంఠ లోకానికి పోయాడు. శ్రీరామచంద్రమూర్తి, రాజ్య హీనులై నానా దేశాలలో తిరుగుతున్న పూర్వ రాజుల వంశాల వారిని పిలిపించి, వారి పెద్దల రాజ్యాన్ని వారికిచ్చి, వారంతా స్వధర్మాన్ని వీడకుండా కాపాడాడు. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులనే నాలుగు వర్ణాల

వారిని సమాన దృష్టితో చక్కగా పరిపాలించాడు. స్వధర్మానుష్ఠానమే మోక్షకారణమనీ, పరధర్మానుష్ఠానం పతనకారణమనీ తెలియచేశాడు. పదకొండువేల సంవత్సరాలు ఇలా రాజ్యాన్ని పాలించి విష్ణు లోకానికి చేరుకుంటాడు శ్రీరామచంద్రమూర్తి.

రామాయణం పరిశుద్ధంగా చదివేవారికి, వినేవారికి మూడు విధాలైన సమస్త పాపాలు హరించి పోయి, ఏమాత్రం ఆలస్యం లేకుండా మోక్ష ఫలం కలుగుతుంది. అంతశక్తి దీనికుండటానికి కారణం, ఇది వేద స్వరూపమై, వేదార్థాన్నే బోధిస్తుంది కాబట్టి. అంతేకాదు, సంసార సాగరాన్ని తరింపచేస్తుంది కూడా. ఇది వినేవారు-చదివేవారు, అంతమాత్రాన సన్యాసులు కానవసరం లేదు. ఆయుస్సు పెరిగి, కొడుకులు, కూతుళ్లతో, మనుమలు, ఇష్ట బంధువులతో అనుభవించి, మరణించిన తర్వాత మోక్షాన్ని, బ్రహ్మానందాన్ని కలిగిస్తుంది. పరిమితి చెప్పనలవికాని మహత్త్వమున్న యీ రామాయణ గ్రంథాన్ని శాస్త్ర ప్రకారం చదివినా, ఇతరులు చదవగా విన్నా, అర్థ విచారం చేసినా, అఖండమైన లాభం జరుగుతుంది. దీన్ని చదవాలి, వినాలి. విషయ చింతన చేయాలి. వినేవారుంటే చదివి వినిపించాలి. చదివేవారుంటే వినాలి. ఈ రెండూ జరగని కాలముంటే, విన్నదానిని, కన్నదానిని, విశేషంగా మననం చేయాలి. ఏదోవిధంగా మనస్సు దీనిపై నిలపాలి.

శ్రీ సీతారామ లక్ష్మణ భరత శత్రుఘ్నుల చరిత్రను, వీరు ఆచరించిన ధర్మాలను అన్ని లోకాలకూ శాశ్వతంగా చెప్పేందుకు, శత కోటి గ్రంథాత్మకమైన ప్రబంధంగా, ఓ బృహత్ గ్రంథాన్ని రచించి నారదుడికి, ఇతర మహర్షులకు ఉపదేశించాడు బ్రహ్మదేవుడు. అంతటితో ఆగకుండా భూలోక వాసుల కొరకై శ్రీరామ భక్తుడైన వాల్మీకికి ఉపదేశించమని నారదుడిని ఆదేశించాడు. వాల్మీకి రచించిన రామాయణం బ్రహ్మ ప్రేరేపించినదే.

వాల్మీకి సంస్కృతంలో రచించిన శ్రీమద్రామాయణం కావ్యాలలో అగ్రస్థానంలో నిలిచింది,. శ్రీమద్రామాయణంలో నాయిక సాక్షాత్తు శ్రీదేవైన సీతా దేవి. నాయకుడు మహావిష్ణువైన శ్రీరామచంద్రమూర్తి. వీరిరువురు త్రేతాయుగంలో దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ చేసి, ధర్మ సంస్థాపన చేసేందుకు అవతరించారు. ఇహ-పర సాధకంబులైన "స్వధర్మాలలో, స్త్రీధర్మం సీతని, పురుష ధర్మం శ్రీరామచంద్రమూర్తని లోకానికుపదేశించాడు వాల్మీకి.

"శ్రీరామాయణం" అంటే, లక్ష్మీరమణుడైన శ్రీమన్నారాయణుడి మాయా మానుషావతారమైన శ్రీరామ చరిత్రనీ, శ్రీ లక్ష్మీదేవి అవతారమైన సీతాదేవి చరిత్రనీ అర్థం. సీతాదేవి మహాత్మ్యాన్ని విశేషించి చెప్పడంవల్ల వాల్మీకి మహర్షే, శ్రీ రామాయణాన్ని "సీతాయాశ్చరితం మహత్తు" అని వెల్లడిచేశాడు. శ్రీరామచంద్రుడు మనుష్యుడివలె నటిస్తుంటే, వాల్మీకేమో వాస్తవార్థం చెప్తూ, ఆయన సాక్షాత్తు భగవంతుడే అంటాడు. రాముడి చర్యల ద్వారా, రాముడి వాక్కుల ద్వారా తాను చెప్పదల్చుకున్న దాన్ని సిద్ధాంతీకరించాడు వాల్మీకి. శ్రీరాముడు భగవంతుడేనన్న అర్థం, హారంలోని సూత్రంలాగా, రామాయణంలోని ఏడు కాండల్లోనూ వ్యాపించి వుంది.

అందుకే, ఇందుకే శ్రీరామచంద్రుడు సాక్షాత్తు దేవుడయ్యాడు.

◆❖◆

ఆంధ్రవాల్మీకి రామాయణం అజరామరం

వాల్మీకి సంస్కృత రామాయణాన్ని, యథా వాల్మీకంగా పూర్వ కాండలతో సహా ఉత్తర కాండనుకూడా తెనిగించిన ఏకైక మహానుభావుడు ఆంధ్ర వాల్మీకి, కవి సార్వభౌమ వావిలికొలను సుబ్బరావు (వాసుదాసు). శ్రీమదాంధ్ర వాల్మీకి రామాయణం మందరాలన్నీ, తెలుగునేల నాలుగుచెరగులా విశేష ప్రాచుర్యాన్ని ఏనాడో, ఏడెనిమిది దశాబ్దాల క్రితమే సంతరించుకున్నాయి.

రామాయణం రసరమ్యం, రామనామం సదాస్మరణీయం. రామాయణాన్ని ఎన్నిసార్లు చదివినా, విన్నా తనివి తీరదు. ఆదర్శ పురుషుడైన రాముడి చరితాన్ని రామాయణ కావ్యంగా వాల్మీకి మహర్షి అనుగ్రహించారు. శ్రీ రామాయణం క్షీర ధార అయితే, వాసుదాసు శ్రీ మదాంధ్ర వాల్మీకి రామాయణం, మందరాలన్నీ, మందార మకరంద మాధుర్యాలే. వాల్మీకి రామాయణ క్షీరసాగర మథనాన్ని చేసి ‘‘మందర’’ మకరందాలనూ, రమా రామ పారమ్య పీయూషాలనూ, నాలుగు చెరగులా పంచి, ఆ మథనంలో ఆవిర్భవించిన శ్రీ సీతారాముల తత్వాన్ని, వేద వేదాంగేతిహాస స్మృతి శ్రుతి శుభంగా అన్వయించి, ఆంధ్రుల హృదయ కేదారాలను ప్రపుల్లంచేసిన పరమ భాగవతోత్తములు ‘‘ఆంధ్ర వాల్మీకి’’ వాసుదాస స్వామి. వాల్మీకి సంస్కృత రామాయణాన్ని అందరికంటే మొట్ట మొదలు తెనిగించి, పదే–పదే రామాయణ పఠన పాఠన శ్రవణాదుల పట్ల తెలుగువారికి అత్యుత్సాహాన్ని కలిగించి, “రామ భక్తి సామ్రాజ్యం” అంటే, తెలుగు మాట్లాడే ప్రాంతాలే సుమా, అనిపించిన నిరుపమ రామ భక్తులు వాసుదాస స్వామివారు.

ఎనిమిదేళ్ల సాహిత్య శ్రమ ఫలితంగా, రామాయణాన్ని తొలుత నిర్వచనంగా తెనిగించి, ఒంటిమిట్ట కోదండ రామస్వామికి అంకితం చేసారు. ఆయన రచించిన నిర్వచన రామాయణం, ఆయన జీవిత కాలంలోనే, నాలుగైదు సార్లు ముద్రించబడింది. ఆంధ్ర వాల్మీకి రామాయణానికి తెలుగులో సరైన వ్యాఖ్యానముంటే, సంస్కృతం రానివారికి చక్కగా అర్థమవుతుందని భావించిన వాసుదాసు “శ్రీ మదాంధ్ర వాల్మీకి రామాయణం మందరం” పేరుతో గొప్ప వ్యాఖ్యానం రాసారు. వాస్తవానికి అదొక గొప్ప

ఉద్గ్రంథం. దాన్ని చిలికిన కొద్దీ ఎన్నో దివ్య రసాయనాలు ఉద్భవిస్తాయని, భావితరాలవారు ఇందుకు పూనుకోవాలని కూడా సూచించారు వాసుదాసుగారు.

తను రచించిన నిర్వచన రామాయణంలో సంస్కృత రామాయణంలో వున్న 24,000 శ్లోకాలను తన పద్యాలలో కూర్చారు. అవన్నీ సుమారు 14,000 పద్యాలయ్యాయి. ఆయన రాసిన ప్రతి పద్యానికి, ప్రతి పదార్థ తాత్పర్యం సమకూర్చారు. ఒక్కో పదానికున్న వివిదార్థాలను విశదీకరించారు. భావాన్ని వివరణాత్మకంగా విపులీకరించారు. అవసరమైన చోట ఆంగ్ల వ్యాఖ్యానాన్నీ సమకూర్చారు. ఆయన మందరాలలోని శ్రీరామాయణ వ్యాఖ్యానంలో ''జ్ఞాన పిపాసి'' కి విజ్ఞాన సర్వస్వం దర్శనమిస్తుంది. ఇక ఆయన రాసిన నిర్వచన రామాయణంలో సాధారణంగా అందరూ రాసే చంపక మాలలు, ఉత్పల మాలలు, సీస, ఆటవెలది, తేటగీతి, కంద, శార్దూలాలు, మత్తేభాలు మాత్రమే కాకుండా, తెలుగు ఛందస్సులో వుండే వందకుపైగా వృత్తాలను, సందర్భోచితంగా ప్రయోగించారు. ఆయన చందఃప్రయోగాలు చదవాల్సిందే!

వాసుదాసు ఆంధ్రవాల్మీకంలోని ప్రతి కాండకొక ప్రత్యేకతుంది. ప్రతికాండ ఒక్కోరకమైన విజ్ఞానసర్వస్వం. ప్రతి కాండలో ఆ కాండ కథా వృత్తాంతమే కాకుండా, సకల శాస్త్రాల సంగమం దర్శనమిస్తుంది. ప్రతికాండ ఒక ధర్మశాస్త్రం, రాజనీతి శాస్త్రం, భూగోళ శాస్త్రం, ఖగోళ శాస్త్రం, సాంఘిక, సామాజిక, ఆర్థిక, సామాన్య, నీతి, సంఖ్యా, సాముద్రిక, కామ, రతి, స్వప్న, పురాతత్వ శాస్త్రం లాగా దర్శనమిస్తుంది. అసలు-సిసలైన పరిశోధకులంటూ వుంటే, మందరం ఏ ఒక్క కాండ మీద పరిశోధన చేసినా, ఒకటి కాదు, వంద పీహెచ్‌డీలకు సరిపోయే విషయ సంపద లభ్యమవుతుంది. డాక్టరేట్ తో పాటు, అద్భుతమైన రహస్యాలు అవగతమౌతాయి. పాదరసంనుండి బంగారం చేసే రహస్యమైన విషయాలలాంటి అనేకమైనవి తెలుసుకోవచ్చు.

వావిలికొలను సుబ్బరావు కడప జిల్లా, జమ్మలమడుగులో 1863 లో జన్మించి 1939 లో పరమపదించారు. ఎఫ్.ఎ చదువు పూర్తిచేసి, పొద్దుటూరు తాలూకా కార్యాలయంలో చిరుద్యోగిగా చేరి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ హోదాకెదిగారు. 1893-1904 మధ్య కాలంలో పదకొండేళ్లు రెవెన్యూ శాఖలో ఉద్యోగం చేసారు. కందుకూరి వీరేశలింగం పంతులు తర్వాత, మద్రాస్ (నేటి చెన్నై) ప్రెసిడెన్సీ కళాశాలలో తెలుగు పండితులుగా 1904-1920 మధ్య కాలంలో పనిచేసారు. కళాశాలలో చేరక ముందే, "శ్రీ కుమారాభ్యుదయం" అనే ప్రబంధ గ్రంథాన్ని రచించారు. భార్యా వియోగం కలగడంతో, వాసుదాసు భక్తి, యోగ మార్గం పట్టారు. ఆంధ్ర వాల్మీకి రచనాకాలం 1900-1908 మధ్య కాలంలో. గాయత్రీ మంత్రం, రామ షడక్షర మంత్రం మూలంలో వున్నట్లే, అనువాదంలో కూడా నిక్షిప్తం చేసారాయన. వాల్మీకంలో వున్న బీజాక్షరాలన్నీ, ఇందులోనూ యథాస్థానంలో చేర్చబడ్డాయి. విడిగా వాసుదాసుగారు, గాయత్రీ రామాయణం, శ్రీరామనుతి కూడా రాసారు. ఆంధ్ర వాల్మీకం అనువాదమైనా, స్వంత రచన, స్వతంత్ర రచన అనిపించుకుంది.

బ్రహ్మర్షి వాల్మీకి రచించిన రామాయణం సంస్కృత భాషలో వున్నందువల్ల చాలామందికి దురవగాహమై పోయింది. చాలామంది తెలుగులో అనువదించి నప్పటికీ అవి కేవలం కథాంశం తెలియ

చెప్పడానికే పరిమితమై పోయాయి. తప్పకుండా అర్థం చేసుకోవాల్సిన సూక్ష్మ విషయాలను అనువాదకులు వదిలిపెట్టారు. వాసుదాస స్వామి శ్రీరామ భక్త కోటిలో చేరి, దాసోభావంతో పరమ భక్తో–ప్రపత్తో మోక్షోపాయానికి మార్గమని భావించాడు.

తనను తన్నే పరిచయం చేసుకుంటూ ఆయన అన్న మాటలు అక్షర లక్షలు. "వాల్మీకి సంస్కృత రామాయణం మూలంలోని 24,000 శ్లోకాలకు, శ్లోకానికి ఒకటి చొప్పున, తెలుగులో 24,000 పద్యాలను రాయాలని సంకల్పించుకున్నాను. అనుకొని, శ్రీరామచంద్రుడే శరణ్యం అన్న నిర్ణయానికొచ్చాను. ఒకనాడు పారాయణం ముగిసిన తర్వాత, శ్రీమద్రామాయణం పుస్తకం ముందుంచుకుని, ప్రశ్న వేసుకున్నాను. ఆశ్చర్యకరంగా వచ్చిన సమాధానం ''ఉత్తిష్ఠ హరి శార్దూల, లంఘయస్వ మహార్ణవమ్'' (''లెమ్మా హరిశార్దూలా, యిమ్మహితార్ణవము దాటుమీ'') అన్న శ్లోక రూపంలో సమాధానం లభించింది. ఇక ఆగవద్దనుకుని, 1900వ సంవత్సరంలో, ఆశ్వయుజ శుద్ధ దశమి నాడు, గ్రంథ రచన ఆరంభించాను".

"ఇంటి ముందరున్న పారిజాతం ఒంటిమిట్ట కోదండ రాముడికే ఈ కృతిని అంకితం చేశాను. సంస్కృతంలో ''వాల్మీకి రామాయణం'' ఎలాగో, తెలుగులో నా రచన అలానే అనుకుని రచనను కొనసాగించాను. శాలివాహన శకం ౧౮౩౦ (1830) అంటే 1908వ సంవత్సరంలో, శ్రావణ పౌర్ణమి నాడు, భగవదనుగ్రహం వల్ల కావ్యం పూర్తయింది. నాతో రామాయణ రచనను పూర్తి చేయించి, శ్రీ రామచంద్రుడే తన సత్య సంధత్వాన్ని ప్రపంచానికి తెలియపర్చాడు".

"సంస్కృతం నుంచి తెలుగుకు భాషాంతరీకరణం చేస్తున్నప్పుడు, మూలంలోని ప్రతి అక్షరానికి అలాంటి మారక్షరం వేయాలన్న ఉద్దేశం నాకు లేదు. నాకు చేతనైనంతవరకు తత్ సమానమైన అక్షరాలతో పోషిస్తూ తెనిగించాను. ఒక్కోసారి, శ్లోకానికి పద్యం కాకుండా, రెండు, మూడు శ్లోకాల భావాన్ని ఒక్క పద్యంలోనే చొప్పించే ప్రయత్నం కూడా చేశాను. రాసేది లోకోపకారమైన గ్రంథం కాబట్టి సార్వజనీనంగా వుండాలన్నదే నా అభిప్రాయం. ఈ కారణం వల్ల, మూలంలో గూఢంగా వున్న సందర్భాలలో, దాని అర్థాన్ని విడమర్చి కొంచెం పెంచి రాసాను. ఏ కారణం వల్ల వాల్మీకి తన కావ్యాన్ని ''నిర్వచనం'' గా రాసారో, అదే కారణం వల్ల నేనుకూడా తొలుత దీన్ని నిర్వచనంగానే రచించాను. నేను సర్వజ్ఞుడను కానందున, అల్పజ్ఞుడైనందున, శక్తిహీనుడను కూడా అయినందున, మీరు ఆలోచించి, నా సాహసానికి క్షమించి, మీ పిల్లల మాటలలాగా నా రచనను అనుగ్రహించి నన్ను ధన్యుడిని చేయమని ప్రార్థిస్తున్నాను. నా దోషాలను మన్నింతురుగాక" అని చెప్పుకున్నారు వావిలికొలను సుబ్బారావు.

శ్రీమదాంధ్ర వాల్మీకి రామాయణం రచించడం పూర్తి చేసిన తర్వాత జరిగిన విషయాలను కూడా వాసుదాసు మాటల్లోనే తెలుసుకుందాం.

"గ్రంథ రచన పూర్తవగానే ఒంటిమిట్ట శ్రీకోదండరాముడికి నివేదించి, లోకానికి తెలియచేయడం ఎలాగని ఆలోచన చేశాం. ఒక ఆహ్వాన సభను ఏర్పాటు చేశాం. అందులో మహా–మహా పండితులు అనేకమంది వున్నారు. ఇలాంటి మహనీయుల కలయికతో అలంకరించిన సభ ఎలాంటి కార్యాన్నైనా చేయగలదు కదా! ఆహ్వానాలందుకుని వచ్చిన వారిలో చాలామంది గొప్ప కవులు, విద్వాంసులు,

అధికారులు, పూజ్యులున్నారు. కార్యక్రమం మూడు రోజులూ, ఉదయం, శ్రీ సీతారామచంద్రులకు సహస్రనామార్చన యథావిధిగా జరుపబడింది".

"మొదటిరోజు ఉదయాన సంస్కృత వాల్మీకి రామాయణం, ఆంధ్ర వాల్మీకి రామాయణం పుస్తకాలను శ్రీస్వామివారి పల్లకిలో వుంచి, ఆ పల్లకిని, మంగళ వాద్యాలతో దేవాలయ గ్రామ ప్రదక్షిణగా వూరేగించారు. గ్రంథానికి పూజ చేసిన తర్వాత ముందున్న కొంత భాగాన్ని కవి చదివారు. ఒక్కరే మూడు దినాల్లో పూర్తి గ్రంథాన్ని చదవడం కష్టమని భావించి, మరికొందరు తోడ్పడి పుస్తక పఠన పూర్తి చేశారు. మూడు రోజులు కూడా దేవాలయ ముఖ మంటపంలో సభలు జరిగాయి. తర్వాత గ్రంథ పరీక్ష జరిగింది. పండితులందరూ వారి వారి సంతుష్టిని పద్యంగానో, ఉపన్యాసంగానో వెల్లడిచేసి, కృతిని ప్రశంసించి కవిని ఆశీర్వదించారు. శ్రీమదాంధ్ర వాల్మీకి రామాయణం, కృతి భర్తైన ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామి వారికి సమర్పించబడింది. అలనాటి పత్రికల్లో ఈ కార్యక్రమాన్ని గురించి విశేషంగా వార్తలొచ్చాయి. ప్రశసింస్తూ ప్రసంగం చేసిన వారు పద్యాలను చదివిన వారు, నన్ను బమ్మెర పోతనతో పోల్చారు" అని రాసుకున్నారు వావిలికొలను సుబ్బరావు.

ఆంధ్ర వాల్మీకిరామాయణం తర్వాత రచించబడిన పలు గద్య, పద్య రామాయణాలకు విశేష ప్రాచుర్యం లభించినా, ఆ రోజుల్లోనూ, ఈ రోజుల్లోనూ, వాసుదాసు రామాయణానికి ప్రాచుర్యం లభించినా తగినంత గుర్తింపు ఎందుకు లభించలేదనేది జవాబు దొరకని ప్రశ్న. వ్యాస మహాభారతాన్ని మొదట తెనిగించిన నన్నయను ''ఆదికవి'' గా పిలిచినప్పుడు, వాల్మీకి రామాయణాన్ని మొట్టమొదట తెనిగించిన వాసుదాసు కూడా ''ఆదికవే'' కదా? నన్నయంతటి గొప్పవాడే కదా. వాస్తవానికి సరైన పోషకుడో, ప్రాయోజకుడో వుండి వుంటే, వాసుదాసు ఆంధ్రవాల్మీకిరామాయణం, ఎప్పుడో, ఏనాడో నొబెల్ సాహిత్య బహుమతికో, జ్ఞానపీఠ పురస్కారానికో నోచుకుని వుండేది.

వాసుదాసు ఆంధ్ర వాల్మీకిగా లబ్దప్రతిష్టులయ్యారు. కాలం గడిచిపోతున్నది. వాసుదాసు మారిపోతున్న తరాలకు గుర్తురావడం కూడా కష్టమైపోతున్నది. మళ్లీ-మళ్లీ జ్ఞాపకం చేసుకోవాల్సిన, మరువలేని మహనీయుడు, ప్రాతఃస్మరణీయుడు వాసుదాసస్వామి.

◆❖◆

వాల్మీకి రామాయణం ఒక విశిష్టమైన గ్రంథం

ఆంధ్ర వాల్మీకి, కవిసార్వభౌమ వాసుదాసు (వావిలికొలను సుబ్బరావు) ''శ్రీ మదాంధ్ర వాల్మీకి రామాయణం'' లో వెలిబుచ్చిన అభిప్రాయాలు అక్షర లక్షలు చేసే ఆణిముత్యాలు. వివరాల్లోకి పోతే.....

వాల్మీకి సంస్కృత రామాయణం మూలంలోని 24,000 శ్లోకాలకు, శ్లోకానికి ఒకటి చొప్పున, తెలుగులో 24,000 పద్యాలను రాయాలని సంకల్పించుకున్నారు వాసుదాస స్వామి. ఇది జరగాలంటే శ్రీరామచంద్రుడే తనకు శరణ్యం అన్న నిర్ణయానికొచ్చారాయన. ఒకనాడు పారాయణం ముగిసిన తర్వాత, భగవత్ సన్నిధానంలో కూర్చొని, శ్రీమద్రామాయణం పుస్తకం ముందుంచుకుని, ప్రశ్న వేసుకున్నారు. ఆశ్చర్యకరంగా వచ్చిన సమాధానం ''ఉత్తిష్ఠ హరి శార్దూల, లంఘయస్వ మహార్ణవమ్'' (''లెమ్మా హరిశార్దూలా, యిమ్మహితార్ణవము దాటుమీ'') అన్న శ్లోక రూపంలో సమాధానం లభించింది. భగవత్ కటాక్షానికి పాత్రుడనయ్యానని నమ్మి, 1900వ సంవత్సరంలో, ఆశ్వయుజ శుద్ధ దశమి నాడు, గ్రంథ రచన ఆరంభించారాయన.

"శ్రీ రామాయణం, భారతం, భాగవతం అద్వితీయమైన గీర్వాణ భాషా గ్రంథాలు. ఈ మూడింటి లో ఆద్యమైంది శ్రీ రామాయణ కావ్యం. కావ్యాలలోకెల్లా ప్రథమంగా ఉత్పన్నమైంది కావడంతో ఆదికావ్యమైంది. రామాయణాన్ని చక్కగా తెలిసినవారు, అర్థం చేసుకోగలిగిన వారు మాత్రమే లోకానికి అందలి విషయాలను వివరించ సమర్థులు. అందరికీ అది సాధ్యమయ్యేది కాదు. అనేకరకమైన లౌకిక విషయాలను తెలుసుకోవాలనుకునే వారికి శ్రీ రామాయణాన్ని మించి తెలిపే గ్రంథం ఎక్కడా లేదు. పరమపదానికి పోవాలనుకునే కోరికగల వారికి, సుఖమైన మార్గాన్ని బోధించగల గ్రంథం శ్రీ రామాయణం తప్ప మరొకటి లేదు. కాలక్షేపానికి చదవడానికైనా శ్రీ రామాయణం లాంటి పుస్తకం ఇంకోటి లేదు. ఇహ-పర లోకాల్లో సుఖపడాలనుకునేవారికి, శ్రీ రామాయణ పఠనం అవశ్య కర్తవ్యం".

"సీతారాములలో విశేషమేమిటంటే, వారు అవతార మూర్తులు కావడమే! భగవంతుడే, శ్రీరాముడుగా, లోక రక్షణార్థం జన్మించాడన్న నమ్మకమే, లోకులందరు ఒకేవిధంగా శ్రీ సీతారాములను

అర్చన చేయడానికి కారణమైంది. వాల్మీకి మహర్షి ఆ అవతార రహస్యాన్ని, తాను గ్రంథస్థం చేసిన శ్రీ రామాయణంలో వివరించాడు. వాల్మీకి మహర్షి, తను రచించిన ఆది కావ్యానికి శ్రీ రామాయణం అని పేరు పెట్టాడు. ఇందులో సీతాదేవి మహాత్మ్యాన్ని విశేషించి చెప్పడంవల్ల వాల్మీకి మహర్షే, శ్రీ రామాయణాన్ని ''సీతాయాశ్చరితం మహత్తు'' అని వెల్లడిచేశాడు. ఆసక్తిగా శోధించిన వారికి, పరీక్షించిన వారికి మాత్రమే, వాల్మీకి రామాయణానికి, ఇతర రామాయణాలకు గల తారతమ్యం, వాల్మీకి రామాయణంలోని గొప్పదనం తెలుస్తుంది''.

''శ్రీ రామాయణం మహాకావ్యం. శ్రీమద్రామాయణంలో ఉత్తమోత్తమ మహాకావ్య లక్షణాలెన్నో వున్నాయి. వర్ణనలెన్నో వున్నాయి. రామాయణం గానం చేసినా, పఠించినా మనోహరంగా వుంటుంది. రామాయణంలో శృంగారం లాంటి నవ రసాలున్నాయి. అందులో శృంగార రసం ''సంభోగ శృంగారం''. వాల్మీకి శ్లోకాల భావం మాత్రమే కాకుండా, అందులోని కొన్ని పదాలు ఎంత అర్థ గాంభీర్యం గలవిగా–రసవంతంగా వుంటాయో చెప్పలేము. ఇందులో హాస్యం, కరుణ, వీర, రౌద్రం, భయానక, బీభత్సం, అద్భుతం, శాంతం రసాలను కనుగొన వచ్చు''.

''ఇక అలంకారాల విషయానికొస్తే, శబ్దాలంకారాలని, అర్థాలంకారాలని రెండు రకాలున్నాయి. రామాయణంలో శబ్దాలంకారాలు తరచుగా కనబడవు. అంత్యానుప్రాసలు కొన్ని చోట్ల వున్నాయి. వర్షాన్ని వర్ణన చేసిన సందర్భంలో మన ఎదుట వర్షం కురుస్తున్నట్లే వుంటుంది. హేమంతాన్ని వర్ణిస్తుంటే, మనకు మంచులో తడుస్తున్నామా అనిపిస్తుంది. అడవులలో జరిగినవి, మనమెప్పుడూ చూడనివి–విననివి చదువుతుంటే, మన కళ్లకు కట్టినట్లే వుంటుంది. తన వర్ణనా చాతుర్యంతో వాల్మీకి, పాఠకులను, తన చేతిలో బొమ్మలా చేసి, ఇష్టమొచ్చినట్లు ఆడుకుంటాడు''.

''వాల్మీకి మరో ప్రత్యేకత ఉత్ప్రేక్ష. అలానే ఆయన వాడిన శ్లేషాలంకారాలు. శ్లేషాలంకారానికి చక్కటి ఉదాహరణ వాల్మీకి నోట వెలువడిన ప్రథమ శ్లోకం. 'మానిషాద ప్రతిష్ఠాం త్వ! మగ మ శ్శాశ్వతీ స్సమాః ... యత్క్రౌంచ మిథునాదేక! మవధీః కామమోహితం'. వేదాన్య విషయంలో కలిగిన ఈ ఆదిమ శ్లోకానికే నిషాద పరంగా ఒక అర్థం, భగవత్ పరంగా రెండో అర్థం వున్నాయి. ఇదే రామాయణ ఉత్పత్తికి కారణమైన శ్లోకం కావడంతో నాంది శ్లోకం అయింది. రామాయణంలోని ఏడు కాండల అర్థం, కథ ఇందులో సూక్ష్మంగా సమర్థించబడింది''.

''అలంకార శాస్త్రంలో ఎన్ని అలంకారాలు చెప్పబడ్డాయో, అవన్నీ వాల్మీకి రామాయణంలో వున్నాయి. వాల్మీకి అసమాన కవితా చాతురి వర్ణనాతీతం. మరొక్క ఉదాహరణ చిత్రాలంకార ఉపయోగం. ప్రశ్న, జవాబు ఒక్క వాక్యంగానే వుంటే చిత్రాలంకారం అవుతుంది. ఇంత దీర్ఘంగా ఊహించి రాసిన కవి ఇంతవరకూ ఒక్క వాల్మీకే. అలంకారాల వరకెందుకు? సాధారణ విషయాన్ని చెప్పాల్సి వచ్చినప్పుడు కూడా ఏదో ఒక చమత్కారాన్ని కనబరిచేవాడు''.

''వాల్మీకి రామాయణంలోని పాత్రలు–పాత్రధారుల వాక్కులు, ఆయా పాత్రల చిత్త వృత్తి గుణాలను తెలియచేసేవిగా, సందర్భోచితంగా, వారున్న అప్పటి స్థితికి అర్హమైనవిగా వుంటాయి. పాత్ర గుణ మహాత్మ్యానికి అసంగతమైన వాక్యాలు ఆయా పాత్రల నోటినుంచి వెలువడవు. శ్రీరాముడు

భగవంతుడన్న అభిప్రాయం వాల్మీకి పదే పదే చెప్పుకుంటూ పోయాడు రామాయణంలో. వాల్మీకి రామాయణమనే ''కలశార్ణవం'' లో రత్నాలను వెదికేవారు, మొట్టమొదటగా తెలుసుకోవాల్సింది వాల్మీకి శైలి–విధానం. అది తెలుసుకోలేక వెతకడం మొదలుపెట్టితే, చీకట్లో తారాడినట్లే. ఒక విషయం గురించి చెప్పాల్సిందంతా ఒకచోట చెప్పడు. కొన్ని సందర్భాలలో ఆ విషయానికి సంబంధించిన ప్రస్తావనే వుండదు. అదే విషయం మరెక్కడో సూచన ప్రాయంగా వుండొచ్చు. ఒక్కోసారి విపులంగా విశదీకరించబడి వుండొచ్చు. ఆయన చేసిన వర్ణనలను బట్టి, ప్రయోగించిన పదజాలాన్ని బట్టి, పాఠకులు ఊహించుకోవచ్చు. ఒకే విషయం, ఒకటి కంటె ఎక్కువ సార్లు చెప్పితే, ఒక్కోసారి ఒక్కోరకమైన విశేషంతో చెప్పబడుతుంది. ఇలాంటి చిత్రాలు అనేకం వుంటాయి''.

''వాల్మీకి రామాయణం ''ధ్వని కావ్యం''. కావ్యానికి ప్రధానమైంది ధ్వని. కావ్యానికి ప్రాణం ధ్వని. ధ్వని లేని కావ్యం శవంతో సమానం. రామాయణంలో ధ్వని విశేషంగా వుంది. కావ్యమంతా ధ్వన్యర్థం వుండడమే కాకుండా, పలు శ్లోకాలకు విడిగా ధ్వన్యర్థం వుంది. రుతు వర్ణనలలో ధ్వని స్ఫురిస్తుంది. శ్రీ రామాయణంలోని కవితా చమత్కృతిని విశదీకరించాలంటే, ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. ఇంతెందుకు ! కాళిదాసు, భవభూతి అంత గొప్ప వాళ్లు కావడానికి రామాయణమే కారణం. కాళిదాసు రచనలు గమనిస్తే, ఆయన వాల్మీకి శిష్యుడని తెలియడమే కాకుండా, గురు శిష్యుల తారతమ్యం స్పష్టంగా బయట పడుతుంది. వాల్మీకి రామాయణం నుంచి కాళిదాసు లాంటి వారు గ్రహించినవి ఎన్నో వున్నాయి. వేదవ్యాసుడంతటి వాడు వాల్మీకి శ్లోకాలను అనువదించగా లేంది, వేరేవారి సంగతి చెప్పాలా ! ఎవరికైనా సత్కవి కావాలని కోరికుంటే, వారు వాల్మీకి రామాయణాన్ని అనేక పర్యాయాలు, శ్రద్ధగా–భక్తితో పఠించాల్సిందే''.

''శ్రీమద్రామాయణం గొప్ప ధర్మ శాస్త్రం. ఇందులో సర్వ విధాలైన, అన్ని రకాల ధర్మాల గురించి వివరంగా చెప్పబడింది. రాజ ధర్మం, ప్రజా ధర్మం, పతి ధర్మం, సతీ ధర్మం, భాతృ ధర్మం, పుత్ర ధర్మం, భృత్యు ధర్మం, మిత్ర ధర్మం లాంటి అన్ని ధర్మాలను గురించి చక్కగా తెలుపబడి వుంది. లాభ–లోభ–పక్షపాత బుద్ధి లేకుండా, న్యాయం మీదే దృష్టి నిలిపి వాదించే న్యాయవాది ధర్మం కూడా చెప్పబడింది. వీటితో పాటు కథా సందర్భానుసారంగా, అంతరాంతరాలలో ఎన్నో నీతులు చెప్పబడ్డాయి. ఇలా రామాయణంలో సకల ధర్మాలున్నాయి. ఇందులో వున్న ధర్మాలే మిగిలిన అన్ని గ్రంథాలలోనూ కనబడతాయి. ఇందులో లేని ధర్మాలు మరింకేదాంట్లోను కనిపించవు. రామాయణంలో సూత్రప్రాయంగా చెప్పిన ఎన్నో విషయాలను వ్యాసమహర్షి తన గ్రంథాలలో పేర్కొన్నాడు. భగవద్గీతంతా కూడా రామాయణ సారమేనని గ్రహించాలి''.

''శ్రీమద్వాల్మీకి రామాయణం మంత్రనిధానం. ఇందులో అనేకానేక మంత్రాలు ఉద్ధరించబడి వున్నాయి. రామాయణమంతా గాయత్రీ స్వరూపమే. గాయత్రిలోని 24 అక్షరాలను, ప్రతి వేయి శ్లోకాలకు ఒక అక్షరం చొప్పున శ్లోకం ఆరంభంలో చెప్పబడింది. ఈ గాయత్రీ విధానాన్ని నారదుడే స్వయంగా వాల్మీకి మహర్షికి, రామాయణంతో పాటే ఉపదేశించాడు. గాయత్రిలోని మొదటి అక్షరంతో శ్లోకాన్ని ప్రారంభించి, అని గాయత్రి కడపటి అక్షరంతో సర్గను ముగించాడు వాల్మీకి''.

"రామాయణం పారాయణం చేసినవారి కోరికలు నెరవేర్చే శక్తి, రామాయణానికి వుండడానికి కారణం, అది భగవత్ కథ కావడానికి అదనంగా సర్వజ్ఞుడైన వాల్మీకి కూర్చిన బీజాక్షరాల మహాత్మ్యమే. శ్రీమద్రామాయణం వేదంతో సమానమైందే కాకుండా వేదమే అనాలి. వేద పఠనం అవశ్యంగా చేయాల్సిన కార్యక్రమాల్లో, రామాయణ పఠనం నియమితమైంది. శత కోటి, అంటే 24 గాయత్రీ బీజాక్షరాలతో కూడిన 24,000 గ్రంథాల రామాయణంలోని ప్రతి అక్షరానికి మహా పాతకాలను నాశనం చేయగల శక్తిగలదని కొందరంటారు. కొందరేమో, శత కోటి రామాయణాన్ని వాల్మీకి సంగ్రహంగా చెప్పాడంటారు. ఇలాంటి మహిమ రామాయణంలో వుండడానికి కారణమేంటో ఆలోచించాలి. వాల్మీకి సూత్రాన్ననుసరించి, రామాయణం వేద స్వర సముద్ధృతంగా, సర్వశ్రుతులందున్నట్లుగా తెలుస్తోంది. రామాయణం ఒక మహత్తరమైన సాంఖ్య శాస్త్రం".

"శ్రీరాముడు సామాన్య ధర్మాలన్నీ ఎలా అనుష్టించింది, కష్ట కాలంలో ఎలా ప్రవర్తించింది, సుఖ కాలంలో ఎలా నడచుకుంది, ఎలాంటెలాంటి వారి మీద ఏ విధమైన అభిప్రాయంతో మెలిగేవాడనేదీ, వీటి కారణాలేంటి అన్న విషయాలన్నీ చర్చించాల్సినవే. రాముడి పైనా, ఆయన తమ్ములపైనా ఏక పత్నీవ్రతం విషయంలో కూడా విరుద్ధాభిప్రాయాలను వెలిబుచ్చిన వారున్నారు". ఈ విషయాలన్నీ చెప్పిన వాసుదాసు గారు రామాయణ గ్రంథమేమో చాలా గొప్పదనీ, రాసిన కవేమో బ్రహ్మర్షి అనీ, ఇందులోని మర్మాలేమో మెండుగా వున్నాయనీ, రాసిందేమో సంస్కృత భాషలో అనీ, చదివినా కొద్దీ విశేషాలు కనిపిస్తాయనీ, అందుకే తాను తెలుగులో ఆంధ్ర వాల్మీకి రామాయణంగా దీన్ని రాశాననీ, పాఠకులు ఆంధ్ర వాల్మీకి రామాయణాన్ని దయతో చదివి తనను ధన్యుడిని చేయండనీ విన్నవించుకుంటాడు.

రామాయణం సర్గలలోని శ్లోకాల సంఖ్యా వివరాలు

కాండ	**సర్గలు**	**శ్లోకాలు**
బాల కాండ	77	2256
అయోధ్య కాండ	119	4415
అరణ్య కాండ	75	2732
కిష్కింధ కాండ	67	2620
సుందర కాండ	68)	3006
యుద్ధ కాండ	131	5990
ఉత్తర కాండ	110	3234
ఏడు కాండలు	**647**	**24,253**

◆❖◆

రామాయణానికి ప్రేరకుడు నారదుడా?

భగవద్విషయాన్ని బోధించే యోగ్యతున్న గురువు దొరకలేదనే నిర్వేదంతో శుష్కించిన వాల్మీకి దగ్గరకు బ్రహ్మ ఆదేశానుసారం నారదుడొస్తాడు ఒకనాడు. వాల్మీకి ఆయనకు సాష్టాంగ నమస్కారం చేసి ప్రశ్నించాడిలా:

"తపమున స్వాధ్యాయంబున, నిపుణుని వాగ్విద్వరేణ్యు నిఖిల మునిజనా
ధిపు నారదుసంప్రశ్నము, తపస్వి వాల్మీకి యిట్టు, తమి గావించెన్"

''తపమున స్వాధ్యాయంబున'' అని అనడమంటే, ఆచార్యుడికుండాల్సిన గుణ సంపత్తిని తెలపడమే. ''వాగ్విద్వరేణ్యుడు'' అంటే, కేవలం వేదమే కాకుండా అర్థ జ్ఞానం కూడా నారదుడికి ఉన్నదని అర్థమొస్తుంది. ''నిఖిల ముని జనాధిపు'' అనే విశేషణం సమాహితత్వమనే ఆచార్య గుణాన్ని తెలియచేస్తుంది. ''తపమున నిపుణుడు'' అంటే జ్ఞానాధికుడని, ''ముని జనాధిపుడు'' అంటే ఉపాసుకులందు శ్రేష్ఠుడని, నారదుడిలో ఈ రెండూ పూర్ణ శక్తులుగా వున్నాయనీ అర్థం. నారదుడు భగవత్తత్వాన్ని సాక్షాత్కరించుకున్నాడని ఆతర్వాత చెప్పిన పదాల్లో వుంది. "సంప్రశ్నము" అన్న పదంద్వారా మిక్కిలి శ్రేష్ఠమైనప్రశ్న అడిగి, మంచివిషయాన్ని రాబట్టదలిచాడన్న అర్థం స్ఫురిస్తుంది. ఇట్లా నారదుడిలోని ఆచార్య లక్షణాలను సంపూర్ణంగా వర్ణించడం జరిగింది.

వాల్మీకి చరిత్ర గురించి కూడా ఇందులో ఇమిడి వుంది. వాల్మీకిలోని శిష్య లక్షణాలను చెప్పడం కూడా జరిగింది. నిర్వేదం లేనివాడు ముముక్షువు కాలేడు. ఉపదేశార్హుడూకాడు. వాల్మీకి జాతి బ్రాహ్మణుడే అనాలి. బ్రహ్మ కూడా వాల్మీకిని ఓ సందర్భంలో "బ్రాహ్మణుడా" అని సంబోధిస్తాడు. వాల్మీకి రచించిన శ్రీమద్రామాయణానికి ఇరవైనాలుగువేల గ్రంథాల పరిమితుంది. ముప్పై రెండక్షరాలను గ్రంథమంటారు. వెయ్యికి ఒకటి చొప్పున 24,000 గ్రంథాలలో 24 గాయత్రీ వర్ణాలు చేర్చబడ్డాయి. "గుణవంతుడు, అతివీర్యవంతుడు, ధర్మజ్ఞుడు, కృతజ్ఞుడు, సత్యశీలుడు, సమర్థుడు,

నిశ్చలసంకల్పుడు, సదాచారం మీరనివాడు, సమస్త ప్రాణులకు మేలుచేయాలన్న కోరికున్నవాడు, విద్వాంసుడు, ప్రియదర్శనుడు, ఆత్మవంతుడు, కోపాన్ని స్వాధీనంలో వుంచుకున్నవాడు, ఆశ్చర్యకరమైన కాంతిగల వాడు, అసూయ లేనివాడు, రణరంగంలో దేవదానవులను గడ–గడలాడించ గలవాడు ఎవరైనా వున్నారా ఈ భూలోకంలో?" అని పదహారు ప్రశ్నలు వేస్తాడు వాల్మీకి నారదుడిని.

ప్రశ్నలు పదహారు. ఇది తపస్సంఖ్యాకం. పదహారు కళలతో కూడినవాడు పూర్ణ చంద్రుడు. అలానే పదహారు ప్రశ్నలకు జవాబుగా శ్రీరామచంద్రుడిని తప్ప ఇంకొకరి పేరు చెప్పగలమా? అందుకే శ్రీరాముడిది పూర్ణావతారం. శ్రీరాముడి విషయమై తన అభిప్రాయాన్ని దృఢపర్చుకోవడానికి, భగవద్విషయం ఉపదేశ రూపంగా గ్రహించేందుకు ఈ పదహారు ప్రశ్నలడిగాడు వాల్మీకి. బాల్యంలోనే శ్రీరాముడు గుహుడులాంటి వారితో సహవాసం చేయడంతో, ఆయన ''గుణవంతుడు'' అయ్యాడు. తాటకాది రాక్షసులను చంపి ''వీర్యవంతుడు'' అయ్యాడు. గురువాజ్ఞ మీరకపోవడం, జనకాజ్ఞ జవదాటకపోవడం, పరశురాముడిని చంపకపోవడం లాంటివి ఆయన ''ధర్మజ్ఞుడు'' అని తెలుపుతాయి. అయోధ్య కాండ వృత్తాంతమంతా శ్రీరాముడిని సత్యవాదిగా, దృఢవ్రతుడిగా, సచ్చరిత్రుడుగా తెలుపుతుంది. విద్వాంసుడు, సమర్థుడు అనే విషయాలను కిష్కింధ కాండలో హనుమంతుడితో జరిపిన సంభాషణ, వాలి వధల ద్వారా అర్థమవుతుంది. కాకాసుర రక్షణ శ్రీరాముడి సచ్చరిత్రను, సర్వభూత హితాన్ని అరణ్య కాండ ద్వారా తెలుపుతుంది. సుందర కాండలో హనుమంతుడి రామ సౌందర్య వర్ణన ఆయనెంత ప్రియ దర్శనుడనేది తెలుపుతుంది. విభీష శరణాగతి ద్వారా రాముడి ఆత్మవంతుడి లక్షణాన్ని బయటపెడుతుంది. ఇంద్రజిత్తుపై కోపించక పోవడం, చేజిక్కిన రావణుడిని విడిచిపెట్టడం, రాముడి జితక్రోధత్వాన్ని తెలుపుతుంది.విరోధైన రావణుడిని మెచ్చుకోవడమంటే రాముడికి అసూయ లేదనే కదా. ఇలానే రాముడు కాంతియుక్తుడనీ, భయంకరుడనీ పలుసందర్భాల్లో అర్థమవుతుంది.

ఇన్నిగుణాలున్నవాడు ఎవరైనా వుంటారా? ఇలాంటి విషమ ప్రశ్నలు వేసి తనను పరాభవిస్తున్నాడేమోనని నారదుడనుకోవచ్చునని భావించాడు వాల్మీకి. అందుకే మళ్లా అంటాడు, వాస్తవార్థం తెలుసుకోగోరి అడిగానే గాని పరీక్షించడానికి కాదని. జవాబుగా నారదుడు: "వాల్మీకీ నీ ప్రశ్నకు తగిన సమాధానం చెప్తాను. సావధానంతో విను" అంటాడు, భగవత్ గుణ వర్ణనానుభవం కలిగిందన్న సంతోషంతో.

తాను ఏ విషయాన్ని బ్రహ్మ దగ్గర తెలుసుకుని వాల్మీకికి ఉపదేశించాలని వచ్చాడో, ఆవిషయాన్ని గురించే వాల్మీకి ప్రశ్నించినందువల్లా, శత కోటి పరిమితమైన రామాయణం తాను బ్రహ్మవల్ల విన్నందువల్లా, తనకు తెలిసిన విషయమే వాల్మీకి అడిగినందువల్లా సులభంగా చెప్పొచ్చునని భావించాడు నారదుడు. వాల్మీకి అడిగిన ప్రశ్న లోకోత్తర విషయానికి సంబంధించింది. అడిగినవాడు, జవాబిచ్చేవాడూ వేదాంతజ్ఞులే. ఇరువురూ సర్వదా భగవత్ చింతన చేసేవారే. నారదుడు భక్తుడు. తత్వవిచారంకంటే గుణ విచారమే శ్రేయస్కరమని ఆయన నమ్మకం. వాల్మీకీ ఆ కోవకి చెందినవాడే. అందుకే భగవత్ గుణ వర్ణన వాల్మీకి చేయగానే నారదుడు సంతోషించాడు.

నారదుడు వాల్మీకి అభిప్రాయాన్ని గ్రహించి అతనికి కావల్సిన రీతిలోనే సమాధానం ఇస్తాడీవిధంగా:

“ముని శ్రేష్ఠా, నీవు శ్లాఘించిన గుణాలు అసమానమైనవి. ఇట్టి సుగుణ సంపత్తిగలవారెవరో చెప్తా, శ్రద్ధగా విను. ఏ వంశంలోనైతే, ఏ ఇంటిలోనైతే, నిత్యం భగవంతుడు ఆరాధించబడుతున్నాడో, అట్టి ఇక్ష్వాకుల మహారాజు వంశంలో, 'రామా రామా రామా', అని లోకులు పొగిడే రామచంద్రమూర్తి అనే పేరుగలాయన జన్మించాడు. అతివీర్యవంతుడాయన. అసమానమైన, వివిధమైన, విచిత్రమైన శక్తిగలవాడు. అతిశయంలేని ఆనందంగలవాడు. ఇంద్రియాలను, సకల భూతాలను వశపర్చుకున్నాడు. సర్వం తెలిసినవాడు. నీతే ప్రధానం ఆయనకు. పరులకు హితమైన, ప్రియమైన మాటలు చెప్తాడు. శ్రీమంతుడు. ఎవరిపై శత్రు భావం లేకపోయినా, తనను ఆశ్రయించిన వారిని ద్వేషిస్తే, వారిని నాశనం చేసే వాడు.”

“శ్రీరామచంద్రుడు ప్రశస్తమైన ధర్మజ్ఞానంగలవాడు. క్షత్రియులకు ప్రశస్త ధర్మమైన శరణాగత రక్షణను ముఖ్య వ్రతంగా ఆచరించేవాడు. చేసిన ప్రతిజ్ఞ తప్పనివాడు. సమస్త భూ జనులకు మేలైన కార్యాలనే చేసేందుకు ఆసక్తి చూపేవాడు. దానధర్మాలు, స్వాశ్రితరక్షణ వల్ల లభించిన యశస్సు, శత్రువులను అణచినందున వచ్చిన కీర్తిగలవాడు. సర్వ విషయాలు తెలిసినవాడు. బ్రహ్మ జ్ఞాన సంపన్నుడు. మిక్కిలి పరిశుద్ధుడు. ఋజుస్వభావం గలవాడు. ఆశ్రిత రక్షకుడు. ఆత్మతత్వం ఎరిగినవాడు. ఆశ్రితులకు, మాత, పిత, ఆచార్యులకు, వృద్ధులకు వశ పడినవాడు. విష్ణువుతో సమానుడు. లోకాలను పాలించ సమర్థుడు. ఆశ్రిత శత్రువులను, తన శత్రువులనూ అణచగలిగినవాడు”.

“ఎల్ల ప్రాణికోటిని రక్షించాలన్న కోరికున్నవాడు. ధర్మాన్ని తానాచరిస్తూ, ఇతరులతో ఆచరింపచేసేవాడు. స్వధర్మ పరిపాలకుడు. స్వజనరక్షకుడు. వేద వేదాంగాలను రహస్యార్థాలతో ఎరిగినవాడు. కోదండ దీక్షాపరుడు. సర్వ శాస్త్రాల అర్థాన్ని నిర్ణయించగల నేర్పరి. జ్ఞాపకశక్తిగలవాడు. విశేషప్రతిభగలవాడు. సమస్త ప్రపంచానికి ప్రియం చేసేవాడు. సాధువు. గంభీర ప్రకృతిగలవాడు. అన్ని విషయాలను చక్కగా బోధించగలవాడు. నదులన్నీ సముద్రానికి పారినట్లే ఎల్లప్పుడూ ఆర్యుల పొందుగోరేవాడు. అందరిమీద సమానంగా వారి, వారి యోగ్యత కొద్దీ ప్రవర్తించేవాడు. గొప్పగుణాలున్నవాడు. ఎప్పుడూ, ఏకవిధంగా, మనోహరంగా దర్శనమిచ్చేవాడు. సమస్తభూతకోటికి పూజ్యుడు. అన్నింటా గుణ శ్రేష్ఠుడు. ఆయనే శ్రీరామచంద్రుడు”.

“శ్రీరామచంద్రుడు రాజ్యం చేసేటప్పుడు లోకాలన్నీ సంతోషించాయి. సంతోషాతిశయంతో కలిగిన గగుర్పాటుతో సాదువులు, ధర్మాత్ములు బలపడ్డారు. శ్రీరామరాజ్యంలో సాదువులు చేసే శ్రీరామ సేవకు విరోధమైన మనోవేదనలుకాని, రోగబాధలుకాని, యీతిబాధలుకాని లేవు. పుత్రశోకం ఏ తల్లితండ్రులకు కలగలేదు. స్త్రీలు పాతివ్రత్యాన్ని విడవలేదు. వారికి వైధవ్య దుఃఖం లేదు. ఎక్కడా అగ్నిభయంలేదు. శ్రీరామరాజ్యంలో నీళ్లలో పడి చనిపోయినవారు లేరు. పెద్దగాడ్పులతో ప్రజలు పీడించబడలేదు. దొంగలు లేరు. ఆకలికి, జ్వరానికి తపించినవారు లేరు. నగరాలలో, గ్రామాలలో, నివసించే జనులు ధన-ధాన్యాలు విస్తారంగా కలిగి, భోగభాగ్యాలతో కృతయుగంలో లాగా మిక్కిలి సుఖమనుభవించారు. శ్రీరాముడు అనేక అశ్వమేధ యాగాలను, యజ్ఞాలను చేసి, బ్రాహ్మణులకు లెక్కపెట్టలేనన్ని ఆవులను, ధనాన్ని దానమిచ్చి, తనసుఖాన్ని వదులుకోనైనా ప్రజలకు సుఖం కలిగేటట్లు

ధర్మ పద్ధతిలో రాజ్యపాలన గావించి, వైకుంఠ లోకానికి పోయాడు''.

రామాయణ పఠనంవల్ల ఇహపర లోకాల్లో సౌఖ్యంకలిగే విషయాన్ని నారదుడు చెప్తాడీవిధంగా: "రామాయణం పరిశుద్ధంగా చదివేవారికి, వినేవారికి మూడు విధాలైన సమస్త పాపాలు హరించి పోయి, మోక్ష ఫలం కలుగుతుంది. అంతశక్తి దీనికుండటానికి కారణం, ఇది వేద స్వరూపమై, వేదార్థాన్నే బోధిస్తుంది కాబట్టి. అంతేకాదు, సంసార సాగరాన్ని తరింపచేస్తుంది కూడా. ఇది వినేవారు, చదివేవారు, అంతమాత్రాన సన్యాసులు కానవసరం లేదు. ఆయుస్సు పెరిగి, కొడుకులు, కూతుళ్లతో, మనుమలు, ఇష్ట బంధువులతో అనుభవించి, మరణించిన తర్వాత మోక్షాన్ని, బ్రహ్మానందాన్ని కలిగిస్తుంది. పరిమితి చెప్పనలవికాని మహత్త్వమున్న యీ రామాయణ గ్రంథాన్ని శాస్త్ర ప్రకారం చదివినా, ఇతరులు చదవగా విన్నా, అర్థ విచారం చేసినా, బ్రాహ్మణుడికి వేద వేదాంగాలు అధ్యయనం చేస్తే ఎలాంటి ఫలం కలుగుతుందో అలాంటిదే కలుగుతుంది. క్షత్రియుడికి సర్వాధిపత్యం కలుగుతుంది. వైశ్యుడికి వ్యాపార లాభం కలుగుతుంది. శూద్రుడికి అపారమైన గొప్పతనం లభిస్తుంది. కాబట్టి నాలుగువర్ణాలవారు, స్త్రీ, పురుషులు, దీన్ని చదవాలి, వినాలి. విషయ చింతన చేయాలి. వినేవారుంటే చదివి వినిపించాలి. చదివేవారుంటే వినాలి. ఈ రెండూ జరగని కాలముంటే, విన్నదానిని, కన్నదానిని, విశేషంగా మననం చేయాలి. ఏదోవిధంగా మనస్సు దీనిపై నిలపాలి''.

రామాయణం ప్రథమ మొదటి శ్లోకంలో, మొదటి అక్షరం ''త'' కారం తో మొదలవుతుంది. ఇది గాయత్రి మంత్రంలోని మొదటి అక్షరం. కడపటి శ్లోకంలోని కడపటి అక్షరం ''యాత్''. గాయత్రి మంత్రం లోని కడపటి అక్షరమూ ఇదే. గాయత్రిలోని ఆద్యంతక్షరాలు చెప్పడంతో రామాయణం గాయత్రి సంపుటితమని తెలుస్తున్నది. ఈ నియమం ప్రకారమే వాల్మీకి వేయి గ్రంథాలకు మొదట ఒక్కొక్క గాయత్రి అక్షరాన్ని వుంచడంతో 24,000 గ్రంథమయింది. 24,000 గ్రంథమంటే 24,000 శ్లోకాలని అర్థంకాదు. 32 అక్షరాల సముదాయానికి గ్రంథమని పేరు.

నారదుడు చెప్పిన రామ చరిత్రను విన్న వాల్మీకి సంతోషంతో ఆయన్ను పూజించాడు. నారదుడు పోయింతర్వాత, వాల్మీకి, శిష్యుడితో తమసాతీరంలో తిరుగుతూ, ఒక క్రౌంచమిథునాన్ని చూశాడు. ఆయన చూస్తుండగానే, బోయవాడొకడు, జంటలోని మగపక్షిని బాణంతో కొట్టి చంపుతాడు. ఆడ పక్షి ఏడుపు విన్న వాల్మీకి, ఎంతో జాలిపడి, బోయవాడిని శపించాడు. ఇలా ఆదికవి నోటినుండి వెలువడిన వాక్యాలు సమాక్షరాలైన నాలుగు పాదాల శ్లోకమయింది. అదే విషయం గురించి ఆలోచిస్తూ, శిష్యుడు భరద్వాజుడితో ఆశ్రమానికి వచ్చాడు. అక్కడికి బ్రహ్మదేవుడు వచ్చి, రామాయణం రాయమని ఉపదేశించి, సర్వం ఆయనకు తెలిసేట్లు వరమిచ్చి పోయాడు. వాల్మీకి రామాయణాన్ని రచించాలని నిశ్చయించుకున్నాడు. సంక్షిప్తంగా నారదుడు చెప్పిన రామ చరిత్రను, వాల్మీకి వివరంగా చెప్పాలనుకున్నాడు. అలా రామాయణ రచనకు బీజం పడ్డది.

◆❖◆

అమరధామం, అయోధ్యానగరం

సరయూ నదీతీరంలో వున్న కోసల దేశంలో, ఎక్కడ చూసినా ధనధాన్యాలు రాసులు–రాసులుగా ఇంటింటా పడివుండి, ఒకరి ధనాన్ని, ధాన్యాన్ని మరొకరు ఆశించాల్సిన అవసరం లేనటువంటి స్థితిగతులుండేవి. ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధిగాంచిన ఆ దేశంలో ప్రజలంతా దేహ పుష్టి కలిగి, సుఖసంతోషాలతో వుండేవారు. ధనధాన్యాది సంపదలతో మిక్కిలి భాగ్యవంతంగాను, మనువు స్వయంగా నిర్మించినందున అందంగా, రమ్యంగాను, పన్నెండామడల పొడవు, మూడామడల వెడల్పు, వంకర టింకర లేని వీధులతోను, ఇరు ప్రక్కల సువాసనలు వెదజల్లే పుష్పాలను రాలుస్తున్న చెట్లతోను, దారినపోయే వారి కళ్లల్లో దుమ్ము పడకుండా తడుపబడిన రాజవీధులతోను అలరారుతుండే అయోధ్యా నగరమనే మహా పట్టణం ఆ కోసల దేశంలో వుండేది.

చక్కగా తీర్చి దిద్దిన వీధి వాకిళ్లతోను, తలుపులతోను, వాకిళ్లముందు మంగళకరమైన పచ్చని తోరణాలు కట్టేందుకవసరమైన స్తంబాలతోను, నగరం మధ్యలో విశాలమైన అంగడి వీధులతోను, శత్రువులను ఎదుర్కొనేందుకు కావాల్సిన రకరకాల ఆయుధ సామగ్రినుంచిన భవనాలతోను, శిల్ప కళాకారుల సమూహాలతోను, వందిమాగధులు, సూతుల జాతివారితోను, శ్రీమంతులైన పండితులతోను, ఎత్తైన మండపాల పై కట్టిన ధ్వజాలతోను, భయంకర శతఘ్నుల ఆయుధాలతోను, నాట్యమాడే స్త్రీ సమూహాలతోను, తియ్య మామిడి తోపులతోను, అందాలొలికే అయోధ్యా పురం ''లక్ష్మీ పురం'' నే మరిపించేదిగా వుండేది.

''అయోధ్యా పురి'' అనే ఆ స్త్రీ నడుముకు పెట్టుకున్న ఒడ్డాణంలా వున్న ప్రాకారం, అగడ్తలు, మితిమీరిన సంఖ్యలో వున్న గుర్రాలు, లొట్టిపిట్టలు, ఆవులు, ఎద్దులు, ఏనుగులు, అనుకూలురైన సామంత రాజులు, కప్పం కట్టే విరోధులైన విదేశీ రాజులు, కాపురాలు చేస్తున్న నానా దేశ వ్యాపారులు, విశేష ధనవంతులైన వైశ్యులు, నవరత్న ఖచితమైన రాజుల ఇళ్లు, చంద్రశాలలున్న అయోధ్యా నగరం స్వర్గ నగరమైన అమరావతిని పోలి వుంది.

నవరత్నాలతో చెక్కబడి విమానాకారంలో కట్టిన ఇళ్లతోను, ఇంటినిండా ఆరోగ్యవంతులైన కొడుకులు, మనుమలు, మునిమనుమలు, మనుమరాళ్లు, వయో వృద్ధులతోను, ఎత్తుపల్లాలు లేకుండా భూమిపై కట్టిన గృహాల్లో పుష్కలంగా పండిన ఆహార పదార్థాల నిల్వలతోను, ఇంటింటా వున్న ఉత్తమ జాతి స్త్రీలతోను, నాలుగు దిక్కులా వ్యాపించిన రాచ బాటలతోను, వాటి మధ్యనే వున్న రాచగృహాలతోను నిండి వున్న అయోధ్యా నగరం జూదపు బీటలా వుండేది.(నగరం మధ్యన రాజగృహం, అందులో కట్టడాలు, గాలి వచ్చేందుకు విడిచిన ఆరుబయలు, నలుదిక్కుల రాచబాటలుండడమంటే చూసేవారికి జూదపు బీటలా వుంటుందని అర్థం).

నగరంలోని నీళ్లు చెరకు పాలల్లా తియ్యగా, తేలిగ్గా, మంచి ముత్యాల్లా కనిపించే లావణ్యం లాంటి కాంతితో వున్నాయి. మద్దెలలు, వీణలు, ఉడకలు, పిల్లన గ్రోవులు, సుందరీమణుల కాలి అందియలు, వీటివల్ల కలిగే ధ్వనులు ఆహ్లాదకరంగా వుండేవి. ఎల్లప్పుడు ఆటపాటలతో, ఉత్సవాలతో, అలంకరించుకున్న స్త్రీలతో, ఆహ్లాద భరితంగా వుండేదా వూరు. ఘోర తపస్సు చేసి సిద్ధిపొందిన వారికి మాత్రమే లభించే స్వర్గంలోని విమానాకార ఇల్లు, అయోధ్యా నగర వాసులకు ఏ కష్టం లేకుండా దొరికాయి.

ఆ నగరంలోని శూరులు అడవులకు వేటకు పోయేటప్పుడు, సింహాలను, అడవి పందులను, ఖడ్గ మృగాలను, ముఖాముఖి కలియబడి తమ భుజ బలంతో–శస్త్ర బలంతో, ఒకే ఒక్క వేటుతో చంపగలిగే గొప్పవారు. అయినప్పటికీ, ఆయుధం లేకుండా, సహాయం చేసేవారు లేకుండా, ఒంటరిగా చిక్కిన బలవంతుడైన శత్రువును కూడా క్షమించి విడిచిపెట్టగల దయా గుణమున్న శూరులు. భయంతో దాగిన వారినికూడా వదిలి పెట్టారు.

అయోధ్యా పురంలోని బ్రాహ్మణులందరు అవిచ్ఛిన్నంగా అగ్నిహోత్రం కలిగుండే వారే. శమ దమాది గుణ సంపన్నులే. ఆరంగాలతో, నాలు వేదాలను అధ్యయనం చేసిన వారే. సత్య వాక్య నిరతులే. వేలకొలది దానాలు చేసిన వారే . గొప్ప మనసున్న వారే. వీరందరు సామాన్య ఋషులైనా, గృహస్తులైనా, నగర వాసులైనా, అడవుల్లో వుండే ఋషులకు సమానమైన వారు.

భగవంతుడు అక్కడ పుట్టినందువల్లే, ఆ పుణ్య నగరం ''అయోధ్య'' గా కీర్తించబడింది. భగవంతుడైన విష్ణువు ఎక్కడుంటాడో, అదే పరమ పదం. ఆయన సేవే మోక్షం. అదే సర్వ కర్మలను ధ్వంసం చేస్తుంది. అయోధ్యలో మహా విష్ణువు పుట్టినందువల్లే మనుష్యులందరు ముక్తులయ్యారని శివుడు పార్వతికి చెప్పాడు.

అయోధ్యా నగరాన్ని దశరథ మహారాజు కీర్తివంతంగా పరిపాలించేవాడు. ఆయన ఇక్ష్వాకుల వంశంలోని రాజులందరిలోనూ అతిరథుడు, అగ్రగణ్యుడు. సమస్త ప్రజలను తనకనుకూలంగా మలచుకోగల నేర్పరి. మహర్షులతో సరిసమానమైన వాడు. రాజర్షులలో శ్రేష్టుడు. యావత్ ప్రపంచం కొనియాడదగిన శ్రీమంతుడు, కీర్తిమంతుడు. వైవస్వత మనువువలె పరాక్రమవంతుడై, జగజ్జనులను పాలిస్తూ, సత్యవంతుడై, ధర్మ, అర్థ, కామాలను రక్షించే విధానం తెలిసున్నవాడిలా, అయోధ్యా పురాన్ని పరిపాలించేవాడు దశరథ మహారాజు.

అయోధ్యాపురంలోని బ్రాహ్మణులు బాహ్యేంద్రియాలను, అంతరేంద్రియాలను, జయించినవారు. పరులను వంచించాలనే దురాచారానికి దూరంగా వుంటారు. ఎటువంటి అనాచారానికి లోనుకాకుండా, సత్యాన్నే పలుకుతూ, భగవత్ కథలనే వల్లించి కాలయాపన చేస్తూ, యజ్ఞ యాగాదులను నిర్వహిస్తూ, నిర్మల బుద్ధితో వుంటారు. వేదాల్లో చెప్పిన కర్మ కార్యాలను నెరవేరుస్తూ, అడిగిన వారికి లేదనకుండా శక్తికొలది దాన ధర్మాలు చేస్తుంటారు. అక్కడి వారెవరికీ, ఇతరులను యాచించాల్సిన పనేలేదు. ఆరంగాల (శిక్ష, వ్యాకరణం, ఛందస్సు, నిరుక్తం, జ్యోతిష్యం, కల్పం) వేదాధ్యయనం చేయడం వారికి నిత్య కృత్యం. పెద్ద మనసుతో పుణ్య కార్యాలను చేస్తూ, దేవర్షులతో-మహర్షులతో సమానంగా, సూర్య చంద్రుల తేజస్సుతో, వర్చస్సుతో భగవధ్యానం చేస్తూ, సదాచార సంపన్నులై మెలగుతుండేవారు.

అయోధ్యా వాసులందరూ సంతుష్టిగల మనసున్నవారే, ధర్మాన్నెరిగినవారే. శాస్త్ర సంబంధమైన ఆలోచనలు చెసే వారే. దేవుడిచ్చిన దాంతోనే సంతృప్తి చెందేవారు. త్యాగ బుద్ధిగలవారు. నిజాన్ని మాత్రమే చెప్పే గుణంగలవారు. తమకెంత అవసరమో అంత సంపాదన మాత్రమే చెసేవారు. అవసరానికి సరిపోయే ఆవులను, గుర్రాలను, సిరి సంపదలను కలిగినవారు. కుటుంబం అంటే శాస్త్రాల్లో ఎటువంటి నిర్వచనం చెప్పబడిందో, దానికనుగుణంగానే, పదిమంది (తను, తన తల్లి, తండ్రి, భార్య, ఇద్దరు కొడుకులు, ఇద్దరు కోడళ్లు, ఒక కూతురు, ఒక అతిథి) కంటే తక్కువున్న ఇల్లు ఆనగరంలో లేదు. కొడుకులకు, భార్యకు కడుపునిండా భోజనం పెట్టకుండా బాధించేవారు కానీ, దాన ధర్మాలు అనుదినం చేయనివారు కానీ, ఆ నగరంలో కనిపించరు. అందమైన ఆ నగరంలో చెడ్డవారు కనిపించరు. పర స్త్రీలను ఆశించే వారు కానీ, భార్యతో కూడా నిషిద్ధ దినాలలో కామ క్రీడలు ఆడేవాడు కానీ, వేశ్యా లోలురు కానీ, చదువురాదననివారు కానీ, నాస్తికులు కానీ అయోధ్యలో లేనే లేరు.

అయోధ్యా వాసులందరూ ధర్మం, శీలం కలవారే. ప్రేమ స్వరూపులే. ఇంద్రియ నిగ్రహం కలవారే. మంచి స్వభావం వున్న వారే. దోషరహితమైన నడవడిక గల వారే. ఋషితుల్యులే. నిష్కళంకమైన మనసున్నవారే. ముత్యాల హారాలు ధరించి, చెవులకు కుండలాలను అలంకరించుకున్నవారే. అందచందాలున్న వారే. కురూపులు కాని వారే. మకుటాలు ధరించి, చందనం పూసుకుని, కొరత లేకుండా భోగ భాగ్యాలను అనుభవించే వారే. ఇష్టమైన ఆహారాన్ని తీసుకునే వారే. అన్న దాతలే. అవయవాలన్నిటినీ అలంకరించుకునే వారే. ఇంద్రియ నిగ్రహంతో పాటు, ఇంద్రియాలను జయించిన వారక్కడి జనులు. అందరూ సోమ యాగం చేసినవారే. అగ్నిహోత్రాలు కలవారే. వారి, వారి ఆచారం ప్రకారం వర్ణాశ్రమ ధర్మాలను పాటించేవారే. బ్రహ్మాన్ని ధ్యానిస్తూ, జప తపాలు చేసేవారే, దయాళులై, చక్కని నడవడి కలవారే. దశరథ మహారాజు పరిపాలన చేసే రోజుల్లో, అగ్నిహోత్రం లేనివాడు కానీ-సోమయాగం చేయని వాడు కానీ-అల్ప విద్య, అల్ప ధనం కలవాడు కానీ-వర్ణ సంకరులు కానీ-దొంగలు కానీ లేనే లేరు అయోధ్యా పురిలో.

తమ వర్ణానికి, ఆశ్రమానికి శాస్త్రోక్తమైన విహిత కర్మ ఏదో, దానినే బ్రాహ్మణులు శ్రద్ధతో ఆచరిస్తూ, విద్యా దానంలో, అధ్యయనంలో ఉత్తములై, వశ్యేంద్రులై, జితమనస్కులై, దానానికి పాత్రులై వుండేవారు. దశరథుడు పరిపాలన చేసే సమయంలో, చపలచిత్తులు, ఐహికాముష్మిక కార్య సాధనకు అవసరమైన దేహ బలం, మనో బలం లేనివారు, ఆరంగాలెరుగనివారు, అసత్యం పలికేవారు, ఈర్ష్య గలవారు,

పాండిత్యం లేనివారు, చక్కదనం లేనివారు, పదివేలు తక్కువగా దానం చేసేవారు, దుఃఖించే వారు, రాజభక్తిలేని వారు, ఇతరులను పరవశులను చేయగల చక్కదనం లేని స్త్రీ-పురుషులు, స్త్రీలను స్త్రీలు, పురుషులను పురుషులు కూడా పరవశులు చేయగల చక్కదనం లేనివారు అయోధ్యా నగరంలో లేరు. అక్కడ నివసించే అన్ని వర్ణాలవారు దైవ పూజ చేయకుండా, అతిథిని ఆదరించకుండా, భోజనం చేయని దీక్షాపరులు.

అయోధ్యా పురవాసులు శౌర్య పరాక్రమాలున్నవారు. సత్యమే ధనంగా కలవారు. ధనంలాగా సత్యాన్ని కాపాడుకునే శూద్రులు తాంత్రిక మంత్రాలతో దేవ పూజ, హిరణ్య దానంతో అతిథి పూజ చేస్తారు. బ్రాహ్మణులు విద్యా శూరులు. వాద పరాక్రములు. బ్రాహ్మణులుపదేశించిన కార్యాలలో ఆసక్తి కలిగి క్షత్రియులు నడచుకునేవారు. వైశ్యులు రాజులకు అనుకూలంగా వుండేవారు. వంచన, దొంగతనం అనే వాటిని దరికి రానీయకుండా, శూద్రులందరు బ్రతుకు పాటుకై కుల విద్యలు నేర్చుకుని, కులవృత్తులలో నిమగ్నమై వుండేవారు. యుద్ధ భటులు కార్చిచ్చులాంటి దేహాలతో, తేజంతో, మందరం లాంటి ధైర్యంతో, ఇబ్బందులెన్ని ఎదురైనా, అప్పగించిన పనిని నెరవేరుస్తూ దేహ, మనో బలంతో ఉత్సాహంగా వుండేవారు.

వీరు-వారు అనే భేదం లేకుండా అయోధ్యా నగరంలోని ప్రజలందరు సద్గుణవంతులే. దేహ పుష్టికలవారే. అసత్యాలాడనివారే. రాజు మేలుకోరేవారే. అధికారులందరు రాజ్యంలో తాముచేయాల్సిన, చేయాలనుకున్న పనులను కార్యరూపంలో పెట్టి చూపించేవారే కాని, ముందుగానే రహస్యాలు వెల్లడించి కార్యభంగం చేయరు. ఇలా యావన్మంది తనను సేవిస్తుంటే, వేగులవారి ద్వారా లోకంలో జరుగుతున్న విషయాలను కళ్లార చూసినట్లు తెలుసుకుని, తదనుగుణంగా భవిష్యత్ కార్యక్రమాన్ని, మంత్రుల, పురోహితుల సూచనలతో, సలహాలతో రూపొందించే వాడు దశరథ మహారాజు. ఇలా పరిపాలన చేస్తూ, బాలసూర్యుడు కిరణాలతో ప్రకాశించే విధంగా, దశరథ మహారాజు కూడా ప్రకాశించేవాడు.

సూర్య బింబం కనిపించిన ఏడు నిమిషాల తర్వాత, సూర్య కిరణాలు భూమిని తాకుతాయి. సూర్య బింబం కంటే, సూర్య కిరణాల మూలంగానే, లోకానికి ప్రయోజనం చేకూరుతుంది. అదే విధంగా, రానున్న కాలంలో, అవతరించనున్న రామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్నులు, దశరథుడికి సూర్య కిరణాల లాంటివారు. ఉదయాన ఎరుపు రంగులో వుండే సూర్యుడు దర్శనానికి పనికి రాడు. ఎండ వ్యాపించి, బింబం తెల్లగా మారిన తర్వాతే దర్శించడానికి యోగ్యుడు. అలాగే, రామాదుల వలనే దశరథుడు లోకమాన్యుడయ్యాడు. జాయానామ పూర్వుడు, స్వనామ పూర్వుడు, పుత్రనామ పూర్వుడు అనే మూడురకాల పురుషులుంటారు. మొదటి వాడికంటే రెండోవాడు, వాడికంటే మూడోవాడు శ్రేష్ఠుడు. దశరథుడు మూడో రకం వాడు.

ఇన్ని సద్గుణాలకు, సంపదలకు, సనాతన ధర్మానికి ఆలవాలమైనది కాబట్టే ఇన్ని వందల, వేల సంవత్సరాల తరువాత కూడా, యుగాలు మారినా అయోధ్య శోభ అలాగే నిత్యనూతనంగా వర్ధిల్లి, రామజన్మ భూమి తరతరాలకు ఆదర్శం కాబోతున్నది.

◆❖◆

యాగాల ఫలమా శ్రీరామావతారం?

ముని కుమారుడిని చంపినందువలనే తనకు సంతాన ప్రాప్తి కలగడం లేదని దశరథుడు చింతించాడు. బాల్యంలో జరిగిన ఆ సంఘటనను, చాలాకాలం మరిచిపోతాడు దశరథుడు. జ్ఞప్తికి వచ్చిన వెంటనే, పాప పరిహారార్థం, అశ్వమేధ యాగం చేయాలన్న ఆలోచన చేస్తాడు. అనిష్ఠ పరిహారం కొరకు అశ్వమేధ యాగం చేయడంతో పాటు, ఇష్ట ప్రాప్తికొరకు పుత్ర కామేష్ఠి యాగం కూడా చేద్దామనుకుంటాడు. పుత్ర కామేష్ఠికి పూర్వ రంగంగా అశ్వమేధ యాగం చేయాలని దశరథుడి కోరిక. సంతాన ప్రాప్తికి ఉద్దేశించిన అశ్వమేధ యాగానికి ఋత్విజుడిగా వ్యవహరించాల్సిందిగా ఋశ్యశృంగుడిని ప్రార్తించాడు దశరథుడు.

దశరథుడి కోరికను మన్నించిన ఋశ్యశృంగుడు, క్రతువుకు కావాల్సిన సామాగ్రిని సమకూర్చుకోమని, యజ్ఞాశ్వాన్ని వదలమని చెప్పగా, ఋత్విజులను, పండితులను, బ్రహ్మ వాదులను పిలిపించమని దశరథుడు మంత్రి సుమంత్రుడిని ఆదేశిస్తాడు. రాజాజ్ఞ మేరకు, సుమంత్రుడు, బ్రాహ్మణోత్తములను పిల్చుకుని వస్తాడు. వచ్చిన వారందరినీ సగౌరవంగా స్వాగతించి, సంతానం కలిగేందుకు అశ్వమేధ యాగం చేయ తలపెట్టానని అంటాడు దశరథుడు.

దశరథుడి మాటలు విన్నవారందరూ సంతోషంతో, ఆయన తలపెట్టిన కార్యం మంచిదని అంటారు. వారిలో ముఖ్యులైన వశిష్ఠుడు, ఋశ్యశృంగుడు, రాజు ఆలోచన గొప్పదని, ఫలితం తప్పక లభిస్తుందని, ఆలశ్యం చేయకుండా కార్యక్రమం ఆరంభించమని సలహా ఇస్తారు. బ్రాహ్మణులు చెప్పిన పనులన్నీ తక్షణమే చేయాలని, వస్తువులన్నీ సమకూర్చాలని, గురువులు చెప్పినట్లు యజ్ఞాశ్వాన్ని విడవమని, దానికి రక్షణగా పురోహితుడొకడిని పంపమని, సరయూ నదికి ఉత్తర దిశగా యజ్ఞశాల నిర్మించమని, శాంతి కార్యాలన్నీ చక్కగా నిర్వహించమని మంత్రులను ఆదేశిస్తాడు దశరథుడు. రాజు తలపెట్టిన కార్యం విఘ్నం కాదని, తమకప్పగించిన పనులన్నీ నిర్విఘ్నంగా కొనసాగేటట్లు చూస్తామని మంత్రులు హామీ ఇచ్చిన తదుపరి బ్రాహ్మణులు శలవు తీసుకుని వెళ్లారప్పటికి.

మొదటి సంవత్సరం చైత్ర పౌర్ణమి నాడు సాంగ్రహణేష్టిని జరిపించి, మర్నాడు, శాస్త్రోక్తంగా బ్రహ్మౌదనం,మేధ్యాశ్వబంధనం,స్నాపనం,ప్రోక్షణం,అశ్వవిమోచనం మొదలైన 'చత్వారస్సముక్షంతి' అనే కార్యాలను నెరవేర్చి, ఆ తర్వాత ప్రతిరోజూ శ్రుత్యుక్తంగా సావిత్రాది కర్మాలను చేస్తుండాలి. ఆవిధంగా మొదటి సంవత్సరం గడచిన తర్వాత, రెండో సంవత్సరం ఆరంభంలో అశ్వం యాగ స్థానానికి బయల్దేరాలి.

అశ్వాన్ని విడిచిన తర్వాత ఒక సంవత్సరకాలం పూర్తయి, తిరిగి వసంత ఋతువు చైత్ర మాసం రాగానే దశరథుడు వశిష్ఠుడి దగ్గరకు వచ్చి అశ్వం తిరిగొచ్చిందని తెలియచేస్తాడు. వశిష్ఠుడు చెప్పిన ప్రకారం తాను యజ్ఞం ప్రారంభిస్తానని, యాగానికి విఘ్నం లేకుండా ఆయన కాపాడాలనీ విజ్ఞప్తిచేస్తాడు. రాజుకోరినవిధంగానే సర్వం తానే నిర్వహిస్తానని ఆయనకు మాట ఇచ్చి, యజ్ఞకార్యాలను పర్యవేక్షిందేకు నియమించిన వృద్ధ బ్రాహ్మణులను, నియమవంతులైన ధర్మాత్ములను, స్థపతిసంఘాలను, శిల్పవిద్యాప్రవీణులను, గుంతలు తవ్వేవారిని, ఇతరత్రా పనులు చేసేవారిని, వడ్రంగులను, చిత్రకారులను పిలిచి, ఎవరెవరికి అప్ప చెప్పాల్సిన పనులను వారివారికి అప్పగించి, ఇతర ఏర్పాట్లలో నిమగ్నమయ్యాడు వశిష్ఠుడు.

''యాగ నిర్వహణకు వేలాది ఇటుకలు కావాలి కనుక వాటిని యాగశాల సమీపానికి తేవాలి. ఉత్తమ బ్రాహ్మణులు, ఋత్విక్కులు బసచేసేందుకు, వారికవసరమైన భక్ష్యభోజ్యపానీయాలు నిలవచేసేందుకు, విశాలమైన, ఎత్తైన రాజగృహాలు, అనువైన ఇతర రకాల భవనాలు నిర్మించాలి. అదేవిధంగా ఋత్విక్కులకు సహాయపడేందుకు వస్తున్న బ్రాహ్మణుల విడిదికొరకు, వారికి భక్ష్యాన్నపానీయాలు వినియోగించేందుకు అనువైన ఇళ్ళుకూడా నిర్మించాలి. యాగాన్ని చూసేందుకొచ్చే పౌరులకు దృఢమైన ఇళ్ళు కట్టించి, ప్రతి ఇంటిలో కావాల్సిన పదార్థాలన్నీ మళ్ళీ, మళ్ళీ అడగకుండా ఏర్పాటుచేయాలి''.

''వీరూ–వారూ అనే తేడాలేకుండా, అన్నిజాతులవారినీ, అన్నితరగతులవారినీ, వారివారి యోగ్యమైన రీతిలో సత్కరిస్తూ, వారిని తృప్తిపరచాలి. కామంతో కానీ, కోపంతో కానీ ఎవరినీ అవమానించరాదు. యజ్ఞ కార్యాలలో తిరిగేపనివాళ్ళను, శిల్పులను, ఇతరులను అందరి లాగే గౌరవించాలి. వారెవరూ కూటికీ, నీళ్ళకూ ఇబ్బందిపడకూడదు. చేయాల్సినపని చిన్నదైనా, పెద్దదైనా వదలకుండా పూర్తిచేయాలి. చేసే ప్రతి పనినీ స్నేహంతో, ప్రీతితో చేయాలి. ఇదేదో వెట్టికి చేస్తున్నామన్న రీతిలో చేయొద్దు.'' అని వశిష్ఠుడు పనులు చేసేందుకు నియమించిన వారితో అనగా, వారందరూ ''మునీంద్రా! మీరు చెప్పిన పనులన్నీ చేసాం. ఏలోపమూలేదు'' అని జవాబిచ్చారు.

వశిష్ఠుడు సుమంత్రుడితో ఆయన స్వయంగా చేయాల్సిన పనులను, ఇతరులతో చేయించాల్సిన పనులనూ వివరిస్తాడు. ''సుమంత్రా! నీకు అందరిగురించీ, వారి అవసరాల గురించీ క్షుణ్ణంగా తెలుసు. ఎవరిని ఏవిధంగా పిలవాల్నో, ఎలా ఆదారించాల్నో తెలిసినవాడివి నువ్వు. నువ్వు నీ అనుభవం ఆదారంగా, దేశంలోని ధర్మాత్ములైన, శిష్టులైన బ్రాహ్మణులను, రాజులను, వైశ్యులను, శూద్రులను, నానా వర్ణాల ప్రజా బాహుళ్యాన్ని యజ్ఞం చూసేందుకు రమ్మని శ్రద్ధగా, త్వరగా పిలిపించు.'' అని

ఆదేశిస్తాడు వశిష్ఠుడు.

ఆయన చెప్పినట్లే పిలిచేందుకు, పిలిపించేందుకు సన్నద్ధమయ్యాడు సుమంత్రుడు. ఇలా వశిష్ఠుడు పనివారందరినీ హెచ్చరిస్తుండగానే, నానా దేశాల రాజులు అయోధ్యా నగరానికి చేరుకున్నారు. అంతవరకు పూర్తి అయిన పనులను, యాగానికి సిద్ధంగా వున్న స్థలాలను, పరిశీలించేందుకు రమ్మని వశిష్ఠుడు, ఋశ్యశృంగుడు అనగానే దశరథుడు మంచి ముహూర్తంలో బయలుదేరి, యజ్ఞశాలకు వెళ్తాడు. వెంటనే బ్రాహ్మణులందరు ఋశ్యశృంగుడుని ముందుంచుకుని, సరయూనది ఉత్తర తీరంలో యజ్ఞకర్మను ఆరంభిస్తారు.

సంవత్సరాంతంలో యజ్ఞాశ్వం తిరిగి రావడంతో, యాగం ఆరంభించడానికి సన్నాహాలు మొదలయ్యాయి. యజ్ఞాశ్వం మరలివచ్చేటప్పుడు చేయాల్సిన కార్యక్రమాలు శాస్త్రంలో చెప్పినట్లే చేయాలి. మొదటి సంవత్సరం గుర్రాన్ని స్వేచ్ఛగా తిరిగేందుకు విడిచిన తర్వాత, అది విహరించేందుకు, దాని సంరక్షణార్థం వీరులు దానివెంబడే పంపాలి. గుర్రాన్ని వారు మరలించకూడదు. అది తిరుగుతూ, తిరుగుతూనే తుదకు తనకుతానుగా గృహానికి మరలిరావాలి.

వచ్చిన వెంటనే, బ్రహ్మ, అధ్వర్యుడు, హోత, ఉద్గాత అనిపిలువబడే నలుగురు ఋత్విక్కులు దానిని రథకారుడి ఇంటిలో బంధించి, దాని నాలుగుపాదాలపై మంత్రాలుచెప్తూ హోమం చేస్తారు. అశ్వ విసర్జన సంవత్సరంలో పదకొండు నెలలు గడచిన తర్వాత దానిని, అక్కడనుండి తరలించి, సదస్సు వద్దకు తెచ్చి, మళ్ళీ అక్కడ అశ్వత్థప్రజంలో బంధిస్తారు. పన్నెండో నెల యజ్ఞానికి కావాల్సిన సామానులను తెచ్చుకొని, కడపటి ఫాల్గుణ అమావాస్య నాడు ఋత్విక్కులతో యజ్ఞశాలలో ప్రవేశించి, రెండవ సంవత్సరం మొదటిరోజు పాడ్యమినుండి మొదలుపెట్టి అశ్వమేధయాగం ప్రారంభిస్తారు. అది మొదలు ఏడు రోజులు శాస్త్రోక్తంగా ఇరవై ఒక్క హోమాలు జరుపుతారు. సోమ ప్రయోగంలో భాగంగా, ఇంద్రుడు దేవతగా గల అయిదు హవిస్సులను (దానం, కరంభం, పరివాపం, పురోడాశం, నయస్య) ప్రాతస్సవనమున ఇంద్రుడిగూర్చి హోమం చేయాలి. మాధ్యందినసవనమున, సాయంసవనమున నయస్యతప్ప ఇతర హోమాలను చేయాలి. ఈ విధమైన కార్యక్రమాలను ఋషిపుత్రుడైన ఋశ్యశృంగుడు, ఇతర బ్రాహ్మణులు కొరత రానీకుండా నిర్వహించారు.

ఔపవసథ్యదినాన అశ్వాలంభమనే కార్యాన్ని జరిపించేందుకు యూపస్తంభ (యజ్ఞ పశువును కట్టివేయాల్సిన స్తంభం) స్థాపన జరగాలి. యూపస్తంభాలు నాటే సమయం రాగానే, మారేడువి ఆరు, చంద్రవి ఆరు, మోదుగువి ఆరు నాటారు మొదలు. అగ్నిని వుంచే తిన్నె (వేది) సమీపంలో ఒక 'విరిగి కట్టె' స్తంభాన్ని నాటారు. దానికి ఇరు పక్కల ఒక్కో 'దేవదార' స్తంభాన్ని నాటారు. మొత్తం ఇరవై ఒక్క స్తంభాలను నాటి వస్త్రాలతో వాటిని అలంకరించారు. చందనం పూసి, వస్త్రాభరణాలతో అలంకరించిన ఆ యూపస్తంభాలు ఆకాశంలో సప్తర్షులలాగా ప్రకాశించాయి.

శాస్త్రంలో చెప్పిన విధంగానే, అందులో సూచించిన కొలతలుగల ఇటుక రాళ్లను తెచ్చి ''శుల్బ'' మనే పనిలో నైపుణ్యమున్న బ్రాహ్మణులు అగ్నినుంచే తిన్నె (వేది) ను కట్టారు. అది గరుడి ఆకారంలో, బంగారు రెక్కలతో, మూడంతలుగా, పద్దెనిమిది ప్రస్తారాలుగా, ప్రకాశించింది. ఆ తర్వాత శాస్త్రోక్తంగా

దైవ ధ్యానం చేసుకుంటూ, మూడువందల పక్షులను, పశువులను, జలజంతువులను కట్టారు. అటు పిమ్మట, కౌసల్య అశ్వానికి ప్రదక్షిణ నమస్కారాలు చేసి, మూడు బంగారు సూదులతో గాట్లుచేసింది అశ్వానికి. ఒక రాత్రంతా గుర్రం సమీపంలో పడుకుంది ధర్మంగా. తర్వాత దశరథుడు బ్రహ్మకు, హోతకు, అధ్వర్యునకు, ఉద్గాతకు, మహిషిని, వావాతను, పాలాకలిని, పరివృత్తిని, దానంగా ఇచ్చాడు. ఋత్విజుడప్పుడు ''వపను'' మంత్రోక్తంగా అగ్నిలో హోమం చేయడంతో, దశరథుడు, శాస్త్రోక్తంగా తగిన సమయంలో దాని వాసన చూసాడు.

పదహారు మంది బ్రాహ్మణులు అశ్వానికి చెందిన ఒక్కొక్క అంగాన్ని తీసుకొని, మంత్రోక్తంగా అగ్నిలో వేసి హోమం చేసారు. ఇతర యజ్ఞాలలో హవిస్సును ''రావి'' సమిధలతో పాకం చేయగా, అశ్వమేధంలో ''ప్రబ్బలి'' సమిధలతో పాకం చేయాలి కనుక అలానే చేసారు. బ్రాహ్మణములలో అశ్వమేధం మూడురోజులు చేయాలని చెప్పారు. మొదటిరోజు చతుష్టోమం, రెండవ రోజున ముక్త్యం, మూడోనాడు అతిరాత్రం అనే కార్యాలను చేయాలని చెప్పబడింది. అలానే చేసిన ఋత్విక్కులు అదనంగా ఇతర శాస్త్రోక్త కార్యాలైన జ్యోతిష్టోమం, ఆయురధ్వరం, అతిరాత్రం, అభిజిత్తు, విశ్వజిత్తు, నప్తోరామ్యం కూడా జరిపించారు.

ఈవిధంగా యజ్ఞం పూర్తవగానే, హోతకు తూర్పుదిక్కునవున్న రాజ్యాన్ని, అధ్వర్యునకు పశ్చిమదిక్కునవున్న రాజ్యాన్ని, బ్రహ్మకు దక్షిణ రాజ్యాన్ని, ఉద్గాతకు ఉత్తరదిక్కునవున్న రాజ్యాన్ని, ఇక్ష్వాకు కులవర్ధనుడైన దశరథుడు దానంగా ఇచ్చాడు. రాజ్యానికి మారుగా గోవులను, రత్నాలను, కొంత బంగారాన్ని ఇస్తే చాలని కోరుతారు బ్రాహ్మణులు. దశరథుడు, వారుకోరినవిధంగానే, ఋత్విజులకు ఇచ్చాడు.

సంతాన లాభం అనుగ్రహించమని వేడుకొనిన దశరథుడితో ఋశ్యశృంగుడు, ఆయన కోరిన విధంగానే నలుగురు కొడుకులు ఆయనకు కలుగనున్నారనీ, కొడుకులు పుట్టేందుకు అధర్వణమంత్రాలతో యాగాన్ని చేయిస్తానంటాడు. దశరథుడు సంతోషించి యజ్ఞానికి పూనుకుంటాడు. అదే పుత్రకామేష్టి యాగం.

దశరథుడి పుత్రకామేష్ఠి యాగం నిర్విఘ్నంగా కొనసాగుతుండగా, అగ్నిహోత్రం మధ్యనుండి ప్రాజాపత్య మూర్తి దర్శనమిస్తాడు. బయట కొచ్చిన ప్రాజాపత్య మూర్తి దశరథుడితో ఆయన్ను చూడటానికి వచ్చానని అంటాడు. దశరథుడిని ధన్యుడిని చేసేదయిన పాయసాన్ని తెచ్చానంటాడు. ఆ పాయసాన్ని తనకిష్ఠమైన భార్యలకు, తనకు గల గుణచేష్టాకీర్తులలో తగినవారని తోచిన వారికి, ఇమ్మని చెప్తాడాయన. దివ్య పాయసాన్నంతో నిండినదైన బంగారు పాత్రను దశరథుడు తీసుకొని, తన భార్యలుండే చోటికి పోయి పట్టపు దేవైన కౌసల్యతో సంతోషంతో జరిగిన విషయాన్నంతా చెపుతాడు.

ప్రాజాపత్య పురుషుడిచ్చింది భగవత్తేజః పూరితమైన పాయసాన్నం. తాను తెచ్చిన పాయసం సగం మొదలే కౌసల్యకిచ్చాడు. ఆమె దాన్ని తాగింది. మిగిలిన సగంలో సగం (పాతిక భాగం) రెండో భార్యైన సుమిత్రకు ఇచ్చాడు. మిగిలిన పాతిక భాగాన్ని రెండు భాగాలు చేసి, ఒకభాగం కైకకు, మరో భాగం తిరిగి సుమిత్రకు ఇచ్చాడు.

పాయసాన్ని రాజపత్నులు సమ్మతితో స్వీకరించారు. కౌసల్య పాయసాన్ని తొలుత తాగిన కారణం వల్ల ఆమె కొడుకు తొలుత (శ్రీరాముడు) జన్మించి జ్యేష్ఠడయ్యాడు. సుమిత్ర తాగకుండా మొదలు ఊరుకుంది. తనకు న్యాయంగా భాగమొచ్చిందనుకున్న కైకేయి కూడా వెంటనే తాగడంతో, ఆమె కొడుకు రెండవవాడుగా (భరతుడు) పుట్టాడు. పాతిక, పరక వేర్వేరుగా ఆఖరున తాగిన సుమిత్రకు కవలలు (లక్ష్మణ, శత్రుఘ్నులు) చివరలో జన్మించారు.

◆❖◆

రామావతార ప్రయోజన అంకురార్పణ!

శ్రీరామ లక్ష్మణ, భరత శత్రుఘ్నుల జననం ద్వారా భగవదవతారాన్ని గురించే చెప్పబడింది. ఆ తరువాత భగవదవతార ప్రయోజనం గురించి మాత్రమే చెప్పడం జరుగుతుంది. ఆ ప్రయోజనాల్లో, శిష్ట రక్షణ, దుష్ట శిక్షణ, ధర్మ సంస్థాపన ముఖ్యమయినవి.

ఒకనాడు తన మంత్రులతో దశరథుడు ఆలోచన చేసే సమయంలో, జగత్ప్రసిద్ధిగాంచిన విశ్వామిత్ర మహర్షి ఆయనను చూడడానికి వచ్చాడు. ఆయన వచ్చిన వార్త విన్న దశరథుడు విశ్వామిత్రుడిని సమీపించి, అర్ఘ్యపాద్యాదులతో పూజించి, గౌరవించి, సంతోషింపచేసి, రెండు చేతులు జోడించి నిలబడ్డాడు. ఉభయకుశలోపరి ముగిసిన పిదప, విశ్వామిత్రుడు, వశిష్ఠ, వామదేవాది ఋషుల వద్దకు వెళ్ళి, వారిని కూడా కుశలప్రశ్నలడిగి, సభా భవనంలోకి ప్రవేశించి, వారివారి ఆసనాలపై కూర్చున్న తర్వాత, తాను చెప్పదల్చుకున్న విషయాన్ని చెప్పబోయే ముందర దశరథుడు ఆయన వచ్చిన కారణం అడిగాడు. తనను మన్నించి ఆయన వచ్చిన పని తెలియచేస్తే దానిని నెరవేరుస్తానన్నాడు.

"మహానుభావా! నీవు ఇతర సామాన్య ఋషులలాంటివాడివి కావు. నువ్వు క్షత్రియుడివిగా పుట్టి, క్షాత్రంలో పెరిగి పెద్దై, రాజర్షివై, సుకుమారుడివై వున్నప్పటికీ, క్షణంలో రాజ్యం, భోగం, సర్వం త్యజించి, గొప్పతపస్సుచేసి, సత్త్వాతిశయంగల బ్రాహ్మణ్యాన్ని సంపాదించి, బ్రహ్మర్షివయ్యావు. ఇలా చేసినవాడు లోకంలో ఇంకెవరూ లేరు. మహానుభావుడివైన నువ్వు అవాప్తసమస్తకాముడవు. అఘటనాఘటన ధురీణుడవైన నువ్వు నా దగ్గరకు కార్యార్థివై రావడమంటే, నా జన్మ సఫలమైనట్లే. నా జన్మ ఫలం నాకివ్వాళ లభించింది. నా జన్మసార్థకమయింది. నీ దర్శనం, దివ్య క్షేత్రాలలోని దేవతల దర్శనంలాంటిదే కనుక, నువ్వు నన్నునుగ్రహించి నీకోరికేదో తెలియచేయాలి. సందేహించ వద్దు. నీవు నా పాలిట దేవుడవు. దేవుడే పని చెప్తే చేయని మనిషి వుంటాడా? నువ్వేది చెప్పినా నెరవేరుస్తాను. ఏది ధర్మం అని నువ్వు భావిస్తావో, దాన్నే చెప్తావుకాని, అధర్మాన్ని చెప్పవు కదా! నువ్వు ధర్మమని చెప్పింది చేయడం వల్ల, నాకెంతో ధర్మాభివృద్ధి కలుగుతుంది." అని విన్నవించుకుంటాడు దశరథుడు విశ్వామిత్రుడితో.

ఇలా తనను ప్రార్థించిన దశరథుడిని సంతోషంతో చూసి అంటాడీవిధంగా: ''ఓ రాజేంద్రా! రఘువంశం సత్యసంధతకు, దాన మహిమకు ప్రపంచంలో ప్రసిద్ధిగాంచింది. నేనేదికోరినా తప్పక ఇస్తానంటున్నావు. నా మనసులో వున్నదాన్నే నేనడుగుతాను. నేనిప్పుడొక యజ్ఞం చేద్దామని సంకల్పించుకొని, దీక్ష పూనాను. దాన్ని ఏవిధంగానైనా విఘ్నం చేయాలని మారీచ, సుబాహువులు అనే ఇద్దరు రాక్షసులు పంతం పట్టారు. వాళ్ళిదరూ మహా బలవంతులు. వాళ్ళీవిధంగా యజ్ఞాన్ని విఘ్నం చేస్తున్నందువల్ల, నువ్వు సహాయం చేస్తావేమోనని అడుగుదామని ఆశతో వచ్చాను. యజ్ఞ సమయంలోనే వారిని దండించాలి''.

''నాకు కావాల్సిన సహాయం ఏంటంటావా? నీ గారాల కొడుకు శ్రీరామచంద్రమూర్తిని, సత్యపరాక్రముడిని నాతో యజ్ఞాన్ని రక్షించడానికి పంపు. వాళ్ళతో యుద్ధంచేసేందుకు, జానెడు పిల్లవాడిని తీసుకొనిపోతే ప్రయోజనమేంటని నీకు అనుమానం రావచ్చు. నేను కాపాడుతున్నంతవరకూ, నీ కొడుకు, మారీచాది రాక్షసుల సమూహాన్ని సులభంగా చంపగలడు. వారిని చంపగల బలశాలి, ఒక్క శ్రీరాముడేకాని మరెవ్వరూలేరు. నా యజ్ఞాన్ని రక్షించగల సమర్థుడైన శ్రీరాముడిని నావెంటపంపు. నువ్వీకార్యాన్ని నెరవేరుస్తే, నీ కొడుకుకు నేనెన్నో శుభాలు కలిగిస్తాను. రాముడు లోకంలో విశేషమైన కీర్తిమంతుడిగా ప్రకాశిస్తాడు'' అని అంటాడు.

సంసారిగా వున్న దశరథుడికి పుత్రుడిపై మోహమెందుకుండదు? ఆయన కొడుకు బలాబలాలు, ఆయనకన్నా ఎక్కువగా విశ్వామిత్రుడికెట్లా తెలుసన్న సందేహం కలగొచ్చు. శ్రీరాముడు పేరుకే దశరథుడి కొడుకు. నిజానికి లోకాలకెల్ల తండ్రి. ఆవిషయాన్నే చెప్తూ, శ్రీరాముడు లోకాన్ని ఉద్ధరించడానికై పుట్టాడు కాని, దశరథుడి ఇంట్లో సుఖపడడానికి కాదంటాడు విశ్వామిత్రుడు. శ్రీరాముడు తన కొడుకని దశరథుడికెంత ప్రేముందో, జగజ్జనకుడైన ఆయనకు అంతకన్నా ఎక్కువ ప్రేమ లోకంమీదుంది. సత్య మెరుగని దశరథుడు శ్రీరాముడిని తనకుమారుడనే తలబోస్తున్నాడనీ, సత్యమెరిగిన తనలాంటివారు, ఆయనను భగవంతుడిగా చూస్తున్నారనికూడా అంటాడు. ఆయన అందరి సొత్తుకాని, కేవలం దశరథుడొక్కడి సొత్తుకాదని విశ్వామిత్రుడు స్పష్టంచేస్తాడు.

''రాజేంద్రా! శ్రీరాముడి సత్య పరాక్రమం నాకు తెలుసు. కావాలంటే వశిష్ఠుడిని అడుగు. అంతటితో తృప్తికలగపోతే ఇక్కడున్న తపస్వులనందరినీ అడుగు. వీరందరికీ శ్రీరాముడి మహిమ తెలుసు. శ్రీరామచంద్రుడిని నాతో పంపు. పనికిమాలిన సందేహాలన్నీ వదిలిపెట్టు. ఈ యజ్ఞం రాక్షసులవల్ల విఘ్నం కాకుండా కాపాడబడాలి. దీక్షా కాలం మించిపోక ముందే నీ కొడుకును నా వెంట పంపు'' అని తాను చెప్పదల్చుకొన్నది పూర్తిగా చెప్పి, యజ్ఞం పేరుతో శ్రీరాముడిని తన వెంట తీసుకొనిపోయి, వారితో మారీచ, సుబాహులను చంపించి, వారికి శ్రేయస్సు కలిగించాలని తాను తలంచిన విషయాన్నంతా చెప్పి, దశరథుడి సమాధానం కొరకు మౌనం దాల్చాడు విశ్వామిత్రుడు.

విశ్వామిత్రుడు రామచంద్రమూర్తిని తన వెంట పంపమన్న మాట వినగానే దశరథుడి ముఖం విలవిల బోయింది. స్మృతి తప్పి పడిపోయాడు దశరథుడు. అలా కొంత సేపు స్మృతి తప్పిన దశరథుడు, కోలుకొని, ధైర్యం తెచ్చుకొని, కొడుకు మీదుండే మోహంతో, పామరత్వంతో, శ్రీరాముడి మూల్యాన్నే

ఎంచుతూ, ఆయన మహాత్మ్యాన్ని గురించి విశ్వామిత్రుడు చెప్పిన మాటలన్నీ మరచిపోయి, రామచంద్రమూర్తిని పంపలేనని చెప్పాడు స్పష్టంగా.

''అయ్యా! విశ్వామిత్ర మహామునీ! 'మా రాముడు' ఇంకా బాలక్రీడలలోనే వినోదం పొందుతున్నాడు. పదహారు సంవత్సరాలింకా నిండలేదు. అందుకే యుద్ధయోగ్యుడుకాదు. బలవంతులైన రాక్షసులతో యుద్ధం ఎలా చేస్తాడు? విశ్వామిత్రా! యజ్ఞం రక్షించబడడమే కదా నీకు కావాల్సింది. దానిని నేను నెరవేరుస్తాను'' అంటాడు దశరథుడు. ఇంకా ఇలా అంటాడు.

"కౌశికనందనా! పుట్టు వెంట్రుకలు కూడా ఇంకా తీయని పసిబాలుడు రాముడు, సమర్థుడని, గొప్పమనస్సున్న ఆలోచనాపరుడివైన నువ్వెట్లా అనుకున్నావయ్యా? వాడు నాప్రాణం. వాడు కష్టపడితే నాప్రాణం పోయినట్లే. వాడికి, నాకు ఎడబాటు కలిగిస్తే నాప్రాణం ఈ దేహంలో వుండదు. ఈవయస్సులో మమ్మల్ని వాడితో వేరుచేయవద్దు. వాడినెట్లా పంపిస్తా? పంపితే ఎట్లా జీవిస్తా?''.

శ్రీమహావిష్ణువు అవతారమైన శ్రీరామచంద్రమూర్తి మహాత్మ్యాన్ని విశ్వామిత్రుడు చెప్పినప్పటికీ, దశరథుడింకా ''మారాముడు'', "పసిబాలుడు'', "బాలక్రీడారాముడు'' అనే అంటాడు. పామరత్వంతో, పుత్రవ్యామోహాన్ని వదలలేకపోతాడు. పదహారేళ్ళుకూడా నిండనివాడు రాముడంటాడు. మైనారిటీ తీరలేదనే అర్థం స్ఫురిస్తుందాయన మాటల్లో. యుద్ధార్హుడు కాకపోవడానికి కారణం కేవలం వయసు తక్కువగా వుండడమే కాదు, రాక్షసుల స్వభావం తెలియనివాడైనందున యుద్ధంచేయలేడని దశరథుడి ఉద్దేశం.

దశరథుడి మాటల ప్రకారం, శ్రీరాముడికప్పుడు పదహారో సంవత్సరం నడుస్తున్నదనుకోవాలి. ఆ వయస్సులోనే కొన్నిరోజులతర్వాత వివాహం జరిగింది. ఆ తర్వాత పన్నెండేళ్లు అయోధ్యలో గడిపాడు. అయోధ్యకాండలో ఒకానొక చోట సీతాదేవి చెప్పిందాన్ని బట్టి, శ్రీరాముడు అరణ్యవాసానికి బయలుదేరేటప్పుడు ఆయన వయస్సు 28 సంవత్సరాలు. అయితే, రావణుడితో భర్తవయసెంతో చెప్తూ, వనప్రవేశసమయంలో రాముడికి 25 సంవత్సరాలనీ, తనకు 18 సంవత్సరాలనీ అంటుంది. మరో సందర్భంలో అరణ్యానికి పోయే ముందర తనను చూడడానికి వచ్చిన శ్రీరాముడితో కౌసల్య అన్న మాటల ప్రకారం, ఆయన కప్పుడు 17 సంవత్సరాల వయస్సుండాలి. ఇదే నిజమైతే, శ్రీరాముడికి ఐదవ ఏటనే పెళ్ళి జరిగుండాలి. విశ్వామిత్రుడి వెంట వెళ్ళే సమయంలో ఆయనకు ఉపనయనమయినట్లు చెప్పబడింది. ఐదో సంవత్సరంలో ఉపనయనం జరగడం శాస్త్రవిరుద్ధం కాబట్టి, శ్రీరాముడు అరణ్యానికి పోయేటప్పుడు 8+17=25 సంవత్సరాల వయస్సని గ్రహించాలి.

వనవాసానికి వచ్చేటప్పటికి శ్రీరాముడికి 25 సంవత్సరాలని వాల్మీకి రాశాడు. వనవాసం వెళ్ళేటప్పుడు 25 సంవత్సరాలనీ, విశ్వామిత్రుడివెంట పోయేటప్పుడు 12 సంవత్సరాలనీ అనుకోవాలి. పన్నెండో నెలలో శ్రీరాముడి జననం, పన్నెండో ఏట విశ్వామిత్రుడితో వెళ్ళడం, పన్నెండేళ్లు అయోధ్యా వాసం, పన్నెండేళ్లు అరణ్యవాసం, పన్నెండేళ్లు సీతాదేవి వాల్మీకి ఆశ్రమంలో నివాసం. ఈ విచిత్రం తత్త్వ వేత్తలకే తెలవాలి.

పామరత్వంతో దశరథుడు మాట్లాడిన మాటలను విన్న విశ్వామిత్రుడు, కోపం తెచ్చుకొని,

కనుబొమల్ని భయంకరంగా ముడిచి, ప్రళయకాల రుద్రుడిలాగా భయంకరుడై, మండుటెండలో నేయివేస్తే ధగ్గుమని విజృంభించే అగ్నిలాగా, అసలే స్వభావరీత్యా కోపిష్ఠైనందున, దశరథుడిని ఏంచేయబోతున్నాడోననేవిధంగా, దేవతా సమూహాలు భయపడుతుంటే, భూమి గడగడలాడుతుంటే రాజును దూశించాడు తీవ్రంగా. ఇలా ఎప్పుడైతే విశ్వామిత్రుడు పలుకుతుంటే చూశాడో, దశరథుడితో శ్రీరాముడిని విశ్వామిత్రుడితో పంపమని నచ్చచెప్తాడు వశిష్ఠుడు.

''రాజేంద్రా! విశ్వామిత్రుడితో నువ్వు తొందరపడి, ఆయనేదికోరినా ఇస్తానన్నావు. ఆతర్వాతనే ఆయన తనకోరికను బయటపెట్టాడు. చెప్పిన తర్వాత నువ్వు ఆడినమాట తప్పడం న్యాయమా? అందుచేత, శ్రీరామచంద్రుడిని విశ్వామిత్రుడివెంట పంపడమే నీకు మేలైన కార్యం. విశ్వామిత్రుడి రక్షణలో వున్న రాముడిని ఎంతటి బలవంతులైనా, రాక్షసులైనా ఏం చేయలేరు. కాబట్టి శ్రీరాముడికి ఏ అపాయం జరుగుతుందన్న భయం లేదు. భయకారణమూలేదు. విశ్వామిత్రుడంటే అందరిలాంటి మునీశ్వరుడు కానేకాదు. ఇవి ఇలాంటివని పరీక్షించి తెలుసుకోడానికి సాధ్యపడని మహాస్త్రాలు ఈయన వశంలో వున్నాయి'' అని దశరథుడితో అంటూ, శ్రీరామ మహాత్మ్యం చెప్పినా తెలుసుకోలేని అతడిని చూసి, ఇంకా నమ్మకం కలిగేలా విశ్వామిత్రుడి అస్త్ర సంపత్తిని గురించి వివరంగా చెప్పాడు వశిష్ఠుడు.

వశిష్ఠుడు చెప్పిందంతా విన్న దశరథుడు, సంతోషించి, మునివెంట పంపేందుకై, లక్ష్మణుడితో సహా రామచంద్రుడిని నిండు మనస్సుతో పిలిచాడు. వచ్చిన కొడుకులకు తొలుత తల్లితండ్రులు మంగళా శాసనం కావించారు. తరువాత పురోహితుడు శుభమైన మాటలతో వారి హితం కోరి, వారికి రాక్షసులవల్ల బాధలుకలుగకుండా మంత్రించారు. దశరథుడు శ్రీరామచంద్రుడిని తన దగ్గరకు పిల్చి, శిరస్సు వాసనచూచి, మీద చేయి వేసి, మహా ప్రీతితో అంతరాత్మ సంతోషిస్తుండగా, బ్రహ్మ సమానుడైన విశ్వామిత్రుడికి రామలక్ష్మణులను అప్పగించాడు.

'కౌసల్యా నందనుడైన' శ్రీరామచంద్రమూర్తి అవతార ప్రయోజనానికి అంకురార్పణ చేయబోతున్నాడు కాబట్టి, దేవతలు శుభశకునాలను ప్రదర్శించారు. భవిష్యత్ లో ఈయనను ఆశ్రయించి, తన కుమారుడైన హనుమంతుడు ధన్యుడై తనకూ కీర్తికలిగించబోతున్నాడన్న సంతోషంతో వాయుదేవుడు రాముడికి మార్గంలో ఆయాసం కలగకుండా, సువాసనలతో మెల్లమెల్లగా సుఖం కలిగేటట్లు వీచాడు. ఇక తమకు రాక్షసులవల్ల భయం లేదనీ, జయమేనని, ధైర్యంతో, దేవతలు బహిరంగంగా దుందుభులు మోగించారు. వృక్షాలు తలంబ్రాలు పోయబోతున్నట్లుగా పూలవాన కురిపించాయి. సూర్యకిరణాలు వేడి సోకకుండా సన్న తుంపర వాన కురిసింది. దేవతలు కనబర్చిన శుభశకునాలను చూసిన అయోధ్యాపురవాసులు, విశ్వామిత్రుడివెంట శుభంగా శ్రీరామచంద్రుడు వెళుతుంటే, శంఖాలను, నగారాలను సంకులంగా మోగించారు.

ముందు తోవ చూపిస్తూ విశ్వామిత్రుడు పోతుంటే, తన వెనుక లక్ష్మణుడు నడుస్తుంటే, ఎడమచేతితో విల్లు ధరించి, శ్రీరామచంద్రమూర్తి వెళ్తున్నాడు. బ్రహ్మదేవుడి వెంటపోయే అశ్వినీ దేవతలలాగా, శివుడి వెనుక వెళ్ళే కుమారస్వామిలాగా, శ్రీరామ లక్ష్మణులను విశ్వామిత్రుడు తోడుకొని పోయాడు.

◆❖◆

రామావతారంలో దుష్టశిక్షణ స్త్రీ వధతోనే మొదలా?

మిథిలా నగరానికి పోయే దారిలో శ్రీరామలక్ష్మణులకు కామాశ్రమాన్ని చూపించి, ఆ తరువాత, తాటకాశ్రమాన్ని వారి పాద స్పర్శతో పవిత్రం చేయించాలన్న తలంపుతో అక్కడికి తీసుకుపోతున్నాడు విశ్వామిత్రుడు. ఆ క్రమంలో నడస్తూ పోయి, గంగాతీరాన్ని చేరారు. అక్కడున్న మునులు వీరు రాబోతున్న సంగతి ముందే తెలుసుకుని, నావను సిద్ధంగా వుంచి, విశ్వామిత్రుడి కెదురుగావచ్చి, గంగానదిని దాటమని ప్రార్థిస్తారు. ఆ ప్రయాణంలో విశ్వామిత్రుడు, వారికి సరయూనది చరిత్రను, దాని పుట్టు పూర్వోత్తరాలను ఆరంభంనుంచి చెప్పాడు.

''బ్రహ్మ దేవుడు తన సంకల్పంతో కైలాసంలో ఒక చెరువును సృష్టించాడు. తన మానసంతో సృష్టించాడు కనుక దానికి 'మానస సరస్సు' అనీ, దానినుండి వెడలివచ్చిన నదికి 'సరయు' అని పేర్లు వచ్చాయి. సరయూ నది అయోధ్యా నగరాన్ని తాకుతూ ప్రవహించి, గంగానదిలో కలుస్తుంది. సరయూ నది నీళ్లు ఎత్తునుండి గంగలో పడడం వల్ల, రెండు నదుల నీళ్లు రాసుకుని ఆశ్చర్యకరమైన శబ్దం వస్తున్నది. రెండు నదులు కలసిన ప్రదేశాన్ని గంగా-సరయూ సంగమం అంటారు''.

(సరయూ నది అయోధ్యకు పడమటి భాగంలో ఆరంభమై, ఉత్తరంగా పారి, తూర్పువైపుకొచ్చి, అంగ దేశంలో నుండి ప్రవహించి గంగలో కలుస్తుంది).

అదొక పుణ్య తీర్థం కాబట్టి శ్రద్ధతో నమస్కరించమని విశ్వామిత్రుడనగానే రామలక్ష్మణులు ముని చెప్పినట్లే చేసి, నది దక్షిణపు వొడ్డుకు చేరారు. అక్కడ నావ దిగి, ముగ్గురూ కాలినడకన ప్రయాణమై పోతుండగా, దారిలో భయంకరమైన అడవిని చేరుతారు. మనుష్య సంచారం లేని కారడవిని చూసిన రామలక్ష్మణులు, భయంకరంగా కనిపిస్తుండే ఆ కారడవిలో వుండేదెవరని ప్రశ్నిస్తారు. గంగానదికి దక్షిణపు వొడ్డున వున్న ఆ అడవే తాటకారణ్యం. ఆ అరణ్యాన్ని గురించి విశ్వామిత్రుడు వివరంగా చెప్పాడిలా.

''ఈ వనాన్ని పూర్వకాలంలో దేవతలవంటి వారు ఏర్పాటుచేశారు. ఈ ప్రాంతమంతా ధన ధాన్య

సమృద్ధి కలిగి, లోకులందరిచే గౌరవించబడేది. మలద మని, కరూశ మని ఈ వూళ్ల పేర్లు. పూర్వం ఈ స్థలంలో ఇంద్రుడు కశ్యపుడి కొడుకైన వృత్రాసురుడిని చంపినందువల్ల అతడికి బ్రహ్మ హత్యా పాతకం తగిలింది. ఆ దోషం వల్ల ఇంద్రుడికి ఆకలి, మలం విడవడం జరిగింది. ఇంద్రుడికి కలిగిన బాధను, దోషాన్ని తొలగించేందుకు దేవతలు ఆయనతో దివ్య తీర్థాల్లో స్నానం చేయించారు. దాంతో ఆయనకు బ్రహ్మ హత్యా పాతకం తొలగిపోయింది. ఆకలి, మలం, రెండూ ఇక్కడే పోవడం వల్ల, ఇక్కడున్న ఒక ప్రదేశానికి మలద మని, మరో ప్రదేశానికి కరూశ మని ఇంద్రుడు పేర్లు పెట్టాడు. ఈ దేశాలు సౌఖ్యాతిశయంతో అలరారుతుంటే, ప్రజలు ధన ధాన్యాలతో సమృద్ధిగా వుండేవారు'' అని చెప్పాడు విశ్వామిత్రుడు.

''కొంతకాలం గడిచిన తర్వాత, ఈ ప్రాంతానికి, వెయ్యేనుగుల బలంగల, తాటక అనే ఒక యక్ష స్త్రీ వచ్చింది. తాటక, సుందుడు అనే వాడికి భార్యే, ఇంద్రుడితో సమానమైన బల పరాక్రమాలు వున్న మారీచుడు అనే నీచ రాక్షస కొడుకును కనింది. వాడు ప్రతిరోజు ఈ ప్రాంతంలో కనిపించిన ప్రతివాడినీ తినడంతో, ఇదొక శ్మశానంగా మారిపోయింది. మలద, కరూశాలు రూపురేఖలు మారిపోయి, భయంకరమైన కారడవిగా తయారయింది రామా'' అని అంటాడు విశ్వామిత్రుడు. అలా ఆ దేశం ఏ విధంగా పాడుకాబడ్డదో వివరించి, తాటక నివసించే స్థలం అక్కడికి ఒక ఆమడ దూరంలోనే వుందనీ, తన భుజ బలంతో తాటకను చంపి, ఆ ప్రదేశాన్ని ఖేదంలేనిదానిగా, చేయాలని రాముడిని ఆదేశిస్తాడు విశ్వామిత్రుడు.

లోకంలో యక్షులు దుర్బలులు అన్న పేరుందని, అలాంటప్పుడు ఒక యక్ష స్త్రీకి ఎట్లా వేయేనుగుల బలం కలిగిందని సంశయం వెలిబుచ్చాడు రాముడు. జవాబుగా: ''పూర్వకాలంలో సదాచార సంపన్నుడైన సుకేతుడు అనే గొప్ప యక్షుడుండేవాడు. వాడికి సంతానం లేక పోవడంతో, బ్రహ్మ కొరకు తపస్సు చేశాడు. సంతోషించిన బ్రహ్మ, వాడికి కొడుకును ఇవ్వకుండా, వేయేనుగుల బలంగల కూతురును ఇచ్చాడు. అది రూప యౌవనాలు కలిగినప్పుడు, సుకేతుడు, ఝర్ఝుని కొడుకైన సుందుడు కిచ్చి వివాహం చేశాడు. వారికి మారీచుడు అనే క్రూరుడైన కొడుకు పుట్టాడు. సుందుడు అగస్త్యుడి వల్ల మరణించాడు. మొగుడిని చంపిన అగస్త్యుడి మీద పగపట్టిన తాటక, కొడుకు మారీచుడుతో కలిసి, అతడిని చంపబోయింది. కోపగించిన అగస్త్యుడు, మారీచుడిని రాక్షసుడుగా కమ్మని, తాటకకు సుందర రూపం పోయి భయంకర రూపం కలగాలని శపిస్తాడు. శాపగ్రస్తురాలైన తాటక రాక్షసరూపంలో, అగస్త్యుడు సంచరించిన ప్రదేశంలోని మనుష్యులను తింటూ, వూళ్లకు వూళ్లనే పాడుచేసింది'' అని వివరణ ఇచ్చి, గోబ్రాహ్మణులకు మేలు కలిగే విధంగా, దయను విడిచి, తాటకను చంపి, కీర్తిమంతుడవు కమ్మని రాముడితో అంటాడు విశ్వామిత్రుడు.

''తాటక మిక్కిలి బలశాలి. శాపం వల్ల క్రూరురాలైంది. అలాంటి స్త్రీని చంపితే పాపం వస్తుందని భావించ వద్దు. భూమిని పాలించేవారు, ప్రజలను రక్షించేందుకు, క్రూరమైనా, కాకున్నా, పాపం వచ్చినా, పుణ్యం వచ్చినా, తనపై నింద పడ్డా, ఏ పనైనా చేయాల్సిందే. ఎందుకంటే, తాను చెడిపోయినా, లోకంలోని అనేకమందిని కాపాడాలి. ఎందరో మనుష్యులు, ఆవులు తాటక మూలాన ప్రాణాలు కోల్పోతుంటే, నువ్వు వాళ్లను రక్షించే శక్తి వుండికూడా, మౌనంగా వూరుకుంటే, గో బ్రాహ్మణ హత్యా

దోషం నీకు కలుగుతుంది''.

''స్త్రీ వధ అధర్మమంటే, నిష్కారణంగా, అధర్మంగా, ఇంత మందిని ఈ క్రూరురాలు చంపుతుంటే, రక్షించే శక్తి వుండికూడా, సహించి వూరుకోవడం ధర్మమా? అలా వూరుకుంటే, క్రమక్రమంగా దుష్టులు ప్రబలిపోతారు. శిష్టులు హతమై పోతారు. అధర్మాన్ని ధర్మమే జయించాలి గాని, అధర్మంతో జయించాలనుకుంటే, ఇరువురికీ తేడా లేదుకదా! అధర్మాన్ని ధర్మంతో జయించాలని అనుకున్నప్పుడే, అది ఉత్తమమైన మార్గమవుతుంది. అదే కనుక సాధ్యం కాకపోతే, అధర్మ వర్తనులను, అధర్మ మార్గంలోనే జయిస్తే, వారి అధర్మమే వారిని చంపినట్లవుతుంది. దీనివలన, అధర్మవర్తనుడు ధర్మంతోనైనా, అధర్మంతోనైనా చెడిపోతాడని భావమొస్తుంది. కాబట్టి, క్రూరులను క్రూరంగానూ, కుటిలులను కుటిలత తోనూ, అధర్మ వర్తనులను అధర్మంగానే, లోక హితం కోరి అణచడం తప్పుకాదు''.

''ప్రజలు నిష్కారణంగా చస్తుంటే చూసేవాడు రాజు కాడు. నువ్వు అధర్మ కార్యం చేయాలని నేను చెప్తున్నానని అనుకోవద్దు. శాస్త్రం చదవడం వల్ల, అనుభవం వల్ల, నాకు రాజ ధర్మం తెలుసు. కాబట్టి దాన్ని చంపు. రామచంద్రా! నువ్వింక ఆలోచించాల్సిన పనిలేదు. నేను చెప్పినట్లే తాటకను చంప'' మని విశ్వామిత్రుడు రాముడికి పలు విధాలుగా బోధిస్తాడు.

విశ్వామిత్రుడు చెప్పిన మాటలన్నీ విని, రామచంద్రమూర్తి తనలో తానే ఆలోచించాడు కొంత సేపు. ''స్త్రీ వధ పాపం అనిపిస్తుంది. గురువైన విశ్వామిత్రుడేమో అధర్మ ప్రవర్తన తాటకను చంపడం పాపం కాదంటున్నాడు. ఆయనెందుకు అసత్యం చెప్పి తనతో అధర్మ కార్యం చేయిస్తాడు? ఏదేమైనా, ఈ ధర్మ, అధర్మ విచారం తో నాకు పనిలేదు. నిండు సభలో తన తండ్రి విశ్వామిత్రుడు చెప్పిన పనులన్నీ చేయమని చెప్పాడు తనతో. జనకుడు ఆజ్ఞ జవదాటకూడదు. గౌరవించాలి. కాబట్టి ధర్మమో, అధర్మమో మునీంద్రుడి ఇష్టప్రకారం నడచుకుంటాను'' అని నిర్ణయించుకుంటాడు.

తండ్రి ఆజ్ఞ ప్రకారం బ్రహ్మ సమానుడైన ఈ బ్రహ్మవాది ఆజ్ఞ నెరవేరుద్దామని అనుకుంటాడు రాముడు. అలా నిశ్చయించుకున్న రాముడు, విశ్వామిత్రుడిని చూసి, చేతులెత్తి నమస్కరించి '' మునీంద్రా! బ్రాహ్మణులు, గోవులు, దేశాలు సుఖపడేందుకు నీ ఆజ్ఞ ప్రకారం తాటకను చంపుతాను'' అంటూ, దిక్కులు వూగే ధ్వని వచ్చే విధంగా తన అల్లె తాడును లాగాడు. చెవులు పగిలి పోయేటట్లు వచ్చిన ఆ ధ్వనిని విన్న తాటక, హుంకారాలతో, భూమి, దిక్కులు పగిలిపోయే విధంగా గర్జిస్తూ, రాముడి అల్లె త్రాటి ధ్వని వచ్చిన దిక్కును పసిగట్టి, ధ్వని చేసుకుంటూ, పాదాలు నేలపై కొట్టుకుంటూ, భయంకరాకారంతో వీరున్నవైపు రాసాగింది.

దాన్ని గమనించిన రాముడు లక్ష్మణుడితో అంటాడీవిధంగా: ''తమ్ముడా, లక్ష్మణా ! ఈ రాక్షసి ఎలా వికార వేషంతో, భయంకర దేహంతో, దిగులు పుట్టే ధ్వని చేస్తుందో చూశావా? ఎవరికైనా దీన్ని జయించడం సులభం కాదు. విశ్వామిత్రుడు సత్యమే చెప్పాడు. దీన్నెవరూ జయించ లేకపోవడం నిజమే. నేనే దీన్ని చంపాలి. కాకపోతే, స్త్రీని ఎట్లా చంపాలన్న కరుణ నన్ను పీడిస్తున్నది. అందుకే దీన్ని చంపకుండా, ముక్కు, చెవులు కోసి, గమన వేగాన్ని అణచివేసి, వెనక్కు తిరిగి పోయేటట్లు చేస్తాను. దాంతో భయం కలిగి చెడ్డ పనులు చేయదు'' అని అంటుండగానే, ఆ రాక్షసి రాముడి మీద పడబోయింది.

ఎప్పుడైతే తాటక భయంకర ఆకారంతో రాముడిపై పడబోయిందో, అప్పుడే విశ్వామిత్రుడు, హుంకారంతో అదిలించి, "రామభద్రుడికి జయం–జయం" అని దీవించాడు.

తాటక కూడా దూరం నుండే రాముడిపై గాలి వాన కురిపించింది. నివ్వెరపడ్డ రాముడు ప్రతిగా ఏం చేద్దామని ఆలోచిస్తుండగానే, తాటక మాయతో రామలక్ష్మణులమీద రివ్వురివ్వున, ధారలు–ధారలుగా, రాళ్లవాన విరామం లేకుండా కురిపించింది. దాని చేష్టలకు కోపించిన రాముడు బాణాలను కురిపించి తాటక రెండు చేతులను నరికివేశాడు. దానిని చంపనని, ముక్కు చెవులు మాత్రమే కోస్తానని అన్న చెప్పిన మాటలు జ్ఞప్తికి తెచ్చుకున్న లక్ష్మణుడు, ఆ పనిని తానే చేయదలిచి, దాని పైకి దూకి, దాని ముక్కు చెవులు ఖండిస్తాడు. అంతమాత్రాన అది వెనుకంజ వేయకుండా, విజృంభించి, నానా రూపాలు ధరించి, కళ్ళకు కనిపించకుండా, మాయలతో, మతి భ్రమణం కలిగించే రీతిలో విపరీతంగా రాళ్ల వాన కురిపిస్తూ ఎదిరించసాగింది.

ఇది గమనించిన విశ్వామిత్రుడు దీన్ని చంపటంలో ఆలశ్యం చేస్తే, సంధ్య వేళైతే, ఇక చంపడం అసాధ్యం అని హెచ్చరిస్తాడు. ఆయనలా అంటుండగానే, తాటక రాళ్లవాన కురిపిస్తూ, మాయా బలంతో తనను సమీపిస్తుంటే, అది కనబడకపోయినా, ధ్వనిని బట్టి గుర్తించి, బాణాలు ప్రయోగించి రాముడు దాని మదం అణిచాడు. తీక్షణమైన బాణాన్ని సంధించి, దాని రొమ్ములో నాటుకునేటట్లు వేయడంతో, ఆ రాక్షసి చచ్చిపోయి, భూమి అదిరిపోయేటట్లు దబీలుమని పడిపోయింది. అది చూసిన ఇంద్రాది దేవతలు, దుష్ట రాక్షసి చనిపోయిందని సంతోషించారు. ఇంతటి బలవంతురాలిని కేవలం బాణాలతోనే రామచంద్రమూర్తి సంహరించాడు. ఆయనకే కనుక అస్త్రబలం వుంటే ఎంత కార్యమైనా చేయగలడని పొగుడుతూ శ్రీరాముడిని పూజించారు దేవతలు.

శ్రీరామచంద్రమూర్తి అవతార కార్యధురంధరత్వం స్త్రీ వధతో ప్రారంభం అవుతుంది. స్త్రీ వధ పాపం అని రామాయణమే చెపుతుంది. భరత వాక్యం, హనుమంతుడి వాక్యం అదే విషయం తెలియచేస్తుంది. అలాంటప్పుడు శ్రీరాముడు ఎందుకు స్త్రీ వధ చేశాడు? భగవద్గీత పుట్టింది ఇలాంటి సంశయ నివృత్తికే. అర్జునుడు, శ్రీరాముడు, ఇరువురు క్షత్రియులే. స్వధర్మమని, బంధువులను చంపితే పాపం వస్తుందని, భయపడ్డాడు అర్జునుడు. స్వధర్మమని, స్త్రీని చంపవచ్చానని, శంకించాడు రాముడు. కృష్ణుడు అర్జునుడికి ఏం ఉపదేశించాడో, విశ్వామిత్రుడు అదే చేశాడు రాముడికి. స్వధర్మ నిర్వహణ తన విధి అని శ్రీరామచంద్రమూర్తి ఆసక్తి లేకపోయినా చేశాడు. అందుకే శ్రీరాముడు తాటకను చంపడం దోషం కాదు.

ఇంద్రాది దేవతలు అస్త్ర దానం చేయడానికి విశ్వామిత్రుడికి రాముడు కంటే యోగ్యుడైన వాడు మరొకరు కనిపించడని, అందుకే, ఆయన దగ్గరున్న విద్యా సమూహాన్నంతా రాముడికివ్వమని చెప్పి పోతారు వారందరు. ఆ రాత్రి అక్కడే గడిపి ఉదయం కాగానే, తన ఆశ్రమానికి పోదామని అంటాడు. సరేనన్న రామ లక్ష్మణులు, ఆ మూడో రోజు రాత్రి, అక్కడే వుండిపోయారు. ఆ వనం కూడా తాటక చావుతో శాపం తీరిన దానిలాగా, కుబేరుడి ఉద్యానవనం లాగా అనిపిస్తూ, సుందర లక్ష్మికి నివాస భూమిలాగా అగుపడ సాగింది.

◆❖◆

వాల్మీకంలో గంగావతరణం

విశ్వామిత్రుడి యాగరక్షణ పూర్తైన తరువాత ఆయన ఆజ్ఞానుసారం ఆయన వెంట మిథిలానగరానికి బయల్దేరి పోతూ మధ్యలో ఒకనాడు మనస్సుకింపైన గంగానదీ తీరంలో ఒక పెద్ద ఇసుక దిబ్బపై విశ్వామిత్రుడి చుట్టూ చేరి కూర్చున్నారు రామలక్ష్మణులు. ఆ సమయంలో గంగానదిని చూపిస్తూ, అది ఎలా మూడు మార్గాల్లో సముద్రాన్ని చేరడానికి వీలైందని రాముడు ఆయన్ను ప్రశ్నిస్తాడు. రామచంద్రమూర్తి వేసిన ప్రశ్నకు జవాబుగా విశ్వామిత్రుడు గంగానదీ వృత్తాంతాన్ని చెప్పసాగాడు.

''హిమవత్పర్వతం గురించి తెలియనివారు లేరు. ఆ హిమవంతుడు మేరుపర్వతం కూతురైన మేనకనే మనోరమను పెళ్లి చేసుకుని, ఇద్దరు కూతుళ్లను కన్నాడు. వారిలో పెద్దది 'గంగ'', చిన్నది 'ఉమ'. వారిద్దరూ పెరిగి పెద్దవారైతున్నప్పుడు, దేవతలు ఆయన్ను కలిసి, తమ కొరకు గంగను మూడు మార్గాల్లో ప్రవహింపచేసి, అందులో ఒక మార్గాన్ని తమకిమ్మని వేడుకున్నారు. దేహి అని అడిగితే కాదనకూడదనుకున్న హిమవంతుడు, మూడు లోకాలను పావనం చేసేదై, స్వేచ్ఛగా చరించేదై, ఆకాశ మార్గంలో పోగలిగేదైన గంగను, వారికి వెంటనే ఇవ్వడంతో వారామెను తమ లోకానికి తీసుకుపోయారు'' అని పర్వతరాజు కూతురైన గంగ ఏవిధంగా జన్మించి ఆకాశానికి పోయిందో తెలియచెప్పాడు శ్రీరాముడికి విశ్వామిత్రుడు.

గంగ వృత్తాంతాన్ని సంపూర్ణంగా వినాలన్న కోరికతో శ్రీరామలక్ష్మణులు, గంగ దేవలోకంలో, మనుష్యలోకంలో ఎలా సంచరించిందని విశ్వామిత్రుడిని అడుగుతారు. ఆమెకంత కీర్తి రావడానికి కారణమేంటని, ఏ పని చేయడంవల్ల ఆమె నదులన్నిటిలో ఉత్తమమైందిగా పిలువబడిందని అడుగుతారు. జవాబుగా, గంగా చరిత్రను పూర్తిగా చెప్పాడు విశ్వామిత్రుడు.

''పూర్వకాలంలో శివుడు పార్వతిని పెళ్లి చేసుకుని, సంతోషంగా ఆమెతో నూరు దివ్య సంవత్సరాలు గడిపాడు. అయినా కొడుకు పుట్టలేదు. రేతస్ఖలనం కాలేదు. ఇంతకాలం రేతస్ఖలనం కాకపోతే, అయినప్పుడు ఎంత బలిష్ఠమైనవాడు పుడతాడోననీ, వాడెలాంటివాడవుతాడోననీ, వాడిని

భరించడమెట్లాననీ దేవతలు భయపడి, తమ బాధను బ్రహ్మతో చెప్పుకుంటారు. అందరూ వెళ్లి శివుడిని కలిసి, నమస్కరించి, తమ మ్రొక్కులను గ్రహించి తమననుగ్రహించమని వేడుకుంటూ, ఆయన తేజస్సుతో పుట్టబోయే కుమారుడిని లోకాలెన్ని కలిసినా భరించలేవని విన్నవించుకుంటారు. మన్మథ విరోధైన శివుడిని, పార్వతిని, వేదోక్తంగా ఘోర తపస్సు చేయమని కోరుతూ, ఆయన నుండి వెలువడే కాంతి పూరితమైన తన రేతస్సును పార్వతిలో విడువకుండా తనలోనే వుంచుకొమ్మని ప్రార్థిస్తారు. అలా చేస్తే లోకాలన్ని సంతోషిస్తాయని, లోకాలకు అకాల ప్రళయం రాకుండా రక్షించమని స్తోత్రం చేస్తూ ప్రార్థించారు''.

దీన్నే ''మహా మైథునం'' అని వాడుకలో పిలుస్తారు. పంచమ కారులైన శాక్తేయులకు ఇది పరమ పవిత్రమైన వ్రతం.

''ఇలా ప్రార్థించిన దేవతలను ప్రేమతో చూసిన శివుడు, వారి కోరినట్లే చేస్తానంటాడు. తను వీర్యాన్ని, పార్వతి శోణితాన్ని తమలోనే ధరించెదమని, రెంటినీ కలవనీయమని, వేర్వేరుగా వుంచుతామని అంటూ, మనుష్యులు, దేవతలు సుఖంగా వుండమని చెప్తాడు. ఇలా శివుడు తన గౌరవం అతిశయించే విధంగా చెప్పగా, ఆయన తేజం జారితే, దాన్ని భూదేవి ధరిస్తుందని దేవతలంటారు. అప్పుడు శివుడు దాన్ని వెలుపలకి వదిలాడు. అది, అడవులు, కొండలతో సహా భూమంతా వ్యాపించే విధం చూసిన దేవతలకు భయమేసింది. వారప్పుడు ఆ శివ తేజస్సును భూమి భరించలేకపోతున్నదని భావించి, అగ్నిహోత్రుడిని, వాయుదేవుడిని సంయుక్తంగా భరించమని కోరగా, అగ్నిహోత్రుడందులో ప్రవేశించాడు. ఆకారణాన అదొక పెద్ద మంచు కొండలాగా యింది. సూర్యాగ్నుల సంపూర్ణ కాంతితో మనోహరంగా లోకసమ్మతమయింది. కాలక్రమంలో అది శరవణం అయింది. దానిలో పుట్టినందున కుమారస్వామి అగ్నిపుత్రుడయ్యాడు. ఆయనే కృత్తికల పుత్రుడై కార్తికేయుడయ్యాడు''.

''ఇదంతా జరిగినందున దేవతలపై పగబట్టిన పార్వతి, వారుచేసిన పాప ఫలం అనుభవించమని నిష్ఠురాలాడింది. పార్వతీదేవి శపించడంతో దేవతలు సిగ్గుతో తలలు వంచుకుని దుఃఖించారు. వారి దుఃఖం చూడలేక శివుడు పార్వతితో కలిసి హిమవత్పర్వతం ఉత్తర శిఖరానికి తపస్సు చేసేందుకు పోయాడు'' ఇలా పార్వతి చరిత్రను ఉపోద్ఘాతంగా చెప్పిన విశ్వామిత్రుడు తదుపరి గంగ చరిత్ర చెప్పసాగాడు.

''పార్వతితో శివుడు తపస్సు చేసేందుకు హిమవత్పర్వతానికి పోవడంతో దేవతలందరూ ఋషీశ్వరులతో కలిసి, బ్రహ్మ దగ్గరకు పోయి, రాక్షసులతో యుద్ధం చేసేందుకు తగిన బలవంతుడైన సేనానాయకుడు కావాలనీ అడిగారు. జవాబుగా, బ్రహ్మ, గంగ ద్వారా అగ్నిహోత్రుడికి ఒక కుమారుడు కలగనున్నాడని, వాడు దేవతలకు సేనానాయకుడై వాళ్లను రక్షిస్తాడని చెప్తాడు. గంగకు పుట్టిన కొడుకును ఆమెవలనే, పార్వతికూడా తన కుమారుడిగానే అంగీకరిస్తుందని అన్నాడు. ఆ తరువాత అగ్నిదేవుడిని కలిసారు దేవతలు. ఆయన ధరించిన ఈశ్వర తేజాన్ని గంగలో విడిచి కుమారుడిని కనమని, లోకాలకెల్ల ఇది హితమైన కార్యమని వేడుకుంటారు. అంగీకరించిన అగ్ని గంగను చేరగా, ఆమెకూడా అయన కోరికను ఒప్పుకుంటుంది. గంగ సౌందర్యవంతమైన రూపాన్ని ధరించి ఆయన్ను

సమీపించగా, అగ్నిహోత్రుడు తన సర్వావయాలనుండి తనలో వున్న తేజస్సును ఆమెలో విడిచాడు. దాంతో గంగా ప్రవాహమంతా మిక్కిలి తేజస్సుతో ప్రకాశించింది''.

''తానీ గర్భ వేదనను సహించలేక పోతున్నాననీ, తేజస్సును భరించలేక పోతున్నాననీ, అవయవాలు దుర్బలమై తెగిపోతున్నాయని, మండిపోతున్నాయని నిట్టూర్పులిడిచింది గంగ. దిగాలుపడిన గంగను చూసిన అగ్నిహోత్రుడు, ఆమె తన గర్భాన్ని హిమవంతం కిందిభాగంలోని నేలపై విడవమని చెప్పాడు. ఆ ప్రకారమే గంగ దాన్ని శుక్ల శోణితాల్లో విడిచింది. ఆ ప్రదేశం వెండి, బంగారం అయింది. దానివేడిగాలికి బూడిదైన ప్రదేశం రాగి, ఇనుము అయింది. మలినం నిలిచిన ప్రదేశం సీసం, తగరం అయింది. అది ప్రవహించిన ప్రదేశంలో అనేక ధాతువులు ఏర్పడ్డాయి. ప్రత్యక్షంగా ఎక్కడైతే గర్భం నిలిచిందో అదంతా బంగారు మయమయింది. అది వ్యాపించిన ప్రాంతంలోని చెట్లు, తీగలు, పొదలు, పచ్చిక బంగారమయింది. అప్పటినుంచి బంగారం అగ్ని వర్ణంలో వుండడంతో జాత రూపం అనే పేరొచ్చింది''.

''శరవణంలో పుట్టిన కొడుకును చూసిన ఇంద్రాది దేవతలు, ఆయన తమ సేనాపతి అవుతాడని బ్రహ్మ చెప్పడంవల్ల, దేవతలు ఆయనను తమ సేనలకు నాయకుడిగా అభిషేకం చేశారు'' అని విశ్వామిత్రుడు గంగాదేవి చరిత్రమంతా రామలక్ష్మణులకు చెప్పి, పుణ్యాత్ముడైన కుమారస్వామి చరిత్రను వినినందున ఆయనకెప్పుడు శుభాలు కలుగుతాయని అంటాడు.

ఇక ఆ తరువాత సగరుడి చరిత్ర చెప్పి గంగావతరణం గురించి వివరించాడు. ''సగరుడి మరణం తర్వాత ఆయన మనుమడు అంశుమంతుడు తన కొడుకైన దిలీపుడిపై రాజ్యభారం మోపి, హిమవత్పర్వతానికి పోయి సగరకుమారులందరికి తర్పణాలు విడవడం కోసం గంగకొరకు ముప్పైరెండు వేల సంవత్సరాలు ఘోర తపస్సు చేశాడు. చివరకు గంగను తేలేక మరణించాడు. తదనంతరం, దిలీపుడు తన కొడుకైన భగీరథుడిని రాజుగా చేసి మరణించాడు. భగీరథుడు రాజర్షిగా వుండి, పిల్లలు లేనివాడైనందున, రాజ్యాన్ని మంత్రుల పరంచేసి, గంగను తెచ్చేందుకు గోకర్ణానికి తపస్సు చేసేందుకు పోతాడు. గంగా తీర్థంతో తన తాతల బూడిద రాసులను తడిపితే వారందరు స్వర్గానికి పోతారని, అలా వరమివ్వమనీ, తనకు పుత్రులనిచ్చి ఇక్ష్వాకుల వంశాన్ని నిలబెట్టమనీ బ్రహ్మనడిగాడు భగీరథుడు. ఆయన కోరినట్లే జరుగుతుందనీ, అయితే, ఆకాశగంగ భూమిపై పడితే ఆ వేగాన్ని, భారాన్ని భూమి భరించలేదుకాబట్టి దాన్ని భరించేందుకు శివుడిని ప్రార్థించమని సూచిస్తాడు. భగీరథుడికలా చెప్పి, తన మాట ప్రకారం ఆ పుణ్య చరితుడి కోరిక తీర్చేందుకు భూలోకానికి పొమ్మని గంగకు కూడా చెప్పి అంతర్థానమయ్యాడు ''.

''భగీరథుడు ఏడాదిపాటు శివుడి కొరకు తపస్సు చేశాడు. ఆయన కోరిక ప్రకారమే గంగానదిని తన శిరస్సుపై ధరిస్తానని శివుడు మాటిస్తాడు. శివుడిలా చెప్పగానే, గర్వాతిశయంలో వున్న ఆకాశగంగ, ఎలా శివుడు తనను సహించగలుగాతాడో పరీక్షించాలని, ఆయన్నెత్తుకుని పాతాళంలో పడేయాలని నిశ్చయించుకుంటుంది. భయంకరమైన ఆకారంతో, సహించరాని అధికమైన వేగంతో వస్తున్న ఆకాశగంగ పొగరు చూసిన శివుడు, రోషంతో విజృంభించి గంగ ఉనికి లేకుండా చేయాలనుకుంటాడు. హిమవత్పర్వతంతో సమానమైన గుహలాంటి రుద్రుడి జడలో భయంకరంగా ప్రవేశించిన ఆకాశ గంగ,

వెలుపలకి రాలేక, అందులోనే తిరుగుతూ, చాలా సంవత్సరాలు సుళ్లు తిరుగుతూ బాధననుభవించింది''.

''శివుడు, తన జడల గుంపును కొంత సడలించి, ఆ సందులోంచి కొంచం పరిమాణంలో గంగను బిందు సరోవరంలో విడిచాడు. అక్కడినుంచి ఏడు పాయలుగా గంగానది పారింది. హ్లాదిని, పావని, నళిని అనే మూడు పాయలు తూర్పు ముఖంగా, సుచక్షువు, సీత, సింధు అనే మూడు పాయలు పడమటి దిక్కుగా పారాయి. మిగిలిన ఏడో పాయ భగీరథుడి వెంట వచ్చింది. భగీరథుడు ఆకాశ గమనం గల దివ్యరథాన్నెక్కి, ఆకాశ మార్గంలో పయనం చేస్తుంటే, దేవతల పొగడ్తల మధ్య గంగ భూమ్మీదగా భగీరథుడి వెంట పోయింది. అప్పటి నళిని పాయనే ఇప్పుడు బ్రహ్మపుత్రి నదని అంటున్నారు''

''అలా ఆకాశాన్నుండి చీలిపోయి, శివుడి జటాజూటంలోకి చొరబడి, అక్కడినుంచి భూమి పైకొచ్చి, భూమిపై ప్రవహించ సాగింది గంగ. పవిత్రమైన గంగాజలం శివుడి శిరస్సునుండి పడిందని భావించిన దేవతలు, దేవర్షులు, భూమిపైనున్న వారందరు అందులో స్నానం చేశారు. శాప కారణంగా భూమ్మీదనున్న దేవతలు కూడా గంగాస్నానం చేసి, పాపరహితులై తిరిగి దేవత్వాన్ని పొందారు. భూమ్మీదున్న ప్రజలు కూడా గంగలో స్నానం చేసి తరించారు. ఇలా గంగ భగీరథుడి రథం వెంట పోతుంటే, దాని వెంబడి దేవతల, రాక్షసుల, కిన్నరుల, యక్షుల గుంపులు పోతుండగా, మార్గమధ్యంలో, జహ్నుడు అనే ముని యజ్ఞం చేస్తున్న ప్రదేశాన్ని గంగ నీటితో ముంచింది''.

''ఎప్పుడైతే నీటితో గంగ తన యజ్ఞ వాటికను ముంచేసిందో, జహ్నుడు కోపించి, గంగ గర్వం అణచాలనుకొని, నిమిషంలో గంగా జలాన్నంతా తాగేశాడు. అప్పుడు దాని వెంట వస్తున్న మునీంద్రులు, ఇతర దేవతా గణం ఆయన్ను ప్రార్థించి, గంగ ఆయన కూతురుగా ప్రఖ్యాతి వహిస్తుందని చెప్పి, ఆమెను వదిలిపెట్టమని కోరుతారు. వారి మాటలకు సంతోషించిన జహ్నుడు, గంగను తన చెవులలో నుండి బయటకొదిలాడు. గంగ అందువల్ల జాహ్నవిగా పిలువబడుతుంది. గంగ ఆ పిమ్మట భగీరథుడి రథం వెంట పోయి, సముద్రంలో ప్రవేశించి, ఆయన కోరిక నెరవేర్చేందుకు పాతాళానికి పోయి, భగీరథుడి తాతల బూడిదమీద దండిగా ప్రవహించడంతో, సగర పుత్రులంతా దోషరహితులై, స్వర్గానికి పోయారు''.

శంకరుడి శిరస్సులో పడినందున, పాపాలను పోగెట్టేదైనందున పావనమైంది గంగంటారు. పావనమైంది కనుకనే రుద్రుడు ధరించాడు. అందువల్ల మనం కూడా పావనమవుదామని సమస్త దేవతలు స్నానమాడి వారు పావనులై, గంగనూ పావనం చేసారు. శివుడి శిరస్సునుండి గంగ పవిత్రం కావడానికి అసలు కారణం, విష్ణు పాదంలో పుట్టడమే. హరుడి శిరస్సునందుండి పడడం వల్ల గంగ పుణ్య నదైందని శైవులు వాదిస్తారు. గంగ పుణ్యనది కనుకనే శివుడు తలపై ధరించాడని వైష్ణవ వాదం. ఈ వివాదాన్ని పరిష్కరించేది వాల్మీకి రామాయణం మాత్రమేనని వాసుదాసుగారి అభిప్రాయం. రామాయణం మూల శ్లోకంలో పుణ్యగంగ, పుణ్యశివుడి శిరస్సులో పడిందనుంది. గంగాశివులకు పరస్పర సంబంధం లేనప్పుడు కూడ ఇద్దరూ పుణ్యులనే అర్థం. అయోధ్యా కాండలో వశిష్ఠ వాక్యంగా కూడా ఇది చెప్పబడుతుంది. అక్కడ గంగ పాదతీర్థం ధరించి పార్వతీ పతి ధన్యుడయ్యాడు అని చెప్పబడుతుంది ఒకానొక చోట.

వసిష్ఠ శక్తి సులభమైంది కాదా?

మిథిలానగరం వచ్చిన విశ్వామిత్రుడు ద్వారా శ్రీరామచంద్రమూర్తి దర్శనం తనకు కలిగినందుకు, అహల్యా–గౌతముడి కుమారుడైన శతానందుడు విశ్వామిత్రుడు సామాన్యుడు కాదని, ఘోరమైన తపస్సు చేసి బ్రహ్మర్షితనాన్ని సంపాదించాడని, శ్రీరామచంద్రుడికి చెప్పాడు. ఆ వివరాలను ఆయన మాటల్లోనే....

ధర్మస్వభావుడైన విశ్వామిత్రుడు రాజ్యపాలన చేస్తూ, ఒక పర్యాయం, సేనలతోగూడి భూమంతా తిరుగుతూ వశిష్ఠాశ్రమాన్ని చూశాడు. ఆశ్రమం లోపలికి పోయి, వినయ విధేయతలతో వశిష్ఠుడికి నమస్కరించాడు. అప్పుడు వశిష్టుడు, సేనలతో సహా అతడికి ఆతిథ్యమిచ్చి గౌరవించదల్చుకున్నాననీ, అంగీకరించమనీ కోరాడు. విశ్వామిత్రుడు ఆతిథ్యం తీసుకునేందుకు అంగీకరించాడు. వెంటనే వశిష్ఠుడు తన కామధేనువైన శబలను పిలిచి, అన్ని రకాల భోజ్యాల్ని ఏర్పాటుచేయమని ఆదేశించాడు. వశిష్ఠుడు చెప్పిన విధంగానే, కామధేనువు, రకరకాల భక్ష్యభోజ్యాలను, ఎవరేదికోరితే దాన్నిసృష్టించింది. మంత్రులతోను, బ్రాహ్మణాదులతోను, సైన్యంతోను కలిసి రాజు సంతృప్తిగా, కడుపునిండా భోజనంచేసాడు.

భోజనానంతరం, విశ్వామిత్రుడు, తనకు కామధేనువు శబలనివ్వమని అంటాడు. శబలను ఎడబాయనంటాడు వశిష్ఠుడు. తనను విడిచి శబల కూడా వుండలేదన్నాడు. తాను సర్వం కామధేనువుతోనే నెరవేర్చుకుంటున్నాననీ, దానికి ఎన్నో విద్యలు కూడా వచ్చనీ, తనకది అవ్యానందానికి కారణమైందని, అలాంటి దాన్ని తను విడిచి ఎలా వుండాలనీ విశ్వామిత్రుడిని ప్రశ్నించాడు వశిష్ఠుడు. కామధేనువును తానివ్వకపోవడానికి మరెన్నో కారణాలను కూడా చెప్పాడు.

వశిష్ఠుడలా కామధేనువును ఇవ్వనని చెప్పగానే, విశ్వామిత్రుడు బలవంతంగా దానిని తీసుకొని పోసాగాడు. తనను ఈడ్చుకొనిపోతున్న భటుల కట్లు తెంచుకొని, మునీశ్వరుడి వద్దకు పోతుంది. క్షత్రియ బలమొక బలమేకాదని, బ్రాహ్మణబలం లెక్కలేని మహిమగలదని, రాజెంత బలవంతుడైనా

వశిష్ఠుడికంటే గొప్పవాడుకాదనీ, తనకాజ్ఞ ఇస్తే రాజు సేనంతా నాశనంచేస్తాననీ కామధేనువైన శబల అంటుంది. ఆలా ప్రార్థించిన శబలను, శత్రువులు నివ్వెరపోయేట్లు. వారి రూపం చెడిపోయేట్లు చేయగల, అనేకమంది శూరులను సృష్టించమని ఆదేశించాడు వశిష్ఠుడు.

వశిష్ఠుడి ఆజ్ఞ లభించగానే, శత్రు సమూహాలకు భయంకలిగించే పప్లవులనే శూరులను తన హుంభారవంతో శబల సృష్టించింది. కామధేను కల్పిత శూరులు విశ్వామిత్రుడి సైన్యాన్నంతా రూపుమాపి విజృంభించారు. అది చూసిన పరాక్రమవంతుడైన విశ్వామిత్రుడు, కోపంతో కళ్లెర్రచేసి, భయంకర బాణాలతో పప్లవ శూరులను చంపి నిస్సారంగా భూమ్మీద పడేటట్లు చేశాడు. విశ్వామిత్రుడిపై పగబట్టిన ఆవు, బట్టిసాలు ధరించి యుద్ధం చేయగల యవనశక సేనల గుంపులను అపారంగా సృష్టించింది. ఆ యవనులు, శకులు, కార్చిచ్చు అడవిలో పడ్డట్లు, రాజు సైన్యం మీదపడి దహిస్తుంటే, వాళ్లందరినీ విశ్వామిత్రుడు తన అస్త్రాలతో పీనుగుపెంటల్లా చేసాడు.

విశ్వామిత్రుడి భయంకరమైన శస్త్రాస్త్రాలతో కాలిపోయిన తన సైన్యాన్ని చూసిన వశిష్ఠుడు, యోగ బలాన్ని ఆశ్రయించి శీఘ్రంగా శత్రు సేనలను సంహరించమని శబలను ఆజ్ఞాపించాడు. వెంటనే హుంకరించిన కామధేనువు మహావీరులను సృజించింది. వారందరు శత్రు సేనలపై పడి, వారి రథాలను, ఏనుగులను, గుర్రాలను, సైన్యాన్ని నాశనం చేసారు. సిగ్గుతో కుమిలిపోయిన విశ్వామిత్రుడు, వశిష్ఠుడిని గెలిచేదెలానని మథన పడి, ఎలాగైనా వశిష్ఠుడిని జయించాలన్న పట్టుదలతో, రాజ్యభారాన్ని కొడుకుకప్పగించి, హిమవత్పర్వతానికి పోయి, శివుడికొరకు తపస్సు చేశాడు.

శివుడు ప్రత్యక్షమై ఏం వరం కావాల్నో కోరుకొమ్మన్నాడు. విలువిద్యనంతా అంగాలతో, ఉపాంగాలతో, మంత్రాలతో, వాటి రహస్యాలన్నిటితో తనకు ఉపదేశించమని ప్రార్థించాడు విశ్వామిత్రుడు. రాక్షసుల వద్ద, మునుల వద్ద, గంధర్వుల వద్ద, యక్షుల వద్ద, దేవతల వద్ద వున్న అస్త్రవిద్యలన్నీ తనకుపదేశించమని కోరాడు. ఆయన కోరినట్లే శివుడు ఉపదేశించి పోయాడు. అస్త్రాలన్నీ తన స్వాధీనంలోకి వచ్చాయన్న ధైర్యంతో, గర్వంతో విశ్వామిత్రుడు వశిష్ఠుడున్న ఆశ్రమానికి వచ్చాడు.

విశ్వామిత్రుడు, వశిష్ఠుడి తపోవనమంతా, కాల్చి బూడిద చేశాడు. కోపగించిన వశిష్ఠుడు, విశ్వామిత్రుడిని మందలించాడు. తపోవనాన్నంతా కాల్చివేసిన చెడుబుద్ధిగల విశ్వామిత్రుడిని ఇక సహించలేనని అంటూ, సాధ్యంకాని తేజస్సుతో అతన్ని తేరిపార చూశాడు వశిష్ఠుడు. ఇంత చెప్పినా విశ్వామిత్రుడు వినిపించుకోకుండా, అస్త్రం వెంట అస్త్రాన్ని ప్రయోగిస్తుండడంతో, వశిష్ఠుడు తనదగ్గరున్న రెండవ యమదండంలాంటి, కాలాగ్ని జ్వాలలను చిమ్మే ప్రకాశవంతమైన బ్రహ్మ దండాన్ని చేతిలో పట్టుకొని మాట్లాడకుండా నిలబడ్డాడు.

అయినా ఆగని విశ్వామిత్రుడు తనదగ్గరున్న ఆగ్నేయాస్త్రాన్ని మునిపై ప్రయోగించాడు. తనపైకొస్తున్న అస్త్రాన్ని చూసిన వశిష్ఠుడు, విశ్వామిత్రుడిని నీచ క్షత్రియుడా అని సంబోధిస్తూ: తనక్కడే నిలుచున్నాననీ, ఆతడి బలమెంతో, చలమెంతో, శస్త్రాస్త్రాల పాండిత్యమెంతో చూపమని, ముందు వాటన్నిటినీ భస్మం చేసి, ఆతర్వాత ఆతడిని భూమి మీద లేకుండా చేస్తానని, క్షత్రియ బలానికి, బ్రాహ్మణ బలానికి తేడా అతడికి తెలియదని, దివ్యమైన బ్రాహ్మణ బలాన్ని ఇక చూపబోతున్నానని, అంటూనే, విశ్వామిత్రుడి ఆగ్నేయాస్త్రాన్ని తన బ్రహ్మ దండంతో చల్లార్చాడు.

అంతటితోనూ ఆగకుండా విశ్వామిత్రుడు, రకరకాల శస్త్రాస్త్రాలను వశిష్ఠుడి మీద ప్రయోగించాడు.

వీటన్నిటినీ వశిష్ఠుడు తన బ్రహ్మ దండంతో హరించివేశాడు. తన అస్త్రాలన్ని వ్యర్థమై పోవడంతో, దీర్ఘమైన కోపంతో, భయంకరాకారుడై, దేవతా గణం, ముల్లోకాలు భయపడుతుండగా, బ్రహ్మాస్త్రాన్ని సంధించి విడిచాడు విశ్వామిత్రుడు.

తనమీదకొస్తున్న బ్రహ్మాస్త్రాన్ని చూసిన వశిష్ఠుడు, చేతిలో బ్రహ్మదండాన్ని పట్టుకొని, దేవతలంతా విభ్రాంతితో గమనిస్తుంటే, దాన్ని మింగాడు. బ్రహ్మాస్త్రాన్ని మింగిన వశిష్ఠుడు మిక్కిలి భయంకరంగా కనిపిస్తుంటే, ఆయన రోమకూపాలనుండి, అగ్నిజ్వాలలు ప్రవహించసాగాయి. ఆ మహా ఋషిశ్రేష్టుడిని, ఋషీశ్వరలందరు ప్రార్థించారు. వశిష్ఠుడి తపో బలమింతని చెప్పలేమని, సత్కీర్తిగల ఆయన తన తేజస్సును శమించజేయాలని, బ్రాహ్మణోత్తముడైన ఆయన చేతిలో విశ్వామిత్రుడు ఓటమి చెందాడని అంటారు వారంతా. ఇలా తనను ఋషీశ్వరులందరు కోరడంతో, వశిష్ఠుడు శాంతించాడు. ఇదంతా చూసిన విశ్వామిత్రుడికి ఏంచేయాల్నో తెలియక నిట్టూర్పులు విడిచి దుఃఖంతో తనలో తానే ఆలోచించసాగాడు. తన క్షాత్రం వ్యర్థమయిందని, అస్త్రాలన్నీ వ్యర్థమయ్యాయని, వాటితో తనకింక అవసరం లేదని, బ్రాహ్మణుడై, శాంత చిత్తుడై, ఇంద్రియాలను జయించినందువలనే కదా వశిష్ఠుడికింత మహాత్మ్యం కలిగిందని అనుకుంటాడు. తనుకూడా శాంత చిత్తుడై, ఇంద్రియాలను జయించి, బ్రాహ్మణుడు కావడానికి ప్రయత్నించాలని అనుకొని, తపస్సు చేసేందుకు సిద్ధమవుతాడు.

వశిష్ఠుడి మహాత్మ్యానికి కారణం ఆయన నిరంతరం చేస్తున్న జపమే. ఆయన జపించే మంత్రం ''గాయత్రి'' మంత్రం. గాయత్రీ మంత్రమే బ్రహ్మాస్త్రం. అది జపించడం వల్లే, వశిష్ఠుడింతటి మహాత్మ్యంగలవాడయ్యాడు. ఇంకో క్షత్రియుడయితే, బ్రహ్మాస్త్రం తగిలితే చనిపోవాల్సిందే. ఒకవేళ అతడికి కూడా బ్రహ్మాస్త్ర ప్రయోగం వస్తే శత్రువు అస్త్రాన్ని అణచి వేయొచ్చు. ఇవేవీలేకుండా, వశిష్ఠుడు దాన్నిమింగి జీర్ణించుకున్నాడు. తపోబలంతో, జపబలంతో, బ్రాహ్మణ్యంతో వశిష్ఠుడి దేహమే బ్రహ్మమై వుండగా, ఆయన్నెవరేం చేయగలరు? కార్చిచ్చుమీద చిచ్చుబుడ్లు ప్రయోగిస్తే ఏం జరుగుతుందో అదేజరిగింది వశిష్ఠ, విశ్వామిత్రుల మధ్య జరిగిన ''ఆత్మ-అనాత్మల'' యుద్ధంలో. వశిష్ఠ విజయం నిజానికి గాయత్రీ విజయమే. అంతటి గొప్పదైన గాయత్రిని అధికరించి చెప్పబడిందే, శ్రీమద్రామాయణం లేదా శ్రీమదాంధ్ర వాల్మీకిరామాయణం. అందుకే ఇవి సర్వోత్కృష్ట గ్రంథాలని వేరే చెప్పాల్సిన పనిలేదు.

గాయత్రీ బీజసంయుతమైన వాల్మీకిరామాయణంలో, ప్రతి అక్షరానికి, గాయత్రీ మంత్రంలోని ఒక్కొక్క అక్షరానికి ఎంత మహిముందో, అంతే మహిముంది. వశిష్ఠ విశ్వామిత్ర యుద్ధం, బ్రాహ్మణ క్షత్రియ యుద్ధం మాత్రమేకాదు. ఆత్మవిద్యకు, అనాత్మవిద్యకు మధ్యజరిగిన యుద్ధం. సంపూర్ణంగా అనాత్మవిద్య నేర్చుకున్నప్పటికీ, వాడు, ఆత్మవంతుడిని గెలవలేడు. విద్యావంతుడి దౌష్ట్యం, ఆత్మవంతుడి సాధుస్వభావం కూడా ఈ యుద్ధంలో స్పష్టంగా కనిపిస్తుంది. వశిష్ఠుడు, ఆద్యంతం తనను తాను రక్షించుకునే ప్రయత్నమే చేశాడుకాని, తన ఉప్పు తిని, కృతఘ్నుడై, దివిటీ దొంగలా తన సొమ్ము అపహరించేందుకు పూనుకున్నవాడినీ, తన ఆశ్రమాన్నంతా పాడుచేసి తనను చంపే ప్రయత్నం చేసినవాడినీ, దెబ్బకు-దెబ్బ అనిగూడా కీడుతలపెట్టలేదు. ఇదే ఆత్మవంతుడైన బ్రాహ్మణుడి లక్షణం. బ్రాహ్మణుడు ఇతరులవల్ల నష్టపడినాగాని, పరులకు హానితలపెట్టడు. వశిష్ఠుడు ఇంతజరిగినా విశ్వామిత్రుడిని శపించలేదు.

వశిష్ఠుడితో ఓటమికి కుమిలిపోతూ, విశ్వామిత్రుడు దక్షిణ దిక్కుగా పోయి, తీవ్రమైన తపస్సు

చేసాడు. వేయి సంవత్సరాలు తపస్సుచేసింతర్వాత, బ్రహ్మ ప్రత్యక్షమై, ఆయన రాజర్షిగా అయ్యాడని వరమిచ్చాడు. తనింతకాలం తపస్సు చేసింది రాజర్షికావడానికానని పరితపించి, మునుపటికంటే గొప్పగా తపస్సు చేయసాగాడు.

వెయ్యేళ్లు విశ్వామిత్రుడిలా ఘోరమైన తపస్సు చేయడంతో, బ్రహ్మదేవుడు ప్రత్యక్షమై ఆయన ఋషి అయినాడని చెప్పి అంతర్థానమయ్యాడు. ఆ మాటలకు తృప్తి చెందని విశ్వామిత్రుడు, అంతకంటే ఘోరమైన, కఠోరమైన తపస్సు చేయసాగాడు. మేనక ఆయన తపస్సు విఘ్నం చేస్తుంది. అందులోంచి బయటపడి వెయ్యి సంవత్సరాలు నిశ్చలుడై, నిర్విఘ్నంగా తపస్సు చేశాడు విశ్వామిత్రుడు. బ్రహ్మదేవుడు మళ్లీ ప్రత్యక్షమై విశ్వామిత్రుడి దగ్గర కొచ్చి, ఆయన మహర్షి అయ్యాడని అంటాడు. ఆయన మాటలకు విశ్వామిత్రుడు పొంగిపోలేదు. తను జితేంద్రియుడనయ్యానా అని బ్రహ్మను ప్రశ్నించాడు. ఆయనింకా జితేంద్రియుడు కాలేదని, దానికొరకు ఇంకా ప్రయత్నంచేయాలని, ఆయన మనస్సు వికారం పొందేందుకు అవకాశమున్నప్పటికీ అలా కానీయకుండా చేయగలిగినప్పుడే జితేంద్రియుడవుతాడని జవాబిచ్చాడు బ్రహ్మ.

విశ్వామిత్రుడు తిరిగి కామాన్ని జయించడంకొరకు, వెయ్యేళ్లు విశేష నియమంతో తపస్సు చేశాడు. ఎన్ని విఘ్నాలొచ్చినా, ఎవరు కలిపించ తలపెట్టినా కోపం తెచ్చుకోలేదు. విశ్వామిత్రుడి దగ్గర కొచ్చిన బ్రహ్మ, అతడి తపస్సు ఫలించిందని చెప్పి, అతడికి బ్రాహ్మణత్వం లభించిందంటాడు. తపస్సు చాలించి లెమ్మంటాడు. బ్రాహ్మణుల వేదాలు, క్షత్రియుల వేదాలు అందరికంటే మొదలు తెలిసిన వశిష్ఠుడు వచ్చి, తనకు బ్రాహ్మణ్యం లభించిందని అంగీకరించాలని, అంతవరకు తాను బ్రాహ్మణుడనేనన్న నమ్మకం తనకు కలగదని అంటాడు. ఆయన కోరిక మేరకు దేవతలు వశిష్ఠుడి వద్దకు పోయి, అది నెరవేర్చమని ఆయన్ను ప్రార్థించారు. ఆ మహా తపస్వి వచ్చి, విశ్వామిత్రుడితో స్నేహం చేసి, అతడు బ్రహ్మర్షి అయ్యాడని చెప్పాడు. విశ్వామిత్రుడు నిజమైన బ్రహ్మర్షి అయ్యాడని, బ్రాహ్మణులకు అధికారమున్న కార్యాలన్నీ ఆయనా చేయవచ్చని, ఆ అధికారం ఆయనకు లభించిందని దేవతలు చెప్పి వెళ్లిపోయారు. విశ్వామిత్రుడు కూడా వశిష్ఠుడితో స్నేహం చేశాడు.

విశ్వామిత్రుడు తొలుత రాజు. గృహస్థుడు. భార్యతో సహా పోయి వానప్రస్థుడై తపస్సు చేసి రాజర్షి అయ్యాడు. అడవిలో దొరికే పళ్లుమాత్రమే తిని తపస్సు చేసి, తర్వాత ఋషి అయ్యాడు. అప్పటిదాకా భార్యా పిల్లలు ఆయన వెంటే వున్నారు. తర్వాత ఒంటరిగా వుండి తపస్సు చేసి మహర్షి అయ్యాడు. మహర్షులంతా జితేంద్రియులు కారు. కాబట్టి, జితేంద్రియుడు కావడానికి, పంచాగ్నుల మధ్య నిలిచి, ఆహారం మాని, వాయువే ఆహారంగా తపస్సు చేశాడు. ఇంతచేసినా కామాన్ని జయించగలిగాడుగాని, కోపాన్ని జయించలేకపోయాడు. అదికూడా జయించేందుకు, మౌనంగా, కుంభకంలో ఏళ్ల తరబడి తపస్సు చేశాడు. అప్పుడు అన్నీ జయించి బ్రహ్మర్షి అయ్యాడు. జన్మతో వచ్చే బ్రాహ్మణ్యం కర్మతో రాదు. విశ్వామిత్రుడికి వచ్చిందంటే దానికొక ప్రత్యేకమైన కారణముందనే అనాలి. ఎవరికైనా, ఎంత చేసినా కామ క్రోధాలు అనివార్యం. వాటిని తనకు వశపడేటట్లు చేసుకున్నవాడే బ్రాహ్మణోత్తముడు. అందుకే బ్రాహ్మణ్యం సులభమైంది కాదు.

◆❖◆

అహల్య శిలగా మారిందా?

అహల్యా వృత్తాంతం ఇతర రామాయణాలకన్నా వాల్మీకి రామాయణంలో భిన్నంగా వుంటుంది. అహల్య శిలగా మారిందని కొన్ని గ్రంథాలలో చెప్పబడిన విషయం వాస్తవం కాదని వాల్మీకి రామాయణం స్పష్టం చేసింది. వాల్మీకి మతమే వేరు. దుఃఖానుభవం లేకుండా, రాయిగా పడి వుంటే, పాప ఫలం అనుభవించినట్లెలా అవుతుంది? అహల్య స్త్రీగా వుంటూనే, ఆహారం లేకుండా తాపంలో మాడుతుంటుంది. రామచంద్రమూర్తి ఆశ్రమ ప్రవేశం చేయగానే ఆ తాపం తొలగి లోకానికి కనిపిస్తుంది. అంటే, జారత్వ దోషం పోవాలంటే, అనేక సంవత్సరాలు తపించి, భగవత్ సాక్షాత్కారం చేసుకోవాలి. అలా కాకపోతే వంశ నాశనం అవుతుంది. గౌతముడు అహల్య స్వరూప నాశనం చేయకుండా, గాలిని ఆహారంగా తీసుకుంటూ, కఠిన వ్రతం ఆచరించమని మాత్రమే అంటాడు. జారత్వమే అభ్యాసంగా వుంటే, ఆ స్త్రీని పతితగా భావించి స్వీకరించ కూడదు, పరిత్యజించాలి. స్త్రీలు తమ జాతివారితో వ్యభిచరించినప్పటికీ, గర్భం రాకపోతే పరిత్యజించ రాదు. అంటే, గర్భం వచ్చినా, అసవర్ణులతో వ్యభిచరించినా, వదిలి పెట్టాలి. గర్భం ధరించకపోతే, న్యాయ శాస్త్ర ప్రకారం దండించి ప్రాయశ్చిత్తం చేయించాలి. వివరాల్లోకి పోతే.....

తాటక లాంటి రాక్షసులను వధించి, విశ్వామిత్రుడి యాగాన్ని నిర్విఘ్నంగా పరిసమాప్తి చేయడానికి అహర్నిశలూ సంరక్షణలో వుండి, ఆ తరువాత ముని ఆజ్ఞానుసారం మిథిలా పురాన్ని చూడడానికి బయల్దేరిన రామలక్ష్మణులు దాన్ని దూరం నుండే చూసి, దాని అందాన్ని మెచ్చుకుంటూ పోతుండగా, ఆ నగరానికి దగ్గర లోనే ఓ చక్కటి మరో ఆశ్రమ ప్రదేశాన్ని చూసారు.

అక్కడున్న ఆశ్రమం ఎవరిదని, చూడడానికి అందంగా వున్నప్పటికీ ఎందుకని జనహీనమైందని అడుగుతాడు రాముడు విశ్వామిత్రుడిని. ఆశ్రమం అలా కావడానికి కారణాన్ని, ఆశ్రమ వృత్తాంతాన్ని వివరించాడీవిధంగా విశ్వామిత్రుడు:

''పూర్వం ఇక్కడ బ్రహ్మ సమానుడైన గౌతమ మహర్షి వుండేవాడు. గౌతముడు తన భార్య అహల్యతో

అనేక సంవత్సరాలిక్కడ వుండి తపస్సు చేశాడు. ఒకనాడు సమయం కనిపెట్టి, గౌతముడివలె ముని వేషంలో అహల్యను కలుస్తాడు ఇంద్రుడు. మన్మథుడి ప్రేరణవల్ల విశేష మోహం కలిగి, ఆ సమయం స్త్రీలతో సంభోగించిచే ఋతుకాలం కాకపోయినా, అహల్యతో రతి కేళికై కోరిక గలిగి వచ్చానని గౌతముడి వేషంలో వున్న ఇంద్రుడు అహల్యతో అంటాడు".

"తన దగ్గరకు వచ్చినవాడు ఇంద్రుడని తెలిసినా, వాడితో రమించడం పాపమని తెలిసినా, ఇంద్రుడంతటివాడు వచ్చి ప్రార్థిస్తుంటే, ఎందుకు కాదనాలని భావించి, దుష్ట బుద్ధితో అతడితో సంభోగించింది అహల్య. ఆ తర్వాత సంతోషంతో, అయిందేదో అయిందనీ, ఇక ఆయనను కాపాడుకుని, తన్ను కూడా కాపాడమని ఇంద్రుడితో అంటుంది అహల్య. అలాంటి గొప్పవాడితో సంభోగించడం వల్ల ధన్యురాలినైనానని అంటూ, త్వరగా ఇంద్రుడిని అక్కడనుండి వెళ్లమనడంతో, భయపడొద్దని చెప్పి ఇంద్రుడు వెళ్లిపోయేందుకు తయారయ్యాడు".

"అదే సమయంలో, కుడిచేత్తో దర్భలు, ఎడమ చేత్తో సమిధలు ధరించి, తీర్థ స్నానం చేసి, తడి బట్టలతో, బ్రహ్మ వర్చస్సుతో, దేవదానవులు సహించలేని తేజంతో ఆశ్రమానికొచ్చిన గౌతముడు ఎదురయ్యాడు ఇంద్రుడికి. ఆయన్ను చూడగానే, తత్తర పాటుతో, చేష్టలుడిగి, కాళ్లు చేతులు వణుకుతుంటే, తెల్లబోయిన ముఖంతో, తన ఆకారాన్ని ధరించి నిలిచిపోయాడు ఇంద్రుడు. గౌతముడికి కోపం తారాస్థాయికి చేరుకుంది".

"తన రూపాన్ని ధరించి, చేయరాని కార్యాన్ని చేసేందుకు సాహసించిన ఇంద్రుడు భవిష్యత్ లో ఇలాంటి పాడు పనులు చేయకుండా, ఆయన వృషణాలు వూడి నేలపై పడాలని శపించాడు గౌతముడు. తక్షణమే, ఇంద్రుడి వృషణాలు వూడి నేల రాలాయి. గౌతముడు ఆ తర్వాత ఇంట్లోకి పోయి భార్య అహల్యను చూసి, కోపంతో ఆమెనుకూడా శపించాడు. నీచ నడవడిగలిగినందున, అనేక సంవత్సరాలు గాలినే ఆహారంగా తీసుకుంటూ, కూడు, నీళ్లు లేకుండా, ఆ ప్రదేశంలోనే వుంటూ, బూడిదలో పడి ఎవరికీ కనిపించకుండా, తాపంతో పొర్లాడుతుండమని శపించాడామెను".

"శాప విముక్తి కూడా గౌతముడే చెప్పాడు. ఎప్పుడైతే దశరథుడి కుమారుడు రాముడు, ఆశ్రమానికి రావడం జరుగుతుందో, ఆ రోజున ఆమే పాపం పోయి పవిత్రురాలవుతుందనంటాడు గౌతముడు. రాముడిక్కడికి రాగానే, ఆయనను అతిథిగా ఎంచి, అతిథికి చేయాల్సిన పూజలు చేసి, కుబుద్ధీ, లోభం, మోహం పోయినదానివై, ఎప్పటి అందమైన ఆకారం ధరించి, సంతోషంగా తన దగ్గరకొస్తావని చెప్పి గౌతముడు ఆశ్రమాన్ని వదిలి హిమవంతానికి పోయాడు" అని ఆ వృత్తాంతాన్ని వివరించాడు విశ్వామిత్రుడు.

"వృషణ హీనుడైన ఇంద్రుడు, దేవతల పురోహితుడైన అగ్ని దేవుడితో సహా ఇతర దేవతలందరితో తనీ స్థితికెందుకెందుకు రావలసి వచ్చిందో చెప్పాడు. గౌతముడు తపస్సు చేస్తున్నప్పుడు ఆయన కోపాన్ని జయించాడా, లేదా, అని పరీక్షించేందుకు, అతడికి కోపాతిశయం కలిగించేట్లు తపస్సును చెడగొట్టానని అంటాడు. ఇలా తను చేసిన దేవతా కార్యానికి ప్రతిఫలంగా గౌతముడు, తనను బీజహీనుడివి కమ్మని శపించాడన్నాడు. భార్యపైకూడా కోపమొచ్చి, ఆమెనూ శపించి, వదిలిపెట్టి, తపస్సును

వ్యర్థంచేసుకున్నాడు గౌతముడు అనికూడా చెప్పాడు ఇంద్రుడు. దేవకార్యం చేసిన తనకీగతి పట్టింది కాబట్టి, తిరిగి తన వృషణాలొచ్చే ఉపాయం చేయమని వారందరినీ కోరాడు''.

“ఇంద్రుడిలా వారినికోరడంతో, అగ్ని మొదలైన దేవతలు, మరుద్గణం, పితృదేవతలతో, వృషణాలులేని ఇంద్రుడికి మేక అండాలనిచ్చి బీజయుతుడిగా చేయమని ప్రార్థించారు. యజ్ఞంలో మనుష్యులు వృషహీణమైన మేక మాంసాన్ని ఇస్తే, దాంతో తృప్తిచెంది, యజ్ఞఫలానికి హానిరాకుండా చేయమనికూడా అంటారు వారు. దేవతలు కోరినట్లు పితృదేవతలు, మేక బీజాలు తీసి, ఇంద్రుడికి తగిలించారు. ఆ రోజునుంచి, బీజాలు లేని మేకమాంసాన్ని యజ్ఞంలో భుజించి, యజ్ఞం చేసినవారికి యాగఫలాన్ని విశేషంగా ఇవ్వసాగారు. గౌతమమహర్షి తపోబలం వల్ల, నాటినుండి ఇంద్రుడు మేషవృషణుడు అయ్యాడు'' అని చెప్పిన విశ్వామిత్రుడు, గౌతముడి ఆశ్రమంలో ప్రవేశించి, అహల్యను ఉద్ధరించేలా సంకల్పించమని శ్రీరాముడిని కోరాడు.

విశ్వామిత్రుడిలా చెప్పడంతో, లక్ష్మణుడితో కలిసి రామచంద్రమూర్తి, విశ్వామిత్రుడు ముందు నడవగా, గౌతముడి ఆశ్రమంలోకి ప్రవేశించాడు. తపస్సునే భాగ్యంగా కలిగున్నదాన్ని, గొప్ప తపస్సు చేయడం వల్ల అతిశయించిన తేజస్సు కలిగిన దాన్ని, దేవ, దానవ, మానవులకింతవరకు కనిపించని దాన్ని, మనుష్యులలో ఎవరికీ లేని సౌందర్యం కలదిగా బ్రహ్మ మాయతో సృష్టించబడిన దాన్ని, మంచు కప్పి, మబ్బు కమ్మినా చంద్రకాంతిలా వున్నదాన్ని, నీటిలో కనిపిస్తున్న సూర్యుడిని ఎండలా చూడడం సాధ్యంకాని రీతిలో వున్నదాన్ని అక్కడ చూశాడు శ్రీరాముడు.

ఆశ్రమంలో శ్రీరామచంద్రమూర్తి ప్రవేశించగానే, శాపం తొలిగిన అహల్య, పూర్వరూపంలో లోకానికి కనపడింది. శ్రీరామ లక్ష్మణులు ఆమెకు నమస్కరించారు. వారు అవతారమూర్తులని గౌతముడు తనకు శాపమిస్తున్నప్పుడు చెప్పిన మాటలను జ్ఞప్తికి తెచ్చుకున్న అహల్య, పూజ్యులైన వారికి అర్ఘ్యపాద్యాలను ఇచ్చింది. రామచంద్రమూర్తి అవి తీసుకుంటున్నప్పుడు దేవతలు దుందుభులు మోగించి, మేలు-మేలని అహల్యను మెచ్చుకున్నారు. ఇలా, శ్రీరామానుగ్రహం వల్లా, ఇంతకాలం తపస్సు చేసినందున పరిశుద్ధురాలైనందు వల్లా, గౌతముడు ఆమెను పరిగ్రహించి శ్రీరాముడిని పూజించాడు. మునీశ్వరుడి పూజలందుకున్న రామచంద్రమూర్తి ప్రయాణానికి బయల్దేరాడు.

◆❖◆

సీతా కళ్యాణంలో వాల్మీకి భావ సూక్ష్మాలు

(రాముడెప్పుడైతే శివుడి విల్లు విరిచాడో, అప్పుడే అతడు శివుడి కంటే గొప్పవాడైన విష్ణువని జనకుడు గ్రహించాడు. అలాంటి ఆమెకు సాక్షాత్తు లక్ష్మీదేవైన సీతను ఇస్తున్నాననే అర్థమొచ్చే విధంగా 'ఈ సీత' అన్నాడు... సీత నాగటి చాలులో దొరికినప్పటికీ జనకుడు సగర్వంగా, 'నాదుకూతురు', తన కూతురని చెప్పాడు. సీతే లక్ష్మీదేవి అయినందువల్ల, విష్ణువు అవతారమైన రాముడి కైంకర్యమే ఆమె స్వరూపం. సృష్టిలో, రక్షణలో, సంహారంలో ఆమె ఆయనకు సర్వకాల సర్వావస్థలందు తోడుగా వుంటుంది. వివాహ లీల కేవలం లోక విడంబనార్థమేనని, ఆయన సొత్తును ఆయనే తీసుకొమ్మని కూడా అర్థం.)

"ఈసీత నాదుకూతురు, నీ సహధర్మచరి దీని నిం గై కొనుమా
కౌసల్యాసుత, నీకును భాసురశుభ మగు గ్రహింపు పాణిం బాణిన్"

విశ్వామిత్రుడు తన యాగ రక్షణకై దశరథ కుమారులైన రామలక్ష్మణులను వెంట తీసుకుపోయి, తన కార్యం నెరవేర్చుకున్న అనంతరం, వారికి కళ్యాణం జరిపించాలన్న ఆలోచనతో, తన వెంట మిథిలా నగరానికి తీసుకుని వెళ్తాడు. వారిని జనక మహారాజుకు పరిచయం చేసి, తన దగ్గర వున్న శివ ధనుస్సును చూపించమంటాడు. దాన్ని చూపించే ముందు సీత జన్మ వృత్తాంతం చెప్పాడు జనకుడు. తనకు నాగేటి చాలులో దొరికిన సీత వీర్యశుల్కనీ, శక్తి ప్రదర్శన చేయడమే అమెకివ్వదగిన శుల్కమనీ, ఎటువంటి వస్త్రవాహనాది అలంకారాలు ఇవ్వాల్సిన పనిలేదనీ, తన దగ్గరున్న ధనుస్సును ఎక్కుపెట్టగలవాడికే కూతురు సీతను ఇస్తానని అంటాడు. ఇంతవరకు తన దగ్గరకు వచ్చిన వారిలో ఎవరు కూడా వింటిని ఎక్కుపెట్టడం మాట అటుంచి, అల్లెతాడును ఎక్కించడం గాని, కనీసం వింటిని ఎత్తడం గాని చేయలేకపోయారని అంటాడు. అలా ధనుస్సు వృత్తాంతం చెప్పి దానిని శ్రీరామ లక్ష్మణులకు చూపించాడు. శ్రీరామచంద్రమూర్తి విల్లెక్కుపెట్టగలిగితే తాను అదృష్టవంతుడినని, అయోనిజైన సీతను ఆయన కిస్తానని, అంటాడు.

శ్రీరాముడు, ధనుస్సుండే పెట్టె దగ్గరికిపోయి, దాని మూత తెరిచి, తాను వింటిని చూసానని, తాకానని చెప్పి, ఆయన ఆజ్ఞాపిస్తే బయటకు తీస్తానని అంటాడు. వింటిని బయటకు తీసి ఎక్కుపెడతానని కూడా అంటాడు. అలానే చేయమని జనకుడు, విశ్వామిత్రుడు చెప్పారు రాముడితో. అవలీలగా వింటిని అరచేత్తో పట్టుకొని, బయటకు తీసి, రాజులందరు చూస్తుండగా రాముడు అల్లెతాటిని బిగువుగా లాగుతుంటేనే, విల్లు ఫెల్లుమని రెండుగా విరిగిపోయింది. రామచంద్రమూర్తి భుజబలం చూసానని, సీత రామచంద్రమూర్తిని మగడిగా గ్రహించడమంటే అది తన అదృష్టమని, తాను ధన్యుడనయ్యానని, అంటాడు జనకుడు. తన ముద్దుల కూతురు సీత దశరథ కుమారుడు శ్రీరామచంద్రుడిని భర్తగా పొందడంవల్ల తమ జనక కులానికి కీర్తి సంపాదించిపెట్టినట్లయిందని కూడా అంటాడు జనకుడు విశ్వామిత్రుడితో.

ఆ తరువాత జరగాల్సిన కార్యక్రమం జరిపించడానికి దశరథ మహారాజుకు కబురు చేయడం, ఆయన మందీ మార్బలంతో మిథిలా నగరానికి రావడం జరిగింది. సీతా రాముల కళ్యాణానికి ముందు ఇరు వంశాల వారు వంశ క్రమాలను గురించి అడిగి తెలుసుకుంటారు. కన్యను ఇచ్చుకొనేటప్పుడు, పుచ్చుకొనేటప్పుడు, అధమ పక్షం మూడు తరాల వంశ జ్ఞానం ప్రధానంగా తెలుసుకోవాలి. కులం తెలుసుకోకుండా కన్యను ఇవ్వకూడదు, తీసుకొననూ కూడదు. వివాహంలో వధూవరుల కుల జ్ఞానం అవశ్యంగా తెలియాలి. తొలుత తల్లి కులం, తండ్రి కులం పరీక్షించాలి. ధన ధాన్యాలు ఎంత సమృద్ధిగా వున్నప్పటికీ, వివాహ విషయంలో పది రకాల వంశం వారిని వదలాలని శాస్త్రం చెపుతున్నది. జాతకర్మాది క్రియలు లేని, పురుష సంతానంలేని, విద్యా శూన్యమై, మిగిలి దీర్ఘ రోగాలు కలదై, మూల రోగాలు కలదై, క్షయ, అజీర్ణం, అపస్మారం, బొల్లి, కుష్ఠు రోగాలు కలదైన వంశాలతో వివాహ సంబంధం చేయరాదు. తోడబుట్టినవాడు లేని పిల్లను, తండ్రెవరో తెలియని దానిని వివాహం చేసుకోకూడదు. ఇక ఆ తరువాత సీతా కళ్యాణ ఘట్టం మొదలవుతుంది.

"సీతను సర్వాభరణోం, పేతను దా నిలిపి నగ్ని కెదురుగ గౌస
ల్యా తనయున కభిముఖముగ, క్ష్మాతలనాథుండు రామచంద్రున కనియెన్"

అన్ని విధాలైన అలంకారాలతో ప్రకాశిస్తున్న సీతను, అగ్నికి ఎదురుగా–శ్రీరామచంద్రమూర్తికి అభిముఖంగా, నిలువబెట్టి, జనక మహారాజు శ్రీరామచంద్రమూర్తితో:

"ఈ సీత నాదుకూతురు, నీ సహధర్మచరి దీని నిం గై కొనుమా
కౌసల్యాసుత, నీకును భాసురశుభ మగు గ్రహింపు పాణిం బాణిన్"

"కౌసల్యా కుమారా, ఈ సీత నా కూతురు. నీ సహధర్మచారిణి. ఈమెను పాణి గ్రహణం చేసుకో. నీకు జగత్ ప్రసిద్ధమైన మేలు కలుగుతుంది. నీకు శుభం కలుగుతుంది. మంత్రపూర్వకంగా ఈమె చేతిని నీ చేత్తో పట్టుకో. రామచంద్రా, పతివ్రత, మహా భాగ్యవతి అయిన నీ సీత, నీ నీడలా ఒక్కసారైనా నిన్ను విడిచి వుండదు'' అని అంటూ, మంత్రోచ్చారణతో పవిత్రవంతములైన జలధారలను రామచంద్రమూర్తి చేతుల్లో జనక మహారాజు ధారపోశాడు. దేవతలు, ఋషులు మేలు–మేలనీ, భళీ అనీ శ్లాఘించారు.

సంతోషాతిశయంతో దేవతలు పూల వాన కురిపించారు. దేవదుందుభులను చాలా సేపు మోగించారు. వాసవుడు మొదలైన పలువురు, తమ శోకత్వాన్ని, దీనత్వాన్ని తమ మనస్సులనుండి తొలగించుకున్నారు.

ఈవిధంగా మంత్రించిన జలాలను ధారపోసి భూపుత్రి సీతను శ్రీరామచంద్రమూర్తికిచ్చి వివాహం చేసానని జనక మహారాజు సంతోషిస్తూ లక్ష్మణుడివైపు చూసి, "లక్ష్మణా ఇటు రా. దానంగా ఊర్మిళను స్వీకరించు. ప్రీతిపూర్వకంగా ఇస్తున్నాను. ఈమె చేతిని ప్రేమతో గ్రహించు" మని కోరాడు. ఊర్మిళను లక్ష్మణుడికిచ్చిన తర్వాత, భరతుడిని మాండవి చేతిని, శత్రుఘ్నుడిని శ్రుతకీర్తి చేతిని గ్రహించమని ప్రేమతో పలికాడు జనకుడు. ఇలా నలుగురు కన్యలను దశరథుడి నలుగురు కొడుకులకు ధారపోసి, జనకుడు రాజకుమారులతో, దోష రహితమైన మనసున్న వారందరు సుందరులైన భార్యలతో కలిసి, సౌమ్య గుణంగలవారిగానూ, సదాచార సంపన్నులుగానూ కమ్మని అంటాడు. జనక మహారాజు మాటలను విన్న దశరథుడి కుమారులు రామలక్ష్మణ భరతశత్రుఘ్నులు, తండ్రి అనుమతితో భార్యల చేతులను తమ చేతుల్లో వుంచుకొని, సంతోషాతిశయంతో, మలినం లేని భక్తితో, అగ్నికి, వేదికి, మౌనీశ్వరులందరికి, రాజులకు భార్యలతో కలిసి ప్రదక్షిణ చేసారు. వివాహం శాస్త్ర ప్రకారం ప్రసిద్ధంగా జరిగింది. పూల వాన కురిసింది. ఆకాశంలో దేవ దుందుభులు ధ్వనించాయి. దేవతా స్త్రీలు నాట్యం చేసారు. గంధర్వ కాంతలు పాడారు. రావణాసురుడి భయం వీడి, సందుల్లో, గొందుల్లో దాక్కున్న వారందరు నిర్భయంగా, గుంపులుగుంపులుగా ఆకాశంలో నిలిచారు. మంగళ వాద్యాలు మోగుతుంటే, రామ లక్ష్మణ భరత శత్రుఘ్నులు అగ్నికి మూడుసార్లు ప్రదక్షిణ చేయడంతో పెళ్లి తంతు ముగిసింది. తమ భార్యలతో దశరథ కుమారులు విడిది ఇళ్లకు పోవడంతో, వారివెంట దశరథుడు, వశిష్ట విశ్వామిత్రాది మునీశ్వరులతో, బంధువులతో విడిదికి పోయారు.

సీతా కల్యాణ ఘట్టం చదివినవారికి శ్రీ సీతా వివాహ విషయ చర్చకు సంబంధించి ఆసక్తి కలగడం సహజం. కన్యాదానం చేస్తూ జనకుడు రాముడిని "కౌసల్యా సుత" అని సంబోధించాడు. ఎందుకు జనకుడు కౌసల్యా కుమారా అని పిలవాలి? స్త్రీ పేరుతో పిలవకుండా, వాడుక పేరైన "రామా" అని పిలవచ్చు కదా. దశరథ కుమారా అనకూడదా? ఆ రెండూ ఇప్పుడు సరిపోవని అర్థం చేసుకోవాలి. కేవలం రామా అని పిలిస్తే ఆ పేరుకలవారు మరొకరుండవచ్చు కదా. దశరథ కుమారా అని పిలవడానికి ఆయనకు నలుగురు కొడుకుల్లో వేరొకరు కావచ్చు కదా. కౌసల్యా కుమార అంటే ఏవిధమైన సందేహానికి తావుండదు. "ఈ సీత" అంటాడు రాముడితో. సీత, సిగ్గుతో తన చేయి పట్టుకొమ్మని, తనంతట తానే రాముడిని అడగదు. రామచంద్రమూర్తి తనకు తానే సీత చేయి పట్టుకుంటే, పెళ్లికాక ముందే ఎందుకలా స్వతంత్రించి కాముకుడిలా ప్రవర్తించాడని సీత అనుకోవచ్చు, లోకులూ భావించవచ్చు. అందుకే జనకుడు తానే సీతచేతిని రామచంద్రమూర్తికి చూపి "ఈ సీత" అని చెప్పాడు. అలంకరించబడిన కల్యాణమంటపంలో, నలు వైపులా నిలువుటద్దాలు వేసి వుండడంతో, అన్నిటిలోనూ సీత రూపమే కనిపించసాగింది. అద్దంలో సీతేదో, నిజమైన సీతేదో తెలుసుకోలేక నలుదిక్కులు చూస్తున్న రాముడి భ్రమపోయేట్లు, చేయి చూపి "ఈ సీత" అని చెప్పాడు జనకుడు.

"ఈ సీత" అంటే, అతి రూపవతైన సీతని, సౌందర్య, సౌకుమార్య, లావణ్యాదులలో స్త్రీలందరినీ

అతిశయించిందని అర్థంకూడా వస్తుంది. ''ఈ సీత'' అంటే, ''ఈ యగు సీత'' అనే అర్థం కూడా వుంది. రాముడెప్పుడైతే శివుడి విల్లు విరిచాడో, అప్పుడే అతడు శివుడికంటే గొప్పవాడైన విష్ణువని జనకుడు గ్రహించాడు. అలాంటి ఆమెకు సాక్షాత్తు లక్ష్మీదేవైన సీతను ఇస్తున్నాననే అర్థమొచ్చే విధంగా ''ఈ సీత'' అన్నాడు. రాముడెంత మహా సౌందర్య పురుషుడని పేరుందో, అంతకంటే తక్కువ కాని సౌందర్యం ఆమె కుందని చెప్పదల్చుకున్నాడు జనకుడు. సీత అంటే కేవలం నాగటి చాలనే కాదని, నాగటి చాలు భూమిని ఛేదించుకొని రూపంకలదిగా ఎలా అవుతుందో, అలానే భూమిని ఛేదించుకొని రావడంవల్ల సీత అనే పేరు ఆమెకు ప్రఖ్యాతమయింది. దీనివల్ల ఆమె ఆభిజాత్యం తెలుస్తున్నది. సీత, నాగటి చాలు, అంటే కాపువాడి కృషి ఫలింపచేసి, వాడికి ఫలం కలిగించేది. అలానే రాముడు చేయబోయే కార్యాలన్నీ, సీత వలనే ఫలవంతమవుతాయనీ, ఆమె సహాయం లేకుండా రాముడి కృషి వ్యర్థమని, ప్రతిఫలాపేక్ష లేకుండా అతడికి సహాయపడుతుందని జనకుడి మనస్సులోని ఆలోచన.

ఆకాశ గంగానది శాఖైన సీత ఏవిధంగా ఒకసారి తనను సేవించినవారి పాపాలను ధ్వంసం చేస్తుందో, అలానే ''ఈ సీత'' తనకొక్కసారి నమస్కారం చేసిన వారి పాపాలను ధ్వంసంచేస్తుంది. కౌసల్యా సుతుడైన రాముడు యోనిజుడని, సీత అయోనిజని, కాబట్టి ఆభిజాత్యంలో రాముడికంటే తక్కువైందేమీ కాదని జనకుడి భావన. సీత నాగటి చాలులో దొరికినప్పటికీ జనకుడు సగర్వంగా, ''నాదుకూతురు'', తన కూతురని చెప్పాడు. అలాంటి తనకూతురును, ఎలా ప్రేమించాలో అలానే ప్రేమించమని సూచించాడు. సీతంటే జన్మపరిశుద్ధి అనీ, ''నాదుకూతురు'' అంటే నానా సపరిశుద్ధి అనీ తెలుపబడింది. ''నీ సహధర్మచరి'' అనడమంటే, రాముడి విషయంలో ఎలా వుంటుందోనని ఆలోచించాల్సిన పనిలేదనే అర్థం స్ఫురిస్తుంది. రాముడేది ధర్మమని భావిస్తాడో, ఆ ధర్మమందే ఆమె ఆయనకు తోడుగా వుండి ఆ కార్యాన్ని నిర్వహిస్తుంది. రాముడు తండ్రి వాక్యాన్ని ఎలా పాలించాడో, అలానే ఆయన వాక్యాన్ని సీత పాలిస్తుందని అర్థం. సీతే లక్ష్మీదేవి అయినందువల్ల, విష్ణువు అవతారమైన రాముడి కైంకర్యమే ఆమె స్వరూపం. సృష్టిలో, రక్షణలో, సంహారంలో ఆమె ఆయనకు సర్వకాల సర్వావస్థలందు తోడుగా వుంటుంది. వివాహ లీల కేవలం లోక విడంబనార్థమేనని, ఆయన సొత్తును ఆయనే తీసుకొమ్మని కూడా అర్థం.

◆❖◆

విష్ణువే బలవంతుడా?

సీతారాముల కల్యాణం జరిగిన మర్నాటి ఉదయం, దశరథ కుమారులకు మంచి దీవెనలిచ్చి హిమాచలానికి వెళ్లిపోయాడు బ్రహ్మర్షి విశ్వామిత్రుడు. ఆయనలా వెళ్లగానే, అయోధ్యకు పోయేందుకు తమకు అనుమతినివ్వమని జనకుడిని కోరాడు దశరథుడు. ఆ వెంటనే, బిడ్డలకు అరణం ఇచ్చింతర్వాత, దశరథ మహారాజుతో కలిసి, వారితో తాను కొంతదూరం ప్రయాణంచేసి, వారందరిని సాగనంపి, ఆయన అనుమతితో తన ఇంటికి తిరుగు ప్రయాణమై పోయాడు జనకుడు.

వెళుతున్న రామచంద్రమూర్తి ఇంపైన-శ్రేష్ఠమైన సుకుమారత్వాన్ని, అందాన్ని, గొప్ప గాంభీర్య గుణాన్ని, శౌర్యాన్ని గమనించిన మిథిలా పుర స్త్రీలు ఒకరితో మరొకరు ఇలా చెప్పుకున్నారు: ''అమ్మా, వీడా యుద్ధంలో తాటకను చంపిన విల్లుకాడు? వీడా విశ్వామిత్రుడి యాగాన్ని రక్షిస్తూ సుబాహుడిని చంపిన పౌరుషశాలి? వీడా అహల్యను శాప విముక్తురాలిని చేసి మరల స్త్రీగా చేసిన ఉపకారి, వీడా మన జనక రాజు దాచిపెట్టిన శివిడివిల్లు విరిచిన జగజ్జెట్టి, వీడా నిన్ననే మన సీతను పెళ్లిచేసుకొని కులుకుతున్న సుందరుడు. అమ్మా, మన రాజు జనకుడు ఎంత పుణ్యాత్ముడే? ఇంతటి వాడిని అల్లుడిగా సంపాదించాడు! ఇతడిని భర్తగా పొందేందుకు మన సీత ఏ నిష్ఠలు సలిపిందోకదా? ఇతడు తన అల్లుడయేందుకు మనరాజు జనకుడు ఏ మంత్రం జపించాడోకదా? ఇతడు ప్రభువుగా తమను పాలించేందుకు అయోధ్యాపురవాసులు ఎన్ని తపస్సులు చేసారోకదా?'' అని ముక్కుమీద వేలుంచుకుని ఆశ్చర్యపడ్డారు.

దశరథుడు పయనమై అయోధ్య దిక్కుగా పోతుంటే, ఆయనకు ఎదురుగా, పరుష ధ్వనులతో ఆకాశంలో పక్షులు భయంకరంగా కూసాయి. అప్పుడే కొన్ని మృగాలు ప్రదక్షిణగా పరుగెత్తసాగాయి. ఆకాశంలో అపశకునాలు, భూమిమీద శుభశకునాలు కనబడడంతో, దశరథుడు అదేంటని వశిష్ఠుడిని అడిగాడు. పక్షి కూతలవల్ల భయంకరమైన కీడు కలిగే అవకాశం వున్నప్పటికీ, అడవిమృగాలు ప్రదక్షిణగా పోతున్నందున, భయపడాల్సిన అవసరం లేదని వశిష్ఠుడు దశరథుడికి ధైర్యం చెప్పాడు. ఇంతలో, చూసేవారి గుండెలు ఝల్లుమనేలా గాలి సుళ్లుపెట్టూ వీరిని తాకింది. భూమి వణికి చెట్లు నేల

కూలాయి. విస్తారంగా చీకట్లు సూర్యుడిని కమ్ముకున్నాయి. దిక్కులు తెలవకుండా, దుమ్ము విశేషంగా లేచి, దశరథుడి సైన్యాన్ని కప్పేసింది. ఇదంతా జరుగుతుంటే, ఏంచేయాల్నో తోచక ఎక్కడివారక్కడే నిలబడి పోయారు.

ఆ సమయంలో, భయంకరమైన ఆకారంతో, దిగులు పుట్టించే తేజంతో, భుజంమీద ప్రకాశవంతమైన గండ్రగొడ్డలిని ధరించి జమదగ్ని కుమారుడు, పరశురాముడు, ఏనుగులా వేగంగా అడుగులు వేసుకుంటూ భూమిపై దద్దరిల్లే ధ్వనులు పుట్టించుకుంటూ అక్కడికొచ్చాడు. ఇలా వస్తున్న ఆయనను దూరంనుండే చూసిన మునులు, తన తండ్రిని చంపాడన్న కోపంతో రాజులందరినీ హతమార్చిన పరశురాముడు ఎందుకొస్తున్నాడానని ఆలోచించ సాగారు. ఇంతలో, అక్కడకు చేరుకున్న పరశురాముడికి, ముని సమూహం అర్ఘ్యం ఇచ్చి పూజించిన తర్వాత, వారిని దాటిపోయి శ్రీరాముడితో సంభాషించాడు పరశురాముడు.

''రామా, దశరథ రామా! అద్భుతమైన నీ గొప్పబలాన్ని గురించి విన్నాను. నువ్వు శివుడి ధనుస్సును విరచడం గురించి కూడా లోకులందరు చెప్పుకుంటుంటే విన్నాను. శివుడి విల్లు విరచడం ఆశ్చర్యకరమైన విషయమే. ఇంత గొప్పదని చెప్పలేందది. ఇదివిన్న నేను, ఆ విల్లుకంటే గొప్పదైన మరోదాన్ని, నీ బలం పరీక్షించేందుకు తీసుకొచ్చాను. ఇదిగో, ఇదే పరశురాముడి విల్లు. దీన్ని చూస్తుంటేనే గుండెలు ఝల్లుమంటాయి. దీన్ని నువ్వు ఎక్కుపెట్టి, భయపడకుండా, నీబలమెంతో, వీర్యమెంతో చూపించు. ఈ విల్లు నువ్వు ఎక్కుబెట్టితే, నీ పరాక్రమం ఎంతో చూసి, నీతో ద్వంద్వ యుద్ధంచేస్తాను'' అని శ్రీరాముడితో అంటాడు పరశురాముడు.

పరశురాముడి మాటలు విన్న దశరథుడు, వెలవెలబోయిన ముఖంతో, దీనంగా, కాళ్లల్లో వణుకుపుట్టుంటే, మాటలు తడబడుతుంటే పరశురాముడిని ప్రార్థించాడీవిధంగా: ''అయ్యా, ఈ నా కొడుకు బాలుడు. ఏదో పిల్లతనంతో శివుడి విల్లు విరిచాడు. నువ్వా తప్పును క్షమించు. నీవు కోపించవచ్చా? ఓ మునీశ్వరా, నా గొప్ప పురుషార్థాలన్నీ నాశనం చేయడానికి వచ్చావా? రామచంద్రుడిని ఒక్కడిని చంపితే, మేమందరం అతడితో పోవాల్సినవాళ్లమే''. ఇలా అంటున్న దశరథుడి మాటలు వినిపించుకోకుండా, పెడచెవిన పెట్టిన పరశురాముడు, శ్రీరామచంద్రమూర్తికి ధనుస్సుల వృత్తాంతాన్ని చెప్పసాగాడు.

''నీవు విరిచిన విల్లు, ఇప్పుడు నాచేతిలో వున్న విల్లు, రెండు కూడా, మిక్కిలి బలిష్ఠమైనవి. దేవతలు చెప్పి చేయించినవి. మిగుల శ్రేష్ఠమైనవి. మిక్కిలి దృఢమైనవి. గొప్ప ప్రయత్నంతో విశ్వకర్మ వీటిని తయారుచేశాడు. అందులో ఒకదాన్ని, త్రిపుర సంహార సమయంలో శివుడికి దేవతలిచ్చారు. నువ్వు విరిచింది దాన్నే. ఇది రెండోది. దీన్ని దేవతలు విష్ణువుకిచ్చారు. ఇదీ మిక్కిలి బలిష్ఠమైనదే. బలంలో శైవచాపంతో సమానమైంది. ఇలా కొంతకాలం జరిగింతర్వాత దేవతలు బ్రహ్మ దగ్గరకు పోయి, శివకేశవులలో ఎవరు బలవంతులని ప్రశ్నించారు. వారి అభిప్రాయం తెలుసుకున్న బ్రహ్మ, క్రియా రూపంలో వారి సందేహం తీరుస్తానని చెప్పి, శివుడికి, విష్ణువుకు విరోధం కలిగించాడు''.

''శివుడు దగ్గరకు పోయి, త్రిపురాలను నాశనం చేసిందెవరని అడిగాడు బ్రహ్మ. తానేనని జవాబిచ్చిన

శివుడితో, చేతగాని ప్రగల్భాలు పలకొద్దని, విష్ణువు బాణమై పోయినందున కదా త్రిపురాలను కాల్చిందని అంటాడు. ఆయన చేసిందేమీ లేదని, త్రిపురాలను కాల్చి బూడిద చేసింది తానేనని, శివుడు నిమిత్తమాత్రుడేనని విష్ణువంటున్నాడని రెచ్చగొట్టాడు శివుడిని బ్రహ్మ. విష్ణువుకు ఆ శక్తి వుంటే తనకు బాణంగా ఎందుకు నిలిచాడు? అని, శివుడు ఎదురు ప్రశ్న వేశాడు బ్రహ్మను. శివుడన్న మాటలను విష్ణువుకు చెప్పి, పరస్పర ద్వేషం కలిగించి, ఇరువురినీ యుద్ధానికి సిద్ధంచేశాడు బ్రహ్మ''.

''ఒకరిపై మరొకరు కోపించి, వారిద్దరూ భయంకరమైన యుద్ధంచేశారు. ఆ యుద్ధంలో శివుడికి నువ్వు విరిచిన వింటిని, విష్ణువుకు నాదగ్గరున్న వింటిని ఇచ్చారు దేవతలు. ఆయుధాలలో తేడాలుంటే, ఇరువురి బలాబలాలు నిర్ణయించడం సాధ్యంకాదని, సరిసమానమైన ధనుస్సులను ఇచ్చారిద్దరికి. ఇద్దరూ జయించాలనే యుద్ధంచేశారు. ఇదంతా చూస్తున్న దేవతలు, మునులు, చారణులు, వృథా కలహం మాని, హరిహరులిద్దరు యుద్ధం ఆపు చేయమని ప్రార్థించారు. వారుకూడా శాంతించారు. విష్ణువు బల వేగంతో శివుడి విల్లు పెట్లిపోవడం చూసిన దేవతలు, మునులు, విష్ణువే శివుడికంటే బలవంతుడని తమ మనస్సులో అనుకున్నారు''.

''దేవతల అభిప్రాయాన్ని గ్రహించిన రుద్రుడు, ధనుస్సుపై కోపంతో, బాణాలతో సహా దాన్ని దేవరాతుడికిచ్చాడు. విష్ణువు ధరించిన వింటిని ఆయన, భృగువంశభవుడైన ఋచీకుడికిచ్చాడు. ఋచీకుడు తన కొడుకైన జమదగ్నికి ఇచ్చాడు. ఆ జమదగ్ని నా తండ్రి. జమదగ్ని శస్త్ర సన్యాసం తీసుకొని తపస్సు చేస్తున్నప్పుడు, గర్విష్ఠుడైన కార్త్యవీర్యార్జునుడు, నీచ బుద్ధితో, నా తండ్రిని చంపాడు. దారుణమైన పితృమరణవార్త విన్న నేను క్రూరుడనై, రాజులను పలుమార్లు వధించాను. రాజులందరినీ చంపి, యజ్ఞం చేసి, యజ్ఞాంతంలో భూమినంతా కశ్యపుడికి దానం చేసి, మహేంద్ర పర్వతం నా నివాసంగా చేసుకొని, తపస్సు చేసుకుంటూ సుఖంగా దేవతా సంఘసేవితుడనై వున్నాను. నువ్వు, నీ మహాబలంతో, శివుడి విల్లు విరిచావని విని పరుగెత్తుకుంటూ వచ్చాను. ఆ వైష్ణవ చాపం ఇదే. నువ్వు క్షత్రియ వంశంలో పుట్టినవాడివైతే, నీ తండ్రి, తాతల క్షాత్రం స్మరించి, ఈ విల్లు ఎక్కుపెట్టి నీ భుజబలం చూపించు. నువ్వు విల్లెక్కుబెట్టి, బాణం సంధించగలిగితే, నీతో ద్వంద్వ యుద్ధం నేనొక్కడినే చేస్తాను. త్వరగా కానివ్వు'' అని పరశురాముడన్న మాటలకు శ్రీరాముడు కోపించాడు.

పరశురాముడిలా మాట్లాడుతుంటే కోపం తెచ్చుకున్న శ్రీరామచంద్రమూర్తి, మెల్లని స్వరంతో, ''ఏమన్నావు పరశురామా? నీకథంతా విన్నాను. శూరుడు పగ తీర్చుకోవడం న్యాయమే కాబట్టి జనకుడి ఋణం తీర్చుకునేందుకు నీవు చేసిన పని సరైందనే అంగీకరిస్తున్నాను. అంతవరకు బాగానే వుంది. కాకపోతే నేను దుర్బలుడని తలుస్తున్నావు నువ్వు. క్షాత్రధర్మంలో నేను తక్కువన్నట్లుగా నువ్వన్నమాటలను సహించను. నా తేజస్సు నువ్వు తెలుసుకోలేక పోతున్నావు. నా బలాధిక్యాన్ని చూపిస్తాను, చూడు'' అని అంటూ, పరశురాముడి చేతిలోని భయంకరమైన వింటిని లాక్కున్నాడు.

వింటిని లాగి, ఎక్కుపెట్టిన రామచంద్రమూర్తి, ఒక బాణాన్ని సంధించి, కళ్లెర్రచేసి అమితమైన కోపంతో పరశురాముడిని చూసి ''బ్రాహ్మణుడవైకూడా, శస్త్రాన్ని ధరించి వచ్చిన నిన్ను చంపవచ్చని శాస్త్రం అనుమతించినా, నీవు నా గురువైన విశ్వామిత్రుడి బంధువైనందున, నీమీద కోపంతో నీపై

సంధించి, నిన్ను చంపగలిగిన ఈ బాణాన్ని నీమీద ప్రయోగించడానికి మనసొప్పుకోవడంలేదు. అందువల్ల, నువ్వింక ఎంతమాత్రం నడవ లేకుండా, ఒక దిక్కున పడే విధంగా నీ కాళ్ల గమనవేగాన్నిగానీ, నువ్వు తపస్సు చేసి సంపాదించిన పుణ్యలోకాలనుగానీ, ఏదికోరుకుంటే దాన్ని, ఈ బాణంతో ఖండిస్తాను. ఈ బాణం వృధాగా పోదు. ఇది విష్ణు సంబంధమైంది కనుక సంధించిన తర్వాత వ్యర్థంగా పోదు. సార్థకంగా లక్ష్యాన్ని భేదించిన తర్వాతే శాంతిస్తుంది. దేనిని ఖండించాలో చెప్పు'' అంటాడు.

ఆ మాటలకు పరశురాముడు జడపదార్థమై, వీర్య విహీనుడై, బొమ్మలాగా శ్రీరామచంద్రమూర్తిని చూడసాగాడు. శ్రీరామచంద్రుడి తేజంతో, పరాక్రమం నశించి, బలం పోయి, జడుడైన పరశురాముడు, మునుపటిలా కాకుండా, గౌరవంతో మెల్లగా ఇలా అన్నాడు రాముడితో.

''పుండరీకాక్షా, మహానుభావా, నా నడకను నరకొద్దు. నా తపస్సుతో నేను సంపాదించుకున్న పుణ్య లోకాలను నీ బాణంతో ధ్వంసం చేయి. ఆ పుణ్యలోకాల అనుభవం నాకు లేకుండా చేయి. అజ్ఞానంతో, తెలివిలేక, నీ సత్తా తెలుసుకోలేక తప్పుచేసాను. ఎప్పుడైతే నువ్వు నా చేతిలో వున్న విల్లు లాక్కొని బాణం సంధించావో, అప్పుడే, ఇతరులకెవరికీ సాధ్యంకాని పని నువ్వు చేసావనుకున్నాను. కాబట్టి నువ్వు నిర్వికారుడవు, అపరాజితుడవు, శ్రీమన్నారాయణుడివి అని తెలుసుకున్నాను. నేను తెలివి మరిచి అపరాధం చేసాను. క్షమించు. నీకు శుభం జరగాలి. నువ్వు ముల్లోకాలను పాలించే ముఖ్యదేవుడివి. అసమానమైన వ్యర్థంగాని నీ బాణాన్ని విడువు. నా కీర్తి నాశనం కావడం, గతులు తప్పడం కళ్లారా చూసి, సమయం దాటకుండా మహేంద్ర పర్వతానికి పోతాను''. పరశురాముడిలా చెప్పగానే, రామచంద్రమూర్తి బాణాన్ని విడవడంతో, తన పుణ్య గతులన్నీ దగ్ధమై పోవడం చూసి, ఆయనకు ప్రదక్షిణ చేసి మహేంద్ర పర్వతానికి పోయాడు.

పరమార్థ జ్ఞానం దేవతలు క్రియా రూపంగా తెలిపేందుకు బ్రహ్మ శివకేశవుల మధ్య పరస్పర ద్వేషం కలిగించి యుద్ధం చేయించాడు. ఒకరు చూసి చెప్పినదానిలా కాకుండా, కళ్లార చూసి, ఎవరెక్కువ బలవంతులో దేవతలు స్వయంగా తెలుసుకున్నారు. ఈ వాస్తవాన్ని తెలుసుకోకుండా, విష్ణువు ఎక్కువా, శివుడెక్కువా అని, తత్పక్షపాతులు విరివిగా గ్రంథాలు రాసారు. శివ కేశవులకు భేదం లేదని పురాణాలు ఘోషించాయి. భగవంతుడు, జనార్ధనుడు ఒకడే. సృష్టి, స్థితి, లయం చేసేందుకు బ్రహ్మని, విష్ణువని, శివుడని పేర్లు పెట్టుకున్నాడు. విష్ణువు అధికుడని దేవతలు గ్రహించారని పరశురాముడు శ్రీరాముడికి చెప్పాడు. అది వాస్తవం కాదు. ఇక పొతే, శ్రీరామావతారం పూర్ణావతారం. పరశురామ అవతారం, రామావతారంలో కలిస్తే, తక్కువ తేజస్సు, ఎక్కువ తేజస్సులో కలిసిపోతుంది. పరశురాముడిలోని వైష్ణవ తేజం బయటికొచ్చి దేవతలందరు చూస్తుండగా శ్రీరాముడిలో ప్రవేశించింది.

◆❖◆

పౌరులు కోరిన ఏలిక రాముడు

అసమానమైన గుణాలతో సుసంపన్నుడైన శ్రీరాముడిని అయోధ్యా రాజ్యానికి ఎలా పట్టాభిషిక్తుడిని చేయాలా అని ఆలోచించాడు దశరథుడు. అప్పటికప్పుడే శ్రీరాముడిని రాజుగా చేయాలా? వద్దా? చేస్తే మంచిదా? చేయకుంటేనా? అని పదే-పదే ఆలోచించి, చేయడమే శ్రేయస్కరమని భావించాడు. రాజైన వాడికి ప్రజల అభివృద్ధి కావాలన్న కోరిక వుంటుంది. అలాంటి కోరిక శ్రీరాముడిలో వుందని దశరథుడి నమ్మకం. ప్రతి తండ్రికి, తన కొడుకు తనను మించినవాడైతే మంచిదను కుంటాడు. అలాగే దశరథుడు కూడా. ఇలా ఆలోచించిన దశరథుడు, శ్రీ రామచంద్రమూర్తిని యువరాజు చేయాలని, మంత్రులతో ఆలోచించి నిశ్చయించుకుంటాడు.

రామ పట్టాభిషేకానికి దశరథుడు తొందరపడటానికి ఇంకో కారణముంది. దశరథుడికి మరణం ఆసన్నమవుతున్నదని సూచనగా కొన్ని అపశకునాలు గోచరించాయి. కాకపోతే, ఆయన అపశకునాలకు భయపడి తీసుకుంటున్న నిర్ణయం కాదు. తాను మిక్కిలి వృద్ధుడవడం, యోగ్యుడు, సమర్థుడు అయిన కుమారుడు, అందునా ఎదిగినవాడుండడం, ఇంకా రాజ్య భారం వహించడం ధర్మం కాదని భావించడం రామ పట్టాభిషేక ప్రయత్నాలను వేగవంతం చేయడానికి కారణాలు. మరణం సమీపంలోనే వున్నందున ఇంకా ఆలశ్యం చేసి ప్రయోజనం లేదనుకుంటాడు దశరథుడు. శ్రీరామచంద్రుడిపై ప్రజలకున్న అనురాగాన్ని గురించి కూడా ఆలోచన చేశాడు దశరథుడు. తనకు, ప్రజలకు ప్రీతి కలిగించే రామ పట్టాభిషేక కార్యాన్ని జరిపించడానికి సరైన సమయం ఆసన్నమైందని గుర్తించిన దశరథుడు, శుభస్య శీఘ్రం అని తలపోశాడు.

రాజైన వాడు, తన తదుపరి తన కొడుకును తన ఇష్ట ప్రకారం పట్టాభిషేకం చేసే అధికారం లేదు. రాజ్యం ప్రజలది. రాజ్యాన్ని పరిపాలించే శక్తి ఎవరికి కలదో, వానినే, పట్టాభిషిక్తుడిని చేసే అధికారం ప్రజల కుంది. ఆ భారం కూడా వారిదే. ప్రజల నిమిత్తం రాజుంటాడు కాని, రాజు కొరకు ప్రజలుండరు. అన్ని విధాలుగా శ్రీరామచంద్రుడు రాజ్యభారం వహించడానికి సమర్థుడని దశరథుడు భావించినప్పటికీ,

ప్రజానురాగం వుందని ఆయన నమ్మినప్పటికీ, ప్రజల సమ్మతి లేకుండా అయనకు అలా చేసే అధికారం లేదు కాబట్టి, వారిని సంప్రదించే ఆ పని చేయాలనుకుంటాడు దశరథుడు.

ఆలోచన చేసేందుకు, సామంతరాజులను, ముఖ్య రాజులను, వివిధ దేశాలలో దూరంగా వుండేవారిని, గ్రామాలలో వుండేవారిని దశరథుడు పిలిపించాడు. అందరినీ ఒక్క రోజునే రమ్మని కబురు చేశాడు. తన మాట ప్రకారం అయోధ్యకు వచ్చిన వారందరికీ, వారి వారి యోగ్యతల ప్రకారం తగిన వసతి ఏర్పాట్లు చేశాడు దశరథుడు. రాజులందరు వచ్చిన తరువాత, వారివారి ఆసనములపై కూర్చుండిన తరువాత, దశరథుడు సభ తీరాడు. సభదీరిన దశరథుడు, అక్కడున్న వారందరినీ కలియ చూసి, ఇలా చెప్పసాగాడు.

''ఆర్యులారా! ఇక్ష్వాకుల వంశంలో పుట్టిన నేను, మా పెద్దలు ఏ ప్రకారం ప్రజలకు మేలైన పనులను చేశారో, అలాగే, ఆ మార్గంలోనే నేను కూడా మిక్కిలి హెచ్చరికతో ప్రమాదం లేకుండా, నా శక్తివంచనలేకుండా ప్రజలను రక్షించాను. ఈ విషయం మీ అందరి మనస్సులకు తెల్సిందే! ఎల్లప్పుడూ ప్రజలకు మేలైన పనులే చేయాలని కోరుకునే నా శరీరం, వార్ధక్యానికి గురైంది. నాకు అరవై వేల వయస్సు కొరతలేకుండా గడిచింది. దేహం దుర్బలమైంది. జ్ఞాపకశక్తి క్షీణించకముందే, మతి మరుపు రాక ముందే, కర్తవ్యాన్ని మరిచి ఒకదానికి బదులు ఇంకొక టి చేయడానికి ముందే, అలాంటి స్థితి రాక ముందే, ఈ రాజ్య భారాన్ని వదిలించుకుని సుఖపడాలని కోరుకుంటున్నాను''.

''రాజ్య భారాన్ని దీర్ఘకాలం మోసి, మోసి, ఇక ఈ భారాన్ని తొలగించుకొని సుఖపడాలని ఆశతో వున్నాను. అలా చేయడానికి మీ అందరి అనుమతి కావాలి. అలాంటప్పుడు ఈ రాజ్యం గతి ఏంటి? ప్రజలందరిని ఏం చేసి పోతావు అని అంటారేమో? నాకు తోచిన రీతిలో దానికి కావాల్సిన ఏర్పాట్లు చేస్తాను. మీ కిష్టమైతే దానికి మీ అంగీకారం తెలపండి. అదేంటని అంటారా? ఇక్కడున్న ద్విజులందరికీ సమ్మతమైతే, మీరందరూ ఒక్క మాటతో, నిండు మనస్సుతో, అంగీకరించి సరైనదే అంటే, నా పెద్ద కుమారుడు, శ్రీరాముడిని, మీ అభిప్రాయం తెలుసుకుని, యువరాజుగా చేయాలనుకుంటున్నాను''.

''వాస్తవానికి రాముడు మూడు లోకాలను ఏల తగినవాడే. ఇక మీ సమ్మతి తెలపడమే ఆలస్యం. శీఘ్రంగా నేను ఈ భూ భారాన్ని శ్రీరాముడికి అప్పగించి, సుఖపడతాను. నేను చెప్పిన ఈ ఆలోచన సమంజసమని మీకు అనిపించితే, దానికి మీ సమ్మతి తెలపండి. ఒక వేళ నా ఆలోచన మీకు నచ్చకపోతే, ఇంతకంటే మేలైన ఆలోచన తెలపండి. నేను చెప్పిన ఆలోచన కాబట్టి, అంగీకరించకపోతే నేను నొచ్చుకుంటానని భావించవలదు. రాముడు నా కొడుకు కాబట్టి, పుత్ర వాత్సల్యంతో చెప్పాను. కార్యాలోచనలో అయినవారి ఆలోచన పక్షపాతంతో కూడి వుండవచ్చు. మధ్యవర్తుల ఆలోచన మేలైందిగా వుంటుంది. ఉదాసీన మనుష్యుల ఆలోచన పనికిరాదు. రాముడి రాజ్యంలో సుఖపడవలసిన వారు మీరు. రామ పక్షపాతంతో నేను చెప్పిన ఆలోచనకంటే మధ్యవర్తులైన మీ ఆలోచనే మేలు''.

ఇలా దశరథుడు చెప్పడంతో, రాజులందరూ, మేలు–మేలు అని, బాగు–బాగు అని కేకలు వేశారు. దశరథుడిని శ్లాఘించారు. బ్రాహ్మణ శ్రేష్టులు, పౌరులు, గ్రామజనులందరు, కలిసి మాట్లాడుకుని, ఏకాభిప్రాయానికి వచ్చారు. దశరథుడు ఎన్నో వేల సంవత్సరాలనుండి రాజ్యాన్ని పాలించుతున్నాడని,

ముసలివాడైనాడని అంటూ, రాజ్యపాలనకు శ్రీరామచంద్రుడిని యువరాజుగా చేయమని కోరారు. సభలో వున్న ప్రముఖులందరూ, ఒకే మాటగా చెప్పడంతో, వారి వుద్దేశం రాముడి మీద ప్రేమా? తన మీద కోపమా? తెలుసుకోవాలని భావించాడు దశరథుడు.

''రాజులారా! రాముడిని యువరాజుని చేస్తానని నా నోటి వెంట మాట వచ్చినదే తడవుగా, మీరు పూర్తిగా వినీ-వినకుండానే దానికి సమ్మతించి ఆయనను ప్రభువుగా వుండాలని కోరుతున్నారు. ఇదంతా చూస్తుంటే నాకేదో సందేహంగా వుంది. నా పరిపాలనలో ఏదో లోపం వుందని మీరు భావిస్తున్నట్లు అర్థమవుతోంది. నా పాలన తొలగిపోతే మంచిదని మీరు అనుకుంటున్నట్లుగా వుంది. ఇది వాస్తవమేనా? లేక నిజంగా రాముడి మీద ప్రేమా? నిజం చెప్పండి. వాస్తవంగా మీ అభిప్రాయం వెల్లడించండి''. అని వారిని ఒకవైపు ప్రశ్నించినప్పటికీ, లోలోన మాత్రం తన అభిప్రాయాన్ని సర్వజనులు ఆమోదించినందుకు, సంతోషించాడు దశరథుడు.

దశరథుడి ప్రశ్నలకు సమాధానంగా, అక్కడున్న వారందరు పండిత, పామర అనే భేదం లేకుండా, ఒకే మాటగా ఇలా చెప్పారు: ''రాజా! దేవుడితో సమానుడైన రాముడిలో ఆనందకరమైన అనేక కల్యాణ గుణాలున్నాయి కాని, హేయ గుణం ఒక్కటి కూడా కానరాదు. రాముడు నీ కొడుకైనందున ఆయన మహిమ నీకు తెలిసి వుండకపోవచ్చు. శ్రీరాముడికి సత్యమే శౌర్యం. శౌర్యం ద్వారా నెరవేరాల్సిన పనులు కూడా ఆయన విషయంలో శౌర్యంతో సంబంధం లేకుండానే, సత్యం వల్ల కలుగుతాయి. శౌర్యం చూపాల్సి వచ్చినప్పుడు సత్యం తప్పడు. సాక్షాత్తు నారాయణుడితో సమానుడు. ఇక్ష్వాకుడి వంశంలో పుట్టిన గొప్పవారిలో శ్రేష్టుడు. ధర్మానికి ప్రతీక. రాముడిని శత్రువులు, మిత్రులు కూడా పొగుడుతారు. రాముడే లేకపోతే లోకంలో ధర్మం లేనే లేదు''.

''రాజా! నీ కొడుకు సమస్త ప్రజలను సంతోష పెట్టాడు. నిష్కల్మషమైన ఓర్పులో భూమికి సమానుడు. అసమానమైన బుద్ధిలో దేవతల గురువైన బృహస్పతికి సమానుడు. సామాన్య ధర్మాలు, విశిష్ట ధర్మాలు, సకల ధర్మాలు తెలిసినవాడు. తప్పు చేసినవారిని కూడా ఆదరించే గుణం కలవాడు. కాఠిన్యం కనబరచడు. వెన్నలాంటి మనసున్న దయామయుడు. దేవతలకు, మనుష్యులకు, రాక్షసులకు తెలియని అనేక శస్త్రాస్త్రాలను సమ ధర్మంగా తెలిసిన పండితుడు. వేద-వేదాంగాలను అర్థ సహితంగా తెలుసుకున్నవారిలో సమర్థుడు. శాస్త్ర పాండిత్యంలో రాముడిని మించినవారు లేరు. ఇలాంటి గొప్ప గుణాలు, గొప్ప బుద్ధి కలగడానికి కారణం, గొప్ప వారైన తల్లిదండ్రుల వంశంలో పుట్టినందువల్లే! బంగారానికి మెరుగుపెట్టినట్లే, రాముడు స్వసద్గుణాలవల్ల మిక్కిలి గొప్పవాడయ్యాడు. సర్వకాలాలోను నిర్మలమైన మనసున్నవాడయ్యాడు. శరణు కోరితే వారెంత కీడు చేసినా దయతో రక్షించే గుణం కలవాడు''.

''ఎన్ని కష్టాలు కలిగినా, సత్యం తప్పితే కష్టాలు తొలగుతాయన్న భావనకు దూరంగా సత్యం తప్పని సమర్థుడు. ఎవరి విషయంలోనైనా సంతోషిస్తే మేలు చేయడం, కోపగిస్తే కీడు చేయడం ఆయన నైజం. రాముడిని ఆశ్రయించినవారికి మేలు తప్పక కలుగుతుంది. ఆయన వున్న చోట జనన, మరణ, శత్రు,దారిద్ర్యాది భయాలు దరికి రావు. శ్రీమన్నారాయణుడుకి ఎలాంటి చిహ్నాలున్నాయని శాస్త్రాలు

చెప్తున్నాయో అలాంటి చిహ్నాలే శ్రీరాముడికి వుండడం వల్ల ఆయనను చూసినవారు సాక్షాత్తు శ్రీమన్నారాయణుడే తమకు ప్రత్యక్షమైనాడని భావించే లాంటి సౌందర్యవంతుడు రాముడు. రామబాణం ఎప్పుడూ గురితప్పలేదు. మనుష్యులలో కనిపించని గొప్ప మహిమ కలవాడు''.

"రాజా! శ్రీరామచంద్రమూర్తి ఈ రాజ్యాన్ని పాలించడానికి యోగ్యుడా? అని మా అభిప్రాయం అడిగావు. తుచ్ఛమైన ఈ లోకాన్నే కాదు. మూడు లోకాలను పాలింప సమర్థుడు. దుష్ట శిక్షణకు కావాల్సిన ధైర్య, శౌర్య, వీర్య, పరాక్రమాలను, సాధు రక్షణకు అవసరమైన శాంతి, దాంతి లాంటి సద్గుణాలను, ధర్మ సంస్థాపనకు కావాల్సిన సత్య గుణాలను కలిగిన రాముడిని ఇక్కడున్న మేం నలుగురం మాత్రమేకాదు, భూ ప్రజలందరు ఆయననే ఏకగ్రీవంగా తమ పతిగా వరించారు. వారందరి అభిప్రాయమే మేం తెలుపుతున్నాం. ఈ విషయంలో భిన్నాభిప్రాయం లేనే లేదు. రాజా నీవు చాలా పుణ్యవంతుడివి. పుత్ర శబ్దాన్ని సార్ధకం చేస్తూ, పున్నామ నరకాన్నుంచి తప్పించడం మాత్రమే కాకుండా, తక్కిన పుణ్యాలను చెడకుండా రక్షించుతూ, రాజులు అవశ్యం పోవాల్సిన నరకానికి నిన్ను పోకుండా రక్షించగలవాడిని, రాముడిని కొడుకుగా కన్నావు. ఇంకొకరు కొడుకై పుట్తే, కాముకుడవైన నిన్ను, నరకానికి పోకుండా కాపాడగలిగేవాడు కాదు. నువ్వు కూడా యోగ్యుడవైనందునే మరీచికి కశ్యపుడు కొడుకైనట్లు మహర్షి తుల్యుడైన రాముడు నీ కుమారుడైనాడు. ఆయన తండ్రిగా స్వీకరించడానికి నీవే తగినవాడివి''.

"రాజా! రాముడికి ఎల్లప్పుడూ సుఖమే కలగాలి. 'రాముడు దీర్ఘకాలం జీవించాలి. రాముడికి వ్యాధులవల్ల బాధలు కలగకుండా వుండాలి. రాముడి దేహబలం వర్ధిల్లాలి'. ఈ విధంగా దేవతలు, గంధర్వులు, ఋషులు, పన్నగులు దేశ-దేశాల్లోనే కాక గ్రామాల నుంచి పట్టణాల దాకా సర్వకాలాలోను కోరుకుంటున్నారు. రామచంద్రుడి విషయంలో వీరూ-వారూ అనే భేదం లేకుండా, సర్వదా అందరూ ఆయనను తప్ప ఇతరులను తలచడం లేదు. నల్ల కలువల లాంటి నీలమైన దేహ కాంతి కలవాడిని, పగ వారి పొగరు అణచువాడిని, సర్వజనులు సర్వ వేళల ఉచ్చరించే నామం కలవాడిని, దయా గుణం కలవాడిని, అందమైన చెక్కిళ్లు కలవాడిని, కొత్త యవ్వనమందుండువాడిని, యశస్సు వల్ల నిండిన లోకం కలవాడిని, సముద్రం లాగానే లోతు తెలియని వాడిని, పర్వతంలాగా చలించని వాడిని, సజ్జనులందు, సాజ్యంలోను అదే శక్తిగల సత్యాన్ని, ధర్మాన్ని కలిగివుండిన వాడిని, ఇంపుగా, మెత్తగా మాట్లాడువాడిని, దోష రహితుడిని, దేవాది దేవుడితో సమానుడైన వాడిని, శ్రీరామచంద్రమూర్తిని యువరాజుగా కళ్లారా చూసి సంతోషించాలని వుంది రాజా! కాబట్టి, మా మేలును కోరి, మా కోరిక నెరవేర్చు'' అని అంటారు.

ఈ విధంగా పౌరుల సమ్మతి తీసుకుని శ్రీరాముడికి పట్టాభిషేకం చేయాలన్న నిర్ణయానికి వచ్చాడు దశరథుడు. కాకపోతే, విధి వక్రించి, కైకేయి వరాల మూలాన ఆయన వనవాసానికి పోవాల్సి వచ్చింది. అది వేరే విషయం.

వాస్తవానికి, శ్రీరాముడిపై ఘాటు ప్రేమ, భక్తి కలిగిన వారందరికీ, శ్రీరాముడి నిర్యాణ కాలంలో ముక్తి లభించింది.

◆❖◆

మంథరోపాఖ్యానం...
శ్రీరాముడి వనవాసానికి నాంది

రామపట్టాభిషేకం విషయంలో దశరథుడి నిర్ణయాన్ని హర్షిస్తూ ప్రజలు వాడవాడలా సంబురాలు జరుపుకుంటూ సంతోషంగా మాట్లాడుకోసాగారు. ఎక్కడ చూసినా కోలాహలమే. సందడే సందడి. అంతటా మంగళ వాద్యాలు మోగుతున్నాయి. ఈ నేపథ్యంలో, దశరథుడి ముద్దుల భార్య కైక దాసి మంథర, మర్నాడు పట్టాభిషేకమనగా, ఆ సాయంకాలం, మేడ ఎక్కి ఆ హడావుడిని చూసింది. శ్రీరామ పట్టాభిషేక వార్త వూరంతా తెలిసినప్పటికీ, కైకకు తానే స్వయంగా చెప్పదల్చిన దశరథుడు, ఆ విషయాన్ని ఆమెకు చేరకుండా జాగ్రత్త పడ్డాడు. ఇతరుల ద్వారా ఆమెకా వార్త తెలిస్తే, ఆమె మనస్సులో వికారం కలిగి, ఏదైనా విఘ్నం చేయవచ్చని ఆయన అనుమానం.

శ్రీరాముడి పట్టాభిషేకం తన సొంత కొడుకు పెళ్లిలాగా భావించి, పట్టు వస్త్రాలతో అలంకరించుకుని సంతోషంగా తిరుగుతున్న ఒక స్త్రీ మూర్తిని గమనించింది మంథర. విషయం తెలియని మంథర రాజేమన్నా గొప్ప కార్యం చేస్తున్నాడా అని ఆమెను అడిగింది. మంథర విషపు బుద్ధి తెలియని ఆ స్త్రీ మూర్తి, సంతోషంతో ఉప్పొంగి పోతూ, మంథరతో వున్న విషయం చెప్పింది. మర్నాడు ఉదయం శ్రీరాముడికి దశరథుడు యౌవరాజ్య పట్టాభిషేకం చేయనున్నాడని చెప్పింది. శ్రీరాముడి పట్టాభిషేక వార్త విన్న మంథర, మండిపడుతూ, బిరబిరా పోయి, కైకకు ఆ విషయం, తన మనసులో మాట, వక్ర భాష్యంతో చెప్పింది. .

కైకకు ఏమీ తెలియదని, అందువల్ల ఆమెకు చెడిపోయే కాలం వచ్చిందని, అలా వూరుకుంటే గంటల వ్యవధిలోనే ఆమెకు కీడు కలగవచ్చని అంటుంది. మంథర ఇంకా ఇలా అనసాగింది: "ఓ కైకా! నీ మగడు రేపే శ్రీరాముడిని యువరాజును చేయడానికి సన్నాహాలు చేస్తున్నాడు. శ్రీరాముడి పట్టాభిషేకం నాకు ఎలా కీడు కలిగిస్తుందని నువ్వు అంటావేమో? నీకు దుఃఖం కలిగించే విషయం కాబట్టే నేనూ దుఃఖ పడుతున్నాను. ఇక్కడ నీతో అల్లి-బిల్లి మాటలు చెప్తూ, నీ మీదే ప్రాణాలన్నీ నిలిపినట్లు కనిపిస్తున్నాడు నీ మగడు దశరథుడు. అక్కడేమో, నీకు కీడు కలిగే విధంగా, నీ సవతి కౌసల్యకు అన్నీ ఇస్తున్నాడు.

దశరథుడు మోసంతో, రాముడికి పట్టాభిషేకం జరిపిస్తే, నువ్వు నీ బంధువులు కూడా చెడిపోరా? నా మాట విను. నీ కొడుకును, నిన్ను, నన్ను రక్షించే ఉపాయం కనిపెట్టు. నీకు మేలైన పని జరగడానికి ఇదే సరైన సమయం. ఇది తప్పిపోతే మరో అవకాశం రాదు. పొరపాటు పడొద్దు'' అని మంథర తీరు తీరుగా కైకకు బోధించింది.

శ్రీరామ పట్టాభిషేకం గురించి మంథర చెప్పిన మాటలకు కైక సంతోషించింది. తన దేహం మీదున్న ఆభరణాలలో శ్రేష్టమైన దానిని ఒకటి తీసి అలాంటి సంతోష వార్త తెలిపిన మంథరకు బహుమానంగా ఇచ్చింది. ఇంతకంటే తనకిష్టమైన వార్త లేదని అంటుంది. రాముడికి పట్టాభిషేకం జరగడం తన కిష్టమైన వార్త అని అన్న కైక మాటలు మంథరకు రుచించలేదు. తన మాట కైక వినడం లేదని కోపమొచ్చింది. ఆమె తనకు ఇచ్చిన సొమ్మును విసిరి పారవేసింది. కైక సంతోషించాల్సిన సమయం కాదు అంటుంది. కైక మనస్సు చీకాకు పడే మాటలు మళ్లీ చెప్పసాగింది మంథర. కైకకు ఎన్నోవిదాలుగా దుర్బోధ చేసింది. ఆమె మనసు మార్చింది.

మంథర చెప్పింది సబబుగానే అనిపించింది కైకకు. తన కొడుకు రాజు కావడానికి మంచి ఆలోచన, ఉపాయం చెప్పమని అంటుంది. తన కొడుకుకు రాజ్యం రావాలని, రాముడికి పట్టాభిషేకం కాకూడదని అంటుంది. ఉపాయం చెప్తే తప్పక అమలు చేస్తానంటుంది. అలా అడిగిన కైకకు మంథర ఉపాయం చెపుతుందిలా.

"దేవతలు రాక్షసులతో యుద్ధం చేసే సమయంలో, ఇంద్రుడు నీ భర్తను తనకు తోడు రమ్మని అడిగాడు కదా! అప్పుడు దక్షిణ దిక్కున వున్న దండకారణ్యంలో పగవాడైన శంబరుడి పట్టణమైన వైజయంతం మీదకు నీ భర్త దండయాత్రకు పోయేటప్పుడు ఆయన వెంట నువ్వు కూడా వెళ్లావు కదా! ఆ యుద్ధంలో దశరథుడు రాక్షసుల వల్ల గాయపడి, రథం మీద మూర్ఛపోయిన సంగతి గుర్తుంది కదా! మూర్ఛ పోయిన నీ భర్తను, రథాన్ని, ఆపద నుంచి తొలగించి, యుద్ధ భూమి నుంచి దూరంగా తీసుకుని పోయావు నువ్వు. అక్కడికి కూడా తరుముకుంటూ వచ్చిన రాక్షసుల బారిన పడకుండా వేరొక రహస్య ప్రదేశానికి రథాన్ని తోలుకు పోయావు. అలా రెండు సార్లు ప్రాణాపాయం నుంచి కాపాడిన నీకు దశరథుడు రెండు వరాలిచ్చాడు. నువ్వు ఆ వరాలను అప్పుడు కోరలేదు. అక్కరపడి ఇష్టం వచ్చినప్పుడు అడుగుతానంటే, అలాగే కానిమ్మని దశరథుడు అన్నాడు''.

"నీ భర్త నీకు రెండు వరాలిస్తానన్నాడు కదా! అవెలాగ అడగాలో చెప్తా విను. పట్టాభిషేకం కొరకు ప్రస్తుతం రాముడికి చేస్తున్న కార్యక్రమాలన్నిటినీ రద్దు చేసి, అవి భరతుడికి చేయమని అడగడం ఒకటి. రెండోది, పద్నాలుగు సంవత్సరాలు రాముడు అడవులకు వెళ్లాలని కోరడం. ఈ రెండు వరాలు కోరుకో. రాముడు అరణ్యాలకు పోతే, రాజ్యం నిరాటంకంగా భరతుడిదే. కోపం వచ్చిన దాని వలె నటించుతూ, కోప గృహానికి పోయి, నేలమీద చినిగిన గుడ్డ వేసుకుని పడుకో. నీ భర్త నీ దగ్గరకు వచ్చే సమయానికి వగలమారి ఏడుపు మొదలెట్టు. జాగ్రత్తగా నాటక మాడు. మనస్సు దృఢంగా వుంచుకో. వరాలు ఇస్తానని వాగ్దానం తీసుకో. ప్రమాణం చేయించుకుని అడగాల్సిన రెండు వరాలు అడుగు''. ఇలా చెప్పిన మంథర తెలివికి ఆశ్చర్యపడి సంతోషంతో ఆమెను మెచ్చుకుంది కైక.

కైక కోప గృహంలో ప్రవేశించింది. జడను విప్పి విరబోసుకుంటుంది. కటిక నేలమీద పడుకుంటుంది. ఆభరణాలు తీసేస్తుంది. తీసిన ఆభరణాలను ఇంటి నిండా వెదజల్లుతుంది కైక. నేలపై పడుకుని నిట్టూర్పులు విడవడం కొనసాగిస్తుంటుంది.

ఇదిలా వుండగా, శ్రీరాముడి పట్టాభిషేక వార్త కైకకు చెప్పాలనుకుంటాడు దశరథుడు. కైక ఇంటిలోని అంతఃపురంలోకి ప్రవేశించాడు. పడకటింటిలో కైక కొరకు వెతికితే ఆమె కనబడలేదు. తన ప్రియురాలు ఎక్కడి పోయిందో కదా అని వ్యాకుల పడ్డాడు. కైక కోప గృహం చేరిందని కావలి కత్తె వినయంగా జవాబిస్తుంది. ఆమె కోప గృహం చేరిందన్న వార్త విని ఆయన కూడా కోప గృహానికి వెళ్తాడు. కైక కోపానికి కారణం అడిగాడు. ఇలా దశరథుడు పలుకుతుంటే, అతడిని మరింత దుఃఖపడేట్లు చేద్దామనుకుంది కైక. తన కోరిక తీరుస్తానని ప్రమాణం చేస్తే చెప్తాను అంటుంది. ఆమె ఏది కోరితే అదివ్వడానికి సిద్ధం అంటాడు. ఆమె కోరికేంటో త్వరగా చెప్పమంటాడు.

ప్రమాణం నెపంతో దశరథుడిని కట్టి పడేసిన కైక, లోగడ ఆయన తనకు ఇచ్చిన వరాల విషయాన్ని జ్ఞాపకం చేసుకోమంటుంది. పూర్వం ఒకసారి దేవతలు, రాక్షసులు యుద్ధం చేస్తున్న సందర్భంలో దశరథుడు తనకు ఇచ్చిన రెండు వరాల విషయమూ గుర్తుచేస్తుంది. అవి ఇప్పుడు కావాలని అంటుంది. దశరథుడు, వెనుకా, ముందూ ఆలోచించకుండా, కోరుకొమ్మంటాడు. మొదటి వరంగా, శ్రీరాముడికి దశరథుడు చేస్తున్న పట్టాభిషేక ప్రయత్నం నిలిపి, దానికి బదులుగా, తన కొడుకు భరతుడికి పట్టాభిషేకం చేయమని కోరుతుంది. శ్రీ రామచంద్రుడు నార చీరెలు కట్టుకుని, పద్నాలుగు సంవత్సరాలు దండకారణ్యంలో తిరగాలని, తన మనసులోని కోరికను రెండో వరంగా బయట పెడ్తుంది.

కైకేయి చెప్పిన ములుకుల్లాంటి మాటలను విన్న దశరథుడు, నోట మాట రాక, తత్తర పడి, మూర్ఛపోయాడు కాసేపు. మళ్లీ అతి కష్టం మీద తెలివి తెచ్చుకుని గుండెలు చెదిరేలా దుఃఖించాడు. కైకను పరిపరి విధాలుగా దూషించాడు. రఘు వంశాన్ని నాశనం చేయడానికే వచ్చిందనీ, చెడ్డ పని తలపెట్టిందనీ, ఎలా తాను అత్యంత ప్రియమైన గారాబు కొడుకు శ్రీరామచంద్రుడిని అడవులకు పొమ్మని ఆజ్ఞాపించగలననీ, రాముడిని విడిచి ఒక్క నిమిషం కూడా బతకలేనేననీ, శ్రీరాముడిని విడవడం అంటే ప్రాణాలను విడవడమేననీ, ఆమె కాళ్ల మీద పడి సాష్టాంగ నమస్కారం చేస్తాననీ, వరాలు ఉపసంహరించుకోమనీ అంటాడు. ఆ తరువాత, శ్రీరాముడు అడవులకు పోదగిన వాడు కాదని తెలపడానికి ఆయన గుణగణాలను వర్ణించసాగాడు దశరథుడు. ఇలా అంటూ దశరథుడు కైకను వేడుకోవడం మొదలెట్టాడు.

దశరథుడి మాటలకు కోపం అతిశయించగా, కైక, రాజుతో అనసాగింది. "ఏమోయ్ రాజా! వరాలు కోరుకో, నేను ఇస్తానని ప్రమాణం చేసి, నన్ను నమ్మించి, నేను రెండు వరాలు కోరితే, అవి ఇవ్వడానికి ఏడుస్తున్నావు? ఇది నీకు తగిన పనేనా? వగలమారి ఏడుపులతో నన్ను మోసగిద్దామనుకుంటున్నావా? నేను చేసిన ఉపకారానికి ప్రత్యుపకారంగా నా కోరిక తీరుస్తానని నువ్వు ప్రమాణం చేశావు. మరి, ఇవ్వడానికి ఎందుకు ఏడుస్తున్నావు?". ఆ మాటలు విన్న దశరథుడు కైకతో న్యాయ నిష్టూరాలు ఆడాడు.

ఇంకా ఇలా అంటాడు దశరథుడు. "శ్రీరాముడు అరణ్యానికి పోవడంతో నా మరణం సంభవించడం తథ్యం. నా వెంటనే కౌసల్య మరణిస్తుంది. లక్ష్మణుడు అన్నను వదిలి వుండడు. శ్రీరాముడి వెంట అడవులకు పోతాడు. శత్రుఘ్నుడు భరతుడి వెంట మొదలే వెళ్లిపోయాడు. భర్త, ఇద్దరు కొడుకులు తన వెంట లేకపోవడంతో, సుమిత్ర శోక సముద్రంలో మునిగి ఆమే మరణిస్తుంది. పాపాత్మురాలా! నన్ను, కౌసల్యను, సుమిత్రను, న్యాయ వంతులైన రామలక్ష్మణ శత్రుఘ్నులను, దుఃఖంలో ముంచి నువ్వు మాత్రం సర్వ సుఖాలు అనుభవించు. శ్రీరాముడిని విడిచి వుండడం నీ కొడుకుకు ఇష్టమైతే, అలాంటి అధర్మ చరిత్రుడు విడిచే తిలోదకాలు, తండ్రికి చెందవు. మరణించిన నాకు అతడు ఊర్ధ్వలోక క్రియలు చేయకూడదు. నేను మరణిస్తే, శ్రీరాముడు అడవికి పోతే, నువ్వు విధవవై, నీ ఇష్టం వచ్చినట్లు నీ కొడుకుతో సహా నీవే రాజ్యాన్ని ఏలుకో".

దశరథుడు ఇలా తనలోని కోపాన్ని అణచుకోలేక, అనదల్చుకున్న మాటలన్నీ అని, తిట్టదల్చుకున్న వన్నీ తిట్టి, మళ్లీ మెత్తని మాటలతో కైకను బతిమిలాడాడు.

అప్పుడు భర్తను చూసి కైక ఇలా అన్నది. "ఓ రాజా! నాకు వరాలిస్తానని ప్రమాణం చేశావు కదా! నాకిచ్చిన వరాలను నెరవేర్చు. ధర్మమేంటో ఆలోచించు. చేసిన ప్రమాణం తీర్చడం ధర్మమో, తీర్చకుండుట ధర్మమో ఆలోచించు. ఎందుకు సత్యం తప్పుతావు? ధర్మం విడుస్తావో, శ్రీరాముడిని విడుస్తావో తేల్చుకో. శ్రీరాముడిని ఇవ్వాళే అడవికి పంపు. నువ్వు చేసిన ప్రమాణం తక్షణమే నెరవేర్చకపోతే నీ సాక్షిగా, నీ పాదాల మీద పడి, ప్రాణాలు తీసుకుంటాను". ఇలా తనను బెదిరిస్తున్న కైకను గురించి ఆలోచించసాగాడు దశరథుడు. ఏం చేయాలో తోచక కలత చెందాడు.

ఇదంతా జరిగిన తరువాత, ఇవేమీ తెలియని వశిష్ఠుడు, రాజు వుండే అంతఃపురం సమీపానికి వచ్చాడు. మంత్రి సుమంత్రుడిని చూసి, తన రాక విషయాన్ని వెంటనే దశరథుడికి తెలియచేయమని అడిగాడు వశిష్ఠుడు. మంత్రి సుమంత్రుడు రాజు వద్దకు వెళ్లి, వశిష్ఠుడు ఆయన రాక కొరకై సభా మందిరంలో ఎదురు చూస్తున్నాడనీ, వచ్చి శ్రీరామ పట్టాభిషేక కార్యం నెరవేర్చమనీ అంటాడు.

అప్పుడు కైక మంత్రి సుమంత్రుడితో, రాజుగారు రమ్మంటున్నారని చెప్పి శ్రీరామచంద్రుడిని పిలుచుకురమ్మంటుంది. శ్రీరాముడిని దర్శించుకున్న సుమంత్రుడు కైకేయి దగ్గరున్న దశరథ మహారాజు, ఆయన్ను చూడాలనుకుని, తన దగ్గరకు తీసుకు రమ్మని తనను పంపాడనీ, అక్కడి రాముడిని రమ్మనీ అంటాడు.

లక్ష్మణ సహితంగా బయల్దేరి, తమ్ముడు తోడు రాగా, అంతఃపురంలోకి వెళ్లాడు శ్రీరాముడు. దశరథుడి పరిస్థితి చూసి విచారపడ్డాడు. అప్పుడు రాముడికి కైక తన వరాల సంగతిని చెప్పింది. తండ్రి మాట పాలించదల్చుకుంటే, వాటిని నెరవేర్చమనీ, పద్నాలుగేండ్లు అరణ్యాలలో సంచరించడానికి తక్షణమే బయల్దేరాలనీ, ఆయన అభిషేకానికై తయారు చేయబడిన సామాగ్రి అంతా భరతుడికి ఇవ్వాలనీ చెప్పింది. వెంటనే రాముడు, తక్షణమే తాను జడలు ధరించి, నార వస్త్రాలు కట్టుకుని, భయంకరమైన అడవులకు పోయి, తండ్రి మాటలు యథార్థం చేస్తానన్నాడు.

శ్రీరాముడు కైకతో ఇలా అంటాడు: "అడవులకు పోవడం నాకొక కష్ట కార్యమని నువ్వు అనుకుంటున్నావు కదా? అదెంతటి పని? అది నాకొక లక్ష్యమా? భరతుడు వచ్చే దాకా నేనిక్కడ వుంటానని అనుకోవద్దు. నాకు తండ్రి ఆజ్ఞ ఎలాంటిదో తల్లి ఆజ్ఞ కూడా అలాంటిదే. నువ్వు చెప్పినట్లే పద్నాలుగేండ్లు అడవులకు పోతాను. నీ కోరిక నెరవేరుస్తాను. కాకపోతే, నా తల్లికి ఈ విషయం చెప్పి, ఆమె ఆజ్ఞ తీసుకుని, నా భార్యకు చెప్పేంతవరకు ఓపిక పట్టు".

ఇక ఆ తరువాత తల్లి కౌసల్య ఆజ్ఞ, సమ్మతి తీసుకుని సీతా లక్ష్మణ సమేతంగా పద్నాలుగేళ్ల వనవాసానికి పోయాడు శ్రీరాముడు.

ధర్మం కన్న దైవం మిన్న

రామాయణం రసరమ్యం. అందులో అవసరం లేందేదీ లేదు. ప్రతిదీ తెలుసుకోవాల్సిన విషయమే. అయోధ్య కాండలో అలాంటిదే ఒక సంఘటన శ్రీరాముడిని వనవాసానికి వెళ్లమని కైక కోరడం. శ్రీరాముడుని అడవులకు పంపాలని, ఆయన స్థానంలో తన కొడుకు భరతుడికి పట్టాభిషేకం చేయాలని కైక దశరథుడిని కోరడం, ఆ విషయాన్ని ఆయన మాటగా కైకే స్వయంగా రాముడుకి తెలియచేయడం, రాముడు తండ్రి ఆజ్ఞ పాలించడానికి అడవులకు పోవడానికి సిద్ధపడి తల్లి కౌసల్య అనుమతి, ఆశీర్వాదం కొరకు ఆమె దగ్గరకు పోవడం, ఆ సమయంలో కౌసల్య, తమ్ముడు లక్ష్మణుడు కైకను దూషించి రాముడు అడవులకు పోవద్దని అభ్యంతర పెట్టడం నేపథ్యంలో ధర్మం, అధర్మం, నీతి, న్యాయం లాంటి విషయాలెన్నో లక్ష్మణుడికి వివరిస్తాడు రాముడు. ధర్మాన్ని మించిన దైవం వుందని, కైక మోసం చేసిందని ఆమె మీద కోప్పడ కూడదని, అందులో ఆమె తప్పేమీ లేదని అంటాడు రాముడు. తనకు పట్టాభిషేకం చేయాలని ప్రయత్నం చేసిన వాడు దశరథుడు కాదని, విఘ్నం కలిగించింది కైక కాదని, తాను అడవుల పాలవడానికి తన దోషం ఏదీ లేదని, ఇవన్నీ కేవలం దైవ కృత్యాలేనని అంటాడు.

విధి చేష్ట ఎలా వుంటుందో సోదాహరణంగా తెలియచేశాడు రాముడు. ఇంకా ఇలా అంటాడు: ‘‘ఇంత దూరాలోచన దైవ ప్రేరణ వల్లనే కలిగింది. అలా కాకపోతే తనకు ఏ అపరాధం చేయని నన్ను నిష్కారణంగా కష్టపెట్టాలని కైక మనసుకు కలగడం సాధ్యమా? మన ముగ్గురు తల్లులలో, నా మీద ఒకరికి ఎక్కువ, మరొకరికి తక్కువ ప్రేమ అని చెప్పడానికి, వారిలో కొంచెమైనా తారతమ్యం కనిపించడం నేను చూడలేదు. ఇదే కైకకు నిన్నటి దాకా తన కొడుకుపై ఎక్కువ ప్రేమ కాని, నామీద తక్కువ ప్రేమ కానీ, విరోధ భావం కానీ లేదు. ఇదంతా ఇవ్వాళే కలగడానికి కారణం చెప్పగలమా? ఉన్నట్లుండి ఇంతటి ప్రేమ, విరోధంగా మారడానికి కారణం దైవం కాకుండా మరెవరు? తన కన్న కొడుకు కంటే నాపై ఎక్కువ ప్రేమగల కైక, ఏ అపరాధం చేయని నన్ను, నిష్కారణంగా కఠినోక్తులు మాట్లాడి, ఊళ్లో కూడా వుండనీయకుండా, అడవులకు పొమ్మని అనడం అంటే, ఇదంతా విధి చేష్టకాకుండా ఇతరుల చేష్ట ఎలా

అవుతుంది? ఇతరులకు ఇది సాధ్యం కూడా కాదు''.

రాముడు ఇంకా ఇలా అంటాడు:''ఆమె స్వభావ రీత్యా దుష్టురాలు. ఆ దుష్ట స్వభావమే ఇప్పుడామెను ప్రేరేపించింది. ఇక దైవం ఏమి చేసిందంటావా? సహజంగా ఆమె దుష్టురాలు కాదు. ఆమె పుట్టడం తోనే ఆమెతో గుణాలకు తోడు గౌరవం కూడా పుట్టింది. కులం కొలది గుణం అంటారు. ఆమె గొప్ప వంశంలో రాజకుమారిగా పుట్టింది. గొప్ప జాతిలో, గొప్ప వంశంలో పుట్టి, గొప్పవారి సాంగత్యంలో పెరిగిన దానికి నీచగుణం సహజమని ఎలా చెప్పగలం? సాలగ్రామాల గనుల్లో గులకరాళ్లు కూడా వుంటాయికదా? సముద్రంలో విషం పుట్టలేదా? అలా ఐతే బాల్యం నుంచే ఆమె నీచురాలై వుండాలి. అలా కాకుండా, దానానికి, దయకు స్థానంగా కీర్తి సంపాదించింది. సహజంగా నీచురాలైతే ఆమెకు ఈ కీర్తి కలిగేదా? తనతో సమానమైన సవతుల మీద ద్వేషం పెంచుకుంది. అది నీచమే కదా? ఆమె ద్వేషించింది సపత్నీత్వాన్ని కాని సవతులను కాదు. వారు సవతులు కాకపోతే వారిని ద్వేషించేది కాదు. అందరు ఆడవారిని ద్వేషించలేదే? తమ యోగ క్షేమాలకు హాని కలిగిస్తారేమోనని అనుమానం కలిగిన తోటి రాజులను అణచివేసే ప్రయత్నాన్ని పట్టాభిషిక్తులైన రాజులు కూడా చేయడం లేదా? ఒకరికె ఎంతైనా దానం చేయగల కైక పరుల సొత్తును ఎందుకు ఆశించింది? ఎంతో దయా గుణం కల ఆమె ఇలాంటి క్రూరమైన పనికి ఎందుకు సాహసించింది? ఎందుకు భర్తను ఎదిరించింది? ప్రీతిపాత్రుడనైన నన్ను ఎందుకు పనికిమాలిన, బాధాకరమైన మాటలను అనగలిగింది? దైవం ఆవేశించకుంటే ఇలా చేయగలిగేదా? సహజమైతే ఇన్నాళ్లు ఎందుకు చేయలేదు? కాబట్టి ఇంత మహిమగలది, ఊహించలేనిది, అసాధ్యమైన ప్రభావం కలదైన దైవం ఎలాంటివారికైనా అందలేనిదే. దానికి ఎదురులేదు. ఆమెకు ఆ దుర్బుద్ధి పుట్టడానికి, నాకు దారిద్ర్యం రావడానికి దైవమే కారణం. ఆ దైవమే ఇంత పని చేసింది''.

''దైవం వుందనడానికి ప్రమాణం ఏంటి? దైవాన్ని ఎదిరించి ఇలాంటివి జరగకుండా మనం పురుషకారం చేయలేమా? ఒక పని మనం చేస్తున్నప్పుడు దైవం అనేదొకటున్నదని, అదేంటో చేస్తున్నదని, మనకు తెలియదు. ఫలితం కలిగేటప్పుడు మాత్రం ఆ దైవం కనపడి అదెలా చేయదల్చుకున్నదో, అలానే చేస్తుంది. ఫలితంలో మాత్రం కనిపించి, వేరే విధంగా కనిపించక, ఆ కారణం వల్ల దానిని జయించలేక సతమతమయ్యే మనం దైవంతో పోరాడగలమా? అది ఏ రూపంలో, ఎలా, ఏం చేస్తున్నదో మనకు తెలియనప్పుడు దానితో పోరాటం చేయగలమా? ఎలా చేస్తాం? ఫలానా సమయంలో, ఫలానా కార్యం సాధించేందుకు, ఫలానా సాధనాలను (దైవం) సిద్ధం చేసుకుని వుందని మనకు ముందే తెలుస్తే కదా, మనం ప్రతీకారం చేయగలం? కార్యస్వరూపంలో కనిపించకుండా, ఫలితం స్వరూపంలో కనిపించేదే దైవం. కాబట్టి దైవం వుందనడానికి అనుమానమే ప్రమాణం. బుద్ధి బలంతో మాత్రమే దానిని ఊహించగలం. కారణం లేకుండా కార్యం జరగదు. నిష్కారణం అంటే, కారణం మనకు తెలియదని అర్థమే కాని, కారణం లేదని అర్థం కాదు. కాబట్టి, మన సంతోషానికి, సౌఖ్యానికి, వ్యసనానికి, శాంతికి, రోషానికి, లాభనష్టాలకు, జననమరణాలకు, మరెన్నో ఇతర ఫలితాలకు....వేటినైతే కారణం లేకుండా కలుగుతున్నాయని అనుకుంటామో, వాటన్నిటికీ మూలకారణం దైవమే సుమా! ఇది తప్పదయ్యా తప్పదు!''.

''పామరులమైన మన సంగతలా వుంచితే, ఘోరమైన తపస్సు చేసి, ఎంతో జ్ఞానాన్ని, మహిమను సంపాదించి, నిత్యనియమవ్రతులై, శాంతులై, నిష్కాములై, అడవిలో ఒక మూల నివసించే మునులు కూడా దైవాన్ని ఎదిరించి ఏమీ చేయలేరు. ఇలాంటి వారిలో కొందరు హటాత్తుగా కామానికి, కోపానికి లోబడి, దీర్ఘకాలంగా అభ్యసిస్తున్న నియమనిష్ఠలను నీటిపాలుచేసి, మర్యాద తప్పి, భ్రష్టులై పోవడం దైవ చేష్ట కాదా? పురుష ప్రయత్నంలో ఏ లోపం వుంది? విశ్వామిత్రుడంతటి వాడే నిమిషంలో కామానికి, క్రోధానికి వశుడై చెడి పోయాడో విన్నాం కదా? శివుడు కూడా అలానే అయ్యాడు కదా? ఎప్పుడు కూడా ఇదిలా జరుగవచ్చని ఊహించని పనులు తటాలున వున్నట్లుండి అయిపోవడం, అందరూ తప్పక అవుతుందనుకున్న కార్యం విఘ్నం కావడం లాంటివన్నీ దైవ చేష్టలే! ఇది సత్యం. ఈ విధంగా సప్రమాణంగా, నిస్సందేహంగా నిశ్చయించుకుని, ఇతరుల ఉపదేశాల వలనే కాకుండా, నాలో నేనే కార్యాచరణ ఆలోచించాను. ఇది దైవ కృత్యమని, దీనిలో మన దోషం లేదని, కైక నిమిత్త మాత్రమేనని, ఆమె దైవానికి సాధనం అయిందని, సాధించేది దైవం మాత్రమేనని, నాకు అర్థమైంది. దానివల్ల నాకు వ్యసనం, బాధ కలగలేదు. లక్ష్మి పోయింది, దారిద్ర్యం వచ్చింది అని దుఃఖించవద్దు. నా అభిప్రాయంలో, లెక్కింపనలవి కాని ఈ రాజ భోగాలు, అరణ్యవాసం, రెండూ ధర్మ కార్యాలే. రెండూ ఒకటిగానే అనిపిస్తున్నది. ఒక విధంగా ఆలోచిస్తే, వనవాసమే సుఖమనిపిస్తున్నది. ఎందుకంటే, రాజభోగం సుఖరూపక దుఃఖం; వనవాసం దుఃఖరూపక సుఖం. రాజభోగం ఇప్పటికి సుఖంగా కనిపించినప్పటికీ, నిర్వహణలో దుఃఖంతో కూడుకున్నదవుతుంది. వనవాసం నిశ్చింతం. నిరుపద్రవం. పుణ్యఫలదం. కాబట్టి, తాత్కాలికంగా దుఃఖంగా తోచినప్పటికీ, పోనుపోను సుఖమిస్తుంది. సుఖాన్ని, దుఃఖాన్ని ఇచ్చేవారెవరూ లేరు. ఎవరో ఇతరులు అవి కలిగిస్తారని మనం అనుకుంటాం. నేనే ఈ పని చేశాననడం వృధాభిమానం. ప్రతి మనిషి తాని చేసిన కర్మకు కట్టుబడి వున్నాడు. కైకలో స్వతస్సిద్ధమైన దోషం లేదు. పిశాచం పట్టిన వారు, సన్నిపాత జ్వరంతో బాధ పడేవారు, దూషించినప్పుడు, అది రోగబలమంటామే కాని వ్యక్తిని తప్పు పట్టం కదా? అలానే, దైవం కైక నోటి నుండి ఇలాంటి కీడు మాటలు పలికించింది. కైక మీద కోప్పడి ప్రయోజనం లేదు''.

శ్రీరాముడు చెప్పినదంతా విన్న లక్ష్మణుడు ఆయనతో విభేదించి ఇలా అంటాడు: ''కైకేయీ దశరథుల ఆలోచనను నువ్వు దైవ తంత్రంగా పోల్చావు. అలాంటి దైవం నాకిష్టం లేదు. కుట్రలు ప్రేరేపించు దైవం ఎలా దైవం అవుతుంది? ఎలా పూజ్యనీయమవుతుంది? బలం లేనివారు, అల్ప తేజస్సు కలవారు దైవ బలం అంటారు. ఎందుకు? వాళ్లకు కార్యసాధనకు కావాల్సిన బలం, తెలివితేటలు లేకపోవడం వల్ల, నింద తమ మీద వేసుకోకుండా దైవం మీద పెట్తారు. ఇక బలవంతులు, కీర్తిని కోరేవారు, దైవం అనేదొకటున్నదని కలలో కూడా అనుకోరు. పురుషకారంతో స్వకార్యాన్ని సాధించి కీర్తిని పొందుతారు. అలాంటివారిని దైవం ఏం చేస్తుంది? బలం గల గొప్పవాడు పౌరుష బలంతో దైవాన్ని దగ్గరకు రాకుండా తరిమికొట్టి, చివరకు, దైవం వల్ల ఏ బాధ పడకుండా, సమర్థతతో తన పని తాను చేసుకుంటాడు. నువ్వు దైవ బలం ఎక్కువ అంటున్నావు. నేను పురుష బలం ఎక్కువ అంటున్నాను''.

కైకేయిని దూషించవద్దని లక్ష్మణుడితో రాముడంటాడు. రాజ్యాభిషేక విఘ్నం ఆమె చేసింది కాదని, దైవకృతం అని, ఆమె నిమిత్త మాత్రమే అని, ఆమె మీద కోప పడవద్దని, దైవమే మేలు, కీలుకు కారణం

అని, ఆమెకు ఆ బుద్ధి కలిగించింది దైవమే అని, అలా కాకుంటే తన మీద ఎంతో ప్రేమ కలిగిన ఆమెకు నిమిషాల్లో విషమ బుద్ధి ఎందుకు కలిగిందని, దైవం అప్రతిహతమని, అలాంటి దైవంతో ఎవరు పోరగలరని, రాముడు సమాధానం చెప్పాడు. బదులుగా లక్ష్మణుడు, రాముడు చెప్పింది సరైంది కాదని, దైవం పరాధీనమైందని, అది స్వతంత్రించి ఏ పనీ చేయలేదని, అలాంటి దాన్ని నమ్ముకుని, దైవం ఇస్తుందని పురుష ప్రయత్నం చేయకుండా వుండడం సరికాదని అంటాడు. దైవం కంటే పౌరుషమే శ్రేష్టమని లక్ష్మణుడు వాదించాడు.

మహాభారతంలో చెప్పినట్లు, లోకం దైవాన్ని ఆలంబనంగా తీసుకుని పురుషకారంలో ఉదాసీనులు కాకూడదు. మనుష్యుడు చేయాల్సిన కర్మం చేయకుండా దైవమే ఇస్తాడని భావించకూడదు. ఇలాంటి మాటలు చూస్తుంటే, దైవం కంటే పౌరుషం బలమని అనిపిస్తుంది. రాముడు దైవమే బలిష్టమని అన్నాడు. దైవ–పౌరుషాలకు పరస్పర విరోధం కనిపిస్తున్నది. ఇదెలా అంటే....పురుషకారం లేకుండా దైవం ఏ కార్యం చేయలేదు...అలానే, దైవ సహాయం లేకుండా ఏ కార్యం ఫలించదు. కాబట్టి ఏదైనా ఫలితం కావాలంటే రెండూ అవసరమే! ఇదిలా వుంటే...రామచంద్రమూర్తి ఎందుకు పురుషకారానికి అనమతి ఇవ్వలేదు? ఆయన అభిప్రాయం ప్రకారం...పురుష ప్రయత్నం వ్యర్థం...దైవమే కార్యసాదకం. నిజంగా అలాంటి అభిప్రాయమే ఆయనకుంటే, సీతకొరకై పురుషకారం చేసి వుండేవాడు కాదు. దైవమే సీతను తెచ్చి ఇస్తుందని వూరకే వుండేవాడు. ధర్మ విరుద్ధ పురుషకారం శ్రీరాముడికి సమ్మతం కాదు. లక్ష్మణుడి పురుషకారానికి ప్రథమ కబళం దశరథుడు. రాజ్యం కోసం తండ్రిని పీడించిన వాడవుతాడు. అందుకే రాముడొప్పుకోలేదు. రాముడు పురుషకార విరోధి కాదు. అలానే, అన్న అరణ్యాలకు పోయి కష్టపడడం ఇష్టం లేక, ఎలాగైనా అయోధ్యలోనే ఆయన వుండేట్లు చేయడానికి సద్భావంతో లక్ష్మణుడు రాముడితో వాదించాడే కాని ఆయన దైవ విరోధి కాదు. అలాంటప్పుడు లక్ష్మణ వాదన సాధువాదమా? దుర్వాదమా? అని విచారించాలి.

రామాయణంలో సీతారామలక్ష్మణుల చరిత్ర వల్ల, వారి మాటల వల్ల, బోధ పడేదేంటంటే... పౌరుషం కంటే దైవమే ప్రబలం కాబట్టి, దైవాన్నే సేవించాలనే విషయం. భారతంలో కూడా ఇదే చెప్పబడింది. కాబట్టి మనుష్యులు దైవాన్ని ధిక్కరించి పౌరుషాన్నే ఆశ్రయించక దైవాన్ని ఆశ్రయించి, యథాశక్తి, యథాశాస్త్రం ప్రకారం, నిష్కాములై స్వకర్మలు చేయాలి. రామాయణంలో మనం నేర్చుకోవాల్సిన ముఖ్య విషయం ఇదే. భగవద్గీతోపదేశం కూడా ఇదే. రాముడు చెప్పిన ప్రతి మాట అందరికీ అన్ని వేళలా వర్తిస్తుందనడంలో సందేహం లేదేమో!

◆❖◆

కౌసల్య, దశరథుల అంగీకారంతో శ్రీరామ వనవాసం

రామాయణంలో శ్రీరాముడు వనవాసానికి వెళ్లే అంశం ముఖ్యమైనది. అప్పుడు, దశరథుడి సమక్షంలో ఆయన పక్షాన కైక అజ్ఞానుసారం అడవులకు పోవడానికి సిద్ధపడ్డ శ్రీరాముడు, తండ్రికి ప్రదక్షిణ నమస్కారాలు చేశాడు. కైకకూ నమస్కారం చేశాడు. అంతఃపురాన్ని వదిలి బయటకొచ్చి, తల్లి ఇంటికి పోయాడు. లక్ష్మణుడు తనలో పెల్లుబుకుతున్న కోపాన్ని, దుఃఖాన్ని తన మనసులోనే అణచిపెట్టుకున్నాడు. తల్లి, కౌసల్యను చూసిన రాముడు, అయిష్టమైన వార్త ఎలా చెప్పాలి అని సిగ్గుతో తలవంచుకున్నాడు. చేతులు జోడించి చెప్ప సాగాడు.

"అమ్మా! దండకారణ్యంలో నేను దర్భాసనం మీద కూర్చునే సమయం దగ్గర పడుతున్నది. రాజుగారు భరతుడికి యౌవరాజ్యాన్ని ఇచ్చాడు. నన్ను పద్నాలుగేండ్లు దండకారణ్యంలో ముని వేషంలో తిరగమని ఆదేశించాడు" అని రాముడు చెప్పగానే కౌసల్య పక్కనే వున్న లక్ష్మణుడు వినేట్లు ఇలా అంది.

"నాయనా! రామా! నువ్వు అడవులకు పోతే, నాకు మరణించడం తప్ప వేరే మార్గం లేదు కదా! ముందు ముందు నేను కైకకు పరిచారికురాలు కావాల్సిందేనా?. ఇలాంటి పరిస్థితిలో, ఎలా బతికుండాలి రామా? నా దుఃఖానికి అంతమెప్పుడో నువ్వే చెప్పు. పద్నాలుగేండ్లు నిన్ను చూడకుండా ఎలా ప్రాణాలు బిగపట్టుకుని వుందగలను?"

ఏడుస్తున్న కౌసల్యను చూసి లక్ష్మణుడు ఇలా అన్నాడు. "ఎవతో, ఒక ఆడుది, నోటికొచ్చినట్లు వదరుతే, దానికి విలువ ఇచ్చి, ఏ సుఖాలకు నోచుకోకుండా, రాజ భోగాలన్నీ వదిలిపెట్టి, పౌరుషం విడిచి, అడవికి పోవడం అనేది, నాకు ఏ మాత్రం సమ్మతం కాదు. శ్రీరాముడు అడవులకు పోయేంత నేరమేం చేశాడో నాకు తెలియదు". ఆ తరువాత శ్రీరాముడితో ఇలా అన్నాడు.

"ఈ విషయాలన్నీ రెండోవాడి చెవిన పడక ముందే, ఈ భూమినంతా నీ మహా శాసనానికి లోబడేట్లు, నా సహాయంతో శీఘ్రంగా చెయ్యి. నీకెవరు అడ్డం వస్తారో చూద్దాం. తప్పు చేసినవారిని తండ్రైనా,

ఆచార్యుడైనా దండించాల్సిందే. ఇది ధర్మ శాస్త్రం. ఎవరి సలహాతో, వారి మాటలను నమ్మి, ఏ నెపంతో ఈ రాజ్య భారాన్ని నీపైన మోపకుండా, కైకకు ఇవ్వాలనుకున్నాడు? ఆయనకున్న ప్రధాన బలం మనమిద్దరం. మనల్ని కాదనుకుని, కైక కుమారుడిని ఎలా రాజు చేయగలడు? అది సాధ్యమా?"

జవాబుగా, లక్ష్మణుడిని సముదాయిస్తూ రాముడిలా అన్నాడు. "లక్ష్మణా! అజ్ఞానంతో, పుత్ర వ్యామోహంతో తల్లి దుఃఖిస్తున్నదని నాకు తెలియదా? నువ్వు కూడా ఆమె లాగా మాట్లాడ వచ్చా? లక్ష్మణా! తండ్రి మాట కాని, తల్లి మాట కాని, బ్రాహ్మణ వాక్యం కాని, ముందు చేస్తానని చెప్పి, మాట తప్పడం ధర్మాత్ముల లక్షణం కాదు. నేను వారి ఇష్ట ప్రకారం చేస్తానని మాట కూడా ఇచ్చాను. ప్రతిజ్ఞ కూడా చేసాను. అది తప్పను కదా?". తరువాత, శ్రీరామచంద్రమూర్తి, తల్లి కౌసల్య వైపు చూసి, "అమ్మా! నేను అడవులకు పోవడానికి, అక్కడే వుండడానికి వెంటనే అనుమతించు. నన్ను దీవించి, ప్రయాణానికి పోయ్యేవారికి చెప్పాల్సిన వీడ్కోలు మాటలు చెప్పు. ఉత్సాహంగా నన్ను అడవులకు పంపు. పద్నాలుగేండ్లు అడవుల్లో వుండి, ప్రతిజ్ఞ తీర్చి తిరిగి నగరానికి వస్తాను" అంటాడు.

ధర్మాన్ని మించిన దైవం వున్నాడని అంటూ, తమ్ముడు లక్ష్మణుడితో, శ్రీరాముడు ఆ వివరాలను చెప్పాడిలా: "నాకు పట్టాభిషేకం చేయాలని ప్రయత్నం చేసిన వాడు దశరథుడు కాదు. దానికి విఘ్నం కలిగించింది కైక కాదు. నేను అడవుల పాలవడానికి నా దోషం ఏదీ లేదు. ఇవన్నీ కేవలం దైవ కృత్యాలే! మరెవరి పనీ కాదు. కాబట్టి ఎందుకు బాధ పడ్తావు? ఇంత దూరాలోచన దైవ ప్రేరణ వల్లనే కలిగింది. కైకకు నా మీద వున్న ప్రేమ విరోధంగా మారడానికి కారణం దైవం కాకుండా మరెవరో చెప్పు? ఇదంతా విధి చేష్టకాకుండా ఇతరుల చేష్ట ఎలా అవుతుంది? ఇతరులకు ఇది సాధ్యం కూడా కాదు".

శ్రీరామచంద్రుడు చెప్పినదాన్ని లక్ష్మణుడు అంగీకరించలేదు. కోపంతో ఇలా అన్నాడు అన్నతో. "అన్నా! రామచంద్రా! నువ్వేదో దైవాన్ని గొప్పదిగా భ్రమపడుతున్నావు. నువ్వే చెయ్యాలనుకుంటే, చేయదల్చుకుంటే, నీకు అసాధ్యమైన పని ఏదన్నా వుందా? అన్నింటిలో సమర్థుడవైనప్పటికీ, ఏ సామర్థ్యం లేని దైవాన్ని ఎంతో పెద్ద చేసి చెప్పావు. ఇది సమర్థుడి లక్షణమా? దేనికీ కొరగాని దైవాన్ని ధీరుడవు, సమర్థుడవు, చిత్త విభ్రాంతి లేని వాడివైన నువ్వు పామరుడిలాగా పొగుడుతున్నావు. ఇది నీకు తగునా?"

ఈ విధంగా చెప్తున్న లక్ష్మణుడిని చూసి, శ్రీరాముడు జనకుడి ఆజ్ఞ ప్రకారం నడుచుకోవడమే ఉత్తమమని అంటాడు. అదే సరైన మార్గం అనీ, తండ్రి జీవించి వుండగా ఆయన చెప్పినట్లు చేయాలనీ మరీ మరీ చెప్పాడు. శ్రీరాముడు వనవాసం చేయడానికి నిశ్చయించుకున్నాడని తెలిసి, ఆయనను పోవద్దని చెప్పడం వృధా అని భావించి, తనను కూడా అడవికి తీసుకొని పొమ్మని కౌసల్య అడుగుతుంది రాముడిని. ఇలా అంటున్న తల్లితో రాముడు భర్తను విడిచి తన వెంట రావడం సరైంది కాదని చెప్పాడు.

కౌసల్య, కొడుకు చెప్పిన మాటలే ధర్మమని అనుకుంది. కొడుకును చూసి కౌసల్య, "నాయనా! నీ మనసును మార్చలేకపోతున్నాను. కాబట్టి జాగ్రత్తగా పోయి రా. తండ్రి కొరకు నువ్వు పూనిన వ్రతం పూర్తి చేసి, కృతకృత్యుడవై, తిరిగి రాగానే నిన్ను చూసి సుఖపడతాను. అప్పటి దాకా ప్రాణాలు పోకుండా బిగబట్టుకుంటాను. ఇలా పోయి అలా వచ్చే లోపున పద్నాలుగేళ్లు తొందరగా గడిచి పోయేట్లు సుఖంగా

తిరిగి రా. నీకు శుభం కలగాలి” అని అంటుంది.

అంతఃపురంలో వున్న సీతకు శ్రీరాముడి వనవాస వార్త తెలియదింకా అప్పటికి. ఇంటిలోకి ప్రవేశించిన శ్రీరాముడు సీత ముఖం చూడగానే సిగ్గుతో తలవంచుకున్నాడు. సీతను చూసి దుఃఖాన్ని ఆపుకోలేని రాముడు బహిరంగంగానే శోకించాడు. శ్రీరాముడి ముఖం చూసిన సీతకు శోకంతో గుండె చెదిరిపోయింది. సీతతో శ్రీరాముడు, తనను అడవులకు పొమ్మని తండ్రిగారు ఆజ్ఞాపించారని చెప్పాడు. అడవుల మధ్య సుఖంగా విహారం చేయబోయే ముందర సీతకు చెప్పి ఆమె సమ్మతి తీసుకుని పోతే క్షేమం అని అనుకుని వచ్చానని అంటాడు.

భర్తకు ఇలా జవాబిచ్చింది సీత. “రాజు నిన్ను అడవికి పొమ్మంటే నన్ను కూడా పొమ్మనే అర్థం. నీలో నేను సగం. నీ సగం దేహం ఇంట్లో పెట్టి, మిగిలిన సగం దేహంతో అడవికి పొమ్మని నీకు రాజు చెప్పాడా? ఏ ఏ దశల్లో ఏఏ విధంగా భర్తృ సేవ ఎలా చేయాల్నో, ఆ పద్దతులేంటో, చిన్న తనంలోనే నా తల్లిదండ్రులు నాకు నేర్పారు. కాబట్టి నేనేం చేయాలో నాకు తెల్సు. నువ్వు నన్ను వదిలితే, నేను ప్రాణం వదులుతాను”. ఆమె మాటలు విని, సీతను ఓదార్చుతూ, మిక్కిలి ప్రేమతో కౌగలించుకుని, ఆమెను బాధపడవద్దని, తనతో తీసుకొని పోతానని చెప్పాడు శ్రీరాముడు.

శ్రీ సీతారాముల మధ్య జరిగిన సంభాషణను, శ్రీరాముడి వెంట వచ్చి సమీపంలోనే వున్న లక్ష్మణుడు ఆసాంతం విన్నాడు. కట్టుకున్న భార్య సీతనే వనవాసానికి, కష్టం మీద, శ్రీరాముడు అంగీకరించడాన్ని అర్థం చేసుకున్నాడు. లక్ష్మణుడు కూడా అన్న వెంట పోవాలని నిశ్చయించుకున్నాడు. తన అభిప్రాయాన్ని లక్ష్మణుడు ఇలా చెప్పాడు శ్రీరాముడికి: “చేతిలో విల్లు ధరించి, గొప్ప మృగాలతో నిండిన అడవుల్లో అపాయం లేని తోవల గుండా, నేను ముందు పోతుంటే, నా వెనుక మీరిరువురూ, ఎటువంటి ప్రయాస లేకుండా వన వినోదం చూసుకుంటూ రావచ్చు. సంచరించవచ్చు. మహానుభావా! నువ్వు లేని స్థలం వైకుంఠమైనా నాకు వద్దు”.

లక్ష్మణుడు, చేస్తున్న ప్రార్థనను అర్థం చేసుకున్న శ్రీరాముడు, తమ్ముడితో తన మాటలుగా ఇలా చెప్పాడు. “లక్ష్మణా! నిన్ను నిష్కారణంగా ఇక్కడ వదలి పోతానా? నీలో ఏదో దోషముందని నిన్నిక్కడ వదలి పోవడం లేదు. నా వెంట నువ్వు వచ్చావనుకో! ఆ తరువాత నీ తల్లిని, నా తల్లిని ఏ లోపం లేకుండా భరించేవారెవరు? ఇక్కడే వుండి తల్లిని చూసుకో. నా మాట మీద గౌరవం వుంచి, నీతిగా అన్న మాట మీర కూడదని అనుకో. నా కోసం నా మాట విను. నువ్వు, నేను, ఇద్దరం లేకపోతే, మన తల్లులు ఎలా సుఖపడతారు?”

శ్రీరాముడు చెప్పిన మాటలకు లక్ష్మణుడు జవబిచ్చాడిలా: “అన్నా! నువ్వు నాకు తండ్రితో సమానం. అడవుల్లో నీకవసరమైన కందమూలాలు నేను సేకరిస్తాను. నేను రాకపోతే ఇవన్నీ నువ్వే చేసుకోవాలి కదా? ఆ శ్రమ తప్పిస్తాను. నీకు అలసట వస్తే విసురుతా. నీ పాద సేవ చేస్తా. అడవిలో దొరికే పండ్లు, దుంపలు, ఇంకా అలాంటివి తెచ్చిస్తా. నువ్వు సీత వినోదంగా వుండొచ్చు. కొండ శిఖరాలలో మీరిద్దరూ విహరిస్తుంటే లేదా నిదురిస్తుంటే విల్లంబులు ధరించి మీకు కాపలాగా వుంటాను”. లక్ష్మణుడి మనస్సు అర్థం చేసుకున్న రాముడు, ఆయన తనతో పాటుగా వనవాసానికి రావడానికి సమ్మతించాడు. వరుణుడు

తమకు లోగడ ఇచ్చిన రెండు కటారులు, అక్షయ బాణ తూణీరాలు, భేదించనలవికాని కవచాలు, అడవుల్లో రాక్షస వధ చేయడానికి, వేట కొరకు కావాలని వాటిని తెమ్మంటాడు.

లక్ష్మణుడు తన హితులకందరికీ తమ వనవాస యాత్రా విషయమంతా చెప్పి, శ్రీరాముడు చెప్పిన ఆయుధాలను తీసుకొనివచ్చి ఆయనకు చూపాడు. శ్రీరాముడందుకు సంతోషించాడు. శ్రీరాముడు, తనకున్న ధనం, ఇతర పదార్థాలు, లక్ష్మణుడితో కలిసి, బ్రాహ్మణులకు, ఇతర తపస్వులకు, తమను ఆరాధించేవారికి, సేవకులకు, ఎప్పుడు ఇచ్చేదానికంటే ఎక్కువగా ఇచ్చి సంతోషపెడ్దామని అంటాడు లక్ష్మణుడితో. వసిష్ఠుడి కుమారుడైన సుయజ్ఞుడిని, ఇతర పెద్దలను పిలిపించమటాడు.

శ్రీరాముడి ఆజ్ఞ ప్రకారం, లక్ష్మణుడు సుయజ్ఞుడింటికి పోయాడు. శ్రీరాముడు చేయబూనిన కార్యం గురించి వివరించి, తనతో అక్కడకు రమ్మంటాడు. సుయజ్ఞుడు శ్రీరాముడి గృహానికి వచ్చాడు. సీతా సమేతంగా శ్రీరాముడెదురేగి, మొక్కి, ఆయనకు తన వస్తువులన్నీ ఇచ్చాడు. సంతోషంతో సీతారామలక్ష్మణులను దీవించి పోయాడు. దానాలిచ్చి అందరినీ తృప్తి పరిచి, రామలక్ష్మణులు సీతాసమేతంగా తండ్రిని చూడడానికి బయల్దేరారు. తండ్రిని చూడడానికి పోతున్న రామలక్ష్మణులను, వారి వెంట వున్న సీతాదేవిని చూసి దుఃఖపడే పురజనులు కైకేయీ దశరథులను నిందించారు.

తండ్రిని సమీపించిన శ్రీరాముడు దశరథుడితో ఇలా అన్నాడు: "సీత, లక్ష్మణుడు కూడా నాతో అరణ్యాలకు వస్తున్నారు. నేనెంత వద్దని వారించినా, వదలక, నా వెంట రావడానికి ఇష్టమున్నందున, ఇక్కడ వుండలేమన్నారు. కాబట్టి వాళ్లు రావడానికి అంగీకరించాను. నాకు, సీతకు, లక్ష్మణుడికి, ప్రజలకు త్వరగా అనుమతి ఇవ్వు".

శ్రీరాముడిని చూస్తూ దశరథుడు ఇలా అంటాడు. "శ్రీరామా! అడవులకు పోయి శీఘ్రంగా తిరిగి రా. అడవులకు పోకుండా నిన్ను ఆపుచేయడం నాకు శక్యం కాదు". శ్రీరాముడు తనను వదలి పోతున్నాడనే బాధతో, దుఃఖంతో, నిద్రాహారాలు మాని ఏడుస్తుండడం వల్ల కలిగిన శరీర తాపంతో, గుండె చెదరిన దశరథుడు, కొడుకును కౌగలించుకుని, శవంలాగా కాళ్లు చేతులాడించకుండా నేల మీద పడిపోయాడు.

అప్పుడు స్వయంగా కైకే నార చీరెలు తెచ్చి, "రామా! వీటిని కట్టుకో" అని పురజనులందరి ముందర శ్రీరాముడికిచ్చింది. ఇలా ఎప్పుడైతే నార చీరెలు తన చేతికి వచ్చాయో, వెంటనే, శ్రీరాముడు తాను ధరించిన సన్న వస్త్రాలను తీసేసి, పక్కన పెట్టి, సంతోషంగా నార చీరెలు కట్టుకున్నాడు. ఆయన కట్టుకోగానే, తండ్రి చూస్తుండగానే, లక్ష్మణుడు కూడా కట్టుకున్నాడు. శ్రీరామలక్ష్మణులు నార వస్త్రాలు కట్టుకున్న తరువాత, సీతను కూడా కట్టుకొమ్మని, ఆమె చేతికి కైక నార చీరెలను ఇచ్చింది. సీత నార వస్త్రాలను పట్టుచీరెలలాగా భావించి కట్టుకుంటుంటే చూసిన వారందరూ కఠినమైన పదజాలంతో దశరథుడిని ఛీ కొట్టారు. ఏడ్వసాగారు. ఆ తరువాత శ్రీరాముడు తన తల్లి కౌసల్య దగ్గర, ఇతర మాతల దగ్గర శలవు తీసుకున్నాడు. సుమంత్రుడు తోలుతున్న రథం ఎక్కి అడవులకు బయల్దేరి వెళ్లిపోయారు సీతారామలక్ష్మణులు.

◆❖◆

నిలువెత్తు నిస్వార్థం

(దశరథుడి మృతి, అడవికి భరతుడి ప్రయాణం)

శ్రీరాముడు వనవాసానికి వెళ్లిన ఆరవనాటి అర్థరాత్రి దశరథుడు చింతిస్తూ ప్రాణాలు విడిచాడు. రాజు మరణ వార్త చెప్పడానికి పరిచారకులు కౌసల్య దగ్గరకు పోయారు. కౌసల్య మూర్ఛపోయింది. తక్కిన స్త్రీలు, కైక, సుమిత్ర దుఃఖ పడ్డారు. బంధువులందరూ రాచపీనుగు చుట్టూ గుమిగూడి ఏడవసాగారు. కైకను కౌసల్యతో పాటు అందరూ దూషించారు.

ఇలా విలపిస్తుండగా, రాజకీయ వ్యవహారాలు తెలిసినవారు వచ్చి, కౌసల్యను ఓదార్చి, రాజు దేహాన్ని నూనె కాగులో వుంచి, దశరథుడి కొడుకులు ఒక్కరైనా లేకపోవడంతో దహనం చేయడానికి బదులు ఇంట్లోనే భద్రపరిచారు. ఆ తరువాత చేయాల్సిన పనుల గురించి ఆలోచన చేశారు. దశరథుడి భార్యలందరూ దుఃఖంలో మునిగిపోయారు.

ఆ తరువాత శ్రీరాముడు అడవులకు పోయిన ఎనిమిదవ రోజు ఉదయం రాజును నిర్ణయించే అధికారం కల బ్రాహ్మణ పెద్దలు గౌతముడు, మౌద్గల్యుడు, కాత్యాయనుడు, మార్కండేయుడు, జాబాలి, కాశ్యపుడు, వామదేవుడు, మంత్రులతో సభ తీరారు. వీరంతా వసిష్ట మహర్షిని చూసి "మునీంద్రా! రాజు మరణించడం వల్ల, రాజకుమారులెవరూ దగ్గర లేకపోవడం వల్ల, గొప్పవారైన రాజకుమారులలో ఎవరినైనా ఒకడిని పురానికి రాజుగా చేయాలి. అలా కాకపోతే సంకటంలో పడిపోతాం" అన్నారు.

రాజపురోహితులు, మంత్రులు చెప్పిన మాటలు విన్న వశిష్ఠుడు, భరతుడికేకదా రాజు రాజ్యాన్ని ఇచ్చింది కాబట్టి, మేనమామ ఇంట్లో వున్న భరతుడిని దూతలను పంపి రమ్మని చెప్దాం అని అంటాడు. వశిష్ఠుడి మాటలకు వారందరూ సరే-సరే అన్నారు. అదే రాజనియమం అన్నారు. అదే బాగుంటుందని అందరూ అంగీకరించిన తరువాత, సిద్ధార్థుడు, విజయుడు, జయంతుడు, అశోకుడు, నందనుడు అనే పేర్లుగల దూతలను పిలిచి భరతుడి దగ్గరకు పోయి, వశిష్ఠుడి ఆజ్ఞగా, ఏదో ముఖ్యమైన పని ఉన్నందున ఎంత మాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే బయల్దేరి రమ్మన్నారని మాత్రం చెప్పండి అని అన్నాడు. శ్రీరాముడు అరణ్యానికి పోయాడని కాని, తండ్రి మరణించాడని కాని, భరతుడితో చెప్పవద్దు అని కూడా

చెప్పాడు. వారలాగే వేగంగా పరుగెత్తే గుర్రాలను ఎక్కి ప్రయాణమై పోయి, కేకయ రాజు పట్టణమైన గిరివ్రజపురానికి చేరారు. దూతలు రాత్రంతా ఒక చోట గడిపి భరతుడి దర్శనం కొరకు ఎదురుచూశారు.

ఏ రాత్రైయితే దూతలు భరతుడున్న నగరం ప్రవేశించారో అదే రోజు రాత్రి భరతుడు తెల్లవారు ఝామున ఒక చెడ్డ కల కని భయపడ్డాడు. ఆ కలలో, మాసిన దేహంతో, తల విరియబోసుకుని, కొండమీద నుండి తాను పేడమడుగులోకి దూకినట్లు, అందులో కప్పగంతులు పెట్టుకుంటూ, నవ్వుతూ, దోసెట్లో నూనె తీసుకుని నూనె అన్నం తిని తాగినట్లు, తలకిందికి కాళ్లు పెట్టుకుని పైనుండి నూనె దేహానికి రాసుకున్నట్లు, నూనెలో మునిగునట్లు, సముద్రాలు ఎండినట్లు, చంద్రుడు నేలమీద పడ్డట్లు, గాడాంధకారం లోకమంతా వ్యాపించినట్లు, పట్టపు ఏనుగు దంతం విరిగినట్లు కల వచ్చింది. నిప్పు చల్లగా అయిందనీ, భూమి పగుళ్లు పారిందనీ, చెట్లు ఎండిపోయాయనీ, కొండలు పొగరాజుకున్నాయనీ, నల్ల ఇనుప పీటమీద నల్ల కాంతిగల వస్త్రం ధరించి, దశరథుడు ఆయన్ను నల్లటి, పచ్చటి స్త్రీలు పరిహసిస్తుంటే, నవ్వుతుంటే, ఎర్రటి పూదండలు ధరించి గాడిదలు కట్టిన రథం మీద దక్షిణ దిక్కుగా పోయినట్లు కలగన్నానని స్నేహితులతో అన్నాడు.

"ఎర్రటి గుడ్డ కట్టుకున్న ఒక స్త్రీ రాజును చూసి నవ్వుతున్నది. వికారపు ముఖం కల ఒక రాక్షసి నా తండ్రిని బలాత్కారంగా లాగుతున్నది. ఇలాంటి భయంకరమైన కలగన్నాను. ఈ కల ఫలితం ఏమంటారు? దశరథుడో, రాముడో, లక్ష్మణుడో, నేనో మరణించడం కలుగుతుంది. ఇంతకు ముందు ఎన్నడూ రాని ఇలాంటి పీడకల నన్ను నానా విధాలుగా పీడిస్తున్నందువల్ల, నా జనకుడికి ఏదో కీడు కలిగిందని అనుమానిస్తున్నాను" అని అన్నాడు భరతుడు.

రామాయణంలో దశరథ, భరత, త్రిజటలు స్వప్నాలు కన్నట్లు చెప్పడం జరిగింది. ముగ్గురి కలలు నిజమయ్యాయి. ఈ విషయం శాస్త్ర, ఇతిహాసాలలో కూడా వివరంగా చెప్పడం జరిగింది. కాబట్టి స్వప్నాలు నిజమవుతాయే కాని అబద్ధం కాదు.

ఈ విధంగా తన కల గురించి స్నేహితులకు వివరిస్తూ, పిచ్చివాడిలాగా తిరుగుతూ, తండ్రిని స్మరించుకుంటూ, చింతిస్తుండగా, రాజ దూతలు వచ్చారు ఆయన దగ్గరకు. అయోధ్యకు ప్రయాణానికి సిద్ధం కమ్మని వసిష్ట మహర్షి ఆజ్ఞగా చెప్పారు. సమ్మతించిన భరతుడు అయోధ్యకు ప్రయాణమై పోయాడు. మొత్తం ఏడు రాత్రులు ప్రయాణం చేశాడాయన. ఎనిమిదవ దినం ఉదయాన్నే దూరం నుండి అయోధ్యను చూసి సారథితో ఇలా అన్నాడు.

"చూశావా సారథీ! అయోధ్య ఎలా వుందో? నెత్తురులేనివాడి ముఖంలా, తెల్లగా పాలిపోయి, దూరంనుండి చూస్తుంటే, ఈ అయోధ్య విషయంలో నాకు సంతోషం కలగడం లేదు. కారణం ఏమై వుంటుంది? మనుష్య సంచారం లేని అడవిలాగా కనిపిస్తున్నది నాకు అయోధ్య. ఇవన్నీ చూస్తుంటే మనసుకు ఏదో సందేహం కలుగుతున్నది. శకునాలు మంచిగా లేవు. హృదయం కలత చెందుతున్నది. ఇది నిశ్చయం. నా సమీప బంధువులెవరికో, ఏదో, అశుభం కలిగింది" అని అంటూ భరతుడు నగరంలో ప్రవేశించి సారథితో మరల ఇలా అన్నాడు.

"సారథీ! పెద్దలు దశరథుడు, శ్రీరాముడు వుండగా, వసిష్ఠుడు నన్నెందుకు పిలిపించాలి? తొందరగా రమ్మని వసిష్ఠుడు పిలిచినప్పుడు దానికేదో కారణం వుండాలికదా? ఇవన్నీ చూస్తుంటే ఏదో కీడు జరిగిందన్న అనుమానం కలుగుతున్నది. రాజు మరణిస్తే ఏం జరుగుతుందో అవన్నీ ఇప్పుడీ వూళ్లో కనిపిస్తున్నాయి. ఇవన్నీ చూస్తుంటే పరితాపం కలుగుతున్నది". ఆ తరువాత కలతచెందిన మనసుతో తండ్రి వుండే మేడవైపు పోయాడు భరతుడు.

తండ్రి ఎప్పుడూ వుండే మేడకు పోయి అక్కడ ఆయన లేకుంటే, తల్లి కైకేయి ఇంటికి పోయి, ఆమె పాదాలకు నమస్కరించాడు. "ఎందుకు రాజబంధువులు, రాజునకు సంబంధించిన ఇతరులు దుఃఖపడుతున్నారు? రాజెప్పుడూ నీ ఇల్లు విడిచిపోడుకదా? ఇప్పుడెందుకు లేడు?" అని అన్నాడు.

తాను చెప్పబోయే వార్త భరతుడికి సంతోషం కలిగిస్తుందన్న ఆశతో కైక ఇలా అంది. "నాయనా! నీ తండ్రి సామాన్యుడా? భూమ్మీద పుట్టినవారు ఏ తోవన పోతారో ఆ దారిలోనే ఆయనా పోయాడు". అని తండ్రి మరణవార్తను భరతుడికి చెప్పింది. ఆ వార్త విన్న భరతుడు ఆర్తుడై "హా! తండ్రీ" అని నేలమీద చచ్చిపోయినవాడిలాగా పడిపోయాడు. కైక కొడుకును తన చేతులతో పట్టి మెల్లగా లేపింది. తండ్రి మరణించే ముందర చివరిగా తనకు చెప్పమని చెప్పిన హితవాక్యాలు వినాలని వుంది" అని అన్నాడు. కైక ఉన్నదున్నట్లు ఇలా చెప్పింది భరతుడికి.

"రామా! సీతా! లక్ష్మణా! అని మిక్కిలి దుఃఖంతో ఏడుస్తూ, ఏడుస్తూ, రాజు స్వర్గానికి పోయాడు. నారచీరెలు కట్టుకుని శ్రీరాముడు సీతతో, లక్ష్మణుడితో దండకారణ్యానికి పోయాడు. కారణం ఏమిటంటావా? శ్రీరాముడిని అడవులకు పంపమని, నిన్ను రాజుగా చేయమని, నేనేరా నీ తండ్రిని కోరాను. తాను చెప్పిన మాటపై నిలిచి నీ తండ్రి తమ్మునితో, సీతతో, శ్రీరాముడిని అడవులకు పంపాడు. అలా పంపిన తరువాత తన ప్రియకుమారుడిని చూడకుండా వుండలేక దుఃఖంతో చనిపోయాడు. పురోహితులు నీ రాకకొరకు ఎదురు చూస్తున్నారు. ధైర్యం తెచ్చుకుని పట్టాభిషేకానికి సిద్ధంకా. రాజునకు కావాల్సిన సంస్కారాలు ముగియగానే బ్రాహ్మణులు నీకు అభిషేకం చేస్తారు".

కైక ఇలా భరతుడితో చెప్పగానే, తల్లితో, "నా తండ్రిని, తండ్రితో సమానమైన రఘువంశ శ్రేష్ఠుడైన శ్రీరామచంద్రమూర్తిని విడనాడి ఏడిచే ఈ అనాథకు, నిర్భాగ్యుడికి ఐశ్వర్యం ఎందుకు? రాజ్యం ఎందుకు? ఓసీ క్రూరురాలా! రాజును చంపావు. సాదుగుణాలున్న శ్రీరామచంద్రుడిని అడవుల పాలు చేశావు. పుండుమీద కారంలాగా తీవ్ర దుఃఖంలో వున్న నాకు మరింత బాధ కలిగించావు. ఓసీ దుష్టురాలా! మా వంశాన్ని నాశనం చేయడానికి నువ్వెక్కడనుండి దాపరించావే? సమస్త లోకాలను నాశనం చేసే కాళరాత్రిలాగా రాజును చంపావుకదా? బుద్ధిలేని దానా! అజ్ఞానంతో, ధనకాంక్షతో, నీ వంశ సుఖాలన్నీ నాశనం చేశావుకదా? నిన్ను పెళ్లి చేసుకున్న కారణాన రాజు దిక్కులేనివాడిలాగా చచ్చిపోయాడు కదా! ఓసీ పాపాత్మురాలా! నా తండ్రిని చంపినట్లే నన్ను చంపాలనుకున్నావు. నా తండ్రిలాగా నీ మాయ మాటలకు లోబడను. నేను నీ ఇష్టానికి వ్యతిరేకంగా చేస్తాను. ఆ శ్రీరాముడిని పట్టణానికి మరల వచ్చేట్లు చేస్తాను. అగ్నిప్రభ కల ఆయన్నే రాజుగా చేసి స్థిరమైన అంతఃకరణతో ఆయనకు దాసుడనై, చత్రచామరాదుల సేవ చేస్తూ, ఆయనకు సంతోషం కలిగిస్తాను. ఇది నా

స్వరూపస్వభావం. నా స్వరూపం వల్లే నేను ఆయనకు దాసుడిని".

"శ్రీరామచంద్రమూర్తి రాజైతే కౌసల్య రాజమాత అవుతుందనీ, గౌరవించబడుతుందనీ, సవతికి ఇలాంటి గౌరవం రాకుండా నీకు రావాలని ఆలోచన చేశావు. నువ్వు ఏడుస్తుండగానే శ్రీరాముడిని రాజును చేస్తాను. కౌసల్యకే రాజమాత అనే గౌరవం కలిగిస్తాను. శ్రీరాముడెలా మునివేషంతో అడవులకు పోయాడో, అలాగే నేను, నువ్వు చూస్తుండగానే మునివేషంతో అడవులకు పోతాను. ప్రజలు ఏడుస్తున్నది శ్రీరాముడికి రాజ్యం రాలేదని కాదు, శ్రీరాముడు అన్యాయంగా అరణ్యాలపాలైనాడని ఏడుస్తున్నారు. లోకులెలా ఏడ్చారో అలానే నువ్వూ ఏడవాలి. శ్రీరాముడిని అడవులకు పంపిన పాపం పోవాలంటే ఆయన్ను మరల తీసుకువచ్చి రాజును చేయడమే. ఆయనను భూమికి రాజును చేసి నేను పుణ్యుడనవుతాను".

ఇలా కైకతో మాట్లాడిన భరతుడు, శత్రుఘ్నుడితో కలిసి, కౌసల్య ఇంటికి పోయాడు. వినయంగా చేతులు ముకుళించి కౌసల్యతో ఇలా అన్నాడు: "తల్లీ! ఇక్కడి పట్టాభిషేక విషయంకాని, అది నాతల్లి విఘ్నం చేసిన సంగతికాని, శ్రీరాముడిని అడవులకు పంపిన పాపపు చరిత్రకాని, నాకు తెలియదు. అన్నను అడవుల పాలు చేసేంతటి పాపాత్ముడనా?". ఇది భరతుడు కేకయపురం విడిచిన ఎనిమిదవనాటి సంగతి.

ఇక ఆతరువాత, ఆచార్యులు, ఋత్విక్కులు, పురోహితులు జరగాల్సిన పనులు శాస్త్రప్రకారం జరిపించడానికి సన్నాహాలు చేశారు. గంధం చెక్కలతో పేర్చిన చితిమీద రాజు దేహాన్ని వుంచారు. ఋత్విజులు మంత్రాలు చెప్పారు. భరతుడు అగ్ని మండేట్లు చేశాడు. రాజస్త్రీలైన కౌసల్య, ఇతరులు, పల్లకెక్కి పురాన్ని విడిచి భరతుడున్న చోటుకు పోయి, శవానికి ప్రదక్షిణగా, అప్రదక్షిణగా తిరిగారు. తరువాత పల్లకీలలో సరయూ నదీతీరం చేరి, స్నానం చేసి, పదిరోజులు సూతకంతో నేలమీద పడుకుని గడిపారు. పదకొండో రోజున భరతుడు అశౌచాన్ని ముగించాడు. పన్నెండో రోజున పుణ్యాహవచనం లాంటి కర్మలన్నీ జరిపాడు. తరువాత పదమూడోరోజున రాజకుమారుడు అస్తికల సంచయనం చేసి, వెక్కి-వెక్కి ఏడుస్తూ మూర్ఛపోయి నేలమీద పడ్డాడు. ఇలా పడ్డ భరతుడిని పక్కనున్న వారు లేపారు.

అప్పుడు, జ్ఞాని అయిన మౌని వశిష్ఠుడు భరతుడితో, "భరతా! పదమూడవ రోజు జరుగుతున్నది, వ్యర్థంగా కాలం గడపడం తగదు అనగానే, ఆ కార్యక్రమం అయిన తరువాత, పదునాల్గవ నాటి ఉదయాన, సింహాసనానికి రాజును చేయడానికి అధికారం వున్న రాజకర్తలు భరతుడితో, రాజ్యాన్నంతా తీసుకుని పాలించమని కోరారు. అన్న శ్రీరాముడిని రాజును చేసి, ఆయనకు బదులుగా, తానే అడవుల్లో పద్నాలుగేళ్లు వుంటాననీ, ప్రయాణ సన్నాహాలు చేయమనీ, అన్న శ్రీరాముడిని నగరానికి తెస్తాననీ, అభిషేక వస్తువులను అడవికే తెమ్మనీ, అరణ్యంలోనే ఆయనకు పట్టాభిషేకం చేద్దాం అనీ, కాబట్టి ఆయన వున్న చోటుకు పోవడానికి దారి ఏర్పాటుచేయండనీ అంటూ అడవికి ప్రయాణమయ్యాడు భరతుడు.

రాజధర్మం అంటే?

(భరతుడికి రాజధర్మం బోధించిన శ్రీరాముడు)

శ్రీరాముడి వనవాసం ఆరంభంలో, ఒకనాడు చిత్రకూటాన్ని, మందాకినీ నదిని గురించి సీతకు చెప్తున్నప్పుడు ఆకాశం బద్దలయ్యే ధ్వని, దూళి ఆయనకు వినిపించింది, కనిపించింది. ఆ ధ్వనికి కారణం కనుక్కోమని లక్ష్మణుడికి చెప్పాడు. కారణం కనుక్కున్న లక్ష్మణుడు, అలా సైన్యంతో వచ్చేది భరతుడని చెప్పి ఆయన్ను అనుమానించాడు. లక్ష్మణుడిని సరిదిద్దాడు అన్న శ్రీరాముడు.

ఇంతలో, అన్నను చూడాలన్న కోరికతో వస్తున్న భరతుడికి పర్ణశాలలో కూర్చున్న శ్రీరాముడు కనిపించాడు. దర్భాసనం మీద కూర్చున్న శ్రీరాముడిని చూసి పరుగెత్తుకుంటూ సమీపంలోకి పోయాడు భరతుడు. తనను చూడగానే దుఃఖిస్తున్న భరతశత్రుఘ్నులను పట్టుకుని ఓదార్చి, వారి కన్నీళ్లను తుడిచాడు. కౌగలించుకున్నాడు. వారి మనస్తాపం తొలగించాడు. భరతుడిని కుశల ప్రశ్నలు వేశాడు. తండ్రి ఆజ్ఞప్రకారం నువ్వొచ్చావా? అని అడిగి ఆయన బతికున్నాడా అన్న సందేహాన్ని వెలిబుచ్చాడు. తండ్రి పోయిన వార్త విని ఎంతగానో దుఃఖించాడు. అంత్యక్రియలు చేశాడు. ఇక ఆతరువాత రాజ ధర్మాన్ని గురించి అనేక విషయాలు చెప్పాడు.

రాజ ధర్మాన్ని వివరిస్తూ ఇలా అడిగాడు: "దేవతలను యజ్ఞాలతో తృప్తి కలిగిస్తున్నావు కదా? శ్రాద్ధాదుల వల్ల పితృ దేవతలను తృప్తి పరుస్తున్నావా? ప్రజలను వాళ్లు చెప్పినట్లు విని సంతోషపరుస్తున్నావా? గురువులకు శుశ్రూష చేసి తృప్తి పరుస్తున్నావా? తండ్రితో సమానమైనవారికి, పెద్దలకు నమస్కారాలు చేసి తృప్తి పరుస్తున్నావా? విద్వాంసులను, ఆయుర్వేదం తెలిసినవారిని, బ్రాహ్మణులను, ధనం ఇచ్చి సంతోష పరుస్తున్నావా? నీ మంత్రులందరూ శౌర్యవంతులేకదా? నీతిశాస్త్రం చక్కగా చదివారా? బుద్ధిలో నీతో సమానమైనవారా? ఇంద్రియ నిగ్రహం వున్నవారేనా? ముఖం చూసి ఎదుటివారి అభిప్రాయం చెప్పగలరా? శాస్త్రాన్ని తెలిసిన మంత్రులు పని చేయడానికి ముందే నీ ఆలోచనలు బహిర్గతం చేయరు కదా?"

"రహస్యాలను ఇతరులతో ఆలోచిస్తావా నువ్వు? ఒకడితోనే పంచుకుంటే వాడికి ఎవరనుకూలంగా

వుంటే వారికి చెప్తుతాడు, పదిమందితో పంచుకుంటే, వాళ్లలో ఒకరు కాకున్నా మరొకరు వేరేవారికి చెప్పొచ్చు. భిన్నాభిప్రాయాలవారైతే ఒకరితో ఒకరు కలహించుకుంటారు. నీ ఆలోచనలు ఏవిధంగా వున్నా, పనికి ముందే ఎవరికీ చెప్పవుకదా? నీతిశాస్త్రం ప్రకారం కార్యం చెడిపోయే విధంగా ఆలస్యం చేయవుకదా? నువ్వు ఆలోచించి నిర్ణయించిన కార్యక్రమం కావడానికి ముందే నీ సామంతరాజులకు ఆ విషయం తెలియదు కదా? నువ్వు, నీ మంత్రులు చేసే ఆలోచనలు ఇతరులు తెలుసుకోలేరు కదా? వేయిమంది మూర్ఖులకంటే కార్యం ఆలోచించి చేయగలవాడు ఒక్కడు చాలు. అలాంటివారున్నారా నీ దగ్గర?"

"నీ మీద నిజమైన ప్రేమగలవారిని, అనేక పరీక్షల్లో నెగ్గినవారిని, ఆదినుండి వంశపరంపరగా సేవ చేస్తున్న వారిని, వాక్కు, మనసు, కర్మ మూడూ సత్యంగానే వుండేవారిని, ఏవిధమైన మాలిన్యం లేనివారిని, శ్రేష్ఠ కార్యాలలో శ్రేష్ఠులైన వారినే మంత్రులుగా నియమిస్తున్నావు కదా? భరతా! నీ దగ్గర, నిర్మలమైన మనసు లేనివారు, చెడునీతిని బోధించేవారు, ఇతరులమీద పిర్యాదులు చేసేవారు, రాజభయం లేనివారు, ధనాశ వున్నవారు లేరుకదా? నీ సేనానాయకుడు సుగుణాల వాడే కదా? శూరుడేనా? ధైర్యం వున్నవాడేనా? త్రికరణశుద్ధి కలవాడేనా? రాజంటే ప్రేమ వున్నవాడేనా? నీ సేనలోని ముఖ్యులు బలవంతులేకదా? పరాక్రమవంతులేకదా? యుద్ధంలో సమర్దులేనా?"

"ఇతర రాజుల విషయంలో 18 మంది తీర్థులను నియమించావా? 18 మంది తీర్థులంటే: మంత్రి (Minister), ఆలోచ చెప్పేవాడు; పురోహితుడు (Private Secretary); యువరాజు (Prince); సేనాపతి (Commander-in-Chief), సేనలకన్నిటికీ అధిపతి; దౌవారికుడు లేదా ద్వారపాలకుడు (Gate keeper), అంతఃపురంలాంటి వాటిదగ్గర వున్న ద్వారపాలకుల్లో మేటి; అంతర్వంశికుడు లేదా అంతఃపుర కార్యనిర్వాహకుడు (Palace Controller); కారాగారాధిపతి (Superintendent of Jails); అర్థసంచయికుడు (Revenue officer Collector), ధనం సంపాదించేవాడు; కార్యనియోజకుడు, రాజాజ్ఞాలను వెల్లడించేవాడు; ప్రాడ్వివాకుడు (Judge), న్యాయ స్థానంలో న్యాయ విచారకర్త; సేనానాయకుడు, భటులకు జీతభత్యాలు ఇచ్చేవాడు; నగరాధ్యక్షుడు, రాత్రిపూట నగర ద్వార ప్రాకారాలలో ప్రహరీ తిరుగుతూ రక్షించేవాడు; కర్మాంతికుడు (Accountant General), పనులు చక్కబరుస్తున్న సైన్యేతర జీతగాళ్ళకు జీతాలు పంచిపెట్టేవాడు; సభ్యుడు, ప్రతిరోజూ సభను అలంకరించడం, రాజు, మంత్రి, ఇతర అధికారుల ఆసనాలు ఏర్పాటు చేయడం, సభలోకి అనుమతి ఉన్నవారిని రానీయడం, లేనివారిని నిరోధించడం, సభలో శబ్దం రాకుండా చూడడం, సభా రక్షకులను నియమించడం చేసేవాడు; ధర్మాధ్యక్షుడు (Munsiff), ఇరుపక్షాల వాదనలు విని ధర్మశాస్త్రం ప్రకారం పరిష్కారం చెప్పేవాడు; దండపాణి లేదా దండపాలుడు (Magistrate), జారులను, చోరులను ఇతర రకాల అపరాధం చేసిన వారిని దండించేవాడు; దుర్గపాలుడు, దుర్గాలను కాపాడేవారి మీద పై అధికారి; రాష్ట్రాంతపాలుడు, రాష్ట్రాన్ని పరరాజులు ఆక్రమించకుండా పొలిమేరలను ఎల్లప్పుడూ కాపాడేవారి మీద అధికారి. వీరిలో మొదటి ముగ్గురు, అంటే, మంత్రి, పురోహితుడు, యువరాజు స్వపక్షం వారు కాగా, మిగతావారు పరపక్షం వారు. వీరిమీద వేగులుండాల్సిన అవసరం లేదు. కారణం ఈ ముగ్గురూ ఎప్పుడూ రాజు సమక్షం లోనే వుంటారు కాబట్టి.

"బ్రాహ్మణులు కదా అని నాస్తికవాదులైన చార్వాకులను, గౌరవించడం లేదుకదా? వాళ్లను చేరదీస్తే ఈ లోకానికి, పరలోకానికి వాళ్లు కీడు చేస్తారు. వారి మనసులు యదార్థానికి విరుద్ధంగా విపరీతార్థాలు చెప్తాయి. వాళ్లు పండితులు కాకపోయినా తమను తాము పండితులమని అనుకుని సర్వజ్ఞత్వం తమ మీద వేసుకుని, విపరీత బుద్ధులు నేర్పుతూ, తమను నమ్మినవారిని ఉభయ లోకాల్లో చెడగొడతారు. సత్సంప్రదాయపరంగా చదవాల్సినవి చదవకుండా, ధర్మశాస్త్రాలను విపరీత బుద్ధితో వక్రభాష్యం చెపుతూ, నిస్సారమైన, నిరర్థకమైన తర్క, యుక్తి వాదాలు చేసుకుంటూ వుండే చార్వాకులతో స్నేహం కీడు కలిగిస్తుంది".

"భూమి దున్ని జీవించేవారి విషయంలో, పశువులను మేపి జీవించేవారి విషయంలో, వారు కష్ట జీవులైనందున వారికి కావాల్సిన పదార్థాలకు సంబంధించి సహాయం చేస్తున్నావా? ప్రజలు తమ ఆహార పదార్థాల విషయంలో వీరిమీదే ఆధారపడ్డారు. అలాగే వాణిజ్యంలో జీవిస్తూ నిన్ను ఆశ్రయించేవారికి శుభమే కదా? కృషి, గోరక్షణ, వాణిజ్యం చేసేవారికి రాజు సహాయం అత్యంత అవశ్యం కాబట్టి, వారికి కావలసిన సహాయం చేస్తూ, వారి బాధలు తీరుస్తున్నావా? రాజైన వాడు సమస్త వర్ణాశ్రమ ధర్మాలవారిని శాస్త్రప్రకారం రక్షించాలి. అలా చేస్తున్నావు కదా? స్త్రీలను గౌరవిస్తున్నావు కదా? ఏకాంతంలో కూడా నువ్వు వారికి రహస్యాలు చెప్పడం లేదు కదా? ఎందుకంటే వాళ్లు చపల చిత్తులు కాబట్టి రహస్యాలను దాచలేరు".

"ప్రతిరోజూ సభలో ఉదయాన ప్రజలకు దర్శనం ఇస్తున్నావు కదా? కొన్ని రోజులు సభకు రాకపోతే నీకేదో రోగం వచ్చిందని ప్రజలు సందేహిస్తారు. సేవకులు ఇష్టానుసారంగా వచ్చిపోతుంటే అతిపరిచయం వల్ల నిన్ను చులకనగా చూస్తారు. అందుకే వాళ్లను అసలే చూడకుండా వుండకూడదు. అలాగే, ఎప్పుడో ఒకసారి చూసి వారి స్థితిగతులు విచారించాలి. నీ జలదుర్గాలు, గిరిదుర్గాలు, వనదుర్గాలు అన్నీ ధనధాన్యాలతో, జలాలతో, ఆయుధాలతో కూడి వున్నాయికదా? వీరులైన భటులు, విలుకాళ్లు రక్షిస్తున్నారు కదా? పనులు చేయడానికి శిల్పులున్నారు కదా?"

"వ్యయం కంటే మించి ఆదాయం వుంది కదా? ఆదాయంకంటే తక్కువగానే వ్యయం చేస్తున్నావు కదా? అయోగ్యులకు అనవసరంగా ధన సహాయం చేయడం (అపాత్రదానం) లేదు కదా? బ్రాహ్మణులకు, స్నేహితులకు కావాల్సిన ధనం ఇస్తున్నావా? దేవతా కార్యాలు, పితృ కార్యాలు, చేసేవారికి ధన సహాయం చేస్తున్నావా? అన్ని కార్యాలు మనమే చేయలేం కాబట్టి పుణ్యకార్యాలు చేసేవారికి సహాయం చేస్తే మనకూ పుణ్యం వస్తుంది. ధనవంతుడికి, పేదవాడికి తగాదా వచ్చినప్పుడు నీ మంత్రులు కుటిలబుద్ధితో ధనికుడికి మద్దతివ్వకుండా జాగ్రత్త పడాలి. నేరం చేసినవాడిని వదిలిపెట్టడం వల్ల కలిగే పాపం కంటే నేరం చేయనివాడిని దండించడం వల్ల కలిగే పాపం ఎక్కువ అని తెలుసా?"

"గురువులకు, వృద్ధులకు, తాపసులకు, బ్రాహ్మణులకు, నాలుగు వీధులు కలిసే ప్రదేశంలో వున్న దేవతల్లాంటి చెట్లకు, అతిథులకు, మోక్షలాభం సిద్ధించినవారికి, దేవతలకు, భక్తితో, నిర్మల మనసుతో నమస్కారం చేస్తున్నావా? ధనం కోసం ధర్మాన్ని వ్యర్థం చేయడం లేదుకదా? ధనం సంపాదించాల్సిన సమయంలో ధర్మ విచారం చేస్తూ కాలయాపన చేయవద్దు. రాత్రి అనుభవించాల్సిన కామాన్ని పగలు

చేయడం తప్పు. ధర్మ, అర్థ, కామాలను ఏవేళకు ఏది చేయాలో అదే చేయాలి. ధనం మీది ఆశతో లోభివై ధర్మకార్యాలు చేయడం మానలేదుకదా? సుఖాబిలాషతో ధర్మ, అర్థాలను ధ్వంసం చేయడం లేదుకదా?"

"ధర్మ పద్ధతిన రాజ్యపాలన చేస్తున్నావుకదా? అసత్యం పలకడం, దేవుడు లేదనడం, పని చేయకుండా ఎప్పుడూ ఆలోచనే చేస్తూ కాలం గడపడం, కోపం రానివారి మీద కోపం తెచ్చుకోకూడని సమయంలో కోపగించుకోవడం, బుద్ధిపొరపాటు, బుద్ధిమాంద్యం, శ్రేయస్కరమైన జ్ఞానుల దర్శనం మనం పోయి చేసుకోక పోయినా వారొచ్చినప్పుడు కూడా చేయకపోవడం, పంచేంద్రియాలకు లోబడి వుండడం, రాచకార్యాలను ఒక్కడే ఆలోచన చేయడం, నీచులను గౌరవించడం లేదా ఒకే సమయంలో అనేకమంది శత్రువులమీద దండెత్తడం, నిర్ణయించబడిన పని చేయక పోవడం, అనర్థజ్ఞులతో కలిసి ఆలోచన చేయడం, ఆలోచనలను దాచుకోకుండా బయట పెట్టడం, శుభకార్యాలలో నిర్లక్ష్య భావం, ఈ పద్నాలుగు దోషాలు రాజుకు వుండకూడదు. ఇవి లేకుండా రాజ్యం చేస్తున్నావు కదా?"

"దశవర్గం, పంచవర్గం, చతుర్వర్గం, అష్టవర్గం, త్రివర్గం, విద్యాత్రయం అనే వాటి లక్షణాలు తెల్సుకుని, వాటిలో ఏవి అవసరమో, ఏవి కావో ఆలోచించి, అలాగే ఆచరిస్తున్నావా? ఇంద్రియాలను చక్కగా వశపర్చుకున్నావా? దైవ వ్యసనాల గురించి, మానుష్య వ్యసనాల గురించి, కృత్యం గురించి, ప్రకృతి, మండలం, వింశతి వర్గాలు, షడ్గుణాలలో ముఖ్యమైన సంధి, విగ్రహం, యాత్ర, దండం గురించి, ఆలోచించి వాటిని విడిచి, గ్రహించాల్సిన వాటిని గ్రహిస్తున్నావా?"

"ఆలోచించి చేయాల్సిన పనులను ముగ్గురికి తక్కువ కాకుండా, నలుగురికి ఎక్కువ కాకుండా, అది కూడా మొదట ఒక్కొక్కరితో వేర్వేరుగా, తర్వాత అందరిని కలిపి ఒక్కటిగా, ఆలోచిస్తున్నావా? ఆలోచించి వారి అభిప్రాయాలను అర్థం చేసుకుంటున్నావా? ఆ తరువాత వారు చెప్పినదాంట్లో మంచి–చెడు నువ్వు స్వతంత్రంగా ఆలోచన చేస్తున్నావా? ఇద్దరితోనే కలిసి ఆలోచన చేస్తే, వారిరువురు వేరేవేరే అభిప్రాయం చెప్తే ఏం చేయాలనే సందిగ్ధం కలగొచ్చు. ముగ్గురైతే ఇద్దరు ఒక విధంగా, ఒకరు వేరే విధంగా చెప్తే ఎక్కువమంది అభిప్రాయం ప్రకారం నిర్ణయం తీసుకోవచ్చు. అప్పుడూ సందేహం వస్తే నాలుగో వ్యక్తి అభిప్రాయం తీసుకోవచ్చు. అంతకన్నా ఎక్కువైతే, ఐకమత్యం కుదరక వారిలో వారు కలహించుకునే ప్రమాదం వుంది. రహస్యం చెడిపోవచ్చు. రహస్య విషయాలు ఎక్కువ మందితో ఆలోచన చేయరాదు. కొందరు సలహా అడిగినప్పుడు, వారితో ఆలోచన చేసినప్పుడు, ఒంటరిగా ఒక విధంగా, నలుగురిలో మరో విధంగా చెప్తారు. అలాంటి వారి సలహాలు నమ్మకూడదు. ఎవరెన్ని చెప్పినా విని స్వయంగా ఆలోచించి తన మనసును సమాధానపర్చుకుని సరైన విధంగా నిర్ణయం తీసుకోవాలి"

"నేను నీకు చెప్పినవన్నీ ధర్మార్థ కామాలతో కూడినవి. ఇహపరలోక సుఖం కలిగించేవి. మోక్షార్థికి కావాల్సిన దీర్ఘాయువు ఇచ్చేవి. ధర్మార్థ కామాలలో ధర్మానికే ప్రాధాన్యం ఇస్తున్నావుకదా? రాజైనవాడు ధర్మ మార్గాన నడుచుకుంటూ ప్రజలను పాలిస్తే మరణించిన తరువాత స్వర్గానికి పోయి అక్కడ దివ్యభోగాలను అనుభవిస్తాడు. ఎలాంటి సందర్భంలోనైనా, ప్రాణాపాయ స్థితిలో కూడా ధర్మాన్ని విడువకూడదు. ధర్మం శాశ్వతం".

◆❖◆

జాబాలి ఆస్తికుడే!

భగవంతుడు అవ్యాకృతాత్ముడై రూపం, నామం, క్రియ లేనివాడై కొంతకాలం వుంటాడు. ఆ తరువాత మళ్లీ సృష్టిని సంకల్పిస్తాడు. ఆ సంకల్ప శక్తివల్ల ప్రకృతి క్షోభిల్లుతుంది. అప్పుడు మళ్లీ ఒకదానిలో నుండి ఇంకొకటి పుట్టాయి. ఈ విధంగా తమస్సు, ప్రకృతి, మహత్తు, అహంకారం, ఆకాశతన్మాత్రం, అగ్ని, జలతన్మాత్రం, జాలం, పృథివీ, పృథివినుండి ఔషదులు, వరుసగా ఉద్భవిస్తాయి. ఇది పరిణామం, ఇవోల్యూషన్ అని అంటారు. మొదలు జరిగేది విపరిణామం, ఇన్వొల్యూషన్. విపరిణామం చాప చుట్టడం లాంటిది కాగా, పరిణామం చాప విప్పి పరచడం లాంటిది. ఇవన్నీ చేసేవారు ఎవరు? వాటంతట అవే అయ్యాయా? ప్రకృతి జడం కాబట్టి దానంతట అది పరిణామం చెందలేదు. జీవుడు కర్మబద్ధుడైనందున, ఆకాలంలో ప్రకృతిలో కలసి వున్నందున అతడికి ఆ శక్తిలేదు. కాబట్టి ఇవన్నీ చేసేవాడు భగవంతుడే! ఈ విధంగా సర్వం భగవంతుడే అని అర్థం చేసుకోవాలి. వివరాల్లోకి పోతే.....

సీతాలక్ష్మణ సమేతంగా వనవాసం చేస్తున్న శ్రీరాముడి దగ్గరికి జడలు, కృష్ణాజినం ధరించి వచ్చిన భరతుడు వనవాసం మాని అయోధ్యకు వచ్చి రాజ్యాన్ని పాలించమని అన్నగారిని పలురకాలుగా వేడుకున్నాడు. అయినా, శ్రీరాముడు భరతుడిని తనదైన శైలిలో తగురీతిలో సమాధాన పరిచే ప్రయత్నం చేసి హితోక్తులు పలికాడు.

హితమైన మాటలు చెప్పి భరతుడిని సమాధాన పరుస్తున్న శ్రీరామచంద్రుడిని చూసి, అక్కడే వున్న బ్రాహ్మణోత్తముడైన జాబాలి ఇలా అంటాడు: "సర్వం తెల్సిన నీకు పామరుడిలాగా బుద్ధిమాంద్యం ఎలా కలిగింది? తండ్రి-తండ్రి అని అంటున్నావే? మనిషికి తండ్రి అనేవాడెవరు? బందువులెవ్వరు? ఇదేం అనాలోచిత ప్రసంగం? ఒకడి ద్వారా మరొకడికి అయ్యే పనేంటి? ఒకడు ఇంకొకడికి ఏంచేయగలడు? ముసలితనం రాకుండా కాపాడగలమా? చావురాకుండా ఆపగలమా? పుట్టినప్పుడు తానొక్కడే పుట్టాడు, చనిపోయేటప్పుడు ఒక్కడే చస్తాడు. అప్పుడీ తండ్రులలో, బంధువులలో ఒక్కడైనా వెంట వస్తారా? అలా రానప్పుడు వీరు కన్నవారెలా అయ్యారు? బంధువులెలా అయ్యారు?".

"ఎక్కడి తల్లి? ఎక్కడి తండ్రి? ఒకడిని తండ్రి అనీ, ఒకరిని తల్లి అనీ అనడం బుద్ధిలేనితనమే! ఒక ప్రాణికి, మరొక ప్రాణికి సంబంధమే లేదు. రామచంద్రా! ఈ తల్లిదండ్రుల దేహాలు సత్రాలు, చలువ పందిళ్ళ లాంటివి. అప్పటికప్పుడు ఉపయోగించుకునేవి మాత్రమే! కాబట్టి వీటికోసం వివేకవంతుడు తాపత్రయపడడు. రామచంద్రా! యౌవనంలో అనుభవయోగ్యం కాని చెడుమార్గాన్ని ఎందుకు కోరుకుంటున్నావు? సుఖకారణమై, భోగవస్తువులతో నిండిన అయోధ్యకు పో. నీ ఇష్టానుసారం సుఖం అనుభవించు".

"తండ్రి ఎవడు? నువ్వెవరివి? తండ్రికి నీకు ఏమి సంబంధం? అతడు వేరు, నువ్వు వేరు. దీనిని తెల్సుకుని హితులు చెప్పిన విధంగా చేయి. పురుషుడు ఒక స్త్రీ గర్భంలో బీజం వేస్తే అది స్త్రీ రక్తంతో కలిసి పిండమై, ప్రాణంతో పుట్టున్నది. తండ్రి ఒక అల్ప సహాయం మాత్రమే. ఆ మాత్రానికి ఎందుకు తండ్రి–తండ్రి అని అంటున్నావు? నాలుగు భూతాల సంయోగమే దేహం. పుట్టినవాడు ఎన్ని రోజులకైనా చావాల్సిందే. ఇది ఆలోచించకుండా పిచ్చివాడిలా వ్యర్థంగా ఏంటో అంటున్నావు. నువ్వెక్కడ? తండ్రి ఎక్కడ? ఇద్దరికీ ఏం సంబంధం?".

"కష్టపడి వైదిక కర్మలు చేస్తున్నారు. చనిపోయినవాడు అన్నం తింటాడా? చనిపోయినవారి పేరు చెప్పి ఇతరురులు తింటున్నారు. దీనివల్ల లాభం ఏమిటి? బతికున్నవాడు అన్నం తింటే చనిపోయినవాడి కడుపెలా నిండుతుంది? ఒకడు కూడు తింటే మరొకడి కడుపెలా నిండుతుంది? బుద్ధికలవారు ఇవి విని నమ్ముతారా? మబ్బుల్లో నీరును నమ్ముకుని చెరువు నీరు తెగగొట్టుతారా? చనిపోయిన తరువాత ఎదో సుఖం కలుగుతుందని ప్రత్యక్ష రాజ్య సుఖాన్ని పోగొట్టుకునే బుద్ధిలేనివాడు ఎవరైనా వుంటారా? కాబట్టి లోకం సమ్మతించే ఆలోచన చేయి. మామీద దయ చూపి పట్టాభిషేకం చేసుకో".

జాబాలి మాటలకు శ్రీరాముడు జవాబుగా ఇలా చెప్పాడు: "ఓ బ్రాహ్మణుడా! నీ మాటలను బట్టి నువ్వు నియమహీనుడివని, పాపివని తెలసుకున్నా. నేను చేసిన ప్రతిజ్ఞను సముద్రంలో కలిపి, సత్యాన్ని నాశనం చేసి, మీరు సత్యంలో వుండమని ఎవరికి ఏమని చెప్పను? అసత్యమాడి పరలోక సుఖం ఎలా అనుభవించను? యథారాజా తథా ప్రజా అనే న్యాయాన్ని అనుసరించి రాజు నాస్తికుడై, దేవుడు లేడు, పరలోకం లేదు, అని చెప్తే లోకులు కూడా వారి–వారి ఇష్టప్రకారం దొంగతనం, రంకుతనం, హత్యలు లాంటివి చేస్తారుకదా? అప్పుడు ధర్మం, సత్యం అనేవి నశిస్తాయి కదా? కాబట్టి సర్వ జగాలకు సత్యమే ఆధారం. అన్నింటికంటే సత్యమే శ్రేష్ఠం. వాస్తవానికి మోక్షాన్ని కోరేవాడు సత్యాన్నే పలకాలి. సత్యమే లక్ష్మీవాసస్థానం. ప్రపంచానికంతా సత్యమే నియంత. సత్యానికి లోబడి ప్రపంచం నడుస్తున్నది. సత్యమే ప్రపంచం నిలబడడానికి మూలాధారం. మోక్షప్రాప్తికి సాధనం సత్యం. సత్యం విడిచిన వారికి ఇవేవీ పనిచేయవు. నరుడు సత్యమే ప్రధానంగా కలవాడు కావాలి".

"సత్యమే స్వరూపంగా వుండే ధర్మం ఆత్మను విడిచి వుండేది కాదు. సత్పురుషులు ఆచరించాల్సిన వానప్రస్థ ఆశ్రమాన్ని, జడలు ధరించి సత్యం కొరకై నేను స్వీకరించా. పాపకార్యాలు ఆలోచిస్తే, అవి చేయకపోయినా, పాపం వస్తుంది. ఇది మానసికం. అసత్యం నోటితో చెప్పినా పాపం వస్తుంది. ఇది వాచకం. దేహంతో చేయడం వల్ల ఈ మూడు రకాల పాపాలు వస్తాయి. సత్యమే ప్రధానంగాగల

పురుషుడికి కీర్తి, యశస్సు, లక్ష్మి తమంతట తామే వలచి వస్తాయి. ఈ లోకంలో ఇవి సమకూర్చడమే కాకుండా సత్యం స్వర్గలోకానికి తోడుగా పోయి దివ్యసుఖాన్ని కలిగిస్తాయి. ఇలాంటి సత్యాన్ని ఎవరు వదులుకుంటారు?"

"అది లేదు, ఇది లేదు అనే విచారం కాని, లభించిన దాని మీద ప్రేమకాని లేకుండా, లభించినదానితో పంచేంద్రియాలను సంతోషపెట్టూ, శాస్త్రం మీద, కర్మఫలం మీద నమ్మకంతో, పాపరహితమైన మనసుతో, సత్కార్యాలు చేస్తూ, పితృవాక్యాన్ని పాలిస్తూ కాలం గడుపుతా. ఈ భూమండలం కర్మభూమి కాబట్టి ఇక్కడున్నవారు కర్మలే చేయాలి. ఊర్ధ్వలోకాలు ఫలభూములు. ఇక్కడ చేసిన కర్మల ఫలం అక్కడ అనుభవించాలి. ఇక్కడ పుణ్యం చేసినవాడు అక్కడ సుఖం అనుభవిస్తాడు. ఇక్కడ పాపం చేసినవాడు అక్కడ దుఃఖం అనుభవిస్తాడు. కాబట్టి ఇక్కడ పుణ్యకర్మలే చేయాలి. అలా పుణ్యకర్మలు చేసిన మనుష్యులే వారి, వారి పుణ్యకర్మం కొద్దీ వాయువుగానో, అగ్నిగానో, చంద్రుడుగానో పుట్టాడు".

"సూర్యుడు, చంద్రుడు, అగ్ని, ఇంద్రుడు, బ్రహ్మ, రుద్రుడు, ఇవన్నీ ఉద్యోగాలే. ఎవరే సంకల్పంతో ఏ కర్మ చేస్తాడో, ఆచరిస్తాడో, ఆ కర్మఫలంగా వాడే ఉద్యోగ పదవికి అర్హుడో వారికా పదవి ఇవ్వడం జరుగుతుంది. వీరంతా కొంతకాలం ఆ పదవుల్లో వుండి వేరేవారికి స్థానం కలిగిస్తారు. బ్రహ్మ రుద్రేంద్రాది పదవులన్నీ కర్మఫలాలే. ఫలదాత భగవంతుడైన విష్ణువే. భగవంతుడైన విష్ణువు సృష్టికర్త అయి తన్ను సృజించుకుంటున్నాడు. పాలించేవాడై తన్ను రక్షించుకుంటున్నాడు. సంహరించేవాడై సంహరింపబడుతున్నాడు. నూరు యజ్ఞాలు చేసినవారు ఇంద్రుడై నహుషుడిలాగా స్వర్గాధిపతి అవుతాడు. మహర్షులందరూ స్వర్గం పోవడానికి కారణం వారువారు చేసిన తపోనిష్ఠల వల్లే".

ఇలా కోపంతో శ్రీరామచంద్రమూర్తి మాట్లాడగా, జాబాలి మళ్లీ సత్యమైన మాటలతో ఇలా అన్నాడు: "రామచంద్రా! నేను నాస్తికుడిని కాదు. నేను నాస్తికోక్తులను చెప్పను. నాస్తి అనేది లోకంలో లేదు. సర్వం అస్తియే! నేను నాస్తికుడిని కాకపోయినా ఎందుకు నాస్తికవాదం చేశానంటావా? విను. రామచంద్రా! మీరిద్దరూ రాజ్యాన్ని అంగీకరించకపోతే రాజ్యం, ప్రజలు ఏగతి పట్టాలి? దేశం ఎంతటి దుస్థితికి వస్తుంది? ఈ మహావిపత్తును ఆలోచించి న్యాయంగా రాజ్యం నీది కాబట్టి నువ్వు రాజు కావడం ధర్మమని అనుకుని, న్యాయోక్తులన్నిటికీ విరుగుడు మాటలు చెప్పిన నీకు, ఈ మార్గంలోనైనా నిన్ను అంగీకరించేలా చేద్దామనుకుని నాస్తికవాదం చేశానే కాని, నేను నాస్తికుడిని కాదు. ఎవరైనా నాస్తికవాదం చేస్తే నేనే వారిని ఖండిస్తా".

"ఇప్పుడు నేను చేసిన వాదన, ధర్మానికి హాని కలిగినప్పుడు ఎలాగైనా ధర్మ స్థాపన చేయాల్సి వస్తే, నువ్వు రాజుగా వుండి అలా చేస్తే, నిన్ను నేనే ఆక్షేపించి ఇప్పుడు నేను చేసిన వాదన ఖండించే వాడిని. ఇప్పుడు నాస్తికవాదన చేయడమే కాదు, ఎప్పుడైనా ధర్మహాని కలిగితే, ఇలాంటి కష్టకాలం వస్తే, మళ్లా నాస్తికవాదన చేస్తా. ధర్మంగా వుండి, ఇంత దేశాన్ని అరాజకం చేసి ఇందరు ప్రజలను నాశనం చేయడం ఎక్కువ కీడా? నువ్వొక్కడివి తాత్కాలికంగా నాస్తికవాక్యాన్ని అంగీకరించి రాజువై, లోకరక్షణ చేయడం మేలా? క్షమించు. ఒక పని నెరవేరాలంటే ఎన్ని విధాల ప్రయత్నించినా తప్పులేదు".

జాబాలి ఇలా చెప్పగా అతడిమీద కోపంతో వున్న శ్రీరామచంద్రుడితో వసిష్ఠుడు ఇలా అన్నాడు:

"రామచంద్రా! నిన్ను అయోధ్యకు తీసుకుపోవడానికే జాబాలి ఆ విధంగా నాస్తికవాదం చేశాడు. ఈ ప్రపంచం ఎలా పుట్టిందో చెప్తా విను. బ్రహ్మాండమంతా జలంతో నిండి ఒక సముద్రంగా వున్నప్పుడు భూమి సృష్టించబడింది. పరబ్రహ్మం వల్ల దేవతలు, బ్రహ్మ కలిగారు. భూమి నీట్లో మునుగుతున్నప్పుడు విష్ణువు ఆదివరాహమై తన కొమ్ముతో దాన్ని పైకెత్తాడు. అప్పుడు అవ్యయుడు, నిత్యుడు, పరబ్రహ్మం వల్ల కలిగిన బ్రహ్మ తన కొడుకులైన మరీచ్యాదులతో ప్రపంచమంతా వ్యాపించాడు. ఆకాశమే పరబ్రహ్మం. ఆకాశమంటే సర్వత్రా ప్రకాశించేది. ఈ ప్రపంచం ప్రళయకాలంలో చీకట్లో మునిగి వుండేది. అంటే, ఆ కాలంలో మహదాది అయిన ప్రకృతి సూక్ష్మ ప్రకృతైన తమస్సులో లీనమై తమస్సు భగవంతుడితో ఏకీభావంగా వుండేది. ఈ కారణం వల్ల అది ప్రత్యక్ష ప్రమాణానికి అగమ్యంగా, చీకట్లో వస్తువులు కళ్లకు కనబడని విధంగా, ఇది ప్రపంచమని గుర్తించగల చిహ్నాలు లేకుండా, శబ్దం వల్ల కూడా తెలియకుండా అంతా నిద్రావస్థలో వున్నట్లుండేది".

వసిష్ఠుడు ఇంకా ఇలా చెప్పుకుంటూ పోయాడు: "ఆ బ్రహ్మకు మరీచి, మరీచికి కశ్యపుడు, కశ్యపుడికి భాస్కరుడు, భాస్కరుడికి మనువు, మనువుకు ఇక్ష్వాకుడు పుట్టారు. అయోధ్యను మనువు ఇక్ష్వాకుడికి ఇచ్చాడు కాబట్టి మీ వంశానికి ఇక్ష్వాకుడే మూలపురుషుడు. అతడికి కుక్షి, ఆ కుక్షికి వికుక్షి, అతడికి బాణుడు, బాణుడికి అరణ్యుడు జన్మించారు. ఈ అరణ్యుడే రావణుడితో యుద్ధం చేసి శపించాడు. అరణ్యుడికి బృథువు కలిగాడు. అతడి కుమారుడే త్రిశంకుడు, దేహంతో స్వర్గానికి పోయాడు. త్రిశంకుడికి ధుంధుమారుడు లేదా యువనాశ్వుడు, అతడికి బలశాలి మాంధాత పుట్టారు. మాంధాత కొడుకు సుడంది. అతడి కొడుకులు ధ్రువసంధి, ప్రసేనజతుడు. ధ్రువసంధి కొడుకు భరతుడు. అతడి కొడుకు అసితుడు. ఇతడిని హైహయులు, తాలజంఘులు యుద్ధంలో ఓడించి రాజ్యం నుండి వెళ్ళగొట్టారు. ఆయనకు ఇద్దరు భార్యలు. వారిలో ఒకామె గర్భవతిగా వున్నప్పుడు సవతి విషం పెట్టింది. గర్భవతి కాళింది చ్యవనుడనే మునిదగ్గరకు పోయింది. ఆ ముని ఆమెకు వంశాన్ని ఉద్ధరించే సజ్జన స్తోత్రుడైన కొడుకు పుడుతాడని దీవించాడు".

"ఇంటికి పోయిన కాళిందికి బ్రహ్మతో సమానుడైన కొడుకు సగరుడు పుట్టాడు. ఆ వంశ పరంపరలో, అసమంజసుడు, అంశుమంతుడు, దిలీపుడు, భగీరథుడు, కకుత్సుడు, రఘువు, కల్మాషపాదుడు, శంఖనుడు, సుదర్శనుడు. నహుషుడు, నాభాగుడు పుట్టారు. అతడికి అజుడు, సువ్రతుడు అనే ఇద్దరు కొడుకులున్నారు. అజుడి కుమారుడు దశరథుడు. "దశరథుడి కొడుకుల్లో నువ్వు పెద్దవాడివి. కాబట్టి రామచంద్రా! నీ తండ్రిలాగా నువ్వు కూడా భూమిని పాలించు. ఇక్ష్వాకు వంశంలో పుట్టినవారిలో ఇప్పటిదాకా వంశపరంపరంగా పెద్దవాడే రాజవుతున్నాడు. కాబట్టి నువ్వు కూడా వంశధర్మాన్ని అనుసరించి, అది తప్పించక, రాజ్యాభిషేకానికి అంగీకరించి ప్రజలను పాలించు" అని ముగించాడు వసిష్టుడు.

◆❖◆

ధర్మాధర్మ విచారణ.... శ్రీరామ పాదుకా పట్టాభిషేకం

వనవాసం ఆరంభంలో వున్న తనను, భరతుడు అయోధ్యకు పిలుచుకుని పోవడానికే వచ్చాడని గ్రహించిన శ్రీరాముడు, రాజ్యభారం మోయాల్సినవాడివి అరణ్యానికి ఎందుకొచ్చావని ప్రశ్నించాడు. "వేటకొచ్చావా? అలా అయితే ఈ జడలెందుకు? ఈ కృష్ణాజినం ఎందుకు? ఈ నారచీరెలు కట్టుకోవడానికి కారణం ఏమిటి? ఎందుకని నువ్వు రాజ్యాన్ని వదిలి వచ్చావు?" అని ప్రశ్నించాడు. జవాబుగా భరతుడు చేతులు జోడించుకుని, "నీ రాజ్యాన్ని నువ్వే తీసుకో. నువ్వే రాజై అందరినీ సంతోషపెట్టు. నేను నీకు తమ్ముడిని, శిష్యుడిని, దాసుడిని. నా మీద దయ చూపు. ఇది నా కోరిక. దీనికోసమే నేను వచ్చాను" అని అంటాడు.

భరతుడి మాటలకు స్పందిస్తూ శ్రీరాముడు, "రాజ్యభారం మోయలేనంటున్నావు భరతా! అలా అయితే నీకొక ఉపాయం చెప్తా విను. దానివల్ల నీకు భారం తగ్గుతుంది. తండ్రి వాక్యాన్ని మనం ఇరువురం పాలించినట్లవుతుంది. నువ్వు రాజ్యాన్ని, జనపదాలను, నగరాలను, అయోధ్యలోనుండి విచారించు. నేను అడవుల్లో నారచీరెలు కట్టి, జింక చర్మం ధరించి, ఏ భయం లేకుండా ధర్మాధర్మాలు విచారిస్తా. నాకు తండ్రి ఇచ్చింది వనవాస భాగం. దానిని పద్నాలుగు సంవత్సరాలు అడవిలోనే వుండి అనుభవించి ముగించాలి. ఇదే ఆయనకు, నాకు గొప్ప హితమైన కార్యమని నా భావన. ఉభయలోక పూజ్యుడైన తండ్రి ఏం చెప్పాడో అది చేయడమే నాకు శ్రేయస్కరం" అని చెప్పాడు.

భరతుడు ప్రేమతో, భక్తితో, గౌరవంతో అన్న శ్రీరాముడితో ఇలా అన్నాడు. "నువ్విక్కడ ఒంటరిగా వుండి ఎవరికీ మేలుచేస్తావు? గృహస్థాశ్రమం తప్ప తక్కినవన్నీ పరాదీనపు బతుకులే. గృహస్తుడుగా వుండడానికి అసమర్థుడే సన్యాసి లేదా వనవాసి అవుతాడు. ఇక్కడ నీ ఇంటికి ఏ అతిథి వస్తాడు? ఏ అభ్యాగతి వస్తాడు? వచ్చినా ఎంతమంది వస్తారు? వచ్చినవారికి ఏం పెట్టుతావు? కాబట్టి గృహస్థ ధర్మాన్ని అవలంభించి పాలించు రామచంద్రా! నువ్వు మాకందరికీ రక్షకుడివి. మేం నీకు భృత్యులం. మమ్మల్ని నువ్వు కాపాడకపోతే ఎవరు కాపాడుతారు? అలాగే నువ్వు గొప్పవాడివయ్యావు కాబట్టి

ఇతరులకు ఆరాధ్యుడివి అయ్యావు? నువ్వు మహా వృక్షానివి అయ్యావు. మాలాంటివారు మరుగుజ్జులు. నువ్వు పట్టాభిషేకానికి అంగీకరించడం చెట్టు పూయడం లాంటిది".

భరతుడు శ్రీరాముడితో ఇంకా ఇలా అన్నాడు: "క్షత్రియుడికి వానప్రస్థ ఆశ్రమ చర్య, వేషం శాస్త్ర విరుద్ధం కాదు కదా? అంటావేమో? క్షత్రియుడి ప్రథమధర్మం ప్రజాపాలన. ప్రజాపాలన చేసేవాడు పట్టాభిషేకం చేసుకుని సింహాసనం అధిష్టించాలి. ఇలా అని ప్రాజ్ఞులు చెప్తారు. నువ్వు వారిలో శ్రేష్ఠుడివి. ఇది నేను నీకు చెప్పాలా? క్షత్రియుడికి ప్రజాపాలన ముఖ్య ధర్మం అని శాస్త్రం కూడా చెప్తున్నది. నువ్వు వుండాలని అనుకుంటున్న తాపస ధర్మం ప్రత్యక్ష ఫలం కాదు. దాని ఫలమిప్పుడు కనబడదు. క్షత్రియుడికి ప్రప్రథమంలోనే తాపసచర్య ఏ శాస్త్రం విధించలేదు. ఇలాంటి తాపస ధర్మం ఏ క్షత్రియుడు అనుసరిస్తాడు? రాజధర్మం రక్షారూపంగా, దండరూపంగా, భోగరూపంగా కళ్లకు కనపడుతుంది. కాబట్టి ఫలం వుందో, లేదో అనే విషయంలో సందేహం లేదు. రాజు ప్రజాపాలన చేయాలని శాస్త్రం నిర్ణయించింది. ఇలా చేయడానికి క్షత్రియుడు ఎందుకు సందేహించాలి? రాజధర్మం సుఖ-భాగాలతో కూడింది. కష్టించి ధర్మం చేయాలంటావా? ప్రజాపాలన తాపస ధర్మం కంటే కూడా కష్టమైంది. ఇక్కడ నీ ఒక్కడి యోగక్షేమాలు చూసుకుంటే చాలు. రాజ్యపాలనలో కోట్లాది మంది యోగక్షేమాలు ఆలోచన చేయాలి. కాబట్టి దానినే అంగీకరించు. ఇప్పుడు నువ్వు వానప్రస్థుడివై బ్రహ్మచర్యాన్ని అవలంభించావు. ఇవి రెండూ గృహస్థధర్మం కంటే గొప్పవేంకాదు. ధర్మం అంటే ఆసక్తికల నువ్వు అలాంటి ధర్మాన్ని వదిలి ఇలా వుండడం ధర్మం కాదు".

"నిన్ను నేను ఇంతగా ప్రార్థించడం నా సుఖం కొరకు కాదు. నువ్వు పట్టాభిషేకం చేసుకుంటే, నా తల్లికి పాపనింద పోతుంది. తండ్రికి నరకబాధ తప్పుతుంది. ఈ రెండు పనులు నీవల్ల జరిగితే భగవంతుడు జీవకోటులందరినీ రక్షించినట్లు నువ్వు మమ్మల్ని రక్షించినవాడివవుతావు. నువ్వు పట్టాభిషేకం చేసుకుంటే ఈ మూడు పుణ్యాలు నీకు కలుగుతాయి. నేను రానని నువ్వు అంటావా? నీతో నేనుండాల్సిన వాడిని. నిన్ను విడిచి వుండను. నువ్వు అయోధ్యకు వస్తే అక్కడే కలిసి వుంటా. నువ్వు అరణ్యాలలో వుంటే ఇక్కడే కలసి వుంటా. ఇది నా నిర్ణయం. ఆత్మను విడిచి శరీరం ఎలా వుంటుంది?". భరతుడు ఇంత చెప్పినా శ్రీరామచంద్రుడు అయోధ్యకు పోవడానికి అంగీకరించలేదు.

భరతుడి ప్రార్థనకు బదులుగా, దానికి సమాధానంగా శ్రీరాముడిలా అన్నాడు: "భరతా! దశరథుడు అధర్మాత్ముడై రాజ్యం నీకివ్వలేదు. నీ తల్లి వివాహకాలమందు కన్యాశుల్కంగా తన రాజ్యాన్ని ఆమె కొడుక్కి ఇస్తానని దశరథుడు ప్రమాణం చేశాడు. ఇది ప్రమాణపూర్వకంగా చేసిన పని కాబట్టి, అలా చేసిన దశరథుడు ఎలా అధర్మాత్ముడవుతాడు? ఆ మాట ప్రకారం రాజ్యాన్ని నీకిచ్చినా, నన్నెందుకు అడవులకు పంపాలంటావా? దేవ, రాక్షస యుద్ధంలో నీ తల్లి తనకు సహాయం చేసిన కారణాన మన తండ్రి ఆమెకు రెండు వరాలిచ్చాడు. ఆ రెండు వరాలిప్పుడు ఆమె కోరింది. అందులో ఒకటి నీకు రాజ్యాభిషేకం, రెండోది, నా వనవాసం. ఆ రెండు వరాలూ మన తండ్రి ఇచ్చినవే! కాబట్టి ఆయన మాట ప్రకారం పద్నాలుగు సంవత్సరాలు నేను అడవుల్లో వుండడానికి సీతాలక్ష్మణులతో వచ్చా. ఇలా నేను చేయడానికి కారణం తండ్రిని సత్యవాక్యపాలకుడిని చేయడమే కాని కామ-క్రోధాలు కావు".

"తండ్రిని నేను సత్యవచననిష్ఠుడిని చేసినట్లే, నువ్వు కూడా తండ్రిని సత్యవాదిని చేయాలికదా? కాబట్టి రాజ్యలక్ష్మిని అంగీకరించు. తండ్రి తరువాత తండ్రి అంతటివాడిని నేను కదా? నేను చెప్తున్నా. పెద్దవాడు చెప్పాడని నాకొరకు నామాట విను. నష్టమైనా, కష్టమైనా, ఇష్టం అయినా, కాకపోయినా పెద్దవారి మాట వినాలికదా? కాబట్టి తండ్రి ఋణం ఆయన మాట ప్రకారం నడిచి తీర్చు. తల్లి కూడా సంతోషించే విధంగా ప్రవర్తించు. తండ్రి వాక్యం ప్రకారం నడుచుకుని, తండ్రికి అసత్య దోషం వల్ల కలిగే నరక బాధ నుండి రక్షించు. అయోధ్యకు పోయి రాజువు కా".

అని శ్రీరాముడనగానే, విన్న భరతుడు నిరాశతో, ఇక వాదనలతో లాభం లేదనుకుంటాడు. మొండికేసి పని పూర్తి చేయాలని భావించాడు. అన్న అయ్యో, పాపం అనేట్లు చేయాలనుకుంటాడు. సుమంత్రుడితో తనకొరకు ఒక దర్భాసనం ఏర్పాటు చేయమని కోరాడు. రామచంద్రమూర్తికి తన మీద దయకలిగి అయోధ్యకు వస్తానని మాటిచ్చేవరకు, అప్పు ఇచ్చిన బ్రాహ్మణుడు ఇచ్చిన అప్పు రాబట్టుకోవడానికి అప్పు తీసుకున్న వాడి ఇంటి వాకిట్లో ముఖానికి గుడ్డ వేసుకుని కూడు–నీళ్లు ముట్టుకోకుండా ఎలా వుంటాడో అలా పండుకుంటానని, ఇది తన నిశ్చయం అని భరతుడు సుమంత్రుడితో చెప్పాడు. దర్భలు పరచుకుని పండుకోవడానికి సిద్ధపడ్డ భరతుడిని చూసి రామచంద్రమూర్తి ఇలా అన్నాడు: "తమ్ముడా! నీకు నేను ఏ అపకారం చేశానని నువ్వలా చేస్తానంటునావు? రాజ్యమేలాల్సిన క్షత్రుయుడికి ఇది ధర్మమా? లేలే! ఇలాంటి వ్రతాన్ని వదులు. నా మాట విని మళ్లీ అయోధ్యకు పో".

ఇలా రామచంద్రమూర్తి చెప్పగా విని భరతుడు ప్రజల వైపు తిరిగి, "ప్రజలారా! మా అన్నకు నామీద దయరాలేదు. మీరు ఆయనకు ముఖ్యులుకదా! మీరైనా చెప్పి అయోధ్యకు పిలుచుకుని పొండి. మీరే ఆయనకు సరైన సమాధానం చెప్పండి" అన్నాడు. ప్రజలప్పుడు భరతుడితో, "భరతా! నువ్వు చెప్పినదానికంటే ఎక్కువగా మేమేం చెప్తాం? నీకు ఆయన చెప్తున్న ప్రతి మాటను బట్టి ఆయన మనసు తెల్సిపోయింది. తప్పొప్పులు తెల్సినవాడు కాబట్టి అన్నీ చక్కగానే చెప్పాడు. ఆయనేం తప్పు చెప్పాడని మేం ఆయనకు చెప్పగలం? తండ్రి వాక్యపాలన చేయాలన్నదే ఆయన కోరిక. ఆయనకు దానిమీద వున్న ప్రీతి రాజ్యం మీద కాని, మరి దేనిమీదా కాని లేదు. ఇలాంటివాడిని ఒప్పించడం మాకు సాధ్యమా?"

ప్రజలు చెప్పిన మాటలు విన్న రామచంద్రమూర్తి, "భరతా! లోకులు చెప్పిన మాటలు విన్నావు కదా? నిష్పక్షపాతంగా చెప్పేవారి మాటలు ఇలాగే వుంటాయి. నువ్వు ధర్మ పక్షపాతివిగా కాకుండా నామీద ప్రేమతో మాట్లాడుతున్నావు. కాబట్టి వీరి మాట, నామాట మనసులో పెట్టుకుని న్యాయమార్గంలో పో. క్షత్రియుడు దర్భలమీద పండుకో కూడదు. అది స్వధర్మ విరుద్ధం." అన్నాడు.

శ్రీరాముడిలా చెప్పగానే భరతుడు దర్భల మీద నుండి లేచి, నీటిని తాకి, ప్రజలందరూ వినేట్లు ఇలా అన్నాడు: "తండ్రిని నాకు రాజ్యం ఇవ్వమని నేను అడగలేదు. ఇలాంటి తప్పుడు పని చేయమని తల్లిని కూడా కోరలేదు. శ్రీరాముడు అడవికి పోయిన వార్త కూడా నాకు తెలియదు. తండ్రి మాట పరిపాలించడం ఆవశ్యకమైతే మా అన్నగారికి మారుగా నేనుంటా. ప్రతినిధులను ఏర్పాటుచేయడం శాస్త్ర సమ్మతమైనదే కదా? కాబట్టి ఈ పద్ధతికి అంగీకరించండి".

శ్రీరాముడు తెగేసి చెప్పిన దానికి సమాధానంగా భరతుడిలా అన్నాడు. "అన్నా! సరే! నీ మాట వింటా. నేనెంత ప్రార్థించినా నీ మనసు కరగడం లేదు. నీకు నామీద నిర్మలమైన మనసుంటే, ఈ బంగారు పాదుకలమీద నీ పాదాలను వుంచు". శ్రీరాముడు అలాగే చేశాడు. భరతుడు వాటిని భక్తితో తీసుకుని రెండు చేతులు జోడించి అన్నతో ఇలా అన్నాడు: "అన్నా! నేను చెప్పే మాట సావధానుడవై విను. రోజులు లెక్కపెట్టుకుంటూ, జడలు ధరించి, జింక చర్మం కప్పుకుని, ఊరి బయట ఇల్లు ఏర్పాటు చేసుకుని, రాజ్యతంత్రం అంతా పాదుకలకు అప్పచెప్పి, ప్రాణం బిగబట్టి వుంటా. పదిహేనవ సంవత్సరం మొదటి రోజున నువ్వు రాకపోతే నేను అగ్నిలో దూకుతా". భరతుడి మాటలకు శ్రీరాముడు మాట ఇచ్చాడు. ఇక పోయిరమ్మని చెప్పి పంపాడు భరతశత్రుఘ్నులను.

భరతుడు పాదుకలను పట్టపు ఏనుగు కుంభస్థలంలో వినయంగా పెట్టి, శ్రీరాముడికి నమస్కరించాడు. రామచంద్రమూర్తి కూడా అందరికీ వీడ్కోలు పలికాడు. ఆ తరువాత, భరతుడు పట్టపు ఏనుగు మీద వున్న పాదుకలను తీసి తన తలమీద పెట్టుకుని, శత్రుఘ్నుడితో కలిసి రథం ఎక్కాడు. దారిలో చిత్రకూటం సమీపంలో వున్న భరద్వాజ ఆశ్రమాన్ని చూశాడు. రథం దిగి భరద్వాజుడిని సమీపించి, అభివాదం చేశాడు. వసిష్ఠుడి మాట ప్రకారం శ్రీరామచంద్రుడు పాదుకలమీద ఎక్కి దిగి, వాటిని ప్రజాపాలనార్థమై ఇచ్చిన విషయం కూడా చెప్పాడు. ఆ రెండు పావుకోళ్లు తీసుకుని అయోధ్యకు పోతున్నానన్నాడు. భరతుడు అయోధ్యకు పోయి, తండ్రి, అన్న లేని అయోధ్యను చూశాడు. సీతారామలక్ష్మణులు లేని అయోధ్యలో తాను బతకలేనన్నాడు వసిష్టుడితో. నందిగ్రామంలోనే శ్రీరాముడి రాకకొరకు వేచి వుంటానన్నాడు. భరతుడి మాటలను సుమంత్రుడు, ఇతర మంత్రులు, గురువైన వసిష్ఠుడు శ్లాఘించారు. శత్రుఘ్నుడు తోడురాగా, గురువు, మంత్రులు సేనలు, వెంటరాగా, పాదుకలను రెంటినీ తలమీద పెట్టుకుని భరతుడు నందిగ్రామం చేరాడు. పావుకోళ్లు రెంటినీ బంగారు సింహాసనం మీద వుంచి సంతోషంతో వాటికి పట్టాభిషేకం చేశాడు.

మునివృత్తిలో ఆయుధాలెందుకు?

సీతారామలక్ష్మణులు వనవాసం చేస్తున్న తొలిరోజుల్లో ఆసక్తికరమైన సంఘటన జరిగింది. ఒకనాడు, తెల్లవారుఝాము కాగానే లక్ష్మణుడు ముందుగా లేచి, స్నానం చేసిన తరువాత, సీతాదేవి, శ్రీరామచంద్రమూర్తి కూడా తటాకజలాలలో స్నానం చేసి, దైవ ప్రార్థన చేసి, సూర్యోదయం కాగానే దండకారణ్యంలో మునుల రక్షణకు బయల్దేరారు. అప్పుడు సీత విల్లంబులను, ఇతర ఆయుధాలను అంబులపొదులను రామలక్ష్మణులను తీసుకొమ్మని చెప్పి ఇచ్చింది. వాళ్లు వాటిని తీసుకుని తమదగ్గర వుంచుకుని ఎక్కుపెట్టారు. రామలక్ష్మణులు విండ్లు ధరించిన విధం చూసి ఆయుధాల పట్టువిడుపులు తెలిసిన సీతాదేవి వారు యుద్ధ సన్నద్ధులైనారని గ్రహించి ఇలా అన్నది శ్రీరాముడితో:

"ప్రాణేశ్వరా! నువ్వు ధర్మ నిరతుడవు కాబట్టి నీలో ఏ పాపాలు కనబడవు. నువ్వు సత్యం, ధర్మం తప్పని వాడివి కాబట్టే తండ్రి వాక్యాన్ని పాలించడానికి ఇంత శ్రమ పడ్తున్నావు. సత్యం, ధర్మం నీలో ఏ కొరతా లేకుండా వున్నాయి. ఇంత సత్యం, ధర్మం విజితేంద్రియులకు తప్ప ఇతరులకు లభించవు. నువ్వెంత జితేంద్రియుడివో నాకు తెలుసు. రామచంద్రా! మిథ్యాభిభాణం పరదార సంగమాభిలాష నీలో లేవు. ఆ విషయం గురించి నేనేం చెప్పను".

"ఇకపోతే, జ్ఞానహీనులు పగలేకపోయినా ఇతరుల ప్రాణం తీస్తారు. అది అలాంటివారికి తగునుకాని నీకు తగదు. అది నాకెలా తెలుసంటావా? మునీశ్వరుల కొరకు దండకారణ్య వాసులైన రాక్షసులను చంపుతానని ప్రతిజ్ఞ చేశావు. అందుకోసమే ఇక్కడకు వచ్చావు. మునిలాగా తిరగాలనుకుంటున్న నీకు, నీ తమ్ముడికి విల్లు బాణాలెందుకు? అవి హింసించే సాధనాలే కదా? ఆత్మరక్షణ కోసమని అనుకోవచ్చుకదా అంటావేమో? ఈ మునులందరూ ఆత్మరక్షణ కొరకు ఏ ఆయుధాలు ధరించారు? నువ్వు సాయుధుడవై వచ్చినందున మునులు వచ్చి నిన్ను రక్షించమని అడిగారంటావా? అలాగే నిన్ను రాక్షసులు హింసించడానికి వస్తే క్షత్రియుడవైన నువ్వు ఎవరిని ప్రార్థించాలంటావా? అలా వారు వస్తే నువ్వు ఆయుధాలు పట్టవచ్చు. కాని, ఇప్పుడు మీరు విల్లు,

ఆయుధాలు పట్టిన తీరు చూస్తే యుద్ధానికి పోతున్నట్లున్నది. అందువల్ల మీ శుభం, హితం కోరినదాన్నైన నేను, నిష్కారణ విరోధంతో మీకేం అశుభం కలుగుతుందో అని భయపడుతున్నా. నువ్వు సత్యం, ధర్మం పాటించేవాడివి. ఇంతదాకా ఆ రెంటినీ సమంగా కాపాడుకుంటూ వస్తున్నావు. సంతోషమే! ఇప్పుడు రెంటికీ విరోధం వచ్చేట్లున్నది. సత్యంతో విరోధించే ధర్మం, ధర్మం కాదు. ధర్మంతో విరోధించే సత్యం, సత్యం కాదు".

"మీరు ఇప్పుడు అడవులకు ప్రయాణమై పోవడం సమ్మతమైన కార్యం కాదు. పోతే ఏమైతుందంటావా? కారణం చెప్తా విను. మీరు యుద్ధానికి పోయే విధంగా చేతులో విల్లంబులు, కత్తులు ధరించి పోతున్నారు. తోవలో ఎవరైనా రాక్షసుడు కనిపిస్తే ఇదిగో రాక్షసుడు దొరికాడని వాడిమీద బాణం వేస్తారు. ఆ దెబ్బకు వాడు చస్తాడు. అదే రాక్షసులకు, మనకు విరోధ కారణమవుతుంది. రాక్షసులు మనకు ప్రత్యక్షంగా అపకారం చేస్తే వారిని చంపవచ్చు కాని, ఎవరో ఋషీశ్వరులు చెప్పారని రాక్షసులను చంపి మనం కయ్యానికి కాలు త్రవ్వడం నాకిష్టం లేదు. రాక్షసులమీద బాణం నువ్వు ప్రయోగిస్తావని నేనెలా ఊహించానంటావా? నువ్వు రాక్షసులను చంపుతానని ప్రతిజ్ఞ చేశావు. నువ్వు సత్య ప్రతిజ్ఞుడవు. కాబట్టి చంపక మానవు. భయపడవద్దు. నిష్కారణంగా నువ్వెవరినీ చంపనని అంటావా? హింసించవచ్చే వారినే హింసిస్తానంటావా? అలా ధైర్యం చెప్తావా? అలా అయితే నీ ప్రతిజ్ఞ ఎలా నెరవేరుతుంది? దానికి సరైన కారణం కావాలి. నువ్వు ఆయుధాలతో అరణ్యానికి పోవడం నాకిష్టం లేదు. క్షత్రియులకు చేతిలో ఆయుధం వుంటే బలాన్ని, తేజాన్ని వృద్ధి చేస్తుంది. కాబట్టి మీ ఆయుధాలను ఇక్కడే వుంచి పోదాం".

"ప్రాణేశ్వరా! రామచంద్రా! శస్త్ర సంయోగం వల్ల కలిగే కీడు అంతా-ఇంతా కాదు. అగ్నిహోత్రుడు దేనిని (కట్టెలను) ఆశ్రయిస్తాడో, దాన్నే దహించి వేస్తాడు. అలాగే శస్త్రం కూడా తన్నెవరు ధరిస్తారో వారికే కీడు చేస్తుంది. ఇదంతా నీకు తెలియదని, నువ్వు అజ్ఞానివనీ, నేను నేర్పడం లేదు. నాకు స్వభావసిద్ధంగా మీమీద స్నేహ భావం వుండడం మూలాన, నేను మీరు మరచిన దానిని జ్ఞప్తికి వచ్చేట్లు చెప్పాను. నన్ను క్షమించు. నేనెంత దూరం ఆలోచించినా ఇప్పుడు, ఇక్కడ, మీ ప్రయత్నం నాకిష్టం కావడం లేదు. మునివృత్తిలో వుండే వారికి ఆయుధాలతో పనిలేదు. కాబట్టి ఆయుధాలను మీరు ధరించడం సరైన పని కాదు. అడవుల్లో మునులు తిరగడానికీ, శస్త్రాలను ధరించడానికీ ఏం సంబంధం? మునివృత్తి శాంతి ప్రధానం. ఆయుధ ధారణ కౌర్య ప్రధానం. ఒకటి శుద్ధ సాత్త్వికం, ఇంకొకటి శుద్ధ తామసం. నువ్వు చేయబోయే ఈ పని పరస్పర విరుద్ధ గుణాలున్నది. కాబట్టి రెండింటిలో ఒకటి వదలు. శస్త్రాన్నైనా వదలు, లేదా, క్షాత్రమైనా వదలు".

"శస్త్రాన్ని ధరించడమే జరగుతే, దాన్ని ఉపయోగించాలన్న పాపపు బుద్ధి పుట్టుంది. కాబట్టి నువ్వు అడవుల్లో వున్నన్నాళ్లు శస్త్రం ధరించవద్దు. శస్త్రాన్ని ధరించాలనుకుంటే, అయోధ్యకు నువ్వు మరలిపోయిన తరువాత, మళ్లీ గృహస్థ ధర్మంలో వున్నప్పుడు, ధర్మ సంరక్షణార్థం శస్త్రాన్ని ధరించవచ్చు. అనుభవించాల్సిన ఐశ్వర్యం, పాలించాల్సిన భూమి వదలిపెట్టి మునిలాగా అడవుల్లోకి వచ్చిన నువ్వు, మునిలాగానే తపస్సు చేస్తే మంచిది. ధర్మంతో ధనం లభిస్తుంది. ధర్మం వల్ల సుఖం కలుగుతుంది. ధర్మంతో చేసే సత్కర్మలు మంచి ఫలితాలను ఇస్తాయి. ధర్మహీనుడు చేసే సత్కర్మలు ఫలించవు. ధర్మం

చెడితే జగమంతా చెడుతుంది. నువ్వు అడవుల్లో తిరిగినంత కాలం హింసా వ్యాపారం లేకుండా వుండకూడదా? ఇదే నేను కోరేది. రాముడు క్రూరుడు అంటారేమోనని విచారిస్తున్నాను. కాబట్టి, నువ్వు, నీ తమ్ముడు ఆలోచించి ఏది మేలని తోస్తే అదే చేయండి''. జవాబుగా శ్రీరామచంద్రమూర్తి ఇలా అన్నాడు సీతాదేవితో:

''దేవీ! అహింసాపరులైన ఋషులు రాక్షసులకు భయపడి వారంతట వారే, నా ప్రయత్నం లేకుండా, కడు దుఃఖంతో నాదగ్గరకు వచ్చి, నేనే దిక్కని శరణుజొచ్చారు. ఇలా నేనే దిక్కని నమ్మిన ఆ ఆశ్రితులను ఎలాగైనా పొడైపొమ్మని తిరస్కరించడం ధర్మమా? హింస నిషేధం అని నువ్వన్నావు. అది నేను అంగీకరిస్తా. హింస అంటే ఎలాంటిది? నిరపరాధులైన సాధువులను హింసించడాన్ని హింస అంటారు కాని అసాధువులను హింసించడాన్ని హింస అనరు కదా? రాక్షస వధమీద నాకున్న ఉద్దేశం ఏంటి? అదేమన్నా వినోద క్రీడా నాకు? వాళ్లను నేను, కామంతో కాని, క్రోధంతో కాని, లోభంతో కాని, మదమాత్సర్యాలతో కాని, మోహంతో కాని చంపాలనుకోవడం లేదు కదా? సాధువుల మేలుకొరకై చేసే పనిలో దోషముందా? దేవీ ఈ మునులు అడవుల్లో, అక్కడొక కాయ, ఇక్కడొక కూర తెచ్చుకుని దాంతోనే కడుపు నింపుకుని దేహయాత్ర చేస్తారు. ఇక రాక్షసులంటావా, మృగాలనే కాకుండా మనుష్యులను కూడా పీక్కుని తిని భోగాలనుభవిస్తారు. మునులు ధర్మపద్ధతిన నడుస్తే, వారు దయాదాక్షిణ్యాలు లేకుండా క్రూరపద్ధతిన నడుస్తారు. ఇలాంటి నిష్కారణ హింసాపరాయణులైన రాక్షసులను వధించి శిష్ట రక్షణ చేయడం అధర్మమా చెప్పు?''

''దండకారణ్యంలో నివసిస్తున్న మునీశ్వరుల సమూహాలు మా దగ్గరకు వచ్చి, అనేకవిధాలుగా తాము పడుతున్న దుఃఖాలను చెప్పి, తమను రక్షించాలని ప్రార్థించారు. ఏకవాక్యంగా వారంతా ఒక్కటే చెప్పారు. దండకలో వున్న రాక్షసులు తమపై పగ బూని, తాము హోమం చేస్తున్న సమయంలో తమను బాధపెట్టున్నారని, ఆ బాధ పడలేక తమకు రక్షకుడు ఎవరు వస్తారో అని విచారపడ్తుండగా, తమ పుణ్యఫలం వల్ల నేను దొరికానని అన్నారు. తపస్సు చేయడం సులువు కాదనీ, అది మిక్కిలి కష్టకార్యమనీ, అంత కష్టపడి చేద్దామంటే మధ్య-మధ్యలో విఘ్నాలు కలుగుతున్నాయనీ, తమ తపశ్శక్తి పోగొట్టుకోదల్చుకోలేక వారిని శపించడం లేదనీ, ఎంతమందిని అలా శపించగలమనీ, ఒక వేళ శపించినా తమకింక ఏ శక్తి మిగుల్తుందనీ, జీవించినా వ్యర్థమే కదా అనీ, వాళ్లన్నారు''.

వాళ్లింకా ఇలా చెప్పారు: ''తమ స్థితిగతులను ఆలోచించమనీ, రాక్షసులు చేసే పనులు ఆపుచేయించమనీ, వారి తపస్సులు సాగేట్లు చేయమనీ, వారిమీద దయచూపి రక్షించమనీ, నేనే వారికి దిక్కనీ, వేరే రక్షించేవారెవరు ఎవరూ లేరనీ, రాక్షసుల బారి నుండి కాపాడమనీ అన్నారు. వాళ్లిలా చెప్పగా వారిని కాపాడాలని ప్రతిజ్ఞ చేశాను. వట్టి మాటలు చెప్పి కన్నీళ్లు తుడిచి పంపలేదు. నాకు సత్యం అన్నింటికంటే ముఖ్యం కాబట్టి ప్రాణాలున్నంతవరకు ఆడినమాట తప్పను. నువ్వే దిక్కని నన్ను ఆశ్రయించి, ఎప్పుడుకూడా ఇతరులకు హాని కలిగించే వాటి జోలికి పోకుండా, దిక్కులేనివారిగా వున్న మునులను, రాక్షసులు పనిగట్టుకుని వధించారు. ఇంతకంటే విరోధమైన పని ఏమన్నా వుందా చెప్పు? నన్ను ఆశ్రయించేదాకా ఎవరేపాపాలు చేసినా వారి పాపఫలం వాళ్లే అనుభవిస్తారని, వారిని నేను

రక్షించే ప్రయత్నం చేయను. ఒకసారి నన్ను ఆశ్రయిస్తే, నేనే దిక్కని వారి రక్షాభారం నామీద వేస్తే, పాపకార్యాలు చేయకుండా వుండే దిక్కులేనివారిని రక్షించడమే నాపని. దానికి నేను కట్టుబడి వున్నాను. అలాంటి వారిని, నా రక్షణలో వున్నవారిని, నా ఆశ్రితులను, రాక్షసులు చంపుతున్నారు. నా భక్తులు నాప్రాణంతో సమానం. నా భక్తులను భాదించడమంటే నన్ను బాధించడమే. కాబట్టి పగకు దీనికి మించిన కారణం ఏం కావాలి? దీనికి జవాబు చెప్తే, సుమతీ, నువ్వు చెప్పినట్లే చేస్తా. ఇక నా మనోనిశ్చయం విను. సత్యాన్ని రక్షించేందుకు ప్రాణాలైన విడుస్తాను. ప్రాణాలకంటే ఇష్టమైన నిన్నైనా విడుస్తాను. నీ కంటే ప్రియమైన తమ్ముడినైనా విడుస్తాను. కాని సామాన్య విషయమైన ప్రతిజ్ఞ విడువను. అందునా, ముఖ్యంగా, బ్రాహ్మణులకు ఇచ్చిన మాట తప్పను''.

శ్రీరాముడు సీతతో ఇంకా ఇలా అన్నాడు: ''ఆశ్రిత రక్షాభారాన్ని వహించిన నేను ఆ ఆశ్రితులై, నా పరతంత్రులై, వుండే మునుల కార్యాన్ని రక్షించడం నా విధి. ఒక్క సారి వాళ్లు నాతో మేము నీ ఆశ్రితులం అని చెప్తే చాలదా? గడియ-గడియకు చెప్పాలా? నేనంత మరిచేవాడినా? వారి యోగక్షేమాలు నేను విచారించాల్సినవాడిని. అలాంటిది, వారు వచ్చి, నేను చేయాల్సిన పనిని గుర్తుచేసిన తరువాత, వారికి ప్రతిజ్ఞ చేసికూడా ఎలా నెరవేర్చకుండా వుంటాను? నువ్వు జనకరాజు కూతురువు కదా! ఇది నీకు తెలియని విషయమా? అప్పు తీసుకున్నవాడు మళ్లీ-మళ్లీ అడిగించుకోవచ్చా? అడిగించుకుని ఇవ్వడం శ్లాఘ్యమా? ఇవ్వకపోవడం శ్లాఘ్యమా? రెండూ కావు. నన్ను నమ్మి, నన్ను స్మరించి, నన్ను ధ్యానించి, అర్చించి, జపించి, సేవించి, వర్ణించి, కీర్తించి నాపై ఋణమెక్కించిన వారి ఋణం నేను తీర్చుకోవద్దా? నా భక్తుడిని నేను స్మరిస్తాను. నేను చెప్పిన మాట నెరవేర్చడం ఆలశ్యమైందని నేను విచారపడుతుండగా వారి కార్యం నెరవేర్చకుండా ఎలా వుండగలను?''.

"నాకు నీమీద, నీకు నామీద, స్నేహం-మోహం వున్న కారణాన, నువ్వు మంచి మనసున్నదానివైనందున, ఇదంతా చెప్పాను. రక్షోవధకు పూనుకున్నప్పుడు నాకు నీమీద, నీకు నామీద కల స్నేహానికి, మోహానికి విఘ్నం కలుగొచ్చునేమో అన్న నీ అనుమానం గ్రహించాను. అది సహించైనా కార్యం నెరవేర్చాలి. నువ్వు ఉత్తమ స్త్రీవికాబట్టి, నీకిలాంటి మంచిమాటలు చెప్పగలిగాను. స్నేహం, మోహం భర్తకు తమ మీద లేకపోయినా, భర్తలమీద తమకు లేకపోయినా చెప్పగలరా? చెప్పరు. కాబట్టి నువ్వు ఉత్తమగుణ సంపన్నవనీ, నిష్కపటవ్యాపారవనీ మెచ్చాను. నువ్వు పుట్టిన జనక వంశానికి, నీ శీలానికి తగినవిధంగా చెప్పాను. ఇందేం దోషం వుంది? నువ్వు సహధర్మచారిణివి. ప్రాణాలకంటే ఎక్కువ ప్రియమైన దానివి'', అని చెప్పి లక్ష్మణుడు, సీత తోడురాగా శ్రీరాముడు విల్లు ధరించాడు.

◆❖◆

సీతానసూయ సంవాదం

చిత్రకూటం దగ్గర వున్న శ్రీరాముడికి, భరతుడు వచ్చి దుఃఖపడిన విషయం పదే–పదే గుర్తుకు రాసాగాయి. మనసు అన్యాక్రాంతం అవుతున్నందున ఇక అక్కడ వుండడం వనవాసానికి ఏమాత్రం మంచిది కాదనుకుంటాడు. వెంటనే, సీతారామలక్ష్మణులు ముగ్గురూ బయల్దేరి అత్రి మహాముని ఆశ్రమానికి చేరుకుంటారు. ఆయన తన భార్య, పరమ పతివ్రత అనసూయాదేవిని సీతాదేవికి పరిచయం చేశాడు.

పరిచయం చేస్తూ అత్రి మహాముని సీతాదేవిని చూపిస్తూ అనసూయతో, "ఈ పతివ్రతా శిరోమణి భూదేవి కూతురు. ఈమెను నువ్వు గౌరవించు" అని చెప్పాడు. తరువాత అనసూయాదేవి గొప్పతనాన్ని అత్రి శ్రీరాముడితో ఇలా చెప్పాడు: "చినుకనేది కురవకుండా మనుష్యులు ఇతర జీవికోటులు మాడిపోతే, తన తపస్సుతో ఫలాలను, కందమూలాలను పది సంవత్సరాలుండేలా చేసింది. గంగానది ప్రవహించేదిగా చేసింది. పదివేల సంవత్సరాలు భర్త అనుమతితో విఘ్నం లేకుండా తీవ్ర నిష్ఠహూని తపస్సు చేసింది. దేవకార్యం నిర్వహించడానికి ఆమె పది దినాలు ఒక రాత్రిగా సూర్యోదయం అనేది లేకుండా చేసింది. వ్రతాలన్నీ సొంతం చేసి స్నాతక కర్మ జరిపింది. నువ్వు నీతల్లిలాగా ఈమెను పూజించు. నీపూజకు ఈమె యోగ్యురాలు. ఈమె సమస్త భూతాల నమస్కారాలకు యోగ్యురాలు. స్త్రీ ధర్మమైన పాతివ్రత్యానికి సంబంధించి ఇతరులకు సాధ్యంకాని కార్యాలు చేయడం వల్ల అసూయపడరానిదని కీర్తి పొందింది. నువ్వు సీతాదేవిని ఈమెకు నమస్కారం చేయమని చెప్పు". అని అత్రిమహాముని చెప్పగా శ్రీరామచంద్రమూర్తి సీతాదేవిని చూసి మునీంద్రుడు చెప్పినట్లు అనసూయను దర్శించమని చెప్పి అలా చేస్తే ఆమెకు మేలు కలుగుతుందని అంటాడు.

భర్త చెప్పినట్లే సీతాదేవి పోయి, వృద్ధురాలైన అనసూయను చూసింది. ఆమెను చూడగానే, పతివ్రతా ధర్మం ఈ రూపంలో వచ్చిందని అనే విధంగా వుందని అనిపించింది సీతకు. తన పేరు చెప్పి నమస్కారం చేసి రెండు చేతులు జోడించి నిలువబడి కుశలం అడిగింది అనసూయను. నిర్మలమైన మనసున్న

అనసూయాదేవి సంతోషంతో ధర్మాత్మురాలైన సీతతో, “సీతా! నువ్వెంత పుణ్యచరిత్రవే! పాతివ్రత్యమే గొప్పదిగా భావించి చుట్టాలను, సంపదను, సౌఖ్యాన్ని వదిలి, మహారాజు కోడలినని కాని, మహారాజు కూతురునని కాని లక్ష్యపెట్టకుండా, తండ్రిని యదార్థవాదిని చేయాలన్న ఉద్దేశంతో అడవికి వస్తున్న భర్తతో వచ్చావు. ఇలాంటి స్త్రీలు కూడా లోకంలో వుంటారా? పతివ్రతైన స్త్రీకి, భర్త ఎలాంటివాడైనా అతడే ఆమె పాలిటి దైవం. మగడి కంటే గొప్ప చుట్టం స్త్రీకి ఎవరూ లేరు. కుల ధర్మం పాటిస్తూ, మంచి పనులు చేసే పతివ్రతా రత్నానికి ఆమె ఇంకేమీ చేయకపోయినా, ధర్మాలన్నీ చేసినవారికి లభించే స్వర్గం లభిస్తుంది” అని చెప్పింది.

అసూయలేని అనసూయ చెప్పిన మాటలు విని తన మీద ఎంతో ప్రేమ వుండబట్టే ఇలా హితం బోధించిందని సీతాదేవి సంతోషించింది. అనసూయతో ఇలా అంది.

సీత అనసూయతో, “తల్లీ! నీ లాంటి పతివ్రత ఇలా చెప్పడం వింతకాదు. పతివ్రతలకు భర్తే దైవం అనే విషయం నాకూ తెలుసు. ధర్మం మీదే బుద్ధి నిలిపి, తల్లిలాగా, తండ్రిలాగా మేలెంచేవాడైన శ్రీరామచంద్రమూర్తి నాకు భర్త అయినప్పుడు సేవించడంలో ఆశ్చర్యం ఏముంది? నన్ను తప్ప మిగిలిన రాజస్త్రీలందరినీ ఆయన కౌసల్యను చూసినట్లు చూస్తాడు. వీరు తల్లుల లాంటి వారని సమదృష్టితో చూస్తాడు. నేను నా భర్తతో అడవులకు వచ్చేటప్పుడు నా అత్తగారు, పెళ్లి చేసుకున్నప్పుడు మా తల్లి, పాతివ్రత్యాన్ని గురించి చాలా మాటలు చెప్పారు. అవన్నీ మనసులో నాటుకున్నాయి. కాని పాతబడ్డాయి. ఇప్పుడు నువ్వు వాటిని కొత్తగా మనసుకు నచ్చేట్లు చెప్పి బలపర్చావు. తల్లీ! నా అభిప్రాయంలో స్త్రీలకు పతి శుశ్రూష తప్ప వేరే తపస్సు అక్కరలేదు”.

ఆ మాటలకు అనసూయ సంతోషించి సీతను దగ్గరకు తీసుకుని శిరస్సు వాసనచూసి ఇలా అంది: “అమ్మా! ఇంపైన నీ మాటలతో నాకు చాలా సంతోషం కలిగింది. నీకేం కావాలో కోరుకో. నా తపోబలం వల్ల నీకు అది కలిగిస్తా”. అనసూయ మాటలకు ఆశ్చర్యపడ్డ సీత ఆమె తనను పరీక్షిస్తున్నదనుకుని, ఆమె దయవల్ల తనకే కొరత లేదనీ, తానేం కోరాలింకా అని అంటుంది.

సీతాదేవి అన్న మాటలకు అనసూయ ప్రీతి చెందింది. “ఈ పూల దండలు, ఈ వస్త్రం, ఈ సొమ్ములు, ఈ మైపూతలు, ఈ పరిమళ ద్రవ్యాలు అన్నీ దేవతా సంబంధమైనవే. భూలోకవాసులకు లభించవు. మనసుకు సంతోషం కలిగిస్తాయి ఇవన్నీ. ఈ పూలదండలు వాడిపోవు, వీడిపోవు, వాసన పోదు. నీకివి అందంగా వుంటాయి. వీటిని నువ్వు ధరిస్తే ప్రకాశిస్తూ, పూర్ణకాంతితో, మనోహర దేహంతో, లక్ష్మీదేవి విష్ణువును సంతోషపెట్టినట్లు సంతోషపెట్తావు” అని ప్రేమతో అనసూయ ఇవ్వగా, సీతాదేవి సంతోషించి, వాటిని తీసుకుని, నిర్మలమైన భక్తితో ఆ ముని భార్యకు కృతజ్ఞతా సూచకంగా నమస్కారం చేసి ఆమె పక్కన కూచుంది. ఇలా తన పక్కన కూచున్న సీతతో అనసూయ సరదాగా కబుర్లాడుతూ ఇలా అంది.

“నిన్ను రామచంద్రమూర్తి తన పరాక్రమంతో స్వయంవరంలో పెళ్లి చేసుకున్నాడని మాటమాత్రంగా వినడమే కాని, అదెలా జరిగిందో వివరంగా వినలేదు. అ కథ వినాలని వుంది. జరిగినదంతా వివరంగా చెప్పు” అని అనసూయ అడిగింది.

జవాబుగా సీతాదేవి, "అమ్మా! చెప్తా విను. నా తండ్రి జనకుడు క్షాత్ర ధర్మం అంటే ప్రీతికలవాడు. విదేహ దేశానికి రాజు. ఒకనాడు యజ్ఞం చేయడానికి నేల దున్నిస్తుంటే నాగేటి కర్రు తగిలి నేల పెళ్లలు లేచివచ్చి నేను భూమిలోనుండి బయటకు వచ్చా. అప్పుడు ధాన్యం చల్లడానికి పిడికిట్లో గింజలు వుంచుకున్న జనకుడు నన్ను చూసి ఆశ్చర్యపడి తన కన్నకూతురులాగా నన్ను ఆయన తన కుడి తొడమీద కూర్చుండబెట్టుకుని తన కూతురని చెప్పాడు. ఆకాశవాణి కూడా నేను ఆయన కూతురునే అంది. ఆకాశవాణి మాటలకు సంతోషించిన జనకుడు నన్ను తన పెద్ద భార్యకు ఇచ్చాడు. ఆమె నన్ను తన కన్నబిడ్డలాగా చూసుకుంది. పెంచింది. నాకు వివాహయోగ్య దశ రావడం గమనించిన తల్లిదండ్రులు ఆ దిశగా ఆలోచన చేయసాగారు. ఈ కన్య ఇలాంటి గొప్ప గుణాలు కలది కదా! దీనికి తగిన వాడిని, సద్గుణ సంపత్తికలవాడిని, గొప్పవాడిని, ఏవిధంగా భర్తగా సంపాదించగలనని జనకుడు విచార సముద్రంలో మునిగిపోయాడు. తల్లిగర్భంలో పుట్టని సుందరినైన నాకు, దేవకన్యలాంటి నాకు, తగినవాడిని, మన్మథాకారుడిని, సమానుడైన వాడిని సంపాదించాలని వెతికాడు కాని ఎవరూ దొరకలేదు. అప్పుడు స్వయంవరం చాటిస్తే బాగుంటుందని ఆలోచనచేశాడు".

"ఈ ప్రకారం ఆలోచించి, తాను చేసిన ఒక గొప్ప యజ్ఞంలో వరుణుడు తనకు ఇచ్చిన మనుష్యులు కదిలించ సాధ్యపడని వింటిని, రాజులు కలలో కూడా ఎక్కుపెట్టలేని వింటిని, అక్షయబాణాలను, తాను పిలిపించిన రాజులందరికీ చూపించాడు. ఆ విల్లెక్కుపెట్టిన వాడు తన కూతురుకు భర్త కాగలడని ప్రకటించాడు. అక్కడికి వచ్చిన రాజులు దానిని ఎత్తలేక, చూడగానే భయపడి, దానికి ఒక నమస్కారం చేసి పోయారు. చాలాకాలం ఇలాగే గడిచి పోయింది. రాజకుమారులెవరూ దానిని ఎక్కుపెట్టలేక పోయారు".

"అప్పుడు విశ్వామిత్రుడు మా తండ్రి చేసే యజ్ఞం చూడడానికి రామలక్ష్మణులను తీసుకొచ్చాడు. మా తండ్రికి, మన్మథులలాగా వున్న సుకుమారులైన వారిద్దరినీ, దశరథరాజ పుత్రులను పరిచయం చేశాడు. చేసి, ఆయన దాచిపెట్టిన వింటిని శ్రీరామచంద్రమూర్తికి చూపించమని అన్నాడు. జనకుడలాగే చేశాడు. విశ్వామిత్రుడి మాట ప్రకారం శ్రీరాముడు వింటిని సమీపించాడు. ఆ వింటిని శ్రీరాముడు అనాయాసంగా ఎక్కుపెట్టి, అల్లెతాడు గట్టిగాపట్టి లాగగా చూసేవారు భయపడేట్లు, పిడుగుపడ్డ ధ్వనితో అది రెండుగా విరిగింది. విల్లు ఎక్కుపెట్టిన, విరిచిన వారికి తన కూతురును ఇచ్చి వివాహం చేస్తానని ప్రతిజ్ఞచేసిన మా తండ్రి తన మాట ప్రకారం శ్రీరామచంద్రమూర్తికి నన్ను కన్యాదానం చేయడానికి జలపాత్ర చేతిలో తీసుకున్నాడు. కాని తమ తండ్రి అభిప్రాయం తెలుసుకోవాలని చెప్పి శ్రీరాముడు దానం తీసుకోలేదు. అప్పుడు మా తండ్రి దశరథ మహారాజు దగ్గరకు దూతలను పంపాడు. మా తండ్రి ఆహ్వానాన్ని ఆదరించి దశరథమహారాజు వచ్చాడు. శ్రీరామచంద్రుడికి నన్ను, నా చెల్లెలు ఊర్మిళను లక్ష్మణుడికి దానం చేశాడు జనకుడు. ఈ విధంగా నేను శ్రీరామచంద్రమూర్తిని వివాహం చేసుకున్నా".

సీతాదేవి ఇలా చెప్పగా విన్న అనసూయాదేవి ఇలా అంది: "సీతాదేవీ, మధురంగా నీ స్వయంవర చరిత్ర చెప్పావు. సీతమ్మా! రాత్రి సంచరించే జంతువులు తిరగడం మొదలుపెట్టాయి. తపస్వులు, సాదుకునే జింకలతో శయనించారు. చూశావా? రాత్రి చాలా గడిచింది. చంద్రముఖీ! ఆకాశం

నక్షత్రసమూహంతో ప్రకాశిస్తున్నది. వెన్నెల ముసుగేస్తుంటే చంద్రుడు ఉదయించాడు. అదిగో చూడు. ఇక నువ్వు శ్రీరామచంద్రమూర్తి దగ్గరకు పో. నిన్ను చూడడం వల్ల, నీతో మాట్లాడడం వల్ల నాకెంతో సంతోషం కలిగింది. నేను నీకిచ్చిన చీరెలు, సొమ్ములు, వాసన ద్రవ్యాలు నా ఎదుట ధరిస్తే సంతోషిస్తా".

సీత అలాగే చేసి అనసూయకు నమస్కారం పెట్టి శ్రీరామచంద్రమూర్తి దగ్గరకు పోయింది. ఆయన సీతను చూసి సంతోషించాడు. అనసూయతో తనకు జరిగిన సంభాషణ అంతా చెప్పి ముని భార్య తనకు చీరె, పూల దండలు, సువాసన ద్రవ్యాలు ఇచ్చిన విషయం చెప్పింది. మనుష్యులకు లభించని బహుమానాలను చూసి శ్రీరామలక్ష్మణులు సంతోషించారు. ఆ రాత్రి నిద్రపోయి సూర్యుడు ఉదయించగానే లేచి, సంధ్యావందనం లాంటి ప్రాతఃకాల కృత్యాలను తీర్చుకుని, మునీశ్వరుల దీవెనలు తీసుకుని సీతారామలక్ష్మణులు ప్రయాణమయ్యారు.

◆❖◆

పరిణామవాదానికి లేదు ప్రాణ భయం!

ఆంధ్రవాల్మీకి, కవిసార్వభౌమ వావిలికొలను సుబ్బారావు (వాసుదాసు) శ్రీమదాంధ్ర వాల్మీకి రామాయణం మందరం, అయోధ్యాకండ చివర్లో శ్రీరాముడి దినచర్య గురించి వివరించారు. సాధువులను రక్షించడానికి, పాపాత్ములను నాశనం చేయడానికి, ధర్మ స్థాపన కొరకు, ప్రతియుగంలో శ్రీమన్నారాయణుడు భూమ్మీద అవతరిస్తుంటాడు. ఈ అవతారాలే మళ్లీ-మళ్లీ పునరావృతమవడం వల్ల, ఇప్పటికి ఎన్ని మత్స్యావతారాలు, నృసింహావతారాలు, శ్రీరామావతారాలు, కృష్ణావతారాలు అయ్యాయో చెప్పడం కష్టం. మళ్లీ-మళ్లీ అవతారాలు వచ్చినప్పుడు, వారితో పాటే మళ్లీ-మళ్లీ హిరణ్యాక్ష-హిరణ్యకశిపులు, బలిచక్రవర్తి, రావణ-కుంభకర్ణులు, కంస-శిశుపాలులు లాంటి వారు కూడా రావాలికదా? వారు వచ్చినప్పుడు వారి సహాయకులు, సహచరులు, తల్లిదండ్రులు, అవతార పురుషుడికి కావాల్సినవారు రావాలి కదా? అలాంటప్పుడు పరిణామవాదం తప్పవుతుంది కదా? అలాగే ముక్తి, జన్మరాహిత్యం అనే పదాలు వ్యర్థమైనవే కదా?

అవతారాలు రావడం నిజమే. వారికి కావాల్సినవారు, విరోధులు రావడం కూడా నిజమే. బ్రహ్మేంద్రాదులు, అష్టదిక్పాలకులు, సూర్యచంద్రులు, సప్తర్షులు....అందరూ పుట్టడం యదార్థమే. అయినా పరిణామ వాదం తప్పుకాదు. ముక్తి అనేది వ్యర్థపదం కానేకాదు. బ్రహ్మ, రుద్ర, అగ్ని, వరుణుడు...లాంటి పదాలన్నీ ఆయా పదవుల పేర్లే కాని ఆ ఉపాధిలో వుండే జీవాత్మల పేర్లు కావు. కలెక్టర్, డిప్యూటీ కలెక్టర్, తహసీల్దార్ అనే పదవుల్లో వుండేవారు మళ్లీ-మళ్లీ వచ్చారంటే, అదే మనిషి వచ్చాడని అర్థం కాదు. అలాగే బ్రహ్మ, రుద్ర, అగ్ని, వరుణుడు అనే పదవుల్లో వున్నవారు పోగానే, ఆ స్థానం ఖాళీ కాగానే, మరో అర్హుడు ఆ స్థానంలో నియమించబడుతాడు. వాడి ఉద్యోగం వాడు చేస్తాడు. ఇలా వచ్చేవాడు భిన్న జీవుడే కాని ఇంతకు ముందు వున్నవాడు కాదు. కాబట్టి పరిణామ వాదానికి ప్రాణ భయం లేదు.....ముక్తుడికి పునర్జన్మ భయం లేదు. ఒక స్థానంలో రెండు జీవులుండవు. జీవయాత్రా విషయంలో పరిణామమే సరైన మార్గం.

బ్రహ్మాండకోటులు అనంతం. జీవకోటులూ అనంతమే. ప్రపంచం నిత్యం. సంసారం నిత్యం. కాలం నిత్యం. నది ఒడ్డున నిలుచుని చూస్తుంటే నీళ్లు, నీటి బిందువులు దాటిపోతూనే వుంటాయి. వాటి స్థానంలో మరికొన్ని వస్తాయి. ఒక నీటి బిందువు సముద్రంలో ప్రవేశించగానే ఆద్యంతాలలో శూన్య స్థానం లేనట్లే, జీవుడు ముక్తుడు కాగానే ఆ స్థానంలో కాని, ఆదిలో కాని, శూన్యం వుండదు.

శ్రీరామవతారం వైవస్వత మన్వంతరంలో ఐదవ మహాయుగమైన త్రేతాయుగంలో సంభవించింది. కృతయుగానికి 1728000 సంవత్సరాలు, త్రేతాయుగానికి 1296000 సంవత్సరాలు, ద్వాపరయుగానికి 864000 సంవత్సరాలు, కలియుగానికి 387000 సంవత్సరాలు కలిపి మొత్తం ఒక మహాయుగానికి 4275000 సంవత్సరాలు వుంటాయి. ఇలాంటి వేయి మహాయుగాలు బ్రహ్మకు ఒక పగలు, మరో వేయి మహాయుగాలు ఒక రాత్రి అవుతుంది. ఇవి రెండూ కలిస్తే ఒక రోజవుతుంది. దాన్నే కల్పం అంటారు. 360 కల్పాలు బ్రహ్మకు ఒక సంవత్సరం. 36000 కల్పాలు బ్రహ్మాయువు. త్రిమూర్తులలో అవతారాలు ఒక్క విష్ణువుకే కాని మిగతా ఇద్దరికీ లేవు. విష్ణువు రాజసుడైన బ్రహ్మను సృష్టికార్యానికి, తామసుడైన శివుడిని సంహారకార్యానికి, నియమించి, రక్షాభారాన్ని తనమీద వేసుకుని, దానికి అవసరమైన విధంగా ప్రవర్తించాడు. ఆ క్రమంలోనే మనిషి రూపంలో త్రేతాయుగంలో, రామావతారంగా జన్మించాడు.

శ్రీరాముడి జనన కాలంలో గురువు, చంద్రుడు, కర్కాటక లగ్నంలో వున్నారు. అంటే జన్మ లగ్నం కర్కాటకం కాగా, మేషంలో రవి–బుధులు, తులలో శని, మకరంలో కుజుడు, మీనంలో శుక్రుడు వున్నారు. ఆయన పుట్టిన సంవత్సరం విలంబి. నక్షత్రం పునర్వసువు. ఇది నిర్ధారించడానికి శ్రీమద్రామాయణంలో ఆధారాలు లేవు. శ్రీరంగమహాత్మ్యం అనే గ్రంథంలో భగవంతుడు బ్రహ్మకు చెప్పిన మాటల ఆధారంగా కొంత తెలుస్తున్నది. తాను రఘువంశం వారు పాలించే అయోధ్యకు పోవాలని అనుకుంటున్నాననీ, అక్కడ నాలుగు మహాయుగాలుంటాననీ, ఆ తరువాత కావేరీ తీరానికి పోయి చంద్ర పుష్కరిణీ తీరంలో శయనిస్తాననీ చెప్పాడు బ్రహ్మతో. విష్ణువు ఆజ్ఞానుసారం బ్రహ్మ తాను అర్చిస్తున్న శ్రీరంగధామాన్ని ఇక్ష్వాకు మహారాజుకు ఇచ్చాడు.

తదనంతరం జరిగిన పరిణామంలో, ఐదవ త్రేతాయుగంలో కొడుకులకై దశరథుడు అశ్వమేధ యాగాన్ని చేశాడు. ఆ యుగంలోనే శ్రీరామ జననం అయింది. జన్మించింది విలంబినామ సంవత్సరం కాబట్టి హేవిలంబిలో అశ్వమేధయాగం, పుత్రకామేష్టి చేశాడు. దుర్ముఖి చైత్రమాసంలో అశ్వం విడిచారు. పునర్వసువు నక్షత్రంలో బుధవారం నాడు శ్రీరామజననం. భరతుడు గురువారం పుష్యా నక్షత్రంలోను, లక్ష్మణ–శత్రుఘ్నులు శుక్రవారం ఆశ్లేషా నక్షత్రంలోనూ జన్మించారు. చైత్ర బహుళ పంచమి నాడు నామకరణం జరిగింది. పరాభవ సంవత్సరంలో తొమ్మిదో ఏట ఉపనయనం జరిగింది. అరణ్యవాసానికి పోయేటప్పుడు శ్రీరాముడికి 25 సంవత్సరాలు కాగా, సీతాదేవికి 18 సంవత్సరాలు. శ్రీరాముడికి 12 ఏళ్ల వయసున్నప్పుడు, సౌమ్యనామ సంవత్సరంలో యాగరక్షణ కొరకు విశ్వామిత్రుడి వెంట అరణ్యాలకు పోయాడు. ఈ విషయం మారీచుడు రావణాసురుడితో సీతాపహరణం ముందర

చెప్పినట్లు రామాయణంలో వుంది. దశరథుడు విశ్వామిత్రుడికి చెప్పిన మాటలనే మారీచుడు రావణుడికి చెప్పాడు.

శ్రీరాముడికి 12 సంవత్సరాల వయసున్నప్పుడు, సీతకు ఆరేళ్ళ వయసులో వారి వివాహం జరిగింది. దీనికి దృష్టాంతరంగా విశ్వామిత్రుడి యాగం కాపాడడానికి రామలక్ష్మణులు వెళ్లిన రోజు నుంచి మిథిలా నగరం వెళ్లడం వరకు తీసుకోవచ్చు. సౌమ్యనామ సంవత్సరం మాఖ బహుళంలో శ్రీరామలక్ష్మణులు విశ్వామిత్రుడి వెంట పోయారు. 15 వ నాటి ఉదయం మిథిలా ప్రవేశం చేసి, శివ ధనుర్భంగం చేశాడు. 27 వ రోజున శుక్ల త్రయోదశి శుభ దినం కాబట్టి, ఉత్తర ఫల్గుణీ నక్షత్రంలో సీతారాముల కల్యాణం జరిగింది. ఉత్తర ఫల్గుణీ నక్షత్రం శ్రీరాముడి జన్మ నక్షత్రానికి ఆరవది.

అంటే, 27 వ రోజు ఫాల్గున శుద్ధ త్రయోదశి అయితే, అయోధ్య నుండి బయల్దేరిన రోజు మాఘబహుళ విదియ కావాలి. విదియ-హస్తా రోజు ప్రయాణానికి మంచి రోజే. అది శ్రీరాముడికి ధృవతార కూడా అవుతుంది. కాబట్టి ఆ రోజున హస్త పోయిన తరువాత అభిజిల్లగ్నంలో ప్రయాణమై వుండాలి. సీతారాముల కళ్యాణమైన తరువాత, అంటే, బహుళ విదియతో ముగిసి, తదియనాడు జనకుడు బిడ్డలకు అరణాలిచ్చిన తరువాత, చవితినాడు అప్పగింతలై, ఫాల్గుణ బహుళ పంచమి నాడు అయోధ్యకు ప్రయాణమయ్యారు. షష్టి-సప్తముల్లో పరశురాముడి గర్వభంగం అయింది. దశమినాడు అయోధ్య ప్రవేశం జరిగింది. ఆ తరువాత 12 సంవత్సరాలు సుఖసంతోషాలతో గడిచింది. ఆ విధంగా బాల కాండ మొత్తం 24 సంవత్సరాల వృత్తాంతం.

దుందుభి నామ సంవత్సర చైత్ర శుద్ధ చవితినాడు దశరథుడు, శ్రీరాముడికి పట్టాభిషేకం చేయాలని పౌరులతో-మంత్రులతో ఆలోచన చేసి, పంచమి నాటి ఉదయం పుష్యా నక్షత్రంలో యౌవరాజ్య పట్టాభిషేకం జరిపించాలని నిర్ణయించాడు. మరో రకంగా చెప్పాలంటే, చైత్ర శుద్ధ పంచమే వనవాసారంభమైన రోజు. మర్నాడు గంగాతీర వాసం, ఆ మర్నాడు గుహుడి దర్శనం. అయోధ్య విడిచిన మూడో రోజు సప్తమినాడు జడలుజడలు ధరించడం, నాలుగోనాడు అష్టమి రోజున భరద్వాజాశ్రమం వెళ్లడం జరిగింది. ఐదవనాడు నవమిన యమున దాటారు. ఆరవనాడు దశమీ రోజున చిత్రకూటమి వెళ్లి వాల్మీకి దర్శనం చేసుకుని, పర్ణశాల నిర్మించుకున్నారు. అదే రోజున అక్కడ అయోధ్యలో దశరథుడు మరణించాడు.

శ్రీరాముడు అయోధ్య విడిచిన 17 వ రోజున భరతుడు అక్కడికి చేరుకున్నాడు. మర్నాడు తండ్రికి కర్మలు ప్రారంభించాడు. 29 వ రోజున కర్మకాండలన్నీ పూర్తయ్యాయి. మర్నాడు 30 వ రోజున వైశాఖ శుద్ధ చవితినాడు రాజకర్తలు భరతుడిని రాజ్యభారం వహించమని కోరారు. 31 వ రోజున పంచమీ నాడు సభకు వచ్చిన భరతుడిని వసిష్ఠుడు పట్టాభిషేకం చేసుకొమ్మని అడిగాడు....భరతుడు తిరస్కరించాడు. మర్నాడు వైశాఖ శుద్ధ షష్ఠి రోజున భరతుడు చిత్రకూటానికి బయల్దేరాడు. అదే రోజున గుహుడిని కలిశాడు. మర్నాడు సప్తమినాడు జడలు ధరించాడు....భరద్వాజుడి విందు స్వీకరించాడు. 34 వ రోజున, వైశాఖ శుద్ధ అష్టమి నాడు, చిత్రకూటానికి బయల్దేరి శ్రీరామదర్శనం చేసుకున్నాడు. అదే

రోజున రాముడు తండ్రికి నీళ్లు విడిచాడు. 35 వ రోజున రామ–భరత సంభాషణ అనంతరం మర్నాడు భరతుడికి తన పాదుకలను ఇచ్చాడు శ్రీరాముడు. అదే రోజు, అంటే, వైశాఖ శుద్ధ దశమిన భరతుడు అయోధ్యకు చేరాడు. 37 వ రోజున వైశాఖ శుద్ధ ఏకాదశి నాడు భరతుడు నందిగ్రామం చేరాడు.

భరతుడు వెళ్ళిపోయిన తరువాత పౌర్ణమి వరకు చిత్రకూటం లోనే వుండి సీతారామలక్ష్మణులు, వైశాఖ బహుళ పాడ్యమినాడు అత్రి ఆశ్రమానికి చేరారు. సీత అనసూయతో సంభాషణ చేసింది కూడా ఆ రోజో లేదా మరునాడో అయ్యుండాలి.....ఎందుకంటే అనసూయ చంద్రవర్ణన చేసింది కాబట్టి.... ఏదేమైనా ప్రాణ భయం లేనిదే పరిణామవాదం!

శ్రీరాముడి దండకారణ్య ప్రవేశం

చిత్రకూటం నుండి సీతారామలక్ష్మణులు దండకారణ్యం ప్రవేశించారు. శ్రీమద్రామాయణంలో శ్రీసీతారామలక్ష్మణులు మినహా, తక్కినవారందరూ సందర్భానుసారంగా వచ్చినవారే. ఈ ముగ్గురి సంబంధం చిద చిదీశ్వరుల సంబంధాన్ని తెలుపుతున్నది. ప్రకృతికి అధిష్ఠాన దేవత లక్ష్మి. ఆమె సీత. ఈమె చైతన్య స్వరూపిణి. ప్రకృతి బద్ధాత్మ స్థానంలో ఈమె చెప్పబడింది. లక్ష్మణుడు ప్రకృతి సంసర్గంలేని జీవుడు. కాబట్టే ఈయన్ను భార్యతో జంజాటంలేని వాడిగా చెప్పడం జరిగింది. శ్రీరాముడు ఈశ్వరుడు. ప్రకృతి బద్ధజీవుడు, శుద్ధజీవుడు. ఇరువురూ ఈశ్వరుడిని ఆశ్రయించి, ఆయనకు శేషభూతులై వుండేవారే. ఈ తత్వం తెలిసినవాడు ముక్తుడవుతాడని భగవద్గీతలో చెప్పబడింది. శ్రీమద్రామాయణం ఈ ముగ్గురి సంబంధమనే విషయం ఆద్యంతం బోధిస్తున్నది.

శ్రీరామచంద్రమూర్తి భయంకరమైన క్రూర మృగాలతో కూడిన దండకారణ్యంలో ప్రవేశించి, అక్కడ నానారకాలైన సుందర వృక్షాలతో అందంగా, శుభంగా వున్న మునీశ్వరుల ఆశ్రమాలను చూశాడు. ఫలాలు, కందమూలాలు ఆహారంగా, ఇంద్రియ నిగ్రహం కలిగి, నారచీరెలు, జింకచర్మాలు కట్టి, బ్రహ్మ వర్చస్సుతో సూర్యాగ్నులలాగా ప్రకాశించే మునులున్నారక్కడ. వానప్రస్థ, సన్న్యాసాశ్రమం స్వీకరించిన వారితో, తపస్వులతో, వేదనాదంతో, పరబ్రహ్మజ్ఞానం కలవారితో నిండివున్న ఆ ప్రదేశంలోకి ప్రవేశించాడు శ్రీరాముడు.

శ్రీరామచంద్రమూర్తిని, లక్ష్మణుడిని, సీతాదేవిని మునులంతా మంగళాశాసనాలు చేసి సేవించారు. ధర్మాత్ములైన ఆ ఋషీశ్వరులు తమ పర్ణశాలకు రామచంద్రమూర్తిని పిలుచుకునిపోయి, ఆసనం చూపించి, కూర్చుండబెట్టి, కందమూలాలు, ఫలాలు, పుష్పాలు సమర్పించి చేతులు జోడించి ఇలా తమను రాక్షసుల నుండి రక్షించమని వేడుకుంటారు. "మమ్మల్ని రక్షించే భారం సర్వకాల సర్వావస్థలలో నీమీదే వుంది. అందుకే నువ్వు మమ్మల్ని రక్షించాలి. నువ్వు ఎక్కువ దయకలవాడివి కదా! నీమీద మా రక్షాభారం వేసి నిన్నే నమ్ముకుని వుంటాం" అని అంటారు. శ్రీరామచంద్రమూర్తి వారి ఆతిథ్యాన్ని

స్వీకరించి, అక్కడే నిద్రించి, ఉదయాన అడవిలోకి పోయాడు.

అడవిలో పోతున్న శ్రీరామచంద్రమూర్తి పర్వత శిఖరంలాగా పొడగాటి దేహంతో, పెద్ద ధ్వని చేస్తూ మనుష్యులను తినేవాడిగా, లోతైన పెద్ద కళ్లతో, భయంకరమైన పెద్ద నోటితో, భయంకరమైన వికార ఆకారంతో, కొత్తగా నెత్తురుకారే పులిచర్మం కప్పుకుని, మూడులోకాలని మింగే విధంగా నోరు తెర్చుకుని, యముడిలాగా భూతాలకు భయంకరంగా వుండి, నాలుగు పులులు, రెండు తోడేళ్లు, పది దుప్పులు, ఏనుగుతల శూలంకొనలో గుచ్చి, పెద్దగా బొబ్బలు పెట్తూ వున్న విరాధుడు అనే క్రూరుడుని చూశాడు. ఆ విరాధుడు తటాలున వాళ్లమీద పడ్డాడు. పడి, సీతాదేవిని ఎత్తుకుని, చంకలో వుంచుకుని, శ్రీరామలక్ష్మణులతో వారి నెత్తురు తాగుతానన్నాడు.

లక్ష్మణుడు, రాక్షసుడివైపు తిరిగి, వాడెవడని ప్రశ్నించాడు. ముందు వారెవరో చెప్పాలనీ, వారెక్కడికి పోతున్నారనీ, విరాధుడు జవాబుగా ప్రశ్నించాడు. దానికి శ్రీరామచంద్రుడు తాము ఇక్ష్వాకు వంశంలో పుట్టిన క్షత్రియులమనీ, అడవిలో తిరుగుతున్నామనీ, పాపాత్ములం కాదనీ అన్నాడు. జవాబుగా విరాధుడు: ''నా తండ్రి జయుడు, నా తల్లి శతహ్రద. నన్ను దనుజులందరూ విరాధుడు అని పిలుస్తారు. నేను తపస్సు చేసి శస్త్రంతో చావకుండా బ్రహ్మ నుండి వరం పొందా. నరకబడడం వల్ల, చీల్చబడడం వల్ల, చంపబడకుండా వరం పొందా. మీరు బతకాలనుకుంటే ఈ స్త్రీని నాకు వదిలి వెళ్లండి. ఈమెను నాకు వదిలితే మిమ్మల్ని చంపను'' అని అన్నాడు.

విరాధుడు చెప్పిన మాటలకు కోపగించిన శ్రీరామచంద్రుడు, "ఓరీ! నీచ రాక్షసుడా! దుష్టుడా! నీ అంతట నువ్వే చావును వెతుక్కుంటూ వచ్చావు. నా ఎదురుగా నిలబడి మరల బతికిపోతావా?" అంటూ బాణం ఎక్కుపెట్టాడు. పదునైన బాణాలను రాక్షసుడిమీద వేశాడు. రాముడు ఏడు బాణాలను విరాధుడి రొమ్ము దూర్పోయే విధంగా వేయగా, అవి కొండ లాంటి వాడి దేహాన్ని చీల్చి, ఎర్రగా మారిపోయి, భూమిలోకి పోయాయి. బాణాల తాకిడి బాధను సహించలేని విరాధుడు జానకిని నేలమీద వదిలి, శూలం తీసుకుని రామలక్ష్మణులను సమీపించాడు. రామలక్ష్మణులిరువురూ ఆ రాక్షసుడి మీద పదునైన బాణాలను వర్షంలాగా కురిపించారు. వారు వేసిన బాణాలను చూసిన విరాధుడు, ఈ బాణాలు తననేమీ చేయలేవని నవ్వి, తన భయంకరమైన శరీరాన్ని పెంచాడు. దేహంలో నాటుకుని పోయిన బాణాలన్నీ నేలరాలాయి. శ్రీరామచంద్రమూర్తి మరి కొన్ని బాణాలను వేశాడు. శ్రీరామలక్ష్మణులు వేస్తున్న పదునైన బాణాలను చూసి రాక్షసుడు నవ్వాడు. వాళ్లూ వదలకుండా వీడిపై బాణాలు వేయసాగారు. వాటివల్ల బాగా బాధకలిగిన విరాధుడు, ప్రాణాలను బిగపట్టుకుని, రామలక్ష్మణులపై వజ్రసమానమైన శూలాన్ని విసిరాడు. మండుతూ వస్తున్న ఆశూలాన్ని చూసి శ్రీరాముడు దాన్ని రెండు బాణాలతో నరికాడు. భూమి కంపించే విధంగా అది నేలరాలింది. వాడి శూలం విరగగానే, రామలక్ష్మణులిద్దరూ వాడి మీద దూకారు. దూకి తమ కత్తులతో వాడిని కొట్టారు. అప్పుడా రాక్షసుడు వాళ్లిద్దరినీ ఎత్తుకుని ఆకాశంలో పరుగెత్తాడు. అడవి మధ్యలోకి వాళ్లను తీసుకుని వెళ్లి తమను చంపాలన్న వాడి కోరికను గ్రహించాడు శ్రీరాముడు. వాడు ఎక్కడికి తీసుకునిపోతే అక్కడికే పోదామనీ, అదే మన మార్గమనీ శ్రీరాముడు లక్ష్మణుడితో అన్నాడు.

చంటి పిల్లను ఎత్తుకున్న విధంగా రామలక్ష్మణులను భుజాలమీద ఎత్తుకుని అడవిలో పోతున్న ఆ విధానం చూసిన సీతకు భయం కలిగింది, ఏడ్చింది. సీత ఏడుపు మాటలు విన్న శ్రీరామలక్ష్మణులు రాక్షసుడిని చంపడానికి తొందరపడసాగారు. విరాధుడి కుడి భుజమందున్న లక్ష్మణుడు వాడి ఎడమ చేతిని, ఎడమ భుజాన వున్న శ్రీరాముడు వాడి కుడిచేతిని నరికారు. విరాధుడు ఆయుధాలతో చచ్చేవాడు కాదు. చేతులు లేనివాడయ్యాడు. కాబట్టి వాడిని మోచేతులతో, మోకాళ్లతో గుద్ది, పైకెత్తి కింద పడేశారు. కత్తులతో నరికినా, బాణాలతో గుచ్చినా, నేలమీద వేసి గుద్దినా, చావని ఆ కఠిన రాక్షసుడిని చూసిన శ్రీరాముడు లక్ష్మణుడితో , వీడిని ఒక గుంట తీసి పూడుద్దామన్నాడు. ఇది విన్న విరాధుడు, రాముడితో, తాను ఆయన చేతిలో చచ్చిపోయాననీ, అజ్ఞానం వల్ల ఆయన ఎవరైందీ తెలుసుకోలేక పోయాననీ, అని తన శాప విషయాన్ని గురించి చెప్పాడు.

విరాధుడిలా అన్నాడు: “ శ్రీరామచంద్రా! మీరెవరో ఇప్పుడు తెలుసుకున్నా. శ్రీరాముడివి నీవు. అవతార మూర్తైన భవంతుడవని, సీతాదేవి లక్ష్మి అని తెలుసుకొంటిని. నేను పూర్వం తుంబురుడనే గంధర్వుడిని. రంభతో కూడి కామావేశాన మర్యాద తప్పి సంచరిస్తుంటే కుబేరుడు నన్ను రాక్షసుడివి కమ్మని శపించాడు. శాపం తొలగే ఉపాయం కూడా ఆయనే చెప్పాడు. దశరథ కుమారుడు శ్రీరాముడు ఎప్పుడు నన్ను చంపుతాడో అప్పుడు నాకు రాక్షసత్వం పోతుందని, గంధర్వ రూపం వస్తుందని అన్నాడు. శ్రీరఘురామచంద్రమూర్తీ! నీ కరుణవల్ల భయంకరమైన శాప బాధ తొలగింది. మీ దర్శనం వల్ల కృతకృత్యుడనయ్యాను. స్వర్గానికి పోతాను. దయ చేసి ఆజ్ఞ ఇవ్వు. మీకు మేలు కలుగుగాక! ఈ దారిలో ఒకటిన్నర ఆమడ దూరం పోయాక అక్కడ సూర్యతేజుడైన శరభంగ మహర్షి వున్నాడు. ఆయన్ను మీరు దర్శించండి. మేలు కలుగుతుంది. నన్ను పూడ్చి వేయండి. ఆ తరువాత అక్కడికి పోండి శ్రీరామచంద్రమూర్తీ! ఏనుగును పూడ్చడానికి ఎంత గుంత తవ్వుతారో అంతది తవ్వండి'' అన్నాడు. వెంటనే చనిపోయాడు.

శ్రీరామచంద్రమూర్తి చెప్పిన విధంగా లక్ష్మణుడు విరాధుడి దేహం పక్కనే వెంటనే ఒక గుంత తవ్వాడు. శ్రీరామలక్ష్మణులు కల్సి వాడి శరీరాన్ని ఆ గుంతలో వేశారు. ఇంకా ప్రాణంతో వున్న విరాధుడు, శ్రీరామలక్ష్మణులు బలవంతంగా గుంతలో పడేయగానే, భయంకరమైన ధ్వని చేస్తూ, దాంట్లో పొర్లాడు. వాడిని పిడికి పోటులతో చంపారు రామలక్ష్మణులు. ఊపిరితో పూడ్చరాదు కాబట్టి చంపి మరీ పూడ్చారు. శ్రీరామలక్ష్మణులు విరాధుడిని ఈ విధంగా చంపి, సంతోషించి, ఆ గోతిని పెద్ద రాయితో పూడ్చారు. ఇలా చేసి, దూరంగా వుంచిన వారి బాణాలను మరల తీసుకుని, సీతాదేవి దగ్గరకు పోయారు.

పంచవటి ఏది?

మౌని సుతీక్ష్ణుడు శ్రీరాముడిని అగస్త్యాశ్రమానికి పొమ్మని చెప్తాడు. ఆయన చెప్పినట్లే అక్కడికి బయల్దేరి పోయారు సీతారామలక్ష్మణులు. అగస్త్యుడి ఆశ్రమం సమీపిస్తుంటే లక్ష్మణుడికి వాతాపీల్వలుల చరిత్ర చెప్పాడు రాముడు. పూర్వం ఒకప్పుడు వాతాపి, ఇల్వలుడు అనే సోదరులు బ్రాహ్మణ వేషం వేసి బ్రాహ్మణులను చంపుతుండేవారు. ఇల్వలుడు బ్రాహ్మణ వేషం వేసుకుని, బ్రాహ్మణుల దగ్గరకు పోయి, ఆ రోజున తన ఇంట్లో శ్రాద్ధం వుందనీ, నిమంత్రణకు రమ్మనీ, సంస్కృత భాషలో పిలుస్తాడు. పిలిచింది నిజమైన బ్రాహ్మణుడే అని మోసపోయి అంగీకరిస్తారు బ్రాహ్మణులు. వాడు తన తమ్ముడిని మేకగా చేసి, చంపి, ఆ మాంసాన్ని బ్రాహ్మణులకు వడ్డించేవాడు. (పూర్వకాలంలో మాంసం తినేవారు బ్రాహ్మణులు కూడా. దానిలోని చెడు గుణాలను, ఇలాంటి మోసాలను తెలుసుకొని దానిని నిషేధించారు). బ్రాహ్మణులు నోరారా తిని పొట్టలు తడవుకొంటూ కూర్చోగానే, ఇల్వలుడు ''వాతాపీ రమ్మ'' అని పిలిచేవాడు. అలా పిలవగానే వాతాపి వారి పొట్టలు చీల్చుకొని బయటకు వచ్చేవాడు. ఆ బ్రాహ్మణులు చనిపోయేవారు. వారిని వారిరువురూ చంపి తినేవారు.

ఈ విధంగా రాక్షసులవల్ల వేలాది మంది బ్రాహ్మణులు చనిపోయారు. అప్పుడు దేవతలు ప్రార్థించగా అగస్త్యుడు వారిని తన తపఃప్రభావం వల్ల శాంతింప చేశాడు. ఒకనాడు వీరు అగస్త్యుడికి నిమంత్రణం చెప్పగా అయన అంగీకరించి, భోజనానికి వెళ్ళి సర్వం బక్షించాడు. "జీర్ణం, జీర్ణం, వాతాపి జీర్ణం" అన్నాడు పొట్ట తడుముకుంటూ. శ్రాద్ధం ముగించిన తరువాత ఎప్పటిలాగా ఇల్వలుడు 'వాతాపీ' అని పిలిచాడు. అగస్త్యుడు అప్పుడు "నీ తమ్ముడి మీద ఎందుకు భ్రాంతి? నీ తమ్ముడు జీవించి వున్నాడని అనుకుంటున్నావా? నీ భ్రాత చచ్చిపోయాడని తెలియదా? నా కడుపులోంచి బయటకు రావడం సాధ్యమా? నీ తమ్ముడు ఎక్కడ వున్నాడో చెప్తా విను. మేకలాగా నా కడుపులో పడి జీర్ణమై నరకానికి పోయాడు తెలియదా?" అని పలికాడు.

తన తమ్ముడు చనిపోయాడని తెలుసుకున్న ఇల్వలుడు కోపంతో అగస్త్యుడిని చంపడానికి ఆయన

మీదకు పోవడానికి ప్రయత్నించగా, ఆ ముని, నిప్పులు కక్కే చూపులతో అతడిని భస్మం చేశాడు. అలాంటి మహిమ కలవాడి ఆశ్రమం ఇదే లక్ష్మణా, అని చెప్పాడు శ్రీరాముడు. ఆశ్రమ ప్రదేశం ప్రవేశించిన లక్ష్మణుడు అక్కడున్న అగస్త్య మునిని దర్శించుకున్నాడు. ఆ ముని శ్రీరామచంద్రమూర్తిని అతిథిగా గ్రహించి, ప్రేమతో అతిథులకు ఇవ్వాల్సిన అర్ఘ్యం, పాద్యం ఇచ్చి, పూజించి, యోగక్షేమాలు విచారించి, వానప్రస్థగృహస్థ ధర్మాలు తెలిపాడు. శ్రీరామచంద్రమూర్తికి ఒక గొప్ప విల్లు, అక్షయ బాణాలు, తూణీరాలు ఇచ్చాడు. తరువాత ఇలా అన్నాడు. దగ్గరలో వున్న పంచవటికి వెళ్లమని సలహా ఇచ్చాడు. పంచవటికి పోయే మార్గం చూపించాడు. రామలక్ష్మణులు అగస్త్యుడు చెప్పిన మార్గంలో పంచవటికి పోయారు.

పంచవటిని చూసిన శ్రీరాముడు, లక్ష్మణుడితో ఇలా అన్నాడు. ''లక్ష్మణా! పంచవటి ఇదే. చక్కగా పూసిన తీగలు, చెట్లు, గుంపులు–గుంపులుగా, కన్నుల పండుగగా కనపడుతున్నాయి. ఇక్కడ సీతకు, నీకు, నాకు, మన ముగ్గురికి అనుకూలమైన, సంతోషకరమైన స్థలమేదో చూడు. నీటికి దూరంగా వుండకూడదు. మనసుకు ఇంపైనదిగా, నీటికి దూరం లేకుండా, స్వేచ్ఛా విహారానికి యోగ్యమైందిగా వుండాలి. నేల చదునుగా, పడుకోవడానికి సుఖంగా వుండాలి. నువ్వు తేవడానికి అవసరమైన పూలు, కట్టెలు, దర్భలు దండిగా దగ్గరలోనే వుండాలి. గట్టి నేల కాకుండా పడుకోవడానికి, కూర్చోవడానికి, అనుకూలంగా మెత్తని నేలగా వుండాలి. పెంట, పేడ కుప్పలు లేకుండా నిర్మలంగా వుండాలి. మనం కొన్నాళ్లు ఇక్కడే వుంటాం. కాబట్టి అనుకూలమైన ప్రదేశమైతే మంచిది కదా? అందుకే మన ముగ్గురికీ సౌఖ్యమైన స్థలాన్ని చూడు''.

ఇలా శ్రీరామచంద్రమూర్తి చెప్పగా లక్ష్మణుడు, అన్ననే తగిన స్థలం ఎంపిక చేయమని అన్నాడు. లక్ష్మణుడు ఇలా చెప్పగానే శ్రీరాముడు తగిన స్థలాన్ని నిశ్చయించి, అక్కడ ఆశ్రమం నిర్మించమనీ అంటాడు. త్వరగా పర్ణశాల నిర్మించమని శ్రీరాముడు అనగానే, లక్ష్మణుడు ఒక ఆకుల ఇంటిని కట్టాడక్కడ. భూమిలో పునాది తీసి, పక్కా గోడలు కట్టి, లావాటైన వెదుళ్లు స్థంబాలుగా నాటి, వాటిమీద బక్కటి, సన్నటి వెదుళ్లను పరచి, జమ్మికొమ్మలు వాసాలుగా చేసి, నారలతో గట్టిగా బిగించి, ఆ వెదుళ్ల మీద బోద రెల్లును దట్టంగా కప్పి, నేలను చదరంగా, నున్నగా చేసి, దిమ్మెసతో మూడు–నాలుగు సార్లు నీళ్లు చల్లి కుటీరాన్ని సిద్ధం చేశాడు లక్ష్మణుడు.

పంచవటి స్థలం ఏదనే వివాదం చిరకాలంగా అనేకమందిని బాధిస్తున్నది. భద్రాచలం దగ్గరున్న పర్ణశాల అని కొందరు, నాసిక దగ్గర అని మరి కొందరు, అభిప్రాయ పడుతున్నారు. వీటిల్లో ఏది సత్యమో అనే విషయాన్ని రామాయణాన్ని బట్టి, స్థలశోధనాన్ని బట్టి నిర్ధారించాల్సి వుంది. పంచవటి గోదావరీ తీరంలో వుందనే విషయం నిర్వివాదాంశం. పంచవటి దగ్గర గోదావరి నది ఉత్తరాన్నుండి దక్షిణానికి పారుతూ వుండాలి. ఎందుకంటే రామలక్ష్మణులు సీతాపహరణం తరువాత ఆమెను వెతుక్కుంటూ గోదావరీ తీరాన వెళ్లారు. ఇలా వెళ్తున్న రామలక్ష్మణులకు దక్షిణ దిక్కుగా సీత పోయిందని మృగాలు, పక్షులు చూపాయి. అప్పుడు రామలక్ష్మణులు నేరుగా దక్షిణానికి పోకుండా, నైఋతి దిశగా పోయి, గోదావరీ తీరంలో జటాయువును చూశారు. ఈ కారణాన, గోదావరి నది జటాయువు పడ్డ స్థలం దాకా,

దక్షిణాభిముఖంగా పారుతుండాలి. జటాయువుకు గోదావరీ జలాలతో రామలక్ష్మణులు నివాపాలు విడిచినందున వారున్న స్థలం గోదావరి తీరమే అయ్యుండాలి. ఇక్కడినుండి రామలక్ష్మణులు నైఋతిదిశగానే మూడు కోసుల దూరం పయనించారు. తూర్పుగా పోవడానికి ఏరు అడ్డం వస్తుంది. కాబట్టి తూర్పుగా పోలేదు. కొంత తూర్పుగా పోతేనే కాని జటాయువు చెప్పిన దక్షిణ మార్గం కనిపించదు. కాబట్టే అక్కడినుండి మూడు కోసులు తూర్పుగా పోయారనుకోవాలి. ఇప్పుడు ఇప్పటి భద్రాచలం దగ్గర, గోదావరి నదికి దక్షిణాన వున్నారు వారు. ఇలా వచ్చినందున వారికి గోదావరి దాటాల్సిన పనిలేదు. ఈ కారణాన పంచవటి గోదావరి నదికి పడమటి తీరాన వున్నదని అంగీకరించాలి. తూర్పునే వుండి వున్నట్లయితే, గోదావరి దాటే వుండాలి. ఆ విషయాన్ని వాల్మీకి చెప్పలేదు.

ఇప్పటి పర్ణశాలే పంచవటి అని అనుకుంటే, వారొకవేళ నైరుతి దిక్కుగా ప్రయాణం చేసే వుంటే, ఏటి పాలు అయ్యేవారు. భద్రాచలం దగ్గర ఏరు దాటినట్లు కొందరు రాశారుకాని, అది ఆలోచించి రాసిన రాతకాదు. ఇప్పుడు అందరూ అనుకుంటున్న పర్ణశాల కాదు కాని, దానికి ఎదురు ఒడ్డున, చక్కగా పంచవటి వుండేదని చెప్పొచ్చు.

అలాగే ఒకాయన నాసికను పంచవటి అని పేర్కొన్నారు. అక్కడి నుండి దక్షిణంగా వచ్చినట్లు చెప్పారాయన. ఇది రామాయణానికి విరుద్ధం. పంచవటి గోదావరీ నదీ పశ్చిమ తీరాన వున్నదనడానికి స్థలం ఆధారంగా వుంది. పర్ణశాలకు ఎదురుగా రథగుట్ట అనేదొకటి వుంది. ఇక్కడ రావణాసురుడు తన రథాన్ని దాచిపెట్టాడని అంటారు. ఎందుకంటే సీతాపహరణ సందర్భంలో, రావణాసురుడు సీతాదేవిని ఎత్తుకుని రాగానే రథం సిద్ధంగా వుంది అని చెప్పడం జరిగింది. సమీపంలో అది కనపడనందున ఆ పని కొనసాగింది కాని, ఏటికి ఒక ఒడ్డున రథం; సీత, రావణుడు మరో ఒడ్డున వుంటే ఇది సాగి వుండేది కాదు. కాబట్టి పంచవటి పడమటి దిక్కునే వుండాలి. సీతాపహరణం ఆ పక్కనే అయి వుండాలి. అంతే కాదు, దీనికి సమీపంలోనే, సీత గుట్టలని పెద్ద పర్వతం వుంది. ఇక్కడ ఖరుడు యుద్ధానికి వచ్చినప్పుడు సీతాలక్ష్మణులు వున్నారని, ఆ కారణాన ఆ గుట్టలకు ఆ పేరు వచ్చిందని అంటారు. కాదనడానికి కారణం లేదు. తూర్పు ఒడ్డున వున్నట్లయితే, ఏరు దాటి పోయి, అక్కడి గుట్టల్లో వుండాల్సి వచ్చేది. ఈ గుట్ట కింద పడమటి దిక్కుగా పెద్ద బయలు ప్రదేశం వుంది. అక్కడ పద్నాలుగువేల రాక్షసులు నిలిచి యుద్ధం చేయగలిగే పెద్ద స్థలం వుండేది. సీతాలక్ష్మణులకు ఇక్కడ జరిగిన యుద్ధం గుట్ట మీదనుండి కనపడేది.

మరొక చోట వాల్మీకి రామాయణంలో పద్మ సరస్సు పంచవటికి దగ్గర్లోనే వుందని చెప్పడం జరిగింది. అది ఇప్పటిదాకా వుందో, లేదో, చెప్పడం సాధ్యపడదు కాని ఇలాంటి పెద్ద చెరువొకటి వున్నట్లు అక్కడుండే కోయవాళ్లు చెప్తుంటారు. ఈ చెరువుకూ, గోదావరి నదికి, మధ్య పంచవటి వుంది. వర్షాకాలంలో ఏటి నీళ్లు బురదగా వున్నప్పుడు ఈ చెరువు నీళ్లు సీతారామలక్ష్మణులు వాడుకునేవారు. ఇప్పటి పర్ణశాలకు దక్షిణంగా గోదావరీ తీరంలో భద్రాచలానికి వచ్చే తోవలో, దుమ్మగూడెం అనే వూరుంది. దీనికి ఎదురుగా ఏటికి ఆవలి ఒడ్డున ఒక చిన్న గుట్ట వుంది. దీని దగ్గరలోనే జటాయువుకు, రావణుడికి యుద్ధం జరిగిందని రామాయణంలో వుంది. ఇప్పుడు గోదావరి నది తూర్పు ఒడ్డు కోసుకొని వస్తున్నది. ఇప్పటి ఏటి మధ్యలో దుమ్మగూడేనికి చెందిన కొంత భాగం వుండేదట. అక్కడ అలా చూసిన

వారు ఆంధ్రవాల్మీకికి చెప్పారా విషయాన్ని. వాస్తవానికి ధూమగూడెమే దుమ్మగూడెం అయింది. ఆ గుట్ట దగ్గరే జటాయువుకు సంస్కారాలు చేశాడు శ్రీరాముడు.

ఇప్పటి హంపే పంప అనీ, అక్కడే పర్ణశాల వున్నదనీ, చెప్పడానికి ఒక నిరాకరించలేని ప్రబల కారణం వుంది. రామలక్ష్మణులు లంకకు పోయేటప్పుడు ఏ మార్గంలో వెళ్లినా, లంక నుండి తిరిగొచ్చేటప్పుడు విమానాన్ని చక్కగా వచ్చేట్లు చేశారు కాని, వంకర-టింకరగా పోలేదనేది స్పష్టం. లంక నుండి సముద్రం దాటిన తరువాత, రామేశ్వరం దగ్గరనుండి, అయోధ్యకు వెళ్లారనేది అందరూ అంగీకరించిందే. అలాంటప్పుడు ఎడమవైపున కిష్కింద, కుడివైపున పంచవటి వుండి వుండాలి. ఈ రెండు స్థలాలను రామచంద్రమూర్తి సీతాదేవికి చూపించాడు. ఈ మార్గానికి, నాసికకు సంబంధమే లేదు. కాబట్టి పంచవటి నాసిక కాదు. కావడానికి వీల్లేదు. నాసిక అనేది మొదటి పేరు కాదనీ, నవశిఖ అనేది నాసిక అయిందనీ, పురాణాలలో ప్రసిద్ధికెక్కిన నాసిక శూర్పణకదే అయినందువల్ల ఆ కథకు, దీనికి ముడిపెట్టారని కూడా కొందరు రాశారు. నాసిక పంచవటి కాదనడానికి మరికొన్ని కారణాలున్నాయి.

సీతారామలక్ష్మణులు చిత్రకూటం నుండి దక్షిణంగా ఋక్షవంతానికి వచ్చి, అక్కడనుండి, పశ్చిమాభిముఖంగా నాసిక చేరినట్లు కొందరంటారు. వాళ్లు చెప్పిన మార్గంలో వింధ్యపర్వతాన్నే కాకుండా, నర్మద, తపతీ నదులను దాటి, విదర్భ గుండా నాసికలోకి పోవాల్సి వుంటుంది. ఇది చాలా దుర్గమ మార్గం. అదీ కాకుండా, వాల్మీకి ఎక్కడా, సీతారామలక్ష్మణులు వింధ్యనూ, నర్మదా తపతులను దాటినట్లు చెప్పలేదు. వారు దాటే వుంటే ఆ సుప్రసిద్ధ నదుల గురించి వాల్మీకి తప్పక రాసేవాడే. రామలక్ష్మణులు దక్షిణానికి వచ్చి, ఆ తరువాత ఆగ్నేయంగా కిష్కింధకు వచ్చారనడం రామాయణానికి ప్రత్యక్ష విరుద్ధం అనాలి. వాస్తవానికి రామలక్ష్మణులు నైఋతీ మూలగా, ఆ తరువాత కొంత మేరకు నైఋతిగా పోయి, అక్కడనుండి తూర్పుగా పోయి, కబంధుడిని చంపి, అక్కడనుండి మళ్లీ పడమరగా పోయి, పంప (తుంగభద్ర) చేరి అక్కడికి పడమర వున్న శబరి గుహకు పోయారు. జటాయువు గుట్ట దగ్గరనుండి నైఋతిగా వస్తేనే కిష్కింధకు రాగలరు. అలా కాకుండా కొందరు చెప్పినట్లు ఆగ్నేయ మూలగా పోయివుంటే, సముద్ర తీరానికి చేరేవారే కాని, కిష్కింధ చేరకపోయేవారు. ఆగ్నేయ మూలగా ప్రయాణం చేసినట్లు రామాయణంలో ఎక్కడా ఒక్క మాటైనా లేదు. అలాగే భద్రాచలం దగ్గర ఉష్ణ గుండం వుందనడం, సీతాదేవి స్నానం చేసేదనడం, రేకపల్లె దగ్గర జటాయువు రెక్క పడిందనడం బహుశా కల్పితాలు కావచ్చు.

◆❖◆

రామరావణ యుద్ధానికి నాంది శూర్పనఖోపాఖ్యానమా?

సీతారామలక్ష్మణులు వనవాసం చేయాల్సిన పద్నాలుగు సంవత్సరాలలో పదమూడవ సంవత్సరం గడుస్తున్న సందర్భంలో, మార్గశిర మాసం నడుస్తున్నప్పుడు ఒక రోజున శ్రీరామచంద్రమూర్తి, సీతాలక్ష్మణులతో కూడి గోదావరీ నదీ స్నానం చేసి, పూర్వుల, పెద్దల కథలు చెప్పుకుంటూ ముచ్చటించుకుంటుండగా, రావణాసురుడి చెల్లెలు శూర్పనక అందమైన ఆకారంతో ఆశ్రమంలో ప్రవేశించింది. శ్రీరామచంద్రమూర్తిని చూసి కామదగ్ధచిత్త అయ్యి, ఆ రాక్షసి, శ్రీరాముడిని చేరవచ్చింది.

వచ్చి, మోహావేశంతో శూర్పనఖ శ్రీరాముడిని చూసి ''నువ్వెవరివి? జడలతో మునీశ్వరుడి వేషం ధరించి, కాముకుడవై, భార్యతోనూ, క్షత్రియ రూపంలో విల్లు-బాణాల తోనూ, రాక్షసులు స్వేచ్ఛగా తిరిగే ఈ స్థలానికి ఎందుకు వచ్చావు? ఈ ప్రకారం ఇక్కడ వుండడానికి కారణం ఏమిటి?'' అని అడగగా శ్రీరామచంద్రమూర్తి ఇలా చెప్పాడు.

"దశరథుడనే మహారాజు పెద్ద కొడుకును నేను. నన్ను రాముడని అంటారు. వీడు నా తమ్ముడు లక్ష్మణుడు, వా వెంట వచ్చాడు. ఈ స్త్రీ నా భార్య సీత. తల్లిదండ్రుల ఆజ్ఞ మీరలేక పితృవాక్య పరిపాలన అనే ధర్మాన్ని నిర్వహించే కోరికతో తపోరూప ధర్మాన్ని స్థాపించడానికి మేం వచ్చాం. మా చరిత్ర విన్నావు కదా? నువ్వే జాతిదానివి? నీ పేరేంటి? ఎవ్వరిదానవు? సత్యం చెప్పు. ఇది రాక్షస భూమి ఐనా నీ మనోహరాకారం చూసి రాక్షసివి అవుతావని అనుకోను. ఇక్కడికి నువ్వు రావడానికి కారణం ఏంటి?". ఇలా అడిగిన రామచంద్రమూర్తికి నిజం చెప్తా వినమని అంటుంది.

శూర్పనఖ శ్రీరాముడితో, "సుందరుడా! నేను శూర్పనఖ అనే స్త్రీని. కోరిన రూపాన్ని ధరించగలను. ఈ అడవుల్లో ఒంటరిగా తిరుగుతుంటాను. విశ్రవసుడి కొడుకు రాక్షసరాజైన రావణాసురుడి పేరు విన్నావా? అతడు మా అన్న. కుంభకర్ణుడు, విభీషణుడు కూడా నా తోడబుట్టిన వారే. ఖరదూషణులు కూడా నా తోబుట్టువులే. వాళ్లు యుద్ధంలో మహాశూరులు. వావి వరుసలకు వాళ్లు నా అన్నలని చెప్పానేకాని వారి ఆజ్ఞకు లోబడి వుండేదాన్ని కాను నేను. నా ఇష్ట ప్రకారం నేను తిరుగుతుంటాను.

కాబట్టి నువ్వు నన్ను గ్రహించావా వాళ్లు నీ మీద కోపంగా వుంటారని భయపడాల్సిన పనిలేదు. చక్కదనంలో నీలాంటి వాడిని నేను చూడలేదు. కాబట్టి కళ్లారా నిన్ను చూసింది మొదలు దొడ్డమగవాడా, నువ్వే నాకు తగిన మగడవని నిన్ను కోరుతున్నాను. నువ్వు నన్ను తిరస్కరించావా, మా అన్నలందరనీ నీమీదకు యుద్ధానికి పిలుచుకొనివచ్చి నిన్ను చంపిస్తాను" అంటుంది.

"రామా! నాకిదివరకే భార్య వుందంటావేమో? చీ, చీ, ఇదేమి సీత? చూడడానికి రోత పుడ్తున్నది. వేలెడు ముక్కు. వెన్నంటు డొక్క విరిచిన బొందె తుంటెలాగా విరుగు కాళ్లు, చేతులు, చింతాకంత కళ్లు, అసలే లేని గోళ్లు, ఇక నా సొగసు నేనే చెప్పకూడదు కాని, నా డొక్క, నా పిక్క, నా ముక్కు, నా చెక్కు, నా గోళ్లు, నా కాళ్లు, నా కళ్లు, నా చన్నులు, నా చేతులు ఎలా వున్నాయో చూడు. సీత వికార రూప. దీన్ని వదిలిపెట్టు. దూరంగా పొమ్మను. నీలాంటివాడికి తగిన పెళ్లాం కాదు. కానేకాదు. నెనే ముద్దు పెళ్లామని అను. నన్ను సరిగ్గా చూడు. నేను నీకు తగిన భార్యను కానా? అవునను. కాబట్టి నన్ను నీ భార్యగా చేసుకో. దీన్నేం చేద్దామంటావా? దీన్ని నీ తమ్ముడితో సహా ఇప్పుడే గుటుక్కున మింగుతా. ఆ తరువాత నీకు ఇంక భయం లేదు...ఈ జంజాటం వుండదు" అని అంటుంది శూర్పణఖ.

శూర్పనఖకు చెప్పాడిలా రాముడు: "రాకాసీ! దీనిని ముందు పెళ్లి చేసుకున్నాను. అయినా ఏంటంటావా? ఇప్పుడు ప్రియురాలైన దీనిని నేనెలా విడుస్తాను? అది ధర్మం కాదే? అది వుండవచ్చు. నువ్వూ వుండవచ్చు అంటావా? నీలాంటి అద్భుతమైన అందగత్తెకు సవతి పోరు వుండకూడదు. కాబట్టి నీకు దుఃఖం కలగక తప్పదు. నిన్ను దుఃఖ పెట్టడానికా పెళ్లి చేకోవడం? కాబట్టి నామీద భ్రాంతి వదిలిపెట్టు. నువ్వు కామం నిలుపలేనని అంటావా? ఇదిగో వీడిని చూడు. మంచి శీలం కలవాడు. నా తమ్ముడు. చూడడానికి ప్రియమైన వాడు. సహించరాని తేజం కలవాడు. లక్ష్మణుడనే పేరుకలవాడు. ఈ లక్ష్మణుడు భార్య లేనివాడు. అసమాన శౌర్యవంతుడు. సమర్థుడు. యౌవనంలో వున్నాడు. అందగాడు. ఇదివరకు భార్యా సుఖం తెలియనివాడు. భార్య కావాలని కోరుతున్నాడు. నీ అందమైన రూపం చూడగానే వీడు నీకు పతిత్వయోగ్యుడు అవుతాడు. సవతి పోరులేకుండా అతడిని భజించు".

అనిశ్రీరామచంద్రుడుచెప్పగావినిఆరాక్షసి, నిమిషమైనాఆలశ్యంచేయకుండా, లక్ష్మణుడితో "ఓయీ అందగాడా! నీ చక్కదనానికి సరైన అందగత్తెను నేనే. నీకు పెళ్లాం అవుతాను. నువ్వు నన్ను పెళ్లి చేసుకో. వనాలలో,కొండలలో సంచారం చేద్దామా? రా, పోదాం" అన్నది.

శ్రీరామచంద్రమూర్తి పరిహాసంగా మాట్లాడిన భావం తెలుసుకొన్న లక్ష్మణుడు, తానూ శూర్పనఖతో పరిహాసంగానే మాట్లాడాడు. "ఓసీ! వెర్రి పిల్లా! నేను బానిసను. నన్ను పెళ్లి చేసుకొని నువ్వు కూడా బానిసవై వీరి సేవ చేస్తావా? నీ చక్కదనానికి నువ్వు బానిసగా వుంటావా? ఈ మహాత్ముడుకి నేను బంటుగా సేవ చేస్తున్న సంగతి నీకు తెలియదేమో? నీకు తెలిసే అవకాశం లేదు. తెలుస్తే, నేనేంటి, బానిసను ఎలా పెళ్లి చేసుకుంటాను అని అనుకొనేదానివి. అలాంటి సమృద్ధమైన అర్థం కలవాడిని నిన్నేం సంతోషపెట్టగలను? నిర్మలకాంతి కలదానివి కాబట్టి, నువ్వు, ఆయన్నే వరిస్తే నువ్వు చిన్న భార్యవై, కులుకుతూ ముద్దులొలకవచ్చు. ఇలాంటి వికార స్వరూపం గలదానిని, భయంకర స్వరూపం వున్నదానిని, ఆ సవతిని, పెద్ద పొట్టకలదానిని, ముసలిదానిని, జానకిని నెట్టి నిన్ను భార్యగా గ్రహిస్తాడు.

ఇలాంటి పరమ సుందరిని వదిలి ఎవరు మనుష్య స్త్రీకొరకు వేడుక పడతాడు?" అని లక్ష్మణుడు పలికాడు శూర్పనఖతో.

లక్ష్మణుడు చెప్పిన మాటలు పరిహాస వచనాలని తెలుసుకోలేని ఆ బుద్ధిహీన, నిజమని నమ్మి, పర్ణశాలలో సీతతో వున్న శ్రీరామచంద్రుడి దగ్గరకు పోయి ఇలా అంది: ''ఈ విరూపను, సవతిని, ఈ కరాళను, నిర్ణతోదరిని గ్రహించి నువ్వు నన్ను గౌరవించడం లేదు. కాబట్టి దీన్ని ఇప్పుడే మింగి సవతిపోరు లేకుండా సుఖపడతాను''. ఇలా అంటూ శూర్పనఖ జింకపిల్ల కళ్లలాంటి కళ్లున్న సీతమీద దూకింది. ఇది చూసిన శ్రీరాముడు దాన్ని బిగపట్టి, కోపంతో లక్ష్మణుడితో ''లక్ష్మణా! నీచులతో పరిహాసం ఆడడం తప్పు. అలా మనం చేసినందువల్ల కష్టం కలిగింది. దీనివాత పడకుండా సీతాదేవి ఎలా బతికి సుఖంగా వుంటుందో ఆలోచించు. ఇది స్త్రీ. ఆయుధం ధరించి యుద్ధానికి వచ్చింది కాదు. కాబట్టి చంపకూడదు. దీన్ని, బలగర్వంతో దేహం తెలియనిదాన్ని, రాకాసిని పట్టుకొని విరూపగా చేయి'' అన్నాడు. అప్పుడు శూర్పనఖ కంటే మహాబలశాలి అయిన లక్ష్మణుడు తటాలున కత్తి దూసి, అది ఎదిరించినా వదలక, దాని ముక్కు, చెవులు కోశాడు.

ముక్కు–చెవులు ఈ విధంగా మొక్కలు పోగా, లబలబ నోరు కొట్టుకుంటూ, రొమ్ము గుద్దుకుంటూ, వానాకాలంలోని మేఘం అదిరినట్లు, అడవి ప్రతిధ్వనించేట్లు, పెద్ద ధ్వనితో బొబ్బలు పెట్టుకుంటూ, నెత్తురు కారుతుంటే, వికార రూపం మరింత వికారం కాగా, మనుష్యులు తనను ఇలా చేశారే, నలుగురిలో నవ్వుల పాలైతిని కదా అని ఆక్రోశంతో ఏడుస్తూ అడవుల్లో పడి వేగంగా పరుగెత్తింది.

ఇలా పరుగెత్తుకుంటూ పోయి జనస్థానంలో రాక్షసుల మధ్యన వున్న తమ్ముడు ఖరుడిని చూసి, ఏడుపు ధ్వనితో ఆకాశం నుండి పిడుగుపడ్డట్లు ధభీలున నేలమీదపడి పెద్దపెట్టున ఏడ్చింది.

దేహమంతా నెత్తురుతో తడిసి నేలమీద పడి, వికార రూపంతో ఏడుస్తున్న శూర్పనఖను చూసి ఖరుడు ఇలా అన్నాడు. "ఎవరినీ తరుమకుండా, బెదిరించకుండా, బుసకొట్టకుండా, తనంతట తాను బుట్టలో కదలకుండా వుండే మహా భయంకర, విషంకల నల్ల త్రాచుపామును ఎవడు వేలితో పొడిచాడు? ఎవడీ విషం తాగింది? ఎవడు తనంతట తానే మృత్యుపాశాన్ని తన కంఠానికి తగిలించి బిగించుకున్నాడు? చెప్పు. నేనిప్పుడే వేగంగా పోయి వాడిని చంపి నెత్తురు తాగుతా. నువ్వు బలం, పరాక్రమం విశేషంగా వున్నదానివి. కాబట్టి సామాన్య బలవంతులు నిన్ను పరాభవం చేయలేరు. నువ్వు కోరిన చోట, కోరిన రూపంతో తిరగగలిగే దానివి. నిన్ను అడ్డగించగలవారు లేరు. అలాంటి నిన్ను ఎవడే దీర్ఘకాలం బతకడానికి ఇష్టపడక ఇలాంటి కష్టాల పాలు చేశాడు? దేవతలలో కాని, గంధర్వులలో కాని, పరమర్షులలో కాని, దౌర్జన్యంగా ఇలాంటి పెద్ద అపకారం చేయడానికి తెగించిన వాడు ఎవడో చెప్పు. వాడిని చంపుతా''. అని ఖరుడు అడగ్గా, తోడ బుట్టిన వాడి మాటలు విని విస్తారంగా కన్నీళ్లు కాల్వలుగా కారుతుంటే, ఈ విధంగా చెప్పింది శూర్పనఖ.

"నన్నీ ప్రకారం చేసింది ఎవరని అంటావా? చెప్తా విను రాక్షసుడా! వారు యౌవనవంతులు. చక్కటివారు. మునుల వేషంలో వున్నారు. కోమల దేహం కలవారు. మహాబల సంపన్నులు. నార చీరెలు, కృష్ణాజినం వస్త్రాలుగా వున్న వారు. అడవిలో లభించే పళ్ళు తింటారు. ఇంద్రియ నిగ్రహం కలవారు.

ధర్మ మార్గంలో వుండేవారు. అన్నదమ్ములు వాళ్ళు. దశరథరాజ కుమారులు. శ్రీరామలక్ష్మణులు అనే పేర్లు కలవారు".

తనను విరూపను చేసినవారెవరు? అని ఖరుడు అడిగిన ప్రశ్నకు సమాధానంగా శూర్పనఖ దశరథ రాజకుమారులు శ్రీరామలక్ష్మణులు అని చెప్పే బదులు, వారి సౌందర్యాన్ని ఎందుకు వర్ణించాలి? ఆమెలో కామం విఘ్నమై కోపంగా మారిందేకాని, కామం చావలేదు. వైరాగ్యం ఇంకా పుట్టలేదు. గాఢంగా శ్రీరామలక్ష్మణ రూపాలలో మనస్సు నాటుకొని వుండడం వల్ల, వారి మూర్తులే దానికి కళ్ళ ఎదుట కనపడుతున్నాయి. అలా కామమోహిత అయినందువల్ల దాన్ని నిగ్రహించుకోలేక తమ్ముడి ఎదుట ఆ భావాన్నే బయట పెట్టింది. "కామాతురాణాం నభయం నలజ్జా" అనే నానుడి వుంది. అంటే, కామాతురులకు భయం, సిగ్గు వుండదు. ఈ కారణం వల్లే రామలక్ష్మణుల సౌందర్య వర్ణన చేసింది శూర్పనఖ. ఇలా చేయడం స్త్రీ అయిన శూర్పనఖ గొప్ప కాదు. శ్రీరామచంద్రమూర్తిని చూసిన వారందరూ, అనుకూలమైనా, ప్రతికూలమైనా ఇలానే మాట్లాడుతారు.

శూర్పనఖ తన జవాబును కొనసాగిస్తూ..."తాము దశరథ రాజకుమారులమని చెప్పారేకాని, వారి తేజస్సు చూస్తే, వాళ్ల మాట నమ్మడం కష్టంగా వుంది. అయినా, వారు అసత్యమాడేవారిలాగా లేరు. కాబట్టి వారి మాట ప్రకారం వాళ్లు మనుష్యులో, నా అభిప్రాయం ప్రకారం దేవతలో చెప్పలేను. చూడడానికి రాజచిహ్నాలున్నా గంధర్వరాజుతో సమానంగా వున్నారు. ఆ ఇద్దరిమధ్య ప్రాయంలో వున్న ఒక పడుచును, సమస్తాభరణాలు ధరించిన దానిని, సన్నటి నడుముకల దానిని, తామర రేకుల్లాంటి కళ్లున్న దానిని చూశాను. అలాంటి సుందరిని నేనింతవరకు చూడలేదు. ఆ పడుచుకోసం నన్ను వారిద్దరూ ఒక్కటై, రంకుటాలిలాగా దిక్కులేని దాన్ని చేసి దురవస్థల పాలు చేశారు" అని అంటుంది. జరగబోయే రామరావణ యుద్ధానికి ఈ విధంగా అంకురార్పణ జరిగిందనాలి ఒక విధంగా.

◆❖◆

మొదట హితోక్తి చెవికెక్కినా...

సీతాపహరణం వద్దన్న మారీచుడి సలహా విన్న రావణుడు

లక్ష్మణుడి చేతిలో పరాభవం పొంది, ముక్కు–చెవులు కోయించుకుని, ఏడ్చుకుంటూ వచ్చిన శూర్పనఖ చెప్పుడు మాటలకు, దాని అన్న ఖరుడు కోపంతో పద్నాలుగు మంది క్రూర రాక్షసులను రామలక్ష్మణుల మీదికి యుద్ధానికి పంపాడు. శూర్పనఖ దారి చూపిస్తుంటే, దండకారణ్యానికి పోయారు వాళ్ళు. యుద్ధానికి వచ్చిన వాళ్లను తన బాణాలతో ఎదిరించాడు రాముడు. ఆయన వేసిన బాణాలకు, వాళ్లు వేళ్ళు తెగిన చెట్లలాగా నెత్తురుతో తడిసి, దేహాలతో ప్రాణాలు పోయినవారై, భూమ్మీద పడ్డారు. అది చూసి శూర్పనఖ పరుగెత్తింది.

భయంకరంగా గట్టిగా ఏడ్చుకుంటూ, జనస్థానంలో వున్న ఖరాసురుడి దగ్గరకు వచ్చిన రాక్షస నాశనానికి కారకురాలు కాబోతున్న శూర్పణఖను చూసి ఖరుడు మళ్ళా ఎందుకు ఏడుస్తూ వచ్చావని అడిగాడు. "నువ్వు పంపిన వారందరూ రాముడి బాణాలకు క్షణకాలంలో నిలబడి చచ్చిపోయారు. అది చూసిన నేను, అక్కడ వుంటే నన్నేం చేస్తారో అన్న భయంతో, గాలి వేగంతో పరుగెత్తుకుంటూ వచ్చానిక్కడికి. నువ్వు రాముడిని ఎదిరించి, యుద్ధం చేసే ధైర్యం వుందా? వుంటే, ఏదీ చూద్దాం, తక్షణమే రాముడిమీదకు యుద్ధానికి బయల్దేరు" అని శూర్పనఖ పెద్ద నగారా వాయించినట్లు కడుపు మీద బాదుకుంటూ, ఏడుస్తుంటే రాక్షస నాయకుడు ఖరుడు ఆమెను సమాధాన పరచాడు.

శూర్పనఖ నిందా వాక్యాలకు, తన పౌరుషాన్ని రెచ్చగొట్టే విధంగా మాట్లాడిన మాటలకు జవాబుగా ఖరుడు "ఎందుకు ఏడుస్తావు? ఏడవ వద్దు. ఇదిగో ఇప్పుడే పోయి తమ్ముడితో సహా రామచంద్రుడిని చంపుతా" అని చెప్పగానే శూర్పనఖ సంతోషించింది. తమ్ముడిని మరీ–మరీ పొగిడింది. దూషణుడు అనే సేనానాయకుడిని పిలిచి యుద్ధానికి సన్నద్ధం కమ్మన్నాడు ఖరుడు. భయంకరమైన బలం కలవారిని, పద్నాలుగువేల రాక్షసులను శీఘ్రంగా సమకూర్చమని దూషణుడిని పురమాయించాడు ఖరుడు. వాడు ఇలా చెప్పగా దూషణుడు రథాన్ని అతడి ముందు నిలిపాడు. దాని మీదకు కోపంతో ఎక్కాడు ఖరుడు. ఖరుడు రథం ఎక్కగానే, దూషణుడు పెద్ద సేనతో ఖరుడి పక్కన నిలిచాడు. సైన్యాన్ని కదలమని ఖరుడు

ఆజ్ఞాపించాడు. వారి వెంట పద్నాలుగు వేలమంది రాక్షసులు బయల్దేరారు.

వారు రావడం చూసిన రాముడు, లక్ష్మణుడు చేయాల్సిన పనేదో చెప్పాడు. "సీతాదేవి ఇక్కడుంటే ఆమెకు వాళ్ళు కీడు కలిగిస్తారు. కాబట్టి ఆమె ఇక్కడ వుండకూడదు. ఒంటరిగా ఎక్కడికీ పంపకూడదు. నువ్వు ఆమెను పిల్చుకొని, విల్లు-బాణాలు ధరించి దట్టంగా వున్న చెట్ల గుంపులుకల కొండగుహలోకి పొండి. ఆమెను లోపల వుంచి నువ్వు బయట కాపలాగా వుండు. ప్రయాణం కండి తొందరగా. లేలే. నేనొకపని, నువ్వొకపని చేయాల్సి వుంది. రెండూ ముఖ్యమైనవే కదా?" (వీటినే ఇప్పుడు "సీతమ్మ గుట్టలు" అని అంటారు. రాక్షస సైన్యం తూర్పు ముఖంగా వచ్చింది. సీతాలక్ష్మణులు ఏటి ఒడ్డు వెంట ఉత్తర ముఖంగా పోయారు). రామచంద్రమూర్తి చెప్పినట్లే త్వరగా లక్ష్మణుడు తన విల్లు, బాణాలు ధరించి సీతాదేవితో వెళ్ళిపోయాడు.

సంతోషంతో యుద్ధ ప్రయత్నం చేశాడు రాముడు. ఖరుడి సైన్యం రాముడిని చూసింది. అప్పుడు రాక్షస సైన్యం రాముడిని సమీపించగా, రామభద్రుడు వారందరినీ తేరిపార చూశాడు. సైన్యంతో శ్రీరాముడిని తాకాడు ఖరుడు. మిగిలిన రాక్షసులందరూ రాముడిని చుట్టుముట్టి గుడియలు, శూలాలు, గండ్రగొడ్డళ్ళు, కత్తులు ఆయన మీదికి విసిరారు. రామభద్రుడు ప్రతిగా, తన బాణ సమూహాలతో వారందరినీ సర్వాయుధాలు లేకుండా చేశాడు. ఖరుడి సైన్యాన్ని హతం చేసాడు శ్రీరాముడు. మిగిలిన వారంతా దుఃఖపడుతూ ఖరుడి చాటుకు పోయారు భయంతో. అప్పుడు దూషణుడు రోషంతో రామభద్రుడి మీదకు యుద్ధానికి పోయాడు. శ్రీరాముడితో యుద్ధం చేసి మరణించాడు దూషణుడు. శ్రీరాముడి చేతిలో కాలకార్ముకాది సేనాపతులు కూడా చనిపోయారు. శ్రీరాముడితో పోరాడి చనిపోయాడు త్రిశిరుడు కూడా. అప్పుడు శ్రీరాముడితో యుద్ధం చేసాడు ఖరుడు. పదునైన బాణాలతో రాముడుని నొప్పించాడు. శ్రీరాముడి కవచాన్ని కూడా భేదించాడు. చివరకు శ్రీరాముడి చేతిలో మరణించాడు ఖరుడు సహితం.

ఇలా యుద్ధం ముగియగానే, లక్ష్మణుడు సీతాదేవితో సహా వచ్చాడక్కడికి. యుద్ధంలో గెలిచి అపరాజితుడైన శ్రీరాముడు, మునులు పూజిస్తుండగా, సీతాలక్ష్మణులు తన తోడు వస్తుంటే, విలాసంగా తన ఆశ్రమానికి వచ్చాడు. అక్కడికి చేరిన తరువాత సీతాదేవి శత్రుసంహారుకుడు, ఋషులకు సంతోషం కలిగించిన వాడు, తన భర్త అయిన శ్రీరామచంద్రమూర్తిని గట్టిగా కౌగలించుకుంది.

దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ నిమిత్తమై శ్రీరాముడు దండకకు వచ్చాడు. దుష్టులను శిక్షించడం ప్రథమ కార్యం. ఖరాది వధకు కారణం, దానివలన ప్రయోజనం ఋషి సంరక్షణేకదా? శ్రీమహాలక్ష్మీదేవి స్త్రీలను బాధించే రాక్షసులను సమూలంగా నాశనం చేయడానికే భర్తను భూమిమీద అవతరించాలని కోరి, తానూ అవతరించింది. తన కోరిక నెరవేరే సమయం ఆసన్నమైంది కదా అన్న సంతోషంతో, తన కార్యాన్ని స్వకార్యంగా భావించిన భర్తకు తన సంతోషం వ్యక్తం చేయడానికి ఆయన్ను కౌగలించుకున్నది. రామచంద్రమూర్తి లేని సీత గుహనుండి వచ్చి రాముడిని కౌగలించుకున్నది అంటే, హృదయమనే గుహలో వుండే జీవుడు పరతంత్రుడై ఆచార్యులవలన సర్వస్వామిని దర్శించి దానితో సర్వ విరోధి వర్గం నశించగా, అందులోంచి వెలువడిన స్వామిని దర్శించాడని అర్థం. శ్రీరామచంద్రమూర్తి జయం

విన్నవారు పాపబందాల వల్ల, కారాగార గృహ బంధాల వల్ల, ఋణబాధల వల్ల, ఎదుర్కొన్న ఇబ్బందులను విడవబడుతారు. పుష్పవతైన స్త్రీ వింటే రామచంద్రమూర్తి అనుగ్రహం వల్ల వంశోద్ధారకుడైన కొడుకును కంటుంది.

జనస్థానం నుండి అకంపనుడనే రాక్షసుడు, రావణుడి వేగులవాడు, లంకకు పోయి, రావణాసురుడితో జనస్థానంలో వున్న ఖరుడుతో సహా రాక్షసులందరూ యుద్ధంలో చంపబడ్డారని చెప్పాడు. ఈ మాటలు విన్న రావణుడు అదిరిపడి, కళ్లల్లో నిప్పులు కురుస్తుంటే, ఎవరా పని చేసారని అడగ్గా జవాబుగా రామచంద్రమూర్తి అని అంటాడు. రామచంద్రుడు ఒక్కడే ఆ పని చేసాడా? లేక యుద్ధానికి ఇంద్రాదులను తోడు తెచ్చుకున్నాడా? వివరాలు చెప్పమని అడిగాడు. అప్పుడు శ్రీరాముడి పరాక్రమాన్ని వర్ణించి చెప్పాడు రావణాసురిడికి అకంపనుడు. అకంపనుడు ఈ విధంగా చెప్పగానే విన్న రావణుడు ముఖం ఎర్రగా చేసి తక్షణమే ఆ మనుష్యులను చంపుతానంటూ బయల్దేరడానికి సిద్ధమౌతాడు. అప్పుడు అకంపనుడు రామభద్రుడి బలపరాక్రమాలను మరింత వివరంగా చెప్పాడు. బ్రహ్మేంద్రాదులు కూడా ఆయన్ను గెలవలేరనీ, రాముడి మీదికి యుద్ధానికి పొతే లాభం లేదని సలహా ఇచ్చాడు. శ్రీరామ వధోపాయంగా సీతాపహరణం చేయమని అకంపనుడు సూచించాడు. సీతాదేవి అందాన్ని వర్ణించి చెప్పి రావణుడిని రెచ్చగొట్టాడు. ఆమెను రావణాసురుడు తెస్తే, ఆమె మీద ప్రేమ కల రాముడు, ప్రియురాలి ఎడబాటుతో కలిగే తాపం అనే అగ్నిలో పడి చస్తాడని అకంపనుడు చెప్పగా రావణుడు ఆ ఆలోచన బాగుందని ఆమోదించాడు. యుద్ధం లేకుండా శత్రువు చనిపోతున్నాడనే ఆలోచన రావణుడికి రుచించింది.

వెంటనే మారీచుడిని చూడడానికి పోయాడు రావణుడు. మారీచుడు ఆయనకు అర్ఘ్యపాద్యాలు ఇచ్చి, ఆసనం చూపించి, భక్ష్య భోజ్యాలిచ్చి తృప్తి పరిచాడు. ఆయనతో రావణాసురుడు "తండ్రీ! రాముడనే ఒక్క మానవుడు రాక్షసులందరినీ యుద్ధ సామర్ధ్యంతో వధించి జనస్థానాన్ని పాడుచేశాడు. అతడి భార్యను నేను అపహరించాలనుకుంటున్నాను. ఈ విషయంలో నాకు నీ సహాయం కావాలి. ఆ విధంగా నేను నా పగ తీర్చుకుంటాను" అని అంటాడు.

రావణుడు ఈ విధంగా చెప్పగా విన్న మారీచుడు, సీతాదేవి గురించి లోపల శత్రుత్వం, బయటికి స్నేహం కలవాడెవడో, ఎప్పుడు రావణుడు చెడిపోవాలో అని ఎదురు చూస్తున్నవాడు ఇలా చెప్పాడని అంటాడు.

ఇలా అంటాడు మారీచుడు. "పాతాళంలో పడి అక్కడి నుండి మళ్లీ పైకి రాలేనట్లు రామపాతాళంలో నువ్వు పడ్డావా మళ్లా ఊపిరితో వెలుపలికి రాలేవు. రామపాతాళం ఎలాంటిది అంటావా? విల్లే మొసలి. అది నీళ్లలో అడుగు పెట్టీ పెట్టకముందే వాతవేస్తుంది. అది దాటిపోతే భుజ వేగమనే పెద్ద బురద వుంటుంది. దాంట్లో దిగబడితే అంతే సంగతి ఇక. అదీ దాటిపోగలిగితే, బాణపరంపరలనే అలలు మీదమీద వచ్చిపడి లోపలి ఈడ్చుకు పోయి చంపుతాయి. ఇలాంటి యుద్ధ ప్రవాహంకల రామపాతాళంలో పడితే ఇక జీవితాశ లేదు. నేను పరుషంగా చెప్పానని కోప్పడవద్దు. క్షమించు. వాస్తవంగా నీ మేలు కోరి చెప్పాను. కోపం తగ్గించుకొని లంకకు వెళ్లు. నీ భార్యలతో సంతోషంగా

జీవించు. ఆడవిలో ఆయన భార్యతో రాముడు వుంటాడు. ఆయన భార్యతో ఆయన లేకుండా చేశావా, నీ భార్యలతో నువ్వు సుఖంగా వుండవు".

ఇలా మారీచుడు చెప్పిన హితోక్తులు విన్న రావణుడు, అలాగే ఆయన చెప్పినట్లే చేస్తానని జవాబిచ్చి, లంకకు పోయి సంతోషంగా తన ఇంటికి చేరాడు. రాముడితో బలవద్విరోధం ఎందుకు? నేనొక్కడినే పోతే అందర్నీ చంపిన రాముడిని తానొక్కడినే జయించగలనని నమ్మకం ఏమిటి? అని ఆలోచించి సంతుష్టుడై ఇంటికి పోయాడు రావణాసురుడు.

ఇప్పటికింకా రావణుడికి శూర్పనఖ ముక్కు-చెవులు కోసిన సంగతి తెలియదు. అకంపనుడు తెలిసినా చెప్పలేదు. ఎందుకు చెప్పలేదు? ఖరుడికి, రాముడికి యుద్ధం ఎందుకు జరిగిందని రావణాసురుడు అడగలేదు. అందరు ఋషులను చంపినట్లే రాముడిని కూడా చంపడానికి పోయి చచ్చారేమో అనుకున్నాడు. తనంతట తానుగా అకంపనుడు చెప్పలేదు. అసలు శూర్పనఖ రాముడి దగ్గరకు పోవాల్సిన అవసరం ఏమొచ్చిందని రావణుడు అడుగుతాడని భావించి అకంపనుడు ఆ విషయాన్ని దాటేశాడు. అదే వచ్చి అన్ని సంగతులు చెప్పుకుంటుందిలే, మనకెందుకీ బాధ? అనుకున్నాడు.

◆❖◆

"జనకాత్మజ సంబంధమున రాముం డప్రమేయ పురుతేజుం డయ్యె"

పద్నాలుగు వేలమంది రాక్షస శ్రేష్టులు, ఖరుడు, దూషణుడు, త్రిశిరుడు, శ్రీరాముడి చేతిలో చావడం కళ్లారా చూసిన శూర్పనఖ, ఏడ్చుకుంటూ, రావణుడు పాలించే లంకకు పోయింది. పోయి అక్కడ తన అన్నను చూసి తనకు జరిగిన అవమానం, ఖర దూషణాదుల చావు గురించి వివరంగా చెప్పింది.

"ఓరీ! నీ పక్కనే కాచుకున్న మృత్యుదేవతను కనుక్కోలేక పోతున్నావుకదా! వేగులవాళ్ళను ఏర్పాటుచేసి ఎక్కడెక్కడ ఏం జరుగుతుందో, ఎవరు మిత్రులో, ఎవరు శత్రువులో తెలుసుకోలేకుండా, వున్నావు. నీకు సరైన వేగులు లేనందున నీ జనస్థానంలో నీ బంధువులందరూ చచ్చిన వార్త నీకెలా తెలుస్తుంది? ఖరదూషణాది బంధువులతో సహా పద్నాలుగువేల మంది రాక్షసులను రామచంద్రమూర్తి ఒక్కడే యుద్ధభూమిలో నాశనం చేశాడు. నీకు విరోధులై, నీ కీడు కోరే రాక్షసులకు ఇక రావణుడి వల్ల భయం లేదు. తాను రక్షిస్తానని చెప్పాడు. దండకారణ్యంలో నీ వాళ్ల భయం లేకుండా కూడా చేశాడు. ఇవన్నీ అతిబలవంతుడైన రామచంద్రుడు ఒక్కడే చేశాడు" అని అంటుంది. ఇంకా ఏవేవో మాటలతో దెప్పి పొడిచింది.

ఈ విధంగా శూర్పనఖ చెప్పిన మాటలకు రావణుడు ఆమెను, రాముడు ఎలాంటి పరాక్రమం కలవాడు, ఏ ఆయుధం కలవాడు, మనుష్యుడా? దేవతా? అని తనకు కావాల్సిన విషయాల గురించి ప్రశ్నించాడు. శూర్పనఖ రాముడి ఆకారం మరిచిపోదామన్నా మరువలేక, కళ్ళకు కట్టినట్లు వుండడం వల్ల, ఆయన ఆకార సౌందర్య వర్ణనతో జవాబిచ్చింది. తమ్ముడు లక్ష్మణుడి పరాక్రమం గురించీ, సీత సౌందర్యం గురించీ కూడా వర్ణించింది.

"సీత ఎవరికి భార్యో, ఎవరిని ఆమె సంతోషంగా కౌగలించుకుంటుందో, ఆ పురుషుడు మూడులోకాలలో ఇంద్రుడి కంటే గొప్పవాడై పేరుతెచ్చుకుంటాడు. చక్కటి సౌందర్యం, నడవడి కలిగి స్త్రీలలో శ్రేష్టురాలైన ఈ సీత నీకు తగిన భార్య. ఆమెకు నువ్వు తగిన భర్తవి. ఇద్దరినీ పోల్చి చూసి ఆ సీతను తెచ్చి నీకివ్వాలని భావించి నేనక్కడికి పోయాను. నా ఆలోచన తెలుసుకున్న లక్ష్మణుడు నేను

మొత్తుకుంటున్నా వినకుండా, నన్ను పట్టుకొని నా ముక్కు, చెవులు మొదలంటా కోశాడు. నువ్వే స్వయంగా పోయి ఆ సొగసుగత్తెను కళ్లారా చూస్తే, ఆమె కావాలని పట్టుబట్టుతావు. నువ్వు జానకిని భార్యగా చేసుకోవాలంటే అది సాధించడానికి తక్షణం బయల్దేరు. ఇప్పుడే దండకారణ్యంలో సీత వున్న చోటుకు పో. రామలక్ష్మణులను యుద్ధంలో చంపు. సీతను తీసుకొచ్చి నీ ఇష్ట ప్రకారం సుఖపడు" అని అన్నది.

శూర్పనఖ మాటలు విన్న రావణుడు, మంత్రులతో ఆలోచించి, కార్యం ఎలా చేయాలో నిర్ణయించుకొని, వాళ్లను పొమ్మని పంపి, ఎలా ముందుకుపోవాలో ఆలోచన చేశాడు. రావణుడిలా అనుకుంటాడు: "ప్రాణం పోగొట్టుకొనైనా మానం రక్షించుకోవాలి. కాబట్టి వూరుకోవడం మానహానికరం. అపకీర్తికరం. ప్రతీకారం చేయాలంటే ఏం చేయాలి? ఎలా చేయాలి? బహిరంగంగా యుద్ధానికి పోవాలా? యుద్ధంలో నేనే జయిస్తానని నమ్మకం ఏంటి? కాబట్టి ఇది అపాయం. వంచన చేసి సీతను అపహరించి తెస్తే, ఎక్కడో వున్న వాళ్లను ఇంటిమీదకు నేనే తెచ్చినట్లు అవుతుంది. వారిక్కడికి వస్తే వూరికే పోరు. మరో విధంగా ఆలోచిస్తే, రామలక్ష్మణులు నా గురించి తెలుసుకొనడం, తెలిసినా సముద్రాన్ని దాటడం, లంకకు రావడం, యుద్ధంలో గెలవడం, ఇరువురు మనుష్యులకు అసంభవం. ఒక వేళ అలా కాకపోతే, భార్యను కోల్పోయిన బాధతో, అవమానంతో, చావనే చస్తే మరీ మంచిది. సీతను వశపర్చుకుంటే నాకే భయం లేదు. ఆ విషయం వాళ్లకు తెలియగానే చస్తారు".

ఇలా నిశ్చయించుకొని, మనస్సు దృఢం చేసుకొని, రహస్యంగా రథాన్ని సిద్ధం చేసి తీసుకొని దానిమీద ఆకాశ మార్గాన రావణాసురుడు సముద్రాన్ని దాటాడు. ఆ వనంలో ఒక ప్రదేశంలో, నిర్మలమైన స్థలంలో, మితాహారుడై, చలించని ఇంద్రియ నిగ్రహంతో, జింక చర్మం ధరించి, జడలతో, నారవస్త్రాలు కట్టుకుని తపస్సు చేస్తున్న మారీచుడి దగ్గరకు పోయాడు రావణుడు. మారీచుడు అతడిని తగు విధంగా మర్యాదలు చేశాడు. మళ్లీ ఎందుకు వచ్చావని అడిగాడు రావణుడిని మారీచుడు.

మారీచుడి ప్రశ్నకు జవాబుగా రావణుడు. "ఆర్తుడనై వచ్చాను. మహాత్మా! నా ఆర్తి పోగొట్టడానికి నువ్వు తప్ప నాకు వేరే గతి లేదు. నా తమ్ములు ఖరుడు, దూషణుడు, ముద్దుల చెల్లి శూర్పనఖ, అతి శూరుడైన త్రిశిరుడు, పద్నాలుగు వేలమంది రాక్షసులు రాముడి మీద కోపంతో యుద్ధానికి పోగా, అతడు వారందరినీ చంపాడు. అంతే కాకుండా మునులంతా దండకారణ్యంలో భయం లేకుండా తిరగొచ్చని చెప్పాడు. రాముడు నాతో విరోధం లేకున్నా నిష్కారణంగా నా చెల్లెలి ముక్కు-చెవులు బలగర్వంతో కోశాడు".

రాముడు ఇలాంటివాడు కాబట్టే, దేవతాస్త్రీతో సమానమైన సౌందర్యం కల అతడి భార్య జానకిని తీసుకురావడానికి తాను పోతున్నాననీ, మారీచుడు తనకు తోడుగా రావాలనీ, తన తమ్ములు, మారీచుడు, తనకు సహాయంగా వుంటే యుద్ధంలో దేవతలనైనా గడ్డిపోచలాగా చూస్తాననీ, ఇది తన నిశ్చయం అనీ, అంటాడు రావణుడు మారీచుడితో.

రావణుడు చెప్పిన రాముడి వృత్తాంతాన్ని ఆసాంతం విన్న మారీచుడు, రామచంద్రమూర్తి శౌర్యం తెలిసినవాడైనందున, తన ప్రాణానికే ముప్పు వచ్చిందికదా! అని గుండెలు ఝల్లన భయపడ్డాడు.

నిశ్చేష్టుడయ్యాడు. తెప్పరిల్లి, వణకుతూ, నోట తడిలేకపోవడంతో పెదవులు నాకుతూ, ధైర్యం చెడి శవంతో సమానమై పోయి, రావణుడిని చూస్తూ భయంతో, రెండు చేతులూ జోడించి, తనకు క్షేమకరమైన విధంగా ఇలా అంటాడు. "రావణా! రామచంద్రుడితో విరోధం వద్దని మొన్ననే నేను చెప్పాను. సరే అని అంగీకరించి పోయావు. ఇంతలో మనస్సు మార్చుకొని మళ్లీ వచ్చావు. నీ మేలు కోరేవాడిని కాబట్టి నీకు లాభం చేకూరే మాటలనే చెప్తా".

"రాముడి వృత్తాంతాన్ని నీవెరుగవు. ఆయనకే కోపం వస్తే లోకంలో రాక్షస జాతి అనేది పేరుకుకూడా వుండదు. రాముడి నుండి సీతను వేరు చేద్దామని చూస్తున్నావా? ఇది నీకు సాధ్యమా? రామచంద్రమూర్తి వల్ల ఆమె రక్షించబడుతున్నది. రాముడి నుండి వేరు చేస్తే రక్షకుడు లేనందువల్ల నువ్వు చెప్పినట్లు వింటుందని అనుకుంటున్నావు. ఆమె తన పాతివ్రత్యంతో తనను తాను కాపాడుకుంటున్నది. తన రక్షాభారం ఇతరుల మీద వేయలేదు. కాబట్టి నువ్వు అపహరించినా ఆమె నీకు లోబడుతుందని భావించకు. తమను తాము కాపాడుకోలేని వారేకదా పరరక్షణ కోరేది? కాబట్టి నీ ఉద్దేశం కొనసాగదు. సీతాదేవిని నువ్వు అపహరించాలని చూస్తున్నావు. ఆమె సమీపంలోకి నువ్వు పోగలిగితే కదా, నువ్వు ఆమెను అపహరించడం? ఆమెను రాముడనే అగ్నిహోత్రం చుట్టుకొని రక్షిస్తున్నది. 'జనకాత్మజ సంబంధమున రాముం డప్రమేయ పురుతేజుం డయ్యెను'. సీతాదేవి సంబంధమున చేసి రాముడు ఛేదింపరాని గొప్ప తేజం కలవాడయ్యాడు. అలాంటి రాముడి విల్లు రక్షిస్తుంటే సీతను తేవడం నీకు సాధ్యమా? నువ్వు రాముడికి కోపం వచ్చినా చెడుతావు. సీతకు కోపం వచ్చినా చెడుతావు. ఇక, ఇరువురికీ కోపం వస్తే నీ గతేంటి? ఆలోచించి ఆ వైపుకు వెళ్లు" అంటాడు.

"రాక్షసరాజా! రామచంద్రమూర్తితో విరోధిస్తే నీ కోరికలు, రాజ్య భోగాలు, సుఖాలు, ప్రాణం, వీటిలో ఒక్కటైనా మిగలదు. కాబట్టి నీకింకా కొంతకాలం సుఖపడాలనుకుంటే, రామచంద్రమూర్తి మనస్సు నొచ్చుకునే పనేమీ చేయొద్దు. నిన్ను నేను ప్రార్థిస్తున్నాను. నువ్వు లంకకు వెళ్లిపో. అక్కడ నీ మేలుకోరే విభీషణుడులాంటివారిని రహస్యంగా కాకుండా నిండు సభలో చూడు. నువ్వు అనుకున్న పనిలో గుణమెంతో వాళ్లు చెప్తే విను. దాంట్లో ఏది బలమో, ఏది దుర్బలమో, నీ బలమెంతో, రాముడి బలమెంతో నిశ్చయం చేసుకో. ఆ తరువాత ఇది మనకు మేలనీ, ఇది మనకు కీడనీ తేల్చుకుని ముందుకుపో. నాకు తోచింది నేను చెప్పాను. రామచంద్రుడిని నువ్వు యుద్ధరంగంలో సమీపించవద్దు. నా మాట విను. నీకు మేలు కలుగుతుంది" అని అంటాడు. శ్రీరాముడి బలపరాక్రమాలను వివరంగా, విడమర్చి చెప్పిన మారీచుడు, అంతటితో ఆగకుండా, శ్రీరాముడితో తాను పడ్డ పాట్లు చెప్పాడు రావణుడితో.

మారీచుడి హితవాక్యాలు రావణుడికి రుచించలేదు. రావణుడు మారీచుడితో నిష్ఠూరాలు పలుకుతూ ఇలా అన్నాడు. "ఓరీ! మారీచుడా! నిన్నెవడురా ఈ కథలు చెప్పమని అడిగాడు? రాముడు మనుష్యుడు, మూర్ఖుడు, పాపాత్ముడు. అలాంటివాడిని నాతో సమానం అనుకొని యుద్ధానికి పోతానా? ఏమీ నీ అహంకారం? నేనొక పనిచేద్దామని నీ సహాయం కోరితే, అది రాచధర్మం అని తెలుసుకోకుండా, తెలివిలేక, ఏవేవో పనికిరాని మాటలు ఇంతసేపు చెప్పావు. నువ్వు నాకు చేయాల్సిన సహాయం గురించి

చెప్తా విను. వెండి చుక్కలు కల బంగారు జింకగా మారు. రామాశ్రమం దగ్గర సీత ఎదురుగా సంచరించు. నీ వ్యవహారం చూసి నువ్వు నిజమైన జింక అని నమ్మి, ఆశ్చర్యపడి, సీతాదేవి నిన్ను పట్టుకొని రమ్మని మగాడిని పంపుతుంది. నువ్వు ఆరాముడిని దూరంగా తీసుకుపోయి అక్కడ జానకీ! లక్ష్మణా! అని చనిపోయేవాడి గొంతుతో రాముడు గొంతులా అనిపించేట్లు బిగ్గరగా అరువు. అది రాముడి గొంతని నమ్మి సీత భయంతో రాముడిని చూసి రమ్మని లక్ష్మణుడిని పంపుతుంది".

"అన్న మీద ప్రేమతో లక్ష్మణుడు రాముడిని వెతకడానికి పోతాడు. ఆ రాజకుమారులు ఇరువురూ లేనప్పుడు రాముడి భార్యను అపహరించి భార్యగా చేసుకొని సుఖపడతాను. ఈ మాత్రం సహాయం నువ్వు చేసి నీ ఇష్టం వచ్చిన చోటుకు వెళ్లు. పని పూర్తి కావడానికి నువ్వు ముందు పో. నీ వెనకాలే నేను రథం మీద వస్తాను. రాముడిని మోసం చేసి సీతను అపహరించి, యుద్ధమనేది లేకుండా సుఖంగా కొంచెం సేపట్లోనే ఇంటికి పోతాను. నువ్వు దీనిని చేయకపోతే నిన్ను ఇప్పుడే చంపుతాను. అలా కాకుండా నేను చెప్పింది నీకు అంగీకారమైతే నేను చెప్పినట్లే చేయి. అలా కాదని, నీకిష్టం లేదంటావా, నీ చేత బలవంతంగానైనా చేయిస్తాను. తప్పదు. కాబట్టి తెలివి తెచ్చుకో. నేను చెప్పినట్లు అక్కడికి పోతే నువ్వు చావడం సందేహం, తప్పించుకోవచ్చు కూడా. ఇక్కడ ఇలానే వాగుతుంటే నా చేతిలో నీకు చావు తథ్యం. అక్కడికి పోవడం మేలో, లేదా ఇక్కడ చావడం మేలో, ఆలోచించి తగిన విధంగా చేయి".

రావణుడిలా రాజులాగా ఆజ్ఞాపించడం విన్న మారీచుడు, నిష్ఠూరంగా, ఆయన మాటలకు విరుద్ధంగా, ప్రతికూలమైన మాటలతో జవాబిచ్చాడిలా: "నేను పోవడమంటే చావడమే! ఆయన కళ్లకు కనబడ్డ దాకే నా జీవితం. ఇక్కడ నేనొక్కడినే చస్తాను. నువ్వేమో సీతను అపహరించుకుని పోయి బంధువులతో సహా చస్తావు. ఇది నమ్ము. నన్ను చంపించి నువ్వు బతకడం కల్ల. సీతాదేవిని ఎత్తుకుపోతే అందరూ నాశనమే!".

ఇదంతా చెప్పిన మారీచుడు రావణాసురుడిని చూసి, ఇంకా తాను ఆయన మాట వినడం ఆలస్యం చేస్తే, వెంటనే చంపుతాడేమో అన్న భయంతో పోవడానికి సిద్ధమయ్యాడు. ఆశ్రమం సమీపానికి పోయారిద్దరూ. నిమిషంలో మారీచుడు శ్రేష్ఠమైన జింకలాగా ఆ అరణ్యంలో తిరుగుతూ, రాముడి తపోవనం సమీపించాడు. జానకీదేవిని మోసగించడానికి ఆ రాక్షసుడు జింక వేషంలో అక్కడే ఎక్కడ తిరిగితే తనను సీత చూడగలడో అక్కడే తిరగసాగాడు. అలా తిరుగుతూ, దూరంగా పరుగెత్తుతూ, వెనుకా–ముందుకూ కదలుతూ సమయం కోసం వేచి చూడసాగాడు. ఈ ప్రకారం అడవిలో తిరుగుతున్న ఆ మృగాన్ని చూసి ఇతర మృగాలు నిజమైన మృగమని భ్రమించి దగ్గరకు వచ్చి వాసన చూసి బెదిరి పోసాగాయి. ఇలా అది తిరుగున్న సమయంలోనే జానకీదేవి కంట పడింది.

◆❖◆

మారీచ మాయా జింకను చూసి భ్రమించిన సీతాదేవి

రావణాసురుడి అజ్ఞానుసారం, ఆయనకు భయపడి, మారీచుడు రావణుడితో కలిసి పంచవటి సమీపానికి వచ్చాడు. వచ్చి, నిమిషంలో శ్రేష్టమైన జింకలాగా ఆ అరణ్యంలో తిరుగుతూ, రాముడి తపోవనం సమీపించాడు. జానకీదేవిని మోసగించడానికి ఆ రాక్షసుడు జింక వేషంలో సమయం కోసం వేచి చూడసాగాడు. పూలు కోయడానికి బయటకు వచ్చిన సీతాదేవి ఆ జింకను చూసి ఆశ్చర్యపడింది. ఆ వింత జింకను ప్రేమతో చూసింది సీత. ఆ వింత జింకను చూసి, భర్త రామచంద్రుడిని, మరది లక్ష్మణుడిని రమ్మని పిలిచింది. దాన్ని చూసిన లక్ష్మణుడికి సందేహం కలిగింది. మారీచుడనే రాక్షసుడికి ఇలాంటి ఆకారంలో తిరుగుతూ మునులను, వేటకై వచ్చే రాజులను వధించే అలవాటుందని, యోగశక్తిగల ఆ రాక్షసుడే తన అద్భుత యోగ శక్తితో జింకలాగా తిరుగుతున్నాడని, ఇది నిజమైన జింక కాదని అంటాడు.

ఆయన మాటలకు అడ్డుతగిలి, భర్త దగ్గరికి పోయి, సీత ఇలా అంటుంది. "ప్రాణేశ్వరా! ఈ జింక మీద ఆశ కలిగింది. ఆడుకోవడానికి ఇది కావాలి. ఈ మృగం ప్రాణంతో దొరికితే అంతకంటే కావాల్సింది ఏమిటి? ఒకవేళ ఇది ప్రాణాలతో దొరక్కపోయినా, దీని చర్మమైనా నాకు ఆనందం కలిగిస్తుంది. లేపచ్చికతో చేయబడిన దర్భాసనం మీద దీన్ని పరచుకుని నీతో కూర్చోవాలని అనుకుంటున్నాను." అంటుంది. సీతాదేవి మాటలకు శ్రీరామచంద్రుడు, ఆ జింకను చూసి సంతోషించాడు.

సీతాదేవి కోరిన విధంగా జింకను పట్టుకోవాలని భావించిన శ్రీరామచంద్రమూర్తి లక్ష్మణుడితో అన్నాడిలా: "లక్ష్మణా! ఈ జింక మీద సీతకు ఎంత ఆశ కలిగిందో? మనం కూడా ఇలాంటి సౌందర్యంకల జింకను చూశామా? ముమ్మందు చూడగలమా? బంగారుమయమైన ఈ శ్రేష్టమైన జింక చర్మం మీద సీతాదేవి నాతో కలిసి కూర్చోవాలని ఆశపడుతున్నది. ఇది రాక్షస మాయామృగం. జీవితంలో పట్టుబడదు. అందుకే దీన్ని చంపాలి. వీడు వాతాపి అంతటి వాడే! అగస్త్యుడి వల్ల వాడు ఎలా చచ్చాడో, వీడు కూడా మనల్ని మోసగించడానికి వచ్చాడు కాబట్టి, వీడూ చావాల్సిన వాడే. నేను వేటకోసం పోతాను. నువ్వు ధృడ ప్రయత్నంతో సీతకు అపాయం కలగకుండా కాపాడాలి. ఈ మృగం నువ్వు

చెప్పినట్లు రాక్షసమాయ అయితే చంపుతాను. లేక సహజ మృగమే అయితే జాగ్రత్తగా పట్టి తెస్తాను. వీట్లో ఏదో ఒకటి చేస్తాను. లక్ష్మణా! సీతాదేవిని చూస్తుండు జాగ్రత్తగా".

శ్రీరాముడి చర్య వలన గ్రహించాల్సిన నీతి వున్నది. ఆయన భ్రమ పడడమే కాకుండా, లక్ష్మణుడు చెప్పినా వినలేదు. మారీచుడి మాయ అని నమ్మితే, ఉన్నచోటే వుండి బాణ ప్రయోగం చేయవచ్చుకదా? జింక వెంట పోవాల్సిన పని లేదు. అది నిజమైన జింకే అన్న భ్రాంతి వదలలేదు. సీతాదేవి లోకమాన్య స్త్రీ అవుతుందా? ఆమెకు తెలియని విషయాలు లేవు కదా? బంగారు జింక లోకంలో వుండదని తెలియదా? పరమ భక్తికల సీత ఎందుకు ఒక క్షుద్ర మృగానికై భర్తను వదిలి వుండాలని అనుకుంది? కాబట్టి కర్మానుసారం బుద్ధి అనే నీతి బలపడుతున్నది.

పరమార్థం విచారిస్తే, మనుష్యులకు కోరికలు కోరే స్వాతంత్ర్యం వుంది. దాన్ని నెరవేర్చే భారం భగవంతుడి మీద వుంది. ఎవరే కోరికలు గట్టిగా కోరినా భగవంతుడు దాన్ని నెరవేరుస్తాడు. కాని దాని ఫలం అనుభవించమని అంటాడు. కాబట్టి మంచి కోరికలు కోరేవారికి మంచి ఫలమే కలుగుతుంది. చెడు కోరికలు కోరేవారికి కలిగేది చెడు ఫలమే! ప్రకృతి విషయమైన కోరికలు కోరేవారందరికీ సీతాదేవికి పట్టిన గతే పట్టుంది. మారీచుడి మాయే ప్రకృతి. ప్రపంచంలో మనం చూసేవి, వినేవి అన్నీ ప్రకృతి చిత్రాలే! సీతాదేవి మాయ జింకను చూసి భ్రమించి ఆశపడినట్లు మనం కూడా చిత్ర–విచిత్రమైన ప్రకృతి పదార్థాలను చూసి సత్యమని భ్రమ పడుతున్నాం. ఇవి సత్యం కావు. క్షణభంగురాలు. ఆ జింక వల్ల సీతాదేవి ఎలా సుఖపడాలని కోరుకుందో అలాగే మనం ప్రకృతి పదార్థాలవల్ల ఆనందపడాలని కోరతాం. రామచంద్రమూర్తి సీతాదేవి కోరిక నేరవేర్చినట్లే మనకోరికనూ నెరవేరుస్తాడు. సీతాదేవి అనుభవించిన ఫలం మనం కూడా అనుభవించబోతున్నాం. సీతకు ఏం ఫలం కలిగింది? అది ముమ్ముందు తెలుసుకుంటాం.

విల్లు, బాకు, అంబుల పొదులు ధరించి శ్రీరాముడు ఆ మృగాన్ని పట్టుకోవడానికి వెంటనే బయల్దేరాడు. రాముడిని చూసి తనను చంపడానికి వస్తున్నాడని నిర్ణయించుకున్న మాయామృగం పారిపోతే రావణుడు చంపుతాడని భయపడింది. రాముడికి కనిపించీ–కనిపించకుండా తిరగసాగింది. కాసేపు దగ్గరికి, కాసేపు దూరంగా, కాసేపు పచ్చిక మేస్తూ, కాసేపు వినోదంగా తిరుగుతూ, రామచంద్రమూర్తికి కనిపించేది. శ్రీరాముడు విల్లు ఎక్కు పెట్టగానే, దూరంగా పరుగేత్తేది. భయపడుతున్నట్లు నటించి ఆకాశంలో గంతులు పెడ్తూ ఆడేది. రామచంద్రుడు కోపగించుకుని దీన్ని చంపాలని నిర్ణయించుకుని, సూర్యకాంతిగల బ్రహ్మాస్త్రాన్ని సంధించి, ఆ మృగ రూపంలో వున్న రాక్షసుడికి గురి చూసి కొట్టాడు.

శ్రీరాముడు వేసిన బాణం జింక రూపంలో వున్న రాక్షసుడి శరీరంలో దూరడంతో ఆ రాక్షసుడు భయంకరమైన ధ్వనితో ఎగిరి పడ్డాడు. తన మాయా శరీరం వదలిన మారీచుడు రాముడి గొంతును అనుకరిస్తూ "హా! సీతా! హా! లక్ష్మణా!" అని అరిచి జింక రూపం వదలి నిజరూపం దాల్చి భూమ్మీద పడి ప్రాణాలను విడిచాడు. అలా పడిపోయిన రాక్షసుడిని చూసిన రాముడికి లక్ష్మణుడి మాటలు స్మరణకొచ్చాయి. సీత మీద మనస్సు పోయింది. లక్ష్మణుడు చెప్పినట్లు ఇది మారీచుడి మాయేనని

నిశ్చయించాడు. తన బాణంతో చచ్చినవాడు మారీచుడే అని అనుకున్నాడు. తన గొంతుతో "హా! సీతా! హా! లక్ష్మణా!" అని అరచినది విని సీతాలక్ష్మణులు ఏమని అనుకున్నారో అని ఆలోచిస్తూ, భయంతో, శీఘ్రంగా ఆశ్రమానికి బయల్దేరాడు.

ఆశ్రమంలో వున్న సీత తన భర్త గొంతుతో "హా! సీతా! హా! లక్ష్మణా!" అని దుఃఖంతో వినిపించగా లక్ష్మణుడిని చూసి, "అయ్యో లక్ష్మణా! ఇదేం విపరీతం? రామచంద్రుడిని చూడడానికి త్వరగా పరుగెత్తు. రామచంద్రమూర్తి ఒంటరిగా వున్నాడు. ఎక్కడ ఎవరి చేతులకు చిక్కాడో, లేక, మరేమైనా ఆపద కలిగిందో? మీ అన్న అరుస్తున్నాడు. త్వరగా ఆయనను కాపాడడానికి పోవయ్యా" అని అనింది. లక్ష్మణుడు సీతను కాపాడమని తనకు అన్న చెప్పిన మాటలు జ్ఞాపకం చేసుకుని సీత చెప్పినట్లు పోకుండా అక్కడే నిలిచి వున్నాడు. అది చూసి సీత లక్ష్మణుడితో కోపంగా మాట్లాడింది. పద్నాలుగువేల మంది యోధులను ఒక్కడే తన కళ్ళ ఎదుటే చంపగా చూసినప్పటికీ, ఆయనకు ఏదో ఆపద కలిగిందని అనుకోవడం కర్మబలిష్టమే! లక్ష్మణుడితో కోపంగా, నిష్ఠూరంగా మాట్లాడింది. దుర్భాషలాడింది. వంచకుడా అన్నది. దుష్టకామం కలవాడన్నది. స్నేహితుడి వేషం వేసుకుని తిరుగుతున్న గొప్ప శత్రువు అన్నది. తన మీద వున్న మోహంతో తన్ను చేపట్టాలని అక్కడికి పోవడానికి ఒక్క అడుగైనా వేయడం లేదు అని నిందించింది.

సీతాదేవి తనను నిష్ఠూరాలు ఆడుతూ అంటున్న మాటలకు లక్ష్మణుడు ఎన్నో విధాలుగా జవాబు చెప్పాడు. భయపడవద్దన్నాడు. ఆమె భర్తను యుద్ధంలో దేవతలు, మనుష్యులు, యక్షులు, సర్పాల రాక్షసులు, పిశాచాల నాయకులు, లేదా ఇంకెవరైనా నిలిచి పోరాడగలరా? అన్నాడు. ఆమె నోట వచ్చిన మాటలు అనతగ్గవి కాదన్నాడు. ఒంటరిగా సీతను విడిచి పోనన్నాడు. మనం విన్నది రామచంద్రమూర్తి గొంతు కాదు. ఏ మాయలమారో అలా గొంతు మార్చి అరిచాడు. ఆ మారీచ రాక్షసుడే అలా స్వరం ఇంద్రజాలంలా అనుకరించాడు అని కూడా చెప్పాడు. నిజం చెప్తున్న ఆయన్ను సీత మళ్లీ-మళ్లీ చాలా కఠినంగా నిందించింది.

సీతాదేవి సాక్షాత్తు లక్ష్మీదేవి. ఆమెలాంటి ఉత్తమురాలు ఏ లోకంలోనూ లేదు. అలాంటిది లక్ష్మణుడి తత్వం తెల్సి కూడా ఇలా మాట్లాడవచ్చా? స్త్రీ ఎప్పుడైనా స్త్రీనే. స్త్రీ స్వభావం బొత్తిగా లేని స్త్రీ వుండదు. వారికి కోపం వస్తే, అనరాని మాటలు, చేయరాని పనులు వుండవు. ఇక లక్ష్మణుడు నిష్కారణంగా భరతుడిని అనరాని మాటలన్నందుకు ఇది పర్యవసానం. నిష్కారణంగా సీతతో పడరాని మాటలు పడ్డాడు.

ఇక అవతారం విషయం ఆలోచిస్తే వాస్తవం తెలుసుకోవచ్చు. సీత పుట్టింది లంకను చెరచడానికే. సమూలంగా రావణుడిని చంపడానికే ఆమె పుట్టింది. వేదవతి అలాగే అన్నది కదా? ఆ కార్యాన్ని సీత చేయాల్సి వుంది. దానికొరకై లంకకు వెళ్లాలి. రామలక్ష్మణులు తన దగ్గర వుంటే, రావణుడు రాలేడు. కాబట్టి మాయా మృగం నెపంతో రాముడిని మంచిమాటలు చెప్పి దూరంగా పంపింది. లక్ష్మణుడు అలా పోయేవాడు కాదు. రామాజ్ఞను కూడా ఉల్లంఘించి పోయేంత పని చేస్తేనే కాని ఆయన పోడు. ఇట్లా నిందలు వేస్తేనే ఆయన పోతాడు. ఇలా కార్యసాధన మార్గం ఆలోచించి, పంపడానికి సిద్ధమైంది కాని జ్ఞాన హీనగా, దుష్టురాలిగా మాట్లాడ లేదు.

వినడానికి కూడా యోగ్యంకాని మాటలను జానకి లాంటిది పలకగా, లక్ష్మణుడు రెండు చేతులు జోడించి సీతవైపు తిరిగి, ఆమెకు బదులు చెప్పడానికి తన మనస్సు అంగీకరించడం లేదంటాడు. "న్యాయం చెప్పేవాడినైన నేను న్యాయం పలుకుతుంటే, నీ దుష్టవాక్యాలను ఈ వనదేవతలందరూ వివరంగా సాక్షులై విందురుగాక. ఛీ! సహజంగా స్త్రీత్వమే పాపాత్మకం. కోపస్వభావంగలదానా! పెద్దవాడు తండ్రితో సమానమైన అన్న ఆజ్ఞ పాలిస్తున్న నన్ను ఈ విధంగా సందేహించినందున నువ్వు ఇప్పుడే పాడైపో. అబలా! ఇప్పుడే పోతాను రాముడున్న దగ్గరికి. ఇప్పుడు నీకు స్వస్తి కలుగుకాక. వనదేవతలు రక్షించెదరుగాక. నాకు చెడు సూచించే అపశకునాలు కనిపిస్తున్నాయి. రామచంద్రుడితో తిరిగి వచ్చిన తరువాత నిన్ను చూడగలనో? లేదో?"

ఇలా ఎప్పుడైతే లక్ష్మణుడు అన్నాడో, జానకి కన్నీళ్లు కారుస్తూ, ఏడుస్తూ, కర్ణశూలాల లాంటి మాటలన్నది. "నేను విషం తిని చస్తాను. గోదావరిలో దూకుతాను. ఉరిపోసుకుంటాను. మంటల్లో పడి చస్తాను. ఇతరులను కాలి వేలితోనైనా తాకుతానా?" అని అంటూ గట్టిగా ఏడుస్తూ, రెండు చేతులతో దబ-దబా తన కడుపుమీద కొట్టుకుంది. లక్ష్మణుడు ఓదార్చినా వినలేదు, ఆగలేదు. ఆ తరువాత లక్ష్మణుడు ఇంకా ఇక్కడే వుంటే ఏమవుతుందోనని భయపడి, సీతకు నమస్కారం చేసి, రుజుత్వమే మేలని భావించి, రాముడి దగ్గరకు పోయాడు.

లక్ష్మణుడు అలా వెళ్లిపోగానే అవకాశం దొరికిందని రావణుడు సీతను చేరదల్చుకున్నాడు. సన్యాసి వేషం వేసుకుని, సన్నకాషాయ వస్త్రం కట్టుకుని, ఎడమ భుజం మీద త్రిదండం పట్టుకుని, చేత కమండలం వుంచుకుని, గొడుగు పట్టుకుని, శిఖ కలిగి, పావుకోళ్లు తొడుక్కుని, అన్నదమ్ములిద్దరూ లేకపోవడంతో సీతదగ్గరకు పోయాడు రావణుడు. వాడికి భయపడి చెట్ల ఆకులూ కదలలేదు. గాలి ఆగిపోయింది. వేగంగా పారే గోదావరినది వాడి భయంతో మెల్లమెల్లగా నడిచింది. దుష్టుడైన రావణుడు మగడు సమీపంలో లేడని వ్యధపడుతున్న సీతను సమీపించబోయాడు. ఆవేశించిన కామంతో, మోసబుద్ధితో, వేదఘోష చేస్తూ, సీతదగ్గరకు పోయి సవినయంగా ఆమెతో ఇలా అన్నాడు.

సుందరీ! నీ వయస్సు, నీ సౌకుమార్యం, నీ చక్కదనం, ఆలోచించగా నువ్వు వంటరిదానివై ఈ అడవిలో వుండడం నాకు వెర్రి కలిగిస్తున్నది. సింహాలు, కోతులు, చిరుతపులులు, ఎలుగులు, పెద్దగద్దలు, విస్తారంగా ఇక్కడ తిరుగుతున్నాయే? నువ్వెలా భయం లేకుండా ఇక్కడ వున్నావు? నీ భర్త ఎవడు? ఇక్కడ ఎందుకు వున్నావు? ఇది రాక్షసుల గుంపులు తిరిగే స్థలం" అని రావణుడు అడిగాడు. బ్రాహ్మణ సన్యాసి వేషం వేసుకున్న వాడిని సీతాదేవి శీఘ్రంగా, యతులను పూజించే విధంగా పూజచేసి సత్కరించింది.

◆❖◆

వాల్మీకి రామాయణంలో లక్ష్మణ రేఖ వుందా?

మారీచ మాయా జింకను శ్రీరాముడు సంహరించగానే, వాడు చనిపోతూ, రాముడి గొంతుతో అరవడంతో భ్రమించిన సీతాదేవి అన్నకు సహాయంగా మరది లక్ష్మణుడిని పొమ్మని బలవంతం చేస్తుంది. పోకపోతే నిష్ఠూరాలు ఆడింది. నిందించింది. ఆమె మాట కాదనలేక, అయిష్టంగానే లక్ష్మణుడు అన్నకు సాయంగా వెళ్తాడు. వెళ్తూ–వెళ్తూ కేవలం ఆమెను జాగ్రత్తగా వుండమని మాత్రమే అన్నాడు కాని ఇతర రామాయణాల్లో చెప్పినట్లు ఎలాంటి రేఖా (లక్ష్మణ రేఖ) గీయలేదు. ఆమెను ఫలానా హద్దులోనే వుండమని, గీత దాటవద్దనీ నిర్దేశించనూ లేదు.

లక్ష్మణుడు అలా పోగానే, బిక్షాపాత్ర, కమండలాలు ధరించి, బ్రాహ్మణ సన్యాసి వేషంలో వచ్చిన (రావణాసురుడు) రాక్షసుడిని, తనకు కీడుచేసే ఆలోచనలో వున్నవాడిని, రాక్షసుడని తెలిసీ, బ్రాహ్మణుడిని పూజించిన విధంగానే పూజించింది సీతాదేవి. “ఇదిగో దర్భాసనం..ఇక్కడ కూర్చో. ఇదిగో అర్ఘ్యం...ఇదిగో బాద్యం...సర్వం సిద్ధం. ఇదిగో నీ ఆహారం కొరకు అడవిలోని పండ్లు....తృప్తిగా భుజించు” అని శాస్త్ర ప్రకారం చెప్తున్న సీతను, రాముడి భార్యను, తన చావుకోరకు రావణుడు బలాత్కారంగా అపహరించాలనుకున్నాడు. మాయా మృగాన్ని వేటాడడానికి పోయిన రామచంద్రుడు లక్ష్మణుడితో కలిసి వస్తాడేమోనని భయంగా అడవి నాలుగు దిక్కులా చూశాడు.

తనను బలాత్కారంగా తీసుకుపోదలచి రావణుడు అలా ప్రశ్నించాడని సీత భావించింది. అతిథులను, అభ్యాగతులను ఆదరించాల్సిన విధానం చక్కగా తెలిసిన సీత, రావణుడి మాటలు, వాడి ఆర్భాటం విని, చూసి, వీడు నిజమైన సన్యాసి కాదనుకుంటుంది. సన్యాసి వేషం ధరించిన బ్రాహ్మణుడు అనుకుని, అతిథితో అబద్ధం ఆడకూడదని, బ్రాహ్మణుడితో అసత్యం ఆడరాదని, అనుకుంటుంది. వీడు దొంగ సన్యాసి కాబట్టి వంచకులకు వంచనతో సమాధానం చెప్పాలి అనీ, అలా చెప్పడం దోషం కాదనీ, అల్పకాలం ఆలోచన చేసి వాడికిలా చెప్పడం ప్రారంభించింది.

“మిథిలా రాజు, జనకరాజు కూతుర్ని. నా పేరు సీత అంటారు. నీకు మేలు కలగాలి. నేను శ్రీరాముడి

భార్యను సుమా! మా మామగారు శ్రీరాముడికి పట్టాభిషేకం చేయాలని ఆలోచన చేశాడు. దానికి కావాల్సిన ఏర్పాట్లన్నీ చేశాడు. అప్పుడాయన భార్య కైక, నా భర్త దేశాన్ని వదిలి పోవాలని, తన కొడుకు రాజ్యానికి పట్టాభిషిక్తుడు కావాలని, రెండు వరాలు తన భర్తను కోరింది. తన మాట అంగీకరించకపోతే ప్రాణాలు విడుస్తానని బెదిరించింది. నా మామగారు ఆమెను ఎంత ప్రార్థించినా ఆయన విన్నపం చెవిన పెట్టలేదు. ఆ పట్టాభిషేక విఘ్నకాలానికి నా భర్తకు ఇరవై అయిదు సంవత్సరాల వయసు. నాకు పద్దెనిమిదేళ్ల వయసు. ఇంత లేత వయసువారు అడవుల్లో ఎలా తిరగ గలరో కూడా మా అత్త కైకేయి ఆలోచించలేదు. తండ్రిని సత్యవచనుడిని చేయడానికి, దేనికీ భయపడని రాముడు, అరణ్యాలకు వచ్చాడు.''

రామచంద్రమూర్తి విశ్వామిత్రుడితో అరణ్యానికి పోయేటప్పుడు ఆయన వయసు పన్నెండేళ్ళు. ఆ సంవత్సరమే సీతా వివాహం. తరువాత పన్నెండేళ్ళు అయోధ్యలో సుఖంగా వున్నాడు. ఆ తరువాత సంవత్సరం పట్టాభిషేక ప్రయత్నం కాబట్టి అప్పటికి రాముడికి పాతిక సంవత్సరాలు. అరణ్యావాసం ఆరంభమైన తరువాత ఋశ్యాశ్రమాలలో పదేళ్లు గడిపాడు. పంచవటిలో మూడేళ్లు వున్నాడు. వనవాసారంభం మొదలు పెట్టి ఇప్పటికి పద్నాలుగవ సంవత్సరం కాబట్టి, సీతాపహరణ సమయానికి శ్రీరాముడికి ముప్పై ఎనిమిదవ ఏడు. సీత జనకుడికి దొరికింది మొదలు ఆరు సంవత్సరాలు మిథిలలో వుంది. వివాహం తరువాత అయోధ్యలో పన్నెండేళ్ళు వుంది. పదమూడో సంవత్సరం అరణ్యాలకు ప్రయాణం కాగా, వనవాసానికి బయల్దేరి అప్పటికి సీతాదేవికి పద్దెనిమిది సంవత్సరాలు గడిచాయి. కాబట్టి, ఇప్పటికి సీతకు, ముప్పై ఒక్క ఏళ్లు గడిచాయి. ఇది ముప్పై రెండో ఏడు''.

సీత రావణుడికి ఇంకా ఇలా చెప్పింది. "నా భర్త సవతి తమ్ముడు, శూరుడు, లక్ష్మణుడు అన్నకు సహాయంగా విల్లు-బాణాలు ధరించి మాతో అడవులకు వచ్చాడు. కైక కారణాన రాజ్యాన్ని పోగొట్టుకుని మేం ముగ్గురం అడవుల్లో తిరుగుతున్నాం. కొంచెం సేపు నువ్వు ఇక్కడ వుంటే నా భర్త వస్తాడు. నీకు వనఫలాలు ఇస్తాడు. బ్రాహ్మణుడా! నీ పేరేంటి? నీ గోత్రం ఏమిటి? నువ్వే కులం వాడివి? ఏ జాతివాడివి? వివరంగా చెప్పు. ఎక్కడైనా ఆశ్రమంలో వుండకుండా ఈ అరణ్యాలలో ఎందుకు తిరుగుతున్నావు?''

సీతాదేవి ప్రశ్నలకు ఆ రాక్షసుడు తన చరిత్ర చెప్తా వినమని అంటూ, పరుషంగా మాట్లాడాడు. తన పేరు వింటే దేవతలు, దైత్యులు కూడ గడ-గడలాడుతారని తన ప్రతిష్టను చెప్పుకున్నాడు రావణుడు సీతతో ఇలా. "ఎవని పేరు చెప్తే మనుష్యులు మాత్రమే కాకుండా దేవతలు, దైత్యులు కూడా గడ, గడలాడుతారో, అలాంటివాడిని, రాక్షసుల నాయకుడిని. నా పేరు రావణాసురుడు. నీకు మేలు కలుగుగాక. నిన్ను చూసింది మొదలు నా భార్యలమీద ప్రేమ కలగడం లేదు. ఉత్తమ స్త్రీలనెందరినో బలాత్కారంగా తెచ్చాను. అట్లా అయితే నువ్వెందుకు అని అడుగుతావేమో? వారందరికీ నువ్వు ప్రభువై వుండు. నా గృహం లవణ సముద్రం మధ్యలో కొండ శిఖరం మీద వుంది. దాన్ని లంక అంటారు. అక్కడికి వచ్చి నాతో కలిసి వుండు. నువ్వు నా భార్యవైతివా సమస్తాభరణాలతో అలంకరించబడిన ఐదువేలమంది ఉత్తమ వంశంలో పుట్టిన స్త్రీలు శ్రద్ధాభక్తులతో నిన్ను సేవిస్తారు.''

రావణుడిలా చెప్పగా, అంతవరకూ వాడికి చేస్తున్న ఉపచారాలను వదిలి, సీతాదేవి అమితమైన

కోపంతో, రాక్షసులకు ప్రభువైన రావణుడిని లెక్కచేయకుండా, గట్టి మనస్సుతో జవాబిస్తూ తన భర్త శ్రీరాముడు ఎలాంటి వాడో, అతడి జోలికి వస్తే ఏ గతి పట్టుందో వివరించింది. గట్టి మనస్సుతో కఠినమైన మాటలు అన్నప్పటికీ భయంతో, భీకరమైన గాలికి వణికే అరటి చెట్టులాగా గడ-గడ వణికింది. అది చూసి సీతను మరింతగా భయపెట్టుతూ, రావణాసురుడు తన కులం, బలం వర్ణించాడు.

రావణుడు అనే సార్థక నామధేయం కలవాడినని, గంధర్వులు, పన్నగులు, గరుడులు తన్ను చూసి భయపడతారని, మృత్యువును చూసినట్లు ఎవరిని చూస్తే పరుగెత్తుతారో, యుద్ధంలో ఎవరిని చూసి కుబేరుడు పరుగెత్తాడో, ఎవరికి భయపడి తన పట్టణమైన లంకను విడిచి కుబేరుడు కైలాసం చేరాడో, ఎవరు పుష్పక విమానాన్ని లాక్కొని తన వాహనంగా చేసుకున్నాడో, అలాంటి తన ముఖాన్ని చూసి ఇంద్రుడు మొదలైన దేవతలు కూడా పరుగెత్తుతారని, తనున్న చోట గాలి కదలదని, సూర్యుడు చంద్రుడిలాగా చల్లగా అయిపోతాదని, ఎక్కడెక్కడ తాను నిలుస్తాడో అక్కడ చెట్లమీద ఒక్క ఆకైనా భయంతో కదలదనీ సీతాదేవిని తన మాటలతో భయపెట్టాడు. ఆమె భర్త రాముడిని దూషించాడు.

పది తలల వాడినైన తనను, కైలాస పర్వతాన్ని ఎత్తిన తనను, కుబేరుడిని ఓడించి పుష్పక విమానాన్ని పొందిన తనను, ఇంద్రుడిని బందీచేసిన తనను, బ్రహ్మ-శివుడి వరాలు పొందిన తనను, ముల్లోకాలు జయించిన వాడినైన తనను చేరడానికి సీతకు సందేహమెందుకని అడిగాడు. ఇవన్నీ విన్న సీత రావణుడికి మునుపటి కంటే కఠినంగా జవాబిచ్చింది.

సీతాదేవి కఠినంగా రావణుడిని నిందించగానే రావణుడు కోపంతో శరీరం తెలియకుండా, భుజాలు ఎగురవేస్తూ, సీతను భయపెట్టడానికి తన నిజ స్వరూపాన్ని చూపించాడు. దొంగ సన్యాసి వేషాన్ని వదిలి ఆ దుష్టుడు పదితలల, ప్రళయకాలంలో సూర్యాగ్నిలాగా మితిమించిన తేజం కల, బంగారు కుండలాల, కోపంతో కూడిన, నల్లటి మేఘంతో సమానమైన, విల్లు-బాణాలు కల కాలుడితో సమానమైన తన శరీరాన్ని చూపించాడు. ఎర్రటి వస్త్రాలు ధరించి, ఎర్రటి కళ్ళతో, ఎండాకాలంలోని సూర్య తేజస్సు వేడిమితో, విజృంభించి, కఠినమైన మాటలతో రావణుడు సీతాదేవితో ఇలా అన్నాడు.

"వినవే సీతా నా మాట! కళ్యాణీ నన్ను చూడు. నేను అలాంటి పొగడ్త కలవాడిని. నీమీద ప్రేమ వున్నవాడిని. నీకిష్టం కాని పని ఎన్నడూ చేయను. నామాట విని ఆ మనుష్యుడిని మరిచిపోయి దనుజుడనైన నన్ను కూడి నాకు శుభం కలిగించు. ఓసీ! బుద్ధిలేనిదానా! నువ్వు తెలివికలదానివనుకుంటున్నావు కాని నీకు తెలివేలేదు. నీకు తెలివే వుంటే, ఒక ఆడదాని మాట ప్రకారం, రాజ్యాన్ని, స్నేహితులను, బంధువులను, అందరినీ వదిలి, క్రూర సర్పాలు, ఏనుగులు, మృగాలు, రాక్షసులు సంచరించే అడవిలో తిరుగుతూ, శత్రువులను ఎదిరించి రాజ్యాన్ని సంపాదించుకునే ధైర్యంలేని దరిద్రుడిని ఎలా మోహిస్తావు? ఏం గుణాలు చూసి మెచ్చావే?". ఇలా అని అంటూ రావణాసురుడు, అయ్యో! వీడు చెడిపోతున్నాడే? అని స్నేహభావంతో మంచిమాటలు చెప్తున్న సీతను కామంతో పరవశుడై, పట్టుకున్నాడు.

రావణుడు, ఎడమ చేత్తో సీతాదేవి తల వెంట్రుకలను, కుడిచేత్తో తొడలను, శీఘ్రంగా పట్టుకుని, తన మాయారథం అక్కడికి రాగానే, ఆ క్రూరుడు భయంకరమైన బెదిరించే మాటలతో బెదిరించి,

బలాత్కారంగా ఒడిలో ఎత్తుకున్నట్లు ఎత్తుకుని, రథంలో వేశాడు. ఆ సమయంలో యముడితో సమానమై, తీక్షణంగా ప్రకాశించే కోరలతో, పర్వతమంత శరీరంగల ఆ రాక్షసుడిని చూసి వనదేవతలు భయంతో అడవుల్లోకి పరుగెత్తారు. ఈ విధంగా ఆకాశంలో శీఘ్రంగా పోయే రథం మీద కడుబాధతో సీతాదేవి పిచ్చిపట్టినట్లు భ్రమచెందిన దానిలాగా ఏడ్చింది.

సీతాదేవిని రావణుడు ప్రత్యక్షంగా తాకాడా? లేదా? అనే విషయం చర్చనీయాంశం. వాల్మీకి రామాయణంలో రావణుడు సీతాదేవిని తాకి తీసుకుపోయాడని స్పష్టంగా చెప్పడం జరిగింది. రామచంద్రమూర్తి మాయామృగం వెంట పోయినప్పుడు అసలు సీతను దాచి మాయా సీతను ఆశ్రమంలో వుంచాడనీ, రావణుడు తాకింది ఆమెనేననీ కొందరి వాదన. సీతాదేవి చుట్టూ గిరిగీసి, దానిని సీత దాటిపోవలదని లక్ష్మణుడు, రాముడికొరకై పోయేటప్పుడు చెప్పినట్లు మరికొందరి వాదన. రావణుడు పెళ్లను తీసుకుపోయాడే కాని సీతను తాకలేదని వారంటారు. రావణుడు అపహరించినది మాయా సీత అనడానికి వాల్మీకి రామాయణంలో ప్రమాణం లేదు.

రావణుడు ఎత్తుకుపోతున్న సీత రామలక్ష్మణులను తలచుకుంటూ ఏడ్చింది. "అయ్యో! ఆశ్రిత రక్షణార్థివైన రామచంద్రా! నీ ఆశ్రితురాలైన నన్ను వీడు ధర్మం తప్పి తీసుకుపోవడం చూడలేదా? రామా! న్యాయాన్ని ధిక్కరించి తిరిగే దుష్టులను శిక్షించే నువ్వు నన్ను దొంగిలించిన ఈ దుష్టుడిని ఎందుకు వదుల్తున్నావు? పాపాత్ముడా! రావణా! నీ పాపఫలం వెంటనే అనుభవానికి రావు. కొంతకాలానికి అవి పక్వాలై ఫలితమిస్తాయి. నువ్వు చేసే పాపానికి ఫలితం త్వరలోనే అనుభవిస్తావు. నీకు చెడిపోయే కాలం దాపరించినందున రావణా! ఇలాంటి పాపకార్యం చేయడానికి వచ్చావు. కాబట్టి శత్రువులకు మృత్యువైన శ్రీరాముడి చేతిలో నీ ప్రాణాలు పోతాయి".

"అడవిలోని పూలతో, పండ్లతో నిండివున్న వృక్ష సమూహాల్లారా! తీగలారా! ఆకాశాన సంచరించే వాళ్లూ, మీరు రాముడిని చూసినప్పుడు సీతను రావణుడు అపహరించాడని దయతో చెప్పండి. మాల్యవంత పర్వతమా! దేవ విరోధి అయిన రావణుడు నీ భార్యను అపహరించి తీసుకుని పోతున్నాడని రాముడికి చెప్పు. గోదావరీ నదీ! నీకు దండం..దండం. కోదండ ధరుడైన రాముడితో నీ భార్యను రావణుడు అపహరించాడని చెప్పు. నామీద దయవుంచి ఈ మాత్రం మాట సహాయం చేస్తే, ఆ తరువాత నేను స్వర్గంలో వున్నా, యమలోకంలో వున్నా, రామచంద్రమూర్తి నన్ను విడిపిస్తాడు" అని ఏడుస్తుంది సీత తనను రావణాసురుడు ఎత్తుకుని పోతుంటే.

"రామా! రామా! లక్ష్మణా!" అని ఏడుస్తున్న సీతాదేవి ఆకాశమార్గాన తీసుకుని అతి వేగంగా పరుగెత్తాడు రావణుడు. ఇలా రకరకాలుగా మాట్లాడుతూ, ఏడుస్తున్న సీత స్మృతితప్పి పడుతూ ఉన్నప్పటికీ, రావణుడు ఆమెను తీసుకు పోవడం ఆపలేదు. రావణుడు సీతను చంకలో ఇరికించుకుని పోయాడు. ఆమె కుదురుగా వుండలేదు. ముందు–వెనుకలకు వాలుతూ వుంది. ఎవరెప్పుడు అడ్డం తగులుతారో అన్న భయంతో త్వరగా లంకకు చేరాలన్న తపన రావణుడిది. రామలక్ష్మణులు రాకపోతారా అని సీత ఆశ. ఇలా చంకలో పొర్లడం వల్ల వెనుకపక్కగా వాలి సీత సొమ్ములను ఉత్తరీయంలో ముడికట్టి కిష్కింధ ప్రాంతంలో కిందకు పడేసింది. రావణుడు సీతతో లంక చేరాడు.

◆❖◆

కోపం లేని రాముడు సహజ గుణం వదలవచ్చా?

మాయా జింకను రాముడు సంహరించిన తరువాత పర్ణశాలలో లక్ష్మణుడు కూడా లేని సమయం చూసి రావణుడు సీతాదేవిని అపహరించాడు. ఇక్కడ ఇలా వుంటే, దండకలో రాముడి సంగతి వేరే విధంగా వుంది. ఆశ్రమానికి రావాలని త్వర-త్వరగా వస్తుంటే, వెనుక పక్క అశుభం సూచిస్తూ నక్క కూత వినిపించింది. కీడు కలుగుతుందని భావించిన రాముడు, రాక్షసులు సీతను ఎత్తుకు పోయారేమో అని అనుమానిస్తాడు. నడుచుకుంటూ వస్తున్న రాముడికి మృగాలు, పక్షులు, కుడి నుండి ఎడమవైపుగా భయంకర ధ్వని చేసుకుంటూ పోవడం జరిగింది. ఇది చూసి, లక్ష్మణుడిని, సీతను గురించి ఆలోచించుకుంటూ ఆలస్యం చేయకుండా పోసాగాడు రాముడు.

రాముడు ఆశ్రమాన్ని సమీపించాడు. అక్కడే ముఖం వేలాడవేసుకుని, ఒంటరిగా వస్తున్న తమ్ముడిని చూశాడు. వెంటనే ఏదో కీడు జరిగిందని శంకించాడు. తమ్ముడిని సమీపించి, మొదలు పరుషంగాను, తరువాత మృదువుగాను, ఇలా అన్నాడు. “లక్ష్మణా! ఎడమకన్ను అదురుతున్నది. సంతోషం మనస్సులో ఏమాత్రం లేదు. ఆశ్రమంలో సీత లేదు. పగ తీర్చుకోవడానికి రాక్షసులు ఆమెను పట్టుకుని పోయారో లేక వారి బాధ పడలేక ఆమే చనిపోయిందో లేక మనల్ని వెతుక్కుంటూ వచ్చి దారి తెలియక వేరే తోవలో ఎక్కడికైనా పోయిందో?”

“లక్ష్మణా! చెప్పు, సీత ప్రాణంతో వుందా? రాక్షసులు మింగారా? ఎత్తుకు పోయారా? మారీచుడి అరుపుకు సీత మోసపోయినా, నువ్వెలా మోసపోయావు? సీత పొమ్మన్నా రక్షించాల్సిన వాడివి అబలను ఒంటరిగా వదలి ఎలా వెళ్లావు? వెళ్లి మనకు కీడు చేసే రాక్షసులకు అవకాశం ఇచ్చావు. రాక్షసులు ఆమెను చంపారో? ఏమో? ఇలా జరగవచ్చని కొంచెమైనా ఆలోచించావా? అయినా నిన్ను అని ప్రయోజనం లేదు. ఈ గతి నాకు కలగాలని మీకీ బుద్ధి పుట్టించాడు” అని సీతకొరకై రాముడు వెక్కి-వెక్కి ఏడ్చాడు.

"నువ్వు సీతను రక్షిస్తావని నమ్మి కదా సీతను ఒంటరిగా నీ స్వాధీనంలో వుంచి నేనిలా వచ్చాను? నేను కాపాడలేక నీకాపని అప్పచెప్పానా? ఆ స్త్రీరత్నాన్ని అడవిలో ఒంటరిగా వదలిపెట్టి ఇక్కడేదో మునిగిపోయినట్లు పరుగెత్తుకుంటూ వచ్చావు. నిన్ను చూసింది మొదలు నాకేదో భయంగా వుంది లక్ష్మణా. వచ్చినవాడివి సీతను కూడా తీసుకుని రావచ్చుకదా? ఆమె లేకుండా నువ్వు ఒక్కడివే రావడం దూరం నుండే చూసిన నాకు గుండె పగిలింది. ఎడమ భుజం, ఎడమ కన్ను అదిరాయి. కొంప మునిగింది కదా అనుకున్నాను".

రామచంద్రమూర్తి తనమీద నింద వేయడంతో, దోషం ఆరోపించడంతో, ఆయన పడుతున్న దుఃఖబాధను గమనించి, ఇంతకు పూర్వమే సీత మాట్లాడిన మాటలకే నొచ్చుకున్న లక్ష్మణుడు మరింత నొచ్చుకుని ఇలా జవాబిచ్చాడు అన్నకు. "అన్నా! ఆ ధ్వని నీ గొంతుక ధ్వని అని మోసపోయి స్వతంత్రించి నాకై నేను రాలేదు. 'సీతా, లక్ష్మణా, కావరే' అనే ధ్వని అరణ్యంలో రాగా సీత విని భయపడి నన్నుపొమ్మని, బలవంతపెట్టింది. 'రాముడికి భయం లేదమ్మా అని ఆమెకు నమ్మకం కలిగేలా ఎంతో చెప్పాను. "రాముడికి తమ్ముడివి కాదు. ఎప్పుడు వీలవుతుందా, ఎప్పుడు సీతను హరిస్తానా? అన్న ఆశతో నా కోసమే నా మగడి వెంట వచ్చావు' అన్నది. ఈ మాటలు వినగానే నా పెదవులు అదిరాయి. కళ్ళు ఎర్రగా అయ్యాయి. కోపం పట్టలేక, అక్కడ వుండలేక ఆశ్రమం వదిలి వచ్చాను. అన్నా! వున్న విషయం చెప్పాను. "

లక్ష్మణుడు ఇలా చెప్పడంతో, రాముడు, "నువ్వు సీతను విడిచి రావడం సరైన పనికాదు. ఇప్పుడేమనుకున్నా ఏం ప్రయోజనం? స్త్రీలకు కోపం వస్తే ఏదో అంటారు. అందునా, భర్తకు కీడు కలిగిందని భయంతో, శోకంతో, పీడించబడ్డ వారి విషయం చెప్పాల్నా? ఇవన్నీ నువ్వు ఆలోచించకుండా సీత కోప్పడ్డదని నువ్వు కూడా కోపంతో నా శౌర్యం, నా శక్తి తెలిసికూడా ఆడదాన్ని ఒంటరిగా అడవుల్లో వదిలి వచ్చావే? ఏమనాలి నిన్ను? నా ఆజ్ఞ జవదాటావుకదా?" అన్నాడు.

రాముడు తాను చెప్పదలచుకున్న మాటలను లక్ష్మణుడికి చెప్పి, త్వర–త్వరగా ఆశ్రమం వైపు అడుగులు వేస్తుంటే, ఎడమకన్ను కిందిభాగంలో అదిరింది. కాళ్లు కూలబడ్డాయి. దేహం వణకడం మొదలైంది. తన ఆశ్రమం ప్రవేశించి వెదికిచూసిన రాముడు సీత లేదని నిశ్చయించుకుని, మనసు కలత చెందగా ఆమెను తలచుకుని ఏడ్చాడు.

సీత ఏమైందోనని రకరకాల ఆలోచించడం మొదలెట్టాడు. "ఎక్కడి పోయి వుంటుంది? నేనేం చేయాలి? ఎక్కడ వెతకాలి? ఎలా వెతకాలి? ఈ పాడు అడవిలో ఎవరిని అడగాలి?" అనుకుంటూ, సీతను వెతికి–వెతికి కళ్ళు వుబ్బేట్లు రామచంద్రమూర్తి ఏడ్చాడు. దుఃఖం ఎక్కువవతుంటే ఎర్రగా అవుతున్న కళ్ళతో, వికారమైన చూపులతో, పిచ్చి పట్టిన వాడిలాగా, మూర్ఖుడిలాగా ఏడ్చాడు. తనకెవరు దిక్కని అనుకున్నాడు. సీతాదేవి దాక్కున్నదేమో అని చెట్టు–చెట్టు దగ్గరకూ పరుగెత్తాడు రాముడు. గుట్ట–గుట్టకూ పరుగెత్తాడు. బాగా ఏడ్చాడు. ఎక్కడ కూడా సీత లేనందున మనసులో తల్లడిల్లుతు మూర్ఛపడి, లేస్తూ, సొక్కుతూ, ఆరాటపడుతూ, ఆ అడవిలో సీతను వెతికినా ఎక్కడా కనపడలేదామె.

కలతచెందిన శ్రీరామచంద్రుడు, సీతాదేవి రాక్షసుల చేతిలో చిక్కి మరణించిందేమోనని అనుమాన పడతాడు. ఒక వనం తరువాత మరో వనంలో వెతుకుతూ, భ్రమతో, సీతా–సీతా అని పిలుస్తూ వెర్రివాడిలాగా శోకించాడు. సీతాదేవిని వెతుక్కుంటూ సహించలేని బాధతో వున్న అన్నకు లక్ష్మణుడు హితవాక్యాలను చెప్పాడు. బాధ పడవద్దన్నాడు. కొండలు, గుట్టలు, కోనలు, నదులు, కొలనులు, కొలకులు వెతికి–వెతికి సీతాదేవి జాడ లేకపోయేసరికి దుఃఖం ఎక్కువైంది అన్నదమ్ములకు. వాస్తవానికి సీతాదేవి తన ఎదురుగా లేకపోయినా, మన్మథతాపం వల్ల కళ్లకు కట్టినట్లు దగ్గరే వున్నట్లు భావించిన శ్రీరాముడు, ఆ సీతను గురించి గద్గద స్వరంతో, మాట కూడా సరిగ్గా రాకుండా, తన బాధ ఇలాంటిదని చెప్పనలవి కాకుండా, విచారంతో చాలా–చాలా అన్నాడు, తనలో అనుకున్నాడు. తమ్ముడు లక్ష్మణుడిని అయోధ్యకు పొమ్మన్నాడు.

ఈ విధంగా రామచంద్రమూర్తి విలపిస్తుంటే లక్ష్మణుడు రాముడిని ఉరట పరచడానికి కాలానుగుణమైన కొన్ని మాటలు చెప్పాడు. "అన్నా! ఏడవవద్దు. సంతాపంతో శుష్కించి విచారించవద్దు. ధైర్యంగా వుండు. శోకంతో కృశించవద్దు. స్త్రీరత్నమైన సీతాదేవిని వెతుకుదాం.".

స్త్రీపురుషుల సంయోగం వల్ల కలిగిన దేహం భగవంతుడికి లేదు. అయినా విష్ణుమూర్తి ఇతర అవతారాలలాగా కాకుండా రామావతారం దోషరహితమై, చైతన్యం కలదై, నిత్యసుఖ స్వరూపమైన తన శరీరాన్ని ప్రకాశించేట్లు చేసింది. రామచంద్రమూర్తిలో రావణుడికి భగవంతుడనే బుద్ధి లేకుండా చేసి వాడికి మోక్షం లేకుండా చేయడమే రామచంద్రుడి శోకానికి ఫలం అని చెప్పడం జరిగింది. రావణుడి చేత సీతను అపహరించేట్లు చేయడం, వాడి పుణ్యాన్ని నాశనం చేసి, వాడిని తన చేతిలో చంపబడేట్లు చేయడమే. గొప్ప తపస్సు చేసి సంపాదించిన బలం కల రావణుడిని అంతకంటే అధిక తపోబలం లేకుండా చంపడం సాధ్యపడదు. దేవతలు అంతకంటే ఎక్కువ తపస్సు చేయలేరు. కాబట్టి, వాడికి అనుచితమైన అనురాగం సీతమీద కలిగించి, దానివల్ల వాడిని మోహితుడిని చేసి, రావణుడి తపశ్శక్తి నాశనం చేసి, దేవతలా కార్యం సాధించాలని లక్ష్మీదేవితో కలిసి ఆలోచించి సీతతో సహా అవతరించాడు విష్ణువు.

రామచంద్రమూర్తి మాయామానుషవేశాధారి అని అంగీకరించాలి. కర్మబద్ధులై జన్మించిన ప్రాకృత జనులు ఎలా ప్రవర్తించారో ఆయనా అలానే చేశాడు. భార్య మీద ప్రేమగల మనుష్యులు ఆమెను పోగొట్టుకుంటే ఎలా ఏడుస్తారో రాముడు కూడా అలానే చేశాడు. కన్నీరు కార్చడం, ఏడవడం, సత్యమే కాని అది తామస శోకం వలన కలిగింది కాదు. జయ–విజయులకు మూడో జన్మలోకాని ముక్తిలేదనే విషయం భగవంతుడికి తెలుసు. రావణ–కుంభకర్ణులది రెండవ జన్మే కాబట్టి ముక్తిలేదు. భగవంతుడు రావణుడికి మోక్షం లేకుండా చేయడానికి వాడికి దుర్బుద్ధి పుట్టించి వాడితో ఒక అకార్యం చేయించి అది నెపంగా వాడిని వధించాడు. లోక శిక్షకోసం వచ్చినవాడు కదా భగవంతుడు.

అడవి మృగాలను చూసి రాముడు, "వీటికి సీత పోయిన జాడ తెలుసేమో?" అని అంటూ కన్నీరు కార్చుకుంటూ వాటిని అడుగుతాడిలా. "మృగాలూ...సీత జాడ మీకు తెలియునా?" అని. అవి చివాలున

లేచి, దక్షిణ దిక్కుగా పయనమై తలలు పైకి ఎత్తుకుని రామలక్ష్మణుల ముఖాలు చూసుకుంటూ పరుగెత్తాయి. అప్పుడు లక్ష్మణుడు వాటి అభిప్రాయం అర్థం చేసుకుని అన్నతో దక్షిణ దిక్కుగా (ఆకాశ మార్గాన రావణుడు పోయిన మార్గం) సీతను వెతకడానికి పోదాం అన్నాడు. అలాగే పోసాగారు ఇరువురూ. రాముడు భయపడుతూ అటూ-ఇటూ తిరుగుతూ సీతను వెతుకుతూ వుండగా, ఆమె పాదాల చిన్న ముద్రలు, ఆ పాదాల వెంటే పోయిన పెద్ద-పెద్ద రాక్షస పాదాల ముద్రలు, విరిగిపడిన ధనుస్సు, రథం, అమ్ములపొది, అక్కడక్కడా పడి వుండడం గమనించాడు. అవి చూసి తొట్రుపడుతూ రాముడు లక్ష్మణుడితో ఇవి రాక్షసులవేమో అన్నాడు.

రాముడు లక్ష్మణుడితో ఇలా అన్నాడు: "ఇక్కడ విషయం ఆలోచించి చూస్తుంటే ఎవడో రాక్షసుడు అడవిలో నా భార్యను అపహరించినట్లు స్పష్టంగా కనిపిస్తున్నది. ఇక్కడి పరిస్థితి చూస్తుంటే, బలిష్టుడైన రాక్షసుడే విరోధ బుద్ధితో నాకు అపకారం చేయాలనుకుని సీతను అపహరించాడని అర్థమవుతున్నది. కాబట్టి మనకు రాక్షసులతో ప్రాణాంతకమైన విరోధం కలిగింది అనడం నిశ్చయం. రాక్షసులు సీతను అపహరించి ఎక్కడైనా దాచిపెట్టయినా వుండాలి, లేదా, ఆమె చచ్చిపోయైనా వుండాలి, లేదా, రాక్షసులు ఆమెను తినైనా వుండాలి. వీటిల్లో ఏదో ఒకటి నిజం. రాక్షసులీవిధంగా సీతను బక్షిస్తుంటే, ధర్మఫలదాతలైన దేవతలైనా అక్కరకు వచ్చినప్పుడు ఆదుకుందాం అనుకోలేదు కదా? కాబట్టి వీళ్లూ నాకపకారం చేసినవారే! రాక్షసులు, భూత సమూహాలు, ఇక నా పౌరుష గుణాన్ని చవిచూసి ఎలాంటి పాట్లు పడనున్నారో చూస్తుండు". రాక్షసులలో, పిశాచాల్లో, యక్షుల్లో, గంధర్వుల్లో, భూజనుల్లో ఒక్కడైనా సుఖపడుతాడేమో చూడు....ఈ క్షణంలోనే నా పరాక్రమాన్ని ప్రదర్శిస్తా చూడు. మూడులోకాలు బాధపడేట్లు చేస్తాను. నాసీతకు ఏబాధ లేకుండా దేవతలు నాకు సమర్పించారా, సరి. లేదా, ప్రసిద్ధమై వ్యర్థం కాని నా పరాక్రమాన్ని ఏడుస్తూ చూస్తారు. నాకు ప్రియమైన సీతను మంచితనంగా తెచ్చి దేవతలు-ఇతరులు ఇవ్వకపోతే, లక్ష్మణా! ముల్లోకాలు ఏవిధంగా రూపంలేకుండా నాశనం అవుతాయో చూస్తుండు".

అని చెక్కిళ్లు అదురుతుంటే, భయంకరమైన కోపంతో, ఎర్రటి కళ్ళతో రాముడు తన పెద్ద విల్లుని చేతిలోకి తీసుకుని, చక్కటి బాణాన్ని అల్లెతాటిలో సంధించి, ప్రళయకాలాగ్ని లాగా మండిపడసాగాడు రాముడు. ఎప్పుడూ కోపం తెచ్చుకొని రాముడిని చూసి లక్ష్మణుడు పెదవులు ఎండిపోతుంటే, ముఖం వెల-వెలపోతుంటే, ఆయనతో ఇలా అన్నాడు.

"అన్నా! నువ్వు సర్వదా జగాలకు మేలుచేయడానికి ఇష్టపడే వాడివే. కోపం లేనివాడివే. మృదుస్వభావుడివే. ఇలాంటి నువ్వు ఇప్పుడు కోపం తెచ్చుకుని నీ సహజగుణం వదలవచ్చా? ఇది నీకు ధర్మమా? ఎవడో ఒక్కడు చేసిన నేరాన్ని కనిపెట్టే శక్తిలేక లోకాన్నంతా నాశనం చేయడం న్యాయమా? విరిగిన ఈ రథం ఎవరిదో, ఎందుకు ఎవరివల్ల విరిగిందో అనే విషయం మనం విచారించి తెలుసుకోవాలి. విరిగిన గుర్రపు గిట్టలను, దొరలిన చక్రాల కమ్మలను, నేలబడ్డ నెత్తురు బొట్లను, పరిశీలించి చూస్తే ఇవన్నీ ఒకడివే అనిపిస్తున్నది".

"నువ్వు ఆలోచించకుండా ఎవడో ఒకడి కోసమని లోకమంతా నాశనం చేయడం మంచిదా? ఎవడో ఒకడు అపరాధం చేస్తే దాన్ని లోకమంతా ఒప్పుకున్నాడని భావించి, ఆ లోకమంతా వధ్యమని నువ్వు అనుకోవడం పొరపాటు. ఎందుకంటే, తమ రక్షణ కోరే సర్వభూతాలను రక్షించగలవాడివి నువ్వు ఒక్కడివే కాని వేరొకడు లేడు. నేను నీకు తోడురాగా తపస్వుల సహాయంతో సీతను అన్నిచోట్లా వెతుకుదాం. మనం చేయాల్సినదంతా చేసిన తరువాత. అప్పటికీ దేవతలు మంచితనంగా సీతను సమర్పించకపోతే, అప్పుడు ఏది ఉచితమో ఆ పని చేద్దాం. నీ ఇష్ట ప్రకారం లోకాన్ని భస్మం చేయి" అని అంటాడు లక్ష్మణుడు రాముడితో. అన్నను శాంతపరిచాడు అప్పటికే.

◆❖◆

మోక్షానికి ఆత్మోపాసన ఒక్కటే మార్గమా?

సీతాదేవి కనపడనందుకు, చింతించి జగత్ సంహారానికి సిద్ధపడ్డ శ్రీరాముడిని శాంతింప చేసే ప్రయత్నంలో లక్ష్మణుడు అన్నకు ఎన్నో విషయాలను చెప్తాడు. ఆయన పాదాలమీద పడి నమస్కరించి, "అన్నా! పూర్వజన్మలోనే కాకుండా ఈ జన్మలోనూ విస్తారంగా తపస్సు చేసి, ఎన్నో అశ్వమేధయాగాలను చేసి, మరెన్నో గొప్ప పుణ్యకార్యాలను చేసి, మన తండ్రి అతి కష్టంతో దేవతలు అమృతాన్ని సంపాదించినట్లు నిన్ను కన్నాడు" అని అంటాడు.

శ్రీరామచంద్రమూర్తిని అమృతంతో పోల్చడం అంటే, అమృతం వల్ల దానికేమీ లాభం లేదు కాని, దాన్ని అనుభవించిన దేవతలకే లాభమని అర్థం. అలాగే శ్రీరాముడు దేవతలకు, లోకులకు భోగ్యుడై వారికి మేలు చేయడానికి పుట్టాడని అర్థం. లోకాన్ని ఉద్ధరించడానికి పుట్టిన శ్రీరాముడు లోకాలను నాశనం చేయడం తగదని లక్ష్మణుడు అంటున్నాడు. అలాగే, అమృతాన్ని సంపాదించడం కోసం ముప్పైమూడు కోట్ల దేవతలు కష్టబడ్డారు కానీ, రాముడి కొరకు ఒక్క దశరథుడే కష్టపడ్డాడని భావన. అమృతం ఎలా రాక్షసుల వినాశనానికి కారణమైందో అలాగే రాముడు కూడా రాక్షస సంహారం చేయాలని చెపుతున్నాడు లక్ష్మణుడు. అందుకే, దేవతలమీద, ఇతర భూతాల మీద కోపం చూపకుండా, అమృతంలాగా ఎల్లప్పుడూ నిర్మలంగా వుండాలని సూచన ఇచ్చాడు లక్ష్మణుడు.

లక్ష్మణుడు ఇంకా ఇలా చెప్పాడు రాముడికి. "నీలో తప్ప ఇతరుల్లో లేని నీ కళ్యాణగుణాలకు సంతోషించి మన తండ్రి నిన్ను ఎడబాసిన కారణాన మరణించాడని భరతుడు చెప్పాడు కదా? అలాంటి కళ్యాణగుణాలను వదిలి ఇలాంటి హేయగుణాన్ని చేపట్టి, లోకానికి ఉపద్రవం కలిగిస్తే, మన తండ్రి నీవిషయంలో ఏమని భావిస్తాడు? రాముడు సౌమ్యుడు, సాధువు, జితేంద్రియుడు, శాంతుడు అనుకున్నానే? ఇంతటి క్రూరుడా, అని అనుకోడా? నువ్వు చేయాలనుకున్న లోకోపద్రవం తండ్రికి కూడా చేసినట్లే కదా? తన నాశనానికా తండ్రి నిన్ను కన్నది? కకుత్థ్సుడి వంశంలో పుట్టిన వాళ్లలో శ్రేష్టుడివైన నువ్వు, మహాశుద్ధసత్త్వం కల నువ్వు, అప్రాకృతుడవైన నువ్వు, కకుత్థ్సుడిలాగా దేవతలను, లోకులను

రక్షించాల్సిన నువ్వు, శోకంతో సహించలేని విధంగా పరితపిస్తుంటే, ప్రకృతిబద్ధులైన ఇతరులందరూ దుఃఖం సహించగలరా? అలాంటి వారిలోనే దుఃఖం అణచుకునేవారు కనిపిస్తుంటే నువ్వు దుఃఖపడడం శోచనీయం".

"జగాలను పుట్టించే భారం బ్రహ్మదేవుడిది. సంహరించే భారం రుద్రుడిది. రక్షించే భారం నీది. అలాంటి నువ్వు ధర్మాన్ని వదిలి లోకులను సంహరించాలనుకుంటే భూప్రజలకు రక్షకుడెవరు దొరుకుతారు? పైరును రక్షించడానికి వేసే కంచే పైరును మేయడానికి సిద్ధపడితే ఇక దాన్ని రక్షించే ఉపాయం ఏమిటి? లోకంలో నువ్వొక్కడివే దుఃఖమనుభవించుతున్నానని అనుకోవద్దు. నీకున్నంత దుఃఖం ఎవరికీ లేదనుకోవద్దు. ఎంత మహాత్ములైనా, దేవతా శ్రేష్టులైనా, దైవ సంకల్పాన్ని దాటగలరా? ఎవరైనా కష్టాలను ఎదుర్కోకుండా కాలమంతా సుఖంగా గడుపుతారా? లేరుకదా? కాబట్టి ప్రాణులకు మేలు–కీడు స్వభాసిద్ధంగా వస్తాయి".

"సీతాదేవి రాక్షసుల చేతిలో చచ్చినా కూడా అందుకోసం నువ్వు గుండెలు పగిలేలా ఏడవవద్దు. అది జ్ఞానంలేనివాడు చేయాల్సిన పని. నువ్విలా ఏడుస్తుంటే సీతాదేవి వస్తుందా? ఏడ్వడం వల్ల దేహం, మనస్సు చెడడమే తప్ప మరేం లాభం లేదు. జ్ఞానంకలవాడు దేనికీ దుఃఖపడడు. జీవకోటుల యథార్థస్థితి అయిన జననమరణాలు, సుఖదుఃఖాలు, శోకసంతోషాలు, సంయోగవియోగాలు లాంటివి నిత్యం జరిగేవి కావు. రావడం, పోవడం వాటి స్వభావగుణాలు. కాబట్టి వాటికి పరితాపపడడం మంచిదికాదు. నీచమైన హృదయ దౌర్బల్యం వదిలి, గొప్ప మనస్సు చేసుకుని, ఇలా వ్యసనపడడం నీకు తగునేమో ఆలోచించు. జ్ఞానం కలవారు స్వభావసిద్ధమైన బుద్ధిబలంతో మేలు–కీడులను పరీక్షిస్తారు".

"పూర్వం చేసిన పుణ్యపాపకర్మల గుణాలు కానీ, దోషాలు కానీ, మనం ఇప్పుడు ప్రత్యక్షంగా చూడలేం. మనం ఈ కర్మ చేశాం, మనకీ ఫలం కలుగుతుంది, అని నిశ్చయంగా చెప్పడం ఎవరికీ సాధ్యపడదు. ఈ కర్మ ఈ విధంగా చేయడం వల్ల ఈ ఫలితం ఇప్పుడు అనుభవిస్తున్నాం అని కర్మ చేసిన విధం చెప్పడం కూడా సాధ్యపడదు. కాని, కారణం లేకుండా ఏదీ జరగదు. ఫలితం ఇప్పుడు అనుభవిస్తున్నాం కాబట్టి, దీనికి కారణమైన కర్మ ఎదో, ఎప్పుడో చేశాం అని మాత్రం చెప్పగలం. అలాంటి కర్మ చేయడం వల్లే ఈ ఫలం కలిగిందని చెప్పవచ్చు. మనకు కారణం తెలిసినా, తెలియకున్నా, అనుభవించడం తప్పదు. కాబట్టి సుఖం అనుభవానికి వచ్చినప్పుడు మనం చేసిన పుణ్యం వల్లే ఇది కలిగిందని కాని, దుఃఖం కలిగినప్పుడు మనం పూర్వం ఏదో పాపం చేశామని అందుకే ఇది కలిగిందని భావించరాదు. సుఖం కలిగినందువల్ల పుణ్యమే చేయాలని కాని, దుఃఖం కలగడం వల్ల పాపం చేయరాదని అనుకుని మనస్సు ధృడ పరచుకోవాలి. సంతోషానికి పొంగక, దుఃఖానికి బాధపడక వుండాలి".

"రామచంద్రా! నువ్వు మూర్ఖుడివి కాదు. కార్యాకార్య, ధర్మాధర్మ విషయంలో నీకుకల స్థిరజ్ఞానం దేవతలకు కూడా లేదు. అయినప్పటికీ దుఃఖాతిశయం వల్ల నీ జ్ఞానం నివురుగప్పిన నిప్పులాగా నిద్రబోతున్నది. మనుష్యులను చూద్దామా, వాళ్ళు నీదగ్గరకు వచ్చి తమ మీద కోపం ఎందుకని అడిగే సాహసం కూడా చేయలేరు. దేవతలేమో నీమూలాన బాగుపడేవారు. కాబట్టి నీకు అపరాధం చేయరు.

కాబట్టి వాళ్ళను ఎందుకు బాధించాలి? వ్యర్థ కోపం వల్ల, వ్యర్థ శోకం వల్ల ఏ పనీ కాదు. మనకపకారం చేసినవాడు ఎవడో కనిపెట్టి శూరుడివైన నువ్వు వాడిని దండించు. దానివల్ల నీకు సీత మళ్లీ లభిస్తుంది. కీర్తీ కలుగుతుంది".

చిన్నవాడైనా తమ్ముడు లక్ష్మణుడు చెప్పగా విన్న పెద్దవాడైన రామచంద్రమూర్తి, దాంట్లోని సారాన్ని గ్రహించి, కోపంతో లోగడ చేద్దామనుకున్న పనిని వదిలి, విల్లు ఆధారంగా నిలబడి, "నాయనా! లక్ష్మణా! సీతను వెదకడానికి ఏం చేయవచ్చు? ఎక్కడికి పోదాం?" అని అడిగాడు. లక్ష్మణుడు జవాబుగా ఇలా చెప్పాడు. "ఈ జనస్థానంలో పెద్ద-పెద్ద మృగాలు, గుహలు, కొండలు, చొరలేని మార్గాలు వున్నాయి. కిన్నరుల ఇండ్లున్నాయి. భయంకరమైన రాక్షసుల అధీనంలో వుందిది. పెద్ద-పెద్ద చెట్లున్నాయి. కాబట్టి రాక్షసులు సీతను తెచ్చి ఇక్కడే, ఎక్కడో దాచిపెట్టి వుంటారు. కాబట్టి సీతాదేవిని ఇక్కడే ఎక్కడో వెతకాలి. నీలాంటి బుద్ధి సంపదకలవాడు ఆపద వస్తే చలించాలా? ఎంత గట్టిగా గాలి వీచినా కొండలు కదులుతాయా?". ఇలా చెప్పగా రామచంద్రమూర్తి తమ్ముడు తనవెంటరాగా అడవి ప్రదేశమంతా వెతికాడు.

ఇలా వెతుక్కుంటూ పోగా-పోగా, ఆ పర్వతం దగ్గరే ఒకచోట పెద్ద కొండలాగా వున్న, నెత్తుటితో తడిసిన, పుణ్యాత్ముడిని, ప్రాణం పోయినా సరే స్వామికార్యం చేయాలన్న భక్తి కలవాడిని, పక్షి శ్రేష్టుడిని, జటాయువును చూశారు రామలక్ష్మణులు. అతడు రాక్షసుడని భ్రమించి, జటాయువుకు ఎదురుగా పోయి, ఒక తీవ్ర బాణాన్ని సంధించగా భూతలం వణికింది. అప్పుడు గద్గద స్వరంతో పక్షిరాజు రామచంద్రుడితో ఇలా అన్నాడు.

"సీతను, రావణుడు అపహరించాడు. బలవంతంగా ఆమెను ఎత్తుకుని ఆకాశమార్గాన పోసాగాడు. అది చూసిన నేను, విసురుగా వాడికి అడ్డం పోయాను. వాడిని ఎదిరించి వాడితో బలం కొద్దీ యుద్ధం చేసి వాడి రథాన్ని నేలపడగొట్టాను. వాడిని కింద పడేశాను. నేను విరిచిన విల్లు ఇక్కడే పడి వుంది. పొది కూడా ఇక్కడే పడిపోయి వుంది. నా రెక్కల దెబ్బకు చచ్చిన సారథి ఇక్కడే పడిపోయి వున్నాడు. నేను ముసలివాడినై అలసిపోయాను. అప్పుడు వాడు తన కత్తితో నా రెక్కలను తెగనరికి నేలమీద పడేసి, సీతను పట్టుకుని ఆకాశమార్గాన పరుగెత్తాడు. నీ భార్య కోసం ముందే రావణుడు నన్ను చంపాడు. నా స్నేహితుడైన దశరథుడి పుత్రా! చావడానికి సిద్ధంగా వున్న నన్ను నువ్వు కూడా చంపాలా?"

జటాయువు మాటలు విన్న రాముడు తన విల్లు దూరంగా పడవేసి, అతడిని కౌగలించుకుని, తమ్ముడితో కలిసి ఏడ్చాడు. రెక్కలు నరకబడి నెత్తురుకారుతున్న జటాయువును తన చేత్తో తుడిచి, సీత వృత్తాంతం చెప్పమని అడిగాడు. జటాయువు మెల్లగా రెప్పలు తెరిచి, సన్నటి గొంతుతో జవాబిచ్చాడిలా. "రామా! వాడు మాయగాడు. రహస్యంగా సీతాదేవిని బలాత్కారంగా పట్టుకుని ఆకాశమార్గాన పోయాడు. కత్తితో నా రెక్కలు నరికి అమితమైన వేగంగా దక్షిణ ముఖంగా పరుగెత్తాడు. రాక్షసుడు సీతాదేవిని అపహరించిన ముహూర్తం "విందు". ఆ ముహూర్తంలో అపహరించబడిన సొమ్ము మళ్లీ స్వంతదారుడికి చేరుతుంది. తప్పదు. ఆ రాక్షసుడు తొందరలో ఇది గమనించలేదు. కాబట్టి నీ భార్యను అపహరించినవాడు కాలం మింగిన చేపలాగా అయిపోతాడు. రామా! సీతకొరకు నువ్వు

ఆందోళనపడవద్దు. నువ్వు ఆ రాక్షసుడిని యుద్ధంలో చంపి మళ్లీ సీతను గ్రహించి గొప్ప కీర్తిని సంపాదించి సంతోషంగా అయోధ్యకు పోతావు". ఇంతదాకా స్మృతి తప్పకుండా తెలివిగా చెప్పి, జటాయువు ఆయన చూస్తుండగానే దేహం విడిచి స్వర్గానికి పోయాడు.

అలా నేలమీద పడ్డ జటాయువును చూసి రామచంద్రమూర్తి బాగా దుఃఖపడి, తమ్ముడు లక్ష్మణుడితో ఇలా అన్నాడు. "తమ్ముడా! మన తండ్రి నాకెలా పూజ్యుడో, ఇతడు కూడా అలా పూజ్యుడే. కాబట్టి తండ్రిలాగా నా చేత సంస్కారం చేయించుకోవడానికి అర్హుడు. జటాయువుకు అగ్నిసంస్కారాలు చేద్దామని నిశ్చయించుకున్న రాముడు తమ్ముడితో, "లక్ష్మణా! నా పనికోసమై ప్రాణాలు విడిచిన ఈ పక్షిరాజును శాస్త్రప్రకారం నా తండ్రిలాగే దహన సంస్కారం చేస్తాను. కాబట్టి చితి పేర్చు" అని జటాయువున్న దిక్కుగా చూశాడు. చూసి, ఆయన్ను వైకుంఠం పొందమంటాడు. పక్షి కాబట్టి కర్మాదికారం లేనందున, అగ్నిసంస్కారానికి యోగ్యత లేనందువల్ల, ఉత్తమలోకాలు లేకపోయినా తన ఆజ్ఞ వల్ల ముక్తిని పొందమని అంటాడు జటాయువును. రామచంద్రమూర్తి బ్రహ్మవిధి ప్రకారం సంస్కరించి, యోగులు పొందే సనాతమైన తన లోకాన్ని ఇచ్చాడు. రామానుగ్రహం వల్ల ఆ గద్ద పరమపదానికి పోయి విష్ణుసారూప్యాన్ని పొందింది.

జటాయువు ఋషులలాగా మోక్షం కొరకు పరమాత్మోపాసన చేయలేదు. అలాంటివాడికి రాముడెలా మోక్షం ఇచ్చాడు? అలాగైతే అందరికీ ఇవ్వ వచ్చుకదా? అని ఆక్షేపించవచ్చు. దీనికి సమాధానం: మోక్షానికి ఆత్మోపాసన ఒక్కటే మార్గం కాదు. చాలా మార్గాలున్నాయి. భగవద్గీతలో కర్మ, జ్ఞాన, రాజయోగాలు, భక్తీ, ప్రపత్తి, క్షేత్రక్షేత్రజ్ఞజ్ఞానం, అవతార జ్ఞానం లాంటివి చెప్పడం జరిగింది. బ్రహ్మసూత్రాలలో 32 విద్యలు చెప్పడం జరిగింది. ఇవేవీ లేకున్నా ప్రేమ ఒక్కటే మోక్షసాధనమని శాస్త్రాలు చెప్తున్నాయి. అనన్యమనస్కుడై, భగవంతుడి కోసం రాజ్యాన్ని, ప్రాణాన్ని విడిచి ఆయన సమక్షంలో ఆయనమీదే దృష్టి నిలిపి ప్రాణం వదిలి, ఆయన చేతులమీదుగా సంస్కారం పొందిన జటాయువుకే మోక్షం లేకపోతే ఇంకెవరికి వుంటుంది? ఇలాంటివారికెవరికైనా మోక్షం ఇస్తాడు రాముడు కాని, ప్రకృతిబద్ధులై, కామదాసులై, భక్తీ శూన్యులైన వారందరికీ మోక్షం ఎలా ఇస్తాడు? జటాయువు కంటే ఎక్కువ త్యాగం చేసినవారెవరు? కాబట్టి జటాయువుకు మోక్షమివ్వడం న్యాయమే.

జటాయువును సొదమీద పెట్టి, అగ్ని రగిలించి, తన తండ్రిలాగే ఆయనకూ నిప్పు పెట్టి జింక మాంసంతో పిండాలు చేశాడు. ఆ పిండాలను లేతపచ్చిక మీద వుంచి, బ్రాహ్మణులు స్వర్గప్రాప్తి కోసం మనుష్య ప్రేతాలను ఉద్దేశించి ఏ మంత్రాలను చదువుతారో అవే చదివాడు. ఆ తరువాత గోదావరీ నదిలో తమ్ముడితో సహా స్నానం చేసి, జటాయువుకు నీళ్లు వదిలారు. మరణించిన గద్ద రాజు మహర్షి సమానుడైన రామచంద్రుడి చేత సంస్కారం పొంది పుణ్యలోకాలకు పోయాడు. ఇలా రామలక్ష్మణులు కర్మలు చేసి, జటాయువు మీదనే మనసుంచి, సీతాదేవి తనకు లభిస్తుందని ఆయన చెప్పిన మాటలను విశ్వసించి, సీతాదేవిని కలవాలన్న కోరికతో అడవుల జాడ పట్టుకుని పోయారు.

కాలాన్ని దాటడం ఎవరికికైనా సాధ్యమా?

రామలక్ష్మణులు జటాయువుకు కర్మలు చేసి, సీతాదేవి లభిస్తుందని ఆయన చెప్పిన మాటలను విశ్వసించి, సీతాదేవిని కలవాలన్న కోరికతో అడవుల జాడ పట్టుకుని నైరుతిమూలగా పోయారు. అడవిలో సీతను వెతకసాగారు. మధ్యలో అడ్డుతగిలిన అయోముఖి అనే రాక్షసిని చంపారు. అలా సీతను వెతుక్కుంటూ పోతుండగా అడవిని చీల్చుకుంటూ పెద్ద ధ్వని వినిపించి, ఒక భయంకరాకారం కనిపించింది.

పర్వతంలాంటి పెద్ద దేహం, పెద్ద రొమ్ము, తల–మెడ లేకుండా, బిరుసు వెంట్రుకలు, నల్లటి మబ్బు లాంటి, ఉరుము లాంటి ధ్వని, నిప్పుల్లాంటి ఒంటి పెద్ద కన్ను, పెద్ద కోరలు, యోజనం పొడుగు చేతులు కలవాడిని, నోరు తెరిచి తమ దారికి అడ్డంగా వున్న వాడిని, కబంధుడిని సమీపించారు రామలక్ష్మణులు. ఆ రాక్షసుడు వీళ్ళిద్దరినీ తన రెండు చేతులతో పట్టుకున్నాడు. వారిద్దరూ శత్రువు చేత చిక్కి ఆపదపాలయ్యారు.

రాక్షసుడిని చూసి అన్నదమ్ములు ఒకరికొకరు ధైర్యం చెప్పుకున్నారు. వారిని చూసి కబంధుడు తనను చూసి వారెందుకు భయపడుతున్నారని అడిగాడు. వాళ్లను తన నోట్లో పడేట్లు బ్రహ్మ చేశాడని కూడా అన్నాడు. ఈ రాక్షసుడు మహా బలవంతుడనీ, భయంకర దేహంకల దుష్టుడనీ, ప్రపంచమంతా గెలవగల పరాక్రమం కలవాడిగా కనిపిస్తున్నాడనీ, కాబట్టి తమను మింగుతాడు కాని వదలడని లక్ష్మణుడు అంటాడు. లక్ష్మణుడు చెప్పిన మాటలు విని ఆ రాక్షసుడు, రామలక్ష్మణులను నోట్లో వేసుకుందామని ఆలోచించే లోపలే వాడి తత్త్వాన్ని అర్థం చేసుకున్న వారిద్దరిలో రామచంద్రమూర్తి వాడి కుడిచేయి నరికాడు. రాముడికి కుడిపక్కన వున్న లక్ష్మణుడు తన కత్తి దెబ్బతో ఎడమ చేయి నరికాడు. ఇలా నరకగా ఆ రాక్షసుడు భూమ్యాకాశాలు, దిక్కులు దద్దరిల్లేట్లు నేలకొరిగాడు.

దుఃఖంతో కూడిన ఆ రాక్షసుడు రెండు చేతులూ కోల్పోయి వారెవరనీ, ఈ అడవిలో వాళ్లకేమిపని వుందనీ అని ప్రశ్నించాడు. జవాబుగా లక్ష్మణుడు, వాళ్ల చరిత్ర చెప్పాడు. తాము ఇక్ష్వాకు వంశంలో పుట్టామనీ, తన అన్న పేరు శ్రీరాముడనీ, తన పేరురు లక్ష్మణుడనీ, దండకారణ్యంలో వున్నప్పుడు

దుండగులైన రాక్షసులు మాయచేసి అన్నరాముడి భార్య సీతమ్మను దొంగిలించగా ఆమెను వెతుక్కుంటూ ఇక్కడికి వచ్చామనీ అన్నాడు. మొండెం మాత్రమే ఆకారంగా వున్న ఆ రాక్షసుడు ఎవరని కూడా అడిగాడు. ఇది విన్న ఆ రాక్షసుడు, తనకు శాపమోక్షణ కాలం దగ్గరికి వచ్చింది కదా అని సంతోషించి ఇలా జవాబిచ్చాడు లక్ష్మణుడికి.

"ఓ రాఘవులారా! నా భాగ్యం పండడం మిమ్మల్ని ఇక్కడ చూడగలిగాను. చేతులు పోగొట్టుకున్నాను. వినయం తప్పిన పనులు చేయడం వల్లే నాకిలాంటి వికార స్వరూపం కలిగింది. నేను మొట్టమొదట సుందరాకారం కలిగి, అందగాడినని పెరుతెచ్చుకున్నాను. ఆ గర్వంతో మునులను అరణ్యవాసులను భయపడేట్లు అనేకరకాల దుఃఖపెట్టూ, స్థూలశిరుడు అనే మునిని నింద్య రూపంలో భయపెట్టాను. ఆ ఋషీశ్వరుడు 'ఓరీ! పాపాత్ముడా! నింద్యమైన ఈ రూపంలో నన్ను బెదిరిస్తావా? నీకు ఈ రూపమే శాశ్వతం కలుగుగాక!' అని శపించాడు. శాపవిమోచనం చెప్పమని ప్రార్థించగా ఈ అడవిలో ఎప్పుడు రామచంద్రుడు నీ చేతులు తెగనరికి దహిస్తాడో అప్పుడే నీకు శాపం తొలగిపోయి, నీ పూర్వ రూపం పొందుతావు అని శలవిచ్చాడు ఆ మునీశ్వరుడు".

"కబంధ రూపం రావడానికి మరో కారణం వుంది. ఒక సారి బుద్ధిహీనుడనై ఇంద్రుడిని యుద్ధానికి రమ్మని పిలిచాను. ఇంద్రుడు వజ్రాయుధం వేటుతో నా తల, రొమ్ము, కడుపు, తొడలు కుదించుకు పోయేట్లు అణచి వేశాడు. నేనప్పుడు, నాకీ దురవస్థకన్నా మరణమే మేలని చంపమని ప్రార్థించాను. నేనెలా బతకాలయ్యా? అని అడిగితే, ఆమడ పొడుగున్న చేతులు, కడుపులో నోరు అనుగ్రహించాడు. వాటి సహాయంతో ఏనుగులను, పులులను, సింహాలను, ఇతర మృగసమూహాలను చంపి తింటున్నాను. లక్ష్మణుడితో సహా ఎప్పుడు రాముడు నా చేతులను నరుకుతాడో అప్పుడు మళ్లీ నేను స్వర్గానికి వస్తానని చెప్పి ఇంద్రుడు పోయాడు".

"ఇక అప్పటి నుండి ఈ వికార స్వరూపం పోవడానికి ప్రయత్నం చేస్తూ, ఎవరు కనపడ్డా పట్టుకుని, రాముడు చిక్కకపోతాడా అని ఆశతో ఎదురు చూస్తున్నాను. ఆ మునీశ్వరుడు చెప్పిన రాముడివి నువ్వే. మీకు నేను సహాయం చేస్తాను. మీ కార్యం సాధించగల స్నేహితుడిని చూపిస్తాను. నన్ను అగ్నితో దహించు" అని అంటాడు కబంధుడు. తన దేహాన్ని వేగంగా దహించి వేస్తే సీతను దాచి వుంచిన రహస్యమంతా దాచకుండా చెప్తానంటాడు కబంధుడు రాముడితో. ఆ పని సూర్యాస్తమయం లోపే చేయమంటాడు. వాడి విషయం తెలిసినవాడు ఒకడున్నాడనీ, అతడితో ధర్మబద్ధంగా స్నేహం చేయమనీ, అతడు ప్రపంచంలో తిరగని చోటు లేదనీ, అతడు రాముడికి ఉపకారం చేస్తాడనీ చెప్పాడు కబంధుడు.

కబంధుడు చెప్పిన మాటలు విన్న లక్ష్మణుడు వాడిని దహనం చేయడానికి సన్నాహాలు చేశాడు. రామలక్ష్మణులు చూస్తుండగానే, మండుతున్న ఆ మంటల్లో నుండి బయటకు వచ్చి, ఆకాశానికి ఎగిరిన కబంధుడు, తాను సీతాదేవిని చూసిన విధం రాముడితో ఇలా చెప్పాడు.

"రామచంద్రా! లోకంలో సంధి, విగ్రహ, యానా, సన, ద్వైదీభావ, సమాశ్రయంలనే ఆరు ఉపాయాలను పనులు చక్కబెట్టడానికి ఆలోచిస్తారు. ఈ ఆరింటిలో సంధి తప్ప తక్కినవి నీకు ప్రస్తుతం సరిపడేవి కాదు. ప్రత్యక్ష శత్రువు ఎవరైంది నీకు తెలియలేదు కాబట్టి, నువ్వు వాడితో సంధి చేద్దామన్నా

కుదరదు. కాబట్టి మొదలు నీ శత్రువు విషయం, సీత ఉనికి తెలుసుకోవాలి. ఇది మీ ఇద్దరివల్ల సాధ్యపడేది కాదు. కాబట్టి అన్యుల సహాయం తీసుకోవాలి. ఇతరులతో సంధి అంటే, ఎలాంటివారితో చేయాలి? కయ్యానికి, నెయ్యానికి, వియ్యానికి సమానత్వం కావాలి. తనకంటే గొప్పవారితో స్నేహం కుదరదు. తక్కువ వారితో స్నేహం చేస్తే లాభం లేదు. తనకంటే ఎక్కువవాడు తనని చులకన చేస్తాడు కాని, నిండు మనస్సుతో ఆదరించడు".

"కాబట్టి నీ స్థితిలాంటి స్థితిలో ఉన్నవాడిని చూసి స్నేహం చేసుకో. సుగ్రీవుడు అనే వానర రాజు, తన అన్న వాలికి తనమీద కోపం రాగా, నలుగురు వానరులను సహాయంగా తీసుకుని దుఃఖపడుతూ, పంపానది ఒడ్డున వున్న పవిత్ర ఋశ్యమూక పర్వతం మీద సంచరిస్తున్నాడు. అతడు పరాక్రమవంతుడు. ఋజువర్తనం కలవాడు. అతడితో నువ్వు స్నేహం చేస్తే నీ భార్యను వెదకడానికి అతడు నీకు సహాయపడతాడు. రామా! నువ్వెందుకు దుఃఖపడతావు? ఏదెలా జరగాలో అలాగే జరుగుతుంది కాని, దానిని తప్పించడానికి ఎవరికి సాధ్యం? ఎలాంటివారికైనా కాలాన్ని దాటడం సాధ్యం కాదుకదా?.

"సుగ్రీవుడు, అన్న వాలికి భయపడి, తిరుగుతున్నాడు. వాడు నమ్మేట్లు నువ్వు నీ ఆయుధాలన్నిటినీ తాకి ప్రతిజ్ఞ చేసి అతడితో స్నేహం చేయి. అతడికి తెలియని రాక్షసులు వుండే చోటు భూమ్మీద లేదు. సూర్యకిరణాలు వ్యాపించే భూమ్మీదగల నదులు, నదాలు, కొండలు, అడవులు, వెతికి నీ భార్య ఎక్కడున్నదీ వార్త తెప్పించగల సమర్థుడు సుగ్రీవుడు. నిన్ను ఎడబాసిన కారణాన దుఃఖిస్తున్న సీతాదేవి రావణుడి బందీగా ఎక్కడ ఉన్నదో కనుక్కోగల సమర్థుడతడు. ఆ రావణుడి ఇల్లు వెతికి, వాడామెను పాతాళంలో దాచినా, మెరువు కొనలో ఉంచినా, రాక్షసుల గుంపును చంపి ఆమెను తీసుకురాగలడు".

ఇంతదాకా రామలక్ష్మణులు దక్షిణ దిక్కుగానే ప్రయాణం చేశారు. జటాయువు కూడా దక్షిణం వైపే పొమ్మని సలహా నిచ్చాడు. ఈ మార్గానికి కిష్కింధ పడమరగా వుంది. కబంధుడు, ఇంకా ఇలా అన్నాడు. పంపా సరస్సు వైపు పొమ్మంటాడు. పంపా సరస్సు గురించి వర్ణించి చెప్పాడు. అక్కడ సమీపంలోనే వుంటున్న శబరికి దర్శనం ఇవ్వమంటాడు. ఆమె రాముడిని దర్శించి స్వర్గం చేరాలనుకుంటున్నదనీ, రాముడి రాక కొరకు వేచి చూస్తున్నదనీ చెప్పాడు. ఇలా చెప్పి కబంధుడు ప్రయాణానికి సిద్ధమయ్యాడు. రామలక్ష్మణులు పొమ్మని ఆజ్ఞాపించారు. కబంధుడు సంతోషంగా పోయాడు. రామలక్ష్మణులు త్వరగా పడమటి దిశగా పయనమయ్యారు.

పడమటి దిక్కుగా పోతున్న రామలక్ష్మణులు శబరి వుండే రమ్యమైన ఆశ్రమాన్ని చూసి సమీపించారు. (పంప ఒడ్డున ఈ ఆశ్రమం ఇప్పటికీ వుందట. ఈ గుహ వాకిట్లో పట్టపగలు ఎండలు మండిపోతున్నప్పటికీ, దుప్పటి కప్పుకునేంత చల్లటి గాలి వీస్తుంది). శబరి వీరిని చూసి చేతులు మోడ్చి, వారిపాదాలను అంటి నమస్కరించి, పాద్యం ఇచ్చి, తగిన ఉపచారాలను అన్నింటినీ శాస్త్ర ప్రకారం కావించింది.

"శ్రీరఘురామచంద్రా! నేను శుశ్రూష చేస్తుండే నా గురువులు, మీరు చిత్రకూటానికి వచ్చారనీ, ఇక్కడికి వస్తారనీ, మీ దర్శనం చేసుకుంటే నాకు మళ్లీ జన్మలేని లోకం లభిస్తుందనీ చెప్పిన కారణాన మీ కొరకు వేచి చూస్తున్నాను. సంతోషంగా మీ కోసం మంచివి, ఏరి-కోరి నానా రకాలైన కందమూల ఫలాలు సంపాదించాను" అని అన్న శబరి మాటలకు ఆమెను చూసి రామచంద్రమూర్తి మతంగాశ్రమం

వింతలు చూపించమని అడగ్గా ఆమె అలానే చేసింది. ఆ తరువాత శబరి, "రామా! వినతగినవన్నీ విన్నావు, చూడతగినవన్నీ చూశావు. ఇక నేను నా గురువులున్న చోటుకు పోయి వాళ్ళను దర్శించాలి. నాకు ఆజ్ఞ ఇవ్వు" అంటుంది. ఆ పుణ్యాత్మురాలు చెప్పిన మాటలన్నీ విన్న రామచంద్రుడు ఆమె గురుభక్తికి, దైవభక్తికి మెచ్చి, ఆమె కోరిక ప్రకారం పరమపదానికి పొమ్మన్నాడు.

శబరి పరమపదానికి పోగా, ఏకాగ్రమనస్కుడై, తన తమ్ముడు లక్ష్మణుడిని చూసి రామచంద్రుడు మతంగముని గురించి చెప్పాడిలా. "ఆహా! ఏమి, ఈ ఋషుల మహిమ? అవి చూస్తూ వుంటే చాలా ఆశ్చర్యంగా వుంది. లక్ష్మణా! ఇక్కడ జింకలు, పులులు, మచ్చికతో సహజ విరోధం వదిలి నమ్మకంగా తిరుగుతున్నాయి. మునీశ్వరులు వున్నప్పుడే కాకుండా వాళ్లు పోయిన తరువాత కూడా వాళ్ల తేజస్సు వ్యాపించి ఉన్నందున హింస అనేది కనబడడం లేదు. మునీశ్వరుడు సృష్టించిన సముద్ర జలాలతో పితృ తర్పణం చేశాం. ఇది మనకు మేలు చేస్తుంది. లక్ష్మణా! మన కష్టకాలం పోయింది. ఇక సౌఖ్యమే కలుగుతుంది. ఇక్కడికి సుగ్రీవుడు వుండే పర్వతం దగ్గరే. ఎంతో దూరం లేదు. ఇక మనం పంపకు పోదాం. అక్కడే కదా సుగ్రీవుడు వానరులతో వుండే ఋశ్యమూకం వున్నది. మనం సుగ్రీవుడిని చూడడానికి పోదాం పద. సీతను వెతికే పని అతడిదే కదా?" అన్న మాటలకు లక్ష్మణుడు తానూ ఆ విషయమే ఆలోచిస్తున్నానని అన్నాడు. వాళ్లు పంపాతీరం చేరారు.

పంపా సరోవరం చూసిన రామలక్ష్మణులు దాని సౌందర్యానికి, వ్రతనిష్ఠ కల మునులతో కూడిన దాని మహిమకు ఆశ్చర్యపడి నేత్రానందంగా దాన్నే చూసుకుంటూ పోయారు. దానికి కొంచెం దూరంలో వున్న మతంగు కొలనులో స్నానం చేసి ఆ రాజకుమారులు సమీపంలోని అందమైన వనాలను చూస్తూ పోసాగారు. అలా పోతున్న వారికి అందమైన తీగలతో ప్రకాశించే బొట్టుగు చెట్లు, మాదిఫల వృక్షాలు, గన్నేరులు, మొల్లతీగెలు, మర్రులు, ఏడాకుల అరటులు, మొగలి చెట్లు, ఎర్ర గన్నేరులు, మామిడితోపులతో కూడిన ఆ వనం అలంకరించబడిన పడుచులాగా వుంది. చిలుకలు, గుడ్డికొంగలు, నెమిళ్ళు లాంటి మనోహరమైన పక్షుల ధ్వనులు వింటూ సంతోషంగా పంప చేరారు.

అప్పుడు రాముడు లక్ష్మణుడితో, "ఈ పంప ఒడ్డున వున్న ఋశ్యమూకపర్వతం మీదనే కదా ఆ పుణ్యాత్ముడు సుగ్రీవుడున్నది? శోకతప్తుడినై రాజ్యాన్ని కోల్పోయి, భార్యను పోగొట్టుకుని ఎలా బతకాలి? కాబట్టి మన పనికోసం నువ్వు సుగ్రీవుడిని చూడడానికి వెళ్లు. నేను పోవడం మర్యాద కాదు". ఇలా లక్ష్మణుడితో చెప్తూ, రామచంద్రమూర్తి అధికమైన దుఃఖంతో పంపాతీరాన్ని చూడడానికి అనువైన స్థలానికి తమ్ముడితో కలిసి చేరాడు. అందమైన ఆ కొలను చూసిన వారికి ఇన్నాళ్లు కలగని సంతోషం కలిగింది.

హనుమంతుడు ఆచార్యపదవికి తగినవాడేనా?

పంపా తీరం చేరిన రామచంద్రమూర్తి, అపహరించబడిన భార్య సీత కోసం బేలవలె ఏడుస్తూ వుండడం చూసిన లక్ష్మణుడు సమాయనుకూల హితబోధ చేసి సంతాపాన్ని ఉపశమింప చేసే ప్రయత్నం చేశాడు. లక్ష్మణుడు చెప్పిన మాటలు సత్యమని భావించిన రాముడు దుఃఖాన్ని విడిచి ధైర్యం వహించాడు. ఆ తరువాత శీఘ్రంగా నిర్భయంగా నడుస్తూ, తమ్ముడు ధర్మ వాక్యాలు చెప్తుంటే వినుకుంటూ ఋశ్యమూక పర్వతం దిశగా ముందుకు సాగిపోయారు.

రాముడు, లక్ష్మణుడు ఋశ్యమూక పర్వతం దరిదాపుల్లో సంచరిస్తుండగా, వారిని, కొండమీద వున్న సుగ్రీవుడు చూసి భయపడ్డాడు. సుగ్రీవుడితో పాటు ఇతర వానరులు కూడా చూశారు. రామలక్ష్మణులను చూసిన వానరులకు వీరిని వాలి పంపగా తమను చంపడానికి వచ్చారని భావించారు. పంపానదికి ఉత్తరాన రామలక్ష్మణులు, దక్షిణాన సుగ్రీవాదులు వున్నారు. వారి వెంట ఇంకా ఎవరైనా వస్తున్నారేమోనని నలుదిక్కులా చూశాడు. ఒకచోట నిల్వలేకపోయాడు. పరుగెత్త సాగాడు.

ఆ సమయంలో ఆంజనేయుడు సుగ్రీవుడి దగ్గరకు పోయి ''వానర రాజా! ఎందుకు నీకు భయం వేస్తున్నది? వాలి భయంతో ఎందుకు నువ్వీవిధంగా పరుగెత్తుతున్నావు? ఈ పర్వతం ఋష్యమూకం కదా! ఇక్కడ వాలివల్ల భయం లేదుకదా? ఒకవేళ భయపడడానికైనా వాలి ఇక్కడెక్కడా కనబడడం లేదే? కాబట్టి ఎందుకు తొట్రుపాటు పడుతున్నావు? నీ పిరికితనానికి కారణం ఏమిటి?'' అంటాడు. హితమైన మాటలు చెప్పిన ఆంజనేయుడితో సుగ్రీవుడు రామ లక్ష్మణులను చూసిన విషయం చెప్పి, తనను చంపగల వారెవరినో ఇక్కడికి వాలి పంపాడని నిశ్చయించాను కాబట్టి భయపడ్డానని అంటాడు.

“రాజులందరూ తమ శత్రువులను ఉపాయంతోనే కదా చంపుతారు? అలాగే వాలి కూడా చేస్తుండవచ్చు. అయినప్పటికీ ఇది ఇలాగే అని నేను చెప్పలేను. నా జాగ్రత్తలో నేను వుండడం మంచిదని పరుగెత్తి వచ్చాను. నా ఆలోచన సరైందా? కాదా? అని తెలుసుకోవాలి. దానికొరకు ఎవరో ఒక సామాన్యుడిని వారిదగ్గరకు పంపాలి. నువ్వే సామాన్య మనిషి వేషంలో వాళ్ల దగ్గరికి పోయి విషయం

తెలుసుకో. ఆంజనేయా! నువ్వు పోయి వాళ్ల మనస్సు నిజంగా ఎలాంటిదో కనుక్కో. నీమీద ముందుగా నమ్మకం పుట్టించుకుని ఆ తరువాత నామీద వాళ్లకు సదభిప్రాయం కలిగేట్లు చేయి. వాళ్లు నిర్మలమైన మనస్సు కలవారనీ, వంచన గుణం లేనివారనీ నీకు నమ్మకం కుదిరితే, వాళ్లు మాట్లాడే విధానం గమనించు. వారి మాటల్లో నిజమెంతో, మోసమెంతో తెలుసుకో''.

అని సుగ్రీవుడు చెప్పగా హనుమంతుడు రామలక్ష్మణులున్న ప్రదేశానికి నిజస్వరూపంలో పోతే, పోయిన పని నెరవేర్చడం కష్టమని భావించి, వానర రూపం వదిలి, సన్న్యాసి లాగా తానున్న కొండ దగ్గరినుండి, వారిదగ్గరికి పోయి ఏకాగ్ర చిత్తంతో, వినయంగా వాళ్లకు నమస్కారం చేశాడు.

ఇక్కడ సన్న్యాసి రూపం ధరించిన హనుమంతుడు గృహస్థుడైన రామచంద్రమూర్తికి ముందుగా తానే నమస్కారం చేయడం అంటే సర్వత్రా ఇలాంటి ఆచారం సమంజసమని అనుకోవాలి. సన్న్యాసి గృహస్థుడికి నమస్కారం చేయడం భావ్యం కాదని కొందరంటారు కాని, అది వాస్తవం కాదు. మనువాక్యమూ కాదు. మనుశాస్త్రానికి విరుద్ధం కూడా. ఆ మాటకు మూలం ఏంటో, కర్త ఎవరో కూడా తెలియదు. జ్ఞానాధికుడైన గృహస్థుడికి సన్న్యాసి నమస్కరించాలి అనేదే మనువాక్యం. హనుమంతుడు అత్యద్భుతములైన రామలక్ష్మణుల ఆకారాలు చూసిన వెంటనే అధికానంద పరవశుడై తాను ధరించిన సన్న్యాసి ఆకారాన్నికూడ మరచిపోయి అవశంగా వారికి నమస్కారం చేశాడు. ఇది సర్వత్రా ప్రామాణికం కాదని కొందరి అభిప్రాయం. ఇది యుక్తంకాదు. హనుమంతుడు నిపుణమతి. గొప్ప మంత్రి. రాముడి అభిప్రాయం కనుక్కొని రమ్మని సుగ్రీవుడు పంపగా వచ్చాడు. అలాంటి వాడు ఆదిలోనే తనను తాను మరచిపోతే తక్కిన కార్యం ఎలా నెరవేర్చగలడు? రామచంద్రమూర్తి ఎలా నమ్ముతాడు? రామచంద్రమూర్తి దివ్యమంగళ విగ్రహం చూడగానే వీరు సుగ్రీవుడికి మేలు చేసేవారే కాని పగవారు కాదని నిశ్చయించిన హనుమంతుడు తాను వేసుకున్న వేషం మారు వేషమనీ, తాను చారుడనీ తెలియచేయడానికే నమస్కారం చేశాడు. ఇక్కడ బిక్షువు అంటే సన్న్యాసికాదు. బ్రహ్మచారి అని కొందరంటారు. అదీ యుక్తం కాదు. హనుమంతుడు మొదటినుండీ బ్రహ్మచారే కాని, ఇప్పుడు కొత్తగా వేయలేదు. కాబట్టి హనుమంతుడు సన్న్యాసి వేషం ధరించాడనీ, జ్ఞానాధికుడైన రామచంద్రుడికి, గృహస్థుడికి, నమస్కరించడం తప్పుకాదనీ చెప్పాలి.

ఆ తరువాత సుగ్రీవుడి అభిప్రాయానికి సరిపోయేట్లు తన అభిప్రాయాన్ని చెప్పాడు హనుమంతుడు రాముడితో ఇలా. "అయ్యలారా! మీరెవరు? ఈ అడవి ప్రదేశానికి ఎందుకు వచ్చారు? మీరు రాజర్షులతో, దేవతలతో సమానంగా వున్నారు. మీలో రాజవేషం , ముని వేషం రెండూ కలిసి వున్నాయి. అలా అయితే మీరు సంకరులని నా అభిప్రాయం కాదు. మీరేదో మంచి వ్రతం పూని ఇలా వున్నారని నేను అనుకుంటున్నాను. ఇలాంటి వ్రతం మీరు పూనడానికి కారణమేంటి? మహిమలో దేవతలకు సమానంగా వున్నారు. కాబట్టి ఎలాంటి శత్రువునైనా చంపగల సమర్థులు మీరు. మీరెందుకు నారచీరెలు కట్టి జడదారుల్లాగా జడలు ధరించి తిరుగుతున్నారు? మీ యోగ్యతకు, మీ ఇప్పటి స్థితి, పరస్పర విరుద్ధంగా వుండడానికి కారణం ఏంటి?. మీరేదో శత్రుసంహార కార్యక్రమానికి సిద్ధమైనట్లు కనపడుతున్నది".

హనుమంతుడు ఇన్ని ప్రశ్నలు వేసినా రామలక్ష్మణులు ఆయన మాటల సొంపు–పెంపు వింటూ వూరకే వున్నారు తప్ప ఒక్కదానికైనా జవాబివ్వలేదు. కారణాలు అనేకం వుండొచ్చు. ఆయన మాటలపట్ల ఆసక్తి కావచ్చు. తాము మాట్లాడితే ఆయన మాటలు వినే అవకాశం కోల్పోవచ్చు. సన్న్యాసులు తిరగకూడని ప్రదేశంలో తిరుగుతున్న ఈ సన్న్యాసి నిజమైన సన్న్యాసా? కాదా? అన్న సందేహం కావచ్చు. బిక్షకోసం వచ్చిన సన్న్యాసి అయితే ఆయన స్థితిగతులు చెప్పుకోవాలి కాని తమ స్థితిగతులను గురించి ఎందుకు అడగాలి? వేగులవాడేమో! ఇక్కడ పరస్పర శత్రువులైన వాలి–సుగ్రీవులలో ఇతడు ఎవరి పక్షమో? కాబట్టి ముందుగా తానెవరో చెప్పిన తరువాత మాట్లాడుదామని రామలక్ష్మణులు భావించి వుండాలి.

ఇక హనుమంతుడు వేరే విధంగా ఆలోచించ సాగాడు. తానెంత మాట్లాడినా వీళ్లు బదులు చెప్పడం లేదు. తనమీద వీరికి సందేహం కలిగిందేమో? ఆ సందేహం తీరేవిధంగా తాను సంభాషిస్తేనేగాని వాళ్లు తనను నమ్మి తనతో మాట్లాడారని అనుకుంటాడు. వీళ్లు గొప్పవారిలాగా వున్నారు కాబట్టి వీళ్ల స్నేహం తప్పక చేయాలి అని ఆలోచించి తన వృత్తాంతాన్ని కపటం లేకుండా ఇలా చెప్పాడు.

"ఆర్యులారా! నా వృత్తాంతాన్ని చెప్తా వినండి. ఈ ప్రాంతంలో సుగ్రీవుడు అనే ఒక ధర్మాత్ముడు, కోతిరాజు, వీరుల గౌరవానికి పాత్రుడు వున్నాడు. అతడిని ఆయన అన్న వెళ్లగొట్టితే నిలువనీడలేక, ప్రాణ భయంతో అమితంగా బాధపడ్తూ దేశంలో తిరుగుతున్నాడు. మీ స్నేహం కోరి ధర్మాత్ముడైన సుగ్రీవుడు పంపుతే మీ దగ్గరికి వచ్చాను నేను. నేనాయన మంత్రిని. వాయుపుత్రుడిని. నా పేరు హనుమంతుడు. నేను వానరుడిని. కోరిన రూపం ధరించి, కోరిన ప్రదేశానికి వెళ్లగలను. సుగ్రీవుడి మేలు కోరి సన్న్యాసి వేషంలో ఋశ్యమూకం నుండి ఇక్కడికి వచ్చాను" అని చెప్పి హనుమంతుడు మౌనం దాల్చాడు.

దీంతో రామలక్ష్మణుల సందేహం తీరింది. వాలి–సుగ్రీవుల పేర్లు, వాలి సుగ్రీవుడిని వెళ్లగొట్టడం, సుగ్రీవుడు ఋశ్యమూకం మీద వుండడం, ఇవన్నీ రామలక్ష్మణులకు తెలిసిన విషయమే. కాబట్టి సందేహానికి తావు లేదు. ఆ తరువాత తాను సుగ్రీవుడి మంత్రినని చెప్పాడు హనుమంతుడు. అంటే సుగ్రీవుడి పక్షంవాడని అర్థమయింది.

హనుమంతుడి మాటలకు సంతోషించిన రాముడు, తమ్ముడు లక్ష్మణుడిని చూసి హనుమంతుడిని ప్రశంసిస్తూ చెప్పాడు. "లక్ష్మణా! ఇతడు సుగ్రీవుడికి ప్రీతిపాత్రుడైన మంత్రి. మనం ఏ సుగ్రీవుడిని చూడాలని పోతున్నామో, అతడి మంత్రే ఈ రూపంలో మనదగ్గరికి వచ్చాడు. అంటే, సుగ్రీవుడితో ఏ పనైతే అవుతుందని అనుకుంటున్నామో, అది ఇతడి ద్వారానే జరుగుతుంది. ఆయన్ను మనం ఎలా నమ్మవచ్చో ఇతడిని కూడా అలాగే నమ్మవచ్చు. ఆయనకూ, ఇతడికీ భేదం లేదు".

హనుమంతుడు ఆచార్యపదవికి తగినవాడని శ్రీరామచంద్రమూర్తి ఆయన యోగ్యతను గురించి చెప్పాడు. ఆచార్యుడు వేదం తెల్సినవాడిగానూ, విష్ణుభక్తుడుగానూ, మాత్సర్యం లేనివాడుగానూ, విష్ణుమంత్రం తెలిసినవాడుగానూ, ఆ మంత్రం మీద భక్తికలవాడుగానూ, మంత్రార్థం ఇతరులకు చెప్పగలిగిన వాడుగానూ, బాహ్యాభ్యంతరాలలో నిర్మలమైన వాడుగానూ, గురుభక్తి కలవాడుగానూ, పురాణాల జ్ఞానం కలవాడుగానూ వుండాలి. ఇలాంటివాడినే ఆచార్యుడు అంటారు. ఈ గుణాలు

హనుమంతుడిలో వున్నాయని శ్రీరాముడు చెప్పాడు లక్ష్మణుడితో.

సుగ్రీవుడితో స్నేహం చేస్తే తన పని హనుమంతుడి వల్లే సఫలం అవుతుందని రామచంద్రమూర్తి నిశ్చయించుకున్నాడు. వాక్యజ్ఞుడు లక్ష్మణుడు, వాక్యజ్ఞుడు హనుమంతుడు అని శ్రీరామచంద్రమూర్తి అంటాడు. అంటే, ఈ గుణాలన్నీ లక్ష్మణుడిలో, హనుమంతుడిలో, ఇద్దరిలో, కలవనీ, ఇద్దరూ సమానులే అనీ భావం.

శ్రీరామచంద్రమూర్తి ఈ విధంగా చెప్పడంతో, వాక్యజ్ఞుడైన లక్ష్మణుడు వాక్యజ్ఞుడైన హనుమంతుడితో ఇలా అన్నాడు. "అయ్యా! పండితుడా! సుగ్రీవుడి గురించి, అతడి ప్రభావం గురించీ, అతడి గొప్ప గుణాలను గురించీ, మేం ఇదివరకే విన్నాం. కాబట్టే ఆయన్ను వెతుక్కుంటూ ఇక్కడికి వచ్చాం. నువ్వు చెప్పిన సుగ్రీవుడి పనిని మేం సంతోషంతో నువ్వు చెప్పినట్లే చేయగలం". ఇది విని హనుమంతుడు సుగ్రీవుడి జయం కోరుతూ రామసుగ్రీవులకు స్నేహం కుదర్చాలని అనుకున్నాడు. ఆ తరువాత హనుమంతుడితో తమ యావత్ వృత్తాంతాన్ని చెప్పాడు లక్ష్మణుడు.

లక్ష్మణుడు ఇలా చెప్పగానే, అతడిని చూసి, హనుమంతుడు, "ఈ పరాక్రమం, ఈ ఇంద్రియ జయం, ఈ బుద్ధి సంపద, ఇలాంటి సదాచార సంపత్తికల మిమ్మల్ని తన అదృష్టం కొద్దీ సుగ్రీవుడు చూశాడు. సజ్జన స్తోత్ర పాత్రమైన నడవడి కలవారా! ఇక సుగ్రీవుడి చరిత్ర చెప్తాను వినండి" అంటూ చెప్పసాగాడు. "తన అన్న అయిన వాలి పగపట్టి, బాధపెట్టి, ఊరు వెడలగొట్టి అతడి భార్యను అధర్మ పద్ధతిలో హరించడం వల్ల అడవుల్లో కీడు దశ అనుభవిస్తున్నాడు సుగ్రీవుడు. సీతాదేవిని వెతికే పనిలో మాలాంటి కోతులను రంగంలోకి దింపి మీకు తప్పక సహాయం చేస్తాడు".

ఇలా చెప్పి సుగ్రీవుడిని చూడడానికి పోదాం రమ్మని రామలక్ష్మణులను అడిగాడు. అప్పుడు లక్ష్మణుడు రామచంద్రమూర్తితో "అన్నా! హనుమంతుడు యదార్థం చెప్తున్నాడు. సుగ్రీవుడికి నీతో పని వుంది. కాబట్టి సంతోషించు. నీ కార్యం కూడా నెరవేరిందని భావించు. ఒకవేళ యితడు చెప్పింది అబద్ధమైతే దానివల్ల మనకు వచ్చే నష్టం ఏమీ లేదు. పనైతే అయింది, లేకపోతే లేదు. ఇప్పుడు మనం వున్న స్థితికంటే తక్కువ స్థితికి పోము. ఆయన మాటలు సంతోషంగా కార్యసాధకుడిలాగా వున్నాయి. సందేహించడానికి తావులేకుండా స్పష్టంగా సాదుభావంతో ప్రసంగిస్తున్నాడు. కాబట్టి హనుమంతుడు కోరినట్లు మనం సుగ్రీవుడి దగ్గరికి పోదాం". అని లక్ష్మణుడు చెప్పగా రామచంద్రమూర్తి అలాగే చేద్దామన్నాడు.

ఆంజనేయుడు తన సన్న్యాసి రూపాన్ని వెంటనే వదిలాడు. రామలక్ష్మణులను ఇద్దరినీ భుజాలమీద ఎక్కించుకుని, సుగ్రీవుడు తిరుగుతున్న చోట దించాడు.

రామ సుగ్రీవుల స్నేహం సీతాన్వేషణకేనా?

సుగ్రీవుడు పంపగా పోయిన హనుమంతుడు తన వెంట తీసుకొచ్చిన రామలక్ష్మణులను ఆయనకు సవివరంగా పరిచయం చేశాడు. విస్తారమైన సత్యం, శౌర్యం, సత్యమైన శౌర్యం, సత్యమే శౌర్యంగా కల వాడు రాముడనీ, సాక్షాత్తూ పరమాత్మ అనుకోవాలనీ చెప్పాడు. దశరథ మహారాజు కొడుకైన ఆయన అడవుల్లో తిరుగుతుంటే, రావణాసురుడి వల్ల తన భార్యను కోల్పోయాడనీ, సుగ్రీవుడి స్నేహం కోరి అన్నదమ్ములు ఇక్కడికి వచ్చారు కాబట్టి వారిని పూజించమనీ చెప్పాడు. సుగ్రీవుడు రామలక్ష్మణులను సమీపించి, పూజించి, రామచంద్రమూర్తిని చూసి ఇలా అన్నాడు.

"రామచంద్రా! నాతో స్నేహం చేయడానికి నీకు పరిపూర్ణంగా అంగీకారమైతే, నా చేతిలో నీ చేయి వెయ్యి. ఇదిగో, నా చేతిని స్నేహధర్మ మర్యాద ప్రకారం చాచాను. ఇది అభయహస్త ప్రధాన ప్రార్థన". ఆ మాట విన్న రామచంద్రమూర్తి సంతోషించి, తన అరచేతిని, సుగ్రీవుడి అరచేతిలో వుంచి, గౌరవించి నిండు మనస్సుకల స్నేహంతో కౌగలించుకున్నాడు. అప్పుడు అగ్నిహోత్రాన్ని వారిద్దరి మధ్య హనుమంతుడు పెట్టాడు. రామసుగ్రీవులు అడవి పూలతో పూజించి, ఒకరిచేయి మరొకరు పట్టుకుని, ఆసక్తిగా అగ్నికి ప్రదక్షిణ చేశారు. ఇలా రామసుగ్రీవులు స్నేహం చేసి ఇద్దరూ తమ పని జరిగినట్లే సంతోషించారు.

అప్పుడు సవినయంగా సుగ్రీవుడు తనకు అన్న వాలి చేసిన అపకారాన్ని గురించి ఇలా చెప్పసాగాడు. "రామచంద్రా! నా అన్న వాలి భయంకరమైన పరాక్రమం కలవాడు. వాడు నామీద కోపంతో నన్ను రాజ్యం నుండి పంపించి, నా భార్యను హరించి, నిర్దయుడై వెళ్లగొట్టితే, ప్రాణభయంతో కొండాకోనలలో అల్లల్లాడుతున్నాను. నన్ను కరుణార్ద్ర దృష్టులతో చూసి వాలి భయం నాకు లేకుండా చేసి నన్ను రక్షించు".

సుగ్రీవుడిలా చెప్పగా స్నేహధర్మం తెల్సిన శ్రీరామచంద్రుడు చిరునవ్వుతో ప్రీతిగా సుగ్రీవుడితో వాలిని చంపడానికి ప్రతిజ్ఞ చేస్తూ ఇలా అన్నాడు. "స్నేహితుడంటే ఉపకారం చేసేవాడని అర్థం. ఇది నేను చక్కగా ఎరుగుదును. కాబట్టి నీ భార్యను అపహరించిన ధర్మవిరుద్ధ చరిత్రుడైన వాలిని చంపుతాను.

భయపడవద్దు. రాముడిలా చెప్పగా, సంతోషించిన సుగ్రీవుడు, "రామచంద్రా! నీ అనుగ్రహంవల్ల నా భార్య, రాజ్యలక్ష్మి లభిస్తే సంతోషిస్తాను. నీ బాణాలతో వాలిని త్వరగా చంపి నా తీవ్ర దుఃఖాన్ని తొలగించి రక్షించు. నీకు నీ భార్యను ఎడబాయడం వల్ల కలిగిన దుఃఖాన్ని నేను తొలగిస్తాను. నువ్వు బాధపడవద్దు. పతివ్రతైన సీతాదేవిని నీచుడైన రాక్షసుడు ఏ ప్రదేశంలో దాచినప్పటికీ, పాతాళంలో వున్నా సరే, ఆకాశాన వున్నా సరే, రామచంద్రా! ఆమెను నేను తేగలను. నువ్వు బాధపడవద్దు".

సుగ్రీవుడు శ్రీరాముడితో ఇంకా ఇలా అన్నాడు. "మేం సీతను చూడడమే కాదు. ఆమెకూడా మమ్మల్ని చూసి, ఆమె తనమీది ఉత్తరీయంలో సొమ్ములను మూటగట్టి విసిరివేసింది. వాటన్నింటినీ నేను కొండగుహమీద వున్న హనుమంతుడి చేతికి ఇచ్చి దాచిపెట్టాను. వాటిని త్వరగా తెప్పిస్తాను. నీ భార్యవేమో చూడు" అని వాటిని తెచ్చి రాముడికి చూపించడం జరిగింది. చీర చెరగున కట్టిన సొమ్ములను రామచంద్రమూర్తి చేతికి తీసుకుని, వాటిని చూస్తూ, కళ్లల్లో కన్నీళ్లు వస్తుంటే, అవి చూపులను అడ్డగిస్తుంటే, "హా! ప్రియురాలా! రమణీ!" అంటూ ఆరాటంగా ఆ భూషణాలను ఒత్తిపట్టుకుని పుట్టలోని పాము బుసకొట్టినట్లు పెద్ద శ్వాస విడిచాడు. "లక్ష్మణా, వీటిని నువ్వు చూడు. ఇవి సీతవే కదా?" అని అడిగాడు. జవాబుగా లక్ష్మణుడు, "అన్నా! ఈ బాహుపురులు, ఈ కమ్మలు, సీతాదేవివి అవునో–కాదో నేను చెప్పలేను. ప్రతిదినం ఆమెకు పాదాభివందనం చేసేటప్పుడు చూసేవాడిని కాబట్టి ఈ అందియలు సీతాదేవివే అని చెప్పగలను" అన్నాడు.

లక్ష్మణుడు ఇలా చెప్పగానే, సుగ్రీవుడిని రావణుడి వృత్తాంతం అడిగాడు రాముడు. ఆ రాక్షసుడు కాపురముండే దేశం కానీ, అతడి బలం కానీ, శక్తికానీ, సామర్థ్యం కానీ, ఆ నీచుడి కులంకానీ తనకు తెలియదనీ, అయినా విచారపడవద్దనీ, ఏవిధంగానైనా వాడిని కనుక్కునే మార్గాన్ని అన్వేషిస్తామనీ అన్నాడు సుగ్రీవుడు. సీతాదేవి ఎక్కడున్నా వెతికి ఆ రాక్షసుడిని బంధువులతో, కొడుకులతో, స్నేహితులతో యుద్ధంలో చీల్చివేసి రాముడి మనస్సుకు సంతోషం కలిగేట్లు చేస్తానని మాట ఇచ్చాడు.

ఇక్కడ సుగ్రీవుడు స్పష్టంగా అబద్ధం చెప్పాడు. రావణాసురుడి విషయం హనుమంతుడికి తెలియదుకాని సుగ్రీవుడికి బాగా తెలుసు. రావణాసురుడు వాలి చేతిలో ఓడిపోయి సంధి కుదుర్చుకున్నవాడే. అప్పుడు సుగ్రీవుడు కూడా అక్కడ వున్నాడు. అలాంటప్పుడు తెలిసి–తెలిసి అబద్ధం చెప్పడం మిత్రద్రోహం కాదా? కాదు. కానేకాదు. ఇప్పుడే రావణాసురుడి గురించి సుగ్రీవుడు చెప్తే చాలా తొందరలో వున్న రామచంద్రమూర్తి వెంటనే లంకమీదకు యుద్ధానికి పోదామని అనవచ్చు. వాడి బలం ఈయనకు తెలియదు. తానేమో వాలి జీవించి ఉన్నంత దాకా ఈ స్థలాన్ని విడిచి పోవడానికి వీల్లేదు. ఒకవేళ పోయినా ఇప్పుడున్న ఐదుగురితో చేయగలిగింది ఏమీ లేదు. తాము బయల్దేరిపోతే వాలి సైన్యంతో దండెత్తి వస్తాడు. వాలి, రావణుడు ఒకటైతారు. అప్పుడీయన ఎవరితోనని యుద్ధం చేస్తాడు? తొందరపాటు వల్ల కార్యభంగమే కాని అనుకూలం కావు. వాలిని చంపి రాజ్యాన్ని సుగ్రీవుడికి ఇస్తే తానూ సర్వాధికారి అవుతాడు. అప్పుడు నిర్భయంగా లంకమీదకు దండెత్తవచ్చు. ఇలా కార్యభారం, సాధన మార్గం ఆలోచించి సుగ్రీవుడు అబద్ధం చెప్పాడు. దీనివల్ల రామచంద్రమూర్తి పని పాడవలేదు. స్నేహధర్మాన్ని అనుసరించి ఆడిన అబద్ధం తప్పుకాదు.

ఈ విధంగా రామసుగ్రీవులు వారి–వారి సుఖ దుఃఖాలు ఒకరితో మరొకరు ఏకాంతంగా చెప్పుకున్నారు. ఏక నిశ్చయంతో రామసుగ్రీవులు ఇలా తమ సుఖదుఃఖాలు ఒకరికొకరు చెప్పగా, సుగ్రీవుడు తన కార్యం సఫలమైంది కదా అని మిక్కిలి సంతోషించాడు.

వాలి తనకు చేసిన కీడును గురించి సుగ్రీవుడు రాముడికి వివరంగా చెప్పాడు. తన ప్రాణాలకంటే ప్రియమైన భార్యను అపహరించాదనీ, తన స్నేహితులను, బంధువులను, చెరసాలలో బంధించాడనీ, తన ప్రాణాలను తీయడానికి ఆలోచిస్తున్నాడనీ చెప్పాడు. "వాలి మహా పరాక్రమశాలి. సూర్యుడిలాంటివాడు. శత్రువులకు భయంకరుడు. అలాంటివాడు చచ్చి నేలబడితేనేకాని నా దుఃఖాలు పోవు".

తనకు, తన అన్నకు విరోధం వచ్చిన విధం చెప్పడం ప్రారంభించాడు. "మయుడి కుమారుడు, దుందుభి సోదరుడైన మాయావి అనేవాడు స్త్రీ కారణాన వాడికీ, వాలికీ వున్న విరోధాన్ని అడ్డం పెట్టుకుని ఒక అర్ధరాత్రి అందరూ నిద్రించే సమయంలో వాలిమీదకు యుద్ధానికి వచ్చాడు. రాక్షసులతో అర్ధరాత్రి యుద్ధానికి పోవడం మంచిది కాదని నచ్చచెప్పాం. మా మాట వినకుండా వాడిమీదకు యుద్ధానికి పోయాడు".

"ఒంటరిగా రాక్షసుల మీదకు యుద్ధానికి పోతున్న అన్న వాలి వెంట నేను కూడా పోయాను. ఆ రాక్షసుడు భయంతో వేగంగా పరుగెత్తసాగాడు. ఆ దానవుడు ఒక బిలంలో ప్రవేశించాడు. అప్పుడు మా అన్న దానవుడిని చంపి వస్తానని చెప్పి లోపలికి పోయాడు. నేను బిలం బైట నిలబడ్డాను. ఒక సంవత్సరం నేనా బిలం బైటనే వుండిపోయాను. బిలంలోనుండి నెత్తురు భయంకరమైన నురుగుతో బయటకు రాసాగింది. రాక్షసుల సింహనాదాలు స్పష్టంగా వినపడ్డాయి. వాలి దీనమైన ఏడుపు వినపడ్డది. పరాక్రమం క్షీణించి వాలి రాక్షసుడి చేతిలో చిక్కాడని, మరణించాడని భావించి, కొండను ఆ బిలానికి అడ్డంగా వేసి అక్కడి నుండి వెళ్లిపోయాను. మంత్రులు నన్ను రాజ్యానికి రాజుగా చేసి, పట్టాభిషేకం చేశారు. ఆ విధంగా రాజునైన నేను రాజ్యాన్ని పాలిస్తున్నాను".

"ఇంతలో, వాలి దైత్యుడిని చంపి, నగరానికి వచ్చి, రాజ్యాన్ని కోరి తనను విడిచి వెళ్ళిపోయానని సందేహించాడు. పట్టాభిషేకం చేసుకున్న నన్ను చూసి కోపంగా చూశాడు. నన్ను తిట్టి, నా దగ్గరున్న మంత్రులందరినీ బంధించి, వాళ్లను చెరసాలలో వేశాడు. నన్ను వూరు వెడలగొట్టాడు. నా భార్యను గ్రహించాడు. అంతటితో ఆగకుండా నన్ను చంపడానికి రావడంతో ప్రాణ భయంతో అనేక దేశాల్లో తిరిగి చివరకు ఈ గుట్టకు అతడు రాలేకపోవడానికి కారణం వుండడం వల్ల ఇక్కడ స్థానం ఏర్పాటు చేసుకున్నాను. బుద్ధిపూర్వకంగా నేను ఏ అపకారం చేయలేదు. అలా అయినప్పటికీ పడరాని కష్టాలను పడుతున్నాను. నన్ను రక్షించు".

సుగ్రీవుడు జరిగినదంతా సత్యంగానే చెప్పాడు కాని, తాను రాజుగా వున్న సమయంలో అన్న భార్య తారను గ్రహించిన సంగతి చెప్పలేదు. ఈ కలహంలో మొదలు సుగ్రీవుడు మీద అనుమానం రావడం సహజమే. కాని సుగ్రీవుడు బుద్ధిపూర్వకంగా చేయాలని పొరపాటు చేయలేదు. వాస్తవంగా రాజ్యకాంక్ష వల్ల వాలికి ద్రోహం చేసినట్లయితే అతడు కిష్కింధకు వచ్చినపుడు తన బలంతో వాలిని

నిగ్రహించగలిగేవాడే! వాలిసుగ్రీవులు ఇద్దరూ ఇంచుమించు సమానమైన బలవంతులే. వాలిదగ్గర ఇంద్రదత్తహారం వుండడం వల్ల ఎక్కువ బలశాలి అయ్యాడు. హనుమంతుడు, నీలుడు లాంటివారు సుగ్రీవుడి సహాయకులు. సుగ్రీవుడు వాలితో యుద్ధానికి పూనుకుంటే ఒక్క హనుమంతుడే వాలిని మట్టుబెట్టగలడు. కాబట్టి సుగ్రీవుడిలో ద్రోహబుద్ధి లేదు.

సుగ్రీవుడి విషయంలో వాలి అనుమానపడ్డాడు. బిలద్వారం మూయడం, రాజ్యాభిషిక్తుడు కావడం ద్రోహబుద్ధితో చేశాడని నమ్మాడు. తాను జీవించి వుండగా తన భార్య తారను గ్రహించాడని కోపం వచ్చి వుండవచ్చు. అందుకే ఆ తరువాత సుగ్రీవుడి భార్యను వాలి గ్రహించాడు. అయితే సోదరుడు మరణిస్తేనే ఆయన భార్యను స్వీకరించవచ్చని ఒక మర్యాద ఆ జాతుల్లో వుంది. వాస్తవానికి వాలి మరణించాడని నమ్మి ఆయన భార్యను సుగ్రీవుడు గ్రహించాడు. కాని, సుగ్రీవుడు జీవించి ఉన్నాడని తెల్సికూడా వాలి అతడి భార్యను గ్రహించాడు. ఈ కులమర్యాదను రామచంద్రుడు కూడా ఆదరించాడు. ఎందుకంటేవాలి మరణం తరువాత సుగ్రీవుడు తారను గ్రహించాడని తెలిసీ ఆయన ఏం అనలేదు. వాలి కుల మర్యాదను, శాస్త్ర మర్యాదను ఉల్లంఘించడం వల్లే శిక్షార్హుడయ్యాడు.

సుగ్రీవుడు ఇలా చెప్పడంతో రామచంద్రమూర్తి అతడితో, "మిత్రమా! బాధపడవద్దు. నా బాణాలతో నీ పగ తీరుస్తాను. ఆ పాపాత్ముడెంతవరకు నాకంట పడడో అప్పటివరకే సుఖంగా వుంటాడు. కపీశ్వరా నా దుఃఖంలాంటిదే నీ దుఃఖం. దాన్ని ఉపశమించేట్లు చేస్తా. సంతోషించు". ఆ తరువాత దుందుభి వృత్తాంతాన్ని చెప్పాడు. వాలి, దుందుభి మధ్య జరిగిన యుద్ధంలో ఏ విధంగా వాలి దుందుభిని చంపి, వాడి కళేబరాన్ని చేతులతో పైకెత్తి, ఆమడ దూరంలో పడేట్లు విసిరి వేసింది చెప్పాడు. "అప్పుడారాక్షసుడి నోటినుండి కారుతున్న నెత్తురు గాలికి కొట్టుకుని వచ్చి మతంగాశ్రమంలో పడింది. అది చూసి మునీశ్వరుడు బాగా కోపం తెచ్చుకున్నాడు. తన తపశ్శక్తితో బలోన్మత్తుడైన వాలి చేసిన పని ఇది అనుగ్రహించాడు. వాలిమీద కోపం తెచ్చుకున్నాడు ముని. వాలి ఇక్కడికి వస్తే చచ్చిపోతాడు అని శపించాడు. అప్పటి నుండి వాలి ఇక్కడికి రాడు. ఆ విషయం నాకు తెలిసినందువల్ల భయం లేకుండా ఇక్కడ తిరుగుతున్నాను. అదిగో అదే ఆ రాక్షసుడి ఎముకల గూడు. నేలపడి వుంది చూడు. రామచంద్రా! వాలి భుజబలం ఎలాంటిదో నీకు చెప్పాను. అలాంటి మహాబలశాలి వాలిని నువ్వెలా చంపుతావో చెప్పు" అని అంటాడు సుగ్రీవుడు.

రాముడు తనలో తానే నవ్వుకుని, తన బలాన్ని ఆయన నమ్మేట్లు ప్రదర్శిస్తానని సుగ్రీవుడితో అన్నాడు. దుందుభి శరీరాన్ని దూదిలాగా తన వేలితో అవలీలగా ఎత్తి పది యోజనాల అవతల పడేట్లు చిమ్మాడు. రామచంద్రమూర్తి ఇంకా సుగ్రీవుడికి నమ్మకం కలిగేట్లు చేయడానికి, ఆయన చూపించిన మద్దిచెట్టును గురిచూసి కొట్టాడు. రామచంద్రమూర్తి వేసిన బాణం త్వరగా పోయి, ఆ ఏడు చెట్లను త్వరగా నరికి, కొండబద్దలయ్యేలా భేదించి, భూమిలో దూరి, మళ్లీ త్వరగా బయటకు వచ్చి ఆయన అంబుల పొదిలో చేరింది. తన రెండు చేతులు జోడించి, రామచంద్రమూర్తిని ప్రార్థిస్తూ తన అన్న వాలి ఆయనకు ఒక లెక్క కాదన్నాడు. అన్నను రాముడు చంపుతాడన్న నమ్మకం కుదిరింది.

◆❖◆

తార మాట వింటే వాలి బతికేవాడేనా?

తన అన్న వాలిని శ్రీరాముడు చంపుతాడన్న నమ్మకం కుదిరింది సుగ్రీవుడికి. ఆ వెంటనే సుగ్రీవుడితో రాముడు, కిష్కింధకు పోదామనీ, ఉపేక్ష చేయవద్దనీ, సోదరుడిని యుద్ధానికి పిలువమనీ, భయపడవద్దనీ అంటాడు. రాముడు చెప్పినట్లుగానే సుగ్రీవుడు కిష్కింధకు పోయి దిక్కులు పిక్కటిల్లేట్లు సింహనాదం చేసి వాలిని యుద్ధానికి పిలిచాడు. ఆ ధ్వని విన్న వాలి మండిపడుతూ యుద్ధానికి వచ్చాడు. వారిరువిరికీ ఆకాశంలోని బుధ, అంగారక గ్రహాలకు లాగా ఘోరమైన ద్వంద్వయుద్ధం జరిగింది. అప్పుడు రామచంద్రమూర్తి గురిచూసి వాలిమీద బాణం వేద్దామనుకున్నాడు కాని, ఆకారంలో సమానంగా ఒకేవిధంగా వున్న వారిద్దరినీ చూసి ఎవరు సుగ్రీవుడో, ఎవరు వాలో పోల్చుకోలేక ఆగిపోయాడు. ప్రాణం తీద్దామనుకున్న బాణాన్ని సందేహంతో రామచంద్రమూర్తి విడవలేదు. ఇంతలో వాలి దెబ్బలకు బాధపడి, వాలి వెంటపడి తరుముతుంటే ఋశ్యమూకానికి పరుగెత్తి పోయాడు సుగ్రీవుడు.

రాముడు లక్ష్మణులను చూసి సుగ్రీవుడు సిగ్గుతో తలవంచుకుని ఇలా అన్నాడు. "నీ పరాక్రమాన్ని నేను నమ్మేట్లు చేసి చూపించి, నన్ను యుద్ధానికి పొమ్మని ప్రేరేపించి, శత్రువు చేతిలో నన్నిలా చంపేట్లు చేయడానికి కారణం ఏమిటి? నా శత్రువు చేతిలో నన్ను చంపించడంవల్ల నీకు కలిగే లాభం ఏంటి రామచంద్రా? బలవంతుడా! మహాబుద్ధిమంతుడా! వాలిని చంపమని నిన్ను నేను కోరినప్పుడు చంపనని ముందే చెప్పవచ్చుకదా? నువ్వు అలా చెప్తే నేను ఎప్పటిలాగా హాయిగా ఇక్కడే పడి వుండేవాడిని కదా? నన్నెందుకు యుద్ధానికి పంపావు? నన్ను చావుదెబ్బల పాలుచేయడానికా?"

ఏడుస్తున్న సుగ్రీవుడిని చూసి రామభద్రుడు, "నా దివ్యబాణాన్ని విడవకపోవడానికి కారణం చెప్తా విను. రూపంలో, వయస్సులో, ఎత్తులో, చూడడానికి, వేషంలో, నడకలో, కాంతిలో, మాటల్లో, కంఠస్వరంలో, ధైర్యంలో, మీరిద్దరూ సమానంగా వున్నారు. ఈ కారణాన మీలో వాలి ఎవరో, సుగ్రీవుడు ఎవరో నేను గుర్తుపట్టలేక ప్రాణం తీసే బాణాన్ని వదలలేదు. ఇది ముమ్మాటికీ నిజం. నా బాణం నిన్ను చంపితే, నా బుద్ధిలేనితనం, పిల్లతనం, శాశ్వతంగా నిలిచి వుండేది కదా? కార్యభంగమే కాకుండా

శాశ్వతమైన అపకీర్తి వచ్చేది. నేను, లక్ష్మణుడు, సీత నీకు వశపడి వున్నాం. మా క్షేమం నీ చేతిలో వుంది. కాబట్టి నీకు నేను ద్రోహం చేయను. నా మాట నమ్ము. సందేహించవద్దు. మళ్లీ వాలి మీదకు యుద్ధానికి పో. నాకు తెలిసేవిధంగా నువ్వేదైనా గుర్తు ధరించు. ఆమాత్రం నువ్వు చేస్తే, నా బాణం దెబ్బకు వాలి కిందపడి చస్తాడు" అని చెప్పి లక్ష్మణుడితో "లక్ష్మణా! గజపుష్పమాల తీగె పుష్కలంగా వుంది. అది స్పష్టంగా తెలిసేట్లు తెచ్చి ఇప్పుడే సుగ్రీవుడి మెడలో వేయి". అని రామచంద్రమూర్తి చెప్పగానే లక్ష్మణుడు దాన్ని తెచ్చి సుగ్రీవుడి మెడలో వేశాడు.

ముందు లక్ష్మణుడు, వెనుక వల, నీల, తార, హనుమంతుడు రాగా రామచంద్రుడు బంగారు రేకులతో అలంకరించిన పెద్ద విల్లును, సూర్యకాంతికల బాణాలను చేతిలో ధరించి బయల్దేరాడు. వాలిని సంహరించాలన్న ఆసక్తితో వున్న శ్రీరాముడు వాలి పాలించే కిష్కింధను చూశాడు. ఈ విధంగా అందరూ వాలి పాలించే నగరానికి సమీపంలో దట్టమైన అరణ్య ప్రదేశంలో చెట్ల గుంపులున్న ఒక మరుగైన స్థలంలో నిలబడ్డారు. ఎలాంటి సింహనాదం నువ్వు చేస్తే, కోపంతో మండిపడుతూ, వాలి యుద్ధానికి వస్తాడో, అలాంటి సింహనాదం చేయమని సుగ్రీవుడితో అంటాడు రాముడు. ఇలా రామచంద్రమూర్తి స్పష్టంగా తనకు చెప్పిన మాటలు విన్న సుగ్రీవుడు, ఉరుములాగా గర్జిస్తూ, తన కంఠధ్వనిని దిక్కులు పిక్కటిల్లేట్లు చేశాడు. గుండెలు పగిలేలా సుగ్రీవుడు చేసిన సింహనాదాన్ని, ఆయన కఠోరమైన కంఠధ్వనిని విన్న వానరులు దిక్కుతోచక పరుగెత్తాయి. మేఘం ఉరుములాగా సుగ్రీవుడి కంఠధ్వని క్షణ-క్షణం పెరగసాగింది.

సుగ్రీవుడి సింహనాదం అంతఃపురంలో వున్న వాలి వినగానే అతడి మదం అణగిపోయింది. విపరీతమైన కోపం వచ్చింది. ఆ కోపంతో వాలి గ్రహణం పట్టిన సూర్యుడిలాగా హీనుడయ్యాడు. కోపాతిశయంతో మండుతున్న అగ్నిలాగా వెలుగుతూనే కాంతిహీనుడయ్యాడు. భయంకరమైన సుగ్రీవుడి కంఠధ్వని తన చెవుల్లో పడగానే, పట-పటా పండ్లు కొరికి, సుగ్రీవుడి మీదకు యుద్ధానికి పోవడానికి సన్నద్ధమయ్యాడు. ఆ సమయంలో వాలి భార్య తార ఆయనను అడ్డుకుని ఆయనకు మేలుజరిగే మాటలను తొట్రుపాటుతో ఇలా చెప్పింది.

"ఈ కోపాన్ని వదిలిపెట్టు. సూర్యోదయం కాగానే నువ్వు యుద్ధానికి పోవచ్చు. ఇప్పుడే పోకపోతే నీకు వచ్చే అవమానం కానీ, నీ విరోధికి కలిగే గౌరవం కానీ ఏమీ లేదు. ఆలోచించు. ఇప్పుడే పోతే వచ్చే నష్టం ఏంటి? అంటావా? ఇప్పుడు యుద్ధానికి పోకూడదు. దానికి కారణం ఏమిటంటావా? ఇంతకు కొద్దిసేపటి క్రితమే నీ భుజబలం ముందు సతమతమై, బలహీనుడుడై పరుగెత్తిపోయాడు. ఇంతలోనే మళ్లీ యుద్ధానికి నిన్ను పిలిచే ధైర్యం, సాహసం ఎక్కడినుండి వచ్చింది? కాబట్టి నాకు ఏదో సందేహం కలుగుతున్నది. అతడు చేస్తున్న సింహనాదం ఇదివరకు చేసినట్లు లేదు. ఇప్పుడు, బలం, చలం, బలమైన యత్నం, చాలా గొప్పగా కనిపిస్తున్నది. ఇలా కావడానికి కారణం ఏదో వుండాలి. కారణం లేకుండా కార్యం వుంటుందా? ఏదో బలిష్టమైన సహాయం దొరక్కుండా ఇలా మళ్లీ యుద్ధానికి రాడని నా అభిప్రాయం. బలిష్ట సహాయం దొరక్కపోతే అలాంటి సింహనాదం చేయడు. బాగా ఆలోచించి, పరీక్షించి, నిస్సందేహంగా బలిష్టుడని అనుకున్నవాడితో వస్తాడు కానీ, అల్పులతో రాడు".

"ఇంతకుముందే నేనీ వృత్తాంతాన్ని విన్నాను. మన అంగదుడే నాకీ సంగతి చెప్పాడు. అతడు అరణ్యానికి పోయి మరలి వచ్చేటప్పుడు మన వేగులవాళ్ళు చెప్పారట. రఘువంశంలో పుట్టిన రామలక్ష్మణులు అనేవాళ్లు, నువ్వు పోలేని ఋశ్యమూకంలో నీ తమ్ముడికి సహాయం చేయడానికి వచ్చారట. వాళ్లలో రాముడనేవాడు శత్రువులపాలిటి కాలాంతకుడు. ప్రళయకాలాగ్నిలాంటివాడు. ఉచితానుచిత విద్యల్లో సమర్థుడు. సుగ్రీవుడికి రక్షకుడైన వాడు నీకెందుకు కాకూడదని అంటావా? నిన్నెందుకు శిక్షిస్తాడంటావా? సుగ్రీవుడు ఆయన్ను ఆశ్రయించాడు. నువ్వు ఆశ్రయించలేదు. కాబట్టి నీకు ఆయన రక్షకుడు కాలేదు. అదే కాకుండా, ఆయన్ను ఆశ్రయించిన సుగ్రీవుడికి నువ్వు విరోధివి. నిన్నెలా రక్షిస్తాడు? సుగ్రీవుడు ఎప్పుడైతే అతడు శ్రీరామచంద్రమూర్తిని ఆశ్రయించాడో, అప్పుడే సాధువయ్యాడు. నువ్వు పోయి ఆశ్రయిస్తే నిన్నూ రక్షిస్తాడు. సర్వకల్యాణ గుణాలకు రామచంద్రమూర్తి స్థానం. నేను నీ దోషాలు ఎత్తి చూపడానికి ఇవన్నీ చెప్పడం లేదు. నా మాట విను. విని నడుచుకుంటే నీకు మేలు కలుగుతుంది".

"రామచంద్రమూర్తితో విరోధం పెట్టుకోవడం సరైంది కాదు. అది దోషం. దానివల్ల మేలు కలగదు. అందుకే, నేను, నాకు తోచిన ఉపాయం చెప్తా విను. ఆ తరువాత నీకేది మంచిదో అదే చేయి. సుగ్రీవుడికి యౌవరాజ్యం ఇచ్చేయి. వాడూ మహాబలవంతుడే. అలాంటి వాడితో నీకెందుకు అనవసర విరోధం? నా మనవి విను. రామచంద్రమూర్తితో స్నేహం చేయడం నీకు శ్రేయస్కరం, శుభకరం. అదెలా కుదురుతుంది అని అంటావా? నీ తమ్ముడిమీద పగ వదలిపెట్టు. నువ్వాపని చేస్తే రామచంద్రమూర్తి నిన్ను ద్వేషించడు. నీకు వాడొక్కడే తమ్ముడు. వాడు తప్ప నిన్ను అన్నా అని పిలిచేవాడు ఎవరూ లేరు. వాడు కూడా దుర్మార్గుడు కాదు. దుష్టుడు కాదు. ఉత్తమ గుణాలు కలవాడు. నీమీద వినయవిధేయతలున్నాయే కాని, నిన్ను వాడు ధిక్కరించేవాడు కాదు కదా? వాడు నీకు తమ్ముడు కాదా? నీకేమైనా శత్రువా? వాడు, నువ్వు ఒక్క గర్భంలో పుట్టారుకదా? అతడిని గౌరవించి దగ్గర వుంచుకో. తమ్ముడి విషయంలో ద్రోహం మానుకో. ఇంద్రుడి తేజస్సుకల రామచంద్రమూర్తితో విరోధం వద్దు. శాంతించు"

తార ఈ విధంగా ఎంత హితం చెప్పినా వాలి చెవులకు ఎక్కలేదు. కాలం దాపరించినవాడు హితవాక్యాలు వింటాడా? తార ఇలా చెప్పడంతో, వాలికి కోపం వచ్చింది. అలా చెప్పడం తారకు తగదని ఆమెతో ఇలా అన్నాడు. "ఈ విధంగా మాట్లాడడం నీకు న్యాయమా? వాడు నాకు తమ్ముడా? తమ్ముడే అయితే మితిమీరిన గర్వంతో చెలరేగి, సింహనాదాలు చేసి, పరాక్రమవంతుడనని భావించి నన్ను యుద్ధానికి పిలుస్తాడా? ఇలాంటివాడిని ఎలా క్షమిస్తాను? శూరులకు ప్రాణాలు తీపి అని అనుకుంటున్నావా? పరాజయం అంటే ఏమిటో తెలియనివారికి, యుద్ధంలో వెనుకడుగు వేయని, తిరస్కరించబడని వారికి, విరోధులు చేసే అవమానం కంటే చావడమే మేలు. నామీదికి యుద్ధానికి వచ్చినవాడు శూరుడా? సింహనాదాలు చేస్తాడా? నేనేమో బలహీనుడినా? వాడి రంకెలు విని సహించేటంత ఖర్మ నాకెందుకు? ఇక రామచంద్రమూర్తి నన్ను చంపుతాడని కదా నువ్వు భయపడ్తున్నావు? నువ్వు భయపడాల్సిన కారణం లేదు".

"ఆయన నాకపకారం చేయడు. ఎందుకంటే, ఆయన ధర్మం అంటే విశేష ప్రీతికలవాడు.

మేలెరిగినవాడు. ఇలాంటివాడు నిష్కారణంగా నన్నెందుకు చంపుతాడు? నువ్వు ఇతర స్త్రీలతో అంతఃపురానికి వెళ్లు. నామీద నీకున్న భక్తివల్ల ఇంత చెప్పావని నాకు తెలుసు. యుద్ధానికి పోయి శత్రువును కొట్టి, నీ మరది భుజబల గర్వం అణచి వస్తాను. వాడిని చంపను. నామాట నమ్ము. వాడికి బలం లేదు. గొంతు లేదు. అలాంటివాడి సింహనాదాన్ని సహిస్తానా? నా ప్రాణం మీద ఒట్టు పెడుతున్నాను. నా విజయం కాంక్షించి వెళ్లిపో" అని వాలి చెప్పగానే తార ప్రదక్షిణ చేసి, మంగళాశాసనాలు చెప్పి స్త్రీలతో సహా సన్నటి గొంతుతో ఏడ్చుకుంటూ అంతఃపురానికి పోయింది. ఇలా తార ఇంటికి వెళ్లిపోగానే వాలి అసమాన కోపంతో ఉరు విడిచి పోయాడు.

అధిక రోషంతో విరోధిని చూడాలన్న కోరికతో వున్న వాలికి సుగ్రీవుడిని చూడగానే ఉత్సాహం కలిగింది. వెంటనే, కట్టువస్త్రాన్ని చక్కగా బిగించి, కడుకోపంతో, సుగ్రీవుడికి ఎదురుగా పోయాడు. అలా వస్తున్న వాలిని బంగారుమాలిక ధరించిన సుగ్రీవుడు, చూసి, అదురు-బెదురూ లేకుండా ముందుకు పోయాడు. తనకెదురుగా వస్తున్న తమ్ముడిని చూసి వాలి, కోపంతో తన ముష్టిని చూపిస్తూ, అది అతడిని వజ్రంలాగా భేదిస్తుందన్నాడు. పరుగెత్తి పోవద్దని అన్న వాలికి సమాధానంగా తన ముష్టిని చూపాడు సుగ్రీవుడు. వాలి తలను చింతకాయలాగా చేస్తానంటాడు. ఆమాటలకు కోపించిన వాలి, సుగ్రీవుడిని సమీపించి గట్టి పిడికిలితో కొట్టాడు. ఆ దెబ్బకు ప్రతిగా, తన శరీరం నుండి నెత్తురు కారుతున్నప్పటికీ, ఒక చెట్టు పీకి గిరగిరా తిప్పి వాలిని కొట్టాడు సుగ్రీవుడు. ఆ దెబ్బకు బలవంతుడైనప్పటికీ వాలి గడగడ వణికాడు. కలవరపాటు చెందాడు కాసేపు. వాలిసుగ్రీవులిలా ఒకరినొకరు జయించగల వారిలాగా, భయపడకుండా, వెనుదీయకుండా, ఆకాశాన సూర్యచంద్రుల్లాగా భూమ్మీద యుద్ధరంగంలో ప్రకాశించారు.

వాలి శౌర్యం క్రమంగా పెరగసాగింది. సుగ్రీవుడి బలం క్రమంగా తగ్గసాగింది. అయినా సుగ్రీవుడు యుద్ధం చేస్తూనే వున్నాడు. ఒకరినొకరు ముష్టిఘాతాలతో, చేతులతో, చెట్లతో, కాళ్లతో, గోళ్లతో, దీరుల్లాగా తమ ఇష్టం వచ్చినరీతిలో యుద్ధం చేశారు. ఒకరినొకరు సమీపించి చెట్లతో కొట్టుకుంటూ, ఒకరినొకరు నేలమీద పడేసుకుంటూ, పిడికిలి గుద్దులతో నొప్పించుకుంటూ, వీర్యంగా తాకుతూ యుద్ధం చేశారు. సుగ్రీవుడి బలం క్రమక్రమంగా క్షీణించింది. వాలితో దెబ్బలు తిని నలుదిక్కులా చూడసాగాడు.

తన స్నేహితుడు, తాను అభయహస్తం ఇచ్చిన వాడు, తననే నమ్మినవాడు, శరణాగతుడు, సుగ్రీవుడు తన కళ్ళ ముందరే శత్రువు చేతిలో ప్రాణాంతక బాధ పడడం చూసిన శత్రుసంహరణ దక్షుడైన శ్రీరాముడు, వాలిని చంపగల భయంకర బాణాన్ని తీసి అల్లెతాటిలో చాలా వేగంగా కూర్చాడు. ఆ అల్లెతాటి శబ్దానికి ఆకాశంలో తిరిగే పక్షులు, నేలమీద తిరిగే మృగాలు భయపడి తమ స్థానాల్లో వుండలేకపోయాయి. వజ్రాయుధంలాగా, వేగంగా, పిడుగులాగా, రామచంద్రమూర్తి విల్లు నుండి వెలువడిన బాణం వాలి రొమ్మును తాకింది. ఆ బాణం తాకగానే ఇద్రధ్వజంలాగా బలం క్షీణించి, వాలి నేలకూలాడు.

◆❖◆

శ్రీరాముడు వాలిని చంపడం అధర్మమా?

శ్రీరాముడి బాణం దెబ్బకు వాలి నేలమీద పడిపోయినప్పటికీ, ఆయన తేజం కాని, పరాక్రమం కానీ, ప్రాణాలు కానీ విడువలేదు. ఇంద్రుడు ఇచ్చిన ఆయన మెడలోని బంగారు సరం వాలి తేజస్సు, ప్రాణాలు, పరాక్రమం, కాంతి పోకుండా కాపాడాయి. బంగారు సరంతో, ప్రాణాలు తీస్తున్న బాణంతో, నిర్మలమైన శరీరంతో వాలి మూడురంగుల ప్రకాశించాడు. శత్రువులను సంహరించే శక్తికల వాలికి, స్వర్గానికి పంపే శక్తికల రామబాణం ముక్తిని కలిగించింది. తాను నేలపడేసిన వాడెలాంటివాడో చూడాలనుకుని వాలిని సమీపించాడు శ్రీరాముడు. తనను సమీపించిన రామచంద్రుడిని చూసిన వాలి ధర్మంతో, వినయంతో కూడిన, కఠినమైన మాటలతో ఇలా అన్నాడు.

"రామా! నువ్వు రాజకుమారుడివి. శాస్త్రజ్ఞానం చక్కగా తెలిసనవాడివి. గొప్పవంశంలో పుట్టావు. కీర్తికి నువ్వు నెలవైనవాడివి. ఇలాంటివాడివై వుండి కూడా యుద్ధభూమిలో నేను ఇతరులతో యుద్ధం చేస్తున్న సమయంలో, చాటున వుండి నా రొమ్ముమీద కొట్టడంలో ఏం గొప్ప వుందో చెప్పు. రామచంద్రా! రాముడు కరుణాజ్ఞానం కలవాడనీ, ప్రజల మేలు కోరేవాడనీ, దయాలక్ష్మికి స్థానమైనవాడనీ, ఉచితానుచితజ్ఞానం కలవాడనీ లోకులు నిన్ను పొగడుతుంటారు. తార నన్ను యుద్ధానికి పోవద్దని, సుగ్రీవుడికి సహాయంగా రాముడు వచ్చాడనీ, ఆయన నన్ను చంపుతాడనీ చెప్పినా వినకుండా వచ్చాను. రాజులకుండే ఉచితమైన సద్గుణాలు రాముడిలో లేకపోతాయా, నన్నేల నిరపరాధిని చంపుతాడని వచ్చాను. నీ చేతుల్లో చచ్చాను. నేను అంటున్న రాజగుణాల్లో ఒక్కటికూడా నీలో లేదు. నువ్వేం రాజువి? సుగ్రీవుడు చెప్పాడని తొందరపడి, కోపగించి, గుణదోషాల విచారణ చేయకుండా, ఇతరులతో యుద్ధం చేసేవాడిని ఎలా చంపాలన్న ఆలోచన చేయక, ధర్మచింతన చేయక, ఎదురుపడి యుద్ధం చేసే ధైర్యం లేక, సత్యాసత్యాలు తెలుసుకోకుండా, పిరికివాడిలాగా దూరంగా మాటువేసి, నీకే అపకారం చేయని నన్ను దండించావు కదా? నువ్వు మోసగాడివి అని తార తెలుసుకుంది కాని నేను తెలుసుకోలేక పోయాను".

"రాముడు గొప్పవంశంలో పుట్టాడు కాబట్టి గొప్ప గుణాలు కలవాడై వుంటాడనీ, కళ్యాణ గుణాల మనోహరుడు కాబట్టి హేయ కార్యాలు ఎందుకు చేస్తాడనీ, నేను ఇతరులతో యుద్ధం చేస్తున్నప్పుడు నామీదకు ఎలా వస్తాడనీ, నన్నెందుకు చంపుతాడనీ, ఇలాంటి అకార్యం ఎందుకు చేస్తాడనీ భావించి, నీ ముఖం ఎన్నడూ చూడని కారణాన మోసపోయి ఈ విధంగా యుద్ధానికి వచ్చి నీచేతుల్లో ప్రాణాలు పోగొట్టుకున్నాను. రాజవేషం ధరించిన పాపపు నడవడికలవాడివి నువ్వు. మాయలమారివి. ఈ వాస్తవం తెలుసుకోలేక బుద్ధిహీనతవల్ల ఇలా అయిపోయాను. నీకు నామీద కలహకారణం లేదు. అడవుల్లో వుండి మా ఇష్టప్రకారం ఏదో ఆ వేళకు దొరికిన కాయకూరలు తింటూ బతికే కోతులం. కాబట్టి నీకూటికి అడ్డం రాలేదు. ఇలాంటి నన్ను యుద్ధం చేస్తున్న సమయంలో చంపడానికి కారణం ఏంటి? రాజుల వంశంలో పుట్టి వేదాలను అధ్యయనం చేశావే? ఎందుకీ విధంగా ధర్మాత్ములు ధరించాల్సిన వేషాలు వేసుకుని లోకులకు కీడైన క్రూర కార్యం చేయతలపెట్టావు?".

"మేం అడవుల్లో తిరిగేవాళ్ళం. మీరు నగరాల్లో తిరిగేవారు. మేం పండ్లు, కందమూలాలు తిని జీవించే మృగాలం. మీరు ఇష్ట మృష్టాన్నాలు తింటారు. నేనేమో మృగాన్ని. నువ్వో మనుష్యుడివి. నేను నీ సేవకుడిని. నువ్వు రాజైనా బుద్ధిలేనివాడివయ్యావు. రాజులైనవారు ధర్మవశులై నడచుకోవాలికాని మేమే ప్రభువులం, మేమెలా చేసినా కాదనేవారెవరు? అని ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించకూడదు. నువ్వేమో ఇంద్రియాల వల్ల కలతచెంది, కామమే సర్వకాల-సర్వావస్థలలో ముఖ్యమని భావిస్తూ, అది నెరవేరకపోతే కోప్పడుతూ, చెడు-మంచిరాజుల మిశ్రమ నడవడికలవాడివై ప్రవర్తిస్తున్నావు. దానివల్ల నువ్వు మంచివాడివో, చెడ్డవాడివో మాలాంటి వాళ్లకు అర్థం కావడం లేదు. నిన్ను శిష్టుడవని నమ్మలేం, దుష్టుడవని అనలేం. విల్లే ప్రధాన సాధనంగా తలచి, కలహానికి కాలుదువ్వుతూ, బలవంతుడినన్న గర్వంతో, ధర్మం విడిచి మర్యాద వదిలావు".

"ధర్మం రక్షించడంలో నీకు విశ్వాసం లేదు. ధర్మరక్షణ వ్యర్థమని నీ అభిప్రాయం. కోరికల మీద మనసు పోనిచ్చి, ఇంద్రియాలకు వశపడి , అవి ఎలా ఈడుస్తే అలా పోతున్నావు. నీ విషయంలో నేను ఏ రకమైన దోషం చేయలేదు. ఇలాంటి నిరపరాధిని నన్ను నీ బాణంతో చంపావు. ఈ నింద పోవడానికి సజ్జనుల సభలో నువ్వేమని సమాధానం చెప్తావు? నువ్వు రాజవంశంలో పుట్టతగిన వాడివికాదు. రామచంద్రా! ఏం మగవాడివయ్యా? నీ మగతనం నీ భార్యను అపహరించిన వాడిమీద చూపలేకపోయావు కాని, నీజోలికి రాకుండా తటస్థుడిగా వున్న నామీద చూపావుకదా! రామా! నా కంటి ఎదురుగా నిలబడి నువ్వు నాతో యుద్ధం చేస్తే నిన్ను నేను నిమిషంలో రుద్రభూమికి పంపేవాడిని కదా? నేనెంత శౌర్యం కలవాడినైనా చాటుగా వుండి విడిచిన నీ బాణం వల్ల చావాల్సి వచ్చింది కదా?"

"రామా! నీ కథ నాకు కొంచెమైనా చెప్పలేదు. చెప్పినట్లయితే, నువ్వే కారణాన సుగ్రీవుడు కోరిక తీర్చడానికి నన్ను చంపావో, ఆ కపటచిత్తుడైన రావణుడిని యుద్ధంలో కొట్టి, మెడలు వంచి పట్టుకుని, ఇక్కడికి ఈడ్చుకుంటూ తీసుకొచ్చేవాడినికదా? సీతను ఒక్కపూటలో తీసుకునిరానా? గోటితో పోయేదానికి గొడ్డలిని వెతికావుకదా? నా మరణానంతరం తండ్రి రాజ్యభాగంలో అర్హుడైన సుగ్రీవుడు నన్ను ఆ రాజ్యం కొరకు చంపడం న్యాయమే. కాని, ఏ సంబంధంలేని నువ్వు వక్రమార్గంలో నన్ను

చంపావు. ఇది తమస్సుతో చేసింది. అధర్మమైనది".

అని, నోరు ఎండుతుంటే, బాణం బాధతో శరీరమంతా మండుతుంటే, బాధ సహించలేక శ్రీరాముడిని వూరికే చూసుకుంటూ తేజోహీనుడై వాలి పడిపోయాడు. వాలి తనను దూషించిన వాక్యాలకు శ్రీరామచంద్రుడు సమాధానం చెప్పాడు. దీనికొరకే వాలి వెంటనే మరణించే విధంగా బాణం వేయకుండా కొన ఉపిరి వుండేట్లు వేశాడు రాముడు. వాలి చనిపోయేట్లు బాణం వదులుతే రామచంద్రమూర్తి వాలిని వధించడానికి కారణం తెలియక లోకులు ఆయన్ను పలురకాలుగా నిందించి వుండేవారు. రాముడు తగిన సమాధానం చెప్పినప్పటికీ కొందరు దుష్టులు ఇప్పటికీ ఆయన్ను నిందిస్తూనే వున్నారు కదా!

ధర్మార్థయుతంగా, హితంగా, కఠినంగా, అవివేకంగా వాలి పలికిన మాటలకు, ధర్మార్థ గుణ సహితంగా రామచంద్రమూర్తి ఇలా అన్నాడు. "ఓయీ! ధర్మమని, అర్థమని పలికావు. సంతోషమేకాని ధర్మం ఏవిధంగా ఆచరిస్తే పురుషార్థమవుతుంది? ఎప్పుడు అది పురుషార్థం కాదు? అర్థం, కామం ధర్మంతో కూడి వుండేట్లు చేయాల్నా? ఈ విషయం నువ్వు ఆలోచించావా? పోనీ కుల సంప్రదాయం అంటావా? శాస్త్ర విషయంలో సందేహం వస్తే శిష్టాచారం కదా ప్రమాణం? అది ఎలా వుందో ఆలోచించావా? ఏ ఆలోచన చేయకుండా పిల్లతనంగా నన్ను దూషిస్తే నీకు కలిగే లాభం ఏమిటి? పోనీ నువ్వు అడవిలో వుండేవాడివు కాబట్టి నీకు ధర్మశాస్త్రం ఎలా తెలుస్తుందంటావా? తెలుసుకోక పోవడం నీ తప్పు. (ignorance of law no excuse). నువ్వు కులగురువులనో, కులంలో పెద్దలనో, శాస్త్రం తెలసిన పండితులనో, ఆచార శుద్ధులనో అడిగావా? ఎందుకు అడగలేదు? ఇదంతా ఆలోచించకుండా నన్ను దూషిస్తే లాభం ఏంటి?".

"ఓయీ! కొండలతో, అడవులతో, తోటలతో, తోపులతో కూడిన ఈ భూమంతా ఇక్ష్వాకుల కాలం మొదలు ఇప్పటిదాకా మా వంశంలో పుట్టిన రాజులదని నీకు తెలుసా? ఈ కారణాన నువ్వు ఇక్ష్వాకు వంశంవారికి సామంతరాజువేకాని స్వతంత్ర ప్రభువువు కాదు. ఇలా వాళ్లు సార్వభౌములైనందువల్ల వారి రాజ్యంలోని సమస్త జనులను, మృగాలను, పక్షులను కూడా రక్షించడానికి, శిక్షించడానికి వారికి అధికారం వుందని తెల్సుకో. ధర్మరక్షణ కొరకు తిరిగే మేం, స్వధర్మాన్ని తప్పకుండా, భూమ్మీదకల అధర్మాత్ములను భరతుడి ఆజ్ఞమేరకు దండిస్తాం. నువ్వు ధర్మాన్ని వదిలి కఠినమైన, నింద్యమైన కార్యం చేస్తూ అధర్మయుక్తమైన కామాన్నే ప్రధానంగా స్వీకరించి రాజధర్మాన్ని తప్పావు. ఇది నీకు తగునా? నిన్ను చంపిన కారణం చెప్తా విను. సజ్జనులు శ్లాఘించే సనాతన ధర్మాన్ని వదిలి నీ తమ్ముడు బతికుండగా అతడి భార్యను, నీ కోడలి లాంటి రుమను నువ్వు పాపమార్గంలో దుష్కామంతో పొందావు. నీతమ్ముడి భార్యను నువ్వు చెరిచిన కారణాన నిన్నీవిధంగా చంపాల్సి వచ్చింది".

"నిన్ను దండించడానికి నేనెవర్ని అంటావేమో? చెప్తా విను. నేను క్షత్రియుడుగా పుట్టాను. సనాతన ధర్మాన్ని 'క్షతమ్' (చెడి పోకుండా) కాకుండా రక్షించే వాడే క్షత్రియుడు. కాబట్టి ధర్మరక్షణ అనేది నాకు పుట్టుకతో వచ్చిన అధికారం. నేను సింహాసనం అధిష్టించినా, అధిష్టించకున్నా ఈ కార్యం నాకు తప్పదు. అది తప్పితే నేను నా స్వధర్మాన్ని తప్పినట్లే. ధర్మరక్షణ విషయంలో నాకెక్కువ అధికారం వుంది.

రాజకుమారుడినైన నేను ధర్మాన్ని లక్ష్యం చేయకుండా కామమే ప్రధానంగా చేసుకుని అతిపాపం చేస్తున్న నిన్ను ఎలా క్షమిస్తాను? ఎలా సహిస్తాను? ఇది సాధ్యమా? నా భార్యను రావణుడు ఎత్తుకుని పోవడం అధర్మమని కదా నువ్వు వాడిని కొట్టి తెస్తానన్నావు. అలాగే పరుడి భార్యను, అదీ తమ్ముడి భార్యను, కోడలులాంటి దానిని పూర్తిగా చెరిచిన నిన్ను ఏం చేయాలో నువ్వే చెప్పు?".

"వాలీ! నా మనసులో లక్ష్మణుడు ఎలాగో స్నేహం విషయంలో సుగ్రీవుడు అలాంటివాడే. నావల్ల సుగ్రీవుడికి కలిగే లాభం ఏంటి అంటావా? లక్ష్మి, భూమి, భార్య. అతడి వల్ల నాకు కలిగే లాభం సీతను వెతకడం. ఆ పని అతడు చేయగలడు. మా స్నేహంవల్ల నాక్కావలసింది నాకవుతుంది, అతడికి కావాల్సింది అతడికి దక్కుతుంది. ఇలాంటి స్నేహాన్ని ఏ కారణాన ఉపేక్ష చేసి నీతో స్నేహం చేయమంటావు? ఇంతకంటే ఎక్కువ మేలు నువ్వేం చేస్తావు నాకు? నీ భార్యను హరించిన వాలిని చంపుతానని, వానర రాజ్యాన్ని, ఆయన భార్యను ఆయనకు అప్పగిస్తానని సుగ్రీవుడికి మాట ఇచ్చాను. ఈ మేరకు వానరుల సమక్షంలో ప్రతిజ్ఞ చేసాను. అలా నిండు మనస్సుతో ప్రమాణం చేసి మాట తప్పవచ్చా? కాబట్టి నా స్నేహితుడి కార్యసాధన కొరకు కూడా నిన్ను చంపాను. నువ్వు నిర్దోషివైనా, నా స్నేహితుడుకి విరోధివైనందున నాకు కూడా నువ్వు విరోధివే. నిన్ను చంపడానికి అనేక కారణాలున్నాయి. నువ్వు తనకు విరోధివని సుగ్రీవుడు చెప్పినంత మాత్రానే నేను నమ్మి నిన్ను చంపలేదు. నా కళ్లముందర నా స్నేహితుడు, నా ఆశ్రితుడు, నాకు శరణాగతుడు వేరేవాళ్ల చేతిలో చంపబడడం నేను అలా చూస్తూ సాక్షిగా వుండడం ధర్మమా?".

ఇలా వాలికి అనేక రకాలుగా ధర్మ శాస్త్ర వాక్యాలను చెప్పాడు శ్రీరాముడు. శ్రీరాముడి మాటలకు సమాధానపడి తనను క్షమించమని కోరాడు వాలి. చెప్పినదంతా సత్యమనీ, దాంట్లో కొంచెమైనా సందేహం లేనేలేదనీ, జ్ఞానం లేకపోవడంతో తానేదేదో అన్నాననీ, తన్ను క్షమించమనీ, తాను ఆయన చేతిలో యుద్ధంలో చనిపోయి ఉత్తమలోకాలకు పోతున్నాననీ, తన మరణానికి చింతించవనీ, సుగ్రీవుడి మీద ఏ ప్రేమ వుంచాడో ఆ ప్రేమ అంగదుడిమీద కూడా వుంచమనీ అన్నాడు.

ఇలా చెప్పిన వాలిని సమాదానపర్చాడు రాముడు. "నువ్వు పాపకార్యం చేశావు కాబట్టి నేను నిన్ను దండించాను. దానివల్ల నువ్వు పాపరహితుడివై ఈ దేహాన్ని విడిచి నిర్మలమైన దేవతాస్వరూపాన్ని ధర్మ మార్గంలో పొందేవాడివయ్యావు. నిన్ను దండించకపోతే నువ్వు నరకానికి పోయేవాడివి. నేను నిన్ను చంపడం ఏమాత్రం అధర్మం కాదు" అన్నాడు. "రామచంద్రా! మహానుభావా! నువ్వు ప్రయోగించిన వాడి బాణం నిప్పులాగా నన్ను కాలుస్తుంటే, ఆ బాధతో తెలివిహీనుడనై నిన్ను తిట్టాను. రామచంద్రా! నన్ను క్షమించు" అన్నాడు వాలి. అలా అంటూనే కొన ఊపిరితో నేలకొరిగాడు.

◆❖◆

సుగ్రీవుడి పట్టాభిషేకం రామకార్యానికేనా?

వాలి, సుగ్రీవులు యుద్ధం చేస్తుంటే దూరం నుండి రామచంద్రమూర్తి వేసిన బాణం తాకిడికి పెద్ద మూర్ఛ వచ్చినందున వాలి బాధతో నేలకొరిగాడు. అంతకు ముందే సుగ్రీవుడు కొట్టిన దెబ్బలకు వాలి కీళ్లు బాగా నొప్పి కలిగించాయి. దానికి తోడు, రామబాణం మేకులాగా శరీరానికి గుచ్చుకుంది. ఈ కారణాన కాళ్లలో బలం పోయి కదిలించలేక, బాణం బాధకు విలవిల్లాడాడు. ఇక అక్కడ కిష్కింధలో వున్న తారకు తన మగడు చనిపోయాడన్న వార్త తెలిసింది. వాలిని చూడాలన్న కోరికతో త్వరత్వరగా కొడుకుతో సహా కిష్కింధ వదిలి వచ్చింది. రామ బాణం దెబ్బకు పడిపోయిన భర్త పాదాల దగ్గరకు పోవాలనుకుంది.

వాలిని దూరం నుండే చూసి, కీళ్లు సడలిపోగా, నడవలేక–నడవలేక, భర్తను సమీపించి, వాలిని, ఆయనను బాణంతో చంపిన శ్రీరాముడిని, పక్కనే వున్న లక్ష్మణుడిని, ఈ పనంతా వారితో చేయించిన సుగ్రీవుడిని చూసింది. వాలిని సమీపిస్తూనే, బాణం తాకిడికి నేలమీద పడివున్న ఆయన్ను చూసి, మూర్ఛిల్లి, నిలబడి, గాఢనిద్ర నుండి లేచినదానిలాగా "ప్రియనాథా! మనోహరా!" అని ఏడ్చింది. ఇలా ఏడుస్తున్న వదినను, చావడానికి సిద్ధంగా వున్న అన్నను, సుకుమారుడైన బాలుడు అంగదుడిని చూసిన సుగ్రీవుడు దుఃఖంతో వేడి కన్నీళ్లు కార్చాడు. తార అక్కడే వున్న కొడుకు అంగదుడిని చూసి, "కుమారా! ఇక్కడికి రా. ధర్మప్రీతికల నీ తండ్రిని కరువుతీరా చూడు. ఇదే కడసారి చూపు. ఇకమీద నీ తండ్రిని నువ్వు చూడాలనుకున్నా ఆ అదృష్టం నీకు లేదు. ఇంక ఎవరిని నువ్వు నాయనా అని పిలుస్తావు?"

అలాగే వాలిని ఉద్దేశించి, "ఇదిగో, వీడే అంగదుడు. చూడు. సర్వకాలం ముద్దుగా పెంచుతే అలాగే పెరిగాడు. నీ ఎదుట మాట్లాడడానికే భయపడుతాడు. అలాంటప్పుడు, కోపం కల పినతండ్రికి సేవ ఎలా చేస్తాడో? చేయకపోతే ఏమవుతుందో? (భర్తమీద పడి) వానరేశ్వరా! వీడే నీ కొడుకు. కళ్ళు కొంచెం తెరిచి చూడు. ఎందుకేడుస్తున్నావని సమాదానపర్చు. వానరేంద్రా! నిన్ను చంపి రామభద్రుడు గొప్ప పని చేశాడు. అదేంటంటావా? సుగ్రీవుడికి చేసిన ప్రమాణం సార్థకం చేసి ఆ అప్పు తీర్చుకున్నాడు. (సుగ్రీవుడిని చూసి) సుగ్రీవా! విరోధం పోయేట్లు అన్నను చంపావు. ఇక హాయిగా రుమతో, రాజ్యరమతో

సుఖపడు. (మళ్లీ వాలిని చూసి) ప్రియా! నీ ప్రియురాళ్ళందరూ ఇక్కడ ఏడుస్తున్నారు. వాళ్లతో ఒక్క మాట మాట్లాడకూడదా?'' అన్నది తార.

అలా ఏడుస్తున్న తారతో హనుమంతుడు ఇలా అన్నాడు. "దేవీ ఎందుకు ఏడుస్తున్నావు? ఏడవడం మాను. ఎవరైనా కర్మకు తగ్గ ఫలితం అనుభవించక తప్పదు. పుణ్యకర్మకు శుభం, పాపకర్మకు కీడు కలిగించడానికి వారివెంట పరలోకానికి పోవడం జరుగుతుంది. అలాగే వాలి కూడా తన శుభాశుభ కర్మఫలం అనుభవించడానికి పోయాడు. దీనికోసం నువ్వు సుగ్రీవుడిని కాని, రాముడిని కాని నిందించాల్సిన అవసరం లేదు. వారు నిమిత్తమాత్రులే. నీ కొడుకు అంగదుడు బాలుడు. వాడు జీవించి వున్నాడు. అలాంటివాడిని నువ్వు కాకుండా మరెవ్వరు రక్షిస్తారు?''

"వాలికొరకు ఎందుకు ఏడుస్తున్నావు? లోకంలో చేయాల్సినవన్నీ చేసి లోకాన్ని వదిలాడు వాలి. అంగదుడికి, కపిశ్రేష్టులకు, భల్లూక శ్రేష్టులకు, కపిరాజ్యానికి నువ్వే దిక్కు. సమస్త భారం నీమీదే వుంది. ఏడవడం ఆపుచేయి. క్రమక్రమంగా నీ సహాయంతో నీ కొడుకు రాజ్యం చేయడం నువ్వు చూసి సంతోషిస్తావు. కాబట్టి ఇలా దుఃఖపడవద్దు. భవిష్యత్ లో నీకు, నీకొడుక్కు రాగల కష్టం ఏదీ లేదు. కాబట్టి వర్తమానంలో జరగాల్సింది ఆలోచించు. నీ కొడుకును తండ్రికి ఉత్తర క్రియలు చేయనివ్వు. అంగదుడు తండ్రికి సంస్కారం చేయగా అతడి రాజ్యాన్ని స్థాపించి నువ్వు దుఃఖం పోగొట్టుకుంటావు''.

ఇలా వీళ్లు మాట్లాడుకునే సమయంలో కొంచెం ఊపిరికల వాలి మెల్లగా ఊపిరి పీల్చుకుంటూ కళ్లు విప్పి, తన దగ్గర వున్న అంగదుడిని, అతడి సమీపంలో వున్న సుగ్రీవుడిని చూసి, స్నేహపూర్వకమైన మాటలతో స్పష్టంగా ఇలా అన్నాడు. "సుగ్రీవా! నీమీద పగసాధించానని నన్ను దూషించవద్దు. నీలో ఏదోషం లేదు. ఇదిలా జరగాలని వుండడం వల్ల నా ఫలం నన్ను బట్టుకుని యీడ్చి, బలవంతంగా జ్ఞానహీనుడిని చేసింది. అన్నదమ్ముల మర్యాద ప్రకారం మనం ఒక్కటిగా వుండలేకపోయాం. తమ్ముడా! ఇది దైవం చేసిన పని. దాన్ని తప్పించడం మన శక్యమా? ఇక నేను జీవించలేను. ఈ వానర రాజ్యాన్ని నువ్వు సంతోషంగా పాలించు. ప్రాణం, రాజ్యం, సంపద, భూమ్మీద మూడులోకాల పొగడ్తలు కన్న యశస్సు వదిలి స్వర్గానికి పోతున్నాను'' అని అంటూ అంగదుడిని, తారను సుగ్రీవుడికి అప్పచెప్పాడు వాలి. తన మెడలోని బంగారు హారాన్ని సుగ్రీవుడికి ఇచ్చి దాన్ని ధరించమని చెప్పాడు వాలి. సుగ్రీవుడు తన మనస్సులో పూర్వం ఆయన మీద వున్న విరోధం, రోషం వదిలి శాంతించి, బంగారు సారాన్ని ఆయన ఆజ్ఞానుసారం తీసుకున్నాడు. ఆ తరువాత కొడుకు అంగదుడికి రకరకాల విధంగా నీతి, ధర్మం బోధించాడు వాలి.

ఈ విధంగా చెప్పి, వాడిగల బాణాల వల్ల బాధపడుతూ, గుడ్లు గిర–గిరా తిప్పుతూ, పళ్ళు తెలిసేట్లు నోరు తెరిచి వాలి ప్రాణాలను విడిచాడు. కోతి గుంపులన్నీ హా! హా! అని ఏడ్చాయి. ప్రభువు చనిపోగా కిష్కింధ పాడుబడినట్లు కాంతిహీనమై కనిపించింది. కొండలు, తోటలు, గుహలు, పూర్వం ఉన్నట్లుగా కాకుండా పాడుబడినట్లు అయిపోయాయి. ఆవుల మందకు రక్షణగా వున్న ఆబోతు చస్తే రక్షణ చెడ్డ ఆవులు భయంకరమైన సింహాలు వుండే అడవిలో దుర్బలులై ఘోషిస్తున్నట్లు వానరులు వాలికొరకై ఏడ్చారు. మరణించిన (వాలి) భర్త ముఖం చూస్తూ విస్తార శోక సముద్రంలో మునిగి ఏడుస్తూ, మగడిని కౌగలించుకుని తార నేలమీద పడింది.

ఇలా తార ఏడుస్తుంటే నీలుడు వచ్చి వాలి రొమ్ములో వున్న రామ బాణాన్ని లాగాడు. ఆ బాణం లాగడంతో వానర శ్రేష్టుడి గాయాల నుండి నెత్తురు కాలవల్లాగా పారింది. అప్పుడు తార వాలి శరీరం మీద వున్న ధూళిని తన కన్నీటి ధారలతో సర్వావయాలను కడిగింది. ఆ తరువాత తార అంగదుడిని దగ్గరకు తీసుకుని వాలిని చూపించి, "నీ తండ్రిని కళ్లారా చూశావా? పాపకార్యం వల్ల కలిగిన విరోధం ఈ రోజుతో దేహంతో వదిలాడు. కుమారా! ఇదే కడసారి, ఇక నీ తండ్రి ముఖం నువ్వు చూడబోవు. కాబట్టి మొక్కు. బాల సూర్యుడు లాంటి దేహం కలవాడు ఒక్కడే యమపురికి పోతున్నాడు". అని చెప్పింది. తల్లి అలా చెప్పగా, అంగదుడు వాలిపాదాల మీద పడి, "తండ్రీ! నేను అంగదుడిని. నమస్కరిస్తున్నాను. అంగీకరించు" అని అన్నాడు.

అంగదుడితో కూడి ఇలా తార దుఃఖపడుతుంటే, ప్రాణం పోయి తన అన్న నేలమీద పడివుండడం చూసిన సుగ్రీవుడు ఇదంతా తన వల్లే కదా జరిగిందనీ, తానే దీనంతటికీ కారణమనీ కళ్ళనీళ్ళ పర్యంతమయ్యాడు. తార ముఖం చూస్తుంటే ఆయన హృదయం కళవళపాటు చెందింది. అప్పుడు సుగ్రీవుడు మెల్లగా రామచంద్రమూర్తిని సమీపించి, నిట్టూర్పు విడుస్తూ ఇలా అన్నాడు. "నువ్వు అన్న ప్రకారం నీమాట చెల్లించుకున్నావు. కపిరాజ్యం నాకు లభించింది. కాని రాజ్య సుఖాల మీద, ప్రాణం మీద ఆశ నశించిపోయింది. నా మూలంగా మా అన్న చచ్చి పడి వుండడాన్ని, బతకాలా-వద్దా అన్న సంశయంలో వున్న అంగదుడిని చూసిన తరువాత రామచంద్రా! నా మనస్సు రాజ్య భోగాల మీదకు పోవడం లేదు. దుఃఖం ఆపుకోలేక పోతున్నాను". సుగ్రీవుడి మాటలు విని, రామచంద్రమూర్తి, సుగ్రీవుడిలాగే తానూ కళ్ళనీళ్ళ పర్యంతమై కొంచెం సేపు దుఃఖపడ్డాడు. తార దగ్గరకు పోయి ఆమెను ఓదార్చాడు. రాముడి ఓదార్పు మాటలకు తార దుఃఖం మానింది.

దీనికే కరుణారసం అని పేరు. పరుల దుఃఖం తన దుఃఖంగా భావించి దుఃఖపడడమే కరుణ లక్ష్యం. ఈ అవతారంలో ఈ రసం విశేషంగా కనిపిస్తుంది. సీతకొరకు రామచంద్రమూర్తి ఏడ్చింది ఇలాంటి కారణం వల్లే అని అర్థం చేసుకోవాలి. ఇది దొంగ ఏడ్పు కాదు. మాయ అంతకంటే కాదు. నిజమైన దుఃఖం. ఆత్మార్థహానికై వచ్చింది కాదు. ఇలాంటి కరుణ కలవాడు కాబట్టే రామచంద్రమూర్తికి కరుణాకాకుత్థ్సుడని బిరుదు వచ్చింది. ఆశ్రితుల దుఃఖం ఆయన కొంచెమైనా సహించలేడు. ఇది భగవంతుడిలో కల కళ్యాణ గుణాల్లో ఒకటి. భగవంతుడు ఆశ్రిత వత్సలుడు. అందుకే దృఢంగా కావాలని ఎవ్వరేది కోరినా అనుగ్రహిస్తాడు. కాని, చెడ్డ కోరికలు కలవారు ఫలితాన్ని అనుభవించేటప్పుడు దుఃఖపడుతుంటే, అయ్యో! వీరిలాంటి పాపపు కోరికలు కోరి ఇలా దుఃఖపడుతున్నారే, వీళ్లెప్పుడు బాగుపడతారా? అని వారిలాగే తానూ దుఃఖపడతాడు.

ఆ తరువాత సుగ్రీవుడు సహాయపడుతుంటే అంగదుడు తన తండ్రికి చితిని పేర్చి, ఏడ్చుకుంటూ, పరలోకానికి పోతున్న వానర శ్రేష్టుడికి అగ్నిని చితిమీద వుంచాడు. అప్రదక్షిణంగా తిరిగాడు. వాలికి ఈ విధంగా సంస్కారాలు చేసి శాస్త్ర పద్ధతిలో నీళ్లు విడవడానికి చల్లని నీళ్లున్న నదిని చేరి తార, సుగ్రీవుడు అంగదుడితో కలిసి వాలికి నీళ్లు వదిలారు. వారితో సమానంగా రాముడు కూడా దుఃఖిస్తుంటే సుగ్రీవుడితో ప్రేత కర్మలు జరిపించారు. యుద్ధంలో చనిపోయిన అన్న వాలికి దహనాది కార్యక్రమాలు జరిపించి

సుగ్రీవుడు రాముడి దగ్గరకు వచ్చాడు. మిగిలినవారంతా, స్త్రీలు, పౌరులు, కిష్కింధకు పోయారు.

తడిబట్టలతో, దుఃఖభారంతో, బాధపడతున్న సుగ్రీవుడిని మంత్రులంతా సేవించారు. అందరూ కూర్చున్న తరువాత హనుమంతుడు రామచంద్రమూర్తితో "రఘుకులదీపకా! నువ్వు సమ్మతిస్తే సుగ్రీవుడు కిష్కింధ చేరి దివ్యౌషధులతో పవిత్ర స్నానం చేసి వానరులతో మిగిలిన పట్టాభిషేక కార్యక్రమం జరిపిస్తాడు. ఆయనకు మీరు పట్టాభిషేకం చేసి ఈ వానర సమూహాలకు సంతోషం కలిగించు" అన్నాడు. జవాబుగా రామచంద్రమూర్తి ఆంజనేయుడితో సుగ్రీవుడు వూరికి చేరి సుఖంగా పట్టాభిషిక్తుడై శాస్త్రవిధి తప్పకుండా వానర రాజ్యాన్ని పాలించాలని అన్నాడు.

ఇలా అని సుగ్రీవుడితో చెప్పాడిలా. "ఈ అంగదుడిని యువరాజుగా పట్టాభిషేకం చేయి. ఇతడికి యౌవరాజ్యం ఇవ్వడం సబబే. నిన్ను కిష్కింధకు పోయి పట్టాభిషేకం చేసుకోమంటే నా పని మరిచానని కాదు. దానికి సమయం ఇది కాదు. వానాకాలంలో మొదటిది శ్రావణ మాసం. అది మొదలు నాలుగు నెలలు వర్షాకాలం అంటారు. ఈ నాలుగు నెలలు దండయాత్రకు పనికిరావు. కాబట్టి నీ వూరికి పో. నేను, లక్ష్మణుడు ఈ గుహలో వుంటాం. కార్తీక మాసం రాగానే రావణ వధకు కావాల్సిన ప్రయత్నాలు, వానర సేనను పోగు చేయడం జరగాలి. నువ్విప్పుడు వూరికి పోయి నీ స్నేహితులు సంతోషించే విధంగా రాజువై సుఖపడు".

రామచంద్రమూర్తి పట్టాభిషేకానికి సంకేతం ఇచ్చినట్లే అని సుగ్రీవుడు భావించాడు. రామచంద్రమూర్తి ఆజ్ఞ ఇవ్వగానే సుగ్రీవుడు కిష్కింధకు పోయాడు. అక్కడ ఆయనకు వానర గుంపులు, పౌరులు, సాష్టాంగ నమస్కారం చేశారు. తన అన్న అంతఃపురానికి పోయి, దుఃఖపడుతున్న తారను సమాధాన పరిచాడు. ఆ తరువాత బక్ష్యాలతో, మణులతో, వస్త్రాలతో, బ్రాహ్మణులను తృప్తి పరిచారు. తదుపరి, శాస్త్రంలో చెప్పిన విధంగా దర్భలు పరిచిన భూమ్మీద అగ్నిని నిలిపారు. పవిత్ర మంత్రాలతో హోమాలు చేయించి, మంత్రాలు తెల్సినవారు చిత్ర మాల్యాలతో ప్రకాశించే మేడలో మనోహరమైన బంగారు పీటమీద తూర్పు ముఖంగా సుగ్రీవుడిని నిలబెట్టారు. అనేక నదుల నుండి, ఉపనదుల నుండి, సముద్రం నుండి జలాలను తెచ్చి, బంగారుకుండలో పోసి, బంగారు పాత్రలను ఎద్దుకొమ్ములతో ఆ నీళ్లలో ముంచారు. ఆ తరువాత శాస్త్రంలో చెప్పినట్లు మైందుడు, ద్వివిదుడు, గంధమాదనుడు, గజుడు, గవాక్షుడు, గవయుడు, హనుమంతుడు, జాంబవంతుడు, నలభుడు, శరభుడు సంతోషంగా సుగ్రీవుడిని, ఇంద్రుడిని అభిషేకించినట్లు మిక్కిలి సువాసన కల మంచినీటితో ప్రేమతో అభిషేకించారు. సుగ్రీవుడు సంతోషంగా పట్టాభిషిక్తుడై, ఆ తరువాత, రామచంద్రమూర్తి చెప్పిన విధంగా అంగదుడిని యువరాజుగా అభిషేకించగా అందరూ సంతోషించారు. సుగ్రీవుడిని పొగిడారు.

ఇప్పుడు కిష్కింధ అని చెప్పబడే ప్రదేశాన్ని చూస్తే, అదొక చిన్న పట్టణం లాగా కనపడుతుంది. కాని, వాలి–సుగ్రీవులు పాలించినది ఆ చిన్న పట్టణం కాదు. కిష్కింధా రాజ్యం అల్ప రాష్ట్రం కానే కాదు.

◆❖◆

రాముడికిచ్చిన మాట తప్పాడా సుగ్రీవుడు?

సుగ్రీవ, అంగద పట్టాభిషేక వార్త విన్న రామచంద్రుడు, లక్ష్మణుడితో కలిసి ప్రస్రవణ పర్వతం మీద నివసించాడు. భార్యలేని దుఃఖంతో ఆయనకు సంతోషం లేదు. శ్రీరామచంద్రమూర్తిని చూసి లక్ష్మణుడు ఆయన దుఃఖం పోయేట్లు సమాధాన పరిచేవాడు. అన్నతో "రామచంద్రా! సర్వం అనుకూలంగా వస్తుంది. తగిన సమయం రాగానే సుగ్రీవుడు ప్రయత్నపూర్వకంగా సహాయం చేస్తాడు కాని మాట తప్పడు. కాబట్టి వానలు ఆగేదాకా సహించి ఇక్కడే వుందాం. ఆ తరువాత శత్రువులను ధ్వంసం చేద్దాం" అన్నాడు.

ఇదిలా వుండగా, హనుమంతుడు సుగ్రీవుడి ద్వారా రామచంద్రమూర్తి కార్యం నెరవేర్చడానికి పూనుకున్నాడు. కార్యం నెరవేర్చాల్సిన కాలం సమీపించిందని హనుమంతుడు భావించాడు. ఆ విషయాన్ని సుగ్రీవుడు ఆలోచించక పోవడం కూడా గమనించాడు హనుమంతుడు. స్వామి కార్యం మరచిన సుగ్రీవుడిని గుర్తించాడు. సుగ్రీవుడిని హెచ్చరించాలనుకున్న హనుమంతుడు, వినయంగా ఆయనతో ఇలా అన్నాడు.

"వానర రాజా! స్నేహితుల కార్యం ఇంకా నేరవేరాల్సి వుంది. కాబట్టే నేను నిన్ను హెచ్చరించగలుగుతున్నాను. శీఘ్రంగా నువ్వు నీకు మేలుచేసిన వారి పని చేయడానికి ప్రయత్నాలు చేయి. సీతను వెతకడానికి వానరులను పంపు. ఇప్పటికే సమయం మించి పోయింది. రామచంద్రుడు, సీతాన్వేషణకొరకు తొందరున్నప్పటికీ, సమయం, కాలం తెలిసన వాడైనందున నిన్ను హెచ్చరించకుండా నీ నడవడి పూర్తిగా తెలిసేవరకు తొందర పడకూడదని వేచి వున్నాడు. నువ్వు చేయాల్సిన సహాయం వూరికే ధర్మానికి చేస్తున్నది కాదు. నీకాయన ముందుగా సహాయం చేశాడు. కాబట్టి నువ్వతడికి మారుమేలు చేయాలికదా? అది నీకర్తవ్యం కదా? చేయకపోతే తప్పుకాదా? కాబట్టి సీతను వెతికించడానికి వానరులందరినీ ఇక్కడికి పిలిపించాలని కోరుతున్నాను. వారు హెచ్చరించక ముందే చేస్తే దోషం లేదు".

అదే సమయంలో రాముడు అక్కడ లక్ష్మణుడితో ఇలా అన్నాడు: "లక్ష్మణా! సుగ్రీవుడేమో ఇంకా

ఇక్కడికి రాలేదు. ఏదైనా ప్రయత్నం చేశాడా అంటే అదీ లేదు. సీతను వెతికే పని ఆలోచించడం లేదు. తగిన కాలంలో తన బాధ్యతను మరచాడు. లక్ష్మణా! నువ్వు కిష్కింధకు వెళ్లు. మూర్ఖుడై భోగాలు మరిగిన కుటిల మనస్సుకల ఆ సుగ్రీవుడిని చూడు. చూసి నేను చెప్పానని వాడితో ఇలా అను. 'అంతకు పూర్వమే తనకు ఉపకారం చేసినవారికి ప్రత్యుపకారం చేస్తానని ప్రమాణం చేసి కూడా అది నెరవేర్చక పోవడం చేసినవాడిని పురుషాధముడు అంటారని ప్రాజ్ఞులు చెప్తారు. ముందు మాట చెప్పి ఆ ఆమాట నెరవేర్చడానికి పాపమైనా, పుణ్యమైనా ఆడినమాట తప్పక సత్యం మీద వుండే కార్యనిర్వాహకుడే పురుషోత్తముడని పేరు పొందుతాడు. తన కార్యం నెరవేర్చి మేలు చేసిన స్నేహితుడిని మరిచిన కృతఘ్నుడు చస్తే వాడి పీనుగను కుక్కలు, గద్దలు, నక్కలు తినకపోగా అటువైపు కూడా చూడవు'. అని ఈ విధంగా చెప్పు".

"నా కోపానికి తగిన విధంగా నువ్విలా చెప్పు. 'వానరరాజా! వాలి పోయిన మార్గంలో నీకిష్టముంటే నువ్వు కూడా పోవచ్చు. అయినా వాలి పోయిన దారిలో నువ్వు పోవద్దు. వానరుడా! నువ్వేం ప్రమాణం చేశావో ఇప్పటికైనా జ్ఞాపకం తెచ్చుకో. వాలిచేసిన దోషానికి వాడిని మాత్రమే దండించాను. ద్రోహబుద్ధివై సత్యవాక్యం గమనించని నిన్ను, మూడుఢవైన నిన్ను, బంధువులతో సహా చంపుతాను. వానరరాజా! నువ్వు చెప్పిన ప్రమాణ వాక్యాలను జవదాటవద్దు. శాశ్వతమైన ధర్మ మార్గాన్ని వ్యర్థపరచవద్దు. నా వాడి బాణాలతో చనిపోయిన నీ అన్నను చూడడానికి పోవద్దు'. అని నా మాటలుగా నేను చెప్పానని సమయోచితంగా ఇంకేదైనా చెప్పాలనుకుంటే కలిపి చెప్పు" అన్నాడు. అన్న ఆజ్ఞానుసారం లక్ష్మణుడు చాలా వేగంగా కిష్కింధ వైపు వెళ్లాడు.

కిష్కింధ ప్రవేశించిన లక్ష్మణుడిని వూరి బయట చూసిన కోతులు, సుగ్రీవుడి ఇంటికి పోయి లక్ష్మణుడు కోపంతో వచ్చాడని చెప్పారు. అంతఃపురంలో వున్న ఆయనకు వారి మాటలు చెవికెక్కలేదు. తన దగ్గరికి వచ్చిన అంగదుడితో ఇలా అన్నాడు లక్ష్మణుడు. "నాయనా! నువ్వు పోయి నీ పినతండ్రికి చెప్పు. లక్ష్మణుడు నీతో మాట్లాడడానికి వాకిట్లో నిలిచి వున్నాడు. ఆయన మాటలు వినడానికి నీకిష్టమైతే, వానరుడా! ఎలా ప్రవర్తించాలో అలా చేయి. నువ్విక్కడికి వస్తావా? నన్ను అక్కడికి రమ్మంటావా? నేను రాను, నువ్వు రావద్దు. నీ తోవన నువ్వు పొమ్మంటావా? నువ్వీమాట చెప్పి ప్రత్యుత్తరం ఏమిస్తాడో తెలుసుకుని త్వరగా రా". వెంటనే అంగదుడు పోయి తారకు, రుమకు వృత్తాంతమంతా స్పష్టమైన మాటలతో చెప్పాడు.

లక్ష్మణుడు తన వాకిట్లో కోపంగా వచ్చి నిలబడ్డాడని చెప్పిన అంగదుడి మాటలు వినగానే, సుగ్రీవుడు, కూర్చున్నవాడు కూర్చున్నట్లే ఆసనం మీద వణక సాగాడు. "నేను లక్ష్మణుడికి, రాముడికి భయపడను. కాని ప్రియస్నేహితుడు కారణం లేకుండా కోపానికి వచ్చాడు కదా అని బాధపడుతున్నాను" అన్నాడు. అప్పుడు సుగ్రీవుడికి మరోమారు హనుమంతుడు హితబోధ చేశాడు.

"సుగ్రీవా! నువ్వు వారి విషయంలో దోషం చేశావు. ఆ దోషానికి ప్రాయశ్చిత్తం నువ్వు లక్ష్మణుడికి రెండు చేతులు జోడించి మొక్కడమే. ఇంతకు మించి ఉపాయం లేదు. నీ మేలుకోరి, భయపడకుండా నీకు హితమైన దానినే చెప్పాను. ఆ ప్రకారం చేస్తే బాగుపడతావు. రామచంద్రమూర్తి అంటే నువ్వేమనుకుంటున్నావు? తన పని తాను చేసుకోలేక అసమర్థుడై నిన్ను ఆశ్రయించడానికి

వచ్చాడనుకుంటున్నావా? ఆయనకు కోపమే వచ్చి విల్లు చేతపట్టుకుంటే, దేవతలతో, రాక్షసులతో వెలిగే ఈ ప్రపంచమంతా తనకు లోబడేట్లు చేసుకోగలడు. పూర్వం రామచంద్రమూర్తి చేసిన ఉపకారం తలచి తిరిగి మేలుచేయడానికి ప్రయత్నించు. రాముడి దగ్గరకి పోయి రెండు చేతులు జోడించి నమస్కరించి ఆయనకు వశమై పో" అంటాడు.

అంతఃపురంలో ఈ విధంగా సమాలోచనలు జరుగుతుంటే, వాకిట్లోనే వున్న లక్ష్మణుడిని, అంగదుడు లోపలికి రమ్మని పిలిచాడు. లక్ష్మణుడు లోనికి పోయాడు. అక్కడ పరిస్థితి చూసి లక్ష్మణుడికి కోపం వచ్చింది. ఇంతలో అంగదుడు వచ్చి సుగ్రీవుడితో లక్ష్మణుడు వచ్చాడని చెప్పాడు. అప్పుడు సుగ్రీవుడు తారను చూసి, లక్ష్మణుడు ఇంత కోపంలో ఎందుకు ఉన్నాడో కనుక్కొమ్మని, కారణం లేకుండా లక్ష్మణుడికి కోపం రాదని, అలా కోప్పడడానికి మనలో ఏదో నేరముండాలని అన్నాడు. అలానే అని పోయిన తార లక్ష్మణుడి దగ్గరికి పోయి ఆయన కోపానికి కారణం అడిగింది. వెంటనే లక్ష్మణుడు, సుగ్రీవుడు సమయాతిక్రమణం చేసాడని చెప్పాడు. "నాలుగు నెలలకు వస్తానని మాట ఇచ్చి, సారా తాగుతూ, స్త్రీలతో ఆటలాడుతూ, కాలం తెలియకుండా ప్రవర్తిస్తున్నాడు. ధర్మం చెడినప్పుడు అర్థం, కామం, వాటంత అవే చెడిపోతాయి. కాబట్టి వీటిని నీ మగడు వదిలాడు. ఇక వాడెలా బాగుపడతాడని అనుకుంటున్నావు? వానరరాజు ఈ విధంగా ప్రవర్తించాడు కాబట్టి మేం చేయాల్సిన పనేంటో ఆలోచించి నువ్వే చెప్పు" అని అన్నాడు. ఆ మాటలు విన్న తార లక్ష్మణుడిని సమాధాన పరచింది.

తన మాటలకు లక్ష్మణుడు సమాధాన పడినట్లు గ్రహించి మళ్లీ ఇలా అన్నది. "రాజకుమారా! సుగ్రీవుడు మన్మథవశుడైనా నువ్వు రాకముందే మీ కార్యం నెరవేర్చడానికి కావాల్సిన ప్రయత్నం చేశాడు. ఏమి ప్రయత్నం చేసాడంటావా? అతడి పిలుపు మేరకు బలవంతులైన, కోరిన రూపం ధరించగల అనేకులు, కోటానుకోట్ల వానరులు, వచ్చి వున్నారు".

తార పిలవడంతో అంతఃపురంలోకి పోయాడు లక్ష్మణుడు. అక్కడ సుగ్రీవుడిని చూశాడు లక్ష్మణుడు. అలాగే కోపంతో వున్న లక్ష్మణుడిని సుగ్రీవుడు చూశాడు. వానరరాజు సుగ్రీవుడిని చూసి లక్ష్మణుడు క్రూరమైన కోపంతో ఇలా అన్నాడు.

"నువ్వు రాజుగా వుండడానికి తగినవాడివి కాదు. తనకు మేలు చేసినవాడికి తిరిగి మేలు చేస్తానని ప్రమాణం చేసి, మాట తప్పి, ధర్మాన్ని ఉపేక్షించిన వాడికంటే మూర్ఖుడు, నీచుడు ఎవరో చెప్పు. నువ్విలానే చేశావు కదా! ముందు రామచంద్రుడితో నీ పని చేయించుకుని ప్రత్యుపకారం చేయని కారణాన నువ్వు కృతఘ్నుడివి. నువ్వు మానహీనుడివి. నువ్వు వంచకుడివి. నువ్వు నీచుడివి. నువ్వు అసత్యవాదివి. రామచంద్రమూర్తి వల్ల నీ ప్రయోజనం నెరవేర్చుకుని, ప్రత్యుపకారం చేయాలని నీ మనస్సులో వుంటే, సీతాదేవిని వెతకడానికి శీఘ్రంగా నువ్వెందుకు ప్రయత్నం చేయలేదు? నిన్ను వాలి పోయిన చోటుకే ఆయన పంపుతాడు. పాపాత్ముడా! వాలి పోయిన దారి ఇంకా మూతపడలేదు. తెరిచే వుంది. ఆ తోవలో పోవడానికి నువ్వు ఆలోచించవద్దు. నువ్వు చేసిన శపథం గుర్తుచేసుకో. నువ్వు రామకార్యాన్ని ఆలోచించడం లేదు. ఇది నిజం".

ఈ విధంగా చాలా కోపంగా మాట్లాడుతున్న లక్ష్మణుడిని తార సమాధాన పరిచే ప్రయత్నం చేస్తూ

ఇలా అన్నది. "నువ్వు వాస్తవం తెలుసుకోకుండా మూఢుడిలాగా కోపం తెచ్చుకోకూడదు. వాస్తవం ఏమిటి అంటావా? చెప్తా విను. సుగ్రీవుడు రామచంద్రుడి కార్యార్థమై దేన్నైనా వదలి పెట్టుతాడని నా అభిప్రాయం. ఆ కార్యం అంటే అంత ఆసక్తి కలవాడు. లక్ష్మణా! సుగ్రీవుడు తాను చేసిన ప్రమాణం ప్రకారం యుద్ధంలో రావణుడిని చంపి రామచంద్రుడితో సీతను కలపగలడు. నీకెందుకు సందేహం కలిగింది? సుగ్రీవుడు ఒంటరిగా వచ్చి మీ ఎదురుగా కూర్చుంటే కలిగే ఫలితం ఏమిటి? లంకలో లక్ష కోట్లపైన, పదికోట్ల మూడులక్షల అరవై వేల రాక్షసులు ఉన్నారనీ, వారందరినీ చంపేదాకా రావణుడిని చంపడం సాధ్యం కాదనీ, సహాయం లేకుండా సుగ్రీవుడు ఒక్కడే రావణాసురుడిని ఎలా చంపగలడనీ, వాస్తవం తెలిసిన వాలి నాతో చెప్పాడు. వాలి సుగ్రీవుడితో యుద్ధానికి పోయే ముందర నాతో ఈ విషయం చెప్పాడు. యుద్ధంలో మీకు సహాయం చేయడానికి వానర సమూహాలను ఇక్కడికి రమ్మని ఇంతకు ముందే సుగ్రీవుడు ఆజ్ఞాపించాడు. ఆ గడువు నేటితో ముగుస్తున్నది. కాబట్టి సుగ్రీవుడి మీద మునుపటి ప్రేమ కలిగి వుండు. ప్రీతిగా అతడి భయం పోగొట్టు".

ఇలా తార చెప్పగా, లక్ష్మణుడు ఆమె చెప్పిన ధర్మంతో కూడిన మాటలకు తన తీవ్రమైన కోపాన్ని వదిలాడు. అది చూసిన సుగ్రీవుడు లక్ష్మణుడంటే భయాన్ని వదిలాడు. అణకువతో ఇలా అన్నాడు. "లక్ష్మణా! పూర్వం పోయిన వానరరాజ్యం, సంపద, కీర్తి, ఇవన్నీ రామచంద్రమూర్తి దయవల్ల మళ్లీ నాకు లభించాయి. ఇది సత్యం. అంతటి పరాక్రమ సంపదకలవాడికి, స్వకార్యంతో దిక్కులంతటా వ్యాపించిన కీర్తికల అంతటి వాడికి ఎవడు అపకారం చేయగలడు? రామచంద్రమూర్తి సీతను మళ్లీ పొందగలడు. దానికోసం దుష్టుడైన రావణుడిని చంపగలడు. సందేహం లేదు. అయినప్పటికీ నేను నిమిత్తమాత్రంగా సహాయం చేస్తాను. నా సహాయం లేకపోతే ఆయన తన కార్యం చేసుకోలేడని నా అభిప్రాయం కాదు". లక్ష్మణుడు ఆ మాటలకు సంతృప్తి పడ్డాడు.

లక్ష్మణుడు ఇలా చెప్పగా విన్న సుగ్రీవుడు హనుమంతుడితో భూమ్మీద ఎక్కడెక్కడో వున్న వానరులందరినీ, పిలిపించమన్నాడు. ఆయన అలాగే చేస్తానన్నాడు. సుగ్రీవాజ్ఞ ప్రకారం వానర ముఖ్యులు దిక్కులు కనబడనట్లు యుద్ధకాంక్షతో వచ్చారు. అంజనా పర్వతం నుండి కాటుకలాంటి నల్లటి దేహం కల వానరులు మూడు కోట్లమంది, పడమటి కొండ నుండి బంగారువన్నె దేహం కల పది కోట్ల వానరులు, కైలాసం నుండి సింహం మెడమీది వెంట్రుకల లాంటి కాంతి కల వేయికోట్ల మంది వానరులు, హిమవత్పర్వతం దగ్గర పండ్లు, వేళ్ళు తినే కోతులు వేయివేల కోట్ల మంది, వింధ్య పర్వతం నుండి నిప్పులాంటి ఆకారం కల కోటి వేలమంది కపులు, పాలసముద్రం తీరం నుండి టెంకాయలు తినే వానరులు లెక్కలేనంత మంది వచ్చారు. వీరంతా రాముడి కార్యం సాధించడానికి వచ్చారు. వీరంతా సుగ్రీవుడు పెట్టిన గడువుకు సరిగ్గా వచ్చారు. వానరులను పిలవడానికి పోయి వచ్చినవారు తెచ్చిన పళ్ళు, పూలు, కానుకలను సుగ్రీవుడి ముందుంచి, "వానర రాజా! మీ ఆజ్ఞ కోతులందరికీ తెలియచేయగా వారంతా కిష్కింధకు వచ్చారు" అని చెప్పారు. సుగ్రీవుడు చాలా సంతోషించి వారి కానుకలను స్వీకరించి, వారందరినీ ఇండ్లకు పొమ్మని ఆజ్ఞాపించాడు. అక్కడి నుండి అంతా కలిసి బయల్దేరి శ్రీరాముడి దగ్గరకు పోయారు.

హనుమంతుడికే ముద్రికనెందుకిచ్చాడు శ్రీరాముడు?

సీతాన్వేషణ చేయడానికి, శ్రీరాముడికి ఇచ్చిన మాట ప్రకారం వానర సేనను నలుమూలల నుండి రప్పించిన తరువాత, తాను రామచంద్రుడి కార్యం నేరవేర్చానని సంతోషించాడు సుగ్రీవుడు. అప్పుడు లక్ష్మణుడు సుగ్రీవుడితో రామచంద్రమూర్తిని చూడడానికి పోదామా అని అడిగాడు. ఆయన ఆజ్ఞ ప్రకారం అలాగే చేద్దామని అన్నాడు సుగ్రీవుడు. అంతా కలిసి రామచంద్రమూర్తి వున్న చోటుకు పోయారు. వానరసేనను చూసి రామచంద్రమూర్తి సుగ్రీవుడిని దయగా, ప్రేమగా పలకరించాడు.

సుగ్రీవుడిని సంతోషంతో కౌగలించుకుని, ప్రేమతో ఇలా అన్నాడు. "సుగ్రీవా! ధర్మం, అర్థం, కామం అనేవాటిని వేర్వేరుగా భాగించుకుని, ఏఏ వేళల దేనిని అనుష్టించాల్నో తెల్సుకుని, ఒకటి చేసేటప్పుడు ఇంకొకటి చేయకుండా, దేన్నీ ఉపేక్షించకుండా వాటిని సేవించే వాడే రాజని కీర్తి వహిస్తాడు. (సుగ్రీవుడు ధర్మార్థాలను సేవించాల్సిన సమయంలో కామం అనుభవించాడని, అది రాజనీతి కాదని ఇక్కడ భావం). ధర్మాన్ని వదిలి, అర్థాన్ని మరిచి, ఎప్పుడూ కామంమీదే ఆసక్తికలవాడు చెట్టు కొనకొమ్మ మీద నిద్రపోయి, నేలమీద పడి మేల్కొన్నవాడితో సమానం. శత్రువులను చంపుతూ, స్నేహితులను సంపాదించుకుంటూ, హెచ్చరికగా ధర్మార్థ కామ ఫలాలను అనుభవించే రాజు ధర్మ మార్గంలో నడిచిన వాడవుతాడు. సుగ్రీవా! ఇది మన పనికోసం ప్రయత్నం చేయాల్సిన సమయం. మంత్రులు, దండనాయకులు, ఇతరులతో ఇప్పుడే సభ ఏర్పాటుచేయి. ఎలా కార్యం ముందుకు తీసుకుపోవాలో ఆలోచిద్దాం".

రామచంద్రమూర్తి చెప్పిన మాటలకు జవాబుగా సుగ్రీవుడు ఇలా అన్నాడు. "రామచంద్రా! నాకు పోయిన మహైశ్వర్యం, వానర రాజ్యలక్ష్మి, గొప్ప కీర్తి, ఇవన్నీ నీ వల్ల, నీ తమ్ముడివల్ల, మీ ఇద్దరి అనుగ్రహం వల్ల, నాకు లభించాయి. ఇలాంటి నీకు ప్రత్యుపకారం చేయతలచనివాడు ఎల్లప్పుడూ నిందించతగిన వాడే. భూమండలంలోకల కోతులను, కొండముచ్చులను, ఎలుగులను, బలవంతులను పిలిపించాను. వీరంతా సాధారణమైన కోతులు కావు. కోరిన రూపం ధరించగలవారు. అడవి మార్గాలు తెల్సినవారు.

తమతమ సేనలతో వందలు, వందవేలు, వంద లక్షలు, అయుతాలు, శంకువులు, అర్బుదాలు, ఖర్వాలు, మధ్యములు, అంతములు, సాగరములు, పరార్తాలుగా వస్తున్నారు. దుష్టుడైన రావణుడిని చంపి వీరు నీ భార్యను తెచ్చి నీకు సమర్పిస్తారు". సుగ్రీవుడిలా చెప్పగా, ఆయన చేసిన యుద్ధ ప్రయత్నమంతా తెలుసుకుని, రామచంద్రమూర్తి సంతోషించాడు.

ఇలా శ్రీరామ సుగ్రీవులు మాట్లాడుకుంటున్న సమయంలో వానరసేన భూమంతా నిండింది. పదివేల కోట్ల కోతులు కొలుస్తుంటే శతవలి వచ్చాడు. తారకు తండ్రైన సుషేషణుడు పదివేల కోట్ల సేన కొలుస్తుంటే వచ్చాడు. రుమ తండ్రైన తారుడు కోటి సహస్రాల కోతులతో వచ్చాడు. హనుమంతుడి తండ్రైన కేసరి వెయ్యి అనీకములు కొలుస్తుంటే వచ్చాడు. గవాక్షుడు కోటివేల కపులతో వచ్చాడు. రెండు కోట్ల ఎలుగులతో ధూమ్రుడు వచ్చాడు. పనసుడు మూడు కోట్ల కపులతో వచ్చాడు. నీలుడు పదికోట్ల కోతులతో, గవయుడు ఐదు కోట్ల వానరులతో వచ్చారు. వేయి కోట్ల కోతులతో దరీముఖుడు, మూడు కోట్లతో గజుడు, వేయి కోట్ల కోతులతో అశ్వినీ దేవతలా కుమారులు ద్వివిదుడు, మైందుడు, పదికోట్ల కోతులతో జాంబవంతుడు వచ్చారు. నూరుకోట్ల కపులు సేవిస్తుంటే రుమన్వంతుడు సుగ్రీవుడి ఆజ్ఞానుసారం శ్రీరామచంద్రుడి దగ్గరకు వచ్చాడు. నూరు వేల కోట్ల కోతులతో గంధమాదనుడు వచ్చాడు.

తారుడు ఐదు కోట్ల కోతులతో వచ్చాడు. తార కొడుకు అంగదుడు వేయి పద్మాలు, నూరు శంకువులు సంఖ్య కల కోతులతో వచ్చాడు. ఇంద్రజాను శూరుడు పదకొండు కోట్ల వానరులు కొలుస్తుంటే రామచంద్రుడి దగ్గరికి వచ్చాడు. పదివేల లక్షల కోతులు కొలవగా రంభుడు వచ్చాడు. రెండు కోట్ల కోతులు సేవిస్తుంటే దుర్ముఖుడు వచ్చాడు. వేయి కోట్ల కోతులు సేవిస్తుంటే హనుమంతుడు వచ్చాడు. నలుడు, వీరులైన ఇతర వానరులు శత లక్ష కోట్లతో, దదిముఖుడు పది కోట్ల వానరులతో, వహ్నికుముదుడు, రంహుడు, ఉగ్ర శరభుడు మొదలైన వానర సమూహాలు వచ్చాయి.

వీరు కాకుండా కొండల సమూహాల్లో, నదుల ఒడ్డులలో, అడవుల్లో వుండే వారు వచ్చారు. వారి సమాఖ్య ఇంత అని చెప్ప అలవికాదు. వచ్చిన వారందరినీ సుగ్రీవుడు వాళ్ల గురించి రామచంద్రుడికి తెలియచెప్పి, వారి క్షేమ సమాచారాలను విచారించాడు. వారిని వాళ్ల సేనలతో అడవుల్లో, కొండల్లో వుండమని ఆదేశించాడు. "ఈ సేన అంతా నీదే. నీ ఆజ్ఞకు లోబడి నీ ఆజ్ఞానుసారం నడచుకుంటారు. ఇక ఏమి చేయాలో సెలవివ్వు. ఇక్కడ వున్న వానరులు అప్పచెప్పిన పని చేయడానికి సమర్థులు. వీరందరినీ నేను ఎరుగుదును. అయినప్పటికీ నువ్వు ఆలోచించి తగిన విధంగా వీరితో పని చేయించుకో" అని సుగ్రీవుడు రాముడికి చెప్పాడు.

రామచంద్రమూర్తి సుగ్రీవుడిని కౌగలించుకుని ఇలా అన్నాడు. "దశకంఠుని ఇంట్లో సీతాదేవి బతికున్నదో, లేదో మొదట తెల్సుకోవాలి. ఆమె మరణించి వుంటే మనం ఏ ప్రయత్నం చేయలేం కదా? కాబట్టి రావణుడు వుండే ప్రదేశం, సీతాదేవి బతికున్నదా? లేదా? అనే విషయం, బతికుంటే ఎలా వుంది అనే సంగతి, తెలసిన తరువాతే నువ్వు చేయాల్సిన సహాయం గురించి చెప్తాను. కార్యమంతా నెరవేర్చడానికి నువ్వే సమర్థుడివి. ఎవరెవరిని ఎక్కడికి పంపాలో నువ్వే పంపించు.

రామచంద్రమూర్తి ఇలా సుగ్రీవుడికి చెప్పగానే, ఆయన రామలక్ష్మణుల ఎదుటనే, వినతుడిని శీఘ్రంగా పిలిచి లక్షల కొద్దీ వానరులు ఆయనను సేవిస్తుంటే, తూర్పు దిక్కుగా రావణాసురుడు వుండే స్థలం వెతకడానికి త్వరగా వెళ్లమని చెప్పాడు. తూర్పు దిక్కున వెతకడానికి వానర శ్రేష్ఠులను పంపిన సుగ్రీవుడు ఆ తరువాత దక్షిణ దిక్కున వెతకడానికి సమర్థులైన అగ్ని కొడుకు నీలుడిని, హనుమంతుడిని, బ్రహ్మ కొడుకైన జాంబవంతుడిని, గజుడిని, సుహోత్రుడిని, గవయుడిని, శరారిని, శరగుల్మిడిని, సుషేణుడుని, ఋషభుడిని, గవాక్షుడిని, అశ్వనీ దేవతల కుమారులైన మైంద–ద్వివిదులను, గంధమాదనుడిని, విజయుడిని, ఉల్కాముఖుడిని, అంగదుడిని, తదితర ప్రసిద్ధ బలులను పంపాలని భావించి కొంత సేనను వారికంటే ముందుగానే దక్షిణ దిక్కుకు పంపాడు. వీళ్లందరినీ తన దగ్గరికి పిలిచి దక్షిణ దిక్కున కల కొండల, గుట్టల, అడవుల గురించి వివరంగా చెప్పాడు.

హనుమంతుడిని, ఇతరులను దక్షిణ దిక్కుకు పొమ్మని ఆజ్ఞాపించిన సుగ్రీవుడు తన మామ, తారకు తండ్రైన, మహాబల పరాక్రమవంతుడు సుషేణుడిని పిలిచి ఆయనతో పాటు మరీచి మహర్షి కుమారుడిని, మారీచుడనే వాడిని, మిగతా మారీచులను, శూరులను చూసి వారితోపాటు రెండు లక్షల కోతులను తీసుకుని పశ్చిమ దిశగా పొమ్మన్నాడు. తన మామను పశ్చిమ దిక్కుగా పంపిన సుగ్రీవుడు శతవలిని ఉత్తర దిక్కుగా పొమ్మన్నాడు.

ఈ విధంగా నలుదిక్కులకు పోయేవారికి చెప్పాల్సిన మాటలు చెప్పిన సుగ్రీవుడు హనుమంతుడిని చూసి, ఇతడివల్లే ఈ కార్యం సాధ్యమవుతుందని, ఇతడే ఈ పనిని సాధించగల సమర్థుడని ఆలోచించి, నిశ్చయించి, పరాక్రమశాలైన హనుమంతుడితో ఇలా అన్నాడు.

"ఓ వానరసత్తమా! నీళ్లల్లో, నిప్పుల్లో, స్వర్గంలో, ఆకాశంలో, నీ గమనం అనివార్యం. నువ్వు పోవాలనుకుంటే అడ్డం రాగలది, ఆటంకపర్చగలది ఏదీ లేదు. ఇది నిశ్చయం. నాకు తెలుసు. అసురులతో, గంధర్వులతో, దేవతలతో, సర్పాలతో, మనుష్యులతో, కొండలతో, సముద్రంతో కూడిన ఈ సమస్త భూమండలంలో నీకు తెలియరానిది వుందా ఆంజనేయా? వేగంలో, తేజంలో, తేలికలో పోవడానికి, బలాతిశయం చూపడానికీ నువ్వు నీ తండ్రితో సమానం ఆంజనేయా! ఓ కపీశ్వరా! నీ అతిశయించిన తేజస్సును పోల్చి చూస్తే నీకు సమానమైన ప్రాణి ఈ భూమ్మీద లేదు. కాబట్టి హనుమంతా! రామచంద్రమూర్తి భార్యను సాధించి మరల తెచ్చే ఉపాయం ఏదో అది నువ్వే చేయాలి. నీకు తప్ప ఇతరులకు అది సాధ్యంకాదు".

హనుమంతుడు ఇంత బలశాలి, గొప్పవాడు అని సుగ్రీవుడికి తెలుసు కదా! ఎందుకు అతడిని వాలిమీదకు యుద్ధానికి పంపలేదు? హనుమంతుడు తనంతట తానే ఎందుకు వాలిని నిరోధించలేదు? ఇంత బలవంతుడు సహాయుడిగా వుండి కూడా ఎందుకు సుగ్రీవుడు కష్టపడ్డాడు? హనుమంతుడు సుగ్రీవుడి బంటు. స్వామి ఆజ్ఞ లేకుండా ఏదీ చేయకూడదు. తాను వాలిని జయించలేను, అని చెప్పి బంటు సహాయం కోరలేదు కదా! అలా కోరడం తనకు అవమానంగా సుగ్రీవుడు భావించి వుండవచ్చు. తనంతట తానే వాలిని నిరోధిస్తే అది సుగ్రీవుడిని అవమానించినట్లే. ఒక వేళ హనుమంతుడు సుగ్రీవుడి పక్షాన యుద్ధానికి వస్తే వాలి పక్షం వారంతా అతడిని ఎదిరించడానికి వస్తారు. ఆ పోరుకు అంతం

ఎక్కడ? కాబట్టి అన్నదమ్ములే కొట్టుకుని చావనీ అని మిగతా వారంతా వూరుకున్నారు. హనుమంతుడికి కూడా తన బలం తనకు తెలియదు. స్వయంగా దేనికీ సాహసించడు. జాంబవంతుడి లాంటివారు వుండాలి ప్రోత్సహించడానికి. హనుమంతుడికి భయపడడం వల్లే వాలి సుగ్రీవుడిని భయపెట్టాడు కానీ చంపడానికి పూనుకోలేదు.

ఇలా సుగ్రీవుడు అంటుంటే రామచంద్రమూర్తి, సుగ్రీవుడు కార్యభారాన్ని హనుమంతుడి మీద పెట్టున్నాడు కాబట్టి, ఈ అంజనేయుడే నిశ్చయించిన కార్యం చేసే శక్తికలవాడని భావించాడు. ఇలా భావించిన రామచంద్రమూర్తి తన పేరు చెక్కబడిన బంగారపు ఉంగరాన్ని తన చేతిలో తీసుకున్నాడు. హనుమంతుడితో "వానరశ్రేష్టా! దీన్ని తీసుకునిపో. సీతకు చూపించు. ఇది చూపిస్తే నువ్వు నిజంగా నా దూతవేనని భయం లేకుండా నీతో మాట్లాడుతుంది. సుగ్రీవుడు అప్పచెప్పిన పని చేయగల సమర్థుడివి నువ్వే అని నాకు అనిపిస్తున్నది. ఈ కారణాన దీన్ని నీదగ్గర వుంచుకో" అని అన్నాడు.

రామచంద్రమూర్తికి ఈ ఉంగరం ఎక్కడినుండి వచ్చింది? సర్వం త్యజించిన వానప్రస్థుడు ఉంగరం దరించవచ్చా? అయితే, రామచంద్రమూర్తి వానప్రస్థాశ్రమం స్వీకరించలేదని అయోధ్యకాండలో చెప్పడం జరిగింది. కైకేయి కోరిక ప్రకారం నారచీరెలు ధరించాడే కాని, తక్కిన ఆశ్రమ చిహ్నాలను అనుష్టించలేదు. ఆ కారణాన ఉంగరం ధరించడం వల్ల వ్రతభంగం కలగలేదు. కాగల కార్యం ఆలోచించి సుబాహుడితో మారీచుడిని ఎందుకు చంపలేదో, అలాగే, ఈ ఉంగరాన్ని కూడా పరిత్యజించలేదు. కాని సొగసుకోసం వుంచుకోలేదు. ఇంకో విషయం....ఈ ఉంగరం సీత రామచంద్రమూర్తికి ఇచ్చింది. వివాహ సమయంలో వధూవరులు ఉంగరాలు మార్చుకునే ఆచారం ఇప్పటికీ వుంది. దాని విలువ మాత్రం కొంచెం చెడింది. ఈ ఉంగరాలను భర్త జీవించినంతకాలం భార్య, భార్య జీవించినంతకాలం భర్త విడవరాదు. స్త్రీలకు మంగళసూత్రం ఎలాగో, అలాగే, భర్తలకు ఈ ఉంగరం అలాంటిది. తక్కినవన్నీ త్యజించినప్పటికీ దీన్ని మాత్రం త్యజించకూడదు. దాన్ని త్యజించడం అంటే భార్యను త్యజించినట్లే. ఆ కారణాన రామచంద్రమూర్తి దాన్ని విడవకుండా ధరించాడు. సీతాదేవిని నమ్మించకలిగింది మరేదీ లేదు కనుక, తానిచ్చిన ఉంగరాన్ని, రాముడి వేలుకుండే ఉంగరాన్ని, సీత ఎప్పుడూ చూస్తుండే ఉంగరాన్ని హనుమంతుడికి ఇచ్చాడు శ్రీరాముడు.

శ్రీరాముడిలా చెప్పగా, హనుమంతుడు ఉంగరాన్ని తీసుకుని, శిరం మీద ధరించి, రెండు చేతులు జోడించి, రామచంద్రమూర్తి పాదాలకు నమస్కరించి నిలబడ్డాడు. తరువాత ఆయనతో సహా వానరులు అందరూ భక్తితో, తమ ప్రభువు అజ్ఞానుసారం పెద్ద మిడతల దండులాగా భూమంతా ఆక్రమించుకుంటూ చాలా వేగంగా పోయారు. వానరులంతా ఎవరికీ వారే తామే సీతను వెతుకుతామనీ, సీతను వెతికి తెస్తామనీ కేకలు వేయసాగారు.

◆❖◆

సమస్త భూమండలం తిరిగిన సుగ్రీవుడు

సీతాదేవిని వెతకడానికి నలుదిక్కులకూ ఒక్కొక్క వానర నాయకుడి నేతృత్వంలో కోటానుకోట్ల వానర వీరులను పంపించే ముందర వాళ్ళు వెళ్లే దిక్కులో వున్న ప్రదేశాలను వివరంగా చెప్పాడు వాళ్లకు సుగ్రీవుడు. ఒక విధంగా ఆయన మాటల్లో అది సమస్త భూమండలమే! వానరులంతా ప్రయాణమై సీతాన్వేషణకు వెళ్లిపోయిన తరువాత సుగ్రీవుడితో రామచంద్రమూర్తి, ఈ సమస్త భూమండలం ఆయనకెలా తెలుసని ప్రశ్నించాడు. జవాబుగా సుగ్రీవుడు శ్రీరాముడికి....

దుందుభి అనే దైత్యుడు దున్నపోతు ఆకారంలో వాలిమీదకు యుద్ధానికి వచ్చిన సంగతి, వాలి అతడిని మలయ పర్వతం దాకా తరిమికొట్టిన సంగతి, వాడు భయపడి పర్వతం గుహలోకి ప్రవేశించిన సంగతి, వాడిని చంపాలని వాలి కూడా గుహలోకి వెళ్ళిన విషయం, తాను వినయంగా గుహద్వారం దగ్గర వుండిపోయిన వ్యవహారం, ఒక్క సంవత్సరం గడిచినా అన్న రాలేదన్న విషయం, దరిమిలా నెత్తుటి వరదలు బిలమంతా నిండిన విషయం, అది చూసి వాలి చనిపోయాడని బాధపడడం, ఒక పెద్ద గుండును వాకిటికి అడ్డంగా పెట్టి కిష్కింధకు రావడం, అన్న చనిపోయాడని నిశ్చయించి రాజ్య భారాన్ని చేపట్టిన విషయం అంతా చెప్పాడు.

ఆ తరువాత దానవుడిని చంపి వాలి నగరానికి రావడం, తాను అతడి కాళ్లకు మొక్కి రాజ్యాన్ని అప్పగించడం, అయినా వాలి కోపంతో తనను ఇల్లు వెళ్లగొట్టి చంపడానికి ప్రయత్నం చేయడం, వాలిని తప్పించుకోవడానికి తాను తన మంత్రులతో సహా రేయింబవళ్ళు వేగంగా పరుగెత్తడం, వాలి వెంటాడడం, భూమండలం అంతా తనకు కాళ్లవాపు వచ్చేదాకా పరుగెట్టడం వివరించాడు సుగ్రీవుడు. అప్పుడు స్పష్టంగా అద్దంలో చూసినట్లు భూమండలం అంతా చూశానంటాడు. తూర్పు దిక్కుగా పోయి, పెద్ద చెట్లు, సరస్సులు, నదులు, కొండలు, తూర్పు కొండ, పాలసముద్రం చూసి వెనక్కు తిరిగాడు. వాలి తరుముతుంటే దక్షిణ దిక్కుగా పరుగెత్తి, వింధ్య పర్వతాలలోని వృక్షాలను, చందనాలను చూశాడు. పశ్చిమంగా పోయి అస్తాద్రి మొదలైనవి చూశాడు. ఉత్తరంగా పోయి హిమాలయం, మేరువు, సముద్రం

చూశాడు. ఆ విధంగా ఆనాడు భూమండలమంతా కళ్లారా చూశాను అంటాడు. తానూ చూసిన విధమంతా జ్ఞాపకం వుంచుకున్న సుగ్రీవుడు వానరవీరులకు ఆ వివరాలను చెప్పాడు. చెప్పి ఆ స్థలాలన్నింటిలో సీతను వెతకమంటాడు.

సీతను వెతకడానికి ముందుగా తూర్పు దిశకు వినతుడిని పొమ్మన్నాడు. ఆ దిక్కున వున్న ప్రదేశాలను వివరించాడు. సరయూ నది, గంగ, కౌశికిన, మనోహరమైన సింధు, యమున, సరస్వతి వున్నాయి. కొండలతో, వనాలతో కూడిన మహీనది, కాలమహి, బ్రహ్మమాల, విదేహం, మాలవం, కాశికాపురం, మగధదేశ గ్రామాలు, కోసలం వున్నాయి. ఇవి కాకుండా సముద్రమధ్యాన. ఏడు ఖండాలతో కూడిన యవద్వీపం, స్వర్ణరూప్యకమనే దీవులను దాటి పోతే ఆకాశాన్ని అంటే శిఖరంకల శిశిరం అనే పర్వటం వుంటుంది. అది దాటిపోతే, ఎర్రటి నీళ్లు, లోతు, మహా వేగంకల శోణ నాదం వుంటుంది. ఇది సముద్రానికి అవతలి ఒడ్డున వుంటుంది.

ఎర్రటి నీళ్లున్న సురాసముద్రాన్ని చూసుకుంటూ పోతే, బంగారం, మణులతో ప్రకాశిస్తూ కైలాసంతో సమానమైన, విశ్వకర్మ నిర్మించిన గరత్మంతుడి గృహాన్ని చూడవచ్చు. అక్కడ తెల్లటి మేఘంలాగా పాల సముద్రం వుంది. నిర్మలమైన పాల సముద్రం మధ్యలో ప్రసిద్ధమైన ఋషభ పర్వతం వుంది. అది తెల్లటి కాంతికలదై, దివ్యమైన పరిమళాలతో, పూలతో కూడిన బంగారి చాయకల చెట్లతో నిండి వుంటుంది. అక్కడే బడలిక పోయే సుందరమైన కొలను వుంటుంది. దాని పేరు సుదర్శనం.

ఆ కొలనులో తెల్లటి కింజల్కాలు కల తెల్ల కమలాలు వుంటాయి. వాటి కోసం కిన్నరులు, చారణులు, దేవతలు, వారి సమూహాలు, అప్సరసలు, జలకేళి కొరకు వస్తుంటారు. ఆ పాల సముద్రాన్ని దాటిపోతే, ప్రాణికోటికి భయం కలిగించే, యౌర్య మహర్షి కోపం మూలాన పుట్టిన గుర్రపు ఆకారంకల అగ్ని కనబడుతుంది. ఆ శుద్ధోదక సముద్రాన్ని దాటి అటువైపు పోగా అక్కడ పదమూడు యోజనాలు కల బంగారు రాయికల బంగారు కొండ వుంది.

అటు పిమ్మట బంగారుమయమైన తూర్పు కొండ వుంది. ఆ పర్వత సమూహంలో ఆకాశాన్ని తాకుతూ, బంగారుమయమై, నూరామడల విస్తీర్ణం కల అందమైన అరుగు వుంది. అక్కడ మద్ది చెట్లు, తాటి చెట్లు, చీకటి మాకులు, కొండ గోగులు, సూర్యకాంతితో పూచి వుంటాయి. అక్కడ యోజనం వెడల్పున, పది ఆమడ ఎత్తున పర్వత శిఖరం వుంది. దాని పేరు సౌమనసం. సూర్యుడు జంబూద్వీపం ఉత్తర భాగంలో తిరుగుతూ ఆ కొండమీదకు వచ్చినప్పుడు మేరువు దక్షిణ దిక్కువారికి కనపడుతుంది. దాని పక్కదే సుదర్శనం. ఈ గొప్ప ద్వీపంలో సమస్త ప్రాణి సమూహాలకు నేత్ర కాంతి కలిగించే గొప్ప తేజంతో సూర్యుడు ప్రకాశిస్తుంటాడు.

బ్రహ్మ దేవుడు భూలోకానికి, తక్కిన లోకాలకు, ద్వారంగా చేసిన కారణాన, సూర్యుడు సంచరించడానికి మొదలు అక్కడి నుండే బయల్దేరడం వల్లా, దాన్ని పూర్వ దిశ అంటున్నారు. ఆ తూర్పుకొండకు ఆవల దేవతలు వుంటారు. అక్కడ చంద్ర-సూర్య కాంతులు లేవు. చీకట్లు వ్యాపించి వుంటాయి. అక్కడి దాకా పోవచ్చును కాని ఆ తరువాత పోవడం సాధ్యపడదు.

దక్షిణ దిక్కుకు నీలుడిని, హనుమంతుడిని, జాంబవంతుడిని, అంగదుడిని, తదితర ప్రసిద్ధ బలులను పొమ్మన్నాడు. వీళ్లందరికీ దక్షిణ దిక్కున కల కొండల, గుట్టల, అడవుల గురించి చెప్పాడు.

అనేక వృక్షాలు, లతలు, వేయి శిఖరాల పర్వత శ్రేష్టం వింధ్యము, పెద్ద-పెద్ద పాములు కల నర్మద, విశాలమైన గౌతమీ అనే పేరున్న నదీ తీరం, కృష్ణ, మహానది, వరద, మేఖల (ఇదే అమరటంక పర్వతం... ఇక్కడే నర్మద పుట్టుతుంది), ఉత్కలం, దశార్ణము, ఆశ్వవంతి, అవంతి, విదర్భ, మహిషి ఋషికాలు, వంగా, కాశీ, కళింగ, అంగ దేశాలుంటాయి. కొండలు, గుహలు, నదులున్న దండకారణ్యంలో గోదావరి నది వుంటుంది. ఆంధ్ర, పుండ్ర, చోళ, పాండ్య, కేరళ, దేశాలు, సహ్యా పర్వతం వుంటాయి. కావేరి వుంటుంది. సముద్రాన్ని కలియబోయే తామ్రపర్ణీనది వుంది.

దానికి అవతల బంగారు రేకులతో ప్రకాశించే, శోభావిలసితమైన పాండ్యనగరి తలవాకిటి వుంది. సముద్రం లోపల, అగస్త్యుడు పూర్వం మహేంద్ర పర్వతం నిలిపాడు. అది నీళ్లల్లో మునిగీ-మునగనట్లు కనిపిస్తుంది. సముద్రం మధ్యలో మనుష్యులు పోలేని నూరామడల విస్తారంకల ద్వీపం వుంది. ఆ ద్వీపంలోనే రావణాసురుడు వుండే పట్టణం వుంది.

దక్షిణ సముద్రం మధ్యలో అంగారక (దీన్నే సుందరకాండలో సింహిక అని పిలిచారు) అనే రాక్షసి వుంది. అది ఆకాశాన పోయే వారి నీడను పట్టుకుని నిలిపి బక్షిస్తుంది. ఆ ద్వీపం నుండి నూరామడ పోతే, అక్కడ సిద్ధులు, చారణులు వుండే, సూర్య-చంద్ర కిరణాలతో సమానమై, అందంగా వుండి, సముద్ర జలాలతో చుట్టబడ్డ, ఆకాశాన్ని తాకే శిఖరం కలిగిన పుష్పితకం అనే పర్వతం కనిపిస్తుంది. దాని బంగారు శిఖరాన్ని రాసుకుంటూ సూర్యుడు దక్షిణాయనంలో దాని వెండి శిఖరానికి వస్తాడు. దక్షిణాయనంలో దీనికి దక్షిణంగా సూర్యుడు పోడు.

ఆ పర్వతాన్ని దాటి పద్నాలుగు ఆమడలు పోతే వైద్యుతమైన సూర్యవంతం అనే కొండ వస్తుంది. ఆ కొండలోనే విశ్వకర్మ అగస్త్యుడికి బంగారంలాగా ప్రకాశించే ఆమడ వెడల్పు, పది ఆమడ ఎత్తుకల, దివ్య రత్నాలతో విలసిల్లే ఇల్లు నిర్మించి ఇచ్చాడు. ఆ మహా పర్వతంలో సర్పాలతో రక్షించబడే భోగవతి అనే పేరుకల సర్పరాజైన వాసుకు నివాస స్థలం వుంది. ఆ పాముల నగరంలోపల అక్కడక్కడా రహస్య స్థలాలు వున్నాయి. అవన్నీ దాటి పోతుంటే, వృషభాకారం కలిగి, కాంతివంతమై, దేవతా సంబంధమై, అగ్ని కాంతితో, గోరోచన కాంతితో వెలిగే ఋషభం అనే పర్వతం వుంటుంది. అది భూమికి పొలిమేర. అంటే ఆవల సముద్రం వుందని అనుకోవాలి.

దాన్నీ దాటిపోతే ఆ పిమ్మట భయానకమైన యమలోకం వుంటుంది. కాబట్టి మనుష్యులకు ఆ యమలోకానికి పోవడం సాధ్యం కాదు. ఆ నగరాన్ని చుట్టుకుని భయంకరమైన చీకటి వ్యాపించి వుంటుంది. అక్కడి దాకా పోవచ్చు. ఆ తరువాత పోవడం అసాధ్యం.

ఆ తరువాత సుగ్రీవుడు సుషేణుడిని పిలిచి, పశ్చిమంగా పొమ్మంటాడు.

పశ్చిమ దిశగా పోతే, సురాష్ట్రం (ఇప్పటి సూరత్), బాహ్లికం, శూరము, భీమమనే దేశాలు విశాలంగా వుంటాయి. పడమటగా ప్రవహించే నదులు, మునులుండే అడవులు, కొండలు, నీరులేని

ప్రదేశాలు, పెద్దరాల దేశాలను దాటిపోతే పశ్చిమ సముద్రం వస్తుంది. అది దాటిపోయి మురచీ పట్టణం, జటీపురం, అవంతిని, అంగలోప వుంటాయి. అక్కడి నుండి సింధు నది సముద్రంలో పడేచోటు వస్తుంది. అక్కడ దక్షిణలోయల వెంట వుండే హల పర్వతాన్ని చూడవచ్చు. అక్కడ పెద్ద మ్రాకులు, అనేక శిఖరాలు కలిగి ఆకాశాన్ని అంటే, రెక్కలుకల దానిలాగా ఎగిరే సింహాలుండే చరియలు కల హేమగిరి వుంది.

ఆ పర్వతం దాటి నూరామడలు పోతే, చూడడానికే అసాధ్యమైన పారియాత్ర పర్వత (పశ్చిమ రాజపుత్ర స్థానంలో వున్న ఇప్పటి సోలేమాన్ రేంజ్ కావచ్చు) శిఖరాన్ని చూడవచ్చు. గంధర్వులు వుంటారక్కడ. వీరి దేశం గాంధార దేశం. ఇది ఇప్పటి ఆఫ్ఘానిస్తాన్. ఇందులోని గాంధారం అంటే కాందహార్. అక్కడ పవిత్రమైన వైడూర్యకాంతికలదై వజ్రాల దృఢమైన కొండ వుంది.

ఆ కొండ పేరు వజ్రధరం. అందులో చిత్రమైన నూరామడల చదరమైన నేల వుంది. దానికి ఆవల సముద్రంలోని నాల్గవ భాగంలో చక్రవంతం అనే పెద్ద పర్వతం వుంటుంది. అక్కడ విశ్వకర్మ రచించిన సాహస్రార చక్రం వుంది. దానికి వేయి అంచులున్నాయి. దాన్ని రక్షించే హయగ్రీవుడిని, పంచ జనుడిని చంపి, విష్ణువు హయగ్రీవుడి చక్రాన్ని, పంచ జనుడి వెన్నెముక అయిన శంఖాన్ని తీసుకున్నాడు. పంచజనుడి వల్ల లభ్యమయింది కాబట్టే శంఖానికి పాంచజన్యమని పేరు వచ్చింది. ఆ తరువాత అరవై ఆమడలు పోతే సముద్రంలో విశాలమైన వెండి శిఖరంతో కూడిన వరాహ పర్వతం వుంటుంది. విశాలమైన ఆ పర్వతంలో ప్రాగ్జ్యోతిషం (దీని ఇప్పటి పేరు అస్సాం) అనే పట్టణం వుంది.

ఇవన్నీ కలయ చూస్తూ పోతుంటే సెలయేళ్లున్న సర్వసౌవర్ణం అనే పేరున్న కొండ వస్తుంది. ఆ పర్వతానికి మేఘవంతం అనే పేరు. అది దాటిపోతే అరవై వేల కొండలు వస్తాయి. ఆ పర్వతాల మధ్య ప్రదేశంలో ఉత్తర మేరుసావర్ణి అనే పర్వతం వుంది. విశ్వులు, ఆదిత్యులు, మరుత్తులు, వసువులు మొదలైనవారు ప్రసిద్ధులైన దేవతలను సాయంకాల సమయంలో భక్తితో బంగారు కొండమీద వున్న సూర్యుడిని సేవించడానికి వస్తారు. ప్రాణకోటికంతా కానరానివాడై లోకమంతా చీకటిలో మునిగేట్లు చేసి తానూ పడమటి కొండకు పోతాడు.

గడియకు పదివేల ఆమడల వంతున పోయి సూర్యుడు పడమటి కొండకు చేరుకుంటాడు. ఆ పర్వత శిఖరం కొనలో సూర్యకాంతి కల మేడలతో నిండిన దివ్యమైన ఒక ఇల్లు వుంది. అది విశ్వకర్మ నిర్మితం. అక్కడ అస్తపర్వతానికి, మేరుపర్వతానికి మధ్యన బంగారుమయమై, చిత్రమైన అరుగు కలిగి, పది తలల తాల వృక్షం కళ్లకు ఆనందంగా కనపడుతుంది. సూర్యుడు ఉదయ సమయాన ఇంతదాకా తన తేజస్సుతో చీకట్లను తరిమి పడమటి కొండకు పోతాడు. ఆ తరువాత సూర్యరశ్మి వుండదు. కాబట్టి ఏమున్నదో తెలియదు. చీకట్లు వ్యాపించి వుంటాయి.

ఆ తరువాత సుగ్రీవుడు మహాబలవంతుడైన శతవలి అనే వాడిని ఉత్తర దిక్కుకు పొమ్మంటాడు.

ఉత్తరాన హిమవత్పర్వతం వుంది. మ్లేచ్ఛ దేశంలో శూరసేన, పుళింద, ప్రస్థర, మద్రక, భారత (హస్తినాపుర), దక్షిణ కురుభూములు, కాంభోజ, యవన, శకదేశం, అరట్ట, బాహ్లిక, పౌరవ, టంకణ, ఋషిక దేశాలు, జీనా దేశం, పరమ చీన (మంచూరియా–మంగోలియా) దేశం, నిహార, దరద

ప్రదేశాలు, హిమవత్పర్వత ప్రాంతం వుంటాయి. సోమాశ్రమం, కాలపర్వతం అవతలవైపున గుహలుంటాయి. ఆ పర్వతం దాటి పోగా సుదర్శనం అనే పర్వతం వస్తుంది. అది దాటిపోయిన తరువాత దేవసఖమనే పర్వతం వుంటుంది. దానికి అవతల కొండలు, నదులు, చెట్లు, జీవజంతువులు లేని నూరామడల పొడవున్న దేశం వుంటుంది. దీన్ని గోబి, శాము ఎడారి అంటారు. ఆ మరుభూమిని దాటిపోతే కైలాసపర్వతం కనబడుతుంది. (హిమాలయానికి ఉత్తరాన టిబెట్ దేశం వుందిప్పుడు). అక్కడ తెల్లటి మేఘంతో సమానమై, బంగారంతో అలంకృతమై, తెల్లటి కాంతికల కుబేరుడి ఇల్లుంది. దాన్ని విశ్వకర్మ నిర్మించాడు".

అక్కడ వస్వౌకసార అనే కొలను వుంది. కుబేరుడు ఎల్లప్పుడూ అక్కడ వినోదంగా క్రీడిస్తుంటాడు. ఆ ప్రదేశంలో పూర్వం కుమారస్వామి శక్తి ప్రయోగంతో నిర్మించిన శిబిరం వుంది. ఆ దారిలోనే హంసలు మానస సరస్సుకు పోయివస్తుంటాయి. ఆ బిలంలోకి పోవడం అంత సులభం కాదు. అక్కడ వృక్షం, కామశైలం, మానసం అనే పర్వతాలున్నాయి. దేవదానకులకు కూడా మాంసం అనే పర్వతం దగ్గరికి పోవడానికి సాధ్యంకాదు.

క్రౌంచపర్వతం దాటిన తరువాత మైనాక పర్వతం వస్తుంది. ఆ పర్వతం మీద మయుడనే దానవుడు కట్టుకున్న సుందరమైన గృహం వుంది. అక్కడ సిద్ధులుండే ప్రదేశంలో వైఖానసం అనే సరస్సు వుంది. ఆ సరస్సుకు ఆవల సూర్యకాంతి, చంద్రకాంతి, నక్షత్రకాంతి లేదు. అక్కడ మేఘాలు లేవు. ఆకాశం శబ్దం లేకుండా వుంటుంది. మీరది దాటిపోతే శైలోదం అనే శిలానది వుంది. దానికి ఇవతల, అవతల కీచకాలు అనే పేరుకల వెదుళ్ల పొదలుంటాయి. ఆ ఏటి నీళ్లలో దిగినవారు రాళ్లుగా మారిపోతారు కాబట్టి ఆ నది దాటాలంటే, ఆ పొదల వెదుళ్ళు పట్టుకుని పోవాలి, రావాలి. ఆ దరిన, ఈ దరిన వెదుళ్ళు కలిసికొని అల్లుకుని వుంటాయి. ఆ ఉత్తర కురుభూములు పుణ్యం చేసిన పురుషులకు భోగస్థానాలై వుంటాయి".

అక్కడ అనేక నదులున్నాయి. వాటిల్లో వైడూర్యాలున్న ఆకులు కలిగిన బంగారు కమలాలుకల తామరతూండ్లు వున్నాయి. అక్కడ ఎర్రటి కలువల వనాలున్నాయి. అక్కడి సరస్సులు బంగారువన్నె, బాలసూర్యుడివన్నె కలిగి వుంటాయి. చూడడానికి చాలా సంతోషకరములై వుంటాయి. జాతినీలాల కాంతికల రేకులు, అపరంజి బంగారు కాంతికల కింజల్కాలున్న నల్లటి కలువలతో నిండిన సరస్సులు అక్కడ అందంగా వుంటాయి. అగ్నితో సమానంగా బంగారు కాంతితో కొండలక్కడ దండిగా వున్నాయి.

ఆ ఉత్తర కురు భూముల్లో కొన్ని పర్వతాలు అసమానమైన, ఆశ్చర్యకరమైన పీటలు, మంచాలు కాస్తాయి. దాన్ని దాటి ఉత్తరంగా పోతే, సముద్రంలో సోమశైలం అనే పేరున్న బంగారుమయమైన పర్వతం వుంటుంది. దాన్ని ఇంద్రలోక వాసులు, బ్రహ్మ లోకవాసులు కాపాడుతుంటారు.ఆ ప్రదేశంలో సూర్యకాంతి లేకపోయినా ఆ బంగారు కాంతి వల్ల వస్తువులు కనబడుతుంటాయి.

అక్కడ షాడ్గుణ్య పరిపూర్తికలిగి ప్రపంచ స్వరూపుడైన విష్ణువు, ఏకాదశ మూర్తులు ధరించి, మన్మథ విరోధి అయిన శివుడు, ప్రపంచాన్ని సృష్టించిన బ్రహ్మ కాపురం వుంటారు. ఉత్తర కురుభూములకు ఉత్తరంగా వున్న సోమపర్వతం చేరబోవడం సాధ్యపడదు. ఆవలి దేశం కట్టుపాటు లేనిది. సూర్యకాంతి వుండదు. అక్కడ ఏమున్నదో ఎవరికీ తెలియదు.

◆❖◆

అంగదుడిది సుగ్రీవుడి మీద తిరుగుబాటా?

సీతాదేవిని వెతకడానికి సుగ్రీవుడి ఆజ్ఞానుసారం పంపబడిన వానరులు భూమండలం అంతా వెతికి నెల గడువు తీరగానే తిరిగి వెనక్కు వచ్చారు. తూర్పు దిక్కుకు పోయిన వినతుడు, ఉత్తర దిక్కుకు పోయిన శతవలి, పశ్చిమ దిక్కుకు పోయిన సుషేణుడు నెలకాగానే మరలి వచ్చి ఎక్కడా సీత కనబడ లేదనీ, సీత జాడ లేదనీ చెప్పారు.

ఇక హనుమంతుడు సీతాదేవిని తప్పక చూసే వస్తాడని ఆయన రాకకొరకై అందరూ వేచి చూస్తున్నారు. హనుమంతుడు సుగ్రీవుడు సూచించిన విధంగానే, అంగదుడితో, తారుడితో, ఇతరులతో కలిసి మొదలు వింధ్య పర్వతం దగ్గరకు పోయాడు. సీతాదేవి కొరకై అంతటా వెతికారు. సీత ఎక్కడా కనబడలేదు. ఎక్కడ కూడా సీతాదేవి కనబడక పోవడంతో వ్యసనపడుతూ ఒక చెట్టు కింద చేరి వుండడం చూసిన అంగదుడు, తానూ బడలికతో ఉన్నప్పటికీ, తనలాగే శ్రమపడిన వానరులను ఉత్సాహపరిచే మాటలు చెప్పాడు. మళ్లీ–మళ్లీ వెతుకుదాం అన్నాడు. అంగదుడి మాటలు విన్న వారంతా బడలిక తీరగానే మళ్లీ వింధ్య పర్వతం నాలుగు దిక్కులా వెతకసాగారు.

అలా వెతుకుతుంటే ఋక్షబిలం అనే పేరుకల ఒక పెద్ద బిలాన్ని చూశారు వానరులు. అప్పుడు ఆంజనేయుడు అక్కడ నీళ్లున్న బావో, మడుగో వుండడం నిజం కాబట్టి లోపలికి పోదామన్నాడు. అంతా కలిసి ఆ బిలంలోకి ప్రవేశించి, ఒక ఆమడ దూరం దప్పికతో ప్రయాణం చేసిన తరువాత, వెలుతురున్న ఒక ప్రదేశాన్ని, అక్కడ కొన్ని తినుబండారాలను వానరులు చూశారు. వారంతా అలా–అలా వెతుకుతుంటే ఒక చోట నారచీరెలు, కృష్ణాజినం, వస్త్రంగా ధరించి తపస్సు చేస్తున్న ఒక స్త్రీ కనిపించింది.

అప్పుడు హనుమంతుడు ఆ ముసలిదాని దగ్గరికి పోయి, తమ ఆకలిదప్పుల విషయం చెప్పి, అక్కడున్న భోజన పదార్థాలు, పండ్లు, ఫలాలు, పుష్పాలు, పరిమళాల బంగారు చెట్లు, నిర్మల జలాలు, బంగారు కమలాలు, ఎవరి తపోమహిమవల్ల కలిగాయని అడిగాడు. ఆమె గురించి, ఆమె మహిమ గురించి ప్రశ్నించాడు. జవాబుగా స్వయంప్రభ అనే ఆమె ఇలా చెప్పింది.

"మాయలుకల రాక్షస ప్రభువైన మయుడు తన అద్భుత శక్తితో దీన్ని నిర్మించాడు. రమ్యమైన ఈ బంగారు గృహాన్ని నిర్మించినవాడు రాక్షసులకు విశ్వకర్మ అయిన దనుజ శ్రేష్టుడు. అతడు ఈ మనోహరమైన వనాన్ని కల్పించి ఇక్కడ వుండసాగాడు. దానవుడైన మయుడు దేవతాస్త్రీ అయిన హేమతో కలిసి వున్నందుకు కోపగించిన ఇంద్రుడు వజ్రధారతో అతడిని చంపాడు. ఆ మయుడు హేమకు ఈ బంగారు గృహాన్ని, వనాన్ని ఇచ్చాడు. ఇక్కడ సమస్త సుఖాలున్నాయి. ఆటపాటల్లో నేర్పరైన హేమకు నేను ప్రేమపాత్రమైన సఖిని. ఆమెదే యీవనం. ఆమెవల్ల నేను దీన్ని వరంగా పొంది దీన్ని రక్షిస్తున్నాను. నేను మెరుసావర్ణి కూతురును. నా పేరు స్వయంప్రభ. ఈ మూలాలు, ఫలాలు, ఇతర పదార్థాలు, పానీయాలు తృప్తి తీరా తినండి, తాగండి. శ్రమ తీరిన తరువాత మీ వృత్తాంతం చెప్పండి".

హనుమంతుడు తమ చరిత్ర సమస్తం ఆమెకు వివరించాడు. తామొచ్చిన పని గురించీ చెప్పాడు. ఆమె ఇచ్చిన ఫలమూలాలు తిని బడలిక తీర్చుకుని, తమను ఈ బిలం నుండి మళ్లీ భూమ్మీదకు చేర్చమన్నాడు. తన తపఃఫల బలంతో వానరులందరినీ నిమిషంలో బిలం నుండి దాటించింది ఆమె. వింధ్యపర్వతం దగ్గర ప్రస్రవణం అనే పెద్ద కొండదగ్గర దింపి స్వయంప్రభ వెళ్లిపోయింది. స్వయంప్రభ సర్వజ్ఞ అని అనుకోవాలి. ఆ కారణాన ఆమెకు భూత-భవిష్యత్-వర్తమానాలలో ఏం జరుగుతుందో తెలుసు. కాబట్టి ఎక్కడ వాళ్లను వదిలితే భవిష్యత్ కార్యం నెరవేరుతుందో అక్కడే, సముద్రతీరంలో విడిచిందని అర్థం చేసుకోవాలి.

అప్పుడు అంగదుడు వానరులతో ఇలా అన్నాడు. "మీరంతా రాజుకు విశ్వాసపాత్రులైన సేవకులు. రాజాజ్ఞప్రకారం, రామకార్యం నెరవేర్చడానికి, నామీద ప్రేమతో నన్ను ముందుండే వాడిగా చేశారు. ముఖ్యుడిగా వుండడానికి నేను అంగీకరించి మీవెంట వచ్చాను. ఇంత చేసికూడా వచ్చినపని చేయకుండా మరలిపోతే సుగ్రీవుడు మనల్ని తునకలు-తునకలుగా నరుకుతాడు. ఇందులో సందేహం లేదు. సుగ్రీవాజ్ఞ నెరవేర్చకుండా బతికి సుఖపడేవాడు ఎవడు? నియమించిన గడువుకాలం దాటిపోయింది. మనం బాధపడి చేయగలిగింది ఏమీలేదు. కాబట్టి మనకిప్పుడు ప్రాయోపవేశం ఒక్కటే మార్గం అని తోస్తున్నది".

"సుగ్రీవుడు స్వభావసిద్ధంగా క్రూరుడు. దానికితోడు ఇప్పుడాయన రాజు. అధికార బలం వచ్చింది. రాముడి భార్య వార్త చెప్పకపోతే మనల్ని చంపుతాడు కాని క్షమించి వదలడు. కాబట్టి అక్కడికి పోయి చావడం కంటే ఇక్కడే చావడం మంచిది. మనమంతా మరలిపోతే, పోయిన వెంటనే చంపుతాడు. అక్కడికి పోయి అవమానపడి ఘోరమైన చావు చావడం కంటే ఇక్కడే చావడం మేలుకదా! నాకు యౌవరాజ్యం ఇచ్చినవాడు సుగ్రీవుడు కాదు. రామభద్రుడు. ఆయన ఆజ్ఞ మీరలేక తనకిష్టం లేకున్నా నన్ను యువరాజు చేశాడు. నామీద సద్గుణభద్రుడైన రామభద్రుడికి దయ వున్నది కాబట్టి నన్నపుడు ఏమీ చేయలేక వూరకున్నాడు. ఇప్పుడు సమయం దొరికింది కాబట్టి ఆయన ఆజ్ఞ మీరానన్న నెపంతో నన్ను చంపుతాడు. అక్కడికి పోయి చావడం కంటే పుణ్యస్థలమైన ఈ సముద్రతీరంలో చావడం మేలు"

అంగదుడిలా చెప్పడంతో భయపడుతున్న వానరులను చూసి తారుడు ఇలా అన్నాడు. "మీరెందుకు దుఃఖపడతారు. చావాల్సిన పనిలేదు. మనమంతా ఈ బిలంలో మళ్లీ ప్రవేశించుదాం. మనకు కావాల్సిన

చెట్లు, తినడానికి భోజ్యాలు, కందమూలఫలాలు, పరిశుద్ధమైన వనం, పరిశుద్ధమైన నీరు అక్కడ వున్నాయి. అవేకదా మనకు కావాల్సింది. భయం మాట కూడా అక్కడ వినపడదు. అక్కడ మనముంటే సుగ్రీవుడే కాదు, ఇంద్రుడైనా, ఇంద్రసమానుడైన రామచంద్రుడైనా మనల్ని చేరలేడు".

కిష్కింధకు పోవాల్సిన పనిలేదు, ఇక్కడే వుందాం, అని అంగదుడు చెప్పిన మాటలకు అనుకూలంగా తారుడు చెప్పిన మాట విన్న వానరులందరూ ఎలా చేస్తే మనకు కీడు కలగదో అలాగే చేద్దామని అన్నారు. అంగదుడు, తారుడు ఇలా మాట్లాడడం, దానిని వానరులు ఆమోదించడం గమనించిన హనుమంతుడు, సుగ్రీవుడి రాజ్యాన్ని అంగదుడు హరించాడని భావించాడు. తారుడు చెప్పిన మాటలను అంగదుడు, ఇతరులు నిషేధించలేదు. అంటే వారందరూ బిలంలోకి ప్రవేశించి అక్కడో, బయట అడవులలోనో వానర రాజ్యం ఒకటి ఏర్పరుచుకుంటారు. అప్పుడు ఏకంగా వున్న వానర రాజ్యంలో ద్వైవిధ్యం పుటుతుంది. అప్పుడు సుగ్రీవుడి రాజ్యం చెడిపోతుంది. సుగ్రీవుడిని విభేదించేవారు, వాలి పక్షపాతులు ఇక్కడికి చేరుతారు. అదలా వుండగా ప్రారంభించిన రామకార్యం చెడిపోతుంది. ఈ విధంగా ఆలోచించ సాగాడు హనుమంతుడు.

అంగదుడిని ఓదార్చడానికి హనుమంతుడు పూనుకున్నాడు. "ఏమీ అంగదా! నువ్వీవానరులను నీ చేతికిందకు తీసుకుని ప్రత్యేక వానరరాజ్యం స్థాపించాలని ఉపాయంతో వున్నావా? ఎలా చేస్తావో నేనూ చూస్తాను. వీరంతా రామకార్యం కొరకు నీవెంట వచ్చారు కాని నీతోపాటు కలకాలం ఇక్కడ తమ ఇండ్లు–వాకిళ్లు, భార్య–బిడ్డలను వదిలి ఈ అడవిలో అల్లాడడానికి వచ్చారని అనుకుంటున్నావా? వీరంతా నీకు లోబడ్డారనుకో! అలాగైతే, నేనిప్పుడే పోయి రామలక్ష్మణులను, సుగ్రీవుడిని, తక్కిన సైన్యాన్నిమీ దురుద్దేశం చెప్పి ఇక్కడికి పిలుచుకొస్తాను. ఇప్పుడు మనం చేసింది అబుద్ధి పూర్వకాపరాధం. అప్పుడు మీరు చేయబోయేది రాజద్రోహం. బుద్ధిపూర్వకాపరాధం. కాబట్టి ఇప్పుడు దండం తప్పవచ్చు కాని అప్పుడు దండం తప్పదు. అప్పుడు నువ్వు, నీరాజ్యం ఏం కాబోతున్నదో ఆలోచించు". అని కోపంగా, ఉపాయంగా, భయం కలిగేట్లు చెప్పి మళ్లీ సామమార్గంలో ఇలా చెప్పాడు.

"అంగదా!నువ్వు యుద్ధంలో నీ తండ్రి కంటే నేర్పుకలవాడివి. కపిరాజ్యం అంతా తండ్రిలాగే భరించే శక్తికలవాడివి. అయినా ఒక్కటి ఆలోచించు. ఈ కోతులు ఎప్పటికీ చపల చిత్తులే. ఇప్పుడున్న బుద్ధి ఇంకాసేపటికి వుండదు. ఇలాంటి వీళ్లు తమ పెళ్లాలను, పిల్లలను, బంధువులను వదిలి కలకాలం ఇక్కడ నిన్నెందుకు కొలుస్తారు. ఇక్కడ వున్నవారంతా నీకు లోబడి వుంటారని అనుకుంటున్నావేమో? అది పొరపాటు. సుగ్రీవుడిని సుహోత్రుడు, నీలుడు, జాంబవంతుడు ఎలా వదలరో అలాగే నేనూ వదలను. నువ్విక్కడ నీ ప్రయత్నం మొదలు పెట్టగానే మేం సుగ్రీవుడి దగ్గరికి పోయి అంగదుడు ఇలా చేస్తున్నాడని చెప్పేవాళ్ళమే. వీరిని నువ్వు ఏవిధంగానైనా నీలో కలుపుకోలేవు. నువ్వు ఇంకోటి ఆలోచించడం లేదు. ఇక్కడ నీకున్న సేనకంటే అక్కడ సుగ్రీవుడికి ఎక్కువ సేనకలదని తెలుసుకో. మూడు భాగాలు అక్కడ వుంటే ఇక్కడ ఒక్క భాగం వుంది. కాబట్టి నీవల్ల సుగ్రీవుడికి భయం లేదు. బలవంతుడితో విభేదించి బలహీనుడు బతకగలడా?"

"వానరులను నమ్మి నువ్వు పినతండ్రితో పగబూనినా, వీరు చివరిదాకా నీతో వుండకుండా

వెళ్లిపోతారు. నువ్వొక్కడివే మిగులుతావు. నువ్వు బుద్ధిమంతుడివి. ఆలోచించి చూడు. వానరులు భార్యాబిడ్డలను తలచుకుంటూ, ఇక్కడ తినడానికి కందమూలాలు, తాగడానికి నీళ్లు లేక, దినమొక గండంగా శ్రమపడుతూ, దుఃఖస్థానమైన ఈ శయ్యలమీద, రాళ్లమీద, రప్పలమీద, నేలమీద, గడ్డిమీద ఎండనక–వాననక నిద్రిస్తూ, ఆ శ్రమపడలేక నిన్ను వదిలి వెళ్లిపోతారు. సుఖజీవనానికి, సుఖ శయ్యలకు, బంధువుల తోడుకు, అలవాటుపడ్డవారు ఈ ఘోరారణ్యాలలో నీకోసం ఎందుకు కష్టపడతారు? నీ మేలుగోరు బంధువులు, నీ స్నేహితులు, నిన్ను వదిలిపోగా నువ్వు ఒంటరివాడివై భయంతో గాలికి గడ్డిపోచ వణికినట్లు ఏ సమయంలో ఏమవుతుందో అని భయపడతావు. ఉత్తభయం మాత్రమే కాదు. నీకు కీడుకూడా కలుగుతుంది. నీ విరోధ బుద్ధి మానుకుని వినయంగా మా వెంట కిష్కింధకు రా. ఇదివరకులాగే నిన్ను నీ పినతండ్రి యువరాజుగా నియమిస్తాడు. నీమీద ఆయనకు ఎలాంటి ద్వేషం లేదు. ఆయన నిర్మలమైన మనస్సుకలవాడు. ప్రతిజ్ఞ తప్పనివాడు. నామాట నమ్ము. నీకెప్పుడూ సుగ్రీవుడు కీడుచేయడు. కాబట్టి యువరాజా! కిష్కింధకు పోదాం".

హనుమంతుడిలా సుగ్రీవుడిని ప్రశంసించి చెప్పగా తన మనసులో మాట మెల్లగా ఆయనకు చెప్పాడిలా. "తనపని చక్కపరిచి తన ప్రాణం కాపాడిన ఋజుమనస్కుడు రామచంద్రుడినే మరచిపోయినవాడు మరింకెవరి మేలు కోరగలడు? ఇది కృతఘ్నుతకు దృష్టాంతం. ఇలాంటివాడు ధర్మమార్గంలో నడుస్తాడా? ఈ విధమైన చపల చిత్తుడుని, స్మృతిలేనివాడిని, పాపాత్ముడుని, కృతఘ్నుడుని సద్వంశంలో పుట్టి గౌరవంగా బతకాలనుకున్న వాడెవరూ నమ్మరు. ఆయన తనకొడుకుకు రాజ్యం ఇస్తాడు కాని విరోధి కొడుకైన నన్ను ప్రాణాలతో కూడా వుండనిస్తాడా? ఆయనకు ఇప్పుడు కొడుకుల్లేకపోయినా ముందు–ముందు పుట్టరని ఏమిటి? కాబట్టి నేను బతికితే రాజ్యం ఆశిస్తాడని నన్ను చంపుతాడు. నా మనసులో వున్న ఆలోచనంతా చెప్పాను. ఈ కారణాన నేను స్పష్టంగా అపరాధం చేసినట్లే. దీనుడిని. నా రక్షణలో శక్తిలేనివాడిని. కాబట్టి నేను జీవించి దిక్కులేనివాడిలాగా కిష్కింధలో ఎలా వుండగలను? ప్రాణం తీపికదా? సుగ్రీవుడు నేనెక్కడ రాజ్యానికి ప్రభువునైతానో అని నన్ను బతకనీయడు. అక్కడికి వచ్చి చెరసాలలో పడి చావడం కంటే ఇక్కడ ప్రాయోపవేశం చేయడం మేలు".

అని చెప్పి అంగదుడు తోటి వానరులతో, "వానరులారా! మీరు మీ ఇష్టం వచ్చినట్లు మీమీ ఇండ్లకు పోవచ్చు. ఆజ్ఞ ఇస్తున్నాను. నేను కిష్కింధకు రాను. నేను ఎలా జీవించి వుండగలను?" అని అంటూ, దర్భలు పరచి, వాటిమీద తూర్పు ముఖంగా కూర్చుని మరణమే మేలని నిశ్చయించుకున్నారు. రామచంద్రుడితో సహా అందరినీ తలచుకుంటూ, జటాయువు పేరెత్తాడు. ఏ ప్రదేశంలోనైతే వానరులు చావాలని నిర్ణయించారో, అక్కడే, జటాయువుకన్నా దీర్ఘకాలం జీవించివున్నవాడు, గద్దలకు రాజు, పర్వతగుహలో వున్నవాడు, సంపాతి బయటకు వచ్చి, వానరులందరినీ సంతోషంగా చూశాడు. ఆయన రాకతో అంగదుడి కథ ఒక మలుపు తిరిగింది.

◆❖◆

సంపాతి వల్లే సీత జాడ తెలిసిందా?

సీతాన్వేషణలో విఫలమై, నిరాశా నిస్పృహలతో అంగదుడి ఆజ్ఞానుసారం ఏ ప్రదేశంలోనైతే వానరులు చావాలని నిర్ణయించారో, ఏ ప్రదేశంలోనైతే అంగదుడు దర్భల మీద పడుకుంటాడో, అక్కడే, దీర్ఘకాలం జీవించివున్న గద్దలకు రాజు, సంపాతి పర్వతగుహలో నుండి బయటకు వచ్చి, వానరులందరినీ సంతోషంగా చూశాడు. తానున్న చోటుకే దైవం కొత్త ఆహారాన్ని తెచ్చిందనుకున్నాడు. ఈ వానరులను దినానికి ఒకరిని వంతున వరుసగా చంపి తింటాను అనగా ఆ మాటలకు భయపడ్డ అంగదుడు హనుమంతుడితో ఇలా అన్నాడు.

“ఆంజనేయా! ఆహారం మీద ఆశకల ఆ పక్షిని చూశావా? సీతనే నెపంతో యముడే వానరులను చంపడానికి ఈ రూపంలో వచ్చాడు. మనమేమో శ్రీరాముడి కార్యం నెరవేర్చలేకపోయాం. ఇంతలో తటాలున ఈ ఆపద సంభవించింది. సీతాదేవికి మేలుచేయాలనుకున్న జటాయువుకు ఏం జరిగిందో మనందరికీ తెలుసుకదా! అలాంటి గతే మనకిప్పుడు తటస్థించింది. రామచంద్రమూర్తికి ఉపకారం చేయడానికే ధర్మం తెలిసిన జటాయువు శరీరాన్ని విడిచి కీర్తి గడించింది. రావణాసురుడి చేతుల్లో యుద్ధంలో నరకబడి పక్షిరాజు జటాయువు చనిపోయి పరమపదానికి పోయింది. కాబట్టి ఆయనే పుణ్యాత్ముడు. దశరథుడు చావడం, సీతను రావణుడు అపహరించడం వల్ల జటాయువు చావడం, వీటన్నిటివల్ల మనకు ప్రాణాపాయం సంభవించింది”. నేలమీద పడిన వానరులు అంగదుడు చెప్పిన వృత్తాంతం వింటుండగా సంపాతి మనస్సు చలించి, పరితాపం కలగడంతో, ఇలా అన్నాడు.

“అయ్యో! ఎన్ని రోజులకు నా తమ్ముడి పేరు వినడం జరిగింది! నా ప్రాణాలకంటే వాడు నాకు ప్రియుడు. వాడి మరణవార్త వినడంతో నా హృదయం చలించింది. దండకలో రావణాసురుడికి, వాడికి యుద్ధం ఎందుకు జరిగింది? ఆ యుద్ధంలో వాడు ఎలా చనిపోయాడు? వానరా! ఆ కథంతా చెప్పే నువ్వెవరివి? మీరు గొప్ప మనస్సుతో నన్ను కొండ మీదనుండి కిందకు దింపమని వేడుకుంటున్నాను. నా తమ్ముడు మిక్కిలి బలశాలి. ఎన్నో సుగుణాలను తెలిసినవాడు. అతడిని మీరు పొగుడుతుంటే

ఇన్నాళ్లకు ఇక్కడ వినగలిగాను. రామచంద్రమూర్తి తండ్రైన దశరథమహారాజుకు నా తమ్ముడు స్నేహితుడెలా అయ్యాడు? వానరులారా అదంతా వినాలని వుంది. వానర శ్రేష్టులారా! సూర్యకిరణాలతో నారెక్కలు కాలిపోవడంవల్ల నేను కొండ దిగలేను. నామీద కనికరం చూపి నన్ను మీదగ్గరకు తీసుకుపోండి". వానరులలో కొందరు పోయి దాన్ని కొండమీదనుండి కిందకు దింపారు. అప్పుడు అంగదుడు దాంతో ఇలా అన్నాడు.

"ఓ పక్షి శ్రేష్టమా! విను. దశరథమహారాజు కొడుకు, రామచంద్రమూర్తి, తండ్రి ఆజ్ఞానుసారం తన భార్యతో, తమ్ముడితో దండకారణ్యంలో ప్రవేశించాడు. ఆ సమయంలో రావణాసురుడు ఆ ముగ్గురూ జనస్థానంలో తిరుగుతున్నప్పుడు రామచంద్రమూర్తి భార్య సీతాదేవిని అపహరించుకుని పోయాడు. అలా తీసుకెళ్తున్న సమయంలో శ్రీరామచంద్రమూర్తి తండ్రికి స్నేహితుడైన జటాయువు జానకీదేవిని చూశాడు. ఆమెను విడిపించాలని ఆకాశంలో పోతున్న రావణుడిని ఎదుర్కొని వాడి రథాన్ని విరిచి ఆమెను భూమ్మీదకు దించాడు. అంతటితో ఆగకుండా రావణుడితో యుద్ధానికి దిగాడు. పక్షిరాజు రెక్కలను, యుద్ధంలో రావణుడు నరికాడు. అంతట జటాయువు మరణించాడు. రామచంద్రమూర్తి అతడికి అగ్ని సంస్కారాలు చేసి ఉత్తమ లోకాలు ప్రసాదించాడు. ఆ తరువాత నా పినతండ్రి సుగ్రీవుడితో స్నేహం చేసి నా తండ్రి వాలిని చంపాడు. ఆ తరువాత సీతను వెతకడానికి మమ్మల్ని దక్షిణ దిక్కుకు పంపాడు సుగ్రీవుడు. ఆమెకోసం మేం వెతికాం కాని ఆమె మాకు కనబడలేదు. కార్యం సాధించకుండా వెనక్కు తిరిగిపోతే మా ప్రాణాలు దక్కవు. కాబట్టి ఇక్కడే మరణిద్దామని నిశ్చయించుకున్నాం. ఈ మాట నిజం". అని చెప్పాడు.

మరణానికి సిద్ధమైన వానరులు కన్నీళ్లు కారుతుంటే దుఃఖపడుతూ తమ చరిత్రను తెలపగా సంపాతి వారితో ఇలా అన్నాడు. "రావణుడి చేతిలో చనిపోయిన జటాయువు నా తమ్ముడు. అతడి మరణ వార్త తెలిసికూడా రెక్కలు కాలిపోవడం వల్ల, ముసలివాడినైనందున, పగ తీర్చుకునే బలం లేనందున, ఏమీ చేయలేక ఇలా అనాథలాగా పడి సహించి వూరికే వున్నాను. పూర్వం వృత్రుడికి, ఇంద్రుడికి యుద్ధం జరుగుతున్న సమయంలో మేమిద్దరం మా వేగం తెలుసుకోవడానికి, ఒకరినొకరు గెలవాలన్న కోరికతో ఆకాశానికి ఎగిరి, సూర్యమండలం సమీపించడానికి పోవడానికి ప్రయత్నించాం. చక్రాకారంలో గాలిలో తిరుగుతూ, ఆకాశాన మేం పోతున్నప్పుడు సూర్యుడు నడినెత్తికి వచ్చాడు. అప్పుడు తమ్ముడు ఆ ఎండ వేడిని సహించలేక బాధపడ్డాడు. నేనప్పుడు ప్రేమతో అతడికి ఎండ తగలకుండా రెక్కలతో కప్పాను. ఫలితంగా నా రెక్కలు కాలిపోవడం, నేను వింధ్యపర్వతం మీద పడడం జరిగింది. నేనిక్కడ వుండడం వల్ల నా తమ్ముడి గురించిన వార్తలు వినలేకపోయాను".

ఇలా అంటున్న సంపాతితో అంగదుడు ఇలా అన్నాడు. "నువ్వు జటాయువు అన్నవే అయితే, నేను చెప్పినదంతా విన్నావు కదా! నీకు తెలిసుంటే, రావణుడు వుండే చోటు ఇక్కడికి దగ్గరలో వుందా? దూరంలో వుందా? చెప్పు".

అంగదుడి మాటలకు జవాబుగా వానరులకు సంతోషం కలిగించే మాటలు చెప్పాడు సంపాతి. "నేనిప్పుడు శౌర్యం లేనివాడిని. కాబట్టి నేను విశేష సహాయం మాత్రం చేయలేను. మాట సహాయం తప్పకుండా చేస్తాను. నాకు రావణాసురుడి విషయమే కాదు. రావణుడు తీసుకుని పోతుంటే నిడుపాటి

కళ్ళుకల యౌవనవతిని, సమస్త భూషణాలతో ప్రకాశించే దానిని, కన్నీరు కారుస్తూ శరీరం మీద ఆభరణాలను ఒక్కటొక్కటే పారవేస్తూ బాధపడుతున్న ఒక స్త్రీని చూశాను. ఆమె పట్టుచీర రావణాసురుడి మీద పడుతుంటే గమనించాను. ఆమె రామా! లక్ష్మణా! అని ఏడిచింది. కాబట్టి ఆమె సీతాదేవి అని భావిస్తాను. ఆ రాక్షసుడు వుండే చోటు చెప్తా విను".

"రావణాసురుడు లంకాపురంలో వుంటాడు. సముద్రానికి ఇక్కడి నుండి నూరామడల దూరంలో ఒక ద్వీపం వుంది. అదే రావణుడు వుండే పురం. ఆ పురంలో, రావణాసురుడి అంతఃపురంలో, రాక్షస స్త్రీల కాపలాలో సీత దుఃఖిస్తున్నది. సముద్రం మీద నుండి దక్షిణ దిక్కుగా మీరు నూరామడలు పోతే, అక్కడ సముద్రమే అగడ్తగా కల లంక వుంటుంది. అక్కడికి పోయి రావణాసురుడిని చూసి, ఫలసిద్ధి పొంది రండి. మీ విస్తార పరాక్రమం చూపడానికి తొందరపడండి. ఆలశ్యం చేయవద్దు. నా జ్ఞాన దృష్టితో చూశాను. మీరు కార్యం సఫలం చేసుకుని రాగలరు".

"మాకు స్వభావంగా ఇలాంటి దృష్టి కలగడానికి కారణం మేమేమో దూరంగా వున్న ఆహారం తినడానికి పోవాల్సి వుంటుంది. మాకు కావాల్సిన ఆహారం సమీపంలో దొరకదు. ఆ కారణాన భగవంతుడు మాకు దూరదృష్టి ఇచ్చాడు. రాక్షసుడు లోకం నిందించే పని చేశాడు. వానరులారా! దానికి తగ్గ విధంగా మీరు చేయబోయే కార్యం నా తమ్ముడిని చంపినదానికి బదులు కావాలి. సముద్రాన్ని దాటే ఉపాయం వెతకండి. సముద్రం దాటి లంకలో వున్న సీతను చూసి ధన్యులై జై అంటూ కిష్కింధకు మరలి పొండి. చనిపోయిన నా తమ్ముడికి సముద్ర జలంతో తర్పణం చేయాలి. కాబట్టి మీరు నన్ను సముద్రం దగ్గరికి తీసుకుని పొండి". సంపాతి చెప్పిన విధంగానే వానరులు అలానే చేశారు. మళ్లీ ఆయన వున్న చోటుకు తెచ్చి దింపారు. సీతాదేవి వార్త తెలియడం వల్ల వానరులు సంతోషించారు.

అప్పుడు జాంబవంతుడు లేచి నిలబడి సంపాతితో ఇలా అన్నాడు. "సీత ఎక్కడ వుంది? ఎవరైనా చూశారా? ఆమెను అపహరించిన రాక్షసుడు ఎక్కడివాడు? పక్షిరాజా! అంతా చెప్పి వానరులను రక్షించు. వజ్రసమానమైన రామచంద్రమూర్తి బాణాలను ఆ మూఢుడు లక్ష్యం చేయడం లేదు". జాంబవంతుడి ప్రశ్నకు ఇంతకు ముందే సమాధానం చెప్పిన సంపాతి, సీతాపహరణం గురించి తాను విన్నది, కన్నది, సీత వుండే ప్రదేశం గురించి మళ్లీ చెప్పాడు.

"వానరులారా! వినండి. రెక్కలు విరిగినవాడినైనందున నేనీకొండమీదే వుంటాను. ఇలాంటి నా మీద పితృ భక్తివల్ల నా కొడుకు సుపార్శ్వుడు ఆహారం తెచ్చి ఇచ్చేవాడు. ఒకనాడు ఆకలి వేసి ఆహారానికి ఎదురు చూస్తుండగా సూర్యాస్తమానమైన తరువాత ఆహారం తేకుండానే నా దగ్గరికి వచ్చాడు. ముసలివాడికి కోపం ఎక్కువ కాబట్టి దప్పికతో వాడిని నిందించాను. నన్నాతడు శాంతపరచి ఏమన్నాడంటే, తాను మహేంద్ర పర్వతం దగ్గర వున్న సమయంలో ఎవరో ఒక స్త్రీని తీసుకు పోవడం చూశాడట. వాడు రావణుడనే రాక్షస రాజని సిద్ధులు అంటుంటే విన్నాడు నా కొడుకు. ఆ సిద్ధులే, దుర్నీతిపరుడైన రావణుడు రాముడి భార్య సీతను బలవంతంగా అపహరించుకుని పోతున్నాడని, రామా! లక్ష్మణా! అని ఏడుస్తున్న ఆ స్త్రీ సీతేనని అన్నారట. ఇలా వారన్నారని నా కొడుకు నాకు చెప్పాడు. వానరులారా! ఏది రామకార్యమో, అది నా సొంత కార్యమే! ఇది సత్యం. ఇందులో సందేహం లేదు.

మీరు సుగ్రీవుడు పంపగా వచ్చారు. దేవతలకైనా మీరు అసాధ్యులు. మీకు అసాధ్యం లేదు. కాబట్టి ఆలశ్యం చేయవద్దు".

తనకు రెక్కలు పోయిన విషయం చెప్పి అవి మళ్లా ఎలా వస్తాయో నికాశరుడు అనే మునీశ్వరుడు తనతోఅన్న మాటలు చెప్పాడు. "ఇక్ష్వాకు వంశంలో దశరథరాజు పుట్టాడనీ, అతడికి రామభద్రుడు అనే కొడుకు కలుగుతాడనీ, ఆయన తండ్రి మాట ప్రకారం తమ్ముడు లక్ష్మణుడితో కలిసి అరణ్యాలకు వస్తాడనీ, ఆ రామచంద్రుడి భార్య సీతాదేవిని రాక్షసరాజు రావణాసురుడు అపహరిస్తాడనీ, రామదూతలైన వానరులు సీతాదేవిని వెతుకుతూ తను వుండే ప్రదేశానికి వస్తారనీ, వారికి సీతాదేవి వృత్తాంతం తెలిపితే నాకు మేలవుతుందనీ, నేను ఈ ప్రదేశం వదిలి ఎక్కడికీ పోవద్దనీ, ఇక్కడే వుండాలనీ నిశాకరుడు నాకు చెప్పాడు. విస్తార కీర్తికల రామచంద్రుడిని చూడాలని ఆశ వుందికాని, అంతకాలం బతకడానికి మనస్సంగీకరించడం లేదు. కాబట్టి దేహాన్ని వదులుతాను" అంటాడు సంపాతి.

ఇలా సంపాతి చెప్తుండగానే వానరులు చూస్తుంటే సంపాతికి రెక్కలు మొలిచాయి. తన రెక్కలను చూసుకుని సంపాతి సంతోషించాడు. "ఏవిధంగానైనే సరే, ఎంత కష్టపడైనా సరే మీరు సీతాదేవిని వెతకండి. నాకు రెక్కలు వచ్చిన వ్యవహారం చూస్తుంటే మీరు ఆయన చెప్పినట్లు సీతను చూడగలరని నమ్మకం కలుగుతున్నది. నాకు ఆజ్ఞ ఇస్తే నేను ఆకాశమార్గాన పోతాను". అని చెప్పి సంపాతి వెళ్లిపోగా వానరులు మళ్లీ పౌరుషం తెచ్చుకుని సీతాదేవిని వెతకడానికి అభిజిత్ ముహూర్తానికి ఎదురు చూస్తూ ఆమె వున్న దిక్కుకు పయనించారు.

రావణుడు వుండే స్థలాన్నిసంపాతి చెప్పడంతో, వానరులు సంతోషంగా విజృంభించి, పొంగిపోతూ, గంతులేస్తూ, పుణ్యాత్మురాలు సీతను చూడాలన్న కోరికతో సముద్ర తీరాన్ని చేరారు. అక్కడ దక్షిణ సముద్రాన్ని తేరిపార చూశారు. వానరుల దేహాలు పులకరించాయి. వివిధ రకాల వికార జంతు సమూహాలతో నిండిన గగుర్పాటు కలిగించే ఆసముద్రాన్ని చూసి, విచారపడి, ఇక ఏం చేయాలి అని, ఎలా దాన్నిదాటాలా అని భయపడ్డారు. అలా భయంతో, దుఃఖంతో, వానర సమూహాలు బాధపడుతుంటే వారిని చూసిన అంగదుడు వారికి ధైర్యం కలిగేట్లు ఇలా చెప్పాడు.

"ఈ సముద్రాన్ని దాటగల మహాతేజం కలవాడెవరో? నూరామడల సముద్రాన్ని దాటి ఆ వానరుల ప్రాణభయం పోగొట్టగల మహాబలవంతుడు ఎవరో? అలాంటి సామర్థ్యంకల వానర శ్రేష్టుడు, సముద్రాన్ని దాటగలవాడు వుంటే ఆయన వానరులందరికీ ప్రాణదానం చేయుగాక. వానరులారా! మీరు బలవంతులలో ఉత్తములు. అధిక పరాక్రమం వల్ల పొగడబడిన వారు. గొప్ప వంశంలో పుట్టినవారు. ఇలాంటి మీకు ఎలా పోయినా, ఏసమయంలో పోయినా, పోలేని స్థలం లేదు. ఇదివరకు లాగానే ఇప్పుడు కూడా అందరం కలిసి దాటిపోదామా? అని అనుకుంటే, అంతా పోలేరేమోనని అనిపిస్తోంది. అంతా దాటగలిగితే అందరం కలిసే పోదాం. ఈ సముద్రాన్ని ఎవరెవరు వారి-వారి శక్తికొలది ఎంతమేరకు దాటగాలరో ఆలోచించి చెప్పండి" అని అన్నాడు.

అంగదుడి మాటలకు వానర వీరులు ఎవరికీ వారే ఆ అవకాశం తీసుకోవాలని ముందుకు రాసాగారు.

◆❖◆

సముద్రాన్ని హనుమంతుడే దాటగలడా?

సంపాతి మాట ప్రకారం సముద్ర తీరం చేరిన వానరులకు ఆ సముద్రాన్ని ఎలా దాటాలో అర్థం కాలేదు. "ఈ సముద్రాన్ని దాటగల మహాతేజం కలవాడెవరో? నూరామడల సముద్రాన్ని దాటి ఆ వానరుల ప్రాణభయం పోగొట్టగల మహాబలవంతుడు ఎవరో? అలాంటి సామర్థ్యంకల వానర శ్రేష్టుడు, సముద్రాన్ని దాటగలవాడు వుంటే ఆయన వానరులందరికీ ప్రాణదానం చేయుగాక" అన్న అంగదుడి మాటలకు జవాబుగా గవయుడు, గవాక్షుడు, సుషేణుడు, ద్వివిదుడు, మైందుడు, గజుడు, జాంబవంతుడు, గంధమాదనుడు, శరభుడు ఇలా అన్నారు. గజుడు తాను పది ఆమడల సముద్రాన్ని దాటగలనన్నాడు. గవాక్షుడు ఇరవై, గవయుడు ముప్పై, శరభుడు నలబై, గంధమాదనుడు ఏబై, మైందుడు అరవై ఆమడలు దాటగలమని చెప్పారు. ద్వివిదుడు డెబ్బై ఆమడలు, సుషేణుడు ఎనబై ఆమడలు దాటగలమని అన్నారు. ఆ తరువాత జాంబవంతుడు ఇలా అన్నాడు.

"కపులారా! నాకు పూర్వం గమనశక్తి వుండేది. ఇప్పుడు చాలా ముసలివాడినయ్యాను. యౌవనం పోయింది. ఏదెలావున్నా, రామలక్ష్మణులు, సుగ్రీవుడు మనం ఎలాగైనా ఈ కార్యాన్ని సాధిస్తామని నమ్మారు. కాబట్టి దీన్ని ఉపేక్షించరాదు. కాబట్టి ఇప్పటి నా శక్తి ఆలోచిస్తే, తొంబై ఆమడ దాటగల భుజ శక్తి వుండవచ్చునేమో అనిపిస్తున్నది. నా శక్తి ఇంతేనా? అనవద్దు. మీలాగే నేను వయసులో వున్నప్పుడు అసమానబలం, వేగంకలవాడినై వుండేవాడిని. ఆ వయసు గడిచిపోయింది. ముసలితనం వచ్చింది. గమనం తగ్గిపోయింది. బలం కూడా తగ్గింది. కాబట్టి నేనెంత ఉత్సాహం చూపినా ఇంతకు మించి పోలేను. తొంబై ఆమడ పోవడం వల్ల కలిగే లాభం ఏదీ లేదు".

తానూ నూరామడ పోగలను కాని మరలి రాగలనో, లేదో, సందేహమన్నాడు అంగదుడు. అప్పుడు జాంబవంతుడు, "నువ్వు నూరామడ కాదు వేయామడ కూడా పోగలవు. మరల రాగలవు. అయినా నువ్వాపని చేయకూడదు. రాజు సేవకులతో పని చేయించాలి. కాబట్టి సేవకులు వూరికే కూర్చుండి రాజుకు పనులు చెప్పకూడదు. ఈ వానర సేనకంతా నువ్వు స్వామివి. మేమంతా ఇక్కడ వుండి నిన్ను

పంపడం మాకు మర్యాదకాదు. అదే కాకుండా ఈ కార్యానికంతా ఆధారం నువ్వే. మా ప్రభువు కుమారుడివైనందున నువ్వు మాకు ప్రభువువే. కాబట్టి నిన్ను ముందు వుంచుకుని కార్యం సఫలం చేస్తాం" అని చెప్పాడు.

అంగదుడు జవాబుగా, "తాతా! నన్ను పోవద్దంటున్నావు. వేరేవారెవరూ పోవడానికి సిద్ధంగా లేరు. కాబట్టి మళ్లీ ప్రాయోపవేశమే మార్గమా? చావడం ఎందుకు వూరికి పోదామంటావా? సుగ్రీవుడి ఆజ్ఞ నెరవేర్చకుండా అక్కడికి పోతే మన ప్రాణాలుండవు. సుగ్రీవుడు దండించడానికి, రక్షించడానికి సమర్థుడు. కాబట్టి ఏం చేయాలో చెప్పు" అన్నాడు. అప్పుడు జాంబవంతుడు, హనుమంతుడిని కార్యోన్ముఖుడిని చేయడానికి ప్రోత్సహించసాగాడు. హనుమంతుడితో ఇలా అన్నాడు.

"సర్వశాస్త్రాలలో ప్రసిద్ధమైన పాండిత్య కల వానరవీర శ్రేష్టుడా! పవననందనా! ఎందుకిలా ఎవరితో మాట్లాడకుండా ఒంటరిగా కూచున్నావు? రామకార్యంతో నీకు పనిలేదా? నువ్వు బలంలో, పరాక్రమంలో, తేజంలో, రామలక్ష్మణ సుగ్రీవులు ముగ్గురికీ సమానమైనవాడివి కదా? ఆ ముగ్గురు ఒక ఎత్తు, నువ్వొక్కడివే ఒక ఎత్తు కదా! పక్షిరాజైన గరుత్మంతుడి రెక్కలకు ఎంత బలం, వేగం వుందో నీ బాహువులకు కూడా అంతే వుంది. లోకంలో వుండే అందరికంటే తేజంలో, బుద్ధిబలంలో, ధైర్యంలో నువ్వే అధికుడివి. నీ శక్తి సామర్థ్యాలు నువ్వేల తెలుసుకోలేవు? దానికి కారణం ఏమిటో ఆలోచించు".

"అప్సరసలలో శ్రేష్టురాలైన ఒక ప్రసిద్ధ సుందరి శాపవశం వల్ల వానరస్త్రీగా అంజనాదేవి అనే పేరుతో పుట్టింది. ఆమె కేసరి అనే వానర వల్లభుడికి భార్య అయింది. అత్యంత సౌందర్యవతైన ఆ వానర స్త్రీ ఒకానొక రోజున సంతోషంగా మనుష్యస్త్రీ స్వరూపం ధరించి, అలంకరించుకుని, మెడలో పూల పూలదండలు వేసుకుని, మృదువైన సన్నటి చీర కట్టుకుని, పర్వత ప్రదేశంలో తిరుగుతున్నది. అప్పుడామె కట్టుకున్న ఎర్రటి అంచుకల పచ్చని దువ్వలువ కొండగాలికి మెల్లగా జారిపోయింది. ఆమె అందమైన ఆకారం చూసిన వాయుదేవుడు, ఆమె భుజాలను పట్టుకుని గట్టిగా కౌగలించుకున్నాడు".

"ఆమె అప్పుడు భయపడి 'ఎవ్వడు నా పాతివ్రత్యానికి హానికలిగించాలని చూస్తున్నాడు?' అని అంది. వాయుదేవుడప్పుడు 'నీమీద మనస్సు కలిగి నేను కౌగలించుకున్నాను. అంతమాత్రాన నీ పాతివ్రత్యానికి హానిలేదు. నువ్వు భయపడవద్దు. నేను నిన్ను ఎప్పుడూ తాకే వాయుదేవుడిని. నీకు దీనివల్ల కీర్తి కలుగుతుంది. ఈదడంలో, దాటడంలో నాకు సమానమైన కొడుకు, మిక్కిలి వేగంగా పోయేవాడు, పరాక్రమవంతుడు, బుద్ధిబలం కలవాడు నీకు పుట్టుతాడు'. అని చెప్పగా నీ తల్లి మనసులో సంతోషించి అక్కడినుండి వెళ్లిపోయి, ఒక కొండ గుహలో వానర శ్రేష్టుడివైన నిన్ను కనింది".

"అసమాన కీర్తికలవాడా! ఒకనాడు నువ్వా అడవిలో ఉదయిస్తున్న సూర్యుడిని చూశావు. అది పండు అనుకున్నావు. నువ్వు ఆకాశానికి ఎగిరి మూడొందల యోజనాలు పోగా సూర్య కిరణాల వేడికి నీ దేహం తపించినప్పటికీ లక్ష్యం చేయకుండా సూర్యుడిని సమీపించగా ఇంద్రుడు కోపంతో నీమీద తన వజ్రాయుధాన్ని ప్రయోగించాడు. వజ్రాయుధం దెబ్బకు నీ ఎడమ చెంప గాయపడ్డది. అప్పటినుండి నీకు హనుమంతుడు అనే పేరు వచ్చింది. నీకు కలిగిన బాధ చూసి కోపంతో వాయుదేవుడు కొంచెం కూడా సంచరించకుండా స్తంబించి వుండిపోయాడు. దేవతలు కలతచెంది వచ్చి, వాయుదేవుడిని

సమాదానపర్చడానికి ప్రయత్నించారు. అప్పుడు వానరేంద్రా! నిన్ను చూసిన బ్రహ్మ నీకు శస్త్రాలతో మరణం లేకుండా వరాలిచ్చాడు. ఇంద్రుడు నువ్వు కోరేవరకూ నీకు మరణం రాకుండా వరం ఇచ్చాడు. నువ్వు కేసిరికి క్షేత్రజుడివి. వాయుదేవుడికి ఔరసుడివి. కాబట్టి గొప్ప తేజస్సుతో దాటులు వేయడంలో నీ తండ్రైన వాయుదేవుడికి సరితూగుతావు".

"నాయనా! మాకు ప్రాణదానం చేసి మమ్మల్ని రక్షించు. నువ్వీ సమయంలో రక్షించకపోతే మేమంతా చస్తాం. రామలక్ష్మణులు కూడా చనిపోతారు. వారికొరకు విలపిస్తూ అయోధ్యలోని అందరూ చస్తారు. ఇంతమంది ప్రాణాలు నీచేతిలో వున్నాయి. నువ్వు ధైర్యంలో, కార్యసాధనలో, సామర్థ్యంలో రెండో గరుత్మంతుడివి. కొండలు, అడవులతో సహా వున్న ఈ భూమండలాన్ని త్రివిక్రమావతార సమయంలో ఇరవైఒక్క సార్లు ప్రదక్షిణగా తిరిగావు. నువ్విప్పుడు సమస్త సద్గుణాలు కలవాడివి. భూమ్మీద ఉన్నవారిలో బలంలో, దూరం పోవడంలో నువ్వే గొప్పవాడివి. నిన్ను మించినవాడు లేడు. ఏదీ నీ విజృంభణం, పరాక్రమం చూపించు. మా హనుమంతుడు ఇంతటివాడు కదా అని ప్రత్యక్షంగా చూసి సంతోషిస్తాం. వానరోత్తమా లెమ్ము. ఈ సముద్రాన్ని దాటు. ఈ వానరసేనలు నీ వేగాన్ని, పరాక్రమాన్ని చూడడానికి ఆశతో వున్నారు. వీరి కోరిక తీర్చు. నీ శక్తి చూడడానికి కోరికగా వున్నారు వానరులు కాబట్టి నువ్వు ఉపేక్షించ వచ్చా?"

(ఉత్తిష్ఠ హరి శార్దూల లంఘ యస్వ మహార్ణవమ్....అనే వాల్మీకి రామాయణంలోని ఈ మాటల ఆధారంగా వాసుదాసు ఆంధ్రవాల్మీకి రామాయణ రచనకు పూనుకున్నారు)

జాంబవంతుడు ఇలా ప్రోత్సహించగా, ప్రేరేపించగా ఆ క్షణంలోనే హనుమంతుడు విజృంభించాడు. వానరులు సంతోషంగా చూస్తుంటే తన దేహాన్ని పెంచాడు.

నూరామడల వెడల్పుకల సముద్రాన్నిదాటడానికి బలం పెంచుకుని, విజృంభిస్తిన్న హనుమంతుడిని వానరులు చూసి తమ దుఃఖాన్ని వదిలి, సంతోషంచి కిల-కిలమని చప్పుడు చేస్తూ ఆంజనేయుడిని పొగిడారు. ఆంజనేయుడు దేహాన్ని పెంచి విజృంభించగా వానర శ్రేష్ఠులు మేలు-మేలని పొగిడారు. హనుమంతుడు వానరుల మధ్యనుండి లేచి, వానరులలో పెద్దవారికందరికీ నమస్కారం చేశాడు.

ఆ తరువాత ఆంజనేయుడు తన పరాక్రమం గురించి ఇలా అన్నాడు." సముద్రాన్ని దాటడానికి నాకు సమానమైన వారు లేరు. నా తండ్రికి నేనే సమానమైన వాడిని. మేరు పర్వతానికి వెయ్యి సార్లు ప్రదక్షిణ చేసి రావాల్నా? సముద్రంలోని నీళ్లు చేతులతో ఎగజల్లి, కొండలతో, అడవులతో, మడుగులతో నిండిన భూమిని ముంచాల్నా? నేను పొయ్యేటప్పుడు నా పిక్కల వల్ల కలిగిన గాలితో మొసళ్లతో కూడిన సముద్రాన్ని ఆకాశానికి ఎగజిమ్మాల్నా? ఆకాశంలో వేగంగా తిరుగుతున్న గరుత్మంతుడిని వెయ్యి సార్లు ప్రదక్షిణ చేయాల్నా? ఇక్కడి నుండి ఎగిరిపోయి పొడుస్తున్న సూర్యుడిని సమీపించి ఆయన పడమటి కొండ చేరే లోపల నేను ఆకడికి పోయి ఆయన నెత్తిమీద వున్నప్పుడు ఎదురు రావాల్నా? అక్కడి నుండి భూమ్మీద దిగకుండా ఇక్కడికి రాగలను".

"నా బలవేగంతో ఆకాశాన సంచరించే వాటినన్నిటినీ దాటి పోగలను. నువ్వు గింజంత తునకలయ్యేట్లు భూమిని చీల్చాలా? సముద్రాన్ని ఎండబెట్టాలా? పర్వతాలను చేతులతో పిండి-పిండిగా దంచాలా? తొడల వేగంతో భయంకరమైన సముద్రాన్ని నావెంట వచ్చేట్లు చేయాల్నా? భయంకరమైన

దేహం కల ఆంజనేయుడిని ఏమని అనుకుంటున్నారు? రివ్వున నేను ఆకాశంలో పోతుంటే, తీగల్లో, చెట్లలో, వున్న పూలు ఆ వేగానికి తటాలున తెగి నా వెంట వస్తున్నప్పుడు నేను పోయే మార్గం నక్షత్రాలతో దీర్ఘమైన ఆకాశంలాగా చూసేవారికి కనిపిస్తుంది. ఆకాశంలో పైకి ఎగురుతూ, కిందికి దిగుతూ నేను పోయేటప్పుడు ప్రాణికోటులన్నీ ఆశ్చర్యంతో స్పష్టంగా నన్ను చూడగలవు. సముద్ర జలాలను సల–సల వుడికేట్లు చేస్తూ, మహా వేగంగా మేఘాలను అదరగొట్టుతూ వానరులారా! నేను సముద్రాన్ని దాటుతాను. మీరు చూస్తూ వుండండి".

"బలంలో, వేగంలో వాయువుకు, గరుత్మంతుడికి సమానుమైన వాడిని. నా వెంట పక్షిరాజైన గరుత్మంతుడు, వాయువు తప్ప మరెవ్వరూ రాలేరు. నేను నిమిషంలో ఆకాశానికి ఎగిరి నిరాధారంగా సముద్రాన్ని దాటేటప్పుడు త్రివిక్రమావతారుడైన విష్ణుమూర్తి లాగా ప్రకాశిస్తాను. సీతాదేవిని చూడలేక పోయామే అన్న విచారాన్ని వదలండి. అపాయం లేదు. సంతోషంగా వుండండి. నా అంతఃకరణం ఉత్సాహంగా వుంది. అంతఃకరణం నిర్మలంగా వుంది, ఉత్సాహపూరితంగా కార్యం అవుతుందని చెప్పితే తప్పక జరుగుతుంది. వాయువేగ, గరుడవేగాలకంటే అధికమైన వేగంతో వెయ్యి యోజనాల సముద్రాన్నైనా దాటగలనని భావిస్తున్నాను. అలాంటప్పుడు నూరు యోజనాలు ఒక లెక్కా? పునాదితో సహా లంకానగారాన్ని కూడా పెరికి ఈడ్చుకుని రాగలనని సందేహం లేకుండా తోస్తున్నది".

ఈ విధంగా మేఘగంభీరధ్వనితో చెప్తున్న వానరాదిపతిని, మహాతేజుడిని చూసి, వానరులంతా ఆశ్చర్యపడి చాలా సంతోషించారు. అప్పుడు జాంబవంతుడు హనుమంతుడిని చూసి, "ఈ వానర మండలమంతా నీకు కార్యసాధనకై, నీకు మంచి దీవెనలు ఇస్తున్నది. మునుల అనుగ్రహ ప్రభావం వల్ల, వానర వృద్ధుల అభిప్రాయం వల్ల, గురువుల దయ చేత, కపిశ్రేష్టా! నువ్వీ మహాసముద్రాన్ని దాటి కీర్తితో ప్రకాశిస్తావు. నువ్వు చేయబోయే కార్యం తపస్వులకు, సాధువులకు సంతోషమైనది. కాబట్టి వారు నిన్ననుగ్రహిస్తారు. కులానికి కీర్తి తేబోతున్నావు కాబట్టి కులవృద్ధులు నిన్నుగ్రహిస్తారు. ఇలాంటి మహాత్ముడు మనకు శిష్యుడయ్యాడు కాబట్టి గురువులు నీమీద దయ చూపుతారు. ఈ బలంతో నువ్వు సముద్రాన్ని దాటుతావు. కీర్తి సంపాదిస్తావు".

అప్పుడు ఆంజనేయుడు వానరులతో సహా మహేంద్ర పర్వతం కొండ మీదికి పోయాడు. అక్కడ నానారకాల చెట్లతో, పొదలతో, సకల రకాల మృగాలతో, ఫల–పుష్పాల చెట్లతో, జల ప్రవాహాలతో, సింహాలు, పులులు తిరుగుతూ వున్న, పక్షుల కోలాహలంతో నిండిన, మదించిన ఏనుగులున్న గొప్ప ప్రదేశంలో హనుమంతుడు సంచరించాడు. ఆంజనేయుడి పదఘట్టనతో పీడించబడి, సింహంతో కొట్టబడ్డ ఏనుగులాగా, ఆ పర్వతం వుంది. ఆ పర్వతం తారుమారై, చెదిరిన రాలుగలదై, నీటి వంకలను కక్కింది. భయపడిన మృగాలు, కదులుతున్న చెట్లు, ఎగిరిపోయే పక్షులు, మధుపానసక్తులైన గంధర్వ నాగ దంపతులు, బొక్కల్లో దూరే పాములు కలిగి, దొర్లుతున్న రాళ్లు ఒకదానితో ఒకటి తగులుతుంటే అవి చాలా బాధపడి నిట్టూర్పులు విడిచాయి. ఆ పర్వతం ధ్వజంతో కూడిన దానిలాగా భయం కలిగించాయి. ఆ పర్వతాలు ఒంటరిగా చిక్కిన బాటసారిలాగా వున్నాయి. అప్పుడు వానరశ్రేష్టుడైన హనుమంతుడు లంకకు పోవాలని నిశ్చయించుకున్నాడు.

◆❖◆

హనుమను అడ్డుకున్న సింహిక జలాంతర్గామా?

జాంబవంతుడి ప్రేరణతో వానరులతో కూడి హనుమంతుడు, లంకకు వెళ్లాలన్న సంకల్పంతో మహేంద్ర పర్వతాన్ని ఎక్కుతాడు. దానిని కార్యరూపంలోకి తేవడానికి సిద్ధపడ్డాడు హనుమంతుడు. రావణుడు అపహరించిన సీతాదేవిని లంకలో వెతికేందుకు ఆకాశ మార్గాన అక్కడకు ప్రయాణమవుతాడు. హనుమంతుడు తాను పయనించాల్సిన మార్గాన్ని ఒక సారి తేరిపార చూశాడు. హనుమంతుడు అత్యంత సుందరాకారుడిలాగా కనిపించాడప్పుడు. దీర్ఘంగా ఆలోచిస్తూ ముందుకూ, వెనుకకూ తిరుగుతాడు. పక్షులను బెదిరించాడు. జంతువులను అదిలించాడు. రొమ్ము, నుదురుతో తాకుతూ చెట్లను పడేశాడు. కొండను వూగేట్లు చేశాడు. విజృంభించిన సింహం మాదిరి సంచరించాడు. ఆ మహేంద్ర పర్వతంపైన హనుమంతుడు విచ్చలవిడిగా తిరుగుతూ ప్రకాశించాడు.సూర్యుడికి, ఇంద్రుడికి, వాయుదేవుడికి, బ్రహ్మకు, ఇతర దేవతలకు అణకువతో నమస్కరించి ప్రయాణానికి సన్నాహమవుతాడు హనుమంతుడు. సూర్యుడు ఆయనకు విద్యాగురువైనందున తొలుత నమస్కరిస్తాడు. రాక్షసులతో యుద్ధానికి పోతున్నాడు కాబట్టి రాక్షస విరోధి ఇంద్రుడికి ఆ తర్వాత నమస్కరిస్తాడు. బలం, వేగం కలగాలని తండ్రి వాయుదేవుడికి నమస్కరిస్తాడు. బ్రహ్మాస్త్రాల బాధ కలగకుండా వుండాలని బ్రహ్మదేవుడికి ప్రార్థనా పూర్వకంగా నమస్కరిస్తాడు. గురుదేవతలతో పాటు ప్రత్యక్షదేవతైన తండ్రికి నమస్కరించాలని భావించి దక్షిణ ముఖంగా వున్న హనుమంతుడు తూర్పు తిరిగి ఆ పని చేస్తాడు. వానరులందరూ చూస్తుండగా అంతులేనంతగా తన దేహాన్ని పెంచాడు.

మితిమీరిన శరీరంతో, సముద్రాన్ని దాటుతున్నానన్న గర్వంతో, హనుమంతుడు రెండు చేతులతో, కాళ్లతో పర్వతాన్ని ఊగించాడు. కదలని ఆ పర్వతం హనుమంతుడి బలానికి చెదిరింది. ఆ ఉగిసలాటకు పర్వతం మీదున్న చెట్ల పూలు కొండ మీద రాలడంతో పర్వతం పూలకొండ మాదిరిగా అందంగా కనిపించింది. గడ-గడ వణకుతున్న ఆ కొండ గుహల్లోకి అడవి మృగాలు కలవరపడి ఏడ్చిన ధ్వనులు భూమ్యాకాశాలను దద్దరిల్ల చేసాయి. పర్వత చరియల్లోనూ, చుట్టుపక్కల ప్రదేశాలలోనూ, తిరుగాడే

పాములు పడగలు విప్పి, కాటేస్తే అగ్నితో సమానమైన ఆ విషప్రభావానికి రాతిగుండ్లు వేయితునకలై ఎగిరిపడ్డాయి.

ఆంజనేయుడు రామకార్యార్థమై, వానరార్థమై, పర్వతాకారంలో అసాధ్యమైన సముద్రాన్ని దాటి ఆవలి ఒడ్డుకు పోయే ప్రయత్నంలో ఉన్నాడని సిద్ధులు, చారణులు, విద్యాధరులకు చెప్పారు. సీతకై సముద్రాన్ని దాటడం కేవలం రాముడికొరకే కాదు, వానరుల ప్రాణ రక్షణ చేయడం కూడా వుంది. దేహాన్ని అమితంగా పెంచిన హనుమంతుడు ఒక్కసారిగా వళ్ళు విదిలించి, వెంట్రుకలు రాల్చి, వర్షాకాల మేఘం లాగా దిక్కులు పిక్కటిల్లేట్లు గర్జిస్తాడు. గరుత్మంతుడు పామును విదిలించినట్లు తన తోకను విదిలించాడు. హనుమంతుడి తోక గరుత్మంతుడు పట్టుకున్న పాములాగా ఆయన వీపుమీద మెరుస్తున్నదప్పుడు.

హనుమంతుడు సముద్రాన్ని దాటేందుకు ఉద్యుక్తుడయ్యాడు. ఆక్కడున్న వానర ముఖ్యులతో, సంతోషంగా తన పౌరుషాన్ని, బలాన్ని తెలియచేస్తూ, వాయువేగ సమానమైన శ్రీరామ బాణంలాగా లంకలో ప్రవేశిస్తానంటాడు హనుమంతుడు. అక్కడ సీత కనిపించక పోతే, రావణుడిని బందించి తెస్తాననీ, ఏవిధంగానైనా సీతను తోడ్కొని వస్తాననీ అంటాడు హనుమంతుడు. ఒక వేళ వెళ్లేది తానొక్కడే కనుక, సీతాదేవిని లంకలో వెతకడం ఆలశ్యమైతే, లంకనే ఇక్కడకు తెస్తానంటాడు. అడ్డమొస్తే రావణుడిని పాతిపెట్టానని కూడా చెప్తాడు. హనుమంతుడు వానరుల వద్ద సెలవు తీసుకుంటాడు.

కపులవద్ద సెలవు తీసుకున్న హనుమంతుడు, చివాలున ఎగిరి వేగంగా పయనించడం ప్రారంభించాడు. చేతులు చాచి ఆకాశంలో దూసుకెళ్తున్న పంచముఖ ఆంజనేయుడు పర్వత గుహలోంచి తలబయటకు చాచి ప్రాకుతున్న "పంచశీర్షయివోరగమా" (ఐదు తలల పామా!) అన్నట్లున్నాడు. అలలతో నిండిన సముద్రాన్ని రివ్వున దాటి ఆకాశాన పోతున్న హనుమంతుడు, ఆకాశ, సాగరాలను తాగుతూ పోతున్నాడా అనిపించింది. హనుమంతుడాసమయంలో, పరివేశం మధ్యనున్న సూర్యుడిలాగా కనిపించాడు. హనుమంతుడు పయనిస్తున్న సాగర మార్గమంతా ఆయన తొడల వేగంతో తలక్రిందులై, తారుమారై, పిచ్చిపట్టిన దానిలాగా కనిపించింది. ఆకాశన్నంటుతున్న అలలను హనుమంతుడు తన దేహం నుండి వీస్తున్న గాలితో తన్నుకుంటూ పోసాగాడు.

హనుమంతుడి కదలికతో సముద్రం కలవరపడింది. హనుమంతుడి ఉల్లంఘన వేగానికి సముద్రపు నీళ్లన్నీ ఆకాశంలోకి ఎగిరిపోవడంతో, అందులో వుండే తాబేళ్లు, మొసళ్లు, చేపలు, ఇతర జలచరాలు, బయటకు కనిపించసాగాయి. రామకార్యం నిర్వహించటానికి అనువుగా, హనుమంతుడికి శ్రమ కలుగకుండా వుండేందుకు, వాయువు చల్లగా వీచింది.

ఇదిలా వుండగా, సముద్రుడు, రామకార్యార్థమై వెళ్తున్న హనుమంతుడికి ఏవిధంగా సాయపడగలనా అని ఆలోచిస్తాడు. పరాక్రమించి పోతున్న ఆంజనేయుడికి కష్టం కలుగకుండా చూడడమే మేలనుకుంటాడు. హనుమంతుడికి ఒకింత బడలిక తీర్చే ఉద్దేశ్యంతో, తనలో దాగివున్న మైనాక పర్వతాన్ని ఆపని కొరకు పురమాయిస్తాడు సముద్రుడు. "హనుమంతుడు మనకు అతిథి, పూజ్యుడు. నీవు నీటిలోనుండి లేచి, ఆయనకు ఎదురేగి, బడలిక తీరేటట్లు నీనెత్తిన ధరించు. నీవిట్లా చేస్తే,

ఆయనకు కొంత బడలిక తీరుతుంది. తక్కిన సముద్రాన్ని సులభంగా దాటిపోగలడు" అంటాడు మైనాకుడితో.

సముద్రుడి మాటలకు స్పందించాడు మైనాకుడు. నీటిని రెండు భాగాలు చేసి పైకొచ్చాడు. తనదారికి అడ్డంగా నిల్చిన మైనాకుడిని గమనించి, హుంకరించి, ఆకాశమార్గంలోనే ఢీకొన్నాడు హనుమంతుడు. హనుమ దెబ్బకు, విలపిస్తూ, శోషిల్లి పడిపోయాడు మైనాకుడు. అయినా, ప్రీతిగా హనుమంతుడితో ఇలా అన్నాడు: "నాబంగారు శిఖరం మీద నీశ్రమ తగ్గేంత వరకు నిలిచి, ఆతర్వాత నీ ఇష్టమొచ్చినట్లు పో. సముద్రుడు నీమేలు కోరి నన్నెంచుకున్నాడు. శ్రీరామచంద్రమూర్తి కార్యార్థివై పోతున్న నీకు సహాయపడాలని భావించాడు. నీవిక్కడ కాసేపాగి, ఫలాలు, కందమూలాలు తిని, అలసట తీరేవరకు విశ్రాంతి తీసుకో. తర్వాత మిగిలిన దూరాన్ని వేగంగా, సులభంగా, పోవచ్చు" అని మైనాకుడు హనుమంతుడితో విన్నవిస్తాడు.

మైనాకుడికి తనదైన శైలిలో జవాబిచ్చాడు హనుమంతుడు. "పర్వతోత్తమా, నీవు చేసే సత్కారాలు అంగీకరించినట్లే. నీ మంచి మాటలచేతనే సపర్యలు అంగీకరించినట్లయింది. ఆఫలం నీకు దక్కింది కూడా. నేను సంతోషించాను. నేనిక్కడ ఆగకూడదు. చేయాల్సిన పని చాలా వుంది. నేను ఎక్కడా ఆగననీ, రామబాణంలా వెళ్లి వస్తాననీ, పని చక్కబెట్టుకొస్తాననీ వానరులతో ప్రతిజ్ఞ కూడా చేసాను. నన్నాపవద్దు. కోప్పడవద్దు మిత్రమా!"అన్నాడు. పోయివస్తానని సెలవుతీసుకొని, మరింత వేగంగా, మరింత పైకెగిరి, సముద్ర మైనాకుల ఆశీర్వాదం పొందాడు.

ఒంటరిగా సాహసించి పోతున్న హనుమంతుడు రావణుడిని ఎలాగెల్చి రాగలడని, దేవతలు, ఋషులు, సిద్ధులు అనుకుంటారు. ఎలా సముద్రాన్ని దాటగలడన్న సందేహంతో, ఆయన బలాన్ని తెలుసుకోదల్చారు వారు. ఆ ఆలోచనతో, సూర్యకాంతిగల నాగమాత "సురస"ను సందేహ నివృత్తి కొరకు ఉపయోగించ దల్చారు. దైత్య స్త్రీగా పోయి వేగంగా సముద్రాన్ని దాటుతున్న హనుమంతుడికి అడ్డుపడి, ముహూర్తకాలం పాటు ఆలస్యం చేయమని సురసను కోరుతారు. సరేనని అంగీకరించిన సురస, భయంకరమైన పెద్ద వికార రూపాన్ని ధరించి ఆకాశంలో తిరుగుతూ, ఆంజనేయుడికడ్డుపడి, ఎదురునిల్చి, "ఎటుబోతున్నావు" అని ప్రశ్నిస్తుంది. "దేవతలు నిన్ను నాకు ఆహారంగా పంపించారు. నన్ను దాటి నీవెక్కడకు పోలేవు. నానోట్లో చొరపడు. నిన్నుమింగుతా. నువ్వేం మాట్లాడినా నేనువినను" అంటుంది సురస. ఆమెతో విరోధానికి పోకుండా, రెండు చేతులెత్తి జోడించి, నమస్కరించి, తాను వెళ్తున్న పనిని వివరిస్తాడు హనుమంతుడు.

తనకు చిక్కి ఆతడు ప్రాణాలతో తప్పించుకుని పోలేడనీ, అది తనకీయబడ్డ వరమనీ అంటూ సురస హనుమను అడ్డుకుంటుంది. అలా అంటూ నోరు తెర్చుకొని నిలబడ్తుంది. తన్ను మింగగల నోరు ఆమెకు లేదని తన దేహాన్ని పది ఆమడల నిడివిగా పెంచుతాడు హనుమంతుడు. సురస తన నోటిని ఇరవై ఆమడల నిడివిగా చేస్తుంది. హనుమంతుడు ముప్పై ఆమడలకు పెంచుతాడు. ఇలా ఇరువురూ పెన్చుకుంటూ పోతుంటారు. ఎప్పుడైతే సురస తన నోటిని నూరు ఆమడలకు పెన్చుతుందో, బుద్ధిమంతుడైన హనుమంతుడు తక్షణమే తన దేహాన్ని చిన్నదిగా చేసాడు. అతి వేగంతో, సమర్థతతో,

హనుమంతుడు బొటన వేలంత రూపంలో, చటుక్కున సురస నోట్లో చొరబడి, అంతే వేగంతో, ఆమె నోరుమూసేలోపల, బయటపడి, ఆకాశంలో నిల్చి ఆమెకోరిక తీర్చానంటాడు.

సురస పోయినతర్వాత అలక్ష్యం చేయరాని సముద్రాన్ని వదిలి, గరుడ వేగంతో, ఆకాశానికి లంఘించి భయంకరంగా, హనుమంతుడు తన ప్రయాణాన్ని కొనసాగించాడు. స్వర్గానికి వెళ్తున్న పుణ్యాత్ములు, దేవతలు భుజించే అన్నాన్ని తీసుకెళ్తున్న అగ్నిహోత్రుడు, చంద్ర–సూర్యాది గ్రహాలు, చుక్కలు, అశ్వినీ మొదలైన నక్షత్రాలు, దేవ ఋషులు, దేవతలు, ఆకాశమార్గాన సంచరించే ఇతరులు, నాగులు, యక్షులు, దేవ గంధర్వులు, కిన్నరుల కలయికతో కూడిన బ్రహ్మ నిర్మిత ఆకాశమార్గాన, సూర్య–చంద్రులు పయనించే దారిని (ఖగోళ రహస్య సంచారమార్గం) కూడా దాటుకుంటూ ఏ ఆధారం లేకుండా దూసుకుపోతున్నాడు ఆంజనేయుడు.

వేగంతో అతిశయించి పోతున్న హనుమంతుడిని చూసి, "సింహిక"అనే రాక్షసి హనుమంతుడి నీడను తన ఆకారంతో పట్టుకుంటుంది. ఎదురుగాలి తగిలిన పడవలాగా అయిందప్పుడు హనుమంతుడికి. వేగం తగ్గింది. ఓ భూతం సముద్రం నుండి లేవడం గమనించాడు. సముద్రంలో సరీగ్గా ఇదే చోట్లో, తన నీడను పట్టుకోబోయే అంగారక గ్రహం వున్నదని సుగ్రీవుడు తనకు చెప్పిన మాటలు జ్ఞాపకం చేసుకుంటాడు బుద్ధిమంతుడైన హనుమంతుడు. వెంటనే భయంకరమైన కొండలాగా, శరీరాన్ని ఎత్తుగా, వెడల్పుగా పెంచుతాడు. అది చూసిన రాక్షసి పాతాళ గుహవంటి భయంకరమైన తన నోరు తెర్చి, మేఘం లాగా గర్జించి, సునాయాసంగా ఆంజనేయుడిని తినేద్దామని ముందుకొచ్చింది. అప్పుడాంజనేయుడు దాని శరీరాన్ని, విప్పిన నోటిని, మర్మ స్థానాలను, పరిశీలించసాగాడు.

ఇలా పరిశీలించిన వెంటనే అదను చూసి, వజ్రం లాంటి దేహమున్న హనుమంతుడు, శరీరాన్ని చిన్నదిగా చేసి, దాని నోట్లో దూరాడు. దేవతలది చూసి ఆందోళన చెందారు. వారలా భయపడ్తుండగా, దాని పేగులను మొలకల్లాంటి తనగోళ్లతో అతివేగంగా, అతితొందరగా, ఆరాక్షసి భరించలేని రీతిలో, నోరు మూసేలోపల, చీల్చి బయటకు దూకాడు మహావీరుడు ఆంజనేయుడు. (ఈ సింహిక అనే హింసిక జలాంతర్గామి లాంటిది. సముద్రంలో వుండి కాపలా కాస్తున్నది కాబట్టే, చుట్టూ సముద్రం ఆవరించి వున్న తన లంకా నగరానికి ఎవ్వరూ ప్రవేశించజాలరనే విశ్వాసం రావణుడికుంది). దేవతలు హనుమంతుడిని పొగుడుకుంటూ మాట్లాడారు.

దేవతలంటున్న మాటలను ఆలకిస్తూనే తనువచ్చిన పని పూర్తి చేసుకోపోయే ఉపాయాన్ని ఆలోచిస్తూ, ఆకాశాన్నుండి కిందకు దిగే ప్రయత్నం చేసాడు హనుమంతుడు. తను దిగాల్సిన తీరాన్ని దగ్గరనుండి చూస్తాడు. అప్పుడే తన శరీరాన్ని, చూసుకుంటూ, ఆలోచనలో పడ్డాడు హనుమంతుడు. ఇంత పెద్ద శరీరంతో కనిపిస్తున్న తనను ఒక వింత జంతువుగా రాక్షసులు భావించి వేడుకగా తన చుట్టూ తిరుగుతారేమోనన్న అనుమానం కలుగుతుంది. కొండంత శరీరాన్ని తక్షణమే చిన్నదిగా చేస్తాడు. త్రికూటపర్వతం మీదినుంచి దేవేంద్రుడి పట్టణంతో సరితూగే వనసమూహాలతో ప్రకాశిస్తున్న లంకానగరాన్ని తేరిపార చూసాడు.

◆❖◆

లంకిణి ఓటమి లంకా నాశనానికి సూచనా?

అసాధ్యమైన సముద్రాన్ని సులభంగా, అవలీలగా దాటి, త్రికూటపర్వత శిఖరమందున్న లంకను చూసిన తర్వాతనే హనుమంతుడి మనస్సు కుదుటపడింది. బహిరంగంగా తనుతిరిగితే రాక్షసులు చూస్తారేమోనన్న అనుమానంతో, ఉద్యాన వనంలోని చెట్ల చాటున తిరగసాగాడు.

హనుమంతుడు నూరు యోజనాల సముద్రాన్ని దాటాడని రామాయణంలో స్పష్టంగా చెప్పబడింది. అయినప్పటికీ, ఇప్పుడు సముద్రమంత వెడల్పు లేదుకదా? రావణాసురుడి లంక ఇదేనా?. అని కొందరు సందేహపడుతుంటారు. అయితే, కొన్ని బౌద్ధ ప్రామాణిక గ్రంథాలను చదివినవారికి ఈ అనుమానం నివృత్తి చేసుకునే ఆధారాలు లభ్యమవుతాయి. ఇంద్రజిత్ హోమం చేసిన "నికుంభిల", సీతాదేవిని వుంచిన "అశోకవనం" ఇప్పటికీ వున్నాయక్కడ. అక్కడ సీతాదేవి పూజించబడుతున్నదనీ, "రావణకోట" అనే స్థలం కూడా వున్నదనీ, స్పష్టమవుతున్నది. దీన్నిబట్టి సింహళద్వీపమే ఈనాటి శ్రీలంక, ఒకనాటి లంక.

అయితే, ఇప్పుడు సింహళద్వీపానికీ, మనదేశానికీ, మధ్యవున్న సముద్రం వెడల్పు అరవై మైళ్లే. నూరుయోజనాలకు, అరవై మైళ్లకు ఎంతో వ్యత్యాసముందని అనుకోవడం సహజం కదా. ఇకపోతే యోజనం కొలత, ఇంత అని ఎక్కడా స్పష్టంగా చెప్పలేదు. ఎనిమిది మైళ్లని కొందరు, రెండున్నర మైళ్లని కొందరు లెక్కలు చెప్తారు. అదే విధంగా "ఆమడ", "క్రోసు"ల విషయంలో కూడా స్పష్టత లేదు. ఇప్పటిమైలు (1760 గజాలు) పూర్వంలేదు. కావున యోజనం అంటే, ఖచ్చితంగా ఇన్ని మైళ్లని నిర్ధారించలేం. అంతే కాకుండా ఇప్పుడు సముద్రం అరవై మైళ్లే అయినప్పటికీ, రామాయణ కాలంలో, ఎక్కువై వుండవచ్చు. సముద్ర భాగం విశేషంగా పూడిపోయి క్రమేపీ నేలగా మారిందని శాస్త్రవేత్తలు వ్రాసి వున్నారు. వ్రాస్తున్నారు కూడా. ఇప్పటి రఘునాధ పురానికి దక్షిణ భాగమంతా పూర్వం సముద్రంగా వుండేది. అదే విధంగా, పురాణాలలో చెప్పిన దాన్ని బట్టి, ఇప్పటి తిరువాన్కూర్ పూర్వం సముద్రంలో మునిగుండేదట. అలాంటప్పుడు నేటి తిరునల్వెల్లి సముద్రంలో మునిగి వుండవచ్చుకదా!

రామాయణంలో చెప్పబడ్డ "త్రికూటం", "లంబపర్వతం", "సువేల" అనేవి లంకకు దక్షిణ భాగాన వున్నవేకాని, ఉత్తర భాగంలో లేవు. కాబట్టి ఇప్పటి లంకలోని ఉత్తర భాగం కూడా సముద్రంలో మునిగే వుండాలి. లేదా హనుమంతుడు ఈ ప్రదేశాన్ని వదిలి అక్కడకైనా పోయుండాలి. ఈ పర్వతం చుట్టూ సముద్రమున్నదన్నాడుకాని, గ్రామాలున్నట్లు వాల్మీకి చెప్పలేదు. "సువేల" అన్న పదమే సముద్ర తీరమన్న అర్థాన్ని చెప్తోంది. లంకలోని ఇప్పటి ఉత్తర రేవుకు, త్రికూటానికి, మధ్య దూరం, నూరు మైళ్లకు పైనే వుంది. కాబట్టి హనుమంతుడు దాటింది రెండొందల ఏభై మైళ్లని తేలుతున్నది. అంటే నూరుయోజనాలు రెండొందల ఏభై మైళ్లకు సమానం కావచ్చు.

సీతను దొంగిలించి తెచ్చిన రావణాసురుడు, ఆమెకు కాపలాగా విల్లు, బాణాలు ధరించి ఎల్లప్పుడూ తిరుగుతుండే రాక్షస శ్రేష్ఠులుండే సమస్త ప్రదేశాలు కనిపించాయి ఆంజనేయుడికి. శోభాయమానంగా వున్న లంకను కొండ శిఖరాన్నుంచే చూసిన హనుమంతుడికది ఆకాశాన వున్న స్వర్గంలాగా గోచరించింది. లంకను మొట్టమొదట విశ్వకర్మ నిర్మించాడు. కుబేరుడికి తొలుత స్థానమైంది. అంద-చందాలలో ఈవిధంగా ఉండవచ్చేమోనని ఉహించనలవికానిది.

లంకను గెలవడం అసాధ్యమనిపిస్తుంది హనుమంతుడికి. శ్రీరామచంద్రమూర్తి లంకకు వచ్చినప్పటికీ, రావణ రక్షణలో ప్రవేశించనలవికాని లంకానగరాన్ని ఏంచేయగలడన్న అనుమానమేస్తుంది ఆయనకు. పోనీ, మనకు విరోధమెందుకు? సీతను అప్పగించమని మంచితనంగా సామ, దాన, భేద, దండో పాయాలు కూడా పనికి రావేమో అనుకుంటాడు. ఇప్పుడు తాను చేయవలసిన పని సీతను వెతకడం, దానికి లంకలో ఎలా ప్రవేశించాలని యోచించడమనుకుంటాడు. లంకకు పోయేమార్గమేంటని ఆలోచిస్తాడు. బహిరంగంగా లోపలికి వెళ్లడం మంచిదికాదు. తెలవకుండా వంచించి, లోపలికి పోయి, కనపడవలసిన చోట కనపడుతూ, కనపడరాని చోట కానరాక వుండే రీతిలో వేషాలు మార్చాలనుకుంటాడు ఆంజనేయుడు. మొత్తం మీద చీకటి మాటున కార్యం చక్కబర్చుకోవాలని కూడా నిర్ణయించుకున్నాడు.

"ఏవిధంగా చేస్తే నా ప్రయత్నం సఫలమౌతుంది? పగటి వేళ ప్రవేశించాలా? రాత్రి వేళా? ఈ రూపంలోనా? రూపం మార్చాలా? ఈక్షణమే ఈ రూపంతోనే పోవాల్నా? అలాపోతే, రాక్షసుల కంటబడితే, రామకార్యం, సీతాదేవిని వెతకడం చెడిపోతుందికదా? రాక్షస రూపంలో పోవాలా? లంకలోని వారందరూ ఒకరికొకరు తెల్సినవారేకదా? కొత్తవాడినైన నన్ను గుర్తించరా? ఇంకో రూపంలో పోయినా వారు తెలుసుకోవచ్చుకదా? ఈ రాక్షసులకు తెలియకుండా గాలికూడా లంకలో సంచరించలేదుకదా!" అని హనుమంతుడు పరి-పరి విధాలుగా ఆలోచిస్తాడు. చీకటి పడేవరకు ఇక్కడే దాక్కొని, ఆతర్వాత చిన్న కోతిగా మారి, రావణుడి పట్టణంలో చొరబడి, సీతాదేవిని రాక్షసుల ఇళ్లలో వెతకాలి. అట్లైతే రామకార్యం చేసినవాడినన్న గౌరవంతో అతిశయించగలనని ఆలోచించాడు హనుమంతుడు.

సూర్యుడు అస్తమించగానే, పిల్లి ఆకారంతో, "ప్రదోష" కాలంలో, లంకలో ప్రవేశించేందుకు, కొండ దిగి నడిచి రాకుండా, అక్కడి నుండే ఒక్క గంతేసాడు హనుమంతుడు. లంక రక్షణకై నియమించబడిన,

కఠిన రాక్షసులను లంకా నగరం ప్రవేశిస్తూనే చూసాడు హనుమంతుడు. లంకాపురిని ప్రవేశించడానికి లంబ పర్వతంపైనుండి దిగుతాడు హనుమంతుడు. ఆయన దిగిన లంబ పర్వతమప్పుడు చీకట్లో వేలాడే పర్వతంలాగా వుంది. ఎంతో చిత్ర, విచిత్రంగా వుందే ఈ లంకానగరం! అనుకుంటాడు హనుమంతుడు. లంకానగర సౌందర్యాన్ని చూసి, ప్రాకార సమీపాన్నుండి లంకానగరాన్నొక్కసారి తేరిపార చూస్తాడు హనుమంతుడు. మనోహరమైన ఆరావణుడి పట్టణాన్ని, దాని గొప్పతనాన్ని తిలకించి, ఎంతో సంతోషంతో దాన్ని గురించి మరీ, మరీ అనుకుంటాడు మనస్సులో హనుమంతుడు.

ఒరనిండా, చేతిలో, కత్తులుంచుకుని తిరిగే సైనికుల రక్షణలో వున్న ఈపట్టణాన్ని బలంతో గెలవడం ఎవరికీ సాధ్యం కాదేమో ననుకుంటాడు హనుమంతుడు. అయితే, అంగదుడు, ద్వివిదుడు, సుగ్రీవుడు, మైందుడు, సుషేణుడు, రుక్షుడు, కుముదు, కుషపర్వుడు, కేతుమాలుడు మాత్రం లంకలో ప్రవేశించ గలరనుకుంటాడు.

ఈప్రకారం, లంకలోకి రాగల బలవంతులగు వానరులను లెక్కపెట్టి, రామలక్ష్మణుల బలపరాక్రమాలను ఆలోచించి, భయపడాల్సిన పనిలేదు, వారు వస్తే విజయం కలుగుతుందని సంతోషపడ్డాడు. ఇలా ఆలోచిస్తూ మరీ, మరీ సమీపంలోకి పోతాడు హనుమంతుడు. పోతున్న అతడికి, రావణుడి పట్టణం, మణులనే దుస్తులు కప్పుకొన్నట్లుగా, పశువుల కొట్టంలాంటి శిరోభూషణాలు కలదిగా, యంత్రశాలను పోలిన స్తనాలున్నట్లుగా, అలంకరించుకున్న స్త్రీ లాగా కనిపించింది. ఆయన ఇలా లంకను గురించి అనుకుంటుండగానే లంక స్త్రీగా రానే వచ్చింది.

లంకానగరంలో ప్రవేశిస్తున్న కోతిని లంకాదిదేవత లంఖిని తన సహజ రూపంతో చూసింది. అదే సమయంలో ఆమెనూ చూసాడు హనుమంతుడు. తక్షణమే కోపంతో వూగిపోతూ అసహ్యమైన ముఖాన్ని, భయంకరమైన రూపాన్ని, దాల్చిన "లంక" హనుమంతుడికి అడ్డంగా నిల్చి గర్జిస్తూ, "నువ్వెవరివి? ఎందుకొచ్చావు? నీవు చావక ముందే చెప్పు" అని ప్రశ్నించింది. ఎల్ల వేళల, అన్ని ప్రదేశాలలో, రావణుడి సేనలతో రక్షించబడుతున్న లంకానగరంలోకి దేవతలే ప్రవేశించలేనప్పుడు ప్రవేశించినా బ్రతకలేనప్పుడు, హనుమంతుడు ఎలా రాగాలిగాడని నిలదీస్తుంది.

"సరే నాసంగతి తర్వాత చెప్తాను. వికారపు కన్నులతో, లంకా నగర వాకిట్లో వున్న నీవెవ్వరవు? ఇక్కడెందుకున్నావు? నాకెందుకు అడ్డుపడ్తున్నావు? ఊరంటూ వుంటే ఎవరో ఒకరు రాకుండా వుండరు కదా!" అని ఎదురు ప్రశ్న వేస్తాడు ఆంజనేయుడు. ఆమాటలు విన్న "లంక" మండిపడి, మారుతిని చూసి కోపంతో, భయంకరంగా మాట్లాడడం మొదలెట్టిందీవిధంగా:

"రావణాసురుడి ఆజ్ఞను శిరసావహించి, ఈపట్టణాన్ని ఎల్లవేళలా రక్షిస్తున్నాను. నాకళ్లు కప్పి నువ్విందులోకి రాలేవు. అది సాధ్యపడే విషయం కాదు. ఓ కోతీ, నువ్విప్పుడే చస్తావు. నేనే లంకనురా! ఇది నాసంగతి. మరి నువ్వెవరివో చెప్పు."

"లంకిణి" మాటలకు ఏ మాత్రం అధైర్యపడలేదు హనుమంతుడు. స్త్రీ ఆకారంలో వున్న ఆమెను చూస్తూ, ఏమాత్రం సందహించకుండా, లంకను చూసిపోదామన్న కోరికతో వచ్చానని చెప్పాడు. తనను

గెలవకుండా ద్రోహబుద్ధిగల హనుమంతుడు రావణుడు రక్షించే లంకా నగరంలోకి ఎట్లా పోతాడో చూస్తానని కఠినంగా అంటుంది లంకిణి. ఏదేమైనా తాను లంకను చూసి శీఘ్రంగా వచ్చిన దారిలోనే పోతానన్న హనుమంతుడిపై మండిపడుతూ, భయంకరమైన ధ్వని చేస్తూ, అరచేత్తో ఆయన్ను కొడుతుంది. దెబ్బతిన్న మారుతి, కేకపెట్టూ, ఆడదానిపై తన ప్రతాపం ఎందుకు చూపాలని అనుకుంటూ పెద్దగా కోప్పడక, తన ఎడమచేతి పిడికిలితో లంకిణిని పొడుస్తాడు.

ఆ మాత్రం పిడికిటి పోటుకే, లంకిణి నోరు తెర్చుకుని, నేలమీద పడిపోయింది. హనుమంతుడు దాన్ని జాలిగా, దయతో చూశాడు. లంకిణి గర్వమణిగి హనుమంతుడితో: "వానరేంద్రా! నన్ను రక్షించు. నామీద దయ చూపు. నువ్వు చాలా పరాక్రమవంతుడవు. బలవంతులు స్త్రీలను చంపరాదన్న నీతికి కట్టుబడ్డారు. నేనే "లంకిణి" ని. యుద్ధంలో సాహసంతో, బలపరాక్రమాలతో, నన్నే గెలిచావు. నీకు రాక్షసులు ఇక అడ్డమా? లంకా నగర ప్రతిష్ఠ సమయంలో నాకు బ్రహ్మదేవుడు వరమిస్తూ, సీతాదేవిని వెతికేందుకు వచ్చే కోతి నిన్నెప్పుడు గెలుస్తాడో, అప్పుడే లంక నాశనమౌతుందని చెప్పాడు" అంటుంది.

తాను సత్యం చెప్తున్నాననీ, బ్రహ్మ దేవుడు యదార్థం చెప్పాడనీ, ఆయన మాటలు తప్పు కావనీ, సీతాదేవి కారణాన రాక్షసులకు, రావణుడికి చావు మూడిందనీ, హనుమంతుడు నగరంలోకి పోయి పట్టణమంతా కలియతిరిగి, తన ఇష్ట ప్రకారం చేయదల్చుకున్న పనులన్నీ చేయవచ్చని హనుమంతుడికి చెప్తుంది లంకిణి. పతివ్రతల శాపానికి గురైన లంకలోకి ప్రవేశించి సీతను చూసేందుకు కోరిక తీరేవరకు సుఖంగా లంకలో తిరగమని కూడా సలహా ఇస్తుంది.

లంకలో ప్రవేశిస్తున్న హనుమంతుడికీ, అడ్డుతగిలిన లంకిణికీ, యుద్ధం జరుగుతున్నప్పుడు, వారు కొట్టుకుంటున్నప్పుడు, ఆకేకలు వూళ్లో వున్న రాక్షసులకు ఎందుకు తెలియలేదని సందేహం రావచ్చు. గ్రామదేవతల గుళ్లు ఊరిబయట వుంటాయి. వూళ్లోకి రావటానికి వీల్లేని వ్యక్తులను, పొలిమేరదాటకుండా చేసేటందుకే వీరు అక్కడ కాపలా కాస్తుంటారని శాస్త్రం చెప్తున్నది. లంకిణికి, హనుమకు మధ్య జరిగిన గొడవ వూరిబయట జరిగింది. అదీ రాత్రివేళ. వూళ్లోవారి అరుపుల మధ్య ఇవి వినపడే అవకాశం లేదు. మరో విషయం, ఎవ్వరూలేని ప్రదేశం గుండా లంకలోకి ప్రవేశించే ప్రయత్నం చేసాడు హనుమండు. ఇకపోతే, హనుమంతుడు చెప్పక పోయినప్పటికీ, బ్రహ్మదేవుడి మాటలను గుర్తుచేసుకున్న లంకిణి, హనుమంతుడు సీతాదేవికొరకే వచ్చాడని నిర్ధారించుకుంటుంది.

"లం" అనేది పృధివీ బీజాక్షరం. కాబట్టి పృధివీతత్వాన్ని తెలుపుతున్నది. అది కలది "లంక". లంకంటేనే "దేహం". హనుమంతుడు లంకను జయించాడంటే, తనలోని ఆత్మను వెతికేవాడు, మొదట దేహాన్ని జయించాలన్న అర్థం స్ఫురిస్తున్నది. దేహాన్ని జయించనివాడికి ఆత్మావలోకనం జరగదు.

◆❖◆

తొలి సీతాన్వేషణలో హనుమ విఫలుడైనాడా?

రాక్షస సంచారం లేని ప్రదేశం ద్వారా హనుమంతుడు లంకా ప్రవేశం చేశాడు. శత్రు స్థానాలలోకి దొడ్డిదారి ("అద్వారం") నుండే ప్రవేశించాలన్నది రాజనీతి. హనుమంతుడదే పనిచేసాడు. శత్రు దేశంలోకి ప్రవేశించేటప్పుడు ఎడమకాలు ముందుంచాలి కాబట్టి హనుమంతుడు ఆ పద్ధతినే అనుసరిస్తాడు. రాచబాటకు చేరిన హనుమంతుడు, లంకను నలు దిక్కులనుండి చూసి, దాని బహుముఖ ఐశ్వర్యానికి మురిసిపోయాడు. అలా తిరుగుతున్న హనుమంతుడికి వర్ణనాతీతమైన ధ్వనులు వినిపిస్తాయి. ధ్వనులకు తోడు, వేదాధ్యయనం చేసేవారిని, రాక్షస వందిమాగధులను, రాచబాటల నడుమ నిల్చున్న గుంపులను, వేగులను, గర్జించే రాక్షసులను, దీక్షలో వున్నవారిని కూడా చూసాడు హనుమంతుడు. రావణాసురుడి ఇంటి ముందు, కాపలాకాస్తున్న ఆయన మూలబలగాన్నీ చూసాడు హనుమంతుడు. కమ్మని వాసనలతో కూడి వున్న రావణాసురుడి అంతఃపురాన్నిచూసాడు హనుమంతుడు.

రావణుడి అంతఃపురాన్ని బయటనుండే చూసి, ఆ తర్వాత లోనికి ప్రవేశిస్తాడు. మద్యపానంతో శరీరాన్ని మరిచి ఏంచేస్తున్నారో తెలియని రాక్షసులుండే ఇళ్ల సముదాయాన్ని కనుగొంటాడు మారుతి. మద్యపాన ప్రభావంతో దేహాన్ని మరిచి మాట్లాడుతూ, ఇతరులను బెదిరిస్తున్న రాక్షసులను హనుమంతుడు చూసాడు. భర్తలను రతికై ప్రార్థిస్తున్న స్త్రీలను హనుమంతుడు చూసాడు. కామావేశం వున్న స్త్రీలను, వికారమైన, విద్దూరమైన, ఇంపైన చేష్టలు చేస్తున్న స్త్రీలను, పెళ్లై సంతోషంతో వున్న స్త్రీలను చూసాడు హనుమంతుడు. లేతవయస్సులో వున్నవారిని, చంద్రబింబం లాంటి ముఖం కలవారిని, వంకర కనురెప్పల వెంట్రుకలున్నవారిని, ఆభరణాలు ధరించిన వారిని, మెరుపు తీగల్లాంటి ఆడవారిని చూసాడాంజనేయుడు.

తను చూస్తున్న స్త్రీలలో, రాజవంశంలో పుట్టినదాని లాంటి దానిని, స్వసంకల్పంతో అయోనిజగా పుట్టిన దానిని మాత్రం చూడలేకపోయాడు హనుమంతుడు. సీతాదేవిని తాను వెతికిన అన్ని రహస్య

ప్రదేశాల్లో ఎక్కడా చూడలేక పోయినందుకు హనుమంతుడు బాధపడ్డాడు ఆసమయంలో. రాక్షసుల ఇళ్లల్లో ఎంత వెతికినా, సీతాదేవిని చూడలేకపోయినందుకు చింతిస్తూ హనుమంతుడు తాను కోరిన రూపాన్ని ధరించి, మరింత వేగంగా, శ్రద్ధగా తిరిగి వెతకనారంభించాడు. సింహాల కాపలాలో నిరపాయంగా వుండే వనంలాగా, ప్రాకారంతో చుట్టబడి వున్న రావణ గృహాన్ని చూసాడు హనుమంతుడు. దేదీప్యమానంగా వెలుగుతున్న ఆ ఇంటిని చూసి ఆశ్చర్యంతో ముక్కుపై వేలుంచుకుని దాన్నే చూడసాగాడు హనుమంతుడు. అక్కడా-ఇక్కడా అన్ని చోట్లా వెతకసాగాడు సీతకోసం హనుమంతుడు.

ఇలా తిరుగుతూ రావణుడి రాక్షస నాయకులు వుండే ఇళ్లంటిలో వరుస తప్పక సీతకొరకై వెతుకుతాడు హనుమంతుడు. అయినా ఫలితం కానరాలేదు. ఇలా వీళ్లందరి ఇళ్లల్లో వెతికిన హనుమంతుడు, మనోహరంగా, విశాలంగా వున్న అందమైన రావణాసురుడి గృహాన్ని చూస్తాడు. ఆ పరిసరాలలో సువాసనలు వెదజల్లే మనోరంజకమైన పుష్పక విమానాన్ని చూసిన హనుమంతుడు దాని రూపకల్పనకు ఆశ్చర్య పడ్డాడు. ఆపట్టణంలో ఎంతసేపు తిరిగినా, వెతుకుతున్న సీత జాడ తెలియరానందున ఏంచేయాలన్న విచారంలో పడ్డాడు సునేత్రుడైన హనుమంతుడు. దాని సౌందర్యం దేవతల విమానాలకు లేనేలేదు. దాంట్లోని ఏ భాగం, ఏ ప్రదేశం చూసినా ఆశ్చర్యం కలుగక మానదు.

పుష్పక విమానం మధ్యలో, అర్ధ యోజనం వెడల్పు, యోజనం పొడవున్న రావణుడి ఇంటిని చూసి, అందులోకి పోయి, అక్కడ సీతాదేవి కనపడుతుందేమోనని వెతకసాగాడు హనుమంతుడు. మేడలనేకం వున్న రావణుడి నగరంలోని బలవంతులైన రాక్షసుల ఇళ్లలోనూ, రావణుడుంటున్న ఇంటిలోనూ, తనకార్యక్రమాన్ని కొనసాగించాడు మారుతి. రావణాసురుడి రక్షణలో వున్న ఆ ఇల్లు, ఇంపైన ధ్వనులతో వీనులకు, రూపాలతో కళ్లకు, త్రాగటానికి ఇంపైన వాటితో చర్మానికి, వాసనలతో ముక్కుకు, నోరూరిస్తూ నాలుకకు తృప్తినిచ్చాయి హనుమంతుడికి. అక్కడి దీపాల కాంతి, రావణుడి దేహకాంతి, వాడు ధరించిన బంగారపు సొమ్ముల కాంతి, కలవడంతో ఆ శాల మండుతున్నట్లు వెలుగుతోంది. ఆ విశేషం చూసి హనుమంతుడు, ఔరా! అని తనలో మెచ్చుకుంటాడు.

ఇలా పరిపరి విధాలుగా ఆలోచిస్తూ, చింతిస్తూ, సీతాన్వేషణ కొనసాగిస్తాడు హనుమంతుడు. అలా వెళ్తున్న అతడికి రావణుడి శయ్య కనిపిస్తుంది. చిత్రమైన దాని ఆసనాలు స్ఫటికాలతో, బంగరు వైడూర్యాలతో, దంతాలతో చేయబడ్డాయి. ఇంద్రుడి పానుపును మించిన రావణుడి మంచాన్ని తిలకించి ఆశ్చర్య పోతాడు హనుమంతుడు. సర్వాలంకార శోభితంగా గడచిన రాత్రి సయ్యాటల అలసటతో కనిపిస్తున్న రావణాసురుడు ఆ పెద్ద పానుపుమీద నిద్రపోతుండడం గమనిస్తాడు హనుమంతుడు. అయ్యో! ఈపాపాత్ముడి దగ్గరకెందుకొచ్చానా అని బాధపడ్డాడు కాసేపు. నవ్వుముఖంతో రావణుడి కాళ్లదగ్గర నిద్రిస్తున్న, వాడి స్త్రీలను నిర్మలమైన మనస్సుతో చూసాడు ఆంజనేయుడు. బాగా మత్తుగా మద్యం సేవించి, నాట్యాలు చేసి, భర్తతో రతిక్రీడలాడి, అలసి-సొలసి, వళ్లు తెలీకుండా అక్కడ పడిపోయి నిద్రపోతున్నారు రావణుడి భార్యలందరూ.

వీరాంజనేయుడు ఇలా నిద్రిస్తున్న స్త్రీలందరినీ చూసుకుంటూ పోయి-పోయి, ఓ ప్రత్యేకమైన స్థలంలో, ఏకాంతంగా నిద్రిస్తున్న ముగ్ధ మనోహర సౌందర్యాతిశయంకల, మరో స్త్రీని గమనిస్తాడు. అలా కనిపించిన స్త్రీ పట్టపు దేవికనుక, ఈమూకలో కలవక వేరే ఒంటరిగా నిద్రిస్తోంది. మనోహర సౌందర్యరాశి, పట్టపురాణి మండోదరిని అక్కడి పడకటింట్లో నిదిరిస్తుండగా చూసాడు హనుమంతుడు. ఆమె ముగ్ధమోహనాకృతిని చూసిన హనుమంతుడు, "సీతను చూసితి-చూసితి"నని సంతోషంతో భుజాలు తట్టుకున్నాడు. తోకను ముద్దిడుకుంటాడు. గెంతులేస్తాడు. "అబ్బ ఇప్పటికి చూసాకదా సీతాదేవిని" అని అనుకుంటాడు కొంతసేపు హనుమంతుడు. కుదుటపడ్డ ఆయన మనస్సు, ఈమెట్లా శ్రీరాముడి భార్య సీతాదేవవుతుందని తర్కించుకుంటుంది. ఈమె సీత కాద"ని నిశ్చయించుకుని, మండోదరిని దాటి ఆవలికిపోయి, మద్యం సేవించే పానశాలలో సీతను వెతకడం ప్రారంభిస్తాడు.

రావణుడి అంతఃపురమంతా వివరంగా గాలించినప్పటికీ, సీతాదేవి రూపం, ఆమె వున్న స్థలం జాడ ఏ మాత్రం తెలవకపోవటంతో చింతించాడు హనుమంతుడు. నిద్రలో పరవశమై వళ్లు తెలియకుండా వున్న పరస్త్రీలను చూసి పాపం చేసాననుకుంటాడు. ఇట్లా ఆలోచిస్తున్న హనుమంతుడి మనసుకు, తాను చేసిందిన్ది తప్పా-ఒప్పా అని నిశ్చయించి తీర్మానించగల సామర్ధ్యం-బుద్ధి మళ్లీ కలిగింది. ఇలా విచారించే బదులు ఇంకోచోట వెతుకుతాననుకుంటాడు. ఆడది ఆడవారి మధ్యలో వుండక ఎక్కడుంటుందని నిష్కాముడనై, కర్తవ్యం నెరవేర్చాలి అనుకుంటాడు మరల. "నిష్కల్మశమైన మనస్సుతో అంతఃపురమంతా మిక్కిలి శ్రద్ధతో వెతికాను-సీతాదేవి ఎక్కడా కానరాలేదు కదా" అనుకుని, పానశాలను విడిచి, అంతఃపురంలో వెతకసాగాడు మళ్లీ.

ఆ అంతఃపురం మధ్యలో తీగలతో ఏర్పాటుచేసిన ఇండ్లలోనూ, చిత్రాలతో అలంకరించబడిన ఇండ్లలోనూ ఎంత వెతికినా సీత కనపడలేదు. ఆమె కనపడనందున ఒకవేళ మరణించిందేమోనని అనుకుంటాడు. పాతివ్రత్య రక్షణకు పూనుకుని, సత్పురుషులతో స్తుతించబడే సుగుణోపేత సీతామాత ఆత్మహత్య చేసుకోక పోయుండవచ్చునేమో కాని, క్రూరుడైన రావణుడు చంపాడేమోనని అనుకుంటాడు. కాకపోతే కామాసక్తుడై తెచ్చిన వాడు నయానో, భయానో, కోరిక తీర్చుకునే ప్రయత్నం చేస్తాడు కాని, హింసించి వుండడనుకుంటాడు. ఒకవేళ భయంకర, వికార దేహాలు, ముఖాలు, కన్నులు వున్న రాక్షస స్త్రీలకు భయపడి సీతాదేవి ప్రాణాలు వదిలిపెట్టిందేమో, ఏంచేయాలిప్పుడని ఆలోచనలో పడ్డాడు హనుమంతుడు. చెప్పిన పౌరుష వాక్యాలను నెరవేర్చలేక, సీతను చూడలేక సుగ్రీవుడు పెట్టిన గడువు దాటినతర్వాత, ఆయన్ను చూడడం ఏ ధర్మాన్ననుసరించి చేయాలని భయపడ్డాడు. ఒకవేళ వెళ్లినా బలవంతుడైన అతడు తన ఆజ్ఞను మీరినందుకు తనను దండించక మానుతాడా? అని తలపోస్తాడు.

"అంతఃపురంలో చూసాను, రావణాసురుడి స్త్రీలందరి మధ్యలో చూసాను. అయినా ఎక్కడా సీతాదేవి కనిపించలేదు. చేయాల్సిన కృషి అంతా చేసానే! శ్రమ వ్యర్ధమైందికదా!" అని అనుకుంటాడు హనుమంతుడు. వానరుల ఎదుట పౌరుషాలు పలికినందుకు; "హనుమంతా, ఏంచేసొచ్చావు? సీతను తెస్తానంటివే? తెచ్చావా?" అని అడిగితే జవాబేమివ్వాలి? వెతికాను, కానరాలేదు, పోయినవాడిని పోయినట్లే తిరిగొచ్చాను అని చెప్పనా? అలా ఎలా చెప్పేది? చెప్తే మంచిగుండదు. ఇలా అనుకున్న

హనుమంతుడు, ఇక్కడే వుండి వెతుక్కుంటూపోతే, హనుమంతుడు రావణుడి చేతిలో చచ్చిపోయాడేమోననుకోవచ్చు నని తలుస్తాడు. అలా అనుకుని మిగిలిన వానరులు తామూ బ్రతికుండి ప్రయోజనం లేదనుకుని ప్రాయోపవేశం చేయడానికి నిశ్చయించుకోవచ్చుననుకుంటాడు. ఇక్కడుండకూడదు, మరలిపోవాల్సిందే అనుకుంటాడు. పోతే నాడు పొగిడిన, శ్లాఘించిన జాంబవంతుడు, అంగదుడు, ఇతర వానర ముఖ్యులు "ఛీ" అంటారేమోనని కూడా భయపడ్తాడు.

తానిక్కడ ఊరకనే ఉండరాదనీ, వ్యర్థుడై పోనూకూడదనీ, అధైర్యపడకూడదనీ, కార్యం ఎట్లాగైనా సాధించాలనీ, సకల కార్యాలను నెరవేర్చే ఉత్సాహాన్ని ఆశ్రయించి మళ్లీ ప్రయత్నించాలనీ నిశ్చయించుకుంటాడు హనుమంతుడు. రావణాసురుడు రక్షించే అన్నిప్రదేశాలు: పానగృహాలు, చిత్రగృహాలు, తోటలు, కేళిశాలలు, సందులు, గొందులు, వీధులు, విమానాలు, ఇవీ,అవీ,అన్నీ విడిచిపెట్టకుండా గాలించాలనీ ఆలోచిస్తాడు. అనుకున్నదే తడువుగా వెతకడం ప్రారంభించాడు. నేలమాళిగలలో, నాలుగు వీధులు కలిసే ప్రదేశాలలోని మందిరాలలో, రావణుడింటి దగ్గరున్న ఆటపట్టులలో, ఇలా పోయినచోటికే పోయి, ఎక్కినమెట్టే ఎక్కి, దిగినమెట్టే దిగి వెతుకుతాడు. ప్రాకారాలలో, ఇంటింటి మధ్యనున్న వీధుల్లో, అరుగుల్లో, దిగుడుబావుల్లో, సరస్సు తీరాలలో, రావణుడికి అనుకూలురైన స్త్రీల మధ్య, ప్రతికూలురైన స్త్రీల మధ్య ఎంత వెతికినా సీత కానరాక పోవటంతో దిగులు పడ్డాడు హనుమంతుడు.

అక్కడినుండి ప్రాకారం మీదకు చేరిన హనుమంతుడు సీతాదేవిని చూడలేకపోయినందుకు చింతించసాగాడు. మనస్సు కలతచెందింది మరోమారు. లంకలోని చెరువులు, గుంటలు, సరస్సులు, నదులు, వంకలు, వాగులు, కొండలు, డొంకలు, సమస్త ప్రదేశాలలో వెతికినా వ్యర్థమయింది కదా అని వ్యాకులపడ్తాడు.తర్వాత ఇలా ఆలోచిస్తాడు:

"సీతను చూడలేకపోయాను. సీత రావణుడింట వున్నదని ఎంతోనమ్మకంతో చెప్పాడే సంపాతి! అయినా ఆమె ఇక్కడ కనపడలేదాయె! ఏంచేయాలి? సంపాతి అసత్యమాడడే? దానివలన అతడికి కలిగే లాభమేంటి? కాబట్టి ఇక్కడే ఎక్కడో సీత వుండేవుండి తీరాలి. ఎందున్నదో? రావణాసురుడికి వశపడినందున వాడామెను వీరందరిలో కలపక మరెక్కడైనా వుంచాడా? ఛీ, ఎందుకిలాంటి తప్పుడు ఆలోచనలు వస్తున్నాయి? ఆమె జనకరాజు కూతురు, మిథిలలో పుట్టింది, శ్రీరాముడి భార్య, విదేహ సంబంధమున్నది, భూమిలో పుట్టింది, పేరు సీత...అలాంటిది కామవశురాలై దుష్టుడు, జాతివల్ల నీచుడు, దనుజుడు, క్రూరుడు, మనుష్యులను తినేవాడైన రావణుడిని ఎట్లా కామిస్తుంది? అట్టి విపరీతం ఎప్పటికీవుండదు"

"సీతాదేవి ఇందులేదు–అందులేదు. పోనీ రావణుడు అపహరించుకుని ఎత్తుకొస్తున్న సమయంలో, అబల అయిన సీత నడితోవలో పడిపోయివుండవచ్చా? అలాకాకపోతే ఆకాశమార్గాన తన్నెత్తుకుని రావణుడు పోతున్న సమయంలో, క్రిందున్న సముద్రాన్ని చూసి, పరవశించి, వశంతప్పి, దాంట్లో పడిపోయిందా? వాడి వేగానికి ధైర్యం కోల్పోయి, వణకుతూ ఆకాశంలోనే తనువు చాలించిందా?

శ్రీరామచంద్రుడిని, పున్నమినాటి చంద్రుడినే తిరస్కరించేరీతి ముఖాన్ని, తామరపూలరేకుల్లాంటి ఆయన కళ్లను స్మరిస్తూ ప్రాణం విడిచిందా? రావణుడే భక్షించాడా? రావణస్త్రీలు చంపారా? చంపి తిన్నారా? రామా! లక్ష్మణా! అంటూ ఏడుస్తూ మరణించిందా? ఇలా పరిపరి విధాలుగా అనుకుంటాడు.

రామపత్ని సీత రావణాసురుడి వశంకావడం కల్లనీ, అందువల్ల, వాడే ఎక్కడైనా సీతను దాచైనా వుంచి వుండాలి, లేదా, పతివ్రత కనుక వశపడక సముద్రంలో పడి మరణించైనా వుండాలి అనుకుంటాడు. భార్యపై ప్రేమ వున్న రాముడికి తాను ఏమనిచెప్పాలని మధనపడ్డాడు హనుమంతుడు.

◆❖◆

హనుమంతుడు చూసింది సీతాదేవే కదా?

లంకా నగరంలో ఎందెందు వెతికి చూసినా సీత జాడ తెలియక పోవడంతో హనుమంతుడు దిగాలు పడ్డాడు. సీత కనపడలేదని చెప్తే కీడు తప్పదని, చెప్పకపోతే దోషం కల్గుతుందని, అంటే, చెప్పినా, చెప్పకున్నా కీడే! చెప్పాల్నా? వద్దా? అన్న మీమాంసలో పడ్డాడు. మనస్సు కుదుటపడలేదు. ఒక ఆలోచన చేస్తుంటే, దాన్ని బాధించే ఆలోచన మరోకటి వస్తున్నది. యోగ్యమైన నీతి ఏమిటా అని మరీ-మరీ ఆలోచించ సాగాడు. సీత జాడ కనుక్కోకుండా తాను కిష్కింధకు పోతే ప్రయోజనమేంటి? కాబట్టి ఇక్కడినుండి కిష్కింధకు పోకపోవడమే ఉత్తమమని నిర్ణయించుకున్నాడు. లంకలోనే వుండి, సీతాదేవిని కనుక్కోలేక పోయినందున, ఓ చెట్టు క్రిందో, పుట్ట క్రిందో, నివసిద్దామనుకుంటాడు హనుమంతుడు. కందమూలాలు బాగాదొరికే సముద్రతీరానికి పోయి, అక్కడ చితి పేర్చుకుని, దాంట్లో చావడం మేలనికూడా భావిస్తాడు.

లంకాధిదేవతను జయించడంతో శుభారంభం కలిగించి, లంకలో హనుమంతుడు ప్రవేశించాడన్న కీర్తిని తెచ్చిన ఆనాటి రాత్రి, సీతాదేవి దర్శన భాగ్యం లేకుండా వృధాగా పోతున్నదే అని దిగులుపడ్డాడు హనుమంతుడు. చచ్చేం సాధిస్తామనీ, ప్రాణాలొదిల్తే పెక్కు దోషాలు కలుగుతాయనీ, ప్రాణాలు విడువరాదనీ, బ్రతికుంటేనే శుభం కలుగుతుందనీ నిర్ణయానికొస్తాడు. వేరేవిధంగా కూడా ఆలోచిస్తాడు. సీత వుందో-లేదోనన్న సంగతి తర్వాత చూసుకోవచ్చు. ముందు ఇంత అనర్థానికి కారణమైన రావణుడిని పట్టుకుని చావకొట్టే మంచిదనీ, ఇదే వాడి పాపానికి తగిన ప్రాయశ్చిత్తమనీ భావిస్తాడు హనుమంతుడు. రావణుడిని పట్టుకుని, సముద్రమ్మీదేసి, ఈడ్చుకుని పోయి రామచంద్రమూర్తి ఎదుట నిలబెట్టుదామనుకుంటాడు.

ఇలా పలుమార్లు అధైర్యంతో విచారపడ్డాడు. దిగులుపడ్డాడు. సీతకనిపించే దాకా వెతకాలనుకుంటాడు. ప్రాకారం పైనుండి నలువైపులా తేరిపార చూసిన హనుమంతుడికి అశోకవనం కనిపించింది. అక్కడింకా వెతకలేదుకనుక, వెతకాలనుకుంటాడు. ఈవిధంగా కొంచెంసేపాలోచించి,

అశోకవనంలో సీత తప్పక వుంటుందని నిశ్చయించుకుని, ఉత్సాహంతో లేచి ధ్యానం చేస్తాడీవిధంగా: "రామచంద్రమూర్తికి నమస్కారం, లక్ష్మణస్వామికి నమస్కారం. విదేహ రాజపుత్రి, శ్రీరామ ధర్మ పత్ని సీతమ్మకు నమస్కారం. ధర్మరాజుకు, ఇంద్రుడికి, మరుత్తులకు, వాయువుకు, రుద్రులకు, సూర్యచంద్రులకు, సుగ్రీవుడికి నమస్కారం"....."నమోస్తు రామాయ సలక్ష్మణాయ దేవ్యై చతస్యై జనకాత్మజాయై" అని వాల్మీకం.

హనుమంతుడు లంకను జయించాడంటే యోగి దేహాన్ని జయించినట్లే. దేహం వశ పడగానే ఆత్మావలోకనం లభించదు. హనుమంతుడు సీత కొరకై వెతుకుతున్నప్పుడు మండోదరిని చూసి సీతని భ్రమిస్తాడు. అంటే ఆయన అన్వేషణలో, శోదించే సమయంలో, కనిపించిన ఆత్మ తేజస్సు లాంటి తేజస్సును "ఆత్మ"ని భ్రమించ కూడదు. ముమ్మందు మిక్కిలి హెచ్చరికతో, నిష్కాముడై, జితేంద్రియుడై వెతకాలి. ఇలా వెతుకుతుంటే, స్వప్రయత్నం ద్వారానే కార్యం సాధ్యమౌతున్నదనే భావనంటే, అది తొలగి పోయే వరకు, ఆత్మ దర్శనం కలగదు. అందుకే కార్య సిద్ధికై, సీత-రామ-లక్ష్మణులకు, మొక్కి, కార్యమారంభించినాడు. కాబోయే సీత దర్శనానికీ, జరిగిన రామ దర్శనానికీ, సుగ్రీవుడే కారణం కనుక ఆయనకూ నమస్కరించాడు. హనుమంతుడు సంపాతి (జటాయువు సోదరుడు) మాటలందు నమ్మకంతో రావణుడి అంతఃపురంలో సీతను వెతికినట్లే, సాధకుడు గురు వాక్యం మీద నమ్మకంతో, "దేహంలో ఆత్మాన్వేషణ" చేయాలి. కనపడక పోతే, ప్రయత్న లోపం జరిగిందనుకొని, నిరుత్సాహ పడకుండా, కనిపించే దాకా వెతకాల్సిందే!

ఈవిధంగా సమస్త దేవతలకూ నమస్కరించి, దిక్కులన్నీ తేరిపార చూసి, అశోకవనం పైనే దృష్టి సారించాడు. అనేక రాక్షసుల కాపలాలో పరిశుభ్రంగా వుంచబడి, మిగిలిన అన్ని వనాలకంటే మనోహరంగా వున్న ఆ వనంలో, సీత వుండడం నిశ్చయమని భావిస్తాడు. తన దేహాన్ని మరింత చిన్నదిగా చేసి, సీతాన్వేషణలో నిమగ్నమౌతాడు మళ్లా. సమస్త భూతాలను, పరాత్పరుడిని, భగవంతుడిని తనకార్యం సఫలమయ్యేటట్లుగా చూడాల్సిందని ప్రార్థిస్తాడు హనుమంతుడు. ప్రార్థించి, ఆశతో ఎదురుచూడసాగాడు.

హనుమంతుడు మెల్లగా ఆ వుద్యానవనంలోని ప్రాకారం మీదకు గెంతుతాడు. అక్కడ నిలబడి అశోకవనాన్ని తేరిపార చూసాడు. దోరపండ్లతో, ముదిరిన పండ్లతో, కోకిలల, తుమ్మెదల, నెమళ్ల ధ్వనులతో నిండిన అశోకవనాన్ని చూసాడు హనుమంతుడు. ఆయన అలికిడికి చెట్లపైనున్న పక్షులు నిద్రలేచి కిల-కిల కూయడం మొదలెట్టాయి. హనుమంతుడు ఒక చెట్టు మీదినుండి మరో చెట్టు మీదికి దూకటంతో, ఆ అలికిడికి, కొమ్మలు కదిలి, పక్షులు లేచి, కిలకిల కూస్తూ, ఆకాశానికి ఎగిరిపోసాగాయి. హనుమంతుడు అశోకవనంలోని తీగల గుంపును చిమ్మాడు. చుట్టూ బంగారు చాయ ఉన్న చెట్లు చుట్టుకోగా, బంగారు గజ్జెలు ధ్వనించే "శింశుపావృక్షాన్ని" చూసి ఇంకా ఆశ్చర్యపోయాడు హనుమంతుడు.

సీతాదేవి ఇక్కడకు తప్పక వస్తుందని నమ్మిన ఆంజనేయుడు, "శింశుపావృక్షాన్ని" ఎక్కి, ఆమెను చూద్దామని భావిస్తాడు. సీతాదేవి ప్రాణాలతో వుంటే తప్పక అశోకవనానికి వస్తుందని నమ్ముతూ,

"శింశుపావృక్షం" పైన దాక్కుని అన్ని ప్రక్కలా చూస్తుంటాడు హనుమంతుడు. అన్నిరుతువులలో పూచే, కాచే చెట్లతో, అతిశయిస్తున్న అశోకవనాన్ని, "శింశుపావృక్షం" పైనుండి చూసాడు హనుమంతుడు. అగ్నిజ్వాలల్లాంటి ఎర్రని చెట్లనూ, ఆంజనేయుడు అశోకవనంలో చూశాడు. అన్నిరుతువుల్లో ఫలాలతో నిండి, సువాసనగల చెట్లతో, జింకలతో అలరారుతూ, రెండవ గంధమాదన పర్వతాన్ని తలపిస్తున్నదావనం. వనం మధ్యలో కైలాసపర్వతంలో, తెల్లగా, నిర్మలంగా, పగడాల మెట్లు, బంగారపు అరుగులు కలిగి, లమీదేవిలా ప్రకాశిస్తున్న, రమ్యమైన, కన్నుల పండువైన, వేయిస్తంబాల మేడను చూసాడు హనుమంతుడు అతిదగ్గరనుండి.

మాసిన చీరతో, ధైర్యం చెడిన మనస్సుతో, ఆహారం తీసుకోనందున శుష్కించిన దేహంతో, నిట్టూర్పులతో, ఈమె సీతేనని గుర్తించలేని దేహకాంతితో, బాధిస్తున్న రాక్షస స్త్రీలమధ్యన కనిపించిందొక సుందరి హనుమంతుడికి. ఆ స్త్రీ, హోమధూమంతో కప్పబడి, అగ్నిశిఖలా అందంచెడి, మిక్కిలి బాధపడ్తూ కనిపించింది. ఒంటి చీరెతో, దుఃఖంతో, శుష్కించిపోయి, అంగారకుడు పట్టుకున్న కాంతి విహీనమైన రోహిణిలాగుంది. కన్నీళ్లు కాలువలు కారుతూ ముఖమంతా ఆవరించి, దుఃఖంతో శోషించి, వెక్కి, వెక్కి ఏడుస్తూ, రాక్షస స్త్రీసమూహాలనే చూస్తూ, ఒంటరిగా, వేటకుక్కలకు చిక్కిన ఆడజింకలా అల్లాడుతూ, నడుంవరకు వ్రేలాడుతున్న నల్లటి త్రాచుపాములాంటి ఒంటి జడతో, సంపూర్ణంగా మాసిన దేహంతో వున్న స్త్రీని చూసాడు హనుమంతుడు. ఆమె మిక్కిలి సుఖానికి యోగ్యమైన దానిలా, మిక్కిలి దుఃఖంపడే స్త్రీలా అనిపించింది హనుమంతుడికి.

ఆమె సీతాదేవేనని నిశ్చయించుకోవటానికి కారణాలు వెతుకుతాడు. ఆనాడు ఋశ్యమూకపర్వతం పైనుండి రావణుడు అపహరించుకుని పోతున్నప్పుడు చూసిన సుందరరూపాన్ని జ్ఞప్తికి తెచ్చుకుంటాడు. ఆ రూపమే ఈమెలో కనిపిస్తున్నదికదా అని మరల-మరల చూస్తాడు నిర్ధారణగా. ఆమెలో "స్థిరపడని, కుదుటపడని శ్రద్ధ; సందేహం కలిగించే స్మృతి వాక్యం; క్షయించిన సంపద; కల్మషంతో కూడిన బుద్ధి; విఘ్నమైనకార్యఫలంలో వుండే లక్షణాలను" చూస్తాడు హనుమంతుడు. ఈమె సీత కాదేమో, అవునేమో, లేక, రావణుడు బలాత్కారంగా తెచ్చిన స్త్రీలలో ఒకతేమో అనుకుంటాడు. సందేహం మాని, ఈమె సీతేనని నిర్ధారించుకుంటాడు. తన నిర్ణయానికి తానే కారణాలు వెతుక్కుని తృప్తి పడతాడు. తన నిర్ణయం సబబేనని తీర్మానించుకుంటాడు.

శ్రీరామచంద్రమూర్తి జానకి సొమ్ములని వేటిని చూపించాడో, అలాంటివన్నీ, ఈమె సమీపంలో ఒకచెట్టు కొమ్మకు వ్రేలాడుతుండడం కనిపించాయి, మరోనిదర్శనంగా సీతాదేవి ఆభరణాలను, కోతుల ముందు పడవేసినతర్వాత, వారు వాటిని మూటగా కట్టి, రాముడొచ్చినప్పుడు అందచేసారు. ఎవరైనా తనను వెతుక్కుంటూ వస్తే, గుర్తించేందుకు ఆమే ఆపని చేసింది. ఈమె సీతేననటానికి అక్కడ కిష్కింధలో చూసిన ఆభరణాలలాంటివే ఇక్కడా కనిపిస్తున్నాయి. అంటే కొన్ని అక్కడ విడిచి మిగిలినవి గుర్తుపట్టెందుకు ఇక్కడ వేలాడకట్టిందని భావిస్తాడు. ఎన్నాళ్లుగానో నగలు ధరించనందున ఆమె ఒంటి మీద గుర్తులుకూడా కనిపిస్తున్నాయి. అంటే, శ్రీరాముడు, సీత సొమ్ములివి అని వేటిని చూపించాడో, అవి ధరిస్తే ఎలాంటి గుర్తులు పడతాయో, అలాంటివే ఈమె ఒంటిమీదున్నాయి. సీతాదేవి పారేసినవి కాకుండా, తొందరగా తీసేయలేనివి ఒంటిమీదే వుంచుకున్నది. అక్కడ చూసిన నగలిక్కడ లేవు,

ఇక్కడున్నవక్కడ లేవు. అక్కడ ఎడమభాగానివి వుంటే, ఇక్కడ కుడివైపువి వున్నాయి. సందేహంలేదనుకుంటాడు హనుమంతుడు.

ఇంకా సందేహ నివృత్తికి కారణాలు వెతుకుతాడు. ఈమె సీతే అనడానికి మరోకారణం చెప్పుకుంటాడు హనుమంతుడు. ఈమె శ్రీరామచంద్రుడి హృదయేశ్వరి సీతాదేవి. సీతాదేవి హృదయేశ్వరుడు శ్రీరామచంద్రుడు. ఇరువురు ఏకాభిప్రాయం కలవారే. ఆమె "ఔనన్నది" ఈయన కాదనడు. ఈయన ఔనన్నది ఆమె కాదనదు. ఆమె రామాభిమతానుసారిణి. సీతానుగ్రహం వస్తే రాముడి అనుగ్రహం వచ్చినట్లే అనుకుంటాడు. రాముడి హృదయేశ్వరి, రాణి, అయినందున, దూరదేశంలో మగడిని విడిచి వున్నప్పటికీ, ఆయన హృదయాన్ని మటుకు వదలకుండా నిలిచే వుంది. ఆయన హృదయాన్నెడబాయకుండా వుంది. సాముద్రికశాస్త్రం ప్రకారం రాముడికెలాంటి అవయవ సౌష్టవముందో, అట్టి వాడికి ఎలాంటి అవయవ సౌష్టవం కల భార్య వుండాల్నో, అలాంటి లక్షణాలన్నీ ఈమెలో వుండడం మరో నిదర్శనంగా భావిస్తాడు.

ఆమె ఈయనపై మనస్సు నిలిపింది. కాబట్టి వీరిమనసులు ఎక్కడ న్యాయంగా వుండాలో, అక్కడే వున్నాయి. దేహాలు మాత్రం వేరుగా వున్నాయి. మనస్సులు ఏకంగా వున్నాయి. అందుకే వీరిద్దరూ బ్రతకగలిగారు. అదే కాకపోతే ఇద్దరూ మరణించేవారే! (ఇదే జీవాత్మ–పరమాత్మ సంబంధమని అర్థం చేసుకోవాలి).

ఇంకా ఇలా అనుకుంటాడు: "రాముడు భూకాంతుడు కనుక బ్రతికాడు. సీతాదేవిని విడవడంవలన కలగాల్సినంత దుఃఖమే కలిగితే బ్రతికుండే వాడా? ఆత్మహత్య చేసుకోనక్కరలేదు. నిజంగా దుఃఖమే కలిగితే ప్రాణాలు వాటంతటవే శరీరాన్ని విడిచిపోయేవే. అలాంటప్పుడు సీత ప్రాణమెందుకు పోలేదు? ఆమెకు దుఃఖం లేకనా? సీత పరతంత్ర. భర్త ఆజ్ఞ లేకుండా మరణించలేదు. దేహమే ఆమెది, ప్రాణం రాముడి సొత్తే. ఆమె పోగొట్టుకోలేదు. పోతాయన్నా బిగపట్టుకోవాలి. రాముడు స్వతంత్రుడు. దేహాన్ని వదలాల్సి వుండాలి. కానీ చేయలేదే? అదే అసాధ్య కార్యం. రాముడు సీతను, వదిలి ఎలా వుండగలుగుతున్నాడు? జీవితేశ్వరైన సీత పోయిన తర్వాత నాకింకేమిపననుకొని, జీవుడు పోవాలనుకున్నా, పోనీయక బిగపట్టాడు. ఇది దుష్కరమేకదా! ఇంతటి అసాధ్యకార్యం సాధించిన రామచంద్రమూర్తి సామాన్యుడుకాడు. ఇదిచేయకలిగినవాడు ఎంతటి అసాధ్యమైన పనైనా చేయగలడు. లంకాప్రవేశం చేసి, సీతను చూసిన నేనే అసాధ్యకార్యం చేసానన్న గర్వంతో వున్నానే. కాని రాముడు చేసిన కార్యం ఎదుట నేనుచేసింది గొప్పకానేకాదు."

జానకీదేవిని చూసిన హనుమంతుడు ఇలా అనుకుంటూ, మాసిన చీరతో, స్నానంలేని ఒంటితో, నిద్రాహారాలు మాని, భర్తనే ధ్యానంచేస్తున్న పరమపతివ్రతను చూసే అదృష్టం తనకు కలిగిందికదా అని ఆనందిస్తాడు. వానరులందరూ బ్రతికినట్లేననీ, సుగ్రీవుడు కృతజ్ఞుడయినాడనీ, రామలక్ష్మణుల కార్యం నెరవేరిందికదా అని సంతోషపడ్డాడు. "రామచంద్రమూర్తి ఎంతగొప్పవాడోకదా! కాకుంటే ఇట్టి స్త్రీకి భర్తయ్యేవాడా! ఎంత జితేంద్రియుడు కాకపోతే ఈమెను విడిచి బ్రతుకుతాడా?" అని సంతోషంతో శ్రీరాముడి సామర్థ్యాన్ని తనివితీరా పొగడుతాడు.

◆❖◆

సీత దృష్టిలో రావణుడు గడ్డిపోచతో సమానమా?

అశోకవనంలో సీతాదేవిని చూసిన హనుమంతుడు ఆమెను చూసే అదృష్టం తనకు కలిగిందికదా, రామలక్ష్మణుల కార్యం నెరవేరిందికదా అని సంతోషపడ్తాడు. ఉత్తమురాలైన సీతకు ఎటువంటి కష్టమొచ్చిందని తల్చుకుంటూ మరీ-మరీ ఏడుస్తాడు. ఏడుస్తూ అనుకుంటాడు:"ఈమె మహాపతివ్రత. ఈమెకిట్టి ఆపద రాకూడదు. సీత ప్రకృతికతీత. అందరిలాగా కర్మానుభవానికై పుట్టిందికాదు. అట్టి ఈమెకే దిగులు సంప్రాప్తిస్తే కాలాన్ని అతిక్రమించే వారెవరైనా వుంటారా? అదెవ్వరికీ సాధ్యం కాదు. రామచంద్రమూర్తి నిశ్చయం, లక్ష్మణుడి అభిప్రాయం ఎరిగిందికనుకనే, గుండెనిబ్బరంతో వుంది సీత. రామచంద్రమూర్తికి సీత, సీతకు రాముడు, వయస్సులో, స్వభావంలో, సాముద్రిక లక్షణాలలో, ఒకరికొకరు సరిగ్గా సరిపోయారు. ధర్మాత్ముడు, మహితాత్ముడు, మహాత్ముడు, మిధిలానాధుడు, జనకుడి కూతురు సీత ఈమె. పరమపతివ్రతైన సీతే ఈమె. సందేహంలేదు. ఇట్టిలక్షణాలు ఆమెలో తప్ప మరొకరిలో వుండవు'' అని కూడా అనుకుంటాడు.

వివాహకాలంలో శ్రీరాముడికి పన్నెండేళ్లు, సీతకు ఆరేళ్లు. అంటే రాముడి వయస్సులో సగం. శాస్త్రప్రకారం తగినవయస్సే. ఇప్పుడు శ్రీరామచంద్రుడి వయస్సు ముప్పైతొమ్మిది సంవత్సరాలు, సీతకు ముప్పైరెండు. వధువుకు ఎనిమిదేళ్ళు వుంటే, వరుడికి పదహారేళ్ళు వుండాలని విష్ణు స్మృతి. సీత-రాముడు వయస్సులో ఎలా ఈడూ-జోడో, శీలంలోనూ అంతే. సాముద్రికం ప్రకారం, సార్వభౌమత్వ చిహ్నాలు రాముడికున్నాయి. అట్టి వాని భార్యకల దానికే చిహ్నాలుండాలో అవన్నీ సీతకున్నాయి. సూర్యవంశంలో ప్రసిద్ధికెక్కిన వాడి కొడుకు రాముడైతే, చంద్రవంశంలో జగత్ప్రసిద్ధికన్న జనకుడి కూతురు జనని-జానకి.

''స్మరణ మాత్ర సంతుష్టాయ'' అంటే స్మరించినంత మాత్రాన సంతోషించే వాడు రాముడు. ''ప్రణతి ప్రసన్న జానకి'' అంటే ఒక్క నమస్కారంతో సంతోషించేది సీత. ఇట్టి అపురూప దాంపత్యం లోకంలో ఎక్కడైనా వుందానని ఆశ్చర్యపోతాడు హనుమంతుడు. భక్తులకు సీత-రాములిరువురూ సేవ్యులే.

జగన్మాత ''శ్రీదేవి'', జగన్నాయకుడు ''విష్ణువు''. ఒకరున్న చోటే రెండో వారుంటారు. వీరిరువురి తోనే ప్రపంచమంతా వ్యాపించి వుంది. ఈశత్వం ఇద్దరిలో సమానమే. సర్వదా ఏకశేషులే! ఒకేమాటలో ఇరువురినీ తెలిపేదే ఏకశేషం. ఇలా ''సర్వకారణత్వం, సర్వవ్యాపకత్వం, సర్వనియంతృత్వం'' లక్ష్మీనారాయణుల్లో, సీతారాముల్లో వుంది. ఇరువురిలో, "ఉపాయత్వం, ఉపేయత్వం'' వున్నాయి. అందుకే సీతారాములిరువురూ సమానంగా సేవించాల్సిన వారేనని గ్రహించాడు హనుమంతుడు.

రామచంద్రమూర్తి చేసే కార్యాలన్నింటికీ మూలకారణం సీతాదేవే! చేసేది రాముడు, చేయించేది సీత. నిగ్రహానుగ్రహాల రెండింటిలోనూ ఇదే నియమం. భగవంతుడు అనేకకోటి బ్రహ్మాండ నాయకుడు కాగా అఖిలాండ కోటి బ్రహ్మాండాలకు నాయకి లక్ష్మీదేవి. ఈ అనంత కోటి బ్రహ్మాండాలు ఆమె మూలాన్నే నామరూపాలై, స్థితిగలవై వున్నాయి. అట్టి ఈమెకు ముల్లోకాలు ఒక లెక్కకాదు. అయితే లక్ష్మీదేవి, సీతాదేవి భగవంతుడి సహధర్మచారిణిగా, భగవత్ సంకల్పానుసారంగా, తదాజ్ఞావశవర్తియై, ఆయనకు పరతంత్రంగా వుంటుందని భావన.

సీతాదేవి వృత్తాంతమంతా ఏకమై, అనన్యమై, భగవత్ ప్రాప్తి ఎప్పుడా-ఎప్పుడా అని ఎదురు చూస్తుండే పరమభక్తురాలి-ప్రపన్నురాలి చరిత్రే! అందుకే రామాయణాన్ని "సీతాయాశ్చరితమ్ మహత్" అంటాడు వాల్మీకి. సీతాదేవి తాను చెరనుండి తప్పించుకోవటమే కాకుండా, తన లాగా దుఃఖిస్తున్న దేవ, గంధర్వ, నాగ మొదలైన జాతుల స్త్రీలను కూడా విడిపించింది. సీతాచర్య నేర్పేదిదే! ఇతర ఉపాయాలను వెతక్కుండా, దేహాభిమానం, స్వాతంత్ర్యం వదిలి, స్వరక్షణాభారం భగవంతుడిమీద వేసి, "అనన్యార్హశేషత్వం, అనన్యశరణత్వం, అనన్యభోగత్వం" అనే అకారత్రయ సంపూర్తిని కలిగి, సంసారంలో వుండే తరించేటందుకు "ప్రపత్తితోనో, పరమభక్తితోనో" సాయుజ్యాన్ని పొందవచ్చని, సీతాదేవి చరిత్ర వలన తెలుసుకోవచ్చు. అంటే, భగవత్ప్రాప్తి కోరేవాడు, ఆయన అనుగ్రహం కొరకు సీతాదేవిలాగా, భగవన్నామాన్ని వుచ్చరిస్తూ, స్వధర్మాన్ని వదలకుండా వుండడం తప్ప వేరే మార్గం లేదు.

సీతాదేవి శ్రీరాముడినొక్కడినే చూడాలనుకుంటుంది. అంటే, ఇది, "ఏకాగ్రభక్తి, ఏకభక్తి, అనన్యత్వాన్ని" గురించి చెప్పటమే. అలానే, భక్తుడు దేవతలెందరున్నా, తన ఇష్టదైవాన్నే నమ్మి, "ఏకభక్తి, ఏకాగ్రభక్తి" కలవాడై వుంటాడు. అలానే భక్తులు, ప్రపన్నులు, తమ కెన్ని కష్టాలొచ్చినా, విశ్వాసం వదలకుండా, భగవంతుడు రక్షించేదాకా, తమ "భక్తి-ప్రపత్తులే" తమకు రక్ష అని భావిస్తారు. పతివ్రతలు తన భర్తకంటే ధనవంతులు, విద్యావంతులు, రూపవంతులు, బలవంతులు, లోకంలో ఎందరున్నా, భర్తకంటే అధముల్లాగానే ఎంచుతుందికాని, వారిని ప్రేమించదు.

దుఃఖం మీద, దుఃఖం వస్తుంటే, పరితపిస్తున్న సీత కనిపించింది హనుమంతుడికి. సీత సమీపంలోనే ఆమెకు దిగులు కలిగిస్తున్న వికార-ఆకారాల రాక్షస స్త్రీలనెందరినో చూసాడు. సీత చుట్టూ తిరుగుతూ, అరుస్తూ, కేకలేస్తున్న రాక్షస స్త్రీలను చూసిన హనుమంతుడి దేహం పులకరించింది. ఆయన కంటికి వారంత భయంకరంగా వున్నారు. రాక్షసులింకా మేలుకునే వున్నారు కాబట్టి, చెట్టు మీదనే వుండిపోయాడు హనుమంతుడు. కాంతి తొలగిన ముఖమున్నప్పటికీ, భర్తపరాక్రమం తలచుకుంటూ, ఆయన తనను తప్పక రక్షిస్తాడన్న ధైర్యంతో కనిపించిందామె. మైమర్చిపోయే సౌందర్యమున్న సీతను

చూసి, కృతార్థుడనైతినని, సంతోషంతో హనుమంతుడి కళ్లల్లో నీరు ప్రవహించింది. ఇదంతా రామలక్ష్మణుల అనుగ్రహంతో లభించిందేకదా అని వారికి నమస్కరించి, సీతతో మాట్లాడే సమయంకొరకు , చెట్టుకొమ్మపైనే వేచిచూడసాగాడు.

దాదాపు రాత్రంతా గడిచిపోయి, తెల్లవారుతున్న సమయంలో, రావణుడు సీతను తలచుకుంటాడు. కంటికి ఇంపైన అశోకవనంలోకి, భూషణాలు ధరించిన రావణుడు, తనకున్న మహాసంపదను ప్రదర్శించుకుంటూ ప్రవేశించాడు. కామాతిశయంతో కన్నుమిన్ను కానని రావణుడు, సీత తనకు వశపడుతుందని, మూఢుడై భావిస్తూ, పరస్త్రీల విషయంలో పాటించాల్సిన కనీస మర్యాదను కూడా మరచి అశోకవనంలోకి ప్రవేశిస్తాడు. ప్రవేశించి సీతాదేవిని సమీపించాలని అనుకుంటాడు. వాడిని చూసిన హనుమంతుడు, తను చూస్తున్నది రావణుడినేనని అనుకుంటాడు. వాడిని పూర్తిగా చూసేందుకు, అనువైన స్థలంచేరి , వాడెదురుగా కనిపించేవిధంగా, బలవంతుడు అయినప్పటికీ, వాడి తేజస్సు ముందర తేజోహీనుడై కొమ్మల నడుమ దాగాడు.

రావణాసురుడు, తనవైపు రావడం, దూరాన్నుండే చూసిన సీత, వణకసాగింది. ఆలస్యం చేయకుండా, తన శరీరాన్ని భయంతో కప్పుకుంటుంది. రావణుడిని చూసి తెల్లబోయింది. పవిత్రురాలైన సీతను, పాపాత్ముడైన రావణుడు, తన మరణదశ దగ్గరపడడంతో, సమీపించాడు. రావణుడు, తియ్యటిమాటలతో, తన మనసులోని ఆలోచనను, పతివ్రతా శిరోమణైన సీతకు చెప్పాడు.

“సౌందర్యగనీ! నన్ను గౌరవించు. నీవు భయపడాల్సిన అవసరంలేదు. నేను రాక్షసుడనైనప్పటికీ, నీమీద కామంతో వచ్చానేకాని నిన్ను చంపడానికి రాలేదు. నీకు పాపభయమక్కరలేదు. నువ్వు భయపడవద్దు. నన్ను అనుగ్రహ దృష్టితో గౌరవించు. నీకు సరితూగే స్త్రీ ఈలోకంలో లేనేలేదు. నిన్ను పొగడడం నాకు సాధ్యం కావడంలేదు. అజ్ఞానం వదలి నా భార్యవు కా. పట్టపురాణివి కా. నామణులు, రాజ్యం, నీ సొత్తే”. ఇలా తనను పొగుడుకున్న రావణుడు ఆ తరువాత శ్రీరాముడిని దూషించాడు.

దుష్ట రావణుడిద్వారా ఇలాంటి మాటలు వినాల్సివచ్చెకదా అని, మనసులోనే దిగులుపడుతుంది సీత. వీడు తన్ను తాకుతాడేమోనని భయంతో వణకిందికూడా. వాడిని దహించగల శక్తి తనకున్నా, సాధ్వి అయినందున, సహించి వూరుకుంది. ఆపత్కాలంలో దేవుడిని ప్రార్థించినట్లే, పతివ్రతలకు భర్తే దైవం కనుక, శ్రీరాముడిని తలచుకుంది. తనను వీడేమీ చేయలేడన్న ధైర్యం తెచ్చుకుని, తన కోసం ఏడవకుండా, భర్తకు తనవల్ల దుఃఖం వచ్చింది కదా అని బాధపడింది. చెప్పినా వినకుండా, తనకారణాన రావణుడు సర్వనాశనమైపోతున్నాడే అని, వాడికొరకూ కన్నీరు కార్చింది. ఇలా అనుకుంటూ, పరిశుద్ధమైన చిరునవ్వుముఖంతో ఒక “గడ్డిపోచ”ను తనకడ్డంగా రావణుడి ముందు పడేసింది సీత.

రావణుడు దుష్టుడైనా ప్రభువు, క్షత్రియుడు. పైగా తన దగ్గరకొస్తున్నాడు కాబట్టి వాడు అతిథే. అతిథిని సత్కరించాలని శాస్త్రాలు చెప్తున్నందువల్ల తనకు లభించిన “తృణం” వాడివైపుకు వేసిందని ఒక భావన. “నిన్ను నేను తృణప్రాప్రాయంగా చూస్తున్నాను. ఈ తృణం నన్నేమి చేయగలదో నువ్వూ అంతే” అనేది మరో అర్థం. రావణుడు పశువుతో సమానమనే అర్థమొచ్చే రీతిలో వాడి భోగ్యవస్తువైన గడ్డిపోచ వేసింది సీత. ఇలా ఎన్నో అర్థాలను, విశేషాలనూ సెలవిస్తారు మన పెద్దలు గడ్డిపోచను మధ్యలో

వేయడంలో. అలా రావణుడిని తృణప్రాయంగా చూసి కర్తవ్య బోధ చేసింది సీతాదేవి.

''రావణా! నీవు మూఢుడివిరా! రామచంద్రమూర్తి నుండి నన్ను వేరుచేయడం నీకు చేతనవుతుందా? శ్రీరామచంద్రుడికి నేను ''అనన్య''ను. నన్నాయన నుండి వేరుచేయలేవు. నీవు అవివేకివి. నేను రాముడి దానినైనా, ఆయన మీద ఆధారపడ్డ పరతంత్రనైనా, నేనే ఆయన్ను లోకానికెక్కువగా వుపయోగపడేటట్లు చేస్తున్నాను. ఆయన మహిమ లోకమంతా తెలవడం నావల్లనే. నేనులేకపోతే, ఆయన ఉనికేలేదని చెప్పాలి. నాభర్తను ఎడబాసి వగస్తున్న నాదగ్గరకు, నామగడిని తెచ్చి విడువు. అలాచేస్తే నిన్ను ''నయమతి'' అంటారు. నేనుచెప్పినట్లు చేయి. చేయకపోతే రాముడు నిన్ను చంపడం ఖాయం'' అని అంటుంది.

మారీచుడు రావణుడితో ''జనకాత్మజ సంబంధంబున రాముండప్రమేయ పురుతేజుండయ్యె'' నని చెప్పాడు. అవివేకైన రావణుడికి అది అర్థం కాలేదని సీత గుర్తుచేస్తుందిక్కడ. యాచకులు లేని దాతలు, రోగులు లేని వైద్యులు లేనట్లే, ప్రపంచం లేకపోతే భగవంతుడు లేనేలేడు. ప్రకృతిమూలాన్న తప్ప, భగవంతుడిని తెల్సుకునే మార్గమే లేదు. ఆ భగవంతుడి శక్తే ''లక్ష్మి''. ఆమే ''మాయ''. ఆమే ''ప్రకృతి''. ఆమె 'చిద్విలాసమే' ప్రపంచం. ఎప్పుడెప్పుడు విష్ణువు అవతారమెత్తుతాడో, అప్పుడన్ని సమయాల్లో శ్రీదేవి ఆయనకు సహాయంగా రావాల్సిందే. విష్ణు దేహానికి అనురూపమైన దేహాన్ని ధరిస్తుంది. ఆమె ''అనన్య''. అంటే, చీకటి–వెలుతురు లాగా అన్యం కాకుండా వుంటుంది.

సీతాదేవి కఠినంగా మాట్లాడుతుంటే, కోపించిన రావణుడు, అనరాని పరుషమైన మాటలతో, ఆమె పైన విరుచుకు పడ్డాడు. "జానకీ! ఇదివరకు పన్నెండు నెలల గడువిచ్చాను నీకు. ఇంకా రెండునెలలు మిగిలాయందులో. అంతవరకు నీమీద నమ్మకంతో వేచిచూస్తాను. ఈలోపల నువ్వు నాభార్యగా, నాపడకెక్కకపోతే, గడువు తీరిన మర్నాడే, నా వంటవాళ్లు నిన్ను, నా ఉదయం భోజనంలో నంచుకోవటానికి వండుతారు". రావణుడి బెదిరింపు మాటలకు సీత భయపడలేదు. చాలా రకాలుగా వాడిని బెదిరించింది. తానే వాడిని భస్మం చేయగలిగినా, పరతంత్రురాలినైనందున అలా చేయడం లేదన్నది.

నయాన–భయాన, సీతాదేవి చెప్పిన మాటలు రుచించని రావణుడు, సీతను నానా రకాలుగా నిందించాడు. అక్కడున్న నానారకాల రాక్షస స్త్రీలను ఆమెపైకి పురుగొల్పుతాడు. సీతాదేవిని తనవశమయ్యేటట్లు చేయమంటాడు. ఇట్లా బెదిరిస్తూ, రాక్షస స్త్రీలను ఆజ్ఞాపిస్తూ, సీతను మళ్లీ, మళ్లీ చూస్తూ, రాక్షస స్త్రీలు, తనచుట్టూ సేవిస్తుండగా, సీతను అనుచితమైన రీతిలో మరోమారు బెదిరించి, మదనోద్రేకానికి గురై, తడపడ్తూ, బంగారంతో ప్రకాశిస్తున్న తన ఇంట్లోకి వెళ్లిపోతాడు రావణుడు.

◆❖◆

త్రిజట స్వప్నం నిజమా? కల్పితమా?

రావణుడి ఆజ్ఞానుసారం, రాక్షస స్త్రీలు, సీత దగ్గరకు చేరి, అనేక రకాల కఠినమైన మాటలన్నారు. ఏకజట, హరిజట, ప్రఘస, వికట, దుర్ముఖి, వినత, అసుర, చండోదరి, అజాముఖి, శూర్పణక అనే రాక్షస స్త్రీలు రావణుడి బల పరాక్రమాలను పొగిడి అతడి ఇల్లాలివై సంతోషించమనీ, రారాజును, దేవతల విరోధిని, రావణుడిని భర్తగా చేసుకుని సుఖపడమని హితబోధ చేశారు. నయవాక్యాలతో సీతను ఒప్పించ లేకపోయిన రాక్షస స్త్రీలు, బెదిరింపు మాటలన్నారు. తనను పరుష వాక్యాలతో బాధిస్తున్న రాక్షస స్త్రీలతో, తన మనసులోని మాటలను చెప్పసాగింది సీత.

"ఓరాక్షస స్త్రీలారా! మీరు చెప్తున్న మాటలు లోకం మెచ్చేవికావు. మీకు ఘోరపాపాన్ని కలిగిస్తాయి. మనుష్య స్త్రీ, రాక్షసుడి భార్యకావడం ఎక్కడైనా జరిగిందా? చెడుమాటలు మానేయండి. నామగడే నాకుగొప్ప" అంటుంది సీత రాక్షస స్త్రీలను వుద్దేశించి. సీతాదేవి అన్న మాటలకు ప్రత్యుత్తరంగా, రావణుడిచే ఆజ్ఞాపించబడిన రాక్షస స్త్రీలు, కఠినవాక్కులనే బాణాలతో ఆమెను నొప్పించసాగారు. ఆమాటలకు, శోకంతో కన్నీళ్లు కారుతుంటే, భయంతో లేచి శింశుపావృక్షం చాటుకు పోతుంది సీతాదేవి.

శింశుపావృక్షం మీద కూర్చుని రాక్షస స్త్రీలు జానకిని బెదిరిస్తూ అన్న మాటలన్నీ విన్నాడు హనుమంతుడు. రావణుడు రాకముందే తాను చూసిన స్త్రీని సీతాదేవిగా నిర్ణయించుకున్న హనుమంతుడు, సీతా-రావణుల సంభాషణవల్ల, తన నిర్ణయాన్ని స్థిరపర్చుకున్నాడు.

ఈ విధంగా రాక్షస స్త్రీలు బెదిరిస్తూ మాట్లాడుతుంటే, సీతాదేవి "రామా" అంటూ గొంతెండగా ఏడ్చింది. లంకలో వున్న సీతాదేవి రాక్షస స్త్రీలతో పడ్డ బాధల్లాంటివే, దేహంలోని "బద్ధజీవుడు" సంసారమనే ఇంద్రియాలతో పడే బాధలు. రావణుడు కానీ, రాక్షస స్త్రీలు కానీ, సీతను బెదిరించారే కాని, చంపలేక పోయారు. అదే విధంగా, "జీవాత్మ" ను ఏవీ చంపలేవు. బాధించ గలుగుతాయి. సీతాదేవి లాగా బద్ధ జీవులు "ప్రారబ్ధ" మని, దృఢ చిత్తంతో, భగవంతుడే రక్షిస్తాడని అమిత విశ్వాసంతో వుండాలి.

సీతాదేవి ఇంద్రియాలకు లోబడలేదని, భగవంతుడి మీదే విశ్వాసం వుంచిందని దృఢ పడ్తున్నది.

సీత ఇంకా ఇట్లా అనుకుంటుంది తనమనస్సులో: ''శ్రీరామచంద్రుడి దర్శనం లేకపోవడం అటుంచి, రాక్షస స్త్రీలకు వశపడి బాధపడాల్సి వచ్చిందికదా! నేను ఇంకా మరణించక ఎందుకు ప్రాణం నిల్పుకున్నాను? నాపాపమే కారణమా? ఇంత మహా దుఃఖాన్ని అనుభవించడానికి పూర్వజన్మలో నేనెంత ఘోరపాపం చేసానో? ఈవిధంగా మూర్ఖపు రాక్షస స్త్రీలు కావలికాస్తుంటే ఎక్కడో వున్న రాముడు రావడమేంటి? నన్ను రక్షించడమేంటి? కాబట్టి మృత్యుదేవతే నాకు దిక్కు''.

శ్రీరాముడిని తలచుకొని దుఃఖించిన సీత, రాక్షసస్త్రీల పైన తన కోపాన్నీ, అశక్తతనూ చూపిస్తుంది. పరుషంగా మాట్లాడుతుంది. ''మీ నోళ్లు పట్టెతంత చిన్న-చిన్న ముక్కలుగా నాశరీరాన్ని కోసుకోండి. కత్తులతో నరకదల్చుకుంటే అలానే చేయండి. మంటల్లో వేయదల్చుకుంటే వేసికాల్చండి. మీ ఇష్టం వచ్చినట్లు మీరుచేయండి. నేనైతే మీమాట వినను. ఎందుకు మీకీమిడిసిపాటు? గర్వం? నాదేహం మీవశం. ఏమైనా చేసుకోండి. మనసు నాస్వాధీనం. దాన్ని మీరేమీ చేయలేరుకద!'' అని తెగేసి చెప్పి, ఇంకా ఇలా అంటుంది:

''నీచుడైన రావణుడు నాకు ఏడాది గడువిచ్చాడు. అదివాడి చావు గడువు. అదిదగ్గర పడ్తున్నది. ఆ గండం తప్పించుకోవడం, మీ రాక్షసులకు తెలవదు. ఉత్పాతం ఇప్పుడే పుట్టున్నది. చూస్తుండండి. ధర్మ మార్గంలో అపాయం తప్పించుకోవడం తెలియని మూఢరాక్షసులు, ఈ కీడు మూడింది నావల్లనేనని, రావణాసురుడి భోజనానికి నన్ను హింసించి పంపుతారేమో! ఆమాత్రం కీడుతప్పదు. రాముడు తమను చంపుతుంటే, వాళ్లు నన్ను చంపుతారు. నా ప్రాణేశ్వరుడు దయాశీలి, తామర రేకుల్లాంటి కళ్లున్న రామచంద్రమూర్తినే విడిచి ఏడుస్తున్న నన్ను మీరేంచేసినా, నేనేంచేయగలను?''

ఇదంతా జరుగుతున్న సమయంలో అక్కడే నిద్రిస్తున్న ''త్రిజట'' అనే వృద్ధ రాక్షస స్త్రీ, వీళ్లందరినీ మందలించింది. దూరంగా పొమ్మని అందరినీ గద్దిస్తుంది. ఈ రాక్షస సమూహమంతా మూలమట్టంగా నాశనమౌతుందని, సీతాదేవి భర్తకు విజయం తథ్యమని కలగన్నాననీ, ఆ కలను తల్చుకుంటే దేహమంతా వణుకుతున్నదనీ, తనకల విషయం వివివరంగా వినమనీ అనగానే రాక్షస స్త్రీలందరూ భయంతో ఆమె చుట్టూ చేరారు. తాను కలలో చూసిన సన్నివేశం వివరాలను ఇలా చెప్పసాగింది త్రిజట:

''తెల్లటి ఏనుగు దంతంతో తయారై, ఆకాశంలో పయనించగలిగిన పల్లకీని, వేయి హంసలు లాగుతుంటే, తెల్లటి వస్త్రాలు కట్టుకుని, రామచంద్రమూర్తి, లక్ష్మణుడితో కూడి వస్తాడు. సీత అందమైన తెల్లటి చీరె కట్టుకుని, పాలసముద్రంలో, తెల్లటి పర్వతం మీద సూర్యుడితో కూడిన ప్రభలాగా, రాముడితో వుండగా చూసాను. నాలుగు దంతాల కొండలాగున్న ఏనుగుపై లక్ష్మణుడితో రాముడు పోతుండగా చూసాను.

''తెల్లటి వలువలు, పూదండలు ధరించి, ధీరుల్లో శ్రేష్ఠులైన రామలక్ష్మణులు, చిగుళ్ల లాంటి పాదాలున్న సీత పక్కన సంతోషంతో వుండగా చూసాను. అదిచూడగానే నా గుండెలు పగిలాయి. ఆపర్వత శిఖరం మీద ఆకాశాన్ని తాకుతున్న ఏనుగుపై, రాముడి తొడమీద సీతాదేవి కూర్చొని వుంది.

సూర్యచంద్రులను తాకుతున్నదా అనిపించింది. రాజకుమారులైన రామలక్ష్మణులు, చంద్రుడిలాంటి ముఖమున్న సీతాదేవి, స్పష్టంగా భద్రజాతి ఏనుగుపై కూర్చొని లంకమీద ఆకాశాన వున్నట్లు కలగన్నాను. ఎనిమిది మేలుజాతి ఎడ్లను కట్టిన రథమెక్కి రామచంద్రుడు ఈ సీతాదేవితో రావడం చూసాను.''

''సూర్యకాంతిగల పుష్పక విమానం ఎక్కి రామలక్ష్మణులు, ఉత్తరదిశగా సీతతో పోతుంటే చూసాను. విష్ణుపరాక్రముడు, మహాబుద్ధిశాలి, శ్రీరామచంద్రమూర్తి, సీతతో, తమ్ముడితో వుండగా చూసాను. ఇది నిజమవుతుందనిపిస్తున్నది''. (స్వప్నక్రమం: రామలక్ష్మణులు పల్లకీలో సీతను వెతుకుతూ లంకకు వస్తారు. లంక దగ్గర పాలసముద్రంలో ఒక తెల్లటి కొండ దగ్గరకు రాముడు వచ్చి చేరుతాడు. సీతకూడా ఆ కొండ దగ్గరే వుంది. రామలక్ష్మణులు పల్లకి దిగి ఏనుగునెక్కి సీత దగ్గరకొచ్చారు. సీతకూడా ఏనుగునెక్కి పెనిమిటి తొడపై కూర్చున్నప్పుడు సూర్యచంద్రులను తాకుతున్నట్లుగా వుంది. ఈ విధంగా వాళ్లు లంకకు ఆకాశమార్గాన వచ్చి, ఏనుగు దిగి, ఎనిమిది ఎడ్లు కట్టిన రథంపై కూర్చుని, లంకకొచ్చి, పుష్పకవిమానం ఎక్కి ఉత్తరదిశగా పోయారు)

''పాపాత్ములు స్వర్గం దగ్గరకు ఎట్లా పోలేరో, అట్లే దేవరాక్షస సమూహాలు యుద్ధరంగంలో, శ్రీరాముడిని సమీపించలేవు. రావణుడు ఒంటికి నూనె పూసుకుని, నూనె త్రాగుతూ, గన్నేరు పూల దండలు మెళ్లో వేసుకుని, ఎర్రబట్టలు కట్టుకుని, బోడితలతో, నల్లబట్టలు ధరించి, పుష్పక విమానం నుండి ఒక ఆడది ఈడుస్తుంటే, నేలపైబడి బాధపడ్తుంటే చూసాను. గాడిదలు కట్టిన రథం మీద, ఎర్ర పూదండలు వేసుకుని, ఎర్రగంధం పూసుకుని, పిచ్చివాడిలాగా నూనె త్రాగుతూ, గంతులేస్తూ, గాడిదమీద దక్షిణ దిక్కుగా పోతుంటే చూసాను. గాడిదమీద పోతున్న వాడల్లా తలకిందులుగా పడిపోతాడు. పడి, భయంతో దిగ్గునలేచి, తెల్లబోయి, మత్తుతో వికలుడై, భయపీడితుడై, వాగుతూ, బట్టలిప్పేసి, దిక్కుతోచక, భయంకరమైన, అసహ్యమైన బురదలో పడిపోవడం చూసాను. కాళి అనే ఓ స్త్రీ ఎర్రగుడ్డేసుకుని, బురద పూసుకుని, వాడిమెడను కౌగలించుకుని, రాక్షసరాజును దక్షిణదిక్కుగా ఈడ్చుకుంటూ పోతుంది.''

''కుంభకర్ణుడి పైకూడా ఇలాంటికలే కన్నాను. రావణుడి కొడుకులు నూనెలో మునగడం చూసాను. పందిపై రావణుడు, మొసలిపై ఇంద్రజిత్తు, ఒంటెపై కుంభకర్ణుడు దక్షిణదిక్కుగా ప్రయాణం చేయడం చూసాను. ఒక్క విభీషణుడు మాత్రం తెల్ల గొడుగు, తెల్ల బట్టలు, తెల్లగంధం పూతతో, ఆటపాటలమధ్య, మేఘధ్వనిగల ఒక పెద్ద ఏనుగునెక్కి నలుగురు మంత్రులతో ఆకాశ మార్గంలో పోతుంటే చూసాను. ఎర్రగుడ్డలు, ఎర్రమూల్యాలు ధరించి మేళతాళాలతో వుండగా చూసాను. విరిగిన గోపురాలతో వున్న రావణ రక్షణలోని లంక సముద్రంలో పడుతుంటే చూసాను. రాముడికి భృత్యుడైన ఓ కోతివచ్చి లంకను కాల్చి బూడిదచేయగా చూసాను. ఏడుస్తున్న ఆడవాళ్లు నూనె త్రాగి లంకలో వేడి బూడిదలో పడిపోవడం, కుంభకర్ణుడు, ఇతర రాక్షసులు పౌరుషం పోయి, పేడమడుగులో పడుతుంటే చూసాను.'' తనకొచ్చిన కల విషయం చెప్పడంతోపాటు, రాక్షసస్త్రీలను మందలిస్తుంది కూడా త్రిజట ఇలా:

''రాక్షసస్త్రీలారా లేచి చాటుగా పొండి. సీతాదేవిని తీసుకెళ్లటానికి ఇక్కడకు వచ్చిన రాముడు, భయంకరంగా రాక్షసులందర్నీ చంపుతున్నప్పుడు, తనభార్యను బాధించిన మిమ్ములనందరినీ కూడా

చంపకుండా వూరుకోడు. అందువల్ల మీమాటలు చాలించండి. బెదిరింపు మాటలు మానండి. ప్రాయశ్చిత్తంతో క్షమించమని సీతను వేడుకుందాం. నా కల నిజమైన కల. సీత తప్పక తనభర్తను చేరుతుంది. సీత దు:ఖాన్ని అనుభవించడానికి అర్హురాలుకాదు. ఈమె దివ్యసుఖాలను అనుభవిస్తుంది. ఈమెను బాధిస్తే మనకొచ్చిన లాభమేంటి? ఆమె ఎడమకన్ను ఎట్లదురుతుందో చూడండి. అది ఆమెకు మేలుచేస్తుంది. ఈమె అనుకున్నట్లే భర్తను కలుస్తుంది. రావణుడు నాశనం అవుతాడు. రామచంద్రమూర్తి గెలుపు ఖాయం'' అంటుంది.

ఇదిచెప్తుంటే ఉన్నట్లుండి సీతాదేవి ఎడమచేయి పులకించి అదిరింది. ఎడమతొడా అదిరింది. అంటే రాముడు సమీపంలోనే వున్నాడని మంగళసూచిక. మొదట సీతమ్మ ఎడమకన్ను అదిరింది. వెంటనే ఎడమ భుజం అదిరింది. తరువాత ఎడమ తొడ అదిరింది. ఇవన్నీ త్రిజట చెప్పినప్పుడు ఆ రాక్షస స్త్రీలంతా చూసారు. నిజమేనని నమ్మక తప్పింది కాదు. కొమ్మలమీదున్న పక్షులు అమితమైన సంతోషంతో, ఓదార్పు మాటలు పల్కుతూ, శుభసూచకం ప్రేరేపిస్తూ సీతకు ధైర్యాన్ని కలిగిస్తున్నాయనీ, దీన్నిబట్టి సీతకు త్వరలోనే శుభం కలుగనున్నదనీ, కాబట్టి రాక్షసులు ఆమెను బాధించవద్దనీ అంటుందిత్రిజట. రాక్షసస్త్రీలంతా, త్రిజట చెప్పినట్లే సీతాదేవి శరణుజొచ్చారు. రక్షిస్తానని సీత వారికి అభయమిస్తుంది.

త్రిజట విభీషణుడి కూతురని కొందరు, కాదని మరి కొందరు అంటారు. ఆమె సీతాపక్షపాతి, అభిమానం వున్నామె. కలంతా కల్పితమనుకున్నా, కోతివచ్చే విషయం, లంక కాల్చే విషయం వూహించని విషయమేకదా! అంటే స్వప్నమంతా కల్పితం కాకపోవచ్చు. రామాయణంలో మూడు స్వప్నాలున్నాయి. దశరథ స్వప్నం, భరత స్వప్నం, త్రిజట స్వప్నం. మూడూ నిజమయ్యాయి. భగవంతుడే నిద్రపుచ్చుతూ, మేల్కొన్నప్పుడున్న ఇంద్రియాలను తానే గ్రహించి, బాహ్యేంద్రియాలను విస్తరించి, స్వప్నాలను వాడి, వాడి అదృష్టం ప్రకారం సృష్టించి, కొంతసేపు వాడనుభవించేటట్లు చేస్తాడు. స్వప్నంలో కనిపించేవన్నీసృష్టించబడినవే. స్వప్నాల్లో చూసినవన్నీఅసత్యంకాదు. స్వప్నాలుయదార్థమౌతాయనడం శాస్త్ర సమ్మతం. త్రిజట తన స్వప్నాన్ని వివరించిన విధం రాక్షస స్త్రీలకు హడలెత్తించగా, శింశుపా వృక్షంపై చక్కగా కూర్చొని ఇదంతా వింటున్న హనుమంతుడికి ఇక చేయవలసిన పని ఏదో అందంగా సూచించినట్లయింది.

ఇంతలో, సీతాదేవికి మళ్లీ శుభశకునాలు కనపడసాగాయి. సీతాదేవి ఎడమకన్ను చేప తాకిన పద్మంలాగా అదిరింది. ఆమె ఎడమచేయి అంతకంటే కూడా ఎక్కువగా అదిరింది. ఇలాంటి శుభశకునాలు కన్న సీతాదేవి శోకం వదలి, సంతోషించి, చంద్రుడున్న రాత్రిలాగా ప్రకాశించసాగింది. అంటే భర్తతో గూడిన సంతోషం కలిగింది.

◆❖◆

హనుమ సీతకు విశ్వాసపాత్రుడయ్యాడా?

రావణాసురుడు ఆజ్ఞాపించిన దరిమిలా, రాక్షసస్త్రీల బెదిరింపు మాటలను, సీత సమాధానాన్ని, త్రిజట చెప్పిన స్వప్న వృత్తాంతాన్ని శింశుపా వృక్షం మీద కూర్చుని విన్న హనుమంతుడు, ఈమె దేవలోకంలోని నందనవనంలో వుండాల్సిన స్త్రీగాని, మనుష్య స్త్రీకాదని తలుస్తాడు. వివిధ రకాల ప్రత్యక్ష, పరోక్ష నిదర్శనాల వల్ల, తాను చూసింది సీతనేనీ, రామచంద్రమూర్తి సందేశం వినే అర్హత ఈమెకే వుందనీ, హనుమంతుడు తీర్మానించుకుంటాడు. ఇంతవరకు సుగ్రీవుడు అప్పగించిన సీతాన్వేషణ పని సాధించిన హనుమంతుడు, ఇక శ్రీరాముడు చెప్పిన కార్యసాధన గురించి ఇలా ఆలోచించసాగాడు.

''సీతాదేవికి ఆమె భర్త యోగక్షేమాలు తెలిపి, ధైర్యం చెప్పడమే మేలైన పని. ఈమెకు ధైర్యం చెప్పి, ఈమె దుఃఖాన్ని నివారించడం నా ప్రథమ కర్తవ్యం. రామచంద్రమూర్తి సీతను ఎప్పుడు చూస్తానా అని ఆసక్తితో వున్నాడక్కడ వనంలో. ఆయన మాటలు ఈమెకు చెప్పి, ఓదార్చి, ఈమెచెప్పే మాటలు ఆయనకూ చెప్పి ఆయన్ను కూడా ఓదార్చాలి. ఇదే సరైన మార్గం.'' అనుకుంటాడు హనుమంతుడు.

''శ్రీరాముడి వృత్తాంతం ఈమెకు చెప్పడం ఆవశ్యకమే అయినా, ఎలా చెప్పాలి? అవకాశం చూసి, సీతాదేవిని ఓదార్చిపోవడమే మంచిది. ఎట్లాజరగాలది? నేను చిన్న ఆకారంలో వున్నాను. దాన్నిప్పుడు పెంచొద్దు. కోతినైన నేను మనుష్యులలా సంస్కృతం మాట్లాడవచ్చా? బ్రాహ్మణుడిలాగా సంస్కృతం మాట్లాడితే, నన్ను రావణుడిగా అనుమానించి అసలే మాట్లాడదేమో! మాట్లాడకుండా వూరుకుంటే, ఓదార్చాల్సిన ఆమెను ఎలా ఓదార్చాలి? మాట్లాడాలంటే, ఎలా, ఏమి మాట్లాడాలి? వేరేమార్గం లేదు. ఈమెకు తెలిసిన ప్రాకృతభాషలోనే మాట్లాడుతా. ఎలా చెప్పితే సీత నామాటలు చక్కగా వింటుంది, నన్ను చూడగానే సీత భయపడకుండా ఎట్లా వుంటుంది?''

ఇలా పరిపరి విధాల ఆలోచించిన హనుమంతుడు, బుద్ధిమంతుడు కనుక, సరైన నిర్ణయానికొస్తాడు. తన్ను చూస్తేనే కదా సీత భయపడేది అనుకుంటాడు. కనిపించకుండా, కొమ్మల్లో దాక్కుని, సీత భయపడకుండా, రామచంద్రమూర్తిని, ధర్మంతోకూడిన, శుభాన్నిచ్చే, తియ్యటి మాటల్తో పొగిడి, ఆమె

నమ్మేటట్లు చేస్తే మంచిదని భావిస్తాడు. తనమాటలను ఆమె ఎంతవరకు నమ్ముతుందో చూసిన తర్వాతనే, ముందు-ముందు ఏమిచేయాల్నో నిర్ణయించుకోవచ్చు అనుకుంటాడు. హనుమంతుడు, ఆమెను చూస్తూ, ఆమె మాత్రమే వినేటట్లు, చెట్టుచాటునుండి, తియ్యగా మాట్లాడసాగాడు.

దశరథుడి పేరు స్మరించేవారెవ్వరూ లంకలో వుండరు కాబట్టీ, ఆ ప్రస్తావన వచ్చినా కీర్తించే వారెవరూ లేరుకాబట్టీ, దశరథుడితో మొదలెట్టి ఆయన ఉదారకీర్తిని గురించిన మాటలు సీతచెవిలో పడేటట్లు చేసి, ఆమెమనస్సును ఆకర్షిస్తాడు హనుమంతుడు. ఈవిధంగా సీతాదేవి మనస్సును తనవైపు లాక్కొని, ఆతర్వాత ఇంకేమి చెప్తాడో విందామన్న ఆసక్తి ఆమెలో కలిగిస్తాడు హనుమంతుడు. పరేంగిత జ్ఞానిగా హనుమంతుడు సాక్షాత్కరిస్తాడు. ఎవరో తనమామగారిని పొగడ్తున్న మాటలు విన్న సీతాదేవి ఇంకేమి వినపడ్తుందో అని ఆలకించింది ఆసక్తిగా.

"దశరథ మహారాజు పెద్దకొడుకే శ్రీరామచంద్రుడు. (ఎవరో తన మగడిపేరు చెప్తుతున్నారే అని, ఇంకా ఏంచెప్తారో విందామని, మరింత ఆసక్తిగా మనస్సు పెట్టి వినసాగింది సీత). శ్రీరాముడు తండ్రి ఆజ్ఞప్రకారం, తమ్ముడు, భార్య తోడురాగా అడవులకెళ్లాడు. రావణుడు, మాయలేడి నెపంతో, మోసంచేసి, శ్రీరాముడి భార్యను అపహరించాడు. ఆమెను వెతుకుతూ వచ్చిన రామలక్ష్మణులు వానర రాజైన సుగ్రీవుడితో స్నేహం చేసారు. వాలిని చంపి, రాజ్యాన్ని ఆయనకప్పగించాడు రాముడు. సీతాదేవిని వెతికేటందుకు, సుగ్రీవుడు పంపిన, పరాక్రమమవంతులు, కామరూపులైన వానరులనేకమందిలో ఒకడినైన నేను, జటాయువు సోదరుడు సంపాతి సలహామేరకు, ఆయన మాటలు నమ్మి, నూరామడల పొడవున్న సముద్రాన్ని దాటి లంకకొచ్చాను. సీతాదేవిని ఇక్కడ వెతుకుతున్న నాకు, నా పూర్వ పుణ్యఫలంవల్ల, శ్రీరాముడు చెప్పిన ఆకారం, వర్ణన, కాంతి, గుణం, సౌందర్యం వున్న పతివ్రత కనిపించింది".

ఇలా హనుమంతుడు అంటున్న మాటలను విన్న సీతాదేవి, ఆశ్చర్యపడి, కుటిలాలకాలను సవరించుకుంటూ తలపైకెత్తి, ఎవరీ మాటలు చెప్తుతున్నారా అని చెట్టువైపు చూసింది. ఇదేమన్నా రావణుడి మాయేమో అనుకుని, భయం, భయంగా, రాముడిని స్మరించుకుంటూ, చెట్టు కింద, మీద, ప్రక్కన, సందుల్లో చూడసాగింది సీత. ఆత్మహత్యకు సిద్ధపడిన సీతమ్మకు హనుమంతుడు చేసిన రామగుణగానం జీవివితంపైన ఆశలు చిగురింప చేసింది. సీతమ్మకు ఊపిరిలూదింది.

రామనామస్మరణ వింటున్న సీతాదేవికి, చెట్టుకొమ్మల్లో కనిపించిన కోతిని చూడగానే వళ్లుజలదరించింది. తనకేం కీడు జరగబోతున్నదో అని భయపడింది. రామలక్ష్మణులను స్మరించి మెల్లగా ఏడ్చింది సీత. అయితే తాను చూసింది హనుమంతుడనే విషయం ఆమెకు తెలియదు. తాను చూసింది వాస్తవంగా కోతేనని నిశ్చయించుకుంటుంది. రెండు చేతులు జోడించి, బ్రహ్మకు, అగ్నికి, బృహస్పతికి, నమస్కరించుతుంది. కోతిచెప్పిన మాటలన్నీ నిజం కావాలని, భిన్నంగా జరుగవద్దని కోరుకుంటుంది. సీతాదేవి మనస్సుకు తాను నిజమైన కోతేనన్న నమ్మకం కుదిరిందనీ, పూర్తిగా నమ్మకం ఇంకా కుదరలేదని భావిస్తాడు హనుమంతుడు.

తనమీద సీతకు కొంత విశ్వాసం కలిగిందన్న నమ్మకంతో, హనుమంతుడు పైకొమ్మనుండి కింది

కొమ్మకు దిగి, వినయంతో, ఇలా అంటాడు సీతతో: ''అమ్మా నన్నునుగ్రహించి నువ్వెవరివో, ఎందుకిట్లా మాసిన పట్టువస్త్రం కట్టుకుని, కొమ్మను పట్టుకుని, నిలబడి వున్నావో చెప్పు తల్లీ? అమ్మా! ఎక్కడనుండి నీవిక్కడకు వచ్చావు? ఎందుకు దుఃఖిస్తున్నావు? నీవు క్షత్రియస్త్రీవని కూడా నీ శుభచిహ్నాలు చూసి భావిస్తున్నాను. రావణాసురుడు బలాత్కారంగా ఎత్తుకొచ్చిన సీతవు కావుకదా! నిజం చెప్పు. నీవు రామచంద్రమూర్తి భార్యవన్న సందేహం కలుగుతున్నది. నా అభిప్రాయం నిజమేకద! చెప్పాలి'' అని అడుగుతాడు హనుమంతుడు సీతాదేవిని. త్రిజట మాటలకు భయపడ్డ రాక్షస స్త్రీలు సీతను వదిలి ఎక్కడి వారక్కడే దూరంగా పోయారు కొంతసేపు. అందువల్లనే సీతతో మాట్లాడటానికి కొంత సమయం దొరికింది హనుమంతుడికి.

హనుమంతుడు తన భర్తను కీర్తించినందుకు, సంతోషించిన సీత, ఆయనతో తన గురించి చెప్పసాగింది ఇలా:

"దశరథుడి కోడలను నేను. జనకరాజు కూతుర్ని. రామచంద్రుడి భార్యను. నాపేరు సీత. భోగ–భాగ్యాలన్నీ అనుభవిస్తూ పన్నెండు సంవత్సరాలు శ్రీరాముడింట్లో వున్నాను. పదమూడో ఏట దశరథుడు నా భర్తను రాజును చేయాలనుకున్నాడు. దశరథుడి ముద్దుల భార్య కైకేయి. రామచంద్రమూర్తిని అడవులకు పంపాలని కోరుతుంది. దశరథుడు భార్యకేమీ సమాధానం చెప్పలేక, అయిష్టంగానే తన పెద్దకొడుకును రాజ్యం వదిలి పొమ్మంటాడు. తండ్రిపైనున్న భక్తి, గౌరవాల వల్ల, శ్రీరాముడు, ఆయనతో కలసి మేమిద్దరం వనవాస దీక్ష తీసుకుని, భయంకరమైన అడవిలో ప్రవేశించాం. రాముడి భార్యనైన నన్ను, వంచనతో, రావణాసురుడు దొంగతనంగా ఎత్తుకొచ్చాడు. అందుకే ఇక్కడ దిక్కులేక ఏడుస్తున్నాను. పన్నెండు నెలలు గడువిచ్చాడు వాడిమాట వింటానికి. అందులో ఇంకా రెండునెలలే మిగిలి ఉన్నాయి. ఆ గడువు ముగిస్తే చస్తాను. ఈ లోపల రామచంద్రమూర్తి రాకపోతాడా అన్న ఆశతో చావకుండా బ్రతికున్నాను''.

సీతాదేవి మాటలను విన్న ఆంజనేయుడు, ఆమెను ఊరడిస్తూ,''దేవీ! రామచంద్రమూర్తి నీకోమాట చెప్పమని పంపినందువల్ల, ఆయన దూతగా నేనిక్కడకు వచ్చాను. ఆయన క్షేమమని నీతో చెప్పమన్నాడు. నీ క్షేమసమాచారం తెలుసుకుని రమ్మన్నాడు. లక్ష్మణుడు, నీకు సాష్టాంగ నమస్కారమని చెప్పమన్నాడు. వారిరువురూ కుశలం'' అని చెప్పాడు. ఈమాటలను విన్న సీతాదేవి సంతోషపడి, తనువెల్ల పులకరిస్తుంటే శుభవార్త తెలిపిన హనుమంతుడిపై సీతాదేవికి ప్రేమకలుగుతుంది. ఒకర్నొకరు నమ్మి మాట్లాడుకోవడం ప్రారంభించారు. సీతాదేవి చెప్పిన మాటలను విన్న హనుమంతుడు, ఈమెకు తనమీద దృఢమైన నమ్మకం కుదిరిందన్న విశ్వాసంతో, ఆమెను బుజ్జగిస్తూ, ఆమె దుఃఖాన్ని అణచటానికి, కొద్ది–కొద్దిగా ఆమె దగ్గరకు పోసాగాడు. ఆయనలా దగ్గరకు వస్తుంటే, రావణాసురుడే ఈవేషంలో తనతో మాట్లాడడానికి వచ్చాడన్న భయం కలిగింది సీతాదేవికి. అప్పుడు హనుమంతుడితో ఇలా అంటుంది.

"నీవు నిజంగా రామదూతవే అయితే నాకు ప్రియమైన ఆయన గుణాలు వర్ణించు. అలాచేస్తే నాకు అమిత సంతోషం కలుగుతుంది. రావణుడైతే రామచంద్రుడిని కీర్తించడు కద!'' అన్నది. సీతాదేవి తనను సందేహిస్తున్నదనుకున్న హనుమంతుడు, అది పోగొట్టడానికి, తియ్యటి మాటల్తో, రామచంద్రమూర్తిని

కీర్తిస్తాడు. ఆయన గుణగణాలను వర్ణిస్తాడు వివరంగా.

''త్వరలో నువ్వు రాముడిని, లక్ష్మణుడిని, సుగ్రీవుడిని లంకలో చూస్తావు. నేను మాయలమారి రావణుడిని కాను. నీకు కనిపిస్తున్న రూపమే నా అసలు రూపం. నేనుకోతినే. పేరు హనుమంతుడు. సూర్యపుత్రుడు, వానరరాజు అయిన సుగ్రీవుడికి మంత్రిని. అధముడను కాను. ఇలాంటి నేను నీకొరకై, రామాజ్ఞ ప్రకారం సముద్రాన్ని దాటాను. లంకలో ప్రవేశించాను. రావణుడి నెత్తిమీద దొంగచాటుగా కాకుండా, పరాక్రమంతో కాలుపెట్టాను. ఇదంతా చేసి నిన్ను చూడటానికి వచ్చాను. నన్ను నమ్ము. నేను నువ్వనుకుంటున్నట్లు రావణుడను కాను. సందేహం మాని, పరులతో ఎలా సంభాషించ వచ్చన్న అనుమానం లేక, నీ దాసుడైన నాతో, నీబిడ్డతో మాట్లాడినట్లే మాట్లాడు'' అంటాడు హనుమంతుడు.

సందేహ నివృత్తి కొరకు హనుమంతుడిని ఈవిదంగా ప్రశ్నిస్తుంది సీత: ''శ్రీరామచంద్రమూర్తికీ, నీకూ స్నేహమెలా కలిగింది? లక్ష్మణుడెట్లు తెలుసు నీకు? నరులు, వానరులు, ఒకరిని చూస్తే ఇంకొకరు బెదురుతారు కదా! ఎట్లా మీరిరువురూ ఒకచోట చేరారు? అన్నదమ్ములిద్దరికి ఎలాంటి గుర్తులున్నాయి? రాముడికీ, లక్ష్మణుడికీ తొడలెలా వుంటాయి? చేతులెట్లా వుంటాయి? నీవు నిజమైన వానరుడవే అయితే, రామదూతవే అయితే, వాస్తవం చెప్పి నన్ను మెప్పించు''

శ్రీరామ-లక్ష్మణుల చిహ్నాలేంటని సీతాదేవి హనుమంతుడికి వేసిన ప్రశ్న ఒక విషమ ప్రశ్న. అందులో రెండు భాగాలున్నాయి. చేతుల విషయం ఎవరైనా చెప్పొచ్చు. అందరికీ కనిపిస్తాయి కాబట్టి. ''తొడలెలా వుంటాయని'' కూడా అడుగుతుంది. అంటే మర్మాంగాలను గురించి ఆరా తీస్తున్నదన్న మాట. దీంట్లో గురువును పరీక్షించే తీరు కనిపిస్తుంది. జవాబు చెప్పేటప్పుడు ఔచిత్యం కనబరుస్తాడా? లేదా అని పరీక్షించ దల్చింది. దీనర్థం: ''ఆచార్యుడు'', భగవత్ తత్వాన్ని ఆమూలాగ్రంగా, రహస్యాలతో సహా తెలిసిన వాడై వుండాలని.

జవాబుగా హనుమంతుడు: ''దేవీ! నా అదృష్టం కొద్దీ, నేను రావణుడను కానని నమ్మి, మౌనం చాలించి,నీభర్త గుర్తులు,లక్ష్మణుడి చిహ్నాలు,యోగ్యంగా,వాస్తవంగా చెప్పమని అడిగావు.చెపుతావిను'' అని అంటూ ఆమెకు నచ్చే విధంగా, మెచ్చే విధంగా అన్నీ సవివరంగా చెప్తాడు. ఆయన ఆత్మగుణాలనీ, దేహగుణాలను కూడా వర్ణించి చెప్పాడు. హనుమంతుడు మొదట శ్రీరాముడి ఆత్మగుణాలను వర్ణించి, తర్వాత దేహగుణాలను వర్ణిస్తాడు. "తేజస్సు, యశస్సు, శ్రీ" ల వల్ల వ్యాపించిన వాడంటాడు. బ్రహ్మచర్య నిష్ఠ కలవాడంటాడు. రాముడిని వర్ణించిన హనుమంతుడు, ఆయన్ను గురించి చాలా నిగూఢంగా చెప్తాడు. హనుమంతుడు జయశీలుడు. పరీక్ష నెగ్గాడు. సీతకు విశ్వాస పాత్రుడైనాడు.

సీత హనుమతో పోకపోవడానికి కారణం?

తాను శ్రీరాముడి దూతననే విషయాన్ని ధృవీకరించడానికి, సీతాదేవి కోరినట్లే శ్రీరాముడి గుణగణాలను వర్ణించాడు హనుమంతుడు. మొదట శ్రీరాముడి ఆత్మగుణాలను వర్ణించి, తర్వాత దేహగుణాలను వర్ణిస్తాడు. రాముడిని వర్ణించిన హనుమంతుడు, ఆయన్ను గురించి చాలా నిగూఢంగా చెప్పడంతో సీతకు విశ్వాస పాత్రుడైనాడు. ఇక అక్కడి నుంచి సీతాన్వేషణలో రామలక్ష్మణులు ఎక్కడెక్కడ తరిగి కిష్కింధకు చేరుకున్నదీ వివరించాడు.

"సీత కొరకై వెతుకుతున్న శ్రీరామలక్ష్మణులు మేముండే చోటుకు వచ్చారు. అన్న రాజ్యంలోంచి వెళ్లగొట్టబడి, ఋష్యమూకాద్రి మీద నివసిస్తున్న సుగ్రీవుడు, నార చీరెలు, చేతుల్లో బాణాలతో వస్తున్న వారిని చూశాడు. వారెవరో తెలుసుకొని రమ్మని నన్ను పంపాడు. నా కంటికి వారు మహాత్ముల్లాగా కనపడినందున, వినయంగా, చేతులు జోడించి, వారి దగ్గరకు పోయాను. నన్నాదరించి, గౌరవించిన వారిద్దరినీ తీసుకునివచ్చి, సుగ్రీవుడి ఎదుట నిలిపాను".

"కలిసిన రామ, సుగ్రీవులు ఒకరితో ఒకరు మాట్లాడుకుంటూ, ఒకరినొకరు నమ్మారు. ఒకరి దుఃఖం ఇంకొకరికి చెప్పుకొని సమాధానపర్చుకున్నారు. తన భార్యను అపహరించాలనుకున్న ఆయన అన్న వాలి, సుగ్రీవుడిని వెళ్లగొట్టాడు. ఆ అవమానాన్ని భరించలేని సుగ్రీవుడిని నీ మగడు సమాదానపర్చాడు. వాలి, సుగ్రీవుల కలహకారణం ఇదే. నీ ఎడబాటుతో దుఃఖిస్తున్న శ్రీరాముడి చరిత్రను లక్ష్మణుడు సుగ్రీవుడికి చెప్పాడు. గతంలో రావణాసురుడు ఆకాశమార్గాన నిన్ను ఎత్తుకొని వెళ్తున్నప్పుడు, నువ్వు, భూమి మీద పడేసిన ఆభరణాలను సుగ్రీవుడు రామచంద్రమూర్తికి చూపాడు. నీ జాడ మాత్రం చెప్పలేకపోయాం. నీ ఎడబాటుతో, నీమగడు, ఎల్లప్పుడు లోలోన కుములుతుంటే, అగ్నిని కలిగిన అగ్నిపర్వతంలాగా కనిపించాడు".

"రావణుడిని, వాడి కొడుకులను, స్నేహితులను, యుద్ధంలో చంపి, నీ భర్త, నిన్ను త్వరలోనే తీసుకెళ్తాడు. వాలిని చంపుతానని రాముడు, నిన్ను వెతికించి నీవార్త తెప్పిస్తానని సుగ్రీవుడు ప్రమాణం

చేసారు. సుగ్రీవుడితో కిష్కిందకు పోయి, వాలిని చంపి, సుగ్రీవుడిని రాజుగా చేసాడు రాముడు. ఇలావారిద్దరికీ స్నేహం కుదిరింది. నేను వారి దూతను, నిన్ను వెతుక్కుంటూ సముద్రాన్ని దాటి ఇక్కడకు వచ్చాను. నా పేరు హనుమంతుడు. సుగ్రీవుడు రాజై, తాను చేసిన ప్రమాణాన్ని నెరవేర్చడానికి, నిన్ను వెతికేందుకు వానరులను పది దిక్కులకు పంపాడు. నిన్ను మేము వెతుకుతూ కనపడక బాధపడ్తుంటే, జటాయువు సోదరుడు సంపాతి కనబడి నీ జాడ చెప్పి, నువ్వు లంకలో వున్నావని అన్నాడు. ఆయన మాట ప్రకారం, నూరామడల సముద్రాన్ని దాటి, రావణుడి నగరం లంక ప్రవేశించి, రాత్రి సమయంలో రావణుడినీ, నిన్నూ చూశాను. వాస్తవం చెప్పాను. భయం లేకుండా, ధైర్యంగా నాతో మాట్లాడు. నన్ను నమ్ము. నాలో మాయలేదు. రామకార్యం చేసేందుకు నీ కొరకై వచ్చాను. వానర రాజు మంత్రిని, వాయుదేవుడి కొడుకును, సూర్యవంశం రాజు రామచంద్రమూర్తి దూతను''.

ఇంతవరకు తాను రామచంద్రమూర్తి దూతగా వచ్చానని చెప్పిన హనుమంతుడు, తన జన్మ వృత్తాంతాన్ని కూడా సీతాదేవితో చెప్పాడు. "మాల్యవంతమనే పెద్ద పర్వతముంది. అక్కడ నాతండ్రి కేసరి అనే వానర రాజున్నాడు. దేవ ఋషుల ఆజ్ఞానుసారం, గోకర్ణమనే పర్వతానికి పోయి, శంభసాధనుడనే దైత్యుడిని చంపాడొకసారి. ఇట్లా మాతండ్రి కాలం నుండే, రాక్షసులకు, మాకూ విరోధముంది. ఆయన భార్యకు, వాయుదేవుడికీ, నేను జన్మించాను. నా స్వశక్తితో, స్వకార్యంతో, హనుమంతుడన్న పేరు తెచ్చుకున్నాను. నీ నమ్మకం కొరకు నీ భర్త గుణ-గణాలన్నీ చెప్పాను''.

సీతమ్మ హనుమంతుడిని తన జన్మ వృత్తాంతం చెప్పమని అడగలేదు. రాముడి రూప విశేషాలను మాత్రమే అడిగింది. దానితోపాటు తన జన్మ వృత్తాంతాన్ని హనుమంతుడు చెప్పాడు. అడగనిదే చెప్పడం దేనికి? అని అనిపించవచ్చు. కానీ హనుమంతుడు ఆంజనేయుడు కదా! అంటే ప్రశస్త వాక్కు కలవాడని అర్థం. వ్యర్థంగా ఏదీ మాట్లాడడు. అసలు కారణమేమిటంటే, తాను రామదూతను అనీ, సామాన్యమైన సగటు వాడిని కాదనీ, సమర్థుడననీ సీతమ్మను నమ్మించ చేయడం. నమ్మదగిన వాడినీ, విశ్వాసపాత్రుడినీ అని సీతమ్మకు రూఢి చేయాలని భావించడం! తనను ఈ మహాకష్టం నుండి తప్పించగలవాడని, రాముడిని రప్పించి తనను ఆయనతో కూర్చగల సమర్థుడనీ విశ్వాసాన్ని పాదుకొల్పటానికే తన వైనం చెప్పాడు. ఇన్ని విధాలుగా చెప్పిన తర్వాత హనుమంతుడు, శ్రీరామచంద్రమూర్తి దూతన్న విషయం నమ్మింది సీతాదేవి.

జనకరాజు కూతురు సీతాదేవికి శ్రీరాముడి పేరు చెక్కిన ఉంగరాన్ని చూపిస్తాడు. దానిని దూతైన తనకు ఇచ్చిన రామచంద్రుడు, సీతకు ఇమ్మని చెప్పాడనీ, అది చూసిన ఆమెకు తనమీద నమ్మకం కుదురుతుందన్నాడనీ, అంటాడు హనుమంతుడు. ఆ ఉంగరాన్ని చూసిన సీతకు మనోవ్యాకులత కూడా తీరుతుందని రాముడు చెప్పినట్లు తెలియచేస్తాడు. హనుమంతుడిచ్చిన ఉంగరాన్ని సంతోషంగా తీసుకుంటుంది సీత. ఇదొక అద్భుతమైన ఉంగరం. ఇందులో మూడు మణులుంటాయి. అందులో ఒక మణిలో రాజైనవానికి పితృ-పితామహంగా వచ్చే సూర్యవంశపు శక్తిని ఆవహింప చేస్తారట. ఇది శ్రీరాముడి రాజ్యాధికార ముద్ర. దానిపై శ్రీరాముడి పేరు కూడా చెక్కబడి ఉందని పెద్దలంటారు. అలాంటి రాజ ముద్రను ఇవ్వడమంటే రాజ్యాన్నే ఇచ్చి వేయడమని అర్థంకద! సీతమ్మ కంటే రాజ్యం గొప్పది

కాబోదు అని రాముడి భావన అనేది స్పష్టమవుతున్నది.

తనభర్త శ్రీహస్తాన్ని అలరించే ఆ ఉంగరాన్ని చూసిన సీతకు తన మగడే ఎదురుగా వచ్చినంత సంతోషం కలిగింది. ఆ ఉంగరాన్ని తాకుతూ అనుకుంటుంది సీత: ''పాణిగ్రహ సమయంలో మొదటిసారి తన చేతిని రామచంద్రమూర్తి పట్టుకున్నప్పుడు, తనను తగిలిన ప్రథమాభరణం ఇదేకదా! తనకు ప్రణయకోపం వస్తే, శాంతింప చేయటానికి, భర్త తన గడ్డం పట్టుకుని బ్రతిమిలాడుతుంటే, తాకేదీ ఉంగరమేకదా! తనను కౌగలించుకున్నప్పుడు, వంటిమీదున్న ఆభరణాలన్నీ తీసేసినా, తీయందీ ఉంగరం కదా! ప్రణయకోపంలో ఇరువురికీ మాటలు లేనప్పుడు, మాట్లాడే నెపంతో, నేలమీద ఉంగరం పడేస్తే, తీసుకొమ్మని మాట్లాడే అవకాశం ఇచ్చింది ఈ ఉంగరమేకదా! అరణ్యాలకు పోతున్నప్పుడు, సర్వాభరణాలూ తీసేసినా, తనతో పాటు వెంట తెచ్చుకున్నదీ ఈ ఉంగరమేకదా!'' ఇలా అనేక విధాలుగా ఆలోచిస్తున్న సీతకు, సాక్షాత్తూ శ్రీరామచంద్రుడే ఎదురుగా వచ్చి నిల్చున్నట్లు, భావనాతిశయ బలం వల్ల ఆయన ఆకారం స్పష్టంగా కనిపించిందామెకు.

లజ్జవతైన సీత, తన పతి క్షేమం, పతివార్త తెలిపిన ఆంజనేయుడిని, అభినందన పురస్సరంగా స్తోత్రం చేసింది. హనుమంతుడిని ప్రశంసించి శ్రీరామాదుల కుశలం అడిగింది. రామచంద్రమూర్తి తనను తప్ప మరేదీ తల్చుకోవడం లేదని ఆంజనేయుడు చెప్పడంతో, సీతకు అమృతం తాగినంత సంతోషం కలిగింది. అయితే ఆయన అమితంగా దుఃఖ పడుతున్నాడని కూడా చెప్పినందువల్ల విషం తాగినట్లనిపించింది. ''విషం కలిపిన అమృతాన్నిచ్చినట్లున్నాయి నీమాటలు'' అంటుంది సీతాదేవి హనుమంతుడితో.

“ఓ మారుతీ! రామచంద్రమూర్తి సూర్య వంశానికే అలంకార ప్రాయమైన వాడే! ఆయన ఈ వ్యథా సముద్రంలో మునగకుండా, తీరానికి ఎప్పుడు చేరుతాడయ్యా? గాలివానకు గిర–గిరా తిరిగే నావలాగా నలిగిపోయాడా? నన్నెప్పుడు తీసుకునిపోతాడో? ఎప్పుడు రావణుడిని చంపుతాడో? ఎప్పుడొస్తాడయ్యా రామచంద్రుడు? ఎప్పుడు చీలుస్తాడయ్యా రాక్షసమూకను? వాళ్లనెప్పుడు తన బాణాలతో ఖండిస్తాడు? పునాదులతో సహా ఎప్పుడీలంకాపురి పాడైపోతుంది? ఎప్పుడు నన్నాయన చూస్తాడు?''

“ఆంజనేయా! రావణుడు నాకొక్క సంవత్సరం గడువిచ్చాడు. అది ముగిసేవరకే నేను బ్రతికుంటాను. ఆ సంవత్సరంలో పదోనెల జరుగుతున్నదిప్పుడు. ఇంకా రెండునెలలే గడువున్నది. అవికాగానే నా చావు సిద్ధం. కాబట్టి రామచంద్రమూర్తిని ఈ లోపలే వచ్చేటట్లు తొందరపెట్టు. ఆ తర్వాత వచ్చినా ఫలితం వుండదు''. ఇలా కళ్లనిండా నీళ్లు వుంచుకుని మాట్లాడుతున్న సీతాదేవిని చూసి హనుమంతుడు శోకించవద్దని ప్రార్థిస్తూ, ఇలా అన్నాడు.

“నామాటలు విన్న శ్రీరాముడు సేనతో, వెంటనే ఇక్కడకు వస్తాడు. అంతవరకు దుఃఖమెట్లా ఆపుకోవాలంటే, దానికో మార్గముంది. నా వీపుపైనెక్కు, రామచంద్రమూర్తి వున్న చోటుకి నిన్ను తీసుకుని పోతాను. నేను దూతను. నీశీలానికి ఏ హానీలేదు. నిన్ను శ్రీరాముడి దగ్గరకు ఇప్పుడే చేరుస్తాను. నీమగడు, తమ్ముడితో కూడి రావణాదులను చంపే ప్రయత్నాన్ని నీకళ్లతో నువ్వే చూడగలవు. నావీపుపైకెక్కు. నామాట నమ్ము. ఆకాశంలో సూర్యచంద్రులతో ముచ్చటిస్తూ, సముద్రాన్ని, ఆకాశాన్ని అవలీలగా

నావీపుమీద కూర్చొని దాటు. రాముడివద్దకు పోయేంతవరకూ నిన్ను దించను'' అన్న ఆంజనేయుడి మాటలకు, భక్తికి, సంతోషించిన సీత, ఆయన మాటలకు ఆశ్చర్యపోయి ఇలా జవాబిస్తుంది.

''ఆంజనేయా! నేను సొమ్ములను మూటవేసిన స్థలం నాకు గుర్తుంది. అక్కడికి, ఇక్కడికి చాలా దూరం. ఇంతదూరం నన్ను ఎట్లా మోసుకుని పోతావు? నీమాటలు వినడానికే వింతగా వున్నాయి. ఇంతవరకు నీవు నిజంగా కోతివో, కాదో అన్న అనుమానం, సందేహం వుండేవి. ఇప్పుడు నీబుద్ధిని పట్టి చూస్తే నీవు నిజంగా కోతివేనని, నిశ్చయించుకుంటున్నాను. ఈడ్చి కొలిస్తే నువ్వు జానెడు కూడా లేవు. నీవు నన్నెట్లా మోసుకుపోతావు'' అన్న సీతాదేవిమాటలకు హనుమంతుడు విచారపడ్డాడు. మేరుపర్వతంతో సమానమైన ఆకారంతో, ఎర్రటి ముఖంతో, వజ్రాయుధం లాంటి గోళ్లతో, కోరలతో, సీతాదేవి ముందరర నిలబడి: ''దేవీ! ఈ లంకను, కొండలతో, వనాలతో, బురుజులతో, ప్రాకారాలతో, తోరణాలతో, రావణాసురుడితో సహా పెల్లగించి, అత్యంత వేగంగా తీసుకునిపోయే శక్తి నాకుంది. నేను చిన్నవాడినన్న అభిప్రాయం మానుకో. ఆలస్యం చేయకుండా రాముడి దగ్గరకు పోదాం రా!'' అంటాడు హనుమంతుడు సీతతో. అని అంటూ తన ఆకారాన్ని పెంచి చూపాడు.

హనుమంతుడలా చెప్పగానే, ఆశ్చర్యం, భయం కలిగించే అతడి ఆకారాన్ని చూసి: ''కపీశ్వరా! నీ బలగర్వం, వాయువేగం, కార్చిచ్చులాంటి నీశరీరం, ఎలాంటిదో తెలుసుకున్నాను. నీవు సామాన్య కోతివికావు. ఇంత గొప్పవాడివి కాకపోతే నువ్వెట్లా సముద్రాన్ని దాటి, రహస్యంగా లంక ప్రవేశించి, నన్ను వెతకగలిగే సమర్థుడవవుతావు? ఇంతపని మామూలు వాళ్లకు సాధ్యమవుతుందా? నన్ను రామచంద్రమూర్తి దగ్గరకు తీసుకుపోగలవని నమ్ముతున్నాను. నీపై నాకెంత విశ్వాసమున్నా నీవెంట రాకూడదు. నీ వెంట రాకపోటానికి, మరో ముఖ్య కారణముంది. నా భర్తపై నాకున్న భక్తివల్ల, మగవాడిని, రాముడిని, తప్ప మరెవ్వరినీ తాకను. అలా చేయటానికి నామనస్సు ఒప్పుకోదు. ఈ వాస్తవాన్ని ముందే చెప్పితే, నీవేమనుకుంటావోనని, చివరకు చెప్తున్నాను''.

''రామచంద్రమూర్తి వచ్చేవరకు ఆగలేను. రాలేను. రాముడు, రావణుడిని, యుద్ధంలో, ఈలంకలోనే చంపి నన్ను తీసుకోపోవాలి. అదే ఆయన యోగ్యతకు తగిన పని. ఆయన నన్ను రక్షించలేడన్న సందేహం వుంటేకదా, నేను నీవెంట రావాల్సింది. శ్రీరాముడి యోగ్యతకు తగనిదీ, ఆయనకు కష్టసాధ్యమైనదీ, సందిగ్ధమైంది, నేనుకోరడం లేదు. ఎలాంటి విరోధులనైనా చంపేశక్తి, దండించే పరాక్రమం, ఆయనకున్నదని చెప్తే విన్నాను. కళ్లారా చూసాను. ఆయన శక్తి నాకు తెల్సు. ఆ సమర్థుడి ఎదుట యుద్ధభూమిలో నిల్చే శక్తి ఇంద్రాది దేవతలకు కానీ, పన్నగులకు కానీ, దేవదానవ రాక్షస సమూహాలకు కానీ లేదు. నీవు త్వరగా లక్ష్మణ, సుగ్రీవులతో కూడిన రామచంద్రమూర్తినే లంకకు తీసుకొచ్చి, రావణుడిని చంపి, నన్ను తీసుకుని పొమ్మని ఆయనతో చెప్పు. ఆయనకొరకు తీవ్ర దుఃఖంతో వున్న నన్ను కృతార్థురాలిని చేయి. నీకు పుణ్యముంటుంది'' అని చెప్తుంది.

హనుమకు చూడామణి ఎందుకిచ్చింది సీత?

హనుమంతుడి సూచన మేరకు ఆయన వెంట రాముడి దగ్గరకు పోనని సీత అనటానికి కారణాలను వివిధ కోణాల నుంచి విశ్లేషించాడు హనుమంతుడు. హనుమంతుడు వాక్య విశారదుడు. తర్క పండితుడు. అందువల్ల, రామానుగ్రహం కొరకు, తాను చెప్పిన ఉపాయం మంచిదా, లేక, సీత చెప్పిన ఉపాయం మేలా, అని తర్క-యుక్తులతో, ఆలోచిస్తాడు. ఆమె చెప్పిందే బాగుందనుకుని, సీతాదేవితో ఇలా చెప్తాడు:

"దేవీ! ఇక్కడి సంగతులన్నీ, అంటే, నీవు నా ఎదుట రావణుడికి, రాక్షసస్త్రీలకు, నాకు చెప్పిన మాటలను, రామచంద్రమూర్తికి విన్నవించుకుంటాను. నీ ఏడ్పులు, వురిపోసుకునేందుకు నువ్వు చేసిన ప్రయత్నం కూడా చెప్తాను. నీ కష్టాలను చూసి, రాముడిపైనున్న భక్తితో నా వెంట రమ్మన్నానేకాని, వేరే కారణం లేదు. నన్ను తప్పుగా ఎంచక క్షమించు. నాతో నీవు రావడానికి అంగీకరించలేదు కనుక, నేనిక్కడకొచ్చినట్లు, నిన్ను చూసినట్లు, రామచంద్రమూర్తి నమ్మదగ్గ గుర్తేదన్నా ఇవ్వు. లేకపోతే నామాటలు ఆయన నమ్మడేమో! ఉత్తమాటలు నీవు నమ్మవని ఆయన ఉంగరం ఆనవాలుగా తెచ్చాను. అలాగే నీవుకూడా ఆయన్ను నమ్మించే గుర్తు ఏదన్నా ఇవ్వు తల్లీ!" అంటాడు హనుమంతుడు.

ఆంజనేయుడి మాటలు విన్న సీతాదేవి కళ్లనుండి నీరు కారుతుంటే, మెల్లగా హనుమంతుడితో, శ్రీరాముడికి మంచి గుర్తు చెప్తా వినమంటుంది. ఆ విషయాన్ని చెప్తున్నన్నంత సేపూ, ఎక్కువగా, సీత ప్రత్యక్షంగా ఆయనకు చెప్తున్నట్లే, ఆయన్నే సంభోదిస్తుంది. ఒక్కోసారి ఆయన్ను పరోక్షంలో వుంచుకున్నట్లుగా హనుమంతుడిని సంభోదిస్తుంది. మొదట రాముడిని వుద్దేశించి కథచెప్తుందీ విధంగా:

"పూర్వం చిత్రకూటంలోని, మందాకినీ తీరం దగ్గర నివసిస్తున్నప్పుడు, ఓనాడో కాకి, నన్ను మాంసమనుకుని, తనముక్కుతో పొడవగా, ఓ మట్టిపెళ్లను ఆ తుంటరి కాకిమీద విసిరాను. ఆ తరువాత నాతొడపైన తలవుంచి నీవు పడుకున్నావు. రామచంద్రమూర్తీ! నీవు నిదురించగానే, ముందు బాధపెట్టిన కాకే, నాదగ్గరకొచ్చి, నా స్తనాలను గీరి, ముక్కుతో నాకు బాధకలిగేటట్లు పొడిచింది. ఆ గాయం నుండి

రక్తంకారి, ఆబొట్లు నిదురిస్తున్న నీపైన పడ్డాయి. ఆ పాపపు పక్షిపెట్టే బాధ సహించలేక, సుఖంగా నిద్రిస్తున్న నిన్ను లేపాను. నీవు లేచి, నా గాయాన్ని చూసి, కోపంతో, నాకెదురుగా వున్న కాకిని నెత్తురుతో తడిసిన గోళ్లతో చూసావు. నీవు చూడగానే, కాకిరూపంలో వున్న ఇంద్రుడి కొడుకు, గాలిలాగా కొండ దిగి పరుగెత్తసాగాడు''.

శ్రీరాముడిని పరోక్షంగా వుంచుకుని, హనుమంతుడిని సంభోధిస్తూ: ''పరుగెడ్తున్న కాకిని చూసి, కోపంతో, దయను వదిలేసి, దర్భాసనంలోని దర్భను తీసి, దాన్నే బ్రహ్మాస్త్రంగా కాకిమీద వేసాడు రాముడు. ఆ దర్భపోచ ఆకాశంలో పోతున్న కాకిని వెంటాడింది. ఆ కాకి ముల్లోకాలు తిరిగి, ఎంతోమంది శరణు కోరింది. ఇంద్రుడు, బ్రహ్మాది దేవతలు, గొప్ప మహర్షులు, అందరూ దానిని కాపాడలేమని చెప్పారు. వేరేగతిలేక మళ్లీ తిరిగొచ్చి రాముడినే శరణుకోరింది. శరణు–శరణని భూమిపై సాగిలబడిన కాకిని చూసి, అది చంపబడాల్సిందే అయినా, దయతల్చి వదిలేసావు. ఆ కాకి నీ శరణుజొస్తే, దాన్ని చూసి నీవు, బ్రహ్మాస్త్రం వ్యర్థం కాదు, ఏమిస్తావని అడిగావు. అది తన కుడి కంటిని తీసుకొమ్మంది. ఆ భయంకర బాణం దాని కుడికన్ను హరించి వేసింది. కాకేమో చావుతప్పి కన్నులొట్టబోగా, రాముడినీ, దశరథుడినీ తలచుకుంటూ, నమస్కరిస్తూ పోయింది''.

మళ్లీ రాముడిని ఉద్దేశించి మాట్లాడుతూ, "నరేంద్రా! నాకు చిన్న బాధకలిగితేనే, ఆ బాధ కలిగించిన కాకిపైన బ్రహ్మాస్త్రం ప్రయోగించావే! నిన్ను తిరస్కరించి, ఇంతకాలం, ఇంతబాధపెట్టున్న ఈ క్రూరుడిని ఎందుకు ఉపేక్షిస్తున్నావు? నిన్ను నాథుడిగాగల నేను అనాథలాగా పడి వున్నానే! ఇలా చేయడం నీకు ధర్మమేనా?" అని భావగర్భితమైన వాక్యాలు రాముడిని గురించి అన్న సీత, హనుమంతుడితో, రాముడి ఉపదేశ పాండిత్యం ఆచరించడంలో లేదా? అని అడగమంటుంది.

ఇలా శోకంతో కూడిన మాటలను, కళ్లల్లో నీరు కారుతుంటే, కలవరపడుతూ, అడుగుతున్న సీతాదేవిని చూసి, ఓదార్పు మాటలతో హనుమంతుడు, సీత కష్ట కాలం పోయిందనీ, దుఃఖం అంతరిస్తుందనీ, లంకనెప్పుడు భస్మం చేయాల్నా అని రామలక్ష్మణులిద్దరూ ఎదురు చూస్తున్నారనీ అంటాడు. సీతకు ద్రోహం చేసిన రావణుడిని బంధువులతో సహా చంపి శీఘ్రంగా అయోధ్యకు రామచంద్రుడు తీసుకుపోయే సమయం వచ్చింది అంటాడు.

''అమ్మా, నేను పోయి సీతాదేవిని చూశాననగానే, శ్రీరాముడు, లక్ష్మణుడు సుగ్రీవుడు, వానరులైన నా స్నేహితులు, మాకేం చెప్పిందంటే, మాకేం చెప్పిందని అడుగుతారు. నీమాటలుగా, వారందరికీ ఏం చెప్పాలో చెప్ప'' మని ఆంజనేయుడు అడుగుతాడు సీతను. దుఃఖంతో కన్నీరుకారుస్తూ, సీతాదేవి సమాధానమిస్తుంది హనుమంతుడికిట్లా:

''కుశలమడిగానని చెప్పు. నాకు బదులుగా ఇదిసీత నమస్కారమని రాముడికి మ్రొక్కు. మీ క్షేమ సమాచరం అడిగానని చెప్పు. నేను రక్షించమని అడిగానని మాత్రం చెప్పవద్దు. నీవు మిత్ర శ్రేష్టుడవు. ఇదే నీవు నాకు చేయవలసిన ఉపకారం. వానరేంద్రా! నా దుఃఖం సమసిపోవాలి. ఇదే నాకు కావాల్సింది. దానికొరకు నామగడు, ఎలాంటి ప్రయత్నం చేస్తే నన్ను రక్షించగలడో, అదంతా ఆయనతో చేయించాల్సిన వాడివి నీవే! ఆ భారం నీమీదే వుంది. ఒక్కమాటమాత్రం ఆయనకు మళ్లీ–మళ్లీ చెప్పు.

ఎంత కష్టమైనా సహించి ఇంకొక్కనెల ప్రాణాలు బిగపట్టుకుంటాను. ఆపైన నేను నిల్పుకోవాలన్నా ప్రాణం నిల్వదు రామచంద్రా! అన్నానని చెప్పు. నన్నుద్ధరించమను. తన సొమ్మును తనే కాపాడుకోవాలని చెప్పు''.

తనమాటలుగా రామచంద్రమూర్తికి చెప్పమని ఎన్నో విషయాలు చెప్పిన సీతాదేవి, ఆ తర్వాత తన కొంగులో ముడివేసి దాచుకున్న ''చూడామణి'' ని తీసి, రామచంద్రమూర్తికిమ్మని హనుమంతుడికిస్తుంది. నిత్యమూ శ్రీరాముడికి పాదాభివందనం చేయడం సీతమ్మకు అలవాటు. అలా చేస్తున్నప్పుడు చూడామణిని (నాగరం లేదా కొప్పుబిళ్ల) రాముడు చూస్తుండడంవల్ల దానిని ఆయన తేలిగ్గా గుర్తుబడతాడు. అందువల్లనే చూడామణిని ఇచ్చింది సీతమ్మ. ఆమె ఇచ్చిన ఆ జడబిళ్లను హనుమంతుడు తనవేలికి పెట్టుకున్నాడు. ఆ జడబిళ్ల ఆయన వేలికి ఉంగరంలాగా సరిపోయింది. తర్వాత ఆమెకు ప్రదక్షిణ చేసి, నమస్కరించి నిలబడ్డాడు. అసమానమై, ఉత్తములు మాత్రమే ధరించదగి, సీతాదేవి తన మహాత్మ్యం వల్ల ధరించిన, చూడామణిని, హనుమంతుడు, తన బుద్ధిబలంతో పొంది, సంతోషించి, శ్రీరాముడి దగ్గరకు త్వరగా పోవాలన్న ఆలోచనలో పడ్డాడు.

చూడామణిని హనుమంతుడికిచ్చిన సీతాదేవి, ఈమణి రామచంద్రమూర్తికి బాగా తెలుసనీ, దీన్ని చూడగానే తనను, తన తల్లినీ, దశరథ మహారాజునూ, ఆయన స్మరించుకుంటాడనీ చెప్తుంది. వివాహ సమయంలో, దీనిని జనకమహారాజు తనతల్లి చేతికిచ్చాడనీ, ఆమె, దశరథుడు, రాముడు చూస్తుండగా, తనతలలో అలంకరించిందనీ అంటుంది. హనుమంతుడికి ఉత్సాహం కలిగేవిధంగా, చెప్పగలిగినంత చెప్పాననీ, ఇక ముందున్న కార్యం ఎట్లా చేస్తే బాగుంటుందో, అది ఆయన్నే ఆలోచించుకోమనికూడా చెప్తుంది.

ఆంజనేయుడి మనసంతా, ఎక్కడో వున్నదని గ్రహించిన సీత, తను చెప్పేది వినమనీ, శ్రీరామచంద్రమూర్తినీ, ఆయన తమ్ముడినీ, ఆయనకూ, తనకూ ముఖ్యులైన వారితో కూడిన సుగ్రీవుడినీ, వానరులందు పెద్దవారినీ, ధర్మ పద్ధతిలో యధాచితంగా క్షేమాన్ని విచారించానని చెప్పమంటుంది. మహాబలవంతుడైన శ్రీరాముడు, ఏవిధంగా, మోయలేని ఈ దుఃఖ సముద్రాన్నుంచి తన్ను దరిచేరుస్తాడో, ఆ విధానాన్ని తెలుసుకుని, ఆ పద్ధతిలోనే ఆయన్ను ఒప్పించి, కీర్తిమంతుడివి కమ్మని చెప్తుంది. తాను దేహాన్ని చాలించకముందే, తనమగడు తన్నెట్లా రక్షించగలడో ఆలోచించి, బుద్ధి, చమత్కారాలున్న హనుమంతుడు, ఆయనకు నచ్చచెప్పి పుణ్యం కట్టుకొమ్మని అడుగుతుంది.

సీతాదేవి చెప్పిన మాటలన్నీ, హితమైనవిగా, యుక్తియుక్తంగా, నిర్దోషమైనవిగా, ప్రయోజనంతో కూడినవిగా వున్న మంచిమాటలని భావించిన మారుతి చెప్పదలుచుకున్న మిగిలిన మాటలను ఆమెకు చెప్తాడు.

వానర, భల్లూకరాజైన సుగ్రీవుడు సీత నిమిత్తమై, గొప్ప సైన్యంతో రాముడికి సహాయపడేందుకు నిర్ణయించుకున్నాడనీ, ఆయనతో వచ్చేవారంతా అసమాన పరాక్రమవంతులనీ, దేవతలతో సమానులనీ, మనోవేగం కలవారనీ, దిక్కులలో, ఆకాశంలో సంచరించేవారనీ, వారంతా శీఘ్రంగా రాబోతున్నారనీ, ధైర్యం చెప్పాడు సీతకు హనుమంతుడు. "పరాక్రమవంతులు, సముద్రంతో,

పర్వతాలతో వ్యాపించివున్న భూమండలాన్ని ఆకాశమార్గాన చుట్టిరాగల సమర్థులు. వారికీ సముద్రం దాటడం చాలా చిన్నపని. వానరులలో సముద్రాన్ని దాటగల నాలాంటివారు చాలామంది వున్నారు. సుగ్రీవుడి దగ్గరున్నవారందరూ నాకంటే గొప్పవారో, సమానులో కాని తక్కువైన వాడొక్కడు కూడలేడు.

"రావణుడిని సేనలతో సహా చంపి రాముడు నిన్ను అయోధ్యకు తీసుకుపోతాడు. మేమెప్పుడొస్తామా అని మా రాకకొరకు ఎదురుచూస్తుండు. ఏ సాహసం చేయొద్దీలోపల. మండుతున్న అగ్నిహోత్రం లాగా రామచంద్రమూర్తిని ఇక్కడ చూస్తావు. రాక్షసుడికేగతి పడ్తుందో చూడు. కొడుకులతో, చుట్టాలతో, మంత్రులతో చచ్చిపోయి రావణుడు నేలకూలగా చూసిన నీవు దుఃఖ సముద్రపు ఒడ్డుకు చేరుకుంటావు. నీ మగడిని కలుస్తావు''.

ఇట్లా పలురకాలుగా సమాధానపరిచి ప్రయాణానికి సిద్ధపడిన హనుమంతుడు, సీతకు మరింత ధైర్యం కలిగేటట్లు మరికొన్ని మాటలు చెప్పాడు.

వాడిపోతున్న మడిలోని పైరుపై వానచినుకులు పడడంతో, పచ్చబడ్డట్లు, హనుమంతుడి ప్రియమైన మాటలు సీతకు మళ్లీ ప్రాణం పోసినట్లనిపించింది. బ్రతికాననుకుంటుంది. తన భర్తను ఎలా కలిసే వీలుందో అలానే చేయమని మళ్లీ కోరుతుంది హనుమంతుడిని. ఇంకా శ్రీరాముడిని ఉద్దేశించి ఇలా పలుకుతుంది:

"పరాక్రమంలో ఇంద్రుడూ, వరుణుడూ కలిసికట్టుగా వచ్చినా నీకు సమానం కారు. అంత పరాక్రమవంతుడవైన నీవు, నీ భార్యను, నీకు తెలియకుండా, దొంగతనంగా రాక్షసులెత్తుకునిపోయి, బాధపెట్టుతుంటే, శత్రువులాగా ఎలా వూరుకుంటున్నావు? ఇదేమన్న ప్రశస్తమైన కార్యమా? దశరథ రాజకుమారా! నీమనస్సును ఆకర్షించే శక్తి ఉన్నందునే, సముద్రజలాలలో కౌస్తుభంలాగా పుట్టిన చూడామణిని నేను దాచుకున్నాను. దీనిని చూడగానే నీవిరహాగ్నికూడా చల్లారాలి! ఇప్పుడు దీన్ని కూడా ఎడబాస్తున్నాను. ఇక ఈ దుఃఖసాగరంలో నేను ప్రాణాలు నిలబెట్టుకోవాల్సిన అవసరం లేదనుకుంటా. అలాగైతే ఎందుకు పంపించానంటావా? ఇదివరదాకా దీని దర్శనం నీ రూపాన్ని స్మృతికి తెస్తుండేది. ఇప్పుడదిపోయి నిన్ను పిల్చుకొస్తుందన్న నమ్మకంతో పంపాను. ఇది సముద్రంలో పుట్టిందికనుక, సముద్రంవల్ల బాధలేకుండా నన్ను రక్షిస్తూ వచ్చింది. ఇక నన్ను రక్షించేవారెవ్వరు?''

సీత మాటలు విన్న హనుమంతుడు, రామచంద్రమూర్తి తప్పక ఆమె కష్టాలు తొలగిస్తాడనీ, ఆయన నిజంగా దుఃఖిస్తున్నాడనీ, ఆయన స్థితి చూసి లక్ష్మణుడు కూడా శుష్కిస్తున్నాడనీ, తాను ఇవ్వన్నీ ప్రమాణం చేసి చెప్తున్నాననీ, తనమాటలు నమ్మమనీ అంటాడు.

రామచంద్రమూర్తి గుర్తించే మరో జ్ఞాపిక ఇవ్వమని మళ్లీ అడుగుతాడు. తానిచ్చిన చూడామణిని మించిన గుర్తేమీలేదని, దానిని చూడగానే హనుమంతుడు తన దగ్గరకు వచ్చినట్లు నమ్ముతాడనీ సీత చెప్పడంతో, తనింక వెళ్లడానికి అనుమతినివ్వమంటాడు హనుమంతుడు. ఇలా అంటూనే, తనకు తలవంచి నమస్కరించి నిల్చిన హనుమంతుడు దేహాన్ని పెంచడం, సముద్రాన్ని దాటే ఉత్సాహాన్ని కనపర్చడం కళ్లారా చూసి, వెళ్లిరమ్మనీ, శుభం కలుగుగాక అని అంటూ సెలవిస్తుంది.

◆❖◆

బ్రహ్మాస్త్రం హనుమను బంధించలేదా?

హనుమంతుడు అశోకవనంలో వున్న సీతను చూసి, ఆమెతో మాట్లాడి, ఆమెకు రాముడి గుర్తుగా అంగుళీయకం ఇచ్చి, ఈమె గుర్తుగా చూడామణిని తీసుకుని, ఆమెదగ్గర శలవు తీసైకుని వెళ్లిపోయాడు. తనకు శుభమగుగాక, విఘ్నాలు కలగకుండా వుండుగాక! అని సీతాదేవి అనడంతో, ఆమె దయకు పాత్రుడనైనాననుకుంటాడు హనుమంతుడు. ఇంకా చేయాల్సినపని కొంచెం మిగిలుంది అనిపించిందాయనకు. సీతను వెతకమనీ, లంకను చూడమనీ, సుగ్రీవుడు తనకు రెండు పనులప్పగించాడు. సీతను వెతకడం, చూడడం అయిపోయింది. లంకను చూడటమంటే, రాక్షసుల బలాబలాలు బేరీజు వేయడం, రావణుడి అభిప్రాయం తెలుసుకోవడం ఇంకా జరగలేదు. ఇదిచేయాలంటే, సామ–దాన–భేదాలు పనికిరావు. దండోపాయమొక్కటే సరైన మార్గమనుకుంటాడు.

రామలక్ష్మణులు సహాయం లేనివారు, ఏమీ చేయలేరని దురభిప్రాయంతో వున్న రాక్షసుల అపోహ తొలగించాలంటే, సుగ్రీవుడి సహాయముందని ప్రకటించి, యుద్ధం చేసి, కొందరినన్నా చంపాలని అనుకుంటాడు. ఇలా జరుగుతే తక్కినవారు ద్వేషం వదిలి మెత్తబడటమో, వారిలో వారికి విభేదాలు రావటమో జరుగుతుందనుకుంటాడు. తాను యుద్ధంచేసి కొందరిని చంపి వేస్తే రామచంద్రమూర్తి పని సులభం కావచ్చు. సీతాదేవి ఏం చెప్పింది? రాముడే రావాలి, రావణాదులను చంపాలి, తనను తీసుకునిపోవాలనికదా! ఈ సంగతి చెప్పటమంటే రాక్షసుల బలాబలాల విచారణ జరగాలనే! అనుకున్నాడు.

ఏదోవిధంగా, రావణుడిని, వాడి మంత్రులను, సైన్యాన్ని, యుద్ధానికీడ్చి, దాంతో శత్రువుల బలాబలాలను తెల్సుకుని, వాడి ఆలోచనేమిటో అర్థం చేసుకోవటమే మంచిదనుకుంటాడు. గొప్పగొప్ప వృక్షాలతో, అందమైన తీగలతో వున్న అశోకవనం ఉద్యానవనం ధ్వంసం చేస్తే రావణుడికి కోపం వస్తుందనీ అనుకుంటాడు. ఈ అశోకవనం కార్చిచ్చుతో కాలినట్లు పాడైపోతే, మండిపడ్డ రావణుడు, ఏనుగులతో సహా తనసైన్యాన్ని యుద్ధం చేయమని తనమీదకు పంపుతాడు. వాళ్లను తునాతునకలు చేసి

సంతోషంగా కిష్కింధకు పోదామని నిర్ణయించుకుంటాడు.

ఇలా ఆలోచించిన హనుమంతుడు విజృంభించాడు. చెట్లన్నీ కూకటివ్రేళ్లతోసహా పీకి నేలమీద పడేయడం ఆరంభించాడు. ప్రమదావనాన్ని పాడుచేసాడు. క్రీడాపర్వతాలను నేలమట్టం చేసాడు. క్రీడాసరస్సులను విరగ గొట్టాడు. ఆ వనం కార్చిచ్చు తగిలి కాలిపోయినట్లయింది. రావణాసురుడి భార్యలకు ప్రమదావనమైన ఉద్యానవనాన్ని మూలమట్టంగా నాశనంచేసి, సంతోషంతో కయ్యానికి కాలుదువ్వి, యుద్ధానికెదురు చూస్తూ ఆ వనం తలవాకిటిమీద కూర్చున్నాడు హనుమంతుడు.

సీతకు కాపలాగా వున్న రాక్షస స్త్రీలు దీనికి భయపడి, దిక్కుతోచక, పరుగు-పరుగున రావణుడికి చెప్పటానికి వెళ్లారు. వెళ్లి: ''భయంకరమైన వానరరూపంకల వీరుడొకడు సీతతో మచ్చికగా ముచ్చట్లాడి, అశోకవనంలో వున్నాడు. వాడు సీతను వెతికేందుకు వచ్చిన శ్రీరాముడి దూతో, కాదో, తెల్సుకోవడం కష్టంగా వుంది'' అని విన్నవించుకున్నారు రావణుడికి. "నీ వనాన్ని పాడు చేసినందుకు, సీతను పలుకరించినందుకు, కోతి పొగరు అణిగేటట్లు కఠినంగా దండించు. నువ్వు కోరికపడ్డ ఆడదానితో మరొకరొచ్చి మాట్లాడినవాడెవరైనా కాని ప్రాణాలతో వుండవచ్చునా?" అని రెచ్చగొట్టారు రాక్షసులు. ఆమాటలకు మండిపడ్డాడు రావణాసురుడు.

కోపంతో ఊగిపోయాడు రావణుడు. తనతో సమానమైన కింకరులనేవారిని వెంటనే వెళ్లి, ఆ కోతిని పట్టుకునిరమ్మని పంపుతాడు. ఆ కింకరులు ఆయుధాలు, ఖడ్గాలు ధరించి, యుద్ధకాంక్షతో, హనుమంతుడి మీదకొస్తారు. వారిని చూసి ''దృఢపరాక్రమం, ధన్యమైన రూపంకల శ్రీరామచంద్రమూర్తికీ, శత్రువులు సంహరించలేని బలమున్న లక్ష్మణుడికీ, రామలక్ష్మణుల రక్షణలో వుండి, తెంపు, పరాక్రమం, కీర్తిగల వానరనాధుడు సుగ్రీవుడికి, జయంకలుగుకాక...జయంకలుగుకాక'' అని స్మరిస్తాడు హనుమంతుడు. (జయ త్యతిబలో రామో లక్ష్మణశ్చ మహాబలః దాసోహం కోసలేంద్రస్యః నరావణ సహస్రం మే యుద్ధే ప్రతిబలం భవేత్. వీటిని జయమంత్రాలంటారు. సర్వకార్య సిద్ధికి ఈ శ్లోకాలను జపించమన్నారు పెద్దలు. ఇవి నిత్యమూ పఠించే వారిపై క్షుద్రశక్తులు పనిచేయవని పెద్దలంటారు) సమస్తకళ్యాణ గుణాలవల్ల మనోహరుడైన కోసలదేశ ప్రభువైన రామచంద్రమూర్తికి తాను దాసుడననీ, శత్రు సంహారకుడైన వాయుపుత్రుడననీ, హనుమంతుడన్న పేరుకలవాడిననీ, వేయిమంది రావణులైనా తనతో యుద్ధంలో సరితూగరనీ, రాళ్లతో, చెట్లతో శత్రువులను సంహరిస్తాననీ గర్జిస్తాడు. లంకను ధ్వంసం చేసి, రాక్షసులందరినీ హింసించి, సీతాదేవికి మ్రొక్కి, రాక్షసులేడుస్తుంటే, కీర్తిమంతుడనై వెళ్తానని అరుస్తాడు.

తన మీదకు వచ్చిన కింకర రాక్షసులందరినీ నుగ్గు చేసాడు. ఇలా కింకర సమూహాన్నంతా చంపి, ఇంకా యుద్ధం చేయాలన్న కోరికతో, జంకూ, గొంకూ లేకుండా, రాక్షసులకు భయంకరంగా కనిపిస్తూ, మళ్లీ తోరణమెక్కి కూర్చున్నాడాయన. అప్పుడు ప్రహస్తుడి కొడుకును యుద్ధానికి పంపుతాడు రావణుడు. వాడిపేరే ''జంబుమాలి''. కింకరులందరినీ చంపిన హనుమంతుడు, మేరుపర్వత శిఖరంతో సమానమైన ఓ మేడను చూసాడు. అది గట్టిగా వూగిపోయేటట్లు దానిమీదకు దూకుతాడు. చూడటానికి ప్రాసాదంలాగా వున్న ఆమేడ లంకాధిదేవత గుడి. హనుమంతుడు, ఆ మేడంతా విరగదన్ని,

విజయగర్వంతో మరొక్కసారి ''జయం-జయం'' రాముడికి అని స్మరిస్తూ, వేయిమంది దశకంఠులు కూడా ఒక్క హనుమంతుడికి సరికాదని గర్జిస్తాడు.

హనుమంతుడి సింహనాదాన్ని విన్న దేవాలయం కాపలాదారులు (చైత్యపాలకులు), ఆయన్ను చుట్టుముట్టారు. కావలి రాక్షసులందరినీ చంపి, ఆకాశంలోకి ఎగిరి, అందరూ వినపడేటట్లు గట్టిగా చెప్తాడీవిధంగా: "ఓ లంకావాసులారా! వినండి. నాలాంటి వేలాది వానరులు సుగ్రీవాజ్ఞ ప్రకారం సీతాదేవిని వెతుకుతున్నారు. వాళ్లంతా నాలాగా బలవంతులే! పది ఏనుగుల బలమున్నవారు కొందరు, నూరేనుగుల, వెయ్యేనుగుల బలమున్న వారు మరికొంతమంది, చెప్పలేనంత బలవంతులు ఇంకొందరు, వాయువేగంతో పోగలిగేవారు ఎంతో మంది వున్నారు వాళ్లలో. వీళ్లందరిరి ఆయుధాలు గోళ్లు, దంతాలు, రాళ్లే! ఇలాంటి కోటానుకోట్ల, లెక్కించనలవికాని వానరులను తీసుకుని, అమేయబలుడు సుగ్రీవుడు ఇక్కడకు రాబోతున్నాడు. వచ్చి మిమ్ముల్నందరినీ చంపబోతున్నాడు. నిష్కారణంగా శ్రీరాముడితో విరోధం తెచ్చుకున్నారు మీరందరూ. రావణుడికీ లంకకూ, మీకూ ఇక ఋణానుబంధం తీరినట్లే!''.

దీంతో ఇంతవరకు సీతను లంకలో వుంచిన వార్త అంతఃపురానికి వచ్చేవారికి తప్ప తెలియని ఇతరులకు కూడా తెలుస్తుందిప్పుడు. రహస్యం బయటపడింది. అప్పుడు ప్రహస్తుడి పుత్రుడు జంబుమాలి అక్కడకు అతివేగంగా వచ్చాడు. హనుమంతుడు వేసిన ఒక ఇనుప గుండు దెబ్బకు, జంబుమాలి పొడిపొడిగా, ముక్కలు చెక్కలై నేలకూలాడు. కింకరులు జంబుమాలి చచ్చాడని రావణుడికి తెలిపారు. రావణుడు, ఏడుగురు మంత్రిపుత్రులను పంపాడు హనుమంతుడిమీదకు. వచ్చిన వాళ్లను అరిచేతుల్తో, కాళ్లతో కొట్టి, గోళ్లతో చీల్చేసాడు. మంత్రికుమారుల మరణవార్త విన్న రావణుడు తన ఐదుగురు సేనానాయకులైన, విరూపాక్షుడు, దుర్ధరుడు, యూపాక్షుడు, భాసకర్ణుడు, ప్రహసుడు అనేవారిని పిల్చి, వారి సమస్త సైన్యంతో వెళ్లి, కోతిని పట్టుకుని తెమ్మంటాడు. యుద్ధానికి వచ్చిన వారందరినీ చంపాడు హనుమంతుడు.

తన ఐదుగురు సేనానాయకులు, యుద్ధంలో మరణించారన్న వార్త విన్న రావణుడు, అక్షుడనే తనకొడుకును యుద్ధానికి బయల్దేరమని చెప్పాడు. బయల్దేరిన అక్షుడు, బలవంతుడైన హనుమంతుడిని సగౌరవ దృష్టితో చూసి, యుద్ధానికి దిగాడు. ఆంజనేయుడు తన చూపులతోనే అక్షకుమారుడి సేనలను దగ్ధం చేసాడు. వాడి యుద్ధ కౌశలాన్ని చూసి ఎలా చంపాలా అని ఆలోచిస్తూనే దేహాన్ని పెంచి, రాక్షసకుమారుడిని చంపే ఉద్దేశ్యంతో, వాడికాళ్లు పట్టుకుని, తిప్పి, వేగంగా బలంకొద్దీ నేలమీద వేసి బాదుతాడు. వాడిచావుకు రావణుడి గుండెలు పగిలి, వాడి వంశ క్షయం మొదలైంది.

అక్షకుమారుడు, చచ్చాడని విన్న రావణుడు హతాశుడైనాడు. ఇంద్రజిత్తును (అసలు పేరు మేఘనాదుడు. ఇంద్రుడిని జయించి ఈ బిరుదు పొందాడు) పిలిచి అతడిని యుద్ధానికి పంపాలని నిర్ణయించాడు. ఇంద్రజిత్తు, అస్త్రవిద్యలలో ప్రధముడనీ, సమస్త దేవదానవులకు శోకం కలిగించిన వాడనీ, భుజబలంలో ఎల్లలోకాలలో ప్రసిద్ధికెక్కిన వాడనీ, బ్రహ్మదేవుడి దగ్గరనుండి మహాస్త్రాలు సంపాదించిన వాడనీ, వాడు చేసిన పనులు దేవతలందరకూ తెలుసనీ, అంటాడు రావణుడతడితో. దేవదానవులూ, ఇంద్రుడూ అతడి ఎదుట నిల్చి యుద్ధం చేయడం మాట అటుంచి, మాయలు చేయడంలో కూడా అతడికి సమానులు కారనీ అంటాడు రావణుడు.

తండ్రిమాటలు విన్న ఇంద్రజిత్తు, తండ్రికి ప్రదక్షిణ చేసి నమస్కరిస్తాడు. యుద్ధానికి పోతున్న ఇంద్రజిత్తు వేగానికి జంతువులు అరిచాయి, దిక్కులు కాంతిహీనమయ్యాయి, పక్షులు ఆకాశానికెగిరి కూయసాగాయి. ఇంద్రజిత్తు బాణవర్షాన్ని కురిపిస్తూ, హనుమంతుడి దగ్గరకు పోయేప్రయత్నం చేయగా, ఆయన కంఠధ్వనికి, కొండలు బద్దలయ్యి, భూమికదిలి, మేఘాలు చెదిరిపోయాయి. ఇంద్రజిత్తు వేస్తున్న బాణాలు, విచ్చలవిడిగా వచ్చి హనుమంతుడిని తాకాయి. ఈ వీరులిద్దరూ దేవదానవుల్లా విరోధంతో యుద్ధం చేయసాగారు. ఇద్దరూ యుద్ధంలో, సమర్థులే! ఇద్దరూ అతివేగంగా, అంతులేని పరాక్రమంతో, భూతసమూహాలు ఆశ్చర్యపోతుంటే యుద్ధం చేసారు. వారిద్దరిలో తేడా కనిపించలేదు. ఒకరిలోపం ఇంకొకరికి తెలవడం కష్టమయింది. తన బాణాలన్నీ వ్యర్థమైపోతుంటే, ఏంచేయాలన్న ఆలోచనలో పడ్డాడు ఇంద్రజిత్తు.

ఆంజనేయుడెంతకూ తనకు చిక్కడంలేదనుకున్న ఇంద్రజిత్, భుజబలంతో వీడిని చంపడం వీలుకాదనీ, ఏవిధంగానైనా కట్టేయాలనీ, భావించి బ్రహ్మాస్త్రం సంధించాడు. అది ఆంజనేయుడిని కట్టేయడంతో, కోతి నేలకూలిందని సంతోషించారు రాక్షసులు. కాళ్లూ, చేతులూ కదిలించలేక సోలిపోయిన ఆంజనేయుడు, బ్రహ్మ తనకిచ్చిన వరాన్ని గుర్తుచేసుకుంటాడు. భుజపరాక్రమం చాలించి, బ్రహ్మ ఆజ్ఞను దాటకుండడమే మేలని తలుస్తాడు. రాక్షసులకు కొంచెం సేపు చిక్కిపోయినా, తనకు వరాలిచ్చిన బ్రహ్మ, ఇంద్రుడు, తండ్రి వాయుదేవుడు, తన్ను రక్షిస్తుంటే, తనకొచ్చిన భయమేదీలేదనుకుంటాడు. బ్రహ్మ రుద్రేంద్రాదుల వరాలను పొందిన నిరుపమ పరాక్రమశాలి హనుమంతుడు. అతడిని ఏ అస్త్రాలూ బంధించలేవు.

వీళ్లకు చిక్కినా తన్నేమీ చేయలేరనీ, ఏంచేయాలన్నా రావణాజ్ఞ తప్పనిసరనీ, కదలక, మెదలక వూరుకుండిపోయాడు. దుష్టరాక్షసులు తనమీదపడి, నారతాళ్లతో, నారగుడ్డలు కలిపి, తన్నుకట్టేస్తుంటే, కోతిగుణం తెలిపేవాడిలా కేకలు వేయసాగాడు.

హనుమంతుడు పడిపోవడం చూసిన రాక్షసులు కోపంతో, బలమైన పగ్గాలను నారవస్త్రాలతో ముడేసి, కడు ప్రయత్నంతో తన్ను కట్టేస్తుంటే, రావణుడిని చూడవచ్చుకదా అన్న కోరికతో, ఆ కట్లు సహించి వూరుకున్నాడు ఆయన. ఇంద్రజిత్తు హనుమంతుడిని, ''బ్రహ్మాస్త్రం''తో బంధించిన తర్వాత, రాక్షసులు, తాళ్లతో, పగ్గాలతో తిరిగి కట్టేయగానే, బ్రహ్మాస్త్ర బంధాలు తెగిపోయాయి. బ్రహ్మాస్త్ర బంధాలు మరో బంధాలతో కలిస్తే, ఆ బంధాలు విడిపోయినట్లే! దీనర్థం: ప్రపత్తి చేసినవాడు, దాని మీద విశ్వాసం లేక పోతే, ప్రపత్తికి సహాయ పడుతుందని వేరే సాధనాన్ని వుపయోగిస్తే, ''ప్రపత్తి'' చెడిపోతుంది. ప్రపత్తిలో వున్న అపాయం ఇదే! ఇతర ''ఉపాయాల''ను అది సహించదు. ఉత్తములు నీచ సహవాసాన్ని సహించరుకదా! అంతే భరన్యాసం చేసినవాడు మళ్లీ సొంత ప్రయత్నం చేస్తే వాడికి భరన్యాస ప్రభావం మీద నమ్మిక లేనట్లే! భరన్యాసం చేసినవాడు అకించనుడిగా భావిస్తూ వుండాలని పెద్దలంటారు.

తన దేహాన్ని కట్టేసిన అస్త్రబంధాలు వదిలిపోయిన సంగతి ఎరుగని ఆంజనేయుడు చిక్కుబడివున్నాడనీ, తెలిస్తే విజృంభిస్తాడనీ, అప్పుడేంగతనీ ఇంద్రజిత్తు ఆలోచనలో పడిపోయాడు.

◆❖◆

హనుమ నీతులు రావణుడికి రుచించలేదా?

హనుమ, ఇంద్రజిత్తు మధ్య జరిగిన భీకర యుద్ధంలో, ఇంద్రజిత్తు హనుమంతుడిని "బ్రహ్మాస్త్రం"తో బంధించిన తర్వాత, రాక్షసులు, తాళ్లతో, పగ్గాలతో తిరిగి కట్టేయగానే, బ్రహ్మాస్త్ర బంధాలు తెగిపోయాయి. బ్రహ్మాస్త్ర బంధాలు మరో బంధాలతో కలిస్తే, ఆ బంధాలు విడిపొయినట్లే! ఇంద్రజిత్తు ఆలోచన చేస్తున్నప్పుడే, రాక్షసులు కోతిని తాళ్లతో కట్టి, కట్టెలతో కొట్టూ, పిడికిళ్లతో గుద్దుతూ తీసుకునిపోయి, రావణుడి ముందర నిలబెట్టారు. "తెచ్చాం కోతిని" అంటారు. వెంటనే ఆ సభలో వున్నవారందరూ: "వీడెవడు? ఎక్కడనుండి వచ్చాడు? ఎవరు పంపారు? ఏం పనుండి వచ్చాడు? ఎందుకిలా చేసాడు?" అని ఒకరితో ఒకరు అనుకుంటుంటే, ఇంకొందరు మదించిన గర్వంతో హేళనగా మాట్లాడసాగారు. "కట్టేయండి, కొట్టండి, కాల్చండి, మింగండి" అనడం మొదలెట్టారు వాళ్లు. ఇవన్నీ వింటూనే హనుమంతుడు, రావణుడి సభా మంటపాన్ని చూసాడు.

అదే సమయంలో హనుమంతుడిని రావణుడు చూసాడు. మంత్రి శ్రేష్టులను, పెద్దలను, వీడెవ్వడో తెలుసుకోమని కోరాడు రావణుడు. కానీ హనుమ మంత్రులకు నేరుగా జవాబు చెప్పడు. రావణుడితోనే మట్లాడుతాడు. రావణుడిని లక్ష్యపెట్టడు, నిర్లక్ష్యంగా చూశాడు. వాడిని చూసి ఆశ్చర్యపోయిన హనుమంతుడు ఆయన్ను గురించి "ఏమి రూపం, ఏమి తేజం, ఏమి బలం, ఏమి ధైర్యం" అని అనుకుంటాడు. రాజులకుండాల్సిన చిహ్నాలన్నీ వున్నాయే ఇతడికి అనుకుంటాడు. ఇట్టివాడు ధర్మ విరుద్ధమైన పనులే చేసి వుండకపోతే, స్వర్గాన్ని కూడా తన శక్తి, యుక్తులతో పరిపాలించేవాడుకదా! అని భావిస్తాడు. వీడుకోపించి, పరాక్రమించి, లోకాలన్నీ ప్రళయకాలంలోని సముద్రం లాగా చేయదల్చుకుంటే ఆ తేజస్సును అడ్డగించే వారుండరు కదా! అనుకుంటాడు.

ఎదురుగా వున్న ఆంజనేయుడిని, ఎగాదిగా చూసి ఆలోచనలో పడ్డాడు రావణుడు. కైలాసపర్వతాన్ని పెళ్లగించినప్పుడు, తనను శపించిన నందీశ్వరుడే ఈ రూపంలో వచ్చెనా వుండాలి లేదా, తన శత్రు పక్షంలోని బాణుడన్నా కోతిరూపంలో వచ్చి వుండాలని సందేహిస్తాడు. లంకకేపనిమీద వచ్చాడు?

వీడిని పంపిందెవ్వరు? ఉద్యానవనాన్ని ఎందుకు పాడుచేసాడు? రాక్షస స్త్రీలనెందుకు బెదిరించాడు? యుద్ధమెందుకు చేసాడు? ఈ విషయాలన్నీ అడగమని తన ముఖ్యమంత్రి అయిన ప్రహస్తుడిని ఆజ్ఞాపించాడు. వెంటనే అతడు ఆంజనేయుడిని ప్రశ్నిస్తాడు. భయపడవద్దనీ, నిజం చెప్పితే వదిలిపెట్తామనీ, అసత్యం చెప్తే ప్రాణాలతో వదలమనీ అంటూ, హనుమంతుడినెవరు తమ రాక్షసనగరానికి పంపించారని ప్రశ్నిస్తాడు ప్రహస్తుడు. రాక్షసరాజు నగరానికి ప్రవేశించిన కారణం సర్వం విన్నవించమంటాడు ప్రహస్తుడు.

ప్రహస్తుడడిగిన ప్రశ్నలకు తనవృత్తాంతాన్నంతా చెప్తా వినమంటాడు. తానే ఆకారంలో కనిపిస్తున్నాడో, ఆ జాతివాడినేననీ, దుర్లభమైన రాక్షసరాజు దర్శనంకోరి ప్రమదావనాన్ని పాడుచేసాననీ అన్నాడు. యుద్ధం చేయడానికి రాక్షసులొస్తే తన్ను కాపాడుకోవటానికి మాత్రమే వారితో పోరాడానంటాడు. తనను ఎవరు కూడా అస్త్రాలతో కట్టెయ్యలేరనీ, తానే కావాలని పట్టుబడ్డాననీ చెప్పాడు. ''బ్రహ్మ చేత నీవొక్కడివే వరాలు పొందలేదు. నేనుకూడా ఇట్టి వరాలు పొందినవాడినే. రాక్షస రాజును చూడగోరి బ్రహ్మాస్త్రానికి పట్టుబడ్డాను. రాక్షసులు నన్ను తాళ్లతో కట్టినప్పుడే ఆ అస్త్ర బంధాలూడిపోయాయి'' అంటాడు. శ్రీరామచంద్రమూర్తి బంటుననీ, రాక్షసరాజుకు కొన్ని క్షేమకరమైన మాటలు చెప్తా వినమనీ హెచ్చరికగా అంటాడు హనుమంతుడు.

"సుగ్రీవుడి ఆజ్ఞానుసారం నిన్ను చూడటానికి ఈ పట్టణానికి వచ్చాను. నీ తమ్ముడు వానర రాజు, సుగ్రీవుడు నీ కుశలవార్త అడిగాడు. నీకు ఇహపరాలలో సుఖం కలిగించే ధర్మ వాక్యాలను చెప్పి పంపాడు. దానిని నీకు చెప్తా విను. చతురంగ బలాలున్న దశరథుడనే మహారాజున్నాడు. అతడి పెద్దకొడుకు పేరు శ్రీరామచంద్రుడు. తండ్రి ఆజ్ఞప్రకారం ఆయన భార్య సీత, తమ్ముడు లక్ష్మణుడు తోడురాగా దండకారణ్యంలోకి వెళ్లాడు. ఆయన భార్య ఒకనాడు అడవిలో కనిపించక పోయేసరికి, తమ్ముడు లక్ష్మణుడితో కలిసి వెతుక్కుంటూ ఋశ్యమూక పర్వతం వద్దకు వచ్చారు. సుగ్రీవుడు సీతను వెతికిస్తానని ప్రతిజ్ఞ చేశాడు. రాముడు వాలిని చంపి, సుగ్రీవుడికి వానరరాజ్యం ఇస్తానని వాగ్దానం చేసి, ఇచ్చిన మాట ప్రకారమే యుద్ధంలో వాలిని చంపి, సుగ్రీవుడిని రాజును చేసాడు. వాలి ఎవరో, ఎట్టివాడో నీకూ తెలుసు. అలాంటివాడు ఒక్క రామబాణానికి చచ్చాడు. ఆ తర్వాత సీతను వెతికేందుకు వేలాదివేల వానరులను అన్ని దిక్కులకూ పంపాడు సుగ్రీవుడు. వానరవీరులు, సీతాదేవిని అన్నిప్రదేశాల్లో వెతుకుతున్నారు. సుగ్రీవుడి దగ్గర నాలాంటివాళ్లు అనేకమంది వున్నారు. నన్నొక్కడిని జయించడమే నీకింత కష్టమైతే, వారందరూ ఒక్కసారే వస్తే నువ్వేమి చేయగలవో ఆలోచించుకో. నేను వాయుపుత్రుడిని. పేరు హనుమంతుడు. సీతాదేవిని వెతుక్కుంటూ నూరామడల సముద్రాన్ని దాటి ఇక్కడకు వచ్చాను. ఆమెను నీ ఇంట్లో చూసాను. నేను చెప్తున్నదంతా సత్యం".

"విధానాన్ననుసరించి ధర్మశాస్త్రాలను చక్కగా అధ్యయనం చేసావు. ప్రపంచం మెచ్చేరీతిలో తపస్సు చేసావు. ఇంత గొప్పవాడివి, పరపురుషుల స్త్రీలను బాధపెట్టడం ధర్మమా? రాక్షసవంశాన్ని నీ ఈ అధర్మ కార్యం కూకటివ్రేళ్లతో నాశనం చేసే విపత్తుకు దారితీయదా? నీవంటి బుద్ధిమంతుడు, ఇలాంటి పనులు చేయవచ్చా? రామచంద్రమూర్తి కోపంగా వదిలే బాణాలకు, లక్ష్మణుడి బాణాలకు, నీవేకాదు

దేవదానవులందరు కలిసి ఎదిరించినా నిలువలేరు. శ్రీరామచంద్రమూర్తికి కీడుచేసిన వారెవ్వరైనా, ముల్లోకాల్లో ఎక్కడైనా ప్రాణాలతో వుండడం సాధ్యమేమో నీవే ఆలోచించు. నిన్ను జయించి కారాగృహంలో బంధించిన కార్తవీర్యార్జునిడిని ఓడించి, ఇతర రాజులందరినీ ఇరవై ఒక్క సార్లు చంపిన పరశురాముడిని అరగడియలో బాణప్రయోగం లేకుండానే ఓడించాడాయన''.

"ధర్మమైనదీ, భూత, భవిష్యత్, వర్తమాన కాలాలకు పనికొచ్చేదీ, సుఖలాభాలతో కూడినదైన సుగ్రీవుడి మాటలు విను. జానకీదేవిని రాముడికివ్వు. ఆమె ఎక్కడుందో చూశాం. వున్న స్థలం తెలిసిపోయింది. మిగిలిన కార్యం రామచంద్రమూర్తే చేస్తాడు. రామచంద్రమూర్తి చూసిరమ్మన్నాడే కాని తీసుకుని రమ్మనలేదు కాబట్టి ఒక్కడినే వెళ్తున్నాను. సీతాదేవిని నేను చూసాను. ఆమె స్త్రీయేకదా అని నువ్వనుకుంటే అదిపొరపాటు. నిన్ను చంపడానికి నీ మెడకు చుట్టుకున్న ఆడ త్రాచుపాము. ఆమె దగ్గరకు పోతే చస్తావు. నిన్ను చంపటానికి ఆమే చాలు. నిన్ను చంపకుండా ఆమెవదలదు కాబట్టి, ఆమెను నువ్వువదులు''

"రావణా! ఎంతో కష్టపడి తపస్సు చేసావు. అది మర్చిపోయి, పాడుచేసే పనులెన్నో చేసావు. నీ తపస్సు వ్యర్థమై పోతున్నదని మర్చావు. నీ తపఃఫలంతో దేవదానవులెవ్వరూ నిన్ను జయించకుండా వరం పొందావు. ఆ వరాలేవీ నిన్నిప్పుడు రక్షించలేవు. ఎందుకో చెప్తా విను. నువ్వు దేవతలతో, దానవులతో, రాక్షసులతో, గంధర్వులతో, నాగులతో చావకుండా వరం పొందావు. సుగ్రీవుడు అమరుడు కాదు, అసురుడూకాదు, గంధర్వుడుకూడ కాదు, దానవుడూ కానే కాదు, నీవరాలు నిన్నెట్లా రక్షిస్తాయని అనుకుంటున్నావు? చీకటి, వెలుతురు ఒకేసారి రానట్లే, పాప-పుణ్యఫలాలు రెండూ ఒకేసారి అనుభవించలేం. నువ్వు పుణ్యఫలం అనుభవించుతున్నంత వరకూ, పాపఫలం దరికిరాదు. ధర్మఫలం అధర్మఫలాన్ని చెరిపేపేస్తుంది. అధర్మఫలం ఇంకా నీకనుభవంలోకి రాలేదు. నీ తపస్సు నీకు దీర్ఘాయువు ఇవ్వాలి. కాని, నువ్వుచేసిన పరస్త్రీ అపహరణనే పాపపు పనివల్ల త్వరగా చావాలి. ఈ రెండూ ఏకకాలంలో జరుగవు కాబట్టి, నీ చావింతవరకూ ఆగింది. నీ వ్రతఫలంగా దేవదానవుల చేతుల్లో చావులేకుండా వరం కోరావు. నరవానరులను నిషేధించావు. నీ తపఃఫలం వారినుండి నిన్ను కాపాడదు. ఇక నీ పూర్వపుణ్యం పూర్వపాపాన్నే హరిస్తుంది. కాని ఇప్పుడు చేస్తున్న పాపకార్యాలనుండి నిన్ను రక్షించదు. నీవు బలవంతంగా ఎత్తుకొచ్చిన సీతాదేవిని, ఇతర స్త్రీలను ఎవరివారికి వారిని అప్పగిస్తే నీ దోషం పోతుంది. తపఃఫలం పుణ్యమనుభవించినకొద్దీ క్షీణిస్తుంది. శాశ్వతంగా మిగిలిపోదు. నీ తపఃఫలం ఎంతవరకు అనుభవించాలో, అంతా ఇప్పటివరకూ అనుభవిస్తూ వస్తున్నావు. అది పూర్తయింది. ఇకనుండి నీవు చేసిన పాపఫలం నేటినుండే అనుభవిస్తావు''.

"జనస్థానంలో వున్న నీ తమ్ములందరూ చావడంతో మొదలయిందినీ పాపఫలం అనుభవించేరోజు. తర్వాత నీ స్నేహితుడు వాలి చచ్చాడు. అతడి విరోధి సుగ్రీవుడు రాముడికి మిత్రుడయ్యాడు. ఇవన్నీ నీకు అరిష్టసూచనలే! ఇవన్నీ ఆలోచించి, నీకేదిమంచిదని తోస్తే అదే చేయి. నీ అధర్మఫలాన్ని, నేడే, ఇక్కడే, ఇప్పుడే, నిన్ననుభవించేటట్లు, నామాటలను యదార్థం చేయగలను. నేనొక్కడినే లంకానగరాన్నంతా నాశనంచేయగలను. మీలో ఎవ్వరూ నన్ను బాధపెట్టగలిగేవారు లేనేలేరు. మీ శస్త్రాస్త్రాలు నన్నేమీ

చేయలేవు. ఇంద్రజిత్తు దగ్గరున్న బ్రహ్మాస్త్రం పనికూడా అయిపోయింది. అదిమళ్లీ ఉపయోగపడదు".

"జానకీదేవికి ద్రోహం చేసినవాడిని, తానే చంపుతానని ప్రతిజ్ఞ చేసాడు శ్రీరాముడు సుగ్రీవుడి ముందర. అందుకే ఈ విషయంలో నేనేమీ చేయలేకపోతున్నా. నీ వశమందున్న జానకి ఉత్తమస్త్రీ. ఆమె లంకంతా పాడుచేసేందుకు వచ్చిన కాళరాత్రి. ప్రళయకాలంలో కాళరాత్రి ఏ విధంగా లోకాన్నంతా నాశనం చేస్తుందో, అట్లాగే, ఈమె లంకంతా నాశనం చేయబోతున్నది. నీ మెడలో తగులుకున్న యమపాశం ఈమె. నువ్వు బ్రతకాలనుకుంటే, లంకను కాపాడుకోవాలంటే, ఆమెను వదిలి పెట్టడమొక్కటే మార్గం''.

హనుమంతుడు మొదలు పెట్టినప్పుడు అనునయంగా చెప్పాడు. రావణుడి ముఖకవళికలను కనిపెట్టి, భయపడే మాటలనడం ప్రారంభించాడు. ''సృష్టించేవాడు బ్రహ్మ, సంహరించేవాడు రుద్రుడు'' కదా! అయితే ఇవి రామ కార్యాలుగా హనుమంతుడు చెప్పడంలో అతిశయోక్తి లేదు. తగిన కారణం వుంది. అనంతకోటి బ్రహ్మాండానికి ''పరబ్రహ్మం'' ఒక్కడే! అతనికి సమానుడూ, అధికుడూ, ఎవరూ లేరు. గడ్డిపోచ కదలాలన్నా ఆయనే కారణం. ఆయనే సృష్టికొక అధికారిని, సంహరించటానికొక అధికారిని నియమించాడు. ''బ్రహ్మ, రుద్రులు'' నిమిత్తమాత్రులు. భగవంతుడైన ''విష్ణుమూర్తి'', రజోగుణం విశేషంగా వుండే జీవులందు ప్రవేశించి వారితో సృష్టి కార్యాన్ని, తమోగుణం వున్నవారిలో ప్రవేశించి సంహార కార్యాన్ని, సత్వగుణం వున్నవారిలో ప్రవేశించి రక్షించే పనినీ చేస్తాడు. అందుకే సమస్త ప్రయోజకర్త వాస్తవానికి ఆ ''భగవంతుడే''.

"ఓ రాక్షసరాజా! చిల్లరదేవుళ్ల మాట అటుంచు. నీ మీద ప్రేమతో వరాలిచ్చిన స్వయంభు, చతురాస్యుడైన బ్రహ్మదేవుడైనా, ముక్కంటి త్రిపురాంతకుడు అయిన రుద్రుడైనా, ముప్పెమూడుకోట్ల దేవతలకు అధిపతైన ఇంద్రుడు, మహేంద్రుడైనా, లేక ఈ ముగ్గురూ కలిసొచ్చినా, యుద్ధంలో రాముడి బారినుండి నిన్ను రక్షించలేరు. శరణాగతియే నీకు రక్షణ. ఆయన్నే శరణుకోరు''.

ఇలా హనుమంతుడు చెప్పుకుంటూ పోతుంటే సహించ లేకపోయాడు రావణాసురుడు. రావణాసురుడు హనుమంతుడిని చంపమని ఆజ్ఞాపించాడు. విభీషణుడు, రాజాజ్ఞ నీతికి విరోధమనీ, దోషమనీ చెప్తుతాడు. మెత్తటి మాటలతో, రాజుకు నచ్చచెప్పే ప్రయత్నం చేస్తాడు. విభీషణుడు చెప్పినదంతా సత్యమేనని ఒప్పుకుంటాడు రావణుడు. కోతికిష్టమైన అవయవం తోకైనందున, దానిని కాల్చి పంపితే వీడికది తగిన శిక్షని తలుస్తాడు. తోకను కాల్చి వూరంతా తిప్పమని ఆజ్ఞాపించాడు రావణాసురుడు. వెంటనే, రాక్షసులు పాతగుడ్డలు తెచ్చి, చమురులో తడిపి, తోకకు చుట్టసాగారు. హనుమంతుడు తన దేహాన్ని పెంచసాగాడు. రాక్షసులు తోకకు నిప్పంటించారు. హనుమంతుడు తనతోకతో వాళ్లను కొట్టాడు. హనుమంతుడి తోక కాలుతుంటే, పిల్లలు, పెద్దలు, స్త్రీలు సంతోషించారు.

సీతమ్మ ఆజ్ఞాపిస్తే అగ్ని చల్లబడ్డాడా?

రావణాసురుడి అజ్ఞానుసారం, రాక్షసులు హనుమంతుడి తోకకు నిప్పంటిస్తుంటే, ఆయన తన తోకతో వాళ్లను కొట్టాడు. తన తోక కాలుతుంటే, హనుమంతుడు పరిపరివిధాలుగా ఆలోచించసాగాడు. ''తాను ఏమి చేయాలిప్పుడు? తాను విడిపించుకోదల్చుకుంటే వీళ్లు తనకడ్డమా? త్రాళ్లు తెంచుకుని వీళ్ళందరినీ చంపాల్నా? ఇదికోపగించుకునే సమయం కాదు. ఏదిమేలో అదే ఆలోచించాలి. వీళ్లనెందుకు కొట్టాలి? రావణుడి ఆజ్ఞ ప్రకారమే వీళ్లు తనను బాధిస్తున్నారే తప్ప, వాళ్ల తప్పేమీలేదే! వాళ్లు తనకోవిధంగా మేలే చేస్తున్నారు. రాత్రివేళ మొత్తం లంకను చూడడం సాధ్యపడలేదు. వీళ్లిప్పుడు తిప్పితే చూడొచ్చు. వీళ్లు రెక్కలు విరిచి కట్టితే కట్టుకోనిద్దాం. నా దేహాన్ని కాల్చినా కాల్చవచ్చు. అటూ–ఇటూ ఈడిస్తే ఈడ్వవచ్చు. వీళ్లు చేసేపనిని వడ్డీతో సహా తీరుస్తా'' అనుకుంటాడు.

ఇలా హనుమంతుడు ఆలోచిస్తున్నప్పుడే, అతడిని వాడావాడా తిప్పారు రాక్షసులు. విజృంభించి శంఖాలు పూరిస్తూ, చప్పట్లు కొడుతూ, తిట్టుకుంటూ, కొట్టుకుంటూ, వూరంతా తిప్పారు. రాక్షసులు తిప్పుతుంటే, హనుమంతుడు కష్టపడకుండానే, సందు–సందు, గొంది–గొంది, వాడ–వాడ, వీధి–వీధి, రహస్య ప్రదేశాలు, ఇళ్ళకున్న దొడ్డి దోవలు, చిన్న–చిన్న ఇళ్లు, పెద్ద–పెద్ద మేడలు తిరిగి చూశాడు. కొందరు రాక్షసస్త్రీలు పరిగెత్తుకుంటూ సీతాదేవి దగ్గరకు వెళ్లి ఆమెతో గుసగుసలాడిన కోతిని, రాక్షసులు పట్టుకుని, తోక కాల్చి వూళ్లో తిప్పుతున్నారని ఆమెకు చెప్పారు. హనుమంతుడి మేలుకోరుకునే పతివ్రత సీతాదేవి, రాక్షసులను ఆయన చంపిన సంగతి గురించి విని సంతోషించింది. ఆంజనేయుడి మేలుకోరి అగ్నిహోత్రుడిని ప్రార్థిస్తుందిలా:

"నేను పతిసేవచేసే స్త్రీనైతే, నిష్ఠతో తపస్సు చేసిన దాననైతే, నేను నిజమైన పతివ్రతనే అయితే, ఓ అగ్నిదేవుడా! నీవు హనుమంతుడిపట్ల చల్లబడాలి. సూర్యవంశ రాజుల్లో శ్రేష్టుడైన శ్రీరామచంద్రమూర్తికి నామీద దయవుంటే, నాకింకా కొంచెం భాగ్యం మిగిలే వుండి వుంటే, హనుమంతుడికి చల్లగా అయిపో! మనసున్న రామచంద్రమూర్తితో సాంగత్యం నేనెప్పుడూ కోరేదాన్నైతే, మంచి నడవడిగల దాన్నని

హనుమంతుడు నన్ను నమ్మితే, ఆయనకు శీతలుడవైపో. సుగ్రీవుడు త్వరగా ఇక్కడకు రావడం, నన్నీ శోకసముద్రం నుండి దాటించడం నిజమైతే, హనుమంతుడికి బాధలేకుండా చల్లగా అయిపో''.

ఇదొక అగ్ని పరీక్ష. సీతమ్మకేకాదు, రాముడికి కూడా! నేనే పతివ్రతనైతే, నాకు తపశ్శక్తి వుంటే, అదృష్టవంతురాలిని అయితే, తార వుత్తమరాలైతే, సుగ్రీవుడు సత్యవంతుడైతే, ఇవన్నీ నిజమైతే, అగ్ని తన సహజ స్వభావాన్ని ఉపసంహరించుకోవాలి. అంతేకాదు, చల్లబడిపోవాలి. అందరిపట్ల, అన్ని విషయాలలో కాదు. కేవలం హనుమంతుడిపట్ల మాత్రమే చల్లబడమంది ఆ తల్లి. అంటే, చక్కగా చల్లబడ్డాడు. ఆమె అన్న మాటలన్నీ సత్యమని నిరూపించేసాడు అగ్నిదేవుడు. రామాయణంలో ఇదొక అత్యంత ఆశ్చర్యకరమైన సన్నివేశం. మరొక రహస్యం కూడా వుందిక్కడ. శీతోభవ అని సీతమ్మ ఆజ్ఞాపిస్తే అగ్ని విధేయుడై చల్లబడ్డాడు హనుమంతుడి విషయంలో. మరి సీతమ్మ దగ్ధోభవ దశానన అని అగ్నిని ఆజ్ఞాపిస్తే రావణుడు బూడిద అయ్యేవాడు కద! అందువల్లనే ఆ తల్లి అన్నది, నాకు శ్రీరాముడి ఆజ్ఞ లేదు కనుక అలా శపించడం లేదని. రావణుడికి గుండె పగిలేంత దిగులు పట్టుకుంది దీనివల్ల. అంతేకాదు. ముందు కాలంలో సీతమ్మ అగ్నిప్రవేశం చేయవలసిన సమయంలో అగ్ని సీతమ్మను దహించజాలడన్న విషయం కూడా రుజువయింది.

హనుమంతుడి విషయంలో అగ్నిహోత్రుడు చల్లబడితే, ఆమె చెప్పినవన్నీ సత్యమేనన్న భావం పైమాటల్లో కలుగుతుంది. రామచంద్రమూర్తి బ్రహ్మాస్త్రం సంధించి, నిన్ను రూపుమాపుతానని సముద్రుడిని బెదిరించినా, తనస్వభావాన్ని విడువలేనని చెప్పగలిగాడు ఆ వేళ సముద్రుడు. కాని, హనుమంతుడికి చల్లదనం కలిగించమని సీతాదేవి మాట మాత్రంగా అడిగితే, అగ్ని చల్లబడింది. ఎంతటి మహాత్ములైన పురుషులకు కూడా సాధ్య పడనిది, పతివ్రతలైన స్త్రీలకు సాధ్య పడుతుందని దీనివలన తెలుస్తున్నది. సీత అగ్నిహోత్రుడిని ప్రార్థించిందేకాని, తనతపోబలంతో నువ్విట్లా కమ్మని శాసించలేదు. స్త్రీలకు రక్షాకార్యం స్వధర్మం. బిడ్డలను రక్షించడానికి, భర్తకున్న స్వాతంత్ర్యం భార్యకూ వుంది.

ఇలా ప్రార్థిస్తున్న సీతాదేవికి, హనుమంతుడికి అపాయం లేదన్న సూచనలు రాసాగాయి. కాలుతున్న తోకనుండి మండే గాలి రాకుండా, మంచులాంటి చల్లటి గాలి వీచింది ఆమెవైపు. అగ్ని తనను కాల్చకుండా చల్లబడిపోవడం చూసి హనుమంతుడు ఆశ్చర్యపోయాడు, కారణం తెలియక. అకస్మాత్తుగా అనిలుడు శీతలుడైనాడేమిటా! అని ఆయనకు ఆశ్చర్యం కలిగింది. సముద్రం దాటి వచ్చేటప్పుడు, ఎలాగైతే సముద్రుడు, మైనాకుడు శ్రీరాముడిపట్ల చూపిన ప్రీతిని, అగ్నిహోత్రుడు మాత్రం ఎందుకు చూపడనీ, ఇదంతా రామచంద్రమూర్తి మహిమేననీ, ఆయన పని చేస్తున్న తనకు ఆయనెందుకు అపాయం కలుగనిస్తాడనీ, భావిస్తాడు. పతివ్రతైన సీతాదేవి దయవలన, శ్రీరామానుగ్రహం వల్ల, వాయుదేవుడికి అగ్నిహోత్రుడు మిత్రుడైనందువల్ల తనపైన ప్రేమతో చల్లబడ్డాడనుకుంటాడు.

తోకమండుతుంటే హనుమంతుడు ఏంచేయాలన్న ఆలోచనలో పడ్డాడు. లంకలోని పౌరులకు బాధకలిగిస్తే, ఈ బాధ రావణుడి మూలాన్నే జరిగిందని, ప్రజలందరూ వాడిపట్ల విరోధం పెంచుకుంటారు కనుక, దానిమూలాన్న, వారిలో వారికి పడక, సీతాదేవిని రాముడికప్పగించమని చెప్పేవారు కొందరుండవచ్చని హనుమంతుడు భావిస్తాడు. అందుకే ఈ రాక్షసులకు కొంచెం బాధ కలిగించాలని

నిశ్చయించుకుంటాడు. "ఈ నగరాన్ని నాశనం చేస్తే, నేననుకున్న పనులన్నీ అయినట్లే. నేనుపడ్డ శ్రమకు ఫలితం లభించినట్లే! నాకుపకారం చేస్తున్న, అగ్నిహోత్రుడికి ప్రత్యుపకారంగా ఇక్కడున్న ఇళ్లన్నీ ఇవ్వడం న్యాయం'' అనుకుంటూ ఇళ్లమీద తిరగడం ప్రారంభించాడు. మెరుపులతో కూడిన మేఘంలా చలించక హనుమంతుడు లంకలోని, ఇల్లిల్లూ, తోటతోటా, మేడమేడా తిరిగి, సర్వం కాల్చేసే కార్యక్రమంలో మునిగిపోయి, ఆనందించసాగాడు.

తన తరఫున ధర్మ మార్గంలో రావణుడితో విభీషణుడి ఇల్లు తప్ప మిగిలిన వారి ఇళ్ళన్నీ కాల్చాడు. బలంగా గాలి వీస్తుంటే, విజృంభించిన హనుమంతుడు, ఇల్లిల్లూ తగులబెట్టడంలో నిమగ్నమైపోయాడు. లంకా నగరమంతా కాలిబూడిదైపోయి, నేలకూలుతున్న పెద్దపెద్ద మేడలతో నిండిపోయింది. రాక్షసుల ధ్వనితో ఆకాశం నిండిపోయింది. ఎన్నిళ్లుకాలినా, ఎంత తగులబడినా, భూమిమీద పీనుగులెన్ని పడ్డా, ఆయనకు తృప్తి కలగలేదు. హనుమంతుడు లంకా దహనం చేస్తుంటే, ఆ మంటలు పెరిగి త్రికూట పర్వతం వరకూ వ్యాపించాయి. రాక్షసులు లంకానగరాన్నీ చూసి దుఃఖపడ్తూ ఎవరీ వానరుడని ఆలోచనలో పడ్డారు. ఇది సామాన్యకోతి అనటానికి వీల్లేదు అనుకుంటారు. వనాన్నిపాడుచేసి, రాక్షసులను చంపి, మేడలు, మిద్దెలు నేలమట్టం చేసి, ఇంకా మండుతున్న తోకతోనే, సూర్యుడిలాగా వెలుగుతూ, హనుమంతుడు త్రికూటపర్వతాన్ని చేరుకుని, శ్రీరాముడిని చూడటానికి పోదామనుకుంటాడు. ఈ తతంగమంతా జరిగాక హనుమంతుడు, మండుతున్న అగ్నిని, తోకను, సముద్రంలో ముంచి చల్లారుస్తాడు.

పట్టణమంతా కాలి వుండడం గమనించి, ఎంత పాడు పనిచేసాను! అని విచారించసాగాడు. లంకంతా కాల్చివేసి, ఆలోచనలేకుండా తానెంతో చేయరానిపని చేశానే అని బాధపట్తాడు. ఆలోచనలేక సీతాదేవిని కూడా కాల్చి స్వామిద్రోహం చేసినవాడినైనాననీ, బాధపడ్తాడు హనుమంతుడు. లంకంతా కాలి బూడిదయితే, ఆమంటల్లో సీత కూడా తగులుకుని నశించి వుండాలికనుక, తాను చేసిన పని తానే పాడుచేసాననీ, తెలివిలేక జానకి వున్నదన్న ఆలోచనలేక క్రూరమైన పనిచేసి రామకార్యం పాడుచేసాననీ, కుమిలిపోతాడు హనుమంతుడు. ఇలా ఆలోచిస్తున్న హనుమంతుడికి, దేహంలో శుభశకునాలు కనిపించసాగాయి. కుడికన్ను, కుడిభుజం అదరడం, హృదయం ప్రసన్నం కావడంతో, వేరేవిధంగా ఆలోచిస్తాడిలా:

"సీతాదేవిని అగ్నిదహించడమా? నా తెలివి తెల్లారే ఆలోచనకదా ఇది! సీత రాక్షసస్త్రీలాంటిది కాదుకదా! అగ్నిని అగ్ని ఎలా దహిస్తుంది? నాదేహాన్నే కాల్చే సమర్ధత లేనివాడు అగ్నిహోత్రుడు. అలాంటిది సీతాదేవిని కాల్చేశక్తి అగ్నిహోత్రుడికి వుందా? రామచంద్రమూర్తి దాసుడనైన నేను, ఆయన కార్యంపైన లంకాదహనం చేస్తుంటే, నా తోక కొనవెంట్రుకలనైనా కాల్చనివాడు, అలాంటి మహానుభావురాలిని తాకగలడా?" సీతా మహాత్మ్యం గురించి ఆలోచించసాగాడు అదేపనిగా. సరీగ్గా అదేసమయంలో, ఆకాశంలో తిరుగుతున్న ఋషులు, చారణులు, మునులనుకుంటున్న మాటలు హనుమంతుడి చెవుల్లో అమృతం పోసినట్లు వినిపించాయి. వారిలా అనుకుంటున్నారు: "ఆశ్చర్యం– ఆశ్చర్యం! హనుమంతుడివల్ల అగ్నిదేవుడు, తోరణాలతో, ప్రాకారాలతో, బురుజులతోసహా

లంకానగరాన్నంతా దహించి వేసాడు. మంటల్లో యావత్తూ మసి అయిపోయినా అశోకవనంలో సీత చెక్కు చెదర లేదే! ఎంత ఆశ్చర్యం? ఆమెను అగ్ని సమీపించనేలేదు'' అన్న మాటలను వింటాడు హనుమంతుడు.

శుభశకునాలు కలగడంతో, సీతాదేవి మహాత్మ్యం ప్రత్యక్షంగా చూసినవాడు కావడంతో, ఋషుల మాటలవల్ల సీతాదేవి క్షేమంగా వున్నదని తెలుసుకున్న హనుమంతుడు సంతోషిస్తాడు. అయినా ఆ మహాపతివ్రతను మరొక్కసారి కళ్లారా చూసి, స్వయంగా దర్శించుకుని, క్షేమసమాచారం తెలుసుకుందామనుకుంటాడు. ఆ తర్వాత ప్రయాణమైతే, చేయాల్సిన పని నిర్విఘ్నంగా, సంపూర్ణంగా నెరవేర్చినట్లవుతుందని తలుస్తాడు హనుమంతుడు. ఇలా తలచిన హనుమంతుడు, సీతాదేవి వుండే ప్రదేశానికి పోయి, శింశుపావృక్షం కిందున్న ఆమెకు నమస్కరించి, తను చేసిన పూర్వ పుణ్యఫలంవల్ల, క్షేమంగా వున్న సీతను మళ్లా దర్శించే భాగ్యం తనకు కలిగిందని చెప్తూ, తన ప్రభుకార్యం ఏదెట్లా చేయాలో, ఎట్లా జరగాలో అవన్నీ అలానే చేయడం జరిగిందని అంటాడు.

ఇలాచెప్పి బయల్దేరబోతున్న హనుమంతుడితో, తనభర్తపై తనకున్న ప్రేమను తెలిపే వాక్యాలను మరోసారి చెప్పింది సీతాదేవి ఆయనతో. సీతచెప్పిన ఆ మాటలకు సరైన రీతిలో స్పందిస్తాడు ఆంజనేయుడు. రామచంద్రమూర్తి వానర సైన్యంతో సముద్రాన్ని దాటివచ్చి, రాక్షసుల పొగరణచి, ఆమె శోకాన్ని నిర్మూలిస్తాడనీ, తనమాటలు నమ్మమనీ, దిగులుపడవద్దనీ సీతకు ఓదార్పు వచనాలు చెప్తాడు హనుమంతుడు. సాహసంచేసి, అపాయం కలిగే ఎటువంటి పనీ చేయవద్దని సీతకు చెప్పి, తానిప్పుడే రామచంద్రమూర్తిని చూడబోతున్నానని, ఆమె అనుజ్ఞ కోరుతూ ఆమెకు నమస్కరిస్తాడు.

సీత అనుమతి తీసుకుని, ఆమెకు అభివాదం చేసి, ఆశీర్వాదాన్ని పొందిన హనుమంతుడు, రాముడి దర్శనం త్వరలో చేసుకోవాలన్న కోరికతో అరిష్టమనే పేరున్న కొండనెక్కాడు. సముద్రపు ఉత్తరగట్టు చేరేందుకు, ఆ పర్వతం మీదనుండి సన్నద్ధుడవుతున్న హనుమంతుడి కాళ్లతొక్కిడికి, అక్కడున్న అడవిజంతువులు తత్తరలాడాయి. కొండగుహల్లో వున్న సింహాలన్నీ బెదిరిపోయి దిక్కులు పిక్కటిల్లేటట్లు ధ్వని చేసాయి. హనుమంతుడు సముద్రాన్ని దాటేందుకు, ఆకాశానికి లంఘించి ఎగరగానే, అక్కడున్న విషం జ్వలించే సర్పాలు సందుల్లోకి దొర్లిపోయాయి. కిన్నరులు, పన్నగులు, యక్షులు, కింపురుషులు ఆ పర్వతాన్ని వదిలి ఆకాశానికి ఎగిరారు. పదియోజనాల వెడల్పు, ముప్పై యోజనాల ఎత్తున్న ఆ పర్వతం నిమిషంలో నేల మట్టమైంది.

ఆకాశ మార్గంలో పోతున్న హనుమంతుడు, సముద్రంలో పోతున్న నావలా వున్నాడు. మబ్బుల్లో దోబూచులాడుకుంటూ పోతున్నాడు. హనుమంతుడు, మేఘాలమధ్య చుట్టుకున్నప్పుడు ఆకాశంలోని చంద్రుడిలా, మేఘాలను చీలుస్తున్నప్పుడు ఆకాశంలో వెళ్తున్న గరుత్మంతుడిలా కనిపించాడు.

◆❖◆

మధువనాన్ని పాడుచేయడం దేనికి సంకేతం?

ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్రానికి కావాలనే పట్టుబడి, రావణుడి దగ్గరకు రాక్షసులతో తీసుకునిపోబడి, రావణుడిని చూసి వాడికి నీతులు బోధించి, వాడి కోపానికి గురై, వాడి ఆజ్ఞానుసారం రాక్షసులు హనుమంతుడి తోకకు నిప్పంటించిన తదనంతరం, లంకా దహనం చేసిన హనుమంతుడు, సీతను చూసి ఆమె అనుమతి తీసుకుని, ఆమెకు అభివాదం చేసి, ఆశీర్వాదాన్ని పొంది, రాముడి దర్శనం త్వరలో చేసుకోవాలన్న కోరికతో సముద్రాన్ని దాటి, మేఘంలా వున్న మహేంద్ర పర్వతాన్ని చూసి, సింహనాదం చేశాడు. హనుమంతుడి సింహనాదం, ఆవలి ఒడ్డున వుండి, దిగులుపడుతూ, ఎప్పుడు హనుమంతుడిని చూస్తామా అని ఎదురుచూస్తున్న కోతులు విని సంతోషించారు. హనుమంతుడు పోయిన పనిని చేసుకొస్తున్నాడని అంటాడు జాంబవంతుడు వానరులతో.

వానరులంతా హనుమంతుడు వస్తున్నాడని సంతోషిస్తూ, స్నేహితుడిని చూడాలన్న ఆత్రంతో, ఆయన ధ్వనిని వింటూ గంతులేసారు. వస్తున్న హనుమంతుడిని దూరాన్నుండే చూడాలన్న కోరికతో, ఒక శిఖరాన్నుండి అంతకంటే ఎత్తైన మరో శిఖరానికీ, ఒక చెట్టునుండి అంతకంటే ఎత్తైన ఇంకో చెట్టుమీదకూ, కొమ్మనుండి కొమ్మపైకీ, కిలకిలా అరుచుకుంటూ దూకసాగారు. తాము ఫలానా చోటున్నామని ఇతరులకు తెలపటానికి, పూచిన కొమ్మలను, చేతుల్లోని గుడ్డలను వూపుతూ ఆనందించసాగారు వారంతా. ఇంతలో సింహనాదం చేస్తూ హనుమంతుడొచ్చాడు. మేఘంలా వస్తున్న హనుమంతుడిని చూస్తూ, ఆకాశంవైపు చేతులు జోడించి నిల్చున్నారు వానరులందరూ. హనుమంతుడిని చూసి, ఆయన దగ్గరకు చేరారు మిత్రులందరూ. జ్ఞానవృద్ధుడు, వయోవృద్ధుడైన జాంబవంతుడికీ, యువరాజైన అంగదుడికీ, తనకంటే వయసులో పెద్దవారికీ, భక్తితో నమస్కరించాడు హనుమంతుడు.

ఏం చెప్తాడో విందామని తహతహలాడుతున్న వానరుల మనస్సు కుదుట పడేటట్లు రెండే-రెండు మాటలు చెప్తాడు ఆరంభంలో: ''చూచితి-సీత''నని. ఆ తర్వాత అంగదుడి చేయిపట్టుకుని, మహేంద్ర పర్వతం మీద, అందరూ కూర్చునే వీలున్న రమ్యమైన ప్రదేశానికి తీసుకుపోతాడు. అప్పుడందరూ

వింటూ వుండగా: ''దయాహీనులైన రాక్షసస్త్రీల రక్షణలో వున్న సీతను చూసాను. అశోకవనంలో, భర్తను చూడాలన్న కోరికతో, ఆ పతివ్రత మాసిపోయిన వెంట్రుకలతో, ఆహారంలేక శుష్కించింది'' అనగానే అమృత సమానమైన ఆమాటలకు పోయిన ప్రాణాలు తిరిగొచ్చినట్లు సంతోషంతో, మిగిలినదంతా వినే ఓపికలేక ఎగురసాగారు కొందరు. మరి కొందరురు గెంతులేశారు. ఇంకొందరు కిలకిలా అరుచుకుంటూ, తోకలను నేలకేసికొట్టారు. హనుమంతుడిని కౌగలించుకుని, "తండ్రీ బ్రతికించావు'' అని అరిచారు. కోతుల మధ్యనున్న అంగదుడు హనుమంతుడితో, ఆయన ఎలా పోయాడో, ఏం చేసాడో, ఎట్లా చూసాడో, అదంతా వివరంగా చెప్పాలని అడిగాడు. సముద్రాన్నెట్లా దాటింది, లంకలోకెట్లా ప్రవేశించింది, సీతనెట్లా చూసింది, రావణుడెట్లా కనిపించింది, అదంతా వివరంగా చెప్పమని అడుగుతాడు.

సీతాన్వేషణకు లంకకు పోయివచ్చిన విధమంతా క్షుణ్ణంగా కపులకు వివరించిన హనుమంతుడు, తన వానర మిత్రులతో ఇలా అంటాడు: "శ్రీరామచంద్రమూర్తి అనుగ్రహంచేత, మీ అందరి ప్రోత్సాహం వల్ల, నా వంతుగా మీరు నాకు అప్పగించినపని, లంకకు వెళ్లి సీతను చూసి రావడం పూర్తయింది. ఇక తక్కినకార్యం మీవంతు. రావణుడు అల్పుడనీ, సులభ సాధ్యుడనీ, భావించవద్దు. వాడి తపోబలంతో, లోకాలను నిల బెట్టగలడు. సంహరించనూ గల సమర్థుడు. జానకిని తగిలినా వాడింకా దగ్ధమై పోలేదంటే, అది వాడి తపోబలమే! వాడి తపోమహిమ సీతాదేవి పాతివ్రత్యం కంటే గొప్పదనడంలో అర్థం, వాడిని రాముడు, సుగ్రీవుడు ఏమీ చేయలేరని కాదు. రావణుడు దగ్ధమైపోకుండా వున్నాడంటే అది వాడి తపోబలంవల్ల కాదు. వాడు ఆమెను తాకినప్పుడు ఆమె కోప్పడలేదు. ఆమె నిజంగా కోపమే తెచ్చుకుంటే, ఆ కోపాగ్ని, నిజమైన అగ్నిహోత్రుడి అగ్నికంటే తీవ్రమయిందవుతుంది. సీత తనంతట తానుగా రావణుడిని నాశనం చేయ సంకల్పించలేదు కనుకనే వాడింకా జీవించి వున్నాడు''.

"లంకలో జరిగిందంతా చెప్పాను. ఇక జరగాల్సింది మీరు ఆలోచించండి. సీతాదేవిని తీసుకొచ్చి, రామచంద్రమూర్తి దగ్గరకు పోతే మంచిదని నా అభిప్రాయం. జాంబవంతుడితో సహా మీరంగీకరిస్తే అలానే చేద్దాం. ఆమె అక్కడ ఏడుస్తూ వుండడం, ఆ వార్త చెప్పగానే రామచంద్రమూర్తి దుఃఖపడడం, ఈ సన్నివేశం మనం కళ్లప్పగించి చూడడం నాకు నచ్చలేదు. రావణుడిని, వాడి బలగాన్నీ, నేనొక్కడినే చంపగలను. మీరుగూడా నావెంట వుంటే చెప్పాల్సిన పనేలేదు. కార్యం సులభమైపోతుంది. మనం రావణుడిని చంపి సీతను తెస్తే, రాముడికేమీ అపకీర్తి రాదు. మనం ఆయన సేవకులం. సేవకులు చేయాల్సినపనికూడా ప్రభువే చేయాలా? సేవకులకు సాధ్యపడకపోతేనే ప్రభువు చేయాలి. అన్నీ ప్రభువే చేసుకుంటే సేవకులతో పనేమిటి? నేనొక్కడినే నిర్భయంగా లంకా నగరమంతా తిరిగి బూడిదయ్యేంతవరకూ కాల్చాను. రామచంద్రుడి పేరు, సుగ్రీవుడి పేరు, లక్ష్మణుడి పేరు, మహా పరాక్రమవంతులైన మీ అందరి పేర్లూ, అన్నిచోట్లా అదేపనిగా చెప్పాను. నేను రామచంద్రమూర్తి దాసుడననీ, పేరు హనుమంతుడనీ, వాయుపుత్రుడననీ, అందరూ వినేటట్లు చెప్పాను. రహస్యంగా ఏపనీ చేయలేదక్కడ''.

"మా ఇద్దరిమధ్య జరిగిన సంభాషణలోని అన్నివిషయాలనూ, ఆమె అడిగినవన్నీ తెలియచేసాను.

సీతాదేవి మహాత్మ్యం చేత, ఆమె అసమానమైన పాతివ్రత్యంచేత, తమోగుణంకల రావణుడు ఇంతవరకూ దుర్మరణం పాలుకాలేదంటే వాడుగొప్పవాడనే అనాలి. అయితే భర్త చేతులతోటే రావణుడిని చంపించి, ఆ కీర్తి ఆయనకు దక్కేలాచేసి వీరపత్నినిపించుకోవాలన్న ఆమె వ్రతమే ఆ రావణుడినింతవరకూ కాపాడింది. వాడందుకే ఇంకా శాపగ్రస్తుడు కాలేదు. వీటన్నిటికీ ప్రతిక్రియగా ఏది న్యాయమని తోస్తే అదేచేద్దాం. ఆలోచించండి'' అని హనుమంతుడనగా, అంగదుడు తన అభిప్రాయం చెప్పసాగాడు.

హనుమంతుడు, సీతను చూసివచ్చాడే కాని, పిలుచుకుని రాలేదనడం బాగుంటుందేమో ఆలోచించమని అంటాడు అంగదుడు. ఇట్టివాడు ఉత్త చేతులతో రాముడి వద్దకు పోతే మంచిదికాదేమో నని తన అభిప్రాయమంటాడు అంగదుడు. అంగదుడి ఆలోచన బాగున్నప్పటికీ, రామచంద్రమూర్తి అభిప్రాయం తెలుసుకుని, ఆయన చెప్పినట్లు చేస్తే బాగుంటుందని జాంబవంతుడు సలహా ఇస్తాడు.

జాంబవంతుడి సలహా బాగున్నదని అంగదుడు, హనుమంతుడు, తక్కినవారందరూ అంగీకరించి, హనుమంతుడు ముందుండగా మహేంద్ర పర్వతాన్ని విడిచి బయల్దేరారు. రామచంద్రమూర్తికి ఎప్పుడు సహాయం చేద్దామా అన్న కోరికతో, ఆకాశ మార్గాన పోతున్న వారికంటికి అందమైన మధువనం కనిపించింది. మధువనం పటిష్టమైన కాపలాలో భద్రంగా కాపాడబడుతున్నది. సుగ్రీవుడి మేనమామ ''దధిముఖుడు'' దాంట్లోనే కాపురముంటూ, కాపలావారికి నాయకుడిగా వున్నాడు. ఆ వనాన్ని చూస్తూనే వానరులంతా, అక్కడున్న తేనె తాగాలన్న కోరికతో యువరాజైన అంగదుడి అంగీకారమడిగారు. జాంబవంతుడు, ఇతర వానర ప్రముఖులు, సరేననడంతో వారందులోకి దూరారు.

లోపలికి పొమ్మని అంగదుడు అనుమతి ఇవ్వగానే, వానరులందరూ నాట్యం చేస్తూ, సంతోషంతో గెంతులేస్తూ, వళ్లు తెలియకుండా ఆటలాడుతూ, పాటలు పాడుతూ, మీసాలు తిప్పుకుంటూ, వేడుకలాడుకుంటూ, ఊగుతూ, తూలుతూ, మధు వనంలోకి దూరారు. యధేచ్ఛగా తిరుగుతూ, తృప్తితీరా తేనెతాగారు. దానితో బాగా మత్తెక్కింది వానరులందరికీ. వనాన్నంతా కలియబెట్టి, చెట్లకున్న పళ్ళన్నీ నేలరాలకొట్టి, చిందరవందర చేసారా మధువనాన్ని. దధిముఖుడు బలవంతంగానన్నా వాళ్లను నివారించి వనాన్ని రక్షించాలనుకున్నాడు. సైన్యం వెంటరాగా, కోపంతో వీళ్లను అడ్డుకునే ప్రయత్నం చేస్తే, వానరులు వాళ్లను మోకాళ్లతో కుమ్మారు, పిడికిళ్లతో గుద్దారు, కొట్టారు, ముద్దిచూపించారు. ఇది చూసి అక్కడికి వచ్చిన అంగదుడు, తనకు వరుసకు తాతైనప్పటికీ, గౌరవించాల్సిన వాడైనప్పటికీ, తేనెతాగిన మత్తులో, దధిముఖుడిపైన పడి గుద్దులుగుద్ది వదిలిపెట్టాడు.

అంగదుడే ముందుండి మధువనాన్ని పాడుచేసాడని సుగ్రీవుడికి చెప్పాలనుకుంటాడు దధిముఖుడు. అలాచెప్తే సుగ్రీవుడు వీళ్లను తప్పక దండిస్తాడని భావిస్తాడు. తనవెంట ఇతర వనపాలకులు వస్తుంటే, నిమిషంలో సుగ్రీవుడి దగ్గరకు అకాశ మార్గాన వెళ్లాడు దధిముఖుడు. అక్కడున్న రామలక్ష్మణ సుగ్రీవులను చూసి, ఏడ్చుకుంటూ అల్లుడైన సుగ్రీవుడికి నమస్కరిస్తాడు.

మధువనంవైపు ఎన్నడూ రాని వానరులు, ఇప్పుడు దక్షిణ దిక్కునుండి తిరిగి వస్తూ ఆ వనాన్ని పాడుచేసారని పిర్యాదు చేసాడు. వారక్కడ తేనెతాగారనీ, పండ్లన్నీ తిన్నారనీ, తాగగా మిగిలిన తేనెను పారపోసారనీ, ఇదేమిటని అడ్డంపోయిన కావలివారిని వెక్కిరించి కొట్టారనీ, చెప్పాడు. వనపాలకులు

వెళ్లి బలవంతంగా వానరులను వెళ్లగొట్టే ప్రయత్నం చేస్తే, వాళ్లు కోపంతో పిడికిళ్లతో గుద్దారనీ, కాళ్లతో కుమ్మారనీ, ముడ్లు చూపారనీ, సుగ్రీవుడు రాజన్న సంగతికూడా మరిచిపోయి ప్రవర్తించారనీ, అన్నాడు.

జరిగిన సంగతినీ, దధిముఖుడి పిర్యాదునీ, అక్కడే వున్న లక్ష్మణుడికి వివరిస్తాడు సుగ్రీవుడు. దక్షిణ దిక్కుగా పోయిన వానరసేనకు, ఆలోచన చెప్పేవాడు జాంబవంతుడైనప్పుడు, హనుమంతుడు రక్షకుడైనప్పుడు, ప్రభువేమో అసమానబలుడైన అంగదుడే అయినప్పుడు, వారికప్పచెప్పిన పని సఫలమయిమడనడంలో ఆశ్చర్యం లేదనుకుంటాడు. ఆ విషయమే చెప్పాడు లక్ష్మణుడితో సుగ్రీవుడు. వానరులు సీతాదేవిని చూడకపోయినట్లైతే, బ్రహ్మదత్తమైన మధువనాన్ని కళ్లతో చూసే ధైర్యమైనా వుంటుందా? ఈ మాటలు విన్న రామలక్ష్మణులు సంతోషంతో గగుర్పాటుపడ్డారు.

రామలక్ష్మణులకు ఇలా చెప్పిన సుగ్రీవుడు, దధిముఖుడితో వానరులు మధువనంలో స్వేచ్ఛావిహారం చేసారంటే, వారుమంచి కార్యం సాధించి వుంటారనీ, కాబట్టి వాళ్లను క్షమించాలనీ, క్షమించాననీ అంటాడు. హనుమంతుడు, ఇతరులు ప్రవర్తించిన విధం, సీతాదేవిని చూసేందుకు వారుచేసిన ప్రయత్నం, రామలక్ష్మణుల సన్నిధిలోనే తాను వినదల్చుకున్నానని వానరులందరికీ చెప్పి, వాళ్లను త్వరగా రమ్మని కబురుచేస్తాడు సుగ్రీవుడు. రామలక్ష్మణులను చూసి, సీతాన్వేషణ కార్యం సఫలమయిందికదా అని ఆనందించాడు సుగ్రీవుడు.

దధిముఖుడు, పరిచారకులతో ఆకశానికెగిరి, మధువనానికి వెళ్లిపోయాడు. అంగదుడిని గమనించి, అతడి వద్దకువెళ్లి, చేతులు జోడించి నమస్కరించాడు దధిముఖుడు. తాను చేసిన అపరాధాన్ని మన్నించమని వేడుకుంటాడు. అజ్ఞానంతో చేసిన తప్పులు క్షమించమని, వాళ్లు ఈ వనంలోకి వచ్చిన వార్తను పిన తండ్రి సుగ్రీవుడికి తెలిపి వచ్చాననీ అంటాడు. ఆయన సంతోషించి, వాళ్లను త్వరగా రమ్మని కబురంపాడని కూడా చెప్పాడు దధిముఖుడు.

దధిముఖుడు చెప్పిన మాటలు విన్న అంగదుడు వానరులతో, ఈ విషయాలన్నీ రామలక్ష్మణులకు కూడా తెలిసే వుంటాయనీ, ఎట్లాగూ తేనెతాగి అలసట తీర్చుకున్నాం కనుక, ఇక్కడ చేయాల్సిన పనికూడా ఏమీలేదుకనుక, పిన తండ్రిని చూట్టానికి పోదామా అని అడుగుతాడు. అంగదుడు చెప్పినట్లే చేస్తామనీ, సుగ్రీవుడిని చూడటానికి పోదామనీ వానరులందరూ అంటారు. వానరులు ఆకాశమార్గాన, వేగంగా పోయి సుగ్రీవుడుండే ప్రదేశానికి చేరుకున్నారు.

◆❖◆

నియత, ప్రాణయుక్త, దేవి అంటే ఏమిటి?

సీతాన్వేషణకు కపులను నలుదిక్కులకు పంపగా, దక్షిణ దిక్కుకు పోయిన హనుమంతుడి బృందం తప్ప, మిగిలినవారంతా తిరిగి వచ్చిన తరువాత, ఇంకా సీతాదేవి వార్త తెలియరానందున, రామచంద్రమూర్తి సంతాప పడుతుంటాడు కిష్కింధ సమీపంలో. సంతాపపడుతున్న శ్రీరామచంద్రుడిని చూసిన సుగ్రీవుడు, ఆయనతో, ఓదార్పు మాటలతోనూ, ధైర్యవచనాలతోనూ, మాట్లాడాడు. వానరులు నిస్సందేహంగా సీతను చూసొచ్చారనీ, గడువుదాటి కార్యం సాధించకుండా, తన ఎదుటకు వచ్చే ధైర్యం వాళ్లకు లేదనీ, కార్యసాధకులు కాకపోతే, తాతతండ్రులు రక్షించుకుంటూ వస్తున్న ఉద్యానవనంలోకి ప్రవేశించడానికి ఎన్ని గుండెలుండాలనీ, సీతాదేవి వార్త తెలిసి వుండాలనీ, ఈకార్యం సాధించగలవాడు హనుమంతుడొక్కడేననీ, ఇతరులకిది దుస్సాధ్యం అనీ, అంటాడు సుగ్రీవుడు.

ఇలా రామసుగ్రీవులు మాట్లాడుకుంటున్నప్పుడు, సింహనాదాలు చేసుకుంటూ అంగదుడినీ, ఆంజనేయుడినీ, మనస్సులో తలచుకుంటూ, వానరులు సుగ్రీవుడి దగ్గరగా దిగారు. శ్రీరామచంద్రమూర్తితో హనుమంతుడప్పుడు సీతను గురించి సర్వస్వం తెలియ చెప్పే విధంగా, మూడే–మూడు మాటలంటాడు. ''నియత, ప్రాణయుక్త, దేవి'' అన్న ఆ మూడు మాటలు వింటూనే, సుగ్రీవుడు రామకార్యం ఫలించిందనీ, తన మాట చెల్లించు కున్నాననీ సంతోషించాడు. శ్రీరామలక్ష్మణులు ప్రీతిగా, ప్రియమైన మాటలు చెప్పిన హనుమంతుడిని ప్రేమగా అలాగే చాలాసేపు చూస్తుండిపోయారు.

"నియత'' అంటే పాతివ్రత్య నియమం కలదనీ, "ప్రాణయుక్త'' అంటే జీవించి వున్నదనీ, "దేవి'' అంటే సీతాదేవి అనీ ఆ మూడు మాటలకర్థం. సీతాదేవి ప్రాణాలతో బ్రతికున్నా, శీలం చెడిందయితే చచ్చినదానితో సమానమైంది కనుక, "శీలం'' కలదని "నియత" అని మొదలంటాడు. శీలం కలిగిన విషయం నిజమే! చనిపోతే శీలం వున్నా లాభం ఏమిటి? కాబట్టి జీవించే వున్నదని "ప్రాణయుక్త" అంటాడు. ''దేవి'' శబ్దం తనకు సీతాదేవి మీదున్న భక్తి, గౌరవం చెప్పటానికే! దేవుడి భార్య దేవి. దేవీ శబ్దం లక్ష్మి పర్యాయపదంగా అష్టోత్తర శతనామావళిలో చెప్పబడింది. రామ, దేవ శబ్దాలు సమానర్థం

కలిగున్నవే! తనకామె సాక్షాత్తూ ''లక్ష్మీదేవి'' లాగా కనపడిందన్న భావన.

వానరులందరూ, రామలక్ష్మణసుగ్రీవుల దగ్గరకు పోయి, నమస్కరించి, సీతాదేవి రావణాసురుడి ఇంట్లో వున్న సంగతి, రాక్షసస్త్రీలు ఆమెను బెదిరిస్తున్న విషయం, రావణుడు పెట్టిన గడువు వ్యవహారం, సీతాదేవి పతిభక్తి గురించీ, వివరంగా చెప్పారు. సీతాదేవి క్షేమసమాచారం విన్న శ్రీరాముడు, ఆమె ఎక్కడుంది, ఏంచేస్తున్నది, తన విషయంలో ఏ నియమంతో వుంది, వివరించమని వానరులను అడిగాడు. చూసి వచ్చిన హనుమంతుడినే, ఈ విషయాలన్నీ చెప్పమని మిగిలిన వానరులంటారు. హనుమంతుడప్పుడు, సీతాదేవి వుండే దిక్కుకు తిరిగి, సీతాదేవికి వినయంగా నమస్కరించి, శ్రీరామచంద్రమూర్తితో చెప్పడం మొదలెట్టాడు.

"నూరుయోజనాల సముద్రాన్ని దాటి, సీతను చూసే కోరికతో పోయాను. అక్కడ దేవతల విరోధి రావణాసురుడుండే లంకనే పట్టణముంది. ఆ రాక్షసరాజు ఇంట్లో, ఏకోరికల్లేక, నిన్ను చూద్దామన్న ఒకే ఒక్క కోరికతో, ఊపిరి బిగబట్టుకుని వున్న సీతను చూశాను. దుఃఖమంటే ఏమిటో తెలియక, సుఖపడాల్సిన సీత, చెప్పనలవికాని శోకంతో అశోకవనంలో వుంది. రావణుడి అంతఃపురంలోని చెరలో చిక్కుకున్న సీతాదేవికి కాపలాగా రాక్షసస్త్రీల గుంపులున్నాయి. సర్వకాల సర్వావస్థలందు సీత నిన్ను ధ్యానించడంలోనే నిమగ్నమయింది. దేహం కాంతిచెడి, ప్రాణాలు విడుద్దామని ఆలోచిస్తున్న సీతాదేవిని అదేసమయంలో అతికష్టం మీద చూశాను. నా రాకను ఆమెకు తెలియచేసే వుద్దేశంతో, ఇక్ష్వాకు రాజుకీర్తిని ఆమెను నమ్మించేందుకు, ఆమె వినేటట్లు స్మరించాను''.

"మహామహిమగల సీతాదేవి నిన్నే మిగుల నిర్మల స్వభావంతో, మనస్సులోనే స్మరిస్తున్నది. సత్పురుషులను ప్రశంసించే భక్తి, స్వభావం, పాతివ్రత్యం, తపస్సు, ఉపవాసం వదలకుండా, అశోకవనంలో వుంది. ఇది వీరెవ్వరూ నాతో చెప్పిందికాదు. స్వయంగా నాకళ్లతో నేనే చూసాను'' అంటూ, తనూ, సీతాదేవీ మాట్లాడామనటానికి గుర్తుగా చిత్రకూట పర్వతంపైన జరిగిన కాకాసుర వృత్తాంతాన్ని చెప్పాడు. చెప్పి," అక్కడ చూసిన సర్వస్వం చెప్పమన్నది సీతాదేవి. చెప్పాను. నెలరోజులెట్లాగో ప్రాణాలు నిలబెట్టుకుంటానన్నది. ఎంత శుష్కించి పోయినా, పతివ్రతా ధర్మాన్ని మాత్రం విడువకుండా, రావణుడింట్లో నిర్బంధంగా జీవిస్తున్నది. ఉన్నదున్నట్లు సర్వం నీకుతెలిపాను. నీవెట్లైనా సముద్రాన్ని దాటే ప్రయత్నం చేయి'' అంటాడు. చెప్పదల్చుకున్నది చెప్పిన తర్వాత, అక్కడున్న వారందరూ నమ్మేటట్లు, సీతాదేవి ఇచ్చిన చూడామణి దివ్య రత్నాన్ని తీసి శ్రీరాముడికి సమర్పించాడు హనుమంతుడు.

సీతను తలచుకుని, ఆమెను కౌగలించుకున్న రీతిలో, చూడామణిని రొమ్మునకు హత్తుకుని, సీతను తలచుకుంటూ, దుఃఖం పొంగిపొర్లి వస్తుంటే, లక్ష్మణ, సుగ్రీవులతో ఇలా అంటాడు శ్రీరాముడు: "సుగ్రీవా! ఈ చూడామణిని చూడగానే, నామనస్సు ఎక్కడికో పోయింది. దీన్ని మామామగారు, సీతాదేవికి వివాహ సమయంలో ఆమె శిరస్సు అలంకరించాడు. దివ్యమై, సత్పురుష పూజితమై, జలంలో పుట్టిన ఈ చూడామణిని, యజ్ఞం చేస్తున్న మా మామగారికి, ఆయన మీద దయతో, సంతోషంతో ఇంద్రుడు ఇచ్చాడు ఆయనకు. దీనిని చూస్తుంటే, మామామ జనకరాజునూ, తండ్రినీ చూసినట్లు

అయింది. సీతాదేవి శిరస్సులో ప్రకాశించే దీనిని చూడగానే సీతాదేవే వచ్చినట్లుగా అనిపిస్తున్నది. నన్ను విడిచి సీత ఇంకొక నెల రోజులు జీవించి వుంటే, ఆమెకు మరణమేలేదు. ఎన్నిరోజులైనా బ్రతికుంటుంది. నేను బ్రతికుండాలంటే నన్నామెదగ్గరకు తీసుకొనిపొండి. సీత ఇలా వుందని వినికూడా, ప్రాణాలతో వుండడం నా వశం కాదు".

శ్రీరాముడికోరిక ప్రకారం హనుమంతుడు సీతాదేవి చెప్పిన మాటలన్నీ వినిపించాడు. గుర్తుగా చిత్రకూట పర్వతం మీద జరిగిన కాకాసుర వృత్తాంతాన్నీ చెప్పాడు. సీతాదేవిని చూసి, ఓదార్పు మాటలతో నేను, సీతకు కష్టకాలం పోయిందనీ, దుఃఖం అంతరిస్తుందనీ, లంకనెప్పుడు భస్మం చేయాల్నా అని రామలక్ష్మణులిద్దరూ ఎదురు చూస్తున్నారనీ, చెప్పానంటాడు హనుమంతుడు. సీతకు ద్రోహం చేసిన, రావణుడిని బంధువులతో సహా చంపి శీఘ్రంగా అయోధ్యకు రామచంద్రుడు తీసుకుపోయే సమయం వచ్చిందని కూడా చెప్పానంటాడు.

ఆమెకు ఓదార్పుమాటలతో చెప్పిన విషయాలను రాముడికి విన్నవించిన తర్వాత జరిగిన సంభాషణను కూడ చెప్పాడు. అమ్మా! రాజపుత్రీ! రామచంద్రమూర్తి జ్ఞాపకం వుంచుకునే గుర్తు ఏదైనా ఇవ్వు, అంతమాత్రం చేస్తే చాలు అని తను చెప్పగానే, దగ్గరలో వున్న రాక్షసస్త్రీలెవరూ చూడకుండా, నలుదిక్కులా కలియ చూసి, రావణుడికి తెలియకుండా వుండాలనే వుద్దేశ్యంతో, తలలో ధరించాల్సిన చూడామణిని, చీరె కొంగు ముడిలోనుండి తీసి, తనపై వున్న ప్రేమతో, తన చేతుల్లో వుంచిందంటాడు. అది తీసుకుని ఆమెతో బయల్దేరుతానని చెప్పానన్నాడు. తనపైన శ్రీరాముడికి కల స్నేహ భావం వల్లా, రాముడి దూతనైనందువల్లా, తృప్తిలేని అనురాగంతో, నమ్మకంతో, తనతో సీతాదేవి సంభాషించిందనీ, ఆ వివరాలూ ఆమె మాటల్లో చెప్పాడు.

''నువ్వెట్లాగూ సముద్రాన్నిదాటిపోతావు. రాముడికి నాసంగతులన్నీచెప్తావు. ఆ అన్నదమ్ములిద్దరూ, వానరసేనతో సముద్రతీరానికి వస్తారు. ఆ తర్వాత ఏం జరుగుతుందనేదే ప్రశ్న. ఎలుగుబంట్లు, వానరులు, రాజకుమారులు, అలవికాని ఆ సముద్రాన్ని ఎట్లా దాటుతారయ్యా? ఈ భూప్రపంచంలో, నువ్వూ, గరుత్మంతుడు, వాయుదేవుడు తప్ప ఇంక ఎవరూ ఈ సముద్రాన్ని దాటలేరని నా అభిప్రాయం. నేనాలోచిస్తున్నకొద్దీ, వారిక్కడకు రావడం, అసాధ్యమైనపనిలాగానే తోస్తున్నది. అయినా కార్యదక్షుడవైన నీకు చేయలేని పనేదీలేదు. దీనికి ఏమని సమాధానమిస్తావు? ఎలానెగ్గుకొస్తావో నాకు తెలియదుకాని, సాధించగలవాడివి మాత్రం నీవొక్కడివే! ఎవరూ చేయలేరు, కీర్తినీ పొందలేరు. కాని నీవిలాచేయడం నాకు కీర్తికరం కాదు'' ఇంకా ఇలా అంటుంది:

"రామచంద్రమూర్తి సైన్యంతో వచ్చి, యుద్ధంలో బల–పరాక్రమాలను ప్రదర్శించి, రావణుడిని చంపి, నన్ను అయోధ్యకు తీసుకొని పోతేనే అది నాకు కీర్తికరం. అప్పుడే నేను వీరపత్నినన్న బిరుదుకు కూడా అర్హురాలిని అవుతాను. ఇది రాముడికి సాధ్యపడుతుందా, పడదా అనేసంగతి వేరేవిషయం. కాని ఇంకే విధంగా జరిగినా నాకు కీర్తికరం కాదు. నేను చెప్పినట్లు చేసి, తన బలంతో, బాణాలతో లంకను భస్మం చేసి, నన్ను వెంట తీసుకునిపోతే, నాకేకాదు, శ్రీరాముడికీ కీర్తి. ఆయన వంశానికీ కీర్తి దక్కుతుంది. నాకోసం కాకపోయినా, తనకోసమైనా నేను చెప్పినట్లు చేయాల్సిందేనని నా కోరిక. ఆడదానినైన నా

ఆలోచనావిధానమిది. యుద్ధంలో శూరుడైన రామచంద్రమూర్తికి తగినటువంటి చర్య ఏదో ఆలోచించి చెప్పు''.

వానర, భల్లూకరాజైన సుగ్రీవుడు సీత నిమిత్తమై, గొప్ప సైన్యంతో రాముడికి సహాయపడేందుకు నిర్ణయించుకున్నాడనీ, ఆయనతో వచ్చేవారంతా అసమాన పరాక్రమవంతులనీ, దేవతలతో సమానులనీ, మనోవేగం కలవారనీ, దిక్కులలో, ఆకాశంలో సంచరించేవారనీ, వారంతా శీఘ్రంగా రాబోతున్నారనీ, సీతకు ధైర్యం చెప్పానన్నాడు హనుమంతుడు.

"రామలక్ష్మణులు ఎట్లా వస్తారా అనే సందేహం కానీ, రారని శోకించడం కానీ వదులుకో. నీవు దుఃఖించే కాలంపోయింది. నేనుపోయి చెప్పగానే ఒక్కగంతేసి, వానరులొస్తారిక్కడకు. రామలక్ష్మణులు, సూర్య, చంద్రుల్లాగా నావీపుపైకెక్కి, నీ ఎదుట నిలుస్తారు. వారి బాణాగ్నికి లంకంతా పాడైపోతుంది. రావణుడిని సేనలతో సహా చంపి రాముడు నిన్ను అయోధ్యకు తీసుకుపోతాడు. మేమెప్పుడొస్తామా అని మా రాకకొరకు ఎదురుచూస్తుండు. ఏ సాహసం చేయొద్దీలోపల. మండుతున్న అగ్నిహోత్రం లాగా రామచంద్రమూర్తిని ఇక్కడ చూస్తావు. రాక్షసుడికేగతి పడ్తుందో చూడు. కొడుకులతో, చుట్టాలతో, మంత్రులతో చచ్చిపోయి రావణుడు నేలకూలగా చూసిన నీవు దుఃఖ సముద్రపు ఒడ్డుకు చేరుకుంటావు. నీ భర్తను కలుస్తావు'' అని చెప్పానన్నాడు.

కోరలు, గోళ్ళు ఆయుధాలుగాగల పరాక్రమవంతులైన వానరులు త్వరలోనే లంకకు రావడం, సీతాదేవే స్వయంగా చూడబోతున్నదనీ, వారి భయంకర సింహనాదాలు లంకలోని పర్వతాలలో వినపడే సమయం ఆసన్నమయిందనీ, తాను సీతాదేవికి చెప్పానన్నాడు హనుమంతుడు. నిబంధన ప్రకారం వనవాసాన్ని గడిపి, విరోధులందరినీ చంపి, సీతాదేవితో సహా అయోధ్యలో పట్టాభిషేకం జరుపుకుంటారనీ కూడా ఆమెతో చెప్పానన్నాడు. ఇలా ఎన్నోవిధాలుగా చెప్పి, ఆమెను నమ్మించి, దుఃఖపడకుండా చేసివచ్చానంటాడు.

హనుమంతుడు రామచంద్రమూర్తికి సీతా వృత్తాంతమే చెప్పాడు కాని, తను పడ్డ కష్టాలను ఒక్కటైనా చెప్పలేదు. చెప్పితే ఆత్మ స్తుతవుతుందనుకుంటాడు. ఇంకో విషయం, శ్రీరామచంద్రుడికి చెప్పాల్సింది సీతా వృత్తాంతం కాని, హనుమంతుడు పడ్డ ప్రయాసకాదుకదా!

◆❖◆

లంకానగరం జయించనలవి కానిదా?

హనుమంతుడు సీతావిషయం లంకలో జరిగినది జరిగినట్లే చెప్పగా రామచంద్రమూర్తి విని, సంతోషించి, సుగ్రీవుడిని చూసి, "మన హనుమంతుడికి సమానమైనవాడని చెప్పగలవాడు ఈ లోకంలో ఎవరైనా వున్నారా? లేదు...లేదు....లేదు. హనుమంతుడు కాకుండా, మరెవ్వరికైనా ఆ సముద్రాన్ని దాటడం సాధ్యమయ్యేదా? రావణుడు పాలించే లంకను ఎంతటివాడైనా తన బలసంపదతో ప్రవేశించడం సాధ్యమా? ఒక వేళ రాక్షసులను ఏమరచి లోపల ప్రవేశించినా మళ్లీ ప్రాణాలతో తిరిగిరావడం సాధ్యమా? అలా చేయగలగడం మన హనుమంతుడికి ఒక్కడికే చెల్లింది" అన్నాడు.

రాముడు ఇంకా ఇలా అన్నాడు. "సుగ్రీవుడి యోగ్యతకు తగ్గట్లు రాక్షసులను వధించి లంకాదహనం చేశాడు హనుమ. యజమాని చెప్పని అవసరమైన కార్యక్రమం కూడా నెరవేర్చే దూతను బుద్ధిమంతులు పురుషోత్తముడు అంటారు. ఇది ఉత్తమ దూత లక్షణం. హనుమంతుడు పురుషోత్తముడైనందున రాక్షసులకు చిక్కినా, తన గౌరవానికి హానికలుగకుండా, తనను దూతగా నియమించిన సుగ్రీవుడికి సంతోషం కలిగేట్లు నియమిత కార్యాన్ని సాధించాడు. ఇది ఆయన తన స్వామికి చేసిన ఉపకారం. జానకిని చూసి వచ్చి నాకు, లక్ష్మణుడికి, మా ఉత్తమ రఘువంశానికి ప్రాణాలిచ్చి రక్షించాడు. నేనే రాజుగా వుంటే సర్వరాజ్యం నీకిచ్చేవాడిని. అది కూడా లేదాయె. కాబట్టి నువ్వు చేసిన దానికి బదులుగా నా కౌగిలిని తీసుకో ఆంజనేయా! ప్రార్థిస్తున్నాను. ఇది బదులుగా అంటున్నాను కాని సమానంగా అనడం లేదు. ఇది నువ్వు చేసినదానికి సమానం కాదు. అయినా, ఈ అల్ప దక్షిణను శాస్త్రోక్త దక్షిణగా తీసుకోమని నాకున్న అల్పమైన ఈ దేహాన్ని నీకు సమర్పిస్తున్నాను".

"నా ప్రార్థన నిరాకరించక మన్నించమని కోరుతున్నాను. కృపతో పరిగ్రహించు. నువ్వు నిరాకరిస్తే నాకంతకంటే వేరే మరణం లేదు. ఎందుకు నా కౌగిలి సమానం కాదంటున్నానా? అక్కడ చావడానికి సిద్ధంగా వున్న సీత ప్రాణాలు నిలిపావు. ఆ వార్త తెచ్చి ఇక్కడ నా ప్రాణాలు నిలిపావు. ఇలా ఇద్దరి దేహాలు నువ్వు ఇస్తే, నేను ఒక్క దేహాన్ని ఇవ్వడం ఎలా సమానమవుతుంది? కాదు. నేనేం చేయాలి? ఏమీ

చేయలేకపోయానని బాధపడుతున్నాను. నా ఈ దుఃఖాన్ని నేనిచ్చిన దానిని ప్రేమతో స్వీకరించి అణచివేయి. నువ్వు చేసిన ఉపకారాలకు ఇది సమానం కాదనడానికి ఇంకో కారణం కూడా వుంది. నువ్వు నాకు సుగ్రీవుడితో స్నేహం కుదిర్చి గొప్ప ఉపకారం చేశావు. అప్పటినుండి నీకెలా ప్రత్యుపకారం చేయాల్నా అని ఆలోచిస్తున్నాను. ఇప్పుడు ఇది రెండోది. ఈ రెంటికీ నేనిచ్చిన అల్పం ఎలా సమానం కాగలదు? కాబట్టి హెచ్చు, తక్కువలు ఆలోచించకుండా నేనిచ్చిన అల్పాన్ని ప్రేమతో స్వీకరించు'' అన్నాడు రాముడు.

రాముడు కౌగిలి ఇవ్వడం అంటే తనను తాను సమర్పించుకొనడమే. ఆత్మాత్మీయనిక్షేపం అన్నట్లుగా తనను సమర్పించుకోవడం, అంటే, తనకున్న సర్వస్వాన్ని, అంటే, నిత్యవిభూతి, లీలావిభూతి రెండూ అర్పించినట్లే. వీటితో ఆయనకేం ప్రయోజనమంటే, ఆయనకు ప్రియమైనది ఇస్తేనే కదా, ప్రయోజనం అనవచ్చు. హనుమంతుడికి ప్రియమైంది శ్రీరామచంద్రమూర్తి దివ్యమంగళ విగ్రహమే. పరస్వరూపంతో ఆయనకు పని లేదు. ఎవరికేది ప్రియమో దానినే భగవంతుడు వాడికిస్తాడు. కాబట్టి ఆ దివ్యమంగళ విగ్రహం మీద హనుమంతుడికి ప్రీతి అని తెలిసి రాముడు దాన్నే ఇచ్చాడు. దాంతో హనుమంతుడు తృప్తి చెందాడు.

ఆ తరువాత శరీరం పులకరిస్తుంటే రామచంద్రమూర్తి ఆంజనేయుడిని నిండుమనస్సుతో కౌగలించుకుని సుగ్రీవుడిని చూసి ఇలా అన్నాడు. ''జానకీదేవిని వెతికే పని చక్కబడింది. కాని సముద్రాన్ని తలచుకుంటే దిగులుగా వుంది. దాటడానికి సాధ్యపడని సముద్రాన్ని దాటి, వానరులందరూ దక్షిణ దిక్కు తీరానికి చేరే ఉపాయం నీకేమైనా తెలిస్తే చెప్పు. వానరులారా! సీత ఎక్కడున్నది? ఎలా వున్నది? అనే విషయం మీరు చెప్తే విన్నాను. అక్కడికి మనం పోవాలికదా? పోయే మార్గంలో సముద్రాన్ని దాటాలికదా? మీరంతా ఆ సముద్రాన్ని ఎలా దాటాలో ఉపాయం వుంటే చెప్పండి''. ఈ విధంగా వానరులకు చెప్పి, రామచంద్రమూర్తి ఆంజనేయుడితో కలిసి ఆలోచన చేశాడు.

సముద్రాన్ని దాటడం ఎలా అని విచారపడే శ్రీరామచంద్రమూర్తిని చూసి సుగ్రీవుడు ఆయనకు ధైర్యం కలిగించే మాటలను చెప్పాడు. "ఏ ఉపాయం చేస్తే పాపాత్ముడైన రావణుడిని యుద్ధంలో చంపి సీతాదేవిని తీసుకురావచ్చో ఆ మార్గాన్ని ధీరుడివై చేపట్టు. నువ్వు చేయాల్సినదంతా సముద్రాన్ని దాటి లంక చేరడానికి ఏం చేయాలన్న ఆలోచనే. లంక కనబడితే ఇక రావణుడు చచ్చినట్లే. రామచంద్రా! ఒకటి మాత్రం నిశ్చయం. సేతువు కట్టకుండా సముద్రాన్ని దాటడం దేవతలకైనా సాధ్యంకాదు. సేతువే ఏర్పాటైతే వానరులు సముద్రాన్ని దాటడం శత్రుసంహారం చేయడం తథ్యం. ఆ విషయంలో నువ్వు సందేహించాల్సింది లేదు. ఎందుకంటే ఈ వానరులు కామరూపులు. యుద్ధంలో శూరులు. కలహానికి భయపడరు. కాబట్టి నువ్వు దుఃఖాన్ని వదిలిపెట్టు. అది నీకు తగదు. శౌర్యం వున్నవాళ్లు పనులు చేయడాని అధైర్యపడరు'' అని అన్నాడు.

సుగ్రీవుడు చెప్పిన మాటలు విన్న రామచంద్రమూర్తి, హనుమంతుడితో, "హనుమంతా! నువ్వు లంకానగరాన్ని కళ్లారా చూశావుకదా! దానిలో కోటలెన్ని వున్నాయి? సైన్యం ఎంతమేరకు వుంది? చెప్పు. లంకకు ద్వారాలెన్ని? కోటలెన్ని? వాటిని ఏవిధంగా కట్టించారు? రాక్షసుల ఇండ్లు

ఎన్ని? వాటిని రక్షించడానికి ఎలాంటి ఉపాయం చేశారు? ఇవన్నీ చెప్పు. తీరిగ్గా లంకంతా తిరిగి చూశావు కదా? అన్నింటికీ సమర్థుడివి కాబట్టి నీకీ విద్య కూడా తెలిసే వుండాలి! వివరంగా చెప్పు" అని అన్నాడు.

జవాబుగా హనుమంతుడు, "దేవా! లంకకు నలుదిక్కులా నాలుగు ద్వారాలున్నాయి. వాటి ద్వారాలను అడ్డగడియ చెట్లతో బంధించి వుంచారు. ఆ ద్వారాలలోని రాతి యంత్రాలతో ఆ మార్గాన వచ్చిన విరోధిసైన్యం అక్కడే చచ్చిపోతుంది. రాక్షసులు నిర్మించిన శతఘ్నులు వేటుకు వందమందిని చంపగలవు. అవి ద్వార–ద్వారాన విశేషంగా ఏర్పాటుచేయబడి వున్నాయి. కోటగోడలను పగులగొట్టి లోపలికి పోవడం సాధ్యపడదు. ఆ పట్టణం చుట్టూ మిక్కిలి భయంకరమైన మొసళ్లతో నిండి చాలా లోతులో నీరున్న కందకాలున్నాయి. ఆ కందకాలమీద ప్రజల రాకపోకలకు అనుకూలంగా వుండే విధంగా వెడల్పాటి వంతెనలున్నాయి. శత్రువులు వచ్చినప్పుడు యంత్రాలను తిప్పితే, ఆ వంతెనలు లేచి కోట ద్వారాలకు తలుపుల్లాగా అడ్డుపడతాయి. అక్కడ ఇండ్ల వరసలున్నాయి. అవికూడా ఆ పలకల వంతెనల్లాగే శత్రువులు వచ్చినప్పుడు లంకాపురాన్ని రక్షిస్తాయి".

"లంకలో జలదుర్గం, కృత్రిమ దుర్గం, పర్వత దుర్గం, వనదుర్గాలనే నాలుగు రకాల భయంకర దుర్గాలున్నాయి. ఇవి ఇతరులకు సాధ్యపడవు. లంక నిరాధారంగా సముద్రతీరంలో వున్నది. దానిలోకి ప్రవేశించడం దేవతకు కూడా సాధ్యంకాదు. నావలు కూడా దాని సమీపంలోకి పోవడానికి దారిలేదు. పర్వత శిఖరం అమరావతిలాగా వుంది. బయటి వార్త లోపటికి పోవడం కానీ, లోపలివార్త బయటికి రావడానికి కానీ వీలుకాదు. గొప్ప యంత్రాలు, నానారకాల అగడ్తలు, శతఘ్నులు వున్నాయి. జయించడానికి ఏదీ సాధ్యపడదు. తూర్పునుండి సైన్యం రావడానికి వీలుపడదు. ఆ ద్వారంలో పదివేలమంది రాక్షసులు సైన్యానికి ముందు నిలిచి యుద్ధంచేయడానికి సిద్ధంగా వుంటారు ఎల్లప్పుడూ. దక్షిణద్వారం దగ్గర శూలాలు ధరించిన శూరులు, అజేయులు, పరాక్రమవంతులు లక్షమంది రాక్షసులు నాలుగు రకాలైన సేనలతో కాపలాకాస్తుంటారు. పడమటి వాకిట్లో పదిలక్షలమంది రాక్షసులు కాపలాగా వుంటారు. వీరికి అస్త్రవిద్యకూడా తెలుసు. ఉత్తరద్వారం దగ్గర పది అర్బుదాల రాక్షసులు ఏనుగులు, గుర్రాలు వాహనాలుగా రక్షిస్తుంటారు. వీరంతా రావణుడికి పూజ్యులు, విశ్వాసపాత్రులు".

హనుమంతుడి మాటలను విన్న రామచంద్రమూర్తి ఈ విధంగా అన్నాడు. "లంకను పాడుచేయడం పెద్ద పనికాదని భావిస్తున్నాను. రావణాసురుడి పురాన్ని ధ్వంసం చేస్తాను. సత్యం చెప్తున్నాను. ప్రయాణానికిదే మంచి ముహూర్తం. ఈ ముహూర్తానికి విజయం అని పేరు. ఇప్పుడు మనం బయల్దేరి పోతే పగవాడు జానకిని తీసుకుని ఎక్కడికి పోగలడు? ఎక్కడికి పోయినా చస్తాడు. ఈ ముహూర్తానికి "అభిజిత్" అని పేరు. ఈ రోజు ఉత్తర ఫల్గుణీ నక్షత్రం. నా జన్మ నక్షత్రానికి ఆరవది కాబట్టి శుభం కలుగుతుంది. రేపు చంద్రుడు హస్తతో కూడి ఏడవతారై ధనతార అవుతుంది. అది అశుభం. రేపు ప్రయాణం చేయకూడదు. కాబట్టి ఈ రోజే సైన్యంతో సహా ప్రయాణం చేయాలి. మంచి శుభశకునాలు కనపడుతున్నాయి. కాబట్టి రావణుడిని చంపి సీతను తేవడం సత్యం. శత్రువులను

నాశనం చేసి, జయం పొంది, అవమానాన్ని పోగొట్టుకుంటావని చెప్పేవిధంగా కంటిపైభాగం అదురుతున్నది. ప్రయాణం చేయడానికి ఇదే సరైన సమయం''.

రామచంద్రమూర్తి ఇలా చెప్పగా, సుగ్రీవుడి ఆజ్ఞ మేరకు గుహలనుండి, పర్వత శిఖరాలనుండి, భూమ్యాకాశాలు దద్దరిల్లేట్లు భయంకరంగా బయల్దేరారు వానరులు. రామచంద్రమూర్తి లక్ష్మణ సుగ్రీవులతో కలిసి సంతోషంగా, అతివేగంగా, దక్షిణ దిక్కుగా ప్రయాణం చేశాడు. శ్రీరాముడి వెంట వానర సైన్యం నడిచింది. ఎవరికివారు తామే రావణుడిని చంపుతామని అన్నారు. మహాబలవంతుల మధ్యన రామలక్ష్మణసుగ్రీవులు పోయారు. సుగ్రీవుడు ముందు పోతున్నాడు. త్వరగా నడవమని వానరులను ప్రోత్సహించారు. సముద్ర ధ్వనితో సమానమైన ధ్వనితో సముద్రం పొంగి వెల్లువగా మారిన విధంగా వానరసేన చక్కగా తోలబడ్డ గుర్రాల దండు వేగంలాగా రామచంద్రమూర్తి పక్కనే నడిచాయి.

లక్ష్మణుడు రామచంద్రమూర్తితో సీతాదేవిని మళ్లీ ఆయన తీసుకుని వస్తాడనీ, భూమ్మీద, ఆకాశం మీద, కనిపించే శుభశకునాలు కార్యసిద్ధి తెలియచేస్తున్నాయనీ అంటాడు. రాముడి అవతార కాలంలో జాతకఫలాలు సూచించినట్లే, దండయాత్రాకాలంలో గోచార ఫలాలు రాక్షసుల విపరీత పరిణామానికి సూచనలు అయ్యాయి. శుభ శకునాలు తెలుపుతూ లక్ష్మణుడు అన్నకు సంతోషం కలిగే విధంగా చెప్తుంటే రామచంద్రమూర్తి సైన్యాన్ని వేగంగా నడిపించాడు.

ఇలా ఒక రాత్రి, ఒక పగలు విడవకుండా ప్రయాణం చేశారు. రామచంద్రమూర్తి మహేంద్రపర్వతంమీద ఎత్తైన శిఖరం ఎక్కి తాబేళ్లు, చేపలు అమితంగాకల సముద్రన్ని చూశాడు. మలయ పర్వతం, సహ్య పర్వతం దాటి సముద్రాన్ని సమీపించి, అక్కడ ఆంజనేయుడి మీదనుండి దిగి సముద్రతీరంలో వుండే వనం దాటి చెలియలి కట్ట దగ్గర అలలతో కడుగబడిన ప్రదేశానికి చేరారు.

రామచంద్రమూర్తి సుగ్రీవుడిని చూసి, "వానర రాజా! సముద్ర తీరం చేరాం. ఏదైనా ఒక ఉపాయం చేసి దీన్ని దాటాలికాని వ్యర్థంగా కాలం గడపకూడదు'' అన్నాడు. సముద్రతీరాన సేనలన్నీ ఏఏ సేన ఏఏ చోట దిగాల్నో ఆ విధంగానే దిగిన తరువాత రామచంద్రమూర్తి సముద్రానికి ఆవలి ఒడ్డున సీతాదేవిని తలచుకుని దుఃపడుతున్నాడు. సీతాదేవి దుఃఖిస్తున్నదని హనుమంతుడు చెప్పిన మాటలను జ్ఞప్తికి తెచ్చుకుని మరీ-మరీ దుఃఖించాడు. "సీత జీవించే వుందని హనుమంతుడు చెప్పాడు. కాబట్టి నేను కూడా జీవించగలిగాను. కాని నేనామెను చూడగలనా? నా భార్యను, స్త్రీరత్నాన్ని, భూపుత్రికను సీతను విడిచినందున కలిగిన దుఃఖం నేనెప్పుడు మాసిన గుడ్డను వదిలినట్లు వదిలి సుఖపడతానోకదా?'' అని అంటాడు.

ఇలా రాముడు శోకిస్తుంటే సాయంకాలమై సూర్యుడు అస్తమించాడు. ఆయన బాధ పోయేట్లు లక్ష్మణుడు సమాధాన పరిచే మాటాలు చెప్పాడు. అవి విని, సీతను స్మరించుకుంటూ రామచంద్రుడు సంధ్య వార్చాడు.

విభీషణుడి రాజనీతి రావణుడికి నచ్చలేదా?

శ్రీరామ, లక్ష్మణ, సుగ్రీవ, హనుమంత, అంగద, తదితర వానర నాయకుల సేన సముద్రాన్ని దాటే ఉపాయం ఆలోచిస్తున్న సమయానికి లంకలో రావణుడు, హనుమంతుడు ఒక్కడే చేసిన అసాధ్యమైన కార్యాలను తలచుకుంటూ, రాక్షస వీరులను ''హనుమంతుడు అతిశయించిన శక్తితో ఎవరికీ సాధ్యపడని లంకాపురంలో ప్రవేశించి, నన్ను తృణంకంటే నీచంగా ఎంచి, నా ఇంట్లో ప్రవేశించి, సీతను చూసి, గోపురాలను విరగతన్ని, నేలకూల్చి, రాక్షసులను చంపి పట్టణాన్ని భీభత్సంగా కాల్చాడు. అయిందేదో అయింది. దానికి విచారపడి ప్రయోజనం లేదు కదా! ఇక జరగాల్సిన పని గురించి చెప్పండి. నేనేం చేయాలి? నేనేం చేస్తే నాకు, మీకు మేలు కలుగుతుంది?'' అని అడిగాడు.

రావణుడు ఈ విధంగా చెప్పగా, రాక్షసులు, చేతులు జోడించి ఇలా అన్నారు. "రాక్షసేశ్వరా! పట్టిసాలు, శక్తులు, ఋష్టులు, పరిఘములు, శూలాలు నిండిన గొప్ప సైన్యం నీకుండగా నువ్వెందుకు ఇలా విచారిస్తావు? యుద్ధంలో సమస్త దిక్పాలకుల గర్వం అణచి ఇంద్రలోకానికి పోయి నువ్వు ఇంద్రుడిని జయించలేదా? యమపురిలో ప్రవేశించి, మృత్యుదేవతను కలవర పర్చలేదా? లోకం దిగ్భ్రమ పొందేట్లు జయించలేదా? రాక్షసేశ్వరా! నువ్వే ఏ ఆలోచనా చేయనక్కర లేదు. ఏ కార్యమూ చేయాల్సిన అవసరం లేదు. నిశ్చింతగా వుండు. వానరులందరినీ ఒక్క ఇంద్రజిత్తే చంపగలడు''.

సభలో వున్న రాక్షసులందరూ చెప్పిన తరువాత మంత్రులు, ఇతర ప్రముఖులు వారి అభిప్రాయాలను కూడా చెప్పారు. అందులో ముఖ్యుడైన ముఖ్య సేనానాయకుడు ప్రహస్తుడు తనకు ఆజ్ఞ ఇస్తే ఇప్పుడే పోయి రామలక్ష్మణులను హతం చేస్తానని అంటాడు. తానొక్కడినే ఈ నిమిషంలో పోయి వానర సమూహాలు ఆకాశానికి ఎగిరిపోయినా సరే, సముద్రంలో దాగినా సరే, పాతాళానికి పోయినా సరే పట్టుకుని చంపుతాను అంటాడు దుర్ముఖుడు. వజ్రదంష్ట్రుడు అనే వాడు తానొక్కడే ఎవరి సహాయం లేకుండా లక్ష్మణ సుగ్రీవుడితో సహా రాముడిని ఇప్పుడే చంపుతాను. అది చూసి వానరులందరూ బెదిరి సంతాపంతో పరుగెత్తుతారని అన్నాడు.

కుంభకర్ణుడి కొడుకు నికుంభుడు తన భుజబల పరాక్రమంతో యుద్ధరంగంలో రాముడిని, లక్ష్మణుడిని, హనుమంతుడిని, సుగ్రీవుడిని చీల్చి పారేస్తానని, మిగిలిన వానర సైన్యాన్నంతా తునాతునకలుగా చిటికలో ఖండిస్తానని చెప్పాడు. ఇలా వజ్రహనుడు, యజ్ఞహుడు, నికుంభుడు, రభసుడు, మహాపార్శ్వుడు, రశ్మికేతువు, సూర్యశత్రువు, సుప్తఘ్నుడు, మహోదరుడు, అగ్నికేతుడు, ఇంద్రజిత్తు, ప్రహస్తుడు, అతికాయుడు, విరూపాక్షుడు, ధూమ్రాక్షుడు, దుర్ముఖుడు, వజ్రదంష్ట్రుడు, ఇలా అందరూ మాట్లాడారు. ఇలా అయుధాలు ధరించి పౌరుషపు మాటలు పలుకుతున్న వారిని ఆపుచేస్తూ విభీషణుడు అన్నకు నమస్కారం చేసి ఇలా అన్నాడు.

"రాజనీతిలో కార్యం సాధించడానికి సామ, దాన, భేద అనే మూడు ఉపాయాలున్నాయి. ఈ మూడు ఉపాయలతో కార్యం సాధించలేకపోతే అప్పుడు దండమనే నాలుగో ఉపాయం అవలంభించాలని చెప్తున్నారు. మొదటి మూడు ఉపాయాలను ప్రయత్నించకుండా యుద్ధానికి దిగడం శాస్త్రవిరుద్ధం. రాముడు నివారింపకాని పరాక్రమవంతుడు. అతడిని పరాక్రమంతో జయించడం ఎలా సాధ్యం? వానరాధిపతైన సుగ్రీవుడు రాముడికి తోడుగా వున్నాడని విన్నాం కదా? చూశాం కదా? వానరసేన ఎంతో, ఎలాంటిదో మనకు తెలుసు కదా? ఇలాంటప్పుడు శత్రువులను అలక్ష్యం చేయవచ్చా? రాముడిమీదకు యుద్ధానికి పోవడానికి కారణం ఏంటి? ఆయన మీకు చేసిన అపకారం ఏంటి? ముందు ఎవరెవరికి అపకారం చేశారు? రాముడు ఖరాదులమీదికి దండెత్తి వచ్చాడా? ఖరుడు రాముడి మీదికి దండెత్తి పోయాడా? ఖరుడే కదా పోయింది. తన ప్రాణానికి అపాయం కలిగినప్పుడు వారి శక్తికొద్దీ తమ్ము తాము రక్షించుకొనడం సహజమే కదా? అలాగే తన్ను తాను రాముడు రక్షించుకొంటే తప్పేంటి? రావణుడే కదా ముందు పోయి ఎక్కడో అడవిలో వున్న రాముడి భార్యను అపహరించి తెచ్చాడు. ఇందులో అన్యాయం ఎవరిది? కలహానికి కాలు దువ్వినవారెవ్వరు? సీతాదేవి ఇక్కడ లేకుంటే హనుమంతుడు ఇక్కడికి వచ్చేవాడా? అంతపని చేసేవాడా? ఇదెందుకు మీరు ఆలోచించరు?".

"అన్నా! రామచంద్రమూర్తి సామాన్యమైన బలం కలవాడు కాదు. సారవంతమైన మహా బలం కలవాడు. దేహబలానికి తోడు ధర్మపు నడవడిలో ఆసక్తికలవాడు. ధర్మం వున్న చోటే విజయం వుంటుంది. కాబట్టి ధర్మబలం, దాని వెంట దైవబలం కలవాడు అయిన రామచంద్రుడితో నువ్వు అకారణంగా కలహానికి దిగడం సరైంది కానేకాదు. కాబట్టి సీతాదేవిని రాముడికి అర్పించు. లంక శత్రువుల బారిన పడకముందే సీతాదేవిని రాముడికి అప్పచెప్పు. వానరసేన లంకకోటలు లగ్గలు పట్టకముందే సీతాదేవిని శ్రీరాముడికి అర్పించడం గౌరవకరం. నువ్వు సీతాదేవిని రాముడికి తిరిగి ఇవ్వకపోతే రాక్షసులతో సహా లంకానగరం నాశనమై పోతుంది. అన్నా! నీకు మేలు కలుగుతుంది. మంచిమాటలే చెప్పాను కాని, దానికి విరుద్ధంగా నేనేం చెప్పలేదు. సీతాదేవిని రామచంద్రుడి దగ్గరకు పంపించు".

విభీషణుడి మాటలు రావణుడికి కోపం తెప్పించాయి. ఆ మాటలు విన్న రావణాసురుడు సభ చాలించి, అందరినీ పంపించి, తన ఇంటికి పోయాడు. అతడి వెంటే, రావణుడి ఇంటికి పోయిన విభీషణుడు తన మాటలుగా ఇలా చెప్పాడు. "అన్నా! ఏనాడైతే సీత ఈ వూరికి దాపురించినదో ఆ దినం

మొదలు లెక్కలేని అపశకునాలు లంకాపురంలో కనపడుతున్నాయి. ఈ అపశకునాలకు కారణం సీత ఇక్కడ వుండడమే. సీతను శ్రీరాముడికి అర్పించు. అన్నా! సీతాదేవిని ఇవ్వడం న్యాయమా? అన్యాయమా? ఇస్తే కలిగే ఫలం ఏమిటి? ఇవ్వకపోతే కలిగే నష్టం ఏమిటి? రాబోయేది అంతా ఆలోచించి నీ ఇష్టం వచ్చినట్లు చేయి. ఆలోచించకుండా తొందరపడి ఏదీ చేయొద్దు''. అని చెప్పాడు. తన తమ్ముడు చెప్పిన వాక్యాలు చెవిలో పడగానే రావణుడు కోపగించి విభీషణుడిని విడిచి లోపలికి పోయాడు. అందరి ఎదుట అతడిని ఏమీ అనలేక తానే వెళ్లిపోయాడు.

హితులైన వారు తనను అనాదరం చేసిన కారణాన, తానుగా చేసిన సీతాహరణం పాప కార్యమైనందున, సీతమీద కల కామాతిశయం వల్ల బుద్ధి నాశనం కావడాన, రావణాసురుడు తేజోహీనుడై శుష్కించసాగాడు. ఇప్పుడు యుద్ధం చేయాల్సి వస్తున్నది. ఇది అందరితో కలిసి చేయాల్సిన పని. ఇప్పుడేం చేయాలి? అని మంత్రులతో, హితులతో ఆలోచించడానికి, తాను చేసినది అందరికీ సమ్మతమే అని నిరూపించడానికి రావణుడు సభకు పోయి తన వారందరినీ పిలిపించాడు. వారంతా, వున్నట్లుండి తమను పిలిపించడం వల్ల ఏమి అపాయం వచ్చిందో అని రావణుడి క్షేమం విచారించడానికి వచ్చారు. విభీషణుడు, శుకుడు, ప్రహస్తుడు కూడా వచ్చారు. ఆ రాక్షసులలో ఒక్కడైనా గట్టిగా మాట్లాడినవాడు లేడు. అక్రమంగా వాదించేవాడు లేడు.

అప్పుడు రావణుడు సేనానాయకుడైన ప్రహస్తుడితో ''సేనాపతీ! నువ్వు త్వరగా పోయి, నాలుగు రకాలైన యోధులను, వీరులైనవారిని, ఇదివరకంటే ఎక్కువగా కాపలా పెట్టు'' అని చెప్పగా అతడు రాజాజ్ఞ ప్రకారం పట్టణం లోపల, వెలుపల, అన్ని ప్రదేశాలలో పట్టణం రక్షించడానికి వేర్వేరు రాక్షసులను వేర్వేరు స్థలాలలో వుండడానికి నియమించాడు. ''రాక్షసేశ్వరా! అన్ని సేనలను అన్ని స్థలాలలో నిలిపాను. భయం లేదు. సందేహం లేకుండా మీ పని మీరు చేయవచ్చు'' అని ప్రహస్తుడు చెప్పాడు. రావణుడప్పుడు తాను చేయదల్చుకున్న కార్యం గురించి చెప్పసాగాడిలా.

''రాక్షసులారా! ధర్మం, అర్థం, కామం....వీటిలో ఏది చేయతగింది అని ఆలోచిస్తే ఏది చేసిన కీడు, మేలు, సౌఖ్యం, దుఃఖం, ప్రియం, అప్రియం కలుగునో అని విచారించి మంచి-చెడు నిశ్చయించండి. మీ ఆలోచన ప్రకారమే పోవాలని అడుగుతున్నాను. ఇప్పుడు నేను మీకు చెప్పబోయేదంతా ముందే చెప్పాలని నా మనసులో వుండేది. కాని కుంభకర్ణుడు నిద్రపోతున్నందువల్ల చెప్పలేదు. ఆరు నెలలు నిద్రపోయి ఇప్పుడే మేల్కొన్నాడు కదా! కాబట్టి ఇప్పుడు చెప్పుదామనుకున్నాను''.

రావణుడు రాక్షసులతో ఇలా చెప్పసాగాడు. ''రాముడి భార్య సీతను, దండకారణ్యంలో వుండగా తెచ్చాను. ఎందుకు తెచ్చానంటారా? ముల్లోకాలలో వెతికినా అలాంటి అందగత్తె ఇంకొకరు లేరు. ఆమెను నా భార్యగా చేసుకోవాలని భావించి తెచ్చానుకాని ఆమె ఇంతవరకు నా పానుపు ఎక్కడానికి అంగీకరించలేదు. సీత నాకు లభించకపోతే నేను మదనతాపంతో చావడం తథ్యం. కాబట్టి నేను బతికుండాలని అనుకుంటే నాకు తగిన ఉపాయం చెప్పండి. ఆ రాజకుమారులు సీతాదేవి ఇక్కడ వున్న విషయం తెలుసుకుని సుగ్రీవుడి సారథ్యంలో వానరసేనతో సముద్ర తీరానికి వచ్చి వున్నారు. మీరు నాకు చెప్పాల్సిన ఆలోచన ఏంటంటే, సీతాదేవిని తిరిగి ఇవ్వడానికి వీల్లేదు...రాముడిని చంపాలి...దానికి తగ్గ

ఉపాయం కావాలి''.

రావణుడి ఏడుపు విని కోపంతో కుంభకర్ణుడు వాడితో ఇలా అన్నాడు. ''రామలక్ష్మణులు ఇద్దరూ రక్షిస్తున్న సీతాదేవిని నువ్వు ఎవరిని అడిగి ఎత్తుకొచ్చావు? ఆలోచించిన తరువాతే ఏ పనైనా చేయాలికదా? పనైన తరువాత ఆలోచన చేస్తారా ఎవరైనా? కార్యం నువ్వు చేయకముందు మా ఆలోచన అడిగితే నీకీ మనక్షోభ లేకుండా ఉపాయం చెప్పేవాళ్లం. అలా చేసి వున్నట్లయితే మంచి జరిగేది. కార్యం చేసి, ఇప్పుడు ప్రాణం మీదకు వచ్చిన తరువాత విచారపడితే లాభం ఏమిటి? నువ్వు దోషయుక్తమైన పనిని, అపాయంతో కూడిన పనిని, చేశావు. నిన్ను రాముడు అక్కడే చంపకుండా విడవడం అంటే నువ్వు నిజంగా అదృష్టవంతుడివే! నీతోడబుట్టిన కారణాన నాకు ఇప్పుడు నీతో నిల్వక తప్పుతుందా? తప్పదు. రాముడి నెత్తురు నేను పూర్ణంగా తాగుతాను. ఆ తరువాత నువ్వు సుఖపడు. రామలక్ష్మణులను చంపి వానరులందరినీ భక్షించి, తేల్పులు తీస్తూ, నీకు విజయం, సౌఖ్యం కలిగిస్తాను''.

రావణుడు చేసిన పని మంచిదికాదని కుంభకర్ణుడు చెప్పడం వల్ల అతడికి కోపం వచ్చిందని గ్రహించిన మహాపార్శ్వుడనే వాడు రావణుడితో "నీకోరికను యుద్ధం ద్వారానే తీర్చుకో. పగవారు ఇక్కడికి వస్తే మేమే వాళ్లందరినీ చంపుతాం. సందేహం లేదు. నీ అంతట నువ్వు నీ కోరిక ప్రకారమే నడుచుకో" అన్నాడు. రావణుడు చెప్పిన మాటలను, కుంభకర్ణుడి వదరు మాటలను, వినీ-వినీ, హితంగా, స్వప్రయోజనంగా విభీషణుడిలా అన్నాడు.

"వానరులు రాకముందే సీతను రాముడికివ్వు. వానరులకంటే ముందే వాయువేగంతో, పిడుగుల గుంపుతో సమానమైన రామబాణాలు వచ్చి, రాక్షసుల తలలు నేలపడవేస్తాయి. అవి రాకముందే సీతను రాముడికివ్వు. అప్పుడు నీవల్ల రాక్షసులకు చేటు తప్పుతుంది" అంటాడు. విభీషణుడు పిరికివాడని ఇంద్రజిత్తు నిందించాడు. ఇంద్రజిత్తు పిల్లవాడని, అతడి బుద్ధి ఇంకా పరిపక్వం కాలేదని, మంత్రాలోచనలో యథార్థం తెలుసుకునే శక్తి లేదని తేల్చేశాడు విభీషణుడు. హితం ఉపదేశించే విభీషణుడి ముఖం చూసి (మృత్యుప్రేరితుడైన) రావణుడు కఠినమైన మాటలతో నిందించాడు మరోమారు. తమ్ముడివని చంపకుండా వదులుతున్నాననీ, "పాపాత్ముడా! కులద్రోహీ! ఛీ...పో. నా ఎదురుగా నువ్వు వుండవద్దు" అనీ అన్నాడు రావణుడు.

ఇలా కఠినంగా మాట్లాడిన అన్నమీద కోపంతో, ఇక ఈ పాపాత్ముడి నేలమీద అడుగు పెట్టకూడదని, రావణుడి పంచప్రాణాలు పోతున్నాయా అన్నట్లు ఆకాశానికి ఎగిరి విభీషణుడు ఆయనకు హితం బోధించాడు మళ్లీ. సీతను దొంగిలించి తెచ్చి అధర్మ కార్యం చేశావని చెప్పాడు. "నన్ను వెళ్లిపొమ్మన్నావు. అలాగే పోతాను. నన్ను విడిచి రాక్షసులను, లంకను, నిన్ను చక్కగా నిర్విచారంగా కాపాడుకో. నీకు మేలు కలుగుగాక!" అని వెళ్ళిపోయాడు. రావణాసురుడు చేసిన తెలివితక్కువ పని విభీషణుడుని విడవడమే. రావణుడు విభీషణుడి రాజనీతి విన్నట్లయితే శత్రుపక్షంలో చేరి వుండేవాడు కాదు.

శ్రీరాముడి ఆగ్రహానికి సముద్రుడు గురయ్యాడా?

వానర సేన సముద్ర తీరాన్ని చేరిన తరువాత, రావణుడిని వదిలి రాముడి దగ్గరకు వచ్చిన విభీషణ పట్టాభిషేకం జరిగిన అనంతరం, సముద్రం దాటి లంక చేరడానికి ఉపాయం ఆలోచించారు రామ, లక్ష్మణ, సుగ్రీవ, హనుమాదులు. దారి ఇవ్వమని ప్రార్థిస్తూ, బెదిరిస్తూ, తన కుడి భుజాన్ని దిండుగా చేసుకుని సముద్ర తీరంలో తూర్పు ముఖంగా, నియమబద్ధంగా పడుకున్నాడు శ్రీరాముడు. తాను సముద్రాన్నైనా దాటాలి, లేదా, సముద్రుడు చావనైనా చావాలి. రెంటిలో ఒకటి కావాలని శ్రీరాముడు నిశ్చయించుకున్నాడు. మౌనవ్రతం పూని సముద్రాన్ని ప్రార్థిస్తూ మూడు రాత్రులు (పాడ్యమి, విదియ, తదియ) పండుకున్నప్పటికీ బుద్ధిమాలిన సముద్రుడు కనబడలేదు.

మూడు రాత్రులు దర్భశయనం మీద వుండినా సముద్రుడు దర్శనం ఇవ్వకపోవడంతో కళ్లెర్ర చేసిన శ్రీరాముడు తన సమీపంలో వున్న లక్ష్మణుడిని చూసి, "లక్ష్మణా! చూశావా! సముద్రుడు కనబడడం లేదు. మంచిమాటలు చెప్పడం దుర్జనుల విషయంలో పనిచేయవు. నేను మొదట్లోనే సముద్రాన్ని ఎండించి కాలహరణం చేయకుండా వానరసేనను సముద్రాన్ని దాటించాలనుకున్నాను. మీరంతా సౌమ్య మార్గాన్ని సూచించడం వల్ల మీమాట తీసేయలేక కాలహరణమైనా సరే అని సహించడం వల్ల నన్ను దేనికీ పనికిరాని వాడిగా సముద్రుడు తలచాడు. ఏమిటీ వీడి ధైర్యం? ఇలాంటి వాడి విషయంలో ఓర్పు పనికిరాదు. నా బాణ పరంపరలతో నీరు కదలకుండా స్థంబించి, వీడి గర్వం అణచి, అల్లకల్లోలమయ్యేట్లు చేస్తాను. పదునైన బాణాలతో సాగరాన్ని ఎండబెట్తాను. మంచితనంతో వీడు మాట వినడు. సౌమిత్రీ! విల్లును, బాణాల సమూహాలను తెచ్చి ఇవ్వు. ఈ సముద్రాన్ని ఎండబెట్టి దుమ్ము లేపుతాను. వానరులు కాలినడకన సముద్రాన్ని దాటేట్లు చేస్తాను. చెలియలికట్టను దాటిరాకూడదనే మర్యాదను పోగొట్టి పొంగి పోరలేట్లు చేసి క్షోభకు గురిచేస్తాను" అని అంటాడు.

ఇప్పుడీ సముద్రాన్ని ఏం చేస్తానో చూడమని, దానికి ఏగతి పట్టుందో గమనించమని అంటూ, శ్రీరాముడు ప్రళయకాలాగ్ని లాగా మండిపడుతూ విల్లు గట్టిగా పట్టుకుని నారిలాగి, ఇంద్రుడి

పిడుగుల్లాగా బాణాలను వదిలాడు. ఆ బాణాలు సముద్రాన్ని అల్లకల్లోలం అయ్యేట్లు చేశాయి. వికార రూపంలో సముద్రం చాలా బాధపడి కళవళ పడింది. పాతాళంలో వుండే పన్నగులు విచ్చలవిడిగా వస్తున్న బాణాల వేగానికి ముఖాలు, కళ్ళు మండుతుంటే డీలాపడి శోకించారు. అలల సమూహాలు ఆకాశానికి తగిలేట్లు ఎగిసాయి. సముద్రం అడుగు నుండి కలత పడింది. ఆయన కోపాన్ని చూసి భయపడిన లక్ష్మణుడు "అన్నా! అన్నా! బాణాలు ప్రయోగించ వద్ద" ని చెప్పడంతో పాటు, ఆ రామచంద్రుడి విల్లును పట్టుకున్నాడు.

ఇంత జరిగినా సముద్రుడి దగ్గరనుండి స్పందన లేకపోవడంతో కోపం తెచ్చుకున్న శ్రీరామచంద్రమూర్తి, భయంకరమైన మాటలతో సముద్రుడితో ఇలా అన్నాడు. "ఓరీ సముద్రుడా! నా బాణాల సమూహంతో నీరు ఇంకి పోయేట్లు చేసి, నీ స్వరూపం లేకుండా చేస్తాను. చూస్తూ వుండు. నాకు కోపం వస్తే నువ్వు బతుకుతావా? ఓరీ! రాక్షసులకు ఉనికి పట్టయిన వాడా! నా పదునైన బాణాలతో సేతువు కట్టి వానరసేనను కాలినడకన ఈ క్షణంలోనే అవతలి ఒడ్డుకు చేరుస్తాను. అలా నా పరాక్రమం చూపకపోతే నీకు అసమానమైన నా బలపరాక్రమాలు ఎలా తెలుస్తాయి? కానీ రా!".

ఇలా అంటూ, బ్రహ్మ దండంతో సమానమైన ఒక బాణాన్ని వింటిలో సంధించి, రామచంద్రమూర్తి బ్రహ్మాస్త్రంతో దాన్ని అభిమంత్రించి, అమితమైన వేగంగా అల్లె తాటిని తన చెవి కొనవరకు లాగాడు. అప్పుడు కొండలు గడ-గడలాడాయి. దిక్కులు గాఢమైన అంధకారంలో మునిగి వణికాయి. సూర్య చంద్ర నక్షత్రాలు పెడతోవన పోయాయి. నదుల్లో, సరస్సుల్లో నీళ్ళు ఎండిపోయాయి. నక్షత్రాలు పెద్ద ధ్వనితో నేలరాలాయి. జంతువులు మూర్ఛపోయాయి. అంతటా చీకటి ఆవరించింది. సముద్రంలో ఒక యోజనం దూరందాకా నీళ్లు చెలియలికట్టను వదిలి లోపలికి ఈడ్చుకు పోయాయి. దయాసముద్రుడైన రామచంద్రమూర్తి భూత సంహారం అంటే ఇష్టం లేనందున బాణం వదల లేదు.

అప్పుడు సూర్య తేజస్సుతో సర్పాలతో చుట్టుకుని బంగారు సొమ్ములు ధరించిన సముద్రుడు నీళ్లలోనుండి బయటకి వచ్చాడు. రామచంద్రమూర్తి దగ్గరకు వచ్చి నమస్కారం చేసి, "రామచంద్రా!" అని ఆదరంగా పిలిచి ఇలా అన్నాడు.

"పంచమహాభూతాలైన భూమి, ఆకాశం, అగ్ని, జలం, వాయువు శాశ్వతమైన తమ మార్గాన్ని వదిలి వాటి స్వభావాన్ని విడవవు. ఆ విధంగానే జలరూపంలో వున్న నేను నా లోతు తెలియనీయను. కాలి నడకన దాటనీయను. ఇది నా స్వభావం. దీన్ని నేను తప్పకూడదు. రామచంద్రా! సౌమ్యుడా! నేను నా స్వభావానికి విరుద్ధంగా ప్రవర్తించడం సరైన పని కాదు. ఏ కారణాన కూడా నేను నా నీటిని గట్టిపడేట్లు చేయకూడదు. అలా చేస్తే ఆ జీవజంతువులు బాధపడ్తాయి. చచ్చిపోతాయి. కాబట్టి నేనెప్పుడూ అలాంటి పనిచేయకూడదు. నన్నాశ్రయించిన వారిని నేనెలా బాధపెట్టుతాను? అయినప్పటికీ నీ వానర సేనంతా సముద్రాన్ని దాటేంతవరకూ వారికి ఏ ఆపద లేకుండా, నా చేతనైనంత వరకు రక్షిస్తాను. నీ సేన దాటడానికి మిట్ట ప్రదేశాన్ని ఇస్తాను. కోపం వదులు". అని సముద్రుడు చెప్పగా రామచంద్రమూర్తి ఇలా అన్నాడు.

"ఈ బాణం వ్యర్థం కాకూడదు. దీన్ని ఎక్కడ వేయాలి?" అని రామచంద్రమూర్తి సముద్రుడిని

ప్రశ్నించాడు. జవాబుగా, ఆయన, ఈ మహాస్త్రాన్ని పవిత్రమైన ద్రుమకుల్యమనే ప్రదేశంలో వేయి అన్నాడు. సముద్రుడు ఇలా చెప్పగానే ఆయన చూపించిన దిక్కుగా నిప్పులాగా మండుతున్న తన బాణాన్ని ప్రయోగించాడు రామచంద్రమూర్తి. ఆ బాణం పడ్డ చోట ఎడారి అన్న పేరు వచ్చింది. ఆ బాణం భూమిలో ప్రవేశించినందున కలిగిన రంధ్రం నుండి పాతాళ జలం పైకి వుబికింది. ఆ కూపానికి వ్రణకూపం అని పేరు. అక్కడ నుండి వచ్చిన నీరు సముద్రంలాగా అనిపిస్తుంది. ఆ బాణం భూమిని భేదించడం వల్ల ఆ వేడికి అక్కడ వారు తాగుతున్న గుంటల్లోని నీరు కూడా ఎండిపోయింది. ఈ విధంగా సముద్రంలోని ఒక భాగం రామచంద్రమూర్తి తీక్ష్ణమైన బాణానికి కాలిపోగా, సేతువు కట్టడానికి తనలో స్థలం చూపిస్తానని సముద్రుడు చెప్పాడు. రామచంద్రమూర్తిని చూసి సముద్రుడు ఇలా అన్నాడు అప్పుడు.

"మీ దగ్గర వున్న నలుడు అనేవాడు విశ్వకర్మ కుమారుడు. శిల్ప విద్యలో తండ్రితో సమానమైన వాడు. తండ్రి వరబలం వల్ల ఆ విద్యల్లో ప్రవీణుడు, ప్రసిద్ధ శక్తి కలవాడు అయ్యాడు. వీడు సేతువు నిర్మించడానికి ప్రయత్నం చేయాలి. ఆ సేతువు భారాన్ని నేను వహిస్తాను. కొండలు, చెట్లు నీళ్లలో వేసినప్పుడు అవి మునిగి పోకుండా నేను కాపాడుతాను. నీళ్లమీద తేలేట్లు చేస్తాను".

ఇలా చెప్పి సముద్రుడు కనబడకుండా పోయాడు. అప్పుడు నలుడు ఇలా అన్నాడు. "రామచంద్రదేవా! సముద్రుడు నిజం చెప్పాడు. నా తండ్రి వరబలంతో నేను సముద్రం మీద సేతువు కట్టాను. నేను విశ్వకర్మకు ఔరస పుత్రుడిని. పూర్వం విశ్వకర్మ నా తల్లికి, తన కొడుకుకు సమస్త శిల్ప విద్యలు వస్తాయని వరం ఇచ్చాడు. ఆ వరం బలంతో నేను శిల్ప విద్యలో తండ్రితో సమానుడనయ్యాను. ఈ సముద్రుడు చెప్పడం వల్ల నా విద్య గుర్తుకు వచ్చింది. నేను సేతువు కట్టాను. దానికి కావాల్సిన పదార్థాలు తేవడానికి నాకు వానరుల సహాయం కావాలి. నేనే తెచ్చుకుని కట్టాలంటే ఆ పని కాదు".

ఇలా నలుడు చెప్పడంతో, రామచంద్రమూర్తి వానరులందరికీ చెట్టులు, గుట్టలు తెచ్చి నలుడికి అందివ్వమని ఆజ్ఞాపించాడు. వారలాగే అడవికి పోయి చెట్లు పెళ్లగించుకుని సముద్రతీరానికి వచ్చారు. అవన్నీ నలుడు సముద్రంలో పడవేశాడు. సేతువు వంకరగా పోకుండా నూరామడ పగ్గాలు ఈ కొన నుండి ఆ కొన దాకా ఈ పక్కన కొందరు, ఆ పక్కన కొందరు పట్టుకున్నారు. ఎలా-ఎలా చేయాలో అని రామచంద్రమూర్తి చెప్తుతుంటే వానరులు సహాయం చేస్తుండగా నలుడు మొదటి రోజున సముద్రంలో పద్నాలుగు ఆమడల సేతువు కట్టాడు. రెండో రోజున వానరుల సహాయంతో ఇరవై, మూడవ రోజున ఇరవై రెండు, నాల్గవ రోజున ఇరవై రెండు ఆమడల సేతువు ఉత్సాహంగా కట్టారు. సామర్థ్యసంపత్తి కల నలుడు ఐదవ రోజున ఇరవై మూడు ఆమడల దూరం సేతువు కట్టాడు. ఇలా మొత్తం 101 ఆమడ దూరం కట్టారు. నీటి పొడుగు నూరామడలే కాబట్టి, మిగతా ఆమడ అటూ-ఇటూ భూమ్మీద సగం-సగం ఆమడ కట్టారు.

అప్పుడు సుగ్రీవుడు రామచంద్రమూర్తితో హనుమంతుడి వీపుమీద రాముడు, అంగదుడి వీపుమీద లక్ష్మణుడు ఎక్కి ఆకాశ మార్గాన ఆవలి ఒడ్డుకు రావచ్చని చెప్పాడు. కాని రాముడు వానరులను విడిచి పోదల్చుకోలేదు. సుగ్రీవుడు వెంటే ఆయనా దాటసాగాడు. కొందరు వానరులు సేతువు మీదగా,

కొందరు ఈదుకుంటూ, కొందరు ఆకాశ మార్గాన ఆవలి ఒడ్డుకు చేరారు. రామచంద్రమూర్తి చేసిన ఈ అసాధారణ కార్యం వల్ల ఇక రావణుడి చావు తప్పదని దేవఋషి సిద్ధ చారణులు సంతోషంతో తమ మనస్సులలో ఉప్పొంగి పోయారు.

సమస్త శుభాశుభ శకునాల లక్షణం తెలిసిన రామచంద్రమూర్తి తనకు శుభ శకునాలు కలగడం చూసి సంతోషించి తమకిక భయం లేదని భావించి, లక్ష్మణుడిని కౌగలించుకుని, వానరసేనను ఒక మంచి ప్రదేశంలో, ఎక్కడైతే మంచినీరు విస్తారంగా లభిస్తుందో అక్కడ, వ్యూహాత్మకంగా తీర్చమని చెప్పాడు. వానరులకు, భల్లూకాలకు, రాక్షసులతో వినాశనకరమైన, మిక్కిలి భయంకరమైన యుద్ధం లోకనాశనం కొరకు తటస్థించింది. దుమ్మురేపుతూ గాలి వీచింది. కొండల శిఖరాలు వణకాయి. భూకంపం పుట్టింది. ఆ కారణాన చెట్లు నేలకూలాయి. భయంకరమైన డేగలు, మృగాలు, మేఘసమూహాలు ఉత్పాత సూచకంగా నెత్తురు వర్షం కురిపించాయి.

"లక్ష్మణా! సంధ్యాకాల మేఘాలు కుంకుమ వర్ణం కలవిగా వున్నాయి. సూర్యుడిలో ఒక నల్లటి చుక్క కనపడుతున్నది. సూర్యుడి నుండి ఒక నిప్పు సమూహం మండుతూ నేలమీద పడింది. సూర్యుడిని చూసి అన్ని ప్రదేశాల్లో వున్న మృగాలు, పక్షులు, దుఃఖస్వరంతో ధ్వనిస్తున్నాయి. రాత్రుల్లో చంద్రుడు తన కాంతి క్షీణించడంతో కోనల్లో నలుపు, ఎరుపు కలిసిన కాంతి కలిగి ప్రళయకాలంలో లాగా వేడి కలిగిస్తున్నాడు. ఈ శకునాల ఫలం ఏంటంటావా? ఈ నేల నెత్తురుతో, మాంసంతో బురదకాబోతున్నది. కాబట్టి రావణపాలిత లంకానగారాన్ని ఇప్పుడే సేనతో పోయి ముట్టడిద్దాం" అని రామచంద్రుడు చేతిలో విల్లు ధరించి లంకకు అభిముఖంగా పోయాడు. యుద్ధాభిలాష ఆవహించడంతో సంతోషంతో పోతున్న రామచంద్రమూర్తి వెంట సుగ్రీవ విభీషణులు, ఇతర వానరులు రాక్షసులను చంపాలన్న నిశ్చయంతో పోయారు.

లంకను చూసిన రామచంద్రమూర్తి సీతాదేవిని తలచుకున్నాడు. పాపాత్ముడైన రావణుడి చెరలో సీత మనోవేదనతో దీనురాలై దుఃఖపడుతున్నది కదా! అని తనలో అనుకున్నాడు. ఆ తరువాత, రామచంద్రమూర్తి, రాజనీతి శాస్త్రం ప్రకారం సేనలను విభజించాడు. నీలుడు అతడి సేనతో అంగదుడు హృదయ స్థానంలో వుండేట్లు, ఋషభుడు తన సేనతో కుడిపక్క వుండే విధంగా, గంధమాదనుడు ఎడమవైపు నిలిచేట్లు, వేగదర్శి, సుసేషణుడు, జాంబవంతుడు వారి-వారి సేనలతో గర్భం కాపాడేట్లు ఆజ్ఞచేసి, తానూ లక్ష్మణుడితో కలిసి శిరోదేశంలో నిలిచాడు. పడమటి భాగాన్ని వరుణుడు కాచేట్లు, సేన పుచ్ఛ భాగాన్ని సుగ్రీవుడు రక్షించేట్లు వ్యూహం పన్నాడు శ్రీరాముడు.

◆❖◆

దూతల మాటలు రావణుడి చెవికెక్కలేదా?

శ్రీరాముడు వానర సైన్యంతో సముద్రం ఒడ్డున వున్న సంగతి రావణుడి వేగులవాడు శార్దూలుడు కనిపెట్టాడు. సుగ్రీవుడి సేనను చూసి వేగంగా రాక్షసరాజు దగ్గరికి పోయి, వానరుల, ఎలుగుబంట్ల సేన లంకా పట్టణం మీద పడడానికి వచ్చిందనీ, ఆ సేన పరిమాణం సముద్రంలా పదియోజనాల నేల ఆక్రమించి వుందనీ, రామలక్ష్మణులు సీతాదేవి దగ్గరికి రావడానికి సమీపంలోనే సముద్రం ఒడ్డున వున్నారనీ, వారి సమాచారం వివరంగా సర్వం తెలుసుకోవడానికి దూతలను పంపమనీ, ఈ సమయంలో సామమో, దానమో, భేదమో అవలంభించడం మంచిదనీ చెప్పడంతో, ఆ మాటలకు రావణుడు హెచ్చరికతో తదుపరి కార్యాన్ని ఆలోచించాడు.

శుకుడు అనే పేరుకలవాడిని పిలిచాడు రావణుడు. వాడిని పోయి సుగ్రీవుడికి తన మాటలుగా ఈ విధంగా చెప్పమన్నాడు. "సుగ్రీవా! నాతో నిష్కారణ కలహం నీకు ధర్మం కాదు. నువ్వు, నేనూ ఇద్దరం బ్రహ్మ మనుమలం. కాబట్టి మనకు భందుత్వం వుంది. అల్పుడైన రాముడితో నీకేం పని? రాముడితో స్నేహం చేయడం వల్ల నీకు కలిగే లాభం లేదు. వదిలిపోతే నీకు కలిగే నష్టం లేదు. నువ్వు నాకు సోదరసమానుడివి. రాముడి భార్యను నేను అపహరిస్తే నీకు కలిగే నష్టం ఏమిటి? ఇది ఆలోచించి నీ వూరికి వెళ్లిపో. మనకు విరోధం ఎందుకు? నువ్వు లేకపోతే, సముద్రాన్ని దాటి వానరులు ఇక్కడికి రాలేరు. ఇది నువ్వు ఆలోచించు".

ఇలా చెప్పిన రాక్షసరాజు ఆజ్ఞానుసారం శుకుడు చిలుకలాగా ఆకాశమార్గాన పోయి, నేలదిగకుండా అక్కడినించే రావణుడు చెప్పిన మాటలను యథాతథంగా సుగ్రీవుడికి చెప్పాడు. ఆ మాటలకు వానరులు కోపించి, ఆకాశానికి ఎగిరిపోయి వాడిని పట్టుకుని, విసిరి నేలపైకి కొట్టారు. నేలమీద పడిన వాడు కలవరపడి, "రామచంద్రా! నేను దూతను కాబట్టి నన్ను చంపకూడదు. వీరు నన్ను చంపుతున్నారు. వారిని నివారించు" అని రాముడిని ఉద్దేశించి అన్నాడు. వాడి మొర విన్న రామచంద్రమూర్తి, ఆదరంతో వాడిని చంపవద్దని చెప్పడంతో చంపకుండా చెరలో వేశారు. సేతువు కట్టి, వానరులు ఆవలి ఒడ్డుకు

చేరినతరువాతే వాడిని వదిలారు.

అప్పుడు సుగ్రీవుడు ఆ దూతను చూసి "రావణుడితో ఇలా చెప్పు. ఎప్పుడూ నీకూ, నాకూ స్నేహభావం లేదు. ఈ కారణాన రాక్షసరాజా! నీమీద దయ తల్చాల్సిన అవసరం లేదు. రామచంద్రమూర్తి నామీద స్నేహభావంతో వున్నాడు. అగ్నిసాక్షిగా స్నేహం చేశాడు. వాలిని చంపి నాకు ఉపకారం చేశాడు. రామచంద్రమూర్తి నీకు పగవాడు. నేనేమో ఆయన మేలు కోరేవాడిని. కాబట్టి నువ్వు నాకూ పగవాడివే. వాలి నాకు పగవాడు కాబట్టి చంపించాను. నిన్నూ అలాగే చంపిస్తాను. నిన్ను నీ జ్ఞాతులతో, హితులతో, చుట్టాలతో, కొడుకులతో ఒక్కడిని కూడా వదలకుండా అందరినీ యుద్ధంలో చంపుతాం. నువ్వు పాతాళంలో దాక్కున్నా, సీతాపతి యుద్ధంలో నీ తల నేలకూలుస్తాడు. ఇంద్రాదులకు కూడా జయించనలవి కాని రామచంద్రమూర్తిని సామాన్యుడని భావించావా? రామచంద్రమూర్తిని నీపాలిటి మృత్యువుగా అనుకో" అని అన్నాడు.

సేతునిర్మాణ, సేనా స్థాపనాది కార్యక్రమాలు తీరాయి కాబట్టి, శుకుడిని వదిలిపెట్టమని రామచంద్రమూర్తి సుగ్రీవుడికి చెప్పాడు. ఆయన వెంటనే శుకుడిని వెళ్లగొట్టాడు. వాడు భయం–భయంగా బయల్దేరి రావణుడిని సమీపించాడు. తనకు జరిగిన పరాభవాన్ని గురించి చెప్పాడు. శ్రీరాముడు రక్షించకపోతే తనను చంపేవారని కూడా చెప్పాడు. ఇంకా ఇలా అన్నాడు: "రామచంద్రమూర్తి సుగ్రీవుడితో కలిసి సీతాదేవి సమీపానికి రానే వచ్చాడు. అదిగో అక్కడే వున్నాడు. రామచంద్రమూర్తి సముద్రం నీళ్ళలో సేతువు కట్టాడు. సముద్రం దాటి దాని దక్షిణ తీరంలో సేనలతో వచ్చి లంకను ముట్టడి చేశాడు. రాక్షసులను చంపడానికి విల్లు చేతపట్టి సిద్ధంగా వున్నాడు. వానరులు లంక కోటలమీదకు ఎక్కక ముందే సీతను ఇవ్వడమో, యుద్ధం చేయడమో నిర్ణయించు".

సీతను మళ్లీ రామచంద్రమూర్తికి అర్పించడమే శ్రేయస్కరమని శుకుడు చెప్పిన మాటలకు కోపం వచ్చింది రావణుడికి. దేవదానవులు గుంపుగా ఒక్కటై యుద్ధంలో తన్నెదిరించినా, రామలక్ష్మణులకు సీతను ఇచ్చేది లేదన్నాడు. రాముడికి తన బలం, వీర్యం, శక్తి, ఏమాత్రం తెలియదు కాబట్టి యుద్ధానికి వస్తున్నాడనీ, దానికే నువ్వు భయపడితే ఎలా అనీ, వేయికన్నుల ఇంద్రుడు వచ్చి ఎదిరించినా, పాశం పట్టుకుని వరుణుడు వచ్చినా, యమదండం చేతబూని యముడే వచ్చినా, ధనాధిపతి కుబేరుడే వచ్చినా, తనకే కీడు చేయలేరని ప్రగల్భాలు ఆడాడు.

ఇలా శుకుడికి చెప్పిన తరువాత శుక సారణులు అనే తన మంత్రులను చూసి, సముద్రం ఎక్కడ? దానిమీద సేతువు కట్టడం ఏమిటి? అదేమన్నా వాగా? వంకా? సేతు నిర్మాణం నిజమా? అబద్ధమా? అనేది తెలుసుకోవడంతో పాటు, వానర సేన సంఖ్య ఎంతో కూడా తెలవాలనీ, కాబట్టి వారు మారు వేషాలు వేసుకుని ఎవరూ చూడకుండా వానరసేనలోకి పోవాలనీ, పోయి, వానరుల శక్తి ఏమాత్రం? రాముడి, సుగ్రీవుడి మంత్రులెవరు? యుద్ధానికి ముందుగా కాలు దువ్వుతున్న వారెవ్వరు? ఎక్కువ శౌర్యం కల వానరులెవ్వరు? వానరసేన దిగింది ఎక్కడ? సేతువు ఎలా కట్టారు? వానర సేనానాయకుడు ఎవరు? లాంటివన్నీ చక్కగా తెలుసుకుని రమ్మన్నాడు.

ఇలా రావణుడి ఆజ్ఞానుసారం శుకసారణులు వానరుల వేషాలు ధరించి పోయి వానరసేన చూసి

భయపడ్డారు. భయంతో దేహాలు పులకరిస్తుంటే దిక్కు తెలియక వానర సేనను పరికించి చూశారు. లెక్కపెట్టడానికి వశం కాని ఆ వానర సేన కొండ గుహలలో, సముద్ర తీరంలో, ఉద్యానవనాలలో, సేతువు దాటిన వారిని, దాటుతున్నవారిని, వేచి చూస్తున్న వారిని చూసి దాని అంతం, ఆరంభం తెలుసుకోలేక తిరగసాగారు. ఆ సమయంలో, రావణుడు ఎవరినైనా వేగులవారిని పంపుతాడేమోనని అనుమానించి, వారిని కనిపెట్టాలని తిరుగుతున్న విభీషణుడు, శుకసారణులను పట్టుకుని, పెడరెక్కలు విరిచి, వీరు రావణుడి వేగులవారని చెప్తూ, రాముడి ఎదుట నిలబెట్టాడు. శుకసారణులు రావణుడి ఆజ్ఞానుసారం వానరసేన పరిమాణాన్ని తెలుసుకునేందుకు వచ్చామని చెప్పారు. ఇది తాము చేసిన దోషమని, అందుకుగాను తమను చంపదల్చుకుంటే చంపవచ్చని, రక్షించదల్చుకుంటే రక్షించవచ్చని అంటారు. శత్రువు, మిత్రుడు అన్న భేదం లేకుండా అందరి మేలుకోరే శ్రీరాముడు సంతోషంతో ఇలా అన్నాడు.

"మీరు సమస్త సైన్యాన్ని చూసి వుంటే, మేమున్న విధానాన్ని చక్కగా పరీక్షించితే, రావణాసురుడు మీకు చెప్పిన పనులన్నీ చక్కగా నెరవేర్చినట్లయితే, మీరు వెళ్లిపొండి. మీ ఇష్టప్రకారం ఇంకా చూడాలనుకుంటే చూసి పొండి. ఆ తరువాత విభీషణుడితో వారిని వదలమని చెప్పాడు. శుకసారణుల కట్లు విప్పించాడు. వారు రామచంద్రుడిని "జయ జయ రామచంద్రా" అని పొగిడారు. ఆ తరువాత రావణుడి దగ్గరికి పోయారు. పోయి ఇలా చెప్పారు.

"రాక్షసరాజా! భయంకర తేజంకల ఆ గొప్ప పరాక్రమవంతుడి గురించి మేమేమని చెప్పగలం? చెప్పడం సాధ్యం కాదు. దిక్పాలకులతో సమానమైన నలుగురు బలశాలులు రామలక్ష్మణ, సుగ్రీవ, విభీషణులు ఒక్కచోట చేరారు. ఈ నలుగురే మన పట్టణాన్ని పాడుతో సహా పీకి నాశనం చేయగల సమర్థులు. మిగతా వానరుల మాట అలా వుంటే, ఒక్క శ్రీరాముడే తన పరాక్రమంతో మన లంకను పొడిచేసి నేలపడేయగలడు. మిగిలిన ముగ్గురు కూడా అవసరం లేదు. రామలక్ష్మణ సుగ్రీవులు రక్షించే వానరసేనను మనుష్యులు, రాక్షసులే కాదు దేవతల గుంపంతా ఇంద్రుడితో సహా జయించలేరు. వానరసైన్యంతో యుద్ధం చేయడానికి దిగడం తగదు. కోపం తగ్గించి రాముడికి సీతను ఇవ్వడమే సరైన పని. దానివల్ల నీకు మేలు కలుగుతుంది".

జవాబుగా రావణుడు దేవదానవులు కలిసి ఒక్కటిగా వచ్చి తన్ను ఎదిరించినా, లోకాలన్నీ కలిసి వచ్చి తన్ను చంపుతామన్నా, సీతను మళ్లీ ఇవ్వనన్నాడు. ఇలా అంటూ, తాటి చెట్టంత ఎత్తున్న ఆకాశాన్ని అంటుతున్న తన ప్రాసాదాన్ని ఎక్కాడు. అక్కడ నుండి కొండల్లో, అడవుల్లో, సముద్రంలో, వానరులతో నిండిన ప్రదేశాన్ని, అంతంలేని, లెక్కలేని, వానరసేనను చూసి సారణుడితో వానర వీరుల వివరాలు చెప్పమని అడిగాడు. ఆ విషయాలు తెలిసిన సారణుడు రావణుడితో నీలుడు, అంగదుడు, నలుడు, కుముదుడు, రంభుడు, శరభుడు, పనసుడు, వినతుడు, క్రోధనుడు, హరుడు, గవయుడు, దూమ్రుడు, జాంబవంతుడు, దంభుడు, ప్రమాథి, గవాక్షుడు, కేసరి, శతవలి, గజుడు, గవాక్షుడు, నీలుడు, గవయుడు, మైందుడు, ద్వివిదుడు, సుముఖుడు, అసుముఖుడు, హనుమంతుడు....ఇలా ఒక్కొక్క వానర వీరుల బల పరాక్రమాల గురించీ వివరించాడు. వారంతా లంకను నాశనం చేయడానికి కడు సమర్థులని చెప్పాడు.

ఆ తరువాత రామలక్ష్మణుల గురించి, వారి వీరత్వం గురించీ వివరించాడు సమగ్రంగా.

శుకుడు ఇంతవరకు వానర సేన వీరులను గురించి చెప్పి ఆ తరువాత వానర సేనా సంఖ్యను వివరించాడు. "రాక్షసరాజా! ఇక సంఖ్యా లక్షణం, వానర సేనా సంఖ్య చెప్తా విను. నూరు లక్షలు ఒక్క కోటి. లక్షకోట్లు ఒక్క శంఖం. లక్ష శంఖాలు ఒక మహాశంఖం. లక్ష మహాశంఖాలు ఒక బృందం. లక్ష బృందాలు ఒక మహాబృందం. లక్ష మహాబృందాలు ఒక పద్మం. లక్ష పద్మాలు ఒక మహాపద్మం. లక్ష మహాపద్మాలు ఒక ఖర్వం. లక్ష ఖర్వాలు ఒక మహాఖర్వం. వేయి మహాఖర్వాలు ఒక సముద్రం. లక్ష సముద్రాలు ఒక ఓఘం. లక్ష ఓఘాలు ఒక మహౌఘం అని గణిత శాస్త్రజ్ఞులు చెప్తారు. ఈ గణితం ప్రకారం వానరసేన సమాఖ్య చెప్తా విను. వేయి కోట్లు, నూరు శంఖాలు, వేయి మహాశంఖాలు, నూరు బృందాలు, ఒక మహాబృందం, వేయి నూర్ల పద్మాలు, వేయి మహాపద్మాలు, నూరు ఖర్వాలు, నూరు సముద్రాలు, నూరు మహౌఘాలు, పదివేల మహౌఘాలు కలిగి పెద్ద సముద్రంలాగా వున్న కపిసేనతో విభీషణుడు తనకు తోడుండగా, మంత్రులతో కలిసి సుగ్రీవుడు నీతో యుద్ధానికి సన్నద్ధంగా వున్నాడు. దేవరా! సుగ్రీవుడు నువ్వు అల్ప ప్రయత్నం చేస్తే వూరికే పోడు. మిక్కిలి బలశాలి. వీర్యం, విక్రమం సమృద్ధిగా కలవాడు. వానర సేనను బాగా తేరిపార చూసి, ఎలా చేస్తే ఓడిపోకుండా శత్రువును గెలుస్తావో అలాంటి ప్రయత్నం చేయి" అన్నాడు.

శుకుడు ఈ విధంగా చెప్పగా వానర శూరుల సమూహాన్ని, రామచంద్రమూర్తి సమీపంలో వున్న తన తమ్ముడు విభీషణుడి అసమాన బలాన్ని, రాముడికి కుడి భుజమైన లక్ష్మణుడి పరాక్రమాన్ని, సర్వ వానర ప్రభువైన సుగ్రీవుడి శౌర్యాన్ని తలచుకుని భయంతో గుండె ఝల్లుమంది. అది బయటపడకుండా కోపం తెచ్చుకున్నాడు. తెచ్చుకుని, శుకసారణులను చూసి, తనకు అప్రియమైన మాటలు చెప్పవచ్చునా? ఎందుకు మీ తెలివితేటలు బూడిదైపోయాయి? అని నిందించాడు. "మీలాంటి మూర్ఖులను మంత్రులుగా వుంచుకుని ఇన్నాళ్లు ఎలా రాజ్యం చేసానంటారా? మీలాంటి బుద్ధిమాలిన మంత్రులున్నప్పటికీ దైవ కృపవల్ల రాజ్యం చేస్తున్నాను కాని మీ ఆలోచనాబలం వల్ల మాత్రం కాదు" అని అంటాడు.

ఆ తరువాత శార్దూలాదులను శ్రీరాముడి చర్య కనుగొమ్మని రావణుడు ఆజ్ఞాపించాడు. వారు మారువేషాలు వేసుకుని, సముద్ర తీరానికి చేరారు. అక్కడ వానర సైన్యాన్ని చూసి భయపడి, వెలవెలబోయారు. విభీషణుడు వారిని వేగులుగా గుర్తించి, శార్దూలిడిని పట్టుకుని కొట్టుతుంటే వాడి ఏడుపు ధ్వని విన్న రామచంద్రుడు దయతో వాడిని విడవమని చెప్పాడు. తిరిగి వెనక్కు వచ్చి కపుల చేతుల్లో తాను పడ్డ బాధలు రావణుడికి చెప్పాడు. కపుల పరాక్రమం గురించీ చెప్పాడు. వాళ్ళను యుద్ధంలో గెలవడం అసాధ్యమనీ, సీతను అప్పగించడమే మేలనీ చెప్పాడు.

వారంతా సువేలాద్రిమీద వున్నారనీ, తరువాత చేయాల్సిన పనులేంటో రావణుడే నిర్ణయించుకోవాలనీ అన్నాడు. సీతాదేవిని అప్పగించే సమస్యే లేదని అన్నాడు రావణుడు. యుద్ధానికి సిద్ధం అన్నాడు.

◆❖◆

రాముడి కల్పిత శిరశ్చాపాన్ని సీత నమ్మిందా?

శుకసారణులు, శార్దూలాదులు చెప్పిన వివరాల ద్వారా వానర సేన విషయం విన్న రావణుడి గుండె ఝులుక్కుమ్మంది. కొంచెం భయపడ్డాడు. మళ్లీ ధైర్యం తెచ్చుకున్నాడు. మహా బలవంతుడైన, మాయలు చేయడం నేర్చిన విద్యుజ్జిహ్వుడనే వాడిని పిలిచాడు. సీతను మోసగించాలనీ, అందుకోసం కొంచెం కూడా తేడా లేకుండా శ్రీరాముడు శిరస్సును, బాణంతో సహా అతడి విల్లును, విద్యుజ్జిహ్వుడు తన శక్తితో కల్పించి తానున్న చోటుకు తీసుకురమ్మని చెప్పాడు. ఆ తరువాత రావణుడు అశోకవనం ప్రవేశించి, సీతను చేరబోయాడు. ఆమెతో ఇలా అన్నాడు.

"ఓసీ సీతా! నన్ను స్వీకరించమని నిన్ను ఎంతగానో ప్రార్థించాను కదా! నామాట నువ్వు ఏమాత్రం లక్ష్యం చేయకుండా ఛీకొట్టి పోమ్మన్నావు. నీమగడు, నీ ప్రియుడు యుద్ధంలో చనిపోయాడు. ఇక ఇప్పుడు ఎంత ఏడవాలని వుంటే అంత ఏడువు. వేరే దిక్కులేక నువ్వే నా భార్యవవుతావు. చనిపోయినవాడు నువ్వు ఏడుస్తే బతికొస్తాడా? నా భార్యలలో ఒకదానివై వుండు. రాముడు చనిపోయినా నేను దిక్కుగా వున్నాను. నీ మగడు చనిపోయిన విధం చెప్తా విను. అతడు వానరసేనతో నన్ను చంపడానికి సముద్ర తీరానికి వచ్చాడు. సూర్యాస్తమాన సమయంలో ఉత్తర దిక్కున నీ మగడు బడలికతో నిద్రపోయినప్పుడు, ప్రహస్తుడు సైన్యంతో అక్కడికి మెల్లగా పోయి అదను చూసి పైన పడి పెద్ద కత్తితో రాముడి గొంతు కరకరమని నరికాడు. ఇది చూసి వానరసేన ఒక్కొక్కరే చస్తూ నేలకూలారు. కొందరు సముద్రంలో దూకారు. కొందరు ఆకాశానికి ఎగిరిపోయారు. ఇలా నా సేనలు చంపగా నీ మగడు పరివారంతో సహా చచ్చాడు".

ఇలా సీతాదేవితో అంటూనే, రాముడి శిరస్సును యుద్ధభూమి నుండి తెచ్చిన విద్యుజ్జిహ్వుడిని పిలుచుకుని రమ్మని ఒక రాక్షసుడికి చెప్పాడు. వాడలాగే రాముడి శిరశ్చాపాన్ని తెచ్చి జానకి ఎదుట పెట్టి వెళ్లిపోయాడు. రావణుడు వాటిని సీతాదేవి ముందుకు తోసి, "ఓ కమలాక్షీ! ఇదిగో మా ప్రహస్తుడు బహిరంగంగా, అందరూ చూస్తుండగా, యుద్ధభూమి నుండి తెచ్చిన రాముడు ఎక్కుబెట్టే విల్లు. ఇంకా

ఎందుకు ఆలశ్యం చేస్తావు? నాకు స్వాధీనపడు" అంటాడు.

సీత చూసిన ఆ శిరస్సు అచ్చు రాముడిదిలాగా వుండడంతో, అది తన మగడి తల అని నమ్మి శోకాతిశయంతో ఏడిచింది. తాను పంపించిన జడబిళ్ళను చూసిన సీతాదేవి అది తన మగడిదే అని నమ్మి బాగా ఏడ్చింది. "ప్రాణేశ్వరా! నువ్వు అల్పాయువుడివి అయ్యావు. పాపరహితుడవైన నీకు మృత్యువు ఇప్పుడు రావాల్సిన కారణం లేదు. నీకు నిష్కారణంగా అకాల మృత్యువు ఎలా వచ్చిందో? దీనికి దైవమే కారణం. నీతిశాస్త్రాలు అన్నీ నీకు తెలుసుకదా? ఎప్పుడు ఏది చేయవచ్చు, ఏది చేయకూడదు అని తెలిసిన నీకు మృత్యువు కళ్ళకు కనపడకుండా వచ్చి పైన పడింది. దైవ సంకల్పానికి అడ్డం లేదుకదా?" అనుకుంటూ ఏడ్చింది.

రావణుడిని ఉద్దేశించి, "రావణా! ఆలశ్యం చేయకుండా రామచంద్రుడి మీద నన్ను పడేయి. భార్యను భర్తతో కలిపి మంచి పనిచేయి. ఇలా చేస్తే, నీకు మేలు కలుగుతుంది. రాక్షసరాజా! రాముడి దేహంతో నా దేహం, నాధుడి శిరస్సుతో నా శిరస్సు కూర్చు. సహగమనం చేసి నా భర్త పోయిన లోకానికి నేను కూడా పోతాను". ఈ విధంగా సీతాదేవి పలు విధాలుగా దుఃఖిస్తూ, భర్త శిరస్సు, ధనుస్సు అనేక పర్యాయాలు చూసి-చూసి ఏడుస్తూ, మూర్ఛ పోతుంది.

ఇలా సీత ఏడుస్తున్నప్పుడు రావణుడు అశోకవనాన్ని వదిలి రాముడు చేయబోయే ప్రయత్నం తెలుసుకోవాలని సభకు పోయాడు. అక్కడ యుద్ధ విషయంలో చేయాల్సిన ఆలోచన చేయసాగాడు. ఇక్కడ రావణుడు అశోకవనం నుండి వెళ్లగానే రాముడి తల, విల్లు అదృశ్యం అయింది. ఆ సభలో రావణుడు చేయాల్సిన పని చక్కగా ఆలోచించి దగ్గర వున్న మంత్రులతో, సేనానాయకులతో ఇలా అన్నాడు. "అందరూ వినేట్లు భేరులు గట్టిగా వాయిస్తూ, రాక్షస సేననంతా యుద్ధ ప్రయత్నంలో ఒక్కచోటికి తెండి. వారికి కారణం చెప్పవద్దు". ఆ మంత్రులు, సేనానాయకులు అలాగే చేస్తామని చెప్పి, వారి-వారి సేనలను ఒక్కో చోట చేర్చి, ఆ వృత్తాంతాన్ని రావణుడికి చెప్పారు.

సీతను కాపాడే వారిలో సరమ అనే ఒక రాక్షసి ప్రాణమిచ్చెనా సీతాదేవిని రక్షించడమే వ్రతంగా పెట్టుకున్నది. స్వభావరీత్యా దయాగుణం కలది. రావణుడి వల్ల మోసగించబడ్డ సీత దగ్గరికి పోయి, మెత్తటి వాక్యాలతో ఊరడించి ఇలా అన్నది. "జానకీ! ఊరడిల్లు. సంతాప పడవద్దు. వాస్తవం చెప్తాను విను. విదితాత్ముడైన రామచంద్రమూర్తిని నిద్రపోయే సమయంలో హింసించడం సాధ్యం కాదు. అలా చంపబడనూలేదు. వానరులంతా క్షేమంగా వున్నారు. ఒక్కడు కూడా చావలేదు. వానరులను రాముడు రక్షిస్తున్నందున వారిని బాధించడం ఎవరికీ సాధ్యంకాదు. రాముడి లాంటివాడికి మృత్యువు ఎలా వస్తుందమ్మా? రావణుడు నిన్ను కావాలనే బాధపెట్టాడు".

సరమ సీతాదేవికి ఇలా చెప్పసాగింది. "సముద్రాన్ని దాటి వానరసేనతో నీ మగడు దక్షిణ తీరానికి వచ్చి వున్నాడు. వానరసేన అంతా సముద్రం ఒడ్డున రాముడిని రక్షిస్తూ వుంది. యుద్ధానికి వానర సేనకు కావాల్సినవన్నీ పూర్ణంగా సంపాదించి పెట్టుకున్నారు. రాముడు తమ్ముడితో వున్నాడు. ఇవన్నీ నేను చూసి చెప్తున్నాను. విన్నమాటలు కావు. రావణుడు పంపించిన రాక్షసులు, రామచంద్రమూర్తి దక్షిణ తీరానికి చేరాడని చెప్పారు. రావణుడు మంత్రులతో సమాలోచన చేస్తున్నాడు. సీతమ్మా విను! ఘంటల

ఘణఘణలు, రథాల దబదబలు, గుర్రాల సకిలింపులు, వాద్యాల మోతలు. ఇవన్నీ యుద్ధ ప్రయత్నాలే. కాబట్టి రామచంద్రమూర్తికి కీడు కలిగిందని విచారపడవద్దు. సంతోష లక్ష్మి నిన్ను చేరుతుంది. రాక్షసులకు కీడు కలుగుతుంది. నీ మగడు రావణుడిని చంపి నిన్నేలుకుంటాడు. లక్ష్మణుడితో కలిసి నీ మగడు రాక్షస సేనలను నాశనం చేస్తాడు. శత్రువులను జయించిన నీ మగడితో కలిసి నువ్వు కులుకుతుంటే నేను చూడనా? సంతోషపడవమ్మా జానకమ్మా! నీ మగడితో కూడి నువ్వు పూర్ణ సంతోషం అనుభవిస్తావు".

సీతాదేవికి తనమాటలుగా చెప్పిన సరమ రావణుడు వున్న చోటుకు పోయింది. అక్కడ వాడు తన మంత్రులకు చెప్పే విధం విని, వాడి నిశ్చయం తెలుసుకుని ముహూర్తకాలంలో అశోకవనానికి తిరిగి వచ్చింది. మరలి వచ్చిన సరమను చూసిన సీతాదేవి రావణుడి హృదయం ఎలా వుందో చెప్పమని అడిగింది. అప్పుడు సరమ మంత్రులతో, సహాయులతో కూడిన రావణుడి ఆలోచనను వున్నదున్నట్లు సర్వం చెప్పింది. "సీతమ్మా! రావణుడి తల్లి కైకసి, వృద్ధమంత్రి యవిద్ధుడు ఇద్దరు కూడా శ్రీరామచంద్రమూర్తికి సీతను ఇమ్మని నానా విధాలుగా బోధించారు. జన స్థానంలో ఖరాదులను, పద్నాలుగువేల రాక్షసులను అల్పకాలంలో లక్ష్మణుడు కూడా తోడు లేకుండా ఒంటరిగా, పాదచారై వధించడం అత్యాశ్చర్యమైన విషయమని వారు చెప్పారు. ఇప్పుడు కూడా లక్ష్మణుడు, సేనలతో సుగ్రీవుడు తోడుగా వున్నారని చెప్పారు. కాబట్టి వారు ఎంత పనైనా చేయగలరు అని బోధించారు". అని అన్నది.

ఇలా సరమ చెప్తున్నప్పుడు వానరుల సింహనాదాలు, శంఖాల, భేరుల ధ్వనులు భూమి తబ్బిబ్బు అయ్యేట్లు వినపడ్డాయి. ఆ ధ్వనులకు రాక్షసులు భయపడి, తెల్ల ముఖాలు వేసుకుని, తమ రాజు చేసిన దోషం వల్ల ప్రాణాల మీద ఆశలు వదలుకున్నారు. వానరులు చేస్తున్న ధ్వనులు దిక్కులు పిక్కటిల్లేట్లు వ్యాపిస్తుంటే, రాముడు లంక ముట్టడించడానికి వస్తున్న విషయం అర్థం చేసుకున్న రావణుడు ఒక్క ముహూర్తకాలం ఏం చేయాల్నా అని ఆలోచించసాగాడు.

ఇంతలో రావణుడి తల్లికి పెదనాన్న అయిన మాల్యవంతుడు ఇలా అన్నాడు. "రాజధర్మం తెలిపే నీతి విద్యల్లో పండితుడై, నీతిమార్గాన్ని అనుసరించే రాజు, ఐశ్వర్యంతో కూడి చిరకాలం రాజ్యం చేస్తూ, శత్రువులను తనకు లోబర్చుకుంటాడు. కాలానుగునంగా శత్రువుతో సంధి చేసుకోవాల్సి వచ్చినప్పుడు సంధి, యుద్ధం చేయాల్సి వచ్చినప్పుడు యుద్ధం చేసేవాడు తన పక్షాన్ని వృద్ధి చేసుకుని సంపద కలవాడవుతాడు. ఎప్పుడు సంధి చేసుకోవాలి, ఎప్పుడు యుద్ధం చేయాలని అడుగుతావేమో? శత్రువు కంటే తనబలం తగ్గినప్పుడు, లేదా, శత్రువు సమానుడైనప్పుడు సంధి చేసుకోవాలి. శత్రువు బలం తగ్గి, తన బలం పెరుగుతుంటే శత్రువులను ఉపేక్ష చేయకూడదు. యుద్ధం చేయాలి. నేను చెప్పేది నీతి పద్ధతి కాబట్టి ఇప్పుడు రాముడితో సంధి చేసుకోవడమే తగిన కార్యం. రాముడు తన భార్యను తీసుకుపోవడానికి యుద్ధానికి వచ్చాడేకాని నీ రాజ్యం ఆశించి రాలేదు. కాబట్టి ఆమెను ఇవ్వడంతో పగ, కారణం తీరిపోతుంది. నీ రాజ్యంలో నువ్వు, ఆయన రాజ్యంలో ఆయన సుఖంగా వుండవచ్చు".

"నీకు దానవుల వల్ల, రాక్షసుల వల్ల, దేవతల వల్ల చావులేకుండా వరం వుంది. ఇప్పుడు యుద్ధానికి వచ్చినవారు వీరెవ్వరూ కాదు. నువ్వు వరం పొందని మనుష్యులు, వానరులు, ఎలుగులు వచ్చి లంకను

ముట్టడించారు. ఉత్పాతాలు కూడా పుట్టుతున్నాయి కాబట్టి బుద్ధి కలిగి ఇక చెడ్డ పనులు మానుకో. సంధి చేసుకో". మాల్యవంతుడి మాటలు రావణుడికి నచ్చలేదు.

మాల్యవంతుడు చెప్పిన మాటలు విన్న రావణుడు కోపించి, కళ్లెర్రచేసి, కనుబొమలు ముడివేసి, గుడ్లు తిప్పుకుంటూ, చెప్పినవాడు పెద్దవాడన్న గౌరవం కూడా లేకుండా, సభలో అందరూ వినేట్లు ఇలా అన్నాడు. " రాముడిలో, నాలో లేని సామర్థ్యం ఏముందని మాట్లాడావు? నేను రాక్షసులందరికీ ప్రభువును. దేవగంధర్వులకు భయంకరుడిని. విశేష పరాక్రమవంతుడైన నన్ను ఎందుకు మిక్కిలి నీచుడిగా లెక్కించావు? సీతను దండకారణ్యం నుండి తెచ్చిన నేను ఇప్పుడేమి మునిగి పోయిందని రాముడికి బెదిరి నా కోరిక తీర్చుకోకుండా అప్పగించాలి? వానరులతో, లక్ష్మణుడితో, సుగ్రీవుడితో కూడిన రాముడిని యుద్ధభూమిలో నేను గద్దలపాలు చేస్తుంటే నువ్వే చూస్తావు. వీరాగ్రణి రావణుడు యుద్ధకేళికి భయపడుతాడా? నువ్వు చెప్పినట్లు రాముడు నీ అభిప్రాయం ప్రకారం గొప్పవాడే కావచ్చు. వాడేకాదు, వాడికి నూరింతలు ఎక్కువ గొప్పవాడు వచ్చినా నేను లోబడేవాడిని కాను. ఈ దోషం నాకు పుట్టుకతోనే వచ్చింది. దోషం అని తెలిసి కూడా ఎందుకు సవరించుకోనంటావా? స్వభావ గుణం దాటరానిది కదా? దాన్ని అతిక్రమించి ఎవడు పోగలడు? సముద్రం మీద రాముడు సేతువు కట్టాడని ఏదో గొప్ప పనిగా చెప్తున్నావు. అదొక లెక్కా? దానికి నేను భయపడ్తానా? ఆ రామచంద్రుడు వానరులతో ఇక్కడికి వస్తే మళ్లీ దేహంతో తిరిగి పోలేడని ప్రమాణం చేసి చెప్తున్నాను".

ఇలా రావణుడు చెప్పిన తరువాత మాల్యవంతుడు రావణుడి ఆజ్ఞ తీసుకుని జయ జయ అంటూ ఇంటికి పోయాడు. రావణుడు మంత్రులతో సమాలోచన చేసి లంకలో అన్ని వైపులా రాక్షసులను నియమించాడు.

తూర్పు పక్కన వున్న పురద్వారాన్ని రక్షించడానికి ప్రశస్తబలసంపత్తి కల ప్రహస్తుడిని, దక్షిణాన మహోదర, మహాపార్శ్వులను నిలిపాడు. పడమటి దిక్కున అనేక మాయలు నేర్చిన ఇంద్రజిత్తును విస్తార సేనతో సహా వుంచాడు. ఉత్తరపు దిక్కు కాయడానికి శుకసారణులను పంపి అక్కడికి తానే వస్తానని చెప్పాడు. ద్వీపం దక్షిణ భాగంలో పడమటి దిశగా నైరుతి మూలాన లంక వుంది. సేతువు ఉత్తరాన వుంది. ఉత్తరం–పడమర తాకుడు ఎక్కువ కాబట్టి అక్కడ ఒక చోట తాను నిలిచి ఒకచోట ఇంద్రజిత్తును వుంచాడు. పుర మధ్యభాగం రక్షించడానికి గొప్ప సైన్యంతో విరూపాక్షుడిని పెట్టాడు. ఈ విధంగా లంకకు నాలుగు వైపులా పదిలంగా రక్షకులను నియమించి, రావణుడు దైవ ప్రేరణ వల్ల, తాను కృతకృత్యుడైనానని అనుకున్నాడు. వారివారికి చెప్పాల్సిన పనులు అప్పచెప్పి వారందరినీ వారి సంస్థానాలకు పొమ్మని చెప్పి, తన అంతఃపురానికి సచివులు ఆశీర్వదిస్తూ వుంటే వెళ్లాడు రావణుడు.

◆❖◆

అంగద రాయభారం విఫలమా?

సేతువు మీదినుండి లంకా తీరం చేరిన రామచంద్రమూర్తి, సుగ్రీవుడు, ఆంజనేయుడు, జాంబవంతుడు, అంగదుడు, మైంద ద్వివిదులు, లక్ష్మణుడు, సుషేషణుడు, విభీషణుడు, గజ నల కుముదులు, పనస గవాక్షులు, ఒకచోట చేరి చేయాల్సిన పని గురించి ఆలోచన చేయసాగారు. లంకకు చేరిన వానరులంతా దాన్ని ముట్టడి చేద్దామన్నారు. అలా ముట్టడించినప్పుడు ఎవరే పని చేయాల్నో అని ఆలోచించారు. అప్పుడు విభీషణుడు రావణ సేనా సన్నాహ విధానం రాముడికి చెప్తూ ఇలా అన్నాడు.

"నా మంత్రులు అనలుడు, శరభుడు, ప్రఘసుడు, సంపాతి; మాల్యవంతుడి మొదటి తమ్ముడు సుమాలి కూతురు కైకసి, రెండవ తమ్ముడు మాలి కొడుకులు అనలుడు, సరపాటి; ప్రహస్తుడి తమ్ముడు ప్రఘసుడు పక్షి వేషంలో శత్రు పురమైన లంకకు పోయి అక్కడ పుర రక్షణ కొరకు ఏర్పాటు చేయబడిన సేనల విధం చూసి వచ్చారు. వారి చెప్పినది చెప్తాను. గొప్ప సేనతో సేనానాయకుడైన ప్రహస్తుడు తూర్పు గవనిని కాపలా కాస్తున్నాడు. దక్షిణాన మహోదర, మహాపార్శ్వలున్నారు. పడమట ఇంద్రజిత్తు వున్నాడు. అతడికి సహాయంగా ఆయుధాలు ధరించిన వారెందరో వున్నారు. ఉత్తరాన రావణుడు స్వయంగా తానే రక్షిస్తున్నాడు. వీడికి సహాయంగా రాక్షస సమూహం వుంది. విరూపాక్షుడు నగర మధ్యప్రదేశాన్ని రక్షిస్తున్నాడు. ఈ విధంగా శత్రువులు తమ సేనను తీర్చిదిద్దారు. లంకలో వేయి ఏనుగులు, పదివేల రథాలు, అశ్వాలు పదివేలు, కోటి మంది పదాతులైన రాక్షసులున్నారు. వీరంతా మహాశూరులు, హింసాసక్తులు, రావణుడి మెప్పు పొందినవారు, భయంకరులు. ఇక నువ్వు శత్రువును గెలవడానికి తగిన సన్నాహం చేయి. రామచంద్రా!".

ఇలా విభీషణుడు చెప్పగానే, ఆలోచించిన రామచంద్రమూర్తి శత్రువులను జయించడానికి తన సేనను విభజించాడు. విభజించి ఇలా అన్నాడు. "గొప్ప సేనలతో నలుడు తూర్పు గావని వద్ద నిలిచి ప్రహస్తుడిని గెలవాలి. దక్షిణ దిక్కున అంగదుడు మహోదర, మహాపార్శ్వలను గెలవాలి. ఆంజనేయుడు తన సేనతో పోయి ఇంద్రజిత్తున్న పడమటి దిక్కున నిలిచి లంకను ఆక్రమించాలి. ఇక రావణుడిని చంపే

వంతు నాది. వాడున్న ఉత్తర దిశలో నేను లక్ష్మణుడితో వుంటాను. జాంబవంతుడు, సుగ్రీవుడు, విభీషణుడు సేనా మధ్యాన్ని రక్షించాలి. వానరులెవ్వరూ మనుష్య రూపంలో వుండవద్దు. ఇది నియమం. దీన్ని ఎవరూ, ఎప్పుడూ తప్పకూడదు. నేను, నా తమ్ముడు లక్ష్మణుడు, నా స్నేహితుడు విభీషణుడు, ఆయన నలుగురు మంత్రులు, ఈ ఏడుగురు మాత్రం మనుష్యుల రూపంలో యుద్ధం చేసి శత్రువులను చంపగలం. మరెవరైనా మనుష్యరూపంలో కనబడితే వాడిని శత్రువని వెంటనే వధించాలి. కాబట్టి వానరులెవ్వరూ మనుష్యరూపాలు ధరించకూడదు". ఇలా సేనలను ఏర్పాటు చేసి తన పని ఫలవంతం కావడానికి ఆలోచన చేస్తూ రామచంద్రమూర్తి లంకను చూడాలనుకుని సువేలాద్రి ఎక్కాడు.

రామచంద్రమూర్తి సువేలాద్రి ఎక్కగా, ఆయన వెంట లక్ష్మణుడు ఎక్కాడు. ఆ వెనుక సుగ్రీవుడు, మంత్రులతో విభీషణుడు, హనుమంతుడు, అంగదుడు, నీలుడు, మైంద, ద్వివిద, గజగవయ గవాక్షులు, గంధమాదనుడు, శరభుడు, జాంబవంతుడు, హరుడు, శతవలి, సుషేషణ, ఋషభ, దుర్ముఖులు మొదలైన వారంతా వాయువేగంతో ఎక్కారు. ఇలా అందరూ కొండ ఎక్కి ఆకాశాన్ని తాకుతున్నదా అన్నట్లున్న త్రికూటపర్వత శిఖరం మీదున్న అందమైన ప్రాకారాల వరుసలను, ద్వారాలను చూసి ఆ ప్రాకారాలలో వున్న నల్లటి రాక్షసులను వేరొక ప్రాకారమా అని భావించారు. లక్ష్మణ సుగ్రీవ విభీషణ సహితంగా రామచంద్రమూర్తి ఆ రాత్రి పర్వతం మీదే వున్నాడు.

ఉదయం కాగానే రామలక్ష్మణ సుగ్రీవ విభీషణ తదిర వీరులందరూ లంకానగరాన్ని చూసి ఆశ్చర్య పోయారు. సుగ్రీవుడి ఆజ్ఞానుసారం సువేలలోని వానరులు మినహా మిగిలిన వారంతా దండుగా బయల్దేరి లంకమీదకు పోయారు. వారి సింహనాదాలతో, కాలి తొక్కుళ్ళతో లంకానగరం అంతా అల్లల్ల చలించింది. లంకలో భూమి వణికింది. దూళి అతిశయించింది. ఆ ధ్వనికి భయపడి జంతుసమూహాలు పరుగెత్తాయి. లంకానగరానికి భూషణంగా మనోహరమైన రావణాసురుడి మేడ వుంది. దాన్ని వానరులు మిక్కిలి ఆశ్చర్యంగా చూశారు. రామచంద్రమూర్తి కూడా దాన్ని వానరులతో కలిసి చూశాడు. స్వర్గలోకంతో సమానమైన ఆ పురాన్ని, దాని అందాన్ని చూసిన రామచంద్రమూర్తి ఆశ్చర్యపడి సంతోషంగా సర్వం చూస్తూ వుండిపోయాడు.

ఇంతలో సుగ్రీవుడు చివాలున రావణుడున్న మేడమీదకు ఆకాశానికి ఎగిరి దూకాడు. దూకిన సుగ్రీవుడు, అల్పకాలమే అయినా నిలిచి భయం లేకుండా రావణుడిని చూసి, ఆ దుష్టుడిని కొంచెమైనా లెక్కచేయకుండా, తనతో యుద్ధం చేయమన్నాడు. సుగ్రీవుడిని చూసి రావణుడు "సుగ్రీవా! నా కంట పడకముందు నీకు చక్కటి మెడ వుంది కాని ఎప్పుడు నాకంట పడ్డావో అప్పుడే మెడలేనివాడివయ్యావు". ఇలా అంటూ కోపంతో సుగ్రీవుడిని ఎత్తి అవతల పారవైచాడు.

ఇలా విసిరివేయగా సుగ్రీవుడు పుట్ట చెండులాగా పైకెగిరి చేతులతో రావణుడిని నేలమీదికి తోశాడు. కిందపడ్డ రావణుడు భయపడక, వెనుదీయక త్వరగా లేచి చేతులతో యుద్ధం చేయసాగాడు. వాళ్ళిద్దరూ ఇలా కోపంతో యుద్ధం చేస్తుంటే చెమట నీళ్లు కారాయి. దేహాలలో నెత్తురు ఉబ్బింది. ఇద్దరూ గొప్ప ధైర్యం కలవారై యుద్ధం చేశారు. ఒకరినొకరు కొట్టుతూ, పడతోస్తూ, పెనుగులాడుతూ, ద్వంద్వ యుద్ధంలో నేర్పరులగా యుద్ధం చేశారు. బలవంతులైన ఆ ఇద్దరూ సమానంగా యుద్ధం చేశారు.

సుగ్రీవుడిని న్యాయ యుద్ధంలో గెలవలేమని, మాయ చేసి గెలవాలని రావణుడు అనుకున్నాడు. సుగ్రీవుడు వాడి ద్రోహబుద్ధి కనిపెట్టి, వున్నవాడు వున్నట్లే చిటిక వేసే లోపు ఆకాశానికి ఎగిరాడు. అలా రావణుడిని జయించినవాడై, బడలిక ఏమాత్రం లేకుండా సుగ్రీవుడు వేగంగా రాముడి దగ్గరికి పోయాడు.

సుగ్రీవుడి శరీరం మీద యుద్ధం గుర్తులు చూసిన శ్రీరాముడు అతడిని నిండు మనస్సుతో సంతోషంగా కౌగలించుకుని ఇలా అన్నాడు. "నీవిలాంటి సాహసం చేయవచ్చా? రాజైన వారు సాహసంతో ఇలాంటి పనులు స్వయంగా చేయవచ్చా? నువ్వక్కడ చిక్కుబడి వుంటే సీత గతి ఏంటి? నాగతి ఏంటి? ఈ వానరుల గతి ఏంటి? వీరికి నాయకుడు ఎవరు? నాయకుడు లేకుండా వారెలా యుద్ధం చేస్తారు? మనల్ని నమ్మి వచ్చిన విభీషణుడి గతి ఏంటి? నీ ఒక్కడి అనాలోచిత కార్యం వల్ల ఎందరికి ఎంత కీడు కలిగేదో ఆలోచించు. ఇకమీద నాతో ఆలోచించకుండా ఇతరులకు కష్టం కలిగించే ఇలాంటి పనులు చేయవద్దు".

"ఏమి ఆలోచించానంటావా? విను. తనకు, తన స్నేహితుడికి ద్రోహం చేసినవారిని క్షమించకూడదు. కాబట్టి యుద్ధంలో రావణుడిని, కొడుకులతో, బంధువులతో సేనలతో చంపుతాను. నామాట అసత్యం కాకుండా విభీషణుడిని లంకారాజ్యానికి అభిషిక్తుడిని చేస్తాను. బలవంత పెట్టయినా నాసొంతరాజ్యానికి భరతుడిని నిలుపుతాను. ఈరెండు పనులు చేసి నాప్రాణాలను విడవాలనుకున్నాను". ఆ తరువాత శ్రీరాముడు లక్ష్మణుడితో ఇలా అన్నాడు.

"లక్ష్మణా! రాక్షసుల కనిష్టసూచకాలు కనపడే సమయంలోనే మనం సేనలతో పోయి లంకను ముట్టడించాలి". ఇలా అంటూనే, వానరులంతా చూస్తుండగానే వేగంగా కొండ దిగి, "వానరులారా! ఇవే రాక్షసులకు అపజయం కలిగించే శకునాలు కనపడుతున్నాయి. ఈ సమయంలోనే పోయి లంకను ముట్టడి చేస్తే, అల్పకాలంలో రాక్షసులను, లంకను నుగ్గు-నుగ్గు చేయవచ్చు. మీకు రాగల అపాయం లేదు. మీకు అపాయం కలగకుండా నేను చూసుకుంటాను. రండి, లంకను ముట్టడి చేయండి." అని వానరులకు ఉత్సాహం కలిగే విధంగా సమయోచితంగా రామచంద్రమూర్తి పౌరుష వాక్యాలను పలికాడు.

ఈ విధంగా రామలక్ష్మణులు లంకాపురాన్ని సమీపించి, దానిని, లోపలివారు బయటికి రాకుండా వుండే విధంగా, వానరసేనను నియమించారు. కొండ శిఖరంలాగా వున్న ఎత్తైన ఉత్తర ద్వారాన్ని రామచంద్రమూర్తి లక్ష్మణుడితో కలిసి అడ్డగించాడు. ఆ ద్వారం దగ్గరే రావణుడు లంకాపుర రక్షణ కొరకు కాపున్నాడు. రావణుడు కాపలా వున్న ఉత్తర ద్వారాన్ని అడ్డగించడానికి రామచంద్రమూర్తి తప్ప మరెవ్వరూ సమర్థులు కారు. వానర సేనానాయకుడైన నీలుడు తనకు మైందద్వివిదులు తోడుండగా లంకాపుర తూర్పు ద్వారాన్ని అడ్డగించాడు. గజగవయగవాక్ష ఋషభులు తనకు సహాయంగా వుండగా అంగదుడు తన సేనతో దక్షిణ దిక్కును అడ్డగించాడు. ప్రఘసుడు, ప్రమాథి సహాయులుగా ఆంజనేయుడు పశ్చిమ ద్వారాన్ని అడ్డగించాడు. సుగ్రీవుడు మధ్యలో వున్నాడు.

జాంబవంతుడితో కలిసి సుగ్రీవుడు రామచంద్రమూర్తికి పడమటి వైపు, అంటే, కుడిపక్కన నిలిచారు. హనుమంతుడికి ఎదురుగా ఇంద్రజిత్తు, రామచంద్రమూర్తికి ఎదురుగా రావణుడు వుండడం

వల్ల ఈ రెండు వైపులా తాకుడు ఎక్కువగా వుంటుందని సుగ్రీవుడు ఇద్దరి మధ్య నిలిచాడు. ఎప్పుడు యుద్ధం చేద్దామా అని వానరులు ఎదురు చూడసాగారు. ఈ విధంగా తన సేననంతా తగిన స్థలాలో నిలవబెట్టి మంత్రి పుంగవులతో రామచంద్రమూర్తి సమాలోచన చేయసాగాడు.

వీరుడైన అంగదుడిని చూసి రామచంద్రమూర్తి ఇలా అన్నాడు. "శూరుడా! కోట గోడ దాటి, లంక ప్రవేశించి, రావణుడిని సమీపించి, వాడంటే భయం లేకుండా నీ గొప్పతనానికి తగ్గట్లు నేను చెప్పానని నా మాటలుగా ఇలా చెప్పు. నువ్వు వీరుడివై యుద్ధానికి వస్తే రా. నా బాణాలకు చచ్చి పోగలవు. అలా చేయడానికి నీకు ఇష్టం లేకపోతే గర్వం వదిలి సీతను నాకిచ్చి నా శరణు వేడుకో. ఈ రెంటిలో ఏదో ఒకటి చేయకపోతే నా బాణాలతో లోకంలో రాక్షసులనేవారు లేకుండా చేస్తాను. నీ ఒక్కడి కారణాన రాక్షసవంశమే నాశనం అవుతుంది. నిన్ను చంపి, లేదా, తొలగించి, రాక్షస రాజ్యాదిపత్యం విభీషణుడికి ఇస్తాను. విభీషణుడిని సింహాసనం మీద కూర్చోబెట్టడానికే నేను వచ్చాను" అని అన్నాడు.

ఇలా రామచంద్రమూర్తి చెప్పగా అంగదుడు ఆకాశానికి ఎగిరి, కోట దాటిపోయి, రావణుడు మేడమీద వుండగా అక్కడ దిగి, మంత్రులతో కూడి వున్న రావణుడిని చూసి, సమీపానికి పోయి, రామచంద్రమూర్తి చెప్పిన మాటలను ఒక్క అక్షరం ముక్క కూడా వదలకుండా సర్వం వినిపించాడు. "రామచంద్ర మహారాజు దూతను నేను. ఆయన రాయబారం పంపగా వచ్చాను. నేను వాలి కుమారుడిని. అంగదుడు అంటే నేనే. పుణ్యాత్ముడైన రామచంద్రమూర్తి ఇలా చెప్పాడు. మగవాడివైతే యుద్ధానికి లేచిరా. మంత్రులతో, కొడుకులతో, చుట్టాలతో, స్నేహితులతో సహా నిన్ను చంపుతాను. లోకాలకు నీ బాధ తొలగిస్తాను. సగౌరవంగా సీతను తెచ్చి వెంటనే నాకు సమర్పించకపోతే, శరణు వేడకపోతే, నిన్ను చంపి నీ రాజ్యాన్ని విభీషణుడికి ఇస్తాను అని చెప్పమన్నాడు".

అంగదుడు ఇలా చెప్పగానే, రావణుడు కోపంతో అంగదుడిని పట్టుకుని కట్టేయమని, కొట్టమని, చంపమని అరిచాడు. రావణుడు అలా చెప్పగానే అంగదుడు వారికి చిక్కినట్లు నటించి, వారు దగ్గరికి రాగానే వారి మెడలు చంకలో ఇరికించుకుని పక్షిలాగా వేగంగా ఎగిరిపోయాడు. తాను రామచంద్ర మహారాజు దూతననీ, తన పేరు అంగదుడు అనీ, వాలి పుత్రుడననీ, అందరూ వినేట్లు స్పష్టంగా పలికి సింహనాదం చేస్తూ, అంగదుడు ఆకాశ మార్గాన రామచంద్రమూర్తిని చేరుకున్నాడు. ఆయన్ను చూసి రామచంద్రమూర్తి మెచ్చుకుని యుద్ధాన్ని ప్రారంభించాడు. అంగదుడు చేసిన కార్యాన్ని చూసిన రావణుడు ఇది తనకు అపశకునంగా భావించాడు. అక్షౌహిణిల కొద్దీ వస్తున్న వానర సైన్యాన్ని చూసి రాక్షసులు భయపడ్డారు. వానరుల కేకలకు రాక్షసులు హాహాకారాలు చేశారు.

ఇంద్రజిత్తు నాగపాశాలు రామలక్ష్మణుల మీద విఫలమా?

రామలక్ష్మణ, సుగ్రీవ, హనుమ, అంగద, జాంబవంత నాయకత్వ సారధ్యంలో వానరులు లంకను నాలుగు వైపుల నుండి ముట్టడి చేసిన తరువాత రాక్షసులు రావణుడి ఇంటికి పోయి, ఆ విషయం చెప్పగా అతడికి కోపం వచ్చింది. తన మేడ ఎక్కి వానరులు ఆక్రమించిన విధానం చూశాడు. భూమినే మింగేసే విధంగా వున్న ఈ వానరసేనను ఎలా చంపాల్నా అని ఆలోచించ సాగాడు. ఇదిలా వుండగా రామచంద్రమూర్తి ప్రాకార సమీప ప్రదేశానికి పోయి అన్ని పక్కలా రాక్షసులతో ఆవరించబడి, రక్షించబడి, ధ్వజాలతో అలంకరించ బడిన లంకను చూశాడు.

శ్రీరాముడు విరోధులందరినీ నాశనం చేయమని అనుమతి ఇవ్వగా వానరులు సింహనాదాలు చేస్తూ, విచ్చలవిడిగా, వారి–వారికి నచ్చిన రీతిలో రాక్షస సేనా సమూహాన్ని ఎదిరించారు. ప్రాణాలమీద ఆశ వదలుకుని రావణుడు చూస్తుండగానే బలాతిశయంతో లగ్గపట్టి వానర శ్రేష్ఠులు గుంపులు–గుంపులుగా కోట గోడలను, ద్వారాలను, వనభూములను, నేలను చదరంగా నాశనం చేశారు. ఇలా చేస్తూ, జయం–జయం శ్రీరామచంద్రమూర్తికి, జయం–జయం లక్ష్మణుడికి, రామచంద్రుడి రక్షణలో వున్న సుగ్రీవుడికి జయం–జయం అని సంతోషంగా అరిచారు. "రాక్షసులారా! యుద్ధానికి పొండ" ని రావణుడు చెప్పగానే రాక్షసుల సింహనాదాలు, పెడబొబ్బలు అతిశయించాయి. సముద్రం పొంగి పొర్లినట్లు రాక్షస సేనలు వానరుల మీద పడ్డారు. ఒకనాటి దేవదానవ యుద్ధంతో సమానమైన యుద్ధం రాక్షసులకు, వానరులకు మధ్య జరిగింది.

యుద్ధంలో రాక్షస సైన్యం ప్రకాశించింది. ఇలా దొమ్మి యుద్ధం జరుగుతున్నప్పుడు ఇంద్రజిత్తు అంగదుడితో యుద్ధం చేశాడు. సంపాతి ప్రజంఘుడితో, జంబుమాలి హనుమంతుడితో, మిత్రఘ్నుడు విభీషణుడితో, గజుడు తపనుడితో, నీలుడు నికుంభుడితో, సుగ్రీవుడు ప్రఘసుడితో ఎదిరించి పోరాడారు. లక్ష్మణుడు విరూపాక్షుడిని అడ్డుకున్నాడు. ఇలా ఒకరినొకరు ఎదిరించి దొమ్మియుద్ధం చేస్తుంటే నెత్తురు నేలమీద వ్యాపించింది. మైందుడు, ద్వివిదుడు, సుషేణుడు తదితరులు ద్వంద్వ యుద్ధంలో రాక్షసులను

చంపారు. ఇంతలో సూర్యుడు అస్తమించాడు. రాత్రి చీకట్లను వ్యాపింప చేసింది. ఆ అంధకారంలో వానర రాక్షసులకు యుద్ధం భీకరంగా జరిగింది. రాత్రుల్లో రాక్షసులకు బలం ఎక్కువ కాబట్టి వారు విజృంభించడం చూసి కోపించిన శ్రీరామలక్ష్మణులు జడివానలాగా బాణాలు కురిపించి రాక్షసులను వధించారు.

రామలక్ష్మణుల శౌర్యం, రాక్షసుల పరాజయం చూసిన ఇంద్రజిత్తు, ప్రత్యక్ష యుద్ధంలో వీరిని జయించడం సాధ్యం కాదని, కనపడకుండా యుద్ధం చేద్దామనుకున్నాడు. అంగదుడి దెబ్బకు వెనుకడుగు వేసిన ఇంద్రజిత్తు తిరస్కరణీ విద్యను ఆశ్రయించి ఎవరికీ కనబడక తన వాడి బాణాలతో వానరులను బాధించాడు. ఆ సమయంలో రామచంద్రమూర్తి సుగ్రీవుడి దగ్గర నిలబడి హెచ్చరికగా వుండమని చెప్పాడు. ఇంతలో ఇంద్రజిత్తు వానరసేనమీద బాణాల వాన కురిపించాడు. రామలక్ష్మణులను కూడా ఇంద్రజిత్తు తన బాణాలతో బాధించసాగాడు. యుద్ధభూమిలో రామలక్ష్మణుల ఎదురుగా నిలుచుని వారిని జయించడం సాధ్యం కాదని తెలుసుకున్న ఇంద్రజిత్తు, మాయతో వారిని ఖండించాలని భావించి, వానరులంతా చూస్తుండగా వారిని బాణాలతో కట్టివేయాలని ప్రయత్నం చేశాడు.

తిరస్కరణీ విద్యా బలంతో ఎవరికీ కనబడకుండా ఆకాశాన్నుండి పరాక్రమం చూపుతున్న ఇంద్రజిత్తును వెదకడానికి ఇంద్రుడి మనుమడైన అంగదుడిని, బ్రహ్మ కొడుకు జాంబవంతుడిని, నీలుడిని, సుశేణ పుత్రులను, శరభుడిని, ఋషభుడిని, వినతుడిని, సానుప్రస్థుడిని, ఋషభస్కందుడిని పంపారు. వారెవరూ ఇంద్రజిత్తును చూడలేకపోయారు. ఇంద్రజిత్తు నాగాస్త్ర సమూహాలను ప్రయోగించి రామలక్ష్మణులను ఆ బాణాలతో కట్టిపడేసాడు. బాణాల గాయాలకు వారి దేహం నుండి నెత్తురు కారింది. రామచంద్రమూర్తి విల్లుతో సహా నేలమీద పడిపోయాడు. అన్న నేలమీద పడుకోవడం చూసి లక్ష్మణుడు కూడా తన ప్రాణం మీద ఆశ వదిలి బాణశయ్య మీద పడుకున్నాడు. వానరులంతా వారిని సమీపించి దుఃఖపడ్డారు. కిందపడిపోయిన రామలక్ష్మణులను చూసిన ఇంద్రజిత్తు తనవారికి సంతోషం కలిగే విధంగా మాట్లాడాడు. రాక్షసులను చూసి "రామలక్ష్మణులు ఇద్దరూ బాణాలతో కట్టబడి నేలమీద పడి వున్నారు. చూడండి" అని చెప్పగా కాళ్లు–చేతులు కదిలించకుండా, శ్వాస విడవకుండా, భూమ్మీద పడి వున్న అన్నదమ్ములను చూసి వారు చనిపోయారని రాక్షసులు భావించారు. వాస్తవానికి రామలక్ష్మణులు మూర్ఛ పోయారు కాని చావలేదు. ఆ అస్త్రాలకు కట్టివేయగలంత బలం మాత్రమే వుంది. మంత్రబలం తగ్గగానే కట్లు వూడిపోతాయి.

ఇంద్రజిత్తు రాక్షస సైన్యం తనను కొలుస్తుంటే బలగర్వంతో లంకలోనికి పోయి తండ్రి రావణాసురుడికి రామలక్ష్మణులు ఇద్దరూ చచ్చారని చెప్పగా అతడు తన ఆసనం మీదనుండి లేచి, "కొడుకా! బలే! బలే!" అని మెచ్చుకున్నాడు. సంతోషంగా రావణుడు కొడుకును కౌగలించుకుని, "ఎలా చంపావు? ఏమి ఉపాయం చేశావు? ఆ విధమంతా చెప్పు" అని అడిగాడు. నాగపాశాలతో వాళ్లను కట్టేసానని, కాళ్లు–చేతులు కదిలించలేకుండా పడిపోయారని జవాబిచ్చాడు ఇంద్రజిత్తు. అక్కడ జరిగిన వ్యవహారమంతా వినిపించాడు రావణుడికి. రామలక్ష్మణుల వల్ల తనకింత వరకూ కలిగిన భయం పోగొట్టుకున్న రావణుడు సంతోషంగా కొడుకును పొగిడాడు. ఇంద్రజిత్తు వెళ్ళిపోయిన తరువాత

రామలక్ష్మణులకు కాపలాగా హనుమదాదులు అక్కడే వుండిపోయారు.

రామలక్ష్మణులు ఇంద్రజిత్తు చేతిలో చనిపోయారని సంతోషంగా సీతాదేవికి చెప్పి, ఆమె నమ్మడానికి బలవంతంగానైనా పుష్పక విమానం మీద కూర్చోబెట్టి యుద్ధ స్థలానికి తీసుకెళ్ళి వారిని చూపమని రావణుడు రాక్షస స్త్రీలకు చెప్పాడు. ఆయన ఆజ్ఞానుసారం రాక్షస స్త్రీలు భర్త కొరకు తపిస్తున్న సీతను విమానంలో వుంచి యుద్ధభూమికి తీసుకెళ్లారు. యుద్ధంలో తెలివి తప్పి వున్న నాగపాశబద్ధులైన రామలక్ష్మణులను చూసింది సీతాదేవి.

ఆ విధంగా పడివున్న రామలక్ష్మణులను చూసి, సీతాదేవి దుఃఖపడుతుంటే త్రిజట ఆమెకు ఇలా చెప్పింది. "నీ భర్త మరణించలేదు. ప్రాణాలతోనే వున్నాడు. కాబట్టి నువ్వు దుఃఖపడవద్దు. రామలక్ష్మణులు మరణించలేదనడానికి సాక్ష్యం ఈ పుష్పక విమానమే! ఈ పుష్పకం దివ్య విమానం. ఇది భర్త మరణించిన దానిని మోయదు. నీ భర్త మరణించి వుంటే నిన్నిది మోయదు. కాబట్టి నీ భర్త మరణించలేదు. వానరులు వృక్షహస్తులై యుద్ధానికి సిద్ధంగా వున్నారు. ఈ వానర సేన భయపడకుండా రామలక్ష్మణులను కాపాడుతున్నది. వారు మరణిస్తే ఈ కాపలా ఎందుకు? నీమీద నాకున్న ప్రేమవల్ల శుభకారణాలన్నీ చెప్పాను. నా మాట నమ్ము. బాధపడవద్దు. అన్నదమ్ములు ప్రాణాలతో వున్నారు. మరణించలేదు".

త్రిజట ఇలా చెప్పగా సీతాదేవి, "అమ్మా! నువ్వు చెప్పినదే వాస్తవం కావాలి" అని చేతులు జోడించి నమస్కారం చేసింది. పుష్పక విమానం మళ్లీపోయి సీతా, త్రిజటలను లంకలో దింపింది. అక్కడినుండి రాక్షస స్త్రీలు సీతాదేవిని అశోకవనానికి పిలుచుకుపోయారు. సీతాదేవి రామలక్ష్మణులను తలచుకుని వారి కష్టాలకు బాధపడ్డది.

బాణాలతో కట్టుబడి వున్న శ్రీరాముడు స్మృతి తెచ్చుకుని తన సమీపంలోనే బాణాలతో కట్టబడి మూర్ఛపోయి వున్న తమ్ముడిని చూశాడు. చూసి, సహించలేని దుఃఖతో బాధపడి, "ఇది దుర్లభం. బాణాల దెబ్బలకు నా తమ్ముడే మరణిస్తే, నిశ్చయంగా నేను కూడా ఇక్కడే ప్రాణాలు విడుస్తాను" అన్నాడు.

రామలక్ష్మణులు ఇద్దరూ ఇంద్రజిత్తు బాణాలకు, ఆయన మాయా యుద్ధంలో పడిపోవడం విభీషణుడికి అమితమైన బాధ కలిగించి దుఃఖపడ్డాడు. రాక్షసులు ధర్మ యుద్ధంలో కాకుండా మోసం చేసి రామలక్ష్మణులను బంధించారు కదా అని బాధపడ్డాడు. లోకంలో ఎవరి దగ్గర చేరితే తనకు గౌరవం కలుగుతుందని విభీషణుడు భావించాడో ఆ ధీరులు రామలక్ష్మణులు ఇద్దరూ మరణించిన వారిలాగా పడిపోయారు అని దుఃఖపడ్డాడు. తానూ వ్యర్థమైన కైంకర్య రాజ్యాభిలాష కలవాడినై బతికి కూడా చనిపోయినవాడిలాగా అయిపోయాననుకున్నాడు. దాని ఫలితంగా పాపాత్ముడైన రావణుడి కోరిక సఫలమైంది అనుకుంటాడు.

ఇలా దుఃఖపడుతున్న విభీషణుడిని సుగ్రీవుడు కౌగలించుకుని "నువ్వే లంకను ఏలుతావు. రావణుడి కోరిక నెరవేరదు. విభీషణా! దుఃఖపడవద్దు. వీరు మూర్ఛపోయారు కాని ప్రాణాపాయం లేదు. వీరు మూర్ఛ నుండి లేవగానే రావణ సేనను, అతడిని చంపుతారు" అని ఊరడించాడు. ఆ తరువాత

సమీపంలో వున్న సుషేణుడుని చూసి, రామలక్ష్మణులు మూర్ఛ తెరుకోగానే వారిద్దరినీ తీసుకుని కిష్కింధకు పొమ్మంటాడు. తాను సీతను తెస్తానని అంటాడు.

జవాబుగా సుషేణుడు సుగ్రీవుడితో మృత సంజీవని విద్యతో కూడిన కొన్ని మూలికలు పాల సముద్రం సమీపంలో వున్నాయని, వాటిని సంపాతి, పనసుడు లాంటి వానరులను పంపించి తెప్పించమని అంటాడు. లేదా ఆంజనేయుడిని పంపమంటాడు. అతడు తన పరాక్రమంతో వాటిని తెస్తాడని అంటాడు. దేవతలు పాలసముద్రం ఎక్కడ చిలికారో అక్కడ ద్రోణ పర్వతం, చంద్ర పర్వతం అనే రెండు కొండలున్నాయని, అక్కడ విశల్యకరణి, సంజీవ కరణి ప్రకాశిస్తాయని వాటిని త్వరగా తెప్పించమని అంటాడు. ఇంతలో చెవుడు కలిగే పెద్ద ధ్వని వచ్చింది.

అదే సమయంలో, మండుతున్న అగ్నిహోత్రుడిలాగా ప్రకాశిస్తూ గరుత్మంతుడు ఆకాశంలో కనబడ్డాడు. ఆయన కనపడగానే రామలక్ష్మణులను చుట్టుకున్న పాపపు పాములన్నీ చెల్లాచెదరై భయంతో పరుగెత్తిపోయాయి. గరుడుడు రామలక్ష్మణులను సమీపించి వారిద్దరి ముఖకమలాలను ముట్టుకోగానే వారి దేహాలకున్న గాయాలన్నీ మానిపోయాయి. ఆయన అలా ముట్టుకోగానే రామలక్ష్మణులకు బుద్ధిబలం, దేహబలం, వీర్యం, తేజం, ఓజస్సు, ఉత్సాహం, స్మరణ శక్తి, బుద్ధి సూక్ష్మత వృద్ధి చెందాయి. వారి దేహకాంతి బంగారు కాంతికంటే ఎక్కువయింది. గరుత్మంతుడు రామలక్ష్మణులను కౌగలించుకున్నాడు. తానెవరో చెప్పాడు.

"మీకు తోడ్పడడానికి వచ్చాను. దానవులు, అసురులు, గంధర్వులు ఇంద్రుడిని ముందు వుంచుకుని వచ్చినా నీ శరబంధాలను వదిలించలేరు. ఎందుకంటే వీటిని ఇంద్రజిత్తు మంత్రాల వల్ల కలిగిన అద్భుత శక్తితో సృష్టించాడు. అప్పుడు విషంతో క్రూరమైన కోరలున్న సర్పాలు బాణాల్లాగా వచ్చి, మిమ్మల్ని బంధించాయి. ఈ వృత్తాంతం విని నీమీద వున్న స్నేహభావం వల్ల నేను అతి శీఘ్రంగా బయల్దేరి వచ్చాను. ఆ కట్లను విడిపించాను. రామచంద్రా! రాక్షసులు మోస యుద్ధం చేస్తారు కాబట్టి నువ్వు అప్రమత్తంగా వుండాలి. రాక్షసులకు మోసం చేయడమే బలం. అది లేకపోతే వారు దేనికీ పనికిరారు. కాబట్టి రణంలో మీరు రాక్షసులను నమ్మవద్దు. మీరు ఋజుత్వాన్ని వదలక, వారి మాయలకు లోబడక, హెచ్చరికగా వుండాలి. నేనెవరో యుద్ధం పూర్తయిన తరువాత తెలుసుకుంటావు. నాకు సెలవిస్తే నేను పోతాను. ధర్మ శాస్త్రం నీలాగా తెలిసిన వారెవరూ లేరు. రాక్షస సమూహాలను పూర్తిగా నాశనం చేసి నువ్వు పతివ్రత అయిన సీతను గ్రహిస్తావు".

ఇలా చెప్పి ఆకాశమార్గాన గరుడుడు పోయాడు. రామలక్ష్మణులు మూర్ఛ నుండి తెప్పరిల్లారు. రామలక్ష్మణులను అలా చూసిన వానరులు సింహనాదాలు చేసారు. ధ్వనులు చేశారు. అవి విన్న రావణుడు విని ఉలిక్కిపడి విషయం కనుక్కోమని రాక్షసులను ఆదేశించాడు. స్వేచ్ఛగా యుద్ధభూమిలో తిరుగుతున్న రామలక్ష్మణులను చూసిన రాక్షసుల గుండెలు గుభిల్లుమనగా, ముఖాలు వెలవెల బోయాయి. సర్వం రావణుడికి ఇలా చెప్పారు. "రాజా! ఇంద్రజిత్తు బాణాలతో కట్టబడి కదలక–మెదలక పడివున్న రామలక్ష్మణులు తమ్ము కట్టిన తాళ్ళను తెంచుకుని ప్రకాశిస్తున్నారు".

◆❖◆

రావణుడు సిగ్గుతో యుద్ధభూమిని విడిచిపోయాడా?

నాగపాశాలతో రామలక్ష్మణులను కట్టేసానని, కాళ్లు–చేతులు కదిలించలేకుండా పడిపోయారని, చనిపోయారని ఇంద్రజిత్తు చెప్పగానే అమితంగా సంతోషించాడు రావణుడు. రామలక్ష్మణుల వల్ల తనకింత వరకూ కలిగిన భయం పోగొట్టుకున్న రావణుడు సంతోషంగా కొడుకును పొగిడాడు. అయితే రావణుడి సంతోషం ఎక్కువసేపు నిలవలేదు. యుద్ధభూమిలో తిరుగుతున్న రామలక్ష్మణులను చూసిన రాక్షసులు సర్వం రావణుడికి చెప్పారు. ఇంద్రజిత్తు బాణాలతో కట్టబడి కదలక–మెదలక పడివున్న రామలక్ష్మణులు తమ్ము కట్టిన తాళ్లను తెంచుకుని ప్రకాశిస్తున్నారని చెప్పారు.

ఇలా రాక్షసులు చెప్పగా రావణుడు ఏం చేయాల్నా, చేసినదంతా వ్యర్థమైపోయింది కదా! అని విషాదపడ్డాడు. బ్రహ్మ వరంతో సంపాదించిన తన కుమారుడి మహాస్త్రాలు ఎప్పుడూ వ్యర్థం కావే? అలాంటి బాణాలను కూడా రామలక్ష్మణులు విడిపించుకున్నారే? ఇది ఆశ్చర్యమైన విషయం అనుకున్నాడు. ఈ ప్రకారం అనుకుని, ధూమ్రాక్షుడిని చూసి, రాముడి మీదకు యుద్ధానికి పొమ్మంటాడు. వాడు సైన్యంతో కలిసి సింహనాదాలు చేస్తూ యుద్ధానికి సాగారు.

ధూమ్రాక్షుడు హనుమంతుడున్న పశ్చిమ ద్వారం చేరబోతుంటే ఎదురైన అపశకునాలను చూసి తన చావు తథ్యమని అనుకుని బాధపడ్డాడు. వానర–రాక్షసులు దొమ్మి యుద్ధం చేశారు. ధూమ్రాక్షుడు తన పరాక్రమంతో వానరుల పరాక్రమాన్ని అణిచి వేశాడు. ధూమ్రాక్షుడు మీద హనుమంతుడు వంద బాణాలను వేసి, ఒక పర్వత శిఖరాన్ని వాడి నడినెత్తిమీద వేశాడు. దాంతో వాడు చచ్చాడు. ఇది చూసి రాక్షసులు లంక దారి పట్టారు. ధూమ్రాక్షుడు చనిపోయాడని విన్న రావణుడు వజ్రదంష్ట్రుడనేవాడిని యుద్ధానికి పోయి రామలక్ష్మణులను సంహరించమని చెప్పాడు. వాడలాగేనని యుద్ధ కాంక్షతో రణరంగానికి బయల్దేరాడు. వజ్రదంష్ట్రుడు అంగదుడు వున్న పడమటి ద్వారానికి బయల్దేరాడు. వాడిని చూసిన అంగదుడు మండిపడుతూ చేతిలో ఒక పెద్ద చెట్టు తీసుకుని వజ్రదంష్ట్రుడిని సమీపించాడు. వజ్రదంష్ట్రుడి మీదికి దూకి వాడిని ఒక గుద్దు గుద్దాడు. ప్రతీకారంగా వజ్రదంష్ట్రుడు, అంగదుడి దేహాన్ని

నెత్తురుతో తడిసేట్లు చేశాడు. అంగద వజ్రదంష్ట్రులు పలుమార్లు ఒకరినొకరు కొట్టుకున్నారు. అప్పుడు తటాలున అంగదుడు రాక్షసుడి మీదకు దూకి వాడి శిరస్సును తన కత్తితో నరికాడు.

వజ్రదంష్ట్రుడు మరణించాడని విన్న రావణుడు ప్రహస్తుడితో యుద్ధానికి అకంపనుడిని పంపమని చెప్పాడు. అలా అనగానే ప్రహస్తుడు గొప్ప సేనను యుద్ధానికి సిద్ధం చేసి అకంపనుడి స్వాధీనం చేశాడు. అతడు యుద్ధానికి బయల్దేరి పోయాడు. అకంపనుడు యుద్ధానికి పోతున్నప్పుడు కూడా అపశకునాలు కనిపించాయి. రాక్షస సైన్యం సింహనాదాలు చేసింది. ఇరు పక్షాల సేనలకు భయంకర యుద్ధం జరిగింది. రాక్షసుల ధాటికి వెనక్కు పోతున్న వానరులను చూసిన హనుమంతుడు అకంపనుడిని ఎదుర్కొన్నాడు. హనుమంతుడి మీదకు అకంపనుడు బాణాలను ప్రయోగించినా ఫలితం కనపడలేదు. వాడు బాణాలు వేస్తున్నా లక్ష్యపెట్టని హనుమంతుడు ఒక పెద్ద చెట్టును పీకి తిప్పుతూ అకంపునుడి తల పగిలేట్లు కొట్టగా వాడు ఆ దెబ్బకు నేలమీద పడి చచ్చాడు.

యుద్ధంలో అకంపనుడు చనిపోయిన వార్త విన్న రావణుడు ప్రహస్తుడిని చూసి, కావాల్సినంత సైన్యం తీసుకుని యుద్ధానికి పొమ్మన్నాడు. ఇలా రావణుడు చెప్పగానే ప్రహస్తుడు, ఆయన ఆజ్ఞానుసారం రథం ఎక్కి యుద్ధానికి బయల్దేరి పోయాడు. బయల్దేరుతూ సింహనాదం చేశాడు. ప్రహస్తుడు ముందుకు వేగంగా సాగుతుంటే, వానరులు కేకలు వేశారు. ఇరుపక్షాల వారు ఒకరినొకరు పౌరుషంతో చూస్తూ యుద్ధానికి దిగారు. ప్రహస్తుడు స్వయంగా యుద్ధానికి దిగాడు. యముడితో సమానులైన సమున్నతుడు, నరాంతకుడు, మహానాథుడు, కుంభహనుడు తమమీదకు వస్తున్న వానరులను నిలువరించారు. అప్పుడు ద్వివిదుడు ఒక కొండను వేయడంతో నరాంతకుడు చచ్చాడు. దుర్ముఖుడు వేసిన పెద్ద చెట్టు తగిలి సమున్నతుడు చచ్చాడు. జాంబవంతుడి చేతిలో మహానాథుడు చచ్చాడు. తారుడు విసిరిన చెట్టుకు కుంభహనుడు కొండలాగా నేలకూలాడు.

ఇంతలో యుద్ధం చేస్తున్న ప్రహస్తుడిని చూసి నీలుడు కళ్లెర్ర చేశాడు. ప్రహస్తుడిని అడ్డగించాడు. ప్రహస్తుడు అప్పుడు శూరుడై తన ప్రతాపాన్ని చూపించసాగాడు. వారిద్దరి మధ్యా యుద్ధం కొనసాగింది. అలా జరుగుతుండగా నీలుడు ఒక గుండు తీసుకుని గురి చూసి ప్రహస్తుడిని కొట్టాడు. ఆ రాతి దెబ్బకు ప్రహస్తుడి తల తునకలైపోయి చనిపోయాడు.

ప్రహస్తుడి వృత్తాంతమంతా రాక్షసులు రావణుడికి తెలపగా అతడు బాధపడి, ఇంతవరకు ఈ అల్ప కార్యానికి తానే పోవాల్నా అని ఉపేక్షించి వున్నాననీ, ఇక ఉపేక్షించరాదనీ, తానెలాంటి వాడినో చూపిస్తాననీ, కోతి గుంపును కూలుస్తాననీ, రామలక్ష్మణులను శుష్కింప చేస్తాననీ, రాక్షసులతో అంటూ, రథం ఎక్కి యుద్ధానికి బయల్దేరాడు. యుద్ధానికి పోయిన రావణుడు భయంకరమైన వానర సేనను చూశాడు. రావణుడి సైన్యాన్ని చూసి రామచంద్రమూర్తి విభీషణుడితో ఆ సేన గురించి వివరించమని అడిగాడు.

జవాబుగా విభీషణుడు, రావణాసురుడి కొడుకు అకంపనుడు గురించీ, ఇంద్రజిత్తు గురించీ, అతికాయుడు గురించీ, మహోదరుడనే వాడిని గురించీ, రాక్షసుడు, పిశాచుడు గురించీ, త్రిశిరుడు గురించీ, కుంభుడు గురించీ, నికుంభుడు గురించీ, నరాంతకుడు గురించీ వివరంగా చెప్పాడు.

యుద్ధానికి వచ్చిన రాక్షసరాజు రావణాసురుడుని చూపించి వాడే రావణుడు అని చెప్పాడు. శ్రీరాముడు రావణుడిని చూసి సీతాదేవిని వీడు అపహరించిన కోపమంతా వీడిమీద చూపుతాను అని అంటూ, విల్లు తీసుకుని ఎక్కుపెట్టి, తీక్షణమైన బాణాలను పొదినుండి బయటకు తీసి, యుద్ధం మీద మనస్సుతో లక్ష్మణుడితో సహా నిలబడ్డాడు.

రావణుడిని చూసి కోపంతో సుగ్రీవుడు వాడితో యుద్ధానికి దిగాడు. రావణుడు సుగ్రీవుడిని చంపాలన్న కోరికతో ఒక బాణాన్ని అతడి రొమ్ములో నాటుకునేట్లు వేశాడు. ఆ బాణం వల్ల కలిగిన బాధతో సుగ్రీవుడు కేక వేసి నేలపడ్డాడు. ఇది చూసి, శ్రీరాముడు విల్లు తీసుకుని రావణుడి మీదికి పోతుండగా లక్ష్మణుడు వాడిని తాను చంపాలనుకుంటున్నాననీ, తనకు ఆజ్ఞ ఇవ్వమని అడిగాడు. శ్రీరాముడు అనుజ్ఞ ఇవ్వగానే, యుద్ధానికి బయల్దేరాడు. రావణుడిని చూశాడు.

లక్ష్మణుడు యుద్ధానికి రావడం చూసిన హనుమంతుడు, రావణుడికి, లక్ష్మణుడికి మధ్య అడ్డంగా దూకి, రావణుడు వేసే బాణాలను తన తోకతో తనను తాకకుండా చెదరగొట్టాడు. అమితమైన కోపంతో రావణుడి రథం మీదకు దూకి వేగంగా తన కుడి చేతిని ఎత్తి, రావణుడు బెదిరేట్లు క్రూరపు చూపులతో అతడిని చూస్తూ "ఓరీ! ఇదిగో నా కుడి చేయి చూడు. ఐదు వేళ్లతో కూడినది. ఇన్ని రోజులుగా నువ్వు నీ దేహంలో కాపాడుకుంటున్న ప్రాణాలను ఇప్పుడే చెదరగొట్టుతా. ధీరుడవై చలించకుండా నిలువు" అన్నాడు.

అప్పుడు రావణుడు హనుమంతుడిని గట్టిగా అర చేత్తో కొట్టి అతడిని అమితంగా బాధకు గురిచేశాడు. అర నిమిషం ముందు-వెనుకలకు చాలా సార్లు ఊగి మరల తెప్పరిల్లి, గాండ్రిస్తూ, రావణుడిని ఒక్క గుద్దు గుద్దాడు. హనుమంతుడు చేతి దెబ్బకు ఎంతగానో బాధపడ్డ రావణుడిని చూసి వానరులు, దేవతలు, మునులు మిక్కిలి సంతోషించారు. దెబ్బతిన్న రావణుడు కాసేపటికి తెప్పరిల్లుకున్నాడు. హనుమంతుడి శౌర్యానికి మెచ్చుకున్నాడు.

రావణుడి మెచ్చుకోలుకు స్పందనగా హనుమంతుడు "నీ భుజబలం కొద్దీ నువ్వు నన్ను గుద్దు. ఆ తరువాత నా భుజబలం కొద్దీ నేను గుద్దుతాను. అప్పుడు నా పోటు శక్తి నువ్వు చూడవచ్చు. నువ్వు చావకుండా వుండవు" అన్నాడు. ఇలా చెప్పగానే రావణుడు కోపంతో కళ్లెర్రచేసి మండిపడుతూ తన శక్తి అంతా పూని హనుమంతుడి రొమ్మును కుడి చేతి పిడికిటితో కొట్టాడు. ఆ దెబ్బకు హనుమంతుడు తబ్బిబ్బులాడుతుంటే, తెప్పరిల్లితే ఆంజనేయుడు తనను చంపుతాడని భయపడి వేగంగా నీలుడి మీదికి పోయాడు.

ఆ తరువాత, నీలుడికి, రావణుడికి మధ్య యుద్ధం కొనసాగింది. నీలుడు రావణుడిని చాలా రకాల ఇబ్బంది పెట్టాడు. నీలుడి వేగానికి, యుద్ధ చాతుర్యానికి, రామలక్ష్మణులు, హనుమంతుడు ఆశ్చర్యపోయారు. రావణుడు నీలుడి మీదికి ఆగ్నేయాస్త్రం ప్రయోగించాడు. ఆ అస్త్రానికి నీలుడు తెలివి తప్పి పడిపోయినప్పటికీ, తండ్రి మహిమ వల్ల, తన బలం తేజస్సు వల్ల చావలేదు. అప్పుడు రావణుడు అహంకారంతో లక్ష్మణుడి మీదికి పోయాడు. రావణ లక్ష్మణుల మధ్య యుద్ధం మొదలైంది. ఒకరినొకరు స్మృతి తప్పేట్లు బాణాలతో కొట్టుకున్నారు. చివరకు రావణుడు బ్రహ్మదేవుడు ఇచ్చిన ఆయుధాన్ని

లక్ష్మణుడి మీదికి విసిరాడు. రావణుడు వేసిన బాణం లక్ష్మణుడి రొమ్ములో నాటుకోగా లక్ష్మణుడు సొమ్మసిల్లి, నేలకూలాడు.

ఇదిలా వుండగా, హనుమంతుడు పరుగెత్తుకుంటూ వచ్చి, వజ్రంతో సమానమైన తన పిడికిటితో తన శక్తికొలదీ రావణుడి రొమ్ము మీద గుద్దగా అతడు దిక్కు తెలియక కాళ్ళు-చేతులు కదిలించడం ఆపి, తన రథంలో కూలబడి పోయాడు. హనుమంతుడు పాత కసి అలా తీర్చుకున్నాడు. రావణుడు అలా మూర్ఛపోవడం చూసిన దేవతలు సంతోషంతో కేకలు వేశారు. లక్ష్మణుడిని హనుమంతుడు తన చేతుల మీదుగా ఎత్తుకుని పోయి రాముడి దగ్గర వుంచాడు. లక్ష్మణుడి మీద రావణుడు వేసిన బ్రహ్మశరం అనే బాణం లక్ష్మణుడిని జయించడం తనకు సాధ్యం కాదని భావించి రావణుడి రథం దగ్గరికి పోయింది. బాణం పోగానే లక్ష్మణుడి మూర్ఛ వదిలింది. తెప్పరిల్లుకున్నాడు. ఇంతలో రావణుడు లేచి విల్లు-బాణాలు ధరించి యుద్ధానికి సిద్ధమయ్యాడు మళ్లీ.

తన సైనికులు పడిపోవడం, మిగిలిన వానరులు రావణుడిని చూసి పరుగెత్తిపోవడం చూసిన రామచంద్రమూర్తి, కోపగించి, ఇక ఆలశ్యం చేయకూడదని భావించి, హనుమంతుడి వీపుమీద కూర్చుని రావణుడిమీదికి యుద్ధానికి పోయాడు. రామబాణ సమూహం రావణుడి సారథితో సహా ఆయన్నూ ఇబ్బందికి గురిచేసింది. ఒక బాణం రావణుడి విశాల వక్షంలో నాటుకుపోయింది. వాడప్పుడు విల-విల బోయి చేష్టలుడిగాడు. రామబాణంతో విలపించాడు. అప్పుడు ఒక ఆలోచనచేశాడు రావణుడు. రాముడు విల్లుచేతిలో లేని శత్రువును చంపడని భావించి నేలమీద తన విల్లుని విడిచాడు. వెంటనే యుద్ధ ధర్మాన్ని అనుసరించి రాముడు గొప్ప మనస్సుతో రావణుడి కిరీటాన్ని నేలపడగొట్టాడు. దాన్ని పడగొట్టిన బాణాన్ని కంఠానికి గురిపెట్టినయితే తల ఎగిరిపోయేది. వాస్తవానికి కిరీటం పోయింది అంటే ప్రభుత్వం పోయినట్లేకదా! కిరీటం పోయి, బడలికతో వున్న, కాంతిహీనుడైన రావణుడిని చూసి రామచంద్రమూర్తి వాడితో ఇలా అన్నాడు.

"నిశాచర రాజా! నిన్ను చంపడానికి సమ్మతించను. రాముడు నిరాయుధుడైన వాడిని, ఆయుధం వున్నా కాళ్లు-చేతులు కదిలించలేని వాడిని చంపడు సుమా! ఆ కారణాన నిన్ను కొట్టను. ఇప్పుడు నువ్వేం చేయాలంటావా? నీకు అనుజ్ఞ ఇస్తున్నాను. నిర్భయంగా లంకకుపో. పోయి అలసట తీర్చుకుని మళ్లీ విల్లు బాణాలు తీసుకుని రథం మీద కూర్చుని నీ దగ్గర వున్న అస్త్రాలన్నీ తీసుకునిరా. అప్పుడు నువ్వు నీ రథం మీదనుండి నా శౌర్యం చూస్తావు''.

ఇలా చెప్పగా రావణుడు గర్వం పోయి సంతోషహీనుడయ్యాడు. విల్లు విరిగిపోగా, సూతుడు చావగా, గుర్రాలు మరణించగా, క్రూరమైన బాణాల దెబ్బలకు నొప్పులు పుట్టిన శరీరంతో, ప్రతాపం క్షయించగా రావణుడు లంకకు పోయాడు. రావణుడు సిగ్గుతో యుద్ధభూమిని విడిచిపోగా దేవతలు, అసురులు, భూతాలు, జలచరాలు, ఋషులు, సర్పాలు, దిక్పాలకులు అంతా మిక్కిలి సంతోషించారు.

కుంభకర్ణుడి చావుతో రావణ వినాశనానికి బీజమా?

ప్రప్రధమ రామ–రావణ యుద్ధంలో, రాముడి ధాటికి నిర్వీర్యమైపోయిన రావణుడు గర్వం పోయి సంతోషహీనుడయ్యాడు. విల్లు విరిగిపోగా, సూతుడు చావగా, గుర్రాలు మరణించగా, రామబాణాల దెబ్బలకు నొప్పులు పుట్టిన శరీరంతో, లంకకు పోయాడు. యుద్ధభూమిని వదిలిపోయిన రావణుడు రామబాణాలు ఇంకా తనను తరుముతున్నాయేమోనని నాల్గు దిక్కులా చూస్తూ భయపడ్డాడు. తన దగ్గరున్న రాక్షసులతో, దుఃఖిస్తూ, తన మనస్సులో వున్నదున్నట్లు ఇలా చెప్పాడు.

"అయ్యో! ఎంతో మందిని జయించిన నేను ఈ రోజున యుద్ధభూమిలో ఒక మనుష్యుడిని గెలవలేక పోయాను. ఎంతటి విపరీత కాలం వచ్చిందో కదా! నాకు వరాలిచ్చినప్పుడే బ్రహ్మదేవుడు నాకు మనుష్యులవల్ల భయం కలుగుతుందని చెప్పాడు. ఆ మాటలు నేడు యదార్థమయ్యాయి కదా! ఎవరితో చావకుండా బ్రహ్మ వరం పొందాను. అప్పుడు దురహంకారంతో మనుష్యులు ఏమి చేయగలరని భావించి వారి పేరు చెప్పలేదు. అది ఇప్పుడు నా ప్రాణానికే అపాయం అయింది. నాకు హితం బోధించిన కొందరు, విష్ణువే మనుష్య రూపంలో రాముడిగా నన్ను చంపడానికి వచ్చాడనీ, అతడితో సంధి చేసుకొమ్మనీ చెప్పారు. గతంలో, ఇక్ష్వాకు రాజైన అరణ్యుడనే వాడిని యుద్ధంలో ఓడించాను. అతడు నన్ను తన వంశంలో నన్ను చంపేవాడు పుట్టాడని చెప్పాడు. ఆ రాజు అన్న మాట నేటికి చెల్లుతున్నది కదా! ఇది వాస్తవం కాబట్టి దశరథుడి కొడుకు రాముడు మనుష్యుడనే నమ్ముతాను. దశరథుడు మనుష్యుడైతే ఆయన కొడుకు కూడా మనుష్యుడే కదా!".

"నేను చేసిన పనికి అవమానపడి, కోపంతో వేదవతి అనే ఒక తపశ్శాలినైన స్త్రీ, నన్ను నా కులాన్ని నాశనం చేస్తానని శపించింది. ఆ వేదవతే ఇప్పుడు విదేహరాజుకు కూతురై సీతగా పుట్టింది. ఆ వేదవతి ఋషి కన్య. మనుష్య స్త్రీ కాబట్టి సీత కూడా మనుష్య స్త్రీనే. కాబట్టి సీతారాములిద్దరూ మనుష్య జాతివారే. మనుష్యులు కాబట్టే ఒకరినొకరు వివాహం చేసుకున్నారు కాని, రాముడు విష్ణువైతే మనుష్య స్త్రీని వివాహం చేసుకుంటాడా? సీత లక్ష్మి అయితే మనుష్యుడిని వివాహం చేసుకుంటుందా? కాబట్టి

లక్ష్మీనారాయణుల వాదన నాకు సమ్మతం కాదు. పార్వతి, రంభ, నందీశ్వరుడు నన్ను గురించి చెప్పింది జరగడం ఆరంభమైంది. ఇవి నాకున్న శాపాలు. ఇది తెలుసుకున్న మీరు విరోధులను సంహరించే ఉపాయం ఆలోచించండి. ఈ శాపాలు నన్ను బాధిస్తాయికాని మిమ్మల్ని ఏమీ చేయలేవు. ఇంకో విషయం, నిద్రబోతున్న కుంభకర్ణుడిని లేపాలి''.

ఆయన ఆజ్ఞానుసారం కుంభకర్ణుడిని నిద్రలేపడానికి రాక్షసులు అనేకవిధాలైన ప్రయత్నాలు చేశారు. కుంభకర్ణుడు కళ్లు తెరిచి, తననెందుకు నిద్రలేపారని వాళ్లను అడిగాడు. రావణుడి క్షేమం గురించి విచారించాడు. యూపాక్షుడనే మంత్రి అతడితో ఇలా అన్నాడు. ''ఇప్పుడు మనకు అర్థంకాని మహాభయం మనుష్యుల వల్ల కలిగింది. వానరులు లంకను ముట్టడించారు. సీతాదేవిని అపహరించడం వల్ల బాధపడుతున్న రాముడితో రాక్షసులకు చావుకాలం వచ్చింది. ఇంతకు ముందు ఒక వానరుడు వచ్చి లంకను కాల్చాడు. ఇప్పుడు సూర్యతేజస్సుకల రాముడు బలవంతుడై వచ్చి రావణుడు చచ్చేట్లు యుద్ధంలో పరుగెత్తించి మరీ కొట్టాడు. అవమానం వల్ల, రాముడి బాణాల దెబ్బల వల్ల, రావణుడు నీమీద ఆశతో ఒక్క ప్రాణాన్ని మాత్రం బిగబట్టుకుని బతికున్నాడు''.

మత్తు వదిలించుకుని అన్న రావణుడిని చూడడానికి కుంభకర్ణుడు త్వరగా పోయాడు. అన్నను చేరిన తమ్ముడిని చూడగానే రావణుడు ''నాయనా వచ్చావా!'' అని సంతోషంగా లేచి కౌగలించుకున్నాడు. కళ్ళు తిప్పుకుంటూ ఇలా అన్నాడు.

"తమ్ముడా! సుగ్రీవుడి సహాయంతో వానర సేనతో రాముడు సముద్రం దాటివచ్చి రాక్షస సేననంతా నాశనం చేస్తున్నాడు. యుద్ధానికి పోయిన రాక్షసులంతా అలాగే పోవడమే కాని మరలి రావడం లేదు. ఈ నగరాన్ని నువ్వే రక్షించాలి. వానర సమూహాన్ని నువ్వు చంపాలని నిన్ను నిద్రలేపాను. అసమాన తేజస్సుకలవాడా! నీ బలం అనే గాలితో విరోధులనే మేఘాలను చెదరగొట్టు''.

ఇలా మాట్లాడుతున్న అన్న రావణుడిని చూసి నవ్వాడు కుంభకర్ణుడు. "గతంలో ఆలోచన చేసే సమయంలో నీకు ఎలాంటి కీడు మూడుతుందో అని మేము నిశ్చయించామో అలాంటి కీడే నేడు కలిగింది. దీంట్లో విపరీతం ఏదీ లేదు. యుద్ధం జరిగితే మనవారిలో కొందరైనా చస్తారు కదా? చావకుండా వుండరు కదా? ఒక ఆడదానికోసం నీ మేలుకోరేవారిని చంపుకుంటున్నావు. చెప్పినా వినకపోతివి. ఆడదానిమీద వున్న కామానికి ఫలితం అనుభవిస్తున్నావు. అనుకున్న దానికి విరుద్ధంగా ఏదీ జరగలేదు. పాపం చేసినవాడికి నరకానుభవం తప్పదన్నట్లు నువ్వు చేసిన పాపకార్యానికి వెంటనే ఫలితం కనబడ్డది. దాన్ని అనుభవిస్తున్నావు. చేసిన పుణ్యపాపాలు త్వరలోనేకదా ఫలితం చూపేది?. ఈ చేత్తో చేశావు, ఆ చేత్తో అనుభవిస్తున్నావు.

కుంభకర్ణుడి మాటలకు కోపం తెచ్చుకున్న రావణుడు ఇలా అన్నాడు తమ్ముడితో: "నా మీద నీకు అమితమైన ప్రేమ వున్నా, నీ బలశౌర్యాలు ఎంతో నీకు తెలిసి వున్నా, ఇప్పటి యుద్ధ ప్రయత్నం నిరాక్షేపకార్యమని నీకు తోచినా, వెంటనే నేను నీతిమాలి చేసిన పనిని, దానివల్ల కలిగిన కీడును నీ శౌర్యంతో సరిదిద్దు. ఆపద కలిగిందని తెలిసి దుఃఖపడేవాడిని చేరుకొని సహాయం చేసేవాడే స్నేహితుడు. నీతిమాలిన పనిచేసి దుఃఖపడేవాడిని రక్షించేవాడే బంధువు. కాని సహాయం చేయకుండా నువ్విలా

చేశావు, అలా చేశావు అని చెప్పేవాడు బంధువు కాదు. స్నేహితుడు కాదు''.

ఈ విధంగా రావణుడు చెప్పగా ఇక వాడికి నీతులు చెప్పి ప్రయోజనం లేదని భావించాడు కుంభకర్ణుడు. వాడికి తియ్యగా మంచిమాటలు చెప్పాడిలా. ''రాక్షసరాజా! నీ మేలుకోరే వాస్తవాన్ని, హితాన్ని చెప్పాను. అది నీకు రుచించలేదు. నా ఇష్టప్రకారం నువ్వు రానప్పుడు, నీ ఇష్టప్రకారం నేను రావాలి కాబట్టి, అసమానమైన నా శౌర్యంతో యుద్ధం చేసి నీ పగ తొలగిస్తాను. సర్వ రాక్షసులు రాముడు చావగా నన్ను ప్రీతితో చూద్దురు గాక. రాముడు మొదట నన్ను యుద్ధంలో చంపితే ఆ తరువాత నిన్ను చంపకుండా వదలడు. ఎందుకంటే అతడు బలశ్రీమహితుడు కాబట్టి లక్ష్మీవంతుడికి పరాజయం వుండదు. ఇది సత్యం. నేను యుద్ధంలో అవమాన పడతానన్న విచారం నాకు లేదు. కాబట్టి నన్నే పంపు. నేను చేతిలో త్రిశూలం తీసుకుని యుద్ధంలో వుండగా నన్ను ఎదిరించడానికి ఇంద్రుడు, అగ్ని, వాయువు కూడా సరిపోరు. శత్రువులంతా చావరా?''

అన్న రావణాసురుడి ఆజ్ఞ ప్రకారం కుంభకర్ణుడు యుద్ధ ప్రయత్నాలు ఆరంభించి, చేత శూలాన్ని ధరించి, అన్నతో తాను ఒంటరిగానే యుద్ధానికి పోతానని తాను వచ్చేదాకా సైన్యాన్ని అక్కడే వుంచమని చెప్పి, అన్నకు ప్రదక్షిణ చేసి కౌగలించుకుని, నమస్కారం చెసి యుద్ధానికి పోయాడు. బలశాలైన కుంభకర్ణుడు అన్న ఆశీర్వాదం తీసుకుని సింహనాదం చేస్తూ యుద్ధానికి పోతుంటే ఆయన వెంట శస్త్రాలను ధరించి సింహనాదాలు చేస్తూ భటులు పోయారు.

కుంభకర్ణుడిని చూసి కోతి గుంపులు చెల్లాచెదరై చెదిరిన పాదరసంలాగా అయిపోయాయి. పరుగెత్తిపోతున్న నీలుడిని, గవాక్షుడిని, నలుడిని, కుముదుడిని, అంగదుడు సమీపించి బలవంతులైన వారే అలా పరుగెత్తి పోవచ్చా అని అడిగాడు. ''వీరులారా! ప్రాణాలను కాపాడుకోవడానికి పరుగెత్తి పోవచ్చా? ఇక్కడ వుండే కాపాడుకోలేరా? మనల్ని రాక్షసులు భయపెట్టే భయపడాలా? అందుకే వారొక బొమ్మను తెచ్చారు. రండి, దాన్ని పడగొడ్దాం. శాశ్వత కీర్తిని సంపాదిద్దాం. వీడి ప్రతాపం రాముడు కనిపించేదాకే కదా? అంతవరకు ధైర్యంతో వుండండి''. ఇలా అంగదుడు వారికి చెప్పి వారిని తిరిగి యుద్ధభూమికి మళ్లించాడు.

యుద్ధభూమికి మరలి వచ్చిన వానరులను కుంభకర్ణుడు మింగుతున్నప్పటికీ మిగిలినవారు ఉత్సాహంగా యుద్ధం చేశారు. అప్పుడు ద్వివిదుడు కోపంతో ఒక శిఖరాన్ని కుంభకర్ణుడి మీదికి విసిరాడు. అది వాడిని తాకకుండా మధ్యలో వున్న గుర్రాలను, రథాలను, ఏనుగులను నాశనం చేసింది. యుద్ధం భయంకరంగా మారింది. రాక్షస రక్తం నేలంతా నిండింది. అప్పుడు రాక్షసులు భయంకరాకారులయ్యారు. వానర సేనమీద పడి రాక్షసులు నరకడం ప్రారంభించారు. ఆ సమయంలో వచ్చాడు హనుమంతుడు.

ఆంజనేయుడు అప్పుడు జడివాన కురిసినట్లు ఆకాశాన తిరుగుతూ కుంభకర్ణుడి తలమీద కొండ శిఖరాలను, చెట్లను వేశాడు. కుంభకర్ణుడు వాటిని తన శూలంతో నరికాడు. అంతే కాకుండా వానర సైన్యాన్ని తన శూలధారతో సంహరించాడు. ఇలా వారిద్దరి మధ్య యుద్ధం సాగింది. సాహసవంతులైన శరభుడు, నీలుడు, గవాక్షుడు, గంధమాదనుడు, ఋషభుడు చెట్లతో, కొడలతో, రాళ్లతో, పిడికిళ్లతో కుంభకర్ణుడిని నలుదిక్కుల నుండి బాధించడానికి చేసిన ప్రయత్నం ఫలించలేదు. వానర సమూహాన్ని

కుంభకర్ణుడు గరుడు సర్పాలను మింగినట్లు బక్షించాడు. అలా వానరులందరినీ చిటిక వేసేంతలో మింగాడు. వానరుల మరణాలతో నేలంతా నెత్తురు మాంసాలతో తడిచి బురదయింది. వాడేమో వానర సేనను దహించాడు. చావగా మిగిలిన వానరులు రాముడి దగ్గరికి పోయి శరణు జొచ్చారు.

అంగదుడు పడిపోగానే కుంభకర్ణుడు తన శూలంతో సుగ్రీవుడి మీదికి పోగా, సుగ్రీవుడు ఒక శిఖరాన్ని ఎత్తుకుని అతడి మీదికి వేశాడు. అది కుంభకర్ణుడిని తాకి ముక్కలవగానే రాక్షసులు సింహనాదాలు చేశారు. కుంభకర్ణుడు కొండ దెబ్బకు బాధ కలిగి ఒక త్రిశూలాన్ని తీసుకుని సుగ్రీవుడి మీద ప్రయోగించాడు. దానికి తటాలున ఆంజనేయుడు అడ్డుపడి దాన్ని విరిచి వేశాడు. వానరులు అప్పుడు సింహనాదాలు చేసి హనుమంతుడిని పొగిడారు. తన శూలం విరిగి పోగానే కుంభకర్ణుడు లంక దగ్గరున్న మలయ పర్వతం శిఖరాన్ని వూడబీకి దాంతో సుగ్రీవుడిని కొట్టాడు.

సుగ్రీవుడు స్మృతి తప్పి పడిపోయాడు. కుంభకర్ణుడు పడిపోయిన సుగ్రీవుడి దగ్గరికి వచ్చి, అతడిని ఎత్తుకుని లంకకు పోయాడు. సుగ్రీవుడు చిక్కడం అంటే రాముడి సేనంతా చిక్కినట్లే అని కుంభకర్ణుడు భావించాడు. ఇదంతా చూస్తున్న ఆంజనేయుడు, ఎలాగైనా సుగ్రీవుడు కుంభకర్ణుడి నుండి తప్పించుకుని వస్తాడని నమ్మాడు. లంకకు తీసుకుని పోబడి, మూర్ఛనుండి తేరుకున్న సుగ్రీవుడు, చంకనుండి తటాలున దిగి చివాలున పైకెగిరి, ఏకకాలంలో నోటితో కుంభకర్ణుడి ముక్కు కొరికి, గోళ్లతో చెవులు పెరికాడు. ఆకాశానికి ఎగిరి రామచంద్రుడి దగ్గరకు చేరాడు. అక్కడ లంకలో కుంభకర్ణుడు అవాక్కయ్యాడు. అప్పుడు కుంభకర్ణుడు యుద్ధభూమికి పోయి దొరికిన వానరులను దొరికినట్లే మింగసాగాడు.

అది చూసిన లక్ష్మణుడు కుంభకర్ణుడి మీదికి యుద్ధానికి పోయాడు. కుంభకర్ణుడు లక్ష్మణుడిని లక్ష్యపెట్టక రామచంద్రమూర్తి వున్న చోటుకు పరుగెత్తాడు. అప్పుడు రామచంద్రమూర్తి రౌద్రాస్త్రం సంధించి కుంభకర్ణుడి విశాలమైన రొమ్ము తాకేట్లు వేశాడు. దానికి వాడు చలించి బెదిరిపోయాడు. రామచంద్రమూర్తి వేసిన బాణాల బాదవల్ల వాడి చేతిలో వున్న ఆయుధాలు వాటంతట అవే జారిపడిపోయాయి. అయుధాలు పడిపోవడంతో చేతులతో యుద్ధం చేస్తూ రాక్షసులను, వానరులను మింగుతూ, ఒక కొండ శిఖరాన్ని తెచ్చి వడిగా రాముడి మీదికి వేశాడు. రాముడు దాన్ని ఏడు బాణాలతో ఖండించాడు.

తరువాత రాముడు వాడి మీద విశేషమైన బాణాలను చిమ్మాడు కాని, వాడు చలించలేదు. తాను వేస్తున్న బాణాలు కుంభకర్ణుడిని కొట్టే సామర్థ్యం లేదని గ్రహించిన రామచంద్రమూర్తి వాయువ్యాస్త్రాన్ని ప్రయోగించి అతడి హస్తాన్ని ఆయుధంతో సహా నేలపడగొట్టాడు. రాముడు వేసిన బాణాలకు కాళ్లు విరిగి స్మృతి తప్పి పడిపోయాడు. అప్పుడు రాముడు బ్రహ్మాస్త్రంతో సమానమైన ఐంద్రాస్త్రాన్నివిల్లులో సంధించి విడిచాడు. అది పిడుగులాగా పోయి రాక్షసుడి తలను తుంపగా అది తటాలున పైకి ఎగిసి దభాలున నేలమీద పడగా, మొండెం వానరులను చంపుకుంటూ పోయి సముద్రంలో పడింది. యుద్ధంలో అలా కుంభకర్ణుడిని సంహరించి రాముడు వానరుల నడుమ ప్రకాశించాడు.

◆❖◆

శ్రీరామలక్ష్మణులు బ్రహ్మవాక్యం గౌరవించారా?

బ్రహ్మాస్త్రంతో సమానమైన ఐంద్రాస్త్రాన్ని రాముడు కుంభకర్ణుడు మీద వేయగా, అది పిడుగులాగా పోయి వాడి తలను నరికి చంపిన తరువాత, మిగిలిన మొండెం వానరులను చంపుకుంటూ పోయి సముద్రంలో పడిన విషయాన్ని చావగా మిగిలిన హతశేషులు, రాక్షసులు రావణుడి దగ్గరికి పోయి వివరంగా చెప్పారు. యుద్ధంలో కుంభకర్ణుడు చనిపోయాడని విన్న రావణుడు సహించరాని దుఃఖంతో గాఢంగా మూర్ఛపోయి నేలమీద పడ్డాడు.

ఏడుస్తున్న రావణుడిని చూసి త్రిశిరుడు అనేవాడు ఓదార్చాడు. "నీ భుజబలంతో రామచంద్రుడిని దండించు. ఆ మాటకొస్తే, అసలు నువ్వెందుకు యుద్ధానికి పోవాలి? నువ్వు సుఖంగా నీ ఇష్టప్రకారమే వుండు. నేను పగతీర్చుకుంటాను. నీ శత్రువులను చీల్చి చెండాడుతాను. రామచంద్రుడిని సంహరిస్తాను" అన్నాడు.

ఇలా త్రిశిరుడు చెప్పడంతో రావణుడు సంతోషపడి దుఃఖం మానాడు. ఆ తరువాత యుద్ధోత్సాహంలో వున్న దేవాంతక, నరాంతక, అతికాయ, త్రిశిరుడు, మత్త, యుద్ధోన్మత్తులను పిలిపించాడు. వీరంతా యుద్ధంలో పరాజయం ఎరగనివారే. అందరూ వరాలు పొందినవారే. వీరిని పిలిపించిన రావణుడు, అందరినీ యుద్ధానికి పంపాడు. వారి సింహనాదాలు, వారి రెట్టలు, వారి పాద ఘట్టనలు ఆకాశాన్ని పగిలేట్లు చేసింది. భూమిని వణికించింది. రాక్షస సేనలను చూసిన వానరులు కొండలు, చెట్లు ఎత్తుకుని కేకలు వేశారు. రాక్షసులు ప్రతిధ్వని చేశారు. రాక్షసులు కూడా వెనుదీయక పదునైన బాణాలను వానరుల మీద వేశారు. ఇరు సేనలు పరాక్రమించి యుద్ధం చేశారు.

వానరుల ధాటిని ఆపడానికి నరాంతకుడు రంగంలోకి దిగాడు. తన శక్తితో వానరులను చాలామందిని క్షణంలో చంపాడు. వానరులు ఇలా పడిపోవడం చూసిన సుగ్రీవుడు, అంగదుడితో నరాంతకుడిని చంపమని చెప్పడంతో, నరాంతకుడి మీదికి అతడు యుద్ధానికి పోయాడు. తన దృఢమైన పిడికిలితో రాక్షసుడి రొమ్ము నలిగిపోయేట్లు పొడిచాడు. ఆ దెబ్బకు వాడు దూరంగా కొట్టుకు పోయి

కొండలాగా పడిపోయాడు. నరాంతకుడు అలా చనిపోయాడు.

నరాంతకుడు చావడం చూసిన త్రిశిరుడు, మహోదరుడు, దేవాంతకుడు ఒక్కసారిగా అంగదుడిని తాకి బాధించారు. ఇలా ముగ్గురు రాక్షసులు బాలుడైన అంగదుడిని తాకిన సంగతి తెలుసుకున్న హనుమంతుడు, నీలుడు ఆ దిక్కుగా వచ్చారు. నీలుడు త్రిశిరుడితో, హనుమంతుడు దేవాంతకుడితో యుద్ధం చేశారు. హనుమంతుడి పిడికిటి పోటుపుకు దేవాంతకుడు చచ్చాడు. నీలుడు చెట్లతో కూడిన ఒక పర్వతాన్ని తీసుకుని మహోదరుడి మీద వేయగా వాడు దాని తాకిడికి నేలకూలి చచ్చాడు. పినతండ్రి చావు చూసిన త్రిశిరుడు హనుమంతుడిని బాణాలతో నొప్పించాడు. హనుమంతుడు అప్పుడు తన కత్తితో త్రిశిరుడిమూడు తలలను నరికి వేశాడు. ఆ తరువాత మహాపార్శ్వుడు ఋషభుడి చేతిలో చచ్చాడు. ఇది చూసి, అతికాయుడు యుద్ధానికి రాగా, వాడిని లక్ష్మణుడు ఎదిరించాడు. ఇరువురి మధ్య యుద్ధం కొనసాగింది. లక్ష్మణుడు ఆగ్నేయాస్త్రం వేస్తే, అతికాయుడు సౌరాస్త్రాన్ని సంధించాడు. అతికాయుడు ఐశీక బాణం వేస్తే, లక్ష్మణుడు ఐందాస్త్రాన్ని వేశాడు. లక్ష్మణుడి బాణాలు అతికాయుడిని చంపలేక పోయాయి. చివరకు వాయుదేవుడు లక్ష్మణుడిని సమీపించి వీడు అల్ప ప్రయత్నంతో చచ్చేవాడు కాదని చెప్పగా, లక్ష్మణుడు బ్రహ్మాస్త్రాన్ని సంధించి వేశాడు. అది వాడి శిరస్సును కవచంతో సహా నేలకూల్చింది.

యుద్ధ భూమిలో లక్ష్మణుడి బాణాలకు అతికాయుడు చచ్చాడని విన్న రావణుడు "నేను యుద్ధానికి పొమ్మని పంపిన రాక్షసులు వానరుల బలానికి లోబడి చావడమే కాని తిరిగి రావడం లేదుకదా? రామచంద్రుడిని, సుగ్రీవుడిని, విభీషణుడిని గెలవడానికి సమర్థుడైనవాడు ఒక్కడు కూడా ఈ లంకా నగరంలో వెతికినా కనపడడే! ఆహా! ఏమీ రాముడి పరాక్రమం? ఏమీ ఆ అస్త్రబలం? రాక్షస శ్రేష్టులందరూ ఆయన చేతిలో చచ్చారు కదా? అలాంటి రాముడిని, సర్వక్లేశరహితుడిని విష్ణుమూర్తి, ఆదినారాయణుడుగా నేను భావిస్తాను. ఆయనకాకుండా మరెవ్వరూ ఈ కార్యం చేయలేడు. ఇక లంకంతా మీరు హెచ్చరికగా కాపలా కాయండి". రావణుడి ఆజ్ఞానుసారం రాక్షసులు వెళ్ళిపోయారు.

ఏం చేయడానికి తోచక రావణుడు వుండగా ఇంద్రజిత్తు సమీపించి రామలక్ష్మణులను యుద్ధ భూమిలో భయంకరమైన తన బాణాలతో పడగొట్టుతానని చెప్పి తండ్రి ఆజ్ఞ తీసుకుని యుద్ధానికి బయల్దేరాడు. ఇంద్రజిత్తు రథం ఎక్కి, కనపడకుండా ఆకాశానికి ఎగిరి, యుద్ధం చేయమని తన పక్కనున్న రాక్షసులను ప్రేరేపించాడు.

రాక్షసులు పరాక్రమించి యుద్ధం చేశారు. ఇంద్రజిత్తు తన బాణాలతో వానరులను చంపాడు. వానరులు కూడా భీకర యుద్ధం చేశారు. ఇంద్రజిత్తును ఎదిరించారు. ఇంద్రజిత్తు గంధమాదనుడిని, నలుడిని, మైందుడిని, గజుడిని, జాంబవంతుడిని, నీలుడిని, సుగ్రీవుడిని, అంగదుడిని, ఋషభుడిని, ద్వివిదుడిని, తీవ్రమైన బాణాలతో నొప్పించాడు. వానరసేనను అల్లకల్లోలం చేశాడు. అదృశ్యుడై ఆకాశాన్నుండి యుద్ధం చేశాడు. విక్రమిస్తున్న ఇంద్రజిత్తు వ్యవహారం చూసి శ్రీరాముడు తమ్ముడితో ఇలా అన్నాడు.

"లక్ష్మణా! రావణుడి కొడుకు ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్ర బలంతో వానరసేనలను నేలపాలు చేసి మనల్ని బాదిస్తున్నాడు. వీడిని మనం ఎలా జయించగలం? ఇది స్వయంభు భగవంతుడైన బ్రహ్మదేవుడి బాణం.

దీని మహిమ చాలా గొప్పది. దీన్ని నాలాగే నువ్వు కూడా ఓర్చుకో. మనమంతా స్మృతి తప్పి ఏ ప్రయత్నం చేయకుండా వుండడం చూసి, జయలక్ష్మిని గ్రహించి, ఇంద్రజిత్తు తన నగారానికి పోతాడు". ఇలా ఆయన చెప్తున్నప్పుడే బాణవర్షం అధికమై, సహించరానిదై, రామలక్ష్మణులు మూర్ఛపోయారు. వారు మూర్ఛపోవడం చూసి సంతోషించిన ఇంద్రజిత్తు వారిని ఓడించిన సంతోషంతో తన నగరానికి పోయాడు.

అప్పుడు అక్కడ దుఃఖిస్తున్న వానర వీరులను చూసి విభీషణుడు "కపులారా! రామలక్ష్మణులు పరవశులై పడ్డారని దుఃఖిస్తే లాభం ఏమిటి? ఇది దుఃఖించాల్సిన సమయం కాదు. రాజకుమారులు బ్రహ్మావాక్యం గౌరవించాలి అనుకుని రాక్షసుల బాణాలకు చిక్కారేకాని, పరాక్రమహీనులై కాదు" అన్నాడు. అప్పుడు హనుమంతుడి క్షేమం గురించి జాంబవంతుడు విభీషణుడిని అడిగాడు. అప్పుడు విభీషణుడు ఇలా అన్నాడు. "రామలక్ష్మణులు క్షేమంగా వున్నారా అని అడగకుండా హనుమంతుడు బాగున్నాడా అని ఎందుకు అడుగుతున్నావు? వాస్తవానికి నీకు హనుమంతుడి మీద వున్న ప్రేమ రాజకుమారుల మీద కాని, బాలుడైన అంగదుడి మీదకాని, ప్రభువైన సుగ్రీవుడి మీదకాని లేకపోవడానికి కారణం ఏమిటి?". సమాధానంగా జాంబవంతుడు "హనుమంతుడు జీవించి వుండి మన సేనలు హతమైనా మనకు మనుగడ వుంటుంది. అలా కాకుండా హనుమంతుడు లేకుండా మనమంతా బతికున్నా లేనట్లే లెక్క. హనుమంతుడు గమనవేగాన వాయుదేవుడితోను, వీర్యాతిశయాన అగ్నిదేవుడితోను సమానం" అని అన్నాడు.

"ఆంజనేయా! నీ పరాక్రమం చూపాల్సిన సమయం ఆసన్నమైంది. నువ్వు సముద్రం దాటి చాలాదూరం పోయి హిమవత్పర్వతం చూసి అక్కడ ఋషభ శైలం, కైలాస పర్వతాలను చూడు. వాటి మధ్యన మిక్కిలి కాంతికలదై సర్వౌషధులు కలిగి అందమైన మూలికల కొండ చూడు. ఆ పర్వతం కొనలో అధికమైన తమ కాంతితో దిక్కులను వెలిగించే నాలుగు మూలికలను చూడు. వాటి కాంతిని బట్టి నువ్వు వాటిని గుర్తించగలవు. వాటిలో మృతసంజీవని (చచ్చిన వారిని బతికించేది), విశల్యకరణి (దేహంలో నాటిన ఇతర పదార్థాలను, బాణాలను, ములుకులను వూడతీసేది), సావర్ణ్యకరణి (గాయాలతో వన్నె మారిన చోట మళ్లీ వన్నె వచ్చేట్లు చేసేది), సంధానకరణి (విరిగిన ఎముకలను, అవయవాలను అతికించేది) వుంటాయి. నువ్వు వెంటనే వెళ్లి వాటిని తెచ్చి వానరసేనకు ప్రాణాలను ఇవ్వు". అని అంటాడు జాంబవంతుడు.

హనుమంతుడు తన దేహాన్ని పెంచాడు వెంటనే. త్రికూట పర్వత శిఖరం ఎక్కాడు. సముద్రాన్ని దాటి పోయి మనోహరమైన మంచుకొండ చేరి జాంబవంతుడి మాటలు జ్ఞప్తికి తెచ్చుకున్నాడు. హనుమంతుడు మూలికలకోసం వేయి యోజనాల స్థలాన్ని వెతికాడు. ఆ మూలికలు కనబడలేదు. అవి కనపడక పోవడంతో హనుమంతుడు ఆ శైలాన్ని పాటులతో సహా పెళ్ళగించి ఆకాశానికి ఎగిరి, శీఘ్రంగా వచ్చాడు. హనుమంతుడు దూరం నుండి వస్తుంటేనే మూలిక గాలి సోకడం వల్ల వానరులంతా ప్రాణాలతో లేచి కూర్చున్నారు. హనుమంతుడిని చూసి కేకలు వేశారు. ఆ మహామూలికల వాసన చూసి రామలక్ష్మణులు స్మృతి తెచ్చుకుని తెప్పరిల్లారు. సుగ్రీవుడు తమ వానరసేనతో లంకను కాల్చమని

చెప్పాడు. ఆ మాటలకు వానరులు లంకలో ప్రవేశించి మేడలు, మిద్దెలు అగ్నికి సంతర్పణం చేస్తుంటే అవి కూలిపడ్డాయి.

ఇదిలా వుండగా అక్కడ యుద్ధభూమిలో బాణాల బాధ తొలగగానే రామలక్ష్మణులు విల్లులు ధరించి, అల్లెతాడు మీటి టంటమ్మనే ధ్వని పుట్టించారు. కుంభకర్ణుడి కొడుకులైన కుంభనికుంభులు సేనలతో సహా యుద్ధానికి బయల్దేరారు. అలా గుంపులుగుంపులుగా వస్తున్న రాక్షస సేనను చూసి వానరసేన సింహనాదాలు చేసింది. రాక్షసుల, వానరుల మధ్య యుద్ధం జరిగింది.

ఆ తరువాత జరిగిన యుద్ధంలో సుగ్రీవుడు యముడిలాగా కుంభుడి మీద పడ్డాడు. అదను చూసి, సుగ్రీవుడు కుంభుడిని పట్టుకుని ఎత్తి సముద్రంలో పారవేశాడు. బయటకు వచ్చిన వాడిని సుగ్రీవుడు తన పిడికిలి బిగబట్టి కొట్టగా, ఆ దెబ్బకు కుంభుడు నేలకూలాడు. అప్పుడు నికుంభుడు యుద్ధానికి దిగాడు. అప్పుడు హనుమంతుడు నికుంభుడి మీదికి దూకి మెడపట్టి గిరగిరా తిప్పి కొట్టి, గొంతు నులుమి చంపాడు. ఇలా అంతా దాదాపు ఏకకాలంలోనే చచ్చారు.

ఆ తరువాత ఖరుడి కొడుకు మకరాక్షుడు రావణ అజ్ఞానుసారం యుద్ధానికి పోయాడు. వానరులకు, రాక్షసులకు భయంకరమైన యుద్ధం జరిగింది. మకరాక్షుడి బాణాలకు, అతడి ప్రతాపానికి, భయపడి వానరులు రాక్షసులు తరుముకుని వస్తుంటే, పరుగెత్తారు. ఇలా వానరులను తరుముతున్న రాక్షసుల మీదికి రామచంద్రమూర్తి కోపంతో తన వాడి బాణాలను వేసి వానరుల పైన పడకుండా నిలిపాడు. అప్పుడు మకరాక్షుడు రామచంద్రమూర్తితో ఇలా అన్నాడు. “నిలు నిలు రామా! ఎందుకు గర్వంతో మిడిసిపడతావు? నీ బలం ఏమాత్రమో నాకు చూపు. ద్వంద్వయుద్ధంలో నీ ప్రాణాలను బలి ఇస్తాను. పారిపోకు. నేను లేని చోట నా తండ్రిని నువ్వు దండకారణ్యంలో చంపావు. నువ్వు నా చేతుల్లో చచ్చి త్వరగా యమపురికి పోయి అక్కడ నీతో పూర్వం చచ్చిన రాక్షసులతో స్నేహంగా ఆడుకో. నీ ఇష్ట ప్రకారం, నీకే యుద్ధం కావాలనుకుంటే ఆ యుద్ధమే చేయి”.

ఇలా అన్న మకరాక్షుడిని చూసి “ఓరీ! రాక్షసుడా! యుద్ధంలో నీ శౌర్యం చూపు. ఖరదూషణులను, నీ తండ్రిని, పద్నాలుగు వేల రాక్షసులను చంపాను. నిన్నూ అలాగే చంపుతాను” అంటాడు. శ్రీరాముడు ఇలా అనగానే, మకరాక్షుడు ఆయన్ను తన బాణాల వర్షంలో ముంచెత్తాడు. రామచంద్రమూర్తి ఆ బాణాలన్నిటినీ తన బాణాలతో ఖండించాడు. ఇరువురూ సమానంగా యుద్ధం చేశారు. తనతో సమానంగా పోరాడుతున్న రాక్షసుడిని చూసి శ్రీరాముడు ఆశ్చర్యపోయాడు. వెంటనే వాడి ధనస్సును తెగగొట్టి, ఎనిమిది బాణాలతో సారథిని చంపి, గుర్రాలను ఖండించి, రథం ఎగిరిపోయేట్లు కొట్టగా మకరాక్షుడు శూలం తీసుకుని కిందకు దూకాడు. దాన్ని రాముడి మీదకు విసిరాడు. దాన్ని రాముడు తుంచాడు. శూలం విరిగిపోగా రాక్షసుడు పిడికిలి పట్టి రాముడిని నిలబడమని అంటూ మీదికి దూకాడు. రాముడు చిరునవ్వు నవ్వి ఆగ్నేయాస్త్రాన్ని సంధించి వాడి రొమ్ము చీల్చి చంపాడు.

ఇంద్రజిత్తు మరణంతో రావణుడి ఓటమి ఖాయమా?

మకరాక్షుడి మరణ వార్త విన్న రావణుడు ఇంద్రజిత్తును చూసి వానరులకు ఎదురుగా నిలబడి యుద్ధం చేయకుండా, మాయ ప్రయోగించి వాళ్లను చంపమని చెప్తాడు. రావణుడి మాటలకు స్పందించిన ఇంద్రజిత్తు, అదృశ్యంకాగల రథం ఎక్కి యుద్ధానికి పోతాడు. వానరసేన మధ్య వున్న రామలక్ష్మణులను గుర్తించాడు. గుర్తించి, విల్లు ఎక్కుపెట్టి, బాణసమూహాన్ని జడివానలా కురిపించి వారిమీద వేయగా వారు కూడా బాణాలను వేశారు. అయితే, రామలక్ష్మణుల బాణాలేవీ ఆకాశాన్ని తాకాయి కాని ఇంద్రజిత్తుకు తగల్లేదు. ఇంద్రజిత్తు బాణాలు రామలక్ష్మణుల దేహాలను తాకి బాధపెట్టాయి. వంచనతో యుద్ధం చేస్తున్న ఇంద్రజిత్తు వ్యవహారానికి కోపించి లక్ష్మణుడు "అన్నా! నువ్వు అంగీకరిస్తే బ్రహ్మాస్త్రం ప్రయోగించి ప్రపంచంలో రాక్షసులనేవారు లేకుండా చేస్తాను" అని అన్నతో అన్నాడు. దానికి రాముడు అంగీకరించలేదు.

యుద్ధం చేస్తూ, ఇంద్రజిత్తు హనుమంతుడున్న పశ్చిమ ద్వారానికి వచ్చాడు. ఆ తరువాత మాయా సీతను తన శక్తితో కల్పించి, ఏడుస్తున్న ఆరూపాన్ని తన రథం మీద వుంచుకుని, వానరులకు ఎదురుగా (మాయా) సీతను చంపడానికి పూనుకున్నాడు. హనుమంతుడు రథం మీదున్న మాయా సీతను చూసి ఆమె నిజమైన సీతే అని సంకటపడ్డాడు. ఇంద్రజిత్తు ఏకీడు చేయకముందే (మాయా) సీతను రక్షించాలనుకున్నాడు హనుమంతుడు. తన మీదికి వస్తున్న హనుమంతుడిని చూసి ఇంద్రజిత్తు తన ఖడ్గం దూసి, పైకెత్తి, (మాయా) సీతాదేవి తల వెంట్రుకలు పట్టుకుని, ఆమె "రామా! రామా!" అని అరుస్తుంటే తన కత్తితో నరికాడు. హనుమంతుడు వానర సేనల మధ్యన వున్న శ్రీరాముడిని సమీపించి మిక్కిలి దుఃఖంతో పాపాత్ముడు ఇంద్రజిత్తు సీతను చంపాడని చెప్పాడు. ఇలా హనుమంతుడు చెప్పగానే రామచంద్రమూర్తి నేలకొరిగాడు.

ఇది గమనించిన రాముడి తమ్ముడు లక్ష్మణుడు ప్రేమతో అన్న శ్రీరాముడికి ఓదార్పు మాటలు చెప్తుండగా, అక్కడికి విభీషణుడు వచ్చి, దుఃఖిస్తున్న లక్ష్మణుడిని, ఇతర వానరులను చూసి, విషయం

తెలుసకుని ఇలా న్నాడు. "పుణ్యాత్ముడా! సముద్రం ఇంకిపోయిందని ఎవరైనా చెప్తే, అది ఎంత నిజమో, హనుమంతుడు చెప్పింది కూడా అంత నిజమే! నమ్మతగినది కాదు. ఎందుకంటే, సీతావిషయంలో రావణుడి చిత్తవృత్తి నాకు తెలుసు. ఆమెను వాడు చంపడు కాక చంపడు. ఏవిధంగానైనా బాధించడు. నామాట నమ్ము. ఆమెకు భయంలేదు. రామచంద్రా! సీతాదేవిని వదిలిపెట్టు, లంకలో నీస్వాధీనంలో వుంచుకోవద్దని నేనెంతగానో నచ్చచెప్పాను. నా హితసూక్తి వాడు వినలేదు. సామదాన భేదం వల్లకాని, మాయాదండం వల్ల కాని, సీతాదేవి సమీపానికి పోవడం కూడా ఎవ్వరికీ సాధ్యపడదు. కాబట్టి ఇంద్రజిత్తు సీతాదేవిని లాక్కొని తెచ్చి సంహరించడం అనేది అవాస్తవం".

విభీషణుడు ఇంకా ఇలా అన్నాడు. "ఇంద్రజిత్తు ఇలా చేయడానికి కారణం ఏమిటని నువ్వు అడగవచ్చు. ఇప్పటిదాకా లంకలో వున్న యోధులంతా యుద్ధం చేస్తుంటే వాడు తన ఇష్టం వచ్చినట్లు హోమాలు చేసి వస్తున్నాడు. ఇప్పుడు లంకలో వాడు తప్ప ఇతరులెవరూ ఇక్కడికి వచ్చి మనతో యుద్ధం చేసేవారు లేరు. వూరికే హోమం చేస్తుంటే వానరులు లంకలోకి ప్రవేశించి దాన్ని ధ్వంసం చేసి యజ్ఞానికి విఘ్నం కలిగిస్తారు. ఎవరు అతడు చేస్తున్న యజ్ఞాన్ని విఘ్నం చేస్తాడో అతడి చేతిలో ఇంద్రజిత్తు చస్తాడని బ్రహ్మవరం వుంది. యజ్ఞం పరిపూర్ణంగా సమాప్తమైతే వాడిని దేవతలైనా జయించలేరు. వాడు మిమ్మల్నందరినీ మోసం చేశాడు. ఆలశ్యం చేయకుండా మా వెంట లక్ష్మణుడిని పంపు. పగతీరగా లక్ష్మణుడు ఇంద్రజిత్తును చంపుతాడు. అక్కడిపోయి ముందుగా లక్ష్మణుడు ఇంద్రజిత్తు యజ్ఞాన్ని బాణాలతో చెడగొట్టాలి. ఆ తరువాత వాడిని వధించాలి. యజ్ఞం పూర్తవుతే వాడు అదృశ్యుడై యుద్ధం చేస్తాడు".

"లక్ష్మణుడు అతడిని ఎలా చంపగలడని అడుగుతావేమో? ఇంద్రజిత్తు ఘోరమైన తపస్సు చేసి బ్రహ్మవల్ల బ్రహ్మశిరం అనే అస్త్రాన్ని, ఆకాశ సంచారం చేయగల గుర్రాలను, రథాన్ని వరంగా పొందాడు. ఆ కారణాన వాడు యజ్ఞం పూర్తిచేయాలని తలచి దానిమీదే మనసు నిలిపి వున్నాడు. సేన తనను చుట్టుకుని వుండగా వాడు కనపడకుండా నికుంభిలకు పోయాడు. ఆ యజ్ఞం వాడు పూర్తి చేస్తే మనమంతా చచ్చిపోయినట్లే. బ్రహ్మదేవుడు ఆ వరం ఇచ్చేటప్పుడు ఈ యజ్ఞాన్ని ఎవరు విఘ్నపరుస్తారో వాడి చేతిలో ఇంద్రజిత్తు చావున్నదని చెప్పాడు. కాబట్టి లక్ష్మణుడు పోయి యజ్ఞాన్ని విఘ్నం చేసినట్లయితే అతడి చేతిలో ఇంద్రజిత్తు తప్పక చస్తాడు. కాబట్టి అతడు పోవడానికి అనుమతి ఇవ్వు. వాడు చస్తే రావణుడు చచ్చినట్లే. రామా! ఇంద్రజిత్తు చేసే మాయలు, వాడి బలం, వాడి వేగం నాకు తెలియంది కాదు". వెంటనే రాముడు లక్ష్మణుడిని విభీషణుడు చెప్పిన ప్రదేశానికి పొమ్మన్నాడు. ఆ మాటలకు లక్ష్మణుడు, విభీషణుడు తమ-తమ ఆయుధాలను తీసుకుని పోవడానికి సిద్ధపడ్డారు. లక్ష్మణుడు కవచం తొడుక్కుని, అన్న పాదాలకు నమస్కారం చేసి, ఇంద్రజిత్తు యజ్ఞం చేస్తున్న ప్రదేశానికి విభీషణుడితో కలిసి పోయాడు.

ఆ తరువాత విభీషణుడు సూచన మేరకు లక్ష్మణుడు పిడుగుల్లాంటి బాణాలను తన బలం కొద్దీ రాక్షసుల మీద వేశాడు. వానరుల దాడికి, లక్ష్మణుడి బాణాలకు భయపడకుండా రాక్షస సేనలు వానరసేనను తాకగా వారికి, వీరికి ఘోరమైన యుద్ధం జరిగింది. వానరుల ముందు నిలబడలేక

రాక్షసులు చెదరిపోగా కోపంతో ఇంద్రజిత్తు హోమం చేయడం ఆపుచేసి బయటకు వచ్చాడు. వస్తూనే యుద్ధం చేయసాగాడు. ఈ లోపల, అక్కడికి వచ్చిన హనుమంతుడు, రాక్షసులను కాల్చడం మొదలెట్టాడు. హనుమంతుడిని రాక్షస మూకలన్నీ కలిసికట్టుగా ఎదుర్కున్నాయి. వారందరినీ పీనుగుపెంటలు చేశాడు హనుమంతుడు. ఆ దిక్కుగా రథాన్ని వేగంగా పోనిమ్మనీ, లేకపోతే హనుమంతుడు రాక్షస సేననంతా నాశనం చేస్తాడని ఇంద్రజిత్తు అన్నాడు.

హనుమంతుడి పైకి బాణాలు వేసేందుకు విల్లెక్కుపెట్టుతున్న ఇంద్రజిత్తును చూపించి విభీషణుడు లక్ష్మణుడితో వాడే ఇంద్రజిత్తు అని చెప్పాడు. త్వరగా పోయి వాడిని బాణాలతో పడగొట్టమని పురమాయించాడు.

ఆ విధంగా ఇంద్రజిత్తును చూపించిన విభీషణుడు, ఆ తరువాత వాడు యజ్ఞం విడిచి వచ్చినందుకు సంతోషపడుతూ, లక్ష్మణుడిని పిలిచి సమీపంలోనే వున్న వనంలోకి తీసుకుపోయి, అక్కడ ఇంద్రజిత్తు యజ్ఞం చేసిన విధానమంతా వివరించాడు. "లక్ష్మణా! భయంకరమైన మర్రి చెట్టు ఇదే! ఇక్కడ ఇంద్రజిత్తు భూతాలకు బలులిచ్చి, హోమం పూర్తి చేసి, యుద్ధానికి వస్తాడు. రాగానే ఎవరికీ కనపడకుండా యుద్ధం చేస్తాడు. శత్రువులను చంపుతాడు. అందుకే మళ్లీ ఇక్కడికి ఇంద్రజిత్తు రాకుండా రథంతో, సారథితో సహా చంపు" అని చెప్పాడు విభీషణుడు. అలాగే చేస్తానని లక్ష్మణుడు తన విల్లు తీశాడు. ఇంతలో మర్రిదగ్గరున్న లక్ష్మణుడి దగ్గరికి ఇంద్రజిత్తు వచ్చాడు. అతడిని చూడగానే కోపంతో లక్ష్మణుడు ఇలా అన్నాడు. "నిన్ను వెతుక్కుంటూ వచ్చాను వంచకుడా! యుద్ధ బిక్ష పెట్టు. నీ మాయలిక సాగవు".

ఇలా లక్ష్మణుడు చెప్పడంతో కోపించిన ఇంద్రజిత్తు, హనుమంతుడి వీపుమీద వున్న లక్ష్మణుడిని చూసి ఇలా అన్నాడు. "నా బాణాలు నిన్నేమి చేయబోతున్నాయో చూడు. నీ సేనను అవి కాలుస్తాయి. ఇప్పుడే మీరంతా యమపురికి పోతారు. ఎవరైనా నా బాణ వర్షాన్ని సహించగలరా? లక్ష్మణా! గతంలో నా బాణాల దెబ్బకు తెలివితప్పి కొనవూపిరితో పడిపోయిన సంగతి మరిచావా? తెలివిమాలినవాడివై మళ్లీ ఇక్కడికి వచ్చావు". జవాబుగా లక్ష్మణుడు, "చేతగాని ప్రతిజ్ఞలు ఎందుకు పలుకుతావు? పనికిరాని మాటలు ఎందుకు అంటావు? మాయా యుద్ధం చేయలేవు కదా ఇక? ఏదీ నీ బాహాటమైన శక్తి చూపించు ఒక్కసారి. నా భుజబలంతో నిన్ను యుద్ధంలో ఓడిస్తాను".

లక్ష్మణుడి మాటలకు జవాబుగా ఇంద్రజిత్తు అతడిమీద బాణాలను వేసి యుద్ధాన్ని ప్రారంభించాడు. ఒకరినొకరు ఎదుర్కున్నారు తీవ్రంగా. ఇద్దరూ సమానంగా యుద్ధం చేశారు. ఇరువురి మధ్య ఘోర యుద్ధం జరిగింది. తీవ్రమైన లక్ష్మణుడి బాణాలకు ఇంద్రజిత్తు కవచం, తునాతునకలై రథం మీద పడింది. ప్రతిగా భయంకరమైన బాణాలను వేసి ఇంద్రజిత్తు లక్ష్మణుడి కవచాన్ని కూడా ఖండించాడు. ఇద్దరిలో ఎవరూ వెనుకడుగు వేయలేదు. యుద్ధం జరుగుతున్నంతసేపూ విభీషణుడు లక్ష్మణుడి పక్కనే వున్నాడు. శ్రద్ధగా లక్ష్మణుడికి సలహాలిచ్చాడు. ఎల్లప్పుడూ లక్ష్మణుడిని కనిపెట్టుకునే వున్నాడు.

ఇంద్రజిత్తు, లక్ష్మణుడు యుద్ధం చేస్తుంటే వారి బాణ సమూహాల మధ్య ఇద్దరూ దాదాపు కనబడలేదు. వారేకాదు....అక్కడున్న ఏ పదార్థమూ కనబడలేదు. భూమ్మీద గాఢ అంధకారం కమ్ముకుని కారు చీకటి కూడా వ్యాపించింది.

ఇలా ఇరువురి మధ్య ఘోర యుద్ధం కొనసాగుతుండగానే, లక్ష్మణుడు శూరుడైన ఇంద్రజిత్తు సారథి శిరస్సును నేల కూల్చాడు. సారథి లేకపోయినా వాడి గుర్రాలు చక్కగా తిరగడం చూసిన శరభుడు, గంధమాదనుడు, రభసప్రమాథుడు అనే వానర వీరులు ఇంద్రజిత్తు నాలుగు గుర్రాలను చంపారు. రథాన్ని విరగ్గొట్టారు. గుర్రాలు, సారథి చావగా ఇంద్రజిత్తు నేలమీద నిలబడి లక్ష్మణుడిని ఎదిరించాడు కాని లక్ష్మణుడి బాణపరంపరలకు తట్టుకోలేక పోయాడు. మాయలు చేయడంలో నేర్పరైన ఇంద్రజిత్తు లంకకు పోయి వేరే రథంతో సారథితో సహా వచ్చాడు. వచ్చి, లక్ష్మణుడిని, విభీషణుడిని, వానరుల గుంపును తన బాణవర్షంతో యుద్ధం చేశాడు. వాడి యుద్ధ నైపుణ్యం లక్ష్మణుడిని, విభీషణుడిని ఆశ్చర్యానికి గురి చేసింది. చివరకు లక్ష్మణుడు ఇంద్రజిత్తు సారథిని చంపాడు తన బాణాలతో. సారథి లేకపోయినా గుర్రాలు రథాన్ని నడిపించాయి. ఇంతలో విభీషణుడు తన గదతో ఇంద్రజిత్తు గుర్రాలను కొట్టి చంపాడు. దివ్యాస్త్రాలతో పోరాడుతున్న రాక్షస రాజకుమారుల యుద్ధాన్ని చూసిన దేవతలు ఆశ్చర్యపోయారు.

తాను వేసిన అన్ని అస్త్రాలనూ ఇంద్రజిత్తు ధైర్యంగా ఎదుర్కోవడంతో లక్ష్మణుడు వాడిలా మామూలుగా చావడు అని నిర్ణయించుకున్నాడు. తాను ఒకవేళ బ్రహ్మాస్త్రం వేసినా వాడు కూడా బ్రహ్మాస్త్రం ప్రయోగిస్తాడని భావించాడు. ఇలా ఆలోచించి, లక్ష్మణుడు, ఇంద్రాస్త్రాన్ని సంధించి ఇంద్రజిత్తు మీద వేయగా అది సూర్యకాంతితో శిరస్త్రాణంతో, కుండలాలతో కూడిన ఇంద్రజిత్తు తలను ఖండించింది. అది చూసిన విభీషణుడు, వానరులు, దేవతలు సంతోషించారు. తమ ప్రభువు మరణం చూసిన రాక్షసులు, వానరులు తమను తరుముకొస్తుంటే ఆయుధాలను నేలపడేసి, లంకవైపు పరుగెత్తారు. జాంబవంతుడు, హనుమంతుడు, విభీషణుడు, ఇంద్రజిత్తుని చంపిన లక్ష్మణుడిని పొగిడారు. ఆయన్ను స్తోత్రం చేశారు. దేవతలంతా సంతోషించారు.

ఇంద్రజిత్తును చంపిన లక్ష్మణుడు సంతోషంతో ఆ వార్త చెప్పడానికి విభీషణుడిని, హనుమంతుడిని వెంట పెట్టుకుని రామచంద్రమూర్తి దగ్గరికి పోయి ఆ విషయం చెప్పాడు. రామచంద్రమూర్తి ఆ వార్త విని చాలా సంతోషించాడు. "లక్ష్మణా! యుద్ధంలో రావణుడికి కుడిచేయి ఇంద్రజిత్తు. కుడిచేయి పోయినవాడిని యుద్ధంలో జయించడం కష్టమా? రావణాసురుడికి అన్నిరకాల సహాయపడుతున్న ఇంద్రజిత్తును నువ్వు చంపావు. దాంతో నేను నిజంగా జయించినవాడినయ్యాను. వాడున్నంత వరకు నాకు జయం సందేహంగా వుండేది. కొడుకు చావు వార్త విన్న రావణుడు తన మిగిలిన సేనతో సహా యుద్ధానికి వస్తాడు. నాకు యుద్ధ బిక్ష ఇస్తాడు. నాచేతుల్లో చస్తాడు. సాధుశీలా! నాకు యుద్ధంలో రక్షకుడిగా వుండి ఇంద్రజిత్తును చంపడం వల్లే కదా నాకు సీత లభిస్తున్నది? రాజ్యం కూడా లభిస్తున్నది. నువ్వా పని చేయకపోతే నాకా రెండు లేనట్లే కదా?" అని అన్నాడు.

◆❖◆

బ్రహ్మాస్త్రంతో రావణుడిని చంపిన శ్రీరాముడు

లంకలో రావణుడికి, ఆయన మంత్రులు, లక్ష్మణుడి చేతిలో ఇంద్రజిత్తు మరణించిన వార్తను చెప్పారు. కొడుకు మరణ వార్త వినగానే రావణుడు స్మృతి తప్పి పడిపోయి, మరల తెలివి తెచ్చుకున్నాడు. పుత్రశోకంతో మనస్సు కలత చెంది, ఏడుస్తూ ఇలా అన్నాడు.

"ఔరా! కాలగతిని ఎవరైనా ఎరుగుదురా? ఎవరికైనా ఇదే మార్గం కదా. నీలాంటివాడు ఏమార్గంలో పోవాలనో ఆ మార్గంలోనే నువ్వు పోయావు. కాబట్టి నీకొరకు నేను దుఃఖపడను కాని, నావాడని చెప్పుకోవడానికి వీలుకాని నా దుస్థితికి, నా దీనదశకు ఏడుస్తున్నాను. రాముడు, లక్ష్మణుడు, సుగ్రీవుడు ప్రాణాలతో వుండగా, వారిని చంపకుండా, నాకు సుఖం కలిగించకుండా, నన్నీవిధంగా తీవ్ర దుఃఖంలో పడవేసి నువ్వు మాత్రం ఊర్ధ్వలోకాలకు పోవడం న్యాయమా?"

ఇలా ఏడుస్తూ రావణుడు కోపంతో మండిపోతుంటే ఎండాకాలంలోని సూర్యుడిలాగా మండిపడ్డాడు. కోపాగ్నితో ఆయన ఎర్రటి కళ్ళు మరింత ఎర్రగా అయ్యాయి. వాడి శరీరం రుద్ర రూపం దాల్చింది. యముడి చూపుల్లాగా వున్న అతడి చూపులకు భయపడి రాక్షసులు గుంపులు కట్టి పరుగెత్తారు. అలా పోతున్న రాక్షసులను ఉద్దేశించి రావణుడు, పళ్ళు పటపటా కొరుకుతూ కోపంగా రాక్షసులను ఉద్దేశించి మాట్లాడాడు. బ్రహ్మ ఇచ్చిన విల్లు, బాణాలు ధరించి యుద్ధభూమిలో తాను నిలబడితే ఇంద్రుడైనా తనను గెల్వగలడా? ఇక రామలక్ష్మణులు నాకొక లెక్కా? సూర్యుడితో సమానమైన బాణసమూహాలను వేసి రామలక్ష్మణులను నరికి వేస్తాను అని అన్నాడు.

ఇలా అంటూనే, రావణుడు తన మంత్రులతో, భార్యలతో అశోకవనం దిక్కుగా సీతను చంపడానికి పరుగెత్తాడు. ఇది గమనించిన సుపార్శ్వుడు అనే మంత్రి రావణుడి దగ్గరికి పోయి కొన్ని మంచిమాటలు ఇలా చెప్పాడు. "నీకోపాన్ని రామచంద్రుడి మీద చూపి ఆయన్ను గెలిస్తే లోకం నిన్ను శూరుడివని మెచ్చుకుంటుంది కాని, ఏ అపార్థం చేయని, నీ మీదకు యుద్ధానికి రాని, నీకు ఏకీడు చేయని ఆడదాన్ని చంపితే నిన్ను పౌరుషశాలి అని ఎవరంటారు? సేనతో పోయి రాముడితో యుద్ధం చేసి ఆయన్ను చంపు.

నువ్వే శూరుడివై, ధీరుడివై, సాయుధిడివై పోయి యుద్ధం చేసి జయించు. నీ కోరిక నెరవేరుతుంది. సీత నీకు స్వాధీనపడుతుంది" అని అంటాడు.

ఇలా సుపార్శ్వుడు చెప్పడంతో చెడ్డ మనస్సు కలవాడైనప్పటికీ రావణుడు ధర్మంతో కూడిన మంత్రి మాటలు మన్నించి ఇంటికి పోయి మంత్రులతో కూడి సభ తీర్చి, సమాలోచన చేశాడు. చతురంగ సైన్యంతో వాళ్లను యుద్ధానికి పోయి వానరులతో యుద్ధం చేయకుండా కేవలం రాముడిని మాత్రం చుట్టుకుని శరవర్షాలతో ముంచి చంపండని చెప్పాడు. రావణుడు ఇలా చెప్పగానే మూల సైన్యమంతా ఆయన మాటలకు అంగీకరించి వెళ్లి వానరులతో యుద్ధం చేశారు. ఇలా వానర-రాక్షస యుద్ధం జరుగుతుంటే, రామచంద్రమూర్తి శత్రుసమూహంలో ప్రవేశించి, జోరుమని బాణవర్షం కురిపించాడు. రాక్షస సైన్యం పీనుగులతో యుద్ధభూమి నిండిపోయింది. రామచంద్రమూర్తి గంధర్వాస్త్రం ప్రయోగించి శత్రువులమీద వేయగా వారు దిగ్భ్రమ చెందారు. ఒకరినొకరు వారే చంపుకున్నారు. కామరూపులైన రాక్షసులను, రామచంద్రమూర్తి ఎవరి సహాయం లేకుండా, గంటన్నర సమయంలో నేలపాలు చేశాడు. చావగా మిగిలినవారు లంకకు పారిపోయారు.

రావణుడు పంపించిన మూల సైన్యమంతా రామబాణాలకు చావగా రాక్షస స్త్రీలు భోరున ఏడవడం జరిగింది. శ్రీరాముడి ఎదుట పడ్డవారిని ఎవరూ కాపాడలేరనీ, ఇక రావణుడు బతకడం జరగదనీ నిర్ణయించుకున్నారు. "ఈ రావణుడు బ్రహ్మను దేవ, పన్నగ, గరుడ, రాక్షసాదులతో చావులేకుండా వరాలు కోరి మనుష్యులు తననేమీ చేయలేరని వారి చేతుల్లో చావు లేకుండా వరాలు కోరలేదు. దాని ఫలమే ఇప్పుడు వాడి చావుకు దారితీస్తున్నది. ఇదొక్క రావణాసురుడితో ఆగదు. సర్వ రాక్షసులు నాశనం కావాల్సినవారే. సీత. రావణుడి వంశనాశనం చేయడానికి వచ్చింది" అని చెప్పుకుంటూ రాక్షస స్త్రీలు ఒకరినొకరు పట్టుకుని దుఃఖపడుతూ, గొంతెత్తి బిగ్గరగా ఏడ్చారు.

రాక్షస స్త్రీల ఏడుపు రావణుడి చెవినపడ్డది. నిట్టూర్పులు విడుస్తూ యుద్ధానికి అన్నీ సిద్ధం చేయమని చెప్పాడు రావణుడు. వాడు యుద్ధానికి బయల్దేరి పోతుంటే అంతటా అపశకునాలు కనిపించాయి. ఆ అపశకునాల మధ్య, మృత్యువు ప్రేరణతో, జయిస్తానన్న అజ్ఞానంతో, రావణుడు సైన్యంతో యుద్ధానికి కదిలాడు తన సేనతో. వారి రథాల ధ్వనులు, వారి అరుపులు విని వానరులు ఇనుమడించిన ఉత్సాహంతో రాక్షసులను ఎదిరించారు. ఇరువురికీ భయంకరమైన యుద్ధం జరిగింది. అప్పుడు రావణుడు యుద్ధం మధ్యలోకి పోయి తన విల్లును సంధించి, కపిసేనను నాశనం చేశాడు.

రావణాసురుడు తన రథాన్ని రామచంద్రుడి వైపు తోలమన్నాడు. వాడు అలా పోవడం చూసిన సుగ్రీవుడు పరాక్రమించి రాక్షసుల మీద యుద్ధం చేశాడు. ఆయన దెబ్బకు రాక్షసుల గుంపు బలం చెడి నేలకూలింది. అప్పుడు విరూపాక్షుడు సుగ్రీవుడి మీద బాణాలను వేశాడు. సుగ్రీవుడు రాక్షసుడిని పిడికిటితో గట్టిగా కొట్టగా ఆ దెబ్బకు విరూపాక్షుడు నెత్తురు కక్కుకుంటూ చావుకేక వేసి కిందపడ్డాడు. ఈ విధంగా విరూపాక్షుడు చావగా రాక్షసులు దుఃఖపడ్డారు. ఆ తరువాత సుగ్రీవుడు తనతో యుద్ధానికి దిగిన మహోదరుడి తల నరికాడు. సుగ్రీవుడి చేతిలో మహోదరుడు చావడంతో మహాపార్శ్వుడు అంగదుడితో యుద్ధానికి దిగాడు. అంగదుడు వజ్రంలాంటి గట్టి పిడికిలి పట్టి రాక్షసుడి హృదయం మీద

గుద్దాడు. ఆ దెబ్బకు మహాపార్శ్వుడు ప్రాణాలుపోయి నేలమీద పడ్డాడు. యుద్ధానికి వచ్చిన నలుగురు ముఖ్య యోధుల్లో రావణుడు తప్ప మిగిలిన ముగ్గురూ చావడం చూసి వానరులు సింహనాదాలు చేయగా ఆ ధ్వనికి లంకా నగరం గడగడ వణికింది.

ఆ ధ్వనికి రావణుడు కలతచెంది వానరులమీదికి యుద్ధానికి పోయాడు. రాముడిని సమీపించిన రావణుడితో మొదలు లక్ష్మణుడు యుద్ధం చేశాడు కాసేపు. లక్ష్మణుడి బాణాలు ఖండించి రావణుడు ఆయన్ను దాటుకుని రాముడిమీద వాడి బాణాలు వేగంగా వేయడంతో శ్రీరాముడు వాటిని అణిచి వందలకొద్దీ బాణాలను రావణుడి మీద వేశాడు. ఆ ప్రకారం ఇరువురూ అసమానమైన, అద్భుతమైన బాణసమూహాలను ఒకరిపై మరొకరు ప్రయోగించారు. సర్వాస్త్రాలు తెలిసన రామచంద్రమూర్తి రాక్షసుడి నొసలు చీల్చేట్లు ఐదు బాణాలను వేయగా, రావణుడు వాటిని కొట్టి ఆసురాస్త్రాన్ని వేశాడు. దానికి విరుగుడుగా రాముడు ఆగ్నేయాస్త్రాన్ని ప్రయోగించాడు. అది రావణుడి అస్త్రాన్ని నాశనం చేసింది. ఇరువురూ దివ్యాస్త్రాలతో పోరాడారు. రాముడితో సమానంగా యుద్ధం చేస్తున్న రావణుడిని చూసి సహించలేక లక్ష్మణుడు యుద్ధంలోకి దిగాడు.

మండోదరి వివాహ సమయంలో మయుడు తన శక్తితో కల్పించి, రావణుడికి ఇచ్చిన "శక్తి" ని రావణుడు రాముడి తమ్ముడు లక్ష్మణుడి మీద ప్రయోగించాడు. ఆ బాణం లక్ష్మణుడి వక్షంలో నాటుకుంది. వెంటనే లక్ష్మణుడు మూర్ఛపోయి నేలకూలాడు. లక్ష్మణుడి రొమ్ములో నాటుకున్న రావణ శక్తిని అవలీలగా బయటకు లాగి తునకలు చేశాడు రాముడు. సుగ్రీవాంజనేయులను చూసి లక్ష్మణుడిని హెచ్చరికగా చూసుకొమ్మని అంటాడు. తాను రావణుడిని సంహరిస్తానని చెప్తాడు. ఇక రాముడో, రావణుడో తేలిపోవాలి అని అంటాడు. ఇలా అంటూ శ్రీరాముడు వాడి బాణాలను రావణుడి దేహంలో గుచ్చుకునేట్లు వేశాడు. నిప్పులు కక్కే బాణాలను రావణుడి మీద వేయగా, వాడు ధైర్యం చెడి ఇక అక్కడ వుంటే చావడం ఖాయమని లంకలోకి పారిపోయాడు.

ఆ తరువాత తమ్ముడు లక్ష్మణుడి పరిస్థితి చూసి శ్రీరాముడు కన్నీరు కార్చాడు. కన్నీరు కారుస్తున్న రామచంద్రమూర్తిని ఓదారుస్తూ సుశేణుడు, ఆయనతో లక్ష్మీవర్ధనుడైన లక్ష్మణుడు చనిపోలేదని ఇలా చెప్పాడు. ఇలా చెప్పి, హనుమంతుడితో, వేగంగా దక్షిణ కూటం పోయి, లక్ష్మణుడి దేహంలో నాటుకున్న ములుకులు వూడతీయడానికి విశల్య కరణిని, లక్ష్మణుడిని జీవింప చేయడానికి అక్కడే వున్న సవర్ణకరణిని, సంధాన కరణిని తీసుకునిరా" అని చెప్పాడు. వెంటనే హనుమంతుడు అక్కడికి పోయి, ఓషధులున్న స్థలాన్ని తెలుసుకోలేక, వెతకడానికి ఏమాత్రం ఆలశ్యం చేయకుండా, కొండనే పీక్కుని పోదామని నిర్ణయించుకుని, దాన్ని పెల్లగించి, ఎత్తుకుని, ఆకాశానికి ఎగిరి, వానరుల మధ్యకొచ్చాడు. హనుమంతుడు రాగానే సుశేణుడు ఆ మందుల తీగెను కొండనుంచి బయటికి తీశాడు. సుశేణుడు తాను తీసిన ఔషధులను లక్ష్మణుడికి వాసన చూపించాడు. వెంటనే అతడు సంతోషంగా మూర్ఛనుండి తేరుకున్నాడు.

ఇంతలో లంకకు పారిపోయిన రావణుడు ఒక రథాన్ని సిద్ధం చేసుకుని, యుద్ధానికి వచ్చి, శ్రీరాముడిని బాణాలతో కొట్టసాగాడు. శ్రీరాముడు కూడా వాడికి తన బాణాలతో సమాధానం చెప్పాడు.

వారిరువురి మధ్య యుద్ధం జరుగుతున్న సమయంలో ఇంద్రుడి ఆజ్ఞానుసారం మాతలి రథాన్ని తీసుకుని రామచంద్రమూర్తి దగ్గరికి వచ్చి ఆయనకు మొక్కాడు. "దేవా! నీ గెలుపు కోరి ఇంద్రుడు ఈ రథాన్ని పంపాడు. దీనిమీద ఎక్కు. రథంతో పాటు రావణుడిని చంపడానికి ఐంద్రధనస్సును, అగ్నితో సమానమైన కాంతికల కవచాన్ని, సూర్యకాంతికల బాణ సమూహాన్ని, మెరుపులాంటి ఈ శక్తిని పంపాడు. తీసుకో. నేను నీకు సారథిగా వుండగా ఈ రావణుడిని చంపు" అని అన్నాడు. ఆ రథం ఎక్కి యుద్ధానికి సిద్ధమైన రాముడు, తన అన్ని అస్త్రాలనూ మనస్సులో తలచుకున్నాడు. ఆ అస్త్రాలను ఒకటి వెంట మరొకటి రావణుడి మీద ప్రయోగించగా వాటి దెబ్బకు వాడు బలహీనుడై భయపడి తల్లడిల్లి పోయాడు. చేతిలో విల్లు పట్టుకోలేక పోయాడు రావణుడు. చావడానికి సిద్ధంగా వున్న రావణుడి దుస్థితి చూసిన సారథి ఇక వాడక్కడే వుంటే చావు ఖాయమని రథాన్ని దూరంగా తీసుకుపోయాడు.

రావణుడి రథాన్ని సారథి దూరంగా తీసుకుపోయినప్పుడు, ఆ తరువాత కార్యం ఏమిటా అని రామచంద్రమూర్తి ఆలోచన చేస్తున్నప్పుడు, అగస్త్యుడు రామచంద్రమూర్తి దగ్గరికి వచ్చాడు. వచ్చి ఆదిత్య హృదయం ఉపదేశిస్తాడు. అది చదువుతే విజయం చేకూరుతుందని చెప్పాడు.

యుద్ధభూమికి దూరంగా రథాన్ని తోలుకుపోయిన సారథిని చూసి రావణుడు (మరణం సమీపిస్తుండగా) కళ్లెర్రచేసి, కోపంగా దూషించాడు. రావణుడు మేలు కోరి అలా చేసిన సారథిని పరుషంగా మాట్లాడడంతో సారథి హితమైన మాటలతో జవాబిచ్చాడు. ఆయన మేలు, క్షేమం కోరి అలా చేసానన్నాడు. సారథి మాటలకు సంతృప్తి చెందిన రావణుడు రథాన్ని శ్రీరాముడికి అభిముఖంగా పోనిమ్మని అంటాడు. సారథి రావణుడి ఆజ్ఞానుసారం రథాన్ని శ్రీరాముడి వైపుకు తీసుకుపోయాడు.

ఇంద్రుడు తనకు పంపిన విల్లు తీసుకుని, కోపంతో, సూర్యకాంతితో సమానమైన కాంతికల వాడి బాణాలను రావణాసురుడి మీద వేశాడు రామచంద్రమూర్తి. రామరావణులు ఒకరినొకరు చంపాలనే కోరికతో యుద్ధం చేస్తుంటే దేవతలు ఆకాశాన గుంపులుగా వీక్షించారు. రామరావణ యుద్ధానికి రామరావణ యుద్ధమే సమానమని నిర్మల మనస్సుతో వారంతా ఆశ్చర్య పడ్డారు.

తీవ్రమైన కోపంతో భయంకరాకారుడై రామచంద్రమూర్తి బాణాన్ని సంధించి రావణుడి శిరస్సు నరికాడు. రావణుడి తల కిందపడ్డది కాని వెంటనే మరొక తల మొలిచింది. అలా తల నరకగానే మరొక తల మొలిచింది కాని వాడు చనిపోయే విధం రాముడికి కనబడలేదు. ఇదేమి చిత్రమని రాముడు ఆలోచన చేయసాగాడు. అప్పుడు మాతలి శ్రీరాముడితో వాడిమీద బ్రహ్మాస్త్రం వేయమనీ, వాడు ఏ గడియలో చస్తాడో అని దేవతలు చెప్పారో ఆ కాలం ఇప్పుడు సమీపించిందనీ చెప్పాడు.

మాతలి ఇలా చెప్పగానే ఇంద్రుడికి బ్రహ్మదేవుడికి, ఆయన అగస్త్యుడికి, ఆయన తనకు ఇచ్చిన బ్రహ్మాస్త్రాన్ని రామచంద్రమూర్తి వింట సంధించాడు. అమితమైన వేగంతో రాముడు బ్రహ్మాస్త్రాన్ని బ్రాహ్మణహంతకుడైన రావణుడిమీద వేశాడు. అది పోయి రావణుడి రొమ్ముమీద పడింది. పడగానే ఆ గొప్ప అస్త్రం రావణాసురుడి రొమ్ము చీల్చి, ఆ నెత్తురులో స్నానం చేసి, వాడి దేహం నుండి ప్రాణాలను వెడలగొట్టి, పనంతా అయిపోయిన తరువాత భూమిలో దూరి వెలుపలికి వచ్చి, వినయంగా రాముడి అమ్ముల పొదిలో ప్రవేశించింది. రావణుడు చావగానే ఆయన దేహం ప్రాణాన్ని వదిలినట్లే, విల్లు,

బాణాలు కూడా రావణుడిని వదిలి నేలమీద పడ్డాయి. రావణుడి దేహం అలా శక్తిపోయి నేలమీద పడిపోయింది. తమ ప్రభువు చావడం చూసి చావకుండా మిగిలిన రాక్షసులు రామజయంతో సంతోషించే వానరులు తరుముతుంటే లంకలోకి పారిపోయారు.

◆❖◆

శ్రీరాముడికి ఆదిత్య హృదయం ఉపదేశించిన అగస్త్యుడు

భీకర రామ–రావణ యుద్ధంలో, రావణుడి అంతిమ ఘడియలు సమీపించడానికి కొంత సమయం ముందర, శ్రీరాముడి బాణాలకు తట్టుకోలేక, రావణుడి క్షేమాన్ని కోరి, రథాన్ని సారథి దూరంగా తీసుకుపోయినప్పుడు, ఆ తరువాత కార్యం ఏమిటా అని రామచంద్రమూర్తి ఆలోచన చేస్తున్నప్పుడు, అగస్త్యుడు రామచంద్రమూర్తి దగ్గరికి వచ్చాడు. వచ్చి ఈ కింద చెప్పిన విధంగా ఆదిత్య హృదయం ఉపదేశిస్తాడు.

ధ్యానమ్

నమస్సవిత్రే జగదేక చక్షుసే
జగత్ప్రసూతి స్థితి నాశహేతవే
త్రయీమయాయ త్రిగుణాత్మ ధారిణే
విరించి నారాయణ శంకరాత్మనే

తతో యుద్ధ పరిశ్రాంతం సమరే చింతయా స్థితమ్ ।
రావణం చాగ్రతో దృష్ట్వా యుద్ధాయ సముపస్థితమ్ ॥ 1 ॥

దైవతైశ్చ సమాగమ్య ద్రష్టుమభ్యాగతో రణమ్ ।
ఉపగమ్యా బ్రవీద్రామమ్ అగస్త్యో భగవాన్ ఋషిః ॥ 2 ॥

రామ రామ మహాబాహో శృణు గుహ్యం సనాతనమ్ ।
యేన సర్వానరీన్ వత్స సమరే విజయిష్యసి ॥ 3 ॥

ఆదిత్య హృదయం పుణ్యం సర్వశత్రు వినాశనమ్ ।
జయావహం జపేన్నిత్యం అక్షయ్యం పరమం శివమ్ ॥ 4 ॥

సర్వమంగళ మాంగళ్యం సర్వ పాప ప్రణాశనమ్ ।
చింతాశోక ప్రశమనం ఆయుర్వర్ధన ముత్తమమ్ ॥ 5 ॥

రశ్మిమంతం సముద్యంతం దేవాసుర నమస్కృతమ్ ।
పూజయస్వ వివస్వంతం భాస్కరం భువనేశ్వరమ్ ॥ 6 ॥

సర్వదేవాత్మకో హ్యేష తేజస్వీ రశ్మిభావనః ।
ఏష దేవాసుర గణాన్ లోకాన్ పాతి గభస్తిభిః ॥ 7 ॥

ఏష బ్రహ్మా చ విష్ణుశ్చ శివః స్కందః ప్రజాపతిః ।
మహేంద్రో ధనదః కాలో యమః సోమో హ్యపాం పతిః ॥ 8 ॥

పితరో వసవః సాధ్యా హ్యశ్వినౌ మరుతో మనుః ।
వాయుర్వహ్నిః ప్రజాప్రాణః ఋతుకర్తా ప్రభాకరః ॥ 9 ॥

ఆదిత్యః సవితా సూర్యః ఖగః పూషా గభస్తిమాన్ ।
సువర్ణసదృశో భానుః హిరణ్యరేతా దివాకరః ॥ 10 ॥

హరిదశ్వః సహస్రార్చిః సప్తసప్తి-ర్మరీచిమాన్ ।
తిమిరోన్మథనః శంభుః త్వష్టా మార్తాండకోఽంశుమాన్ ॥ 11 ॥

హిరణ్యగర్భః శిశిరః తపనో భాస్కరో రవిః ।
అగ్నిగర్భోఽదితేః పుత్రః శంఖః శిశిరనాశనః ॥ 12 ॥

వ్యోమనాథ స్తమోభేదీ ఋగ్యజుఃసామ-పారగః ।
ఘనావృష్టి రపాం మిత్రో వింధ్యవీథీ ప్లవంగమః ॥ 13 ॥

ఆతపీ మండలీ మృత్యుః పింగళః సర్వతాపనః ।
కవిర్విశ్వో మహాతేజా రక్తః సర్వభవోద్భవః ॥ 14 ॥

నక్షత్ర గ్రహ తారాణామ్ అధిపో విశ్వభావనః ।
తేజసామపి తేజస్వీ ద్వాదశాత్మన్-నమోఽస్తు తే ॥ 15 ॥

నమః పూర్వాయ గిరయే పశ్చిమాయాద్రయే నమః ।
జ్యోతిర్గణానాం పతయే దినాధిపతయే నమః ॥ 16 ॥

జయాయ జయభద్రాయ హర్యశ్వాయ నమో నమః ।
నమో నమః సహస్రాంశో ఆదిత్యాయ నమో నమః ॥ 17 ॥

నమ ఉగ్రాయ వీరాయ సారంగాయ నమో నమః ।
నమః పద్మప్రబోధాయ మార్తాండాయ నమో నమః ॥ 18 ॥

బ్రహ్మేశానాచ్యుతేశాయ సూర్యాయాదిత్య-వర్చసే ।
భాస్వతే సర్వభక్షాయ రౌద్రాయ వపుషే నమః ॥ 19 ॥

తమోఘ్నాయ హిమఘ్నాయ శత్రుఘ్నాయా మితాత్మనే ।
కృతఘ్నఘ్నాయ దేవాయ జ్యోతిషాం పతయే నమః ॥ 20 ॥

తప్త చామీకరాభాయ వహ్నయే విశ్వకర్మణే ।
నమస్తమోఽభి నిఘ్నాయ రుచయే లోకసాక్షిణే ॥ 21 ॥

నాశయత్యేష వై భూతం తదేవ సృజతి ప్రభుః ।
పాయత్యేష తపత్యేష వర్షత్యేష గభస్తిభిః ॥ 22 ॥

ఏష సుప్తేషు జాగర్తి భూతేషు పరినిష్ఠితః ।
ఏష ఏవాగ్నిహోత్రం చ ఫలం చైవాగ్ని హోత్రిణామ్ ॥ 23 ॥

వేదాశ్చ క్రతవశ్చైవ క్రతూనాం ఫలమేవ చ ।
యాని కృత్యాని లోకేషు సర్వ ఏష రవిః ప్రభుః ॥ 24 ॥

ఉపదేశిస్తూ ఇలా చెప్పాడు.

"శ్రీరామ రామ! శ్రద్ధగా నేను చెప్పేది విను. వింటే నీ శత్రువులందరినీ యుద్ధంలో గెలుస్తావు. నువ్వు మహాభుజబలపరాక్రమం కలిగినవాడివైనప్పటికీ శత్రు సంహారంలో నీకిది తోడ్పడుతుంది. ఆదిత్యహృదయం సంపత్కరమైనది. పుణ్యదమైనది. సకల బాహ్యాభ్యంతర శత్రువులను నాశనం చేస్తుంది. మిక్కిలి శుభకరమైనది. క్షేమానికి హేతువైనది. క్షయం కానిది. పూర్వోత్తర పాపాలన్నిటినీ నాశనం చేసి గెలుపు ప్రసాదించేది. దేహబాధ, మనోవేదన తొలగిస్తుంది. మంత్రాలలో ఉత్తమమైనది. విహితమైన ఆయువుకంటే అధికమైన ఆయువు కలిగిస్తుంది. సమస్త మంగళాలలో మిక్కిలి మంగళమైనది. జపించే వారికి అధికమైన కీర్తిని కలిగిస్తుంది. కాబట్టి ఆ మంత్రంతో రశ్మిమంతుడై ఉదయించే సూర్యుడిని, దేవతల, రాక్షసుల, మనుష్యుల నమస్కారాలందుకునే సూర్యుడిని, సమస్త లోకాలకు ప్రియమైన వాడిని, వివస్వంతుడిని ఇక కొలువు".

"ఇతడే అమితమైన తేజస్సుకలవాడు. సర్వ వేదస్వరూపుడు ఇతడే. కాంతులు కలవాడు ఇతడే. తన కిరణాలతో సమస్త దేవతల, అసురుల సమూహాన్ని, ప్రపంచాన్ని రక్షించేవాడు ఇతడే. ఇతడే బ్రహ్మ,

ఇతడే విష్ణు. ఇతడే స్కందుడు. ఇతడే శివుడు. ఇతడే ప్రజాపతి. ఇతడే మహేంద్రుడు. ఇతడే కుబేరుడు. ఇతడే యముడు. ఇతడే కాలుడు. సోముడు, వరుణుడు, పితరులు, వసువులు, మరుత్తుడు ఇతడే. సాధ్యులు, అశ్వులు, మనువు, వాయువు, వహ్ని, ఋతుకర్త, ప్రభాకరుడు అన్నీ ఇతడే".

"అఖండ భూమండలానికి పతియగువాడు లేక పరమాకాశానికి పతియగువాడు ఆదిత్యుడు నువ్వే. సర్వం ప్రేరేపించేవాడివి నువ్వే. వర్షం కురిపించి పైరులు పండించేది నువ్వే. పరమాకాశంలో వుండేవాడివి నువ్వే. పోషించేవాడివి, లక్ష్మీదేవితో నిత్య సంయోగం కలవాడివి, ప్రపంచ సృష్టికి కారణమైన సాధనం కలవాడివి, ప్రకాశించే వస్తువులకు ప్రకాశం ఇచ్చేవాడివి, సూర్యచంద్రాగ్ని యమాదులను ఆజ్ఞతో తపింప చేసేవాడివి నువ్వే. ఆశ్రితులకు జ్ఞానం కలిగించేవాడివి, జీవకోటుల హృదయంలో వుండేవాడివి, లోకాన్ని సన్నగిల్ల చేసేవాడివి, గరుత్మంతుడిని వాహనంగా కలవాడివి, అనంత కల్యాణగుణాలు కలవాడివి, సుదర్శనాన్ని ధరించినవాడివి, సమస్త పదార్థాల లోపల వెలుపల వ్యాపించి వున్నవాడివి, కల్క్యవతారంలో గుర్రాన్ని వాహనంగా కలవాడివి, అజ్ఞాన నాశకుడివి, సౌందర్య సౌశీల్యాలలో సుఖం కలిగించేవాడివి, నష్టమైన ప్రపంచాన్ని పునర్జీవింప శక్తికలవాడివి, స్తోత్రం చేయతగ్గవాడివి, అగ్నిని తనయందు కలవాడివి నువ్వే. సాయంకాలాన శమించేవాడివి, ప్రళయవేళ వ్యాపార రహితుడై వున్నవాడివి, చక్రాయుధుడివి, తాపత్రయ బాధితులకు తాపం ఆర్చుకోవడానికి చల్లటి ఆశ్రయమైనవాడివి, నిజభక్త విరోధులను తపించచేయగలవాడివి, మంచును నాశనం చేయగలవాడివి నువ్వే".

"దేవా! నువ్వే హిరణ్యగర్భుడివి. నువ్వే వామనమూర్తివి. నువ్వే కర్మకుల కర్మఫలాలను ఇచ్చేవాడివి. నువ్వే పరమాకాశనాథుడివి. ఉదకాలకు మిత్రుడివి నువ్వే. భక్తుల హృదయంలోని చీకటిని పోగొట్టేవాడివి నువ్వే. వేదాల అంతాన్ని పొందినవాడివి నువ్వే. కవిరాజు నువ్వే. ముక్తులను సుషుమ్నానాడిలో ప్రవేశపెట్టేవాడివి నువ్వే. సుశీలుడివి. ప్రకృతి శరీరంగా కలవాడివి. స్వరూప గుణాల విభవాలతో పూర్ణుడివి. ప్రపంచ నిర్మాణ విషయంలో సంకల్పం కలవాడివి. కౌస్తుభాద్యలంకారాలు కలవాడివి. ప్రపంచాన్ని అంతా ఒక్కసారిగా తపింప చేయగలవాడివి. సర్వ భూతకోటుల రంజింప చేయగలవాడివి. సమస్తం వాటివాటి స్థానాలలో స్థాపించగలవాడివి. గ్రహనక్షత్రాదులకు అంతర్యామివై వాటిని శాసించగలవాడివి".

"తేజోవంతులలో తేజోవంతుడవైనవాడా! పన్నెండు మూర్తులు కలవాడా! దినాధిపతీ! ప్రకాశించేవాడా! భక్తులకు జయం క్షేమం కలిగించేవాడా! జయస్వరూపుడా! కమలనాయకా! నీకు నమస్కారాలు. ఉదయపర్వతానికి, పశ్చిమపర్వతానికి, పాపాత్ములకు భయంకరమైన వాడికి, ముక్తులకు అధిపతి అయినవాడికి, హర్యశ్వునకు, జయుడికి మొక్కుతాను. ఆదిత్యుడికి మొక్కుతాను. ఎల్లప్పుడూ వెలిగేవాడికి మొక్కుతాను. సారంగమూర్తికి మొక్కుతాను. మార్తాండుడికి మొక్కుతాను. సృష్టిస్థితి సంహార కర్తలైన బ్రహ్మ, విష్ణు, శివుడికి మొక్కుతాను. ప్రపంచాన్ని సృష్టించే వాడికి మొక్కుతాను. ప్రాణికోటులను సంహరించి, మరల సృజించి, రక్షించే ప్రభువు ఇతడే. తపింప చేసేవాడు, మళ్లా వర్షం కురిపించి ఆ తాపాన్ని అణిచేవాడు ఇతడే".

సూర్యుడు దేవతా మధ్యలో నిలిచి రావణ వధకు సహాయపడునని శ్రీరామచంద్రమూర్తికి అగస్త్యుడు చెప్పాడు. ఇలా చెప్పి, ఈ ఆదిత్య హృదయం మంత్రాన్ని ఆపదల్లో, కష్టాలలో, భయం కలిగినప్పుడు మానవులు చదువుతే వారికి మేలు జరుగుతుంది సీతానాథా అంటాడు. ఏకాగ్ర మనస్కుడివై లోకపతిని, దేవదేవుడిని పూజించమని చెప్పాడు. అలా చేస్తే మరుక్షణంలోనే రావణుడిని వధిస్తావు అని అంటాడు. అలా చెప్పి అగస్త్యుడు అంతర్ధానం అయ్యాడు. శ్రీరాముడు ముని చెప్పినట్లే మంత్రాన్ని జపించాడు. ఆ తరువాత రావణుడితో యుద్ధానికి సిద్ధమయ్యాడు. ఇంద్రుడు పంపిన రథం ఎక్కి, బ్రహ్మాస్త్రంతో రావణుడిని చంపాడు. అలా ముగిసింది రామ–రావణ యుద్ధం.

◆❖◆

రావణుడు సంస్కారానికి అర్హుడన్న శ్రీరాముడు

రామ–రావణ యుద్ధంలో, ముల్లోకాలను భయపెట్టిన రావణుడు శ్రీరామచంద్రమూర్తి చేతిలో చావగా లోకాలన్నీ సంతోషించాయి. దేవతలు దుందుభులు మోగించారు. వారి వాక్యాలు స్తోత్రాలయ్యాయి. దేవతలు, చారణులు సంతోషించారు. సమస్త జనవిరోధైన రావణుడు దేవలోకానికి ప్రయాణమై పోవడంతో దేవతలు శాంతచిత్తులై సంతోషించారు. దిక్కులు తేటగా అయ్యాయి. ఆకాశం నిర్మలమై ప్రకాశించింది. భూమి వణకడం ఆపుచేసింది. మందమారుతం సువాసనతో వీచింది. సూర్యుడు భయం లేకుండా ప్రకాశించాడు. నిర్భయంగా జనులు వీథులవెంట తిరిగారు. యాగాల పొగలు ఆకాశాన్ని తాకాయి. లోకులంతా దిగులు మాని నిద్రించారు.

ఇలా రావణాసురుడు చావగా విభీషణుడు రావణుడి కళేబరాన్ని చూసి దీనుడై ఏడ్చాడు. ఏడుస్తూ ఇలా అన్నాడు. "ఎన్నో యుద్ధాలను జయించి, వీరుడని కీర్తి సంపాదించి, శాస్త్రాలెన్నో పఠించి, పండితులతో పొగడ్తలందుకుని, స్థిరంగా సౌఖ్యం ఇచ్చే పానుపు మీద పడుకునాల్సిన వాడివి అన్నా! ఇవ్వాళ ఇలా నేలమీద పడాల్సిన వాడివయ్యావు కదా! ఇలా జరుగుతుందని నీకు ఎన్ని సార్లు చెప్పినా కామాతిశయంతో నా మాటలు వినలేదుకదా? కుంభకర్ణుడైనా, ఇంద్రజిత్తయినా, ప్రహస్తుడైనా, నరాంతకుడైనా, అతికాయుడైనా బలంకలవారిమని ప్రవర్తించారే కాని ధర్మం శ్రేయస్కరమని, అధర్మం హానికరం అన్న నీతిని పాటించలేదు కదా? నువ్వు కూడా ఆలోచించ లేదు. దాని ఫలమే ఇప్పుడు ఇలా ప్రాప్తించింది కదా? నేనెంతగానో వద్దని వారించాను. నేను చెప్పినదంతా వ్యర్థమైపోయింది. కాలాన్ని ఎవరు తప్పించగలరు?"

ఏడుస్తున్న విభీషణుడిని ఓదారుస్తూ శ్రీరామచంద్రమూర్తి ఇలా అన్నాడు. "అయ్యా! విభీషణా! ఎందుకు ఏడుస్తున్నావు? బలహీనుడై యుద్ధం చేయలేక అవమానపడి చావలేదితడు. ఓడిపోతానని ఏమాత్రం సందేహం లేకుండా, చస్తానేమోనన్న భయం లేకుండా, అపరిమితమైన ధైర్యంతో చేతనైనంతదాకా యుద్ధం చేసి చనిపోయాడు. యుద్ధంలో క్షాత్ర ధర్మంతో వీరమరణం పొందినవారికోసం

ఏడవడం న్యాయమా? ముల్లోకాలనూ బాధించాడు. దేవతలను జయించాడు. యుద్ధంలో అసమాన బలంతో పోరాడి వీరులు పోయే స్వర్గానికి పోయాడు. ఇలాంటివాడి కోసం ఏడవడం తగునా? క్షత్రియ ధర్మం ఇదీ అని నిశ్చయించుకుని, వాస్తవం అర్థం చేసుకుని, తరువాత జరగాల్సిన పనికై త్వరపడు".

"విభీషణా! పగ అనేది జీవితకాలంలోనే కాని చచ్చినవాడి మీద పగ అనేది లేదు. ఇప్పుడు మనం ఏం చేసినా అతడేమి చేయగలడు? ఆ విధంగా ప్రతీకారం ఏమీ చేయలేనివాడి విషయంలో మనం ఏదీ చేయకూడదు. వాడిమీద పగ వాడి మరణంతోనే ముగిసింది. వాడు నేను పుట్టుకతో శత్రువులం కాదు. ఒక విషయంలో విరోధం వచ్చింది. ఆ కార్యం చక్కబడింది. మన కార్యాలు చక్కనైనయ్యాయి. కాబట్టి ఇక వాడి మేలుకొరకై చేయాల్సిన సంస్కారాలు చేయి. వీడు నీకు ఎలాంటివాడో నాకూ అలాగే. నీకెలా తోడబుట్టినవాడు అన్న ప్రేమకలదో నాకూ అలాగే వుంది. నీకు వాడు తోడబుట్టినవాడైనప్పుడు, నువ్వు నాకు తోడబుట్టినవారిలో ఒకడివైనప్పుడు వీడు మాత్రం అలా కాడా? కాబట్టి వీడికి కర్మలు చేసే విషయంలో నేను అన్యథా భావిస్తానని అనుకోవద్దు" అన్నాడు.

ఇలా శ్రీరాముడు విభీషణుడితో అంటున్న సమయంలోనే రావణుడి భార్యలు, రాక్షస స్త్రీలు అంతఃపురం వదిలి ఏడ్చుకుంటూ వచ్చారక్కడికి. "హా రాజనందనా! హా జీవితేశ్వరా! హా ప్రాణ నాయకా! హా మదీశ! హా నాథా! హా పతీ!" అనుకుంటూ ఏడ్చారు. ఒక మనిషి చేతిలో చచ్చావా? అని ఏడ్చారు. సీతను రాముడికి ఇచ్చి వుంటే ఇంత జరిగేది కాదుకదా? అని ఏడ్చారు. "నీ ఒక్కడి మూర్ఖత్వం వల్ల నువ్వు, మేము, వూరివారంతా చెడిపోయాం కదా? నీ మృతికి కామం కారణం కాదు. అంతా దైవ వశం. దైవం తప్పుగా చూస్తే ఏదైనా జరుగవచ్చు. నీ నాశనానికి దైవమే కారణం. విధి సంకల్పం తప్పించడం ఎవరి తరం కాదు" అని ఏడ్చారు.

రావణుడి పెద్ద భార్య మందోదరి యుద్ధభూమికి చేరుకొని దుఃఖం ఆపుకోలేక ఏడ్చింది. మందోదరి వీరపత్నికదా! వీరపత్ని అంటే భర్త గెలిచినప్పుడు ఎంత సంతోషపడాలో, వీరమరణం పొందినప్పుడు కూడా తన వీరపత్నీత్వానికి హానిరాలేదు కదా అని సంతోషించాల్సి వుండగా పామరురాలిలాగా ఇలా ఏడవవచ్చా? మందోదరి రావణుడి మరణానికి ఏడవలేదు. రావణుడు తనకంటే అధములని భావించే మనుష్యుల చేతిలో చచ్చి, తన వీరపత్నీత్వానికి హాని కలిగించాడు కదా! ఇదెంత లజ్జావహం? ఎవరైనా వచ్చి నీ భర్త మనుష్యుడి చేతిలో చచ్చాడే, ఇది నిజమా? అంటే తానేమి చెప్పాలి అని ఏడ్చింది.

"ముల్లోకాలను గెలిచావు కదా! ఎక్కడెక్కడ లక్ష్మి, సంపద వుంటే అదంతా గెల్చావు కదా! ఎంతో పేరు గడించావు కదా! చివరకు ఒక మనిషి చేతిలో చచ్చావు కదా! నిన్నొక మనుష్యుడు చంపాడంటే నమ్మలేక పోతున్నాను. మనిషి మనుష్యులను తినేవాడిని చంపడంలో ఏం న్యాయం వుందో చెప్పు. ఇది విపరీతం, అవమానకరం కదా! సకల శస్త్రాస్త్రాలను పరిపూర్ణంగా తెలిసిన యుద్ధకోవిదుడివైన నిన్ను యుద్ధంలో రాముడు చంపడమా? నమ్మలేకపోతున్నాను ప్రాణనాథా!" అని విలపించింది మందోదరి.

"ప్రాణేశ్వరా! నువ్వు సీతాదేవిని ఏమని అనుకున్నావు? ఆమె వల్లే కదా, వసుధకు వసుధ అన్న పేరు వచ్చింది. శ్రీ, శ్రీ అయింది. అలాంటి స్త్రీరత్నమైన పతివ్రత సీత. ఆమె ఏ అవయవంలోనూ ఒక్కటంటే ఒక్క దోషం కనపడదు. దోషాలు లేకపోవడమే కాదు. సమస్త శుభచిహ్నాలు వున్నాయి. అలాంటి దాన్ని

నువ్వు భక్తితో ఆశ్రయించి వుంటే ఎంతో బాగుపడేవాడివి. ఆ మార్గాన్ని వదిలి మహారణ్యంలో, ఏమూలనో, ఎవరూలేని చోట ఆమె వున్నప్పుడు మోసగించి ఆమె ఏడుస్తూ వుంటే మారీచుడిని పంపించి అపహరించావు. ఇది నిన్ను నువ్వు నాశనం చేసుకునే కార్యక్రమం కాదా? అపహరించడం తప్ప ఆమెవల్ల నువ్వు అనుభవించిన సుఖం ఏమైనా వుందా? సుఖానికి బదులు ఆమె పాతివ్రత్యంలో కాలిపోయావు. వాస్తవానికి నువ్వామెను తాకిననాడే భస్మం కానందుకు నిన్ను చూసి దేవతలు భయపడ్డారు. నువ్వు చేసిన పని పాపకార్యం అయితే అప్పుడే పాపఫలం ఎందుకు అనుభవించలేదు అని అడగవచ్చు నువ్వు. దానికి కారణం వుంది. విత్తనం వేయగానే ఫలం నోటికి రాదు. కాలపక్వం కావాలి. పాపం చేసినవాడికి ఆ పాపఫలం కాలపక్వమైనప్పుడే అనుభవంలోకి వస్తుంది. అప్పుడిక ఏం చేసినా పోదు".

"నువ్వు శూరుడివై లోకాన్నంతా నీ భుజబలంతో గెలిచావు. కాబట్టే నువ్వు శూరుడివనుకున్నావు. కాని నువ్వు నిజానికి శూరుడివి కాదు. నిజమైన శూరుడివే అయితే పిరికివాడిలాగా ఆడదాన్ని దొంగిలించి తెచ్చే నీచకార్యానికి పూనుకుంటావా? మగవారికి భయపడే కదా నువ్విలా చేశావు? జింక నెపంతో రామచంద్రమూర్తిని ఆశ్రమానికి దూరంగా పోయేట్లు చేసి సీతను ఎత్తుకువచ్చావు. ఇది పిరికితనానికి నిదర్శనం కాదా? నిర్భాగ్యదశ పక్వమై నీకిలాంటి దుర్బుద్ధి కలిగింది. నువ్వెప్పుడైతే సీతను తెచ్చావో అప్పుడే సత్యవాదైన నామరది విభీషణుడు రాక్షసులు అంతా నాశనమవుతారని హెచ్చరించాడు. విభీషణుడి ప్రయత్నాలు ఫలించలేదు. మాట వినని నీలాగే రాక్షసులంతా నాశనం అయ్యారు. చేసిన దానికి ఫలం అనుభవించడానికి నీ గతికి నువ్వు పోయావు. కాబట్టి నీకొరకు నేను దుఃఖపడడం లేదు. నాగతి ఏమిటని నేను నాకై దుఃఖిస్తున్నాను".

చనిపోయిన అన్న రావణాసురుడికి దహన సంస్కారాలు జరిపించమని రామచంద్రమూర్తి తనకు చెప్పడంతో, విభీషణుడు ధర్మం ఏంటని ఆలోచన చేశాడు. రాముడు చెప్పినట్లే చేయడం ధర్మమని తీర్మానించుకుని ఇలా జవాబు చెప్పాడు రాముడికి.

"ధర్మ ప్రవర్తన వదిలినవాడు, దయలేని చోరుడు, అసత్యవాది, పాపపు మనస్సుకలవాడు, పర స్త్రీలను బాధించినవాడు రావణుడు వరసకు నాకు అన్నే కాని నడవడిలో నాకు గొప్ప శత్రువు. అహిత కార్యాలలో ప్రీతికలవాడు. ప్రపంచానికి ఉపద్రవం కలిగించినవాడు. ఇలాంటి వీడికా నేనిప్పుడు శాస్త్రప్రకారం సంస్కారాలు చేయాలి? నేనాపని చేయలేను. అన్నకదా అంటావేమో? అన్న అని చెప్పి లౌకిక గౌరవాలు చూపుతాను కాని పారలౌకిక కర్మలకు వీడు అర్హుడు కాదు. నేను ఇప్పుడు వీడికి ఉత్తర క్రియలు చేయకపోతే నన్నెవరైతే శాస్త్రనియమం తప్పాడని తిట్టుతారో వారే వీడి నడవడి తెలుసుకున్న తరువాత విభీషణుడు సరైన పనే చేశాడనీ, పతితులకు శాస్త్రీయ సంస్కారాలు అవసరం లేదని నేను చేసిన పనిని మెచ్చుకుంటారు".

ఈ మాటలకు రాముడు విభీషణుడితో ఇలా అన్నాడు. "విభీషణా! రావణుడు సంస్కారార్హుడు కాడు, పతితుడు అనడానికి నువ్వు చెప్పిన కారణాలు నేను తప్పనను. అవి నాకు తెలియకా కాదు. అతడు అధర్మానికి భయపడడని, అసత్యవాదని, నీతిమాలినవాడని నాకు తెలుసు. తెలిసి కూడా వాడికి సంస్కారం చేయమని చెప్పాను. ఎందుకంటే, పతితుడికి పరలోక క్రియలు లేవనడం లోక సామాన్య విధంగా చస్తే నిజమే కాని, ధర్మయుద్ధంలో న్యాయరీతిన చనిపోయిన వీరుడి విషయంలో కాదు. వాడు

బలశాలి, శూరుడు, తేజస్వి, ఇంద్రాదులకైనా వెనుదీయని వాడు. అలాంటి లోకరావణుడు, పర్వతం లాంటి ధైర్యశాలి, సామాన్యుడా? యుద్ధంలో చనిపోయాడు. వీరస్వర్గం వాడికి లభించాలి. నువ్వు వాడికి సంస్కారం చేయకపోతే ప్రేతత్వం పోదు. ప్రేతత్వం పోకపోతే స్వర్గప్రాప్తి లేదు. వాడు కష్టపడి సంపాదించిన స్వర్గ సుఖాన్ని సంస్కరించని నువ్వు దాన్ని విఘ్నపరచడమే కాకుండా ప్రేతత్వ బాధ కలిగించిన వాడివవుతావు. అది నీకు శ్రేయస్కరం కాదు. చనిపోయినవాడిని ప్రేమ కలవాడు కదా సంస్కరించాల్సింది? వాడు నీకు విరోధి కదా అంటావేమో? ఎంత పాపాత్ముడైనా వీరమరణం పొందినవారికి వీరస్వర్గం వుంటుంది. కాబట్టి వాడు సంస్కారానికి అర్హుడు. రావణుడు లాంటి పాపికి, విరోదికి, సంస్కారాలు చేసినాడన్న కీర్తి నీకు కలుగుతుంది కాని అపకీర్తి రాదు".

శ్రీరాముడు చెప్పిన మాటలకు స్పందించి విభీషణుడు సంస్కారానికి కావాల్సిన సరకులన్నీ తెప్పించాడు. శాస్త్రోక్తంగా రావణుడికి దహన సంస్కారాలు జరిపించాడు. స్నానం చేసి తడిబట్టలతో నువ్వులు, నీళ్లతో తర్పణాలు విడిచాడు. ఆ తరువాత నమస్కారం చేసి, ఆడవారున్న చోటుకు పోయి వారికి సమాధానం చెప్పి, వారందరినీ నగరంలోకి పంపించి, నిర్మలమైన మనస్సుతో సవినయంగా రామచంద్రమూర్తి దగ్గరికి వచ్చాడు విభీషణుడు.

యుద్ధాన్ని చూడడానికి వచ్చిన దేవదానవులు రామరావణ యుద్ధాన్ని కథలుకథలుగా చెప్పుకుంటూ, సంతోషంగా వారి-వారి స్థానాలకు మరలిపోయారు. ఆ తరువాత రామచంద్రమూర్తి తన రథాన్ని నడిపిన సారథి మాతలిని చూసి, ఆయనకు తన మీద వున్న ప్రేమను పొగిడి, అతడు తన రథాన్ని తీసుకుని ఇంద్రుడి దగ్గరికి పొమ్మని అనుమతి ఇవ్వగా, మాతలి అక్కడినుండి వెళ్లిపోయాడు. అప్పుడు రామచంద్రమూర్తి సుగ్రీవుడిని కౌగలించుకుని అక్కడి నుండి లక్ష్మణుడు తోడురాగా, సమస్త వానరసేన సేవించగా, సేనలున్న ప్రదేశానికి పోయి లక్ష్మణుడిని చూసి ఇలా అన్నాడు.

"లక్ష్మణా! దగ్గరికిరా. విభీషణుడుని లంకలో అభిషేకం చేయాలని కోరుతున్నాను. ఇది నా మనస్సులో వున్న కోరిక. దీన్ని నువ్వు నెరవేర్చి రావాలి" అని శ్రీరాముడు చెప్పగానే లక్ష్మణుడు త్వరగా నగరంలోకి పోయి, బంగారు పాత్రలను తెచ్చి, వాటిని తీసుకుని సముద్రతీరానికి పోయి సముద్ర జలాలను తెమ్మని సైనికులను పంపాడు. వారలా జలాలను తీసుకుని రాగానే అందులో ఒకదాన్ని తాను తీసుకుని, రాజయోగ్యమైన ఉత్తమ సింహాసనాన విభీషణుడిని కూర్చోబెట్టి, రాక్షసులంతా చూస్తుండగా వారి మధ్యన మంత్రయుక్తంగా అతడిని అభిషిక్తుడిని చేశాడు. విభీషణుడు సంతోషించి రామచంద్రమూర్తి ఇచ్చిన రాజ్యాన్ని గ్రహించాడు. శ్రేష్ఠులైన రాక్షసులు ఆయన్ను ఆశీర్వదించారు. వారిచ్చిన అక్షతలను, పుష్పాలను, పేలాలను ఇతర శుభకరమైన వస్తువులను తీసుకుని రామచంద్రుడి దగ్గరికి వచ్చాడు. వచ్చి అవి ఆయనకు సమర్పించాడు. శ్రీరాముడు చాలా సంతోషించాడు.

అ ఆతరువాత సమీపంలో వున్న హనుమంతుడిని పిలిచి, లంకకు పోయి అక్కడ రావణుడి ఇంట్లో వున్న సీతాదేవికి యుద్ధంలో తాను గెలిచిన వృత్తాంతాన్ని, రావణుడిని జయించిన విషయాన్ని చెప్పమన్నాడు. ఆమె ఏమని ప్రత్యుత్తరం ఇస్తుందో తెలుసుకుని రమ్మంటాడు.

◆❖◆

శ్రీరామ పత్ని సీతాదేవికి అగ్నిపరీక్షా?

రావణ వధ తరువాత, అతడికి సంస్కారాలు చేసిన అనంతరం, సింహాసనాన విభీషణుడిని కూర్చోబెట్టి, అతడిని అభిషిక్తుడిని చేశారు రామలక్ష్మణులు. అ ఆతరువాత సమీపంలో వున్న హనుమంతుడిని పిలచి రాముడు, విభీషణుడి అనుమతి తీసుకుని లంకకు పోయి, అక్కడ రావణుడి ఇంట్లో వున్న సీతాదేవికి యుద్ధంలో తను గెలిచిన వృత్తాంతాన్ని, సుగ్రీవ లక్ష్మణులతో క్షేమంగా వున్న సంగతిని, చెప్పి, సంతోష పరచి, ఆమె ఏమని ప్రత్యుత్తరం ఇస్తుందో తెలుసుకుని రమ్మన్నాడు.

రామాజ్ఞ శిరసావహించిన హనుమంతుడు తక్షణమే రావణుడి ఇంట్లోకి ప్రవేశించి, దుఃఖిస్తున్న సీతాదేవిని చూసి సంతోషంతో హనుమంతుడు రాముడి సందేశాన్ని వినిపించాడు. "రావణాసురుడు చచ్చాడు. లంక మన వశంలో వుంది. నిన్ను చెరనుండి విడిపిస్తానని ప్రతిజ్ఞ చేసి, అది నెరవేరేదాకా నిద్రపోకుండా సముద్రం మీద సేతువు నిర్మించి చేసిన ప్రతిజ్ఞను నేరవేర్చుకున్నాను. నువ్వు రావణుడి ఇంట్లో వున్నానని భయపడవద్దు. లంకా నగరం, సర్వైశ్వర్యం రావణుడి తమ్ముడు, విభీషణుడి స్వాధీనంలో వుంది. కాబట్టి నీ సొంత ఇంట్లో వున్నట్లే భావించు. నిశ్చింతగా వుండు. క్షణకాలంలో నిన్ను చూడడానికి విభీషణుడు వస్తాడు".

హనుమంతుడు ఇలా అడగగానే సీతాదేవి "నాకు సంతోషం కలిగించిన వార్త చెప్పిన నీకు అంతే సంతోషం కలిగించే మాట ఏదైనా చెప్పాలని ఎంతో ఆలోచన చేశాను. కాని నాకు ఏమీ తోచలేదు. మాట చెప్పక పోయినా ఏదైనా బహుమానం ఇద్దామని అనుకుని ఈ లోకంలో అలాంటిది ఏదైనా వుందా అని ఆలోచించాను. ఒక్కటి కూడా సమానమైనది కనబడలేదు. లోకంలో వున్న వెండికొండ, బంగారుకొండ, రత్నాలు, వేరువేరుగా కాని, కలిపినా కాని సరిపోవని అనిపించింది. ఇతర లోకాలలో ఏదైనా వున్నదా అని ఆలోచన చేశాను. అక్కడా కనబడ లేదు. ఇన్ని లోకాల ఆధిపత్యమే అంటే బ్రహ్మత్వమే నీకిచ్చిన చాలునేమో అని ఆలోచించాను. అది కూడా చాలదని అనిపించింది" అన్నది.

సీతాదేవి మాటలు విన్న హనుమంతుడు ముకుళిత హస్తాలతో నమస్కరిస్తూనే రాక్షస స్త్రీలను

చంపడానికి తనకు అనుమతి ఇవ్వమని ఆమెను అడిగాడు. రాజాజ్ఞానుసారం ఆయన్నే ఆశ్రయించి వున్న ఆయన కార్యాన్ని నెరవేర్చాల్సిన ఈ దాసీజనం మీద కోప్పడవచ్చా అని ప్రశ్నించిదామె. రావణుడి కొలువులో పనిచేస్తున్నందున, ఆయన దాసులు కాబట్టి, వాడి ఆజ్ఞానుసారం వినకపోతే వాడు చంపుతాడేమోనని, భయపడి తనను బెదిరించారు వీరంతా అని, ఇప్పుడు వాడు చచ్చాడు కాబట్టి, వీరు ఇక వాడి దాసులు కానందున తనను బెదిరించరని, కాబట్టి వీరిలో పాపం లేదని తన అభిప్రాయంగా చెప్పింది సీతాదేవి. తానూ తన భర్తను చూడాలనుకుంటున్నానని త్వరగా తీసుకుపొమ్మని అంటుంది.

సీతాదేవి కోరికను హనుమంతుడు చెప్పగానే రామచంద్రుడు పది నెలలుగా నానా భాధలు పడుతున్న సీతాదేవిని ఇంకా తాను కష్టపెట్టాల్సి వచ్చింది కదా అని కళ్లల్లో నీరు కార్చాడు. చింతతో పరవశుడై ఏమీ తోచక, నేలచూపులు చూస్తూ, ఇలా అనుకున్నాడు. దీర్ఘకాలం, పగవాడి ఇంట్లో వున్నదాన్ని కాముకుడై రాముడు మరల పరిగ్రహించాడని లోకులు అంటారేమో అని బాధపడ్డాడు. అలాంటప్పుడు, నిర్దోషురాలిని, కఠిన వ్రతాలు చేసేదానిని విడిచి, మహాదోషం ఎలా మెడకు చుట్టుకోవాలని చింతించాడు. అలా ఆలోచిస్తూనే, సమీపంలో వున్న విభీషణుడిని చూసి, "రాక్షస రాజా! భూకన్య అయిన సీతాదేవిని వేగంగా శిరస్నానం చేయించి, గంధాదులు పూసుకొనచేసి, ఆభరణాలు ధరింపచేసి తీసుకుని రా" అంటాడు.

రామచంద్రమూర్తి ఇలా చెప్పగానే ఆయన అన్న మాటలు సీతాదేవికి చెప్పగానే, సీత అలాగే చేస్తానని చెప్పి సిద్ధమైంది. ఆమెకు అంతఃపుర స్త్రీలతో స్నానం చేయించి, ఆభరణాలతో అలంకరించి, మంచి వస్త్రాలను ఇచ్చి, పల్లకి ఎక్కించి, విభీషణుడు రామచంద్రమూర్తి దగ్గరికి తెచ్చాడు. దీర్ఘకాలం రావణుడి ఇంట్లో వున్న సీతాదేవి వచ్చిందని వినగానే రామచంద్రమూర్తి మనస్సులో సంతోషం, దీనత్వం, కోపం ఆవేశించాయి. సీతను వెంటనే దగ్గరికి తీసుకు రమ్మన్నాడు రాముడు. స్నేహితులతో కూడి వున్న తనను సీత చూడవచ్చనీ, తీసుకురమ్మనీ చెప్పాడు. శ్రీరాముడు ఇలా అనగానే విభీషణుడు సందేహిస్తూనే సీతాదేవిని శ్రీరాముడి సమీపానికి తెచ్చాడు. సీతాదేవి సిగ్గుతో విభీషణుడి వెంట వచ్చి, రామచంద్రమూర్తి సౌమ్యమైన ముఖాన్ని చూసి, తన ఉత్తరీయాన్ని ముఖానికి అడ్డంగా వేసుకుని, "ప్రాణేశ్వరా!" అని గట్టిగా ఏడ్చింది.

తన పార్శ్వంలో శరీరాన్ని వంచి నిలబడ్డ సీతాదేవిని చూసి రామచంద్రమూర్తి తన హృదయంలో బాధను దాచుకుంటూ ఇలా అన్నాడు. "విరోధిని యుద్ధంలో చంపాను. నిన్ను గ్రహించాను. పూర్ణ సామర్థ్యంతో ఏది చేయగలనో అదంతా చేశాను. నేను రావణాసురుడిని చంపుతానని చేసిన ప్రతిజ్ఞ వ్యర్థమైపోకుండా చేసి నేను స్వతంత్రుడను అయ్యాను. నేను నీదగ్గర లేని సమయంలో ఆ చపలచిత్తుడు నిన్ను అపహరించాడు కదా! ఈ దోషం దైవానిదే. నీదికాదు, నాదీ కాదు. అలాంటి దైవ దోషాన్ని పౌరుషంతో ఎదుర్కొన్నాను. గెలిచాను. నిన్ను శత్రు బాధ నుండి తప్పించాను".

సీతాదేవితో సంభాషణను కొనసాగిస్తూ శ్రీరాముడు ఇంకా ఇలా అంటాడు. "యుద్ధంలో శత్రువులను ఓడించి, చంపి, నిన్ను కలవడం నిన్ను గ్రహించడానికి కాదని తెలుసుకో. కులగౌరవం కాపాడడానికి, అపవాదం తొలగడానికి, కీర్తి నిలపడానికి చేయాల్సినదంతా చేశాను. ఇక నీ

విషయానికొస్తే నువ్వు లోకులు సందేహించడానికి అవకాశం ఇచ్చే చరిత్ర కలదానివయ్యావు. రావణుడి ఇంట్లో ఇన్నాళ్లు చెడిపోకుండా వున్నావని లోకమెలా విశ్వసిస్తుంది? ఇలాంటి నువ్వు నా పక్కన నిలబడి నన్ను బాధిస్తున్నావు. అందుకే నీకు అనుమతి ఇస్తున్నాను. నీ ఇష్టం వచ్చిన చోటుకు పోవచ్చు. నీతో నాకింక ఏపనీ లేదు".

"ఉత్తమ వంశంలో, ఉత్తమ జాతిలో పుట్టినవాడు, కీర్తి ప్రతాపాలు కలవాడు, ఎవరైనా పరుడి ఇంట్లో దీర్ఘకాలం వున్న వయసొచ్చిన ఆడదాన్ని స్నేహభావంతో మళ్లీ భార్యగా స్వీకరిస్తాడా? నువ్వే చెప్పు. దుష్కామ దోషంకల చూపులతో దుష్టుడు నిన్ను చూశాడు. వాడి ఒడిలో నిన్ను వుంచుకోవడం వల్ల నువ్వు భ్రష్టవయ్యావు. ఇలాంటి నిన్ను సద్వంశంలో పుట్టి, సదాచార సంపత్తికలిగి, సదాచార సంపన్నుడనని చెప్పుకునే నేను మళ్లీ ఎలా గ్రహిస్తాను? అలాంటి నీచం, గౌరవహానికరమైన కార్యం రాముడు చేయడు సుమా! రాముడు కామదాసుడు కాదు. రాక్షసుడు ఎత్తుకుని పోయిన తన భార్యను విడిపించుకోలేక పోయాడు రాముడనే అపకీర్తి రాకుండా వుండడానికి శత్రువులను వధించి మళ్లీ భార్యను గ్రహించాడన్న కీర్తి దక్కించుకోవడానికి నేను రావణుడిని చంపి నిన్ను వాడి చెరనుండి విడిపించాను కాని, నీమీద కామమోహంతో కాదు. నువ్విక్కడ నుండి నీ ఇష్టం వచ్చిన చోటుకు పోవచ్చు. నీకు అనుమతి ఇస్తున్నాను".

భర్త నుండి ప్రీతికరమైన మాటలు విందామని, విని సంతోషిద్దామని ఎదురు చూసిన సీతాదేవి అప్రియమైన మాటలు విని దుఃఖంతో కన్నీళ్లు కార్చింది.

భర్త మాటలకు జవాబుగా గద్గద స్వరంతో సీతాదేవి ఇలా అన్నది. "భద్రచరిత్రా! శిష్టుడవని చెప్పుకునేవాడా! కులాన, శీలాన నీచుడైనవాడు, కులశీలాల నీచురాలైన దాన్ని అన్నట్లు చెవులు చీల్చే కఠినవాక్యాలు ఎలా అన్నావు? అందునా నన్ను ఉద్దేశించి ఎలా అనగలిగావు? నువ్వు శిష్టుడివైతే నీ నోట ఇలాంటి మాటలు రావు. శిష్టులు నీచులనైనా ఇలాంటి మాటలు అనలేరు. నువ్వు క్షుద్రుడవైతే, ఎంత క్షుద్రుడైనా కులశీలాల శిష్టఅయిన దానిని ఇలా మాట్లాడడు. నువ్వేలాంటి వాడివైనా నీ మాటలు నాకు అన్వయించవు. నువ్వు వాస్తవానికి గొప్పవాడివి. గొప్పవాడిలాగా మాట్లాడకుండా ఇలా మాట్లాడడం నీకు తగదు. నా శీలంలో ఏ దోషం వుందని నువ్వు సందేహించావో అలాంటి దోషం నాలో లేదని నా పాతివ్రత్యం మీద ప్రమాణం చేసి చెప్తున్నాను".

"నన్ను రావణుడు అంటుకున్నాడా? లేదా? అది దోషం కాదా? అని అడుగుతావేమో? వాడు నన్ను తాకింది నిజమే. కాదనను. వాడై వాడే నన్ను తాకాడు కాని నేను వాడిని తాకలేదు కదా? వాడెప్పుడు నన్ను తాకాడు? నేను పరవశనై మూర్ఛపోయిన సమయంలో తాకాడు. నేను దానికి సమ్మతించానా? లేదే! నా అనుమతిమీద వాడు నన్ను తాకలేదు. వాడి దుష్టభావానికి నేనెలా బాధ్యురాలిని? నా భావన దుష్టమైతే నన్ను దండించాలి కాని ఇతరుల భావన దుష్టమైతే నన్ను దండించవచ్చా? నన్ను రక్షించాల్సిన భారం నీమీద వుంది. నువ్వు రక్షించలేకపోయావు. నీ కర్తవ్య లోపంవల్ల నాకీ బాధ కలిగింది. కాబట్టి దోషం నీది కాని నాదికాదు. స్త్రీలు ఏవిషయంలోనూ స్వతంత్రులు కారుకదా?".

ఇలా గద్గత స్వరంతో చెప్పి సీతాదేవి ముఖమంతా చిన్నబుచ్చుకుని, మరది లక్ష్మణుడిని చూసి ఇలా అన్నది. "లక్ష్మణా! ఈ పెనుశోకం అనే వ్యాధికి ఔషధం అగ్నిప్రవేశం తప్ప మరొకటి లేదు. నా ఇష్టం

వచ్చినట్లు పొమ్మని పారతంత్ర్యంనుండి నన్ను నా భర్త విముక్తిరాలిని చేశాడు. ఇక నేను చేసే పనికి అడ్డం వచ్చే అధికారం ఆయనకు లేదు. నీకైనా నామీద పూర్వ భక్తి వుంటే చితి పేర్చు. ఇలాంటి అపనింద వచ్చిన తరువాత జీవచ్ఛవమై ఎందుకు బతకాలి? లక్ష్మణా! పతివ్రతకు ఏగతి యోగ్యమో నేను అగ్నిప్రవేశం చేసి ఆ గతికి పోతాను". సీతాదేవి ఇలా చెప్పడంతో లక్ష్మణుడు పెద్ద చితిని పేర్చాడు. రామచంద్రమూర్తికి సీతాదేవి ప్రదక్షిణ చేసింది. ఆ తరువాత ఆమె అగ్నిహోత్రుడిని సమీపించి, చేతులు మోడ్చి, అగ్నిని ఉద్దేశించి భక్తితో ఇలా అన్నది.

"నా హృదయం సత్యంగా, నిత్యంగా రాముడిమీదే నిలిచి, తొలగకుండ వుంటే, నమ్మకంగా నన్ను అగ్నిహోత్రుడు సర్వదేశ, సర్వకాల, సర్వావస్థలందు రక్షించుగాక! సదాచార సంపత్తిగలనా భర్త నన్ను దుష్టురాలని భావించాడు. నేను దుష్టస్త్రీని కాదేని సర్వజనులు చేసే కర్మలకు సాక్షైన సూర్యదేవుడు, ఇతర దేవతలు నమ్మితే అగ్నిదేవుడు కీడు తొలగించి నన్ను రక్షించుగాక! సూర్యచంద్రులు, దేవతలు, వాయువు, రాత్రులు, సంధ్యలు, పగళ్లు, భూమి, తక్కిన దేవతలంతా నా శీలాన్ని తెలిసున్నవారై దాని విషయంలో సందేహం లేనివారైతే, ఈ లోకులందరికీ తెలిసేట్లు ఓ అగ్నిహోత్రుడా! నన్ను రక్షించు". ఈ విధంగా చెప్పి దేహాభిమానం వదిలి అగ్నికి భక్తితో ప్రదక్షిణ చేసి, పెద్ద మంటలతో ధగ ధగా ఎగురుతున్న అగ్నిలో పవిత్రమైన నడవడికల సీతాదేవి ప్రవేశించింది.

సీతాదేవి అలా అగ్ని ప్రవేశం చేసిన తరువాత కుబేరుడు, యముడు, ఇంద్రుడు, వరుణుడు, ముక్కంటి శివుడు, బ్రహ్మ, ఇతర దేవతలంతా విమానాలమీద ఆకాశం వరకు వచ్చి, వాటిని అక్కడే నిలిపి, తమ దీర్ఘమైన చేతులు జోడించి, ఎదురుగా భూమ్మీద నిలబడి వున్న రామచంద్రమూర్తిని చూసి "నువ్వు సీతాదేవి అగ్నిజ్వాలల్లో ప్రవేశిస్తుంటే చూసి చలించకుండా వుండతగునా? ఎందుకు నిన్ను నువ్వు తెలుసుకోలేకపోతున్నావు? రామచంద్ర ప్రభూ! నువ్వు సామాన్య మనుషిలాగా సీతాదేవిని వదలవచ్చా? కమలాక్షా! నువ్వామెమీద కరుణచూపు". ఆయనే శ్రీమన్నారాయణుడని బ్రహ్మ దేవుడు ప్రత్యక్షమై ఆయన్ను నుతించాడు.

ఇలా బ్రహ్మదేవుడు రామచంద్రమూర్తిని స్తుతిస్తుంటే అగ్నిహోత్రుడు మనిషి రూపంలో సీతాదేవిని ఒడిలో వుంచుకుని బయటకు వచ్చాడు. అగ్నిలో ప్రవేశించినప్పుడు ఎలా వుందో ఇప్పుడూ ఆమె అలాగే వుంది. ఆమెను రాముడికి అప్పగిస్తూ, "ఈమె నీ సీత. ఈమెలో ఏపాపం ఏమాత్రం లేదు. ఏ పాపం ఎరుగని ఈ సాధ్వీమణిని నువ్వు స్వీకరించు" అన్నాడు. అగ్నిహోత్రుడి మాటలకు బదులుగా శ్రీరాముడు, "జానకిలో ఏ దోషంలేదని నాకు తెలుసు. రావణుడి అంతఃపురంలో వున్న సీతను పరీక్షించకుండా స్వీకరిస్తే నన్ను బుద్ధిహీనుడని అనేవారు పెద్దలు. ఆ నింద పడలేక జానకి పతివ్రత అని తెలిసికూడా లోకులను నమ్మించడానికి నేను ఉపేక్షించాను. నేను సత్యమే చెప్తున్నాను. ఈ స్త్రీరత్నం తన పాతివ్రత్య మహిమతో తనను తాను కాపాడుకోగలదని, ఈమెను మించి రావణుడు పోలేడని. ఆమెను తాకి బతకలేడని నాకు తెలుసు. పవిత్రమైన ఈ సీత నిష్కల్మష హృదయం కలది అన్నాడు. ఈ విధంగా దేవతలకు చెప్పి సీతను చేరదీసి రాముడు సుఖపడ్డాడు.

సీతాదేవి నిర్దోషురాలని శ్రీరాముడికి చెప్పి ఆయన్ను నుతించిన దేవతలు, బ్రహ్మదేవుడు

తన భార్య సీతాదేవి తన కళ్లెదుటే పదిమంది చూస్తుండగా అగ్ని ప్రవేశం చేస్తుంటే అది సహించడం మహాక్రూరమైన కార్యమైనప్పటికీ, ధర్మాన్ని ఆచరించడంలో ఏమాత్రం వెనుకాడని శ్రీరామచంద్రమూర్తి, ఒక నిర్దోషురాలిని, అందునా తనమీద అమితమైన ప్రేమకల దాన్ని, ఇంతగా బాధ పెట్టాల్సి వచ్చెకదా అని పరితపిస్తూ తనలో తానే కుమిలిపోయాడు. సీతాదేవి అలా అగ్ని ప్రవేశం చేసిన తరువాత కుబేరుడు, యముడు, ఇంద్రుడు, వరుణుడు, ముక్కంటి శివుడు, బ్రహ్మ, ఇతర దేవతలంతా విమానాలమీద ఆకాశం వరకు వచ్చి, వాటిని అక్కడే నిలిపి, తమ దీర్ఘమైన చేతులు జోడించి, ఎదురుగా భూమ్మీద నిలబడి వున్న రామచంద్రమూర్తిని చూసి ఇలా అన్నారు.

"మహాత్మా! సమస్త లోకాలను సృష్టించడానికి సమర్థుడివి. జ్ఞానుల సమూహాలలో శ్రేష్టుడివి. ఇలాంటి నువ్వు సీతాదేవి అగ్నిజ్వాలల్లో ప్రవేశిస్తుంటే చూసి చలించకుండా వుండతగునా? ఎందుకు నిన్ను నువ్వు తెలుసుకోలేకపోతున్నావు? రామచంద్ర ప్రభూ! నువ్వు సమస్తదేవతలకు నాథుడివి. ఋతుధాముడు అని నీకు పేరు. అన్నిలోకాలను స్వయం సృష్టించి ఆ తరువాత సద్వారకంగా సృజిస్తావు. నీకు నువ్వే ప్రభువివి. నిన్ను నియమించేవాడు లేడు. మహాదేవుడన్న పేరుకల ఎనిమిదవ రుద్రుడివి నువ్వే. ఐదవ వసువువి నువ్వే. నీకు అశ్వినీదేవతలు కర్ణాలు. సూర్యచంద్రులు నేత్రాలు. జగాలన్నీ ప్రళయకాలంలో సమసిపోయినా నువ్వు మాత్రం మిగిలే వుంటావు. సృష్టికి పూర్వం నుండి వున్నవాడివి నువ్వే. ఇలాంటి నువ్వు సామాన్య మనుషిలాగా సీతాదేవిని వదలవచ్చా? కమలాక్షా! నువ్వామెమీద కరుణచూపు".

ఈ విధంగా దేవతలంతా, లోకపాలకులంతా వినయంతో విన్నవించుకోగా రామచంద్రమూర్తి ఆ దేవతానాయకులతో ఇలా అన్నాడు. "దేవతలారా! నన్ను నేను మనుష్యుడినని, రాముడంటే దశరథ కుమారుడనని అనుకుంటున్నాను. నేనెవ్వరిని? ఎవరివాడిని? ఎందుకు పుట్టాను? తెలపండి". జవాబుగా బ్రహ్మదేవుడు "రామా! సత్యవిక్రమా! యథార్థం చెప్తా విను" అంటాడు. అని ఈ దండకం చదువుతాడు.

"శ్రీరామరామా! మహాభావ! నారాయణా! దేవ! లక్ష్మీ సనాథా! యనాథాధినాథా! విభూ! శంఖచక్రాయుధా! నీవ మున్నొంటిశృంగంబు భూదారమై భూమి కాధారమైనిల్చు పెన్నేల్వవుం, జనన రానున్న యాసూడులం గీడులంగూర్చి వేధించి సాధించి బాధించు బల్పోడవున్, నీవ బ్రహ్మంబు, సత్యంబు నీ, వక్షరంబెల్ల కాద్యుండు మధ్యాంతసంస్థుండును న్నీవ, లోకాలికిన్ సిద్ధధర్మంబు కర్మంబు మర్మంబునున్ నీవ, నీవే చతుర్బాహువున్ స్వామియున్ శార్ఙ్గిన్ శంఖివిన్ ఖడ్గివిం గృష్ణుదున్ విష్ణుదున్ బుద్ధియున్ సిద్ధియున్ సత్త్వముం దత్త్వమున్ శాంతియుం దాంతియుం బూరుషాఖ్యుండవు బూరుషోత్కృష్టరూపంబును న్నీవ, నీవే హృషీ కేశ విఖ్యాతమూర్తీ! యజయ్యుండవున్ సర్వసేనానివిన్ గ్రామణీరత్నమున్ స్రష్ట వుం ద్రష్టవున్ నీవ, నీ యంద డిందున్ సమస్తం బుపేంద్రా! హరీ! మధ్వరీ! యింద్రకర్మా! మహేంద్రా! నరేంద్రా! మునీంద్రాది వంద్యా! పరా! పద్మనాభా! విరోధ్యంతకారీ! శరణ్యుండవున్ నీవ, నిన్నే సుమీ సర్వరక్షైక సామర్థ్యదక్షుండవున్ లోకచక్షుండవం చెల్లా దివ్యర్షు లుత్కర్ష భావించి సేవించి స్తోత్రంబు గావింత్రు శాఖాసహ స్రాత్మకామ్నాయరూపా! మహర్షిప్రవేకా! యనేకోరుజిహ్వా! జగత్పాలికీ వాద్యుడౌ కర్తవున్ ధర్తవున్ హర్తవున్ నీవ, నీవే స్వయంభర్తవున్, సిద్ధసాధ్యాశ్రయుం డీవ, నీవే సుమీ సృష్టికిన్ముందు భాసిల్లు రూపంబు, యజ్ఞంబును న్నీవ, నీవే వషట్కార మోంకారమున్నీవ, నీవే సముత్కృష్టయోగై కగమ్యుండవున్, భక్తరమ్యుండవున్ నీవ, నీ పుట్టువుం బుట్టునున్ గిట్టునున్ వెండి నీవిట్టివాడటంచు నెవ్వాడెరుంగన్, రమాధీశ! గోజాతభూనిర్జరా క్రాంతభూతావలీ శైలదిగ్జాలకాంతారదేశంబులన్ నిండి రాణింతు వో దేవదేవేశ! నీవే కదా వేయిపాదంబులన్ వేయిశీర్షంబులన్ వేయినేత్రంబులం బూని భూతంబులన్ గోత్రసంఘాతసంస్ఫీతమౌ భూతదాత్రిన్ వహింపన్ సహింపంగ దక్షుండ, వీ క్షోణి కల్పాంతవేళన్ మహాహీంద్రతల్పుండవై దేవ! గంధర్వ దైతేయ సంఘంబులం దాల్చి ప్రత్యక్షమై యందు, వోరామ! నీ చిత్తమే నేను, నీ జిహ్వయే వాని, రోమాళి దేవాళి, యోగీశహృద్ధామ! శ్రీ ధామ కన్ రెప్పలన్ మూయగా రేయి, విప్పం బగల్, నీదు విశ్వాసముల్ వేదముల్ రామ! నీకాని దావంతయున్ లేదు, సర్వంబులోకంబు నీకున్ శరీరంబు స్థైర్యంబు భూగోళ, మగ్నుల్ ప్రకోపంబు, శ్రీవత్సచిహ్నా! ప్రసాదంబు సోముండు, నీవేకదా మున్ను వైరోచనిం జేరి దానంబునుం గోరి పాదత్రయీన్యాసరూపంబునన్ సర్వలోకంబులున్ నిండి దండించి తా దైత్యు, దైత్యారికిం బట్టముం గట్టి రక్షించితో దివ్యమూర్తీ! లసత్కీర్తి! శ్రీలక్ష్మియే సీత, విష్ణుండవే నీవు, కృష్ణుండునున్ నీవ, నీవే ప్రజానాథవాచ్యుండ వా పంక్తికంఠున్ వధింపంగ నై మానుషీదేహమున జొచ్చి రక్షోధిపుం ద్రుంచి మా కార్యముం దీర్చి లోకంబులం దేర్చి తీ వింక హృష్టుండవై ధాత్రి బాలించి యాపై దివిం జేరుమా, యో రమానాథ! నీవీర్యసారం బమోఘంబు, నీ ఘోరశౌర్యం బమోఘంబు, నీ దర్శనంబే అమోఘంబు, నీ స్తోత్రమున్ మోఘ మే వేళ నేవారికింగాదు, నిన్ భక్తిచే గొల్చి చిత్తంబునం దాల్చు నీ భక్తులౌ వారి కే లోపముల్ లేవు, నిన్నుం బురాణునిన్ సదాపూరుషోత్తంసు నిశ్చంచలం బైన సద్భక్తి సేవించు భక్తుల్ జగద్రక్షకా! యైహికాత్యంత సౌఖ్యంబు లెల్లప్పుడుం గందు రీశా నమస్తే నమస్తే నమః".

(ఈ దండకం ద్వారా రాముడిని సేవించే భక్తులకు ఇహపర సౌఖ్యాలు కలుగుతాయని బ్రహ్మ వాక్కుగా చెప్పడం జరిగింది. ఈ స్తోత్రాన్ని ప్రతిదినం పఠిస్తే జన్మాంతర ప్రాప్తిని కాని, కామక్రోధాల వల్ల కాని, బాహ్య శత్రువుల వల్ల కాని తిరస్కారం కలగదని చెప్పడం జరిగింది. ఇది పాపహరమ, పురాణ,

ఇతిహాస వేదం సంబంధమైనది. కాబట్టి దీనిలో ఎంతో మహాత్మ్యం వుంది).

ఇలా బ్రహ్మదేవుడు రామచంద్రమూర్తిని స్తుతిస్తుంటే అగ్నిహోత్రుడు మనిషి రూపంలో బిడ్డను ఎత్తుకొస్తున్నట్లు సీతాదేవిని ఒడిలో వుంచుకుని చితిలోని కట్టెలను చిమ్ముకుంటూ వచ్చాడు. అగ్నిలో ప్రవేశించినప్పుడు ఎలా వుందో ఇప్పుడూ ఆమె అలాగే వుంది. ఆమెను రాముడికి అప్పగిస్తూ, "ఈమె నీ సీత. ఈమెలో ఏపాపం ఏమాత్రం లేదు. మనోవాక్కుల వల్ల కాని, సంకల్పం వల్ల కాని, అనురాగంతో ఇతరులను చూసికాని ఈమె నిన్నెప్పుడూ అతిక్రమించలేదు. నిన్ను వదిలి మనుష్యులెవరూ లేని ప్రదేశంలో ఒంటరిగా వున్న సమయంలో ఈ సాధ్విని పాపాత్ముడైన రావణుడు బలవంతంగా తెచ్చాడు. తెచ్చి తన ఇంట్లో వుంచాడు. అలా చేసినప్పటికీ నిన్నే ధ్యానిస్తూ, నిన్నే భజిస్తూ ఇతర విషయాలమీద మనసు పోనివ్వలేదు. రావణుడు ఎంత బలవంత పెట్టినా మనసు నీమీదే లగ్నం చేసింది. ఏ పాపం ఎరుగని ఈ సాధ్వీమణిని నువ్వు స్వీకరించు" అన్నాడు. అగ్నిహోత్రుడి మాటలకు శ్రీరాముడు సీతను చేరదీసి రాముడు సుఖపడ్డాడు.

◆❖◆

శ్రీరామ పట్టాభిషేకం

అగ్ని పరీక్ష అనంతరం అగ్నిహోత్రుడు, దేవతలు, బ్రహ్మ చెప్పిన దాన్ని అంగీకరిస్తూ సీతాదేవి నిర్దోషి అని తనకు తెలుసన్న రాముడు ఆమెను సంతోషంగా స్వీకరించాడు. రామచంద్రమూర్తి ఇలా తమ మీద గౌరవంతో శుభకరమైన మాటలు చెప్పగా దేవతలలో వున్న శివుడు ఇలా అన్నాడు. “రామచంద్రమూర్తీ! నీ అవతార ప్రయోజనాలలో సాదు పరిత్రాణం, దుష్ట వినాశనం అనే రెండు పనుల్లో చాలా భాగం నెరవేర్చావు. ఇక మూడోది ధర్మసంస్థాపన చేయడం. దానికొరకై నువ్వు అయోధ్యకు పోవాలి. సంతానం పొంది అసమాన కీర్తికల ఇక్ష్వాకుల కులాన్ని నిలుపు. అశ్వమేధయాగం చేయి. ఈ కార్యాలన్నీ నెరవేర్చి వైకుంఠం పో”.

ఇంద్రుడి కోరిక ప్రకారం, రాముడు, మృతులైన వానరులందరినీ బతికించమని అడిగాడు. రాముడు కోరినట్లే ఇంద్రుడు చేశాడు. చనిపోయిన వానరులంతా బతికారు. గాయాలైన వారు బాగుపడ్డారు. వారికి సమృద్ధిగా ఆహారం లభించింది. ఆ తరువాత రామచంద్రమూర్తి ఆజ్ఞ తీసుకుని దేవతలు స్వర్గానికి పోయారు. దేవతలు వెళ్లగానే రామలక్ష్మణులు వానరసేనను మధ్యన గడిపారు కొంతసేపు.

మర్నాడు ఉదయాన్నే విభీషణుడు రామచంద్రమూర్తిని చూసి, తన వద్ద వున్న పుష్పక విమానం కోరిన విధంగా పోగలదనీ, ఒక్క పగటిలో వారిని అయోధ్యకు చేరుస్తుందనీ, తమ్ముడితో, భార్యతో దీంట్లో ప్రయాణం చేయమనీ అన్నాడు. విభీషణుడు అలా చెప్పినందుకు శ్రీరాముడు సంతోషించి వెంటనే పుష్పక విమానం తెప్పించమన్నాడు. అలా రామచంద్రమూర్తి చెప్పగానే విభీషణుడు పుష్పక విమానాన్ని తెప్పించాడు. వానరులందరికీ విభీషణుడితో బహుమానాలు ఇప్పించాడు రాముడు.

ఆ తరువాత శ్రీరాముడు ఆనందంగా పుష్పక విమానం ఎక్కాడు. తన పక్క ఎడమ తొడమీద సీతాదేవిని కూచోబెట్టుకున్నాడు. లక్ష్మణుడు విల్లు ధరించి పక్కనే నిలబడ్డాడు. వానర రాక్షస మిత్రులందరినీ తగురీతి ఆదరించాడు. తాను అయోధ్యకు పోతున్నాననీ తనకు సెలవివ్వమనీ అడిగాడు వారందరినీ. శ్రీరాముడు ఇలా అనగానే సుగ్రీవుడు, విభీషణుడు, ఇద్దరూ, వానరులతో కూడి తాము

రామ పట్టాభిషేకం చూడడానికి అయోధ్యకు వస్తామనీ, ఆ తరువాత తమ ఇండ్లకు పోతామనీ, తమకు అనుమతి ఇవ్వమనీ కోరారు. శ్రీరాముడు తక్షణమే అంగీకరించాడు. సుగ్రీవ, విభీషణాదులను, కపులందరినీ విమానం ఎక్కమని చెప్పాడు. వారంతా ఎక్కగానే చూసేవారికి బ్రహ్మ రథంలాగా కనిపించే ఆ విమానం పైకి ఎగిరింది. మంత్రపూతమైన ఆ విమానంలో ఎంతమంది ఎక్కినా ఇరుకు లేకుండా సుఖంగా వుంది.

విమానం ఆకాశమార్గాన రివ్వున పోతుంటే అటు-ఇటు చూస్తూ అలాగే చూస్తున్న సీతతో రామచంద్రమూర్తి పూర్వ పరిచిత ప్రదేశాలను సవివరంగా చెప్తూ, చూపించాడు. శ్రీరాముడు ఇలా ప్రదేశాలను వర్ణించుకు పోతుంటే కిష్కింధ గురించి చెప్పగానే సీతాదేవి రాముడితో, "రామచంద్రా! నాదొక విజ్ఞాపన. తారాదేవి మొదలైన సుగ్రీవుడి భార్యలను, ఇతర వానర స్త్రీలను తీసుకుని సంతోషంగా అయోధ్యకు పోవాలని నా కోరిక" అన్నది. ఆమె ఇలా అనగానే సంతోషించిన రాముడు విమానం నిలపమన్నాడు. ఆయన ఆజ్ఞ ప్రకారం సుగ్రీవుడు అంతఃపురానికి పోయి వారందరినీ తీసుకువచ్చాడు. అప్పుడు రామచంద్రమూర్తి సీతతో ఇంతకు ముందు చెప్పినట్లు తాను తిరిగిన ప్రదేశాలను గురించి మళ్లీ వివరించసాగాడు. వివరిస్తూ, "మా తండ్రి వున్న అయోధ్యానగారాన్ని మరలా క్షేమంగా చూడగలిగాం" అన్నాడు. రామచంద్రమూర్తి అయోధ్య వచ్చింది అనగానే వానరులు, విభీషణుడు లేచి నిలబడి, మళ్లీ కూర్చుని, అయోధ్యా నగరాన్ని చూశారు.

పద్నాలుగు సంవత్సరాల వనవాస దీక్ష పూర్తైన కారణాన, చైత్ర శుద్ధ పంచమినాడు శ్రీరామభద్ర ప్రభువు భరద్వాజాశ్రమం దగ్గర విమానం దిగి, ఆ మునీశ్వరుడిని చూసి, నమస్కారం చేసి, అయోధ్యవాసుల క్షేమ సమాచారం అడిగి తెలుసుకున్నాడు. ముని కోరిక ప్రకారం వరం ఇలా కోరాడు. "దయామయా! అన్ని కాలాల్లో అన్ని రకాల తియ్యటి పండ్లు అయోధ్య పోయే మార్గంలో చెట్లకు వుండాలి". దానికి మునీశ్వరుడు అంగీకరించి అలాగే వుంటాయన్నాడు. ఆ వరబలంతో అయోధ్యకు పోయే అన్ని మార్గాలలో పూలులేని చెట్లు పూలతో, పండ్లు లేని చెట్లు తియ్యటి పండ్లతో, పసరులేనివి పసరుతో, మోదుగులన్నీ పచ్చటి ఆకులతో సారవంతం అయ్యాయి. వానరులు అధిక సంతోషంతో ఆ ఫలాలను భుజించారు. ఆ తరువాత రాముడు హనుమంతుడిని పిలిచి, అయోధ్యానగరంలో అందరి క్షేమ సమాచారం, శృంగిబేరపురంలోను స్నేహితుడు గుహుడి క్షేమ సమాచారం తెల్సుకుని, అయోధ్యకు పోయి భరతుడిని సమీపించి తన క్షేమ సమాచారం చెప్పి భరతుడిని గురించి కనుక్కోమని అన్నాడు.

రాముడి ఆజ్ఞానుసారం భరతుడున్న చోటుకు పోయి, ఆయన్ను చూసి హనుమంతుడు వినయంగా నమస్కారం చేసి ఇలా అన్నాడు. "భరతా! ఏ రామచంద్రమూర్తైతే దండకలో నారచీరెలు, కృష్ణాజినం ధరించి వున్నాడని నువ్వు విచారపడుతున్నావో ఆ రామచంద్రమూర్తి నీ క్షేమ సమాచారం కనుక్కుని రమ్మన్నాడు. భరతా! నీకు సంతోషకరమైన మాట చెప్తా విను. నువ్వీ భయంకర దుఃఖం వదిలిపెట్టు. నీమీద ప్రేమకల నీ అన్నను నువ్వీ క్షణంలోనే చూడవచ్చు. రావణుడిని చంపి, సీతాసమేతంగా లక్ష్మణుడితో, వానర మిత్ర సేనా సమూహంతో కలిసి సంతోషంగా వస్తున్నాడు". ఈ మాటలు వింటూనే అమితమైన సంతోషంతో భరతుడు కాసేపు మూర్ఛపోయి, తేరుకుని, హనుమంతుడితో ఇలా అన్నాడు.

"ఎన్నో సంవత్సరాల క్రితం రామచంద్రమూర్తి అడవులకు పోయాడు. మళ్లీ ఇన్ని రోజులకు ఆయన వార్త విన్నాను. అయ్యో! రాముడికి, వానరులకు ఏ కారణాన, ఏవిధంగా స్నేహం కుదిరిందో ఆ విషయమంతా సవివరంగా తెలియచేయి" అని భరతుడు హనుమంతుడిని అడిగాడు. జవాబుగా హనుమంతుడు ఆ విషయాలన్నీ వివరంగా చెప్పాడు.

ఉదయాన్నే రాజపత్నులు, మంత్రులు, బ్రాహ్మణులు, రాచవారంతా సైన్యంతో సహా వరుసలు–వరుసలుగా శ్రీరాముడిని చూడడానికి బయల్దేరారు. వారితో పాటే సుమంత్రుడు, అర్థసాధకుడు, జయంత, విజయులు, అశోక, సిద్ధార్థుడనేవారు బంగారు భూషణాలతో అలంకరించిన ఏనుగులతో బయల్దేరారు. రాజు అంతరంగికులు ఏనుగుల మీద, గుర్రాలు కట్టిన రథాలమీద బయల్దేరి పోయారు. వీరులంతా గుర్రాలనెక్కి భటులతో బయల్దేరారు. దశరథుడి భార్యలు కౌసల్యను, సుమిత్రను ముందుంచుకుని వారితో కలిసి వాహనాలమీద పోయారు. కైక కూడా అందరితో కలిసి బయల్దేరింది. అప్పుడు హనుమంతుడు ఇలా అన్నాడు. "అదిగో అక్కడ కనబడుతున్నవాడే రామచంద్రమూర్తి. సీతతోను, తమ్ముడు లక్ష్మణుడితోను వున్నాడు. ఎడమ పక్క సీత, కుడిపక్క లక్ష్మణుడు వున్నారు. అదిగో అతడే సుగ్రీవుడు. అదిగో విభీషణుడు".

"అతడే రాముడు" అని హనుమంతుడు చెప్పగానే స్త్రీబాలవృద్ధులు అంతా ఆకాశం వైపు వేలు చూపిస్తూ "వాడే రాముడు! వాడే రాముడు! అదిగో రాముడు! రాముడదిగో!" అని ధ్వనించారు. అంతదాకా వాహనాల మీద వున్నవారంతా కిందికి దిగి ఆకాశం వైపు, రాముడి వైపు చూశారు. పద్నాలుగు సంవత్సరాలు దాటగానే తప్పక తిరిగి వస్తానని మాట ఇచ్చిన రామచంద్రమూర్తిని చూసి భరతుడు దూరం నుండే నమస్కారం చేశాడు. రామచంద్రమూర్తి అజ్ఞానుసారం భరతుడు దానిమీదికి ఎక్కి రామచంద్రమూర్తిని సమీపించి నమస్కారం చేశాడు.

ఆ తరువాత శ్రీరామచంద్రుడు తల్లి దగ్గరికి పోయాడు. పాదాలమీద పడి సాష్టాంగ నమస్కారం చేశాడు. సుమిత్రకు, కైకకు, పురోహితుడు వశిష్ఠుడికి మొక్కాడు. పురజనులంతా చేతులు జోడించి రామచంద్రమూర్తికి మొక్కుతూ స్వాగతం పల్కారు. వారందరినీ ప్రేమగా చూశాడు రామచంద్రమూర్తి. కుశల ప్రశ్నల తరువాత భరతుడు తనకు రామచంద్రమూర్తి ఇచ్చిన బంగారు పాదుకలను తీసుకొచ్చి అన్న పాదాలకు తొడిగి, చేతులు జోడించి, "రాజేంద్రా! ఈ రాజ్యమంతా నీది. నువ్వు లేని కారణాన ఇంతదాకా కావలి కాసి వుండి, ఇప్పుడు నీది నీకు అప్పగిస్తున్నాను. నీకు నీ రాజ్యమంతా ఇస్తున్నాను. నువ్వు నాకెలాగైతే రాజ్యాన్ని ఇచ్చావో అదే విధంగా అప్పచెప్తున్నాను. ఇక నేను ఈ బరువు మోయలేను. ఈ రాజ్యాన్ని గొప్పదైన ప్రయత్నం చేస్తేనే కాని రక్షించలేం. ఇది నువ్వే ఆలోచించు" అని అన్నాడు.

ఆ తరువాత శత్రుఘ్నుడి ఆజ్ఞానుసారం నేర్పరులైన క్షురకులను పిలిచి శ్రీరామ లక్ష్మణ భరతులకు మీసాలు కత్తిరించి, గడ్డాలు, క్షౌరం చేశారు. శ్రీరాముడు వెలగల వస్త్రాలను ధరించి అలంకరించుకున్నాడు. ఆయన అలా త్రిలోకాభిరాముడై వుండగా రామలక్ష్మణులకు శత్రుఘ్నుడు మంచి ఆభరణాలు తొడిగాడు. అప్పుడు దశరథుడి భార్యలు మనోహరంగా స్వయంగా వారే సీతాదేవిని అలంకరించారు. కౌసల్య వానర స్త్రీలందరికీ సొమ్ములు, చీరెలు ఇచ్చి అలంకరించుకోమన్నది. ఆ తరువాత అంతా అయోధ్యకు బయల్దేరి పోయారు.

అయోధ్యకు చేరిన తరువాత వసిష్టుడు, రామచంద్రమూర్తిని, సీతాదేవిని రత్నపీఠం మీద కూర్చోబెట్టాడు. ఇలా వారిద్దరినీ కూర్చోబెట్టిన తరువాత, వసిష్టుడు, కాత్యాయనుడు, జాబాలి, కాశ్యపుడు, విజయుడు, గౌతముడు, వామదేవుడు, సుయజ్ఞుడు మొదలైన ఎనిమిదిమంది బ్రాహ్మణ శ్రేష్ఠులు పరిమళాలు ఘుమ్మని వీస్తున్న జలాలతో వారిని అభిషేకించారు. ఆ తరువాత ఋత్విజులు, బ్రాహ్మణులు, కన్యకలు, మంత్రులు, యోధులు, వైశ్యులు దివ్యమైన గొప్ప మూలికల రసంతో ఆకాశాన గుంపులుగా చేరి చూస్తున్న దేవతల సమక్షంలో, నలుగురు దిక్పాలకుల సమక్షంలో అభిషేక కార్యక్రమం అంతా జరిపించారు. బ్రహ్మ నిర్మితమై, అనేక రత్నాలతో ప్రకాశిస్తూ, తేజస్సుతో ప్రకాశిస్తూ, మనువు పూర్వం అభిషిక్తుడైన సమయంలో ధరించినదై, అది మొదలు వంశపారంపర్యంగా పట్టాభిషేక సమయంలో ధరించేదైన, వెలలేని మణులతో ప్రకాశిస్తున్న కిరీటాన్ని రత్న పీఠంమీద కూచున్న రామవిభుడి అంగీకారంతో వేదాధ్యయనపరులైన ఋత్విజులతో కలిసి వసిష్టుడు అలంకరించాడు.

అన్నకు శత్రుఘ్నుడు ప్రశస్తమైన శ్వేతచ్ఛత్రం భక్తితో పట్టాడు. తెల్లటి చామరాన్ని సుగ్రీవుడు వీచాడు. మరొక చామరాన్ని విభీషణుడు పట్టుకున్నాడు. ఇంద్రుడి పక్షాన వాయుదేవుడు తళతళ ప్రకాశించే బంగారు సరాన్ని, సమస్త రత్నాలతో కూడిన మంచి ముత్యాల మనోహరమైన ముత్యాల సరాన్ని అర్పించాడు. రామచంద్రమూర్తి విరివిగా బ్రాహ్మణులకు దానాలు ఇచ్చాడు. బంగారు హారాన్ని ప్రీతిగా సుగ్రీవుడికి ఇచ్చాడు. వజ్ర వైడూర్యాలతో చిత్రించబడ్డ విశేష కాంతికల భుజకీర్తులను అంగదుడికి ఇచ్చాడు. రత్న శ్రేష్టాలతో కూడినదైన, మనోహరమైన, ఉత్తమోత్తమమైన, ఆణిముత్యాలతో కూడిన శ్రేష్టమైన హారాన్ని ప్రేమతో సీతాదేవికి ఇచ్చాడు రామచంద్రమూర్తి.

సీతాదేవి తన మెడలో వున్న ఒక అందమైన హారాన్ని సంతోషంగా చేతిలో తీసుకుని ఎవరికీ ఇస్తే బాగుంటుంది అన్న విధంగా భర్తవైపు చూసింది. సమాధానంగా ఆయన "ఓ అలివేణీ! ఎవరు తన గుణాలతో నిన్ను మెప్పించాడో, ఎవరిలో మంచి బుద్ధి పరాక్రమాలు కలవో అలాంటివాడికి దీన్ని ఇవ్వు" అని అన్నాడు. సీతాదేవి భర్త అలా చెప్పగానే ఆ హారాన్ని హనుమంతుడికి ఇచ్చింది. అది ధరించి హనుమంతుడు కాంతితో ప్రకాశించాడు. ఆ తరువాత మైందుడికి, ద్వివిదుడికి, నీలుడికి వారికిష్టమైన బహుమానాలు రాముడిచ్చాడు. అలా వానరనాథులందరికీ ఇచ్చాడు. ఈ ప్రకారం విభీషణ, సుగ్రీవ, జాంబవంత తదితర వానరులంతా వారివారికి తగిన బహుమానాలు, గౌరవాలు తృప్తితీరా పొంది రామచంద్రుడి ఆజ్ఞ తీసుకుని తమతమ ప్రదేశాలకు వెళ్లిపోయారు. విభీషణుడు రామాజ్ఞ తీసుకుని లంకకు పోయాడు. శ్రీరామచంద్రమూర్తి రాజ్యం ఏలుతున్నప్పుడు ప్రజలు మనోవేదనలు లేకుండా వున్నారు. ఆయన రాజ్యం చేస్తున్నప్పుడు ఏనోట విన్నా రామశబ్దమే! ఏకథ విన్నా రాముడి కథే! ప్రపంచం అంతా రామమయం అయింది. రామచంద్రమహారాజు పదకొండు వేల సంవత్సరాలు తమ్ములతో శ్రీమంతుడై జగత్ప్రసిద్ధిగా ప్రపంచాన్ని పాలించాడు. నూరు అశ్వమేధ యాగాలు చేసి, తమ్ములతో, చుట్టాలతో, ఆప్తులతో, మిత్రులతో కలిసి అనేక విధాలైన యజ్ఞాలు చేశాడు.

◆❖◆

శ్రీరామాయణ పారాయణ ఫల శ్రుతి

నారద మహర్షి వాల్మీకికి రామాయణాన్ని ఉపదేశించినప్పుడు ముందు భూతకాలం చెప్పి, తరువాత భవిష్యత్కాలం చెప్పాడు, వాల్మీకి ప్రశ్న వేయడానికి ముందే "ఎవ్వడీ ధారుణిని యీకాలంలో" అనే ప్రశ్నించాడు కాని, గడిచినవారి గురించి కాని, రాబోయేవారిని గురించి కానీ ప్రశ్నించలేదు. అవతారానికి ముందే రామాయణం రచించినట్లయితే కొంత భూతార్థకంలో, కొంత వర్తమానార్థకంలో, కొంత భవిష్యత్ అర్థకంలో చెప్పాల్సిన పనిలేదు. అవతారానికి ముందే రామాయణం రచించడం జరిగిందని అంటే చాలా విరోధాలు వస్తాయి. అలా చెప్పడానికి ఒక్క ఆధారమైన రామాయణంలో లేదు. రామాయణం వేదంలాగా స్వతఃప్రమాణం. దానిలోని విషయాలను ఋజువు చేయడానికి ఇతర ప్రమాణాలు లేవు.

రామాయణమే ఆదికావ్యం. వేదార్థం ఇందులో విస్తరించి చెప్పడం జరిగింది. వాల్మీకి మహర్షి దీన్ని అశ్వమేధయాగం చేయడానికి పూర్వం రచించి బహిర్గతం చేశాడు. ఇది పుణ్యం కలిగించి ఆయువును వృద్ధి చేస్తుంది. ఇది మిక్కిలి కీర్తికరం. రాజులకు గెలుపు కలిగిస్తుంది. దీన్ని చదువుతే (పఠిస్తే) సకల పాపాలు తొలగిపోతాయి. కొడుకులు కావాలనుకున్నవారికి కొడుకులు, ధనం కోరినవారికి ధనం లభిస్తుంది. రామాభిషేక విధానం విన్న రాజు శత్రువులను గెలిచి రాజ్యం పాలిస్తాడు. రామాయణం ప్రజలు వింటే, వారి ఆయువు వృద్ధి అవుతుంది. కోపాన్ని జయించి, శ్రద్ధగా, ఏకాగ్ర మనస్సుతో, వేదార్థం విస్తరించిన, వాల్మీకి మహర్షి చెప్పిన రామాయణాన్ని మంచి మనసుతో చదివేవాడు సమస్త దుఃఖాలను దాటుతాడు. మరణించిన తరువాత మోక్ష సుఖం కలుగుతుంది. జీవించిన కాలంలో శ్రీరామ కటాక్షం వల్ల వాడి కోరికలన్నీ నెరవేరుతాయి. ఇది సత్యం సత్యం అని స్వానుభవం వల్ల ఆంధ్ర వాల్మీకి వావిలికొలను సుబ్బారావు (వాసుదాసు) గారు ఆయన రచించిన ఆంధ్రవాల్మీకి రామాయణంలో పేర్కొన్నారు. ఆయనగారు సంకల్పించిన మహాకార్యం అతడి శక్తికి మించినవైనా లోకోత్తరంగా అన్నీ నెరవేరాయి.

రామాయణ కావ్యం వినేవారిని గురించి దేవతలు సంతోషిస్తారు. వారి ఇండ్లలో దుష్టగ్రహాలు నిలవలేక పారిపోతాయి. రాజు వింటే భూమిని జయిస్తాడు. పరదేశంలో వున్నవాడు ఆపదలేక ప్రయాణం చేస్తాడు. ముట్టు స్నానం చేసిన వయసు స్త్రీ వింటే ఆమెకు ఉత్తమ గుణాలుకల కొడుకులు పుట్తారు. ఎవరైతే ఈ రామాయణాన్ని ఇష్టంగా పఠిస్తాడో వాడి పాపాలన్నీ హరిస్తాయి.

శ్రీరాముడు ఏనాడో మరణించాడు కదా! అలాంటివాడు తనను సేవించినవారికి ఎలా సహాయం చేస్తాడు? అని ప్రశ్నించేవారికి సమాధానం రామాయణంలోనే వుంది. రామచంద్రమూర్తి నారాయణుడు. సమస్త భూతాలకు స్థానమై సర్వం తానై వుండేవాడు. కాబట్టి ఆనాడున్నాడు, నేడు లేడని అనకూడదు. సమస్త ప్రపంచానికి ప్రభువైన రాముడు లేకపోతే లోకం అనాయకమౌతుంది. అవతారానికి ముందు కాని, తరువాత కాని రామచంద్రమూర్తి లేకపోలేదు. రామచంద్రమూర్తి లేడంటే భగవంతుడు లేడని అర్థం. ఎందుకంటే ఆయనే ఆదిమదేవుడైన హరి. బ్రహ్మరుద్రాదులు లేనికాలంలో ఆయన వుండి వీరందరి జన్మకారకుడైనాడు. ఆయనే ఒక కాలంలో లేడంటే ఇక వుండేది ఏమిటి? దీర్ఘబాహుడైన యితడు సాకారుడు కాని నిరాకారుడు కాదు. ఈయన లక్ష్మీపతి. ఒంటరివాడుకాదు. లక్ష్మీ విశిష్టుడు. నరసింహావతారంలో లాగా సర్వాంతర్యామి అయివుంటాడు. ఒక కాలంలో వుండి వేరే కాలంలో లేకుండా వుండడు. ఇలాంటివాడు శ్రీరామచంద్రమూర్తి.

శుభకరమైన ఈ కావ్యాన్ని వింటే ధనధాన్య వృద్ధి, సంతాన వృద్ధి కలుగుతుంది. సద్గుణాల స్త్రీ సాంగత్యం, ఉత్తమ సౌఖ్యం లభిస్తుంది. పరమార్థమైన మోక్షం ప్రాప్తిస్తుంది. క్షేమ పద్ధతిన ఆయువు, కీర్తి, ఆరోగ్యం లభిస్తాయి. ఇది సోదర స్నేహం, సౌఖ్యం, సాదుబుద్ధి, తేజస్సు కలిగిస్తుంది. పుణ్యలాభం కోరి దీన్ని వినే సత్పురుషులు నియమంగా చపలత లేని మనస్సుతో గ్రంథమంతా వినాలి. రామాయణ శ్రవణ పఠనం వల్ల దుష్ట రోగాలు మానుతాయి. ఇది ప్రమాణానుభవ సిద్ధం.

రామాయణం పురావృత్తమణి అని చెప్పడం జరిగింది. పురావృత్తాలెన్నో వున్నాయి. అవి రామాయణానికి సరికావు. ఎందుకంటే, శ్రీమద్రామాయణం బ్రహ్మ అనుమతితో వాల్మీకి మహర్షి రచించాడు. ఈ కావ్యంలో అనృతం కొంచెమైనా వుండదని బ్రహ్మ వరం. ఇది వేదం స్వరూపం అని చెప్పడం జరిగింది. కాబట్టి ఇలాంటి యోగ్యత, మహాత్మ్యం, గాయత్రీ ప్రణవ మంత్రాది సంపుటీకరణ ఇతర గ్రంథాలలో లేవు. సీతాదేవి వాల్మీకి ఆశ్రమంలో వున్నప్పుడు రాసింది కాబట్టి ఇది పురాతన చరిత్ర అన్నారు. రామాయణ పఠనం వల్ల, రామ కథా శ్రవణం వల్ల సర్వ సుఖాలు కలుగుతాయి. ఈ విధంగా వేదార్థం తెలిపే ఈ రామాయణ కావ్యం పూర్వం వాల్మీకి మహర్షి లోకులకు ఉపకారం చేయడానికి దాన్ని సంహితగా రచించాడు.

◆❖◆



వనం జ్వాలానరసింహారావు తండ్రి వనం శ్రీనివాసరావు గారు – పరమ భాగవతోత్తములు, శ్రీరామ భక్తులు... తన 83వ ఏట 1998లో పరమపదించారు. తల్లి వనం సుశీలమ్మ గారు– సహస్ర చంద్ర దర్శనం చేసుకొని నవంబర్ 2013లో తన 90వ ఏట మరణించారు. స్వగ్రామం – జన్మస్థలం: ఖమ్మం జిల్లా, ముదిగొండ మండలం, వనం వారి కృష్ణాపురం. ఆగస్ట్ 15, 1947 న భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ఏడాదికి, ఆగస్ట్ 8, 1948న జననం. ఒక అక్క, ఇద్దరు చెల్లెళ్ళు, నలుగురు తమ్ములు. విద్యాభ్యాసం: సొంత గ్రామంలో మాధ్యమిక; ఉన్నత పాఠశాల చదువు ఖమ్మంలో; కళాశాల చదువు ఖమ్మం, హైదరాబాద్ లలో; విశ్వవిద్యాలయం చదువు ఉస్మానియా, నాగపూర్‌లలో. లెక్కలు, భౌతిక రసాయన శాస్త్రాల్లో డిగ్రీ; పబ్లిక్ అడ్మిని స్ట్రేషన్ లో ఎంఏ; లైబ్రరీ సైన్స్ లో డిగ్రీ. వివాహం: ఏప్రియల్ 30, 1969న (స్వర్గీయ) అయితరాజు రాంరావు – రాధ గార్ల కుమార్తె విజయలక్ష్మితో వివాహం. ఇద్దరు ఆడపిల్లలు (ప్రేమ మాలిని, కిన్నెర); ఒక కొడుకు (ఆదిత్య కృష్ణ రాయ్). ఆరుగురు (యశ్విన్, మిహిర, అన్ష, మేథ, కనక్, ఇరా) మనుమలు, మనుమరాళ్లు.

ఉద్యోగాలు, ఇతర వ్యాపకాలు: లైబ్రేరియన్ గా జీవనయానం ప్రారంభం. గవర్నర్ కుముద్ బెన్ జోషి దగ్గర ప్రాజెక్టు అధికారిగా, (మాజీ) ముఖ్యమంత్రి డాక్టర్ మర్రి చెన్నా రెడ్డి దగ్గర పౌర సంబంధాల అధికారిగా. హస్తకళల అభివృద్ధి సంస్థలో కొన్నాళ్ళు. మర్రి చెన్నా రెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో కొంత కాలం .

సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ లో కొన్నాళ్ళు.అత్యవసర అంబులెన్స్ సహాయ సేవల సంస్థలో మరికొంతకాలం. ఇలా అక్కడా ఇక్కడా. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారి దగ్గర ప్రధాన ప్రజా పౌర సంబంధాల అధికారిగా.

ఫ్రీలాన్స్ పాత్రికేయుడుగా అనేక ఆంగ్ల, తెలుగు పత్రికలకు సుమారు 3500 కు పైగా ఆర్టికల్స్. ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రాలలో వివిధ రకాల కార్యక్రమాల నిర్వహణ. పలు తెలుగు, ఇంగ్లీష్ టెలివిజన్ చానల్స్‌కు రాజకీయ విశ్లేషణలు.

ఆంగ్లంలో పుస్తకాలు: హైదరాబాద్, చెన్నై, గోవా (స్టర్లింగ్ పబ్లిషర్స్), ఎ సింక్రోనస్ హిస్టరీ స్క్రాప్ బుక్, యాన్ ఎజెండా ఫర్ డెవెలప్మెంట్ ఆఫ్ ఏపీ, గవర్నెన్స్ విత్ ఎ డిఫరెన్స్, 51 మంత్స్ ఆఫ్ కేసిఆర్ గవర్నెన్స్ విత్ డిఫరెన్స్, కేసిఆర్ అండ్ నేషనల్ పాలిటిక్స్; తెలంగాణ డిస్ట్రిక్ట్ అండ్ అడ్మి నిస్ట్రేషన్ ఎట్ అ గ్లాన్స్. తెలుగులో: ఆనుపమ గీతాల తిలక్, కేబీ తిలక్ జ్ఞాపకాలు – అనుభవాలు, అనుభవాలే అధ్యాయాలుగా, ఇదీ సుపరిపాలన, సుందరకాండ మందరమకరందం, బాలకాండ మందర మరకందం, అయోధ్యకాండ మందర మకరందం, అరణ్యకాండ మందర మకరందం, కిష్కింధకాండ మందర మకరందం, యుద్ధకాండ మందర మకరందం, ధర్మధ్వజం, ఇదీ సుపరిపాలన – 51 నెలల కేసీఆర్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ జాతీయ రాజకీయాలు. శ్రీమద్భాగవత కథలు (ఋగ్యజుస్సా మాథర్వణ వేదాల సారం ఈ పుస్తకంలో అనుబంధంగా;) ఆంధ్ర వాల్మీకి రామాయణ రసరమ్య గాథలు; ఆస్వాదన–శ్రీమదాంధ్ర మహాభారత కథలు, త్వరలో: ఆంధ్ర వాల్మీకి రామాయణంలో ఛందః ప్రయోగాలు;.

